
# భారత స్వతంత్ర పోరాటం


## బిపన్ చంద్ర

మృదుల ముఖర్జీ, ఆదిత్య ముఖర్జీ
కె.ఎన్.పణిక్కర్, సుచేతా మహాజన్




ప్రజాశక్తి బుక్‌హౌస్

# భారత స్వతంత్ర పోరాటం

## 1857 - 1947

బిపిన్ చంద్ర

# భారత స్వతంత్ర పోరాటం

## 1857 - 1947

ఆంగ్ల మూలం:

**బిపిన్ చంద్ర**

**మృదుల ముఖర్జీ ✦ ఆదిత్య ముఖర్జీ**

**కె.ఎన్. పణిక్కర్ ✦ సుచేతా మహాజన్**

తెలుగు అనువాదం:

**రావెల సాంబశివరావు**

**కె. చక్రపాణి**

**కె. కేశవరెడ్డి**

**ప్రజాశక్తి బుక్‌హౌస్ - తెలంగాణ**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013*

**India's Struggle for Independence 1857-1947**

**Bipan Chandra**
**Mridula Mukherjee,   Aditya Mukherjee**
**K.N. Panikkar,   Sucheta Mahajan**

First published in Viking by Penguin Books India 1988.
Published in Penguin Books 1989.

Copyright   Bipan Chandra 1987. 1988. 1989.

All rights reserved

ప్రచురణ సంఖ్య : 971

ప్రథమ ముద్రణ : మే, 2006, 2007, 2008
నాల్గవ ముద్రణ : సెప్టెంబర్, 2012

వెల : ₹ 200/-

టైటిల్ : మోహన్

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్** (తెలంగాణ)
ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్,
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర హైదరాబాద్-20. ఫోన్ : 040 - 27660013.

బ్రాంచీలు

హైదరాబాద్ : చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె), ఈసిఐఎల్,
నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు.

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

**website : www.psbh.in**

# విషయసూచిక


భూమిక ........................................................ 11

1. మొదటి పెద్ద సవాలు : 1857 నాటి తిరుగుబాటు........... 33

2. ప్రజా ప్రతిఘటనలు : ఆదివాసీ తిరుగుబాట్లు ................. 45

3. 1857 తరువాత రైతాంగ ఉద్యమాలు, పోరాటాలు :......... 57

4. కాంగ్రెస్ స్థాపన : వ్యూహాజనిత వాదన ........................ 71

5. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన : వాస్తవాలు ................. 85

6. సామాజిక – మత సంస్కరణలు – జాతీయతా జాగృతి ...... 99

7. వలస వాదంపై ఆర్థికపరమైన విమర్శనాత్మక పరిశీలన .... 111

8. పత్రికా స్వేచ్ఛకై పోరాటం .................................... 125

9. చట్ట సభల్లో ప్రచారం .......................................... 139

10. స్వదేశీ ఉద్యమం 1903 – 1908 .......................... 153

11. కాంగ్రెస్‌లో చీలికలు – సమరశీల ఉగ్రవాద ఆవిర్భావం ... 167

12. ప్రథమ ప్రపంచ సంగ్రామం –
భారతీయ జాతీయవాదం – గదర్ పార్టీ ........... 181

13. హోంరూలు ఉద్యమం – పతనం ............................ 197

14. గాంధీజీ తొలి పోరాటం ...................................... 211

15. సహాయ నిరాకరణోద్యమం – 1920–22.................. 231

16. 1920లలో రైతు ఉద్యమాలు - జాతీయవాదం............ 249
17. భారతదేశ కార్మికవర్గం - జాతీయోద్యమం .................. 265
18. గురుద్వారా సంస్కరణలూ, ఆలయ ప్రవేశ ఉద్యమాలు ..... 283
19. స్తబ్ధత ఆవరించిన సంవత్సరాలు - స్వరాజ్యవాదులు,
మార్పులు కోరని పక్షం, గాంధీజీ ....... 299
20. భగత్‌సింగ్, సూర్యసేన్ తదితర విప్లవ ఉగ్రవాదులు ........ 315
21. స్వదేశీ సంస్థానాలలో 1927-1929 ........................ 331
22. శాసనోల్లంఘన 1930 - 1932............................. 345
23. కరాచీ నుంచి వార్ధా : 1932-1934 ....................... 361
24. ఎదుగుతున్న వామపక్షం ........................................ 375
25. యుద్ధ తంత్రం 1934-1937................................ 393
26. ఇరవై ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలన ...................... 407
27. 1930, 1940 దశాబ్దాలలో రైతాంగ ఉద్యమాలు........... 431
28. స్వదేశీ సంస్థానాలలో స్వాతంత్ర్య పోరాటం .................. 445
29. భారతీయ పెట్టుబడిదారులు - జాతీయోద్యమం ............ 465
30. జాతీయవాద విదేశాంగ విధానం అభివృద్ధి .................. 477
31. మతతత్వం పుట్టుక - పెరుగుదల ........................... 491
32. మతతత్వం - ఉదారవాద దశ................................ 509
33. జిన్నా, గోల్వాల్కర్ - తీవ్ర మతతత్వవాదం .................. 525
34. త్రిపుర సంక్షోభం నుండి క్రిప్సు రాయబారం వరకు......... 543
35. క్విట్ ఇండియా ఉద్యమం; భారత జాతీయ సైన్యం ......... 559
36. యుద్ధానంతర జాతీయవాద వెల్లువ .......................... 579
37. స్వాతంత్ర్యం - విభజన ........................................ 593
38. జాతీయోద్యమ దీర్ఘకాలిక వ్యూహం .......................... 613
39. భారతీ జాతీయోద్యమం - సైద్ధాంతిక కోణం................ 629

# ప్రచురణకర్తల మాట

భారత స్వతంత్ర పోరాటంపై సమగ్రమైన, తులనాత్మకమైన అధ్యయనాలు ఇప్పటి వరకు వెలువడలేదనే చెప్పవచ్చు. తెలుగులో అయితే అసలే అందుబాటులో లేవు. సుప్రసిద్ధ చరిత్రకారులు ప్రొ. బిపన్ చంద్ర, బృందం రచించిన ఈ గ్రంథం ఆ కొరతను చాలవరకు తీరుస్తుంది. స్వతంత్రపోరాటంపై లోగడ వెలుబడిన అనేక గ్రంథాలున్నప్పటికీ అవి గాంధీజీ నాయకత్వంలోని అహింసోద్యమమే ఏకైక పోరాటం అన్న ధోరణితో సాగుతాయి. ఇతర ప్రజాఉద్యమాలను, సాయుధ పోరాటాలను పూర్తిగా విస్మరిస్తాయి. ఒక వేళ ప్రస్తావించినా అది మొక్కుబడిగానే ఉంటుంది. గాంధీజీ నాయకత్వంలో జరిగిన పోరాటం స్వతంత్రోద్యమంలో ప్రధాన స్రవంతి అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాని ఇతర ప్రజాపోరాట స్రవంతులకు కూడ సముచిత స్థానం కల్పించినప్పుడే అది తులనాత్మకమైన స్వతంత్ర పోరాట చరిత్ర అవుతుంది. ఇఎంఎస్ నంబూద్రిపాద్ లాంటి నాయకులు ఒక్కచేతిమీద అలాంటి సమగ్ర దృష్టితో బృహత్తర రచనలు చేసినప్పటికి, ప్రామాణిక పరిశోధకులు ఒక బృందంగా ఏర్పడి సమిష్టి అధ్యయనంతో, పరిశోధనతో వెలువరించిన మొదటి రచన ఇది అని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ సమకూర్చిన నిధులతో భారత జాతీయోద్యమ చరిత్రపై ప్రొ. బిపన్ చంద్ర నిర్వహించిన అధ్యయనం ఈ పుస్తకం వెనుక ఉన్నది. అందుబాటులో ఉన్న అన్ని రకాల చారిత్రక పత్రాలు, గ్రంధాలను వినియోగించుకోవడంతోపాటు, క్షేత్ర స్థాయికి వెళ్లి 1500 మందికి పైగా స్వతంత్ర సమరయోధులను ఇంటర్వ్యూ చేసి వారి అనుభవాలను ఆధారంగా చేసుకోవడం ఈ ప్రాజెక్టులో ఒక విశేషాంశం. బిపన్ చంద్రతో పాటు, ఈ పుస్తక సహరచయితలయిన మృదులా ముఖర్జీ, ఆదిత్య ముఖర్జీ, సుచేతా మహాజన్‌లు

కూడ ఈ ప్రాజెక్టులో సభ్యులు. ఈ పుస్తక రచనకు ఎస్ గోపాల్, రోమిలా థాపర్ లాంటి ప్రఖ్యాత చరిత్రకారులతో నిరంతరం జరిపిన చర్చలు ఎంతగానో దోహదపడ్డాయని బిపన్ చంద్ర చెప్పారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఇన్ని విశిష్టతలున్న ఈ గ్రంథాన్ని తెలుగు పాఠకులకు సగర్వంగా అందిస్తున్నది.

నేడు మతోన్మాద శక్తులు దేశ సమైక్యతను విచ్ఛినం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి, మరొకవైపున ప్రపంచీకరణ, స్వేచ్ఛావాణిజ్యాలపేరుతో దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి ప్రమాదం వాటిల్ల చేస్తున్నారు. ఇలాంటి కీలక తరుణంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ గ్రంథం వెలువడుతున్నది. దాన్ని తెలుగులో తీసుకురావడానికి అడిగిన వెంటనే అనుమతి మంజూరు చేసిన ప్రొ. బిపన్ చంద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ఈ పుస్తకం గురించి ప్రొ. బిపన్ చంద్రను సంప్రతించడంలోను, అనువాదాన్ని పరిశీలించడంలోను, ఇతరత్రాను పూర్తి సహాయ సహకారాలు అందించిన హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం, చరిత్ర విభాగానికి చెందిన డా. అట్లూరి మురళి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

మేము ఇప్పటి వరకు ప్రచురించిన వివిధ చరిత్ర గ్రంథాల మాదిరిగానే దీన్ని కూడ పాఠకులు విశేషంగా ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

**– ప్రజాశక్తి బుక్‌హౌస్,**

**10-05-2006**

# రచయితలు

**బిపన్ చంద్ర** హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రాలో జన్మించారు. లాహోర్ ఫోర్మన్ క్రిస్టియన్ కాలేజీలో, కాలిఫోర్నియా స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసించారు. జవర్‌లాల్‌నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆధునిక చరిత్ర ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. ప్రొ. బిపన్ చంద్ర ఆధునిక భారత దేశంలో జాతీయ వాదం, వలసవాదం, మతోన్మాదం అంశాలపై అనేక గ్రంథాలు రచించారు.

**మృదుల ముఖర్జీ** న్యూఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసించారు. ఆమె ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చారిత్రక విషయాల అధ్యయన కేంద్రంలో ఆధునిక భారత చరిత్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వ్యవసాయ చరిత్ర, రైతు ఉద్యమాలు, జాతీయోద్యమం ఆమె ప్రత్యేక ఆసక్తితో అధ్యయనం చేసే అంశాలు.

**ఆదిత్య ముఖర్జీ** ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసించారు. ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చారిత్రక విషయాల అధ్యయన కేంద్రంలో సమకాలీన భారత చరిత్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆధునిక వ్యాపార చరిత్ర, పెట్టుబడిదారీ అభివృద్ధి, సమకాలీన ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు ఆయన ప్రత్యేక ఆసక్తితో అధ్యయనం చేసే అంశాలు.

**కె ఎన్ ఫణిక్కర్** మద్రాసు, రాజస్థాన్ విశ్వవిద్యాలయాలలో విద్య అభ్యసించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేరళ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా పనిచేస్తున్నారు. సాంస్కృతిక అంశాలు, మేధో చరిత్ర, వ్యవసాయ చరిత్రలపై ఆయన విస్తృతంగా రచనలు చేశారు.

**సుచేతా మహాజన్** ఢిల్లీలోని ఇంద్రప్రస్థ కాలేజీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసించారు. సిమ్లాలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్డ్ స్టడీస్‌లో ఫెలోగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన ఢిల్లీ కాలేజ్ ఫర్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. 1940లలో భారత రాజకీయ పరిణామాలు ఆమె ప్రత్యేకాధ్యయన అంశాలు. భారత స్వాతంత్ర్యం, దేశవిభజన, ప్రజాపోరాటాలు, గాంధీజీ జీవితంలో చివరి దశ గురించి ఆమె పరిశోధనలు నిర్వహించారు.

# శైలి గురించి

**దీ**నిలో పరిచయాన్ని, 2, 3, 4, 5, 7, 8, 9, 11, 18, 19, 20, 23, 24, 25, 26, 30, 31, 32, 33, 34, 38, 39 అధ్యాయాలను బిపన్ చంద్ర రచించారు. 1, 6 అధ్యాయాలను కెఎన్ ఫణిక్కర్, 10, 17, 29 అధ్యాయాలను ఆదిత్య ముఖర్జీ, 12, 13, 14, 15, 16, 21, 22, 27, 28, 35 అధ్యాయాలను మృదుల ముఖర్జీ, 36, 37 అధ్యాయాలను సుచేతా మహాజన్‌లు రచించారు.

పరిచయం నుండి 13వ అధ్యాయం వరకు రావెల సాంబశివరావు, 14 నుండి 26వ అధ్యాయం వరకు కె చక్రపాణి, 27 నుండి 39వ అధ్యాయం వరకు కె కేశవరెడ్డి తెలుగులోకి అనువదించారు.

# భూమిక

ఆధునిక సమాజం గుర్తెరిగినంతలో భారత జాతీయోద్యమం ఒక పెద్ద ప్రజా ఉద్యమం అన్నది నిర్వివాదాంశం. అనేక వర్గాలకు, సిద్ధాంతాలకు కట్టుబడిన కోట్లాది ప్రజలలో ఆ ఉద్యమం విద్యుదావేశాన్ని ప్రవహింపజేసి, రాజకీయ చైతన్యాన్ని పురికొల్పి, ఒక మహత్తర వలస సామ్రాజ్యాన్ని మోకరిల్లేట్లు చేసింది. అందువల్లనే ఇప్పటి రాజకీయ, సామాజిక చట్రాన్ని మార్చాలనుకునే వారికి బ్రిటన్, ఫ్రెంచి, రష్యా, చైనా, క్యూబా, వియత్నాం విప్లవాలవలె ఇది కూడ గొప్ప ప్రస్తుతాన్వయాన్ని సమకూర్చుకున్నది.

ప్రజాస్వామిక ప్రతిపత్తితో మౌలికంగా పౌరస్వేచ్ఛా రాజ్యాలుగా, స్థూలంగా చట్టబద్ధంగా వ్యవహరించే సమాజాలలోని ఉద్యమాలకు భారత జాతీయ ఉద్యమంలోని పలు అంశాలు, మరీ ముఖ్యంగా గాంధేయ రాజకీయ వ్యూహం సుసంగతమై నిలుస్తుంది. వాటికే కాదు, ఇతర సమాజాలకూ అది సంబద్ధమే.

వాస్తవానికి భారత జాతీయ ఉద్యమం ఒక ప్రజాస్వామిక లేదాపాక్షిక ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ విజయవంతంగా మార్పు చెందేందుకో లేదా స్థాన భ్రంశం గావింపబడేందుకో సరైన ఏకైక చారిత్రక ఉదాహరణగా నిలుస్తుంది. గ్రామ్సియన్‌సైద్ధాంతిక దృక్కోణం నుండి యుద్ధవ్యూహం సమర్ధమంతంగా నిర్వహింపబడిన ఈ ఉద్యమం ఏదో ఒక చారిత్రక విప్లవ ఘటనద్వారా రాజ్యాధికారం చేజిక్కించుకొనబడక నైతిక, రాజకీయ, సైద్ధాంతిక స్థాయిలో, సుదీర్ఘ పోరాటంద్వారా సాధింపబడి ఏళ్ల తరబడి ప్రగతిపథంలో అంచెలంచెలుగా నాయకత్వాన్ని

పదిలపరచుకుంటూ, పోరాటదశలు నిరంతరాయంగా కొనసాగక, మధ్యమధ్యలో స్తబ్దత చోటుచేసుకున్న ఏకైక ఉద్యమంగా నిలిచిపోయింది.

ప్రజలు జీవించే దానికీ, అభివృద్ధిచెందే దానికీ రాజ్యాంగ బద్ధతతో సమకూరిన ఏర్పాటునే వాడుకుంటూ, ఎటూ బెసకకుండా ప్రవర్తించిన తీరుకు కూడ భారత జాతీయ ఉద్యమం ఓ ఉదాహరణగా నిలుస్తుంది. ఆ ఉద్యమం అంతకు ముందున్న ఏర్పాటును పూర్తిగాత్రోసిరాజనలేదు. ప్రజాస్వామిక సమాజాలలో ఉన్న ఏర్పాటుకు భిన్నంగా ప్రవర్తింపవలసివస్తే పలుమార్లు నేతృత్వం వంటి విషయాలలో అధిక మూల్యాలను చెల్లించవలసి ఉంటుంది. అది ఒంటరితనాన్ని ప్రసాదిస్తుంది. ఒకసారి ప్రజాస్వామిక పంథాలోకి ప్రవేశించటం జరిగితే అది రాజ్యాంగేతర పోరాటంతో సమ్మిళితం చేయబడి ఉన్న వ్యవస్థను కూలదోసేందుకు సమర్థవంతంగా పనిచేస్తుంది.

రాజకీయ మౌలిక సైద్ధాంతిక ఆలోచనా ధోరణులు ఎంత భిన్నంగా వున్నా, ఉమ్మడి లక్ష్యంతో నడిచిన మహోద్యమంగా మనకు తెలిసినంతలో భారతజాతీయ ఉద్యమం ఉత్తమమైన ఉదాహరణగా నిలుస్తుంది. అంతేకాదు, ఆ మహోద్యమం ద్వారా లభించిన సైద్ధాంతిక, రాజకీయ ఆధిక్యతకు తృప్తి చెందుతూ ఆ ఉద్యమం కొనసాగింది. మౌలిక అంశాలపై ఎంతగా వాడిగా వేడిగా చర్చను అనుమతించినా, అందులోని భిన్నత్వమూ, ఒత్తిడీ ఎన్నడూ ఉద్యమ శక్తినీ, సంఘటితత్వాన్ని నీరుగార్చలేదు; పైగా అటువంటి భిన్నత్వమూ, చర్చలూ, వాటిల్లోని స్వేచ్ఛాయుత వాతావరణం, ఉద్యమానికి మరింత ఊతాన్నిచ్చే వనరులయ్యాయి.

స్వాతంత్ర్యానంతరం నలభైయేళ్లు గడచిన పిమ్మటకూడ స్వాతంత్ర్యోద్యమ ఆవేశాన్ని అందుకునేంత దగ్గరగానూ, గతంలోకి తొంగి చూడగల ఒడుపుతోనూ, ప్రశాంతంగా దానిని విశ్లేషించగలంత దూరంగానూ మనం ఉండగలం. అది మన గతానికి, వర్తమానానికి, భవిష్యత్తుకు విడదీయరాని పెనుబంధమైనందున మనం విశ్లేషించి తీరవలసిందే. ప్రతి యుగంలోనూ స్త్రీలూ, పురుషులూ తమతమ చరిత్రల్ని సృష్టించుకొంటూనే వుంటారు. అయితే వాళ్లు చారిత్రక శూన్యతలోంచి కొత్తగా సృష్టించగలిగేదేమీ ఉండదు. వర్తమానంలో వాళ్ల సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనటంలోనూ, భవిష్యత్తును రూపకల్పన చేయటంలోనూ వాళ్ల కృషి ఎంత వినూత్నంగా సాగినా వాళ్ల చరిత్ర వాళ్లు వారసత్వంగా అందుకొన్న ఆర్థిక రాజకీయ,

సైద్ధాంతిక చట్రం వాళ్లకు మార్గదర్శనం గావిస్తుంది; గిరిగీసి నిలుపుతుంది; ఒక ఆకారాన్నిస్తుంది; తగిన శిక్షణనిస్తుంది. నేను స్పష్టంగా చెప్పదలిచిందేమంటే 1947 నుండి భారతదేశం అనుసరిస్తున్న మార్గానికి మూలాలు స్వాతంత్ర్యోద్యమంలో బాగా వేళ్లూని ఉన్నాయి. స్వాతంత్ర్యానంతర అభివృద్ధిపై చెరగని ముద్ర వేసిన రాజకీయ పరమైన, భావజాల పరమైన అంశాలు ఎక్కువగా స్వాతంత్ర్యోద్యమం నుండి సంక్రమించినవే. ఆ వారసత్వం భారతీయులందరికీ సంబంధించినటువంటిది– వాళ్లు నేడు ఏ రాజకీయ పక్షానికి చెందిన వాళ్లయినా, ఏ గ్రూపుకి సంబంధించిన వాళ్లయినా సరే ఎందుకంటే 1885 నుండి 1947 వరకు ఉద్యమాన్ని నడిపిన పార్టీ ఆనాడది పార్టీ రూపంలో లేదు. దానిది ఉద్యమ స్వరూపమే – అతివాద మితవాద రాజకీయ ధోరణులన్నీ అందులోనే సమ్మిళితమై వుండేవి.

* * *

అయితే స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి ప్రధానంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్న లక్షణాలేమిటి? ఒక ప్రధానమైన అంశమేమంటే – ఆ ఉద్యమం విలువలకు, ఆధునిక ఆదర్శాలకు ఆధారభూతం. అది విస్తృత ఆర్థిక – సామాజిక రాజకీయ నాయకత్వ కల్పనా బలంపై ఆధారపడినటువంటిది. (ఆ దార్శనికత సమాన హక్కుల కోసం, సమాన అవకాశాల ప్రాతిపదికపై నిలిచే సామాజిక చట్రంతో స్వతంత్ర విదేశీ విధానంతో అలరారే ప్రజాస్వామికం; పౌర స్వేచ్ఛతో కూడిన లౌకిక భారతం).

ఆ ఉద్యమం భారతావనిలో ప్రజాస్వామిక భావనల్ని, సంస్థల్ని జనప్రియం గావించింది. వయోజన ఓటింగు హక్కు ద్వారా ఏర్పాటు చేయబడే ప్రాతినిధ్య ప్రభుత్వ పద్ధతి కోసం జాతీయ వాదులు పోరాడారు. భారత జాతీయ కాంగ్రెసు ప్రజాస్వామిక పద్ధతిని అవలంబిస్తూ ఒక పార్లమెంటువలె నిర్వహింపబడింది. అది అంతర్గతంగా పార్టీలోనూ, ఉద్యమంలోనూ స్వేచ్ఛగా అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను అనుమతించటమేగాకుండా, ప్రోత్సహించింది. అనేకమైన ముఖ్యనిర్ణయాలు వేడీ, వాడీ చర్చలతరువాతనే, బహిరంగ ఓటింగ్ విధానం ద్వారానే తీసుకోవటం జరిగిందనేది చారిత్రక సత్యం.

వాక్ స్వాతంత్ర్యం, సభా స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యంపై ప్రభుత్వం విరుచుకుపడటం జరిగినప్పుడంతా తొలినుండీ జాతీయవాదులు పోరాటాన్ని కొనసాగిస్తూనే

వచ్చారు. జాతీయోద్యమంతో ఆ పోరాటాలను ఏకీకృతం గావించారు. 1937 – 39 మధ్య తాము అధికారంలో వున్న స్వల్పకాలంలో కాంగ్రెసు మంత్రులు పౌరహక్కుల పరిధిని ఘనంగా విస్తృతపరిచారు. పౌరహక్కుల పరిరక్షణ ఒక రాజకీయ పక్షానికే పరిమితం అన్నట్లుగా సంకుచితంగా ప్రవర్తించక విభిన్న రాజకీయ, సైద్ధాంతిక దృక్పథాలుగల యితరపక్షాలకు గూడ విస్తరించేలా చూసారు. తటస్థవాదులు తీవ్రవాది అయిన తిలక్‌ను సమర్థించారు. కోర్టు విచారణ జరిగే సమయాల్లో అహింసావాదులైన కాంగ్రెసు వారు కమ్యూనిస్టులను, విప్లవకారుల్ని తీవ్రమైన భావావేశంతో సమర్థించారు. 1928లో పబ్లిక్ సేఫ్టీ బిల్లు, ట్రేడ్ డిస్‌ప్యూట్ బిల్లుల్ని మోతీలాల్ నెహ్రూయేగాక, మదన్‌మోహన మాలవ్యా, యమ్. ఆర్. జయకర్‌వంటి సంప్రదాయ వాదులు కూడ వ్యతిరేకించారు. జాతీయోద్యమంలోని ఈ విధమైన పటిష్టమైన పౌరహక్కుల, ప్రజాస్వామిక సంప్రదాయం స్వతంత్ర భారత రాజ్యాంగంలో ప్రతి ఫలించింది.

స్వాతంత్ర్య పోరాటం ఆర్థికాభివృద్ధికై పోరాటంగా కూడ కొనసాగింది. కాలానుగుణంగా స్వతంత్ర భారతాన్ని ప్రభావితం చేసిన ఒక ఆర్థిక సిద్ధాంతం వృద్ధిచెందింది. పారిశ్రామికీకరణ ప్రాతిపదికగా భారతదేశ అభివృద్ధికి కృషి జరగాలనే విషయంలో జాతీయోద్యమం దాదాపు ఏకాభిప్రాయంతోనే ఉంది. అయితే పారిశ్రామికీకరణ విదేశీ పెట్టుబడులు లేకుండా స్వదేశీ పెట్టుబడులపైనే ఆధారపడవలసిఉంది. ప్రభుత్వ రంగానికి ఒక కీలకమైన పాత్ర అప్పగించబడింది. 1930 వ దశకంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానానికి కట్టుబడివుండే నిర్ణయం గైకొనబడింది.

ప్రారంభదశ నుండీ కూడ ఉద్యమం బీదవాళ్ల ఉద్ధరణకు నడుంబిగించింది. గాంధీ రాజకీయ రంగ ప్రవేశం సామ్యవాద దృక్పథాన్ని అమలు పరచాలనుకునే వారి విజృంభణకు ఊతాన్నిచ్చింది. విప్లవాత్మక వ్యవసాయ సంస్కరణ పథకాల దిశగా కూడ ఉద్యమం ఊపందుకుంది. అయితే 1930,1940 దశకాల్లో భారత జాతీయ కాంగ్రెసులో, జాతీయోద్యమంలో ముమ్మరంగా చర్చలు సాగినా భారత జాతీయ కాంగ్రెసుకు సామ్యవాదం ఏనాడు, ఏదశలోనూ సాధికారిక లక్ష్యంగా

రూపొందలేదు. జాతీయవాద కార్యాచరణలో బలమైన వామపక్ష ధోరణులున్నా అనేక కారణాలవల్ల కాంగ్రెసులోని ఆధిపత్య భావనాశక్తి పెట్టుబడిదారీ సమాజపు భావనల ప్రమాణాలకు అతీతంగా నిలువలేకపోయింది.

జాతీయోద్యమం తొలినాళ్ల నుండీ మతాతీత భావనకు పట్టుగొమ్మ. ప్రజలలో లౌకిక విలువల్ని పెంపొందించేందుకు, మతవాదాన్ని వ్యతిరేకించేందుకు దాని నాయకత్వం గట్టిగా పోరాడుతూనే ఉంది. భారత విభజనానంతర మతపూరిత విధ్వంసకాండకు అతీతంగా స్వతంత్ర భారత రాజ్యాంగ రచనలో లౌకికతత్వాన్ని ప్రతిష్ఠింపజేయటంలో అది సఫలీకృతమయ్యింది.

దానిది అంతర్ముఖత్వం కానేకాదు. రాజా రామమోహన్ రాయ్ కాలం నుండి భారత నేతలు విశాలమైన అంతర్జాతీయ అవగాహనను పెంపొందించుకున్నారు. కొన్నేళ్లకు ప్రపంచ స్థాయిలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఒక కార్యాచరణ విధానాన్ని రూపొందించుకున్నారు. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో తలెత్తిన వలసవాద వ్యతిరేక ఉద్యమాలతో సంఘీ భావాన్ని పదిలపరచుకున్నారు. భారతీయులు బ్రిటీషు ప్రజలనుగాక, బ్రిటీషు సామ్రాజ్య వాదాన్ని ఏవగించుకోవాలనే భావనను పాదుకొల్పారు. దానిమూలంగా ఆంగ్లేయ స్త్రీ, పురుషులు రాజకీయ వర్గాలు వారికి అండగా నిలిచాయి. విశ్వవ్యాప్తంగా అభ్యుదయవాద, వలస వ్యతిరేకవాద, పెట్టుబడిదారీవ్యతిరేక శక్తులతో ఘనిష్ఠ సంబంధాలేర్పడ్డాయి. భారతీయ విదేశీ విధాన వ్యక్తీకరణను నిరంతరంగా కొనసాగించే జాతి వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక భావనొకటి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట వారసత్వంలో అలా అంతర్భాగమయ్యింది.

* * *

భారత జాతీయ ఉద్యమం విషయంలో, ఈ గ్రంథ రచయితలు, సహచరులు, వారి విద్యార్థులు పరిశోధించిన, పరిశోధిస్తున్న కృషి ఆధారంగా ప్రధానంగా ఇది రూపుదిద్దుకున్నది. ఈ గ్రంథ రచనలో మేముప్రచురించిన, ప్రచురించని ఏకాంశపత్రాలను (మోనోగ్రాఫ్సను), పురాతన చారిత్రక సమాచారాన్ని, వ్యక్తులవద్దగల పత్రాలను, వార్తాపత్రికల్ని విరివిగా వాడుకున్నాం. 1918 నుండి జాతీయోద్యమంలో పాల్గొన్న 1500 పైగా స్త్రీ, పురుషుల్ని కలిసి మాట్లాడిన విషయాలు గ్రంథస్థం చేసాం. ఈ విషయంలో మా అవగాహనను పెంచుకున్నాం. ఏది ఏమయినా పాఠకుల సౌకర్యంకోసం వాటన్నింటికి

సంబంధించిన సూచికల్ని వీలైనంత తక్కువగా సూచించాం. అవీ మంచి గ్రంథాలయాలలో లభించే పుస్తకాలలోని విషయాలకే పరిమితం చేసాం.

ఆ కారణంగానే నేటివరకు భారత జాతీయ ఉద్యమం మౌలిక సామ్రాజ్యవాద పార్శ్వంనుండి మార్క్సిస్టు దృక్పథం వరకు పలు విధాలైన చారిత్రక అవగాహనలను కలిగివున్నా, మరెన్నో మూసకట్టు విధానాలు, రీతిరివాజులకు ఆలవాలమైనా, మా విశ్లేషణలతో విభేదించినా ఎక్కడో నాలుగవ అధ్యాయంలో భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భావాన్ని గూర్చి సురక్ష కవాట సిద్ధాంత రూపకల్పన విషయాలను మినహాయించి మేము వాటిపై చర్చోప చర్చలకు తావివ్వలేదు. పాఠకునికి న్యాయం చేయాలనే సంకల్పంతో మేము ప్రాథమికమైన అనేక ప్రధాన చారిత్రక ధోరణుల్ని సంక్షిప్తంగా, రేఖామాత్రంగా స్పృశిస్తూ, వాటితో మేము విభేదించిన తీరును సూచిస్తూ, మార్గాంతరాల్ని ఉల్లేఖిస్తూ ఈ గ్రంథాన్ని తయారు చేశాము.

* * *

వైస్రాయిలు లార్డ్ డఫ్రిన్, కర్జన్, మింటోలు; స్టేట్ సెక్రటరీ హేమిల్‌టన్‌ల సామ్రాజ్యవాద ధోరణితో మేము బాగా విభేదించాం. ఆ ధోరణి తొలిసారిగా వి.చిరోల్, రౌలట్ (తిరుగుబాటును రెచ్చగొట్టే) కమిటీ నివేదిక, వెర్నీ లావెట్ మాంటేగు–చెమ్స్‌ఫర్డ్ నివేదికలద్వారా నచ్చజెప్పే పద్ధతిలో ప్రవేశపెట్టారు. 1940లో అమెరికన్ పండితుడు బ్రూస్ టి.మెకాలే దానిని సిద్ధాంతీకరించాడు. 1947 తరువాత దాని విశాల దృక్పథాన్ని రెజినాల్డ్ కూప్‌లాండ్ స్వీకరించగా 1968 తరువాత యానిల్ సీల్, జే. ఏ. గల్లఘేర్,వారి శిష్యగణం సంప్రదాయబద్ధమైన ప్రగతి నిరోధకమైన దాని ధోరణిలోని తుప్పును రాల్చి, వృద్ధిలోకి తీసుకురావటం జరిగింది. మేధావి వర్గాల్లో విశాల దృక్పథ ధోరణి అంతగా ప్రాచుర్యంలో లేని కారణంగానూ, గ్రంథ విస్తరణ భీతితోనూ దానిని వదిలేసాం.

కేంబ్రిడ్జ్ స్కూలుగా భావించే కాకలు దీరిన వలసవాద అధికారగణం, సామ్రాజ్యవాద భావనారాధకులైన చరిత్రకారులు భారతదేశంలో వలసవాదం ఒక ఆర్థిక రాజకీయ, సామాజిక సాంస్కృతిక చట్రంగా రూపొందిందనేదాన్ని అంగీకరించరు. వాళ్ల దృష్టిలో వలసపాలన ప్రధానంగా పరాయిపాలనే. భారతదేశం ఆర్థికంగా, సామాజికంగా సాంస్కృతికంగా అభివృద్ధిని సాధించాలంటే వలసపాలనను పడగొట్టాలనే విషయాన్ని వాళ్లు అంగీకరించనూ అంగీకరించరు; గట్టిగా కాదనను కాదనరు. భారతీయ ప్రజల

బ్రిటీషు పాలనల మధ్య ప్రయోజనాల వైరుధ్య కారణంగా ఉద్యమం వృద్ధి చెందిందనే దానిని ఖండించటం జాతీయోద్యమం విషయంలో వాళ్ల విశ్లేషణ. పర్యవసానంగా భారత జాతీయోద్యమం ఈ వైరుధ్యాలతో భారతదేశం వైపు మొగ్గుచూపిన విషయంలో వాళ్లు స్పష్టంగానో, అస్పష్టంగానో అనంగీకారాన్ని ప్రకటిస్తారు. అంటే భారత జాతీయోద్యమ సామ్రాజ్యవాద వ్యతిరేకతనుగానీ లేదా బ్రిటీషు పాలనలోని సామ్రాజ్య వాదాన్ని భారతదేశపు ఉద్యమం వ్యతిరేకిస్తున్నదనే విషయాన్నిగానీ వాళ్లు గుర్తించరన్న మాట. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నడిచిన భారతీయ పోరాటాన్ని వాళ్లు దసరా వేడుకల్లోని బొమ్మల కొట్లాటవంటి తమాషాగా భావిస్తున్నారు. కీలకమైన వైరుధ్యాన్ని వాళ్లు కాదనటంలో ఈ మేధావుల ధోరణంతా నిరుపయోగమైన వాళ్ల శ్రద్ధతో కూడిన గవేషణ మాత్రం ఇతరులకు ఆ వివరాలను మరోవిధంగా వాడుకునేందుకు బాగా ఉపకరించింది.

భారతదేశం 'ఒక జాతిగా రూపొందుతున్న సత్యాన్ని సామ్రాజ్యవాద రచయితలు కాదన్నారు. వాళ్ల దృష్టిలో భారతదేశం అనేది. అనేక మతాల, కులాల, వర్గాల, ప్రయోజనాల సమ్మేళనమని వాళ్లు విశ్వసించారు. కనుక భారతదేశ రాజకీయాల్ని భారతజాతి, లేదా భారత ప్రజల, లేదా భారత సామాజిక వర్గాల రాజకీయాలుగా వాళ్లు గుర్తించనే లేదు. పైగా 'వాళ్లు హిందూ, ముస్లిం; బ్రాహ్మణ, బ్రాహ్మణేతర; ఆర్య, భద్రలోక్ (సాంస్కృతిక జీవులు) వంటి గుర్తింపుల్ని ముందు నుండీ ఉన్నటువంటి వాటిని దాఖలాలుగా చూపుతారు. ఈ విధంగా కులం, మతం ఆధారంగా ఏర్పడి, వాటిని విధిగా అనుసరించవలసిన గ్రూపులే ప్రధానంగా రాజకీయ వ్యవస్థకు మూలాలుగాని జాతీయత అనేది కేవలం ముసుగులేనంటారు వాళ్లు. సీల్ అన్నట్లుగా– 'దూరాన్నుండి రాజకీయ పోరాటాలుగా కన్పించేవన్నీ దగ్గరగా పరిశీలిస్తే వాళ్లవాళ్ల ముఠాలను సంరక్షించుకునే చర్యలుగానో, వృద్ధిపరుచుకునే చర్యలుగానో కన్పిస్తాయి.' (దీనివల్లనే భారత జాతీయత చైనా, జపాన్, ఆఫ్రికా, ముస్లిం దేశాల జాతీయతలకు భిన్నంగా కన్పిస్తుంది అంటాడు సీల్).

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజల ప్రయోజనాలు ప్రతిబింబించకపోతే మరి ఎవరి ప్రయోజనాలకు భారత జాతీయ ఉద్యమం ప్రాతినిధ్యం వహించినట్లు? దానికి సమాధానంగా వాదనల్ని 19, 20 శతాబ్దాల్లోని అధికారులు

సామ్రాజ్యవాద ప్రతినిధులు మళ్లీ సిద్ధం చేసారు. జాతీయ ఉద్యమం ప్రజా ఉద్యమం కాదని, అది కేవలం మేధావి వర్గాల అవసరాల, ప్రయోజనాల కోసం ముందుకు తీసుకువచ్చినటువంటిదనీ, కనుక వాళ్లు దానిని వాళ్ల లేదా వాళ్లను అనుసరించేవాళ్ల అవసరాలకు, ప్రమోజనాలకు మాత్రమే పరిమితం చేసారనీ నొక్కివక్కాణించసాగారు. అలా మేధావి వర్గం వాళ్ల అవసరాలు, ప్రయోజనాలు జాతీయ ఉద్యమ ఆలోచనకు, సిద్ధాంతానికి, ఉద్యమించేందుకు కావలసిన స్ఫూర్తిని ప్రసాదించాయి. ఈ సముదాయాలు ఒక్కో పర్యాయం మతం లేదా కులం ప్రాతిపదికన మరికొన్ని పర్యాయాలు రాజకీయ లబ్ధికోసం ఏర్పాటు చేసుకున్న బంధాల ఆధారంగా ఏర్పడేవి. ఏ విధంగా ఏర్పడ్డా ఈ సముదాయాలు సంకుచిత దృష్టితో, స్వార్థపరతతో అటు బ్రిటీషు ప్రభుత్వాన్ని వ్యతిరేకించటమో లేక వాళ్లని వాళ్లు వ్యతిరేకించుకోవటమో చేస్తుండేవాళ్లు. అలా జాతీయవాదం, ప్రధానంగా, ఈ సముదాయాల సంకుచిత వాంఛితాలకు ఆమోదయోగ్యతను కల్పించుకొని ప్రజా మద్దతును సంపాదించుకునే సిద్ధాంతంగా భావించబడింది. జాతీయోద్యమం కేవలం మేధావి వర్గం వాళ్ల స్వప్రయోజనాల సాధనకోసం, జనసమీకరణ కోసం వాడుకున్న ఆయుధమైంది.

గల్లఘేర్, సీల్, వాళ్ల విద్యార్థులు ఈ రకమైన ధోరణిని మరింత పెంపొందింపజూస్తే డఫ్రిన్, కర్జన్,చిరోల్, లావెట్, మెకాలే, బి.బి.మిశ్రా వంటివారు నిరాశచెందిన మధ్యతరగతికి చెందిన విద్యావంతులు 'సుపరిపాలనకు' వ్యతిరేకంగా జాతీయవాదాన్ని వాడుకున్నారన్నారు. చిరోల్ విశదం చేసిన దానికీ, రౌలట్ కమిటీ నివేదికలో ఉటంకించిన దానికీ అనుగుణంగా సీల్ ప్రచారంలోకి తెచ్చిందేమంటే బ్రిటీషు ప్రాపకం కోసం భారతీయ మేధావి వర్గాలు ఒక దానితో మరొకటి పోటీ పడటమే జాతీయవాదం అని. ఆయన మాటల్లోనే చెప్పాలంటే –"స్థానికమైన ఈ ప్రజాసమీకరణల్ని, బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని ధిక్కరించేందుకు ఉద్దేశించినవిగా భావించటం తప్పుదారి పట్టించటమే. సామ్రాజ్యవాదానికీ జాతీయవాదానికీ మధ్యగల సంఘర్షణ పట్ల కడు శ్రద్ధ వహించటం జరిగింది. అయితే వాళ్ల మధ్య అసలైన భాగస్వామ్యం విషయంలో అధ్యయనం చేయటం కొంత లాభదాయకంగా వుంటుంది." కనుక జాతీయ ఉద్యమం ఉద్భవించటానికీ, దాని వ్యాప్తికీ బ్రిటీషు పాలన భారతీయుల్లో ఒకరిపట్ల మరొకరికి ద్వేషభావాన్ని రగుల్కొల్పి ఒకరిపై మరొకరిని ఉసిగొల్పింది. వాళ్ల పరస్పర వైరం కొనసాగేందుకు కావలసిన కొంగ్రొత్త కార్యక్రమాలను సంస్థలను అమర్చింది.

సీల్, గల్లఘీర్, వాళ్ల విద్యార్థులు మేధావి సముదాయాలు ఏర్పడ్డ భూమికను మరింత విస్తృత పరిచారు. బ్రిటీషు చరిత్ర కారుడు లూయిస్ నేమియర్ దృక్కోణాన్ని వాళ్లు అనుసరిస్తూ, దానికి మరి కొంత జోడిస్తూ వాదించిందేమంటే ఆ మేధావి సముదాయాలు "పోషకుడు -ఖాతాదారు" వంటి బాంధవ్యంపై ఏర్పడినటువంటివని, వాళ్లు సిద్ధాంతీకరించిందేమంటే బ్రిటీషు పాలనాపరమైన, ఆర్థిక, రాజకీయ అధికారాల్ని స్థానికంగానూ ప్రాంతీయంగానూ అందించటంతో స్థానిక మోతుబరులు పోషకులను, ఖాతాదారులను పోగు చేసి వాళ్ల ప్రయోజనాలను వీళ్లు కాపాడుతూ తిరిగి వాళ్లు వీళ్ల ప్రయోజనాలను కాపాడేట్లు చూసుకుంటూ రాజకీయాలు నిర్వహించసాగారు. ఈ పోషకుల - ఖాతాదార్ల గొలుసులోని కొక్కేల ద్వారానే భారత రాజకీయాలు ప్రారంభమయ్యాయి. క్రమేపీ బడా నాయకులు ఆవిర్భవించి రాజకీయాలకూ స్థానిక మోతుబరులకు కొక్కెం బిగించే దళారులుగా ఆవిర్భవించటం బ్రిటీషు పాలన దేశమంతటా వ్యాపించి ఉండటంతో అఖిల భారత స్థాయి దళారులు పుట్టుకు రావటం జరిగింది. తమ కృషి విజయవంతం కావాలంటే జాతీయ స్థాయి దళారులకు క్రింది స్థాయిలో ప్రాంతీయ స్థాయి దళారులు అవసరమయ్యారు. అలాగే జాతీయోద్యమంలో ఖాతాదారుల్ని పాల్గొనేట్లు చేయవలసిన అవసరం ఏర్పడింది. ద్వితీయ శ్రేణి నాయకుల్ని సబ్ కాంట్రాక్టర్లుగా చిత్రించారు. గాంధీ, నెహ్రూ, పటేల్‌లను ప్రధాన రాజకీయ దళారులుగా సీల్ పేర్కొన్నాడు. అంతేగాక ఈ చరిత్ర కారుల ప్రకారం ఈ అధికార దళారితనం మూలకంగా నష్ట పోయిన ప్రజలు రాజకీయాల్లో కొచ్చింది 1918లోనే. ఆ తరువాత అక్కడ నెలకొనివున్న యుద్ధం, ద్రవ్యోల్బణం, అనారోగ్యం, కాటకాలవంటి రోజువారీ సమస్యలు వాటికి వలస వాదంతో ఎటువంటి సంబంధం లేకపోయినా - తెలివిగా వంచనతో మోతుబరుల ముఠా తగాదాలలో తలదూర్చేట్లు చేసేందుకు వాటిని వాడుకున్నారు.

ఈ విధంగా, ఈ విచారధార కలిగిన చరిత్రకారులు. భారత జాతీయోద్యమాన్ని, భారతదేశంలోని వివిధ మేధావి వర్గాల మధ్యనూ, వాటికీ, విదేశీ మేధావి వర్గానికి మధ్యగల ఘర్షణలు మారురూపంగానూ చిత్రించి, సామ్రాజ్యవాదాన్ని పడగొట్టి, స్వతంత్ర రాజ్యం స్థాపించుకొనేందుకు జరిగిన పోరాటంగా దాని ఆమోదయోగ్యతను గట్టిగా త్రోసిపుచ్చారు. ఐరోపాలో, ఆసియాలో, ఆఫ్రికాలో సహజంగా చరిత్రకారులు జాతీయోద్యమ విప్లవాల సమీక్షలో ఉపయోగించే జాతి, తెగ, బహుముఖత్వం

మార్పులవంటివి భారతదేశ జాతీయోద్యమాన్ని సమీక్షించేప్పుడు దాంట్లో చోటు చేసుకోలేదు. ఈ ధోరణి వల్ల వలసవాద దోపిడీ, చాలీచాలని ఉద్యోగాలవంటివి లేవని చెప్పటమేగాక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రాణాలను త్యాగం చేసిన వాళ్ల ఆదర్శాన్ని కూడ గుర్తించకుండా చేస్తుంది. యస్. గోపాల్‌గారన్నట్లు – ' నేమియర్ రాజకీయాలనుండి మేధాను తొలగించాడని నిందింపబడ్డాడు : ఈ శాఖ మరింత ముందుకు వెళ్ళి రాజకీయాలకు బుర్రలేకుండా చేయటమేగాకుండా వాటి ప్రతిష్టను, సత్ప్రవర్తనను, నిజాయితీని నిస్వార్థ కట్టుబాటును భారత జాతీయోద్యమం నుండి మటుమాయం చేసాయి.' పైగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో కార్యకర్తల, కృషీవలుల దిగువ మధ్య తరగతి ప్రజల, స్త్రీల తెలివైన, చురుకైన పాత్రను అది విస్మరించింది. వాళ్లందర్నీ వాళ్ల అవసరాలు ప్రయోజనాలు తెలియని పసివాళ్లుగానో, మూగవాళ్లుగానో భావించింది. అదే నిజమయితే మరి వలస పాలకులు అటువంటి వాళ్లను వాళ్ల రాజకీయ ఛత్రం క్రిందకు ఎందుకు తెచ్చుకోలేకపోయినట్లో!

* * *

ఇటీవల కొద్దిమంది చరిత్రకారులు ఒక కొత్త పద్ధతిని ప్రారంభించారు. దాన్ని వాళ్లు ద్వితీయ శ్రేణి విధానమన్నారు. అది అంతకు ముందున్న చారిత్రక రచనను త్రోసిపుచ్చుతుంది. మార్క్సిస్టు దృక్పథం గల దానిని కూడ మేధావి వర్గపు చారిత్రక కథనంగా అది ప్రక్కనబెడుతుంది. ఆ పాతకాలపు 'గంత కట్టుడు' చారిత్రక కథనం స్థానంలో సరికొత్త ప్రజా ప్రాతిపదిక పద్ధతిని ప్రవేశపెడుతున్నామన్నారు.

వాళ్లకు వలసకాలం నాటి భారతీయ సమాజంలోని చారిత్రక ఘటనల్లో ప్రధాన ఘర్షణ ఇటు భారతీయుల, విదేశీయుల మేధావి వర్గం మధ్య అటు ద్వితీయ శ్రేణి వర్గాల మధ్యే గాని వలసవాదానికీ, భారతీయ ప్రజలకూ మధ్య కాదని. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కోసం భారత ప్రజలెన్నడూ ఏకం కాలేదంటారు వాళ్లు. కనుక భారత జాతీయోద్యమం అనేది అసలు లేనే లేదంటారు. వాళ్ల ప్రకారం రెండు ప్రధాన మార్గాలు లేదా ఉద్యమాలు నిర్వహింపబడినాయనీ వాటిని అసలు సిసలైన సామ్రాజ్యవాద వ్యతిరేక ద్వితీయశ్రేణి ప్రజా వర్గ పోరాటంగానూ,మేధావి వర్గపు నకిలీ జాతీయోద్యమంగానూ వాళ్లు వింగడించారు. భారత జాతీయ కాంగ్రెసులోని అధికార పక్షం దొంగ ముసుగులో మేధావి వర్గానికి అధికారం కట్టబెట్టేందుకు కృషిచేసింది.

ద్వితీయ శ్రేణి విధానాన్ని రూపొందించిన వారి ప్రకారం జాతీయ ఉద్యమం సామ్రాజ్యవాద, నయా సామ్రాజ్యవాదాలమధ్య ఆందోళనాపూరిత సామ్యాన్నినెలకొల్పే దిశగా కన్పిస్తుంది. కాకపోతే ఒకే ఒక్క తేడా ఏమంటే నయావలసవాద చారిత్రక రచన ఉద్యమాన్ని విడగొట్టదు. ఉద్యమం మొత్తాన్ని కలిపి ఆ విధంగా చూస్తుంది. ద్వితీయ శ్రేణి పద్ధతిలోని చారిత్రక రచన ముందు ఉద్యమాన్ని రెండు వర్గాలుగా విభజించి అందులోని మేధావి వర్గాన్ని నయా సామ్రాజ్యవాద ధోరణికి అంట గట్టేందుకు అంగీకరిస్తుంది. ఈ విధమైన పద్ధతి సహజంగా చరిత్రలో సంబంధంలేనటువంటి రకరకాల మెచ్చుకోళ్లు – ప్రజల సమరశీలత గూర్చి చైతన్యాన్ని గూర్చి అలాగే చరిత్రకు సంబంధించని అనేక రకాలైన ధిక్కార భావనలు – మేధావి వర్గానికి సంబంధించి, వ్యవస్థీకృత పార్టీ నాయకత్వాన్ని గూర్చి ఇతర ఉన్నత వర్గాలను గూర్చి బాగా పట్టించుకునేది. అందువల్ల ఈ పద్ధతి కూడా భారతీయుల వలస విధానానికి వ్యతిరేకంగా జరిపిన వాస్తవ చారిత్రక పోరాటపు న్యాయనిరూపణను నిరాకరిస్తున్నది. ఈ కొత్త ఆలోచనా ధోరణి గల ప్రజా చైతన్యమే ఆలంబనగా చారిత్రక రచన గావించే వాగ్దానం చేసినా అది ప్రజా బాహుళ్యపు అవగాహనల్ని బాగా ప్రతిబింబింపజేసే సరికొత్త మూలాధారాలను ఇంకా వినియోగించుకోవాల్సే ఉంది. దాని 'సరికొత్త' రచన యింకా పాతకాలపు 'ఉన్నతవర్గ' మూలాలపైనే ఆధారపడుతూ వచ్చింది.

* * *

మరో ప్రధాన ఆలోచనా విధానం జాతీయవాద చారిత్రక రచన. వలస పాలన కాలంలో రాజకీయ క్రియాశీలురైన లజపతిరాయ్, ఏ.సీ. మజుందార్, ఆర్.జీ. ప్రధాన్, పట్టాభి సీతారామయ్య, సురేంద్రనాథ్ బెనర్జీ, సి.ఎఫ్. యాండ్రూస్, గిరిజా ముఖర్జీ వంటివారు ఈ భావనాధారకు ప్రాతినిధ్యం వహించారు. ఈ మార్గంలోనే యిటీవల ప్రయనిస్తూ బీ.ఆర్. నందా, విశ్వేశ్వర ప్రసాద్, ఆమ్లెస్ త్రిపాఠీ వంటివారు ప్రముఖంగా చరిత్ర రచనను పరిపుష్టంగావించారు. జాతీయవాద చరిత్రకారులు, మరీ ముఖ్యంగా యిటీవలివారు వలసవాదపు పీడించే లక్షణం పట్ల అవగాహన కలిగి ఉన్నారు గాని, మొత్తం మీద వాళ్ల అభిప్రాయంలో జాతీయత లేదా స్వేచ్ఛ పట్ల స్ఫూర్తి ఫలితమే జాతీయోద్యమమని, భారతదేశం ఒక జాతిగా రూపొందటాన్ని వారు పూర్తిగా గుర్తించారు. జాతీయోద్యమం ప్రజా ఉద్యమంగానే వాళ్ల దృష్టిలో నిలిచింది.

అయితే వాళ్ల ఆలోచనా ధోరణిలోని ప్రధాన బలహీనత ఏమంటే భారతీయ సమాజపు అంతర కుల, వర్గ విభేదాల్ని సరకుగొనక పోవటమో, తక్కువగా అంచనా వేయటమో చేసారు. జాతీయోద్యమం ప్రజలందరి లేదా జాతి మొత్తం ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించినా (వలస పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల కలగలుపు) అది ఒక వర్గపు కోపుగాయటం అందు మూలంగా వివిధ సామాజిక, బౌద్ధిక దృక్పధాలు ఉద్యమంపై ఆధిపత్యానికి నిరంతరం సిగపట్లు పట్టాయనే విషయాన్ని వాళ్లు పక్కన పెట్టినట్లుగా కన్పిస్తుంది. వాళ్లు సాధారణంగా జాతీయోద్యమంలోని మితవాదవర్గం అనుసరించిన పంధానే అనుసరిస్తూ, దాన్నే ఉద్యమం అంతటికీ వర్తించేలా చేసారు. ఉద్యమానికి వాళ్లిచ్చిన వ్యూహాత్మక, భావాత్మక పరిణామాల వివరణ అరకొరగానే ఉండిపోయింది.

* * *

తరువాత మార్క్సిస్టు ఆలోచన విధానం కాస్త ఆలస్యంగా రంగం మీదికి వచ్చింది. జాతీయోద్యమ అధ్యయనానికి పునాదులు ఆర్. పామీదత్, ఏ.ఆర్. దేశాయ్‌లు వేసినా ఎందరో కాలక్రమేణా దానిని విస్తృత పరిచారు. సామ్రాజ్య ధోరణి కలవారి వలె గాక మార్క్సిస్టు చరిత్ర కారులు ప్రధానమైన వైరుధ్యాన్నీ, జాతిగా రూపొందిన క్రమాన్నీ స్పష్టంగా చూడగలిగారు. వాళ్ళు జాతీయవాదులవలెగాక భారతీయ సమాజంలోని అంతర్గత విభేదాలను సంపూర్ణంగా పరిగణనలోనికి తీసుకున్నారు.

ఏది ఏమయినా వాళ్లల్లో చాలా మంది – మరీ ముఖ్యంగా పామీదత్ – ప్రాధమిక సామ్రాజ్యవాద వ్యతిరేక వైరుధ్యాన్నీ, ద్వితీయంగా దేశం లోపలి అంతర్గత వైరుధ్యాలనూ పూర్తిగా సమన్వయ పరచలేకపోయారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని వర్గపోరాటానికో, సామాజిక పోరాటానికో బేరీజు వేయజూసారు. వాళ్లు దాన్నొక బూర్జువా ఉద్యమంగా గాక పోయినా, ఒక నిర్మాణయుత బూర్జువా ఉద్యమంగా గుర్తించసాగారు. వాళ్లు ఆ ఉద్యమంలోని గిరిగీసుకోని తత్వాన్నీ ఆకళింపు చేసుకున్నట్లు లేదు. ఉద్యమంలో బూర్జువాలదే పెత్తనమనుకున్నారు. జాతీయ నాయకత్వాన్ని బూర్జువావర్గంతోనో లేక పెట్టుబడిదారీ వర్గంతోనో సమానంగా చూసారు. ఉద్యమంలోని పోరాట విధానాల ఆధారంగా ఉద్యమపు వర్గతత్వాన్ని విశదీకరింప బూనారు (శాంతియుత స్వభావం). దానితో అది వ్యూహాత్మక తిరోగమనానికీ, రాజీధోరణికీ గురికావలసి వచ్చింది.

మరికొందరు యింకో సంకుచిత దృష్టితో చూసారు. ఆర్థిక వనరులు అందుబాటులోకి రావటం అనేది జాతీయవాద రాజకీయాల శక్తినీ, ప్రభావాన్నీ దిశానిర్దేశం చేసిందని వాళ్లు సూచించారు. మార్క్సిస్టు చరిత్రకారుల్లో చాలా మంది ప్రజా సమీకరణకు సంబంధించిన వ్యూహాలపై, కార్యక్రమాలపై, భావజాలంపైనా జాతీయోద్యమంలోని వ్యూహాత్మక నేర్పరితనపు ఎత్తుగడలపైనా విస్తృతమైన చారిత్రక అవలోకనం జరపలేదు.

* * *

ఇక మా విధానమంటారా – మేము స్థూలంగా మార్క్సిస్టు సంప్రదాయంతోనే ఉన్నామని విశ్వసిస్తూ సమస్యల్ని నిర్ధారించే ప్రయత్నం చేసాం. వలస పాలనలోని భారతదేశంలో నెలకొన్న వైరుధ్యాల స్వభావాన్నీ, ప్రధాన, ద్వితీయ వైరుధ్యాల మధ్య సంబంధాన్నీ, ఉద్యమంలోని వర్గ స్వభావాన్నీ; భారత జాతీయ కాంగ్రెసు, దాని నాయకత్వంలో బూర్జువా వర్గాలు, యితర సామాజిక వర్గాల మధ్య సంబంధాలు – అంటే వర్గానికి రాజకీయ పక్షానికీ మధ్య గల సంబంధం; వివిధ పోరాట పద్ధతుల మధ్య గల సంబంధాలు (అహింసతో సహా) వర్గ లక్షణం, సిద్ధాంతం, వ్యూహం, ఉద్యమంలోని మూకస్వభావం వంటి వాటి నెన్నింటినో పట్టించుకున్నాం. మా రచనా ప్రణాళిక ఇప్పుడున్న వివిధ పద్ధతుల నుండి విభేదిస్తుంది. చివరకు పామీదత్తు, ఏ.ఆర్. దేశాయి వంటి సంప్రదాయ మార్క్సిస్టు పద్ధతికి కూడా ఇది భిన్నంగా ఉంటుంది. ఆ ప్రణాళిక స్థూల రేఖల్ని ఈ క్రింద పొందు పరుస్తున్నాం.

* * *

మా దృష్టిలో భారత స్వతంత్ర పోరాటం ప్రధానంగా భారత ప్రజలకు, బ్రిటీషు వలస పాలనకు మధ్య మౌలికంగా గల వైరుధ్య ఫలితమేనని, తొలి నుండి కూడా భారత జాతీయ నాయకులు ఈ వైరుధ్యాన్ని గుర్తిస్తూనే ఉన్నారు. వాళ్లు ఆర్థికంగా దేశం వెనుక బడిపోతున్నదని, అందువల్ల అభివృద్ధి కుంటుబడుతున్నదని అర్థం చేసుకోగలిగారు. తగిన సమయంలోనే వాళ్లు వలస వాదాన్ని గూర్చి సరిగానే విశ్లేషించుకోగలిగారు. వాస్తవానికి 19వ శతాబ్దంలో వలసవాదానికి ఆర్థిక పరమైన విమర్శను వృద్ధిపరచి దాని సంక్లిష్ట స్వభావాన్ని బట్టబయలు చేసింది వాళ్లే. వాళ్లు వలస వాద విధానానికీ, వలసవాద చట్రపు తప్పని సరి స్థితిగతులకూ మధ్య గల వ్యత్యాసాలను కూడా చూడగలిగారు. వలస పాలనలోని పౌరులుగా, భారత ప్రజల సామాజిక అనుభవాలను సేకరిస్తూ,

వలస పాలనలోనే భారత ప్రజల ఉమ్మడి ప్రయోజనాలను గుర్తిస్తూ జాతీయ నాయకులు క్రమేపీ ఓ కచ్చితమైన వలస వాద వ్యతిరేక సిద్ధాంతాన్ని రూపొందించుకొని దాని పైనే ఉద్యమాన్ని నిలిపారు. ఉద్యమానికి జన సందోహం కాపుగాసిన తరుణంలో వలస వాద వ్యతిరేక సిద్ధాంతమూ, వలస వాదం పట్ల విమర్శ బాగా వ్యాప్తిచెందాయి.

* * *

భారత ప్రజలు ఒక జాతిగా, ఒక దేశ ప్రజగా రూపొందిన చారిత్రక ప్రక్రియలో జాతీయోద్యమం కీలక పాత్ర పోషించింది. జాతీయనాయకులు దాదాభాయి నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, తిలక్ వంటి వారి నుండి గాంధీజీ, నెహ్రూల వరకు భారతదేశం ఇంకా సంపూర్ణంగా ఒక వ్యవస్థీకృత జాతికాదని, అది ఒక జాతిగా రూపుదిద్దుకోవటం యింకా కొనసాగుతూనే ఉన్నదని అంగీకరించారు. ఉద్యమపు ప్రధాన ఆశయాలలో, విధులలో ఒకటి వలస వాదానికి వ్యతిరేకంగా జరిగే ఉమ్మడి పోరాటం ద్వారా భారతీయుల్లో పెరుగుతున్న ఐక్యతను మరింతగా పెంపొందింప జేయటం. 'మరో మాటగా చెప్పాలంటే జాతీయ ఉద్యమాన్ని జాతిగా రూపొందే ప్రక్రియలో ఒక ఫలితంగానూ, ప్రక్రియను వేగవంతం చేసే ఒక క్రియాశీల ఉపకరణంగానూ చూడవలసి వచ్చింది. ఇలా జాతిగా రూపుదిద్దుకునే ప్రక్రియ ఎన్నడూ ప్రాంతీయ పరమైన, భాషా పరమైన, జాతిపరమైన భిన్నత్వానికి ఎదురు నిలువలేదు. పైగా దానికి భిన్నంగా మోసులెత్తుతున్న జాతీయతా గుర్తింపు, పుష్పిస్తున్న యితర సంకుచిత గుర్తింపులు ఒకదానితో ఒకటి శక్తిని సముపార్జించుకునే ప్రక్రియలుగా భావించబడినాయి.

జాతీయతా వాదానికి ముందు వలస పాలన పట్ల ప్రకటించిన ప్రతిఘటన వలసవాదం, జాతిగా రూపుదిద్దుకోవటమనే కవలలవంటి దృగ్గోచర విషయాల్ని గుర్తించలేక పోయింది. వాస్తవానికి అవి పైకి కన్పించేట్లుగా లేవు; అర్థం చేసుకునే అవకాశమూ లేదు. అవి కఠోర సమీక్షాత్మక కృషి పిమ్మట గాని అంతుబట్టవు. ఈ విధమైన సమీక్షను దానిపై ఆధారపడిన రాజకీయ స్పృహను మేధావులు ప్రజల వద్దకు తీసుకు వెళ్లి ప్రజలలో స్వతఃసిద్ధమైన, స్వభావపరమైన, నవజాతి, వలసవాద వ్యతిరేకతా భావాన్ని రేకెత్తించటంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు.

* * *

38వ అధ్యాయంలో వివరించినట్లుగా భారతజాతీయ ఉద్యమానికి సైద్ధాంతికత లోపించినా ఒక కచ్చితమైన పోరాట వ్యూహంతో అది సాగింది. మరీ ముఖ్యంగా 1918 తరువాత పోరాటంలోని వివిధ దశలు, రూపాలు, కలగలిసి పోయాయి. భారత ప్రజల కొరకు హృదయగతంగా, మనోగతంగా నిర్వహింపబడిన ఆధిపత్య పోరువల్లనే ఆ వ్యూహం సాధ్యపడింది. వలసవాద ఆధిపత్యానికి చెందిన రెండు మౌలిక అంశాల నిర్మూలనే దాని ధ్యేయం. (మౌలికంగా గ్రామ్‌సీ ఆధిపత్య సిద్ధాంతాన్నే వాడుకుంటూ దాన్ని కొంత సవరించటం జరిగింది). మరో విధంగా చెప్పాలంటే విశ్వాస పద్ధతిని బదాబదలు చేయాల్సి ఉంది. ఎందువల్లనంటే బ్రిటీషు ఆ పద్ధతి ద్వారానే భారత ప్రజల మౌనంగీకారాన్ని తమ పాలనలో పొందారు. దాని ప్రకారం బ్రిటీషు పాలన దయార్ద్రతతో నిండినదనీ లేదా భారతీయుల మంచికోసమే ఏర్పడినటువంటిదనీ కనుక అది అజేయమనీ, దానిని పడగొట్టటం దుర్లభమనేది భారతీయుల నమ్మిక. ఇదిగో ఈ అంశానికి సమాధానంగా జవహర్‌లాల్ నెహ్రూ తమ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' అనే గ్రంథంలో ఈ విధంగా వ్రాసారు; 'ఆయన (గాంధీజీ) బోధనల్లోని సారాంశం నిర్భీతి... అది కేవలం శారీరక సాహసం మాత్రమే కాదు; మనస్సులో భయమన్నది లేకుండా పోవాలి... కానీ బ్రిటీషు పాలనలో భారతదేశంలో ప్రజల ప్రేరణ భయం దిక్కుగానే. ఆ భయం కూడా సర్వవ్యాప్తమైనటువంటిది; అణచివేతకు సంబంధించినటువంటిది; ఊపిరి సలపనివ్వనిది. సైన్యం వలన పోలీసుల వలన, చుట్టూవున్న గూఢచారుల వలన భయం; అణచివేతకు గురిచేసి కారాగారానికి పంపే చట్టాలంటే భయం. భూస్వాముల ప్రతినిధులంటే భయం; అప్పులిచ్చిన వాళ్లను చూస్తే భయం; నిరుద్యోగం, పస్తుల పట్ల భయం; ఈ భయాలన్నీ ప్రతి గుమ్మం ముందూ నిలిచేవే. ఇదిగో ఈ ఊపిరి సలపనివ్వని భయానికి వ్యతిరేకంగా గాంధీజీ తన నిశ్చిత, నిశ్చల వాణి విన్పించింది: భయపడకండి'[6] అంటూ...

* * *

జాతీయ ఆధిపత్య పోరు ఏ విధంగా రూపొందవలసి ఉంది? ప్రజాను రంజక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో నాయకత్వం ఒక సైద్ధాంతిక ప్రణాళికకు కట్టుబడి వలస పాలన క్రింద గల ప్రజలందరి వలసవాద వ్యతిరేక ఆసక్తులను పరిగణనలోకి తీసుకొని వాటిని ఏకీకృతం చేసి, వివిధ వర్గాల, మతాల ప్రయోజనాల్ని సర్దుకుంటూ

పెత్తనం చేయాల్సి ఉంది. జాతీయ ఉద్యమం లోలోపలే సిద్ధాంత పరమైన పెత్తనానికి జరిగే సంఘర్షణలో అటువంటి సర్దుబాట్లలో లభించే సానుకూలతల్లో సమతౌల్యాన్ని సాధించేందుకు జరిగే మార్పులేగాని కేవలం సర్దుబాటుకు పరిమితం కాదు. వలస పాలనలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ప్రధానం; సామాజిక – కుల వర్గ – పోరాటాలు ద్వితీయం. కనుక భారతీయ సమాజం లోలోపల సంఘర్షణలు తలెత్తవలసిందే; వాటిని తుది వరకు కొనసాగనివ్వకుండా మధ్యలో రాజీమార్గాలు అన్వేషించాల్సిందే; ఒకదానిపై ఒకటి కారాలు మిరియాలు నూరే వర్గాలకు, కులాలకు రాయితీలు కల్పించవలసిందే.

ఇంకా జాతీయతా వ్యూహం చట్టాన్ని సరకుగొనని ప్రచండ ప్రజాపోరాట దశకు, చట్టబద్ధమైన తీవ్రతర ఆందోళనా కార్యక్రమ దశకు మధ్య మారుతూ వచ్చింది. తగినంతగా త్యాగాలను కోరే సుదీర్ఘ చట్ట వ్యతిరేక పోరాటాన్ని నిరంతరం కొనసాగించటం అంతటి ప్రజా బాహుళ్యానికి అసాధ్యం గనుక ప్రజా ఉద్యమాల స్వభావంలో ఎత్తు పల్లాలు, శిఖరాలు, లోయలు ఉంటాయనే దానిని ఆ వ్యూహం స్వీకరించింది. దేశం ఉద్యమంలో చివరి దశ దాటేవరకూ స్వాతంత్ర్య సముపార్జనకు సిద్ధంగా లేకపోయినా ఈ వ్యూహం అంచలంచెలుగా స్వాతంత్ర్య సమరాన్ని ముందుకు తీసుకెళ్తూనే ఉంది.

నిర్మాణ కార్యక్రమం – ఖాదీ అభివృద్ధి కోసం, జాతీయ విద్య కోసం, హిందూ ముస్లిం ఐక్యత కోసం, విదేశీ వస్తు బహిష్కరణ విషయంలో, మద్యపాన నిషేధం కోసం, హరిజన (అంటరాని కడజాతి) ఉద్ధరణ కోసం, ఆదిమజాతి కల్యాణం కోసం, అంటరాని తనాన్ని నిర్మూలించేందుకు – జాతీయతా వ్యూహంలో ప్రధాన భాగమయ్యింది. అదీ మరీ ముఖ్యంగా ఆ వ్యూహ ఏర్పాటు దశలో ఈ వ్యూహం వలస పాలనా పరమైన, రాజ్యాంగ బద్ధమైన పరిధిలోనే ఉంటూ దానిలో చేరిపోకుండా, దానికి ఎర గాకుండా మసలు కోవాల్సి వచ్చింది.

అయితే అహింస పాత్ర ఏమిటి? అది కేవలం గాంధీజీ వాదంగాని, సంపన్న వర్గాల ప్రయోజనాలు శాసించినటువంటిదిగానీ కాదని మేము విశ్వసిస్తున్నాం. సాధ్యమైనంత విస్తృతంగా ప్రజా సమీకరణ జరిపి నిర్వహింప వలసివచ్చే ఆధిపత్య వ్యూహపు పోరులో అది తప్పని సరే.

అధికారం కోసం జరిపిన జాతీయ పోరాట వ్యూహం వలస వాద రాజ్యపాక్షిక ఆధిపత్య లేదా చట్టబద్ధ అధికార తత్వానికి ముడిబెట్టబడింది. అటువంటి తత్వం చట్టబద్ధంగా, నియమం తప్పని అధికార యంత్రాంగంతో సాపేక్షిక స్వతంత్ర న్యాయవ్యవస్థగా కొనసాగుతూ, అత్యంత అణచివేతకు గురిచేసే చట్టాలను రూపొందించి అమలు పరుస్తూ, మామూలు సమయంలో కొంత పౌరస్వేచ్ఛను కల్పిస్తూ ప్రజా పోరాటాల సమయంలో అటువంటి స్వేచ్ఛను నిరాకరిస్తూ కొనసాగేది. అది నిరంతరం రాజ్యాంగపరంగానూ, ఆర్థికపరంగానూ వెసులుబాటును కల్గిస్తూనే రాజ్యపాలన పగ్గాలను మాత్రం చేజారనిచ్చేది కాదు.

ఈ దృక్కోణాన్నుండి చూస్తే 1947లో శాంతియుతంగా, చర్చల ద్వారా జరిగిన అధికార బదలాయింపు యాదృచ్ఛికమూ కాదు; అలసి సొలసిన నాయకత్వపు రాజీబేరపు ఫలితమూ కాదు; అది భారత జాతీయ ఉద్యమపు స్వభావం, వ్యూహాల ఫలితమే అది. అధికారం కోసం చిట్టచివరికి యుద్ధం ప్రకటించినట్లయ్యింది. వాళ్ల పాలన క్రింద కొనసాగేందుకు భారత ప్రజ ఇంకేమాత్రం ఇష్టపడటం లేదనేది బ్రిటీష్‌వారు గుర్తించారు. ప్రజలకు ఇష్టం లేని పాలనను బలవంతంగా కొనసాగించేందుకు భారతదేశంలోని వలస పాలన యంత్రాంగంపై నమ్మకం కలిగి వుండే అవకాశం లేకుండా పోయింది. ఆధిపత్య పోరులో వీగిపోయామనే విషయం బ్రిటీషు వాళ్లు గుర్తించారు. అందువల్ల వాళ్లు తిరోగమించేందుకు సిద్ధమయ్యారే గాని తమ చేతిలోనే విరిగిపోసాగిన కత్తితో బెదిరించి ఇంత పెద్ద దేశాన్ని పాలించే నిష్ప్రయోజక ప్రయత్నాన్ని వాళ్లు చేయదలచలేదు.

ఈ విధమైన వ్యూహాత్మక దృక్కోణం నుండి చూస్తే జాతీయ నాయకత్వంతో జరిపిన చర్చలు, చేసుకున్న ఒప్పందాలు, 1922, 1934ల్లో ఉద్యమ తిరోగమనం; గాంధీ – ఇర్విన్ ఒడంబడికలోని రాజీ ధోరణి; 1922 తర్వాత 1937లోనూ రాజ్యాంగ సంస్కరణల పనితీరు పామీదత్ వంటి రచయితల కంటే భిన్నంగా బేరీజు వేయాల్సి ఉంటుంది. ఈ సమస్యలకు సంబంధించిన అధ్యాయాలలో మేము చేసిందదే.

* * *

భారత జాతీయ ఉద్యమం ఒక బహుళవర్గ, ప్రజా ఉద్యమం. అది బూర్జువాల చెప్పుచేతల్లో నడపబడిన ఉద్యమం కాదు; దానిపై పూర్తిగా బూర్జువా ప్రభావం

ప్రసరించిందీ లేదు. పైగా దాని బహుళవర్గ, ప్రజాను రంజక, లక్ష్మణ రేఖలు లేని స్వభావం వల్ల సోషలిస్టు భావాల పెత్తనానికి సైతం స్వాగతం పలికినట్లయ్యింది.

జాతీయ ఉద్యమం, వాస్తవానికి, నిరంతర పరివర్తనకు గురవుతూ వచ్చింది. 1920ల్లోని చివరి భాగంలోనూ, 1930ల్లోనూ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్‌బోస్, కమ్యూనిస్టులు, కాంగ్రెసు సోషలిస్టులు, వామపక్ష మనస్తత్వం గల సోషలిస్టు బృందాలు, వ్యక్తులు ఉద్యమానికీ జాతీయ కాంగ్రెసుకు సోషలిస్టు నిర్దేశాన్ని అందించేందుకు తీవ్రంగా కృషి సల్పటం జరిగింది. ఈ కృషిలో ఒక భాగం రైతులను కిసాన్ సభల్లోకి, కార్మికులను కార్మిక సంఘాల్లోకి, యువతను యువజన సంఘాల్లోకి, విద్యార్థుల్ని విద్యార్థి సంఘాల్లోకి ప్రవేశించేట్లు చేయటం. ఈ కృషిలో మరో భాగం మొత్తం జాతీయ ఉద్యమానికి ఒక సోషలిస్టు భావనా ధోరణిని సమకూర్చటం; స్వతంత్ర భారతావనికి సోషలిస్టు దృక్పథాన్ని జోడించటం. ఈ కృషి కొంత ఫలించింది. సోషలిస్టు భావాలు విస్తృతంగానూ, త్వరిత గతిన వ్యాపించాయి. 1930, 1940 దశకాల్లో దాదాపు యువ మేధావులందరూ ఎరుపురంగులోని ఏదో ఒక ఛాయకు చెందిన వారయ్యారు. కిసాన్ సభలు, కార్మిక సంఘాలు వామపక్షం వైపుకు మొగ్గుచూపసాగాయి. ఈ విషయంలో గాంధీజీ భావాలు క్రియా శీల దిశగా నిరంతరం వృద్ధి చెందటం కూడ ఒక ముఖ్యాంశమే. అయితే స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట వామపక్షాలు జాతీయ ఉద్యమంపై సోషలిస్టు భావాలు ఆధిపత్యం వహించేట్లు చేయటంలో అంతగా విజయం సాధించింది లేదు. అందుక్కారణాలు అనేకం. ఉద్యమంలో బూర్జువా దృష్టే బాగా ప్రబలింది. కనుక ఉద్యమంలోని ప్రధాన బలహీనత దాని సైద్ధాంతిక చట్రంలో ఉందని మేము సూచించాం.

* * *

భారత జాతీయ కాంగ్రెసు కేవలం ఒక పార్టీ కాదు; అది ఒక ఉద్యమం. అందులో విభిన్న రాజకీయ సైద్ధాంతిక దృక్కోణాలు గల వ్యక్తుల్ని, సముదాయాల్ని యిముడ్చుకుంది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, రాయిస్టుల కాంగ్రెసులోనే వుండి సత్యమూర్తి. కె.యమ్. మున్షీ వంటి రాజ్యాంగవాదుల వలెనే కృషిసల్పారు. అదే సమయంలో భిన్నత్వం ఎంతగా వున్నా జాతీయ ఉద్యమం ఐకమత్యంతో నిలిచేందుకు బ్రహ్మాండమైన సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 1907 నాటి వినాశకరమైన చీలిక గుణపాఠమై నిలిచింది. మితవాదులు గాని, అతివాదులు గాని, రాజ్యాంగ వాదులుగాని రాజ్యాంగేతర

వాదులుగాని; వామపక్షీయులుగాని, సంప్రదాయవాదులుగాని ఆ తరువాత ఎన్నడూ భారత జాతీయ కాంగ్రెసును చీల్చలేదు. చివరకు ఘోర సంక్షోభ సమయాల్లో కూడా.

భారత స్వాతంత్ర్య, సమరం అనే నదిలోకి అనేక ప్రవాహాలు వచ్చి చేరి దానిని పెల్లుబక జేసాయి. అయినా భారత జాతీయ కాంగ్రెసు ప్రధాన వాహినే గాని అదొక్కటే వాహినిగా నిలువలేదు. ఈ పుస్తకంలో ఇటువంటి వాహినులను ఎన్నింటిని గూర్చో చర్చించాం. కాంగ్రెసు ఆవిర్భావానికి ముందే వున్న రైతు, ఆదివాసీ ఉద్యమాలు; విప్లవకారులైన టెర్రరిస్టులు; గదర్ హోంరూలు ఉద్యమాలు; 1920 నాటి అకాలీ, దేవళ సంస్కరణ ఉద్యమాలు; చట్ట సభల్లోనూ, పత్రికల ద్వారానూ చేపట్టిన ఆందోళనలు; కార్మిక కర్షక తిరుగుబాట్లు, కాంగ్రెసు లోపలా, బయటా వామపక్షం తలెత్తటం; దేశ ప్రజా ఉద్యమాలు, పెట్టుబడిదారుల రాజకీయాలు, భారత జాతీయ సైన్యం, రాయల్ ఇండియన్ సైనిక తిరుగుబాటువంటివి అందులో చోటు చేసుకున్నాయి. మేము వాస్తవానికి ఈ పుస్తకంలో దాదాపు సగ భాగాన్ని కాంగ్రెసుకు బయట జరిగిన రాజకీయ ఉద్యమాలకే వినియోగించాం. అయితే కొందరు పేర్కొన్నట్లు వాటిని మేము సమాంతర పాయలుగా చూడలేదు. అవి కాంగ్రెసుకు వెలుపల జరిగినా అవి కాంగ్రెసు భిన్నమయినవి కావు. వాటిని కాంగ్రెసు నడిపిన ఉద్యమానికి వ్యతిరేకం అనటంతో కృత్రి మత్వం చోటు చేసుకుంటుంది. ఎందుకంటే కాంగ్రెసు దాని సంపూర్ణ సానుకూల, వ్యతిరేక లక్షణాలతో నిజమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంగా అనేక సహజ ప్రజా ఉద్యమాలవలే భారత ప్రజల గత ఘనశక్తుల్ని, మేధో వైభవాన్ని కూడదీసుకొని విరాజిల్లింది.

నిజానికి ఈ ఉద్యమాలన్నీ, కాంగ్రెసు ప్రధాన వాహికతో సంక్లిష్ట సంబంధాన్ని ఏర్పరచుకున్నాయే గాని ఏనాడూ అవి కాంగ్రెసుకు ప్రత్యామ్నాయం కాలేదు. అవన్నీ భారత జాతీయ ఉద్యమంలో సంఘటిత మయ్యాయి. ప్రత్యామ్నాయ రాజకీయ పాయలుగా చెప్పుకోవలసి వస్తే కుల, మత ఉద్యమాలను చెప్పుకోవాలి. అవి జాతీయ భావనకు గాని, సామ్రాజ్యవాద వ్యతిరేకతను గాని ఆలవాలం కాలేదు గాని అవికూడ విశ్వాసపాత్ర వలస పాలనానుకూల ధోరణులకు ద్రోహాన్నే తలపెట్టాయి.

* * *

తగిన సమయంలోనే భారతజాతీయోద్యమం ప్రపంచ చరిత్రలో అతిపెద్ద ప్రజా ఉద్యమాలలో ఒకటిగా వృద్ధి చెందింది. అది దాని బలాన్నంతా మరీ ముఖ్యంగా

1918 తరువాత, ప్రజల పోరాట పటిమ నుండి త్యాగ నిరతి నుండి సమకూర్చుకుంది. సత్యాగ్రహం పోరాట రూపమయ్యింది. ప్రజలు క్రియాశీలంగా అందులో పాల్గొన్నారు. అలా పాల్గొనని లక్షలాది మంది మద్దతు దానికి లభించింది. 1919-42 మధ్య కాలంలో ఎన్నో యితర ప్రజాందోళనలు గాక అనేక సత్యాగ్రహ ఉద్యమాలు నడిచాయి. లక్షలాది మంది స్త్రీ, పురుషులు మిక్కుటంగా సమీకరించబడ్డారు. వాళ్ల శక్తి, దృఢ సంకల్పం ఉద్యమాన్ని నిలబెట్టగలిగాయి. జాతీయతా దృక్పథంగల మేధావుల ఉద్యమంగా ఆవిర్భవించి యువకుల్ని, స్త్రీలను, పట్టణ ప్రాంతపు పెటీ బూర్జువాలను, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని పేదల్ని వృత్తి పనివారిని, రైతుల్ని, కార్మికుల్ని, వ్యాపారస్తుల్ని, పెట్టుబడిదారుల్ని, చిన్న చిన్న భూస్వాముల్ని పెద్ద సంఖ్యలో సమీకరించటంలో జాతీయ ఉద్యమం కృషి ఫలించింది.

ఉద్యమం దాని రకరకాల రూపాలలో, దశల్లో ఆధునిక రాజకీయాలను ప్రజల వద్దకు చేర్చింది. ముఖ్యంగా అది ఆధునిక కాలానికి ముందటి కుల, మత, ప్రాంతీయ వత్తిళ్లకూ, సంప్రదాయక పాలకుల పట్ల విధేయతకూ తల ఒగ్గలేదు. అది ప్రజల్ని కుల, మత, ప్రాంతీయతల చుట్టూ పరిభ్రమించే భావాల దిక్కుగా సమీకరించలేదు. ఆ ప్రాతిపదికల మీద లబ్ధిపొందేందుకు అది పోరాడలేదు. ప్రజలు దానిలో బ్రాహ్మణులుగానో, పత్తేదార్లుగానో, మరాఠాలుగానో, హరిజనులుగానో ప్రవేశించలేదు. కుల మత గుర్తింపులతో అది పిలుపు నివ్వలేదు. అయితే కొన్ని కొన్ని సార్లు కులాలకు సంబంధించిన విషయం అది కాకపోయినా గ్రామాలలో ఉద్యమాన్ని క్రమశిక్షణతో నిర్వహించేందుకు కుల చట్రాన్ని వాడుకోవటం జరిగింది.

ఉద్యమం ఎంతగా ప్రజా స్పందనపైనా, అనుభవంపైనా, అణచివేత భావనపైనా, అవసరమైన పరిష్కారాలపైనా, సుపరిపాలన లేదా ఆదర్శ సమాజం పైనా ఆధారపడినా అది కేవలం సమకాలీన స్పృహనే ప్రతిబింబింప చేయకపోరాట కాలంలో క్రియాశీల మార్పుల కోసం ఎంతగానో శ్రమించింది. తత్ఫలితంగా అది ఇతర ఆధునిక స్త్రీ, యువజన, రైతుల, శ్రామిక వర్గాల, హరిజనుల, మిగతా బడుగు వర్గాల విమోచన ఉద్యమాలకు తనలో చోటు కల్పించటమూ, వాటితో ఏకీకరణ చెందటమూ జరిగింది. ఉదాహరణకు 19వ శతాబ్దిలో భారతీయ సంస్కృతిని వలస వాదాన్నుండి రక్షించుకునేందుకు చేపట్టిన సామాజిక, మత సంస్కరణోద్యమాలు జాతీయోద్యమంలో కలిసిపోయాయి. 20వ శతాబ్దంలో అవి జాతీయోద్యమపు స్థూల రూపంలో ఒక

భాగమయ్యాయి. కానీ చివరకు జాతీయోద్యమం మత వాదానికి కొంత దాసోహమనవలసి వచ్చింది. మత వాదం ఆవిర్భావం, వ్యాప్తిని గురించి; దాని సవాళ్లను ఎదుర్కొనటంలో జాతీయ ఉద్యమం పాక్షికంగా వైఫల్యం చెందటానికి గల కారణాలను కొంత మేరకు మేము విశ్లేషించేందుకు ప్రయత్నించాం. స్త్రీల, నిమ్నకులాల సామాజిక స్థితిలో సాధించిన కొద్దిపాటి అభివృద్ధి తప్ప జాతీయోద్యమం సాంస్కృతిక విప్లవాన్ని సాధించటంలో విఫలమయ్యింది. పైగా అది 19వ శతాబ్ది చివరి భాగంలో సాంస్కృతిక పరిరక్షణ' పేరిట సామాజిక మతపర సంస్కరణల్ని 19వ శతాబ్ది తొలి సంవత్సరాల్లోని హేతువాద సమీక్షాత్మక దశకు చేర్చలేకపోయింది. గాంధీజీ ఆ దిక్కుగా కొంత కృషి జరిపినా సాంస్కృతిక పోరాటం రాజకీయ పోరాటంలో అంతర్భాగం కాలేదు.

జాతీయోద్యమం భారతీయుల త్యాగశీలతపైనా అపారమైన విశ్వాసాన్ని ఉంచింది. దానితోపాటు అటు వంటి శక్తికున్న పరిమితుల్ని కూడా గ్రహించగల్గటంతో అసహజమైన, ఊహాజనిత భావాల గొంతెమ్మ కోర్కెల్ని అది కోరలేదు. అది శ్రేణులపైన ఆధారపడిన ఉద్యమమైతే అందులోని అసామాన్య వ్యక్తులు, అసాధారణమైన త్యాగాలను చేపట్టగలరు గాని, ప్రజా ఉద్యమంలో నేతలుగా అసామాన్యులున్నా వాళ్లు ప్రజల సాధారణ శక్తిపైనా, శక్తిహీనతలపైనా ఆధారపడవలసిందే. ఈ సాధారణ ప్రజా అసాధారణమైన కార్యకలాపాలను నిర్వహించవలసి ఉంది. 1934లో గాంధీజీ కే.యఫ్. నారిమన్‌తో యిలా అంటారు: 'ఈ జాతి శక్తి మీ ఊహకు అందకపోవచ్చు గాని, నేను దానిని అంచనా వేయగలను.' అయితే ఆయన వెంటనే చెప్పిన మరో మాటేమిటంటే నాయకత్వం 'ఆశక్తిపైన అధిక భారం మోపగూడదు'.

ఒక ప్రజా ఉద్యమంగా భారత జాతీయోద్యమం రకరకాల ప్రజల విభిన్న శక్తుల్ని, సామర్థ్యాలనూ, నేర్పునూ ప్రోదిచేయగలిగింది. అది వృద్ధులకు, యువకులకు; భాగ్యవంతులకు, బీదలకు; స్త్రీలకు, పురుషులకు; మేధావులకు, సాధారణ ప్రజలకూ అందరికీ స్థానం కల్పించింది. ప్రజలు రకరకాలుగా అందులో పాలు పంచుకున్నారు. జైలుకు పంపే సత్యాగ్రహాలు పికెటింగుల నుండి బహిరంగ సభల్లో, ప్రదర్శనలలో పాల్గొనే వరకూ; సమ్మెలు, హర్తాళ్లలో పాల్గొనటం నుండి కాంగ్రెసు స్వచ్ఛంద సేవకుల 'జాతా'లకు ప్రక్క నుండి జైకొట్టటం వరకు; జాతీయ వాదులైన అభ్యర్థులకు మునిసిపల్, జిల్లా, ప్రాంతీయ, కేంద్ర ఎన్నికల్లో ఓటు వేయటం నుండి నిర్మాణాత్మక కార్యక్రమాల్లో

పాలు పంచుకోవటం వరకు, కాంగ్రెసు పార్టీలో నాలుగణాల సభ్యత్వం పుచ్చుకోవటం నుండి ఖద్దరు దుస్తులు, గాంధీటోపీ ధరించటం వరకు, కాంగ్రెసుకు నిధులు, సమకూర్చటం నుండి ఆందోళన కారులకు నిలువనీడ నివ్వటం వరకు, 'యంగ్ ఇండియా' 'హరిజన్' పత్రికలను, నిషిద్ధ కరపత్రాలను చదవటం పంచటం నుండి జాతీయ భావాలతో నిండిన నాటకాలను చూడటం, ఆడటం, కవితా సదస్సుల్లో పాలు పంచుకోవటం, దేశభక్తి ప్రపూరితాలైన నవలల్ని, గీతాల్ని, కథల్ని వ్రాయటం చదవటం నుండి ప్రభాత భేరీలలో నడవటం, పాడటం వరకు అలా ఉద్యమంలో పాలు పంచుకోవటం జరిగింది.

ఉద్యమం, ప్రజా సమీకరణ విధానం భారతీయుల అత్యంత సృజనశీలతకు తార్కాణాలు, వాళ్లలోని సరికొత్త ఆలోచనా ధోరణికి, చొరవకు పూర్తిగానే న్యాయం చేకూరింది.

ఉద్యమంలో అటు నాయకుల్లోనూ, ఇటు అనుయాయుల్లోనూ అసామాన్యులకు కొదువలేదు. అది వేలాది మంది మృతవీరుల్ని అందించింది. అయితే జీవించి వున్న వారిలో కూడా కొందరు అటువంటి వీరులే లేకపోలేదు.

సంవత్సరాల తరబడి హడావిడి పడకుండా, ఇళ్లూ, వాకిళ్లూ వదలి, ఉన్న ఉద్యోగాల్ని వదలి, వాళ్లకున్న భూముల్ని కోల్పోయి, చివరకు జీవన భృతిని కోల్పోయి వాళ్ల కుటుంబ సభ్యులకు తినతిండిలేక, పిల్లలకు చదువు సంధ్యల్లేక, తగిన వైద్య సదుపాయాల్లేక అలమటించారు.

* * *

# 1 మొదటి పెద్ద సవాలు : 1857 నాటి తిరుగుబాటు

**అ**ది 1857 మే 11 నాటి ఉదయం. అంతకు ముందు రోజే మీరట్‌లో ఒక సిపాయి దళం యూరోపియన్ అధికారుల్ని ధిక్కరించి వాళ్లను చంపి, యమునను దాటి, పన్నుల భవనానికి నిప్పంటించి, ఎఱ్ఱకోటకు చేరేప్పటికి ఢిల్లీ పట్టణం ఇంకా నిద్రమత్తు వీడలేదు. రాజఘాట్ ప్రవేశద్వారం గుండా వాళ్లు ఎఱ్ఱకోటలోకి ప్రవేశించారు. వాళ్ల వెనుకనే ఆవేశపరుల సమూహం. వాళ్లంతా మొగలాయి చక్రవర్తి బహదూర్ షా-II ను వాళ్ళకు నాయకుడిగా మెలగుతూ వాళ్ల పోరాటానికి ఆమోదయోగ్యత కల్పించమని కోరదలిచారు. మొగలాయి చక్రవర్తి అని పేరేగాని బ్రిటీషు ఈస్టిండియా కంపెనీకి అప్పుడతడొక పించనుదారు. అప్పటికి సిపాయిలు ఏ ఉద్దేశ్యంతో వున్నారో ఇదమిద్ధంగా తెలియదు. పైగా తాను సమర్ధవంతంగా నాయకత్వాన్ని నిభాయించ గలిగేదీ లేనిదీ సందేహాస్పదమే. అందువల్ల బహదూర్ షా ఊగిసలాటలో పడ్డాడు. అయితే వాళ్లు అతణ్ని బలవంత పెట్టారని అనుకోదల్చుకపోతే ఒప్పించగలిగారనుకోవాలి. అతణ్ణి హిందూస్థాన్ షెహర్‌షాగా ప్రకటించారు. ఆ తరువాత సిపాయిలు వైభవోపేతమైన ఢిల్లీ పట్టణాన్ని ముట్టడించి దానిపై పట్టు సాధించేందుకు సంసిద్ధులయ్యారు. రాజకీయ ప్రతినిధిగా వున్న సైమన్ ఫ్రాసర్‌తో పాటు అనేక మంది ఆంగ్లేయులు వధించబడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలను కొన్నింటిని ఆక్రమించుకోవటం, కొన్నింటిని ధ్వంసం చేయటం జరిగింది. 1857 నాటి తిరుగుబాటు సఫలీకృతం కాకపోయినా విదేశీపాలనను అంతమొందించేందుకు ఓ వీరోచిత చర్యకు అంకురార్పణ జరిగింది. ఢిల్లీని ముట్టడించటం, తరువాత బహదూర్‌షాను హిందూస్థాన్ చక్రవర్తిగా ప్రకటించటం తిరుగుబాటుకు

విశ్వసించదగిన ఒక రాజకీయ అవగాహనను కల్పించింది. ఆ వైభవోపేతమైన పట్టణపు గతకీర్తిని తిరుగుబాటు దారులకు గుర్తు చేసి వాళ్లను బలసమీకరణకు పురికొల్పింది.

మీరట్ తిరుగుబాటు, ఢిల్లీ స్వాధీనం భవిష్యత్తులో దాదాపుగా ఉత్తర హిందూస్థానమంతటా, మధ్య, పశ్చిమ భారతంలోనూ విస్తృతంగా చెలరేగనున్న సిపాయి తిరుగుబాటుకు సంకేతాలు. దక్షిణ భారతం ప్రశాంతంగానే ఉంది. పంజాబు, బెంగాలు ప్రాంతాలు పాక్షికంగా ప్రభావితమయ్యాయి. 2,32,224 మంది బలగం గల కుంపిణీ సైన్యంలోని దాదాపు సగం మంది చాలా కాలంగా శిక్షణనూ, క్రమశిక్షణనూ పకడ్బందీగా అందించిన సైన్యం పట్ల విధేయతకు తిలోదకాలిచ్చారు.

* * *

మీరట్ ఘటనకు ముందే పలు సైనిక నివాస ప్రాంతాల్లో ప్రతీకార భావన రగులు కొంటూనే వుంది. బెరహంపూర్‌లోని 19వ నేటివ్ ఇన్‌ఫెంట్రీ దళం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌ఫీల్డ్ తుపాకుల్ని ఉపయోగించేందుకు నిరాకరించటంతో 1857 మార్చిలో ఆ దళాన్ని రద్దు చేశారు. 34వ నేటివ్ ఇన్‌ఫెంట్రీ దళంలోని యువసైనికుడు మంగళ్ పాండే మరో అడుగు ముందుకేసి తన దళంలోని సార్జంట్ మేజర్‌కు గురిపెట్టి కాల్చాడు. అతణ్ణి పట్టుకొని మరణ దండన విధించటమే గాకుండా ఆ దళాన్ని రద్దు చేసారు. అధికారులకు ఎదురు తిరిగిన 7వ ఔధ్ రెజిమెంటుకూ అదేగతి పట్టింది.

ఢిల్లీని స్వాధీన పరచుకొన్న నెలరోజుల్లోనే తిరుగుబాటు కాన్పూరు, లక్నో, బెనారస్, అలహాబాదు, బరేలీ, జగదీష్‌పూరు, ఝాన్సీ వంటి పలు ప్రాంతాలకు పాకింది. తిరుగుబాటు కార్యక్రమం తీవ్రమైన బ్రిటీషు వ్యతిరేక భావనతో కొనసాగటంతో పాలనా యంత్రాంగం కుప్పకూలినట్లయింది. తిరుగుబాటుకు నాయకత్వం వహించేందుకు సైనిక పటాలాలలో తగిన వాళ్లు లభించనందున బ్రిటీషు వాళ్ల చేతుల్లో దెబ్బతిన్న బడా భూస్వాముల రాచకుటుంబీకుల వంటి సంప్రదాయిక నాయకత్వంవైపు తిరుగుబాటు దారులు మొగ్గుచూపారు.

కాన్పూరులో చివరి పీష్వా – రెండవ బాజీరావు – దత్తపుత్రుడు నానాసాహెబ్ నాయకుడయ్యాడు. పూనా నుండి బహిష్కృతుడై బాజీరావు కుటుంబ బిరుదుల్ని త్యజించి కాన్పూరుకు దగ్గర్లో తలదాచుకుంటున్నాడు. ఇక లక్నో విషయాని కొస్తే 'ప్రజాభిమానం' తొలగించబడిన నవాబు పక్షానే ఉంది. కనుక పగ్గాలు బేగమ్ హజ్రత్ మహల్‌కు

అప్పగించారు. ఆమె కుమారుడు బిర్జిస్ ఖాదిర్‌ను నవాబుగా ప్రకటించి హిందువులు, ముస్లింలు ముఖ్యమైన హోదాలను సమానంగా పంచుకుంటూ ప్రభుత్వాన్ని నడపసాగారు.

బరేలీలో రోహిల్‌ఖండ్ రాజవంశీకుణ్ణి తమ నేతగా ఎంచుకొన్నారు. బ్రిటీషు ప్రభుత్వం నుండి పింఛను పొందుతున్న అతను నిజానికి అంత ఉత్సుకత చూపెట్టకపోగా జరుగబోయే తిరుగుబాటును గురించి కమీషనరుకు హెచ్చరికలు పంపాడు. అయితే తిరుగుబాటు ప్రారంభం కాగానే అధికారాన్ని చేబూని 40 వేల మంది సిపాయిలతో సైన్యాన్ని సమకూర్చుకొని బ్రిటీషువాళ్లను గట్టిగానే ప్రతిఘటించాడు.

* * *

బీహార్‌లో జగదీష్‌పూర్ జమిందారు కున్వర్‌సింగ్ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. దివాళా తీసేందుకు సిద్ధంగా వున్న 70 యేళ్ల వృద్ధుడాతడు. అతను బ్రిటీషు ప్రభుత్వంపై కక్ష పెంచుకున్నాడు. బ్రిటిష్ ప్రభుత్వం అతని ఎస్టేట్లను లాగేసుకుంది. వాటిని తిరిగి తనకు అప్పగించమని చేసిన విన్నపాలన్నీ చెవిటివాని ముందు శంఖం వూదిన చందంగానే నిష్ప్రయోజనమయ్యాయి. తిరుగుబాటుకు తనకు తానుగా వ్యూహం పన్నకపోయినా సిపాయిలు దీనాపూర్ నుండి అర్రా చేరుకోగానే నిస్సంకోచంగా వాళ్లతో కలిసిపోయాడు.

సిపాయి తిరుగుబాటుకు తిరుగులేని నాయకురాలు ఝాన్సీరాణి లక్ష్మీబాయి. ఆమె భర్త చనిపోగానే రాజ్యపాలన దత్తతకుమారునికి అప్పగించేందుకు అప్పటి గవర్నరు జనరలు లార్డ్ డల్హౌసీ అంగీకరించక "డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్" ప్రకారం రాజ్యాన్ని బ్రిటీషు పాలన క్రిందికి తేవటం జరిగింది. ఆ నిర్ణయంలో మార్పును తెచ్చేందుకు రాణి శతవిధాల ప్రయత్నించింది. ఆమె మనవిని మన్నించేట్లయితే ఝాన్సీని బ్రిటీషు వాళ్లకు హాని తలపెట్టని రాజ్యంగా నిలపగలనంది. ఏ ప్రయత్నమూ ఫలించకపోవటంతో ఆమె సిపాయిలతో చేతులు కలిపింది. కాలక్రమేణ బ్రిటీషువాళ్లు అదుపు చేయ అలవిగాని, గట్టిగా ఎదుర్కొనవలసిన శత్రువులలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకొంది.

తిరుగుబాటు ఈ ముఖ్య కేంద్రాలకే పరిమితం కాలేదు. బెంగాలులోని దాదాపు ప్రతి సైనిక నివాస ప్రాంతానికీ, బొంబాయిలోని కొన్ని ప్రాంతాలకు అది విస్తరించింది. మద్రాసు సైన్యం మాత్రం సంపూర్ణ విధేయతతో మెలగింది. అసలు సిపాయిలు తిరుగుబాటుకు ఎందుకు దిగినట్లు? కంపెనీ వారి కొలువులో కొనసాగటం ఎంతో ప్రతిష్టాత్మకం; అది ఎంతో ఆర్థిక సుస్థిరత్వాన్ని చేకూర్చేది. అనిశ్చితమైన భవిష్యత్తు

కోసం ఈ సదుపాయాలను ఎందుకు వదులుకొనేందుకు సిద్ధమయ్యారు? ఢిల్లీలో విడుదల చేసిన ప్రకటన తక్షణ కారణాన్ని సూచిస్తుంది. "ఆంగ్లేయులు ప్రస్తుతం ఈ విధమైన దుష్ట పన్నాగాలు పన్నుతున్నారనేది సుస్పష్టం. మొదటగా హిందూస్థానీ సైన్యం యొక్క మతాన్ని ధ్వంసం చేసి అటు పిమ్మట ప్రజల్ని బలవంతం మీద క్రైస్తవుల్ని చేయటం. కనుక, మేము, మా మతం కారణంగానే ప్రజలతో మమేకమై ఏ ఒక్క విశ్వాసహీనుణ్ణి బ్రతికి బట్టకట్ట నివ్వకుండా చేసి ఢిల్లీ రాజ్యాన్ని ఈ ప్రాతిపదికపై పునః స్థాపనగావించుకున్నాం."

సిపాయిల్లో అధికాంశం వాయువ్య ప్రాంతాలకు, ఔధ్‌కు చెందిన ఉన్నత కులాల హిందువులు. వాళ్ల మతపరమైన విశ్వాసాలకు దురభిమానాలకు, కంపెనీ ఉద్యోగపు నియమావళికి మధ్య ఘర్షణ ఏర్పడిందనేది నిర్వివాదాంశం. ప్రారంభంలో పాలనా యంత్రాంగం సిపాయిల కోర్కెలకు అనుగుణంగా, వాళ్లకులాలకు మతాలకు తగినట్లుగా వాళ్లు జీవించే విధంగా రాయితీలు కల్పించింది. తరువాత సైనిక నిర్వహణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు విస్తరింపజేయటమే గాక విదేశాలలో కూడా విస్తరింపజేయటంతో ఆ విధమైన రాయితీలివ్వటం సాధ్యపడలేదు. పైగా ఒకే సైనిక విభాగంలో కులపరమైన ప్రత్యేకతలు, తేడాలు యుద్ధభూమిలో పోరాడే ఒక దళం ఐక్యతకు సహకరించేవిగా లేవు. ముందుగా పాలకులు ఒక సులువైన పరిష్కార మార్గాన్ని అన్వేషించారు. బ్రాహ్మణుల్ని సైనికులుగా నియమించటాన్ని నిరుత్సాహ పరచటం. అయితే అందులో సఫలీకృతులు కాలేదు. ఉదాహరణకు పందొమ్మిదవ శతాబ్ది సగం గడిచే నాటికి బెంగాల్‌సైన్యంలో అగ్రకులాలదే పైచేయిగా వుంది.

సిపాయిల అసంతృప్తి తొలిసారిగా 1824లో 47వ బారక్‌పూర్ రెజిమెంటును బర్మా వెళ్లమన్నప్పుడు వెలుగులోకొచ్చింది. హిందూ మతస్తునికి సముద్రం దాటి వెళ్లటమంటే కులాన్ని కోల్పోవటమే. కనుక సిపాయిలు ఆ ఉత్తర్వుల అమలును వ్యతిరేకించారు. దాంతో ఆ సైనిక విభాగం రద్దయ్యింది. వ్యతిరేకతకు నాయకత్వం వహించిన వాళ్ళను ఉరితీసారు. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధంలో పాల్గొన్న సిపాయిల మత విశ్వాసాలు మరింతగా దెబ్బతిన్నాయి. కఠినమైన, విపత్కరమైన పోరాట సమయాల్లో సిపాయిలు తమకు ఏది అందితే అది తిని, తాగవలసిన వత్తిడికి గురయ్యేవాళ్లు. వాళ్లు భారతదేశానికి తిరిగి రాగానే ఇంటిదగ్గరి వాళ్లంతా గగ్గోలు. కుల కట్టుబాట్లు పాటించలేదని లెక్కలు కట్టి తిరిగి వాళ్లలోకి చేర్చుకునేందుకు సందేహించేవాళ్లు. ఆఫ్ఘనిస్తాన్ వెళ్లిన సీతారామ్ అనే సిపాయిని తన ఊరివాళ్లేగాక సైనిక నివాసాలలోని వాళ్లు కూడా వెలివేశారు.

కంపెనీ కొలువులో లభించే ప్రతిష్ఠ సమాజంలో తన స్థానాన్ని భద్రపరచుకొనేందుకు సరిపోయేది కాదు. మతం, కులం అంతకంటే శక్తిమంతమైనవని ఋజువయ్యింది.

* * *

ప్రభుత్వం క్రైస్తవ మతంలోకి మార్పిడులను ప్రోత్సహిస్తూ రహస్య పన్నాగాలు పన్నుతున్నదనే పుకార్లు సిపాయిలను మరింతగా ఉద్రిక్త పరిచాయి. మిషనరీలకు, అధికారులకు మధ్య లంకె ఆ పుకార్లను నమ్మేట్లు చేసాయి. కొన్ని సైనిక నివాస ప్రాంతాలలో మిషనరీలు బాహాటంగా మత ప్రచారం చేసుకోవటమే గాకుండా యితర మతాల పట్ల తీవ్ర విమర్శలు గుప్పించటం వల్ల సిపాయిలకు చిర్రెత్తుకొచ్చేది. రొట్టెల పిండిలో ఎముకల పొడి కలపటం, ఎన్‌ఫీల్డ్ రైఫిల్‌ను వాడుకలోకి తేవటం ప్రభుత్వం పట్ల సిపాయిలకున్న అసంతృప్తిని మరింత పెంచింది. కొత్త తుపాకుల తూటాలను పేల్చేందుకు సిపాయిలు ముందుగా వాటిని కొరికి వుపయోగించవలసి ఉంది. అవి ఆవుమాంసంతోనూ, పంది కొవ్వుతోనూ చేసినటువంటివి. సైనికులలోని ఈ భయాలను నివారించేందుకు సైనికాధికారులు చేసిందేమీ లేదు. దాంతో సిపాయిలు తమ మతం నిజంగానే ప్రమాదంలో చిక్కుకున్నదని భావించసాగారు.

సిపాయిలలోని అసంతృప్తి కేవలం మతానికే పరిమితం కాలేదు. లభించే వేతనాల పట్ల కూడా వాళ్లకు అంతే అసంతృప్తి. కాల్బలంలోని సిపాయికి నెలకు లభించే వేతనం ఏడు రూపాయిలు. ఆశ్విక దళంలోని 'సవారు'కు లభించేది ఇరవయ్యేడు రూపాయిలు. దాన్లోంచి అతను మళ్లీ యూనిఫాం దుస్తులకు, భోజనానికి, జీను వగైరాల మరమ్మతులకు చెల్లించవలసి వస్తుంది. అవన్నీ పోను అతనికి మిగిలేది రూపాయో రెండో. అతణ్ణి మరీ గాయపరచే విషయమేమంటే అతనికీ అంతే హోదాగల బ్రిటీషు ఉద్యోగికీ మధ్య పాటించే వివక్ష. అడుగడుగునా భారతీయ సిపాయి అధీనభావంతో మనవలసి వచ్చేది. జాతిపరంగానూ, పొందే సదుపాయాల్లోనూ అన్నిటా వివక్షే. టి.ఆర్. హోమ్స్ వ్రాసేదేమంటే – భారతీయ సిపాయి "హైదర్ అంతటి సైనిక పాటవాన్ని ప్రదర్శించినా అతను ఒక ఆంగ్ల చిరుద్యోగి పొందే వేతనాన్ని అందుకోజాలడు. అంతేగాక ముప్పయ్యేళ్లు సేవజేసిన తరువాత కూడా అతను ఇంగ్లండు నుండి కొత్తగా వచ్చి పతాకాన్ని పట్టుకునేవాని నిరంకుశత్వాన్నుండి తప్పించుకోజాలడు."

సిపాయిల అసంతృప్తి సైనిక పరమైన విషయాలకే పరిమితం కాలేదు. అది బ్రిటీషు పాలనమీదికే మళ్లింది. సిపాయి, నిజానికి, "సైనిక వేషములో వున్న

వ్యవసాయదారుడు."  అందువల్ల అతని అంతఃకరణ గ్రామీణ ప్రజానీకం నుండి విడివడలేదు.  డల్హౌసీ విధానాల వల్ల ఉత్పన్నం కాగల విపరిణామాల గురించి ఓ సైనికాధికారి యిలా హెచ్చరించాడు.  "మీ సైన్యం దేశంలోని వ్యవసాయదారుల వర్గం నుండి రూపొందింది. వాళ్లకు హక్కులున్నాయి. ఆ హక్కులకు భంగం వాటిల్లితే సైన్యం విశ్వసనీయతపై మీరు ఆధారపడజాలరు.... భారత ప్రజల వ్యవస్థను కాలదన్నితే సైన్యం ఆ సంతతిలోని భాగమే గనుకవాళ్ల పట్ల సానుభూతిని చూపుతుంది. ప్రజాహక్కుల అతిక్రమణ జరిగిన ప్రతి పర్యాయం అది సైనికుల హక్కుల అతిక్రమణగానో లేక వారి బిడ్డల, తలిదండ్రుల, బంధువుల హక్కుల అతిక్రమణగానో వుంటుంది."

* * *

ఔధ్‌లో దాదాపు ప్రతి వ్యవసాయ కుటుంబం నుండి సైన్యంలో ఓ ప్రతినిధి ఉన్నట్లే. సైన్యంలో ఔధ్ నుండి ఆనాడు 75 వేల మంది ఉన్నారు. ఔధ్‌లో ఏం జరిగినా దాని ప్రభావం సిపాయిలమీద వెంటనే పడుతుంది. ధర్మాదాయ సంస్థలకు భూములు ఇవ్వటం, మళ్లీ లాగేసుకోవటం జరిగిన తరువాత నూతనంగా రూపొందించిన భూమి శిస్తు విధానం అతని సంక్షేమాన్ని దెబ్బతీసింది. ఆ భూమిశిస్తు విధానం తెచ్చిపెట్టిన ఇక్కట్లను వివరిస్తూ సిపాయిల నుండి 14,000 మహజర్లు అందుకోవలసి వచ్చింది. ఢిల్లీలోని తిరుగుబాటుదారులు విడుదల చేసిన ప్రకటనలో బ్రిటీషుపాలన తెచ్చిన దుర్భర దారిద్ర్యాన్ని సిపాయిలు బాగానే గుర్తించారన్నది స్పష్టం. కనుక ఆ విధంగా బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అది ఒక రాజకీయ చర్య. సాధారణ ప్రజానీకపు ఇష్టాలతో మమేకమయ్యే సిపాయిల తత్వమే తిరుగుబాటుకు ఆ లక్షణాన్ని అందించింది.

సిపాయిల తిరుగుబాటుతో పాటు ప్రజా ఉద్యమమూ కొనసాగింది. మరీ ముఖ్యంగా వాయువ్యభాగం, ఔధ్‌లలో. బెంగాల్ సైన్యపు నియామకాలు ఆ రెండు ప్రాంతాలకు చెందిన వాళ్లనుండే జరిగాయి. ముజఫర్ నగర్, షహరాన్‌పూర్‌లలో తప్ప మిగతా చోట్ల ప్రజా ఉద్యమం సిపాయిల తిరుగుబాటు వెంట నడిచింది. సిపాయిల తిరుగుబాటు తరువాత ప్రజల్లో ప్రభుత్వం పట్ల, ప్రభుత్వ యంత్రాంగపు పట్టుపట్ల భయం సన్నగిల్లింది. పేరుకుపోతూ వచ్చిన ఇబ్బందులను ప్రకటించే అవకాశం వెంటనే లభించినట్లయ్యింది. బ్రిటీషు పాలనకు వ్యతిరేకతను ప్రకటిస్తూ ప్రజ ఒక్కుమ్మడిగా తిరగబడింది. ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. "ఖజానాను కొల్లగొట్టారు. ఆయుధాల్ని మాయం చేసారు. సైనిక నివాసాలు న్యాయస్థానాలు అగ్నికి ఆహుతయ్యాయి. కారాగారాల గేట్లు బదాబదలై తెరుచుకున్నాయి." ప్రజాపోరాటం విస్తృత ప్రాతిపదికన

నడిచింది. అది అన్ని వర్గాల ప్రజల్ని కలుపుకొని సాగింది. అందులో ప్రాంతీయ పలుకుబడిదార్లున్నారు, రైతులున్నారు, చేతివృత్తులవారున్నారు, మతపరమైన సాధువులున్నారు, పూజారులున్నారు, ఉద్యోగస్తులున్నారు, దుకాణదారులున్నారు, పల్లెకారులున్నారు. సిపాయిల తిరుగుబాటు ఆ విధంగా ఓ ప్రజాభీష్ట ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

* * *

ఈ విధమైన ప్రజాందోళన రేకెత్తడానికి కారణాల కోసం మనం బ్రిటీషు పాలనా స్వభావాన్ని పరికించాల్సి ఉంది. అది దాదాపు అన్ని వర్గాల ప్రజల మనోభీష్టాలను బాగా దెబ్బతీసేట్లు చేసింది. అధిక పన్నుల కారణంగా రైతాంగం క్రమేణా అప్పులపాలై చివరకు దారిద్ర్యపు అంచుకు చేరింది. కంపెనీ ఏకైక లక్ష్యం తక్కువ కృషితో అధికాదాయాన్ని గుంజుకోవటం. తత్ఫలితంగా వసూళ్లు భూమికి సంబంధించిన వనరుల్ని లెక్కలోకి తీసుకొనకుండా హడావుడిగా త్వరితగతిన జరిగాయి. ఉదాహరణకు రాయబరేలీ జిల్లాలో 1812లో వసూళ్లు అంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో పదిమాసాల కాలంలోనే పూర్తవటమే గాకుండా మునుపటి వసూళ్ల కంటే 14,73,188 రూపాయలు అదనంగా లభించాయి. ఈ అదనపు ఆదాయానికి సంబరపడిన ప్రభుత్వం, అధికారుల్ని వాళ్లల్లోని "ఉత్సాహానికీ, సామర్థ్యానికీ, అలుపెరుగని కృషికీ" అభినందించింది. అంతత్వరిత గతిన అటువంటి పెరుగుదల రైతాంగంపై విపత్కర పరిణామాలను తేగలదన్న సంగతి ప్రభుత్వ యంత్రాంగానికి తట్టలేదు. బలప్రయోగం, చిత్ర హింసలు లేకుండా రెవెన్యూ వసూళ్లు సహజంగా జరగవు. 1848-56 మధ్య కాలంలో రోహిల్‌ఖండ్‌లో రూ.2,37,388 వరకూ బలప్రయోగంతో వసూళ్లు జరిగాయి. పరిస్థితులెలావున్నా ప్రభుత్వానికి శిస్తు వసూళ్లే ప్రధానం. కడు అననుకూల పరిస్థితుల్లో కూడా రాయితీలు మంజూరు చేయటం అరుదే. ఒక కలెక్టరు ఓ ఎస్టేటులో కేవలం గడ్డి మాత్రమే పండుతున్నది. కనుక శిస్తువసూళ్లు సాధ్యపడటం లేదని పదే పదే నివేదించినా గడ్డి మంచి పంటే కనుక దానిని విక్రయించి అయినా శిస్తు వసూలు చేయమని ఆదేశం!

సంప్రదాయక భూస్వామ్య కులీనవర్గం కూడా బాధల్ని అనుభవించటంలో వెనుకబడింది లేదు. తిరుగుబాటుకు ఉప్పెన వంటి కేంద్రం ఔధ్‌లో తాలూకాదార్లు వాళ్ల కున్న అధికారాల్ని, విశేష హక్కుల్ని కోల్పోయారు. 21,000 మంది తాలూకాదార్ల ఎస్టేటు హక్కును హఠాత్తుగా ప్రభుత్వం స్వాధీన పరుచుకోవటంతో వాళ్లకు ఆదాయ వనరుల్లేక 'పని చేయలేక, అడుక్కునేందుకు సిగ్గిలి, దుర్భర దారిద్ర్యంలో

కూరుకుపోయారు.'  ఇలా బేదఖలు చేయబడిన తాలూకాదార్లు వాళ్లను చిన్నచూపు చూడటం వల్ల ఏర్పడ్డగాయంతో సమయం కోసం ఎదురుచూస్తూ సిపాయి తిరుగుబాటు కల్పించిన అవకాశాన్ని దొరకబుచ్చుకొని బ్రిటీషు ప్రభుత్వాన్ని ధిక్కరించి వాళ్లు కోల్పోయిన దానిని తిరిగి పొందదలిచారు.

* * *

బ్రిటీషుపాలన అంటే వృత్తి నిపుణులకు, చేతి పనివాళ్లకు కూడా కష్టకాలమే. భారతదేశంలోని రాజ్యాలను కంపెనీ స్వాధీన పరుచుకుంటూ పోవటంతో వాళ్లకు పోషణ కరువైంది.  ఇది చాలదన్నట్లు బ్రిటీషు విధానం భారతదేశపు హస్తకళలను నీరుగార్చి బ్రిటీషు వస్తువులను అందలమెక్కించింది.  అత్యంత కళానైపుణ్యాన్ని ప్రదర్శించే వృత్తి నిపుణుల ఆదాయ వనరులకు గండి పడింది.  వేరే పనికోసం వెతుక్కున్నా దొరికేది కాదు. చేతి వృత్తులను అంతమొందించారే గాని దాని తరువాత ఆధునిక పరిశ్రమల అభివృద్ధి జరుగలేదు.

ఉపయోగితావాద (యుటిలిటేరియనిజం : అత్యధికులకు ప్రయోజనం చేకూరాలనే వాదం) ప్రభావంతో బ్రిటీషు అధికారులు ప్రదర్శించిన సంస్కరణాభిలాష కావలసినంత అనుమానాన్ని రేకెత్తించింది,  నిరసనను ప్రోదిచేసింది, వ్యతిరేకతను పోషించింది. సామాజిక శాసనాల ద్వారా తమ తమ  మతాలను, సంస్కృతులను ధ్వంసం చేసేందుకు బ్రిటీషు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని సనాతన హిందువులు, సంప్రదాయ ముస్లిములు భయపడ్డారు.  పైగా ఆ చట్టాలన్నీ క్రైస్తవ మిషనరీల మతదాహాన్ని తీర్చేందుకు తలపెట్టినవేనని విశ్వసించారు.  కనుక ఛాందసవాదులు మతవాదులు బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యూహం పన్నారు.  తిరుగుబాటుదారులు పలు ప్రకటనలలో సంస్కృతి పట్ల చూపిన శ్రద్ధ సువిదితమే.

సిపాయిల, ప్రజా బాహుళ్యపు తిరుగుబాట్ల కలయిక 1857 ఉద్యమాన్ని మున్నెన్నడూ ఎరుగని ప్రజాపోరాటంగా తీర్చిదిద్దింది.  అది ఓ పద్ధతి ప్రకారం క్రమబద్ధంగా సంఘటిత పరచినటువంటి ఉద్యమమా లేక స్వయం ప్రేరక ప్రతిఘటనా?  తిరుగుబాటు దారులు నమ్మదగిన ఋజువు లేవీ మిగల్చని కారణంగా ఇదమిద్ధంగా తేల్చి చెప్పటం కష్టం.  నాయకుల వైఖరిగాని కార్యకలాపాలు గాని గమనిస్తే వాళ్లు ఒక పథకం ప్రకారం ఉద్యమాన్ని నిర్వహించినట్లు గాని, కుట్రపన్నినట్లుగాని చెప్పజాలం.  ఒకవేళ అటువంటిదేమయినా ఉన్నా బీజోప మాత్రంగా వుండి వుండాలి.

సిపాయిలు మీరట్ నుండి రాగానే బహుశా ఆశ్చర్యచకితుడై బహదుర్‌షా వెంటనే ఆ విషయాన్ని ఆగ్రాలో వున్న లెఫ్టినెంట్ గవర్నరుకు తెలియజేసాడు. రాణీ లక్ష్మీబాయికి కూడా అలాగే బాహాటంగా తిరుగుబాటుదారులతో కలిసేందుకు కొంత సమయం పట్టింది. ఫజియాబాదుకు చెందిన నానాసాహెబ్, మౌల్వీ అహమ్మద్‌షాలు అనేక సైనిక నివాసాలలోని వారితో సంబంధాలు ఏర్పరచుకొని ఉద్యమానికి ఊపిరి పోసారని నిర్ద్వందంగా యింకా నిరూపించుకోవాల్సే ఉంది. అదే విధంగా చపాతీల, తామర పూవుల ద్వారా వర్తమానా లందించిన వైనమూ సందేహాత్మకమే. ఒకే ఒక వాస్తవ విషయమేమంటే మీరట్ ఘటన జరిగిన నెల రోజులలోపే తిరుగుబాటు బాగా వ్యాప్తి చెందింది.

తిరుగుబాటుకు ముందుగా ఒక ప్రణాళిక, నిర్వహణా క్రమం లేకున్నా అది ప్రారంభమైన తరువాత అటువంటి చర్యలు తీసుకొన్న విషయాన్ని ముఖ్యంగా గమనించవలసి ఉంది. ఢిల్లీని పట్టుకొన్న వెంటనే తిరుగుబాటుకు మద్దతు పలికేందుకూ, అందులో పాల్గొనేందుకూ ఆహ్వానం పలుకుతూ చుట్టు ప్రక్కల రాజులకూ, రాజస్థాన్‌లోని వారికీ ఓ లేఖ పంపటం జరిగింది. ఢిల్లీలో పరిపాలకుల కోర్టు నొకదానిని స్థాపించారు. అది వాళ్ల రాజ్యానికి సంబంధించిన విషయాలన్నింటికీ బాధ్యత వహిస్తుంది. అందులోని పది మంది సభ్యులలో ఆరుగురు సైనిక శ్రేణులనుండి నలుగురు సాధారణ విభాగాల నుండి ఉంటారు. నిర్ణయాలు అన్నీ కూడా మెజారిటీ ఓటు ద్వారానే. చక్రవర్తి పేరిట కోర్టు తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. ఒక బ్రిటీషు అధికారి కథనం ప్రకారం “ఢిల్లీలోని ప్రభుత్వం ఒక విధమైన రాజ్యాంగబద్ధంగా కన్పిస్తోంది. రాజు రాజే. రాజ్యాంగబద్ధ చక్రవర్తిలా గౌరవాన్ని పొందుతాడు. పార్లమెంటుకు బదులు సైనికుల సభ ఉంది. అధికారమంతాదానిదే. అయితే రాజుమాత్రం ఏ స్థాయిలోనూ సైనికాధికారి కాదు.” ఇతర కేంద్రాలలో కూడా ఉద్యమాన్ని వ్యవస్థాగతం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి.

తిరుగుబాటు నాయకులందరూ బహాదుర్ షాను చక్రవర్తిగా గుర్తించారు. అతడి పేరిట ఆదేశాలు జారీ చేసారు. నాణాలు ముద్రించారు. బరేలీలో మొఘల్ చక్రవర్తి పేరిట ఖాన్ బహదూర్‌ఖాన్ పరిపాలన సాగించాడు. తిరుగుబాటు దారులు మీరట్‌లో వున్నా, కాన్పూర్‌లో వున్నా, ఝాన్సీలో వున్నా వాళ్ల తొలి అడుగున ఢిల్లీ దిక్కుకే. ఒక వ్యవస్థను, ఒక రాజకీయ సంస్థను నిర్మించి లబ్ధిని భద్రపరచుకోవాలని వాళ్లు తప్పక భావించారు. అయితే బ్రిటీషువాళ్ల అణచివేత కార్యక్రమం వల్ల తొలిరోజుల్లో ఆ విధంగా పొంగారిన ఆలోచనలు అమలులోకి రాలేదు.

ఏడాదికి పైగా తిరుగుబాటుదారులు ఏటికి ఎదురీదుతూ ఉద్యమాన్ని కొనసాగించారు. వాళ్లకు ఆయుధాల అడ్డాలు లేవు. మందుగుండు సామాగ్రి లేదు. బ్రిటీషు ఆయుధాగారాల్ని ముట్టడించి వాటిని స్వంతం చేసుకొని పెద్దగా ముందుకు సాగిందీలేదు. అత్యంత ఆధునిక ఆయుధ సంపత్తిగల శత్రుసైనికులతో పలు పర్యాయాలు వాళ్లు కేవలం కత్తులతో, బల్లేలతో పోరాడవలసి వచ్చేది. వాళ్లకు త్వరితగతిన వార్తలనందించే వ్యవస్థ లేనందువల్ల సమన్వయ చర్యలు సాధ్యపడలేదు. అందువల్ల తమతో పాటు తిరుగుబాటుచేసేవాళ్ల శక్తి సామర్థ్యాలు, శక్తిహీనతలు తెలియక విపత్కర పరిస్థితుల్లో ఒకరి రక్షణకు మరొకరు సహకరించుకోలేకపోయారు. ఎవరికి వారే ఒంటరి వాళ్లుగా మిగిలిపోయారు.

* * *

తిరుగుబాటు దారులు ప్రజల నుండి సానుభూతిని పొందగలిగినా దేశం యావత్తు వాళ్ల వెనుక నిలువలేదు. వ్యాపారులు, మేధావులు, భారతీయ పాలకులు తిరుగుబాటుకు దూరంగా నిలవటమే గాకుండా బ్రిటీషు ప్రభుత్వానికి ఆచరణాత్మక మద్దతు నిచ్చారు. బ్రిటీషు ప్రభుత్వానికి విజయం చేకూరాలని ప్రార్థిస్తూ వాళ్లు బొంబాయి, కలకత్తాలలో సభలు నిర్వహించారు. అలా వుండగానే దేశీయ పాలకులు వాళ్ల భవిష్యత్తు సురక్షితంగా వుండాలనే ఉద్దేశ్యంతో జనాన్ని, వస్తుసామాగ్రిని బ్రిటీషు వారికి అందించారు. ఈ సహాయం గనుక సిపాయిలకు అందివుంటే వాళ్లు మరింతగా తిరుగుబాటు నిర్వహింపగలిగేవాళ్లు.

భారతదేశానికి చెందిన సిపాయిల్లో దాదాపు సగం మంది సిపాయి తిరుగుబాటులో పాల్గొనకపోగా స్వదేశస్థులపైనే తిరగబడ్డారు. ఢిల్లీని బ్రిటీషువాళ్లు తిరిగి స్వాధీనం చేసుకునే సందర్భంలో 1700 బ్రిటీషు ట్రూపులు పాల్గొనగా భారతీయ సిపాయిల ట్రూపులు 3200 పాల్గొన్నాయి. కాశ్మీరీగేట్ పేల్చివేత కార్యక్రమంలో పాల్గొన్న వారిలో బ్రిటీషు సైనికాధికారులు ఆరుగురు కాగా భారతదేశానికి చెందిన సైనికోద్యోగులు ఇరవైనలుగురు. ఆ ఇరవైనలుగురిలో పది మంది పంజాబీలు, పద్నాలుగు మంది ఆగ్రా, ఔధ్‌లకు చెందినవాళ్లు.

ఝాన్సీరాణి, కున్వర్‌సింగ్, మౌల్వీఅహమ్మదుల్లా వంటి గౌరవనీయులను మినహాయిస్తే మిగతా నాయకత్వం తిరుగుబాటు దార్లకు కావలసిన సహాయాన్ని తగినట్లుగా అందించలేదు. వాళ్లల్లో చాలా మందికి ఆ తిరుగుబాటు యొక్క ముఖ్య ఉద్దేశ్యమే

అర్థంకాలేదు. కనుక వాళ్లు తగిన విధంగా సహాయ పడలేకపోయారు. బహాదుర్ షా, జీనత్ మహల్ వంటివాళ్లు సిపాయిలను నమ్మక తాము సురక్షితంగా వుండేందుకు బ్రిటీషు ప్రభుత్వంతో మంతనాలు జరిపేవాళ్లు. పలువురు తాలూకాదార్లు తమ స్వప్రయోజనాల పరిరక్షణకే పూనుకున్నారు. కొందరు మాన్‌సింగ్ లాంటి వాళ్లు గోడమీది పిల్లి వాటంగా ఏవైపు మొగ్గుగావుంటే ఆ వైపుకే మొగ్గేవాళ్లు.

తిరుగుబాటు దారులందరూ కలిసి పరాయి ప్రభుత్వం పట్ల పెంచుకొని పంచుకొన్న ద్వేషం తప్ప వాళ్లకొక రాజకీయ సమ్యక్‌దృష్టిగాని, భవిష్యత్తును గూర్చిన ఒక నిశ్చితమైన దృష్టిగాని లేనేలేవు. వాళ్లంతా వాళ్ల గతానికి బందీలు. ప్రముఖంగా వాళ్లు కోల్పోయిన విశేష హక్కులు తిరిగి సాధించుకొనేందుకు పోరాటం జరిపిన వారే. కనుక వాళ్ళొక సరికొత్త రాజకీయ విధానాన్ని రూపొందించలేకపోయారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. జాన్‌లారెన్స్ సరిగానే అన్నాడు. “వాళ్లల్లో ఏ ఒక్క నాయకుడైనా శక్తిమంతుడై పరాక్రమిస్తే మేము నిష్కృతిలేని రీతిలో నష్టపోయేవాళ్లం.”

అలా కాదుగాని తిరుగుబాటు దారులు బ్రహ్మాండమైన ధైర్యసాహసాల్ని, అంకిత భావాన్ని, నిబద్ధతను ప్రదర్శించారు. వేలాది మంది తాము నమ్మిన దానికోసం పోరాడుతూ ప్రాణాలర్పించారు. వారి శూరత్వ మొక్కటే అంతకంటే ఎంతో ఎక్కువ శక్తివంతమైన బ్రిటీషు సైన్యాన్ని అంతమొందించజాలదు. చాలా కాలం పెనుగులాట తరువాత తొలి పరాజయం 20 సెప్టెంబరు 1875న ఢిల్లీలో ఎదురయ్యింది. హుమాయూన్ స్మారక భవనంలో తలదాచుకొన్న బహాదుర్‌షాను ముట్టడించి, పట్టుకొని, విచారించి బర్మాకు పంపటం జరిగింది. దాంతో తిరుగుబాటుకు నడ్డివిరిగినట్లయింది. దానిక్కారణం ఢిల్లీ వాళ్లకు గుండెకాయ వంటిది కావటమే. బ్రిటీషు సైన్యం ఒక్కో కేంద్రంపై విరుచుకుపడసాగింది. 1858 జూన్ 17న ఝాన్సీరాణి పోరాడుతూనే ప్రాణాలు విడిచింది. ‘ఇదిగో ఇక్కడ పడివున్న ఈ మగువే తిరుగుబాటు దారులందరిలోకీ మగవాడిగా భాసించింది’. అంటూ ఆమెను ఓడించిన జనరల్ హూరోజ్ తన శత్రువుకు అటువంటి నివాళి అర్పించాడు. 1859లో నానా సాహెబ్ లొంగిపోయేందుకు నిరాకరించి పోరాటానికి తిరిగి కొత్త ఊపిరులూదవచ్చనే ఆశతో తప్పించుకుపోయి నేపాల్ చేరాడు. వయోవృద్ధుడైన కున్వర్‌సింగ్ 1858 మే 9న తాను మరణించే వరకూ బ్రిటీషు దళాలను ముప్పుతిప్పలు బెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తూనే వచ్చాడు. బ్రిటీషు వాళ్లకు వ్యతిరేకంగా కడు సమర్థవంతంగా గొరిల్లా యుద్ధతంత్రాన్ని ఏప్రియలు 1859 వరకు

నిర్వహించిన తాంతియా తోపే ఒక జమిందారు నమ్మక ద్రోహం వల్ల బ్రిటీషు వాళ్లకు పట్టుబడి చంపివేయబడినాడు.

బ్రిటీషు సామ్రాజ్యం భారతదేశంలో ఎదుర్కోవలసి వచ్చిన అత్యంత సంకట మయమైన సవాలు ఆ విధంగా అంతమొందింది. ఒకవేళ తిరుగుబాటు దారులు విజయం సాధించి వుంటే చరిత్రగతి ఏవిధంగా వుండేదనేది కపోల కల్పనగానే మిగులుతుంది. అయితే వాళ్లు కాలమానాన్ని వెనక్కి మళ్లించి మళ్లీ రాచరిక వ్యవస్థను పునర్నిర్మించి గట్టిపరచి వుండేవాళ్లనే అభిప్రాయంతో యిక్కడే నిలబడి పోనక్కర్లేదు. అదొక్కటే మార్గం కాదు గదా. సిపాయిల పరిమితులు, బలహీనతలు ఎన్నున్నా పరాయి పాలన నుండి భారతదేశానికి దాస్య విమోచన కలిగించాలనే గట్టి కృషి దేశభక్తిపూరిత చర్య; అభ్యుదయ పథంలో ముందడుగు. ఒక చారిత్రక ఘటన ప్రాముఖ్యత దాని సత్వర విజయాలపైనే ఆధారపడి వుండనట్లయితే 1857 నాటి సిపాయి తిరుగుబాటు కేవలం ఒక చారిత్రక విషాద ఘటన కాబోదు. దాని పరాజయంలో కూడా ఒక ఘనకార్యాన్ని యిముడ్చుకుంది. అది తరువాత కాలంలోని జాతీయ విమోచనోద్యమానికి ఊతాన్నిచ్చింది. ఆ తిరుగుబాటు సాధించజాలనిది ఈ ఉద్యమం సాధించగలిగింది.

* * *

# 2 ప్రజాప్రతి ఘటనలు ; ఆదివాసీ తిరుగుబాట్లు

**వి**దేశీ పాలనకు వ్యతిరేకంగా 1857 నాటి తిరుగుబాటు భారత సంప్రదాయక పోరాటపు అత్యంత నాటకీయ ఘటన. అయితే అది ఆకస్మికంగా జరిగింది కాదు. బ్రిటీషు ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఒక శతాబ్దిపాటు నడిచిన తీవ్రమైన ప్రజాప్రతిఘటన ఫలితం అది.

భారతావనిలో బ్రిటీషు అధికార స్థాపన ఓ సుదీర్ఘ ప్రక్రియ. చెదురు మదురుగా విజయాలు సాధించి, వాటిని సంఘటిత పరచి సమాజాన్నీ, ఆర్థిక వనరుల్నీ వలస విధానానికి అనుగుణంగా రూపాంతర పరచటం జరిగింది. ఈ ప్రక్రియలో అడుగడుగునా అసంతృప్తే, నిరసనలే, ప్రతిఘటనలే.

ఈ ప్రజాప్రతిఘటన ప్రధానంగా మూడు రూపాలుగా సాగింది– ప్రజాప్రతిఘటనలు, ఆదివాసీ తిరుగుబాట్లు, రైతు ఉద్యమాలు. మొదటి రెండింటిని గురించి మనం యిక్కడ చర్చించుకుదాం.

* * *

నూరేళ్ల బ్రిటీషు హయాంలో గొలుసుకట్టుగా సాగిన ఈ ప్రతిఘటనల పరంపరలకు తరచుగా నాయకత్వం వహించిన వాళ్లు– తొలగించబడిన రాజాలు, నవాబులు లేదా వాళ్ల వారసులు, ప్రాభవాన్ని కోల్పోయి బీదరికంలో మగ్గుతున్న జమిందార్లు, భూస్వాములు, పాలెగాళ్లు, పరాజిత భారత రాజ్యాలకు చెందిన మాజీ

అధిపతులు వారి అధికారులు. అయితే చిత్రహింసలకు గురైన రైతులు, బ్రతుకులు బండబారిన చేతివృత్తులవాళ్లు, చిందరవందర చేయబడిన సైనికులు మాత్రమే ఈ ప్రతిఘటనలకు వెన్నెముకగా, జనబాహుళ్యపు పునాదిగా, దెబ్బతీయగల శక్తిగా నిలిచారు.

ఆకస్మికంగా చెలరేగే ఈ స్థానిక ప్రతిఘటనలకు కారణం స్థానికమైన ఇబ్బందులే కావచ్చుగాని, వాటి కాల పరిమాణం స్వల్పమే కావచ్చుగాని అవి చాలా గొప్పగా ఊపందుకొనేవి. కొన్ని వందలనుండి అనేక వేలవరకు సాయుధులు పాల్గొనేవాళ్లు.

బ్రిటీషు ప్రభుత్వం ఆర్థికంగా, పాలనాపరంగా, భూమిశిస్తు పద్ధతిలోప్రవేశపెట్టిన త్వరితగతి మార్పులే ఈ సమస్త ప్రజాపోరాటాలకూ ప్రధానకారణంగా కన్పిస్తుంది. ఈ మార్పులు వ్యవసాయక సమాజాన్ని అతలాకుతలం గావించాయి, అందులో అంతర్భాగంగావున్న వారిని సుదీర్ఘ, విస్తృత వేదనలకు గురిచేసాయి. వీటన్నింటినీ మించి భూమి శిస్తు వసూళ్లకై వత్తిడి పెంచి దండుకోగలిగినంత దండుకొనే వలస విధానం భారతదేశపు గ్రామాల్లో ఉపద్రవాన్ని సృష్టించింది. ఉదాహరణకు బెంగాల్‌లో శిస్తు వసూలు ముప్పయ్యేళ్ల లోపలే మొగలాయీలు వసూలు చేసిన శిస్తు కన్నా దాదాపు రెట్టింపయ్యింది. బ్రిటీషువారి పెత్తనం విస్తరిస్తున్న కొద్దీ ఆ రెవెన్యూ విధానం దేశంలోని యితర ప్రాంతాలకూ పాకింది. అగ్నికి ఆజ్యం తోడయినట్లు ఈ పెంచిన శిస్తులో అణుమాత్రం కూడ వ్యవసాయాభివృద్ధికిగాని, రైతు సంక్షేమానికి గాని వినియోగించక పోవటం రైతుల్లో అసంతృప్తిని బాగా పెంచింది.

వేలాదిగా జమీందార్లు, పాలెగాళ్లు వలసరాజ్యంలో తమ హక్కులు కోల్పోయిగాని, అడిగినంత శిస్తు చెల్లించలేకపోయినందువల్లగాని భూములపై హక్కును కోల్పోయారు. గర్వోన్నతులైన ఈ జమీందార్లు, పాలెగాళ్లు, ఈ నష్టాన్ని మరింతగా నిరసించవలసిన అవసరం ఎందుకు వచ్చిందంటే– వాళ్లతో సరితూగే హోదాగల వాళ్లకు గాక ఆ భూములపై పెత్తనాన్ని అధికారులకు, నయా ధనవంతులకు బదలాయించటం. అందువల్ల వాళ్లు, వాళ్లకు పూర్వం పాలించిన ప్రముఖులు అధికారాన్ని కోల్పోయినందువల్ల కొత్త పాలకులతో ఢీకొనేందుకు సిద్ధమయ్యారు.

గతంలో గమనించిన విధంగానే వ్యవసాయదారులు, చేతివృత్తులవాళ్లు ధ్వజమెత్తేందుకూ,సంప్రదాయ మేధావి వర్గంతో చేతులు కలిపేందుకూ వాళ్ల కారణాలు

వాళ్లకున్నాయి. పెరుగుతూపోతున్న భూమి శిస్తు కారణంగా అనేక మంది రైతులు అప్పులపాలు గావటంగాని, భూములు అమ్ముకోవలసి రావటంగాని సంభవించింది. నయా భూస్వాములు రైతులపట్ల సంప్రదాయక సోదరభావాన్ని వీడి, కౌళ్లు మండిపోయేట్లు చేసి చెల్లించలేని పక్షంలో వాళ్లను ఆ భూములనుండి తొలగించారు. రైతాంగపు ఆర్థిక పతనావస్థ 1770–1857 మధ్య కాలంలో పన్నెండు పెద్ద, అనేక చిన్న కరువులకు దారితీసింది.

కొత్తగా ఏర్పాటైన కోర్టులు, న్యాయవ్యవస్థ భూమిని కోల్పోయిన వాళ్ల నెత్తిన మొత్తి, బీదల్ని అణచివేసి, ఉన్న వాళ్లను అందలమెక్కించేవిగా తయారయ్యాయి. కౌలు బకాయిల వసూలుకో, శిస్తు బకాయిల వసూలుకో లేక అప్పుపై వడ్డీ గుంజేందుకో రైతుల్ని కలతచెందేట్లు చేయటం, చిత్రహింసలుపెట్టటం, జైళ్లలోకి నెట్టటం మామూలు విషయాలుగా మారిపోయాయి. పోలీసు, న్యాయ, సాధారణ పరిపాలన విభాగాల్లో క్రింది స్థాయిలో పెచ్చురిల్లిన అవినీతి సామాన్యుల్ని బాగా దెబ్బకొట్టింది. బీదవాళ్ల నోళ్లు కొట్టి చిన్న చిన్న అధికారులు బాగా బలిసిపోయారు. పోలీసులు ఇష్టారాజ్యంగా సామాన్యుల్ని దోచుకునేవాళ్లు, అణచివేసేవాళ్లు, చిత్రహింసలకు గురిచేసేవాళ్లు. 1859లో విలియం ఎడ్వర్డ్ అనే బ్రిటీషు అధికారి వ్రాసిన ప్రకారం పోలీసులు ప్రజలకు సింహస్వప్నం ... వాళ్ల అణచివేత పద్ధతి, డబ్బు గుంజేవిధానం,మన ప్రభుత్వం పట్ల అసంతృప్తికి ప్రధాన కారణాలలో ఒకటి.'

భారత దేశంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టటం వల్ల భారతీయ హస్తకళల పరిశ్రమలు ధ్వంసమయ్యాయి. పక్షపాత వైఖరితో బ్రిటన్‌లో భారతీయ వస్తువులపై విధించిన పన్నుల వల్ల లక్షలాది చేతివృత్తులవాళ్లు వీధిన పడ్డారు. అంతేకాక వారి సంప్రదాయక పోషకులు, కొనుగోలుదారులు అయిన రాజవంశీయులు, జమీందారులు, తెగ నాయకులు కనుమరుగవడంతో చేతివృత్తులవాళ్ల దైన్యం మరింతగా పెరిగింది.

విదేశీపాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు కావలసినంత ద్వేషాన్ని పెంచటంలో పండిత, పూజారి వర్గాలు చురుకుగా వుండి తిరుగుబాటుకు మార్గం సుగమం చేసాయి. తరతరాల పాలకులు, వాళ్లలోని మేధావి వర్గం, పండితులకు, పూజారులకు, సాధువులకు, మౌల్వీలకు, సాహితీ కళారంగాలకు చెందిన వాళ్లకు ఆర్థిక సాయాన్ని అందించేవాళ్లు. బ్రిటీషు ప్రభుత్వం రాకతో జమిందారీ విధానం యిబ్బందుల్లో

పడటంతో ఈ విధమైన పోషకత్వం అడుగంటింది. వాళ్లపై ఆధారపడి జీవించే వాళ్లంతా బికారులయ్యారు.

ప్రతిఘటనలకు మరో ప్రధాన కారణం బ్రిటీషు పాలనలోని విదేశీతత్వం. విదేశీయుల కాళ్ళ కింద నలిగిపోతున్నామనే భావన ఇతర దేశీయుల్లాగే భారతీయుల్ని కుంగదీసింది. ఈ విధంగా గాయపడిన ఆత్మగౌరవం విదేశీయుల్ని మనగడ్డ నుండి తరిమికొట్టే కృషికి తగిన ప్రేరణ నిచ్చింది.

బెంగాలులోనూ, బీహారులోనూ బ్రిటీషు పాలన ఉన్నందున ప్రజాపోరాటాలు ముందుగా అక్కడ మొదలయ్యాయి. ఒక్కొక్క ప్రాంతం వలస పాలన క్రిందికి రాగానే అక్కడ ప్రతిఘటనలు ఎదురయ్యేవి. ఏదో ఒక ప్రాంతంలో సాయుధ తిరుగుబాటెరుగని సంవత్సరంగాని, పెద్ద ఎత్తున సాయుధ పోరాటాలు విజృంభించని దశాబ్దంగాని లేనేలేవు. 1763-1856 మధ్య కాలంలో వందలాది చిన్నాచితక ప్రతిఘటనల్ని అలా వుంచితే నలభైకి పైగా పెద్దపెద్ద పోరాటాలు సంభవించాయి.

బంకించంద్ర చటర్జీ తన నవల ఆనందమఠ్ ద్వారా సాధువుల తిరుగుబాటును ప్రాచుర్యంలోకి తెచ్చారు. అందులో నిర్వాసితులైన వ్యవసాయ దారులు, విచ్ఛిన్నం చేయబడిన బెంగాలు సైనికులు, సాధువుల, బేదఖలుచేయబడిన జమిందారుల నాయకత్వం క్రింద ఉద్యమించారు. అది 1763 నుండి 1800 సంవత్సరం వరకూ కొనసాగింది. దాని తరువాతది చౌర్ పోరాటం. బీహార్, బెంగాల్ ప్రాంతాల్లోని ఐదు జిల్లాలకు విస్తరించి 1766 నుండి 1772 వరకు, తిరిగి 1795 నుండి 1816 వరకు ఆ పోరాటం సాగింది. తూర్పు భారతంలోని యితర ప్రధాన పోరాటాలు 1783లో రంగపూర్, దీనజ్‌పూర్‌లలోనూ, 1799లో విష్ణుపూర్, బీర్భూమ్‌లలోనూ, 1804-17 మధ్య కాలంలో ఒరిస్సా జమిందారుల ద్వారా, 1827-40 మధ్య సంబల్‌పూర్‌లోనూ జరిగాయి.

దక్షిణ భారతంలో 1794లో విజయనగరం మహారాజా ఎదురు తిరిగాడు. 1790లలో తమిళనాడులోని పాలెగాళ్లు, 19వ శతాబ్దిలో మలబారు, కోస్తా ఆంధ్రా ప్రాంతాల్లో, 1813-14లో పర్లాకిమిడిలో ప్రతిఘటనలు చెలరేగాయి. 1805లో తిరువాన్కూరుకు చెందిన దివాన్ వేలుతంపి వీరోచిత పోరాటాన్ని నిర్వహించాడు.

1830–31వ సంవత్సరంలో మైసూరు రైతులు కూడా ఉద్యమించారు. 1830–34 మధ్య విశాఖపట్నంలోనూ, 1835లో గంజాంలోనూ, 1846–47 మధ్య కర్నూలులోనూ ప్రముఖమైన ప్రతిఘటనలు నిర్వహింపబడినాయి.

పశ్చిమ భారతంలో సౌరాష్ట్ర పాలకులు 1816 నుండి 1832 వరకు పలుసార్లు పోరాడారు. అలాగే 1824–28, 1839–49 మధ్య కాలంలో గుజరాత్‌కు చెందిన కోలీలు కూడ. పీష్వా కడసారి ఓటమి తరువాత మహారాష్ట్ర నిరంతర పోరాటంలో మునిగితేలింది. 1818–31 మధ్య కాలంలోని భిల్లుల పోరాటాలు, 1824లో చిన్నవ నాయకత్వాన నడిచిన కిట్టూరు పోరాటం, 1841 నాటి సతారా ప్రతిఘటన, 1844లోని గడార్కుల తిరుగుబాటు ప్రముఖమైనవే.

ఉత్తర హిందూస్థానంలోని పరిస్థితి తక్కువ ఉపద్రవకరంగా ఏం లేదు. 1824లో పశ్చిమ ఉత్తర ప్రదేశ్, హర్యానా ప్రాంతాల్లో సాయుధ పోరాటాలు జరిగాయి. 1805లో బిలాస్‌పూర్‌లో, 1814–17 మధ్య ఆలీఘడ్ తాలూకాదార్లు 1842లో జబల్‌పూర్ బుందేలాలు, 1852లో ఖాందేష్‌లో జరిపిన పోరాటాలు ప్రముఖమైనవి. 1848–49లోని రెండవ పంజాబు యుద్ధము కూడా ప్రజలు సైన్యము కలిసి సల్పిన ప్రతిఘటనే.

ఈ విధమైన నిరంతర పోరాటాలు మొత్తంగా చూస్తే అత్యధిక పరిమాణంలో జరిగినవే. అయితే అవి స్థానికంగా వేటిదారిన అవే నిర్వహింపబడినాయి. స్థానిక కారణాల వల్ల, వేదనల వల్లనే ఆ పోరాటాలు జరిగాయి. ఫలితాలు స్థానికంగానే మిగిలిపోయాయి. పలు పర్యాయాలు ఆ పోరాటాల తీరులన్నీ ఒకటిగానే ఉన్నందున వాటికి జాతీయత సిద్ధించిందని అనలేం. వేర్వేరుగా వున్న ప్రదేశాల్లో, కాలాల్లో ఉద్యమాలు నడిచినా స్థితిగతులు ఒకే విధంగా ఉండటమే అలా అన్పించటానికి కారణం.

ఈ పోరాటాలకు నాయకత్వం వహించిన సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకచూపే. వాళ్ల దృక్కోణం సంప్రదాయబద్ధమే. వాళ్లింకా గతంలోనే జీవిస్తున్నారు. వాళ్ల రక్షణను బదాబదలు చేసే ఆధునిక ప్రపంచపు విస్మృతిని గూర్చిన అవగాహన ఆనందపు మత్తులో వాళ్ల తలకెక్కలేదు. వాళ్ల ప్రతిఘటన మరో సామాజిక ప్రత్యామ్నాయానికి దారితీయలేదు. అది తరతరాల ఆలోచనా ధోరణీ. సాంస్కృతిక బంధమే. వాటి ప్రధాన ఉద్దేశ్యం గత కాలపు రాచరిక వ్యవస్థను నిలబెట్టుకోవటమే. ఆనాటి సామాజిక బంధాలను పదిల పరచుకోవటమే. ఆ విధమైన వెనుక చూపుతో,

కలిసికట్టుతనం కొరవడి చెల్లాచెదురుగా నిర్వహించిన ఆందోళనలు ఆత్మరక్షణను పెంపొందించటం గాని, విదేశీ పాలనను అరికట్టటం కాని చేయలేకపోయాయి. ప్రతిఘటనా ప్రాంతాల్లో వరసగా శాంతిని నెలకొల్పటంలో బ్రిటీషు ప్రభుత్వం సఫలీకృతమయ్యింది. పరాయి పాలనలో శాంతియుత జీవనం కొనసాగించేందుకు అంగీకారం తెలియజేసిన మునాదార్లుగాని రాజులకు, జమిందారులకు కొన్ని రాయితీలు కల్పించబడినాయి. కొందరికి వాళ్లరాజ్యాలను, ఎస్టేట్లను వాళ్లకు అప్పగించి సంతోష పరచటం జరిగింది. కొందరి వద్ద వసూలు చేసే కప్పం తగ్గించబడింది. తీవ్రంగా తిరుగుబాట్లు నిర్వహించే వాళ్లకు నూకలు చెల్లేట్లు చేశారు. ఉదాహరణకు వేలుతంపి మరణించిన తర్వాత సైతం ఆయనను బహిరంగంగా ఉరివేశారు. 1857 తిరుగుబాటు దక్షిణ భారతదేశానికి తూర్పు పశ్చిమ భారతంలోని పలు భాగాలకు వ్యాపించక పోవటానికి ప్రధాన కారణం ప్రజాపోరాటాల అణచివేతే. ఈ ప్రజాపోరాటాల చారిత్రక ప్రాముఖ్యత ఏమంటే అవి బ్రిటీషు పాలనను వ్యతిరేకించేందుకు కావలసిన శక్తిమంతమైన విలువైన స్థానిక పోరాట సంప్రదాయాలను నెలకొల్పాయి. తరువాత రోజుల్లో భారతీయులు స్వాతంత్ర్యం కోసం నడిపిన జాతీయోద్యమానికి స్ఫూర్తి వాటి నుండే లభించింది.

* * *

మనదేశంలో చాలా భాగంలో విస్తరించి వున్న అదివాసీలు 19వ శతాబ్దంలో వందలాది సమరశీల పోరాటాలు, తిరుగుబాట్లు సాగించారు. అత్యంత సాహసాన్నీ, త్యాగాన్నీవాళ్లు ప్రదర్శిస్తే పాలకులు పాశవిక అణచివేతను, అక్షరాలా ఊచకోతను చేపట్టారు. ఆదివాసీలు క్రిందా మీదవ్వటానికి కారణాలనేకం. వలస పాలనలోకి వాళ్లను లాగటం వల్ల అంతకు ముందు తాము అనుభవిస్తున్న ఏకాంతాన్ని కోల్పోయారు. ఆదివాసీ ప్రభువుల్ని బ్రిటీషు ప్రభుత్వం జమిందార్లుగా పరిగణించి ఒక కొత్త శిస్తు విధానాన్ని రూపొందించి అటవీ సంపదలపై పన్నులు విధించింది. ఆదివాసీ ప్రాంతాల్లోకి క్రైస్తవ మిషనరీలుచొచ్చుకురావటాన్ని ప్రోత్సహించింది. వీటన్నింటినీ మించి చాలా మందిని వడ్డీ వ్యాపారుల రూపంలో, వర్తకుల రూపంలో, శిస్తుగట్టి సాగుచేసుకొనే రైతుల రూపంలో ఆదివాసీల మధ్య దళారుల్ని నిలిపింది. ఆదివాసీలను వలస ఆర్థిక విధానపు దోపిడీల సుడిగుండాల్లోకి లాగే ప్రధాన సాధనాలు ఈ దళారులే. ఈ దళారులు ఆదివాసీలు కారు, బయటి వాళ్లు. వాళ్లు విజృంభించి ఆదివాసీల భూముల్ని పెద్ద ఎత్తున హస్తగతం

చేసుకొని వాళ్లను అప్పుల ఊబిలోకి దించారు. కాలక్రమేణ ఆదివాసీలు భూముల్ని అధికంగా కోల్పోయి అంతకు పూర్వం వాళ్లు ఉమ్మడిగా సాగులోకి తెచ్చిన భూముల్లోనే వ్యవసాయకూలీలుగా, పాలికి పండించేవాళ్లుగా, కౌలుదార్లుగా మిగిలిపోయారు.

వలస పాలన వాళ్లకు అడవితో వున్న అనుబంధాన్ని కూడా మార్చివేసింది. వాళ్లు ఆహారానికీ వంట చెరుక్కీ, పశువుల మేతకూ అడవిపై ఆధారపడేవాళ్లు. వాళ్లు పోడు వ్యవసాయ పద్ధతిని పాటించేవాళ్లు. భూములు నిస్సారమవుతున్న తరుణంలో కొత్త అటవీ భూముల్ని సాగులోకి తెచ్చేవాళ్లు. వలస పాలన ఈ పద్ధతినంతా మార్చివేసింది. అటవీ భూముల్ని ప్రభుత్వం ఆక్రమించేసి ఆదివాసుల్ని అటవీ సంపదకు, అటవీ భూములకు ఉమ్మడి గ్రామ భూములకూ దూరంగా నెట్టింది. కొత్త భూముల్లోకి వ్యవసాయ మార్పిడికి ప్రభుత్వం అనుమతిని నిరాకరించింది.

పోలీసుల, చిరుద్యోగుల జులుం, రాచిరంపాన బెట్టే తత్వం ఆదివాసీల ఆపదల్ని మరింతగా పెంచాయి. శిస్తుకట్టే వ్యవసాయదారులు, ప్రభుత్వ ఏజెంట్లు కూలివ్వకుండా వాళ్లతో పనిచేయించుకునే 'బేగార్' పద్ధతిని పెంచి పోషించాయి.

ఒక ప్రాంతానికీ, మరో ప్రాంతానికీ తీవ్రతలో తేడాయేగాని అన్ని చోట్లా వాళ్ల పాత వ్యవసాయ విధానాలకు పూర్తిగా విఘాతం కలిగింది. అదే ఆదివాసీ సమాజాల్లో తిరుగుబాటుకు అందరికీ వర్తించే కారణం. ఈ తిరుగుబాట్లు విస్తృత ప్రాతిపదికన జరిగేవి. వేలాది మంది ఆదివాసీలు పాల్గొనేవాళ్లు. తరచుగా ఆ ప్రాంతపు ఆదివాసీ జనాభా యావత్తూ పాల్గొనేది.

వలస పాలన చొచ్చుకొని వచ్చి నెత్తికెక్కటంతో పాటు వ్యాపారస్తుల, వడ్డీ వ్యాపారుల, శిస్తు చెల్లించి పండించే వ్యవసాయదారుల ముప్పేట దాడి కొద్దిగానో, పెద్దగానో ఆదివాసీ ప్రత్యేకతను కొనసాగనివ్వలేదు. వాస్తవానికి మానవ బంధాలే ఆదివాసీ పోరాటాలకు ప్రాతిపదిక. ఆదివాసీలు వాళ్లకు వాళ్లు ఒక భిన్నమైన వర్గంగా గాకుండా ఒక ఆదివాసీ ప్రత్యేకతతో విలసిల్లే తెగగా భావించుకుంటారు. అటువంటి సందర్భాల్లో వాళ్ల సంఘీభావం తారాస్థాయికి చేరుతుంది. సహ ఆదివాసీలు శత్రువుతో చేతులుకలిపితే తప్ప దాడికి గురికారు.

అలా అని వాళ్లు ఆదివాసీలు కాని వాళ్లందర్నీ శత్రువులుగా భావించి ఎదుర్కొన్నదీ లేదు. ఆదివాసీ గ్రామాల్లో ఆర్థికంగా సాయపడే పాత్రలు పోషిస్తూనో లేక ఆదివాసీలతో సామాజిక సంబంధాలు కలిగివున్న తెలకలు, గొల్లలు, కమ్మర్లు, వడ్రంగులు, కుమ్మర్లు, నేతపనివాళ్లు, రజకులు, క్షురకులు, మేళగాళ్లు, వెట్టిచాకిరి చేసేవాళ్లు, అదివాసీలు కాని వారింటి పరిచారికలకు, బీదవాళ్లకు హాని తలపెట్టే వాళ్లు కాదు. అంతేగాకుండా వారందరినీ మిత్రవర్గాలుగా పరిగణించారు. చాలా సందర్భాల్లో గ్రామీణ పేదలు ఆదివాసీ పోరాటాల్లో భాగస్వాములుగా వుండేవాళ్లు.

మరో గత్యంతరం లేని సందర్భాల్లోనే ఆదివాసీల పోరాటాలు సాధారణంగా ప్రారంభమయ్యేవి. అవి తరచుగా తమ వాళ్లు కాని వాళ్లపై హఠాత్తుగా విరుచుకుపడి వాళ్ల ఆస్తుల్ని కొల్లగొట్టి వాళ్ల గ్రామాల నుండి వాళ్లను వెళ్లగొట్టేవరకూ నడిచేవి. దీనివల్ల వలస ఆధిపత్యంతో ఘర్షణ పడవలసి వచ్చేది. అలా జరిగినప్పుడు ఆదివాసీలు ప్రాథమికంగా సంఘటితమై సాయుధ ప్రతిఘటనకు పూనుకొనేవాళ్లు.

ఈ దశలో తరచుగా మత నాయకులు – వాళ్ల రక్షకులుగా భావింపబడేవారు – దైవికమైన జోక్యాన్ని వాగ్దానం చేసి, ఆదివాసీయేతర బాహ్యశక్తుల బారి నుండి రక్షణ కల్పిస్తామని చెప్పి విదేశీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలిచి పోరాడమని హితవు పలికేవాళ్లు. ఈ నాయకుల్లో అత్యధికులు వాళ్ల శక్తుల్ని భగవత్ ప్రసాదంగా పేర్కొనేవాళ్లు. శత్రువుల తూటాలు పేలకుండా చేసే ఇంద్రజాలిక శక్తులు వాళ్ల కున్నట్లు గూడ నమ్మబలికేవాళ్లు. ఆశతో, విశ్వాసంతో ఆదివాసీలు కడవరకూ ఆ నేతలను అనుసరించేవాళ్లు.

ఆదివాసీ తిరుగుబాటు దారులకు, బ్రిటీషు సాయుధ దళాలకు మధ్య జరిగే యుద్ధం సరిసమానుల మధ్య జరిగే యుద్ధం కాదు. ఒక వైపున ఆధునిక ఆయుధాలతో కవాతు చేసే సైనిక దళాలయితే మరోవైపున అటు, ఇటు తిరుగాడే స్త్రీ పురుషులు వాళ్ల దళనేతల ఇంద్రజాలిక శక్తుల పైన నమ్మకముంచి రాళ్లు, గొడ్డళ్లు, బల్లేలు, విల్లంబుల వంటి పాతకాలపు ఆయుధాలతో పోరాడటం. ఇటువంటి అసమానయుద్ధంలో లక్షలాది మంది ఆదివాసీలు ప్రాణాలు కోల్పోయారు.

* * *

పలు ఆదివాసీ తిరుగుబాట్లలో సంతాల్ హూల్ లేదా తిరుగుబాటు అనేది అన్నిటికంటే పెద్దది. భాగల్పూరు, రాజమహల్‌ల మధ్య వుండే ప్రాంతంలో నివసించే

డామన్ – ఐ.కోగా గుర్తింపబడే సంతాలులు తిరుగుబాటు చేశారు. దికూలు అనే పరాయి వాళ్లను పారద్రోలేందుకు కృతనిశ్చయులయ్యారు అదే విధంగా పరాయి పాలనను పూర్తిగా రూపుమాపేస్తామని ప్రకటించారు. తిరుగుబాటుకు పురికొల్పిన సామాజిక స్థితిగతుల్ని ఓ సమకాలికుడు 'కలకత్తా రివ్యూ'లో ఈ విధంగా వర్ణించాడు: తేలికగా బెదిరిపోయి లొంగిపోయే సంతాలులపై జమిందారులు, పోలీసు, రెవెన్యూ శాఖాధికారులు, కోర్టులు అన్నీ కలిసికట్టుగా జులుం సాగించటం, దౌర్జన్యపు బలాత్కారాలు, బల ప్రయోగంతో ఆస్తిలేకుండా చేసేయ్యటాలు, తిట్టటం, కొట్టటం, రకరకాల చిన్న చిన్న నిరంకుశ చర్యలు చేపట్టటం జరిగింది. అప్పు తీసుకున్న సొమ్ముపై 50 నుండి 500 శాతంవరకు అధిక వడ్డీలు గుంజటం, సంతలలో, మార్కెట్లలో తూనికలు కొలతల్లో మోసం చేయటం, బీదవాళ్ల పొలాల్లోకి నిర్దయగా ధనవంతులు తమ పశువుల్ని, తట్టులను, గుర్రాలను, చివరకు ఏనుగుల్నికూడా తోలటం వంటి ఎన్నో అన్యాయపు పనులు జరుగుతూ వుండేవి.'

సంతాలులు దికూలను, ప్రభుత్వోద్యోగుల్నీ అవినీతిపరులైన లంచగొండులుగా, యాచకులుగా, దొంగలుగా, అబద్ధాల కోరులుగా, త్రాగుబోతులుగా భావించేవాళ్లు.

1854 వచ్చేప్పటికి ఆదివాసీ నాయకులు, మఝీలు, పర్గనైట్లు సమావేశమై తిరుగుబాటు చేసేందుకు అవకాశాలపై చర్చించుకునేవాళ్లు. చెదురుమదురుగా జమిందారులను, వడ్డీ వ్యాపారులను దోచుకోవటం ప్రారంభమయింది. 1855 జూన్ 30న ఆదివాసీ నాయకులు 400 గ్రామాలకు చెందిన 6000 మంది సంతాలులను భాగనిధి అనే చోట సమావేశపరిచారు. తిరుగుబాటు పతాకాన్ని ఎగురవేయాలని నిర్ణయించుకున్నారు. పరాయి వాళ్లయిన దికూలనూ, వాళ్లకు అండగా నిలిచే వలస పాలకులనూ వెంటనే సమూలంగా వదిలించుకోవాలనుకున్నారు. నిజాయితీ గల పాలన, ధర్మంతో కూడిన న్యాయపాలన అందించే సత్యయుగానికి మార్గదర్శకులు కావాలనుకున్నారు.

తమ చర్యలకు భగవదనుగ్రహమున్నదని సంతాలుల విశ్వాసం. సీదో, కన్హూ అనే ప్రముఖ ఆదివాసీనాయకులు వాళ్లతో వాళ్ల భగవంతుడు (ఠాకుర్) మాట్లాడాడని, స్వాతంత్ర్యం కోసం సాయుధులై, పోరాటం జరపమన్నాడనీ తెలియజేసారు. సిదో అధికారులను ఇలా హెచ్చరించాడు: 'ఠాకుర్ నాతో స్వయంగా చెప్పాడు. ఈ దేశం

సాహిబ్‌లది కాదని. ఠాకురే స్వయంగా పోరాడుతాడు. కనుక సాహిబ్‌లూ, సైనికులూ ఠాకుర్‌తో పోరాటానికి సిద్ధం కావాలి.'

డప్పులు, ఇతర వాద్యాలు వాయించుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఆదివాసీ నాయకులు సంతాలులలోని స్త్రీ పురుషులను సమీకరించారు. నాయకులు గుర్రాలపై, ఏనుగులపై, పల్లకీలలో ముందుండేవాళ్లు. 1500 నుండి 2000 మంది గల జట్లుగా ఏర్పడి అవసరం రాగానే డప్పుల మోతల సంకేతంగా వేలాదిగా పోగై మహాజనులపై, జమిందారులపై, వాళ్ల గృహాలపై, పోలీసు స్టేషన్లపై, తయారవుతున్న రైల్వే నిర్మాణాలపై, తపాలా కార్యాలయాలపై – అలా దోపిడీకి, వలస పాలనకు సంకేతాలైన 'దికు' సంకేతాలన్నింటిపై తిరగబడేవాళ్లు.

ఈ సంతాలుల పోరాటాలను ఆదివాసీలు కానటువంటి దికూలలోని నిరుపేదలు, గొల్లలు తదితరులు సామాగ్రి, సేవలు అందించి సాయపడేవాళ్లు. సంతాలుల ఆయుధాలు సక్రమంగా ఉండేట్లు చూసుకుంటూ కమ్మరులు వాళ్లనంటిపెట్టుకుని వుండేవాళ్లు.

ప్రభుత్వం తిరుగుబాటు స్థాయిని గుర్తించగానే తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున సైనిక చర్యలు ప్రారంభించేది. పదుల సంఖ్యలో రెజిమెంట్లను ఒక మేజర్‌జనరల్‌ఆధీనంలో మోహరింపజేసి, తిరుగుబాటు జరిగే ప్రాంతాల్లో మార్షల్‌లా (సైనిక శాసనం) ప్రకటించి వివిధ నాయకుల ఆచూకీ తెలిపిన వారికి రు,10,000/–ల బహుమతిని ప్రకటించి, తిరుగుబాటును నిర్దయతో అణచివేశారు. 15000 మందికి పైగా సంతాలులు హతులయ్యారు. పదుల సంఖ్యలో గ్రామాలకు గ్రామాలు నేలమట్టం అయ్యాయి. సిదోను నమ్మక ద్రోహంతో బంధించగలిగి 1855 ఆగస్టులో చంపివేసారు. 1866 ఫిబ్రవరిలో తిరుగుబాటు చివరి దశలో యాదృచ్ఛికంగా కన్హూ బంధించబడినాడు. 'రాజ్‌మహల్ గిరులు పోరాడే సంతాల్ రైతుల రక్తంతో తడిసి ముద్దయ్యాయి.' సంతాల్ వీరుల పోరాట పటిమకు సంబంధించిన ఒక విలక్షణమైన ఘటనను యల్.ఎస్.ఎస్. మాలే ఈ విధంగా వర్ణిస్తాడు: 'వాళ్లు పట్టుబడేందుకు అంగీకరింపక ఎప్పుడు దండింప బడేదీ తెలియని స్థితిలో అపాయాన్ని లెక్క చేయక అత్యంత సాహసాన్ని ప్రదర్శించేవాళ్లు. సైనికులకు వ్యతిరేకంగా పోరాడుతూ ఓ సందర్భంలో నలభై ఐదుమంది సంతాలులు

ఒక మట్టిగోడల గుడిసెలోకి జొరబడ్డారు. సైనికులు ఆ గుడిసెపైకి గుండ్లవర్షం తెరపలు తెరపలుగా కురిపించారు. ప్రతీసారీ సంతాలీలు బాణాలు వేసి బదులు పలికారు. కాల్పులు విరమించిన తరువాత సైనికులు గుడిసెలోకి ప్రవేశిస్తే ఒక వయసు పైబడ్డ వ్యక్తి మాత్రం బ్రతికి వున్నాడు. ఓ సైనికుడు అతని వద్దకు వెళ్లి లొంగిపోమ్మంటే ఆ వృద్ధుడు ఆ సైనికునిపై తిరగబడి తన గండ్ర గొడ్డలితో నరికివేసాడు.

* * *

మరో మూడు ముఖ్యమైన ఆదివాసీ తిరుగుబాట్లను వివరిస్తాను. 1820–1837 మధ్య ఛోటా నాగపూరు ప్రాంతపు కోలులు తిరుగుబాటు చేసారు. బ్రిటీషు అధికారం పునరుద్ధరణకు ముందే వేలాది మంది కోలులు సామూహిక వధకు గురయ్యారు. కోస్తా ఆంధ్రాలోని రంప ప్రాంతానికి చెందిన గిరిజనులు ప్రతిబంధకాలతోకూడిన నూతన అటవీ విధానానికి, ప్రభుత్వ మద్దతుతో కొల్లగొట్టే మునసబుదారుకు వ్యతిరేకంగా 1879 మార్చిలో తిరుగుబాటు చేశారు. ప్రభుత్వం అనేక రెజిమెంట్ల కాల్బలాన్ని, ఒక స్క్వాడ్రన్ అశ్వికదళాన్ని, కందకాలు, గనులు త్రవ్వటంలో అనుభవమున్న రెండు కంపెనీల బలగాన్ని 1880లో అక్కడకు రప్పించి అనేక వేల మంది తిరుగుబాటు దారుల్ని అణచివేసేందుకు ఏర్పాట్లు చేసింది.

ముండా జాతి ఆదివాసీల ఆందోళన (ఉల్గులన్) బీర్సాముండా నాయకత్వాన 1899–1900లలో జరిగింది. జాగీరుదార్లు, ఠేకేదార్లు (శిస్తు చెల్లించే రైతులు), వడ్డీ వ్యాపారులు వాళ్ల మధ్యకుచొరబడిన కారణంగా వాళ్ల ఉమ్మడి వ్యవసాయ క్షేత్ర పద్ధతి ఛిన్నాభిన్నం కావటంతో ముప్పయ్యేళ్లకు పైగా ముండా సర్దారులు పోరాడుతూనే వున్నారు.

1874లో పాలికాపుల కుటుంబంలో జన్మించిన బీర్సాకు 1895లో దైవదర్శనమయిందట. అత్యద్భుతంగా వ్యాధుల్ని రూపుమాపే శక్తిగల దేవదూతగా తనని తాను అభివర్ణించుకొన్నాడు. సరికొత్త మత సందేశాన్నందించే రక్షకుణ్ణి అతనిలో చూచినట్లయి వేలాది మంది అతని చుట్టూ మూగసాగారు. సర్దారుల పలుకుబడితో మత ఉద్యమం త్వరలోనే రాజకీయ, వ్యవసాయక స్వభావాన్ని సంతరించుకుంది. బీర్సా ఊరూరా తిరుగుతూ ఊరేగింపులు సమావేశాలు నిర్వహిస్తూ మత, రాజకీయ

ప్రాతిపదికపై అనుయాయుల్ని కూడగట్టసాగాడు. 1899లో క్రిష్టమస్ పర్వదినాన తమకు చెందిన భూభాగంలో ముండా ప్రభుత్వాన్ని స్థాపించేందుకు పోరాటానికి పిలుపునిచ్చాడు. 'ఠేకేదార్లను, జాగీరుదార్లను, రాజాలను, హకీమ్‌లను, క్రైస్తవులను, మట్టుబెట్టేందుకు ప్రోత్సహించాడు. కలియుగం స్థానంలో సత్యయుగ స్థాపన జరుగుతుంది అన్నాడు. 'దికూలతో యుద్ధం అనివార్యం, వాళ్ల రక్తంతో భూమి ఎర్రజెండా అంత ఎరుపెక్కుతుంది అని ప్రకటించాడు. ఆదివాసీలు కాని బీదలపై దాడి చేయరాదన్నాడు.

స్వాతంత్ర్య సముపార్జనకు బీర్సా, కత్తులు, బల్లేలు, గండ్ర గొడ్డళ్లు, విల్లంబులు ధరించిన 6000 మంది ముండాలను పోగు చేయగలిగాడు. అయితే 1900 ఫిబ్రవరి మొదట్లో అతను పట్టుబడి జూన్ మాసంలో కారాగారంలో కన్నుమూసాడు. పోరాటం విఫలమైంది. కాని బీర్సా సంప్రదాయక వాస్తవ గాథల పరిధిలో తన స్థానాన్ని పదిలపర్చుకొన్నాడు.

* * *

# 3 1857 తరువాత రైతాంగ ఉద్యమాలు - పోరాటాలు

**భా**రతీయ రైతాంగంపై వలస విధానపు దోపిడీ ప్రభావం ఎటువంటిదో పరిశీలించటం ప్రయోజనకారి కాగలదు. వలస వ్యవస్థ ఆర్థిక విధానాలు, కొత్త భూమి శిస్తు పద్ధతి, వలసపాలనా పద్ధతి న్యాయశాఖల పనితీరు, చేతి వృత్తుల విధ్వంసంతో జనం భూమిపై ఎగబడటం వంటివి వ్యవసాయరంగ స్వరూపాన్ని మార్చివేసి రైతాంగాన్ని బీదరికంలోకి నెట్టివేసాయి. సువిశాలమైన జమిందారీ ప్రాంతాల్లో రైతుల్ని అధిక కౌళ్లతో పీడించటం లేదా బకాయిల్ని బలవంతంగా వసూలుచేయటం, బేగార్‌ను అమలు పరచటం చేసేవాళ్లు. అటువంటి చర్యల్ని చేపట్టే జమిందారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడవలసి వచ్చేది. ఇక రైత్వారీ ప్రాంతాల్లో ప్రభుత్వమే విపరీతంగా శిస్తును పెంచివేసింది. దీనివల్ల రైతులు వడ్డీ వ్యాపారుల నుండి అప్పుచేయవలసి వచ్చింది. క్రమేపీ పలు ప్రాంతాల్లో నిజంగా భూమిని దున్నే రైతు జమిందారు ఇష్టాయిష్టాలకు అనుగుణంగా వ్యవసాయం చేయవలసి రావటమో, పాలికాపుగా మారిపోవటమో, భూవసతి లేని వ్యవసాయ కూలీగా రూపొందటమో జరిగి వాళ్ల భూములు, పంటలు, పశువులు అన్నీ కూడా భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, భాగ్యవంతులైన భూకామందుల స్వాధీన మయ్యేవి.

ఈ అవస్థలు భరించలేని రైతులు అణచివేతను, దోపిడీని ప్రతిఘటించారు. వాళ్లు గురిపెట్టవలసింది ఏ దిక్కుగా - దేశవాళీ దోపిడీదారా లేక వలస పాలనా? అడ్డంకులన్నీ తొలగితే అసలు సిసలైన శత్రువుగా మిగిలేది వలస రాజ్యమే.

రైతులు సామాజికంగా భరించలేని స్థితికి చేరుకున్నపుడు అటు వ్యక్తులు గాని, ఇటు సముదాయాలుగా గాని సమిష్టి చర్యకు అనువుగాని తరుణంలో వాళ్లు

ప్రాథమికంగా చేపట్టే నిరసన కార్యక్రమం – నేరం చేయటం. సేద్యం చేస్తున్న భూముల నుండి తొలగించబడిన రైతుల్లో అనేక మంది దోపిడీ దొంగలుగా, బందిపోట్లుగా, సామూహిక దొమ్మీదార్లుగా మారవలసిన దుస్థితి ఏర్పడింది. ఆకలితో మాడి చచ్చేకంటే సామాజికంగా హోదాను కోల్పోవటం కంటే అటువంటి నేరాలకు పాల్పడటమే మేలని అనుకోవలసి వచ్చింది.

* * *

అత్యంత విస్తృతమైన సమరశీల రైతాంగ పోరాటం 1859–60 నాటి నీలిపంట రైతుల తిరుగుబాటు. నీలిమందు వ్యాపారులు దాదాపుగా అందరూ ఐరోపావాళ్లే. గ్రామీణ ప్రాంతాల్లో వాళ్లు నెలకొల్పిన నీలిమందు కర్మాగారాలకు కావలసిన పంటను పండించమని కౌలుదార్లపై వత్తిడి తెచ్చారు. ప్రారంభం నుండీ నీలిమందు పంట నష్టాలకు గురిచేసేదిగానే తయారయ్యింది. అందువల్ల బలవంతంపైన, అతికష్టం మీద చేసే వ్యవసాయంగా మారింది. తృణమో, పణమో అడ్వాన్సుగా రైతుకు ముట్టజెప్పి మోసపూరిత ఒడంబడికలకు గురిచేసేవాళ్లు. నీలిమందు ఫలసాయానికి వాళ్లు చెల్లించేది ఎప్పుడూ మార్కెటు రేటు కంటే తక్కువే. జె.బీ. గ్రాంట్ అనే బెంగాలు లెఫ్టినెంటు గవర్నరు ఈ విషయమై వ్యాఖ్యానించిందేమంటే – 'ఈ మొత్తం సమస్యకు మూలకారణం రైతులకు తగినంత మూల్యం చెల్లించకుండా వాళ్లతో నీలిమందు పంటను పండించాలనే పెనుగులాటే'.[1] తనకున్న పొలం మొత్తంలో మంచి దానిలో అధిక ఆదాయాన్నిందించే వరిపంటను పండించే అవకాశాన్ని రైతుకివ్వకుండా అతడిపై వత్తిడి తెచ్చి నీలి మొక్కల్ని పెంచేట్లు చేసేవాళ్లు. చివరకు అది పండించి అప్పగించే సమయంలో వాళ్లు చెల్లించే ఆ స్వల్ప మూల్యంలో కూడా మళ్లీ మోసాలు. నీలిమందు వ్యాపారులు నియమించిన అధికారులకు మాటి మాటికీ ముడుపులు చెల్లించుకోవలసి వచ్చేది. పంట వేసేందుకు వత్తిడి చేసి అడ్వాన్సు తీసుకునేట్లు చేసేవాళ్లు. తరచుగా రైతు ఆ అడ్వాన్సు మొత్తాన్ని చెల్లించగలిగే వాడు కాదు. ఒకవేళ చెల్లించ గలిగినా వ్యాపారులు బాకీ మొత్తం రద్దు కానిచ్చేవాళ్లు కాదు. అలా అడ్వాన్సుగా యిచ్చిన సొమ్ము పూర్తిగా చెల్లించని కారణంగా మళ్లీ నీలిమందు పంటనే తప్పకుండా పండించవలసిన అగత్యం ఏర్పడేట్లు చేసేవాళ్లు.

బలవంతంగా వ్రాయించుకొన్న మోసపూరిత కాంట్రాక్టుల అమలు కోర్టుల ద్వారా అయితే ఇబ్బంది పడవలసి రావటమేగాక తీర్పు వచ్చేప్పటికి ఏండ్లు, పూండ్లు పట్టవచ్చును గనుక నీలిమందు వ్యాపారులు రైతుల్ని లొంగదీసుకునేందుకు భయోత్పాతాన్ని

సృష్టించేవాళ్లు. రైతుల్ని అపహరించుకుపోవటం, గిడ్డంగులలో బంధించటం, కొరడాలతో కొట్టటం, స్త్రీలపై పిల్లలపై దాడిచేయటం, పశువుల్ని తోలుకుపోవటం, దోపిడీలకు పాల్పడటం, ఇళ్లకు నిప్పంటించటం లేక నేలమట్టం చేయటం, పంటల్నీ పండ్లతోటల్నీ ధ్వంసం చేయటం వంటివి వాళ్లు పాటించే కొన్ని పద్ధతులు. వీటికోసం గూండాల ముఠాలను మేపేవాళ్లు.

ఆచరణలో నీలిమందు వ్యాపారులు న్యాయవ్యవస్థ కంటే పై మెట్టులో ఉండేవారు. ఏదో కొద్ది మందిని మినహాయిస్తే ఎక్కువగా యూరోపియన్లయిన మేజస్ట్రేట్లు తరచుగా నీలిమందు వ్యాపారులతో కలిసి విందులు ఆరగిస్తూ, వేటాడటానికి వెళ్తూండేవాళ్లు. కనుక వాళ్ల పట్లనే సానుకూలత ప్రదర్శించేవాళ్లు. నిష్పక్షపాతంగా వ్యవహరించే మేజిస్ట్రేట్లు బదిలీలకు గురయ్యేవాళ్లు. ఇరవై తొమ్మిది మంది నీలిమందు వ్యాపారులు, ఒకే ఒక్క భారతీయ జమిందారు 1857లో గౌరవ మేజిస్ట్రేట్లుగా నియమితులవడంతో 'మన రక్షకులే మన భక్షకులు' అనే సామెత పుట్టుకొచ్చింది.

బెంగాలులోని నీలిమొక్కల రైతులకు ప్రభుత్వ మద్దతు లభించనున్నదను కోవటంతో 1859 శిశిర ఋతువులో నీలిమందు వ్యాపారులలో అసంతృప్తి భగ్గుమంది. ఒక సాధికారిక లేఖను తప్పుగా చదువుకొని తన అధికారానికి మించి హేమచంద్రకర్ అనే కాలరోవా డిప్యూటీ మేజిస్ట్రేట్ ఆగస్టు 17న పోలీసులకు ఒక అధికార ప్రకటనను ఈ విధంగా పంపాడు. 'నీలి మొక్కల రైతుల విషయంలో వివాదాలు తలెత్తే పక్షంలో వాళ్ల భూములపై వాళ్లకు హక్కులున్నందున వాళ్లకు ఇష్టం వచ్చిన పైర్లు వాళ్లు వేసుకొనవచ్చును. కనుక నీలిమొక్కల వ్యాపారులుగాని, మరెవరయినా గాని ఈ వ్యవహారంలో తలదూర్చకుండా పోలీసులు జాగ్రత్త వహించవలసింది'.

కర్ ప్రకటన విషయం బెంగాల్ అంతటా పాక్కింది. తాము ద్వేషించే విధానాన్ని రూపుమాపేందుకు అదే తగిన అదను అనుకున్నారు రైతులు. శాంతియుత పద్ధతుల ద్వారా తమ సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు రైతులు ముందుగా ప్రయత్నించారు. అధికార యంత్రాంగానికి పలుమార్లు పిటీషన్లు పెట్టుకొన్నారు. శాంతియుత ప్రదర్శనలు నిర్వహించారు. 1859 సెప్టెంబరులో వాళ్ల కోపం భగ్గుమంది. వాళ్ల పొలాల్లో బలవంతంగా నీలిమొక్కల్ని పెంచనవసరం లేదనే వాళ్ల హక్కును పదిలపరచుకొన్నారు. పోలీసుల, న్యాయస్థానాల సాయంతో నీలి మొక్కల వ్యాపారుల, వాళ్ల గూండాల వత్తిడులను తట్టుకోగలిగారు.

నాడియా జిల్లాలోని గోవిందపూర్ గ్రామ రైతులు గతంలో నీలి మొక్కల వ్యాపారుల వద్ద పనిజేసిన దిగంబర బిస్వాస్, విష్ణు బిస్వాస్‌ల నాయకత్వాన నీలిమొక్కల పెంపకం వదిలెయ్యటంతో ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్లయ్యింది. సెప్టెంబరు 13న ఓ వ్యాపారి ఒక వంద మంది గూండాలను రైతులపై దాడి జరిపేందుకు ఆగ్రామం పంపగా అక్కడి రైతులు ప్రతిగా లాఠీలు, బల్లేలు ధరించి ఎదురుదాడి నిర్వహించారు.

రైతుల ఆందోళనలు, నీలి మొక్కల సేద్యం చేపట్టిన వారి సమ్మెలు ఇతర ప్రాంతాలకూ త్వరితగతిన వ్యాపించాయి. వ్యాపారుల నుండి డబ్బులు అడ్వాన్సు రూపంలో తీసుకొని హామీ పత్రాలు వ్రాసి యిచ్చే పద్ధతి కొనసాగింపుకు రైతులు నిరాకరించారు. వాళ్లసలు నీలిమొక్కల పెంపకమే చేపట్టమని శపథం పూనారు. వ్యాపారుల దాడుల నుండి తమని తాము రక్షించుకొనేందుకు చేతికి ఏమిదొరికితే అవి – బల్లేలు, వడిసెలలు, లాఠీలు, విల్లంబులు, ఇటుకలు, వెలగపండ్లు, కుండలు ఉపయోగించేవాళ్లు.

నీలిమొక్కల రైతుల సమ్మెలు, ఆందోళనలు 1860వసంత కాలంలో తిరిగి విజృంభించి బెంగాలులో నీలి మొక్కలు పెంచే అన్ని జిల్లాలను చుట్టుముట్టాయి. వందలాది మంది రైతులు కర్మాగారం తరువాత కర్మాగారం పైకి దాడికి దిగారు. ఒక్కో గ్రామం తనని తాను ధైర్యంగా రక్షించుకోగలిగింది. చాలా చోట్ల పోలీసులు జోక్యం కల్పించుకొని రైతు నాయకులను బంధించబోగా రైతులు పోలీసులపైనా వారి స్థావరాలపైనా తిరగబడ్డారు.

వ్యాపారులు అప్పుడు మరో ఆయుధాన్ని ప్రయోగించారు. వాళ్ల జమిందారీ అధికారాన్ని వినియోగించసాగారు. తిరగబడుతున్న రైతుల్ని జమిందారీ భూముల నుండి తొలగిస్తామనీ, శిస్తుల్ని పెంచేస్తామనీ బెదిరించారు. రైతులు అందుకు ప్రతిగా కౌలు సమ్మెకు దిగారు. పెంచిన కౌలును చెల్లించం పొమ్మన్నారు. వాళ్లను ఆ భూముల నుండి ఖాళీ చేయించే సందర్భాలలో భౌతిక ప్రతిఘటనకు సైతం సిద్ధమయ్యారు. వాళ్ల హక్కులు సాధించుకొనేందుకు న్యాయవ్యవస్థను ఎలా ఉపయోగించుకోవాలో క్రమేపీ అర్థం చేసుకోసాగారు. రైతులంతా ఏకమై నిధులు సేకరించి వాళ్లపై పెట్టిన కేసుల విషయంలో తగిన చర్యలు చేపట్టటమే గాక వాళ్లంతట వాళ్లు వ్యాపారులపై న్యాయ పోరాటానికి దిగారు. వ్యాపారుల నౌకర్లను సాంఘిక వెలివేతతో బెదిరించి వాళ్ల యజమానుల సేవలకు దూరం చేసేవాళ్లు.

చివరకు రైతుల సమైక్య ప్రతిఘటన ధాటికి తట్టుకొనజాలక క్రమేణా వ్యాపారులు వాళ్ల కర్మాగారాలను మూసివేసుకోసాగారు. 1860వ సంవత్సరాంతానికి బెంగాల్‌లోని అన్ని జిల్లాలలో నీలి మొక్కల పెంపకం అక్షరాలా తుడిచిపెట్టుకుపోయింది.

నీలి మొక్కల రైతుల ఆందోళన సఫలీకృతం కావటానికి ప్రధాన కారణాలలో ఒకటి రైతులు ప్రదర్శించిన అత్యద్భుతమైన చొరవ, సహకారం, సంఘటిత కౌశల్యం, క్రమశిక్షణ, మరో ప్రధాన కారణం హిందూ ముస్లిం రైతుల మధ్య సంఘీభావన. ఉద్యమానికి నాయకత్వం బాగా స్థితిపరులైన రైతుల నుండీ మరికొన్ని సార్లు చిన్న చిన్న జమిందారుల నుండి, వడ్డీ వ్యాపారుల నుండి, నీలి మందు వ్యాపారుల వద్ద అంతకుపూర్వం పనిజేసిన ఉద్యోగుల నుండీ లభించేది.

బెంగాలు మేధావుల పాత్ర నీలి మొక్కల పెంపకం విషయంలో పోరాటానికి విలక్షణతను చేకూర్చింది. తిరుగుబాటు చేసే రైతాంగానికి మద్దతుగా మేధావులు శక్తివంతమైన ప్రచారాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున సభలను నిర్వహించారు. రైతుల ఇబ్బందులను ఉటంకిస్తూ మహజర్లు తయారుచేసారు. రైతులు న్యాయవ్యవస్థ ద్వారా నెరపే పోరాటంలో తగిన సాయమందించేవాళ్లు. "హిందూ పేట్రియాట్" పత్రికా సంపాదకుడు హరీష్‌చంద్ర ముఖర్జీ పాత్ర ఈ విషయంలో ఉత్కృష్టం. గ్రామీణ ప్రాంతాల్లోని పత్రికా ప్రతినిధులు వ్యాపారులు చేపట్టే అణచివేత కార్యక్రమాల గూర్చి, అధికారుల వాటాలనుగూర్చి, రైతుల ప్రతిఘటనను గూర్చి నిత్యం పంపే వార్తల్ని ప్రచురించేవాడు. అవేగాక తనకు తానుగా భావావేశంతో, కోపంతో సమస్య పట్ల లోతైన అవగాహనతో వ్రాసి ఆ ఉద్యమాల కొక ఉన్నత రాజకీయ స్థాయిని సిద్ధింపజేసాడు. తిరుగుబాటుకు గల చారిత్రక, రాజకీయ ప్రాముఖ్యతను వెల్లడిస్తూ 1860లో ఆయన వ్రాసిందే మంటే – 'బెంగాల్ తన రైతాంగాన్ని చూచి గర్విస్తుంది.... ఏ ఇతర దేశ సాంఘిక చరిత్రలోనయినా సంభవించిన ఏ విప్లవానికీ ప్రాముఖ్యతలోగానీ, విస్తరణలోగానీ తీసికట్టుగాని ఒక విప్లవాన్ని బెంగాల్ రైతాంగం తమ అధికారం కోసం, సంపద కోసం రాజకీయ పరిజ్ఞానం కోసం, చివరకు నాయకత్వం కోసం కూడా నిర్వహించారు.... ప్రభుత్వం కన్నెర్రజేసినా, చట్టం వ్యతిరేకతను ప్రదర్శించినా ట్రిబ్యునళ్లు అననుకూలంగా వున్నా, పత్రికా ప్రపంచం వ్యతిరేకంగా వ్యవహరించినా వాళ్ల కృషి ఫలించింది. వాళ్లందించిన ఫలాలు మనదేశంలోని సకల శ్రేణులకూ, ఎన్నెన్నో భవిష్యత్ తరాల వారికి అందుతాయి.

వ్యాపారుల దురాగతాల్ని కళ్లకుకట్టినట్లు చిత్రించిన దీనబంధు మిత్ర రచించిన నాటకం "నీల్ దర్పణ్" ఎంతో గొప్ప ఖ్యాతినార్జించింది.

నీలిమందు తిరుగుబాటులో మేధావుల పాత్ర అప్పుడప్పుడే ఉద్భవిస్తున్న జాతీయవాద మేధావులపై స్థిరమైన ప్రభావాన్ని ప్రసరింపజేసింది. తమ రాజకీయ శైశవంలోనే వాళ్లు విదేశీయ వ్యాపారులకు వ్యతిరేకంగా ప్రసిద్ధమైన రైతు ఉద్యమానికి మద్దతునిచ్చిన అనుభవాన్ని కలిగివున్నారు. ఇది జాతీయోద్యమానికి కావలసిన దీర్ఘకాలిక ఇమిడికను సంప్రదాయ బద్ధంగా రూపొందింపజేయనుంది.

క్రైస్తవ మత ప్రచారకులు కూడా నీలి తోటల రైతులకు వాళ్ల పోరాటంలో బాగా మద్దతు పలికారు.

ప్రభుత్వ పరంగాచూస్తే సామాజిక తిరుగుబాటు పట్ల, ఆదివాసీ ఆందోళనపట్ల అవలంబించిన కఠిన వైఖరి రైతు ఉద్యమాల సందర్భంగా అవలంబించలేదు. కొంత నిగ్రహం పాటించటం జరిగింది. అదింకా సంతాల్ తిరుగుబాటు, 1857 తిరుగుబాట్ల క్లిష్ట పరిస్థితుల అనుభవాల నుండి ఇంకా తేరుకొనలేదు. కాలక్రమేణా రైతాంగంలో మార్పు చెందిన స్వభావాన్ని ఆకళింపు చేసుకొంది. మేధావులు, మిషనరీలు రైతాంగ ఉద్యమానికి మద్దతు పలకటం ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపింది. నీలి మొక్కల సాగు సమస్యలపై విచారణ నిమిత్తం ప్రభుత్వం ఓ విచారణ సంఘాన్ని నియమించింది. ఆ కమిషన్ ముందుకు వచ్చిన ఋజువులు, ఆ కమిషన్ తుది నివేదిక నీలి మొక్కల సాగులో కొనసాగిన అవినీతి, బలాత్కారాలను బట్టబయలు చేసాయి. తత్ఫలితంగా ఆ విధానంలోని ప్రధాన దుర్వినియోగాలను అరికట్టటం జరిగింది. 1860లో ప్రభుత్వం జారీ చేసిన ప్రకటన ప్రకారం నీలి మొక్కల్నే సాగు చేయాలనే వత్తిడి రైతులపై తేరాదు. వివాదాలన్నీ న్యాయస్థానాల ద్వారానే పరిష్కారం కావలసి ఉంది. కానీ అప్పటికే వ్యాపారులు తమ కర్మాగారాలను మూసివేయసాగారు– వత్తిడి, వంచన లేకుండా వాళ్ల వ్యాపారం లాభసాటిగా వుండదని వాళ్లు భావించారు.

* * *

1870వ దశకంలోనూ 1880వ దశకపు తొలి వత్సరాలలోనూ తూర్పు బెంగాలులోని చాలా ప్రాంతాన్ని వ్యవసాయ దారుల ఆందోళనలు చుట్టుముట్టాయి. దాని క్కారణం జమిందారులు చట్ట పరిధుల్ని దాటి కౌలును విపరీతంగా పెంచే ప్రయత్నాలు చేయటమే గాక 1859 నాటి చట్టం (10) ప్రకారం రైతులకు లభించే స్వాధీన హక్కుల్ని అడ్డుకోవటం; బలవంతంగా రైతుల్ని వాళ్లు సాగు చేసే భూముల్నుండి వెళ్లగొట్టటం, పండిన పంటను లాగేసుకోవటం; దౌర్జన్యంగా పశువుల్ని తోలుకుపోవటం,

అమితంగా ఖర్చు చేయవలసి వచ్చే దావాల్లోకి రైతుల్ని లాగటం వంటి చట్టబద్ధత లేని విపరీత చర్యలకు జమిందారులు పూనుకోవటమే అవుతుంది.

ఆ విధమైన అణచివేత చర్యల్ని యింక ఏమాత్రం సహించేందుకు రైతులు సిద్ధంగా లేరు. 1873 మే మాసంలో రైతు సంఘమో లేక సమ్మేళనమో జమిందారుల విపరీత కోర్కెల్ని అదుపు చేసేందుకు యూసఫ్ షాహీ పరగణాలోని పబ్నా జిల్లాలో ఆవిర్భవించింది. ఆ సంఘం భారీ ఎత్తున రైతు సదస్సులు నిర్వహించింది. రైతులు పెద్ద సంఖ్యలో పోగై జమిందార్లకు భయం కలిగేట్లు ఊరేగింపులు నిర్వహిస్తూ రైతుల్ని వాళ్లతో కలిసి సాగమని విజ్ఞప్తి చేసేవాళ్లు. ఆ సంఘం కౌలు సమ్మెనొకదానిని నిర్వహించింది. దానితో రైతులు పెంచిన కౌళ్లను చెల్లించ నిరాకరించారు. జమిందారులపై న్యాయస్థానాల్లో సవాలు చేసారు. ఖర్చుల కోసం రైతుల నుండి చందాలు పోగు చేసారు. నిదానంగా పోరాటం పబ్నా జిల్లాకే గాక తూర్పు బెంగాలులోని మిగతా జిల్లాలకు వ్యాపించింది. ప్రతి చోటా రైతు సంఘాలు నెలకొన్నాయి. కౌళ్ల చెల్లింపు నిలిచిపోయింది. జమిందారులు కోర్టులకెక్కారు. ప్రధానంగా పోరాటం న్యాయపోరాటంగా రూపుదిద్దుకొంది. పోరాటం హింసాత్మకం కాలేదు. జమిందార్లు వాళ్ల షరతుల్ని రైతులు అంగీకరించేట్లు జులుం చేస్తున్న సందర్భాల్లో మాత్రం హింస చోటు చేసుకునేది. జమిందార్ల ఇళ్లు కొల్లగొట్టిన సందర్భాలు బహు స్వల్పం. బహుకొద్ది స్టేషన్లపై దాడి వెడలటం జరిగింది. కోర్టు డిక్రీలు అమలు పరిచే ప్రయత్నాలను రైతులు అడ్డుకోవటం జరిగేది. అయితే అటువంటి ఘటనలు అరుదు. ఎవరైనా జమిందారునుగానీ, అతని ప్రతినిధినిగానీ, చంపటం గానీ, తీవ్రంగా గాయపరచటం గానీ జరగలేదు. ఈ ఉద్యమ నిర్వహణలో రైతులు చట్టపరమైన అవగాహనను పెంచుకొన్నారు. వాళ్ల హక్కులను గురించి తెలుసుకోగలిగారు. సంఘటితపడేందుకు, శాంతియుత పోరాటాలు నిర్వహించేందుకు, సంఘ నిర్మాణానికి కావలసిన శక్తిని సమకూర్చుకొన్నారు.

1885వ సంవత్సరం వరకు రైతులలో అసంతృప్తి రగులుతున్నా అధికారుల వత్తిడితో కొంత, ప్రోద్బలంతో మరికొంత, సంఘటిత రైతాంగం తమను అధిక వ్యయంతో కూడిన, దీర్ఘకాలికంగా కొనసాగే దావాలలోకి లాగుతుందేమోననే భయం జమిందారులలో నెలకొనటం వల్ల చాలా వివాదాలకు పరిష్కారం లభిస్తూండేది. రైతులు చాలా మంది స్వాధీన హక్కుల్ని పొందగలిగారు. అధిక కౌళ్లను నిలువరించగలిగారు.

హింస చోటుచేసుకొనే తరుణంలో ప్రభుత్వం జమిందారులకు రక్షణ కల్పించేది. రైతులు పెద్ద సంఖ్యలో నిర్బంధించబడేవాళ్లు. శాంతియుత పోరాటాల సందర్భంగానో, కోర్టుల ద్వారా పోరాటాల సందర్భంగానో అయితే పరిస్థితి తటస్థంగా వుండేది. జమిందారీ జులుం నుండి రైతుల్ని కాపాడేందుకు ప్రభుత్వం చట్టం తెస్తానని వాగ్దానం చేసింది. అయితే 1885లో బెంగాల్ కౌలుదారీ చట్టం అమలులోకి తెచ్చిన సందర్భంగా ఆ వాగ్దానం అసంపూర్తిగా నెరవేర్చింది.

అటు జమిందార్లనూ, ఇటు వలస పాలకులనూ సమాధానపడేట్లు ప్రోద్భలాన్ని అందించిన అంశమేమంటే – రైతుల తక్షణ యిబ్బందులకు తగిన నివారణ చర్యలు గైకొనటమే ఉద్యమ ఉద్దేశ్యం కావటం; చట్టం ద్వారా లభించిన హక్కుల్ని, నియమాల్ని మాత్రమే అమలు పర్చవలసిన అవసరం ప్రభుత్వానికి ఏర్పడటం. ఉద్యమం జమిందారీ వ్యవస్థపై ఎక్కుపెట్టలేదు. అలాగే వలస వ్యతిరేక రాజకీయ మలుపు తిరగలేదు. రైతు సంఘాలు చట్టబద్ధంగా వ్యవహరించాయి. జమిందారులను ఎదుర్కొనేందుకు న్యాయ వ్యవస్థనే వాడుకుంది. బ్రిటీషు వ్యతిరేక అభ్యర్థనలను వెల్లడించలేదు. రైతు నాయకులు పలుమార్లు తాము జమిందారులకు వ్యతిరేకులమేగాని బ్రిటీషు ప్రభుత్వానికి కాదని వాదించారు. వాస్తవానికి రైతు నాయకుల నినాదమేమంటే – మా రైతులు 'మహారాణి రైతులుగానే మనాలి గాని వేరొకరి రైతులుగా కాదు". ఈ కారణంగా అధికార చర్యలన్నీ భారతీయ శిక్షా స్మృతి ననుసరించి చేపట్టవలసి వచ్చింది. అందువల్ల గతంలో సంతాల్, ముండా ఉద్యమాల సందర్భంగా సాయుధ బలగాల్ని వాడినట్లు ప్రభుత్వం ఇక్కడ వాడలేదు.

రైతులలో అత్యధికులు ముస్లిములు. జమిందారుల్లో అత్యధికులు హిందువులు. అయినా బెంగాల్ రైతులు మళ్లీ సంపూర్ణంగా హిందూ ముస్లిం ఐక్యతకు కట్టుబడ్డారు. కుల మత ప్రాతిపదికన రైతు సంఘటనకు కృషి చేయవలసిన అవసరం లేకపోయింది.

ఈ సందర్భంగా కూడా అనేక మంది భారతీయ యువ మేధావులు రైతుల వాదాన్ని సమర్థించారు. అలా సమర్థించిన వాళ్లలో బంకించంద్ర చటర్జీ, ఆర్.సి. దత్ వంటి వారున్నారు. తరువాత 1880లలో బెంగాలు కౌలు చట్టంపై చర్చ జరుగుతున్న సందర్భంలో సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహనబోస్, ద్వారకానాధ్ గంగూలీల నాయకత్వాన ఇండియన్ అసోసియేషన్ రైతుల హక్కుల కోసం ప్రచారం చేపట్టింది. రైతుసంఘాలు నెలకొల్పేందుకు సాయపడింది. కౌలు చట్టానికి మద్దతు పలుకుతూ జిల్లాలలో 20,000 వరకూ రైతులు హాజరయ్యే మహాసభలు నిర్వహించింది. ఇండియన్ అసోసియేషన్, జాతీయ వార్తా పత్రికల కృషి కౌలుదారీ చట్టసదుపాయాల్ని

అధిగమించింది. కౌలును శాశ్వత ప్రాతిపదికపై నిర్ణయించాలని కోరాయి. సేద్యం చేయని వారికి కూడా స్వాధీన హక్కుల్ని ధారాదత్తం చేసే అవకాశం ఉన్నందున దళారీ వ్యవస్థ పెరుగుదలకు అవకాశమిస్తుందనే హెచ్చరికలు జారీ చేసాయి. భూమిని దున్నేవారిని జోతేదార్లనే దళారీలు జమిందార్ల మాదిరే అణచివేయగలవన్నాయి. కనుక స్వయంగా భూమిని దున్నే వానికే జిరాయితీ హక్కుండాలని, ఆ హక్కు సన్నకారు రైతులకూ, ఇచ్ఛాధీన కౌలుదార్లకూ అధికంగా కల్పించాలని కోరాయి.

* * *

1875లో మహారాష్ట్రలోని పూనా, అహ్మద్‌నగర్ జిల్లాల్లో ఓ బ్రహ్మాండమైన రైతాంగ తిరుగుబాటు జరిగింది. ఇక్కడ రైత్వారీ విధానంలో భాగంగా భూమిశిస్తు సరాసరి రైతు పేరిటే నిర్ణయించి ఆ భూమికి అతడినే హక్కుదారుగా గుర్తించటం జరిగింది. మిగతా రైత్వారీ ప్రాంతాల్లోని రైతుల మాదిరే దక్కను రైతులూ వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకొనకుండా భూమిశిస్తు చెల్లించే అవకాశం లేకపోవటంతో భూమిని కోల్పోవలసి వచ్చింది. అది రైతులకూ, వడ్డీ వ్యాపారస్తులకూ మధ్య ఉద్రిక్తత పెరగటానికి దారితీసింది. వడ్డీ వ్యాపారులు ఎక్కువ మంది బయటి వాళ్లే – మార్వాడీలు, గుజరాతీలు.

ఈ సమయంలోనే మరో మూడు ఘటనలు జరిగాయి. 1860లలో అమెరికా అంతర్యుద్ధం ప్రత్తి ఎగుమతులకు దారితీయగా, ప్రత్తి ధరలు విపరీతంగా పెరిగాయి. 1864లో అంతర్యుద్ధం సమసిపోవటంతో ప్రత్తి ఎగుమతులు మందగించి ధరలు బాగా పడిపోయాయి. రైతులు నిలదొక్కుకోలేక పోయారు. దీనికి తోడు 1867లోప్రభుత్వం దాదాపు 50 శాతం వరకు భూమి శిస్తును పెంచింది. పైగా వరసగా పంటలు సరిగా పండకపోవటంతో పరిస్థితి దారుణంగా తయారయింది.

అటువంటి పరిస్థితుల్లో భూమిశిస్తు చెల్లించేందుకు రైతులు వడ్డీ వ్యాపారిని ఆశ్రయించవలసి వచ్చింది. అదే అదునుగా భావించిన వడ్డీ వ్యాపారి తన పట్టును రైతుపైనా, అతని భూమిపైనా మరింతగా బిగించాడు. రైతు తన కష్టాలకు మూలకారణం వడ్డీ వ్యాపారి అని గుర్తెరిగి వ్యతిరేకించసాగాడు. నిప్పురాజేసేందుకు ఒక రవ్వ చాలు.

1874 డిసెంబర్‌లో సిరూర్ తాలూకాలోని కర్డా గ్రామంలో స్వయం ప్రేరక ఉద్యమం ఒకటి ప్రారంభమయ్యింది. కాలూరామ్ అనే వడ్డీ వ్యాపారి కోర్టు డిక్రీని అనుసరించి ఒక రైతు ఇంటిని కూల్చకుండా చూచేందుకు అతడికి నచ్చజెప్పటంలో ఆగ్రామస్థులు విఫలం కావటంతో శాంతియుత పద్ధతుల్లో తమ డిమాండ్‌ను

అంగీకరింపజేసేందుకు పరాయి వాళ్ళైన వడ్డీ వ్యాపారులపై సాంఘిక బహిష్కరణా కార్యక్రమాన్ని చేపట్టారు. వాళ్ల దుకాణాల్నుండి సరుకులు కొనేందుకు అందరూ వ్యతిరేకించారు. వాళ్ల పొలాల్ని ఏ ఒక్క వ్యవసాయ దారుడూ దున్నేందుకు సిద్ధం కాలేదు. గ్రామంలోని మంగలి, చాకలి, వడ్రంగి, కమ్మరి, చర్మకారుల వంటి వృత్తి పనివాళ్లు, వాళ్ళకు సేవలు చేయ నిరాకరించారు. ఇంట్లో పనిచేసే పనివాళ్లు కూడా ఎగనామం పెట్టటంతో సాంఘికంగా ఒంటరి తనాన్ని అనుభవించే వడ్డీ వ్యాపారులు తాలూకా ముఖ్య పట్టణానికి తరలివెళ్దామంటే ఎద్దులబండ్లు ఎవ్వరూ కట్టనన్నారు. ఒక వేళ గ్రామస్థుల్లో ఎవరైనా బహిష్కరణ కార్యక్రమంలో పాల్గొనకుండా వడ్డీ వ్యాపారులకు సాయం చేస్తే తప్పు వేస్తామన్నారు. ఈ రకమైన సాంఘిక బహిష్కరణ త్వరితగతిన పూనా, అహ్మద్‌నగర్, షోలాపూర్, సతారా జిల్లాలోని గ్రామాలకు పాకిపోయింది.

సాంఘిక బహిష్కరణ శక్తిమంతం కాజాలని తావుల్లో అది వెనువెంటనే రైతుల దొమ్మీగా రూపాంతరం చెందేది. మే 12వ తేదీన భీంతరి తాలూకాలోని సూపాగ్రామంలో సంత జరిగే ఓ రోజున రైతులందరూ కలిసి పథకం ప్రకారం వడ్డీ వ్యాపారుల ఇళ్లపైన దుకాణాలపై దాడిచేశారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొనో, వాళ్లను బలవంత పెట్టో, మోసం చేసో వ్రాయించుకొన్న నోట్లు, పత్రాలు, కోర్టు డిక్రీలు, రుణాలకు సంబంధించిన యితర పత్రాలు అన్నీ అందరూ చూస్తుండగానే బయటకు తెచ్చి తగుల బెట్టారు. వారం తిరక్కుండానే అల్లర్లు పూనా అహ్మద్‌నగర్ జిల్లాలోని యితర గ్రామాలకు అల్లుకుపోయాయి.

ఈ విధమైన పరిష్కారంలో హింస అంతగా చోటు చేసుకోదు. బలవంతంగా రాయించుకొన్న ఋణపత్రాల్ని వడ్డీ వ్యాపారులు ఎప్పుడయితే అప్పగించేస్తారో అప్పుడు ఇంకా హింసకు తావేముంది? చాలాచోట్ల రైతుల దొమ్మీలన్నీ తాము కొత్తగా పొందిన ఐకమత్య బలం ప్రదర్శించటానికే అన్నట్లు సాగేవి. సూపాలో వడ్డీ వ్యాపారుల ఇళ్లు, దుకాణాలు కొల్లగొట్టి వాటికి నిప్పటించినా మిగతా చోట్ల అలా జరగలేదు.

ప్రభుత్వం హుటాహుటిన రంగంలోకి దిగి ఉద్యమాన్ని అణచగలిగింది. రమారమి మూడు వారాలు మాత్రమే. ఉద్యమం క్రియాశీలంగా కొనసాగింది. చెదురుమదురు ఘటనలు మాత్రం మరోనెలా రెండునెల్లవరకూ జరుగుతూ వచ్చాయి. పబ్నా తిరుగుబాటు వలెనే దక్కన్ అల్లర్లకు కూడా లక్ష్యాలు స్వల్పమే. ఇక్కడ కూడా వలస వ్యతిరేక స్పృహలేదు. కనుక వలస ప్రభుత్వం దక్కన్ అగ్రికల్చరిస్ట్స్ రిలీఫ్ యాక్టు, 1879 ద్వారా వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా రైతులకు కొంత రక్షణ కల్పించటం సాధ్యపడింది.

మళ్లీ మహారాష్ట్రలోని ఆధునిక జాతీయ మేధావి వర్గం రైతులను సమర్థించింది. 1873–74 ప్రాంతంలో జస్టిస్ రానడే నాయకత్వాన పూనా సార్వజనిక సభ రైతు ఉద్యమం నడపటంలో సఫలీకృతం కావటమే గాక 1867 నాటి భూమి శిస్తు సెటిల్‌మెంటును వ్యతిరేకిస్తూ పూనా, బొంబాయిలలో ప్రదర్శనలు నిర్వహించింది. దాని ప్రభావంతో పలువురు రైతులు పెంచిన శిస్తును చెల్లించేందుకు నిరాకరించారు. ఈ ఆందోళన రైతుల్లో ప్రతిఘటించే శక్తిని పెంపొందించటంతో అది 1875లో రైతు ప్రతిఘటనలకు దారితీసింది. పూనా సార్వజనిక సభతో పాటు అనేక జాతీయవాద వార్తా పత్రికలు దక్కన్ అగ్రికల్చరల్ రిలీఫ్ బిల్లును సమర్థించాయి.

* * *

రైతు ప్రతిఘటనలు దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ వృద్ధిచెందాయి. మలబార్‌లో మప్పిలా విస్ఫోటనాలు ప్రాంతీయమైనవే. వాసుదేవ బల్వంత ఫాడ్కే విద్యావంతుడైన గుమస్తా. అతను 1879లో ఒక 50 మందితో రామ్‌సోయి రైతు బలగాన్ని మహారాష్ట్రలో నిర్మించి సామాజిక దొమ్మీని పెద్ద ఎత్తున నిర్వహించాడు. పంజాబులో బాబా రాంసింగ్ నేతృత్వంలో సాగిన కూకా ప్రతిఘటన మత పరమైన ఉద్యమ లక్షణాలను సంతరింపజేసుకుంది. 1872లో సైనిక దళం 49 మంది విప్లవకారుల్ని కాల్చివేయటంతో ఆ ఉద్యమం అడుగంటింది. 1893–94 ప్రాంతాల్లో అస్సాంలోని పలు ప్రాంతాల్లో అధిక భూమిశిస్తు ఆందోళనలకు దారితీసింది. పాశవిక కాల్పుల్లో బాయ్‌నెట్ పోట్లల్లో అనేక మంది అసువులు బాసారు.

* * *

1857 తరువాత రైతు ఉద్యమాల స్వభావంలో కొంత మార్పు పొడసూపింది. యువరాజుల్ని, జమిందారుల్ని, భూస్వాముల్ని గెంటివేసో, ప్రక్కనబెట్టో రైతులే ఉద్యమాలలో ప్రధాన శక్తిగా రూపొందారు. వాళ్లిప్పుడు సరాసరి వాళ్ల హక్కుల కోసం పోరాడసాగారు. వాళ్ళు తమ దృష్టినంతా ఆర్థిక అంశాలపైనా, విదేశాలకు చెందిన తోటల యజమానులు, దేశీయ జమిందార్లు, వడ్డీవ్యాపారులు వంటి శత్రువర్గంపైనా కేంద్రీకరించసాగారు. వాళ్ల పోరాటాలన్నీ నిర్దిష్ట లక్ష్యసాధన దిశగా, పరిష్కారాల అన్వేషణ దిక్కుగా సాగాయి. వలస పాలనను వ్యతిరేకించటం వాళ్ల లక్ష్యం కూడా కాలేదు. పరాధీనతను, దోపిడీని తొలగించుకోవటం కూడా వాళ్ల లక్ష్యం కాలేదు. వాళ్లు లోకాన్ని తల్లక్రిందులు చేయాలనుకోలేదు.

ఈ ఉద్యమాల సరిహద్దులు కూడా చిన్నవే. ఏవో కొన్ని ప్రాంతాలకు పరిమితమై, ఒక ప్రాంతానికీ మరో ప్రాంతానికీ సమాచార వ్యవస్థ కొరవడి సంబంధాలు లేకుండా సాగేవి. దీర్ఘకాలిక వ్యవస్థ రూపొందనందున పోరాటాలకు కొనసాగింపు లేకుండా పోయింది. పరిమితమైన వాళ్ల పోరాట ఆశయం నెరవేరగానే ఆ సంఘ నిర్మాణం, రైతులలోని సంఘీభావం అన్నీ ఆవిరైపోయేవి. ఆ విధంగా నీలి తోటల పెంపకం దార్ల సమ్మె, పబ్నా రైతు సంఘాలు, దక్కన్ రైతుల సంఘ బహిష్కరణా కార్యకలాపాలు అనుయాయుల్ని మిగుల్చుకోలేదు. కనుకనే అవి ఏదశలో కూడా బ్రిటీషు ఆధిపత్యాన్ని ఎదిరించటం గానీ, చిన్న చూపు చూడటం గానీ జరగలేదు.

1857 తరువాత రైతు తిరుగుబాట్లు సామాజిక స్థితిగతులపై అప్పటి కప్పుడు స్పందించి చేసేవిగా ఉండిపోయాయి. దానికి కారణాలు – భరించరాని అణచివేతలు, అసహజమూ అనవసరమూ అయిన దోపిడీలు, సమాజంలో రైతులకు అప్పటి వరకూ గల సుస్థిరమైన స్థానం పోతుందేమోనన్న భయం. నడుస్తున్న విధంగా మరింకే మాత్రం నడిచేందుకు వీలులేదని భావించిన పరిస్థితుల్లో మాత్రమే రైతులు తిరగబడటం జరిగింది.

ఏది న్యాయ సమ్మతమో ఏదికాదో, ఏది సమర్థనీయమో ఏదికాదో అనే దృఢమైన అభిప్రాయాలకు రైతు చలించేవాడు. అందువల్లనే అతను భూమికి స్వంతదారు కావాలనో, భూస్వామ్య వ్యవస్థ రద్దుకావాలనో పోరాడలేదు. కేవలం తాను సేద్యం చేసే భూమి నుండి తొలగించటాన్నీ, భరించలేని విధంగా కౌలును పెంచడాన్ని మాత్రమే వ్యతిరేకించాడు. అదే విధంగా తాను అప్పు చేసిన మొత్తాలపై వడ్డీ చెల్లింపుకు తనకు అభ్యంతరం లేదుగాని వడ్డీ వ్యాపారి తలపెట్టే మోసాలకు, వేసే ఎత్తులకు ఎదురు తిరిగాడు. తన భూమిని వడ్డీ వ్యాపారి సంప్రదాయానికి విరుద్ధంగా కబళిస్తున్నాడని పసిగట్టగానే ఎదురుతిరిగాడు. అతనెన్నడూ శిస్తు వసూలు చేసే హక్కు ప్రభుత్వానికి లేదనలేదు. అయితే శిస్తు పరిమితులు సంప్రదాయాలను దాటి భరించలేని స్థితికి చేరినప్పుడే తిరగబడ్డాడు. విదేశీ వ్యాపారి తన జమిందారు కావటాన్ని తాను అడ్డుకొనలేదు. అయితే తాను కష్టించి చెమటోడ్చి వ్యవసాయం చేసే భూమిలో తనకు ఇష్టం వచ్చిన పంట పండించుకొనే స్వేచ్ఛ కోల్పోయినప్పుడు తాను పండించిన పంటకు తగిన ప్రతిఫలం ముట్టజెప్పనప్పుడు ప్రతిఘటించాడు.

రైతు తన చట్టపరమైన హక్కులను గూర్చిన అవగాహనను బాగా పెంపొందించుకొని కోర్టులోపలా, బయటా వాటిని గూర్చి బాగా నొక్కి చెప్పసాగాడు. తన చట్టపరమైన హక్కుల్ని తనకు గాకుండా చేసేందుకు చట్టాలలోనూ,

న్యాయస్థానాలలోనూ తారుమారుచేసే చట్ట బాహ్య చర్యలకు పాల్పడినప్పుడు తానూ తనకు అందుబాటులో వున్న చట్ట బాహ్య చర్యలతో ఎదుర్కొనేవాడు. చట్టపరమైన అధికార యంత్రాంగం తన చర్యల్ని ఆమోదిస్తున్నదనీ, అలా కాకుంటే కనీసం తనప్రతిపాదనలకు లేదా అభియోగానికి మద్దతు పలుకుతున్నదని పలుమార్లు భావించేవాడు. ఇక్కడ చర్చించిన మూడు ఉద్యమాలలోనూ తాను సర్కారుకు అనుగుణంగానే చర్యలు గైకొన్నాడు.

ఈ ఉద్యమాలలో భారతీయ రైతులు గొప్ప సాహసాన్నీ, త్యాగ నిరతినీ, గణనీయమైన వ్యవస్థాపర దక్షతనూ, కులాలకూ, మతాలకూ అతీతమైన ఏకీభావాన్నీ ప్రదర్శించారు. వలస ప్రభుత్వం నుండి పేర్కొన దగినంతగా రాయితీలను రాబట్టుకోగలిగారు. వలస ప్రభుత్వం కూడా రైతులు సరాసరి తిరగబడి తొడ చరచనందున రాజీ ధోరణితో వ్యవహరిస్తూ వలస విధానపు ఆర్థిక రాజకీయ చట్రానికి లోబడే వ్యవసాయ విధానంలోని కాఠిన్యాలను తొలగించేందుకు సంసిద్ధమయింది. ఈ విధంగా చూస్తే 1857 తరువాత రైతు ఉద్యమాల పట్ల వలస ప్రభుత్వం వ్యవహరించిన తీరుకూ, వలస రాజకీయ అధికారాన్ని సరాసరి ఢీకొన్న ప్రజాపోరాటాల పట్ల, 1857 తిరుగుబాటు పట్ల, గిరిజన తిరుగుబాట్ల పట్ల ప్రవర్తించిన తీరుకూ గుణాత్మకంగా చాలా తేడా ఉంది.

19వ శతాబ్దపు రైతు ఉద్యమాల ప్రధాన బలహీనత ఏమంటే వలసవాదం దాని ఆర్థిక రాజకీయ వ్యవస్థ పట్లేగాక ఉద్యమాల సామాజిక నిర్మాణం పట్ల గూడా తగినంతగా అవగాహన లేకపోవటం. కొత్తగా ఏర్పాటైన వలస పాలిత సమాజాన్ని విశ్లేషించి తదనుగుణంగా ఒక నూతన సిద్ధాంతాన్ని రూపొందించి 19వ శతాబ్ది రైతులు ఒక నవ్యసామాజిక ఆర్థిక, రాజకీయ కార్యక్రమాన్ని కొనసాగించిందీ లేదు. వాళ్ల పోరాటాలు ఎంతటి సమరశీలమైనా అవి పాత సామాజిక వ్యవస్థ పరిధిలోపలే నిర్వహింపబడినాయి. ప్రత్యామ్నాయ సమాజాన్ని గూర్చిన ఓ సానుకూల దృక్పథం కొరవడింది. అటువంటి దృక్పథం ప్రజల్ని విస్తృతమైన ప్రాంతీయ ఉద్యమాలకు, అఖిల భారత స్థాయిలో దీర్ఘకాలిక రాజకీయ ఉద్యమాలకు ప్రజల్ని ఉమ్మడి పోరాటం దిశగా ఏకీకృతం చేయగలిగేది. అటువంటి వినూత్న దృక్పథాన్ని, సమాజాన్ని గూర్చిన సరికొత్త దృష్టిని ఆధారం చేసుకొని జాతీయ స్థాయి రాజకీయ కార్యకలాపాలలో సంఘటితపడిన తంత్రుల్ని, మిగతా ప్రజల్ని తాము రూపొందించిన పోరాటంలో భాగస్వాముల్ని చేయగల జాతీయ నాయకత్వం ఆవిర్భవించి వుండేది. అటువంటి

సిద్ధాంతం, కార్యక్రమం, నాయకత్వం, పోరాట వ్యూహరచన లేనందువల్ల వలస ప్రభుత్వానికి ఒక వైపునుండి రాజీ మార్గాన నడుస్తూ ఏవో కొన్ని రాయితీలు ప్రకటిస్తూ రైతు ఉద్యమాలను చల్లార్చుతూ మరో ప్రక్క బలాన్ని ప్రయోగిస్తూ ఉద్యమాన్ని అణచగల్గటం పెద్ద కష్టమేమీ కాలేదు. ఈ బలహీనత రైతాంగపు ప్రవర్తనపై ఓ మచ్చగా భావించరాదు. కొత్తగా, సంక్లిష్టంగా రూపుదిద్దుకొన్న వలస విధానాన్ని రైతాంగం తమకు తాముగా అర్థం చేసుకోలేక పోయారు. దానికి ఆధునిక మేధావి వర్గపు ఆసరా ఎంతో అవసరం. అయితే ఆ వర్గం అప్పుడింకా ఆవిర్భావ దశలోనే ఉంది.

ఇరవయ్యవ శతాబ్దంలో రైతుల అసంతృప్తి సామ్రాజ్యవాద వ్యతిరేకతతో కలగలిసి వాళ్ల రాజకీయ కార్యకలాపాలు కూడా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఒక భాగం అయినందున చాలా బలహీనతల్ని అధిగమించే వీలు చిక్కింది. జాతీయోద్యమంలో రైతులుకూడా పాల్గొనటంతో విదేశీ పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటానికి బలం చేకూరటమే గాకుండా వాళ్ల వర్గానికి చెందిన హక్కుల సాధనకై శక్తివంతమైన పోరాటాలను నిర్వహించేందుకు, ఆధునిక పద్ధతిలో రైతు సంఘాలు నిర్మించుకునేందుకు రైతులకు అవకాశం లభించినట్లయింది.

* * *

# 4 కాంగ్రెసు స్థాపన : వూహాజనిత వాదన

1885 డిసెంబర్‌లో 72 మంది రాజకీయ కార్యకర్తలు భారత జాతీయ కాంగ్రెసును స్థాపించుకున్నారు. భారత జాతీయతకు అఖిల భారత స్థాయిలో అలా తొలి సంస్థాగత రూపం ఏర్పడింది. దీని స్థాపనలో ఏ.ఓ. హ్యూమ్స్ అనే పదవీ విరమణ గావించిన ఆంగ్లేయ ఐ.సీ.యస్. అధికారి ప్రముఖ పాత్ర పోషించాడు. అయితే ఆ 72 మందితోనే అదెందుకు స్థాపింపబడింది? ఆ సమయంలోనే ఎందుకు స్థాపింపబడింది?

ఈ ప్రశ్న చుట్టూ ఒక శక్తి మంతమైన, పదికాలాల పాటు నిలువగల సురక్ష కవాటపు వూహాజనిత వాదన రూపు దిద్దుకుంది. తరతరాలుగా విద్యార్థులు, రాజకీయ క్రియాశీలురు ఈ కల్పన పైనే ఆధారపడినారు. ఈ కల్పనకు బహుళ ప్రజాదరణతో కూడిన నమ్మిక తప్ప చారిత్రక వాస్తవపు భూమికలేదు.

ఆ వాదన ఏమంటే – ఏ.ఓ. హ్యూమ్, యితరులు కలిసి భారత జాతీయ కాంగ్రెసును ప్రారంభించింది సాక్షాత్తు అప్పటి వైస్రాయి లార్డ్ డఫ్రెన్ సాధికారిక నిర్దేశం, మార్గదర్శకత్వం, సూచనల మేరకేనని. దానికి కారణం ప్రజామోదాన్ని పొంది హింసాత్మక విప్లవంగా రూపొందేందుకు ప్రజలలో పెల్లుబుకుతున్న అసంతృప్తిని మళ్లించే రాజ్యాంగ బద్ధమైన మార్గం లేక 'సురక్ష కవాటం' కావలసి రావటమే. దాంతో విప్లవాత్మక శక్తిని మొగ్గదశలోనే తుంపివేసినట్లయ్యింది. హింసాత్మక విప్లవం జరుగబోయే తరుణంలో కాంగ్రెసును స్థాపించటంతో ఆ విప్లవం నివారించబడిందనేది కీలకాంశం. దానిని

పలువురు రచయితలు అంగీకరించారు: ఉదారవాదులు ఆహ్వానించారు; సామ్రాజ్యవాదానికి కాంగ్రెసు విధేయతను ప్రకటించలేదనుకున్నా అది రాజీధోరణినే ప్రదర్శించిందని రుజువు చేసేందుకు విప్లవ వాదులు వాడుకున్నారు. తొలి నుండీ కాంగ్రెసు జాతీయ వాదానికి వ్యతిరేకమేనని చూపేదానికి అతి మితవాదులు తాపత్రయపడ్డారు. అలా వాళ్లంతా కాంగ్రెసు ఉద్భవించిన తీరే దాని మౌలిక స్వభావాన్నీ, భవిష్యత్తు కార్యావళినీ కీలకమైన రీతిలో దెబ్బతీసాయని అంగీకరించారు.

1916లో అతివాద నాయకుడు లాలా లజపతిరాయ్ మధ్యేవాదుల్ని దెబ్బతీసేందుకు తన "యంగ్ ఇండియా" పత్రికలో "సురక్ష కవాటం" సిద్ధాంతాన్ని వాడుకున్నారు. ఆ సిద్ధాంతాన్ని సంపూర్ణంగా చర్చించి చేసిన సూచన ఏమంటే – కాంగ్రెసు 'లార్డు డఫ్రెన్ ఆలోచనా ఫలితం; ఇంకా చర్చ యిలా కొనసాగింది: 'కాంగ్రెసు స్థాపన బ్రిటీషు సామ్రాజ్యాన్ని ప్రమాదాన్నుండి కాపాడేందుకే గాని భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యాన్ని సమకూర్చి పెట్టేందుకు కాదు. బ్రిటీషు సామ్రాజ్యపు ప్రయోజనాలే ప్రధానం; భారతదేశానివి అనుషంగికమైనవి'. 'అటువంటి భావనకు కాంగ్రెసు కట్టుబడిలేదని ఎవ్వరూ చెప్పలేరు' అని జోడిస్తూ యిలా ముగిస్తారు. 'కనుక కాంగ్రెసు ఆవిర్భావం యిలా జరిగింది. ఇది చాలు దానిని ఉన్నత జాతీయవాదుల దృక్కోణం నుండి ఖండించేందుకు.'

ఓ పాతికేళ్లు పైగా గడచిన తరువాత ఆర్. పామీదత్ రచించిన 'ఇండియా టుడే' అనే గ్రంథం సురక్ష కవాటపు ఊహను వామపక్ష ఆలోచనా ధోరణికి అద్దం పట్టేట్లు చేసింది. ఆ వాదన నొక్కి వక్కాణిస్తూ దత్ వ్రాసిందేమంటే – కాంగ్రెసు ఆవిర్భవించింది ప్రభుత్వపు చొరవతోనే; మార్గదర్శనంలోనే; 'వైస్రాయితో ముందుగా కుదుర్చుకొన్న ఒక రహస్య ప్రణాళిక ప్రకారమే'. దాని వల్ల 'పెరిగి పోతున్న ప్రజా ప్రతిఘటనను, బ్రిటీషు వ్యతిరేక భావాలను అదుపు చేసి బ్రిటీషు పాలనను సంరక్షించే ఆయుధంగా' వాడుకోవచ్చుననుకున్నారు. అది "ముంగిట వున్న విప్లవాన్ని నిష్ఫలం చేసేందుకో లేక ముందుగా అడ్డుకొనేందుకో చేసిన ప్రయత్నం." అయితే కాంగ్రెసు సరైన సమయానికే ఒక జాతీయ సంస్థగా రూపుదిద్దుకొంది. 'విధేయతా స్వభావపు ముసుగు తొలగించి జాతీయతా ముద్ర వేసుకొంది.' అది ప్రజా ఉద్యమాల చైతన్య

రథమయ్యింది. అయితే దాని 'పుట్టుకలోని పాపం' దాని రాజకీయాలపై మాయని మచ్చగా నిలిచిపోయింది. ఒక వంక ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థగా మనుగడ సాగిస్తూ కూడా సామ్రాజ్య వ్యతిరేక వాద ఉద్యమ వ్యవస్థాపక ధర్మాన్ని నిర్వర్తిస్తున్నట్లుగా దాని 'రెండు నాల్కల ధోరణి' 'చరిత్ర కెక్కింది.' అది సామ్రాజ్యవాదంతో యుద్ధమూ చేసింది. తోడ్పాటునూ అందించింది. అది ప్రజా ఉద్యమాలను నడిపింది. జనం విప్లవ పథగాములు కాగానే నమ్మక ద్రోహంతో సామ్రాజ్యవాదం సరసకు చేరేది. కాంగ్రెసువి అలా రెండు పోగులు – 'ఒక వంక ప్రజా ఉద్యమాల బెడదను తొలగించేందుకు సామ్రాజ్యవాదానికి సహకార మందించే పోగు, మరోవంక జాతీయ పోరాటంలో ప్రజా నాయకత్వపు పోగు'. గోఖలే నుండి గాంధీ వరకు కాంగ్రెసు నాయకత్వంలోని ఈ ద్వైదీ భావన భారతీయ బూర్జువా తత్వంలోని ద్వైదీభావన, ఊగిసలాటల ప్రతిఫలనమేననీ, అది వెనువెంటనే బ్రిటీషు బూర్జువా విధానానికి వ్యతిరేకంగా భారత ప్రజలకు నాయకత్వం వహించాలని కోరుకుంటూనే " మరీ తొందరపడితే" సామ్రాజ్యవాదులతో పాటు తామూ విశేష హక్కుల్ని కోల్పోగలమనే భయం' అంటారు దత్. అలా కాంగ్రెసు నిజమైన విప్లవానికి అంటే హింసాత్మక విప్లవానికి ప్రత్యర్థిగా ప్రచారం చేసింది. అయితే ఆ పాత్ర గాంధీజీ కాలం నాటిది కాదు. 'ఈ భావనను సామ్రాజ్యవాదం తన ఉద్దేశపూర్వక సాధికార పాత్రగా చొప్పించింది'. 'మౌంట్ బాటెన్ చివరకు పరిష్కారానికి లొంగిపోయినాడు.' ఈ ద్వైదీభావన పాత్ర పతాక స్థాయికి చేరుకుంది.

అంతకు పూర్వం 1939లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత యమ్.యస్. గోల్వాల్కర్‌కు లౌకికవాదం తద్వారా జాతీయ వ్యతిరేకతా భావన విషయంలో కాంగ్రెసుపై ఎదురుదాడికి సురక్ష కవాట సిద్ధాంతాన్ని బాగా దొరకబుచ్చుకున్నాడు. 'అనాదిగా మనపై దాడులు చేసిన వాళ్లు మన శత్రువులు'. ముస్లిములకు, హిందువులకు సారూప్యత కలదని చెప్పే' విపరీత భావనలను, ప్రజాస్వామ్య భావనలను వెదజల్లుకుంటూ పోతూ తమకు తామే జాతీయ వాదులమని ప్రకటించుకునే వాళ్ల వల్లే హిందూ జాతీయ అంతర్వివేక శీలత మంటగలిసిందని "మేము" అనే కరపత్రంలో ఆయన నేరారోపణకు దిగారు. 'మన శత్రువులనే మిత్రులుగా మసలనిచ్చాం. నిజమైన జాతీయతను చేజేతులా నిర్వీర్యం చేసుకున్నాం'. నిజానికి భారతదేశంలో పోరాటం భారతీయుల, బ్రిటీషు

వాళ్ళ మధ్యనే కాదు; అది ముక్కోణపు పోటీ. హిందువులు ఒక ప్రక్క ముస్లిములతోనూ, మరో ప్రక్క బ్రిటీషువాళ్లతోనూ పోరాడారు. గోల్వాల్కర్ దృష్టిలో హిందువులు జాతీయవాద వ్యతిరేక మార్గాన నడవడానికి కారణం 1885 నాటి హ్యూమ్, కాటన్ వెడ్డర్ బర్న్‌ల లక్ష్యాలు, విధానాలే. "కుతకుతలాడే జాతీయ వాదానికి" 'సురక్ష కవాటం'గా వాళ్లు స్థాపించిన కాంగ్రెసు 'మేల్కొనే భూతాన్ని నిద్ర బుచ్చే ఆట వస్తువుగా, జాతీయ అంతర్వివేక శీలతను ధ్వంసం చేసే సాధనంగా తయారవుతూంటే వాళ్లకు మాత్రం అది విజయసాధనమే.'

సి.యఫ్. ఆంద్రూస్, గిరిజా ముఖర్జీవంటి ఉదారవాదులు 1938లో ప్రచురించిన గ్రంథం 'ది రైజ్ అండ్ గ్రోత్ ఆఫ్ ది కాంగ్రెస్ ఇన్ ఇండియా'లో సురక్ష కవాట సిద్ధాంతాన్ని స్వీకరించారు. 'పనికిమాలిన రక్తపాతాన్ని' నిలువరించినందున అది వాళ్లకు ఆనందదాయకమే. 1947కు ముందూ, తరువాత కూడా పలువురు పండితులు, వందలాది మంది జనాదరణ పొందిన రచయితల రచనల్లో ఈ దృక్పథాల్లోనివి కొన్ని చర్విత చరణాలయ్యాయి.

సురక్ష కవాట సిద్ధాంతానికి చారిత్రక రుజువును సమకూర్చారు. 1978 వేసవిలో సిమ్లాలో హ్యూమ్ చదివినట్లు చెప్తున్న ఏడు రహస్య నివేదికల సంపుటాలలో అది కలదన్నారు. అది చదివిన తరువాతే బ్రిటీషు పాలనను హింసాత్మకంగా పడగొట్టేందుకు కావలసిన 'కుతకుతలాడే అసంతృప్తి' పెనుకుట్ర క్రింది వర్గాలలో కలదని విశ్వసించారని ఆయన అన్నారు.

అసలు ఆ ఏడు సంపుటాల వెనుక మర్మాన్ని విప్పి చెప్పేముందు మనం దాని ఆవిర్భావాన్నీ, వ్యాప్తినీ క్లుప్తంగా పరిశీలిద్దాం. 1913లో ప్రచురించిన ఏ.ఓ.హ్యూమ్ జీవిత చరిత్రలో అది తొలిగా చోటు చేసుకొంది. దాని రచయిత విలియమ్ వెడ్డర్ బర్న్. వెడ్డర్‌బర్న్ (ఐ.సీ.యస్)కు హ్యూమ్‌కు సంబంధించిన కాగితాలలో కాంగ్రెసు స్థాపనకు చెందిన సమాచారం గల తేదీలేని పత్రం లభించింది. ఈ పత్రం నుండే ఆయన విపులంగా ఉటంకించాడు. పాఠకుడు అంచలంచెలుగా రచయితతో కలిసి పరిష్కారాన్ని కనుగొనేందుకున్నూ, మర్మాన్ని కాపాడేందుకున్నూ వెడ్డర్ బర్న్ చెప్పిన దాన్ని కొంత ఇక్కడ వదిలేసి అతని తరువాతి రచయితలు ఉటంకించిన భాగాలను

మాత్రం ముందుగా తెలియజేస్తా. లజపతిరాయ్ భావన ఏమంటే హ్యూమ్ 'స్వాతంత్ర్య ప్రియుడు. బ్రిటీషు కిరీటపు రక్షణ క్రింద భారత దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం కావాలని కోరినవాడు.' అయినా అన్నిటినీ మించి ఆయన 'ఆంగ్లేయ దేశభక్తుడు'. బ్రిటీషుపాలనకు 'ముంచుకొచ్చిన విపత్తు' బెదరగొడుతున్న తరుణంలో అసంతృప్తికి ఒక సురక్ష కవాటాన్ని అమర్చాడు.

దీని నిర్ణాయకపు రుజువుగా హ్యూమ్ జ్ఞాపక పత్రం నుండి వెడ్డర్ బర్న్ తన సొంత వ్యాఖ్యానాలతో ఉటంకించిన దాని నుండి లజపతిరాయ్ ఓ పెద్ద కొటేషన్ పొందుపరిచాడు. దీనినే తరువాత రచయితలందరూ ఉటంకించటమో, ఉదహరించటమో జరిగింది గనుక దానిని సంపూర్ణంగా ఇక్కడ ఎత్తి వ్రాయవలసి ఉంది.

"ఎన్నెన్నో వివరాలు నమోదు చేసిన పలు సంపుటాలు నకలు చూపెట్టారు. అవన్నీ ఆంగ్లంలో సంక్షిప్తాలుగానో, చిన్నవో పెద్దవో జిల్లాల వారీగా పేర్చబడిన రకరకాల ప్రాంతీయ భాషల్లోని సమాచార నివేదికలకు అనువాదాలు గానోఉన్నాయి... ఇలా నమోదు చేసిన అంశాలు లెక్కకు మిక్కిలి; అప్పట్లో 30 వేలకు పైబడిన వివిధ రిపోర్టర్ల నుండి సమాచారముండేదని వినికిడి." ఆ సంపుటాలన్నీ ఆయన వద్ద ఒక్క వారం రోజులు మాత్రమే ఉన్నట్లు హ్యూమ్ పేర్కొన్నాడు. అలా నమోదు చేయబడిన అంశాలలో చాలా భాగం దిగువ తరగతి ప్రజల మధ్య జరిగిన సంభాషణలే. "అవన్నీ తెలియజేసేదేమంటే ఆ బీదవాళ్లంతా ఆనాటి స్థితిగతులను చూసి నిస్సహాయ భావనలో మునిగి పోయారనీ, వాళ్లంతా యిక ఆకలితో అలమటిస్తూ చచ్చిపోవలసిందేననేది విశ్వసిస్తున్నారనీ; కనుక అంతా కలసికట్టుగా ఏదో ఒకటి చేయాల్సిందేనని అనుకుంటున్నారనీ ఆ ఏదో ఒకటి హింసేనని.....ఏదో విద్యాధికులైన కొద్ది మంది మాత్రం అకారణంగా, తెగింపుతో ప్రభుత్వం పట్ల కాఠిన్యాన్ని ప్రదర్శిస్తూ, ఉద్యమాలలో చేరిపోతూ, అక్కడక్కడా నాయకత్వం వహిస్తూ ప్రతిఘటనకు సంఘటిత శక్తిని సమకూరుస్తూ అదొక జాతీయ తిరుగుబాటుగా నిర్దేశనాన్ని అందిస్తున్నారు."

లజపతిరాయ్ ఉటంకించిన దానిలో ఆ ఏడు సంపుటాల స్వభావం, మూలం నిర్వచింపబడలేదు. అయినా అది చాలా త్వరితంగా రూపాంతరం చెందసాగింది. 1933లో గురుముఖ్ నిహాల్‌సింగ్ చేతుల్లో అవి 'ప్రభుత్వ నివేదిక'లయ్యాయి. ఆండ్రూస్,

ముఖర్జీలు వాటిని 'సి.ఐ.డీ. నుండి పొందిన రహస్య నివేదికల పలు సంపుటాలు'గా మార్చివేసి అవి 'అధికార హోదాలో' హ్యూమ్‌కు చేరినట్లుగా పేర్కొన్నారు. ఇక లాక్షణికతతో అత్యంత ప్రభావం చూపిన కథనం ఆర్. పామీదత్‌ది. వెడ్డర్ బర్న్ వ్రాసిన దాని నుండి లజపతిరాయ్ ఉటంకించిన భాగాన్ని తానూ ఉటంకించిన తరువాత దత్ వ్రాసిందేమంటే – 'హ్యూమ్ తన అధికార హోదాలో అపరిమిత పరిమాణం గల రహస్య పోలీసు నివేదికల్ని అందుకున్నాడు' జాతీయోద్యమాన్ని గురించి వ్రాసిన అనేక మంది చరిత్రకారులు, ఇటీవలి వాళ్ళైన ఆర్.సి. మజుందార్, తారాచంద్‌లతో సహా అంతకు ముందటి రచయితల సృజనాత్మక కల్పనను చారిత్రక సత్యంగా స్వీకరించారు.

హ్యూమ్ సంపుటాలు అధికారిక డాక్యుమెంట్లు అనే నమ్మిక బాగా వేళ్ళూనటంతో 1950వ దశకంలో చాలా మంది చరిత్ర కారులు, చరిత్రకారులు కానున్న వాళ్లు, ఈ వ్యాసరచయిత కూడా జాతీయ పురాతన పత్రభాండాగారాలలో వాటి కోసం అన్వేషించటం జరిగింది. ఆ అన్వేషణ నిష్ప్రయోజనమని ఋజువయ్యాక 1947లో బ్రిటీషువాళ్లు ఈ దేశాన్ని వదలి వెళ్లేముందు వాటిని ధ్వంసం చేసుంటారనే ఆలోచన కొంత ఊరటను కల్గించింది. చరిత్ర కారులు ఏ కొంచెమైనా తమ చరిత్ర రచనా జ్ఞానాన్ని ఈ సమస్యకు అన్వయించి ప్రసిద్ధికెక్కిన ఋజువును మరింత జాగ్రత్తగా పరిశీలించి వున్నట్లయితే వాళ్లిలా మోసానికి గురయ్యే వాళ్లు కాదు. రీపన్, డఫ్రెన్ వ్యక్తి గత పత్రాలు లభించకముందే మూడు దశల్లో చారిత్రక సాక్ష్యం, తర్కం వాళ్లకు అందుబాటులో ఉంది.

మొదటి దశ 1870ల్లో భారత ప్రభుత్వం పరిపాలన సాగించిన పద్ధతి ఎలావుందో పరికించటం. 1878లో హ్యూమ్ రెవెన్యూ, వ్యవసాయ, వాణిజ్యశాఖల కార్యదర్శి. ఈ శాఖల కార్యదర్శికి హోంశాఖకు చెందిన ఫైళ్లుగాని సి.ఐ.డి. నివేదికలు గాని ఎలా అందుబాటులో వుంటాయి? పైగా అప్పుడు ఆయన సిమ్లాలో ఉన్నాడు. హోంశాఖకు సంబంధించిన ఫైళ్లన్నీ ఢిల్లీలో వుండేవి. వాటిని సిమ్లా పంపలేదు. మరి ఈ 30 వేల మంది రిపోర్టర్లు ఎక్కడి నుండి వచ్చారు? ప్రభుత్వ రహస్యశాఖలో కొద్ది వందల మంది కంటే ఎక్కువ నియామకాలు జరిగే అవకాశం లేదు. లజపతిరాయ్ పేర్కొన్నట్లు విప్లవం వస్తుందనే భయంతో కాంగ్రెసును స్థాపించితే హ్యూమ్, బ్రిటీషు పరిపాలకులు మరి ఏడేళ్లపాటు ఎందుకు వేచి ఉన్నట్లు?.

ఒక వేళ సంపుటాలు ప్రభుత్వ పత్రాలు కాకుంటే ఇంకేమిటి? దానికి కావలసిన ఆధారం వెడ్డర్ బర్న్ పుస్తకంలోనే సులభంగా దొరుకుతుంది. అయితే రచయితలు అసలు పుస్తకాన్ని వదిలేసి వాళ్లు వీళ్లు ఉటంకించిన వాటిని ఆధారంగా ఎత్తి వ్రాసారు. ఇలా చారిత్రక ఋజువుకు సంబంధించిన రెండవ దశ సమాచారం మనకు వెడ్డర్ బర్న్ పుస్తకంలోనే లభిస్తుంది.

లజపతిరాయ్, పామీదత్ మరికొందరు సంగ్రహంగా ఉటంకించిన విషయాలు వెడ్డర్ బర్న్ పుస్తకంలో 80-81 పేజీలలో ఉన్నాయి. అంతకు ముందు రెండు పేజీలు 78-80. వెనుక ఒక పేజీ తరువాత 82-83 పేజీల్లో ఆ సంపుటాలేమిటో, హ్యూమ్‌కు అవి ఎవరిచ్చారో పాఠకులకు తెలియజేస్తాడు వెడ్డర్‌బర్న్. అవన్నీ 'భారత మత నాయకులు' అనే శీర్షిక క్రింద కన్పిస్తాయి. ఆ అధ్యాయం మొదట్లోనే వెడ్డర్ బర్న్ యిలా వ్రాస్తాడు: ప్రమాదం బెదిరింపు విషయం హ్యూమ్‌కు 'ఒక విశేష మూలం నుండి అదే – భారతదేశంలోని అన్ని తావుల్లో తమ జీవితాలను మత మార్గానికి అంకితం చేసుకొన్న నాయక గణం నుండి లభించింది'. హ్యూమ్ తన పత్రంలో అసంఖ్యాకమైన రహస్య పాక్షిక మత ఆదేశాలను, వాటికి సంబంధించిన లక్షలాది మంది సభ్యులను, భారతదేశపు సమస్యలో దాని ప్రాముఖ్యాన్నీ పరామర్శించాడు. ఈ మత శాఖలకు, ఉత్తర్వులకు ఆధిపత్యం గురువులదే. ఆ గురువులు "ఇహంలోని కోర్కెలను వాళ్లంతట వాళ్లు త్యజించిన వాళ్లు; వాళ్ల కోర్కెలను పరమ సుఖంపై నిలిపిన వాళ్లు. ఈ మత నాయకులు వాళ్ల శిష్యుల ద్వారా లోలోపలి సమాచారాన్ని రాబట్టగలరు. ప్రజాభిప్రాయాన్ని రూపొందించటంలో వాళ్ల ప్రభావం దొడ్డది." ఇదిగో ఇటువంటి గురువులకే "లార్డ్ లిట్టన్ వైస్రాయిగా వున్న చివరి రోజుల్లో హ్యూమ్ దగ్గరయ్యాడు" అని వెడ్డర్ బర్న్ తెలియజేస్తాడు. ఈ గురువులు హ్యూమ్‌కు దగ్గరగా జరగటం ఆయన ప్రాచ్య మతాలను శ్రద్ధగా అధ్యయనం చేసే విద్యార్థి వంటివాడనేగాక "దేశమంతటా అలముకొన్న అపశకునపు అశాంతి, పెనువిప్లవానికి దారితీస్తుందేమోనని వాళ్లు భయపడ్డారు." కనుక ప్రభుత్వంతో చనువున్న హ్యూమ్ లాంటి వాళ్లే అటువంటి 'ఘోర విపత్తును నివారించగలరు.' "ఈ విధంగా ఈ విషయం నాముందుంచబడింది" అని వ్రాసాడు హ్యూమ్. ఈ నేపథ్యంలో 80-81వ పుటల్లోని విషయం విశదం కాగలదు.

ఇంకో విధంగా చెప్పాలంటే రుజువుకు వచ్చిన ఏడు సంపుటాలుగా వేలాది మంది శిష్యులు పంపిన రిపోర్టులను గురువులు హ్యూమ్‌కు చూపెట్టారని అనుకోవాలి. అయితే ఆ రిపోర్టులలోని విషయాలన్నీ 'తప్పక వాస్తవాలు అయ్యుండాలని' హ్యూమ్ ఎందుకు విశ్వసించాలి? ఎందుకంటే శిష్యులు ఒక ప్రత్యేకమైన వర్గం. వాళ్లు ఏదో ఒక సామాజిక వర్గానికో, మతానికో చెందినవాళ్లు కాదు. వాళ్లు అన్ని మతాలకూ చెందిన వాళ్లు. పైగా వాళ్లంతా 'క్రింది తరగతి సామాన్యుల్లా గాక ప్రతిజ్ఞలతో, నియమాలతో బ్రతికే ఉన్నత స్థాయి వాళ్లు.' పైగా వాళ్లంతా 'రహస్యమయజ్ఞానపు అనేక శాఖల్లో ఏదో ఒక శాఖలో దీక్ష బూనినవాళ్లే.' 'అందరూ శపథాలకు కట్టుబడి ఉండేవాళ్లే. వాళ్లకంటే ఆ శాఖలోని అధికులకు తప్ప వేరొకరికి ఏదయినా చెప్పి వాగ్దాన భంగం చేయరు.' నాయకులూ 'ఏఒక్క శాఖకో మతానికో చెందిన వాళ్లు కాదు. అన్ని శాఖలూ, అన్ని మతాలూ వాళ్లవే.' అయితే భారతదేశంలో ఎవరయినా కోకొల్లలుగా వున్న ఈ గురువుల, శిష్యుల ఉనికిని అసలెందుకు పట్టించుకోవాలి? ఎందుకు పట్టించుకోవాలో వివరిస్తాడు హ్యూమ్. ఎందుకంటే సంపూర్ణ గోప్యత వాళ్ల జీవితపు అత్యవసర లక్షణం గనుక. వాళ్లు హ్యూమ్‌నే సంప్రదించటానికి కారణం వాళ్లు సంక్షోభాన్ని నివారించతలపెట్టారు.

ఇక చివరగా మనం చరిత్ర రచనా జ్ఞానపు మూడవ దశకు చేరుకున్నాం. అవి తిరుగులేని నమ్మికతో, పరమ కల్పిత గాథలతో కూడినటువంటివి. గురుశిష్యుల సంపూర్ణ శీలాన్ని వెడ్డర్ బర్న్ వెల్లడించలేదు. దానిక్కారణం మిత్రులైన జీవిత చరిత్ర కారులందరి మాదిరే తన పాత మిత్రుడి ఖ్యాతికి రక్షణ కల్పించటమే. అందుకే ఈ గురుశిష్యులంతా సామాన్య మర్త్యులే అనే అభిప్రాయం కలుగజేసాడు. నిజానికి అలాకాదు. కొన్ని ఆధ్యాత్మికతత్వ రచనలు, మేడమ్ బ్లావట్‌స్కీ రచనల ఆధారంగా వైస్రాయి రీపన్, వైస్రాయి డఫ్రెన్‌ల స్వంత పత్రాల ఆధారంగా వాస్తవాలను పరిశీలించి చూస్తే మనకు కన్పించే దేమంటే ఈ గురువులు చిత్రమైన ప్రాక్ మత భావనా బలంతో అలౌకిక, అతీతశక్తుల్ని కలిగి వున్నట్లుగా భావించారు. వేలాది మైళ్ల దూరంలోని వారితో ముఖాముఖి మాట్లాడగలగటం, వాళ్లను

నిర్దేశించగలగటం, ఏతావుకి వెళ్లాలంటే ఆ తావుకి వెళ్లగలగటం, ఎవరికీ కనబడకుండా ఎక్కడ బడితే అక్కడ కూర్చోగలగటం, అవతలివాళ్లకు తెలియకుండానే వాళ్ల భావాలకూ, అభిప్రాయాలకూ మార్గదర్శనం కలగజేయటం చేసేవాళ్ళని వూహించారు.

* * *

1881లో హ్యూమ్, మేడమ్ బ్లావట్స్కీ మాయలో పడిపోయాడు. గురువులతో సంబంధాలున్నట్లు ఆమె చెప్పుకునేది. వాళ్లను మహాత్ములుగా వర్ణించేది. ఈ 'మహాత్ములు' రహస్య సోదరదళ భాగస్వాములుగా టిబెట్‌లో జీవించేవాళ్లు. అయితే వాళ్లు వాళ్లకున్న అతీతశక్తుల కారణంగా ప్రపంచంలోని ఎవరితోనయినా సంపర్కం పెట్టుకోగలిగేవాళ్లు; మాట్లాడగలిగేవాళ్లు. 'కూట్ హూమీ లాల్‌సింగ్' అనే మహాత్ముణ్ణి బ్లావట్ స్కీ హ్యూమ్‌కు పరిచయం చేసింది. ఈ అదృశ్య సోదరత్వ కూటమి తమ శిష్యుల ద్వారా భారత భూభాగంలోని విషయాలను గూర్చిన గోప్య సమాచారాన్ని సేకరించేది. 1880లో 'పయనీర్' సంపాదకుడు, బ్లావట్ స్కీ మరో అనుయాయుడు అయిన ఏ.సి. సిన్నెట్ తన గ్రంథంలో ఉటంకించిన కూట్ హూమీ లేఖ ప్రకారం ఈ మహాత్ములు 1857లో తమ శక్తిని ఉపయోగంలోకి తెచ్చి భారత ప్రజల్ని అదుపు చేసి బ్రిటీషు సామ్రాజ్యాన్ని కాపాడారనీ, భవిష్యత్తులోనూ అలాగే చేయగలరనీ ఉంది.

హ్యూమ్ ఇదంతా నిజమేనని నమ్మాడు. తానూ అతీంద్రియ శక్తుల్ని పొందటం ద్వారా శిష్యులవలె వర్తమానం, భవిష్యత్తు అంతా గ్రహించాలనుకున్నాడు. టిబెట్‌లోని మహాత్ములతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. 1883లో బ్లావట్స్కీతో హ్యూమ్ గొడవపడ్డాడు గాని గురువులు మహాత్ములపై తన నమ్మిక మాత్రం సడలలేదు. మహాత్ములతో తనకున్న సంబంధాన్ని తన హృదయానికి దగ్గరగా వుండే రాజకీయ లక్ష్యాలను వృద్ధిపరిచేందుకు వాడుకోసాగాడు – హిందూ దేశ పాలనా పద్ధతిని సంస్కరింపజూసాడు. అది భారతీయుల అభిప్రాయాలకు మరింత అనుగుణంగా చేయాలనుకున్నాడు.

1883 డిసెంబర్‌లో ఆయన రిప్పన్‌కు ఇలా వ్రాసాడు: 'జనం వాళ్లను ఎన్నడూ చూడకపోయినా దేవుళ్ళలా భావించి మొక్కుతారు... వాళ్ళతో నాకు సంబంధాలు ఏర్పడ్డాయి... వాళ్ళకు ప్రజాస్పందనల నాడి యిట్టే తెలిసిపోతుంది.' 'దేశీయ బుద్ధి'ని

గూర్చిన జ్ఞానం తనది మహత్తర మైనదిగా చెప్పుకొనేవాడు. అందుక్కారణం లేకపోలేదు. 'కొందరు వ్యక్తులు, వాళ్ళల్లో ఎక్కువ మంది ఆసియాకు చెందిన వాళ్ళు.... వాళ్ళ వాళ్ళ భావాల్ని పసిగట్టటంలో వాళ్ళకున్నన్ని సౌలభ్యాలు మరే సజీవ వ్యక్తికీ లేనటువంటి శక్తి సంపన్నులు... సమర్ధతను చూచి... కొంత మేరకు వాళ్ళ విశ్వసనీయతను ప్రకటించారు.' 1884 జనవరిలోనే కాదు, అంతకు పూర్వం 1848లో కూడా ఆయన రిప్పన్‌కు తెలియజేసిందేమంటే – ఆయన రహస్య సోదర కూటమి సలహా దారులతో సత్సంబంధాలు కలిగే వున్నాడనీ, వాళ్ళ ప్రమేయం వల్లనే 1848లో ఐరోపాలోని విప్లవాలు అణగారాయనీ, అలాగే 1857 తిరుగుబాటు కూడా నన్నాడు. అక్కడెక్కడో టిబెట్ నుండి వాళ్లు తన ద్వారా, తన వంటి వాళ్ళ ద్వారా 'తిరిగి అటువంటి వైపరీత్యం పునరావృతం కాకుండా' సంస్కరణలు ప్రవేశపెట్టేందుకు రిప్పన్‌కు సాయపడుతున్నారన్నాడు. ఆ మహాత్ముల సంపర్కం వల్లనే తాను మహారాణికి నచ్చజెప్పి రెండవ పర్యాయం కూడా రిప్పన్‌కు వైస్రాయి పదవి యిచ్చి 'స్థానిక పత్రికల్ని శాంతింపజేయాలనుకున్నాను' అనీ రిప్పన్‌కు తెలియజేశాడు.

డఫ్రెన్ విషయంలో కూడా హ్యూమ్ అటువంటి పాత్రను పోషించేందుకే ప్రయత్నించాడు. అయితే తన సలహాదారులు ఆత్మ స్వరూపులనీ, అతీతశక్తులు కలిగిన వాళ్ళనీ చెప్పేందుకు సంకోచించటంతో చాలా మంది చరిత్రకారులు ఆ సలహాదారుల్ని ఆయనతోటి కాంగ్రెసు నాయకులని భావించారు! వైస్రాయి స్టేట్ సెక్రటరీకి పంపిన రహస్య లేఖలోని విషయాలు తనకెలా తెలిసాయో చెప్పమని డఫెరిన్ 1887లో ఆగ్రహావేశాలు ప్రదర్శించినప్పుడు మాత్రం ఓ పర్యాయం ఆయన ముందు హ్యూమ్ ముసుగు తొలగించాడు. బాగా ఇరుకున పెట్టటంతో ఇక తప్పదని – అతీంద్రియ శక్తుల ద్వారానో లేక అలౌకిక ఛాయగ్రహణం ద్వారానో తన మిత్రులు ఆ లేఖ ప్రతి నకళ్ళను పొందగలిగినట్లు తెలియజేసాడు. అయితే డఫరిన్ అసలు లేఖను తీసి నకలుకు సరిపోల్చి చూచి నకలు అసలులా లేదని ఋజువు చేయటంతో హ్యూమ్ మిన్నకుండిపోయాడు.

అంతకు పూర్వం గూడా ఓ సారి హ్యూమ్ తన సలహాదారులు సామాన్య రాజకీయ నాయకులు కారనీ, ఉన్నత దీక్ష పుచ్చుకున్నవారనీ, మహాత్ములనీ ఎంతో మెలకువతో పరోక్షంగా డఫెరిన్‌కు చెప్పే ప్రయత్నం చేసాడు. నవంబరు 1886లో

డఫెరిన్‌కు వ్రాసిన లేఖలో హ్యూమ్ పేర్కొన్నదేమంటే – తనకు సిమ్లాలో ఆ సంపుటాలను చూపిన వాళ్లను డఫెరిన్‌కు కూడా అవి చూపేందుకు నచ్చజెప్పటం జరుగుతున్నదనీ, వాటిని డఫెరిన్ స్వయంగా చూచేట్లయితే తానే వాటి సత్య సంధతను తనకున్న సాధన సంపత్తితో తరచిచూచే అవకాశం ఏర్పడుతుందన్నాడు. కాని 'ప్రస్తుతం వాళ్లు అది సాధ్యం కాదు అంటున్నారు.' పోనీ వైస్రాయితో ముఖా ముఖిగా సంప్రదించేందుకు సిద్ధం కమ్మంటే అందుకూ అంగీకరించటం లేదు. వాళ్లల్లో చాలా మంది 'అలా చేయలేరని' నేను విశ్వసిస్తున్నాను. వాళ్లవేషం చూచిన తరువాత వాళ్లు మీతో సరాసరి కలిసి మాట్లాడేందుకు 'కావలసిన స్థితిని మీరు కల్పించరు,కల్పించబోరు.' అయినా ఆశగానే ఉంది. హ్యూమ్ 'ప్రత్యేక మిత్రుడు', సిమ్లాలో 1878లో ఓ మాసం రోజులు ఆయనతో గడిపిన వాడు, తరచుగా భారతదేశంలో వుండేవాడు, వైస్రాయిని కలిసేందుకు అంగీకరించవచ్చు. కనుక హ్యూమ్ సూచించేదేమంటే – 'ఎవరయినా అటువంటి వ్యక్తి ఎప్పుడయినా ఆంతరంగిక కార్యదర్శి వద్దకు వచ్చి వైస్రాయి తనని కలవమన్నట్లు హ్యూమ్ తెలియజేసాడని చెప్తే అతనిని వెంటనే పిలిచి మాట్లాడండి. అతడు అసామాన్యుడు అని గుర్తించేందుకు పది నిముషాలు కూడా పట్టదు. అటువంటి అవకాశం మీకెన్నడూ లభించదు – ఇదెలాగో ఆ దేవుడికే తెలియాలి – అద్భుతాలు ప్రదర్శించుకొంటూ వాళ్లొక మాయాలోకంలో విహరిస్తూంటారు'.

అయితే ఇదంతా తాను ప్రత్యక్షంగా చూపేందుకు ఏమీ లేనందువల్ల హ్యూమ్ ఆందోళన చెందేవాడు. వైస్రాయికి చెప్పటం జరిగింది. – తాను 'క్రమేపీ ఆగ్రహం చెందటమే గాక అసహ్యంచుకుంటున్నట్లు' – ఎందుకంటే 'తాను ప్రామాణికంగా ఏమీ చూపలేక పోతున్నందుకు? ఎవరి సలహా సంప్రదింపులతో తాను మసలు కుంటున్నాడో 'ఉన్నతంగా దీక్ష పూనిన వాళ్లెవ్వరూ ప్రత్యక్షంగా నాప్రక్కన నిలవరు. అందువల్లనే భారతదేశంలోని ఐరోపా వాసుల్లో పలువురు తనని 'ఉన్మాదిగానో, అబద్దాల కోరుగానో చూస్తుండటం? కనుక ఆయన తన రాజకీయ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే తన మిత్రులతో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటాను' అని వైస్రాయికి తెలియజేస్తాడు.

కనుక హ్యూమ్ చూసిన ఏడు సంపుటాలు తయారు చేసింది మహాత్ములు, గురువులు; ఆయన మిత్రులు సలహాదారులు అయిన ఆ అతీంద్రియ మూర్తులేగాని కాంగ్రెసువాదులు కాదు!

* * *

సురక్ష – కవాట సిద్ధాంతానికి మరో ఋజువుగా 1895లో "ఇండియన్ పొలిటిక్స్"లో ప్రచురించబడిన డబ్ల్యు.సి. బెనర్జీ ప్రకటన. దాని ప్రకారం కాంగ్రెసు 'తొలిగా స్థాపించబడిందీ, అప్పటి నుండి నిర్వహించబడిందీ వాస్తవానికి మార్క్విస్ డఫెరిన్, ఆవాల పనే. 1884లో హ్యూమ్ భారతదేశంలోని పేరెన్నిక గన్న రాజకీయ వాదుల్ని సంవత్సరానికో పర్యాయం "సామాజిక విషయాలు చర్చించేందుకు" ఒక చోటికి చేర్చదలచుకున్నాడు." "వాళ్ల చర్చల్లో రాజకీయాలకు తావులేకుండా చూడాలని కోరుకున్నాడు" కాని డఫెరిన్, హ్యూమ్‌ను తద్విరుద్ధంగా చేయమని కోరాడు. రాజకీయంగా భారతీయుల అభిప్రాయం ప్రభుత్వం తెలుసుకునేందుకు వీలుగా రాజకీయాంశాలు చర్చించే ఒక సంస్థను స్థాపించమన్నాడు. ఆ సంస్థ "ఇంగ్లండులో మహారాణిగారి ప్రభుత్వంలో ప్రతిపక్షం నిర్వహించే విధుల్నే" నిర్వహిస్తుంది.

ఈ విషయంలో డబ్ల్యు.సి. బెనర్జీ జ్ఞప్తికి తెచ్చుకోవటంలో పొరపాటయినా పడివుండాలి, లేదా 19వ శతాబ్ది సామ్రాజ్యవాద ప్రతిచర్య తాలూకు తీవ్రమైన ఆగ్రహాన్నుండి జాతీయ కాంగ్రెసును రక్షించేందుకయినా ప్రయత్నించి వుండాలి. ఎందుకంటే సమకాలీన సాక్ష్యం సూచించేది దానికి భిన్నమయినటువంటిది. ప్రతి సంవత్సరం సదస్సు నిర్వహించే విషయంలో హ్యూమ్ భారతీయ నాయకులతో చర్చించింది రాజకీయ సభల గురించే. అంతకు పూర్వం నుండే వున్న బొంబే ప్రెసిడెన్సీ అసోసియేషన్, పూనా సార్వజనిక సభ, మద్రాసు మహాజన సభ, ఇండియన్ అసోసియేషన్ వంటి సంఘాల కృషి అంతా రాజకీయ పరమైనదే. 1882లో ఇండియన్ సివిల్ సర్వీసు నుండి పదవీ విరమణ చేసిన నాటి నుండి హ్యూమ్ బాహాటంగానే భారతీయుల్ని రాజకీయాల్లోకి రమ్మని కోరుతూనే ఉన్నాడు. తన భారతీయ మిత్రుల్ని సామాజికాంశాలపై విడిపోవద్దని కోరుతూనే ఉన్నాడు.

1885 జనవరిలో బి.యమ్. మలబారీ అనే తన మిత్రుడు 'ఇండియన్ స్పెక్టేటర్' పత్రికలో భారతీయుల్ని సాంఘిక సంస్కరణల కోసం ఒక ఉద్యమానికి శ్రీకారం చుట్టమని కొన్ని సంపాదకీయాలు వ్రాయగా మలబారీ ప్రతిపాదనలను ఖండిస్తూ హ్యూమ్, ఇండియన్ స్పెక్టేటర్‌కు ఒక లేఖ వ్రాస్తూ అటువంటి ప్రతిపాదనలోని ప్రమాదకరమైన సంభావ్యతను గూర్చి హెచ్చరించాడు. సామాజిక సంస్కరణల కంటే ముందుగా రాజకీయ సంస్కరణలు జరగవలసి ఉందని వాదించాడు. డఫెరిన్ తన

వంతుగా 1888వ సంవత్సరపు సెయింట్ ఆండ్రూ దినోత్సవ విందు ప్రసంగంలో లక్షలాది మందికి మేలును చేకూర్చే సాంఘిక సంస్కరణలకు పూనుకోకుండా సంకుచిత ప్రయోజనాలకోసం కాంగ్రెసు రాజకీయాలను నడపటాన్ని బహిరంగంగా విమర్శించాడు. అంతకు పూర్వమే అదే అభిప్రాయాన్ని ఆయన స్టేట్ సెక్రటరీకి వ్రాసిన వ్యక్తిగత లేఖలో కూడా ప్రకటించాడు.

1950లో పరిశోధకులకు అందుబాటులోకి వచ్చిన డఫెరిన్ వ్యక్తిగత పత్రాలను ఒకింత పరికించినట్లయితే ఆయన కాంగ్రెసుకు మద్దతు పలకటమో లేక ప్రోత్సహించటమో చేసాడనే కల్పనలను తెరపడుతుంది. హ్యూమ్ తాను ఇండియన్ స్పెక్టేటరుకు పంపిన లేఖ ప్రతిలిపికి, సంఘ సంస్కరణలపై మలబారీ అభిప్రాయాలకు తాను తీవ్రమైన ఆక్షేపణలు తెలియజేసిన ఒక వివరణ పత్రాన్ని కూడా జతచేస్తూ పంపిన తరువాతనే డెఫరిన్ 'హ్యూమ్ అభిప్రాయాలతో ఏకీభవించి' తనని కలవవలసిందిగా కోరాడు. హ్యూమ్ సదస్సులు నిర్వహించ తలపెట్టింది రాజకీయాంశాలపైనే గాని సామాజికాంశాలపైన కాదనే విషయంలో బొంబాయి గవర్నరు లార్డు రేకు డఫెరిన్ వ్రాసిన లేఖ ద్వారా ఖచ్చితమైన ధృవీకరణ లభిస్తుంది. 1885లో హ్యూమ్‌ను తొలిసారి కలుసుకున్న తర్వాత రాసిన లేఖలో "అతను గత భేటీలో తానూ, తన మిత్రులూ కలిసి ఒక రాజకీయ సదస్సును నిర్వహించనున్నామని తెలియజేసాడు. నాకు అర్థమైనంతలో అది కేథలిక్ విమోచనానికి ముందు ఓ కానెల్ నిర్వహించిన పద్ధతిలో ఉండవచ్చు."

డఫెరిన్‌కుకాని అతని సహ లిబరల్ బొంబాయి, మద్రాసు గవర్నర్లుకుగాని ఆల్ఫ్రెడ్, జె.బీ.లాయెల్, డీ.యమ్.వాలెస్, ఏ.కాల్విన్, యస్.సీ.బెలేవంటి కన్సర్వేటివ్ అధికార్లకుగాని కాంగ్రెసు పట్ల సానుభూతి లేదు. 'కాంగ్రెసు తన అస్తిత్వాన్ని అలా కొనసాగించటాన్ని మనం అనుమతించరాదు' కనుక 'ఏ విధంగా ఆనందంగా కాంగ్రెసును సాగనంపాలో' తాను ఆలోచిస్తున్నాననీ రాసిన డఫెరిన్ 1888లో కాంగ్రెసుపై ఆ ఒక్క పర్యాయమే దుమ్మెత్తిపోయటం జరగలేదు. 1885 మే నెలలోనే హ్యూమ్ కాంగ్రెసు విషయంలో రేను అప్రమత్తంగా ఉండమని వ్రాసాడు. అటు సంస్కర్తలనుగాని, ఇటు నిరోధకవాదులను గాని దగ్గరకు చేరనివ్వటం అవివేకం అవుతుందని చెప్పటం జరిగింది. ప్రతిగా రే జూన్ 1885లో వ్రాసిన లేఖలో 'నేషనల్ పార్టీ ఆఫ్ ఇండియా' పేరిట కొత్త రాజకీయ క్రియాశీలుర ఆగమనాన్ని శంకిస్తూ బ్రిటీషు రాజకీయ రంగంపై కన్పించే ఐరిష్ ప్రతినిధుల వలె భారత ప్రతినిధుల పట్ల జాగరూకత

వహించాలన్నాడు. అంతకు ముందు మే మాసంలో, 'దేశీయ అభిప్రాయాన్ని ప్రసరింపజేసే కేంద్రంగా స్థాపించిన ఓ సంస్థకు హ్యూమ్ సర్వాధిపతిగా వున్న విషయాన్ని' రే, డెఫరిన్‌కు తెలియజేసి జాగ్రత్త వహించమన్నాడు.

నిజానికి 1885 మే మాసాంతం నుండే డెఫరిన్, హ్యూమ్‌పట్ల అంతగా మైత్రి పాటించక దూరంగా ఉంచసాగాడు. 1886 నుండి డెఫరిన్ ప్రశ్నించదగిన ఉద్దేశాలకు ఉత్తేజితులవుతూ ఐరిష్ పద్ధతి విప్లవాలను భారతదేశంలో ప్రారంభించాలనుకొంటున్న 'బెంగాలీ బాబులను, మరాఠా బ్రాహ్మణులను' ఆక్షేపించసాగాడు. 1886 మే-జూన్ ప్రాంతాల్లో ఆయన హ్యూమ్‌ను 'జిత్తుల మారి వానిగా, కొంచెం తలతిక్క మనిషిగా, అత్యంత గర్వపోతుగా, సత్యదూరునిగా వర్ణించసాగాడు. హ్యూమ్ ప్రధాన తప్పిదం 'భారతీయ హోంరూలు ఉద్యమానికి ప్రధాన స్ఫూర్తి ప్రదాతల్లో ఒకడు కావటమే.'

చివరగా చెప్పవలసినదేమంటే కాంగ్రెసు ఆవిర్భావం సురక్ష – కవాట సిద్ధాంత ప్రాతిపదిక మీద జరిగిందన్న వాదన ఏ మహాత్ముల నుండి ఆవిర్భవించిందో ఆ మహాత్ముల సంరక్షణకే వదలివేయబడింది.

* * *

# 5 భారత జాతీయ కాంగ్రెసు స్థాపన : వాస్తవాలు

దీనికి ముందు ఆధ్యాయంలో భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భావానికి సంబంధించిన కథ మొదలు పెట్టాం. మనం ఎక్కువగా ముందుకు సాగలేకపోయాం. కారణం లేక పోలేదు: బూజు దులపవలసి వచ్చింది, రెక్కలొచ్చిన సురక్ష - కవాట సిద్ధాంతపు ఊహలకు విశ్రాంతి నివ్వవలసి వచ్చింది; కన్పించకుండా పోయిన సంపుటాల' రహస్యాన్ని ఛేదించవలసి వచ్చింది; హ్యూమ్ 'మహాత్ముల్ని' టిబెట్టులోని వాళ్ల విశ్రాంతి మందిరాలకు పంపవలసి వచ్చింది. ఈ ఆధ్యాయంలో మనం భారత జాతీయ కాంగ్రెసు ఒక సమున్నత జాతీయ సంస్థగా స్వాతంత్ర్య సముపార్జన వరకు భారత జాతీయోద్యమ లక్ష్యసాధనకు మార్గదర్శనం గావిస్తూ అది ఆవిర్భవించిన తీరును మరింత లోతుగా పరిశీలించుదాం.

1885లో భారత జాతీయ కాంగ్రెసు స్థాపన ఆకస్మికమైన లేదా చారిత్రకమైన యాదృచ్ఛిక ఘటన కాదు. 1860, 1870 దశకాల్లో ప్రారంభమై 70వ దశకపు ఉత్తరార్ధంలోనూ, 80వ దశకపు పూర్వార్ధంలో ఓ కుదుపు కుదిపిన రాజకీయ చైతన్యపు కార్యసరళిని అది పతాక స్థాయికి చేర్చింది. ఈ ప్రక్రియలో 1885వ సంవత్సరం ఓ మలుపుగా నిలిచింది. ఎందుకంటే ఆ సంవత్సరమే రాజకీయాల్లో ఆసక్తి కనబరిచే ఆధునిక మేధావులు - రాజకీయ వాదులైన భారతీయులు - సంకుచిత ముఠా దృక్పథాల నుండి బయటపడి విదేశీ పాలనకు వ్యతిరేకంగా జాతీయ ప్రయోజనాలపట్ల ఆసక్తి ప్రదర్శిస్తూ, ఒక 'జాతీయ పార్టీ'"గా వాళ్ళ కృషి ఫలప్రదం గావించుకున్న

సంవత్సరం. వాళ్ళు నెలకొల్పిన ఆ అఖిల భారత జాతీయ సంస్థే సరికొత్త జాతీయ భావనకు, రాజకీయాలకు వేదిక, చిహ్నం, సంఘటిత శక్తి, కేంద్ర కార్య స్థానం.

కాంగ్రెసు ఆవిర్భావం దిశగా సాగే జాతీయ రాజకీయ కార్యాకలాపాలు అందించే సరికొత్త సందేశాలను అర్థం చేసుకోవటంలో బ్రిటీషు అధికార గణం వెనుక బడలేదు. అనుమానంతో, పొంచివున్న ప్రమాదాన్ని గమనిస్తూనే ఉంది. ఈ రాజకీయ కార్యకలాపాలు శక్తివంతం కాగానే ముమ్మందు అవిశ్వాసానికి గల అవకాశం, ప్రభుత్వంపై తిరుగు బాటును రెచ్చగొట్టే చర్యలు, ఐరిష్ పద్ధతి ఆందోళనలు ప్రభుత్వాన్ని వెన్నాడటం మొదలయ్యింది.

అధికారుల అనుమానాలు కేవలం సిపాయి తిరుగుబాటు గందరగోళం నుండి ఇంకా తేరుకొనని పాలనా యంత్రాంగంలో ఉత్పన్నమైన అత్యంత ఆందోళనా పూరిత ప్రతి స్పందన కానేకాదు; వాస్తవానికి బాగా ఆధారాలున్నటువంటిదే. ఆ సంవత్సరాలలో జాతీయవాదులైన భారతీయులు బాహాటంగా వెల్లడించిన కోర్కెలేమంటే – బట్టల దిగుమతుల మీద విధించే దిగుమతి సుంకంపై రాయితీలు కల్పించరాదు; ఆఫ్ఘనిస్తాన్, బర్మాలలో విస్తరణ కూడదు; ఆయుధాలు కలిగి ఉండే హక్కులు చెక్కు చెదరరాదు; పత్రికా స్వాతంత్ర్యం కావాలి; రక్షణ వ్యయం తగ్గించాలి; కరువు నివారణకు అధిక నిధులు కేటాయించాలి; సివిల్ సర్వీసులలో భారతీయుల్ని నియమించాలి; పాక్షిక మిలటరీ స్వచ్ఛంద దళాలలో భారతీయులకు ప్రవేశం కల్పించాలి.; క్రిమినల్ కేసుల్లో యూరోపియన్ల కేసుల పరిష్కారానికి భారతీయ న్యాయాధీశులకు అవకాశం కల్పించాలి.; భారతీయుల్ని పట్టించుకునే పార్టీకే ఓటు చేయాల్సిందిగా బ్రిటీషు ఓటర్లను అభ్యర్థించే హక్కు భారతీయులకు కల్పించాలి – అనేటటువంటివి. వీటన్నిటినీ విడివిడిగా చూస్తే విషయం అంత తీవ్రంగా ఉన్నట్లు కన్పించదు. అయితే ఈ కోర్కెలకు ఏ వలస ప్రభుత్వమూ అంత తేలికగా తల ఒగ్గదు. అలా తల ఒగ్గేట్లయితే వలస ప్రజలపై తన ఆధిపత్యాన్ని క్షీణింప జేసుకోవటమే అవుతుందనుకుంటుంది. నిజమే, ఏ విమర్శ అయినా, కోర్కె అయినా అది పైకి ఎంత నిరపాయకరమైనదిగా కన్పించినా దానిని గనుక వ్యవస్థ సమన్వయ పరుచుకోలేని పక్షంలో పోనుపోను అది వ్యవస్థకే విధ్వంసకారకం కాగలదు.

1875 – 1885 సంవత్సరాల మధ్య రాజకీయాలలో కన్పించిన సరికొత్త ఉరవడి యువజనుల సృష్టే. పలువురు క్రియాశీల జాతీయవాద మేధావుల్లో అత్యధికులు

ఈ సమయంలోనే రాజకీయాల్లో ప్రవేశించారు. పాత సంఘాలు కార్యక్రమాలు చేపట్టే తీరులోగానీ, రాజకీయ కార్యకలాపాలలో గానీ, సామాజిక ప్రాతిపదికనగానీ చాలా సంకుచితంగా కన్పించటంతో వాళ్లు కొత్త సంఘాలను స్థాపించుకున్నారు. ఉదాహరణకు బెంగాలులోని బ్రిటీషు ఇండియన్ అసోసియేషన్ అధికంగా జమీందారుల సమస్యల్నే పట్టించుకుంటూ పోవటంతో క్రమేపీ అది బ్రిటీషు వ్యతిరేక పార్శ్వాన్నే పోగొట్టుకుంది. బాంబే అసోసియేషన్‌ను, మద్రాసు నేటివ్ అసోసియేషన్లు నిరోధకవాదాన్ని ఆశ్రయించి అవసాన దశకు చేరుకున్నాయి. కనుక సురేంద్ర నాథ్ బెనర్జీ, ఆనంద బోస్‌ల నాయకత్వంలో బెంగాలులోని యువ జాతీయవాదులు 1876లో ఇండియన్ అసోసియేషన్‌ను స్థాపించుకున్నారు. 1884లో యమ్.వీరరాఘవా చారియర్, జి. సుబ్రహ్మణ్య అయ్యర్, పి.ఆనందాచార్లు మొదలైన యువకులు మద్రాసు మహాజన సభను ఏర్పాటు చేసుకున్నారు. బొంబాయిలో మరింత సమరశీల దృక్పథం గల కె.టి. తెలాంగ్, ఫిరోజ్‌షా మెహతా వంటివారు దాదాభాయ్‌ఫ్రమ్‌జీ, దిన్‌షా వంటి వృద్ధనాయకులతో రాజకీయ కారణాల వల్ల విడివడి 1885లో బోంబే ప్రెసిడెన్సీ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. పాత సంఘాలలో పూనా సార్వజనిక సభ మాత్రమే పూర్వంలా కొనసాగుతూంది. అయితే అప్పటికే అది జాతీయవాద మేధావుల చేతుల్లోకి పోయింది.

1918 వరకు భారతీయ స్థితిగతుల్ని ప్రబల పరచనున్న దాదాపు అన్ని ప్రధాన దినపత్రికలు – ది హిందు, ట్రిబ్యూన్, బెంగాలీ, మహరాష్ట్ర, కేసరి – రంగం మీదికి రావటంతో దేశంలో నెలకొననున్న నూతన రాజకీయ జీవితానికి ఆ కాలంలో సంకేతమయ్యింది. అమృత బజారు పత్రిక మాత్రం అప్పటికే నవయువకుల సంపాదకత్వంలో నిర్వహింపబడుతూ ఉంది. 1878లో అది ఆంగ్ల వార్తా పత్రిక అయ్యింది.

1885 నాటికి అఖిల భారత స్థాయిలో ఒక రాజకీయ సంస్థ ఆవిర్భావం ఆవశ్యకతై కూర్చుంది. ఈ ఆవశ్యకతను దేశమంతటా జాతీయ వాదులు గుర్తించారు. 1877 నుండి ఆ దిక్కుగా చేసిన పలు ప్రతిపాదనలను ఇటీవలి పరిశోధకులు సవివరంగా అందించటం జరిగింది. మరీ 1883 నుండి ఈ ప్రతిపాదనలు శీఘ్రగతిన పుంజుకోవాలనే అభిప్రాయం బలపడింది. దాంతో రాజకీయ కార్యకలాపాలు తీవ్రరూపం దాల్చాయి. ఈ విషయంలో కలకత్తా నుండి 'ఇండియన్ మిర్రర్' నిరంతరంగా ప్రచారం నిర్వహించసాగింది. 1883 డిసెంబరులోనే ఇండియన్ అసోసియేషన్ అఖిల భారత జాతీయ సదస్సును నిర్వహించి 1885లో మరొకటి జరిపేందుకు పిలుపునిచ్చింది

(1885లో సురేంద్రనాధ్ బెనర్జీ అఖిల భారత జాతీయ సదస్సు పనుల్లో తలమునకలవుతూ జాతీయ కాంగ్రెసు వ్యవస్థాపక సభకు హాజరు కాలేక పోయాడు).

ఈలోగా అంతకు పూర్వం పదేళ్లుగా నిర్వహించిన అనేక ఆందోళనల కారణంగా భారతీయులు బాగా ఆరితేరి గుండె నిబ్బరంతో ఉన్నారు. 1875 నుండి ఎడతెగని దాడి ప్రత్తి దిగుమతి సుంకం సడలింపుపై కొనసాగుతూనే ఉంది. స్వదేశీ వస్త్ర పరిశ్రమ మనుగడను దృష్టిలో వుంచుకొని భారతీయులు ఆ సడలింపును నిలిపివేయాలని కోరుతూనే ఉన్నారు. ప్రభుత్వ సర్వీసుల్లో భారతీయతకు తావివ్వాలంటూ 1877-88 ప్రాంతాల్లో బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్వహించారు. భారతీయులు, లార్డ్ లిట్టన్ తలపెట్టిన ఆఫ్ఘన్ ముట్టడిని వ్యతిరేకించారు. బ్రిటీషు ప్రభుత్వాన్ని ద్వితీయ ఆఫ్ఘను యుద్ధానికైన ఖర్చును భరించమనటం జరిగింది. దేశీయ పత్రికాచట్టంద్వారా పత్రికా స్వేచ్ఛపై ప్రభుత్వ అదుపుకు చేసే ప్రయత్నాన్ని ఎదుర్కొనేందుకు భారతీయ పత్రికలు ముమ్మరంగా ప్రచారానికి దిగాయి. అలాగే ఆయుధ చట్టం ద్వారా తమని నిరాయుధుల్ని చేసే ప్రయత్నాన్ని భారతీయులు వ్యతిరేకించారు. 1981-82 లో తోటలలో పనిజేసే కార్మికుల స్థితిగతులకు, ఎమిగ్రేషన్ యాక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపారు. ఆ చట్టం వల్ల తోటలలో పనిజేసే కార్మికులు బానిసత్వంలో కూరుకుపోతారు. 1883లోభారతీయ మేజిస్ట్రేట్లు యూరోపియన్లను విచారించేందుకు అవకాశం కల్పించే ఇల్బర్ట్ బిల్లు అమలులోకి తీసుకొని రావాలంటూ పెద్ద ఆందోళన నిర్వహించారు. అయితే యూరోపియన్లు అది అమలు కాకుండా చూడగలిగారు. దాంతో భారతీయులు రాజకీయంగా వెంటనే ఒక పాఠం నేర్చుకున్నట్లయింది. వాళ్ల కృషి ఫలించక పోవటానికి కారణం అఖిల భారతస్థాయిలో వాళ్లు సంఘటిత పడక పోవటమే. మరో వైపున యూరోపియన్లు సంఘటితంగా చర్యలు చేపట్టారు. 1883 జులైలో జాతీయ నిధిని పోగుచేసేందుకు అఖిల భారత స్థాయిలో బ్రహ్మాండమైన కృషి జరిగింది. ఆ నిధిని ఇటు భారత దేశంలోనూ, అటు ఇంగ్లండులోనూ రాజకీయ ఆందోళనను పెంపొందించేందుకు వినియోగించదలిచారు. 1885లో యూరోపియన్లకే పరిమితమైన స్వచ్ఛంద దళాలలో ప్రవేశం కొరకు పోరాడారు. భారత దేశంపట్ల మిత్రత్వాన్ని ప్రకటించే అభ్యర్థులకే ఓటు వేయవలసిందిగా బ్రిటీషు ఓటర్లను అభ్యర్థించటం జరిగింది. బహిరంగ ప్రసంగాల ద్వారా, ఇతర పద్ధతుల ద్వారా బ్రిటీషు ఓటర్లకు తమ వాణిని వినిపించేందుకు పలువురు భారతీయుల్ని బ్రిటన్‌కు పంపారు.

* * *

అంతకుముందు సంవత్సరాల్లోని రాజకీయ కార్యకలాపాలు పతాక స్థాయికి చేరటంతో కాంగ్రెస్ ఉనికిలోకి వచ్చిందనేది సుస్పష్టం. 1885 నాటికి భారతదేశంలో రాజకీయాభివృద్ధి ఓ దశకు చేరుకుంది. దాని ప్రకారం కొన్నిప్రధాన లక్ష్యాలనో, నిర్దిష్ట కార్యక్రమాలనో ఏర్పాటు చేసుకొని వాటి కోసం పోరాడాల్సి ఉంది. పైగా ఈ లక్ష్యాలను సమన్వయ పరుచుకొంటూ సాధించటం అఖిల భారత స్థాయిలో రాజకీయ కార్యకర్తలందరూ కలసికట్టుగా ఒకే వేదిక పైకి వచ్చినపుడే సాధ్యపడుతుంది. 1885 డిసెంబరు 28న బొంబాయిలో సమావేశమైన వ్యక్తులు ఈ ఆశయాలపట్ల ఆకర్షితులై, వాటి సాధనకై చొరవ చూపాలనుకున్నారు. కాంగ్రెసు విజయం, పరాజయం, భవిష్యత్ ప్రతిపత్తి దానిని ఎవరు స్థాపించారనే దానిపై గాక తొలి సంవత్సరాలలో దాని ఆశయాలు ఏ మేరకు నెరవేరాయనే దానిపై ఆధారపడి ఉంటాయి.

* * *

భారతదేశం ఒక జాతిగానో, ఒక దేశప్రజగానో రూపుదిద్దుకునే ప్రక్రియలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తూంది. అందువల్ల భారత జాతీయోద్యమ ప్రథమ ప్రధాన లక్ష్యం ఆ ప్రక్రియ పెంపుదలకు కృషి చేయటం, భారతీయులందర్నీ ఒకే జాతిగా కూడగట్టటం, భారత ప్రజానీకంగా రూపొందించటం. కలసి నిలదొక్కుకోని వందలాది విభిన్న జాతుల, వర్గాల సముదాయంగా, ఒక భౌగోళిక వ్యక్తీకరణగా మాత్రమే భారతీయులు వుంటూ వాళ్లు ఒక జాతిగా మనుగడ సాగించనందున వాళ్లని సంఘటిత పరచటం కాని, పారతంత్ర్యాన్నుండి విముక్తి చెందించటం కాని కుదరదని వలస అధికారులు, మౌలిక సిద్ధాంత కర్తలు చాలా సహజంగా భావించేవాళ్లు. భారతీయులు దానిని కాదనలేదుగాని వాళ్లప్పుడు ఒక జాతిగా రూపుదిద్దు కుంటున్నామని నొక్కి చెప్పసాగారు. తిలక్, సురేంద్ర నాథ్ బెనర్జీ, ఇంకా మరెందరో భారతదేశం రూపొందుతున్న జాతి' అని చెప్పేందుకు సంబరపడి పోయేవాళ్లు. లక్ష్యశుద్ధి గల చారిత్రక శక్తులు భారతీయుల్ని సంఘటిత పరుస్తున్నాయని కాంగ్రెసు నాయకులు గుర్తించారు. 'దానితో పాటు వాళ్లు ఇంకా అర్థం చేసుకున్నదేమంటే లక్ష్య సాధనను గూర్చిన చైతన్యయుతమైన అవగాహనను ప్రజలు కలిగి వుండాలని, దాని కోసమే వాళ్లల్లో జాతీయ సమైక్యత, జాతీయత వంటి భావాలను పెంపొందించవలసి ఉందనుకున్నారు.

వీటన్నిటికీ మించి భారతదేశం ఒక జాతిగా రూపొందుతున్నది. దాని జాతీయత సులభంగా సమకూడేది కాదు. దానిని నిరంతరం వృద్ధిపరుస్తూ సంఘటిత

పరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించటం కాంగ్రెసు ప్రధాన లక్ష్యం అయింది; తరువాత ప్రధానంగా సాధించిన విషయమూ అదే అయింది. ఉదాహరణకు పి. ఆనందాచార్లు 1891లో కాంగ్రెసు అధ్యక్షస్థానం నుండి ప్రసంగిస్తూ దానిని ఒక శక్తి మంతమైన జాతీయ వాద పరికరంగా అభివర్ణించాడు. అది అత్యున్నత వైభవోపేత పాత్ర అన్నాడు. కాంగ్రెసు తొలి అధ్యక్షుడు . డబ్ల్యు. సి. బెనర్జీ రూపొందించిన ముఖ్యమైన మూడు ఉద్దేశ్యాలు, లక్ష్యాలలో 'జాతీయ సమైక్యత దిక్కుగా ప్రజల మానసిక భావనల్ని సంఘటితపరచి సంపూర్ణ వృద్ధికి కృషి చేయాలనేది ఉంది.' ఐ. పి. మినాయెఫ్ అనే రష్యన్ యాత్రికుడు తన డైరీలో ఈ విధంగా వ్రాసుకున్నాడు : "బెనర్జీతో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు నేను అడిగాను, కాంగ్రెసు నుండి కాంగ్రెసు నాయకులు ఆశించే ఆచరణాత్మక ఫలితాలు ఏమిటి అని. 'జాతీయ భావనా పరిపుష్టి, భారతీయుల ఐకమత్యం, అనేది ఆయన సమాధానం. అదే విధంగా ప్రథమ కాంగ్రెసు మహా సభల్ని సమీక్షిస్తూ బొంబాయి నుండి ఇందు ప్రకాష్ వ్రాసిందేమంటే – 'నూతన జీవన ప్రారంభానికి అది తెర తీసింది... జాతీయ భావనను రగిలించేందుకు దూరంగా ఉన్న ప్రజల్ని ఉమ్మడి సహానుభూతులతో, ఉమ్మడి ధ్యేయాలతో, దగ్గరకు చేర్చటంలో గొప్ప ప్రయోజనకారి కాగలదు.'

భారత దేశం ఒక జాతిగా రూపొందటమన్నది ఓ సుదీర్ఘ చారిత్రక ప్రక్రియ. పైగా భారత దేశంలోని భిన్నత్వం కారణంగా ప్రపంచంలో మరే ప్రాంతంలోనూ ఎవరికీ అవగాహన లేని ప్రత్యేక యత్నంచేసి జాతీయ ఐక్యతను జాగ్రత్తగా పెంపొందించ వలసి ఉందని కాంగ్రెసు నాయకులు గుర్తించారు. అన్ని ప్రాంతాలకూ దగ్గరయ్యే ప్రయత్నంగా కాంగ్రెసు సభలను దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించసాగారు. ఏ ప్రాంతంలో అయితే కాంగ్రెసు సభ నిర్వహింప బడుతున్నదో ఆ ప్రాంతానికి చెందని వ్యక్తిని అధ్యక్షునిగా ఎన్నుకునేవాళ్లు.

అన్ని మతాల వారికి చేరువ అయ్యేటందుకూ మైనార్టీలలో భయాన్ని పారద్రోలేందుకూ 1888 నాటి కాంగ్రెసు మహాసభలో ఒక నిబంధనను రూపొందించారు. దాని ప్రకారం హిందూ లేదా ముస్లింలలో వర్గాల్లోని అత్యధిక సంఖ్యాక ప్రతినిధులు అభ్యంతరం లేవనెత్తిన అంశాలపై తీర్మానాలు చేయరాదు. 1889లో లేజిస్లేటివ్ కౌన్సిళ్ల సంస్కరణలు కోరుతూ చేసిన తీర్మానంలో మైనారిటీ క్లాజునొకదానిని జోడించటం

జరిగింది. ఆ క్లాజు ప్రకారం పార్శీలు, క్రైస్తవులు, ముస్లిములు లేదా హిందువులు మైనారిటీలుగా వున్న ప్రాంతాల్లో కౌన్సిళ్లకు ఎన్నుకొనబడే ఆయా మైనారిటీ వర్గాల సభ్యుల సంఖ్య జనాభాలో ఆయా మైనారిటీల దామాషాకు తక్కువగా ఉండరాదు. ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టిన వారు తెలియజేసిన కారణమేమంటే – భారతదేశం ఇంకా ఓ సజాతీయ దేశంగా రూపొందలేదు. కనుక యిక్కడి రాజకీయ పద్ధతులకూ, ఐరోపాలోని వాటికీ వ్యత్యాసం ఉండి తీరుతుంది.

కాంగ్రెస్సే గాఢమైన లౌకిక సంస్థగనుక తొలినాటి జాతీయ నాయకులు ఒక లౌకిక రాజ్య స్థాపనకు స్థిరసంకల్పులయ్యారు.

* * *

తొలినాటి కాంగ్రెసు ప్రధానాశయాలలో రెండవది ఒక ఉమ్మడి రాజకీయ కార్యక్రమాన్నో , వేదికనో సమకూర్చటం; దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రాజకీయ కార్యకర్తలు ఒక చోట చేరి వాళ్ల రాజకీయ కార్యకలాపాలను నిర్వహించుకోవటం; ప్రజల్ని అఖిల భారత ప్రాతి పదికపై సమీకరించటం; విజ్ఞానాన్నందించటం; దాని సాధనకు పాలకులకుసంబంధించి భారతీయులకు ఉమ్మడిగా ఎదురయ్యే సమస్యల కోసం పోరాడుతూ, హక్కుల్ని సాధించుకోవలసి ఉంది.

ఆ కారణంగానే కాంగ్రెసు సాంఘిక సంస్కరణల జోలికి పోలేదు. దాని రెండవ మహాసభకు అధ్యక్షత వహించిన దాదాభాయి నౌరోజీ ఒక నియమాన్ని రూపొందించి యిలా చెప్పటం జరిగింది – 'ఈ జాతీయ కాంగ్రెసు తప్పని సరిగా జాతి యావత్తూ నేరుగా పాల్గొనేటటువంటి సమస్యలకు పరిమితం కావలసి ఉంది.' కనుక సాంఘిక సమస్యల్ని గురించి చర్చించేందుకు అది సరైన వేదిక కాదు. 'మన పాలకులకు మన రాజకీయ అభిలాషల్ని వ్యక్తపరిచేందుకు మనమంతా కలిసి ఓ రాజకీయ సంస్థగా రూపొందాం' అన్నారాయన.

* * *

ఆధునిక రాజకీయాలు – ప్రజాబాహుళ్యం పాల్గొనటానికీ, పోరాటాలకు, సమీకరణలకు సంబంధించిన రాజకీయాలు – భారతదేశానికి కొత్త. రాజకీయాలు ఏ కొందరికో ప్రత్యేకించినవి కావని అవి అందరికీ సంబంధించినవేనన్న భావన ప్రజలకింకా సుపరిచితం కాలేదు. ప్రజలు దీనిని గుర్తించనంత కాలం ఏ ఆధునిక రాజకీయ

ఉద్యమమూ సాధ్యపడదు. పైగా ఈ గుర్తింపు ఆధారంగా ఉత్తేజంతో కూడిన, కృతనిశ్చయంగల రాజకీయ అభిప్రాయాన్ని నిర్మించవలసి ఉంది. మేల్కొల్పటం, శిక్షణ నివ్వటం, నిర్వహించటం ప్రజాభిప్రాయాన్ని సంఘటిత పరచటం – ఇదంతా కాంగ్రెసు నాయకుల ప్రధాన చర్యగా కన్పించ సాగింది. తొలినాటి జాతీయతకు చెందిన మొదటి పని అంతా ఆ లక్ష్యం దిశగానే నియంత్రించ బడింది.

మొదటగా భావ ఏకీకరణ, రాజకీయీకరణ చదువుకున్న వారిలో జరిగిన తరువాతనే మిగతా వర్గాలవారి విషయం చూడాల్సి ఉంది. అసలు ప్రధానమైన లక్ష్యం ఏమంటే చిన్న చితక తగాదాల పరిష్కారాన్ని అధిగమించి బ్రిటన్‌లోని ధాన్య శాసన వ్యతిరేక సమితి పద్ధతిలో ఆమోదయోగ్యమైన రాజకీయ కార్యక్రమాన్ని నిర్వహించవలసి ఉంది. ఆనాటి మహాశక్తి వంతమైన రాజ్యానికి వ్యతిరేకంగా రాజకీయ ప్రతి పక్ష పాత్ర నిర్వహణకు నాయకులు, ప్రజలు తమ స్థాయిలో తాము విశ్వాసాన్ని పెంచుకోవలసి ఉంది.

ఇదంత సులువైన పనేంకాదు. సుదీర్ఘ కాలపు రాజకీయీకరణ జరగాల్సి ఉంది. తదనంతర రచయితలు, విమర్శకులు చాలా మంది పూర్వపు జాతీయ వాద నాయకుల రాజకీయ పోరాట విధానాలపై – వాళ్ల ఫిర్యాదులపై విజ్ఞప్తులపై, వాస్తవ ప్రకటనలపై – ఎక్కుపెట్టారు. తొలితరం జాతీయ' వాద నాయకులు ప్రజా ఉద్యమాలు, ప్రజా పోరాటాలు నిర్వహించని మాట నిజమే. అయితే వాళ్ల కృషిలోని అత్యంత ప్రధానమైన భాగాన్ని విమర్శకులు గమనించనేలేదు – అదంతా రాజకీయం దిశగానే నడిచింది. ప్రజలను రాజకీయాలవైపు తిప్పటంగానే గడిచింది. రాజకీయ ఋషిగా గుర్తింపు పొందిన జస్టిస్ రనడే తన సహజ సిద్ధమైన సమ్యగ్దృష్టి పద్ధతిలో 1891 నాటికే దీనిని గమనించటం జరిగింది. పూనా సార్వ జనిక సభ జాగ్రత్తగా ఎంతో కష్టపడి తయారుచేసి పంపిన సుదీర్ఘ వాస్తవ విషయాలతో కూడిన లేఖపై ప్రభుత్వం కేవలం రెండు పంక్తుల సమాధానాన్ని పంపిన సందర్భంగా ఇరవైయ్యారేళ్ల యువకునిగా ఎంతో అసహనాన్ని ప్రదర్శించే గోఖలే నిరాశకు గురయి నప్పుడు రనడే పునర్నిర్ధారణ చేసిందేమంటే – 'మనదేశ చరిత్రలో మన స్థానాన్ని నీవు గుర్తించటం లేదు. ఈ పత్రాలు ప్రభుత్వానికి ఏదో నామ మాత్రంగా పంపాం. వాస్తవానికి అవి ప్రజల్ని ఉద్దేశించి నటువంటివి. అటువంటి విషయాలలో వాళ్లు ఏ విధంగా

ఆలోచించవలసింది నేర్పేందుకే అలా చేసాం. ఈ కృషి సంవత్సరాల తరబడి మరింకే ఫలితాన్ని ఆశించకుండా కొనసాగించాల్సిందే; ఎందుకంటే ఈ విధమైన రాజకీయాలు ఈ నేలకు కొత్త.'

జాతీయోద్యమ ఆ విర్భావానికి ప్రధాన ఆశయంలో భాగంగా ఉమ్మడి అఖిల భారత జాతీయ – రాజకీయ నాయకత్వాన్ని రూపొందించాల్సి ఉంది. అంటే పేరెన్నిక గన్న ఇటాలియన్ మార్క్సిస్టు ఆంటానియో గ్రామ్‌సీ అన్నట్లు ఉద్యమ ప్రధాన కార్య స్థానాన్ని రూపొందించాల్సి ఉందన్న మాట. ఏ జాతి అయినా, ప్రజ అయినా అర్ధవంతమైన ప్రబల రాజకీయ చర్యకు సంసిద్ధులు కావాలనుకుంటే వాళ్లు నిర్మాణపరమైన పటిష్టతను పెంపొందించుకున్నప్పుడే అది సాధ్యం. అలా వ్యవస్థీకృతమైనప్పుడే వాళ్లు ప్రజలుగానో 'చారిత్రకపౌరులు' గానో గుర్తింపబడతారు. జాతీయోద్యమంలో తొలి అడుగు ఎప్పుడు వేయటం జరుగుతుందంటే జాతీయ భావనల లేదా జాతీయ తాదాత్మ్యతల 'వాహకాలు' ప్రజల్ని సంఘటితపరచటం ప్రారంభించినప్పుడే అది విజయవంతం కావాలంటే ఈ 'వాహకాలు' లేదా నాయకులు తప్పని సరిగా ఏకం కావలసి ఉంది. వాళ్లంతా ఉమ్మడి తాదాత్మ్యతను పంచుకోవల్సి ఉంటుంది. అంటే వాళ్లు ఒకళ్ల నొకళ్లు బాగా తెలుసుకోవాలి; ఉమ్మడి దృక్కోణాన్ని, సమ్యగ్దృష్టిని ప్రయోజన వివేకాన్ని, ఇంకా ఉమ్మడి భావనల్ని రూపొందించి పంచుకోగలగాలి. 1885 మార్చిలో జరగనున్న కాంగ్రెసు మహాసభలకు హాజరు కానున్న రాజకీయ కార్య కర్తలకు సమాచారాన్నందిస్తూ ఒక సర్క్యులర్ పంపటం జరిగింది. 'జాతి ప్రగతి కోసం శ్రమించే నిస్వార్ధ కార్యకర్తలందరూ ఒకరికొకరు వ్యక్తిగతంగా బాగా తెలుసు కోవాలని' కాంగ్రెసు కోరుతున్నదని అందులో పేర్కొన్నారు. డబ్ల్యు. సి. బెనర్జీ తొలి కాంగ్రెసు అధ్యక్షునిగా కాంగ్రెసు ఆశయాలలో ఒక దానిని యిలా పునరుద్ఘాటించారు. "మనదేశ ప్రేమికులందరూ వ్యక్తిగతమైన సంపర్కం ద్వారా మైత్రీ భావనలు సరాసరి పెంపొందించుకొని జాతి, కుల, ప్రాంతీయ దురభిమానాలను దేశ ప్రేమికులందరూ దూరం చేసుకుంటూ, సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాల్లో దేశంకోసం కృషి చేసే మనఃపూర్వక కార్యకర్తలందరిలో వ్యక్తిగత సాన్నిహిత్యం, స్నేహ భావన పెంపొందించుకోవాలి.

వేరే మాటల్లో చెప్పాలంటే జాతీయోద్యమానికి ప్రప్రథమంగా కావలసింది జాతీయ నాయకత్వమని కాంగ్రెసు సంస్థాపకులు అర్థం చేసుకున్నారు. ఈ నాయకత్వం పెంపొందించుకోనున్న సామాజిక – సైద్ధాంతిక సంకీర్ణత అన్నది జాతీయోద్యమ నిర్మాణపు

ప్రధాన ఆశయానికి భిన్నమైనది. ఈ సంకీర్ణత అనేక అంశాలపై ఆధారపడినటువంటిది : విభిన్న సామాజిక వర్గాల ప్రవర్తన పైనా సైద్ధాంతిక ప్రభావాలపైన, సిద్ధాంతాల సిగపట్లలోని ఫలితాల పైనా, అలాంటివే యింకెన్నిటిపైనో...

రాజకీయ ప్రజాస్వామ్యపు అంతర్గతీకరణ, దేశీయీకరణలు వాళ్ల ప్రధాన ఆశయాలుగా తొలినాటి జాతీయ నాయకులు భావించారు. వాళ్ల రాజకీయాలకు ప్రజా సార్వభౌమత్వ సిద్ధాంతమే ఆధారం. దాదాభాయి నౌరోజీ మాటల్లో చెప్పాలంటే – 'ప్రజలకొరకే ప్రభువులు కాని, ప్రభువుల కొరకు ప్రజలు లేరనేది సరికొత్త పాఠం.

మొదటి నుండీ కాంగ్రెసు ఒక పార్లమెంట్ మాదిరిగా నిర్వహింపబడింది. వాస్తవానికి కాంగ్రెసు అనే పదమే ఉత్తర అమెరికా చరిత్ర నుండి స్వీకరింపబడింది, కాంగ్రెసు అంటే ప్రజల సభ. కాంగ్రెసు మహాసభలు ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహింపబడేవి. అంశాల వారీగా చర్చించి, వాదించి, అప్పుడప్పుడూ ఓటింగు పద్ధతి ద్వారా నిర్ణయాలు గైకొనేవారు. భారత దేశంలో పార్లమెంటరీ ప్రజా స్వామ్యాన్ని నెలకొల్పి దేశీయీకరణ గావించి, ప్రజామోదం పొందేట్లు చేసింది కాంగ్రెసే. కాని కొందరు రచయితలు వాదించినట్లుగా నిరంకుశాధికార, నియంతృత్వ వలస పాలన కానే కాదు.

అదేవిధంగా, అలనాటి జాతీయ నాయకులు పౌరస్వేచ్ఛను పెంచి పోషించారు. జాతీయోద్యమానికి దానిని అనుసంధానించి అంతర్భాగం గావించారు. పత్రికా స్వేచ్ఛకూ వాక్ స్వాతంత్ర్యానికీ ఏ మాత్రం భంగం వాటిల్లినా ఎదురు తిరిగారు; వాటిని లేకుండా చేసే ప్రతి ప్రయత్నాన్నీ వ్యతిరేకించారు. న్యాయపరిపాలన, కార్యనిర్వాహణాధికారాలు వేరువేరుగా ఉండాలని పోరాడారు. జాతి వివక్షను వ్యతిరేకించారు.

* * *

వలసతత్వాన్ని గురించిన అవగాహనను రూపొందించవలసిన అవసరం ఏర్పడింది. ఆ అవగాహనాధారంగా జాతీయతా సిద్ధాంతాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయంలో తొలినాటి జాతీయవాద నాయకులు అటు నేర్పేవాళ్లూ వాళ్లే; ఇటు నేర్చుకునేవాళ్లూ వాళ్లే. 1870, 1880 దశకాల్లో వాళ్లకు వండి వార్చిన వలస విధాన వ్యతిరేక అవగాహన లేదా సిద్ధాంతం అందుబాటులో లేదు. వాస్తవాలను గట్టిగా అధ్యయనం చేస్తూ, వాళ్లు అనుసరించే విధానాన్ని బేరీజు వేసుకుంటూ వాళ్లకు వాళ్లే ఒక వలస వాద విరుద్ధ తత్వాన్ని రూపొందించుకోవాల్సి వచ్చింది.

మేము ఒక జాతిగా వలస వాదాన్ని వ్యతిరేకించే శత్రువులం అనే వివరణతో కూడిన సైద్ధాంతిక పోరాటం లేకుండా జాతీయోద్యమాన్ని అసలు ఊహించలేం. వాళ్లు చాలా ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవాల్సి వచ్చింది. ఉదాహరణకు బ్రిటన్ భారత దేశాన్ని పరిపాలించేది భారత దేశం బాగుకోసమా? పాలకుల, పాలితుల ప్రయోజనాలలో సామరస్యం ఉందా లేక రెంటి మధ్యా ప్రధానమైన వైరుధ్య మేమయినా ఉందా ? అసలు వైరుధ్యం భారతీయులకూ బ్రిటీషు అధికారులకూ మధ్యనా లేక బ్రిటీషు ప్రభుత్వం తోనా లేక వలస పాలనా విధానంతోనా? శక్తి మంతమైన బ్రిటీషు ప్రభుత్వంతో భారతీయులు ఢీకొనగలరా ? ఢీకొంటే పోరాటం ఏవిధంగా సాగాలి?

వీటికి మరికొన్ని యితర ప్రశ్నలకూ సమాధానాలు వెతుక్కోవటంలో కొన్ని తప్పులు దొర్లాయి. ఉదాహరణకు తొలి తరం జాతీయవాదులు, కనీసం 20వ శతాబ్దపు ప్రారంభం వరకైనా, వలస రాజ్యపు స్వభావాన్ని అర్థం చేసుకోవటంలో విఫలులయ్యారు. వాస్తవాలతో పెనుగులాడేందుకు జరిగే తీవ్ర కృషిలో భాగంగా కొన్ని పొరపాట్లు దొర్లక తప్పదు. తప్పిదాల్ని, ఆటంకాల్ని అటుంచితే వాళ్లకు సిద్ధపరిచిన, అనాసక్తమైన, సమరూప సూత్రాలు లభించక పోవటం వాళ్ల దురదృష్టమేమీకాదు. అటువంటి సూత్రాలు చాలాసార్లు నిర్జీవంగా ఉండి కార్యాచరణకు సహకరించ జాలవు.

నిజమే తొలినాటి జాతీయ నాయకులు బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహించలేదు. అయితే పరాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని నిర్వహించారు. జాతీయవాద పోరాటం లేదా సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాటం వలస పాలనా విధాన వ్యతిరేక పోరాటం అయ్యేందుకు ముందు వలస పాలనా విధానాన్ని 'గురించిన' పోరాటంగా వుందనేది విస్మరించరాని విషయం. కాంగ్రెసును స్థాపించిన పెద్దలు 'వలస పాలనా విధానానికి సంబంధించిన పోరాటాన్ని' అత్యద్భుతంగా నిర్వహించారు.

* * *

ప్రారంభం నుండీ కాంగ్రెసు, పార్టీగా గాక ఉద్యమంగానే నిలిచింది. ఇంతకు పూర్వం చర్చించిన స్థూలమైన ఆశయాలతో ఏకీభవించటానికి మించి యింకే ప్రత్యేకమైన రాజకీయ లేదా సిద్ధాంతపరమైన నిబద్ధతను అది క్రియాశీల కార్యకర్తలనుండి కోరలేదు. అలాగే దాని అనుయాయుల్ని ఒక సామాజిక వర్గానికో, మతాకో పరిమితం చేయలేదు.

ఉద్యమంగా దాని ప్రజాస్వామిక, లౌకిక, జాతీయవాద నిబద్ధత చెక్కుచెదరనంత వరకు అది విభిన్న రాజకీయ విధానాలను, సిద్ధాంతాలను, సామాజిక వర్గాలను, ముఠాలను ఏకీకృతం గావించింది. ఆవిర్భవించిన నాటి నుండీ కాంగ్రెసు వివిధ రాజకీయ ఆలోచనా ధోరణులు కలవాళ్లనూ, సమరశీలతలో ఎంతో తేడాలు కనబరిచేవాళ్లనూ, భిన్న ఆర్థిక మార్గానుయాయుల్ని తన నాయకత్వ శ్రేణుల్లో నిలుపుకుంది.

ముగింపుగా – ఆనాటి జాతీయవాద నాయకులు లౌకిక ప్రజాస్వామిక జాతీయ ఉద్యమానికి పునాదులు వేయవలసి ఉంది. ప్రజల్ని రాజకీయాలవైపు తిప్పి వాటిని గురించిన అవగాహనను పెంచాల్సి ఉంది. ఉద్యమానికి ముఖ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది – అంటే అఖిల భారత స్థాయిలో నాయకత్వ నిర్మాణం చేపట్టాల్సి ఉంది; వలస పాలనకు వ్యతిరేకంగా జాతీయవాద సిద్ధాంతాన్ని మెరుగు పరచి ప్రవర్ధమానం చేయాల్సి ఉంది.

తొలినాటి జాతీయ ఉద్యమపు సాఫల్య వైఫల్యాలపై చరిత్ర తీర్పు చెబుతుంది. అటువంటి తీర్పుకు అవ్యక్త, చారిత్రకేతర ప్రమాణాలపై ఆధారపడక దానంతట అది ఏర్పరచుకొన్న ప్రధాన ఆశయాలను ఏ మేరకు సాధించగలిగింది అని చూడాల్సి ఉంది. అలా చూచేట్లయితే అది సాధించింది చాలా గణనీయమే. అందువల్లనే 1880లో అది చాలా సీదా సాదాగా ప్రారంభమై 20వ శతాబ్దంలో అత్యంత అద్భుతమైన జనప్రియప్రజా ఉద్యమంగా విరాజిల్లింది. తొలి రోజుల్లో అది జరిపిన కృషిని అంచనా కట్టిన దాని ప్రముఖ నాయకుల ఇరువురు అందించిన ఫలితాలకు చరిత్ర కారులు అనంగీకారాన్ని తెలియజేయక పోవచ్చు. 1885నుండి 1905 వరకు కాంగ్రెసు చేపట్టిన సన్నాహక కార్యక్రమాన్ని పరామర్శిస్తూ డి. ఈ. వాచాకు దాదాభాయి నౌరోజీ 1905 జనవరిలో యిలా తెలియజేసారు: 'ప్రభవించే తరాలపై తన ప్రభావం స్తబ్దంగా, ప్రగతి హీనంగా ఉన్నదని దానిపై అదే (కాంగ్రెసు) ప్రదర్శించుకుంటున్న అసంతృప్తి, అసహనాలే మంచి ఫలితాలు లేదా ఫలాలు. అదే దాని పరిణామం, ప్రగతి.... (చేయవలసిందిక) కావలసిన పరిభ్రమణాన్ని సమకూర్చటమే – అది శాంతి యుతంగా గానీ లేక విప్లవ పథానగానీ. పరిభ్రమణ స్వభావం బ్రిటీషు ప్రభుత్వం లేదా బ్రిటీషు ప్రజల తెలివిగల లేదా తెలివి తక్కువ చర్యలపై ఆధారపడి ఉంటుంది.'

1907లో అప్పటి స్థితి గతుల్ని గోపాలకృష్ణ గోఖలే ఈ విధంగా విశ్లేషించారు: 'దేశం ప్రగతి ప్రధాన పయనిస్తున్న తరుణంలో మనం సాధించుకునేవి సన్నగిల్లుతాయనీ,

ఆశాభంగాలు మనను వెంటాడి పరీక్షిస్తుంటాయనీ మనం మరచిపోకూడదు. ఈ పోరాటంలో దూరదృష్టి మనకు కేటాయించిన స్థానం యిదే. ఆ స్థానానికి సంబంధించిన పని పూర్తి చేయటంలో మన బాధ్యత తీరినట్లే. మన దేశీయుల్లోని రానున్న తరాలు వాళ్ల విజయాల ద్వారా దేశానికి సేవజేసే అవకాశం కల్పించి తీరాల్సిందే. ఈ తరానికి చెందిన మనం మాత్రం ప్రధానంగా మన వైఫల్యాల ద్వారా సేవజేస్తూ తృప్తిని పొందాల్సిందే. ఎంత కష్టం అన్పించినా ఈ వైఫల్యాలనుండి ఉద్భవించే శక్తి చివరకు ఘనకార్యాలను సాధించి తీరుతుంది.'

* * *

ఇక ఏ.ఓ. హ్యూమ్ పాత్ర విషయానికొస్తే – కాంగ్రెసును స్థాపించిన వారు అంతటి శక్తిసంపన్నులు, శీల సంపన్నులయిన దేశభక్తులయినప్పుడు హ్యూమ్ ను కాంగ్రెసుకు ప్రధాన వ్యవహర్తను చేయవలసిన అవసరమేమొచ్చింది? హ్యూమ్ అందరినీ మెప్పించాడు. అందులో సందేహం లేదు. అప్పటి ఉదారవాద, ప్రజాస్వామ్య బద్ధ సహచరులందరూ, లాలా లజపతి రాయ్‌తో సహా హ్యూమ్‌వంటి గొప్ప ఆదర్శ వాదితో సహకరించటం అగౌరవమేమీ కాదని సరిగానే భావించారు. కానీ సరైన సమాధానం సమకాలీన స్థితిగతుల్లో లభిస్తుంది. భారత భూఖండపు పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే 1880వ దశకంలో రాజకీయవేత్తల సంఖ్య చాలా స్వల్పం. పాలకులకు బాహాటంగా ఎదురుతిరిగే సంప్రదాయం ఇంకా గట్టిగా వేళ్లూనలేదు.

దాదాభాయి నౌరోజీ, జస్టిస్ రనడే, ఫిరోజ్‌షా మెహతా, జి. సుబ్రహ్మణ్య అయ్యర్, సురేంద్రనాథ్ బెనర్జీ వంటి సాహసవంతులు, నిబద్ధతగల వ్యక్తులు కూడా హ్యూమ్‌తో సహకరించటం జరిగింది (బెనర్జీ ఒక సంవత్సరం తర్వాత). దాని క్కారణం కార్యక్రమం ప్రారంభించిన ఆ తొలి దశలో అధికారులతో వైరాన్ని పెంచుకోదలచుకోలేదు. కూలదోసే శక్తి గల సంస్థ ప్రధాన నిర్వాహకుడు పదవీ విరమణ చేసిన బ్రిటీషు సివిల్ అధికారి అయినట్లయితే పాలకులు ఆ సంస్థను అంతగా అనుమానించరనీ, దానిపై దాడికి దిగరనీ భావించారు. గోఖలే తనదైన నమ్రతా భావనతో రాజకీయ చతురతతో 1913లో ఈ విషయాన్ని స్పష్టంగానే ప్రకటించాడు: 'భారత జాతీయ కాంగ్రెసును ఏ భారతీయుడూ ప్రారంభించగలిగే వాడు కాదు... ఎవరయినా భారతీయుడు ... భారతదేశమంతటా విస్తరించే ఉద్యమాన్ని ప్రారంభించేందుకు ముందుకు వచ్చినట్లయితే భారతదేశంలోని అధికారులు అటువంటి ఉద్యమాన్ని రూపుదాల్చనిచ్చే వాళ్లు కాదు.

కాంగ్రెసు సంస్థాపకుడు ఒక ఘనమైన ఆంగ్లేయుడూ పేరెన్నికగన్న మాజీ అధికారి కానట్లయితే రాజకీయ ఉద్యమాలపట్ల అప్పుడున్న అపనమ్మిక కారణంగా అధికారులు ఉద్యమాన్ని అణచి వేసేందుకు వెనువెంటనే ఏదో ఒక మార్గాన్ని కనుగొనేవాళ్లే.'

మరో విధంగా చెప్పాలంటే హ్యూమ్, ఆంగ్లేయులలోని ఉదారవాదులు కాంగ్రెసును సురక్ష – కవాటంగా వాడుకోవాలనుకుంటే, కాంగ్రెసు నాయకులేమో హ్యూమ్‌ను పిడుగు పాటుకు వాహకంగా వాడుకోజూచారు. తరువాత పరిణామాలను చూచినట్లయితే కాంగ్రెసు నాయకుల ఆశలే నేరవేరాయి.

* * *

# 6 సామాజిక - మత సంస్కరణలు - జాతీయతా జాగృతి

**రా**జా రామమోహనరాయ్ 1828లో ఇలా వ్రాస్తారు: 'హిందువులు అనుసరించే వర్తమాన మత వ్యవస్థ వాళ్ల రాజకీయ లబ్ధిని పెంపొందించుకొనేందుకు అనువుగా లేదని చెప్పేందుకు చింతిస్తున్నాను. ఎన్నో ముక్కలు చెక్కలుగా వున్న వాళ్ల కులాలలోని తేడాలు దేశభక్తి భావనను దరిజేరనివ్వవు. వాళ్లల్లోని అనేకానేక మతపరమైన ఆచారాలు, వేడుకలు, శుద్ధి సూత్రాలు వాళ్లను కఠోర పరిశ్రమకు అనర్హుల్ని చేస్తాయి. కనీసం వాళ్ల రాజకీయ లబ్ధికోసమైనా సామాజిక సౌఖ్యం కోసమైనా వాళ్ల మతంలో మార్పు చోటు చేసుకోవాలనేది నా అభిమతం'. ఇది వ్రాసిన సమయంలో భారతీయులు అప్పుడప్పుడే ఆ శతాబ్ది భారతీయ సాంఘిక జీవనానికి అద్దం పట్టే బౌద్ధికమైన, సాంస్కృతికపరమైన అల్లకల్లోలాన్ని చవిచూస్తున్నారు. కనుక తక్షణ భారతీయ ప్రతిస్పందనగా దానిని మనం స్వీకరించాల్సి ఉంటుంది. బ్రిటీషు విజయం, దాని వలన సంక్రమించిన వలస భావన, సంస్కృతి; దేశవాళీ సంస్కృతి, సంస్థల శక్తి సామర్థ్యాలు, శక్తిహీనతల గూర్చిన ఆత్మవివేచనకు దారితీసింది. ప్రతిస్పందన రకరకాలుగా వున్నా సామాజిక, ధార్మిక జీవన సరళిని సంస్కరించవలసిన అవసరం ఉందనేది మాత్రం అందరూ విశ్వసించే విషయమే. ఈ శోధనకు సామాజిక మూలాన్ని సాధారణంగా పునరుజ్జీవం అని అంటారు. కాని అది అంత సముచితం కాదు. ఏది ఏమయినా అదికొత్తగా ఉద్భవిస్తున్న మధ్యతరగతిలోనూ,ప్రాచ్య పాశ్చాత్య పద్ధతులలో చదువుకొన్న వివేకవంతులలోనూ కన్పిస్తున్నది. పందొమ్మిదవ శతాబ్ది భారతదేశంలోని

సామాజిక – సాంస్కృతిక నవజీవన విధానానికి వలస పాలన అదును కల్పించిందేగాని దానిని మాత్రం అది సృష్టించలేదు.

సంస్కరణాభిలాష భారతదేశాన్ని చుట్టుముట్టింది. బెంగాలులో రాజారామ మోహనరాయ్ కృషి మూలంగా అది ప్రారంభమై 1828లో బ్రహ్మసమాజ స్థాపనకు దారితీసింది. భారతదేశంలో పలు ప్రాంతాల్లో శాఖలున్నా బ్రహ్మసమాజంతో పాటు యింకా మహారాష్ట్రలోని పరమహంస మండలి, ప్రార్థనా సమాజాలు; పంజాబు, ఉత్తరహిందూ స్థానంలోని ఆర్య సమాజం హిందువుల ముఖ్యమైన ఉద్యమాలలో కొన్ని. ఉత్తరప్రదేశ్‌లోని కాయస్థసభ, పంజాబులోని సరీన్‌సభ వంటికొన్ని ప్రాంతీయ కులపరమైన ఉద్యమాలూ ఉండేవి. మహారాష్ట్రలోని సత్యశోధక సమాజం, కేరళలోని శ్రీ నారాయణ ధర్మపరిపాలన సభ వంటి సంస్థల ద్వారా వెనుకబడిన కులాలు కూడా సంస్కరణా కార్యక్రమాన్ని చేపట్టాయి. అహ్మదీయ ఆలిఘర్ ఉద్యమాలు ముస్లిములలోనూ, సింగ్‌సభ శిక్కులలోనూ, రేణుమాయి మజ్దేయాసన్ సభ పార్శీల్లోనూ, సంస్కరణాభిలాషకు ప్రాతినిధ్యం వహించాయి. పరిధిలోనూ, విషయంలోనూ ఒక ప్రాంతానికి చెందినట్లు కన్పిస్తూ ఏదో ఒక నిర్దిష్ట మతానికి పరిమితమైనట్లు కన్పించినా వాటి సాధారణ సమ్యగ్ దృష్టి మాత్రం గణనీయంగా ఒకదాన్నొకటి పోలి ఉండేవి. అవి ఒక అంతర్వివేకశీలతకు ప్రాంతీయ మత వ్యక్తీకరణలే.

ఈ ఉద్యమాలు ప్రధానంగా మత సంస్కరణలకు ఉద్దేశించినవే అయినప్పటికి, వాటిల్లో ఏవీ కూడ కేవలం మత లక్షణాలనే కలిగిలేవు. గాఢమైన మానవతా వాద స్ఫూర్తితో ప్రాపంచిక విషయాలపైనే దృష్టిని నిలిపేవి. పరలోకము, ముక్తి వంటి విషయాలు వాటి చర్చనీయాంశాలలో చోటు చేసుకోలేదు. మరో లోకము ఉంటే ఉండవచ్చనే విషయాన్ని ప్రధానంగా ప్రయోజన లక్ష్యంతోనే రాజారామమోహనరాయ్ అంగీకరించేందుకు సిద్ధపడి ఉండవచ్చు. అక్షయకుమార్‌దత్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌లు నిరీశ్వరవాదులు. అతీంద్రియ విషయాలపై చర్చల్లోకి దిగేందుకు అంగీకరించేవాళ్లుకాదు. దేవుడున్నాడా లేడా అని ప్రశ్నించినప్పుడు విద్యాసాగర్ తనకు భగవంతుణ్ణి గురించి ఆలోచించే సమయంలేదనీ, ఈ భూమిమీద చేయవలసిందే యింకా చాలా ఉందనీ మేలమాడాడు. బంకించంద్ర చటర్జీ, వివేకానందుడు ధార్మికత్వంలోని లౌకిక ప్రయోజనాన్ని ఉద్ఘాటించి మానవజీవితం భౌతిక స్థితి గతుల్ని గుర్తించేందుకు నైతిక, ధార్మిక, భావుకస్వభావాల్ని ఉపయోగంలోకి తెచ్చేవాళ్లు.

మత విశ్వాసాలు, సామాజిక కట్టుబాట్ల మధ్య అవినాభావ సంబంధాలను దృష్టిలో వుంచుకొని చూస్తే సాంఘిక సంస్కరణకు పూనుకునే ముందు మత సంస్కరణకు పూనుకోవాల్సిన అవసరం తెలుస్తుంది. 'హిందువులకు మతం ప్రతి మలుపులో ఎదురవుతుంది. తినటంలో, తాగటంలో, తిరగటంలో, కూర్చోవటంలో, నిల్చోవటంలో పవిత్ర నియమాలను పాటించాల్సి ఉంటుంది. వాటిని అనుసరించకపోవటం పాపమూ, అపవిత్రమున్నూ.' అదే విధంగా ముస్లిముల సామాజిక జీవనంపై కూడా మత సిద్ధాంతాల ప్రభావం గాఢమే. మతం ఆనాడు బాగా పెత్తనం చేస్తున్న సిద్ధాంతమే. దానితో ఘర్షణ పడకుండా సామాజిక చర్య గైకొనటం అసాధ్యం.

* * *

పందొమ్మిదవ శతాబ్దిలో మత మూఢనమ్మకాలు, సామాజిక ఛాందసత్వం అల్లిన హానికరమైన సాలెగూడులో భారత సమాజం చిక్కుకుపోయింది. మేక్స్ వెబర్ దృష్టిలో హిందూ మతం 'గారడీ విద్య, అన్నిట్లోనూ ఆత్మఉన్నదనే విశ్వాసం, మూఢ విశ్వాసాల సమ్మేళనంగా తయారయ్యింది.' భగవంతుణ్ణి పూజించటం మానేసి జంతు బలులు, చిత్రహింసల వంటి జుగుప్సాకరమైన ఆచారాలను చేపట్టారు. విపరీతమైన, అనారోగ్యకరమైన ప్రభావాన్ని పూజారులు ప్రజల మనస్సుపై ముద్రించారు. విగ్రహారాధన, బహుదేవతారాధన, వాళ్ల స్థానాన్నిమరింత గట్టిపరిచేందుకు ఉపయోగపడింది. రాజా రామమోహనరాయ్ పేర్కొనట్లు వేదజ్ఞానం, క్రతువుల విశ్లేషణలపై వాళ్ల గుత్తాధిపత్యం అన్ని రకాల మత వ్యవస్థలకు మోసపూరిత స్వభావం అబ్బేట్లు చేసింది. విశ్వాసపాత్రులైన వారు కళ్లకు కన్పించని శక్తిమంతుడైన ఆ భగవంతునికి లొంగిపోవటమే గాకుండా ఈ పూజారుల చపల చిత్తాలకు కోరికలకు లోబడి జీవించవలసివచ్చింది. మతబోధలు ప్రజలకు తలపెట్టని అకృత్యం లేదు. పూజారుల కామవాంఛల్ని సైతం తీర్చేందుకు మహిళలు తమని తాము అర్పించుకునే వరకూ వెళ్లింది వ్యవహారం.

సామాజిక స్థితి గతులూ అంతే దారుణంగా వున్నాయి. ఇక స్త్రీల విషయమైతే అత్యంత దయనీయం. ఆడపిల్ల పుట్టుకను స్వాగతించేవాళ్లు కాదు; ఆమె పెళ్లి పెనుభారం; ఆమె వైధవ్యం అమంగళకరం. ఆడపిల్ల పుట్టగానే హత్య చేయటం అసాధారణం కాదు. ఈ తొలి ఘాతుకాన్నుండి బయటపడ్డ వాళ్లకు బాల్య వివాహమనే గుదిబండ. చాలాసార్లు పెళ్లి అనేది సామాజిక అవమానాన్నుండి కాపాడుకునే సాధనమయినందువల్ల వైవాహిక

జీవితం ఆనందానుభూతిని అందించలేకపోయింది. బెంగాలులో ఓ ఎనభయ్యేళ్ల వృద్ధ బ్రాహ్మణుడికి రెండు వందల మంది భార్యలుంటే అందులో అందరికంటే చిన్నామె వయస్సు ఎనిమిదేళ్లు మాత్రమే. ఎంతో మంది మహిళలకు వైవాహిక జీవితం ఏదో నామమాత్రమే. వాళ్ల భర్తలతో పునఃసంధాన వేడుకలు తూతూ మంత్రమే. వాళ్లు ఆ తరువాత కూడా భార్యల్ని కళ్లెత్తి చూచిన పాపానపోరు. అయినా సరే భర్తలు మరణిస్తే భార్యలు సతిని పాటించి చితిలో దూకాల్సిందే. దానినే రామమోహనరాయ్ 'ఏ శాస్త్రం ప్రకారం చూచినా హత్యే' నని వర్ణించింది. ఈ విధమైన సాంఘిక నిర్బంధాలను వాళ్లు అధిగమించగలిగినా విధవలుగా జీవితాంతం అసంతృప్తికి, నిర్లక్ష్యానికి, అవమానాలకు గురికావలసి వుంటుంది. కడగండ్లతో నిర్లక్ష్యం పాలవుతూ అగౌరవపరచబడుతూ వంచితులయ్యారు.

మరో బలహీనతాంశం కులం, సంప్రదాయబద్ధమైన ఆచారంలో అందించే హోదా ఆధారంగా వర్గశ్రేణి బంధురంగా విభజింప బడిన ఒక వ్యవస్థను అది కొనసాగిస్తూనే ఉంది. కులంతాలూకు నిబంధనలు సామాజిక గమనశీలతకు అడ్డుపుల్లలయ్యాయి; సామాజిక విభజనలను పెంచి పోషించాయి. వ్యక్తిగత చొరవను కుప్పకూల్చాయి. వీటన్నింటినీ మించింది అంటరాని తనపు అవమానం. అంటరాని తనం మానవ మర్యాదను మంటగలిపింది.

ఇవిగాక లెక్కకు మిక్కిలిగా అడ్డంకులు, అమాయకత్వం, హోదా, అధికారం, అంధప్రారబ్ధవాదం వంటి వాటిని సూచించే అనేక ఇతర ఆచారాలు నెలకొని ఉన్నాయి. అవి నైతికంగా పతనమవుతున్న సమాజపు గుణాలు కావని మనం ప్రక్కన పెట్టినా సంస్కరణ ఉద్యమాలు ఆధునికత్వం దిశగా ఒక సామాజిక వాతావరణాన్ని సృజియించాలనుకున్నాయి. అలా చేసేప్పుడు అవి ఇతరులకు హాని కలిగించాలని కోరుకునే లక్షణాలు లేని ఒక బంగారు గతాన్ని గుర్తుచేయ సంకల్పించాయి. పందొమ్మిదవ శతాబ్దపు పరిస్థితి పోగేసుకుంటూ వచ్చిన స్థితి – పూర్వపు ఆదర్శాల వక్రీకరణ. అయితే సంస్కర్తల ముందు చూపు మాత్రం ఈ విధమైన ఊహాత్మక ప్రమాణాలపై ఆధారపడి లేదు. అది కేవలం ఒక సహకారం, ఒక పనిముట్టు – ఎందుకంటే విశ్వాసాలకు సంబంధించిన ఆచారాలను విశ్వాసపు ప్రమేయం లేకుండా ఎదుర్కొనటం సాధ్యపడదు. అందువల్లనే రాజా రామమోహనరాయ్ సతీసహగమనానికి ఏ విధమైన మతపరమైన

అనుమతి లేదని నిరూపించవలసి వచ్చింది. శాస్త్రాల ఆమోదం కలదని విశ్వసించే వరకు విద్యాసాగర్ 'విధవా వివాహాలను సమర్థిస్తూ కలం కదపలేదు.' దయానందుడు తన కుల వ్యతిరేకతకు వేద ప్రామాణ్యాన్ని ఆధారం చేసుకొన్నాడు.

అలా అని వర్తమానం గతానికి లోబడినట్లూ కాదు; సంప్రదాయానికి పునః ప్రాణప్రతిష్ట గుడ్డిగా చేసినట్లూ కాదు. మహారాష్ట్ర సంస్కర్తలలోని విశిష్ట వ్యక్తి మహాదేవ గోవిందరనడే అన్నట్లు 'చనిపోయి పూడ్చిపెట్టబడిన వాళ్లు ఎప్పటికీ చనిపోయినట్లే, పూడ్చివేయబడినట్లే, దహనం చేయబడినట్లే, అలాగే గతించిన గతాన్ని పునరుద్ధరించలేం. అయితే పాత సరుకును కొత్త సంఘటిత రూపాల్లోకి రూపాంతరీకరించినట్లు సంస్కరించేందుకుమాత్రం అవకాశం ఉంది.' గతాన్ని పునరుద్ధరించటం గాని, సంప్రదాయంతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవాలనిగానీ తలంచలేదు.

* * *

సంస్కరణోద్యమాలకు కావలసిన సమాచారాన్నందించిన రెండు ప్రధాన మేధో ప్రమాణాలేవంటే – హేతువాదం, విశ్వమానవ మతం. హేతువాదపు విమర్శనాత్మక పరిశీలన ద్వారా సామాజిక ఔచిత్యాన్ని నిర్ణయించేవాళ్లు. తొలినాళ్లలో రాజారామోహనరాయ్, అక్షయకుమార్‌దత్‌లు ప్రదర్శించిన రాజీపడని హేతువాద ధోరణికి సరితూగటం ఎంతో కష్టంగా వుండేది. అలౌకిక వివరణలను ఖండిస్తూ రాజారామమోహనరాయ్ కార్యకారణతను ప్రపంచంలో దృగ్గోచరమయ్యే వాటన్నింటికి జతచేసి చూపేవాడు. ఆయన దృష్టిలో సత్యానికి ఏకైక ప్రమాణం ప్రదర్శనా యోగ్యతే. 'హేతువాద మొక్కటే మన ఆదేశకుడు' అని చాటి చెప్పేందుకు అక్షయకుమార్ ఇంకో అడుగు ముందుకు వేసాడు. ప్రకృతి సిద్ధమై, సామాజికమై కేవలం కంటికి కనిపించే సమస్త విషయాలనూ కేవలం యాంత్రిక ప్రక్రియద్వారా విశ్లేషించి అర్థం చేసుకొనవచ్చునన్నాడు. ఈ విధమైన సమ్యగ్దృష్టి సంప్రదాయానికి హేతువాద ఉపగమనాన్ని అందించటమే గాక సమకాలీన, సామాజిక – ఆచారాలను సామాజిక వినియోగ ప్రాతిపదికపై పరీక్షించి నమ్మకం స్థానంలో హేతుబుద్ధిని నిలిపింది. బ్రహ్మసమాజంలో అది వేదాల అమోఘత్వాన్ని నిరాకరించేందుకు దారితీసింది; ఆలీఘర్ ఉద్యమంలో ఇస్లాం బోధనలు ఆధునిక కాలపు అవసరాలతో సఖ్యత పడేట్లు చేసింది. మత సిద్ధాంతాలనేవి మార్పు చెందనటువంటివి కావని చెప్తూ సయ్యద్ అహ్మద్‌ఖాన్ సామాజిక

ప్రగతిలో మత పాత్రను నొక్కి వక్కాణించిందేమంటే – మతం కాలంతో పాటు పరివర్తన జెందుతూ కాలానుగుణమైన అభ్యర్థనలను తీర్చలేకపోతే ఇస్లాం భారతదేశంలో అయినట్లే శిలాజంగా నిలిచిపోతుంది.

సంస్కరణల సమ్యగ్దృష్టి ఎల్లప్పుడూ మత ఆలోచనలవల్లనే ప్రభావితం కాబడదు. అమలులో వున్న సామాజిక ఆచార వ్యవహారాలకు ప్రత్యామ్నాయాన్ని చూపటంలో జాతీయ, లౌకిక దృష్టిపాత్ర సుస్పష్టమే. విధవా వివాహాలను సమర్ధిస్తూ, బాల్య వివాహాలను బహుభార్యత్వాన్ని నిరసిస్తూ అక్షయకుమార్ మతపరమైన ఆంక్షల్నీ, అనుమతుల్నే కాదు, అసలుగతంలో అవి ఉన్నాయో లేదో కూడా పట్టించుకోలేదు. ఆయన వాదనలన్నీ సమాజం మీద అవి చూపే ప్రభావాలపైనా కేంద్రీకరించబడినాయి. బాల్య వివాహాల విషయంలో మత గ్రంథాలమీద ఆధారపడక వైద్య సలహాలు వాటికి వ్యతిరేకంగా ఎందుకు ఉన్నదీ పేర్కొన్నాడు. కుటుంబం, వివాహం విషయంలో చాలా అభ్యుదయ భావాలు ప్రకటించేవాడు – పెండ్లికి ముందు ప్రేమ అవసరమనీ, దాంపత్య జీవితానికి సమానత్వము, భాగస్వామ్యమే ఆలంబనలనీ, విడాకుల చట్టమూ, సంప్రదాయమూ అనుమతించాలని వాదించేవాడు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మహారాష్ట్రలో సంఘసంస్కరణకు సహాయ కారిగా మతంపైన చాలా తక్కువగా ఆధారపడటం జరిగింది. లోకహితవాదిగా పేరుగాంచిన గోపాల్ హరిదేశ్ముఖ్‌కు సంఘ సంస్కరణలకు మతం యొక్క ఆమోదం ఉన్నదా లేదా అనేది అప్రాముఖ్యం. ఒక వేళ మతం వీటిని అనుమతించకపోతే మతాన్నే మార్చాల్సి ఉంటుందన్నాడు – ఎందుకంటే మతం మానవుడి సృష్టే గనుక. పైగా మత గ్రంథాలలో వున్నదంతా సమకాలీన పరిస్థితులకు వర్తించాలని లేదన్నాడు.

సంస్కరణల పరిధి కొందరికే పరిమితం; మత దృష్టి విశ్వజనీనం. సార్వత్రిక ఆస్తికవాద జాతీయ రూపాలుగా విభిన్న మతాలను రాజారామమోహనరాయ్ భావించాడు. తొలుదొల్త ఆయన బ్రహ్మ సమాజాన్ని విశ్వజనీన మత విశ్వాసపు సముదాయంగా ఆయన భావన చేసాడు. అన్ని మతాల విశ్వజనీన మూల సూత్రాలను ఆయన సమర్థించేవాడు. పరబ్రహ్మమొక్కడే అనే వేద సారాన్నీ, క్రైస్తవంలోని ఏకతావాదాన్నీ సమర్థిస్తూనే హిందూ మతంలోని బహుదేవతారాధన, క్రైస్తవంలోని త్రయీ భావం వంటి విషయాలపై ధ్వజమెత్తేవాడు. సయ్యద్ అహ్మద్‌ఖాన్ ఆలోచనలూ అలాగే ప్రతిధ్వనించేవి: ప్రవక్త

లందరిదీ ఒకే 'మతం' (విశ్వాసం); ప్రతి దేశం, జాతి రకరకాల ప్రవక్తలకు నెలవు. కేశవ చంద్ర సేన్ ఆలోచనలలో యిది మరింత సమగ్రతను సంతరింపజేసుకొంది. 'మతాలలోని సత్యాలను అన్వేషించటం కాదు మనపని; ప్రపంచంలో స్థిరత్వాన్ని సంపాదించుకొన్న మతాలన్నీ సత్యాలే.' ఈ సార్వజనిక సమ్యగ్దృష్టి యొక్క సామాజిక చిక్కుల్ని ఆయన విడమర్చి చెప్పారు: 'నిజమైన భగవంతుణ్ణి నిత్యం ఎవరైతే పూజిస్తారో వాళ్లంతా తమతో పాటు జీవించే దేశీయులందరినీ సోదరులుగా గుర్తించగలగాలి. అటువంటి సమాజంలో కులం కన్పించకుండా పోతుంది. నేను నా భగవంతుడు ఒక్కడేనని విశ్వసిస్తే, ఆయన మనందర్నీ సృష్టించాడనుకుంటే మరి నేను సహజ స్పందనతో, సహజ భావనల సానుభూతితో నాచుట్టూ ఉన్నవాళ్లందర్నీ వాళ్లు పార్శీలుకానీ, హిందువులు కానీ, మహమ్మదీయులు కానీ,యూరోపియన్లు కానీ – సోదరులుగా చూడగలగాలి.'

సార్వజనిక సమగ్ర దృష్టి కేవలం దార్శనికతకే సంబంధించినటువంటిది కాదు: ఆనాటి రాజకీయ, సామాజిక దృక్కోణంపై అది శక్తివంతమైన ప్రభావాన్ని చూపింది. పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థంలో మత వివక్ష బలపడేంత వరకు అది అలాగే కొనసాగుతూ వచ్చింది. ఉదాహరణకు రాజా రామమోహన రాయ్ హిందూ న్యాయవాదులకంటే ముస్లిం న్యాయవాదులు ఎక్కువ గౌరవనీయులని భావిస్తే విద్యాసాగర్ మాత్రం మానవ సంక్షేమ వ్యవహారాలలో ముస్లిములను వేరుచేసి చూసేవాడు కాదు. హిందూ దృక్పథం వైపు మొగ్గు చూపుతాడనుకునే బంకిం సైతం ఒక వ్యక్తి యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసేది అతనిలోని ధర్మమేగాని అతను ఏ మతానికి సంబంధించిన వాడు అనేది కాదనిపిస్తుందన్నాడు. అయినా 'ముస్లిం నిర్బంధం', 'ముస్లిం నిరంకుశత్వం' వంటి పదాలు వలస పాలనకు ముందటిపాలనను వివరించేందుకు తరచుగా వాడేవారు. అయితే ఇది వలస పాలనకు ముందున్న రాజకీయ సంస్థల ఇష్టారాజ్యపు స్వభావం వల్ల ప్రభావితమైన ఒక రాజకీయవైఖరేగాని, మతపరమైనది కాదు. అక్కడ ప్రాధాన్యత 'ముస్లిం' అనే దానికి కాదు; 'నిరంకుశత్వం' అనే దానికి. వలస పాలనకు ముందున్న వ్యవస్థను గూర్చి సయ్యద్ అహ్మద్‌ఖాన్ వివరణ వల్ల మనకు మరింత తేటతెల్లమవుతుంది: 'పూర్వపు చక్రవర్తుల, రాజుల పాలన అటు మహమ్మదీయ లేదా ఇటు హిందూ మత పరంగా నిర్వహింపబడినటువంటిది కాదు. అది కేవలం అణచివేత నిరంకుశత్వాలపైనే

ఆధారపడినటువంటిది.; బలవంతునివే హక్కులన్నీ; ప్రజావాణిని పట్టించుకున్న వాళ్లే లేరు.' కనుక ఇక్కడ కొలమానం ఉదారస్వభావం, ప్రజాస్వామిక సిద్ధాంతాలే కాని మతపరమైన గుర్తింపు కానేకాదు. అయితే మతపరమైన గుర్తింపు ప్రజల సామాజిక దృష్టిపై ప్రభావాన్ని ప్రసరింపజేయలేదనే అర్థాన్ని యిక్కడ తీయరాదు. వాస్తవానికి దాని ప్రభావం అధికమే. విశ్వజనీనతపై సంస్కర్తల వక్కాణింపు దాని పట్ల తృప్తిని కనబర్చే ప్రయత్నంగా అర్థం చేసుకోవాలి. అయితే వలస సంస్కృతిభావనల సవాళ్లను ఎదుర్కొనవలసి వచ్చినందున విశ్వజనీన భావన లౌకిక మౌలికతను పెంపొందించేందుకు ఆసరా నివ్వటానికి బదులు మతపరమైన వివక్ష దిశగా తిరోగమించింది.

* * *

పందొమ్మిదవ శతాబ్ది ఒక ప్రక్క సంప్రదాయ సంస్కృతిలోని తిరోగమన శక్తులపై సాంస్కృతిక – సైద్ధాంతిక తిరుగుబాటు, మరో ప్రక్క పెత్తనం చెలాయించే వలస సంస్కృతి, సిద్ధాంతాల విజృంభణ రెంటినీ చూడగలిగింది. తొలి దశ సంస్కరణల కృషి మొదటి దానికి సంకేతం. మతానికి సంబంధించి వాళ్లు విగ్రహారాధనను, బహుదేవతా విశ్వాసాన్ని, మతపరమైన జ్ఞానంలో పూజారుల ఆధిపత్యాన్నీ నిర్మూలించి మతాచారాలను సరళతరం చేసారు. అలా చేయటం మతపరంగా ప్రాముఖ్యతను సంతరించుకోవటమే గాకుండా సమాజ పరమైన చిక్కుల్ని తొలగించేందుకూ అంతే ప్రధానమయ్యాయి. భయం కారణంగా మనిషి సంప్రదాయాలకు కట్టుబడటం నుండి విముక్తి పొందగలగటమేగాకుండా, పూజారుల దోపిడీకి వివేచన లేకుండా లొంగిపోవటాన్ని కూడా అరికట్ట గలిగింది. మత గ్రంథాలను దేశంలోని వివిధ భాషల్లోకి అనువదించటం ద్వారా మతపరమైన జ్ఞానాన్ని వ్యాప్తి చెందించటమే గాకుండా మత గురువులు కానివాళ్లు కూడా మత గ్రంథాలకు భాష్యాలు చెప్పే హక్కును పొందటంతో వక్ర భాష్యాల కారణంగా స్థిరమైన విశ్వాసాలు ఊపిరి సలపనివ్వని స్థితికి ముందుగా గండికొట్టినట్లయ్యింది. ఆచారాలు సరళతరం కావటంతో పూజా పునస్కారాలు బాగా వ్యక్తిగతమై దళారులైన పూజారుల మధ్యవర్తిత్వంతో పనిలేకుండా పోయింది. వ్యక్తి ఆవిధంగా తన స్వేచ్ఛను అనుభవించేందుకు ప్రోత్సాహం లభించింది.

సామాజిక అంతరాలను స్థిరపరచి సామాజికంగా కృంగదీసే కుల వ్యవస్థ విషయం వెనువెంటనే సంస్కరణలకు గురికావలసి ఉందనేది అందరూ గుర్తించిన విషయమే. అది నైతికంగా ఏవగింపు కలిగించే విషయం: అంతకు మించి ముఖ్యంగా అది దేశభక్తి భావనలకు వ్యతిరేకంగా నడిచింది. ప్రజాస్వామిక భావనలను వమ్ము చేసింది. రాజా రామమోహనరాయ్ తిరుగుబాటుకు శ్రీకారం చుట్టాడు – ఆలోచనల్లో, ఆచరణలో కాదు; అయితే శతాబ్దం ముందుకు జరుగుతున్న కొద్దీ దానికి మరింత స్పష్టత, ఊతం చేకూరాయి. రనడే, దయానంద, వివేకానంద అప్పటి కుల వ్యవస్థను స్పష్టంగానే దుయ్యబట్టారు. సంస్కరణోద్యమాలు దాని నిర్మూలనకు నడుం బిగించగా దయానందుడు చాతుర్వర్ణ వ్యవస్థకు ఒక ఊహాజనితమైన వివరణ నిస్తూ దానిని అంతర్గత యోగ్యత ఆధారంగా నిలబెట్టజూసాడు. 'ఏ వ్యక్తి అయితే మంచి జ్ఞానాన్ని పొంది మంచి నడవడికను కలిగి ఉంటాడో అతడే బ్రాహ్మణుడు. అజ్ఞాని శూద్రుడుగా భావింప తగినవాడు' అని వాదించేవాడు. కులం పట్ల తీవ్రమైన వ్యతిరేకత నిమ్న కులాల ఉద్యమాల నుండి ఉద్భవించిందనేది అర్థం చేసుకోవచ్చు. కుల వ్యవస్థను, దాని పరిణామాలను బాగా ఎండగట్టిన ఇరువురు విమర్శకులు – జ్యోతిబా ఫూలే, నారాయణ గురు అన్నవాళ్లు. గాంధీజీకి, నారాయణ గురుకు మధ్య జరిగిన ఒక సంభాషణ ప్రముఖమైనటువంటిది. చాతుర్వర్ణము మానవునికీ మానవునికీ మధ్య గల స్వతస్సిద్ధ విభేదాలను దృష్టిలో వుంచుకొని గాంధీజీ ఒకే చెట్టు ఆకులన్నీ పరిమాణంలోనూ, అమరికలోనూ అచ్చంగా అలాగే వుండవు కదా అన్నాడు. అప్పుడు నారాయణ గురు అందుకొని అన్నదేమంటే – తేడా అంతా పైపైనే; సారంలో మాత్రంకాదు. ఒక చెట్టు ఆకుల రసం అంతా ఒకే విధంగా ఉంటుంది. ఈయనే 'మానవాళి అంతటికీ ఒకే మతం, ఒకే కులం, ఒకే దేవుడు' అని పిలుపునిచ్చింది. అయితే అతని శిష్యుడు సహదరన్, అయ్యప్పన్ దానిని 'మానవాళికి మతం వద్దు, కులం వద్దు, దేవుడొద్దు'గా మార్చాడు.

మహిళల స్థితిని, హోదాను మెరుగు పరిచేందుకు చేపట్టిన ఉద్యమమూ సంపూర్ణ మానవీయరూపాన్ని ధరించలేదు. తొలిగా వ్యక్తి ఏ సామాజిక వాతావరణంలో, ఏ కుటుంబ స్థితిగతుల్లో నుండి రావటం జరిగిందో వాటిల్లో మార్పును తేకుండా

ఏసంస్కరణా నిజానికి అంత ఫలప్రదం కాజాలదు. కనుక సంస్కరింపబడిన గృహిణులు లేకుండా సంస్కరింపబడిన పురుషులు, సంస్కరింపబడిన కుటుంబాలు వర్ధిల్లేందుకు వీలులేదు. మగువల దృక్కోణం నుండి పరికించినట్లయితే అది నిజానికి పరిమిత అంచనాగానే గోచరిస్తుంది. అయినా తమ దేశంలోని 'స్త్రీలు అజ్ఞానంలో మునిగి ఉండగా నాగరికతలో ప్రస్ఫుటమైన ప్రగతి సాధన' ఏ దేశంలోనూ, ఎన్నడూ సాధ్యపడదనేది గ్రహింపుకొచ్చింది.

సంస్కరణ ఉద్యమాలు గనుక సంప్రదాయాలను పూర్తిగా విడనాడి వుంటే భారతదేశం పాశ్చాత్యీకరణ దిశగా అడుగులు వేసేది. కాని సంస్కర్తలు కోరుకుంటున్నది పాశ్చాత్యీకరణ కంటే ఆధునికీకరణనే. గుడ్డిగా పాశ్చాత్య సంస్కృతి కట్టుబాట్లను ప్రవేశపెట్టటం ఎన్నడూ సంస్కరణలలో అంతర్భాగం కాలేదు.

ఈ సంస్కరణలను అలా ప్రారంభించి నిర్వహించటం ఇవ్వాళ నిరాడంబరంగా, శక్తిహీనంగా, హద్దుమీరని పద్ధతిలో కన్పించవచ్చు గాని అది అంత తేలికయిన ప్రతిపాదనేం కాదు. అది మున్నెన్నడూ కనీ, వినీ ఎరుగనంతటి మానసిక వేదననూ, కుటుంబ జీవనానికి సంబంధించి సామాజికంగా చెప్పనలవిగాని మానసిక వత్తిడిని తెచ్చిపెట్టింది. సంప్రదాయ బంధనాల్ని తెంచివేసినందువల్ల స్త్రీ పురుషులందరూ భావావేశాల, భావానుబంధాల క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవలసి రావటంతో రెండు లోకాల మధ్య కొట్టుమిట్లాడుతున్నట్లయ్యింది. బెంగాలులోని తొలి విధవా వివాహం వేలాది మంది వింత ప్రేక్షకుల్ని ఆకర్షించింది. వాళ్లను వాళ్లు రక్షించుకునేందుకు అటువంటి తొలి దంపతులకు మహారాష్ట్రలో పోలీసులు లాఠీలు సమకూర్చారు! చదువు సంధ్యలులేని అసఫలవ్యక్తిని భర్తగా స్వీకరించేందుకు రుక్మాబాయి అంగీకరించక పోవటం నిజానికి అదుపు చేయ వీలుకాని తుపానులా తయారయ్యింది. తన అభీష్టానికి వ్యతిరేకంగా బాల్యవివాహం చేసుకోవలసి వచ్చినందుకు రనడేకు నిద్రపట్టని రాత్రులెన్నో. అలాగే లోక హితవాది తెలాంగ్ మరెందరో సంప్రదాయ భావానుబంధాలకూ, ఆధునిక నిబద్ధతలకూ మధ్య నలిగిపోయారు. సరే, పలువురు

సంప్రదాయాలకు తలవొగ్గినా, ఆ పెనుగులాట కారణంగానే భారతదేశంలో ఆధునికమానవులు, ఆధునిక సమాజం ఆవిర్భవించింది.

* * *

వలస సంస్కృతి, సిద్ధాంతాలుచొచ్చుకొని రావటాన్ని తట్టుకునేందుకు పందొమ్మిదవ శతాబ్దంలో సంప్రదాయ సంస్థలకు తిరిగి శక్తిని సమకూర్చేందుకు, శక్తిమంతమైన సంప్రదాయ సంస్కృతిని తిరిగి పొందేందుకు ప్రయత్నించటం జరిగింది. తొలిగా వలస ఆధిపత్యంపై పోరు అనే భావన సాంస్కృతిక రంగంలోనే వ్యక్తమయ్యింది. దానిక్కారణం, వలస రాజ్యపాలన ఏ సిద్ధాంతాల ప్రాతిపదికమీద నిర్వహింపబడిందో అవి వలసపాలనకు ముందున్ననాటి సిద్ధాంతాలకంటే మించి ప్రగతి నిరోధకాలేం కాదు. సాంస్కృతిక రంగంలోని చొరబాట్లన్నింటికీ తీవ్రంగా స్పందించటం జరిగింది. కనుక వలస పాలనపై దండెత్తటంతో పాటే దేశీయ సాంస్కృతిక పరిరక్షణపై కూడా శ్రద్ధ పెరిగింది.

ఈ శ్రద్ధ మొత్తం సాంస్కృతిక ఉనికిని; జీవనరీతిని, భాష, మతం, కళలు, దార్శనికతల్ని ఆలింగనం చేసుకుంది. ఈ శ్రద్ద రెండు విధాలుగా రూపుదాల్చింది – ఒకటి: ప్రత్యామ్నాయ సాంస్కృతిక భావనా వ్యవస్థను నెలకొల్పటం; రెండు: సంప్రదాయ సంస్థలను పునరుజ్జీవింపజేయటం. ప్రాంతీయ భాషా వ్యాప్తికి కృషి, ప్రత్యామ్నాయ విద్యావిధాన సృజన, భారతీయ కళల, సాహిత్య, పునరుజ్జీవనానికి కృషి, భారతీయ దుస్తులు, భారతీయ భోజనంపై శ్రద్ధ, మత సంరక్షణ, భారతీయ వైద్య విధాన పునరుద్ధరణ, వలసపాలనకు ముందున్న యాంత్రికత సామర్థ్యాలపై ఆరా, సంప్రదాయ జ్ఞానాన్ని పునర్నిర్మించుకోవటం వంటి చర్యలు అశ్రద్ధకు ప్రతిబింబాలే. వీటి తొలి జాడల్ని రాజా రామమోహనరాయ్ క్రైస్తవ మిషనరీలతో జరిపిన చర్చలలో; తత్వబోధిని సభ స్థాపన నిర్వహణలో, మద్రాసువాసులు70వేల మంది సంతకాలు చేసిన విద్యా విషయక మహజరు, లెక్స్‌లోకియాక్టు (క్రైస్తవులుగా మతం పుచ్చుకున్న హిందువుల వంశపారంపర్యపు ఆస్తిపై హక్కుల్ని కల్పించేందుకు 1845లో ప్రతిపాదించబడి 1850లో చట్టం చేయబడింది.) కు ఎదురైన నిరసనలో

గుర్తించవచ్చు.  అంతకు మించిన నిర్దిష్టమైన వ్యక్తీకరణ మితవాద, పునరుజ్జీవ ధోరణులుగా భావింపబడిన తరువాతి ఉద్యమాలలోని ఆలోచనలలో, కార్యక్రమాలలో గోచరిస్తుంది.  బలోపేతమైన స్వదేశీ ధోరణితో వలసవాద సాంస్కృతిక నేతృత్వానికి వ్యతిరేకంగా దేశీయ సంస్కృతిని సంరక్షించుకునే అవసరాన్ని అవి ప్రభావితం చేసాయి.  ఈ విధమైన చారిత్రక అవగాహనలో వలసాధిక్యత కారణంగా సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని – ఒకవేళ అవి ధ్వంసం కాకున్నా వక్రీకరణకు గురయిన కారణంగా – పునర్నిర్మించటమన్నది ప్రగతి నిరోధకం కానవసరం లేదు.  పైగా అది జాతీయ జాగృతిలో అంతర్భాగమయ్యింది. ఇటువంటి ధోరణులు కొన్ని చారిత్రక అవసరపు పరిధులకు అతీతం కాజాలక వర్గ పరమైన అస్పష్ట ధోరణులకు దారితీసాయి.  రాజకీయంగా ముందడుగు వేసినా, సాంస్కృతికంగా వెనుకబడి పోవటానికి బహుశా సాంస్కృతిక, రాజకీయ పోరాటాల మధ్య సఖ్యత లేమి కారణం కావచ్చు.

సామాజిక – ధార్మిక ఉద్యమాల ద్వారా నడిచిన సాంస్కృతిక – సైద్ధాంతిక పోరాటం అప్పుడే ఆవిర్భవిస్తున్న జాతీయ జాగృతిలో అంతర్భాగం.  దాని క్కారణం అది తొలిగా సమకూర్చిన బౌద్ధిక, సాంస్కృతిక విరామం భవిష్యత్తుకు కొత్త చూపును యివ్వగలిగింది.  పైగా అది వలస వాద సాంస్కృతిక భావనలను అడ్డుకొనే ప్రతిఘటనలో భాగమయ్యింది.  ఈ విధమైన ద్వైదీభావనల పోరాటంలో నుండి 'కొత్త మనుషులతో కొత్త కుటుంబాలతో, ఒక కొత్త సమాజంగా ఆధునిక సాంస్కృతిక స్థితి ఆవిర్భవించింది.

* * *

# 7 వలస వాద ఆర్థిక విధానాలపై విమర్శనాత్మక పరిశీలన

వలస దేశాల్లోని జాతీయోద్యమాలన్నింటిలోకీ భారత జాతీయోద్యమమే వలస విధాన ఆర్థిక విధానాల ఆధిపత్యం, దోపిడీల స్వరూప స్వభావాల పట్ల అవగాహనలో బాగా ఆరితేరింది. మితవాదులుగా గుర్తింపు పొందిన ఆ ఉద్యమ తొలినాటి నాయకులే ముందుగా పందొమ్మిదవ శతాబ్దంలో వలస విధానంపై ఆర్థిక పరమైన విమర్శను మెరుగుపరిచారు. భారతదేశంలో జాతీయోద్యమం బాగా పుంజుకునేందుకు బహుశా ఈ విమర్శ కూడా అతి ప్రధానమైన భాగమే. దాని చుట్టూ నిర్మించిన ప్రధాన విషయాలన్నీ తరువాత తరువాత బాగా ప్రజాదరణ పొంది ప్రసంగాల ద్వారా, కరపత్రాల ద్వారా, వార్తా పత్రికల ద్వారా, నాటకాల ద్వారా, పాటల ద్వారా, ప్రభాత భేరీల ద్వారా జాతీయోద్యమానికి చేవను అందించాయి.

పందొమ్మిదవ శతాబ్దపు ప్రథమార్థంనాటి భారత మేధావులు బ్రిటీషు పాలన పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకున్నారు. దానిక్కారణం అప్పటి అత్యంత అధునాతన దేశమైన బ్రిటన్ భారతదేశాన్ని ఆధునీకరణ గావిస్తుందేమోననే ఆశే. ప్రపంచ ఆర్థిక రంగంలో మహాశక్తి మంతమైన పారిశ్రామిక దేశంగా ఆవిర్భవిస్తున్న బ్రిటన్ ఆధునిక విజ్ఞానం సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టటం ద్వారా భారతదేశపు ఉత్పత్తి శక్తుల్ని అభివృద్ధి పరుస్తుందని ఆశించటం జరిగింది. పరాయి ప్రభుత్వపు ఆధిపత్యంలోని అనేకానేక రాజకీయ, మానసిక,

ఆర్థిక అశక్తతల పట్ల తొలినాటి భారత జాతీయ నాయకులకు అవగాహన లేక కాదు గాని అచ్చు పాశ్చాత్య మహానగరాల్లాంటి నగరాలతో భారతదేశాన్ని పునర్నిర్మించాలనుకున్నందువల్ల వాళ్లు వలస పాలనను సమర్థించటం జరిగింది.

1860 తరువాత వాళ్ల ఆశలకు అనుగుణంగా భారతదేశంలో సామాజిక అభివృద్ధి జరగనందున మెలమెల్లగా భ్రమలు తొలగిపోసాగాయి. కొత్త దిశలలో అభివృద్ధి నత్తనడక నడుస్తూంటే మొత్తం మీద దేశం తిరోగమనం అంచున వర్ధమాన దేశంగా నిలిచే స్థితిని వాళ్లు గమనించసాగారు. బ్రిటీషు పాలనను గురించిన వాళ్ల ఊహాచిత్రం నిదానంగా మసక బారసాగింది. బ్రిటీషు పాలనలోని వాస్తవాన్ని, భారతదేశంపై దాని ప్రభావాన్ని మరింత నిశితంగా పరిశీలించసాగారు.

1870–1905 మధ్య కాలంలో బ్రిటీషు పాలనలోని ఆర్థిక విశ్లేషణ ప్రారంభించి కొనసాగించిన ఎంతో మంది భారతీయుల్లో ముగ్గురి పేర్లు ప్రముఖంగా విన్పిస్తాయి. గాంధీకి పూర్వయుగంలో "గ్రాండ్ ఓల్డ్ మేన్ ఆఫ్ ఇండియా"గా ప్రసిద్ధికెక్కిన దాదాభాయి నౌరోజీ ఆ ముగ్గురిలో మరీ ప్రముఖుడు. 1825లో జన్మించిన ఆయన వ్యాపార రంగంలో బాగా ఆరితేరిన వాడే అయ్యాడు గానీ, ఆయన జీవితం, సంపద యావత్తూ భారతదేశంలో ఒక జాతీయ ఉద్యమ నిర్మాణానికి వెచ్చించాడు. ఆయన సమీప సమకాలికుడు జస్టిస్ మహదేవ గోవింద రనడే ఆధునిక పారిశ్రామిక అభివృద్ధి విలువను గూర్చి ఒక తరానికి వివరిస్తూ వచ్చాడు. పదవీ విరమణ చేసిన ఐ.సీ.యస్. అధికారి రమేష్ చంద్ర దత్ "ది ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా" అనే గ్రంథాన్ని ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలోనే ప్రచురించాడు. అందులో ఆయన 1757 నుండి వలస పాలనలో ఆర్థిక విషయాలను గూర్చి క్షుణ్ణంగా పరిశీలించాడు.

ఈ ముగ్గురు నాయకులు, జి.వి. జోషీ, జి. సుబ్రహ్మణ్య అయ్యర్, గోపాలకృష్ణ గోఖలే, ప్రిథ్విస్ చంద్రరే, ఇంకా వందలాది మంది ఇతర రాజకీయ కార్యకర్తలు, పాత్రికేయులు ప్రతి ఆర్థికాంశాన్ని విశ్లేషించి, ఆర్థిక సమస్యల్ని, వలస ఆర్థిక విధానాల్ని నిశిత పరీక్షకు గురిచేసారు. బ్రిటీషు పాలన స్వరూపం, ప్రయోజనాలపై మౌలిక ప్రశ్నలను లేవనెత్తారు. చివరకు వాళ్లు భారత ఆర్థిక వ్యవస్థ వలన విధానంగా రూపాంతరం చెందిన తీరును పసిగట్టి భారత ఆర్థిక ప్రగతికి వలస విధానమే ప్రధాన అడ్డంకి అని తేల్చి చెప్పారు.

భారత ఆర్థిక వ్యవస్థను, బ్రిటీషు ఆర్థిక వ్యవస్థకు ఆధీనం చేయటమే బ్రిటీషు సామ్రాజ్యవాద తత్వమనే సత్యాన్ని వాళ్లు స్పష్టంగా గ్రహించగలిగారు. వాణిజ్యం, పరిశ్రమలు, ఆర్థిక వనరుల్లోని ఆధిపత్యపు వలస విధానాల చట్రాన్ని వాళ్లు బాగా చిత్రించగలిగారు. వలస పాలన యింకా దోపిడీ కప్పం చెల్లింపు,డబ్బే సంపద అనే మోటు పద్ధతుల్లోనే కొనసాగకుండా మారువేషాల్లో, స్వేచ్ఛా విపణి, విదేశీ పెట్టుబడుల వినియోగం వంటి సంక్లిష్టమైన పద్ధతుల్లో నడవసాగింది. పందొమ్మిదవ శతాబ్దపు వలస పాలనలో భారతదేశం బ్రిటీషు మహానగరాలకు ఆహార పదార్థాల, ముడిసరకుల సరఫరా దారుగాను పారిశ్రామిక వాడల్లోని ఉత్పత్తి దారులకు విపణి కేంద్రంగానూ, బ్రిటీషు పెట్టుబడులకు క్షేత్రంగాను మారిందని వాళ్లన్నారు.

తొలినాటి భారత జాతీయ నాయకులు ఒకేసారి అటు అధ్యాపకులుగానూ, ఇటు విద్యార్థులు గానూ తమ పాత్ర పోషింపవలసి వచ్చింది. దాదాపు అన్ని ముఖ్యమైన ప్రభుత్వ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా శక్తిమంతమైన మేధో పోరాటాలను నిర్వహించారు. వలస చట్రంలో ఆ విధానాల మూలాలను అర్థం చేసుకొనేందుకు,వివరించేందుకు ఆ ఆందోళనల్ని ఉపయోగ పెట్టుకున్నారు. జీవన పరిధిలోని ప్రతి అంశంలో బ్రిటన్‌కు భారతదేశపు ఆర్థిక పరాధీనతను తొలగజేయవలసిన ఆవశ్యకతను ఉద్బోధిస్తూ అభివృద్ధి దిశగా స్వతంత్ర ఆర్థిక విధానానికి దారితీసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషింపసాగారు.

శక్తిమంతమై, లక్ష్య శుద్ధితో దూసుకుపోయే శైలీ విన్యాసం ఆ ఉద్యమకాలం నాటి భాషకు అబ్బింది.

* * *

భారతీయులు బీదలయ్యారు. రోజు రోజుకూ వాళ్లు నిరుపేదలుగా మారుతున్నారనేది రూఢి కావటంతో భారతీయ ఆర్థిక పోరాటం ప్రారంభమయ్యింది. దాదాభాయి నౌరోజీ దారిద్ర్యాన్ని ఓ ప్రత్యేక అంశంగా ఎంచుకొని తన జీవితమంతా ఇటు భారత ప్రజల్ని, అటు బ్రిటీషు ప్రజల్ని 'దేశంలో నిరంతరంగా చెలరేగుతున్న దారిద్ర్యాన్ని; దేశం నిస్సారమవుతున్న తీరునూ, దుర్భర హృదయ విదారక స్థితిలో భారతీయుల రక్తం ఉడికిపోతున్న స్థితినీ' వివరిస్తూ జాగృతపరచసాగాడు. నిత్యం ఆయన ప్రజావేదికల నుండి, పత్రికల్లోనూ భారతీయుడు 'ఆకలితో నకనకలాడుతున్నాడు, ముట్టుకుంటే చాలు, పై ప్రాణాలు పైనే పోయేట్లున్నాయి, చాలీ చాలని ఆహారంతో బ్రతుకు వెళ్లదీస్తున్నాడు' అంటూ ఆవేశంగా ప్రకటించేవాడు.

తొలినాటి జాతీయవాదులు అలా చుట్టుముట్టిన దారిద్ర్యాన్ని స్వతస్సిద్ధమనో, అనివార్యమయినదనో, భగవంతుడో ప్రకృతో ప్రసాదించిందనో భావించలేదు. అది మానవ సృష్టే గనుక వివరించటం, నివారించటం సాధ్యమేనన్నారు. ఆర్.సి.దత్తు అన్నట్లు 'ఇవ్వాళ భారతదేశంలో బీదరికం ఉన్నదంటే అందుక్కారణం ఆర్థికపరమైన కార్యకలాపాలే.' భారతదేశంలోని దారిద్ర్యానికి కారణాలను శోధించే తరుణంలో వలస పాలకులు, వలస చట్రం అమలు పరచిన విధానాల వల్ల ఉద్భవించిన పరిణామాలను, శక్తులనూ జాతీయవాదులు గుర్తించారు.

పైగా దారిద్ర్య సమస్యను వాళ్లు ప్రజల 'ఉత్పాదక శక్తిని' పెంచే సమస్యగా – అంటే జాతీయాభివృద్ధి సమస్యగా దర్శించసాగారు. ఈ విధమైన పద్ధతి దారిద్ర్యాన్ని ఒక విస్తృత జాతీయసమస్యగా తీర్చిదిద్దటంతో భారతదేశంలోని వివిధ ప్రాంతాల, వర్గాల ప్రజలు విడివడకుండా సంఘీభావంతో మెలిగేందుకు అది తోడ్పడింది.

అన్నిటికీ మించి ఆర్థికాభివృద్ధి ఆధునిక పరిశ్రమాభివృద్ధిగా చూడబడింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడిదారీ వ్యాపార సంస్థల ద్వారా సంపూర్ణ ఆర్థిక మార్పును సాధించటమే తమ ఆర్థిక విధానాల ప్రధాన లక్ష్యంగా తొలినాటి జాతీయ వాదులంతా ఒకే మాటగా చెప్పారు. జీ.వీ. జోషి వంటి వారి దృష్టిలో పారిశ్రామీకరణ ఒక ఉత్కృష్ట నాగరిక విధానమే గాక ఆ విధానంలో అది అత్యున్నత స్థాయికి చేరుతుంది.' ఇక రానడే మాటల్లో అయితే కర్మాగారాలు 'పాఠశాలలు, కళాశాలల్ని మించి జాతికి సరికొత్త కార్యక్రమాన్ని మరింత ప్రతిభావంతంగా అందించగలవు'. భారతదేశంలో భిన్నత్వంలో అలరారే ప్రజల్ని ఉమ్మడి ప్రయోజనాలు గల జాతిగా ఏకత్వ సాధనకు ఆధునిక పరిశ్రమ సాయమందించ గలిగిన ప్రధాన శక్తిగా చూడబడింది. సురేంద్రనాధ్ బెనర్జీ వార్తా పత్రిక 'బెంగాలీ' 18.1.1902న యిలా పేర్కొంది: 'రాజకీయ హక్కుల కోసం పోరాటం భారతదేశంలోను వివిధ జాతుల్ని కొంతకాలం కలిపి ఉంచగలుగుతుంది. ఆ హక్కుల సాధనతో సాముదాయిక ప్రయోజనం కనబడకుండా పోవచ్చు. కానీ వాణిజ్యపరమైన కలయిక భారతదేశంలోని వివిధ జాతుల మధ్య ఒకసారి సంభవిస్తే అది చిరస్థాయిగా నిలిచిపోతుంది. వాణిజ్య పరమైన, పారిశ్రామిక పరమైన కార్యకలాపాలు ఘనిష్టమైన కలయికకు బంధకమవుతుంది, కనుక అవిభాజ్య భారత యూనియన్ ఆవిర్భావానికి అది గొప్ప కారకమై తీరుతుంది.'

కనుకనే పారిశ్రామికీకరణకు తొలితరం జాతీయవాదులు మనస్ఫూర్తి శ్రద్ధా భక్తుల కారణంగా వాళ్లు విదేశీ వాణిజ్యం, రైల్వేలు, సుంకాల నిర్ణయం, ద్రవ్య విధానం, వినిమయం,

విత్తం, శ్రామిక శాసన నిర్మాణం వంటి అనేక యితర అంశాలను ఆ సర్వోన్నత దృక్పథం నుండి సరిపోల్చి చూడటం జరిగింది.

* * *

అదే సమయంలో తొలితరం జాతీయ వాదులకు ఒక విషయంలో స్పష్టత ఉంది: పారిశ్రామికీకరణ జరగవలసిన అవసరం ఎంత ఉన్నా అది భారతీయ పెట్టుబడుల ఆధారంగానే జరగాలి గాని విదేశీ పెట్టుబడుల ద్వారా మాత్రం కాదు. 1840ల నుండి బ్రిటీషు ఆర్థిక శాస్త్రవేత్తలు, రాజనీతిజ్ఞులు, అధికారులు శాంతి భద్రతలతో పాటు విదేశీ పెట్టుబడులు భారతదేశ అభివృద్ధికి ఎక్కువగానే తోడ్పడ్డాయని భావించారు. జాన్ స్టూవర్ట్ మిల్, ఆల్ఫ్రెడ్ మార్షల్ ఈ అభిప్రాయాన్నే వాళ్ల ఆర్థిక వివరణల్లో పొందుపరిచారు. 1899లో ఆనాటి వైస్రాయి లార్డ్ కర్జన్ విదేశీపెట్టుబడి అనేది భారత 'జాతీయ అభివృద్ధికి అనివార్యం' అని అన్నాడు.

అయితే పై అభిప్రాయాన్ని తొలితరం జాతీయ వాదులు తీవ్రంగా ఖండించారు. విదేశీ పెట్టుబడులనేవి నిర్మూలించనలవిగాని కీడుగా పరిణమించి దేశాన్ని అభివృద్ధి పరచటానికి బదులుగా దోపిడీ చేసి దారిద్ర్యంలో ముంచెత్తాయన్నారు. ఈ విషయంలో దాదాబాయి నౌరోజీ ప్రజాదరణ పొందిన మాటేమిటంటే - విదేశీ పెట్టుబడులు 'భారతదేశంలోని వనరుల దోపిడీ'కి 'స్వలాభాపేక్షకు సంకేతాలు. అదే విధంగా 'హిందూస్థాన్ రివ్యూ', 'కాయస్థ సమాచార్' పత్రికల సంపాదకుడు విదేశీ పెట్టుబడిని 'అంతర్జాతీయ దోపిడీ విధానం'గా అభివర్ణించాడు.

విదేశీ పెట్టుబడులు, స్వదేశీ పెట్టుబడుల్ని ప్రోత్సహించి పెంపొందించడానికి బదులు వాటిని తొలగించి రూపుమాపాయనీ, ఆ విధంగా అది భారతదేశపు పెట్టుబడుల్ని కనుమరుగయ్యేట్లు చేసి భారత ఆర్థిక విధానంపై బ్రిటీషు ఆధిక్యతను పటిష్ట పరిచిందనేది వారి వాదన, విదేశీ పెట్టుబడుల ద్వారా ఒకే దేశాన్ని అభివృద్ధి పరచటమన్నది ఆనాటి చిన్న చితక లాభాల కోసం భవిష్యత్తును ఆసాంతం మారకం వేయటమేనన్నారు. 1901లో బిపిన్ చంద్రపాల్ ఈ విషయంలో జాతీయ భావనా సారాంశాన్ని యిలా ప్రకటించారు: 'దేశంలోని సహజ వనరుల వినియోగానికై విదేశీ పెట్టుబడులు, ముఖ్యంగా బ్రిటీషు వాళ్లవి, సాయాన్ని అందించకపోగా ప్రజల ఆర్థిక స్థితిగతుల ఉన్నతికి అతి గొప్ప అడ్డంకిగా

నిలిచాయి. అది ఆర్థికపరంగా ఎంతో, రాజకీయంగానూ అంతే ప్రమాదం. ఈ రెండందాల కీడుకు త్వరగా, విప్లవాత్మకంగా పరిష్కారం కనుగొనటంలోనే భారతదేశపు భవిష్యత్తు ఆధారపడిఉంది.'

తొలితరం జాతీయవాదుల దృష్టిలో విదేశీ పెట్టుబడుల రాజకీయ పరిణామాలు కూడా తక్కువ ప్రమాదకరమైన వేమీకాదు. ఎందుకంటే ఏ దేశంలో అయినా విదేశీ పెట్టుబడులు ప్రవేశించాయంటే ఆదేశం రాజకీయంగా లోబడవలసి రావటం ఖాయం. విదేశీ పెట్టుబడులు స్వప్రయోజనాన్ని సృష్టిస్తాయి. దాంతో పెట్టుబడిదారులకు రక్షణ, అందు మూలకంగా శాశ్వతమైన విదేశీ పాలన సంభవిస్తాయి. 1889 సెప్టెంబరు 23న హిందూ పత్రికలో వ్రాసిన ప్రకారం 'ఏదయినా దేశంలో విదేశీ పెట్టుబడులకు ప్రతిఫలం లేకుండా పోతే ఆదేశపు పాలన ఆ పెట్టుబడి దారుల బాధ్యతవుతుంది.' ఇంకా ఏమి వ్రాసిందంటే – '(ఒకవేళ) విదేశీ పెట్టుబడిదారుల ప్రాబల్యం మనగడ్డమీద పెరిగేందుకు అవకాశమిస్తే భారత జాతీయ కాంగ్రెసు విజయావకాశాలకు మంగళం పాడినట్లే. "సామ్రాజ్యం ప్రమాదంలో ఉంది" అంటూ విదేశీ పెట్టుబడిదారులు పెట్టే పొలికేకల్లో కాంగ్రెసు నినాదాలు వినిపించవు.'

* * *

తొలితరం జాతీయవాదులు నొక్కి చెప్పిన ఓ ప్రధాన సమస్య భారత సంప్రదాయ హస్తకళలు క్షీణించి, క్షీణించి ధ్వంసమై పోవటం. పారిశ్రామికతకు ఈ విధంగా సాగిలబడటం యాదృచ్ఛికం కాదన్నారు వాళ్లు. బ్రిటీషు ఉత్పత్తిదారులకు అనుకూలంగా భారతీయ పరిశ్రమలను తుదముట్టించేందుకు పనిగట్టుకు తీసుకున్న నిర్ణయాల ఫలితంగా భావించారు వాళ్లు దానిని.

బ్రిటీషు పాలనాధికారులు మరో వైపు నుండి భారతదేశ అభివృద్ధికి ఉపకరణాలుగా, దాని వృద్ధి చెందుతున్న సౌభాగ్యానికి రుజువుగా శీఘ్రగతిన వృద్ధి చెందుతున్న విదేశీ వాణిజ్యాన్ని, త్వరితగతిన నిర్మింపబడుతున్న రైలు మార్గాలను సగర్వంగా చూపెట్టసాగారు. అయితే జాతీయ వాదులు దానితో ఏకీభవించక విదేశీ వాణిజ్యం, రైలు మార్గాలు దేశీయ పరిశ్రమలపై చూపే ప్రతికూల ప్రభావం కారణంగా అవి ఆర్థిక ప్రగతికి ప్రాతినిధ్యం వహించక, అభివృద్ధి చెందని ఆర్థిక విధానానికి, వలస పాలనకూ ప్రాతినిధ్యం వహించేవిగా ఉన్నాయన్నారు. విదేశీ వాణిజ్యంలో ప్రధానాంశం దాని పరిమాణం కాదని అది

అంతర్జాతీయంగా మార్పిడిచేసే వస్తువుల రీతి లేక స్వభావాలతో పాటు అవి జాతీయ పరిశ్రమలపై, వ్యవసాయంపై ఎటువంటి ప్రభావం చూపుతున్నదో అది ముఖ్యమన్నారు. ఆ రీతి 19వ శతాబ్దిలో సమూల మార్పులు చెంది అత్యమితంగా ముడిసరుకుల ఎగుమతి, తయారైన వస్తువుల దిగుమతి దిశగా మొగ్గుచూపసాగింది.

అదే విధంగా రైలు మార్గాలు భారతదేశపు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అనుసంధానింప బడలేదని తొలితరం జాతీయ వాదులు పేర్కొన్నారు. కనుక అవి తెచ్చింది పారిశ్రామిక విప్లవాన్ని కాదనీ, వాణిజ్య పరమైన విప్లవాన్ని మాత్రమేననీ, అదికూడా విదేశీ వస్తువులు స్థానిక పరిశ్రమలలో తయారయ్యే వస్తువుల కంటే చౌకగా లభించేట్లు చేయగలిగాయన్నారు. పైగా రైలు మార్గాల ఏర్పాటు ద్వారా ఉక్కుకు, యాంత్రిక పరిశ్రమలకు, పెట్టుబడులకు లభించే ఊతాన్ని – మనం ఈనాడు చెప్పుకుంటున్న ముందు వెనుకల అనుబంధాన్ని – అందిపుచ్చుకుంటున్నది బ్రిటనే కాని భారతదేశం కాదు. జీ.వీ.జోషీ ప్రకారం రైల్వేలపై వెచ్చించేదంతా బ్రిటీషు పరిశ్రమలకు భారతదేశం అందించే రాయితీ. లేదూ తిలక్ మాటల్లో చెప్పాలంటే 'ఇంకొకరి ఇల్లాలిని అలంకరించినట్లు.'

తొలితరం జాతీయవాదుల దృష్టిలో పారిశ్రామికాభివృద్ధి త్వరిత గతిన జరగక పోవటానికి ప్రధాన అడ్డంకి స్వేచ్ఛా విపణి. అది ఒక వైపున భారతదేశపు హస్తకళా పరిశ్రమను ధ్వంసం చేస్తూనే మరో వైపున శైశవ దశలోనూ, బాగా అభివృద్ధి చెందని దశలోనూ ఉన్న ఆధునిక పరిశ్రమల్ని, పశ్చిమ దేశాలలో బాగా వృద్ధి చెంది చక్కగా నిర్వహింపబడే పరిశ్రమలతో అనుచిత, అసమ, విపత్కరమైన పోటీని ఎదుర్కొనేటట్లు వత్తిడి తెచ్చింది. ప్రభుత్వ పన్నుల విధానాన్ని గమనించిన జాతీయవాదులకు అన్పించిందేమంటే భారతదేశంలోని బ్రిటీషు ఆర్థిక విధానాలు ప్రధానంగా బ్రిటీషు పెట్టుబడి దారీ వర్గ శ్రేయస్సును కాంక్షించి రూపొందించబడినవేనని.

తొలితరం జాతీయవాదులు వలస తరహా ఆర్థిక విధానాలను ఎంతగానో దుయ్యబట్టారు. పెంచే పన్నుల విధానం పేదవాళ్లపై పెనుభారం మోపేదిగానూ, భాగ్యవంతుల్ని అందులోనూ మరీ ముఖ్యంగా విదేశీ పెట్టుబడిదారుల్నీ, పెద్ద పెద్ద అధికారుల్నీ పన్నుల బారిన పడకుండా తప్పించుకునే విధంగానూ రూపొందించబడిందని వాళ్లు బల్లగుద్దినట్లు చెప్పేవాళ్లు. దీనిని అధిగమించేందుకు వాళ్లు భూమి శిస్తును తగ్గించమనీ,

ఉప్పుపై పన్నును ఎత్తివేయమనీ వత్తిడి తెచ్చారు. ఆదాయపు పన్ను విధించటాన్నీ, భాగ్యవంతులు మధ్య తరగతి వాళ్లూ వాడుకునే వస్తువులపై దిగుమతి సుంకాన్ని విధించటాన్ని వాళ్లు సమర్థించారు.

ఇక ప్రభుత్వ వ్యయం వైపు దృష్టి సారించినట్లయితే బ్రిటీషు సామ్రాజ్యావసరాల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపి అభివృద్ధి, సంక్షేమశాఖల్ని ఎండగట్టారని వాళ్లు ఆరోపించేవాళ్లు. ప్రత్యేకంగా ఆసియా, ఆఫ్రికా ఖండాలలో పలు ప్రాంతాలను జయించి తమ అధికారం పట్టు సడలకుండా చూచుకునేందుకు బ్రిటీషు ప్రభుత్వం సైన్యంపై పెట్టే అధిక వ్యయాన్ని వాళ్లు గర్హించారు.

* * *

వలస విధానం పట్ల జాతీయ వాద విమర్శకు కేంద్ర బిందువు 'వట్టిపోయేట్టు చేసే సిద్ధాంతం' (డ్రెయిన్ థియరీ) భారతదేశంలో పనిజేసే బ్రిటీషు సాధారణ, మిలిటరీ ఉద్యోగుల వేతనాలు, పింఛనుల రూపంలోనూ భారత ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీల రూపంలోనూ, భారతదేశంలోని బ్రిటీషు పెట్టుబడిదారుల లాభాల రూపంలోనూ, బ్రిటన్‌లోని భారత ప్రభుత్వానికి సంబంధించిన కార్యాలయాల దేశీయ వ్యయం క్రింద భారత దేశపు పెట్టుబడి, సంపదలలో అధిక భాగం బ్రిటన్‌కు బదలాయించడమో లేక వట్టుబోయేట్లు చేయటమో జరుగుతున్నదని జాతీయ నాయకులు వెల్లడి చేసారు.

భారతదేశానికి ఆర్థిక పరంగానూ లేదా వస్తుపరంగానూ ఏవిధమైన ప్రతిఫలం అందని విధంగా దిగుమతుల కంటే ఎగుమతులు అధికం చేయటంగా ఈ వట్టుబోగొట్టే ప్రక్రియ రూపుదాల్చింది. జాతీయవాదుల అంచనాల ప్రకారం యిలా అడుగంటిన సంపద ప్రభుత్వ ఆదాయంలో సగం. మొత్తం భూమి శిస్తు వసూళ్ల కంటే అధికం, భారతదేశంలో మొత్తం మదుపు చేసిన దాంట్లో మూడో వంతు (ఇవాల్టి లెక్కల ప్రకారమైతే అది జాతీయాదాయంలో ఎనిమిది శాతం).

ఈ సిద్ధాంతానికి అందరూ గుర్తించిన అత్యుత్తమ రూపశిల్పి దాదాభాయి నౌరోజీ. 1867 మే మాసంలో దాదాభాయి నౌరోజీ బ్రిటన్ భారతదేశాన్ని వట్టుబోగొడుతున్నదనీ, పీల్చి పిప్పి జేస్తున్నదనే భావాన్ని ప్రవేశపెట్టాడు. వట్టుబోగొడుతున్న విధానాన్నీ పదే పదే వల్లిస్తూ అందివచ్చిన ప్రతి ప్రజా ప్రసార సాధనాన్నీ వినియోగించుకుంటూ ఆనాటి నుండి దాదాపు ఓ అర్థశతాబ్ది పాటు దానికి వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమాన్ని నిర్వహించాడు.

భారతదేశపు దారిద్ర్యానికి ప్రధాన కారణం అలా దేశ సంపద వట్టుబోయేట్లు చేయటమేననీ, అదే భారతదేశంలో బ్రిటీషు పాలన అనే దౌష్ట్యానికి మూలం అన్నాడు. 1880లో ఆయన వాదించిందేమనంటే – 'దయారహిత ఆర్థిక సూత్రాల అమలు వల్ల కాదు  ఇదంతా జరుగుతున్నది, బ్రిటీషు పాలనా విధానంలోని ఆలోచనా రహిత, దయారహిత చర్యల వల్ల.  భారత దేశపు సంపదనూ, జ్ఞానాన్నీ నిర్దయగా కబళించటం వల్ల, ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆర్థిక సూత్రాల దయారహిత విపరీత ధోరణివల్లనే భారతదేశం పీల్చి పిప్పి చేయబడి ధ్వంసమవుతున్నది.'

మిగతా జాతీయ నాయకులు, పాత్రికేయులు, ప్రచారకులు దాదాభాయి నౌరోజీ అడుగుజాడల్లో నడిచారు.  ఉదాహరణకు ఆర్.సి.దత్ రచన 'ఎకనామిక్ హిస్టరీ ఆఫ్ ఇండియా'కు డ్రెయిన్ సిద్ధాంతం ముఖ్య విషయమయ్యింది. 'ఓ భారతీయ కవి చెప్పినట్లు – రాజు వేసిన పన్నులు సూర్యుడు పీల్చిన తేమ వంటివి, తిరిగి అవి సత్తువనిచ్చే వర్షంగా భూమి మీదకు చేరవలసి ఉంది.  అయితే భారత భూభాగంలో పీల్చిన తేమ భారతదేశంలో గాక యితర భూభాగాలపై సత్తువనిచ్చే వర్షంగా క్రిందికి దిగుతున్నది... ఆ దేశపు అటువంటి గొప్ప ఆర్థిక ఉత్సారణ అనేక సంపన్న దేశాల వనరుల్ని వట్టుబోగొట్టి దారిద్ర్యంలోకి నెట్టివేస్తుంది,  ప్రపంచంలో మరెక్కడా గాని, గతంలో భారతదేశంలో గాని కనీవినీ ఎరుగనంతటి విస్తారంగా తరచుగా, ఘాతుకంగా ఈ దేశాన్ని పలు పర్యాయాలు కరువుకాటకాల సీమగా మార్చివేసింది.'

వలస విధానంపై జాతీయవాద విమర్శలనన్నింటినీ ఉత్సారణ సిద్ధాంతం తనలో యిముడ్చుకోవాల్సి వచ్చింది.  ఆ వట్టుబోయేట్లు చేసే పద్ధతి ఎంతగానో అవసరమయ్యే భారతదేశపు ఉత్పత్తిదాయక పెట్టుబడుల్ని, వ్యవసాయాన్ని, పరిశ్రమల్ని హరించి వేస్తాయి.  వాస్తవానికి ఉత్సారణ సిద్ధాంతం వలస పరిస్థితిపై జాతీయవాద నాయకుల సమగ్ర పరస్పర సంబంధిత, సంఘటిత ఆర్థిక విశ్లేషణకు చెరగని గుర్తుగా నిలుస్తుంది. ఈ సిద్ధాంతం ద్వారానే బ్రిటీషు ప్రభుత్వపు దోపిడీ విధానం బట్టబయలు చేయగలిగారు.  ఈ వట్టుబోగొట్టే పద్ధతిని వ్యతిరేకించటం ద్వారానే జాతీయ వాదులు రాజీలేని రీతిలో రంగంలోకి దిగి సామ్రాజ్యవాద ఆర్థిక సారాన్ని ఎత్తిచూపగలిగారు.

పైగా ఉత్సారణ సిద్ధాంతం కృషీవలులతో నిండిన జాతి సులభంగా అర్థం చేసుకోగల ఒక గొప్ప రాజకీయ ప్రతిభను తనలో యిముడ్చుకుంది.  ఆర్థిక దోపిడీ

విధానాల్లో డబ్బులు ఒక దేశం నుండి మరో దేశానికి చేరటం రైతుకు బాగా అర్థమయ్యింది- ఎందుకంటే అతనికి నిత్యం ప్రభుత్వం ద్వారా, భూస్వాముల ద్వారా, వడ్డీ వ్యాపారుల ద్వారా, న్యాయవాదుల ద్వారా, పూజారుల ద్వారా అది అనుభవైక వేద్యమే. దూరదేశాల్లోని వాళ్లసుఖం కోసం వీళ్లపై పన్నులు విధిస్తున్నారనే విషయం జనాన్ని జాగృత పరచినంతగా మరే ఆలోచనా జాగృత పరచజాలదు.

'పట్టుబోయేట్లు చెయ్యొద్దు' అనే రకం నినాదం విజయవంతం కావలసిన అన్ని ఉద్యమాలకూ అవసరం - దానిని రుజువు పరిచేందుకు సునిశితమైన, జటిలమైన వాదనలతో పనేలేదు. దానికై అది ఒక అంతర్గత గుణాన్ని ఏర్పరచుకుంది. అది ఆచరణాత్మకంగా దానినదే స్వయంగా వ్యక్త పరచుకోగలదు. ఈ విషయంలో ప్రజల్ని శాంతింప జేసేందుకు విదేశీ పాలకులు చేయగలిగిందేమీ లేదు. ఆధునిక వలస విధానాన్ని ఉత్సారణా పద్ధతి నుండి విడగొట్టలేం. భారత ప్రజలు, బ్రిటీషు సామ్రాజ్యవాదం మధ్య నెలకొన్న విభేదం బ్రిటీషు పాలనను అంతమొందించితే తప్ప పరిష్కరింపబడజాలదనేది ప్రజలు గ్రహించగలిగారు. కనుకనే గాంధీయుగంలో జాతీయ రాజకీయ పోరాటంలో ఉత్సారణ సిద్ధాంతం తప్పనిసరిగా ప్రధానమై కూర్చుంది.

* * *

ఆర్థికాంశాలపై ఆందోళన భారతీయుల మానసాలపై పరాయి పాలకుల నేతృత్వ సిద్ధాంతపు మౌలికతను బలహీన పరచసాగింది. అంటే ప్రజల మనసుల్లోని వలస పాలన పునాదుల్ని బలహీనపరచసాగింది. ఏ పరిపాలన కయినా రాజకీయ భద్రత దాని నైతిక ప్రయోజనంపై, హితకర ప్రతిపత్తిపై విశ్వాసం ప్రజలకు ఉన్నంత వరకే - అంటే పాలకులు ప్రధానంగా తమ సంక్షేమం కొరకు పాటు పడుతున్నారనే విశ్వాసాన్ని ప్రజలు విశ్వసించి నంత వరకే. ఈ విశ్వాసమే వాళ్ల ప్రభుత్వాన్ని సమర్థించేట్లు చేసేందుకు ఉద్యుక్తుల్ని చేయటమో లేక కనీసం ఆ పాలన కొనసాగింపుకు మౌనాంగీకారాన్ని తెలియజేసేందుకో ఉపకరిస్తుంది. అది పాలనా కాలానికి న్యాయ సమ్మతిని అందిస్తుంది - ఈ విశ్వాసంలోనే ఆ పాత పునాదులు పదిలం.

భారతదేశంలో బ్రిటీషు అధికారపు రహస్యం భౌతిక పరమైన శక్తితోనే గాక నైతిక శక్తిలో గూడ ఇమిడి ఉంది. అంటే పాలకులు ఒక శతాబ్ద కాలంగా బ్రిటీషు ప్రభుత్వమే భారతదేశంలోని సామాన్యుల 'తల్లీ-తండ్రీ' అని కల్పించిన విశ్వాసంలోనే

అది ఉంది – ప్రాథమిక పాఠశాలల్లో వాచకాలలో తొలిపాఠమే తరచుగా 'బ్రిటీషు పాలనా ప్రయోజనాలు' అనే అంశంపై ఉండేది. జాతీయవాద ఆర్థిక పోరాటం క్రమేపీ ఈ నైతిక మూలాలను శక్తిహీనం చేయసాగింది. బ్రిటీషు పాలనలోని హితకర స్వభావంపై ప్రజల విశ్వాసాన్ని అది బీటలువారేట్లు చేసింది – చివరకు సదుద్దేశ్యాలపై, సత్ఫలితాల పై కూడ.

సామ్రాజ్యవాద పాలకులు, వాళ్ల ప్రతినిధులు భారతదేశంలో బ్రిటీషు పాలనకు ఆర్థికాభివృద్ధిని ప్రధానమైన సమర్ధనీయాంశంగా పేర్కొంటారు. భారత జాతీయవాదులు దానిని తీవ్రంగా ఖండించారు. బ్రిటీషు వ్యాపారాభివృద్ధికీ, పరిశ్రమాభివృద్ధికీ, సంపద పెరుగుదలకు అనుగుణంగా బ్రిటీషు పాలన కొనసాగటమే భారతదేశం ఆర్థికంగా వెనుకబడటానికి ప్రధాన కారణమన్నారు. దారిద్ర్యం, వెనుకబాటుతనం తప్పనిసరిగా వలస పాలన ఫలితాలేనని దుయ్యబట్టారు. 1896 జనవరి 28న తిలక్ పత్రిక 'కేసరి' వ్రాసిందేమంటే – "ఐరోపావాసులు పడి మేసేందుకు భారతదేశం ఓ పెద్ద మైదానంగా గట్టిగా భావించబడుతోంది.' మాజీ కాంగ్రెసు అధ్యక్షులు పి. ఆనందాచార్లు విధాన సభలో చెప్పిన ప్రకారం "బలమైన బ్రిటీషు ప్రభుత్వ మద్దతుతో భారతదేశం విదేశీదాడుల్ని తట్టుకో గలుగుతున్నది గాని ఆంగ్లేయుల, భారతీయుల ప్రయోజనాల మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు మాత్రం కంచే చేను మేసిన చందమవుతున్నది'.

సచ్చిదానంద సిన్హా అనే బీహారుకు చెందిన యువ మేధావి 1903 ఫిబ్రవరి 27న "ఇండియన్ పీపుల్ అనే పత్రికలో భారతదేశ పరిస్థితిని చాలా శక్తిమంతంగా విమర్శిస్తూ క్లుప్తంగా తేల్చిందేమంటే' – 'లార్డ్ కర్జన్ రుజువు పరచినట్లుగా వాళ్ల ప్రభుత్వ కృషి అంతా అణచివేతకు పనిముట్టుగానే పనికి వచ్చింది. సమర్థమంతమైన ప్రభుత్వం లేకపోతే వ్యాపారం వృద్ధి చెందదు. వ్యాపారంలో లాభాలు లేకుండా పరిపాలించటం వృధా ప్రయాస. కనుక ఎల్లప్పుడూ ఛేంబర్ ఆఫ్ కామర్స్ అనుమతితో, తరచుగా దాని చెప్పుచేతల్లో భారత ప్రభుత్వం నడపబడుతూంది. ఇది "తెల్లవాడి బరువే".

వీటన్నింటినీ మించి దాదాభాయి నౌరోజీ దాదాపు నిత్యం చేసే ప్రసంగాలలో రచనలతో అదే పనిగా చెప్పే విషయమేమంటే – బ్రిటీషు ప్రభుత్వం 'బలవంతం చెయ్యటాన్ని కాని, వ్యక్తులకు గాని, ఆస్తికి గాని నష్టం వాటిల్లజేయటాన్ని గాని ప్రపంచం గమనించి భయభ్రాంతులకు లోనుగాకుండా' "ఆ ఉదారంగా కన్పించే ముఖం" తొడుగు

వెనుక దాచేసుకొంటున్నది. ప్రస్తుత దురదృష్టకర దశలో, అక్రమంగా జరిపే భారతదేశ వ్యయం విషయంలో సారాంశం ఏమిటంటే అది బ్రిటీషు పాలన ఔదార్యం కానేకాదు. నిజానికి అది బ్రిటీషు రాజ్యం 'రక్తం కారేట్లు చేయటం.' భారతీయుల ప్రాణాలకు, ఆస్థికి రక్షణ కల్పిస్తున్నామని చెప్పే విషయంలో దాదాభాయి వ్రాసిందేమంటే: చూసే దానికి భారతదేశంలో ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ ఉంది. వాస్తవానికి అలాంటిదేంలేదు. ఒక విధంగాచూస్తే ప్రాణాలకు ఆస్తులకు రక్షణ ఉన్నట్లే - ప్రజలు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకోకుండానూ స్థానిక నిరంకుశ పాలకులు పైనబడకుండానూ రక్షణ ఉంది.,... కాని ఇంగ్లండు కబంధ హస్తాల నుండి ఆస్తికి రక్షణ లేనేలేదు. అదే విధంగా ప్రాణాలకు కూడా .... ఇక రక్షణ, పటిష్టమైన రక్షణ దేనికంటే ఇంగ్లండు బ్రహ్మాండంగా భద్రంగా, సురక్షితంగా ఉండేందుకు.... ప్రస్తుత రేట్ల ప్రకారం సంవత్సరానికి మూడు కోట్లో లేక నాల్గు కోట్లో పౌండ్లకు సరితూగే ఆస్తిని భారతదేశాన్నుండి తరలించుకు పోయేందుకు లేదా భారతదేశంలోనే గుటకాయస్వాహా చేసేందుకు...భారతదేశంలోని లక్షలాదిమందికి జీవితమంటే అర్ధాకలితో, పస్తులో, క్షామమో మరి అనారోగ్యమో'.

ఇక శాంతి భద్రతల ప్రయోజనాల విషయంలో దాదాభాయి చెప్పిందేమంటే - 'భారతదేశంలో ఓ సామెత ఉంది: "కొడితే వీపు మీద కొట్టుగాని పొట్టకొట్టవద్దు" అని. స్థానిక నిరంకుశుని క్రింద ప్రజల వీపుపై అప్పుడప్పుడూ దెబ్బలు పడినా తాము పండించినవి అట్టి పెట్టుకొని అనుభవించే వీలుండేది. బ్రిటీషు ఇండియా నిరంకుశత్వంలో మాత్రం మనిషిపై హింస ఉండదు. శాంతిమయంగా జీవిస్తాడు. అతని సొత్తు మాత్రం కన్పించకుండా ప్రశాంతంగా, అతి సున్నితంగా కబళించబడుతుంది. అతడు శాంతిలోనే ఆకలితో అలమటిస్తాడు, శాంతి భద్రతల వలయంలో శాంతితోనే అంతులేని శాంతిలో అతని కాయం కుళ్లిపోతుంది.'

* * *

బ్రిటీషు పాలనపై సడలిన విశ్వాసం అనివార్యంగా రాజకీయ రంగానికి వ్యాపించింది. వాళ్ల ఆర్థికపరమైన తిరుగుబాటులో భాగంగా జాతీయ నాయకులు దాదాపు ప్రతి ఆర్థిక సమస్యనూ దేశ రాజకీయ పరాధీన స్థితికి ముడిబెట్టే వాళ్లు. అంచెలంచెలుగా, సమస్య వెంబడి సమస్యగా వాళ్లు తేల్చిందే మంటే బ్రిటీషు ఇండియా పాలన 'కేవలం దోపిడీకి పనిముట్టే గనుక' భారతీయులకు అనుకూలంగా వుంటూ

అభివృద్ధి పథకాలను అమలుపరిచే పాలన భారతీయులకు రాజకీయాధికారం వుండే పాలనలోనే సాధ్యపడుతుంది.

తొలితరం జాతీయ నాయకుల్లో ఎంతో మంది రాజకీయాల్లోనూ, రాజకీయ విధానాల్లోనూ మితవాదులుగానే వున్నా, ఇంకా చాలా మంది బ్రిటీషు పాలనకే తమ విశ్వసనీయతను ప్రకటిస్తున్నా ఫలితం ఏమయ్యింది – వాళ్లు బ్రిటీషు సామ్రాజ్యపు రాజకీయ కూకటేళ్లను తెంచి ఈ నేలలో అసంతృప్తి, అవిశ్వాసం, చివరకు విద్రోహపు బీజాల్ని నాటినట్లయ్యింది. 1875 నుండి 1905 మధ్య కాలం మేధో కల్లోలం, జాతీయ భావనా వ్యాప్తి జరగటానికి అది ప్రధాన కారణాలలో ఒకటై ఆధునిక జాతీయ ఉద్యమానికి విత్తనాలు నాటే సమయం రానేవచ్చినట్లయ్యింది.

19వ శతాబ్ది చివరి వరకూ భారత జాతీయ వాదులు వాళ్ల రాజకీయ డిమాండ్లను రాజకీయ అధికారంలో భాగస్వామ్యానికీ, వ్యయంపై నియంత్రణకే పరిమితం చేయగా 1905 నుండి మాత్రం ప్రముఖులైన జాతీయ వాదుల్లోని పలువురు స్వపరిపాలన డిమాండ్‌ను ముందుకు తెచ్చారు. ఇక్కడా మళ్లీ దాదాభాయి నౌరోజీయే అందరి కంటే ముందున్నాడు. 1904లో అంతర్జాతీయ సోషలిస్టు మహాసభలో సంపద తరలింపు విషయం మాట్లాడుతూ "స్వయం పరిపాలన" భారతదేశాన్ని 'ఇతర బ్రిటీషు కాలనీల మాదిరే' పరిగణించాలనే డిమాండ్‌ను ప్రవేశపెట్టాడు. తరువాత ఒక సంవత్సరానికి 1905లో బెనారస్ భారత జాతీయ కాంగ్రెసు మహాసభల సందర్భంగా తమ సందేశంలో దాదా భాయి ప్రత్యేకించి నొక్కి చెప్పిందేమంటే 'భారతదేశపు తప్పిదాలకు, బాధలకు ఏకైక ప్రత్యుపాయం స్వయం పరిపాలనే.'[20] తరువాత 1906 కలకత్తా కాంగ్రెసు సభ అధ్యక్షునిగా ఆయన జాతీయోద్యమ లక్ష్యం యునైటెడ్ కింగ్‌డమ్ లేదా కాలనీలు అన్న విధంగానే 'స్వయం పరిపాలన లేదా స్వరాజ్యం'గా ఉంచారు.

మానసికంగా సంసిద్ధం చేయబడి, లక్ష్యం నిర్ధారించబడినా ఇంకా రాజకీయ దాస్య విముక్తి కోసం ప్రజా పోరాటం కాలగర్భంలో పిండం రూపంలోనే ఉంది. జాతీయ ఉద్యమం పెరిగి పెద్దదయ్యేందుకు తొలితరం జాతీయవాదులు పటిష్టమైన, మన్నిక గలిగిన పునాదుల్ని నిర్మిస్తూ వచ్చారు. వాళ్లు జాతీయతా బీజాల్ని చక్కగా, లోతుగా నాటారు.

వాళ్లు జాతీయతను ప్రధానంగా నైరూప్య లేక పైపై భావాను బంధాల విజ్ఞప్తులకు గానీ లేదా గతానికి సంబంధించిన అస్పష్ట విజ్ఞప్తులకు గాని పరిమితం చేయలేదు. వాళ్లు జాతీయతను ఆధునిక వలస విధానపు, సంక్లిష్ట ఆర్థిక విధానపు అత్యద్భుత శాస్త్రీయ విశ్లేషణతో వింగడించి భారతీయులకూ బ్రిటీషు పాలనకూ మధ్య గల ప్రధాన వైమనస్యాలతో బాగా పాదుకొల్పారు.

20వ శతాబ్దపు జాతీయ వాదులు అధికంగా వారి వలసవాద ఆర్థిక విమర్శలపైనే ఆధారపడవలసి వచ్చింది. ఈ ప్రతిపాదనలే గాంధీ యుగపు యువ ఆందోళనకారుల ద్వారా భారతదేశంలోని మహానగరాలకు, పట్టణాలకు, పల్లెలకూ చేర్చబడి మారుమ్రోగుతూ ఉండేవి. ఈ పటిష్టమైన పునాది ఆధారంతోనే ఆ తరువాతి జాతీయ వాదులుప్రజాందోళనలనూ, ప్రజోద్యమాలనూ నిర్వహించగలిగారు. పైగా ఈ పటిష్టమైన పునాది కారణంగా చైనా, ఈజిప్టు మరెన్నో వలస, అర్ధవలస దేశాలలో వలెగాక సామ్రాజ్యవాద వ్యతిరేకత యిక్కడ కట్టుదిట్టంగా వుంది.

* * *

# 8 పత్రికా స్వేచ్ఛకై పోరాటం

దాదాపు 19వ శతాబ్దం ప్రారంభం నుండీ రాజకీయ స్పృహగల భారతీయులందరూ ఆధునిక పౌరహక్కుల దిశగా ఆకర్షింపబడ్డారు – మరీ ముఖ్యంగా పత్రికా స్వేచ్ఛ విషయంలో. ఎన్నడో 1824లోనే రాజా రామమోహనరాయ్ పత్రికా స్వేచ్ఛను కుంచింపజేసే నియమాలకు వ్యతిరేకంగా తన నిరసనను తెలియజేసాడు. సుప్రీం కోర్టుకు సమర్పించిన మెమోరాండంలో ఆయన పేర్కొన్నదేమంటే – ప్రతి మంచి పరిపాలనకూ "ప్రతి వ్యక్తికీ తాను జోక్యం కల్పించుకోవలసిన విషయాలను అతని దృష్టికి శీఘ్ర గతిన తీసుకు వెళ్లేందుకు ఆతురత చెందుతాడు. అతి ముఖ్యమైన ఈ లక్ష్యసాధనకు అపరిమిత పత్రికా స్వేచ్ఛను కల్పించినప్పుడే ఆశించిన ఫలితం లభించగలదు."

1870–1918 మధ్య కాలంలో ఇంకా వేలాది చిన్న పెద్ద బహిరంగ సభలను నిర్వహించటమో, ప్రజా పోరాటాలకు ప్రజల్ని చురుకుగా తరలించే రాజకీయ కృషో జాతీయోద్యమంలో యింకా ముమ్మరం కాలేదు. అప్పటికింకా ప్రధాన రాజకీయ కృషి సమస్యలకు రాజకీయ ప్రాధాన్యతల్ని సంతరింపజేయటం, రాజకీయ ప్రచారం, జాతీయతా భావజాల రూపకల్పన, శిక్షణ, ప్రచారాల వరకే సాగింది. జాగృత పరచటం తర్ఫీదు నివ్వటం, సమీకరించటం, జాతీయత దిక్కుగా ప్రజాభిప్రాయ ఏకీకరణ వంటి ఈ కృషి ప్రధానంగా పత్రికా రంగం ద్వారానే ఒనగూడింది.

జాతీయ కాంగ్రెసుకు సంబంధించిన కార్యకలాపాలు కూడా ఆ కాలంలో చాలా వరకు పత్రికా రంగం ద్వారానే నిర్వహింపబడేవి. కాంగ్రెసు రాజకీయ

కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తనదైన సంస్థ లేనేలేదు. దాని తీర్మానాలు, ప్రొసీడింగ్సు అన్నీ కూడ పత్రికా ముఖంగానే వెలువరించవలసి వచ్చేది. 1885లో కాంగ్రెసు వ్యవస్థాపక నేతల్లో దాదాపు మూడింట ఒక వంతు పాత్రికేయులనేది కుతూహలాన్ని కల్గించే విషయమే.

అప్పట్లో సుప్రసిద్ధులు, ధీశాలురునైన పాత్రికేయుల సారథ్యంలో శక్తిమంతమైన వార్తాపత్రికలు వెలువడ్డాయి. జి. సుబ్రహ్మణ్య అయ్యర్ సంపాదకత్వంలో హిందూ, స్వదేశ మిత్రక్‌లు, బాలగంగాధర్ తిలక్ సంపాదకత్వంలో కేసరి, మహరాట్టా, సురేంద్రనాథ్ బెనర్జీ సంపాదకత్వంలో అమృత బజార్ పత్రిక, గోపాలకృష్ణ గోఖలే సంపాదకత్వాన సుధాకర్, యన్.యన్. సేన్ సంపాదకత్వంలో ఇండియన్ మిర్రర్, దాదాభాయి నౌరోజీ సంపాదకత్వాన వాయిస్ ఆఫ్ ఇండియా, జీపీ వర్మ సంపాదకత్వంలో హిందుస్థానీ, అడ్వకేట్ పత్రికలు, పంజాబు నుండి ట్రిబ్యూన్, అక్బర్ – ఇ – యామ్ పత్రికలు, బొంబాయి నుండి ఇందు ప్రకాష్, ధ్యాన్ ప్రకాష్, కల్, బంగనివాసీ, సాధారణి అనేవి వెలువడేవి. వార్తా పత్రికకు స్వంతదారుగా లేనటువంటి వారుగాని, లేక ఏదో ఒక హోదాలో వార్తా పత్రికలలో వ్రాయనటువంటి వారు కాని భారతదేశ ప్రముఖ రాజకీయ నాయకుల్లో లేరన్నది వాస్తవం.

వార్తా పత్రికల ప్రభావం చదువుకొన్న చందా దారుల్ని దాటి, చాలా దూరం పోయింది. అది కేవలం మహానగరాలకూ, పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితం కాలేదు. వార్తా పత్రిక మారుమూల గ్రామాలకు చేరేది. ఒకళ్లు చదువుతూంటే ఎంతో మంది వింటూండేవాళ్లు. క్రమేపీ గ్రంథాలయోద్యమం దేశమంతటా వ్యాపించింది. ఒక వార్తా పత్రికుంటే చాలు స్థానికంగా ఓ గ్రంథాలయం నిర్వహింపబడేది. ఒక మేజాబల్ల, ఒకటో రెండో బెంచీలు, లేదా ఓ చాప చాలు – ఆ గ్రంథాలయానికి మూల ధనపు సాధన సామాగ్రి సమకూరినట్లే. వార్తల్లోని ప్రతి విషయమూ లేదా సంపాదకీయ వ్యాఖ్యలు చదివి, విని కూలంకషంగా చర్చింపబడేవి. వార్తా పత్రిక రాజకీయ శిక్షకునిగానే గాక, చదవటం, చర్చించటం వల్ల ప్రజలు ఆ విధంగా రాజకీయాల్లో పాలు పంచుకున్నట్లయ్యింది.

ఆ రోజుల్లో వార్తా పత్రికలు వ్యాపార సంస్థలూ కావు, సంపాదకులకూ, పాత్రికేయులకూ అది వృత్తీ కాదు. జాతి సేవ చేస్తున్నట్లుగానో లేక ప్రజా సేవ చేస్తున్నట్లుగానో వార్తా పత్రికలు ప్రచురింపబడేవి. తరచుగా అవి విరాళాల ద్వారా నడపబడేవి. ఆనాడు పాత్రికేయుడు కావటమంటే రాజకీయ కార్యకర్త కావటమే. తనకై తాను త్యాగాన్ని ప్రదర్శించగల పోరాట యోధుడు కావటమే. ఆనాడు వార్తా పత్రికను ప్రారంభించటమన్నది ఖర్చుతో కూడిన

పనికాదు.  సంపాదకుడు అర్ధాకలితో జీవించటమో లేక వేరే జీవనోపాధి కలిగివుండటమో జరిగేది.  1868లో 32 రూపాయలతో అచ్చువేసే సామాగ్రి కొని అమృత బజార్ పత్రిక ప్రారంభించటం జరిగింది.  అలాగే సురేంద్రనాథ్ బెనర్జీ 1879లో బెంగాలీ పత్రిక గుడ్‌విల్‌ను పదిరూపాయలకు, అచ్చు యంత్రాన్ని మరో 1600 రూపాయలకు కొని ప్రారంభించటం జరిగింది.

పత్రికల ద్వారా రాజకీయపరమైన అభిప్రాయ భేదాలన్నీ నిత్యం వెలుగులోకి వచ్చేవి.  ప్రభుత్వానికి ప్రతిపక్షంగా వార్తా పత్రికలు తమ పాత్రను నిర్వహించేవి.  ప్రభుత్వం చేపట్టే ప్రతి చర్యా, ప్రతి ప్రభుత్వ విధానమూ నిశితంగా విమర్శింపబడేవి. పలుపర్యాయాలు ఎంతో జాగరూకతతో, అమోఘమైన జ్ఞాన సంపదతో కూడిన విమర్శలు వెలువడేవి.  'వ్యతిరేకించు, ఎదురించు, పోరాడు' అనేదే ఆనాటి భారతీయ వార్తా పత్రికల లక్ష్యం.  ఇక జాతీయవాద పత్రికల పాత్రను గూర్చి మార్చి 1886 లోనే వైస్రాయి లార్డ్ డఫ్రిన్ చెప్పిందేమంటే – 'రోజూ వందలాది కుశాగ్రబుద్ధిగల'బాబులు' తమ ఆంగ్లేయ అణచివేతదారులకు వ్యతిరేకంగా, ఆగ్రహంతో అతి పరుషమైన, శక్తిమంతమైన పదజాలంతో విమర్శల్ని గుప్పించేవాళ్ళు.' మళ్లీ మే మాసంలో ఆయన వ్రాసిందేమంటే – 'ఈ విధంగా శంకించనవసరంలేని రీతిలో ఈ పత్రికలు చదివిన వాళ్ల మనసుల్లో....... మనమంతా (బ్రిటీషువాళ్లు) మానవజాతికి శత్రువులమైనట్లు, ప్రత్యేకించి భారతీయులకు అయినట్లు నిజాయితీతో కూడిన విశ్వాసం ప్రబలేది.'

రాజకీయ చైతన్యాన్ని రగిలించటం, జాతీయతను చొప్పించటం, వలస పాలన బండారం బట్టబయలు చేయటం, అవిధేయతను నూరిపోయటం, అంత తేలికయిన పనేంకాదు.  1870 నుండి అమలులో వున్న భారతీయ శిక్షాస్మృతిలోని 124–ఎ సెక్షను ప్రకారం 'బ్రిటీషు ఇండియాలో చట్ట ప్రకారం ఏర్పడిన ప్రభుత్వం పట్ల అసంతృప్తి భావాలను రేకెత్తించేందుకు ఎవరు ప్రయత్నించినా'  వారికి ఆజన్మ ద్వీపాంతరవాసమో లేక మూడేళ్ల కారాగారవాసమో లేక కాలపరిమితికి లోబడి ద్వీపాంతర వాసమో శిక్షగా అనుభవించాల్సి ఉంటుంది. ఇంకా ఈ క్లాజుకు తరువాత కాలంలో మరింత కఠినమైన చర్యల్ని జోడించారు.

చట్టానికి పట్టుబడకుండా వుండేందుకు భారతీయ పాత్రికేయులు పలు తెలివైన పన్నాగాలు పన్ని, వ్రాతలో ఒక ప్రత్యేక శైలిని అందిపుచ్చుకున్నారు.  ప్రభుత్వానికి నిర్ద్వంద విధేయతను చాటే వారి రచనలు సెక్షను 124–ఎ పరిధిలోకి రావు గనుక వాళ్లు వాళ్ల తీవ్ర విమర్శలకు ముందు ప్రభుత్వానికి, మహారాణికి విధేయతను వ్యక్తంజేసే

భావాలను ప్రకటించేవాళ్లు. వాళ్లు చేపట్టిన మరో యుక్తిగల పనేమంటే – లండన్ నుండి ప్రచురింపబడే సోషలిస్టు, ఐరిష్ వార్తా పత్రికల నుండి సామ్రాజ్యవాద వ్యతిరేక రచనల భాగాలనో లేదా క్రియాశీల బ్రిటీషు పౌరుల జాబులనో ప్రచురించటం. అలా చేసినప్పుడు తప్పుచేసిన బ్రిటీషు వాళ్లను వదలి అచ్చువేసిన భారతీయులపై శిక్ష వేయటం కుదరని పని కదా. కొన్ని సార్లు బ్రిటీషు పత్రికలనుండి సేకరించి అచ్చువేసిన సమాచారానికి కొటేషను మార్కులు పెట్టకుండా, దాని మూలాన్ని ఉటంకించకుండా బ్రిటీషు ఇండియా అధికార గణాల్ని విసిగించేవాళ్లు. అధికారులు తీరా శిక్షించేందుకు పూనుకున్న తరుణంలో ఆ రచన అసలు మూలం ఎక్కడిదో తెలియజేయటంతో ఆ అధికారులకు శిక్ష అమలు పరిచేందుకు వీలయ్యేదికాదు. ఉదాహరణకు జారు విధానానికి వ్యతిరేకంగా రష్యాలోని ఉగ్రవాద కార్యకలాపాలను సానుభూతితో ప్రచురించే తీరులో పాఠకుడు వెంటనే భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెంగాలు, మహారాష్ట్రలలో పోరాడే 'ఉగ్రవాద విప్లవ కారులతో పోల్చి చూడటం జరుగుతుంది. అధికారులు కొంత సమయం తీసుకున్న తరువాత తెలుసుకుంటారు – అది అంతకు ముందే లండను నుండి ప్రచురింపబడే టైమ్స్‌లోనో, మరో బ్రిటీషు వార్తా పత్రికలోనో ప్రచురింప బడిందేనని.

విప్లవాత్మకంగా విశదపరచాల్సిన విషయాలు ఓ శ్రేయోభిలాషి నుండి ప్రభుత్వానికి అందించే సలహాలు గానో, హెచ్చరికలుగానో రూపు దిద్దుకునేవి. ప్రభుత్వాన్ని తన తప్పిదాన్నుండి తప్పించటమే రచయిత ముఖ్య ఉద్దేశ్యమయినట్లుగా అది కన్పించేది. బాలగంగాధర తిలక్, మోతీలాల్ ఘోష్ ఇటువంటి రచనలకుపెట్టింది పేరు. ఇంకొంచెం సాహసవంతులయిన రచయితలు మరికొందరు తమ రచన కోసం వ్యంగ్యాన్నో, వెక్కిరింతల్నో, వేలా కోళాలనో, అనుకరణపూరిత ఎగతాళినో ఆశ్రయించేవాళ్లు.

మొత్తానికి, జాతీయవాద పాత్రికేయులకు అందునా మరీ ముఖ్యంగా భారతీయ భాషలకు చెందిన వార్తా పత్రికల వాళ్లకు వాళ్ల పని కత్తిమీద సాముగానే ఉండేది. వాళ్లు సీదా సాదా తనాన్ని నైపుణ్యంతో రంగరించాల్సి వచ్చేది. ఏదో కొద్దిగా చదువుకున్న వాళ్ల కోసం సరళంగా వ్రాయాల్సి వచ్చేది. చట్టానికి పట్టుబడకుండా వ్రాయాలంటే నైపుణ్యాన్ని ప్రదర్శించాల్సి వచ్చేది. వాళ్లు అదంతా అత్యద్భుతంగా నిర్వర్తించేవాళ్లు. దాని కోసం వాళ్లు వాళ్ల కిష్టమయిన భాషల్ని సృజనాత్మకంగా వృద్ధి చేసేవాళ్లు. ఆశ్చర్యజనకమైన విషయమేమంటే ఆంగ్లం అందుకు మినహాయింపేం కాదు.

ప్రభుత్వం ఎప్పుడు పత్రికా స్వాతంత్ర్యంపై విరుచుకుపడినా, దాన్నికుదించే ప్రయత్నంలో వున్నామొదటి నుండి జాతీయోద్యమం గట్టి పట్టుదలతో పత్రికా స్వాతంత్ర్యాన్ని

కాపాడేందుకు కృషి చేస్తూనే ఉంది. నిజానికి పత్రికా స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం స్వాతంత్ర్య పోరాటంలో విడదీయరాని భాగమయ్యింది.

* * *

భారతీయ వార్తా పత్రికలు 1870ల నాటికి నిలదొక్కుకోసాగాయి. అవి లార్డ్ లిట్టన్ పాలనను తీవ్రంగా విమర్శించాయి. మరీ ముఖ్యంగా 1876 – 77 నాటి క్షామపీడితుల పట్ల అమానవీయంగా ప్రవర్తించటాన్ని అవి చూస్తూ మిన్నకుండ లేకపోయాయి. దాని వల్ల ప్రభుత్వం మధ్య తరగతి చదువరుల్ని కూడ దాటి యింకా దూసుకుపోతున్న భారతీయ భాషల్లో వెలువడే వార్తా పత్రికలపై వేటు వేసేందుకు సిద్ధమయ్యింది. 1878 నాటి దేశభాషా పత్రికల చట్టం కేవలం భారతదేశపు భాషల్లో ప్రచురింపబడే పత్రికలకు వ్యతిరేకంగా గోప్యాతి గోప్యంగా ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఏకబిగిన ఒకే ఒక్క సమావేశంలో ఆమోదించబడింది. ఆ చట్ట ప్రకారం ఏదయినా వార్తా పత్రిక విద్రోహకర విషయాల్ని ప్రచురిస్తూ అధికారిక హెచ్చరికను ఉల్లంఘించినట్లు ప్రభుత్వం విశ్వసిస్తే ఆ పత్రికను, అచ్చువేసే యంత్ర సామాగ్రిని, కాగితాన్ని, యితర సామాగ్రిని జప్తు చేసే అధికారం ప్రభుత్వానికుంది.

భారత జాతీయతాభిప్రాయం చట్టానికి పూర్తిగా విరుద్ధంగా వుంది. ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన విషయంగా అతి పెద్ద ప్రదర్శన కలకత్తాలోని టౌన్‌హాలులో గొప్ప బహిరంగ సభ నిర్వహించిన నాడు జరిగింది. అనేక ప్రజా సంస్థలు, పత్రికా సంస్థలు కూడా ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాయి. తత్ఫలితంగా లార్డ్ రిప్పన్ 1881లో దానిని రద్దు చేసాడు.

భారతీయ వార్తా పత్రికలు అంతటి తెలివైన మార్గాలలో పోరాటాన్ని నిర్వహించిన తీరు ఒక ఆనందమయ నాటకీయ సంఘటన ద్వారా వెల్లడయ్యింది. అప్పట్లో బెంగాలీ, ఇంగ్లీషు భాషల్లో ప్రచురింపబడుతున్న అమృత బజార్‌పత్రికను దృష్టిలో పెట్టుకొనే ఆ చట్టం వచ్చింది. ఆ పత్రికపై సంపూర్ణ చర్య గైకొనటమే ఆ చట్టం లక్ష్యం. అయితే ఆ చట్టం ఆమోదింపబడి దానిని అమలు పరచేందుకు మరుసటిరోజు అధికారులు నిద్రలేచేప్పటికి వాళ్లను ఆ పత్రిక జిత్తులతో చిత్తు చేసినట్లు అర్థమయ్యింది. ఎందుకంటే తెల్లవారే సరికి సంపాదకులు ఆ పత్రికను ఆంగ్ల పత్రికగా మార్చివేసారు.

* * *

1905లో పత్రికా రంగంలో మరో గణనీయమైన ఆకస్మిక తిరుగుబాటు చోటు చేసుకుంది. అప్పటి వైస్రాయి లార్డ్ కర్జన్ కలకత్తా విశ్వవిద్యాలయంలో తమ స్నాతకోపన్యాసంలో – 'అత్యున్నత ఆదర్శంగా నిలిచే సత్యం చాలా వరకు పాశ్చాత్య భావన. తూర్పున అది అంతగా గౌరవింపబడక పూర్వమే పాశ్చాత్య నీతి నియమాలలో సత్యం మకుటాయమానంగా నిలిచిందనేది సుస్పష్టం. ఇంతకూ ఆయన వ్యంగ్యంగా వ్యక్తీకరింపదలచుకొన్నదేమంటే – సత్యం అనే ఉన్నత భావనను భారతీయులకు నేర్పింది బ్రిటీషు వాళ్లని.

తరువాతరోజే అమృత బజార్ పత్రిక ముందు పేజీలోనే ఆయన ప్రసంగాన్ని ముద్రిస్తూ అక్కడ బాక్సుకట్టి కర్జన్ పుస్తకం "ప్రోబ్లమ్స్ ఆఫ్ ది ఈస్ట్" నుండి ఒక భాగాన్ని యధాతథంగా ప్రచురించారు. కొరియా పర్యటనలో ఆయన అసత్య మాడి దానిని గొప్పగా చెప్పుకోవటాన్ని వెలుగులోకి తెచ్చారు. కర్జన్ వయస్సు అప్పుడు ముప్పయిమూడేళ్లే. అయినా తన వయస్సు నలభైగా కొరియన్ విదేశాంగ కార్యాలయాధ్యక్షునితో చెప్పటం జరిగిందని ఆ పుస్తకంలో ఆయనే స్వయంగా పేర్కొన్నాడు. అలా వయస్సు పెంచి చెప్పటానికి కారణం తూర్పుదేశాల్లో ఒక వ్యక్తి వయస్సు పెరిగే కొలదీ అతనికిచ్చే గౌరవం పెరుగుతుందని ఎవరో చెప్పటమే. తన యువరూపాన్ని ఆయన కొరియా ఆరోగ్య కరమైన వాతావరణానికి అర్పించివేసాడు. అధ్యక్షుని మరో ప్రశ్నకు కర్జన్ సమాధానం కూడ ఆ పుస్తకంలో యిలా గ్రంథస్థం చేయబడింది. "మీరు విక్టోరియా రాణికి బంధువులా?" అని అడిగిన ప్రశ్నకు "అబ్బే లేదే" అని సమాధానం చెప్పాను. అది విని అతని ముఖ కవళికల్లో ప్రతిఫలించిన ఏవగింపును చూచి మరో దారిలేక నేను యిలా సర్దుకొన్నాను. "అయినా నేనింకా అవివాహితుణ్ణే". ఇటువంటి నీతి బాహ్యమైన సంకేతం ద్వారా నేను తిరిగి ఆ వయోవృద్ధుని అభిమానాన్ని పూర్తిగా పొందగలిగాను.

ప్రజలందర్నీ అవమానించేందుకు వెనుకాడక, భారతీయులకే నీతి సూత్రాలు చెప్పే నీతినియమబద్ధుడైన ఆ వైస్రాయి భంగపాటుకు బెంగాల్ మొత్తం ఫక్కున నవ్వింది. లండన్‌లోని ది వీక్లీ టైమ్స్ కూడా ఈ ఘటనతో ఆనందాన్ని పంచింది. లార్డ్ కర్జన్ గారికి 'సత్యముపై గల గౌరవము బహుశా తరువాతి కాలంలో తమ అర్థాంగి ఆధీనంలో అబ్బివుంటుంది. అది అమెరికా పౌరుల విశేషార్హత' (వైస్రాయి కర్జనుభార్య అమెరికా దేశపు వారసత్వమున్నది) అంటూ ఆ పత్రిక పేర్కొంది.

* * *

భారత జాతీయోద్యమ మూల పురుషుల్లో ఒకరైన సురేంద్రనాధ్ బెనర్జీ పాత్రికేయ విధి నిర్వహణ కారణంగా కారాగార వాసం అనుభవించిన వాళ్లల్లో ప్రధముడు. సాలగ్రామం (కుటుంబ పూజా విగ్రహం) విషయంలో ఓ కుటుంబంలో తలెత్తిన వివాదం కలకత్తా హైకోర్టు న్యాయాధీశుడు జస్టిస్ నోరిస్ ముందుంచబడింది. ఆ విగ్రహం ఎన్నాళ్ల క్రిందటిదో నిర్ధారించేందుకు దానిని కోర్టుకు తెప్పించి పరిశీలించి అది వందేళ్ల నాటిది కాదని తీర్పు చెప్పాడు. అతని చర్య బెంగాలీ హిందువుల భావావేశాలను గాఢంగా గాయపరిచింది. 1883 ఏప్రియల్ 2న బెనర్జీ బెంగాలీ పత్రికలో ఆగ్రహంతో కూడిన సంపాదకీయం వ్రాసాడు. జస్టిస్ నోరిస్‌ను చెడ్డవాళ్లుగా పేరుపడ్డ జెఫ్రేన్, సెరోగ్స్ (17వ శతాబ్దికి చెందిన కళంకితులైన న్యాయాధీశులు) సరిపోల్చుతూ తాను 'అధిష్టించిన స్థానానికి ఎంతగా అనర్హుడో చూపెట్టేందుకు' నోరిస్ చేసింది సరిపోయిందన్నాడు. దానికి తోడు బెనర్జీ యిచ్చిన సలహా ఏమంటే 'ఆయన అపరిపక్వ న్యాయ పంపిణీకి చెందిన అదుపులేని వింతపోకడల్ని అంతం చేసేందుకు కొన్ని బహిరంగ చర్యలు తీసుకోవాల్సి ఉంది'.

కోర్టు ధిక్కార నేరం క్రింద వెనువెంటనే ఐదుగురు న్యాయాధీశులతో కూడిన బెంచి ముందుకు బలవంతంగా బెనర్జీని హాజరు పరిచారు. ఆ ఐదుగురిలో నలుగురు ఐరోపాకు చెందిన వాళ్లు. అందులోని భారతీయ న్యాయాధీశుడు రమేష్ చంద్ర మిత్రా వ్యతిరేకించినా బెంచి బెనర్జీని అపరాధిగా భావించి రెండు నెలల కారాగార వాస శిక్షను విధించింది. ప్రజలు ఆగ్రహించి వెనువెంటనే ప్రతిచర్యకు పూనుకున్నారు. భారత భాగానికి చెందిన కలకత్తాలో అప్పటి కప్పుడు హర్తాళ్ నిర్వహించారు. కోర్టు వెలుపల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి కిటికీలు ముక్కలు చెక్కలు చేసారు. పోలీసులపై రాళ్లు రువ్వారు. ఆ యువకుల్లోని ఒక రౌడీ – అసితోష్ ముఖర్జీ – తరువాతి కాలంలో కలకత్తా విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలరుగా వినుతికెక్కాడు. ప్రదర్శనలు కలకత్తాలోని అన్ని ప్రాంతాల్లోనూ, బెంగాల్లోని అనేక పట్టణాల్లోనే గాక లాహోర్, అమృతసర్, ఆగ్రా, ఫైజాబాద్, పూనా మొదలుగా గల అనేక నగరాల్లో నిర్వహించారు. ప్రధమంగా అలా పెద్ద ఎత్తున నిర్వహించిన అనేక బహిరంగ సభలకు కలకత్తా నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.

* * *

అయితే జాతీయ వాద పోరాట నాయకులలో ప్రసిద్ధికెక్కిన బాలగంగాధర తిలక్ స్వాతంత్ర్యోద్యమ కాలంలో పత్రికా స్వేచ్ఛకై నిర్వహించిన పోరాటంలో తరచుగా

పాల్గొన్న వ్యక్తిగా నిలిచిపోయాడు. 1856లో జన్మించిన తిలక్ తన మొత్తం జీవితాన్ని దేశసేవకే అర్పించాడు.

1881లో ఈయన జీ.జీ. అగార్కర్‌తో కలసి కేసరి (మరాఠీ పత్రిక), మహరాట్టా (ఆంగ్ల పత్రిక) స్థాపించాడు. 1888లో ఆ రెండు పత్రికల నిర్వహణ బాధ్యత తానే స్వీకరించి వాటిని బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా అసంతృప్తిని వ్యాపింప జేసేందుకు దానికి తగినంత జాతీయతా సామర్థ్యాన్ని ప్రోదిచేసేందుకు వినియోగించాడు. తిలక్ ఓ ఆవేశపూరిత, సాహసోపేత పాత్రికేయుడు. ఆయన శైలి నిరాడంబరంగా, సూటిగా వున్నా బాగా చదివించే గుణం కలిగి వుండేది.

మతంతో ముడిబడి, సంప్రదాయ బద్ధంగా జరుపుకునే గణపతి ఉత్సవాలను 1893లో ఆయన జాతీయ భావనాభివృద్ధికి ఉపయోగించటం మొదలు పెట్టాడు. ఆ సందర్భంగా దేశభక్తి గీతాలను ఆలపించటం, ప్రసంగాలను ఏర్పాటుచేయటం, ఆ కార్యక్రమంలో భాగాలు అయ్యేట్లు చూసాడు. అదే విధంగా 1896లో శివాజీ ఉత్సవాన్ని కూడ యువ మహరాష్ట్రీయుల సహకారంతో దేశభక్తిని ప్రేరేపించేందుకు వాడుకోవటం ప్రారంభించాడు. అదే సంవత్సరం ఆయన ప్రత్తిపై ఎక్సైజు సుంకం విధించటాన్ని వ్యతిరేకిస్తూ మహారాష్ట్ర అంతటా విదేశీ వస్త్ర బహిష్కరణకు పిలుపునిచ్చి ఉద్యమించాడు. క్రింది మధ్య తరగతి ప్రజలు, రైతులు, చేతివృత్తుల వాళ్లు, కార్మికులు జాతీయోద్యమంలో పోషించగల ప్రముఖ పాత్రను గుర్తించిన జాతీయనాయకుడీయనే నేమో. అందువల్లనే వాళ్లందర్నీ కాంగ్రెసులోకి చేర్చవలసిన అవసరాన్ని గుర్తించాడు. 1897లో కాంగ్రెసు రైతును విస్మరించిన తీరును విమర్శిస్తూ కేసరి పత్రికలో యిలా వ్రాసాడు: 'భారత దేశానికి రైతు ఆత్మవంటివాడు. అతనిపై కమ్ముకున్న నిరుత్సాహం, నిరాసక్తత వంటి మేఘాల్ని తొలగించినప్పుడే దేశానికి దాస్య విముక్తి. ఈ మేఘాల్ని మనం వెంటనే తొలగించాలి. మనం రైతులతో మమేకం కావాలి – అతను మనవాడేననీ మనం అతని వాళ్లమేనని మనం తప్పక భావించాలి.' ఇది అలా జరిగినప్పుడే 'కాంగ్రెసును పసలేనిదిగా పరిగణించటం మంటే భారతజాతినే అలా చూడటమని ప్రభుత్వానికి తెలిసివస్తుంది. అప్పుడే కాంగ్రెసు నేతల కృషికి విజయకేతనం.'

ఈ లక్ష్య సాధన దిశగా ఆయన 1896–97వ సంవత్సరంలో పన్ను ఎగవేత ఉద్యమాన్ని పూనా సార్వజనిక సభ యువ కార్యకర్తల సహకారంతో మహారాష్ట్రలో ప్రారంభించాడు. అధికారిక క్షామ నియమావళి పత్రాలను మరాఠీలో అచ్చొత్తించి,

వేలాదిగా పంచి, క్షామ పీడిత రైతులకు ఆయన పిలుపునిచ్చిందేమంటే – వాళ్ల పంటలు దెబ్బతిన్నట్లయితే శిస్తు చెల్లించవద్దని.

1897లో పూనాలో ప్లేగు వ్యాపించిన సందర్భంగా ప్రభుత్వం ప్లేగు బారిన పడ్డవాళ్లను వేరు చేసేందుకు గృహ సోదాలను చేసి గట్టి చర్యలు చేపట్టవలసి ఉంది. ఆ సమయంలో చాలా మంది యితర నాయకుల వలెగాక తిలక్ పూనాలోనే ఉండి అటు ప్రభుత్వానికి సహకరిస్తూనే ప్లేగును అరికట్టేందుకు తానూ తగిన చర్యలు గైకొన్నాడు. అయితే ప్లేగు బారిన పడ్డ ప్రజల పట్ల ప్రభుత్వాధికారుల దురుసు ప్రవర్తనను, నిర్దయత్వాన్ని ఆయన దుయ్యబట్టకపోలేదు. ప్రభుత్వం చేపట్టిన ప్లేగు నివారణ కార్యక్రమాల పట్ల ప్రజలలో రేగిన అసంతృప్తి పూనా ప్లేగు కమిటీ ఛైర్మను రాండ్‌తో బాటు లెఫ్టినెంట్ ఐరెస్ట్‌ల హత్యకు దారితీసింది. 1898 జూన్ 27న ఛపేకార్ సోదరులు వాళ్లను హత్యగావించారు.

ప్రజల ఆగ్రహానికి కారణం కేవలం ప్లేగు నివారణ చర్యలలో అవలంబించిన విధానాలే కాదు, 1894 నుండి పన్నులు, ద్రవ్య చలామణి, క్షామ నివారణ వంటి విషయాల్లో ప్రభుత్వ విధానాలు ప్రజలకు కోపాన్ని తెప్పించుతూనే ఉన్నాయి. జాతీయ వాదుల్లో పోరాటతత్వం త్వరితగతిన ప్రబల సాగింది. వార్తా పత్రికల్లో వాడిగా, వేడిగా ప్రతికూల వ్యాఖ్యలు చోటు చేసుకో సాగాయి. ప్రభుత్వం ఆ విధమైన తత్వాన్ని అరికట్టాలనుకుంది. పత్రికలకు గుణపాఠం నేర్పేందుకు నిర్ణయించుకుంది. తిలక్ అప్పటికే మహారాష్ట్రలో జాతీయ వాద పోరాట వీరునిగా, ప్రతికూల ప్రతిభాన్విత పాత్రికేయునిగా పేరెన్నిక గన్నాడు. ప్రభుత్వం ఆయన్ని శిక్షించటం ద్వారా హెచ్చరికలు జారీ చేసేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తోంది. రాండ్ హత్య తగిన అవకాశాన్నిచ్చింది. బ్రిటీషువారు నడిపే పత్రికలు, ప్రభుత్వాధికారులు రాండ్ హత్యను తిలక్ నాయకత్వంలో పూనా బ్రాహ్మణుల కుట్రగా చిత్రించేసారు.

రాండ్‌హత్యలో సరాసరి తిలక్‌నే యిరికించే అవకాశం కోసం ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించింది. అయితే ఋజువులు దొరకలేదు. పైగా తిలక్ ఆ హత్యను తీవ్రంగా ఖండించాడు. అది ఒక దురభిమాని మితిమీరిన చర్యగా అభివర్ణించాడు. అయినా ఆయన ప్రభుత్వాన్ని విమర్శించటం మానింది లేదు. న్యాయ సమ్మతంగాని చర్యల్ని వెలుగులోకి తెచ్చి ప్రజలు తమ హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో తెలియజెప్పటం పత్రికల ప్రధాన లక్ష్యమని గట్టిగా వాదిస్తూనే ఉన్నాడు. కనుక ప్రభుత్వం ఆయన్ని

భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షను 124-ఎ క్రింద ప్రజల్ని రెచ్చగొట్టటం ప్రభుత్వం పట్ల అసంతృప్తిని, ద్వేషాన్ని రేకెత్తించటం వంటి నేరారోపణలపై నిర్బంధించింది.

1879 జూలై 27న తిలక్‌ను నిర్బంధించటం జరిగింది. కేసు జస్టిస్ స్ట్రాచీ మరో ఆరుగురు యూరోపియన్లు, ముగ్గురు భారతీయులు గల జ్యూరీ ముందుకు విచారణకు వచ్చింది. నేరారోపణ ఏమంటే జూన్ 15 నాటి కేసరి పత్రికలో ప్రచురించిన "శివాజీ ప్రవచనాలు" అనే పద్యం. అది శివాజీ ఉత్సవం సందర్భంగా ఓ యువకుడు చదివి వినిపించినటువంటిది. మరో అభియోగమేమంటే ఆ ఉత్సవం సందర్భంగానే శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను వధించటాన్ని సమర్థిస్తూ తిలక్ ప్రసంగించటం.

'శివాజీ ప్రవచనాలు' అనే పద్యంలో ఆ కవి ప్రదర్శింప జేసిందేమంటే ప్రస్తుత స్థితిని చూచి శివాజీ తన దేశవాసుల్ని యిలా మేల్కొల్పుతాడు. "అయ్యో, అయ్యో ఈనాడు నాదేశం ధ్వంసం కావటం నా కళ్లారా చూస్తున్నాను.... విదేశీయులు తమ కరాలతో లక్ష్మిని వేధిస్తూ యీడ్చుకు పోతున్నారు. (మరాఠీలో కర్ అంటే పన్నులు)... పెద్దమ్మ క్షామదేవత రూపంలో దేశమంతటా తిరుగాడుతూంది. చదరంగంలోని కదల లేని పావుల వలె ఈ రాజులంతా (నాయకులందరూ) ఎలా బొత్తిగా మగతనం లేకుండా వుండిపోయారు?'

శివాజీ అఫ్జల్‌ఖాన్‌ను వధించటంలో తిలక్ సమర్ధనను బ్రిటీషు అధికారుల్ని వధించేందుకు రెచ్చగొట్టటంగా విచారణలో చిత్రించటం జరిగింది. మొత్తం మీద అభియోగమేమంటే తిలక్ తన పత్రికలో బ్రిటీషు వాళ్లకు భారతదేశంలో ఉండే హక్కులేదనే అభిప్రాయాలను విస్తరింపజేసాడనే కనుక ఎలా గయినా సరే అతణ్ణి వదిలించుకోవాలని అనుకున్నారు బ్రిటీషు అధికారులు.

పునఃపరిశీలించి చూచుకుంటే అభియోగం అక్రమమైనది కాదని అర్థమవుతుంది. కాని ఆరోజుల్లో గాంధీజీ మార్గదర్శకత్వంలో స్వాతంత్ర్య సమరయోధుల్లా వాళ్లని వాళ్లు అనుకూలంగా సమర్థించుకునేందుకు గాని, రెచ్చగొట్టే విషయంలో వాళ్లు బహిరంగ ప్రకటనలకు దిగేందుకు గాని పూనుకునే వాళ్లుగాదు. త్యాగమయ రాజకీయాలు, బహిరంగంగా అధికార ధిక్కారానికి పాల్పడటం వంటివి యింకా శైశవ దశలోనే ఉన్నాయి. అప్పటి కింకా వలస వాద వ్యతిరేక కార్య కలాపాలన్నీ చట్టపరిధిలోనే చేపట్టక తప్పింది కాదు. కనుకనే తిలక్ అధికారుల అభియోగాలను ఒప్పుకొనలేదు. పరాయి పాలనకు వ్యతిరేకంగా అసంతృప్తిని ప్రచారం చేసే ఉద్దేశ్యం తనకు లేదన్నాడు. పాలకుల్ని ఎదిరించే

ఈ పాత ఫక్కీలో కూడ తిలక్ అత్యంత ధైర్యాన్ని, త్యాగాన్ని ప్రదర్శించాడు. ఓ కొత్త తరహా రాజకీయాలకు శ్రీకారం చుట్టబోతున్నాడనే విషయం తనకు సుస్పష్టమే. ఒక కొత్త తరహా నాయకుణ్ణి ఉదాహరణగా తీసుకొని ప్రజలు నమ్మికను విశ్వాసాన్ని తద్వారా ప్రోదిచేసుకోగలగాలనుకున్నాడు. అపరిపక్వ తీవ్రవాదాన్ని జాగ్రత్తగా ప్రక్కన బెట్టాలనుకున్నాడు. లేకుంటే అది ప్రభుత్వ అణచివేతను ఆహ్వానించి ప్రజల్ని బెదిరింపులకు గురిచేస్తుందని తత్ఫలితంగా ప్రజల నుండి దూరంగా వుండవలసి వస్తుందని గుర్తించాడు.

తిలక్ తన వ్యాఖ్యల్ని రద్దు పరచుకొని క్షమాపణ కోరవలసిందిగా కొందరు మిత్రులు ఆయనపై వత్తిడి బాగా తెచ్చారు. దానికి తిలక్ చెప్పిన సమాధానమేమంటే: ప్రజలలో నా స్థానం (నాయకునిగా) నా ప్రవర్తనపై సంపూర్ణంగా ఆధారపడి వుంటుంది.... వాళ్ల (ప్రభుత్వం) లక్ష్యమేమో పూనా నాయకులను అగౌరవ పరచటం. అయినా నాలో వాళ్లు మెతకదనాన్ని చూడలేరు. కనుక మీరు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి – ఒక దశ దాటిన తరువాత మన మందరం ప్రజల సేవకులం. తగు సమయంలో మీరు ధైర్యాన్ని కావలసినంతగా ప్రదర్శించలేక పోతే ద్రోహంతో వాళ్లను నిరుత్సాహపరచినట్లే.'

జడ్జి స్ట్రాచీ పక్షపాత బుద్ధితో కూడిన క్లుప్తీకరణ జూరీ ముందుంచటంతో న్యాయవాద వర్గాలలో ఆయన చెడ్డపనికి బాగా గుర్తింపు పొందినట్లయ్యింది. ఆయన అసంతృప్తిని కేవలం ప్రసన్నత లేకపోవటంగా నిర్వచించాడు. దానివల్ల ద్వేషం, వైరం, అవిధేయత వంటి పలు విధాలైన వ్యతిరేకతా భావాలు ప్రభుత్వం పట్ల ప్రకటించినట్లయ్యింది. దానితో ఆరింట ముగ్గురు అనుమతించిన తీర్పు తిలక్‌ను దోషిని గావించింది. జ్యూరీలో వ్యతిరేకించిన ముగ్గురు సభ్యులు భారతీయులు. 18 మాసాల కఠిన కారాగారవాసమనే అనాగరిక తీర్పును జడ్జి ప్రకటించాడు. అదీ ఎప్పుడు? – తిలక్ బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్నప్పుడు! తిలక్‌తో పాటు బొంబాయి ప్రెసిడెన్సీలోని మరికొందరు పత్రికా సంపాదకులను విచారణ చేసి అటువంటి కఠినమైన శిక్షలనే విధించటం జరిగింది.

తిలక్‌ను కారాగారంలో బంధించటం దేశవ్యాప్త నిరసనలకు దారితీసింది. ఈ విధంగా పౌరహక్కులపై, పత్రికా స్వేచ్ఛపై వేటు వేయటాన్ని వ్యతిరేకిస్తూ తిలక్‌ను విమర్శిస్తూండే మితవాదులు నిర్వహించే వాటితో బాటు అన్ని జాతీయవాద పత్రికలు, రాజకీయ సంస్థలు దేశవ్యాప్త ఉద్యమాన్ని నడిపాయి. చాలా పత్రికల ముందు పేజీలు నల్లబోర్డరుతో వెలువడినాయి. లండన్‌లో నివసించే భారతీయుల్నుద్దేశించి దాదాభాయి నౌరోజీ ప్రసంగిస్తూ పరిపాలనలో ప్రభుత్వం రష్యా (జారిస్టు) విధానాలను

ప్రవేశపెడుతున్నదని విమర్శించాడు. పత్రికల పీకనొక్కటం ప్రభుత్వం తన ప్రయోజనాలను తానే రూపు మాపుకొనే ఆత్మహత్యా చర్యవంటిదన్నాడు.

రాత్రికి రాత్రే తిలక్ పేరెన్నిక గన్న అఖిల భారత నాయకుడు అయ్యాడు. లోకమాన్య బిరుదు లభించింది. ధైర్య సాహసాలు ప్రదర్శించే నాయకుడయ్యాడు. తన చేతల ద్వారా ప్రబోధించే సరికొత్త నాయకునిగా స్వీయ అర్పణకు సజీవసాక్ష్యంగా నిలిచాడు. 1897 డిసెంబరులో అమరావతిలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెసు సభల్లో సురేంద్రనాథ్ బెనర్జీ తిలక్‌ను గూర్చి అనునయవాక్యాలు పలుకుతూ 'జాతి మొత్తం శోకిస్తూంది' అన్నప్పుడు శ్రోతలందరూ లేచి నిలబడి తమ సమ్మతిని అత్యద్భుతంగా ప్రకటించారు.

1898లో ప్రభుత్వం సెక్షను 124–ఎకు సవరణ తెచ్చి సెక్షను 153ఎ ను శిక్షాస్మృతికి అనుసంధానించింది. భారత ప్రభుత్వం పట్ల ఎవరు ధిక్కార ప్రయత్నం గావించినా లేక విభిన్న జాతుల మధ్య అంటే భారతదేశంలోని ఆంగ్లేయుల పట్ల గూడ విద్వేషాన్ని రగిలించేందుకు ప్రయత్నించినా అది శిక్షార్హమైన నేరమే. ఇది మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు దారితీసింది.

* * *

మనం మరింత విపులంగా 10వ అధ్యాయంలో చర్చించబోయే స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలు దేశంలో మరో కొత్త అణచివేత ఉప్పెనకు దారితీసాయి. ప్రజలు మళ్లీ కోపోద్రిక్తులై ప్రతిఘటించసాగారు. ఈ ప్రతిఘటనలు బెంగాలు యువతను వ్యక్తిగత తీవ్రవాద వైఖరి దిక్కుగా నడిపించాయి. 1908వ సంవత్సరపు ప్రారంభంలో అధికారులపై అనేక బాంబు దాడులు జరిగాయి. ప్రభుత్వానికి ధైర్యం సడలు తున్నట్లనిపించింది. తిరిగి పత్రికలు ప్రధాన లక్ష్యాలయ్యాయి. పత్రికలపై ఆంక్షలు విధిస్తూ సరికొత్త చట్టాలు వచ్చాయి. అనేక పత్రికలు, వాటి సంపాదకులపై కేసులు నడిచాయి. పత్రికా రంగం దాదాపుగా సంపూర్ణంగా అణచివేయబడినట్లయ్యింది. ఈ వాతావరణంలో బెంగాలుకు బయట బహిష్కరణ ఉద్యమాలకూ, అతివాద రాజకీయాలకు ప్రధాన సూత్రధారి లోకమాన్య తిలక్‌వైపు ప్రభుత్వ దృష్టి మళ్లటం తప్పనిసరే.

భారతదేశంలోకి "బాంబు" ప్రవేశించటాన్ని గురించి తిలక్ ఎన్నో రచనలు చేసాడు. హింసను వ్యక్తిగత హత్యాకాండను నిరసించాడు. పాతదాన్ని పూర్తిగా పడగొట్టాలనే సిద్ధాంతాన్ని విషవృక్షంగా వర్ణించాడు. అయితే విమర్శ, నిరసన, మహోన్నత

స్వేచ్ఛకై ప్రజలు అభీష్టం వంటివాటిని అణగదొక్కే చర్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నాడు. అటువంటి వాతావరణంలో 'హింస ఎంతగా నిరసించవలసిందయినా తప్పని సరై కూర్చుంటుంది.' ఆయనే తన వ్యాసంలో వ్రాసినట్లు 'ఎప్పుడయితే అధికార గణం, అకారణంగా కోపాన్ని ప్రదర్శించి, ప్రజల్ని లోబరచుకోవాలని చూస్తుందో, అనవసరంగా వాళ్లను భయపెట్టి, వాళ్ల మధ్య నిరాశను చొప్పించే ప్రయత్నం చేస్తుందో అప్పుడు అటువంటి కఠినమైన అణచివేత విధానాన్ని తట్టుకునే ఓర్పు ప్రజల్లో నశించటానికి సంకేతంగా బాంబు మోత దానంతటదే మోగుతుంది.'

ఇటువంటి వ్యాసాలు ప్రచురించి నందుకుగాను ప్రజలను రెచ్చగొట్టాడనే అభియోగంపై తిలక్‌ను నిర్బంధించి విచారణ చేపట్టారు. తిలక్ తిరిగి తన నేరమేమీలేదని వాదించి అత్యంత సాహసాన్ని ప్రదర్శించాడు. తన అరెస్టుకు కొద్ది రోజుల ముందు తనతో స్నేహంగా వుండే ఓ పోలీసు అధికారిజరగబోయే ఘటననుగూర్చి హెచ్చరించి తిలక్‌ను జాగ్రత్త పడమంటే తిలక్ నవ్వి ఇలా అంటాడు. ఈ ప్రభుత్వం దేశం మొత్తాన్నే ఓ చెరసాలగా మార్చింది. మేమందరం అందులో బందీలమే. ఇప్పుడు జైలుకు వెళ్లటమంటే పెద్ద గది నుండి చిన్న గదికి పోవటమే.' న్యాయస్థానంలో తిలక్ మౌలిక ప్రశ్నను లేవనెత్తాడు – 'తిలక్ ఉన్నాడా లేడా అన్నది ముఖ్యం కాదు. ముఖ్యమైన ప్రశ్న ఏమంటే ఇంగ్లండు ప్రజల మాదిరే ఇక్కడ భారతీయులు కూడ అంతే స్వేచ్ఛను పత్రికా స్వాతంత్ర్య పరంగా అందించేందుకు మీరు సంరక్షకులుగా సంసిద్ధులేనా?'

మరోసారి జూరీ తిలక్‌ను దోషిగా నిర్ధారిస్తూ తీర్పు నిచ్చింది. అందుకు నిరసన తెలియజేసిన భారతీయ సభ్యులు ఈ పర్యాయం ఇద్దరే. దానికి తిలక్ సమాధాన మేమంటే – 'మానవుల, దేశాల గమ్యాన్ని నిర్దేశించే మహత్తర శక్తులున్నాయి. నేను స్వేచ్ఛగా వుండే కంటే యిలా ఇబ్బందుల్లో ఉండటం మూలంగానే నా లక్ష్యం యిలా మరింత చేరువ కావాలనేది వాటి కోరికేమో.' జస్టిస్ డావర్ తిలక్‌కు ఆరేళ్ల దేశ బహిష్కార శిక్ష విధించగా బర్మాలోని మాండలే జైలుకు ఆయన్ని తరలించారు.

అసాధారణమైన ప్రజాస్పందన వెల్లివిరిసింది. తిలక్ నడిచిన మార్గంలోనే నడిచి పత్రికా స్వాతంత్ర్యాన్ని కాపాడుకోబోతున్నామని పత్రికలన్నీ బహిరంగంగానే ప్రకటించాయి. తిలక్‌కు శిక్ష ప్రకటించిన జూలై 22న బొంబాయి పట్టణంలోని

వ్యాపార సంస్థలన్నీ మూసివేసారు. ఒక వారం రోజుల పాటు అవి అలాగే మూతబడి ఉన్నాయి. ఆరు రోజుల పాటు బట్టల మిల్లులలో రైల్వే కర్మాగారాల్లో పనిజేసే శ్రామికులంతా సమ్మెకు దిగారు. కార్మికులను బలవంతంగా విధుల్లోకి పంపే చర్యల్లో వాళ్లకూ పోలీసులకూ మధ్య యుద్ధవాతావరణం. సైన్యం రంగంలోకి దూకింది. 16 మంది కార్మికుల ప్రాణాలు బలిగొన్నారు. వాళ్ల శవాలు రోడ్ల మీదే పడివున్నాయి. మరో 15 మంది వరకూ తీవ్రంగా గాయపడ్డారు. లెనిన్ దానిని భారతదేశ శ్రామిక వర్గ రాజకీయ రంగ ప్రవేశంగా అభినందించాడు.

తిలక్ విచారణ ప్రతిధ్వనులు దగ్గర్లోని మరో కోర్టులో ప్రతిధ్వనించనున్నాయి. "యంగ్ ఇండియా" పత్రికలో తిలక్ రాజకీయ వారసుడు గాంధీజీ వెలువరించిన వ్యాసాలకు గాను అదే 124 – ఏ సెక్షను క్రింద రెచ్చగొట్టటం అనే అదే అభియోగం క్రింద 1922లో విచారణ జరిపారు. నేరం తిలక్ చేసినటువంటిదే కనుక అదే ఆరేళ్ల కారాగార వాస శిక్ష గాంధీజీకి కూడ విధిస్తున్నట్లు జడ్జి తెలియజేసినప్పుడు గాంధీజీ యిలా చెప్పాడు: 'మీరు దివంగత లోకమాన్య బాలగంగాధర తిలక్ విచారణ ప్రస్తావన యిప్పుడు తీసుకురావటం, ఆయన పేరుతో యిలా నన్ను కలపటం నాకు అత్యంత గౌరవ ప్రదంగా, గర్వకారణంగా ఉందని మనవి చేసుకోదలచుకొన్నాను'.

అయితే ఆ రెండు విచారణల మధ్య నెలకొన్న తేడా ఏమంటే గాంధీజీ అభియోగాలకు తల ఒగ్గి నేరాన్ని అంగీకరించాడు. 1908 నుండి జాతీయోద్యమం నడక ఎంత దూరం ఎలా సాగిందనటానికి ఇది ఒక కొలబద్దే. రాజకీయాల్లో పాత్రికేయతల్లోవచ్చిన మార్పుల్లో తిలక్ పాత్ర ఎంతో ప్రముఖమైనది.

* * *

# 9 చట్ట సభల్లో ప్రచారం

1920 నాటి వరకూ భారత దేశంలోని లెజిస్లేటివ్ కౌన్సిళ్లకు సహజంగా వుండ వలసిన స్వంత అధికారాలు లేవు. అయినా వాటిలో జాతీయ వాదులు నెరపిన కృషి జాతీయోద్యమ అభివృద్ధికి సహాయ కారిగా నిలిచింది.

* * *

గవర్నరు జనరల్, కార్య నిర్వహణ మండలి ద్వారా, చట్టాలను రూపొందింప జేయాలనే తలంపుతో 1861 నాటి ఇండియన్ కౌన్సిల్ బిల్లు ద్వారా దానిని విస్తృత పరచటం జరిగింది. దాని పర్యవసానంగా గవర్నరు జనరలు ఆరునుండి పన్నెండు మంది వరకు సభ్యుల్ని పెంచుకోవచ్చు. అందులో కనీసం సగం మంది ఇటు భారతీయులుగాని, అటు బ్రిటీషు వాళ్లుగాని విధిగా అనధికారులై ఉండాలి. ఈ కౌన్సిల్‌నే ఇంపీరియల్ లేజిస్లేటివ్ కౌన్సిల్ అనే వాళ్లు. దానికి అధికారాలేమీ ఉండేవి కావు. ప్రభుత్వపు ముందస్తు అనుమతి లేకుండా అది బడ్జెట్‌పై గాని, ఆర్థికాంశాలపై గాని, ముఖ్యమైన బిల్లులపై గాని చర్చించేందుకు అధికారం లేదు. పాలనా యంత్రాంగపు చర్యలపై అది చర్చించే వీలు లేదు. అందువలన దానిని ఏదో విధమైన అతి ప్రాథమిక పార్లమెంటరీ వ్యవస్థగా చూచే వీలుకూడ లేదు. ఈ వాస్తవాన్ని చాటి చెప్పేందుకా అన్నట్లు 1892 వరకు రమారమి సంవత్సరానికి ఇరవయ్యయిదు రోజులు మాత్రమే ఈ కౌన్సిల్ సమావేశాలు జరిగేవి.

1858 కి పూర్వంవలె భారత ప్రభుత్వం పరాయి నిరంకుశత్వం క్రిందే ఉంది. ఇది యాదృచ్ఛికమేమీకాదు. 1861నాటి ఇండియన్ కౌన్సిళ్ల బిల్లును ప్రవేశపెడుతూ అప్పటి భారత దేశపు సెక్రటరీ ఆఫ్ స్టేట్ చార్లెస్ ఉడ్ అన్నదేమంటే – 'అనుభవం మనకు నేర్పేదేమంటే ఒక ప్రబలమైన జాతి మరో జాతిని పరిపాలిస్తున్నప్పుడు నిరంకుశత్వమే అత్యంత సాధు స్వభావంగల ప్రభుత్వ పద్ధతి.' ఆ తరువాత ఓ సంవత్సరానికి వైస్రాయి ఎల్జిన్‌కు ఆయన వ్రాసిందేమంటే – 'భారతదేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా బ్రిటన్ నుండి అదుపు చేయగల నియంతృత్వమే తగిన ప్రభుత్వంగా రాణించగలదు.' ఈ విధంగా బ్రిటన్ నుండి 'అదుపు చేసే నియంతృత్వమే 1947 ఆగస్టు 15వరకూ భారత ప్రభుత్వ ప్రధాన లక్షణంగా నిలిచింది.

ఈ చట్ట సభలో భారతీయ సభ్యుల పాత్రేమిటి? పాలకులకు భారతీయుల అభిప్రాయాలు తెలియక పోయినందువల్లనే 1857నాటి తిరుగుబాటు జరిగిందనేది పలువురు బ్రిటీషు అధికారుల అభిప్రాయం గనుక దానికి అనుగుణంగా భారతీయుల అభిప్రాయాలు తెలుసుకోగలందులకు వాళ్లను సభ్యులుగా చేర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఆచరణలో కౌన్సిల్ ఆ విధమైన ప్రయోజనాన్ని కూడ చేకూర్చలేక పోయింది. నియమితులైన భారతీయుల సంఖ్య చాల స్వల్పం. 1862నుండి 1892 వరకు గల 30 సంవత్సరాల కాలంలో 45మంది భారతీయుల్ని మాత్రమే నామినేట్ చేసారు. పైగా అలా నామినేట్ చేసేప్పుడు ప్రభుత్వం ఏ రాజులనో, లేక వాళ్ల అధికారులనో, పెద్ద పెద్ద జమీందారులనో, బడా వ్యాపారవేత్తలనో లేక ఉద్యోగవిరమణ చేసిన ఉన్నతోద్యోగులనో భారతీయ సభ్యులుగా ఎంపిక చేసేది. సయ్యద్ అహమ్మద్ ఖాన్ (1878–82), క్రిష్టోదాస్ పాల్ (1883), వి.యన్ మాండ్లిక్ (1884–87), కే. యల్. నూల్కర్(1890–91) రాస్ బిహారీ ఘోష్ (1892) వంటి బహు కొద్ది మంది రాజకీయవేత్తలు, స్వతంత్రులైన మేధావులు భారతీయ సభ్యులుగా నియమితులయ్యారు. భారతీయ సభ్యుల్లోని అధిక భాగం భారత ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారుగాగానీ లేదా ఉద్భవిస్తున్న జాతీయ భావనల్ని ప్రతిబింబింప జేసేవారుగాని లేరు. కనుక వాళ్లంతా అధికార పథంలోనే పూర్తిగా పయనించారంటే ఆశ్చర్య పోనవసరంలేదు. బలరామ్ పూర్‌కు చెందిన రాజా దిగ్విజయసింగ్ విషయం చూస్తే భలే చిత్రంగా ఉంటుంది. ఆయన కౌన్సిల్‌కు రెండు పర్యాయాలు నామినేట్ చేయబడ్డాడు కానీఆయనకు ఇంగ్లీషు

అక్షరం ముక్క రాదు. మరి ఓటు ఎలా వేసే వాడివని ఆయన్ని ఓ బంధువు అడిగినప్పుడు ఆయన చెప్పిన సమాధానం ప్రకారం – వై స్రాయివైపే ఆయన చూస్తుండేవాడట ఆయన చెయ్యెత్తినపుడు చెయ్యెత్తి, ఆయన దించినపుడు దించేవాడట!

కౌన్సిల్లో భారతీయ సభ్యుల ఓటింగ్ సరళి నిరుత్సాహ జనకం. భారతీయ భాషా పత్రికల బిల్లు కౌన్సిల్ ముందుకు తెచ్చినపుడు ఒకే ఒక్క భారతీయ సభ్యుడు సభలో ఉన్నాడు. ఆయనే జమిందారీ ప్రాబల్యంగల బ్రిటీషు ఇండియన్ అసోసియేషన్ నాయకుడైన మహారాజ జోతేంద్ర మోహన్ టాగోర్. ఆయన ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు చేసాడు. 1885లో ఒక వైపున సురేంద్ర నాథ్ బెనర్జీ వంటి జాతీయవాద నాయకులు బెంగాల్ టెనెన్సీ బిల్లు కౌలుదార్లకు మరింత అనుకూలంగా వుండేట్లు చేయాలని పోరాడుతున్న తరుణంలో కౌన్సిల్లోని ఇరువురు జమిందారీ ప్రతినిధులు ఆ బిల్లులోని కౌలుదారీ అనుకూల స్వభావాన్ని బలహీన పరిచేందుకు సహకరించారు. 1882లో కలకత్తాకు చెందిన బడా వ్యాపారుల ప్రతినిధులైన జోతేంద్ర మోహన్ టాగోర్, దుర్గా చరక తాహాలు ఉప్పుపై పన్ను తగ్గించేందుకు వ్యతిరేకతను ప్రకటిస్తూనే వ్యాపారులపై వృత్తిదారులపై విధించే లైసెన్స్ పన్ను తగ్గించటాన్ని సిఫారసు చేసారు. జాతీయ వాదుల కోరిక అందుకు విరుద్ధంగా ఉంది. 1888లో బడా భుస్వాముల ప్రతినిధియైన ప్యారీ మోహన్ ముఖర్జీ, బడా వ్యాపారుల ప్రతినిధియైన దిన్షాలు భారత దేశంలో బ్రిటీషు ప్రాతినిధ్యం వహించే బ్రిటీషు అనధికార సభ్యులతో కలిసి ఉప్పుపై పన్నును పెంచటాన్ని బలపరిచారు.

ఆ సమయానికే జాతీయ వాదులు ఉప్పుపై పన్నుకు వ్యతిరేకంగా చురుకుగా కృషి చేస్తున్నారు. కనుక వాళ్లు ఆ విధంగా బలపర్చటం వల్ల వీళ్లు తీవ్రంగా స్పందించారు. ఇటు వార్తా పత్రికల్లోనూ, అటు కాంగ్రెసు వేదికల నుండి ఆ ఇరువురు ప్రతినిధుల్ని “నకిలీ బంగారు పూతలు”గా “ఉనికిలేని వైభవోపేతులు”గా వర్ణించసాగారు. ఆనాటి చట్ట సభల్లో భారతీయుల అభిప్రాయానికి ప్రాతినిధ్యం లేదనే జాతీయ వాదుల వాదానికి రుజువుగా వాళ్ల ఓటింగ్ సరళిని చూపేవాళ్లు. 1890 జాతీయ కాంగ్రెసు సభలో మదన మోహన మాలవ్యా ఇలా అన్నారు : ‘ప్రజలతో అసలేమీ సంబంధంలేకుండా, అంత క్రూరంగా ప్రవర్తించే అటువంటి అనధికార సభ్యుల ప్రాతినిధ్యం కంటే కౌన్సిల్లో అనధికార సభ్యులు అసలు లేకపోవటమే మంచిది.’ ముఖర్జీ, దిన్షాల ప్రస్తావన తేల్చి

'స్వంత ఆదాయాల్ని అనుభవించే, పెద్ద మొత్తాల్లో వేతనాలు పొందే ఈ గొప్ప గొప్ప గౌరవనీయ పెద్దల్ని కౌన్సిళ్లకు ఎన్నుకునే ప్రక్రియలో ప్రజలకు ఏ మాత్రం అవకాశం కల్పించినా వాళ్ల నియామకం అసలు జరుగుతుందంటారా? మీరే చెప్పండి'– అని మాలవ్యా సభికుల్ని ఆకట్టుకుంటూ అడగ్గానే 'జరగదు, జరగదు, ఎన్నటికీ జరగదు' అంటూ శ్రోతలు నినదించారు.

ఏదేమయినా తొలితరం జాతీయ వాదులు భారతదేశం క్రమక్రమంగా స్వయం పాలకం అయితీరుతుందని ఎంతగా విశ్వసించినా వాళ్ల రాజకీయ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచటంలో మాత్రం ఎంతో అప్రమత్తంగా వ్యవహరించేవాళ్లు. ఎందుకంటే ప్రభుత్వం వాళ్ల కార్యకలాపాల్ని విద్రోహచర్యలుగా, అవిధేయతా రూపాలుగా భావించి అణచివేత చర్యలు చేపడుతుందేమోననే భయంపట్టుకుంది. అందువల్ల 1892 వరకు వాళ్ల డిమాండు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంపుకు దాని సంస్కరణలకు పరిమితమైపోయింది. వాళ్లు అభ్యర్థించిందేమంటే ఎన్నిక కాబడిన అధిక సంఖ్యాకులైన భారతీయ సభ్యులతో మరింతగా కౌన్సిల్ కార్యకలాపాలలో పాలు పంచుకొనే అవకాశమేగాక, కౌన్సిళ్లకు విస్తృతాధికారాలు కల్పించమనటమే గాక, సభ్యులు అధికారాలు కూడా విస్తృతమై బడ్జెట్‌పై చర్చించి నిర్ణయించే అధికారం, రోజువారీ పరిపాలనలోని అంశాల్ని ప్రశ్నించి విమర్శించే అధికారాన్ని కూడ కలగజేయమని.

* * *

ఇండియన్ కౌన్సిల్ యాక్టు 1892 ద్వారా చట్ట నిర్మాణ విధుల్లో కొన్ని మార్పులు చేసుకునేట్లు జాతీయోద్యమం ప్రభుత్వం మీద వత్తిడి తెచ్చింది. ఇంపీరియల్ ప్రొవిన్షియల్ లెజిస్లేటీవ్ కౌన్సిళ్లలో అదనపు సభ్యుల సంఖ్య ఆరు నుండి పదికి, పది నుండి పదహారుకూ పెరిగింది. ఆ సభ్యులలో కొందరు జిల్లా బోర్డుల ద్వారా, మున్సిపల్ కమిటీల ద్వారా పరోక్ష ఎన్నికల పద్ధతిన ఎన్నుకోబడతారు. అయినా అధికారిక ఆధిక్యత కొనసాగుతూనే ఉంది. వార్షిక బడ్జెట్‌పై చర్చించే హక్కు సభ్యులకు కల్పించబడింది గాని దానిపై ఓటు చేయటంగాని, లేదా దానిపై సవరణ తెచ్చేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకుగాని అవకాశాన్ని కల్పించలేదు. ప్రశ్నలు వేసేందుకు అనుమతించారుగాని, అనుబంధ ప్రశ్నలకుగాని, ఆ సమాధానాలపై చర్చకు గాని అనుమతించేవాళ్లు కాదు. సంస్కరింపబడిన ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ 1909 వరకు దాని పాలనా కాలంలో

రమారమి సంవత్సరానికి 13 రోజులు మాత్రమే సమావేశమయ్యేది. ఇరవై నలుగురు భారతీయులు అనధికార సభ్యులుగా వుంటే ఐదుగురు మాత్రమే హాజరయ్యారు!

1892 నాటి చట్టంలో జాతీయవాదులంతా సంపూర్ణంగా అసంతృప్తి చెందారు. అందులో వాళ్ల డిమాండ్లు గేలిచేయబడ్డాయని గుర్తించారు. కౌన్సిళ్లు యింకా శక్తిహీనంగానే ఉన్నాయి. నియంతృత్వం యింకా రాజ్యమేలుతూనే ఉంది. కనుక వాళ్లు ఎన్నుకోబడే అధికార సభ్యులు అధిక సంఖ్యలో ఉండేట్లు చూడాలనీ, బడ్జెట్‌పై ఓటు హక్కు కల్పించాలనీ డిమాండ్ చేశారు. ఆ విధంగా ప్రభుత్వ ఆదాయంపై పట్టు సాధించాలనుకున్నారు. "ప్రాతినిధ్యం లేకపోతే పన్నుల్లేవు" అనే నినాదాన్ని లేవదీసారు. క్రమేణా వాళ్ల డిమాండ్లను చాటగలిగారు. పలువురు నాయకులు - ఉదాహరణకు 1904లో దాదాభాయి నౌరోజీ,1905లో గోపాలకృష్ణ గోఖలే, 1906లో లోకమాన్యతిలక్‌లు కెనడా, ఆస్ట్రేలియాల్లోని స్వయంపాలక కాలనీల తరహాలో స్వయం పరిపాలన కావాలనే డిమాండ్‌ను మెల్లగా ముందుంచసాగారు.

* * *

1892 చట్టానికి రూపురేఖ లందించిన లార్డ్ డఫ్రిన్, మరికొందరు బ్రిటీషు రాజనీతిజ్ఞులు, అధికారగణం కలిపి బాగా నోరున్న భారత రాజకీయ నాయకుల్ని చట్టసభల్లో ప్రవేశం పొందేట్లు చేసి వాళ్లు అక్కడ మాట్లాడటం ద్వారా అవిరి వంటి వాళ్ల రాజకీయ ఆవేశం బహిర్గతం అయ్యే అవకాశం కల్పించారు. కౌన్సిల్ సభ్యులకు నిజమైన అధికారాలేమీలేవనేది వాళ్లకు తెలుసు, సభ్యులు కేవలం పదాడంబరం ప్రదర్శించటమే; రిక్త భాషాడంబరానికి పాల్పడటమే, కనుక అధికారగణం వాళ్లమాటల పట్ల శ్రద్ధ పెట్టాల్సిన పనిలేదు.

నిజమే, బ్రిటీషు విధాన నిర్ణేతలు కౌన్సిళ్లను, భారతీయ నేతల రాజకీయ అధికారాలకు దూరంగా ఉండేట్లు చూచినా, కేవలం ప్రభుత్వ విధానాలకు చర్యలకు ఆమోదముద్ర వేసే యంత్రాలుగా రూపకల్పన చేసినా, ఆవిర్భ విస్తున్న రాజకీయ నేతృత్వాన్ని బుజ్జగించే ఆటబొమ్మగా అందించినా, అధికారుల లోపాలనూ చేతగాని తనాన్ని ఎండగడుతూ, దాదాపు ప్రతి ప్రభుత్వ విధానాన్నీ ప్రతిపాదననూ ప్రతిఘటిస్తూ, ప్రజాధనానికి సంబంధించిన కీలకమైన ఆర్థిక సమస్యల్ని లేవనెత్తుతూ త్వరితగతిన ఆశక్తి హీనమైన నపుంసక కౌన్సిళ్లు ప్రజల యిబ్బందుల్ని బహిర్గతం చేసే వేదికలుగా

మారిపోయాయి.  వాటిల్లో ప్రభుత్వం రూపొందించే చట్టాలు, విధానాలు నిశితవిమర్శలకు గురయ్యేవి.  అవి రూపొందించబడిన పద్ధతి, దాని ఆంతర్యం, పరిణామాలు అన్నీ కూలంకషంగా చర్చింపబడేవి. ఆ విమర్శల్ని కేవలం కౌన్సిళ్లలో గ్రహింపుకే గాక జాతీయవాద సభ్యులు వాళ్ల రాజకీయ అంతస్తును పెంచుకునేందుకు, ఒక జాతీయ ఉద్యమ నిర్మాణానికి వినియోగించుకున్నారు.  సురక్షిత కవాటం కాస్తా జాతీయవాద ప్రచారపు ప్రధాన ప్రవాహంగా మారిపోయింది. కేవలం ధైర్యంతో, వాక్పటిమతో, నిర్భయ విమర్శలతో, లోతైన అవగాహనతో సమాచారాన్ని జాగ్రత్తగా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వంపై నిరంతర పోరాటాన్ని  ఆ కౌన్సిళ్లలో కొనసాగించటం జరిగింది. దానివల్ల రాజకీయంగా, నైతికంగా ఎంతటి ప్రభావం ఒనగూడిందనేదిగాక శక్తిమంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక భావనల్ని ప్రచారం  చేయగలిగింది.

వాళ్ల ప్రసంగాలన్నీ సమగ్రంగా వార్తా పత్రికల్లో ప్రచురింపబడ సాగటంతో చట్టసభల్లోని కార్యక్రమాలకు విస్తృతంగా ప్రజల్లో కుతూహలం పెరిగింది.

కొత్త కౌన్సిళ్లు, అత్యంత ప్రముఖులైన కొందరు జాతీయవాద నాయకుల్ని తమవైపుకు లాక్కున్నాయి.  బెంగాలు నుండి సురేంద్రనాధ బెనర్జీ, కాళీ చరణ్ బెనర్జీ, ఆనందమోహన్ బోస్, లాల్ మోహన్ ఘోష్, డబ్ల్యు.సి. బెనర్జీ, రాస్ బిహారీ ఘోష్, మద్రాసు నుండి పి. ఆనందాచార్లు, సి.శంకరన్‌నాయర్, విజయరాఘవ చారియర్, ఉత్తర ప్రదేశ్ నుండి మదనమోహన మాలవ్యా, అయోధ్యానాథ్, బి.షంభర్‌నాథ్, బొంబాయి నుండి బాలగంగాధర్ తిలక్, ఫిరోజ్‌షా మెహతా, ఆర్.యమ్. సయాని, చిమన్‌లాల్, యన్.జి.చంద్రవార్కర్, గోపాలకృష్ణ గోఖలే, సెంట్రల్ ప్రోవిన్సు నుండి జీ.యమ్. చిట్నవీస్‌లు 1893 నుండి 1909 వరకు ప్రొవిన్షియల్ లేదా సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిళ్లలో సభ్యులుగా వున్న కొందరు కాంగ్రెసు నాయకులు.

ఫిరోజ్ షా మెహతా, గోపాలకృష్ణ గోఖలే లిరువురూ కౌన్సిళ్లను బాగాఉపయోగ పెట్టుకోవటంలోనూ వాటిల్లో నూతనోత్తేజాన్ని ప్రవేశపెట్టటంలోనూ ప్రధానమైన బాధ్యతను స్వీకరించారు. వాళ్లిరువురూ రాజకీయంగా మితవాదులే. అయినా వాళ్లిరువురూ భయమెరుగని స్వాతంత్ర్యేచ్ఛతో ప్రసిద్ధులై భారతదేశంలోని అధికార గణానికి కొరకరాని కొయ్యలయ్యారు.

* * *

1845లో బొంబాయిలో జన్మించిన ఫిరోజ్ షా మెహతా, 1860 ప్రాంతాల్లో లండన్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించే రోజుల్లో దాదాబాయి నౌరోజీ ప్రభావానికి లోనయ్యాడు. బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషనూ, భారత జాతీయ కాంగ్రెసును సంస్థాపించిన వారిలో ఈయనొకరు. 1890వ దశకం మధ్య నుండి 1915లో తుదిశ్వాస విడిచే వరకు భారత జాతీయ కాంగ్రెసులో ఈయన ఆధిపత్యం చెలాయించిన వ్యక్తే. పైగా కాంగ్రెసుపై నిరంకుశాధికారాన్ని చెలాయిస్తున్నట్లుగా తరచుగా నిందలకు గురయ్యేవాడు. శక్తిమంతమైన వాదనా పటిమకు ఈయన పెట్టింది పేరు. ఈయన ప్రసంగాలు సాహసోపేతాలై, సరళాలై, సాహిత్య సంభరితాలై, హాస్య సమ్మిళితాలై ప్రత్యర్థులకు ఒకటికి రెండంటిస్తూ, గాయపరుస్తూ అలరారేవి.

ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఈయన తొలిసారిగా బాగా తలపడింది 1895 జనవరిలో. అప్పుడు 1861 నాటి పోలీసు చట్టానికి సవరణ తెస్తూ బిల్లు ప్రవేశపెట్టటం జరిగింది. ఆ సవరణ వల్ల స్థానిక అధికారుల అధికారాలు మరింతగా పెరిగాయి. వాళ్లు కావాలనుకున్న చోట శిక్షించేందుకు పోలీసు దళాన్ని నియమించి దానిఖర్చును వాళ్లు ఎంపిక చేసిన అక్కడి నివాసితుల సముదాయాల్నుండి వసూలు చేసే వెసులుబాటు లభించింది. అది శాంతి భద్రతల ముసుగులో వ్యక్తుల్ని న్యాయవిచారణ లేకుండానే నిర్బంధించి శిక్షించే ప్రయత్నంగా మెహతా విడమర్చి చెప్పాడు. ఈయన విన్పించే వాదన ఏమంటే: "శాసనాధికారాన్ని నేను యింతకు మించి ప్రయోగాత్మకంగా, తిరోగమనంగా, నిందాయోగ్యంగా, లేక మరింత అవినీతికి అలవాలమైనదిగా భావించజాలను. అనుభవైక శాసనం కార్యనిర్వహణాధికారుల హృదయాలకు ఆహ్లాదకారకమై, శిక్ష, అణచివేతలకు అమాయకులు బలికాకుండా న్యాయవిచారణ ద్వారా నియంత్రించ బడాలనే శాస్త్రీయ వాస్తవాన్ని గుర్తించనివ్వదు.' చట్టాలు అమలు చేయవలసిన కార్యనిర్వహణాధికారుల సమర్థతపై, వివక్షా రాహిత్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మెహతా యిలా అన్నారు: 'వాళ్లు వాళ్ల హోదాకు, వర్గానికీ భిన్నంగా, పక్షపాతరహితంగా, దురభిమానాలకు దూరంగా, లోపాలకు అతీతంగా వ్యవహరించగలరని విశ్వసించటం బద్ధకపు ఆలోచనే.' నేడు ఈ విధమైన భాషనూ, రిమార్కులనూ అతి తీవ్రంగానో లేక సెన్సారు చేయదగినవిగానో ఎవ్వరూ పరిగణించరు. అటువంటి విమర్శలకు అతీతులుగా భావించుకునే సివిల్ సర్వీసు శ్రేణుల్లో ఆ మాటలకు ఓ బాంబు బ్రద్దలయినట్లయ్యింది. వాళ్ల పేరు ప్రఖ్యాతులనూ, కీర్తినీ అందులోనూ అతి

పవిత్రమైన లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఒక 'దేశవాళీ' వ్యక్తి అపవిత్రంగా భావించటమా? జేమ్స్ వెస్ట్‌లాండ్ అనే ఫైనాన్సు మెంబరు సభలో లేచి మెహతా కౌన్సిల్లోకి తెచ్చిన సరికొత్త ఉత్తేజాన్ని' ఖండించాడు. పైగా న్యాయస్థానంలో నేరారోపణ చేసేవాళ్లను...'అదీ మహా సామ్రాజ్యాన్ని నిర్మించి పటిష్ట పరిచిన' ఓ అత్యంత ప్రముఖమైన వర్గాన్ని పక్షపాతంతో దురభిమానంతో సామాన్య న్యాయాన్ని కూడా అందించలేని జాతిగా నిందించటమా? అన్నాడు. 'ఈ కౌన్సిలు తన కార్యకలాపాలలో చూపే హూందాతనం ప్రశాంతత మెహతా రిమార్కుల మూలంగా మంటగలిసాయి' అన్నాడు. మరో విధంగా చెప్పాలంటే వలస పాలనకు చెందిన చట్టసభల స్వభావాన్నీ, పాత్రను మార్చివేసినందుకు మెహతా నిందించబడ్డాడు.

భారతదేశం దానికి ప్రతికూలంగా స్పందించింది. భారతరాజకీయ వేత్తల తక్షణ మద్దతు మెహతాకు లభించింది. తనకు రాజకీయాల్లో ఎదురుగా నిలిచే తిలక్‌వంటి వారు సైతం చట్టసభల్లోకి 'సరికొత్త ఉత్తేజం' ప్రవేశించిందనే వెస్ట్‌లాండ్ వర్ణనను అంగీకరించారు. వేదికల నుండి, పత్రికల ద్వారా మెహతా విమర్శలకు ప్రజ అలవాటు పడసాగింది గాని 'గౌరవ ప్రదమైన' చట్టసభల సమావేశ మందిరాలు మాత్రం అలా పదునైన నిర్భీతి విమర్శలతో దద్ధరిల్లటం మాత్రం సరికొత్త అనుభవమే. లాహోర్ నుండి ప్రచురింపబడే ట్రిబ్యూన్ పత్రిక యిలా వ్యాఖ్యానించింది: ఎన్నికల ప్రక్రియ ద్వారా చట్టసభలలోకి ప్రవేశపెట్టబడి ఇంత కాలం కౌన్సిల్ గదిలో నోరు నొక్కబడిన ప్రజావాణి ప్రజా ప్రతినిధి మెహతా మాటల్లోప్రతిధ్వనిస్తూంది... ఇక జేమ్స్ వేస్ట్‌లాండ్ నిరసన తన బలమైన భద్రతాస్థావరంలో తన కణుపులపై తానే మోదుకొని ఓ ప్రభుత్వోద్యోగి పెట్టిన గావుకేక వంటింది'.

మెహతా దాదాపుగా కౌన్సిల్‌లో మాట్లాడిన ప్రతిసారీ, రెండంచుల కత్తివంటి తన పదునైన హాస్యధోరణిని ప్రదర్శించటం వల్ల పాలనా యంత్రాంగానికి కొరడాతో కొట్టి బాధించినట్లుండేది. ఆయన తన నైపుణ్యంతో బ్రిటీషు ఇండియా ప్రభుత్వం, దాని స్వయం సదాచార పాలనా యంత్రాంగపు ప్రతిష్టను వాటి నైతిక ప్రభావాన్ని ధ్వంసం చేసేందుకు భారతీయులకు తన సంభాషణా చాతుర్యాన్ని ఎంతగానో పంచుతూ సహాయపడిన విధానాన్ని వివరిస్తూ మరికొన్ని ఉదాహరణలను చూపవచ్చు. విద్యాధికులైన భారతీయులు, ఉన్నత విద్య నేటి సామ్రాజ్యవాద భావజాల చరిత్ర కారుల్ని మించి

ఆనాటి సామ్రాజ్యవాద పాలకులకు మిక్కిలి హైరానా కలిగించే విషయాలయ్యాయి. ఉన్నత విద్య 'అసంతృప్తికీ తిరుగుబాటు ధోరణికీ ఆలవాలమైన బాబుల్ని' తయారు చేస్తున్నందున దానిపై కోత విధించేందుకు మార్గాన్వేషణ జరుపుతూ ప్రభుత్వం ప్రజలందరికీ పనికి వచ్చే ప్రాథమిక విద్యపై అదనంగా ఖర్చు చేయవలసిన అవసరాన్ని గుర్తుచేస్తూ అందుకోసం మేధావులకు మాత్రమే పరిమితమైన ఉన్నత విద్యపైకోత విధించింది.

ఉన్నత విద్యావ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య వెనుక అసలు రహస్యాన్ని మెహతా బట్టబయలు చేస్తూ యిలా అన్నారు: 'ప్రజల్ని పాలకుల పీఠాల వద్దకు తీసుకురావాలను కోవటం మంచిదే. కాని ప్రజలు మీ మడమల వద్దకు రాగానే యింకేముంది. మానవ స్వభావం బలహీనమైనది కదా - పైగా వ్యక్తిగత అనుభవమేమో తీవ్రంగా అనంగీకారాన్ని తెలియజేసేటటువంటిది; కనుక తన్నాలనే కోర్కె దాదాపు అణచజాలని దవుతుంది'. కనుక అధికారుల్లో ఎక్కువ మంది 'భారతదేశంలోని ప్రతి కళాశాలను విద్వేషాలను పొదిగే ప్రదేశాలుగా భావించి అవి ఎన్ని తక్కువగా వుంటే అంత మంచిదనుకున్నారు.

ఉన్నత విద్య పద్దు నుండి, ప్రాథమిక విద్య పద్దుకు కేటాయింపుల్ని సర్దాలనుకునే విషయాన్ని మరో ప్రసంగంలో ప్రస్తావిస్తూ తనకో విషయం గుర్తుకు వస్తున్నదన్నాడు: 'అదొక పెద్ద కుటుంబం. తండ్రి చాల మంచివాడు. స్నేహశీలి. అయితే దురదృష్టవశాత్తు తాగుడుకు అలవాటు పడ్డాడు. ఇంటికి వస్తూ వస్తూ తరచుగా దారిలో కాస్త పుచ్చుకునేవాడు. తల్లి పెద్ద పిల్లల చదువు కాస్త పట్టించుకోమని ప్రాధేయపడింది. కళ్లనిండా నీళ్లు నింపుకొని చిన్న వాళ్లకు చాలినంత కూడూ గుడ్డా లేనప్పుడు పెద్దవాళ్ల చదువు సంగతి "ఆలోచించటం సమంజసమేనా అన్నాడు. నిజమే, ఆకలిగొన్న ఆ చిన్నారులు తన కళ్లల్లోకి చూస్తూంటే సమంజసమేననటం కష్టమేగాని, తన భర్త తాగుడు, జూదం మీద ఖర్చు కొంత తగ్గించుకోగలిగితే పిల్లలందరికీ కూటికీ, గుడ్డకే గాక చదువుకునేందుకు కూడా డబ్బులు సరిపోతాయని అనుకోకుండా వుండగలదా? అదే విధంగా, మహాశయులారా! నిరుపేదలకు అత్యంత అవశ్యకాలైన పారిశుధ్యం, పరిశుభ్రమైన నీరు, వైద్య సదుపాయాలు ప్రాథమిక విద్యను అందించాలనుకున్నప్పుడు వాటికీ నిధుల కొరత వుండబోదు. అలాగే ఉన్నత విద్యపై ఖర్చు చేసేందుకు కూడా. అందుకు గాను దేశంలో వృద్ధి చెందుతున్న అపార సంపదల్ని రకరకాల విలాసాలపై ఖరీదైన నివాసాలపై,

వస్తు సామాగ్రిపై, వేసవి విడుదలపై, సరిహద్దుల వద్దకు వినోద యాత్రలపై, అర్థం పర్థంలేని సైనిక విధానం వల్ల యిచ్చ వచ్చిన రీతిన సైన్యం వినోదాలపై వెచ్చించటాన్ని తగ్గించుకోవలసి వుంది. అయితే అటువంటి విధానాలను అమలుపరిచే వాళ్ల అభిప్రాయాలు వాళ్ల కోర్కెలకు, ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయి కదా'.

వివాహ వేడుకల సందర్భంగా, పండుగ పబ్బాలకు ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేస్తున్నందు వల్లే రైతు దుర్భర దారిద్ర్యంలో మునిగి తేలుతున్నాడని నిందించేందుకు అధికారులు 'సంబర పడతారు. 1901లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఓ బిల్లు ప్రవేశపెట్టబడింది. రైతులకు పొదుపు చేతగాక దుబారా చేస్తున్నందువల్ల అతను తన పొలాన్ని కుదువబెట్టితే డబ్బు అతని చేతికి అందకుండా చేసేందుకు గాను రైతుకు తన భూమిపై హక్కులేకుండా చేయాలనేది ఆ బిల్లు ఉద్దేశ్యం. రైతులపై అటువంటి అభియోగాన్ని మోపటం సరికాదంటూ ఆ బిల్లుకు వ్యతిరేకతను ప్రకటిస్తూ మెహతా రైతుల్ని సమర్థించాడు. రైతుకూ తన జీవితంలో ఆనందం, ఆహ్లాదం అవసరమే నన్నాడు. భారతదేశంలోని సగటు రైతు విషయానికొస్తే 'కొన్ని కొత్త మట్టి పాత్రలు, ఏవో కొన్ని అడివిపూలు, ఓ డప్పు వాయిద్యం, పొట్ట నిండా తిండి, ఓ పుచ్చి పోయిన వక్క కాసిని తమల పాకులు, కొద్దిగా పుగాకు కాడలు – ఇంకొందరి విషయంలో చౌకబారు ఆభరణాలు, దుస్తులు వంటివే. పొద్దు పొడిచింది మొదలు పొద్దు గుంకేవరకూ చెమటోడ్చి కష్టించే ఆకుటుంబానికి అదే పండగ సంబరం'. అయినా ప్రభుత్వం తనకున్న మెజారిటీతో బిల్లును ఆమోదించేందుకు వత్తిడి పెరగటంతో మెహతా, గోఖలే జీ.కే. పారీఖ్, బాలచంద్రకృష్ణ, డి.ఏ.ఖరేలతో కలసి చట్టసభల చరిత్రలో అంతకు ముందెన్నడూ లేని "వాకవుట్"ను తొలిసారిగా అక్కడ నిర్వహించాడు. తిరిగి అధికారగణం మెహతాపై కన్నెర్రజేసింది. అప్పట్లో బ్రిటీషు యాజమాన్యం క్రింద నడిచేది ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక వాకవుట్ చేసిన సభ్యులందరూ రాజీనామాలు సమర్పించాలని సూచించింది.

మద్యపాన నిషేధం పేరిట త్రాగుడును ప్రోత్సహించే ప్రభుత్వ ఎక్సైజు విధానాన్ని విమర్శిస్తూ 1898లో ఆయన పేర్కొన్నదేమంటే – ప్రభుత్వ ఎక్సైజు శాఖ పనితీరు చూస్తుంటే 'సత్ప్రవర్తనను విధిగా బోధించవలసిన కర్తవ్యం తనదే అయినా విధిగా దానిని ఆచరించాలన్నది లేదన్న ఓ నీతి బోధకుని అనుసరిస్తున్నట్లుంది.'

1901లో అనారోగ్య కారణంగా ఫిరోజ్‌షా మెహతా ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ విధుల నుండి తప్పుకున్నాడు. ఆయన స్థానంలో గోఖలే ఎన్నిక కాబడేట్లు

చూసాడు. అప్పటికే గోఖలే పూనా సార్వజనిక సభ కార్యదర్శిగా, సుధాకర్ పత్రిక సంపాదకులుగా ప్రసిద్ధుడు. 1897లో భారతదేశంలో ప్రభుత్వ ఖర్చుపై లండన్‌లో రాయల్ కమిషన్ ముందు సాక్ష్యమివ్వటంలో ఆయన సురేంద్రనాధ్ బెనర్జీ, డీ.ఈ. వాచా, జి. సుబ్రహ్మణ్య అయ్యర్, దాదాభాయి నౌరోజీ వంటి అనుభవజ్ఞులను మించిన ప్రతిభను ప్రదర్శించాడు. మెహతాను మించిన అనుయాయునిగా గోఖలే మున్ముందు దాఖలాలు చూపవలసి ఉంది.

* * *

జస్టిస్ రనడే, జి.వి. జోషీల వద్ద భారతీయ ఆర్థికశాస్త్రంలో ఎంతో నేర్పుగా తర్ఫీదు పొందిన గొప్పమేధావి గోపాలకృష్ణ గోఖలే. ఆయన గొప్ప వక్తకాదు. తిలక్, నౌరోజీ, దత్తులవలె కఠినమైన, శక్తివంతమైన పదజాలాన్ని వాడలేదు. మెహతావలె వ్యంగ్యాన్నో, హాస్యాన్నో, వెటకారాన్నో ఆశ్రయించినవాడు కాదు. వక్తగా ఆయన సరళ స్వభావుడు, హేతుబద్ధుడు, మర్యాదస్తుడు, నిరాడంబరుడు. ఆయన ప్రసంగాలు తేలికగా అర్థమయ్యేవి. ఆయన ప్రధానంగా సవివరమైన విషయ సేకరణపైనా; జాగ్రత్తగా, ప్రశాంతంగా, సహేతుకంగా సమాచారాన్ని విశ్లేషించే ప్రక్రియపైనా ఆధారపడేవాడు. అందువల్ల ఆయన ప్రసంగాలు వినోదాన్ని పంచేవిగానో, గాయ పరిచేవిగానో ఉండక క్రమంగా శ్రోతల లేక చదువరుల దృష్టినే వివేక సంపదతో ఆకర్షించేవి.

గోఖలేకు తన బడ్జెట్ ప్రసంగాలు గొప్ప ఖ్యాతిని తెచ్చిపెట్టేవి. అవి విస్తృతంగా వార్తా పత్రికల్లో వచ్చేవి. వాటికోసం అలవాటు పడిన జనం ఎప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడు పత్రికల్లో వాటిని చదువుదామా అని ఎదురుచూచే వాళ్లు. ప్రజలకు రాజకీయ విద్యను అందించేందుకు ఆయన లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను సార్వత్రిక విశ్వవిద్యాలయంగా మార్చేవాడు.

1902 మార్చి 26 నాటి తన తొలి బడ్జెట్ ప్రసంగమే ఆయన్ని అత్యంత గణనీయ పార్లమెంటేరియన్‌గా స్థిరపరచింది. ఎడ్వర్డ్ లా, ఫైనాన్సు మెంబరుగా సభలో ఏడుకోట్ల రూపాయిల మిగులు బడ్జెట్‌ను అప్పుడే ప్రవేశపెట్టాడు. అందుకు సభలో అభినందనలు లభించటంతో ఆయనకు ఎంతో గర్వంగా వుంది. అటువంటి సమయంలో ప్రసంగించేందుకు గోఖలే లేచినిలబడ్డాడు. అంతపెద్ద మిగులు చూచి సభ అలా అభినందనలు అందించటంలో తాను పాలు పంచుకోలేక పోతున్నానన్నాడు. ఈ మిగులు

బడ్జెట్‌వల్ల 'దేశంలోని స్థితికీ, దేశపు ఆర్థిక స్థితికీ పొంతన కుదరటం లేదు.' వాస్తవానికి ఈ మిగులును ద్రవ్యోల్బణంతో సతమతమయ్యే సమయంలో ప్రవేశపెట్టటం 'జాతిని తప్పుత్రోవ పట్టించటమే.' ఆయన ప్రసంగపు కీలక అంశం ప్రజలనుభవించే దారిద్ర్యమే. ఆ సమస్యను ఆయన అన్ని కోణాల నుండి పరిశీలించి చివరకు తేల్చిందేమంటే ప్రజల భౌతిక సంపద క్రమేపీ దిగజారుతున్నది'. పైగా అది ఎంతగా దిగజారిందంటే ప్రపంచ ఆర్థిక చరిత్రలో అంతకు మించిన బాధామయస్థితి లేనంతగా. ఇక బడ్జెట్‌ను సవివరంగా విశ్లేషించేందుకు ఉపక్రమించాడు. దుర్భిక్షం, కరువులు విలయతాండవం చేసే తరుణంలో కూడ భూమిశిస్తు, ఉప్పు పన్ను ఎలా పెరుగుతున్నదో ఎత్తిచూపాడు. ఈ రెండు రకాలైన పన్నుల్ని తగ్గించటమే గాకుండా క్రింది మధ్య తరగతి ప్రజలు పీడింపబడకుండా చూచేందుకై ఆదాయపు పన్ను వేసేందుకు పరిమితిని వెయ్యి రూపాయల వరకూ పెంచాలన్నాడు. సైన్యంపైనా, భారత భూభాగాన్ని దాటిపోయే రాజ్య విస్తరణపైనా అధిక వ్యయాన్ని ఖండిస్తూ, విద్యకు పరిశ్రమలకు అదనంగా నిధులు కేటాయించాలన్నాడు. భారత ఆర్థిక నిర్వహణ వైపు దృష్టి సారిస్తే అది భారతీయుల ప్రయోజనాల వైపుగాక పరదేశీయుల ప్రయోజనాల వైపుకే మొగ్గుచూపుతున్నాయనేది సుస్పష్టమేనన్నాడు. భారత ఆర్థిక వ్యవస్థ నిర్భాగ్య దశనూ, ప్రజల పేదరికాన్నీ, వలస పాలనలోని భారతదేశపు ఆర్థిక స్థితికీ, ప్రభుత్వ పనితీరుకూ ముడిబెట్టి వివరించాడు. ఇదంతా కూడ ప్రభుత్వం స్వయంగా ప్రచురించిన ముఖ్యమైన పుస్తకాలనుండి సేకరించిన సమాచారాన్ని సవివరంగా ఉటంకిస్తూనే కొనసాగింది.

గోఖలే ఈ తొలి బడ్జెట్ ప్రసంగం విన్న ప్రజలు విద్యుదావేశపూరితుల యినట్లయ్యింది. ఆయన జీవిత చరిత్రకారుడు బి.ఆర్. నందా అన్నట్లుగా 'బైరన్ వలె ఈయన కూడ ఓ ఉదయం తాను మేల్కొనేప్పటికి ఖ్యాతి గడించిన వాడయ్యాడు.' ఆయన బాగా విమర్శించేవాళ్లు సైతం వెనువెంటనే పొగడ్తలతో ముంచెత్తారు. జాతీయవాద పత్రికలన్నీ ఘనంగా హర్షాన్ని వెలిబుచ్చాయి. ఆయనభారతదేశపు ఆత్మగౌరవాన్ని అనేక రెట్లు పెంపొందించిన భావనను రేకెత్తించాయి. గతంలో ఆయన్ని చిన్నచూపు చూసేందుకు, సందు దొరికితే మందలించేందుకూ సంసిద్ధంగా వుంటూ వచ్చిన అమృత బజారు పత్రిక అపరిమితంగా కొనియాడింది. 'ప్రభుత్వ ఆర్థిక నివేదికపై నిర్భయంగా, ఉన్నదున్నట్లు మాట్లాడగల

భారతీయ సభ్యుని కోసం ఎదురు చూస్తూనే ఉన్నాం. ఇంత వరకు ఆకోరిక తీరలేదు. సభ్యులతో కొందరికి సామర్థ్యం ఉంటే ధైర్యం లేదు. ధైర్యం గల వాళ్లకు సామర్థ్యం లేదు... భారతదేశంలో బ్రిటీషు పాలనా కాలపు చరిత్రలో తొలిసారిగా ఓ భారతీయుడు ప్రభుత్వ నివేదికల్లోని లొసుగుల్ని బహిర్గతం చేయటంలో కృతకృత్యుడు కావటమే గాకుండా అలా చేయటంలో రాజీలేని ధోరణిని ప్రదర్శించే సాహసం చేసాడు.' ఇటువంటి అర్హమైన పొగడ్తలను కూడా గోఖలే తలకెక్కించుకోలేదు. అంతకు ముందు మాదిరే ఆయన సీదాసాదాగా, పటాటోపం లేకుండా మెలగసాగాడు. ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, తన గురువులలో ఒకరైన,జీ.వీ. జోషికి యిలా తెలియజేసాడు: 'అది నా ప్రసంగం అనే కంటే మీది అనటమేమేలు. ఆ ఘనత అంతా నాకు దక్కటం చూస్తూంటే నేను ప్రజల్ని మోసం చేయటం లేదు కదా అన్పిస్తుంది.'

రానున్న పదేళ్లలో గోఖలే ఆ విధమైన 'సాహసాన్ని పట్టుదలను, ప్రతిభను కలగలిపి' ప్రతిబడ్జెట్ సమావేశంలోనూ, ప్రతిశాసన రూపకల్పనలోనూ ప్రదర్శింప వలసి వుంది. ఆ ప్రక్రియలో ఆయన రైతుల బీదరికాన్నీ, దైన్యాన్నీ, భారతీయ సంపదను తరలించుకు పోవటాన్ని, పారిశ్రామికాభివృద్ధి విషయంలో ప్రభుత్వ ఉదాసీనతను, బీదలపై పన్నుల భారాన్ని పెంచటాన్నీ, ప్రాథమిక విద్య, వైద్య, ఆరోగ్య సదుపాయాల విషయంలో చాలీ చాలని ప్రభుత్వ సంక్షేమ చర్యలు, పత్రికా స్వాతంత్ర్యం,పౌర హక్కులు, అధికారిక అణచివేత కార్యకలాపాలనూ, బ్రిటీషు కాలనీలలో భారతీయ కార్మికుల బానిసత్వాన్నీ, భారతీయుల నైతిక పతనాన్నీ, భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుడు విధానాలనూ, పాలకులు భారతదేశం పట్ల చూపుతున్న అశ్రద్ధనూ, నిర్లక్ష్యాన్నీ ఆయన ప్రముఖంగా ప్రస్తావించాల్సి ఉంది.

వైస్రాయి నుండి అతిచిన్న ఉద్యోగి వరకు వాళ్ల విధానాలు దుయ్యబడుతున్న తీరుకు ప్రయోజన శూన్యమైన కోపంతో ఊగిపోయేవాళ్లు. 1904లో ఎడ్వర్డ్‌లా అనే ఫైనాన్సు మెంబరు ఉద్రిక్తతతో యిలా గావుకేక పెట్టాడు: 'ఇదేమిటి ఈ కౌన్సిల్‌లో ఆయన వచ్చి కూర్చున్నది లగాయితు ఆయనకు తెలియకుండానే నిత్యసంతాపకునిగా ఆవేశమేమిటి? ప్రభుత్వం పట్ల ఆవిధమైన బాధాతప్త విచారగ్రస్త కూనిరాగా లేమిటి? ఆహాహా! ఆ బాధను ప్రకటించటంలో ఎంతటి సాధన?' బడ్జెట్ సందర్భంగా గోఖలే ప్రసంగాలు అధికారుల

గుండెల్లో ఎంతగా రైళ్లు పరుగెత్తించేవంటే 1910లో వైస్రాయి లార్డ్ మింటో, రెవెన్యూ మెంబరుగా ఆర్.డబ్ల్యు.కార్లయిల్‌ను నియమించమని సెక్రటరీ ఆఫ్ స్టేట్‌ను కోరాడు. వైస్రాయికి వ్యక్తిగతంగా తెలియవచ్చిన ప్రకారం 'గోఖలే మొత్తం రెవెన్యూ విధానాన్ని దుయ్యబట్టే ఉద్దేశంతో ఉన్నాడు గనుక దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉండాల్సి ఉంది.

ప్రతిగా గోఖలేకు ప్రజల నుండి గుర్తింపు, ప్రేమ లభించవలసి ఉంది. చట్టసభల్లో ఆయన శ్రమించి సాధించిన దానికి గర్విస్తూ ప్రజ ఆయనకు ప్రతిపక్ష నాయక బిరుదును ప్రసాదించారు. గాంధీజీ ఆయన్ని తన గురువుగా పేర్కొన్నాడు. జీవితాంతం ప్రత్యర్థిగా వున్న తిలక్, గోఖలే అంత్యక్రియల సందర్భంగా యిలా నివాళు లర్పించాడు: 'ఈ భారతదేశపు వజ్రం, 'ఈ మహారాష్ట్ర ఆభరణం ఈ శ్రామికుల యువరాజు రుద్రభూమిలో శాశ్వతంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఒక్కసారి ఆయన వంక తేరిపారజూచి స్ఫూర్తితో ఆయన్ని అనుకరించండి.'

* * *

# 10 స్వదేశీ ఉద్యమం 1903 - 1908

**నూ**తన శతాబ్దితో పాటు స్వదేశీ ఉద్యమం కూడా ప్రారంభం కావటంతో భారత జాతీయోద్యమం ఒక్కుదుటున గొప్పగా ముందుకు సాగింది. బెంగాలులోనే గాక దేశంలోని యితర ప్రాంతాలలో కూడా విద్యార్థులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజల్లోని అధిక సంఖ్యాకులు తొలిసారిగా రాజకీయాల్లో చురుకుగా పాల్గొనసాగారు. తరువాతి అర్ధశతాబ్ది కాలంలో భారత జాతీయోద్యమం దాదాపు అన్ని ప్రధాన రాజకీయ విధానాలు ఆవిర్భావం చెందటం చూస్తూనే వచ్చింది. పరిమిత మితవాదం నుండి రాజకీయ తీవ్రవాదం వరకు, ఉగ్రవాదాన్నుండి ప్రారంభ దశలోని సామ్యవాదం వరకు, అభ్యర్థనలు, బహిరంగ సభల నుండి మరీ ఎదురు తిరగని ప్రతిఘటనలు, బాయికాట్ల వరకు – వీటన్నింటి మూలాలు ఉద్యమంలోనే ఉన్నాయి. ఉద్యమపు సమృద్ధి కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. ఉద్యమ కాలంలో భారతీయ కళలు, సాహిత్యం, సంగీతం, విజ్ఞానం,పరిశ్రమలు అన్నీ కూడ పురోగమన దిశగానే పయనించాయి. భారత సమాజం యావత్తూ ప్రయోగాలు చేయసాగింది. ప్రజల సృజనాత్మకత అన్ని దిక్కులకూ వ్యాపించింది.

* * *

బెంగాల్‌ను విభజించాలనే నిర్ణయాన్ని బ్రిటీషు ప్రభుత్వం తీసుకోవటంతో దాన్ని వ్యతిరేకిస్తూ సాగిన విభజన వ్యతిరేక ఉద్యమంలో స్వదేశీ ఉద్యమపు బీజాలు

మొలకెత్తాయి. ఏడు కోట్ల ఎనభై లక్షల మంది జనాభాగల బెంగాల్‌ను (బ్రిటీష ఇండియాలో దాదాపు నాలుగో వంతు) పాలనా పరంగా సంబాళించటం కష్టమనే విషయం నిర్వివాదాంశమే. అయితే బెంగాలు విభజనకు అసలు కారణం రాజకీయమేనన్న వాస్తవాన్నీ మనం యిక్కడ మరువరాదు. భారత జాతీయత బాగా వేళ్లూనుతున్న తరుణంలో ఈ విభజన భారత జాతీయతా నాడీ కేంద్రాన్ని బలహీన పరచగలదని భావించటం జరిగింది. ఈ విభజన ప్రయత్నం అప్పటి వైస్రాయి (1899–1905) లార్డ్ కర్జన్ మాటల్లో చెప్పాలంటే – 'బెంగాల్ అంతటా ఏమిటి యావద్భారతానికే కేంద్రంగా నిలిచి కాంగ్రెసు పార్టీ తన సంధాన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నందున అటువంటి కుతంత్రాలకు కేంద్ర స్థానమైన కలకత్తాను పడగొట్టాలి., బెంగాలీ మాట్లాడే ప్రజల్ని విభజించాలి. భారత ప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి రిస్లే మాటలు యింకొంచెం నిర్మొహమాటంగా వున్నాయి. 1904 డిసెంబరు 6న ఆయన యిలా అన్నారు: 'అవిభాజ్య బెంగాలు శక్తిమంతమైనది. విభజిస్తే చెల్లా చెదరవుతుంది. అదీ కాంగ్రెసు నాయకుల భావన: అవును వాళ్ల భయాలలో వాస్తవం లేకపోలేదు. అవే ఈ పథకానికి పెట్టనికోటలు... ఈపథకంలో మా ప్రధాన ఆశయాల్లో ఒకటేమంటే విభజించటం, తద్వారా మా ప్రభుత్వ వ్యతిరేకుల్ని సంఘటిత పరుస్తున్న వ్యవస్థను బలహీనపర్చటం.'

విభజన ప్రతి పాదనలకు బెంగాలులో వెనువెంటనే చెలరేగిన నిరసన ప్రదర్శనలకు తీవ్రంగా ప్రతిస్పందిస్తూ కర్జన్ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు యిలా తెలియజేయటం జరిగింది: 'ఇప్పుడు గనుక మనం మెత్తబడి వాళ్ల నిరసనలకు తల ఒగ్గితే తిరిగి బెంగాలును కుదించటం గాని, విభజించటం గాని చేయలేము, ఇప్పటికే సంకటంగా వున్న శక్తిని మరింత దృఢ పరిచి నట్లవుతుంది, భవిష్యత్తులో అది మరింతగా యిబ్బందుల్ని పెంచే వనరై కూర్చుంటుంది.[3] రాష్ట్రాన్ని విభజించినందువల్ల రెండు పరిపాలనా వ్యవస్థల క్రిందకు బెంగాలీలను తెచ్చి వాళ్ల పలుకుబడిని అరికట్టటమే గాకుండా బెంగాలులోనే వాళ్లను మైనారిటీలుగా మార్చివేయాలని – ఎలాగంటే కొత్త ప్రతిపాదనలలో ఒక కోటీ డెబ్బయి లక్షల మంది బెంగాలీ మాట్లాడే వాళ్లుంటే, మూడు కోట్ల డెబ్బయి లక్షల మంది ఒరియా, హిందీ మాట్లాడే ప్రజలు ఉంటారు. విభజన మరో చీలికను తెచ్చేందుకు కూడా ఉద్దేశింపబడింది – ఆ చీలిక మతపరమైనదిగా ఉంటుంది. కాంగ్రెసును, జాతీయ ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకు ముస్లిం మతవాదులకు మద్దతిచ్చే పద్ధతి 19వ

శతాబ్ది చివరి భాగంలో బాగా వ్యాప్తిలోకి వచ్చిన దానినే తిరిగి అమలు చేయవలసి ఉంది. ఢాకాలో విభజనకు ముస్లిముల మద్దతునాశిస్తూ కర్జన్ ఊరిస్తూ మాట్లాడిందంతా వృధా అయ్యింది. విభజన జరిగితే కొత్తగా ఏర్పడే ముస్లిం మెజారిటీ ప్రోవిన్స్‌కు (ముస్లిములు 1,70,00,000, హిందువులు 1,20,00,000 ఢాకా రాజధాని అవుతుందన్నాడు. అప్పుడు తూర్పు బెంగాలులో వాళ్లు సంఘటితమై పూర్వపు ముస్లిం వైస్రాయిలు, రాజులు ఉన్న కాలంలో లాగా తిరిగి ఆనందంగా జీవించవచ్చు' అన్నాడు. దానివల్ల 'ముస్లిములకు' 'లాభంచేకూరి' తూర్పు జిల్లాలన్నీ 'కలకత్తా వినాశకర ప్రభావాన్నుండి' దూరమయ్యే అవకాశం లభిస్తుందన్నాడు.

కర్జన్ తరువాత వైస్రాయిగా వచ్చిన లార్డ్ మింటో కూడ ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా విభజన అమలు పరిచిన తీరును కొంచెంగా పరిశీలించినా దానిని మంచి రాజకీయ వ్యూహంగా స్వీకరించాడన్న విషయం యిట్టే అర్థమవుతుంది. 'పాత ప్రోవిన్స్‌లో పాలనాపరమైన ఇబ్బందులెలా వున్నా కేవలం రాజకీయ దృక్కోణం నుండి చూస్తే విభజన అత్యావశ్యకమని నేను విశ్వసిస్తాను...'[5] అనేది ఆయన వాదన.

విభజన వెనుక గల కుట్రను భారత జాతీయవాదులు స్పష్టంగానే చూడగలిగారు. వెంటనే ముక్తకంఠంలో ఆ చర్యను ఖండించారు. విభజన వ్యతిరేక ఉద్యమం, స్వదేశీ ఉద్యమం ఉద్భవించాయి.

* * *

1903 డిసెంబరులో విభజన ప్రతిపాదనలు ప్రజలకు తెలిసాయి. వెనువెంటనే సద్యోజనిత నిరసన వెల్లువలా సాగింది. విభజన ప్రతిపాదనలు వెలుగులోకి వచ్చిన రెండు మాసాల కాలంలోనే కేవలం తూర్పు బెంగాలులోనే, అందులోనూ ముఖ్యంగా ఢాకా, మైమెన్‌సింగ్, చిట్టగాంగ్ ప్రాంతాల్లోనే ఐదు వందల నిరసన సభలు నిర్వహింపబడినాయంటే ఆ నిరసన ఎంతటి బలీయమైనదో గ్రహించవచ్చు. విభజన ప్రతిపాదనల్ని విమర్శిస్తూ దాదాపు యాభైవేల కరపత్రాలు బెంగాలు అంతటా పంచిపెట్టబడినాయి. సురేంద్రనాథ్ బెనర్జీ, కృష్ణకుమార్ మిత్రా, పృధ్వీశ్ చంద్రరే మున్నగు నాయకులు బెంగాలీ, హితవాది, సంజీవని వంటి పత్రికల ద్వారా విభజన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా శక్తిమంతమైన ప్రచారం గావించారు. 1904 మార్చిలో, 1905 జనవరిలో కలకత్తా టౌన్‌హాల్లో గొప్ప నిరసన సభలు నిర్వహించారు. లెక్కకు మించిన పిటీషన్లు

(ఢాకా డివిజను నుండే అరవై తొమ్మిది అభ్యర్థన పత్రాలు), వాటిల్లో కొన్ని దాదాపు 70,000 సంతకాలతో – (ఆనాటి రాజకీయ స్పృహను బట్టి చూస్తే అది చాలా పెద్ద సంఖ్యే) భారత ప్రభుత్వానికీ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు సమర్పించారు. అప్పటి వరకు బ్రిటీష రాజ్‌కు విధేయతను ప్రకటిస్తూ వచ్చిన పెద్ద పెద్ద జమిందారులు, పాత్రికేయులు, న్యాయవాదులు, ఇతర ఉదార వృత్తులకు చెందిన మేధావుల వంటి వారందరూ రాజకీయ కార్యకర్తలైన కాంగ్రెసు నాయకులతో కలిసి నడుం బిగించారు.

1903 నుండి 1905 వరకు గల కాలంలో పిటిషన్లు, మెమోరాండం, ప్రసంగాలు, ప్రజా సదస్సులు, పత్రికా ప్రచారం ముమ్మరమయ్యింది. దాని ముఖ్య ఉద్దేశ్యం ఇటు భారతదేశంలోనూ, అటు ఇంగ్లండులోనూ విభజనకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం వుందని తెలియజేస్తూ ఆప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఓ కట్టుదిట్టమైన దృష్టాంతాన్ని చూపెట్టటం. ఇలా వత్తిడిని తగినంతగా పెంచినందువల్ల ఆ అన్యాయం జరిగిపోకుండా నిలిచిపోతుందనే ఆశ.

* * *

అయినా భారత ప్రభుత్వం చలించలేదు. ఒకవైపు విభజన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా విస్తృతంగా నిరసన గళం విన్పిస్తున్నా బెంగాల్ విభజన నిర్ణయం 1905 జూలై 19న ప్రకటించటం జరిగింది. ఇంక మితవాద పద్ధతులు పనికిరావనీ, మరో విధమైన వ్యూహం ఏదయినా ఎన్నుకోవాల్సి ఉందని జాతీయ వాదులకు అర్థమైపోయింది. ప్రభుత్వ ప్రకటన వెలువడిందో లేదో ఎన్నో నిరసన సభలు వెనువెంటనే మొఫిసిల్ పట్టణాలైన దినాజ్‌పూర్, పబ్నా, ఫరీద్‌పూర్, తంగైల్, జెస్సోర్, ఢాకా, బీర్‌భమ్, బరీసాల్ వంటి చోట్ల నిర్వహించబడినాయి. ఇదిగో యిటువంటి సభల్లోనే విదేశీ వస్తు బహిష్కరణకు తొలిసారిగా ప్రతిన బూనటం జరిగింది. కలకత్తాలో విద్యార్థులు విభజనకు వ్యతిరేకంగా, స్వదేశీకి అనుకూలంగా అనేక సభలు నిర్వహించారు.

కలకత్తా టౌను హాలులో 1905 ఆగస్టు 7న జరిగిన సమావేశంలో స్వదేశీ ఉద్యమాన్ని గూర్చి లాంఛన ప్రాయంగా ప్రకటించారు. ఇప్పటి వరకు చెదురు మదురుగా, స్వయం ప్రేరకంగా సాగే ఉద్యమానికి ఒక కార్యాచరణ కేంద్రం, నాయకత్వం అందివచ్చినట్లయ్యింది. ఆగస్టు 7 సమావేశంలో పేరెన్నిక గన్న బహిష్కరణ తీర్మానాన్ని ఆమోదించారు. సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాద నాయకులు కూడా మాంచెస్టరు

వస్త్రాలను, లివర్‌పూల్ ఉప్పును బహిష్కరించవలసిందిగా కోరుతూ దేశమంతా తిరిగి చెప్పారు. విభజన 1905 అక్టోబరు 16 నుండి అమలులోకి వస్తుందని సెప్టెంబరు 1న ప్రభుత్వం మళ్లీ ప్రకటించింది. ఆ తరువాత వారాల్లో బెంగాల్ అంతటా నిరసన సభలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని సభలకు బరీసాల్‌లో మాదిరిగా పది పన్నెండు వేలకు పైగా జనం పోగయ్యేవాళ్లు. బహిష్కరణ సందేశం యింటింటికి చేరిందనటానికి దాఖలా 1904 సెప్టెంబరు నుండి 1905 సెప్టెంబరు వరకు మొఫిసిల్ జిల్లాలలో బ్రిటీషు వస్త్రాల ధర ఐదు నుండి పదిహేను రెట్ల వరకూ పడిపోవటమే.

విభజన అమలులోకి వచ్చిన 1905 అక్టోబరు 16వ తేదీ బెంగాలు అంతటా సంతాపదినంగా పాటించబడింది. ఏ ఇంటా పొయ్యి రాజెయ్యలేదు, ప్రజలంతా పస్తులున్నారు. కలకత్తాలో హర్తాళ్ ప్రకటించారు. ప్రజలు తండోప తండాలుగా కాలినడకన సాగిపోయి, ఉదయమే గంగానదిలో స్నానం చేసి వందేమాతరం గీతం ఆలపిస్తూ వీధుల్లో తిరిగారు. ఉద్యమానికి వందేమాతర గీతం సందేశ గీతంగా రూపుదాల్చింది. రెండు చీలికలైన బెంగాలు ఐక్యతకు సంకేతంగా ప్రజలు ఒకళ్ల కొకళ్లు రాఖీలు కట్టుకున్నారు. తరువాత ఆనంద మోహనబోస్, సురేంద్రనాథ్ బెనర్జీ ప్రసంగించిన సభలకు యాభైవేల నుండి, డెభైవేల వరకు ప్రజలు హాజరయ్యారు. అప్పటి వరకూ జాతీయ ఉద్యమ పతాకం కింద నిర్వహింపబడిన సభల్లో కెల్లా అవే పెద్ద బహిరంగ సభలు. సభలు ముగిసిన కొద్ది గంటల్లోనే ఉద్యమ నిర్వహణకు గాను యాభైవేల రూపాయిలు సేకరించగలిగారు.

దిశానిర్దేశంతోనూ, సామాజిక ప్రాతిపదికను ఏర్పాటుచేసుకోవటంతోనూ ఉద్యమం త్వరితగతిన విస్తృతం కాసాగింది. 1906 ఏప్రియల్‌లో బరీసాల్‌కాన్ఫరెన్స్ అధ్యక్షుడు అబ్దుల్ రసూల్ అన్నట్లు – '50 లేక 100 సంవత్సరాలలో మనం సాధించలేని దానిని ఈ పెనువిపత్తు, బెంగాల్ విభజన, కారణంగా ఆరు మాసాల్లో సాధించగలిగాం. దాని ఫలితమే ఈ జాతీయ మహోద్యమమూ, ఈ స్వదేశీ ఉద్యమమున్నూ.'

స్వదేశీ సందేశం, విదేశీ వస్తు బహిష్కరణ త్వరలోనే దేశమంతటా వ్యాపించింది – లోకమాన్య తిలక్ ఉద్యమాన్ని భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు మరీముఖ్యంగా పూనా, బొంబాయి ప్రాంతాలకు తీసుకు వెళ్లాడు. అజిత్‌సింగ్, లాలా లజపత్‌రాయ్‌లు స్వదేశీ సందేశాన్ని పంజాబ్‌లోనూ మిగతా ఉత్తర హిందూస్థానంలోనూ వ్యాపింపజేసారు.

సయ్యద్ హైదర్ రజా ఉద్యమాన్ని ఢిల్లీలో నిర్వహించాడు. రావల్పిండి, కాంగ్రా, జమ్మూ, ముల్తాన్, హరిద్వార్‌లలో కూడా స్వదేశీ ఉద్యమంలో చురుకుగా ప్రజలు పాలు పంచుకున్నారు. చిదంబరం పిళ్లై ఉద్యమాన్ని మద్రాసు ప్రెసిడెన్సీకి చేరవేయగా బిపిన్‌చంద్రపాల్ విస్తృతంగా పర్యటిస్తూ, ప్రసంగాలు చేస్తూ పోవటంతో ఉద్యమంలోకి విద్యుత్తు ప్రవహించినట్లయ్యింది.

భారత జాతీయ కాంగ్రెసు స్వదేశీ పిలుపునందుకుంది. 1905లో గోపాల కృష్ణగోఖలే అధ్యక్షతన జరిగిన బెనారస్ సదస్సులో బెంగాలులోని స్వదేశీ ఉద్యమానికి విదేశీ వస్తు బహిష్కరణ కార్యకలాపాలకు మద్దతు ప్రకటించింది. తిలక్, బిపిన్‌చంద్రపాల్, లాలా లజపతిరాయ్, అరవింద ఘోష్ వంటి వారి నాయకత్వంలోని తీవ్రవాద జాతీయవాదులు కూడా ఆ ఉద్యమాలను భారతదేశంలోని మిగతా భాగాలకుకూడా వ్యాపింప జేయాలను కున్నారు. కేవలం స్వదేశీ, బహిష్కరణ కార్యక్రమాలకే పరిమితం కాక ఒక సంపూర్ణ రాజకీయ ప్రజా పోరాటంగా దాన్ని మలచాలనుకున్నారు. ఇప్పటి లక్ష్యం స్వరాజ్యం. విభజనను వ్యతిరేకించటమన్నది 'రాజకీయ లక్ష్యాలలో బహు స్వల్పమైనదిగా, సంకుచితమైనదిగా' మారిపోయింది. అయితే మితవాదులు మరీ అంత దూరం జరగాలని అనుకోలేదు. అయితే 1906లో దాదాభాయి నౌరోజీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెసు, కలకత్తా సదస్సులో ఓ ముఖ్య నిర్ణయంతో ముందుకు అడుగేసింది. నౌరోజీ తన అధ్యక్ష ప్రసంగంలో 'స్వయం పరిపాలన లేదా యునైటెడ్ కింగ్‌డమ్‌లో లాగానో, ఇతర వలస ప్రాంతాల్లో మాదిరిగానో స్వరాజ్యసాధనే' భారతజాతీయ కాంగ్రెసు లక్ష్యంగా పేర్కొన్నాడు. మితవాదులకు, అతివాదులకు ఉద్యమనడకలో, నిర్వహణలోని ఎత్తుగడలలో పొడసూపిన విభేదాలు బహిర్గతమై 1907 సూరత్ సెషన్‌లో పార్టీ చీలిక దిశగా పయనించటంతో స్వదేశీ ఉద్యమంపై తీవ్ర పరిణామాలకు అదిదారితీసింది.

ఎలాగయితేనేం 1905 తరువాత బెంగాలులో స్వదేశీ ఉద్యమంలో తీవ్రవాదుల్ది పైచేయి అయ్యింది. ప్రజల స్థాయిలోనే ప్రజా సమీకరణలో క్రొంగొత్త పద్ధతులు, పోరాటంలో సరికొత్త మెలకువలు ఆవిర్భవించసాగాయి. వేడుకోవటాలు, అర్జీలు, స్మారక చిహ్నాలు వెనుకంజ వేసాయి. సిద్ధాంత స్థాయిలోను, ప్రచార పద్ధతుల్లోనూ, ఆచరణాత్మక కార్యావళిలోనూ తీవ్రవాద జాతీయవాదులు క్రొంగొత్త ఆలోచనలను పంచారు. ఉద్యమాన్ని

మెల్లగా ప్రజా ఉద్యమంగా రూపొందించి, బహిష్కరణ ఉద్యమాన్ని విస్తృతపరచి దానిని సంపూర్ణ సహాయ నిరాకరణకు, సత్యాగ్రహ పద్ధతికి అనుకూలంగా మలచుకొని రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందాల్సి ఉంది. 'బహిష్కరణ విధానం' విదేశీ వస్తు బహిష్కరణతోనే ఆగక ప్రభుత్వ పాఠశాలల్ని, కళాశాలల్ని, కోర్టుల్ని, బిరుదుల్ని, ప్రభుత్వ ఉద్యోగాలనూ బహిష్కరించే దశకు చేరుకొని సమ్మెలు నిర్వహించేట్లు చేసింది. అలా చేయటంలో ఉద్దేశ్యమేమంటే – 'అప్పటి పరిస్థితుల్లో సంఘటిత బహిష్కరణ ద్వారా బ్రిటీషు వాణిజ్య వేత్తలు దేశాన్ని దోచుకునేందుకు వీలుగాని స్థితినీ, అధికార గణం పాలనా పరంగా ఏమీ చేయజాలని స్థితికి తీసుకురావటమే'. కొందరు అత్యద్భుతమైన దూరదృష్టితో పెద్ద యెత్తున జరిపే శాంతియుత ప్రతిఘటనలో అనూహ్యమైన శక్తి ఉంటుందని కనుగొన్నారు. 'ఒక వేళ... ఒక చౌకీదారు, కానిస్టేబులు, మున్సబు, గుమాస్తా – సరే సిపాయిల సంగతి చెప్పేదేముంది – వీళ్లంతా వాళ్ల వాళ్ల విధుల్ని విస్మరిస్తే ఒక్కక్షణంలో దేశంలో ఫిరంగి పాలన చరమదశకు చేరుకుంటుంది. మందుగుండు సామాగ్రితో పనేలేదు. సిపాయిలకు శిక్షణ అవసరం లేదు'[10] ఒక వేళ బ్రిటీషు ప్రభుత్వం అణచివేత కార్యక్రమాన్ని తీవ్రతరం చేస్తే విప్లవ పథగాములైన ఉగ్రవాదులతో సంబంధాల్ని పెంచుకొన్న అరవింద ఘోష్ వంటి వాళ్లు హింసాత్మక పద్ధతులు అవలంబించేందుకు సిద్ధంగానే వున్నారు.

ఉద్యమంలోకి దూసుకొచ్చిన వివిధ పోరాట ప్రక్రియల్లో కెల్లా విదేశీ వస్తు బహిష్కరణే ఆచరణాత్మకంగానూ, జనరంజకంగానూ ఉండి, కళ్లకు కట్టినట్లు కన్పించే గొప్ప విజయాన్ని సాధించింది. బహిష్కరణ, విదేశీ వస్త్రాలకు బహిరంగ ప్రదేశాలలో నిప్పంటించటం, విదేశీ వస్తువులు అమ్మే దుకాణాల ముందు పికెటింగ్ చేయటం వంటివన్నీ బెంగాలు మారుమూల ప్రాంతాల్లోనే గాక దేశంలోని అన్ని నగరాలలోనూ, ప్రముఖ పట్టణాలలోనూ సర్వసాధారణమై పోయింది. స్త్రీలు విదేశీ గాజులు వేసుకోవటం నిలిపివేసారు. విదేశీ పాత్రలతో వంటకాలు తయారు చేయటం మానివేసారు. రజకులు విదేశీ దుస్తుల్ని శుభ్రంచేయమని చెప్పేసారు. విదేశీ పంచదార కలిసిన ప్రసాదాలను పూజారులు నైవేద్యంగా స్వీకరించజాలమని చెప్పారు.

జన సమీకరణ విషయంలో వివిధ పద్ధతుల్ని నూతనంగా ప్రవేశపెట్టటంలో కూడా ఉద్యమం తగినంత విజయాన్ని సాధించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు ప్రజాసమీకరణకు ప్రధాన సాధనాలవ్వటమే గాకుండా అవి ప్రజాభిప్రాయాన్ని వెలిబుచ్చే

పద్ధతులయ్యాయి. గ్రామ స్థాయిల్లో, తాలూకా స్థాయిల్లో, జిల్లా స్థాయిల్లో, మహానగరాలలో, పట్టణాలలో, ఎన్నో సభలు, ఊరేగింపులు నిర్వహింపబడినందువల్ల స్వదేశీ సున్నిత మానసిక భావనలు బాగా లోతుగా నాటుకోవటమే గాకుండా ఉద్యమ వ్యాప్తికి అవి వాహకాలుగా పనిజేసాయి. ఇటువంటి పద్ధతులు జాతీయ ఉద్యమంలో రానున్న దశల్లో వాటి విశిష్ఠతను నిల్పుకోగలవు.

స్వదేశీ ఉద్యమంలో విస్తృతంగా ఉపయోగింపబడిన మరో ప్రజా సమీకరణ విధానం – స్వచ్ఛంద సేవా సమితులు. వాటన్నింటిలోకీ బాగా ఖ్యాతి గడించిన స్వచ్ఛంద సేవా సంస్థ అశ్వనీకుమార్‌దత్ అనే ఉపాధ్యాయుడు బారిసాల్ అనే గ్రామంలో స్థాపించిన స్వదేశ్ బంధాబ్ సమితి. జిల్లాలో మారుమూల గ్రామాలకు సైతం 159 శాఖల ద్వారా విస్తరించిన ఈ సమితి కార్యకలాపాల వల్ల ఆ ప్రాంతంలో అధిక సంఖ్యాకులైన ముస్లిం రైతుల నుండి అసమాన ప్రజానుసరణను దత్ ప్రోదిచేయగలిగాడు. సమితులు స్వదేశీ సందేశాన్ని జంతర్ మంతర్ పెట్టె ప్రసంగాల ద్వారా, స్వదేశీ పాటల ద్వారా గ్రామాలకు చేర్చి సభ్యులకు భౌతికంగానూ, నైతికంగానూ శిక్షణ యిస్తూ, దుర్భిక్ష సమయాల్లోనూ, అంటురోగాలు ప్రబలి నప్పుడు సమాజ సేవ చేస్తూ, పాఠశాలలు నిర్వహిస్తూ, స్వదేశీ హస్తకళలలో తర్ఫీదునిస్తూ, కోర్టు గొడవల్లో మధ్యవర్తిత్వం నెరుపుతూండేవి. 1906 ఆగస్టు నాటికి బారిసాల్ సమితి 89 మధ్యవర్తిత్వ కమిటీల ద్వారా 523 వివాదాల్ని పరిష్కరించినట్లు భోగట్టా. సమితుల మూలాలు బారిసాల్ లోనే వున్నా అవి బెంగాల్ అంతటా బాగా వ్యాపించాయి. వాటి కార్యక్రమాల వల్ల పల్లె పట్టుల్లో అవి పొందే ప్రజాదరణ వల్ల సహజంగానే బ్రిటీషు అధికార గణం అప్రమత్తం అయ్యింది.

సంప్రదాయ బద్ధంగా ప్రజలు జరుపుకునే పండుగలు, మేళాలలో ప్రజలకు చేరువయ్యేందుకు వాటిని సృజనాత్మకంగా వాడుకోవటానికి స్వదేశీ ఉద్యమ సమయం తార్కాణంగా నిలిచింది. తిలక్ బాగా జన ప్రియంగావించిన గణపతి, శివాజీ ఉత్సవాలు స్వదేశీ ప్రచారానికి పశ్చిమ భారతంలోనే గాక బెంగాలులో కూడా బాగానే ఉపకరించాయి. స్వదేశీ సందేశం అన్ని తరగతుల ప్రజలకు, అందులోనూ తొలిసారిగా ఆధునిక రాజకీయాలకు పరిచయం చేయబడే అధిక సంఖ్యాకులకు బాగా అర్థమయ్యే రీతిలో అందించేందుకు వాడటం జరిగింది.

స్వదేశీ ఉద్యమానికి సంబంధించి మరో ముఖ్యమైన అంశమేమంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో అత్యంతావశ్యకమైన ఆత్మశక్తికి అధిక ప్రాధాన్య మివ్వటం. వివిధ రంగాలలో ఆత్మశక్తి అంటే జాతీయగౌరవాన్ని, హుందాతనాన్నీ, విశ్వాసాన్నీ తిరిగి రూఢి గావించటమే. గ్రామస్థాయిలో తమకు తామే సాయపడటం, నిర్మాణాత్మక కార్యక్రమాలు వగైరా చేపట్టి గ్రామాల సామాజిక, ఆర్థిక పునరుజ్జీవనానికి పాటు పడటంతో గ్రామీణ ప్రజలకు చేరువవటం సాధ్యపడింది. సరిగ్గా చెప్పాలంటే అదంతా సంఘ సంస్కరణ, బాల్య వివాహాలు, కులవేధింపులు, వరకట్నం, మద్యపానం వంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఉద్యమించటం. ఆత్మశక్తి కార్యకలాపాలలో మరో ముఖ్యమైన అంశం స్వదేశీ లేదా జాతీయ విద్య. టాగోర్ శాంతినికేతనం ప్రాతిపదికపై అరబిందో ప్రిన్స్‌పాల్‌గా బెంగాల్ నేషనల్ కళాశాల స్థాపించబడింది. అనతి కాలంలోనే దేశమంతటా ఎన్నో జాతీయ పాఠశాలలు ఆవిర్భవించాయి. 1906లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ స్థాపించబడింది. దేశంలో అప్పటి ప్రముఖులందరూ సభ్యులుగా వున్నటు వంటి ఆ కౌన్సిలు దాని లక్ష్యాలను ఈ విధంగా నిర్వచించింది: జాతీయ ఆలోచనా సరళితో, జాతీయతా నియంత్రణలో, సాహిత్య, వైజ్ఞానిక, సాంకేతిక విద్యా విధానాన్ని ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు రూపొందించటం.'[11] ప్రధానంగా బోధనా మాధ్యమం మాతృభాష అయితే ఆ విద్య ఎక్కువ మందికి అక్కరకు వస్తుంది. సాంకేతిక విద్య విషయంలో బెంగాల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి, పై చదువులకు విద్యార్థులను జపాన్ పంపేందుకు నిధులు సేకరించటం జరిగింది.

ఆత్మశక్తికి మరో పార్శ్వం స్వదేశీ పరిశ్రమల స్థాపన. ఆ సమయంలో స్వదేశీ బట్టల మిల్లులు, సబ్బుల అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలు, తోళ్ల పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్సు కంపెనీలు, షాపులు స్థాపించబడినాయి. వ్యాపార దృష్టికంటే దేశభక్తి భావనతో తలమునకలయ్యే నిర్వాహకులతో నిండిన ఆ సంస్థలు ఎక్కువ కాలం నిలబడలేక పోయాయి. ఆచార్య పి.సి.రే. నెలకొల్పిన బెంగాల్ కెమికల్స్ ఫ్యాక్టరీ వంటివి మాత్రం విజయం సాధించి ఖ్యాతిని గడించాయి.

ఇక సాంస్కృతిక రంగం విషయానికొస్తే దానిపై స్వదేశీ ఉద్యమ ప్రభావం అపారం. ఆనాడు రవీంద్రనాథ్ టాగోర్, రజనీకాంతసేన్, ద్విజేంద్రలాల్‌రే, ముకుందదాస్, సయ్యద్ ఆబూ మొహమ్మద్ తదితరులు వ్రాసిన గీతాలు తరువాత కాలంలో జాతీయ

వాదుల్లోని అన్ని వర్గాలవారినీ కదిలించి నేటికీ ప్రజానురంజకంగానే నిలిచాయి. అలా వాటి ప్రభావానికి లోనైన వారిలో ఉగ్రవాదులున్నారు. గాంధేయవాదులున్నారు, కమ్యూనిస్టులున్నారు. రవీంద్రుడు అప్పట్లో వ్రాసిన 'అమర్ సోనార్ బంగ్లా' అనే గీతం బంగ్లాదేశ్ విముక్తి పోరాట దినాల్లో స్ఫూర్తినందించింది. 1971లో అది ఆ దేశపు జాతీయ గీతమయ్యింది. బెంగాలులోని హిందువులు, ముస్లిములు నివసించేగ్రామాల్లో బెంగాలీ జానపద సంగీతం, స్వదేశీ ప్రభావాన్ని చూపింది. ఆ స్ఫూర్తితో దక్షిణ రంజన్ మిత్ర మజుందార్ సేకరించిన అమ్మమ్మ కథలవంటి భారతీయ జానపద గాథలు ఈనాటికీ పిన్నల్ని ఆహ్లాదపరుస్తాయి. చిత్రకళా రంగంలో అవనీంద్రనాథ్ టాగోర్ విక్టోరియన్ వాస్తవిక ధోరణి ఆధిపత్యానికి అడ్డుకట్టవేసి మొఘల్, రాజపుట్, అజంతా చిత్రాలలోని దేశివాళీ సంప్రదాయపు కోమలమైన సుగుణాల వల్ల స్ఫూర్తి పొందాడు. భారతీయ చిత్ర కళలో తనదైన ముద్ర వేసిన నందలాల్ బోస్ 1907లో స్థాపింపబడిన ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓరియంటల్ ఆర్ట్ వారి ఉపకార వేతనాన్ని ప్రథమంగా అందుకున్నాడు. విజ్ఞానం విషయానికొస్తే జగదీష్ చంద్రబోస్, ప్రపుల్ల చంద్రరే మరికొందరు అసలైన పరిశోధనలలో అగ్రగాములుగా నిలవటం ప్రపంచమంతా వేనోళ్ళ కొనియాడింది.

* * *

మొత్తం మీద స్వదేశీ ఉద్యమాలు, బహుముఖీన కార్యక్రమాల ద్వారా, చర్యల ద్వారా తొలిగా సమాజంలోని పలు వర్గాలను వర్తమాన జాతీయ రాజకీయాల్లోకి అంతకు మించి ఆధునిక రాజకీయ భావనల్లోకి లాక్కురాగలిగాయి.

జాతీయోద్యమపు సామాజిక చట్రం కొందరు జమిందారుల్ని, నగరాలు, చిన్న చిన్న పట్టణాలలోని క్రింది మధ్యతరగతి వర్గాల్ని, పాఠశాలల, కళాశాలల విద్యార్థుల్ని అత్యధిక సంఖ్యలో తనలో యిముడ్చుకోగలిగింది. స్త్రీలు గడపదాటివచ్చి ఊరేగింపుల్లో, పికెటింగులలో పాల్గొనటం అప్పుడే మొదలయ్యింది. ఆ సమయంలోనే తొలిసారిగా శ్రామికవర్గం యొక్క ఆర్థిక యిబ్బందులకు రాజకీయ దిశానిర్దేశం సమకూర్చే ప్రయత్నం జరిగింది. జర్మనీ, రష్యా దేశాలలో వలె అంతర్జాతీయ సోషలిస్టు భావాలకు ప్రభావితులైన కొందరు స్వదేశీ నాయకులు ఈస్టర్న్ ఇండియన్ రైల్వే, క్లైవ్ జ్యూట్ మిల్స్ వంటి విదేశీ వ్యాపార సంస్థల్లో సమ్మెలు నిర్వహించేందుకు కృషి చేశారు.

ఏదో బారిసాల్ జిల్లా వంటి కొన్ని ప్రాంతాల్లో తప్ప ఉద్యమం కావలసినంతగా రైతుల్ని మరీ ముఖ్యంగా వాళ్లలోని బడుగు వర్గాల్ని సమీకరించ లేకపోయిందని కొందరు వాదించవచ్చుగాని పరిమిత ప్రాంతాల్లోని రైతుల్ని ఉద్యమం సమీకరించగలగటమే గొప్పన్న సత్యాన్ని గ్రహించవలసి ఉంది. ఎందువల్లనంటే స్వదేశీ ఉద్యమంలో రైతులు పాల్గొనటంతో భారతదేశంలో ఆధునిక రాజకీయాలకు శ్రీకారం చుట్టినట్లయ్యింది. తరువాత కాలంలో, స్వదేశీ ఉద్యమానంతర కాలంలో కూడ ఉధృత రాజకీయ సమీకరణ, కార్యకలాపాలు రైతుల విషయానికొస్తే కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లోనే కేంద్రీకృతమయ్యాయి. నిజమే, స్వదేశీ ఉద్యమ కాలంలో రైతులు ప్రధానంగా వ్యవసాయ డిమాండ్ల సాధనకై సంఘటితం కాక పోయినా, బాయ్‌కాట్, సత్యాగ్రహం వంటి పోరాట పద్ధతుల్లో పలుప్రాంతాల్లో చురుకుగా పాల్గొనకపోయినా చాలా మంది రైతులు సభల ద్వారా, జాతాల ద్వారా, నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా ఆధునిక జాతీయవాద భావజాలానికీ, రాజకీయాలకు తొలిసారిగా పరిచయం కావించబడినారు.

స్వదేశీ ఉద్యమపు ప్రధాన ప్రతిబంధకం ముస్లిముల, అందులోనూ ముస్లిం రైతుల మద్దతును కూడగట్టలేకపోవటమే. అందుకు చాలా వరకు స్వదేశీ ఉద్యమానికి వ్యతిరేకంగా ముస్లిములను మత ప్రాతిపదికన కావాలని సిద్ధపరచిన బ్రిటీషు విధానమే కారణంగా నిలుస్తుంది. బెంగాలులోని చాలా ప్రాంతాల్లో హిందువులు భూస్వాములుగా వుండగా ముస్లిములు కౌలుదార్లుగా ఉండటం జరిగింది. ఈ విధమైన ప్రత్యేక పరిస్థితుల్ని ప్రభుత్వం తన పన్నాగంలో బాగా వాడుకుంది. ప్రభుత్వ సలహా సంప్రదింపులే గాక సహాయం కూడా పొంది అఖిల భారత ముస్లిం లీగ్ ఆవిర్భవించింది. ఆ తరుణంలోనే. ఇంకా స్పష్టమైన వివరాల్లోకి వెళ్లాలంటే బెంగాలులో ఢాకాకు చెందిన నవాబ్ సలిముల్లా వంటి వారు ప్రభుత్వ మద్దతుతో స్వదేశీ ఉద్యమానికి వ్యతిరేకంగా నిలిచారు. ముల్లాలను, మౌల్వీలను రంగంలోకి దించటంతో స్వదేశీ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, బెంగాలులో మతకలహాలు చెలరేగటమేమిటా అని ఆశ్చర్యపోనక్కర్లేదు.

ఈ నేపథ్యాన్నుండి చూస్తే స్వదేశీ ఉద్యమంలో చేపట్టిన జన సమీకరణ విధానాలు అనుకోకుండా కొన్ని వ్యతిరేక పరిణామాలకు దారితీసాయి. సంప్రదాయ ప్రజారంజక ఆచారాల్ని, ఉత్సవాల్ని, సంస్థల్ని ప్రజాసమీకరణకు – అందులోనూ మరీ ముఖ్యంగా ఉద్యమాలు శైశవ దశలో వున్న తరుణంలో – ప్రపంచమంతటా వాడబడటం

ఆనవాయితీగా వస్తున్నదే. అయినా ప్రభుత్వ మద్దతుతో మతవాద ఛాందసులు వాటిని వక్రీకరించారు. తప్పుడు భాష్యాలు చెప్పారు. స్వదేశీ ఉద్యమాలు ఉపయోగించుకున్న సంప్రదాయ పద్ధతుల్లో మతశక్తులు కుచ్ఛితమైన మత సామ్యాలను చూడసాగాయి. అయితే ఆ పద్ధతులు ప్రజలలోని వివిధ మత ఆచారాల కలయిక వల్ల ఏర్పడిన ఉమ్మడి సాంస్కృతిక సంప్రదాయాల ప్రతిఫలనాలేనన్నది పచ్చినిజం.

* * *

1908వ సంవత్సరం మధ్యలో ప్రజల మద్దతుతో అలా బహిరంగంగా సాగుతున్న ఉద్యమం దానంతటదే కుప్పకూలింది. దానికి కారణాలు అనేకం. మొదటి కారణం ప్రభుత్వం ఉద్యమంలోని విప్లవాత్మక శక్తిని బలవంతంగా అణగద్రొక్కాలను కుంది. ఆ అణచివేత అనేక రూపాలు ధరించింది. బహిరంగ సభలపై, ఊరేగింపులపై, పత్రికలపై అజమాయిషీ పెంచటమే గాకుండా నిషేధించే వరకూ నడిచింది వ్యవహారం. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల్ని పాఠశాల నుండి, కళాశాలల నుండి తొలగించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోకి ప్రవేశం లేకుండా చేసారు. జరిమానాలు విధించారు. కొన్ని సార్లు పోలీసులు దేహశుద్ధికి పాల్పడ్డారు. 1906లో బారిసాల్ సభను పోలీసులు భగ్నం చేసి అందులో పాల్గొన్న ఎందరినో అమానుషంగా బాదటం ప్రభుత్వ విధానాన్నీ, వైఖరినీ చాటి చెప్పే ఉదాహరణగా నిలుస్తుంది.

ఇక రెండవ కారణం – అఖిల భారత స్థాయి అగ్రగామి సంస్థ అయిన కాంగ్రెసులో అంతర్గత విభేదాలు, చిల్లర తగాదాలు. చివరకు 1907లో అవి పార్టీ చీలికకు దారితీయటంతో ఉద్యమం బాగా బలహీన పడింది. స్వదేశీ ఉద్యమం బెంగాలు బయట కూడా విస్తరించినా దేశం రాజకీయాల్లోని ఆ సరికొత్త శైలినీ, దశనూ అందుకునేందుకు సంపూర్ణంగా సంసిద్ధంగా లేదు. ఈ రెండు అంశాలు ప్రభుత్వానికి బలాన్ని చేకూర్చాయి. 1907 – 1908 మధ్య కాలంలో అశ్వనీ కుమార్‌దత్, కృష్ణకుమార్ మిత్రాలతో కలిపి తొమ్మిది మంది ప్రముఖ నాయకులు దేశ బహిష్కరణకు గురయ్యారు. తిలక్‌కు ఆరేళ్ల జైలు శిక్ష విధించారు. పంజాబుకు చెందిన అజిత్‌సింగ్, లాలాలజ్‌పతిరాయ్‌లకు దేశాంతరవాసశిక్ష విధించారు. మద్రాసుకు చెందిన చిదంబరం పిళ్లెని ఆంధ్ర ప్రాంతానికి చెందిన హరిసర్వోత్తమరావును నిర్బంధించారు. బిపిన్ చంద్రపాల్, అరబిందోలు క్రియాశీల రాజకీయాలకు దూరంగా వుండాలని

నిర్ణయించుకోవటంలో ప్రభుత్వ అణచివేత చర్యల ప్రమేయం లేదని చెప్పజాలం. ఒక్క దెబ్బతో దాదాపుగా మొత్తం ఉద్యమం నాయకత్వలేమికి గురయ్యింది.

స్వదేశీ ఉద్యమానికి కట్టుదిట్టమైన ఏర్పాటు, పార్టీ స్వరూపం కొరవడటం మూడవ కారణం. ఉద్యమం, సత్యాగ్రహం, శాంతియుత సహాయ నిరాకరణ జైళ్లు నింపే కార్యక్రమం, సాంఘిక సంస్కరణ, నిర్మాణాత్మక కార్యక్రమాల వంటి గాంధేయ పద్ధతులన్నీ ఆచరణాను కూలంగా ప్రవేశపెట్టటం జరిగింది. అయితే తరువాత కాలంలో గాంధీజీ చేసినట్లుగా అప్పట్లో ఉద్యమం ఆ పద్ధతులకు ఒక క్రమశిక్షణాయుత కేంద్రీకరణ గావిస్తూ భారత రాజకీయాల్ని నడిపించలేదు.; ఆపద్ధతుల్ని రాజకీయ సాధనాలుగా వినియోగించుకోలేదు.

ఏది ఏమయినా 1908వ సంవత్సరం సగంలో బహిరంగ ఉద్యమం వెనుకంజ వేయటం ఉద్యమంలో మరో విధానం తలెత్తింది. అదే సమరశీల ఉగ్రవాదం. ప్రజా ఉద్యమంలో భాగస్వాములైన ఈ దేశయువత ఒక వైపు ఉద్యమం మరణశయ్య మీద వుండగా, మరో ప్రక్క ప్రభుత్వ అణచివేత పెచ్చుమీరుతుండగా కళ్లప్పగించి చూస్తూ, తోకముడిచి మెల్లగా వెనక్కి జారుకునే స్థితిలో లేరు. ఆశాభంగం చెందిన కొందరు వ్యక్తిగత వీరోచిత కార్యాలవైపు మొగ్గుచూపారు. గతంలో ప్రజలు చేపట్టిన చర్యలకు అది భిన్నం.

* * *

ప్రజా ఉద్యమం వెనుకంజ వేయటంతో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఓ ఘట్టం ముగిసినట్లయ్యింది. అయితే స్వదేశీ ఉద్యమం కృతార్థత చెందనట్లుగా భావించటం సరికాదు. జాతీయతా భావనను సరైన సృజనాత్మక పద్ధతిలో అంతకు మునుపెన్నడూ చేరని ప్రజల చెంతకు చేర్చటంలో ఉద్యమం గొప్ప కృషి చేసింది. అలా చేస్తూ చేస్తూ అది వలసవాద భావాల, సంస్థల పెత్తనాన్ని పెద్ద యెత్తున దెబ్బతీసింది. సాంస్కృతిక రంగంలో, భావవీధిలో స్వదేశీ ప్రభావం చాలా కీలకమైనటువంటిది. దానికి సరితూగేది దేశ చరిత్రలో మరెక్కడా కనుపించదు. 1930లో సాంస్కృతిక పురోభివృద్ధి మాటేమిటంటే కాదనలేం గాని అయితే ఆ పురోభివృద్ధిపై ప్రభావం వేసింది మాత్రం వామపక్ష భావాలే.

ఉద్యమం అన్నింటినీ విజయవంతంగా అమలుపరచలేకపోయినా జన సమీకరణలో, జన బాహుళ్యపు చర్యలలో అనేక కొత్త పద్ధతుల్ని మెలకువల్ని రూపొందించ గలిగింది. మితవాదులు వలస వాదంపై ధ్వజమెత్తి ఒక ఆర్థిక పరమైన విమర్శను లేవనెత్తి అది ప్రజలందరి వద్దకు వాళ్లు చేర్చలేక పోయారనే విమర్శను ఏవిధంగా అయితే తక్కువ అంచనా వేయరాదనుకున్నామో అదే విధంగా అతివాదులు, స్వదేశీ ఉద్యమమూ, జన సమీకరణ విషయంలోనూ, ప్రత్యక్ష చర్య విషయంలోనూ రూపొందించిన కొత్త విధానాలు వాళ్లే పూర్తిగా వినియోగించుకోలేక పోయినందు వల్ల వాటి విలువ తగ్గినట్లు కాదు. అవి అలా తమ ఇష్టపూర్తిగా సంక్రమింప జేసిన వాటి ఆధారంగానే జాతీయ ఉద్యమం తరువాత దశలో పెద్ద ఎత్తున ఆధారపడే అవసరం వుంది.

వలస వాదానికి వ్యతిరేకంగా, జాతీయ ప్రజా పోరాటంలో స్వదేశీ ఉద్యమం తొలిమెట్టు మాత్రమే. ఆంటానియో గ్రామ్‌సీ ప్రతీకల్ని అరువు వినియోగించినట్లయితే – భారత స్వాతంత్ర్య సముపార్జన దిశగా చేపట్టవలసిన సుదీర్ఘ సంక్లిష్ట మహాసంగ్రామంలో ఎడతెగని పోరాటంగా దీనిని భావించవలసి వుంది.

* * *

# 11 కాంగ్రెసులో చీలికలు - సమరశీల ఉగ్రవాద ఆవిర్భావం

1907 డిసెంబరులో భారత జాతీయ కాంగ్రెసు చీలిపోయింది. దాదాపుగా అదే సమయంలో సమరశీల ఉగ్రవాదం బెంగాలులో ఆవిర్భవించింది. ఆ రెండు సంఘటనలకు సంబంధంలేదని అనజాలం.

* * *

1907 నాటికి జాతీయవాదుల్లోని మితవాదుల చారిత్రక పాత్ర ముగిసింది. కార్యక్రమాలు ప్రారంభించిన దినాల్లో వాళ్లు పడిన అష్టకష్టాలను, ఆనాటి అపరిపక్వ రాజకీయ చైతన్యాన్ని పరిగణనలోకి తీసుకునేట్లయితే వాళ్లు సాధించింది అపారం అనేది ముందటి అధ్యాయాల ద్వారా గ్రహించగలం.

వాళ్ల వైఫల్యాలు కూడ అనేకం. సామాన్యుల పట్ల వాళ్లకు నమ్మకం పూజ్యం. అందువల్ల వాళ్లతో కలిసి పని చేయలేదు. అలా వాళ్ల మూలాలను కనుగొనలేక పోయారు. మితవాద జాతీయ వాదుల ప్రచారం కూడ సామాన్యులకు అందుబాటులోకి రాలేదు. అఖిల భారత స్థాయిలో వాళ్లేమీ ఉద్యమాలు చేపట్టలేదు. 1905 - 1907 మధ్య కాలంలో స్వదేశీ ఉద్యమం, బహిష్కరణల రూపంలో అఖిల భారత స్థాయిలో ఉద్యమాలు నిర్వహింప వలసి వచ్చినప్పుడు నాయకత్వం వాళ్ల చేతుల్లో లేదు (బెంగాలులో మాత్రమే మితవాదులు క్రియాశీల పాత్ర నిర్వహించగలిగారు). పాలకులను ఒప్పించి; ఆర్థిక, రాజకీయ సంస్కరణలు ప్రవేశ పెట్టించగలమనే విశ్వాసంపైనే వాళ్ల రాజకీయాలు ఆధారపడినాయి. అయితే అలా

ఆచరణాత్మకంగా వారు సాధించింది మాత్రం చాలా స్వల్పం. వాళ్ల మితవాద ధోరణికి గౌరవించటం పోయి బ్రిటీషు ప్రభుత్వం వాళ్లను తృణీకార భావంతో చూచింది; వాళ్ల రాజకీయాలను అసహ్యించుకుంది,; ప్రజా ఉద్యమాలను దమనకాండతో ఎదుర్కొంది.

మితవాదుల ప్రధాన వైఫల్యం ఘటనలకు అనుగుణంగా స్పందించకపోవటంలోనే ఉంది. వాళ్ల సాఫల్యాలే వాళ్ల రాజకీయాలను నిరుపయోగం గావించాయన్నది వాళ్లు గ్రహించలేకపోయారు. జాతీయ ఉద్యమపు నూతన స్థితితో వాళ్లు సరితూగలేకపోయారు. ఈ విషయంలో మన కళ్ల ముందు కన్పించే ఋజువు వాళ్లు యువతను ఆకర్షించలేకపోవటమే.

* * *

జాతీయ కాంగ్రెసు ఆవిర్భావం నుండి బ్రిటీషు ప్రభుత్వం ఆ సంస్థను అనుమానిస్తూనే వుంది. అయితే ప్రభుత్వం మొదట కొద్ది సంవత్సరాల పాటు దాని పట్ల బహిరంగంగా విరోధ భావాన్ని ప్రదర్శించలేదు. అందుక్కారణం ఆ సంస్థ ఏదో కొద్ది మంది మేధావులకే పరిమితమై దాని కార్యకలాపాలు సిద్ధాంత పరంగానే ఉంటాయని ప్రభుత్వం భావించటమే. ఎప్పుడయితే కాంగ్రెసు పరిధి అంత చిన్నది కాదనీ, భారత జాతీయ వాదానికి అది కేంద్రస్థానం కానున్నదని తేటతెల్లమయ్యిందో అధికారులు బహిరంగంగా కాంగ్రెసుపై, జాతీయ వాద నాయకులపై, పత్రికా రంగంపై విమర్శలకు దిగారు.

అధికారులు జాతీయవాదుల్ని, 'అవిధేయ బాబులు',గా 'విద్రోహ బ్రాహ్మలు'గా 'హింసాత్మక ప్రతినాయకులు'గా ముద్రవేయసాగారు. కాంగ్రెసు 'విద్రోహుల కర్మాగారం'గా కాంగ్రెసు వాదులేమో 'పదవులు రాక ఆశాభంగం పొందిన అభ్యర్థులు, అసంతృప్తి పరులైన న్యాయవాదులతో నిండి వారు వేరొకరికి ప్రాతినిధ్యం వహించక వారికి వారే ప్రతినిధులని' వర్ణించటం జరిగింది. 1888లో వైస్రాయి డఫ్రిన్ ఒక బహిరంగ ఉపన్యాసంలో జాతీయ కాంగ్రెసును విమర్శించాడు: అది కేవలం 'సూక్ష్మదర్శినితో చూస్తేగాని కన్పించని మైనారిటీ' మేధావి వర్గానికి చెందినదని గేలిచేసాడు. భారత దేశపు సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా వున్న జార్జి హేమిల్‌టన్ కాంగ్రెసు నాయకులది 'విద్రోహకర రెండు నాల్కల స్వభావం'[2] గా పేర్కొన్నాడు.

అప్పట్లో కాంగ్రెసు పగ్గాలు పట్టిన మితవాదులు, 1897లో భారత దేశంలో పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం నిర్దయగా అణచివేసేందుకు పూనుకున్న సమయంలో, కాంగ్రెసులోని కొన్ని వర్గాలు సమరశీల జాతీయవాద ధోరణుల్ని లేవదీయగా, మితవాదులు అటు వంటి వాళ్లకు దూరంగా జరిగినా విరోధం సమసిపోలేదు. పైగా బ్రిటీషు ప్రభుత్వం కాంగ్రెసును మరింతగా ఖండిస్తూ దానిని అంతమొందించేందుకు ఆతురత కనబర్చ సాగింది. అలా ఎందుకు జరిగింది? ఎందుకంటే – మొదటి కారణం – వాళ్ల రాజకీయాల్లో మితవాదులు ఎంతగా సామరస్యాన్ని, విధేయతను ప్రదర్శించినా వాళ్లింకా జాతీయ వాదులే. వలస వాద వ్యతిరేక రాజకీయాల్ని, భావాలను వ్యాప్తిగావించే టటువంటివాళ్లే. 1905లో వైస్రాయి కర్జన్ యిలా అంటారు: 'గోఖలే తానెక్కడికి వెళ్తున్నాడో తనకే తెలియటం లేదు. ఒక వేళ తెలిస్తే తన నటనతో కపటబుద్ధిని కప్పి పుచ్చుకోజూస్తుండాలి. భారతదేశంలో జాతీయతా భావపు ఉత్సాహాన్ని ఒక వైపు ప్రేరేపిస్తూనే మరోవైపు బ్రిటీషు పాలనకు విధేయతా పూర్వక అంగీకారాన్ని ప్రకటించటం కుదరని పని.'[3] సెక్రటరీ ఆఫ్ స్టేట్ హామిల్టన్ 1900వ సంవత్సరంలో దాదాభాయి నౌరోజీతో ఈ విధంగా రుసరుసలాడాడు: 'బ్రిటీషు పాలనకు మనఃపూర్వక మద్దతును మీకై మీరే ప్రకటిస్తారు, ఆ పాలన నుండి విడదీయలేనటువంటి పరిస్థితుల్ని, పరిణామాల్నీ, తీవ్రంగా నిరసిస్తారు.'

ఇక రెండవ కారణం – మితవాదుల నాయకత్వంలోని కాంగ్రెసు అంత బలమైనది కానందున, ప్రజల మద్దతు అధికంగా లేనందున దానిని అంతమొందించటం చాలా సులువని బ్రిటీషు విధాన నిర్ణేతలు భావించటం. ప్రత్యేకించి కర్జన్, హామిల్టన్ మద్దతుతో ఈ వైఖరిని అవలంబించాడు. 1900 సంవత్సరంలో ఆయన ఈ విధంగా ప్రకటించాడు: 'కాంగ్రెసు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూంది. భారతదేశంలో వుండగానే దాని శాంతియుత మరణానికి సహకరించాలనేది నా ప్రగాఢ వాంఛ.' 1903లో ఆయన మద్రాసు గవర్నరుకు యిలా వ్రాసారు: 'నేను భారతదేశంలో అడుగిడిన నాటి నుండీ నా విధానం కాంగ్రెసును శక్తిహీనం గావించటమే.'[6] 1904లో కాంగ్రెసు అధ్యక్షుని నాయకత్వాన ఓ ప్రతినిధి వర్గం ఆయన్ని కలిసేందుకు వస్తే వాళ్లను చూచేందుకు నిరాకరించి అలా అవమానంపాలు గావించాడు.

ఎప్పుడయితే శక్తివంతమైన స్వదేశీ ఉద్యమం, బహిష్కరణ ఉద్యమం ప్రారంభమయ్యాయో అప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చేసింది. సమరశీల జాతీయ

వాదభావాలకు బలం చేకూరింది. కనుక జాతీయ ఉద్యమాన్ని బలహీన పరిచేందుకు ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ మార్గం కావలసి వచ్చింది. 1907లో భారతదేశానికి సెక్రటరీ ఆఫ్‌స్టేట్‌గా కొత్తగా వచ్చినజాన్ మోర్లే చెప్పినట్లు మితవాదులతో రుసరుసలాడకుండా వాళ్లను దగ్గరకు తీయటమే ప్రభుత్వ విధానమయ్యింది. 'నయవంచనతో అణచివేసే విధానం'గా రూపొందిన ఈ కొత్త విధానం ఓ ముక్కోణపు పద్ధతి దమనకాండ – రాజీమార్గం – అణచివేత – దాని విధానం. మితవాదుల్ని భయపెట్టేందుకు సమరశీల జాతీయవాదులుగా పిలువబడే తీవ్రవాదుల్ని ప్రభుత్వం ముందుగా కొద్దిగా దమనకాండకు గురిచేసేది. అప్పుడు మితవాదుల్ని కొన్ని రాయితీలతో, హామీలతో బుజ్జగించేది. మితవాదులు గనుక అతివాదులతో తెగదెంపులు చేసుకుంటే మరిన్ని రాయితీలు పొందగలరని సూచన ప్రాయంగా తెలియజేసేది. ఈ క్రొత్త విధానపు ఉద్దేశ్యం యావత్తూ తీవ్ర వాదుల్ని దూరంగా వుంచటమే. ఒకసారి గనుక మితవాదులు ఉచ్చులో చిక్కుకునేట్లయితే ప్రభుత్వం తన సంపూర్ణ శక్తిని ప్రయోగించి తీవ్రవాదుల్ని అణచివేయవచ్చు. తరువాత మితవాదుల్ని లెక్కచేయకుండా గాలికి వదిలేయవచ్చు. జాతీయోద్యమంలో దురదృష్టవశాత్తు మితవాదులుగానీ, తీవ్రవాదులుగానీ ఈ ప్రభుత్వ పన్నాగాన్ని అర్థం చేసుకోలేక పోయినందున అనేక ఆటంకాలతో యిబ్బంది పడవలసి వచ్చింది.

* * *

భారత ప్రభుత్వంలో అగ్రాసనాధి పత్యం వహిస్తున్న వైస్రాయి లార్డ్‌మింటో, సెక్రటరీ ఆఫ్ స్టేట్ జాన్ మోర్లే లెజిస్లేటివ్ కౌన్సిళ్లలో సరికొత్త సంస్కరణలంటూ ఎరవేసి 1906 ప్రారంభంలో వాటి విషయమై కాంగ్రెసులోని మితవాద నాయకత్వంతో చర్చింప సాగారు. దేశంలో ప్రబలంగా సాగే ప్రజా ఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో మితవాదులు ప్రభుత్వానికి సహకరించేందుకూ, చర్చలు జరిపేందుకూ అంగీకరించారు. తత్ఫలితంగా జాతీయవాదుల్లో పూర్తి స్థాయిలో చీలిక ఏర్పడింది.

మనం ఆ చీలిక వివరాల్లోకి వెళ్లేముందు బ్రిటీషు ప్రభుత్వం మితవాదుల్ని, ఉగ్రవాదుల్నుండి విడదీసేందుకు తరువాత సంవత్సరాల్లో కూడ ఆ ఎత్తుగడనే వాడుకున్నారనే విషయం కొంత ఆసక్తిదాయకంగా కన్పించవచ్చు. ఉదాహరణకు

1924లో స్వరాజ్య వాదులకు ప్రతిగా, 1936లో నెహ్రూ, వామపక్షీయులకు ప్రతిగా ఆ కుయుక్తులు అలా కొనసాగాయి. తేడా ఏమంటే తరువాత కాలంలో జాతీయవాద నాయకత్వం 1907-1909 మధ్య కాలం నాటి ఘటనల వల్ల గుణపాఠం నేర్చుకొని వాళ్ల మధ్య విభేదాలు ఎన్ని వున్నా ప్రభుత్వం చూపే ఎరకు దూరంగా వుండగలిగారు.

* * *

బెంగాలు విభజనకు వ్యతిరేకంగా మితవాదులు, తీవ్రవాదులు కలిసి పనిజేస్తున్న తరుణంలో (1905-1907) కూడ ఆ రెండు వర్గాల మధ్య ఎంతో బహిరంగ చర్చ, అనంగీకారం నెలకొంటూ వుండేది. తీవ్రవాదులు స్వదేశీ, బహిష్కరణ ఉద్యమాలను బెంగాలు నుండి దేశంలోని మిగతా భాగాలకు కూడ విస్తరింపజేయాలనే వాళ్లు. క్రమేపీ బహిష్కరణ ఉద్యమాన్ని విదేశీ వస్తువులకే పరిమితం చేయక వలస ప్రభుత్వానికి చెందిన ప్రతి సంబంధానికీ లేదా తోడ్పాటుకూ విస్తరింపజేయాలన్నది వాళ్ల కోరిక. మితవాదులు మాత్రం బహిష్కరణ ఉద్యమాన్ని బెంగాలుకే పరిమితం చేయాలన్నారు. దానిని ప్రభుత్వ కార్యకలాపాలకు విస్తరింపజేసే విషయాన్ని పూర్తిగా వ్యతిరేకించారు.

1906 కలకత్తా కాంగ్రెసు సందర్భంగా అధ్యక్షుని ఎంపిక విషయంలో సంగతులన్నీ అవగతమయ్యాయి. జాతీయవాదులందరికీ ఆమోదయోగ్యుడైన గొప్ప దేశభక్తుడు దాదాభాయి నౌరోజీని ఎంపిక చేసుకోవటంతో చీలిక నివారించబడింది. నాలుగు రాజీ తీర్మానాలు - స్వదేశీ, బహిష్కరణ, జాతీయ విద్య, స్వయంపాలన అంశాలపై ఆమోదించబడినాయి. 1907వ సంవత్సరమంతా ఇరువర్గాలు నాలుగు తీర్మానాలపై భిన్న వ్యాఖ్యలతో సతమతమయ్యారు. 1907వ సంవత్సరాంతానికి వాళ్లు ఒకళ్ల నొకళ్లు ప్రధాన రాజకీయ శత్రువులుగా చూచుకోసాగారు. ప్రజలు చైతన్య వంతులయ్యారు గనుక స్వాతంత్ర్య సమరానికి రంగం సిద్ధమయినట్లేననే దృఢసంకల్పానికి వచ్చారు తీవ్రవాదులు. ఒక ఊపు ఊపేందుకు అదే తగిన సమయమని భావించే తీవ్రవాదులకు మితవాదులు ఉద్యమానికి పెద్ద ఆటంకంగా కన్పించసాగారు. వాళ్లల్లో ఎక్కువ మంది అరవింద ఘోష్ నాయకత్వంలో యిక మితవాదులతో తెగదెంపులు చేసుకునేందుకు తగిన సమయం రానే వచ్చిందనుకున్నారు. కాంగ్రెసు నాయకత్వం నుండి వాళ్లను నెట్టివేయాలనుకున్నారు. ఒక వేళ మితవాదుల్ని పదవీచ్యుతుల్ని చేయజాలని పక్షంలో సంస్థను రెండుగా చీల్చాలనుకున్నారు.

ఫిరోజ్‌షా నాయకత్వంలోని మితవాదుల్లోని అధిక సంఖ్యాకులు చీలిక విషయంలో తక్కువ తిన్నదేమీలేదు. ఇక తీవ్రవాదులతో కలిసి పనిచేయటమంటే సుడిగుండంలోకి లాగబడినట్లేనని భావించారు. గత ఇరవై సంవత్సరాలుగా జాగ్రత్తగా అభివృద్ధి పరచుకుంటూ వచ్చిన కాంగ్రెసు ఛిన్నాభిన్నమై పోతుందని భయపడసాగారు. పెద్ద ఎత్తున తలపెట్టే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని దేన్నయినా అణచివేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పుడు ముందుగానే అణచివేతను ఆహ్వానించటమెందుకు? 1907లో గోఖలే చెప్పినట్లు 'మీరు (తీవ్రవాదులు) ప్రభుత్వం వెనుక వున్న అపారమైన శక్తిని గుర్తించటం లేదు. మీ సలహా ప్రకారం కాంగ్రెసు ఏదయినా చేయ తలపెడితే దానిని భగ్నం చేసేందుకు ప్రభుత్వానికి ఐదు నిమిషాలు కూడ పట్టదు'. మింటో, మోర్లేలు ఉజ్వల భవిష్యత్తుకు ఆశలు రేపుతున్నారు. మితవాదుల్లో చాలా మంది భారతీయులు రాజకీయ, పరిపాలనాపరమైన అధికారాలను పంచుకోవాలనుకునే కల సాకారం కాబోతున్నదని భావించసాగారు. తీవ్రవాదుల వత్తిడివల్ల కాంగ్రెసు ఏమాత్రం తొందరపాటు చర్యకు పాల్పడినా బ్రిటన్‌లో అధికారంలో వున్న లిబరల్స్‌ను చికాకుపర్చగలదు. ఇంకా సమయం ఉంది గనుక ఈ తీవ్రవాదుల్ని వదిలించుకుంటే పోలేదా అనుకున్నారు.

ఫిరోజ్‌షా మెహతా ఆలోచనా ధారను వ్యక్తపరిచే విధంగా హెచ్.ఏ. వాద్య తన రచనలో తీవ్రవాదుల్ని 'మన కృషిలో అత్యంత పనికిమాలిన శత్రువులు' అంటూ తూలనాడుతూ, 'కాంగ్రెసుతో వీళ్ల కలయిక మంచి శరీరానికి రోగగ్రస్తమయిన అవయవాన్ని కలిగివుండటం వంటిది. రక్తం విషమెక్కి చనిపోకుండా కాంగ్రెసును రక్షించుకోదలిస్తే శస్త్ర చికిత్స ఒక్కటే శరణ్యం అన్నాడు.[8]

అటు జాతీయ వాద దృక్కోణం నుండి గాని, యిటు వాళ్ల ముఠాతత్వం నుండి గాని ఎటు నుండి చూచినా అది రెండు విధాలా తప్పిదమే, వలస ప్రభుత్వం వాళ్లతో మంతనాలు జరపటం తీవ్రవాదుల భయంవల్లనే కాని వాళ్లలోని సహజ సిద్ధమైన రాజకీయ బలం వల్ల కాదని మితవాదులు గ్రహించలేకపోయారు. అదే విధంగా మితవాదులు తమకు బయటి రక్షక వలయంగా (పౌరహక్కులు వంటి విషయాల్లో) వున్నారనీ, వలస ప్రభుత్వ రథ చక్రాల క్రింద పడి చితికిపోకుండా తట్టుకునేంత శక్తి తమకు లేదనే విషయాన్ని తీవ్రవాదులు గుర్తించలేకపోయారు. సామ్రాజ్యవాద పాలనలో వున్న భారతదేశం వంటి సువిశాల దేశంలో ఒక విశాల ప్రాతిపదికపై నిర్వహింపబడే సంఘటిత

ఉద్యమమే ఏదయినా సాధించగలదనే విషయాన్ని యిరువురూ విస్మరించారు. కనుక పొంచివున్న ప్రమాదాన్ని మొత్తం నాయకత్వం పసిగట్టలేకపోయిందని అనుకోరాదు. రెండు వర్గాల్లోని ప్రముఖ ప్రజానాయకులు తిలక్ (తీవ్రవాది) గోఖలే (మితవాది)లు జాతీయవాద వర్గాల్లోని చీలికవల్ల రానున్న ప్రమాదాన్ని చక్కగానే అంచనా వేయగల పరిపక్వ రాజకీయవేత్తలే. సంఘటిత జాతీయవాద కూటమి బదాబదలు కావటం తిలక్ కోరుకోవటం లేదు. ఆ తరుణంలో ఒక శక్తిమంతమైన ఉద్యమ నిర్మాణం జరగాలన్నా, రాజకీయ డిమాండ్ల కోసం పాలకులపై వత్తిడి పెరగాలన్నా విభిన్న రాజకీయ ధోరణులు సంఘటితం కావలసిన అవసరాన్ని ఆయన గుర్తించాడు. అయితే తన రాజకీయ దృక్పథానికి ప్రజా బలాన్ని అధికంగా సమీకరింపజేసుకొని పరిష్కార మార్గం కనుగొనే దిశలో మితవాదులపై వత్తిడి తేవాలన్నది తన పథకం. మహారాష్ట్రలో తన అనుయాయుల్ని ఉత్తేజపరిచి, బెంగాలులోని మరింత తీవ్రవాద శక్తులతో ముందుకు నెట్టబడి, తాను స్వారీ చేసే పెద్దపులి నుండి దిగటం సాధ్యపడలేదు. తుది నిర్ణయం తీసుకోబోయే సమయానికి ఆయన మరింత తీవ్రవాద నాయకులైన అరబింద ఘోష్ వంటి వారిని అనుసరించాల్సి వచ్చేది.

జాతీయ వాద శ్రేణుల్లో చీలికల వల్ల కలగబోయే ప్రమాదాన్ని గోఖలే గమనించి దానిని నివారించే ప్రయత్నం చేసాడు. 1907 అక్టోబరులో తన స్నేహితునికి యిలా వ్రాస్తాడు: 'చీలికవచ్చిందంటే అది పెను విపత్తే. అధికారగణం ఇరు వర్గాలను సునాయాసంగా పడగొడ్తుంది.'[9] అయితే ఫిరోజ్‌షా మెహతా వంటి బుద్ధిపూర్వక నిరంకుశుణ్ణి ఎదుర్కోగలిగినంతటి వ్యక్తిత్వం కాదు గోఖలేది. సహ తీవ్రవాదుల మొట్టికాయల్ని ఈయనా రుచిచూచిన వాడే.

తపతీనదీ తీరంలో సూరత్‌లో 1907 డిసెంబరు 26న కాంగ్రెసు మహాసభ జరిగింది. కలకత్తా నాలుగు తీర్మానాలను మితవాదులు నీరుగార్చబోతున్నారనే పుకార్లకు తీవ్రవాదులు ఉద్రిక్తులయ్యారు. గత మూడు రోజులుగా సూరత్ మహాసభల్లో తమపై గుమ్మరించిన వ్యంగ్యానికీ, విషానికీ మితవాదులు బాగానొచ్చుకున్నారు. అటువంటి ఉద్రిక్త, కోపగ్రస్త వాతావరణంలో ప్రతినిధులు సమావేశమై ఉన్నారు.

నాలుగు తీర్మానాలు ఆమోదించబడతాయనే హామీని తీవ్రవాదులు కోరారు. మితవాదుల్ని అలా ఒప్పించేందుకు వత్తిడిని పెంచే చర్యగా కొత్తగా ఆ సంవత్సరానికి అధ్యక్షునిగా ఎన్నుకో బడిన రాస్ బిహారీ ఘోష్‌కు ఎదురు తిరిగేందుకు నిర్ణయించుకున్నారు.

ఇరుపక్షాలు ఘర్షణకు సిద్ధపడే సభకు హాజరయ్యారు. క్షణంలోనే 1600 మంది ప్రతినిధులు కేకలు పెడుతూ, ముష్టియుద్ధానికి తలపడి, చివరకు ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకోసాగారు. ఇంతలో ఓ అజ్ఞాత వ్యక్తి వేదికపైకి విసిరిన పాదరక్ష ఫిరోజ్‌షా మెహతాను, సురేంద్రనాథ్ బెనర్జీని తాకింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి సభాస్థలిని నిర్మానుష్యం గావించారు. అలా ఆ కాంగ్రెసు సభలు ముగిసాయి. గెలిచింది మాత్రం ప్రభుత్వమే. మింటో వెంటనే మోర్లేకు వ్రాసాడు – 'సూరత్‌లో కాంగ్రెసు పతనం మనకు ఘన విజయం'.[10]

పొంచివున్న ప్రమాదాన్ని గమనించిన తిలక్ దాన్ని నిరోధించేందుకు కడసారి ప్రయత్నం చేయసాగాడు. కాని తన అనుయాయుల మధ్య తాను నిస్సహాయుడయ్యాడు. ఆ సంఘటనల్లో తీవ్రవాదుల పక్షాన పాలుపంచుకున్న లజపతిరాయ్ తరువాత వ్రాసిందేమంటే – 'ఆయన (తిలక్) తన పార్టీని నడిపించే బదులు తానే ఆపార్టీ దుష్ట శక్తులచే నడిపించబడినాడు. సూరత్‌లో నాకోరిక మేరకు డా॥ రాస్‌బిహారీ ఘోష్ ఎన్నికకు వ్యతిరేకతను తొలగించేందుకూ, కలకత్తా నాలుగు తీర్మానాల విషయం సబ్జెక్ట్సు కమిటీకి నివేదించేందుకూ రెండు పర్యాయాలు అంగీకరించాడే గాని నేను అక్కడి నుండి రాగానే తన చుట్టూ ఆవరించిన అభిప్రాయాల గూటిలో చిక్కుకున్న కారణంగా నిస్సహాయుడిగా నిలిచిపోయాడు.'[11]

సూరత్ భంగపాటు అలా ఆకస్మికంగా జరగటం తిలక్‌ను దిగ్భ్రాంతిని గురిచేసింది. ఆయన దానిని గురించి చర్చించక పోవటానికి కారణం తరువాత రోజుల్లో అరవింద ఘోష్ వ్రాసినట్లు – తిలక్ చీలికను ఒక 'ఘోర విపత్తు'గా భావించాడు. 'ఒక ఘనమైన జాతీయ వాస్తవికతకు, సాధించని సాధ్యతలకు'[12] ఆలవాలమైన సంస్థగా కాంగ్రెసుకు ఆయన విలువనిచ్చాడు. జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు యిప్పుడు ప్రయత్నించసాగాడు. జరిగిన దానికి విచారాన్ని వ్యక్తం చేస్తూ, రాస్ బిహారీ ఘోష్‌ను అధ్యక్షునిగా అంగీకరిస్తూ, కాంగ్రెసు ఐక్యతకు తన సహకారాన్ని ప్రకటిస్తూ తన ప్రత్యర్థులకు ఒక లేఖ వ్రాసాడు. అయితే ఫిరోజ్‌షా మెహతాకు,ఆయన అనుయాయులకు జాలికలుగలేదు. వాళ్లు వికెట్ పడితీరుతుందనే సంబరంలో ఉన్నారు. ఇంతలో ప్రభుత్వం వెంటనే తీవ్రవాదులపై విరుచుకు పడింది. తీవ్రవాద పత్రికల్ని రాచిరంపాన పెట్టింది. వాళ్ల ప్రముఖ నాయకుడు తిలక్‌కు మాండలే జైలులో ఆరేళ్లపాటు నిర్బంధం విధించింది. వాళ్ల మౌలిక సిద్ధాంతకర్త అరవిందఘోష్ ఒక విప్లవ కుట్ర కేసులో యిరికించబడి

నిర్దోషిగా ప్రకటింపబడిందే తడవుగా రాజకీయాలను వదిలేసి ధార్మిక జీవనం గడిపేందుకు పాండిచేరికి వలస బోయాడు. బిపిన్‌చంద్రపాల్ తాత్కాలికంగా రాజకీయాల నుండి విరమించుకున్నాడు. సూరత్‌లో నిస్సహాయ ప్రేక్షకుడుగా నిలిచిన లాలా లజపతిరాయ్ 1908లో బ్రిటన్ వెళ్లి, 1909లో తిరిగి వచ్చి మళ్లీ కొంత కాలం అమెరికాలో గడిపేందుకు వెళ్లాడు. తీవ్రవాదులు శక్తి మంతమైన ప్రత్యామ్నాయ పార్టీని ఏర్పాటు చేసుకోలేక పోయారు. ఉద్యమాన్నీ నిలబెట్టుకోలేకపోయారు. తాత్కాలికమే అయినా విజయం ప్రభుత్వానిదే.

మితవాదులు వాళ్ల తెలివితక్కువ విశ్వాసాలలో మునిగి తేలుతూనే వున్నారు. బెనారస్, కలకత్తా కాంగ్రెసు మహాసభల్లో రూపొందించిన మౌలిక చర్యలనన్నింటినీ తుంగలో దొక్కారు. తీవ్రవాదుల నుండి ఐక్యత కొరకు చేసిన ప్రయత్నాలనన్నింటినీ కాలదన్ని వాళ్లను పార్టీ నుండి బహిష్కరించారు. ఫిరోజ్‌షా మెహతా చెప్పినట్లు వాళ్లు ' 'పునరుత్తేజంతో, జీర్ణోద్ధరణ తలంపుతో, ఆత్మావిష్కారంతో కాంగ్రెసును' పునర్నిర్మిస్తున్నట్లు భావించసాగారు. అయితే కాంగ్రెసులోని ఉత్సాహం ఆవిరై పోయింది. దానిని నిలబెట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మితవాదులు భారతీయుల్లోని రాజకీయవేత్తల, మరీ ముఖ్యంగా యువకుల మద్దతును, గౌరవాన్నీ కోల్పోయి ఒక చిన్న కోటరీ (ముఠా)గా మిగిలి పోయారు. మితవాద నాయకుల్లో ఎక్కువ మంది మెల్లగా జారుకున్నారు. గోఖలే ఒక్కడే తడబడే నడక సాగించింది. అదీ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలోని సహ కార్యకర్తలైన కొద్దిమంది సహాయంతో. రాజకీయ స్పృహగల భారతీయుల్లో ఎక్కువ మంది తమ మద్దతును, అదెంతటి క్రియా రహితమైన ధైనాసరే, లోకమాన్య తిలక్‌కు, సమరశీల జాతీయవాదులకు అందించారు.

1908 తరువాత జాతీయ ఉద్యమం పూర్తిగా అణగారింది. 1909లో అరబింద ఘోష్ మార్పును యిలా గుర్తించాడు. 'నేను జైలుకు వెళ్లినప్పుడు దేశం యావత్తూ వందేమాతరమ్ అని నినదిస్తూ జీవంతో తొణికిసలాడింది, అవమానాల్నుండి బయటపడాలనుకునే లక్షలాది మంది ప్రజలు ఒక జాతిగా మనాలనుకునే ఆశ అది. నేను జైలు నుండి బయటకు రాగానే ఆ నినాదం వినాలను కున్నాను. కానీ నిశ్శబ్దం ఎదురయ్యింది. దేశంపై ఏదో రహస్య ఛాయ అలముకొంది.[13] ఉద్యమ అభివృద్ధికి అడ్డుకట్ట పడినా, ప్రేరేపింపబడిన జాతీయ భావనలు సమసిపోలేదు. ప్రజ మరోదశ

కోసం ఎదురుచూస్తోంది. 1914లో తిలక్ విడుదలైన తరువాత ఉద్యమ పగ్గాలు పట్టుకున్నాడు.

* * *

1909 నాటి 'రాజ్యాంగ' సంస్కరణలతో మితవాదులేమిటి దేశం మొత్తం నిరాశ చెందింది. 1909 నాటి ఇండియన్ కౌన్సిల్ చట్టం ప్రకారం ఎన్నుకునే అభ్యర్థుల సంఖ్య ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లోనూ, ప్రొవిన్షియల్ లెజిస్లేటివ్ కౌన్సిళ్లలోనూ పెరిగింది. కౌన్సిళ్లకు ఎన్నుకోబడే సభ్యుల్లో అత్యధికులు పరోక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకోబడుతున్నారు. గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు ఒక భారతీయుణ్ణి నియమించ వలసి వుంది. ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు చెందిన అరవై ఎనిమిది మంది సభ్యుల్లో ముప్పయ్యారు గురు అధికారులు, ఐదుగురు నామినేట్ చేయబడిన అనధికార సభ్యులు. ఎన్నుకోబడే ఇరవయ్యేడు మందిలో బడా భూస్వాములు ఆరుగురిని ఎన్నుకుంటే బ్రిటీషు పెట్టుబడిదారులు ఇరువుర్ని ఎన్నుకుంటారు. చట్టం సభ్యులకు తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు అవకాశాన్ని కల్పించింది. ప్రశ్నలు వేసే అవకాశాన్ని కూడా కల్పించి వాళ్ల శక్తిని పెంచింది. ప్రత్యేక బడ్జెట్ అంశాలపై ఓటు హక్కును కూడా అనుమతించింది. అయినా సంస్కరింపబడిన ఆ కౌన్సిళ్లు యింకా అధికార సమృద్ధాలు కాక కేవలం సలహా సంఘాలుగానే మిగిలిపోయాయి. వాటిలో ప్రజాస్వామ్యానికి గానీ, స్వయం పాలనకు గానీ తావులేదు. అప్రజాస్వామిక, విదేశీయ, దోపిడీ విధానపు బ్రిటీషు పాలనా స్వభావం చెక్కు చెదరలేదు.

మోర్లే పార్లమెంటులో బహిరంగంగానే యిలా ప్రకటించాడు: ఈ విధమైన సంస్కరణలు ప్రత్యక్షంగా లేదా విధిగా భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్థాపనకు దారితీయగలవనేట్లయితే వాటితో నాకెలాంటి సంబంధం వుండదు.'[14]

మింటో – మోర్లే సంస్కరణల అసలు ప్రయోజనం జాతీయ వాద శ్రేణుల్లో చీలిక తేవటం, ముస్లిం మతవాదానికి మద్దతు పలికి భారతీయుల్లో పెరుగుతున్న సంఘటిత శక్తికి అడ్డుకట్ట వేయటమున్నూ. ఈ రెండవ ప్రయోజనం ఒనగూడేట్లు చూచేందుకు ముస్లిములకు కేటాయించబడిన నియోజకవర్గాల్లో కేవలం ముస్లిములే వాళ్ల అభ్యర్థుల్ని ఎన్నుకునేట్లు సంస్కరణలు తెచ్చారు. హిందువుల, ముస్లిముల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాలు ఒకటిగా కాక వేర్వేరుగా ఉంటాయనే

భావనకు ప్రోద్బలం కలిగించేందుకే అలా చేసారు. వేర్వేరు నియోజక వర్గాల స్థాపనే తరువాత సంవత్సరాలలో చేదు పండ్లను అందించే విష వృక్షాలుగా రూపొందాయి.

* * *

1907వ సంవత్సరాంతం మరో రాజకీయ ధోరణిని ముందుకుతెచ్చింది. అసహనంగా వున్న బెంగాలు యువత వ్యక్తిగత వీరత్వ పథంలో పయనిస్తూ సమరశీల ఉగ్రవాదం వైపుకు మళ్లారు. వాళ్లకు దేశ భక్తిని చాటుకొనేందుకు మరో దారి కన్పించకపోవటంతో మరీ ముఖ్యంగా వాళ్లలా చేయవలసి వచ్చింది. ఇక్కడ మళ్లా మనం గతంలోని వాస్తవాలనే గుర్తుకు తెచ్చుకోవాల్సి ఉంది. బెంగాలు యువత అధికారుల దౌర్జన్యం, అణచివేత కార్యకలాపాల వల్లనూ, మితవాదుల యాచక ప్రవృత్తి వల్లనూ కోపోద్రిక్తులు కావటమే గాకుండా, తీవ్ర వాదులు 'బాంబు రాజకీయాల' వైపుకు లాగటంతో ప్రజలకుసానుకూల నాయకత్వం లేకుండా పోయింది. తీవ్రవాదులు మితవాదుల్ని తీక్షణంగా, సజావుగా, ఫలవంతంగా విమర్శించారు. ప్రజల కర్తవ్యానికి వాళ్లు సవ్యంగానే ప్రాధాన్యతను సంతరింపజేసి, ప్రచారం, ఆందోళనలను మించి కార్యక్రమాలను చేపట్టవలసిన అవసరాన్ని గుర్తించారు. ప్రభుత్వాన్ని నిరంతర ప్రతిఘటనలతో ఢీకొట్టే చర్యల్ని బలపరుస్తూ, విదేశీ వస్త్ర బహిష్కరణ, విదేశీ విద్య, కోర్టులు వగైరాలను విడనాడటం వంటి సమరశీల కార్యక్రమాన్ని ముందుకు తెచ్చారు. యువకుల నుండి వాళ్లు ఆత్మత్యాగాలను కోరటం జరిగింది. వాళ్లు ప్రత్యక్ష చర్యను గురించి మాట్లాడటం వ్రాయటం జరిగింది.

అయితే ఈ ఆలోచనలన్నింటికీ కార్యరూపం ధరింపజేయటంలో వాళ్లు కృతకృత్యులు కాలేకపోయారు. వాళ్లు తగిన రీతిలో ఉద్యమాన్ని నడపగల స్వయం పోషక సంస్థనూ నెలకొల్పలేకపోయారు, మితవాదులకు భిన్నమైన పద్ధతిలో ఉద్యమాన్ని సరిగా నిర్వచించలేక పోయారు. వాళ్లు మిక్కిలి సమరశీలంగా ఉండేవాళ్లు. బ్రిటీషు ప్రభుత్వం పట్ల వాళ్ల విమర్శలు పరుషంగా వుండేవి. పెద్ద పెద్ద బాధల్ని భరించేందుకు, త్యాగాలకు సిద్ధంగా వుండేవాళ్లు. అయితే మహోద్యమానికి మించి మరేం చేయాలో వాళ్లకు తెలియదు. సరికొత్త రాజకీయ పోరాటాలను గాని, ప్రజోద్యమాలను గాని ప్రజల ముందుంచలేకపోయారు. అందువల్ల 1907 ఆసాంతానికి వాళ్లు రాజకీయంగా ముందుకు పోలేని స్థితికి చేరుకున్నారు. మితవాదుల్ని విమర్శించటానికి కాంగ్రెసును

కైవసం చేసుకోవాలను కోవటానికి బహుశా అదొక కారణం అయ్యుండొచ్చు. బల ప్రదర్శనకు పూనుకున్న యువతకు తీవ్రవాదుల గమ్యం లేని విధానాలు నచ్చక పోవటంలో విడ్డూరమేమీలేదు. 1906 లో యువత ఈ పెదవి విరుపును ప్రతిబింబిస్తూ 'యుగాంతర్' అనే వార్తా పత్రిక యిలా పేర్కొంది: 'భారతదేశంలో నివసించే ముప్పయి కోట్ల ప్రజల అణచివేత శాపవిమోచనం కోసం అరవై కోట్ల చేతులు ఎత్తాల్సి ఉంది. సత్తాకు సత్తాయే సరైన విరుగుడు.[15]

అయితే సత్తాపై ఆధారపడే ఉద్యమం ఏరూపు దాల్చబోతున్నదనేది తేలవలసినప్రశ్న. ప్రజానురంజక ఉద్యమ నిర్వహణ అన్నది చాలా కష్ట సాధ్యమై నిరంతర కృషిని చిరకాలం కోరుకుంటుంది. సైన్యపు విధేయతను ఛేదించేందుకు ప్రయత్నించాలని చాలా మంది భావించారు గాని అది అంత తేలికైన విషయం కాదనేది వారికి తెలుసు. ఏది ఏమయినా ఆ రెండు లక్ష్యాలను చాలా కాలం పట్టే లక్ష్యాలుగా నిర్ణయించి తక్షణ చర్యగా సమరశీల యువత ఐరిష్ జాతీయవాదులవో, రష్యన్ నిహిలిస్టులవో, పాప్యులిస్టులవో పద్ధతులు కొన్ని అనుకరించాలనే నిర్ణయానికి వచ్చారు. అంటే ప్రజాకంటకులైన బ్రిటీషు అధికారుల్ని మట్టుబెట్టాలనే నిర్ణయానికి వచ్చారన్న మాట. అటువంటి హత్యలు పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాయనీ, ప్రజల్లో దేశ భక్తిని రేకెత్తిస్తాయనీ, అధికారం పట్ల భీతిని వాళ్ల హృదయాలనుండి తొలగిస్తాయనీ భావించారు. హత్య గావించిన వాళ్లు పట్టుబడితే ప్రతి హత్యలో విప్లవవాదులకు వ్యతిరేకంగా నడిచే కోర్టు కేసు 'చేతల్లో ప్రచారం'గా నిలుస్తుందని భావించారు. ఈ విధమైన పోరాటం జీవితాల్ని పణం పెట్టగల యువకుల్ని అధిక సంఖ్యలో కోరుకుంటుంది. ఇంకేం అది యువకుల ఆదర్శవాదానికి ఆహ్లాదాన్ని చేకూర్చింది. అది వాళ్లలోని అవ్యక్త ధైర్య సాహసాలను వెలికి తెచ్చింది. ఈ విధమైన రాజకీయ పోరాటంలో పాల్గొనే యువకుల సంఖ్య స్థిరంగానే పెరగసాగింది.

మళ్లీ యిక్కడకూడ తీవ్రవాద నాయకత్వం యువతను నిరుత్సాహ పరిచింది. యువతలోని ఆత్మత్యాగం, ధైర్య సాహసాలు కొనియాడబడినా వాళ్లలోని విప్లవాత్మక శక్తికి సరైన మార్గాన్ని చూపటం, చర్య ఎంతటి సాహసోపేతమైనా వ్యక్తి గత విప్లవాత్మక ధోరణికీ, ప్రజా కార్యకలాపాల్లోని విప్లవాత్మక ధోరణికీ మధ్య గల వ్యత్యాసాన్ని నాయకత్వం వాళ్లకు వివరించి చెప్పలేక పోయింది. విప్లవవాది అంటే హింసాత్మక చర్యలపై విశ్వాసమున్నవాడు అనే భావనను ఖండించలేక పోయింది. పైగా అరవిందఘోష్ ఆ

భావనను సమర్థించాడు. బహుశా అప్పటికే ప్రభుత్వంచే వేటాడబడి, దండింపబడే సాహసోపేతమైన యువతను రాజకీయంగా విమర్శించటం సబబు కాదని తీవ్రవాద నాయకత్వం మిన్నకున్నదేమో. రాజకీయంగా, ఆదర్శపరంగా యువ విప్లవ వాదులకు ఎదురు చెప్పకుండా ఉపేక్షించటం ఘోర తప్పిదమైంది. అది వ్యక్తిగత ఉగ్రవాద భావ సమ్మిళితమైన విప్లవం బెంగాలులో వేళ్లూనేట్లు చేసింది.

1904లో వీ.డీ. సావర్కర్ 'అభినవ భారత్' అనే రహస్య విప్లవ కారుల సంఘాన్నిస్థాపించాడు. 1905 తరువాత చాలా వార్తా పత్రికలు బాహాటంగా (కొద్ది మంది నాయకులు రహస్యంగా) సమరశీల ఉగ్రవాదాన్ని సమర్థించటం జరిగింది. 1907లో బెంగాలు లెఫ్టినెంట్ గవర్నరు హత్యకు విఫలయత్నం జరిగింది. 1908 ఏప్రియల్‌లో ప్రపుల్ల ఛాకీ, ఖుదీరామ్‌బోస్ అనే వాళ్లు ముజఫర్‌పూర్‌లో ప్రజలు ఏవగించుకొనే న్యాయాధీశుడు కింగ్స్ ఫోర్డ్ ప్రయాణిస్తున్న వాహనంగా భావించి, దానిపై బాంబు విసిరితే ఇది ఇరువురు ఆంగ్ల వనితల్ని హతమార్చింది. తరువాత ప్రఫుల్ల ఛాకీ తనని తానే కాల్చి చంపుకున్నాడు. ఖుదీరామ్ బోస్‌ను ఉరితీసారు. ఇతని మరణం వేలాది మందిని కన్నీరు పెట్టించింది. ఖుదీరామ్‌బోస్, ప్రఫుల్ల ఛాకీలు జాతీయవాద నాయకుల సరసన జేరి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. దేశమంతటా వారిపై రచించిన జానపద గేయాలు గానం చేయటం జరిగింది.

సమరశీల ఉగ్రవాద యుగం ప్రారంభమయ్యింది. త్వరత్వరగా దేశమంతటా విప్లవవాదుల రహస్య సంఘాలు ఆవిర్భవించాయి. వాటిలో పేరెన్నిక గన్నవి, ఎక్కువ కాలం పనిచేసినవి 'అనుశీలన సమితి', 'జుగాంతర్'. వాళ్ల కార్యకలాపాలు రెండు విధాలుగా నిర్వహింపబడేవి- ఒకటి: పీడించే అధికారుల్నీ, వాళ్లలోనే దేశద్రోహుల్నీ, వాళ్లకు సంబంధించిన సమాచారాన్నందించే దుండగుల్నీ అంతమొందించటం. రెండు: ఆయుధాలు వగైరా సమకూర్చుకునేందుకు నిధుల కోసం దోపిడీలు. ఈ రెండవ తరహాకార్యక్రమాలు 'స్వదేశీ దోపిడీలు'గా ప్రచారంలోకొచ్చాయి. ఆనాటి సమరశీల ఉగ్రవాద చర్యలన్నింట్లోకీ అత్యద్భుతమైన రెండు ఘటనలేవంటే - మొదటిది ప్రభుత్వ ఊరేగింపులో ఏనుగుపై కూర్చున్న వైస్రాయి లార్డ్ హార్డింగ్‌పై రాస్ బిహారీ బోస్ సచిన్ సన్యాల్ నాయకత్వాన అసఫల హత్యాయత్నం. విసిరిన బాంబు వైస్రాయిని గాయపరిచిందేగాని చంపలేక పోయింది. ఇక రెండవది లండన్‌లో మదన్‌లాల్ ధింగ్రా చే కర్జన్ - వైలీ హత్య. 1908 - 1918 మధ్య కాలంలో 186 మంది విప్లవ కారుల్ని

మట్టు బెట్టటం కాని, శిక్షించటంగాని జరిగింది. సమరశీల ఉగ్రవాదులు కూడ విదేశాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. వాళ్లల్లో ప్రముఖులు లండన్‌లోని శ్యామ్‌జీ కృష్ణ వర్మ, వీ. డీ సావర్కర్, హరదయాళ్‌లు; ఐరోపాలో మేడమ్ కామా, అజిత్ సింగ్‌లు.

సమరశీల ఉగ్రవాదం క్రమేణా క్షీణించింది. వ్యక్తిగత విప్లవకారులు చిన్న చిన్న రహస్య ముఠాలుగా ఏర్పడి అద్వితీయ సాహసం ప్రదర్శించినా శక్తిమంతమైన వలస రాజ్యపు అణచివేతను వాళ్లు తట్టుకోలేకపోయారు. వాళ్ల పరిమిత సంఖ్య, వైఫల్యపు పర్యవసానాన్ని అలా ప్రక్కన పెడితే భారతదేశంలో జాతీయవాద ఉన్నతికి వాళ్ల కృషి ఎంతో విలువైనది. ఒక చరిత్రకారుడన్నట్లు 'వాళ్లు మన పురుషత్వాన్ని తిరిగి మనకు అందించారు.

* * *

# 12 ప్రథమ ప్రపంచ సంగ్రామం - భారత జాతీయవాదం - గదర్‌పార్టీ

1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావటంతో దెబ్బతిన్న నాటి నుండి అచేతనంగా పడి వున్న స్వదేశీ ఉద్యమానికి కొత్త ఊపిరి అందినట్లయ్యింది. బ్రిటన్ కష్టాలే భారతదేశానికి అవకాశంగా మారింది. ఉత్తర అమెరికాలో స్థావరం ఏర్పరచుకున్న గదర్ వీరులు, భారతదేశంలోని లోకమాన్య తిలక్, అనిబిసెంట్, వాళ్ల హోంరూల్ సంఘాలు ఆ అవకాశాన్ని రకరకాలుగా దొరకబుచ్చుకొని పలు విధాలుగా విజయాలు సాధించటం జరిగింది.

గదర్‌పార్టీ వారు బల ప్రయోగంతో బ్రిటీషు పాలనను పడగొట్టే ప్రయత్నం చేస్తే హోంరూలు ఉద్యమకారులు స్వరాజ్యసాధనకు దేశవ్యాప్త ఆందోళన చేపట్టారు.

* * *

1904 నుండి ఉత్తర అమెరికాలోని పశ్చిమ తీరం క్రమంగా పెరుగుతున్న ప్రవాస పంజాబీలకు అవాసమయ్యింది. వాళ్లల్లో చాలా మంది భూవసతి లేక పంజాబులోని జలంధర్, హోషియార్‌పూర్ జిల్లాల నుండి ఏదో విధమైన జీవనమార్గం వెతుక్కుంటూ వచ్చిన రైతుకుటుంబాల వాళ్లే. కొందరు సరాసరి పంజాబులోని వాళ్ల గ్రామాల నుండి తరలివస్తే మరికొందరు అంతకు ముందు మలయా, ఫిజీ ప్రాంతాలకు పని వెతుక్కుంటూ వెళ్లి తరువాత పశ్చిమతీరానికి చేరుకున్న వాళ్లు. వాళ్లలో చాలా మంది మాజీసైనికులు బ్రిటిషు ఇండియా సైన్యంలో పనిచేస్తుండగా వాళ్లు దూర తీరాలకు వెళ్లి అక్కడ జీవనోపాధికి గల అవకాశాలతో పరిచయం

ఉన్నటువంటి వాళ్లు. ఆర్థిక యిబ్బందుల కారణంగా ఇళ్లూ, వాకిళ్లూ వదలి, వాళ్లకూ, వాళ్ల సంతానానికీ సమృద్ధ జీవనం కోసం ఉవ్విళ్లూరుతూ స్వంత భూముల్ని అమ్మివేసో, తాకట్టుపెట్టో, సామాను కుదువపెట్టో ఆశలు రేపే తావులకు తరలివెళ్లారు. ప్రయాణంలో అలసిసొలసి కెనడా, అమెరికాలకు చేరిన ప్రవాసులకు వాళ్లు ఆశించిన విధంగా స్వాగతం లభించలేదు. చాలా మందికి ప్రవేశం నిరాకరించబడింది. మరీముఖ్యంగా ఎవరయితే సరాసరి గ్రామాల నుండి వచ్చారో వాళ్లకు పాశ్చాత్య జీవన విధానం, రీతిరివాజుల గూర్చి తెలియదు. కనుక వాళ్ల ప్రవేశాన్ని నిరాకరించారు. ప్రవేశం లభించిన వాళ్లు కూడ జాతి వివక్షకు గురయ్యారు. అంతే కాదు శ్వేతజాతి శ్రామిక వర్గాలకు వాళ్లు పోటీగా నిలుస్తున్నందున వారి ప్రతికూలతను కూడ అనుభవించారు. అక్కడి అమెరికా శ్రామికులు భారతీయుల ప్రవేశానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తే ఓట్ల కోసం ఎదురు చూసే రాజకీయ వర్గాలు వారికి వంతపాడారు.

ఈలోగా అటువంటి వలసలపై ఆంక్షలువిధించమని భారత దేశపు సెక్రటరీ ఆఫ్ స్టేటు కోరటంలో ఆయన కారణాలు ఆయనకున్నాయి. అమెరికాలోని శ్వేత జాతీయులతో భారతీయుల సంపర్కము బ్రిటీషు ప్రతిష్టకు భంగం వాటిల్లజేస్తుందనుకున్నాడు. బ్రిటీషు వాళ్లు బలంవల్ల కాక కేవలం ప్రతిష్ట వల్లనే భారతదేశాన్ని పాలించగలుగుతున్నారనుకున్నాడు. పైగా సామ్యవాద భావజాలంతో ప్రవాస భారతీయుల మనసులు కలుషితం కాగలవనీ, వారు అక్కడ అనుభవించే జాతి వివక్ష భారతదేశంలో జాతీయోద్యమాన్ని పురికొల్పగలదనీ భావించాడు.[1] అన్ని వైపుల నుండి వత్తిడి పెరిగిన కారణంగా 1908లో కెనడాలోకి భారతీయుల వలసలు బాగా కుదించబడినాయి. తారకనాథ్ అనే భారతీయ విద్యార్థి ఉత్తర అమెకారిలోని తొలితరం భారతీయనేతల్లో ఒకడిగా నిలిచి ఓ పత్రిక (ఫ్రీ హిందూస్థాన్) ప్రారంభించాలనుకున్నాడు. బ్రిటీషు ప్రభుత్వం భారతీయుల్ని ఫిజీ వెళ్లి అక్కడి బ్రిటీషు తోటల యజమానులకు ఊడిగం చేసేందుకు ప్రోత్సహిస్తూ ఉత్తర అమెరికా వెళ్లేందుకు యిష్టపడకపోవటానికి కారణం 'స్వేచ్ఛ' వంటి ఆలోచనలు భారతీయులకు అంటుకుంటాయనేదిగా అర్థం చేసుకోగలిగాడు తారకానాథ్.

* * *

ఆతిథ్యదేశాల్లో వివక్షతో కూడిన విధానాలు త్వరితగతిన భారతదేశంలోని జాతీయ వాదుల్లో ఆకస్మిక రాజకీయ చైతన్యాన్ని రగిల్చింది. 1907 నాటికే పశ్చిమ తీరంలోని

రామనాథపూరి అనే రాజకీయ దేశ బహిష్కృతుడు స్వేచ్ఛపై ఒక కరపత్రాన్ని విడుదల చేసి స్వదేశీ ఉద్యమానికి మద్దతు ప్రకటించాడు. తారకనాథ్‌దాస్ వాంకోవర్‌లో 'ఫ్రీ హిందూస్థాన్' అనే పత్రికను ప్రారంభించి సమరశీల జాతీయవాద భావనలతో నడపసాగాడు. లండన్‌లోని 'ఇండియా హౌస్‌వలె వాంకోవర్‌లో 'స్వదేశసేవక్ హోమ్'ను జి.డి. కుమార్ నిర్వహించసాగాడు. 'స్వదేశ సేవక్' అనే గురుముఖి పత్రికనుప్రారంభించి సాంఘిక సంస్కరణలు ప్రతిపాదించటమే గాక భారతీయ సైనికుల్ని బ్రిటీషు ప్రభుత్వం పైకి ఎదురుదాడికి దిగమని కోరేవాడు. 1910లో తారకనాథ్ దాస్, జీ.డీ.కుమార్‌లు సియాటిల్‌లో యునైటెడ్ ఇండియా హౌస్‌ను స్థాపించి ప్రతి శనివారం ఓ ఇరవయ్యయిదు మంది భారతీయ శ్రామికులకు తమ ప్రసంగాలు వినిపించే వాళ్లు. తరువాత వాళ్లిరువురూ వాంకోవర్‌లో వుండే వీలులేకుండా పోయింది. ప్రధానంగా తీవ్రవాద జాతీయ విద్యార్థులతో కూడిన యునైటెడ్ ఇండియాహౌస్ బృందానికీ, ఖాల్యాదివాన్ సొసైటీకి ఘనిష్ట సంబంధాలు ఏర్పడ్డాయి. 1913లో వాళ్లు లండన్‌లోని కలోనియల్ సెక్రటరీని, ఇండియాలో వైస్రాయి యితర అధికారుల్ని కలిసేందుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపేందుకు నిర్ణయం జరిగింది. లండన్‌లో ఆ ప్రతినిధి వర్గం నెల రోజులు వేచి వున్నా కలోనియల్ సెక్రటరీని కలిసేందుకు అవకాశం లభించలేదు. అయితే భారతదేశంలో మాత్రం వాళ్లు వైస్రాయిని, పంజాబు లెఫ్టినెంట్ గవర్నరును కలుసుకోవటంలో కృతకృత్యులయ్యారు. అయితే వాళ్ల రాకను పురస్కరించుకొని లాహోర్, లూధియానా, అంబాలా, ఫిరోజ్‌పూర్, జలంధర్, అమృత్‌సర్, లైల్‌పూర్, గుజ్రన్‌వాలా,సియాల్‌కోట, సిమ్లాలలో వరుసగా బహిరంగ సభలు ఏర్పాటు చేయగా వాళ్లకు పత్రికల ద్వారా,సాధారణ ప్రజల నుండి లభించిన ఉత్సాహపూరిత మద్దతే అధికం.

కెనడాలోను, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనూ కొనసాగిస్తున్న నిరంతర పోరాట ఫలితంగా అక్కడకు వలస వెళ్లిన భారతీయుల్లో జాతీయతా స్పృహ, ఐక్యతా భావన ఒనగూడింది. భారత ప్రభుత్వంగానీ, బ్రిటీషు ప్రభుత్వంగానీ, వాళ్ల తరపున జోక్యం చేసుకొని వలస విధానంలోని ఆంక్షల్ని తొలగించేట్లు చూడలేదు. పైగా సంయుక్త రాష్ట్రాల్లో భారతీయులు అక్కడి భూములకు స్వంత దారులు కారాదనే నియమం విషయంలో పట్టించుకొనకపోవటం అసంతృప్తి, అసహనానికి దారితీసి చివరకు అదొక విప్లవోద్యమంగా వికసించింది.

* * *

హాంకాంగ్, మలయాలలో గతంలో పనిచేసిన శిక్కుల పూజారి భగవన్ సింగ్ 1913వ సంవత్సరం ప్రారంభంలో వాంకోవర్ సందర్శించటంతో విప్లవోద్యమం తొలి ఊపందుకుంది. హింసాత్మక మార్గాల ద్వారానే బ్రిటీషు ప్రభుత్వాన్ని కూలదోయవలసి వుందని ఆయన బాహాటంగానే బోధించి వందేమాతరాన్ని విప్లవ వందనంగా స్వీకరించమన్నాడు. మూడు మాసాల వ్యవధిలోనే భగవాన్ సింగ్‌ను కెనడా నుండి తరిమివేసారు.

వెంటనే విప్లవ కార్యకలాపాల కేంద్రం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు తరలి వెళ్లింది. అక్కడి రాజకీయ వాతావరణంలో స్వేచ్ఛ పాలు కొంత మెరుగు, భారతదేశంనుండి రాజకీయ పరమైన దేశ బహిష్కృతుడు లాలా హరదయాళ్ కీలక పాత్ర పోషించవలసి వచ్చింది. ఏప్రియల్ 1911లో కాలిఫోర్నియా చేరిన హరదయాళ్ కొద్దికాలం స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బోధనా వృత్తిని స్వీకరించి వెంటనే రాజకీయ కార్యకలాపాల్లో మునిగిపోయాడు. 1912 వేసవిలో అమెరికాలోని అనేక మేధావుల,విప్లవకారుల, శ్రామికుల సముదాయాలకు ఆయన వినిపించిన ప్రసంగాలు ప్రధానంగా ప్రభుత్వమే ఉండరాదనే అరాచక వాదంపైనా, ఉత్పత్తి సాధనాలన్నీకార్మిక సంఘాల యాజమాన్యంలోనే నిర్వహింపబడాలనే వాదంపైనా కేంద్రీకరింపబడినవేగాని భారతదేశం నుండి వలస వచ్చిన వారిని యిబ్బందిపెట్టే సమస్యల గురించి కాదు. అయితే ఢిల్లీలోని వైస్రాయి లార్డ్ హార్డింగ్‌పై 1912,డిసెంబరు 23న జరిగిన బాంబు దాడి తన ఊహాజనిత భావనను ఉత్తేజపరిచి తనలో నిద్రాణమై వున్న భారత సమరశీల తత్వాన్ని తట్టిలేపింది. భారతదేశంలోని బ్రిటీషు ప్రభుత్వాన్ని విప్లవం ద్వారా పడగొట్ట వచ్చునే తన విశ్వాసం పునరుద్ధరించబడి వైస్రాయిపై బాంబుదాడిని పొగుడుతూ ఆయన యుగాంతర్ కరపత్రం విడుదలచేశారు.

ఈలోగా అమెరికాలోని పశ్చిమ తీరంలో ఆవాసం ఏర్పరచుకొన్న భారతీయులు ఓ నాయకుని కోసం అన్వేషణలో వున్నారు. 1907లో పంజాబు తిరుగుబాటులో పేరొందిన అజిత్‌సింగ్‌ను ఆహ్వానించాలనుకున్నారు. అయితే హరదయాళ్ అక్కడే వుండటం, 1912 డిసెంబరు తరువాత రాజకీయాల్లో క్రియాశీలపాత్ర నిర్వహించటంతో నాయకుని కోసం వెతకవలసిన పనిలేకుండా పోయింది. 1913 మే మాసంలో పోర్ట్‌లాండ్‌లో హిందీ సంఘం స్థాపించబడింది.

కాన్షీరామ్ నివాసంలో నిర్వహింపబడిన ఆ సంఘ ప్రారంభ సమావేశానికి మిగతా వాళ్లతో పాటు భాయి పరమానంద, సోహాన్ సింగ్ భక్నా, హర్నామ్‌సింగ్

తుందీలత్ వగైరాలు హాజరయ్యారు. ఆ సమావేశంలోనే హరదయాల్ తన కార్య నిర్వాహక ప్రణాళికను ఈ విధంగా వివరించాడు: 'పోరాటం అమెరికన్లపై కాదు. అమెరికాలో లభించే స్వేచ్ఛను సద్వినియోగ పరచుకుంటూ బ్రిటీషు ప్రభుత్వంపై పోరాడాలి. మీరు మీదేశంలో స్వాతంత్ర్యాన్ని సంపాదించ నంతకాలం అమెరికా వాసులు మిమ్మల్ని వాళ్లతో సమానంగా చూడజాలరు. భారతదేశంలో బీదరికానికి, ప్రజల హూందాతనం తగ్గటానికి మూలకారణం బ్రిటీషు పాలనే. కనుక దాన్ని అర్జీలతో కాక సమరశీల సాయుధ పోరాటంతో పడగొట్టాలి. ఈ సందేశాన్ని ప్రజలకు, భారతీయ సైన్యంలోని సిపాయిలకు అందించండి. పెద్ద సంఖ్యలో భారతదేశానికి తరలి వెళ్లండి. వాళ్లందరి మద్దతును కూడగట్టండి. హరదయాళ్ ఆలోచనలు అప్పటికప్పుడే అందరికీ ఆమోదయోగ్యాలయ్యాయి. వెంటనే ఒక కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పాటు చేసారు. 'ది గదర్' అనే వారపత్రికను స్థాపించి ప్రతులను ఉచితంగా పంచాలనుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో 'యుగాంతర్ ఆశ్రమ్' పేరిట కేంద్ర కార్యస్థానాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారు. పలు ప్రాంతాల్లో, పట్టణాల్లో వరుసగా సమావేశాలు నిర్వహించారు. చివరకు ఆస్టోరియాలో జరిగిన ప్రతినిధుల సమావేశంలో పోర్ట్‌లాండ్ తొలి సమావేశపు ప్రతిపాదనల నన్నింటికీ ఆమోద ముద్ర లభించింది. అలా గదర్ ఉద్యమం ప్రారంభమయ్యింది.

* * *

గదర్ విప్లవకారులు వెనువెంటనే విస్తృత ప్రాతిపదికన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. పంజాబీ శ్రామికులు పనిచేసే మిల్లులు, పొలాలు, నివసించే ప్రాంతాల్నీ, విస్తృతంగా పర్యటించారు. ఈ రాజకీయ కార్యకర్తలకు యుగాంతర్ ఆశ్రమమే కేంద్ర కార్యాలయం, ఇల్లూ అన్నీ.

1913 నవంబరు 1న ఉర్దూలో గదర్ తొలి సంచిక విడుదలయ్యింది. డిసెంబరు 9న గురుముఖి సంచిక విడుదలయ్యింది. పత్రిక పేరు చూడగానే దాని లక్ష్యమేమిటో యిట్టే తెలిసిపోతుంది. గదర్ అంటే తిరుగుబాటు. తొలిపేజీపైనే కనిపించే 'బ్రిటీషు పాలనకు శత్రువు' అనే ప్రకటనలు యింకా కూస్త కాస్త సందేహాలేవయినా వుంటే పటాపంచలు చేసేవి. ఆ పత్రిక ప్రతి సంచిక పై పుటలోనే 'అంగ్రేజీరాజ్ కా కచ్చా చితా' అంటూ బ్రిటీషు పాలన దుష్ప్రభావాలను ఓ పద్నాలుగింటిని ఏకరువు పెట్టటం జరిగేది. వాటిలో భారతదేశ సంపద కొల్లగొట్టబడటం, భారతీయుల స్వల్ప

తలసరి ఆదాయం, అధికశిస్తుల భారం, వైద్యంపై అత్యల్పంగా ఖర్చుచేస్తూ సైన్యంపై అత్యధికంగా వెచ్చించటం, భారతీయ కళల, పరిశ్రమల విధ్వంసం, లక్షలాది మంది పొట్టన బెట్టుకునే కరువు, ప్లేగు వంటివి మళ్లీ మళ్లీ రావటం, భారతదేశంలో పన్నులు చెల్లించేవాళ్ల డబ్బులు పట్టుకుపోయి ఆఫ్ఘనిస్తాన్, బర్మా, ఈజిప్టు, పర్షియా, చైనాలలో యుద్ధాలపై వెచ్చించటం, స్వదేశీ సంస్థానాలలో సమన్వయలోపం గావించి తమ ప్రభావం ప్రసరింప జేసుకునే బ్రిటీషు విధానం, భారతీయుల్ని హత్యగావించటమో లేక భారతీయ మహిళల్ని అవమానించటమో చేసిన ఆంగ్లేయులపట్ల ఉదాసీన వైఖరి అవలంబించటం, హిందూ ముస్లిముల నుండి వసూలు చేసిన ధనంతో క్రైస్తవ మిషనరీలకు సాయమందించటం, హిందువుల, ముస్లిముల మధ్య వైషమ్యాన్నిపెంచి పోషించటం వంటివి వుండేవి. ఒక్క ముక్కలో చెప్పాలంటే బ్రిటీషుపాలనకు వ్యతిరేకంగా భారత జాతీయ ఉద్యమం రూపొందించిన విమర్శనంతటినీ సంగ్రహంగా వారం వారం గదర్ పత్రిక చదివేవాళ్లకు అందించటం జరిగిందన్న మాట. జాబితాలోని చివరి రెండు విషయాలు పరిష్కారాన్ని సూచించేవిగా ఉన్నాయి. భారతదేశపు స్వతంత్ర రాజ్యాలలోని భారతీయుల జనాభా ఏడుకోట్లు కాగా, బ్రిటీషుపాలనలోని భారతీయుల సంఖ్య 24 కోట్లు కాగా ఆంగ్లేయులైన అధికారులు గాని, సైనికులుగాని 79,614 మంది. స్వచ్ఛంద సేవకులు 38,948 మంది. 1857 తరువాత యాభై ఆరేళ్లు గడిచాయి. ఇప్పుడు వెంటనే యింకో తిరుగుబాటు జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది.

జాబితా సీదా సాదాగా వుండటమే గాకుండా అందించవలసిన సందేశం సావర్కర్ వ్రాసిన ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ - 1857 (1857 నాటి భారత స్వాతంత్ర్య సంగ్రామం) ధారావాహికంగా ప్రచురించిన దానిలో నుండి పాఠకులకు అందేది. గదర్ పత్రికలో లోకమాన్య తిలక్, శ్రీ అరబిందో, వీ.డీ.సావర్కర్, మేడమ్ కామా, శ్యామ్‌జీ కృష్ణవర్మ, అజిత్‌సింగ్, సూఫీ అంబా ప్రసాద్ వంటి వారి రచనలకు సంబంధించిన ప్రస్తావనలుండేవి. అంతేగాక అనుశీలక సమితి, యుగాంతర్ ముఠా,రష్యన్ రహస్య దళాల సాహస కృత్యాల ముఖ్యాంశాలు కూడా ప్రచురించబడేవి.

అయితే గదర్‌లో ప్రచురింపబడే కవితలు చాలా శక్తిమంతమైన ప్రభావాన్నిచూపాయి. అందువల్ల వాటిని 'గదర్ దీగూంజ్' అనే సంకలనంగా ప్రచురించి ఉచితంగా పంచిపెట్టారు. ఆ కవితల్లో మతాతీత భావన ఎంతగా ప్రతిధ్వనించేదో అంతగా విప్లవం పట్ల తపన తీవ్రరూపం దాల్చటం ఈ క్రింది కవితా భాగం పరిశీలిస్తే అవగతమవుతుంది.

హిందూ, శిక్కు, పఠాను, ముస్లిం

సైనికులందరు వినరండహో....

బ్రిటీషు వాళ్లు దోచేస్తుంటే

వాళ్లతో యుద్ధం చెయ్యోద్దామరి

పండిట్, క్వాజీల్ వద్దనేవద్దు

పడవ మునిగితే ప్రమాదముందోయ్

పూజించేందుకు సమయం కాదిది.

కత్తినిదూసి దూకే సమయం.

ఉత్తర అమెరికాలోని భారతీయులు 'గదర్' పత్రికను ఎక్కువగా చదివేవాళ్లు. కొద్ది మాసాల్లోనే అది ఫిలిప్పీన్స్‌లో, హాంకాంగ్, మలయా, చైనా, సింగపూర్, ట్రినిడాడ్, హోండూరస్ ప్రాంతాలలో నివాసముంటున్న భారతీయులకు అందుబాటులోకి వచ్చింది. ఇక భారతదేశం సంగతి ప్రత్యేకించి చెప్పేదేముంది. అది అంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని ప్రతిస్పందన అందజేసింది. ఆ పత్రికలోని విషయాలు చైతన్య భరిత చర్చలకు దారి తీసేవి. అందులోని కవితలు వలస వచ్చిన పంజాబీలు వుండే ప్రాంతాల్లో చదివేవాళ్లు. క్రమేపీ అవి అన్ని ప్రాంతాల్లోనూ బాగా ప్రాచుర్యం పొందాయి.

ఆశ్చర్యపోనవసరం లేకుండానే, అచిరకాలంలోనే పంజాబు నుండి వలస వచ్చిన వాళ్లు బ్రిటీషు రాజ్యంలో వినయ సంపన్నుడైన సైనికుని స్థితి నుండి తన మాతృభూమి నుండి బ్రిటీషు వాళ్లను తరిమికొట్టే తిరుగుబాటుదారు స్థాయికి చేరుకోగలిగాడు. గదర్ పత్రిక కడుజాగ్రత్తగా పంజాబీయులకు వినయసంపన్న మైన తమ గతాన్ని గుర్తు చేస్తూనే, దానిపట్ల సిగ్గుపడేట్లు చేసి అదేమార్గంలో అణచివేతను ప్రతిఘటించటం ఒక సవాలుగా స్వీకరించేట్లు చేసింది.[6]

సింగ్‌పేరుకు భంగమేలరా?

సింహపు దర్జామరచిపోకురా!

దీప్‌సింగ్‌లే వుంటే నేడూ

శిక్కుల కుండవు యీ కష్టాలు

శిక్కుల శక్తి సమసిపోయెనా?
ఢిల్లీ ముట్టడి మిమ్ము మార్చేనా?
తెల్లవాళ్లను తెగటార్చేందుకు
నరాలు పొంగ నినాద మివ్వ
ముప్పది కోట్లకు మించిన మనము
సిగ్గున మునిగి చేతులు ముడుచుకు
కూర్చుందామా? కూర్చుందామా?
భూమి చీల్చుకొని నోరుతెరిస్తే
కట్టగట్టుకొని దూకేద్దామా?

సందేశం చేరవలసిన చోటుకు చేరింది. ఉత్సాహభరిత సమరశీలయువతలో ఏదయినా చర్య చేపట్టాలనే తహతహ. అంతటి ప్రతిస్పందన హరదయాళ్‌నే ఆశ్చర్యంలో ముంచెత్తింది. భారతదేశంలో విప్లవాన్ని నిర్వహించేందుకు ఎంతకాలం పడుతుందన్న విషయంలో ఆయన కొన్నేళ్లనో, పదేళ్ళనో అన్నాడు గాని గదర్ పత్రికలోని కైపెక్కించే ఉద్బోధలు చదివిన వాళ్లు ఓపిక పట్టలేక పోయారు. పదేళ్లంటే ఎక్కువ సమయంగా కన్పించసాగింది.

చివరకు 1914లో గదర్ ఉద్యమాన్ని మూడు ఘటనలు ప్రభావితం చేసాయి. హరదయాళ్‌ను నిర్బంధించగా అతను తప్పించుకుపోవటం, కామగటమారు సంఘటన, మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభం కావటం.

1914 మార్చి 25న అరాచక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడనే అభియోగంపై హరదయాళ్‌ను నిర్బంధించారు గాని దానిలో బ్రిటీషు ప్రభుత్వ జోక్యం తప్పక వుండి వుంటుందనే శంకను ప్రతివాళ్లూ వెలిబుచ్చారు. బెయిలుపై విడుదలై ఆ అవకాశాన్ని ఆ దేశం నుండి పారిపోవటానికి వాడుకున్నాడు. దాంతో గదర్ ఉద్యమంతో తనకున్న క్రియాశీల సాన్నిహిత్యం అర్థంతరంగా నిలిచిపోయింది.

ఈలోగా మార్చి 1914లో 'కామగటమారు' అనే ఓడ కెనడాకు తన దురదృష్టకర ప్రయాణాన్ని ప్రారంభించింది. కొన్ని సంవత్సరాలుగా భారతీయుల వలసలపై కెనడా

చట్టపరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నది. సరాసరి ఇండియా నుండి వచ్చే వాళ్లకు తప్ప మరో విధంగా వచ్చేవాళ్లకు ప్రవేశాన్ని కల్పించటం లేదు. ఈ చర్య బాగానే పనిచేయసాగింది. అలా సరాసరి ప్రయాణాన్ని ఏ నావికా సంస్థ సమకూర్చటం లేదు. అయితే నవంబరు 1913లో కెనడా సుప్రీం కోర్టు సరాసరి భారతదేశంనుండి ప్రయాణం చేయని వారికి ఓ ముప్పయ్యయుదు మంది భారతీయులకు ఆ దేశంలోకి ప్రవేశాన్ని అనుమతించింది. ఈ తీర్పు ప్రోత్సాహంతో గురుదిత్‌సింగ్ అనే సింగపూర్‌లో నివసించే భారతీయ కాంట్రాక్టరు తూర్పు, ఆగ్నేయాసియాలలో పలు ప్రాంతాల్లో నివసించే భారతీయుల్ని వాంకోవర్ చేర్చేందుకు ఓ ఓడను కుదుర్చుకునేందుకు నిర్ణయించుకున్నాడు. 376 మంది భారతీయ ప్రయాణీకులతో ఓడ వాంకోవర్‌కు బయలు దేరింది. గదర్ విప్లవకారులు జపాన్‌లోని యోకోహామా ప్రయాణీకుల్ని పలకరించి, ప్రసంగాలు చేసి కొంత సాహిత్యాన్ని పంచి పెట్టారు. పంజాబులోని పత్రికను, ఆ ఓడలో ప్రయాణించే భారతీయుల ప్రవేశాన్ని కెనడాలో అడ్డుకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించాయి. కెనడా పత్రికలు దానిని మరో కోణం నుండి వెల్లడి చేసాయి. వాంకోవర్‌లోని కొన్ని పత్రికలు 'విజృంభిస్తున్న ప్రాక్‌దండయాత్ర'గా దానిని చిత్రించి వాళ్ల ప్రజల్ని అప్రమత్తం గావించాయి. ఈలోగా కెనడా ప్రభుత్వం నవంబర్‌లో సుప్రీం కోర్టు నిర్ణయానికి దారితీసిన చట్టపరమైన లొసుగుల్ని తొలగించుకుంది. యుద్ధానికి రంగం సిద్ధమయ్యింది.

ఓడ వాంకోవర్ చేరుకోగానే దానిని రేవులోకి చేరుకోనీయక పోలీసులు వ్యూహాత్మకంగా దిగ్బంధించారు. ప్రయాణీకుల హక్కుల పరిరక్షణ కోసం, హుస్సేన్ రహీం, సోహన్‌లాల్‌పాఠక్, బలవంత్‌సింగ్‌ల నాయకత్వాన 'తీర కమిటీ' ఏర్పాటయ్యింది. నిధులు సేకరించారు. నిరసన సభలు నిర్వహించారు. భారతదేశంలోని బ్రిటీషువాళ్లపై పోరాడతామని బెదిరించారు. అమెరికాలో భగవాన్‌సింగ్, బర్కతుల్లా, రామచంద్ర, సోహన్‌సింగ్ భక్నాల నాయకత్వాన శక్తిమంతమైన ప్రచారం నిర్వహింపబడింది. ప్రజలు దాడికి సంసిద్ధులు కావలసిందిగా పిలుపు నివ్వటం జరిగింది.

వెంటనే 'కామగటమారు' కెనడా జలసరిహద్దులకు దూరంగా తరిమివేయబడింది. అది యోకోహామా చేరకముందే ప్రథమ ప్రపంచ మహాసంగ్రామం ప్రారంభమయ్యింది. బ్రిటిష్ ప్రభుత్వం ఆ ఓడలోని ప్రయాణీకులు వాళ్లు ఎక్కిన రేవుల్లో కూడ దిగరాదనీ, ప్రయాణీకులంతా విధిగా కలకత్తాలోనే దిగాలనీ ఉత్తర్వులు జారీ చేసింది. అది మార్గమధ్యంలోని ప్రతిరేవులోనూ అక్కడి భారతీయుల్లో నిరసన భావాన్ని

నిలిపి, కోపాన్ని రేకెత్తించి, బ్రిటీషు వ్యతిరేకతను కూడగట్టసాగింది. విసిగి వేసారి కలకత్తా సమీపంలో ఓడ దిగిన ఆ ప్రయాణీకులు, అధికారుల ప్రతికూల ధోరణికి కోపించి, పోలీసుల చర్యల్ని ప్రతిఘటించారు. ఆ ఘర్షణలో పద్దెనిమిది మంది ప్రయాణీకులు మరణించారు. 202 మందిని అదుపులోకి తీసుకున్నారు. కొద్దిమంది మాత్రం తప్పించుకు పోగలగటంలో కృతకృత్యులయ్యారు.

గదర్ ఉద్యమ సంభావ్యతకు మూడవదీ, ముఖ్యమైనదీ అయిన పరిణామం మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావటం. ఆ అవకాశాన్నే వాళ్లు సద్వినియోగ పర్చుకోవాలని చెప్పటం జరిగింది. నిజమే, వాళ్లు అందుకు సిద్ధంగా లేరు. అందుకని ఆ అవకాశాన్ని అలా జారిపోనివ్వటమేనా? గదర్ ఉద్యమంలోని ప్రముఖులైన క్రియాశీల సభ్యులందరూ ఓ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఆ అవకాశాన్ని జారవిడువరాదనే నిర్ణయానికి వచ్చారు. అప్పుడు వాళ్లేమీ చేయలేకపోయినట్లయితే మరణమే మేలనుకున్నారు. అయితే వాళ్ల శక్తిహీనతంతా వాళ్ల వద్ద ఆయుధాలు లేకపోవటమే. దానిని అధిగమించేందుకు భారతదేశానికి వెళ్లి ఈ మహత్తర కార్యానికి సహకరించేట్లుగా వాళ్ల హృదయాలను దోచుకోవటమే మార్గమన్నారు. గదర్‌పార్టీ యుద్ధ ప్రకటన విడుదల చేసి విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చింది. మొహమ్మద్ బర్కతుల్లా, రామచంద్ర, భగవాన్‌సింగ్‌లు అనేక బహిరంగ సభలు నిర్వహించి వాళ్ల ప్రసంగాల్లో భారతీయుల్ని తమ దేశానికి తిరిగి వెళ్లి సాయుధ పోరాటం నిర్వహించ వలసిందిగా ఉత్తేజపరిచేవాళ్లు. ప్రముఖులైన నాయకుల్ని కొందర్ని జపాన్, ఫిలిప్పైన్స్, చైనా, హాంగ్‌కాంగ్, మలయా, సింగపూర్, బర్మాలకు పంపి అక్కడి భారతీయులు స్వదేశానికి తిరిగి వెళ్లి విప్లవ వీరులతో చేతులు కలిపేట్లుగా చేసేందుకు నచ్చచెప్పడం జరిగింది. వెంటనే భారతదేశానికి పయనం గట్టిన గదర్ వీరుల్లో ప్రముఖులు కర్తార్‌సింగ్ (బ్రిటిషు ప్రభుత్వం ఆయన్ని ఓ కుట్ర కేసు ఆధారంగా తరువాత ఉరికంబ మెక్కించింది), రఘువర్ దయాళ్ గుప్తాలు.

* * *

భారత ప్రభుత్వానికి గదర్ ప్రణాళిక సాంతం తెలిసిపోయింది. అయినా అదంత గోప్యంగా ఉన్నదెక్కడ? ప్రభుత్వం 'భారతదేశ ప్రవేశ అత్యవసర ఆదేశం' ద్వారా కట్టుదిట్టమైన చర్యలతో భారతదేశానికి తిరిగి వచ్చేవాళ్ల కోసం ఎదురుచూడసాగింది. వాళ్లు రాగానే గట్టి తనిఖీలు నిర్వహించింది. వాళ్ల వల్ల ప్రమాదం లేదనుకున్న వాళ్లను ఇళ్లకు పోనిచ్చారు. మరీ ప్రమాదకారులనుకున్న వాళ్లను

నిర్బంధించారు. కొంచెం తక్కువ ప్రమాదకారులనుకున్న వాళ్లకు గ్రామం విడిచి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. అయితే తనిఖీలలో తప్పుకోగలిగిన కొందరు ప్రమాదకారులు ఉద్యమానికి ఆజ్యం పోసేందుకు పంజాబుకు చేరుకున్నారు. భారత దేశానికి తిరిగి వచ్చిన రమారమి ఎనిమిది వేల మంది వలస వాసుల్లో ఐదు వేల మంది ఏ అడ్డంకులు లేకుండానే ఇళ్లు చేరుకున్నారు. పదిహేను వందల మంది విషయంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం జరిగింది. 1915 ఫిబ్రవరి వరకు 189 మంది బందీలయ్యారు. 704 మంది గ్రామ నిర్బంధానికి గురయ్యారు. కొలంబో, దక్షిణ భారత్ వైపు నుండి పయనించి చాలా మంది పట్టుబడకుండా పంజాబు చేరుకోగలిగారు.

అయితే 1914లో పంజాబు గదర్‌వీరులు ఊహించిన విధంగా లేదు. గదర్ తలపెట్టిన వీరోచిత సాహసానికి ఒడిగట్టే మానసిక స్థితిలో పంజాబీయులు లేరు. విదేశాల నుండి తిరిగి వచ్చిన సమరశీలురు వాళ్లు చేయగలిగిందంతా చేశారు. గ్రామాలన్నీ చుట్టివచ్చారు. మేళాల సందర్భంగా పండగ పబ్బాలలో ప్రసంగించారు గాని ఫలితం పూజ్యం. ఖల్సా ప్రధాన దీవాన్ తమ ప్రభు భక్తిని చాటుకుంటూ గదర్‌వీరుల్ని పతితులైన శిక్కులుగా, నేరస్తులుగా ప్రకటించి వాళ్ల జాడ కనుగొనటంలో ప్రభుత్వానికి సహకరించటం జరిగింది.

సాధారణ పౌరుల ప్రవర్తనకు ఆశాభంగం చెంది, దిగ్భ్రమతో గదర్ వీరులు వాళ్ల దృష్టిని సైనికుల వైపుకు మళ్లించారు. సైనిక దళాలను తిరుగుబాటుకు సమాయత్త పరిచేందుకు అనేక విఫలయత్నాలను 1914 నవంబర్‌లో చేసారు. వ్యవస్థాపక నాయకత్వం, కేంద్రం నుండి ఆజ్ఞలందే విధానం కొరవడినందు వల్ల గదర్ ప్రయత్నాలకు చుక్కెదురయ్యింది.

ఎంతో బాధపడుతూ గదర్‌పార్టీ నాయకుని కోసం వెతికింది. సచీంద్రనాథ్ సన్యాల్, విష్ణుగణేష్ పింగ్లేల కృషి ఫలితంగా, బెంగాలీ విప్లవ వీరుల్ని సంప్రదించిన ఫలితంగా, వైస్రాయి హార్డింగ్‌పై దాడిచేసినందువల్ల వాసికెక్కిన బెంగాలీ విప్లవ వీరుడు రాస్ బిహారీ బోస్ తిరుగుబాటుకు నాయకత్వం వహించేందుకు 1915 జనవరి మధ్యలో పంజాబు చేరుకున్నాడు.

బోస్ సంస్థకు ఓ ఆకారాన్నిచ్చి అనేక కేంద్రాలలోని సైనిక దళాల్ని సంప్రదించేందుకు మనుషుల్ని పంపి (వాయువ్య సరిహద్దు ప్రాంతంలోని బన్ను నుండి ఉత్తర ప్రదేశ్‌లోని ఫైజాబాద్, లక్నోల వరకు) వాళ్లను 1915 ఫిబ్రవరి 11లోపల తిరిగి

రమ్మన్నాడు. దూతలు తెచ్చిన సమాచారం ఆశావహంగానే ఉంది. ముట్టడికి తేదీని ముందు ఫిబ్రవరి 21గా నిర్ణయించి తరువాత 19కి మార్చారు. అయితే నేరపరిశోధకశాఖ (సి.ఐ.డి) ఈ వ్యవస్థకు సంబంధించి పై స్థాయి నుండి క్రింది స్థాయి వరకు మొత్తం కూపీ లాగింది. ప్రభుత్వం కట్టుదిట్టమైన ముందు జాగ్రత్త చర్యలతో ముట్టడిని నిలువరించ గలిగింది. బోసు తప్పించుకోగలిగినా పలువురు నాయకుల్ని నిర్బంధించారు. గదర్ విప్లవం అన్ని విధాలా అణగద్రొక్కబడింది. ప్రభుత్వం అక్కడితో ఆగలేదు. ఇప్పటి వరకూ అనుభవంలోకి వచ్చిన వాటిల్లో కెల్లా మితిమీరిన దమనకాండను జాతీయ ఉద్యమం చవిచూడవలసి వచ్చింది. పంజాబు, మాండలేలలో కుట్రకేసుల విచారణ నిర్వహించారు. నలభై ఐదుగురు విప్లవ కారులకు మరణశిక్ష, 200 మందికి దీర్ఘకాల కారాగార వాసం విధించారు. ఆ విధంగా రాజకీయంగా పంజాబుకు చెందిన ఓ తరం జాతీయవాద నాయకులందర్నీ మట్టుబెట్టినట్లయ్యింది.

అమెరికాలోని గదర్ నాయకుడు రామచంద్రతో సంబంధాలు కలిగి బెర్లిన్ నుండి కార్యకలాపాలు నిర్వహించే కొందరు భారతీయ విప్లవ కారులు జర్మనీ సాయంతో వాళ్ల కార్యకలాపాలు కొనసాగించారు. విదేశాలలో వున్న భారతీయ సైనిక దళాలలో తిరుగుబాటు తెచ్చేందుకు ప్రయత్నిస్తూనే వున్నారు. రాజా మహేంద్రప్రతాప్, బర్కతుల్లాలు ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అమీర్ సహాయాన్ని పొందేందుకు ప్రయత్నించటమే గాక కాబూల్‌లో ఒక స్థానిక ప్రభుత్వ ఏర్పాటు వరకూ నడిచింది వ్యవహారం. అయితే ఇవీ, యింకా యితర ప్రయత్నాలూ అంతగా విజయవంతంకాలేదు. ఇంతకూ బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా ఉగ్రవాదం తలవంచవలసి ఉంది.

కనుక గదర్ వీరుల పోరాటం ఏ ప్రయోజనాన్నీ సాధించలేకపోయిందనే నిర్ణయానికి వద్దామా? వాళ్లు బ్రిటీషు వాళ్లను తరిమెయ్యలేక పోయారు గనుక వాళ్ల ఉద్యమం వైఫల్యం చెందినట్లు భావిద్దామా? పైరెండు అభిప్రాయాలే సరైనవనే వీల్లేదు. పేర్కొన్న లక్ష్యాలకు అనుగుణంగానే రాజకీయ ఉద్యమాల జయాపజయాల్ని అన్నివేళలా బేరీజువేసే వీలుండదు. అలా బేరీజు వేసేట్లయితే అన్ని ప్రధాన జాతీయ పోరాటాలూ – అది 1920 – 22 నాటిది కానివ్వండి లేదా 1930 – 34 నాటిది కానివ్వండి, లేదా 1942 నాటిది కానివ్వండి – వాటన్నింటినీ పరాజయాల జాబితాలోనే చేర్చవలసి వుంది. ఎందుకంటే అవేవీ భారతదేశ స్వాతంత్ర్యాన్ని తెచ్చి ముగిసినవి కావు. అయితే జయాపజయాలను మనం జాతీయవాద స్పృహను గాఢతరం చేయటం తోనూ, కొంగ్రొత్త పోరాట పద్ధతుల్నీ, వ్యూహాల్నీ రూపొందించి ప్రయోగించటంతోనూ, పోరాటాన్ని, మతేతర

వాదాన్ని,ప్రజాస్వామ్యాన్ని, అందరికీ సమానహక్కుల్ని ఆనవాయితీగా మలచటంతోనూ లెక్కింప దలిస్తే గదర్ వీరులు భారత స్వాతంత్ర్య పోరాటాగ్నికి వారి వాటా సమిధల్ని తప్పక అర్పించినట్లే.

అది ఒక వేళ ఎగతాళిగా అన్పించినా సిద్ధాంత పరంగా గదర్ వీరుల విజయం అత్యున్నతమైనది. అంతకు ముందు విడుదలజేసిన పత్రాలేగాక గదర్ పత్రిక వలస వాదాన్ని విమర్శించే ఏకైక జాతీయవాద పత్రికగా నిలిచింది. మితవాద జాతీయవాదుల భావాలను కూడా అది కలుపుకు పోతూ శక్తిమంతంగా తేలికగా అర్థమయ్యే రీతిలో భారతదేశం నుండి వచ్చి విదేశాల్లో నివసించే బీద శ్రామికులకు, వ్యవసాయ కార్మికులకు జాతీయవాదాన్ని అందించింది. ఈ విధమైన పెను ప్రచార కృషి ఒక తరాన్నంతా ప్రభావితం చేసి అవగాహన కల్పించింది. గదర్ ఉద్యమంలో పాల్గొన్నవారూ, వారి నాయకుల్లోనూ అత్యధికులు శిక్కులే అయినప్పటికీ గద్దర్ పత్రిక ద్వారా గానీ, గదర్–దీ–గూంజ్ ద్వారా గాని, యితర ప్రచురణల ద్వారా గాని పంచిన భావజాలం మాత్రం మతాతీతమైనదే. మత ప్రమేయం అల్పమైనది గానూ, ఇరుకు మనస్తత్వానికి సంకేతంగానూ, విప్లవవాదులకు పనికిమాలినదిగానూ చూడబడింది. ఉద్యమంలోకి పలు మతాలకు, ప్రాంతాలకు చెందిన నాయకులుండటమే అందుకు నిదర్శనం. లాల్ హరదయాళ్ హిందువు – అలాగే రామచంద్ర మరికొందరు. బర్కతుల్లా ముసల్మాను. రాస్ బిహారీ బోస్ హిందూ బెంగాలీ! మరో ముఖ్య విషయమేమంటే గదర్ వీరులు పంజాబీల్లో మతాతీత స్పృహను కలిగించేందుకు పనిగట్టుకు కృషిచేశారు. ఎందుకంటే పంజాబీలో 'తుర్కాశాహీ' అనే పదం అణచివేతకు, తలబిరుసు తనానికీ పర్యాయపదంగా నిలిచేది. తురకలు (ముస్లిములు) కూడ సోదరులవలె దేశ స్వాతంత్ర్యానికి పోరాడుతున్నారు గనుక ఆ పద ప్రయోగ విషయంలో పునరాలోచించవలసి వచ్చింది. పైగా గదర్ ఉద్యమం ఏ 'సత్ శ్రీ అకల్'నో నినాదం చేయకుండా 'వందేమాతరం' అనే దాన్నే స్వీకరించింది. గదర్ వీరులు మతానికి సరికొత్త అర్థాన్ని సమకూర్చ ప్రయత్నించారు. మతం అంటే జుట్టుపెంచి, కృపాణం ధరించే బాహ్య విషయాల్లో గాక అన్ని మతాలు కలిసి చెప్పే సత్ప్రవర్తనను ఆచరించటం అన్నారు. అయితే ఖిలాఫత్ ఉద్యమం ముస్లిం మతాభివృద్ధికి చెందినదిగా హరదయాళ్ వాదించటం,శిక్కులు కృపాణాలు ధరించి తిరగటాన్ని బ్రిటీషు ప్రభుత్వం నిషేధించినప్పుడు చేసిన విమర్శల వంటివి గదర్ ఉద్యమ సైద్ధాంతికతలోని అసంబద్ధ విషయాలు గదర్ ఉద్యమం, దాని నాయకులు కాలానుగుణంగా నిర్మించే మతాతీత జాతీయవాద సిద్ధాంత పరిణామ క్రమంలోని కొన్ని మజిలీలుగా

గుర్తించాల్సి ఉంది. ఆనాటి మతపరమైన సమర్ధనల్ని వలస వాదానికి వ్యతిరేకంగా నిర్వహింపబడే సంపూర్ణ సాంస్కృతిక సమర్ధనలో భాగంగానే గుర్తించాలి గాని దానిని మతవాదంగానో, మత సిద్ధాంతంగానో, మతపరమైన స్పృహగానో చూడరాదు.

గదర్ వీరులు ప్రాంతీయ దురభిమానాల్ని దరిచేరనీయలేదు. లోకమాన్య తిలక్, అరవిందఘోష్, ఖుదీరామ్‌బోస్, కాంతీలాల్ దత్తు, సావర్కర్ వంటి వారందరూ గదర్‌పార్టీ వారికి ఆరాధనీయులే. 1915లో నిష్ఫలంగా నిలిచిపోయిన గదర్ ఉద్యమం అంది పుచ్చుకొనగా చలామణీలోకొచ్చిన నేత రాస్‌బిహారీ బోస్. శిక్కుల, పంజాబీయుల గొప్పలు చాటు కోవటం కంటే గదర్‌పార్టీ వాళ్లు 1857లో పంజాబీయులు విధేయతను ప్రభుత్వానికి ప్రకటించటాన్ని దుయ్యబడుతూండేవాళ్లు. అలాగే బ్రిటీషు ప్రభుత్వ భారతీయ సైన్యంలోని శిక్కుల అధిక సంఖ్యను తరువాత కాలంలో వలె శిక్కుల యోధత్వానికి ఋజువుగా భావించి పొగడ్తలతో ముంచెత్తక అదొక సిగ్గుమాలిన పనిగా గుర్తించి బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధ్వజమెత్తమన్నారు. పంజాబీ, మరీ ముఖ్యంగా పంజాబీ శిక్కు వ్యక్తిత్వాన్ని, 1857లో విదేశీయులకు మద్దతు పలకటాన్ని పురస్కరించుకొని, మాతృభూమికి ద్రోహం తలపెట్టిన భారతీయుని వ్యక్తిత్వంగా చిత్రించి దాని పరిహారార్థం భారతమాత గౌరవం కోసం పోరాడి క్షమార్హులు కావలసి వుందన్నారు. అటు తరువాత కాలంలో ప్రముఖరైతు నాయకునిగా కమ్యూనిస్టు నాయకునిగా ఎదిగిన సోహన్‌సింగ్ భక్నా మాటల్లో చెప్పాలంటే – 'మనం శిక్కులమూ కాదు, పంజాబీయులమూ కాదు. మన మతం దేశభక్తి'.

గదర్ తాత్వికతలో మరో ప్రత్యేక గుణం దాని ప్రజాస్వామిక, సమాన హక్కుల అంశం. గదర్ ఉద్యమకారులు వాళ్ల లక్ష్యం సర్వతంత్ర స్వతంత్ర భారత స్థాపనేనని స్పష్టంగా పేర్కొన్నారు. అరాచకత్వ, శ్రామిక సంఘ వాదాలతోనేమి సామ్యవాదంతో కూడ ఎంతగానో ప్రభావితుడైన హర దయాళ్ సమానహక్కుల సిద్ధాంతాన్ని ఈ ఉద్యమానికి అందించాడు. బహుశా దీనివల్లనే చాలా మంది గదర్ ఉద్యమకారులు 20వ శతాబ్దపు 2, 3 దశకాల్లో కమ్యూనిస్టులుగా, రైతు నాయకులుగా రూపాంతరం చెందారు.

హరదయాళ్ మరో ప్రధాన కృషి గదర్ విప్లవకారుల్లో నిజమైన అంతర్జాతీయ దృక్పథాన్ని పెంపొందించటం. ఆయన ప్రసంగాలు, రచనలు అన్నీ కూడా ఐరిష్, మెక్సికన్, రష్యన్ విప్లవకారులకు సంబంధించిన సమాచారంతో నిండివుండేవి.

ఉదాహరణకు ఆయన మెక్సికన్ విప్లవకారుల్ని 'మెక్సికన్ గదర్ వీరులు' అన్నాడు. గదర్ విప్లవకారులు ఆవిధంగా మతాతీత, సమానహక్కుల, సామ్యవాద, దురభిమాన రహిత అంతర్జాతీయ అవగాహన గల వారుగా ప్రసిద్ధికెక్కారు.

దీనర్థం గదర్ ఉద్యమంలో బలహీనతలకు తావే లేదని కాదు. గదర్ ఉద్యమ నాయకులలోని ప్రధాన బలహీనత-ప్రతి దశలోనూ సిద్ధమయ్యేందుకు అంచనాలను తక్కువగా తయారుచేసుకోవటం – అది సంస్థాపరమైన నిర్వహణ విషయం కానివ్వండి, సిద్ధాంతపరమైన మౌలికత కానివ్వండి, వ్యూహాత్మక ప్రయోగం కానివ్వండి, చాకచక్య పద్ధతులు కానివ్వండి, ఆర్థికపరమైన ఏర్పాట్లు కానివ్వండి – ఒక సాయుధ పోరాటానికి సంసిద్ధమయ్యేందుకు తగినట్లుగా వుండేవి కావు. తొలి ప్రపంచ యుద్ధం ప్రారంభమైందన్న సంభ్రమాశ్చర్యాలతో, 'కామగటమారు' సంఘటనతో ఉద్రిక్తత చెంది తమ సైన్యం స్థితిని పరిశీలించుకొనకుండానే యుద్ధ భేరీలు మ్రోగించారు. తెల్లజాతివారి వల్ల వివక్షకు గురై అసంతృప్తితో ఎంతగానో చెలరేగివున్న కొద్దివేల మంది వలస వచ్చిన భారతీయుల్ని సమీకరించినంత తేలికగా భారతదేశంలోని లక్షలాది మంది రైతుల్ని, సైనికుల్ని సమీకరించి చైతన్యం రగిలించటం కుదరదన్న విషయం వాళ్లు మరచారు. అలాగే భారతదేశంలోని బ్రిటీషు ప్రభుత్వపు శక్తిని తక్కువగా అంచనా వేసారు. వాళ్ల సైనిక శక్తిని గాని, నిర్వహణా సామర్థ్యాన్నిగాని, వాళ్ల పరిపాలనలోని సైద్ధాంతిక పునాదుల్నిగాని సరిగా అంచనా వేయక భారత ప్రజలకు కావలసింది కేవలం విప్లవానికో పిలుపుగా వూహించుకొని, ఆ పిలుపుతో బీటలు వారిన బ్రిటీషు సామ్రాజ్యం కుప్పగూలటం ఖాయం అనుకున్నారు.

ఉద్యమంలోని అనేక అంశాలను సమన్వయ పరిచే నిరంతర నాయకత్వాన్ని గదర్ ఉద్యమం తయారు చేసుకోలేకపోయింది. హరదయాళ్ తన మానసిక ధోరణిరీత్యా సంధాన కర్త పాత్రకు పనికిరాడు. ఆయన ప్రచారకుడు, ప్రేరేపకుడు, సైద్ధాంతికుడు. ఆయన భావాలు కూడా నిర్మాణ రీతిలో కొనసాగక, కాలానుగుణంగా ఆయన్ని ఆకర్షించిన రకరకాల సిద్ధాంతాల సమ్మేళనంగా తయారయ్యింది. పైగా కీలక సమయంలో ఆయన అమెరికాను వదలిరావటం సహచరుల్ని తికమకపడేట్లు చేసింది.

గదర్ ఉద్యమపు మరో ముఖ్యమైన బలహీనతేమంటే – దానికి ఒక వ్యవస్థాగత నిర్మాణ పద్ధతి కొరవడటం. గదర్ ఉద్యమం పటిష్టమైన వ్యవస్థాపద్ధతుల వలన గాక సమరశీలుర ఉల్లాసం ఆధారంగానే అది నిలదొక్కుకుంది.

అవగాహన, నాయకత్వం, వ్యవస్థాగత నిర్మాణం వంటి విషయాలన్నింటిలోని బలహీనతలన్నీ కలగలిసి విలువైన మానవ వనరుల్ని వృధాగావించాయి. నలభై మందికి పైగా గదర్ వీరుల్ని ఉరితీయటం, 200 మందికి మించి సుదీర్ఘ కారాగార శిక్షలు విధించటాన్ని గుర్తు చేసుకుంటే 1914–1915 నాటి వీరోచిత, ప్రమాద భరిత కార్యకలాపాలు ఒక తరం లౌకిక, జాతీయవాద నాయకత్వాన్ని మట్టుబెట్టినట్లయ్యింది. వాళ్లు రాజకీయంగా రంగంలో నిలదొక్కుకుని వుండి వున్నట్లయితే, తరువాత సంవత్సరాల్లో పంజాబుకు వాళ్లు భిన్నమైన రాజకీయ సంక్లిష్టతను సమకూర్చ గలిగేవాళ్లు. శక్తిమంతమైన లౌకిక స్థిరత్వాన్ని వాళ్లు తప్పక సాధించగలిగేవాళ్లు. తరువాత సంవత్సరాల్లో తలెత్తిన మతపరమైన ధోరణుల్ని అడ్డుకొనగలిగేవాళ్లు. ఇదంతా ఏదో ఊహా జనిత ఊకదంపుడు కాదు. 20వ శతాబ్దపు 2, 3 దశకాల్లో యింకా మిగిలివున్న గదర్ వీరులు పంజాబులో ఒక లౌకిక జాతీయ రైతు ఉద్యమ నిర్మాణానికి పునాదు లేర్పరచటంలో అందించిన సాయాన్ని దృష్టిలో పెట్టుకునే అలా భావించటం.

* * *

# 13 హోం రూలు ఉద్యమం - పతనం

మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు నాటకీయంగా స్పందించిన తీరు, గదర్ విప్లవ కారుల సాహసోపేత చర్యలకు ఊతాన్నిచ్చింది. ఇప్పుడు మనం అంతకంటే తక్కువ ఆవేశంతో మరింత కట్టుదిట్టంగా రూపొందిన భారతీయ స్పందనను పరిశీలించుదాం. అదే లోకమాన్య తిలక్, అనీబిసెంట్లు నడిపిన హోంరూలు ఉద్యమం.

* * *

బాలగంగాధర తిలక్ తన ఆరేళ్ల కారాగార వాసంలో అధిక భాగం బర్మాలోని మాండలే జైలులో గడిపిన పిమ్మట 1914, జూన్ 16న విడుదల చేసారు. తాను దేశ బహిష్కృతుడైన నాటి భారతదేశం, తిరిగి వస్తున్నప్పటి భారతదేశం భిన్నంగా వున్నాయి. స్వదేశీ ఉద్యమకాలంలో అగ్నికణం అరవింద ఘోష్ పాండిచెరిలో సన్యాసం స్వీకరించాడు. లాలాలజ్‌పత్‌రాయ్ దూరంగా అమెరికాలో ఉన్నాడు. 1907 నాటి సూరత్‌లోని చీలిక, స్వదేశీ ఉద్యమ కారుల్లోని క్రియాశీలురపై ప్రభుత్వం చేపట్టిన శ్రుతి మించిన అణచివేత చర్యలు, 1909లో చేపట్టిన రాజ్యాంగ సంస్కరణలు మితవాదుల్ని దిగ్భ్రమలో ముంచెత్తటం వంటి కారణాలవల్ల ఉమ్మడిగా సంభవించిన ఫలితాల నుండి భారతజాతీయ కాంగ్రెసు యింకా తేరుకోవలసి ఉంది.

తిలక్ తాను, మిగతా తీవ్రవాదుల్ని భారత జాతీయ కాంగ్రెసులోకి పునః ప్రవేశాన్ని కోరే విషయంపైనే ముందుగా తన దృష్టినంతా కేంద్రీకరించాడు. ఏ రాజకీయ చర్య విజయవంతం కావాలన్నా భారత జాతీయ ఉద్యమాన్ని ప్రతిబింబించే

ఆ సంస్థ ఆమోద ముద్ర ముందుగా అవసరమవుతుందనే విషయాన్ని తాను పూర్తిగా అర్థం చేసుకోగలిగాడు. మితవాదుల్ని బుజ్జగించేందుకు, వాళ్లకు తనపై విశ్వాసం కలిగించేందుకు ప్రభుత్వం వైపునుండి ఉత్పన్నం కావచ్చుననుకునే అణచివేత చర్యల్ని అధిగమించేందుకు ఆయన బహిరంగంగా యిలా ప్రకటించాడు: 'నేను చివరిసారిగా చెప్తున్నాను – మేము భారతదేశంలో చేయబూనే దంతా ఐరిష్‌లు. ఐరిష్ హోమ్‌రూలు ఉద్యమకారులు చేస్తున్నట్లే పరిపాలనా విధానంలో సంస్కరణలను కోరుకుంటున్నామేగాని ప్రభుత్వాన్ని పడగొట్టాలని లేదు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో చెలరేగిన హింసాత్మక చర్యలు వ్యతిరేక భావాన్ని ప్రోది చేసేవి మాత్రమే గాక నా అభిప్రాయంలో అవి మన రాజకీయ పురోగతికి అడ్డంకిగా నిలవటం ఓ దురదృష్టకర పరిణామమని చెప్పేందుకు నేను వెనుకాడను.' అంతేగాక ఆయన బ్రిటీషు సార్వభౌమత్వానికి తన విధేయతను భారతదేశంలోని ప్రభుత్వానికి తెలియజేసుకుంటూ భారతీయులందర్నీ ఆ విపత్కర స్థితిలో బ్రిటీషు ప్రభుత్వానికి అండగా నిలవమన్నాడు.

1907లో సూరత్‌లో తామెంచుకున్న మార్గంపట్ల ఎంతో మంది మితవాద కాంగ్రెసు నాయకులు అనుల్లాసంగా వుండటమే గాకుండా కాంగ్రెసు సంపూర్ణంగా నిష్క్రియా జనితంగా నిలబడిపోవటం కూడా వారిని నిరుత్సాహానికి గురిచేస్తోంది. కనుక వాళ్లంతా తిలక్ ప్రతిపాదనలకు పెద్దఎత్తున సానుభూతిని అందించసాగారు. పైగా అప్పుడే భారతజాతీయ కాంగ్రెసులో చేరిన అనీబిసెంటు వైపు నుండి జాతీయ రాజకీయ చైతన్యాన్ని రగిలించేందుకూ, అతివాదుల్ని కాంగ్రెసులోకి తిరిగి చేర్చుకోవలసిందిగానూ బాగా వత్తిడి పెరిగింది.

1914లో అనీబిసెంటు అరవైయ్యారేళ్ల వయసులో ఇంగ్లండులో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించింది. స్వేచ్ఛామయ చింతననూ, హేతువాదాన్నీ, సంస్కరణ ప్రధానమైన సామ్యవాదాన్నీ, 'దివ్యజ్ఞానాన్నీ సమర్థించే వ్యక్తిగా వుంటూ దివ్యజ్ఞాన సమాజ కార్యనిర్వహణలో పాలుపంచుకునేందుకు 1893లో భారతదేశం చేరింది. 1907 నుండి మద్రాసు శివార్లలోని అడయారును కేంద్రంగా చేసుకొని దివ్యజ్ఞాన బోధనను వ్యాప్తి చేయసాగింది. తమకై తాము ఏ విధమైన సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని చవిచూడని వివిధ జాతులకు చెందిన విద్యాధికులలో పలువుర్ని అనుయాయులుగా పొందగలిగింది. 1914లో తనకార్యకలాపాలను విస్తృత పరచాలనే నిర్ణయానికి వచ్చింది. ఐరిష్ హోంరూలు లీగ్‌వలె భారతదేశంలో హోంరూలు ఉద్యమ

నిర్మాణం అందులో భాగమయ్యింది. దాని కోసం అటు కాంగ్రెసు ఆమోద ముద్ర ఇటు అతివాదుల క్రియాశీల సహకారం రెండూ అవసరమేననే అవగాహనకు ఆమె వచ్చింది. అందువల్లనే తిలక్‌తో పాటు ఆమె అతివాద అనుయాయులకు కాంగ్రెసు ద్వారాలు తెరచి స్వాగతం చెప్పేందుకు, మితవాదుల్ని అంగీకరింప జేసేందుకు తన శక్తియుక్తుల నన్నింటినీ వినియోగించింది. అయితే 1914 డిసెంబరులో జరిగిన కాంగ్రెసు వార్షిక సభలు అసంతృప్తినే మిగల్చ గలిగాయి – ఫిరోజ్ షా మెహతా, తమ బొంబాయి మితవాద ముఠా కలిసి గోఖలేతో పాటు బెంగాలు మితవాదులపై విజయం సాధించి అతివాదుల్ని వదిలించుకోగలిగారు. అప్పటి నుండి తిలక్, బిసెంటులు ఒక వైపు తీవ్రవాదాన్ని తిరిగి కాంగ్రెసులోకి చేర్చుకోవాలని వత్తిడి తెస్తూనే మరోవైపు వాళ్లకై వాళ్లు రాజకీయ కార్యకలాపాలను పునరుజ్జీవింప జేయాలనే నిర్ణయానికి వచ్చారు.

* * *

1915 ప్రారంభంలో అనీబిసెంటు తన రెండు పత్రికలు 'న్యూ ఇండియా', 'కామన్ వేల్' ద్వారా ప్రచారాన్ని చేపట్టి, బహిరంగ సమావేశాలు, సదస్సులు నిర్వహించి డిమాండు చేసినదేమంటే యుద్ధానంతరం శ్వేతజాతి వలస ప్రాంతాలలో వలె భారతదేశానికి కూడ స్వయంపాలనను అవకాశం కల్పించాలని. 1915 ఏప్రియల్ నుండి ఆమె గళం దృఢ తరమయ్యింది. ఆమె దృక్పథం తీవ్రరూపం దాల్చింది.

ఈలోగా లోకమాన్య తన రాజకీయ కార్యకలాపాలను ప్రారంభించాడు. ఇంకా పూర్తిగా కాంగ్రెసులో ప్రవేశాన్ని పొందలేదు. మితవాదుల్ని అప్రమత్తం చేసే విధంగాగానీ, కాంగ్రెసుకు వ్యతిరేకంగా వున్నట్లుగా గానీ కన్పించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. 1915 మే మాసంలో పూనాలో తన అనుయాయుల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ విషయాన్ని తేటతెల్లం చేస్తుంది. ఆ సమావేశంలో వాళ్లు తొలి చర్యగా ఒక ప్రాతినిధ్య సంస్థను స్థాపించి, 'కాంగ్రెసు లక్ష్యాలను, కృషిని గ్రామీణులకు విడమర్చి చెప్పబూనారు.' ఆ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో మహారాష్ట్ర అంతటా నెలకొల్పబడిన స్థానిక సంఘాలన్నీ కూడ రాజకీయ కార్యకలాపాల్ని ఉధృతం చేయటం మీద కంటే కాంగ్రెసు ఐక్యత అవసరాన్ని నొక్కి వక్కాణించటం మీదనే వాటి దృష్టిని కేంద్రీకరించాయి. మితవాదుల్లో మరీ ముడుచుకు కూర్చున్న వాళ్ల నన్నా కదిలించలేకపోతే ఎలా అనే బెదిరింపుల్ని అలా వుంచి, తాను తీసుకునే జాగ్రత్తలు' తనలోని సాలోచనా ధోరణి ద్వారానే తిలక్ పలువురిని ఆకట్టుకో జూచాడు!

ఇటు ఈయన శ్రమ, అటు అనిబిసెంటు కృషి త్వరలో ఫలించనుంది. 1915 డిసెంబరు నాటి కాంగ్రెసు వార్షిక సభలో తీవ్రవాదుల పునఃప్రవేశానికి అనుమతిస్తూ తీర్మానించటం జరిగింది. ఫిరోజ్‌షా మరణం బొంబాయి మితవాద ముఠా శక్తిని బలహీన పరిచింది. అయితే అనీబిసెంటు మాత్రం హోంరూలు సంఘాలను స్థాపించాలనే ప్రతిపాదన విషయంలో ఇటు కాంగ్రెసు వారిదీ, అటు ముస్లిం లీగ్ వారిదీ మద్దతు పొందలేక పోయింది. అయితే స్థానిక కాంగ్రెసు కమిటీలను రూపొందించే విషయంలోనూ, బోధనామయ ప్రచారాన్ని చేపట్టే విషయంలోనూ కాంగ్రెసును అంగీకరింప జేయగలిగింది. అప్పటి పరిస్థితుల్లో కాంగ్రెసు అటువంటి కార్యక్రమాన్ని చేపట్టటం సాధ్యం కాదనే విషయం ఆమెకు బాగానే తెలుసు గనుక ఒక వేళ ఈ కార్యక్రమాన్ని కాంగ్రెసు 1916 సెప్టెంబరు నాటికి ప్రారంభించలేక పోయినట్లయితే ఆమె తన లీగ్‌ను స్థాపించుకునేందుకు ఎటువంటి అభ్యంతరం ఉండబోదనే ఒక షరతును జోడించటం జరిగింది.

తిలక్‌కు అటువంటి షరతులేమీ లేనందువల్లనూ, కాంగ్రెసులోకి తిరిగి ప్రవేశించే హక్కును పొందినందువల్లనూ ముందుకు వచ్చి 1916లో బెల్గాంలో బొంబాయి ప్రాంతీయ సదస్సు సందర్భంగా హోంరూలు లీగ్‌ను స్థాపించాడు. సెప్టెంబరు వరకూ వేచి చూడాలనే ఆమె నిర్ణయానికి అసంతృప్తి చెంది అసహనానికి గురైన అనిబిసెంటు అనుయాయులు హోమ్‌రూలు సముదాయాల ఏర్పాటుకు ఆమె అనుమతిని కోరారు. జమ్నాదాస్ ద్వారాకా దాస్, శంకర్‌లాల్‌బంకర్, ఇందూలాల్ యాగ్నిక్‌లు కలిసి బొంబాయిలో 'యంగ్ ఇండియా' పత్రికను స్థాపించి, అఖిల భారత ప్రచార నిధిని ఏర్పాటు చేసి దాని ద్వారా ఆంగ్లంలోనూ, ప్రాంతీయ భాషల్లోనూ కరపత్రాలు ముద్రించే ఏర్పాట్లు చేసారు. సెప్టెంబరు 1916లో కాంగ్రెసు కార్యకలాపాలేవీ లేకపోవటంతో తన దివ్యజ్ఞాన సమాజ అనుయాయి జార్జి అరండేల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హోంరూలు లీగు స్థాపనను ప్రకటించింది. రెండు లీగ్‌లు ఘర్షణకు తావివ్వకుండా వాళ్ల కార్యకలాపాలకు సంబంధించిన ప్రాంతాన్ని పంచుకున్నాయి. తిలక్‌కు సంబంధించిన లీగ్ బొంబాయి పట్నం తప్ప మిగతా మహారాష్ట్ర అంతటా, కర్నాటకలోనూ, సెంట్రల్ ప్రొవిన్సులలోనూ, బీహార్‌లోనూ విస్తరిస్తుంది. అనిబిసెంటు లీగ్ భారతదేశంలోని మిగతా భాగంలో తన కార్యకలాపాలను నిర్వర్తిస్తుంది. అయితే ఆ రెండు లీగ్‌లు కలిసి పని చేయక పోవటానికి కారణం అనిబిసెంటు మాటల్లోనే చెప్పాలంటే – 'ఆయన అనుయాయుల్లో కొందరికి నా పట్ల అయిష్టత, అలాగే నా అనుయాయుల్లో కొందరికి ఆయనంటే అయిష్టత మా ఇద్దరి మధ్యా మాత్రం ఏ గొడవ లేదు.'

తిలక్ మహారాష్ట్ర అంతటా పర్యటిస్తూ, ప్రసంగాలు చేస్తూ, వివరిస్తూ, హోమ్‌రూలు డిమాండ్‌ను ప్రజాను రంజకంగావిస్తూ హోమ్‌రూలు ప్రచారాన్ని బాగా విస్తరింపజేసాడు. 'భారతదేశం యుక్త వయస్కుడైన కుమారుని వంటిది. అతనికి చెందవలసినదేదో అప్పగించవలసిన బాధ్యత తండ్రిదో లేక సంరక్షకునిదో అవుతుంది. అది తప్పక అమలయ్యేట్లు భారత ప్రజ చూడాలి. అది వాళ్ల హక్కు.' పైగా ఆయన 'స్వరాజ్'ను భాషా రాష్ట్రాల ఏర్పాటుకూ, మాతృభాషలో విద్యాబోధనకూ ముడిబెట్టాడు. 'మరాఠాలకు, తెలుగువాళ్లకు, కన్నడిగులకు మూడు ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటు చేయండి.... మాతృభాషలో విద్యాబోధన నిర్వహింపబడాలనే సూత్రం సుస్పష్టమే. బ్రిటీషు వాళ్లు వాళ్ల ప్రజలకు విద్యాబోధన ఫ్రెంచి ద్వారా నిర్వహిస్తున్నారా? జర్మన్లు ఇంగ్లీషు ద్వారా గానీ, టర్కీ వాళ్లు ఫ్రెంచిలో గానీ విద్యాబోధన చేస్తారా' 1915లో బొంబాయి ప్రొవిన్షియల్ కాన్ఫరెన్స్‌లో గోఖలే మృతి సందర్భంగా తన సంతాప తీర్మానాన్ని బలపరిచేందుకు లేచి నిలుచున్న వీ.బీ. ఆలూర్‌తో యిలా అంటాడు: 'కన్నడ భాష హక్కును నిలబెట్టుకునేందుకు కన్నడంలోనే మాట్లాడు.' లోకమాన్యకు మరాఠీ పట్ల భాషాపరంగా గానీ, ప్రాంతీయపరంగా గానీ ఏ మాత్రం దురభిమానమున్న దాఖలా ల్లేవు.

బ్రాహ్మణేతరుల ప్రాతినిధ్యం విషయంలో కానీ అస్పృశ్యత విషయంలో కానీ ఆయన దృక్పథం ఆయన్ని కులాభిమానిగా చూపదు. మహారాష్ట్రలోని బ్రాహ్మణేతరులు అగ్రకులాల వారి డిమాండ్లతో వారికి సంబంధం లేదంటూ ప్రత్యేకంగా మహజరు ప్రభుత్వానికి సమర్పించిన సందర్భంగా ఆచర్యను వ్యతిరేకించే వాళ్లను కొంచెం ఓపిక పట్టమన్నాడు. 'మనం గనుక బ్రాహ్మణేతరులకు ప్రభుత్వం నుండి కోర్కెల సాధన విషయంలో పూర్తిగా వాళ్ల పక్షానే నిలిచినట్లయితే యివ్వాళ సామాజిక అసమానతల ఆధారంగా సాగుతున్న వాళ్ల ఉద్యమం క్రమేపీ మన పోరాటంలో కలగలసి పోగలదు.'[6] ఇక ఆయన బ్రాహ్మణేతరులకు వివరించిందేమంటే అసలు తేడా బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల మధ్య కాదు, తేడా అంతా చదువుకున్న వాళ్ల మధ్య, చదువులేని వాళ్ల మధ్య, ఉద్యోగాలన్నింటిలో బ్రాహ్మణులు ముందుండటానికి కారణం వాళ్లంతా ఎక్కువ చదువుకున్న వాళ్లు కావటమే. ప్రభుత్వానికి నిజంగా బ్రాహ్మణేతరుల పట్ల సానుభూతి, బ్రాహ్మణుల పట్ల ద్వేషం వున్నా పరిపాలన కొనసాగేందుకు బ్రాహ్మణులకు ఉద్యోగాలివ్వక తప్పని స్థితి ఏర్పడింది. అస్పృశ్యతా నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన ఓ సదస్సులో తిలక్ యిలా ప్రకటించాడు: 'భగవంతుడు ఒకవేళ అస్పృశ్యతను చూస్తూ సహించవలసి వస్తే అతణ్ణి నేను భగవంతునిగా గుర్తించను.'

ఆ కాలం నాటి ఆయన ప్రసంగాలలో మనం మతపరమైన నివేదనల ఛాయల్ని కూడ చూడజాలం. హోంరూలు ఉద్యమం మొత్తం లౌకిక భావనల ఆధారంగానే నడిచింది. బ్రిటీషు వాళ్లు పరాయి వాళ్లు కావటానికి కారణం వాళ్లు వేరు మతస్తులు కావటం కాదు. వాళ్లు భారతజాతి మేలుకోసం కృషి చేసేవాళ్లు కాకపోవటమే. 'ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎవరు నడుచుకుంటారో – వాళ్లు మహమ్మదీయులు కానివ్వండి, ఆంగ్లేయులు కానివ్వండి – వాళ్లు పరాయివాళ్లు కారు. పరాయితనం శ్రద్ధకు సంబంధించినటువంటిది. పరాయితనం శరీరానికి వున్న నలుపు, తెలుపు రంగునుబట్టో.. మతాన్ని బట్టో నిర్ణయించేది కాదు.'

తిలక్ స్థాపించిన హోంరూలు లీగ్ ప్రచారం విషయంలో ముందడుగు వేయసాగింది. ఆరు కరపత్రాలను మరాఠీలోనూ, రెండు కరపత్రాలను ఆంగ్లం లోనూ ముద్రించగా, 47,000 ప్రతుల్ని విక్రయించటం జరిగింది. గుజరాతీ, కన్నడ, భాషల్లో కూడ కరపత్రాలు ముద్రించబడినాయి. లీగ్ ఆరు శాఖలుగా విస్తరింపబడి మధ్య మహారాష్ట్ర, బొంబాయి పట్టణం, కర్నాటక, సెంట్రల్ ప్రోవిన్సెస్, బీరార్‌లో రెండు కేంద్రాలుగా నిర్వహింపబడింది.

హోంరూలు ఉద్యమం కొంచెం ఊపందుకోగానే ప్రభుత్వం తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యింది. దానికొక పవిత్ర దినాన్ని ముహూర్తంగా నిర్ణయించింది. 1916 జూలై 23 తిలక్ షష్టిపూర్తి. ఆచారం ప్రకారం పెద్ద ఎత్తున ఉత్సవ నిర్వహణకు అది అనుకూలమైన సమయం. ఆయనకు లక్ష రూపాయల నిధిని బహూకరించారు. అదేరోజు ప్రభుత్వమూ తన బహుమతిని ఆయనకు నోటీసు రూపంలో బహూకరించింది. ఒక సంవత్సరం పాటు తన సత్ప్రవర్తన నిరూపించుకునేందుకు తనపై బైండోవరు కేసు ఎందుకు పెట్టరాదో చెప్పమని సంజాయిషీ కోరింది. రు.60,000/– ధరావత్తు రూపంలో చెల్లించమంది. తిలక్ మాత్రం దానినే తన జన్మదిన సందర్భంగా ఉత్తమోత్తమమైన బహుమతిగా పరిగణించాడు. 'ఇంతకూ భగవంతుడు మనతో ఉన్నాడు. ఇక చూసుకోండి! హోంరూలు ఉద్యమం అడవుల్లోని మంటల్లా ఎలా వ్యాపిస్తుందో.'[9] అణచివేత చర్యలు ఉద్యమకీలల్ని మరింతగా ప్రజ్వలింపజేస్తాయి.

మహమ్మదాలీ జిన్నా నాయకత్వాన ఓ న్యాయవాదుల బృందం తిలక్‌కు అనుకూలంగా వాదించసాగింది. మేజిస్ట్రేట్ కోర్టులో ఆయన ఓడిపోవటం జరిగింది గాని నవంబరులో హైకోర్టు ఆయన నిర్దోషిత్వాన్ని ప్రకటించింది. ఈ విజయానికి

దేశమంతటా జేజేలు మారుమ్రోగాయి. గాంధీజీ పత్రిక "యంగ్ ఇండియా" ఆనాటి ప్రజానురంజకత్వాన్ని ఇలా ఒక్క ముక్కలో తేల్చి చెప్పింది: 'హోంరూలును ఏ గొలుసులతో కట్టిపడవేయాలనుకున్నారో ఆ బెడద వదలి పోవటంతో స్వయంపాలన విషయంలో ఘన విజయం చేకూరినట్లయింది.'[10] తిలక్ ఆ సదవకాశాన్ని వెనువెంటనే వినియోగించుకుంటూ తన ప్రసంగాలలో హోంరూలుకు ప్రభుత్వ అనుమతి లభించినట్లయిందని ప్రకటించసాగాడు. తన అనుయాయులు కూడా హోంరూలు దిశగా ప్రచారాన్ని ఉధృతం చేయసాగారు. 1917 ఏప్రియల్ నాటికి తిలక్ 14000 మంది సభ్యుల్ని కూడగట్టగలిగాడు.

* * *

ఈలోగా అనిబిసెంటు 1916 సెప్టెంబరులో లాంఛన ప్రాయంగా తన హోంరూలు ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈమె లీగ్ తిలక్ స్థాపించిన లీగ్ వలె పకడ్బందీగా లేదు. నియమావళి ప్రకారం ఈమె లీగ్‌లో ముగ్గురు సభ్యులుంటే చాలు ఒక శాఖను స్థాపించుకోవచ్చు. తిలక్ ఏర్పాటుచేసిన ఆరుశాఖలకూ నిర్దిష్ట లక్ష్యాలూ, కార్య ప్రణాళికలూ వున్నాయి. బిసెంటు లీగ్‌కు గల 200 శాఖల్లో కొన్నిటి పరిధి ఒక్కో పట్టణానికి విస్తరించి వుంటే గ్రామాలకు చెందిన సముదాయాలకు మరికొన్ని విస్తరించి వుండేవి. వ్యవస్థాపక శాఖలు ముప్పయినాలుగు కలిసి ఏడుగురు సభ్యులతో ఓ కార్యనిర్వాహక వర్గాన్ని మూడేళ్లపాటు పనిజేసేందుకు ఎన్నుకున్నా కార్యభారమంతా అనీబిసెంటు, ఆమె అనుయాయులు అరండేల్, సీ.పీ.రామస్వామి అయ్యర్, బి.పి. వాడియాలు కేంద్ర కార్యస్థానమైన అడయారు నుండి మోయవలసి వచ్చేది. ఆదేశాలను అందించేందుకు కూడ ఓ క్రమపద్ధతి రూపొందలేదు. ఏ సభ్యుడు కన్పిస్తే ఆ సభ్యునితో వర్తమానం పంపటం ద్వారానో, "న్యూ ఇండియా" పత్రికలో అరండేల్ నిర్వహిస్తున్న హోంరూలు శీర్షిక ద్వారానో అందజేస్తూండేవాళ్లు. తిలక్ లీగ్ కంటే అనీబిసెంటు లీగ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మందకొడిగా సాగింది. 1917 మార్చి నాటికి ఆమె లీగ్ సభ్యుల సంఖ్య 7,000 మాత్రమే. ఆమె దివ్య జ్ఞాన అనుయాయులతో పాటు అలహాబాద్ నుండి జవహర్‌లాల్ నెహ్రూ, కలకత్తా నుండి బి. చక్రవర్తి, జె. బెనర్జీలు హోంరూలు ఉద్యమంలో ప్రవేశం పొందారు. అయితే మనం శాఖల సంఖ్యను బట్టి లీగ్ శక్తిని బేరీజు వేయరాదు. ఎందుకంటే కొందరు ఎనలేని క్రియాశీలతను కనబరిచేవాళ్లు, మిగతా వాళ్లు దివ్యజ్ఞాన సమాజాలకు సహాయకులుగా వుండిపోయేవాళ్లు. ఉదాహరణకు మద్రాసు పట్టణంలో శాఖలు పెద్ద సంఖ్యలో వున్నా చాలా భాగం అవి మందకొడిగానే

పనిజేసేవి. అయితే బొంబాయి నగరశాఖ, ఉత్తర ప్రదేశ్‌లోని నాలుగు పట్టణశాఖలు, గుజరాత్‌లోని అనేక గ్రామీణశాఖలు చాలా క్రియాశీలంగా కార్యక్రమాలను నిర్వహించాయి.

కార్యక్రమంలోని ప్రాధాన్యత అంతా హోంరూలు ఉద్యమ నిర్వహణే, దాని సాధనకు రాజకీయ బోధన, చర్చలు చేపట్టాలనుకున్నారు. 'న్యూ ఇండియా' పత్రిక ద్వారా అరండేల్ సభ్యులకు విజ్ఞప్తులు చేస్తూ వుండేది - రాజకీయ చర్చను పెంపొందించమనీ, జాతీయ రాజకీయాలతో కూడిన పుస్తకాలతో గ్రంథాలయాలు స్థాపించమనీ, విద్యార్థులకు రాజకీయ పాఠశాలలు నిర్వహించమనీ, కరపత్రాలను అచ్చేసి పంచమనీ, నిధులను సమీకరించమనీ, సంఘసేవా కార్యక్రమాలను నిర్వహించమనీ, స్థానిక పాలనలో పాలు పంచుకోమనీ, రాజకీయ సభలనూ, ప్రసంగాలనూ ఏర్పాటు చేయమనీ, స్నేహితులకు హోంరూలు ఆశయాలను విడమర్చి చెప్పి అందులో చేరేట్లు చూడమనీ. ఇందులో కొన్నింటిని చాలా శాఖలు చేపట్టాయి. మరీ ముఖ్యంగా రాజకీయ చర్చ విషయంలో ముందంజలో వుండేవి.

ప్రచారం పట్టు ఎంతగా ప్రబలిందంటే 1916 సెప్టెంబరులో అనీబిసెంటు లీగ్ సాధికారికంగా ప్రారంభింపబడే నాటికే ప్రచారనిధి సేకరించబడి ఇరవయ్యారు ఆంగ్ల కరపత్రాలు మూడు లక్షల వరకూ అచ్చువేసి పంచటం జరిగింది. వాటిలో ముఖ్యంగా భారతదేశంలోని ప్రభుత్వ పనితీరు, స్వయంపాలనావశ్యకతలను గూర్చి పేర్కొనటం జరిగింది. లీగ్ ప్రారంభించిన తరువాత తిరిగి ఈ ఆంగ్ల కరపత్రాలను ముద్రించి పంచటమే గాకుండా భారతీయ భాషల్లోనూ కొత్తగా కరపత్రాలు రూపొందించటం జరిగింది. చాలా శాఖలు బహిరంగ సభలు, ప్రసంగాలు ఏర్పాటు చేయటంలో అధికంగా నిమగ్నమయ్యాయి. ఏ ప్రత్యేక అంశంపై జాతీయస్థాయిలో పిలుపునిచ్చినా శాఖల నుండి మంచి స్పందన లభించేది. ఉదాహరణకు అనిబిసెంటు సెంట్రల్ ప్రోవిన్స్, బీరార్‌లలోనికి ప్రవేశించరాదని 1916 నవంబరులో నిషేధాన్ని ప్రభుత్వం విధించినప్పుడు పలుశాఖలు ప్రభుత్వ చర్యను ఖండిస్తూ తీర్మానాలు చేసి వాటిని వైస్రాయికి, స్టేట్ సెక్రటరీకి పంపటం జరిగింది. అటువంటి స్పందనే ఫిబ్రవరి 1917లో తిలక్‌ను పంజాబ్, ఢిల్లీలలో ప్రవేశించకుండా అడ్డుకున్నప్పుడు లభించింది.

అప్పటి వరకు కాంగ్రెసులో నెలకొన్న నిస్తబ్దతకు కినిసిన పలువురు కాంగ్రెసు మితవాదులు హోంరూలు ఉద్యమంలోకి ప్రవేశించారు. గోఖలేకు చెందిన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ సభ్యులు, లీగ్ సభ్యులు కావటాన్ని అనుమతించక పోయినా

కరపత్రాల ముద్రణద్వారా, ఊరూరూ తిరిగి ప్రసంగించటం ద్వారా హోంరూలు ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించేవాళ్లు. డిసెంబరు 1916లో నిర్వహింపబడనున్న లక్నో కాంగ్రెసు సభలకు సన్నాహాలు చేస్తూ చుట్టూ పల్లెలు, పట్టణాలు పర్యటిస్తూ పలువురు మితవాద జాతీయ వాదులు ఉత్తర ప్రదేశ్‌లో హోంరూలు ఉద్యమంలో చేరిపోయారు. వాళ్ల సమావేశాలు ముఖ్యంగా న్యాయవాదుల గ్రంథాలయాల్లో జరిగేవి. విద్యార్థులు, వ్యాపారస్తులు, వృత్తిదారులు, సంతరోజుల్లో అయితే రైతులు హాజరయ్యే వాళ్లు. ఆ ప్రసంగాలు హిందీలో వుండేవి. ఆనాటి దుర్భర దారిద్ర్యాన్ని గతంలోని వైభవంతో పోలికలు తెచ్చి వివరించే వాళ్లు. ఐరోపా స్వాతంత్ర్యపోరాట ఘట్టాలను వాళ్లకు వివరించి చెప్పేవాళ్లు. హోంరూలు ఉద్యమంలో కాంగ్రెసులోని మితవాదులు పాల్గొనటంలో వింతేముంది? ఎంతో కాలంగా వాళ్లు నిర్వహిస్తూ వచ్చిన రాజకీయ ప్రచారాన్నీ, రాజకీయ ఉద్బోధనూ హోంరూలు ఉద్యమం కొనసాగిస్తూంది.

1916 డిసెంబరులో లక్నో కాంగ్రెసు సభల్లో హోంరూలు ఉద్యమ కారులకు తమ బలాన్ని నిరూపించుకునే అవకాశం లభించింది. ఆ అవకాశం కోసం వాళ్లెంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. అప్పట్లో తిలక్ ఏర్పాటు చేసిన ఆనవాయితీ తరువాత కాంగ్రెసు సభల్లో తప్పనిసరి అంశమై కూర్చుంది. పశ్చిమ భారతం నుండి లక్నో వరకు ప్రతినిధుల్ని ప్రత్యేకంగా చేరవేసే రైలును కాంగ్రెసు స్పెషల్' అనో, 'హోంరూలు స్పెషల్' అనో పిలవసాగారు. అరండేల్ తమ లీగ్‌లోని ప్రతి సభ్యుణ్ణి లక్నో సెషన్‌కు ప్రతినిధిగా నమోదు అయ్యేట్లు చూసుకోమంది. ఆ విధంగా ఆమె కాంగ్రెసును హోంరూలు ఉద్యమ కారులతో ముంచెత్తదలచుకుంది.

తిలక్‌ను, అతని అనుయాయుల్ని మితవాద అధ్యక్షుడైన అంబికా చరణ్ మజుందార్ తిరిగి కాంగ్రెసులోకి స్వాగతించాడు. "దాదాపు పది సంవత్సరాల బాధాకర ఎడబాటు తరువాత, అపార్థాల సుడిగుండాలలో మునక వేసిన తరువాత, ఆనందాన్నివ్వని వివాదాల మృగతృష్ణల్లో పరుగులిడిన తరువాత..... భారత జాతీయ పార్టీలోని ఇరుపక్షాలు కలిసి వుంటే శక్తి సంపన్నులు కాగలరని, విడిపోతే పడిపోగలరనీ అర్థం చేసుకొని ఎట్టకేలకు సోదరులు సోదరుల్ని కలుసుకున్నారు...'

లక్నో కాంగ్రెసు సభల్లో ప్రసిద్ధికెక్కిన కాంగ్రెసు – లీగ్ ఒడంబడిక (లక్నో ఒడంబడికగా ప్రజాను రంజక మయ్యింది) వల్ల కూడ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. మదనమోహన మాలవ్యా వంటి అనేక ప్రముఖ నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా కాంగ్రెసు – లీగ్‌ల మధ్య ఈ ఒడంబడిక నెలకొనేందుకు తిలక్, అనిబిసెంటు యిరువురూ

ప్రముఖ పాత్ర వహించారు. ముస్లింలీగ్ వైపుకు ఈ ఒడంబడిక మొగ్గు చూపిందన్న విమర్శకు లోకమాన్య తిలక్ బదులిస్తూ – 'మహాశయులారా! హిందువులు, ముస్లిం సోదరుల వైపు బాగా వాలిపోయారని కొందరు అంటున్నారు. మనం అంతగా లొంగిపోలేదని నేనంటే యావద్భారతంలోని హిందువుల అభిప్రాయానికి తప్పక నేను ప్రాతినిధ్యం వహించగలను. స్వయం పాలన హక్కులు కేవలం మహమ్మదీయ జాతులకే వర్తింపజేస్తారంటారా...చెయ్యనివ్వండి. కేవలం రాజస్థాన్ వారికే ఆ హక్కులు కల్పిస్తారంటారా... కల్పించనివ్వండి. ఆహక్కుల్ని పొందేందుకు చదువుకున్న వర్గాలకంటే క్రింది వర్గాలు, అట్టడుగు వర్గాలే ఎక్కువ తగినవని బ్రిటీష ప్రభుత్వం భావిస్తే అలాగే కానివ్వండి. భారతదేశంలో ఏ ఒక్క వర్గానికి ఆహక్కుల్ని సంక్రమింపజేసినా బాధపడవలసినపనిలేదు. మనం మూడో వర్గానికి వ్యతిరేకంగా పోరాడవలసి వచ్చినప్పుడు మనం ఈ వేదిక నుండి కలిసి మెలసి ఐకమత్యంతో మెలగటం ముఖ్యం. ఆ ఐకమత్యం జాతి పరంగా, మతపరంగా, రాజకీయ పరంగా కొనసాగవలసి వుంది.

హిందువులలో నియమ నిష్ఠలకు ఆలవాలమైన వర్గానికి చెంది, ప్రాచీన ధార్మిక గ్రంథాలను ఔపోసన పట్టిన వ్యక్తి అటువంటి దృఢసంకల్పాన్ని ప్రకటించటంతో విమర్శకులు ఎదురు నిలువలేక వీగిపోయారు. ముస్లిములకు ప్రత్యేక ఓటు హక్కు అనేది ఎంతటి వివాదాస్పద అంశమయినా మైనారిటీ వర్గాలపై మెజారిటీ వర్గాలు పెత్తనం చేస్తాయనే భయాన్ని మాత్రం తొలగించటంలో కృతకృత్యమయినట్లే.

లక్నో కాంగ్రెసు కూడా స్వయం పాలన దిశగా ఇంకొంత రాజ్యాంగ బద్ధ సంస్కరణలను డిమాండు చేసింది. హోమ్‌రూలు లీగ్‌వారు కోరుకున్న మేరకు అవి లేకపోయినా కాంగ్రెసు ఐక్యతను దృష్టిలో వుంచుకొని వారు అంగీకరించటం జరిగింది. మరో మహత్వపూర్ణ ప్రతిపాదన తిలక్ చేసారు. కాంగ్రెసు రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ కొరకు సమన్వయంతో స్థిరంగా పనిచేసే ఒక చిన్న కార్య నిర్వాహక వర్గాన్ని ఏర్పాటు చేయాలన్నదే ఆ ప్రతిపాదన. వార్షిక సదస్సుల్లో చేసిన తీర్మానాల అమలుకు కూడా బాధ్యత వహిస్తూ అది కృషి చేస్తుందన్నాడు. ఆ ప్రతిపాదన ద్వారా కాంగ్రెసును చర్చావేదిక స్థాయి నుండి నిరంతర ఉద్యమాన్ని నడిపే సంస్థగా రూపుదిద్దవచ్చు ననుకున్నాడు. దురదృష్టవశాత్తు మితవాద వ్యతిరేకత వల్ల ఆ ప్రతిపాదన వీగిపోయింది. ఆ తరువాత నాలుగేళ్లకు 1920లో మహాత్మాగాంధీ రూపొందించిన సంస్కరణాయుత కాంగ్రెసు నియమావళిలో కాంగ్రెసు ఉద్యమాన్ని నిరంతరంగా కొనసాగించాలంటే ఓ కార్య నిర్వాహక వర్గము తప్పనిసరి మార్పుగా పేర్కొనటం జరిగింది.

కాంగ్రెసు సభలు ముగిసాక అదే పందిట్లో ఉభయ హోమ్‌రూల్ లీగ్‌ల సంయుక్త సమావేశం నిర్వహింపబడింది. ఓ వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. కాంగ్రెసు - హోం రూల్ లీగ్ ఒడంబడిక స్వాగతించబడింది. సభలో అనిబిసెంటు, తిలక్ ఇరువురూ ప్రసంగించారు. వాళ్ల తిరుగు ప్రయాణంలో నాయకులిరువురూ ఉత్తర, మధ్య, తూర్పు భారతంలోని పలు ప్రాంతాల గుండా దిగ్విజయ యాత్రలు నిర్వహించారు.

హోం రూలు ఉద్యమం అలా మిక్కిలిగా ప్రజాదరణ పొందటం ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యింది. మద్రాసు ప్రభుత్వం మరీ కఠినంగా వ్యవహరిస్తూ విద్యార్థులు రాజకీయ సభలకు హాజరు కావటాన్ని నిషేధించింది. ఈ ఉత్తర్వుల్ని అందరూ ఖండించారు. ఈ సందర్భంగా తిలక్ వ్యాఖ్య ఏమంటే - 'దేశభక్తి తరంగాలు ఎక్కువగా విద్యార్థుల్ని తాకుతాయనేది ప్రభుత్వానికి పూర్తిగా తెలుసు, ఏదయినా ఒక జాతి విజయవంతమై విలసిల్లాలంటే అది శక్తి మంతమైన కొత్త తరం ద్వారానే సాధ్యపడుతుంది.

* * *

1917 జూన్ మాసంలో మద్రాసు ప్రభుత్వం శ్రీమతి బిసెంటును ఆమె అనుయాయులు బీ.పీ. వాడియా, జార్జి అరండేల్‌ను నిర్బంధించ బూనటంతో ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. వాళ్ల నిర్బంధం దేశవ్యాప్త నిరసనకు అవకాశాన్నిచ్చింది. సర్.యస్. సుబ్రమణియ అయ్యర్ నాటకీయంగా తన 'సర్' బిరుదాన్ని త్యజించాడు. ఇంత వరకూ ఉద్యమానికి దూరంగా వున్న పలువురు - మదన్ మోహన్ మాలవ్యా, సురేంద్రనాథ్ బెనర్జీ, మహమ్మదాలీ జిన్నా వంటి మితవాద నాయకులు సైతం నిర్బంధించ బడిన వారికి తమ సంఘీభావాన్ని ప్రకటించేందుకూ, ప్రభుత్వ చర్యను ఖండించేందుకు గాను హోంరూలు లీగ్‌లో సభ్యత్వం పొందారు. 1917 జూలై 28న అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశంలో ప్రభుత్వం గనుక నిర్బంధించిన వారిని విడుదల చేయకుంటే శాంతియుత ప్రతిఘటన లేదా శాసనోల్లంఘన చేపట్టాల్సిందిగా తిలక్ పిలుపునిచ్చాడు. శాంతి పోరాటం ప్రతిపాదన అన్ని ప్రాంతీయ కాంగ్రెసు కమిటీలకు అభిప్రాయ సేకరణ నిమిత్తం పంపటం జరిగింది. బీహార్, మద్రాసు తమ ఆమోదాన్ని వెంటనే తెలియజేస్తే నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం వేచి చూడాలనుకున్నాయి చాలా ప్రాంతీయ కమిటీలు. గాంధీజీ ప్రోద్బలంతో శంకర్‌లాల్ బంకర్, జమ్నాదాస్ ద్వారకా దాస్ నిర్బంధ ఉత్తర్వులను ఉల్లంఘించి బిసెంటును నిర్బంధించిన తావుకు పయనమయ్యేందుకు సిద్ధమేనంటూ అంగీకరించిన వారి వెయ్యి సంతకాలను సేకరించాడు. అలాగే హోంరూలు

ఉద్యమం మహజరుపై రమారమి పది లక్షల సంతకాలు కర్షకులవి, కార్మికులవి సేకరించసాగారు. వాళ్లు గుజరాత్‌లోని పట్టణాలను, పల్లెలను తరచుగా సందర్శిస్తూ లీగ్ శాఖలను నెలకొల్పటంలో సహాయాన్ని అందించారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ప్రభుత్వ అణచివేత చర్యలు ఆందోళనకారుల్ని మరింత కిర్రెక్కించి వాళ్లలో ప్రభుత్వాన్ని అడ్డుకోవాలనే కాంక్షను పెంచింది. మాంటేగు తన డైరీలో యిలా వ్రాసుకున్నాడు : 'శివుడు తన భార్యను యాభైరెండు ముక్కలు చేస్తే ఏమయ్యింది – ఒక్కో ముక్కలో ఒక్కో భార్య కన్పించింది. శ్రీమతి బిసెంటు నిర్బంధంలో కూడ ప్రభుత్వానికి సరిగ్గా అటువంటి అనుభవమే ఎదురయ్యింది.

బ్రిటన్‌లోని ప్రభుత్వం తన విధానంలో మార్పును తెచ్చి రాజీధోరణితో వ్యవహరించాలనే నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్టేట్ సెక్రటరీగా వచ్చిన మాంటేగు 1917 ఆగస్టు 20న హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఒక చారిత్రాత్మక ప్రకటన చేసాడు: ప్రభువు పాలనలో... పాలనా పరమైన ప్రతిశాఖలో భారతీయుల ప్రాతినిధ్యాన్ని పెంచి క్రమేపీ స్వయం పాలక సంస్థల్ని అభివృద్ధి పరచటం ద్వారా భారతదేశపు పాలనను ప్రగతి పథంలో బాధ్యతా యుతంగా నిర్వహిస్తూ బ్రిటీషు సామ్రాజ్యంలో దానికి ఓ సుస్థిర స్థానాన్ని కల్పించదలిచాం.[15] అయితే 1909లో రాజ్యాంగ సంస్కరణలు తలపెట్టిన సందర్భంగా లార్డ్ మోర్లే చేసిన ప్రకటనకు పూర్తి భిన్నంగా వుంది. ఆయన అప్పుడు ఆ సంస్కరణలు భారతదేశాన్ని స్వయం పాలక దిశగా నడిపేందుకు కాదని స్పష్టం చేయటం జరిగింది. ఇప్పుడు మాంటేగు ప్రకటన ప్రాముఖ్యత ఏమంటే ఈ ప్రకటన తరువాత కూడా హోంరూలు లేదా స్వయంపాలన కోరటం విద్రోహచర్య కాబోదు.

అయితే దీని మూలంగా బ్రిటీషు ప్రభుత్వం స్వయం పాలనను మంజూరు చేయబోతున్నదనీ భావించరాదు. ఆ ప్రకటనతోపాటు వున్న ఆ వాక్యంలోని అదనపు భాగంలో కావలసినంత మెలిక ఉంది. బాధ్యతా యుతమైన ప్రభుత్వాన్ని ఎప్పుడు, ఎలా అందించటమన్నది ప్రభుత్వం నిర్ణయిస్తుందనే దాంట్లో ప్రభుత్వం అధికారపు బదలాయింపులో కావలసినంత జాప్యం చేసేందుకు అవకాశం ఏర్పడింది.

మాంటేగు ప్రకటనలోని రాజీధోరణి ఫలితంగా అనిబిసెంటు 1917 సెప్టెంబరులో విడుదలయ్యింది. ఆమె అప్పుడు ఎంతగానో ప్రజాదరణనుచూరగొనటంతో తిలక్ సలహాపై 1917 డిసెంబరులో ఆమెను కాంగ్రెసు వార్షిక సభలో అధ్యక్షురాలిగా ఎన్నుకొన్నారు.

* * *

హోంరూలు ఉద్యమంలో అంతవరకు కూడగట్టిన శక్తి యుక్తులన్నీ 1918లో అనేక కారణాల వల్ల సడల బారసాగినాయి. 1917లోని కుదుపు తరువాత ఉద్యమం ముందుకు చొచ్చుకు పోవలసింది పోయి నిదానంగా కనుమరుగు కాసాగింది. దానికి ఒక ప్రధాన కారణం బిసెంటు అరెస్టు తరువాత చేరిన మితవాదులు సంస్కరణ విషయంలో వాగ్దానాలు, బిసెంటు విడుదలతో సంతృప్తి చెందారు. శాసనోల్లంఘన మాట మూలంగా కూడ వాళ్లు 1918 నుండి కాంగ్రెసు సభలకు హాజరు కాక దూరంగా వుండిపోయారు. 1918 జూలైలో ప్రభుత్వం తన ప్రణాళికా రచనను ప్రచురించటంతో జాతీయవాద శ్రేణుల్లో ఇంకా చీలిక ఏర్పడింది. కొందరు ప్రభుత్వ విధానాన్ని వెంటనే అంగీకరించాలన్నారు. కొందరు వెంటనే వ్యతిరేకించాలన్నారు. అయితే చాలా మంది మాత్రం ఆ విధానం తగినట్లుగా లేకపోయినా కొంత సమయమిచ్చి వేచి చూద్దాం అన్నారు. ఈ విషయంలోనూ శాంతియుత పోరాటం విషయంలోనూ అనీబిసెంటు ఎంతో ఊగిసలాటను ప్రదర్శించింది. కొన్ని సార్లు ప్రతిఘటన పనికిరాదంది. అయితే ఉద్యమంలోని యువకుల వత్తిడి కారణంగా దానిని ఆమె సమర్థించేది. అలాగే ఆమె తిలక్‌తో కలసి తొలుత సంస్కరణల విషయంలో బ్రిటన్ యిచ్చేదా? భారత్ పుచ్చుకునేదా అంటూ తిరగబడింది గాని తరువాత వాటిని అంగీకరించేందుకు నిర్ణయించుకుంది. తిలక్ తన ధోరణిలో ఊగిసలాటకు తావివ్వలేదు. కాని, బిసెంటు ఊగిసలాట, మితవాదుల ఆలోచనా ధోరణిలోని మార్పుల కారణంగా ఆయన తనకు తానుగా ఉద్యమాన్ని నిలబెట్టటంలో నిస్సహాయంగా నిలిచిపోవలసి వచ్చింది. ఆ సంవత్సరాంతానికి 'ఇండియన్ అన్‌రెస్ట్' గ్రంథకర్త కేసు విషయంలో తిలక్ ఇంగ్లండుకు వెళ్లి కీలకమైన సమయంలో భారతదేశానికి దూరంగా వుండవలసి వచ్చింది. అనీబిసెంటు దృఢ సంకల్పంతో ముందుకు సాగలేకపోవటం, తిలక్ దూరంగా ఇంగ్లండులో వున్న కారణంగా ఉద్యమం నాయకత్వలేమిని ఎదుర్కోవలసి వచ్చింది.

అయితే హోంరూలు ఉద్యమం అత్యద్భుతంగా సాధించి పెట్టిందేమంటే చిత్త శుద్ధిగల జాతీయ వాదుల తరాన్ని అందించింది. వాళ్లు తరువాత మహాత్మాగాంధీ కాలంలో ఉద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదాల్చినప్పుడు జాతీయ ఉద్యమానికి

వెన్నెముకగా నిలిచారు. హోంరూలు ఉద్యమశాఖలు పట్టణాలకు గ్రామాలకు మధ్య సంబంధాలను పటిష్ట పరిచి తరువాత కాలంలో అవి బాగా ఉపయోగపడేందుకు మార్గం సుగమం చేసాయి. హోంరూలు లేదా స్వయం పాలన ఆలోచనను ప్రజల్లో బాగా ప్రచారానికి తీసుకురావటంతో దేశంలో ఓ విధమైన జాతీయవాద అనుకూల వాతావరణం బాగా వ్యాప్తి చెందింది.

1918లో తొలి ప్రపంచ యుద్ధం ముగిసే నాటికి జాతీయ వాదుల్లోని కొత్తతరం రాజకీయ అవగాహనతో ఉత్తేజితులై మార్పు జరుగుతున్నతీరుకు అసహనాన్ని ప్రదర్శిస్తూ, ఒక శక్తిమంతమైన రాజకీయ చర్య ద్వారా బయట పడేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ స్థాయికి తెచ్చిన హోంరూలు ఉద్యమ నాయకులు వాళ్లను ముందుకు తీసుకుపోలేక పోతున్నారు. ఆ విధంగా మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ ప్రవేశానికి రంగం సిద్ధమయ్యింది. అప్పటికే ఆయన దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కుల పోరాటానికి, నాయకత్వం నెరపి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని వున్నాడు. చంపారన్, అహమ్మదాబాద్, ఖేడాలలో భారతీయ రైతుల పోరాటాలకు నాయకత్వం వహించి వున్నాడు. 1919లో ఆయన భరించనలవిగాని, రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా పిలుపు నిచ్చినప్పుడు హోంరూలు ఉద్యమ స్ఫూర్తితో రాజకీయ చైతన్యాన్ని సంతరించుకున్న వాళ్లందరినీ ఆయన ముందడుగు వేయించినట్లయ్యింది.

* * *

# 14 గాంధీజీ తొలి పోరాటం

**రౌ**లత్ చట్టానికి వ్యతిరేకంగా 1919 మార్చిలో మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ తన తొట్టతొలి దేశవ్యాప్త పోరాటమైన 'సత్యాగ్రహ'నికి పిలుపు ఇచ్చేటప్పటికి ఆయన వయసు సరిగ్గా యాభైయ్యేళ్ళు. భారత జాతీయోద్యమ నాయకత్వాన్ని చేపట్టి, కష్టకాలాల్లో దానికి సరైన దిశానిర్దేశం చేయబోతున్న ఆయనను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే మనం కనీసం పాతికేళ్ళు వెనక్కు వెళ్లాలి. అంటే, 1893లో ఓ 24 ఏళ్ళ యువబారిస్టర్‌గా దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టి అక్కడ జాతివివక్షకు వ్యతిరేకంగా భారతీయుల తరపున పోరాటాన్ని ప్రారంభించిన కాలానికి వెళ్ళాలి.

* * *

దాదా అబ్దుల్లా అనే ఓ గుజరాతీ వ్యాపారి న్యాయపరమైన వివాదాన్ని పరిష్కరించడానికి ఒక ఏడాది కాంట్రాక్టుమీద 1893లో దర్బన్‌లో అడుగుపెట్టినప్పుడు ఈ యువబారిస్టర్ పొట్టపోసుకోవడానికి వచ్చిన ఒక సామాన్యుడిగానే కనిపించాడు. కానీ, దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన తొలి భారతీయ బారిస్టర్ అయనే. అక్కడ విద్యాధికుడైన భారతీయుడు కూడా ఆయనే.

భారతదేశంనుంచి దక్షిణాఫ్రికాకు 1890లలో వలస ప్రారంభమైంది. దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డ తెల్లవారు తమ చెరకు తోటల్లో పనిచేయడానికి భారతీయ కార్మికులను, ప్రధానంగా దక్షిణ భారతదేశస్తులను నియమించుకోవడంతో ఈ వలస

మొదలైంది. వారితోపాటుగానే భారతీయ వ్యాపారులు, ముఖ్యంగా అధికసంఖ్యలో మెమన్ ముస్లింలు దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టారు. చెరకు తోటల్లో పనిచేసి కాంట్రాక్టు ముగిసిపోయిన తరువాత అక్కడే స్థిరపడిపోయిన (వీరి సంతానంలో ఎక్కువమంది దక్షిణాఫ్రికాలో జన్మించినవారే) వలస కూలీలు దక్షిణాఫ్రికాలోని భారతీయుల్లో మూడవ గ్రూపు. ఈ భారతీయులెవ్వరికీ కూడా చదువులేదు. చదువుకొనే అవకాశమూ లేదు. ఇంగ్లీషు చదువులు ఇంకా తక్కువ. ధనిక వ్యాపారులకు కూడా ఏదో వ్యాపార అవసరాలకోసం నేర్చుకున్న నాలుగు ఇంగ్లీష్ ముక్కలు మినహా భాషాజ్ఞానం లేదు. దక్షిణాఫ్రికా భారతీయుల జీవితాల్లో జాతివివక్ష అంతర్భాగం. ఈ వివక్షపట్ల వారిలో అసంతృప్తి ఉన్నప్పటికీ దానిని ఏ విధంగా ఎదుర్కోవాలో వారికి తెలియదు. వారు జాతివివక్షను సహించి, భరించి చివరకు దానికి అలవాటు పడిపోయారు.

కానీ, కడుపునింపుకోవడం కోసం ఇటువంటి వివక్షనూ, అవమానాన్నీ భరించి, జీర్ణించుకోగలిగే స్వభావం మోహన్‌దాస్‌గాంధీకి లేదు. ఎందుకంటే ఆయన భారతదేశంలో ఒక రాష్ట్రానికి దివాన్‌గా పనిచేసినాయన కుమారుడు. ఆయన కుటుంబం ఆర్థికసమస్యల్లో కొట్టుమిట్టాడుతుండవచ్చు గాక. కానీ, స్వగ్రామం కథియావాడ్‌లో ఆ కుటుంబానికి అనన్యమైన గౌరవమర్యాదలున్నాయి. దీనితోపాటు ఆయన బారిస్టర్ చదువుకోసం లండన్‌లో మూడేళ్ళు ఉండివచ్చిన వ్యక్తి. దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన అతికొద్దిరోజుల్లోనే చవిచూడాల్సి వచ్చిన జాత్యంహంకారాన్నీ, వివక్షాపూరితమైన అవమానాలనూ గాంధీ ఇటు భారతదేశంలో కానీ, అటు ఇంగ్లండ్‌లో కానీ ఎన్నడూ ఎదుర్కొనలేదు.

ఈ ఖండంలో అడుగుపెట్టిన వారంరోజుల్లోనే డర్బన్‌నుంచి ప్రిటోరియాకు జరిపిన ప్రయాణంలో ఆయన వరుసగా అనేక అవమానాలను చవిచూశారు. ఒక శ్వేతజాతీయుడు ఆయనను ఫస్ట్‌క్లాస్ బోగీనుంచి బైటకు తోసేయడంతో, వెయిటింగ్ రూమ్‌లో రాత్రంతా చలికి వొణుకుతూ కూచున్న సంఘటనతోపాటు, ఫస్ట్‌క్లాస్ టిక్కెట్ కొనుక్కొని కూడా ఇంజన్‌బోగీలో కూచుని ప్రయాణించాల్సి వచ్చిన అవమానాన్ని కూడా ఆయన చవిచూశారు. అంతేకాదు, ఆ బోగీలో కూడా డ్రైవర్‌పక్క సీట్లో కాకుండా ఫుట్‌బోర్డుమీద కూచుని ప్రయాణించాలన్న ఆదేశాన్ని ఖాతరుచేయనందుకు ఆయనను విపరీతంగా కొట్టారు. జొహెన్నస్‌బర్గ్ చేరుకున్న తరువాత రాత్రి బసచేయడానికి హోటల్ గదికోసం ఆయన విపరీతంగా వెతుక్కోవాల్సివచ్చింది. తాను గది అడిగిన మరుక్షణమే

గదులు ఖాళీలేవన్న సమాధానం ఆయనను నిర్ఘాంతపరిచింది. రైల్వేనియమనిబంధనలను ఏకరువుపెట్టి జొహెన్నస్‌బర్గ్ నుంచి ప్రిటోరియాకు ఫస్ట్‌క్లాస్ టిక్కెట్ విజయవంతంగా సంపాదించినప్పటికీ, ఆయనను మరోమారు కంపార్ట్‌మెంట్‌నుంచి దాదాపు బయటకునెట్టేసినంత పనిచేశారు. ఒక యూరోపియన్ ప్రయాణికుడి జోక్యంతో ఆయనకు ఈ అవమానం తప్పింది.

తన రాకకు ప్రధానకారణమైన వ్యాజ్యాన్ని నెరవేర్చాల్సిన ప్రిటోరియాకు చేరుకోగానే ఆయన అక్కడి భారతీయులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇంగ్లీష్ నేర్చుకోదలచుకున్న వారెవరికైనా తాను నేర్పుతానని ప్రకటించారు. భారతీయులు తమను తాము సంఘటితపరచుకొని అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. తన నిరసనను పత్రికలద్వారా కూడా ఆయన వ్యక్తపరిచారు. జరుగుతున్న అన్యాయంపట్ల తీవ్ర ఆగ్రహావేశాలను వ్యక్తంచేస్తూ 'నేషనల్ అడ్వయిజర్'కు రాసిన ఉత్తరంలో– 'క్రైస్తవం దీనిని అంగీకరిస్తుందా..., ఇది న్యాయమైన విధానామేనా... అసలిది నాగరికతేనా?... జవాబుకోసం ఎదురుచూస్తున్నాను'– అన్నారాయన. దక్షిణాఫ్రికాలో ఉండిపోవాలన్న ఉద్దేశం ఆయనకు అప్పటికి లేకపోయినప్పటికీ, ప్రిటోరియాలోని భారతీయులకు ఆత్మగౌరవాన్ని గుర్తుచేసి, జాతివివక్షకు సంబంధించిన అన్ని రకాల దురాగతాలనూ ఎదుర్కొనాల్సిందిగా ప్రోత్సహించారు.

తాను పరిష్కరించాల్సిన వ్యాజ్యాన్ని పరిష్కరించిన తరువాత గాంధీజీ భారతదేశానికి వెళ్లిపోవాలని సంకల్పించారు. అయితే, డర్బన్‌నుంచి భారత్‌కు బయలుదేరుతున్న సమయంలో ఆయన భారతీయుల పౌరసత్వాన్ని రద్దుచేయడానికి ఉద్దేశించిన ఒక బిల్లుపై తన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బిల్లు చట్టసభకు సంబంధించిన అన్ని వ్యవహారాలూ పూర్తిచేసుకుని ఆమోదానికి సిద్ధంగా ఉన్న దశ అది.

దక్షిణాఫ్రికాలోని భారతీయులు గాంధీని కలిసి ప్రయాణం వాయిదావేసుకోమని కోరారు. కనీసం ఒక నెలపాటు ఉండి ఈ బిల్లుపై నిరసన తెలియచేయడంలో తమకు సహకరించమని ప్రాధేయపడ్డారు. కనీసం పిటిషన్లు రాయడానికికూడా తగిన ఇంగ్లీషు పరిజ్ఞానం లేని కారణంగానూ, తమను తాము సంఘటిత పరచుకొని తమ వ్యతిరేకతను వ్యక్తంచేయలేని అశక్తత కారణంగానూ గాంధీజీ సహకారం అవసరమని వారు వివరించారు. నెలరోజులపాటు దక్షిణాఫ్రికాలో ఉండటానికి అంగీకరించిన గాంధీజీ

ఇరవైయ్యేళ్ళపాటు అక్కడే ఉన్నారు. అప్పటికి ఆయన వయసు పాతికేళ్ళు. ఆయన ఆ దేశాన్ని వదిలిపెట్టేసరికి నలభైఅయిదేళ్ళు.

దక్షిణాఫ్రికాలో గాంధీజీ అనుభవాలు ఒక విధంగా ఎంతో ప్రత్యేకమైనవి. బ్రిటన్‌లో బారిస్టర్ అయిన కారణంగా ఆయన చాలావాటిని– ఉదాహరణకు, ఫస్ట్‌క్లాస్ రైలు టిక్కెట్లు, హోటల్‌గదులు వంటివాటిని తన హక్కుగా డిమాండ్ చేసేవారు. ఈ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవడం ఎందుకంటే, ఆయనకంటే ముందు మరే భారతీయుడు కూడా కనీసం వాటిని అడగడానికి కూడా ధైర్యం చేయలేదు. తమపట్ల తెల్లజాతివారు వివక్షచూపడానికి కారణం తాము 'నాగరికులు' కాకపోవడం– అంటే 'పాశ్చాత్యీకరణ' చెందకపోవడంవల్లేనని బహుశా వారు భావించి ఉంటారు. అయితే,పాశ్చాత్యీకరణ చెందిన గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఎదుర్కొన్న అనుభవాలు అటు ఆయనకూ, ఇటు భారతీయులకూ కూడా తెల్లజాతి పాలకుల జాత్యాహంకారమే వీటన్నింటికీ అసలు కారణమన్న విషయాన్ని తేల్చిచెప్పాయి. మరోవైపు, పాశ్చాత్య చదువులు చదువుకున్న ఏకైక భారతీయుడుగా–జాతివివక్షకు వ్యతిరేకంగా భారతీయుల పోరాటానికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత కూడా ఆయన భుజస్కంధాలపై పడింది. ఈ పాతికేళ్ళ యువబారిస్టర్ కంటే అనుభవంలోనూ, వయసులోనూ కూడా పెద్దవారైన ధనిక భారతీయవ్యాపారులు ఆయనను తమ నాయకుడుగా ముందుకు తోయడానికి కారణం– పాలకులతో వారి భాషలో మాట్లాడగలిగే వ్యక్తి ఆయన ఒక్కడే కనుక. తమకోసం పిటిషన్లు రాయగలిగేవాడూ, తమను సంఘటితం చేయగలిగేవాడూ, పాలకుల ముందు తమకు ప్రాతినిధ్యం వహించగలిగేవాడూ ఆయన మాత్రమే కనుక.

* * *

దక్షిణాఫ్రికాలో గాంధీజీ కథ చాలా పెద్దది. భారతదేశానికి రాకముందు ఆయన అక్కడ ఎదుర్కొన్న విభిన్నమైన అనుభవాలను తెలుసుకోవడంకోసం మనం ఇక్కడ దానిని సంక్షిప్తంగా చెప్పుకుందాం.

1894 నుంచి 1906 వరకూ గాంధీజీ సాగించిన రాజకీయ కార్యకలాపాలను దక్షిణాఫ్రికాలోని భారతీయులకోసం ఆయన జరిపిన పోరాటంలోని

'మితవాద' దశగా చెప్పుకోవచ్చు. ఈ దశలో ఆయన ప్రధానంగా దక్షిణాఫ్రికా చట్టసభలకూ, లండన్‌లోని వలసవిభాగపు అధిపతికీ, బ్రిటిష్ పార్లమెంటుకూ అర్జీలు సమర్పించడంపైనే దృష్టి కేంద్రీకరించారు. అన్ని వాస్తవాలనూ సార్వభౌమ ప్రభుత్వం ముందు ఉంచితే బ్రిటిష్‌వారిలో ఉన్న సమన్యాయం, నిష్పక్షపాత వైఖరికి సంబంధించిన స్పృహ రగిలి భారతీయుల తరపున సార్వభౌమ ప్రభుత్వం రంగంలోకి దిగుతుందని ఆయన ఆశించారు. అన్ని వర్గాలకు చెందిన భారతీయులను సంఘటితం చేయడం, వారి డిమాండ్లకు ప్రాచుర్యం కల్పించడం ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. 'నటాల్ ఇండియన్ కాంగ్రెస్'ను ఏర్పాటు చేయడం ద్వారా , 'ఇండియన్ ఒపీనియన్' పత్రికను ప్రారంభించడం ద్వారా ఈ లక్ష్యసాధనకు ఆయన కృషిచేశారు. ఉద్యమాన్ని నిర్మించడంలోనూ, నిధులు సేకరించడంలోనూ, పాత్రికేయుడుగా వ్యవహరించడంలోనూ గాంధీజీకి ఉన్న శక్తిసామర్థ్యాలు ఈ కాలంలోనే బహిర్గతమైనాయి. కానీ, 1906 నాటికి గాంధీజీ ఈ 'మితవాద' పోరాటధోరణితో బాగా అలిసిపోయారు. ఈ విధానాలు ఎటువంటి ఫలితాన్నీ ఇవ్వవని ఆయనకు పూర్తిగా అర్థమైపోయింది.

దక్షిణాఫ్రికాలో గాంధీజీ రెండోదశ పోరాటం 1906నుంచి ఆరంభమైంది. ఈ దశలో ఆయన శాసనోల్లంఘనను ఒక ఉద్యమ విధానంగా ఎంచుకున్నారు. దానికి 'సత్యాగ్రహం' అని పేరుపెట్టారు. దక్షిణాఫ్రికాలోని ప్రతిభారతీయుడూ తన వేలిముద్రలున్న గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా తమతోపాటు ఉంచుకోవాలని ప్రభుత్వం శాసనం చేసినప్పుడు దానిపై నిరసనను వ్యక్తం చేసేందుకు గాంధీజీ తొట్టతొలిసారిగా ఈ విధానాన్ని ఉపయోగించారు. 1906 సెప్టెంబరు 11న జొహెన్నస్‌బర్గ్‌లోని ఎంపైర్ థియేటర్‌లో జరిగిన ఒక బ్రహ్మాండమైన సభలో భారతీయులంతా ఈ శాసనానికి లొంగకూడదనీ, ఎటువంటి పర్యవసానాలనైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలనీ ఏకకంఠంతో తీర్మానించారు. ఇది జరిగిన తరువాత కూడా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోలేదు. భారతీయులు కూడా తమ పట్టువిడవదల్చుకోలేదు. ప్రచారం నిర్వహించడానికి గాంధీజీ ఒక సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాసనం ప్రకారం భారతీయులు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిన గడువు ముగిసిపోవడంతో గాంధీజీపైనా, మరో 26మందిపైనా అభియోగాలు నమోదైనాయి. నేరాన్ని అంగీకరించిన వీరందరినీ దేశం విడిచిపోవలసిందిగా ఆదేశించారు. అందుకు వీరంతా

నిరాకరించడంతో జైలుకు పంపించారు. అయితే, వ్యవహారం అక్కడితో ఆగలేదు. మిగతా వారంతా కూడా ఇదేమార్గాన్ని అనుసరించడంతో జైలుకొచ్చిన వారి సంఖ్య 155కు చేరుకుంది. జైలు భయం అందరిలోనూ పోయింది. అందరూ దానిని ముద్దుగా 'కింగ్ ఎడ్వర్డ్ హోటల్' అని పిలుచుకోవడం ఆరంభించారు.

గాంధీజీని జనరల్ స్మట్స్ చర్చలకు ఆహ్వానించి, భారతీయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ పేర్లను నమోదు చేయించుకున్న పక్షంలో ఈ చట్టాన్ని ఉపసంహరించుకుంటానని హామీ ఇచ్చాడు. గాంధీజీ అందుకు అంగీకరించడమే కాకుండా మొదట తనపేరే నమోదుచేసుకున్నారు. అయితే, స్మట్స్ ఆ తరువాత అతితెలివి ప్రదర్శిస్తూ ఓ మడతపేచీ పెట్టాడు. స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నప్పటికీ వీటికి చట్టబద్ధమైన ఆమోదముద్ర పడాల్సిందేనన్నాడు. దీనితో గాంధీజీ నాయకత్వంలోని భారతీయులు ఈ రిజిస్ట్రేషన్ పత్రాలను బహిరంగంగా తగలబెట్టి తమ వ్యతిరేకతను తెలియచేశారు.

ఇదిలా ఉండగా, ప్రభుత్వం మరో కొత్తశాసనాన్ని తీసుకొచ్చింది. ఈసారి అది భారతీయుల వలసలను నియంత్రించడానికి ఉద్దేశించినది. దీనిని వ్యతిరేకించడానికి ఉద్యమం మరింత విస్తృతరూపాన్ని సంతరించుకుంది. 1908 ఆగస్టులో నటాల్‌కు చెందిన అనేకమంది భారతీయ ప్రముఖులు ఈ కొత్త 'వలస నియంత్రణ' చట్టాన్ని ఉల్లంఘిస్తూ నటాల్ ప్రాంతపు సరిహద్దులుదాటి ట్రాన్స్‌వాల్ ప్రాంతంలోకి ప్రవేశించి అరెస్టయ్యారు.ట్రాన్స్‌వాల్‌లోని మిగతా భారతీయులు కూడా అదేవిధంగా వ్యవహరించి చట్టాన్ని ఉల్లంఘించారు. లైసెన్సులున్న వ్యాపారులు వాటిని చూపించడానికి నిరాకరించడం మరోపరిణామం. వీరందరినీ కూడా జైలులో పెట్టారు. 1908 అక్టోబర్‌లో మిగతావారితోపాటు గాంధీజీ కూడా జైలుపాలయ్యారు. వీరందరికీ కఠినమైన కారాగారశిక్షలు పడ్డాయి. దుర్భరమైన జైలు వాతావరణంలో, అధిక శ్రమతో కూడుకున్న అనేక పనులు చేయాల్సివచ్చింది. అయినప్పటికీ ఈ శిక్ష వారిలో పోరాటస్ఫూర్తిని ఏమాత్రం దెబ్బతీయలేకపోయింది. దీనితో ప్రభుత్వం భారతీయులను-ముఖ్యంగా పేదవారిని తిరిగి భారతదేశానికి పంపించివేసే కార్యక్రమాన్ని నడుంబిగించింది. ఆర్థికప్రయోజనాలను దెబ్బతీసే బెదిరింపులతో వ్యాపారులను లొంగదీసుకోవడానికి సిద్ధపడింది.

ఈ దశలో ఉద్యమంలో స్తబ్ధత ఏర్పడింది. కొంతమంది సత్యాగ్రహులు జైలుకెళ్లడమూ, రావడమూ జరుగుతున్నప్పటికీ అధికుల్లో డస్సిపోయిన సూచనలు కనిపించడం

ఆరంభమైంది. ఉద్యమం దీర్ఘకాలంపాటు నిష్ప్రయోజనంగా సాగుతున్నదని స్పష్టంగా తేలిపోయింది. మరోపక్క ప్రభుత్వం దిగివచ్చే సూచనలు కూడా కనిపించడం లేదు. ఉన్నతాధికారులను కలవడానికి 1909లో గాంధీజీ జరిపిన లండన్‌యాత్ర ఫలితాలనివ్వలేదు. మరోవైపు సత్యాగ్రహుల కుటుంబాలకు చేయూతనివ్వడానికీ, ఇండియన్ ఒపీనియన్ నిర్వహణకూ ఉద్దేశించిన నిధులు కూడా తరిగిపోతున్నాయి. గాంధీజీ న్యాయవాద వృత్తి కూడా ఆయన ఉద్యమానికి పూర్తిగా అంకితమైపోయిన (1906) నాడే అటకెక్కిపోయింది. ఈ దశలోనే గాంధీజీ తన జర్మన్ మిత్రుడు కల్లెన్‌బాచ్ ఆర్థికసహాయంతో 'టాల్‌స్టాయ్ వ్యవసాయక్షేత్రాన్ని' నిర్మించారు. సత్యాగ్రహుల కుటుంబీకులు తమ కాళ్ళపై తాము నిలబడేందుకు వీలుగా దీనిని ఏర్పాటుచేశారాయన. ఈ వ్యవసాయక్షేత్రాన్ని తరువాత కాలంలో భారత జాతీయోద్యమంలో ప్రధానమైన భూమిక నిర్వహించిన గాంధీ ఆశ్రమాలకు పునాదిగా మనం చెప్పుకోవచ్చు. భారతదేశంనుంచి కూడా గాంధీకి విరాళాలు అందడం ఆరంభమైంది. శ్రీ రతన్‌టాటా పాతికవేల రూపాయలు పంపించారు. కాంగ్రెస్, ముస్లిం లీగ్ విరాళాలు పంపించాయి. హైదరాబాద్ నిజాం కూడా ఆర్థికసాయం చేశారు.

1911లో, అంటే ఐదవ జార్జి చక్రవర్తి పట్టాభిషిక్తుడైన సమయంలో– ప్రభుత్వానికీ, భారతీయులకూ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. కానీ, అది 1912 ఆఖరువరకూ మాత్రమే అమలు జరిగింది. ఇంతలో గోఖలే దక్షిణాఫ్రికా వచ్చారు. ప్రభుత్వం ఆయనను అతిథిగా సమాదరించి భారతీయులకు వ్యతిరేకంగా ఉన్న అన్ని రకాల వివక్షాపూరితచట్టాలనూ రద్దుచేయడం జరుగుతుందని హామీ ఇచ్చింది. అయితే, ఈ హామీ ఎప్పటికీ అమలుకునోచుకోకపోవడంతో 1913లో మళ్ళీ 'సత్యాగ్రహం' ఆరంభమైంది.

ఈసారి ఈ ఉద్యమం మరింత విస్తృతరూపాన్ని సంతరించుకుంది. గతంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసినవారందరిపైనా మూడుపౌండ్ల 'పోల్‌టాక్స్'ను విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్న మరో కొత్త డిమాండ్ తోడైంది. నెలకు సగటున 10 షిల్లింగ్‌లు కూడా ఆదాయంలేని నిరుపేద కూలీలపై అపరిమితమైన ఆర్థికభారాన్ని మోపుతూ విధించిన ఈ పన్ను అటు ప్రస్తుత కాంట్రాక్టు కార్మికులనూ, మాజీ కాంట్రాక్టు కార్మికులనూ కూడా ఆగ్రహోదగ్రులను చేసింది. వారంతా సత్యాగ్రహ

ఉద్యమంలోకి వచ్చిచేరడంతో ఉద్యమం మరింతగా విస్తరించింది. ఈ వేడికి తోడుగా మరింత ఆజ్యం పోస్తూ సుప్రీంకోర్టు ఇంతలో ఒక విచిత్రమైన తీర్పు ప్రకటించింది. క్రైస్తవ పద్ధతిలో జరగని వివాహాలూ,రిజిస్టర్ కాని వివాహాలూ చెల్లనేరవని న్యాయస్థానం ఆ తీర్పులో ప్రకటించింది. దాని ప్రకారం హిందూ, ముస్లిం, పార్సీ వివాహాలు చట్టవ్యతిరేకమైనవి కావడంతోపాటు ఈ పద్ధతిలో వివాహాలు చేసుకున్నవారి సంతానం అక్రమసంతానం కూడా అవుతుంది. ఈ తీర్పు భారతీయులను తీవ్రమనోవేదనకు గురిచేసింది. తమ ఆడవారి గౌరవమర్యాదలకు విఘాతంగా, అత్యంత అవమానంగా భావించారు. తమ గౌరవాన్ని కించపరిచిన ఈ తీర్పుపై తీవ్రనిరసననూ, ఆగ్రహాన్నీ వ్యక్తపరుస్తూ అనేకమంది మహిళలు ఉద్యమంలోకి వచ్చిచేరారు.

ఈ దశలో తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైన విషయాన్ని గాంధీజీ గ్రహించారు. సత్యాగ్రహుల పోరాటపటిమనూ,శక్తిసామర్థ్యాలనూ పూర్తిగా సద్వినియోగంచేసుకోవాల్సిన తరుణం ఇదేనని నిర్ణయించుకున్నారు. గాంధీజీ భార్య కస్తూర్బా సహా 16మంది సత్యాగ్రహులు చట్టవ్యతిరేకంగా సరిహద్దులు దాటడంతో ఉద్యమం ఊపందుకుంది. నటాల్‌లోని ఫీనిక్స్‌నుంచి ప్రయాణం ఆరంభించిన ఈ బృందం భౌగోళిక సరిహద్దులు దాటి ట్రాన్స్‌వాల్‌లోకి అడుగుపెట్టగానే ప్రభుత్వం వారిని అరెస్టుచేసింది. 11మందితో కూడుకున్న మరో బృందం ట్రాన్స్‌వాల్‌లోని టాల్‌స్టాయ్ వ్యవసాయక్షేత్రం నుంచి బయలుదేరి సరిహద్దులుదాటి అనుమతిలేకుండా నటాల్‌లోకి అడుగుపెట్టింది. ఈ బృందం గనులు అధికంగా ఉన్న న్యూకాజల్ పట్టణాన్ని చేరుకుని అక్కడి భారతీయ గనికార్మికులకు (వీరిలో అధికులు తమిళులు) పరిస్థితిని వివరించి చెప్పి వారిని సమ్మెచేయడానికి ఒప్పించగలిగారు. పోలీసులు వచ్చి తమను అరెస్టుచేసేలోగా ఈ బృందం తన బాధ్యతను పూర్తిచేసింది.

గాంధీజీ న్యూకాజల్ చేరుకుని సమ్మె నాయకత్వ బాధ్యతలు స్వీకరించారు. యజమానులు ఈ సమ్మెకు ప్రతిగా కార్మికుల ఇళ్ళకు నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేసి కార్మికులు గత్యంతరం లేని స్థితిలో ఇళ్ళువదిలిపెట్టి పోయే పరిస్థితిని కల్పించారు. ఆడామగా పిల్లాజెల్లా కలుపుకొని మొత్తం రెండువేలమందికిపైగా ఉన్న వీరందరినీ వెంటతీసుకుని కాలినడకన సరిహద్దులు దాటి ట్రాన్స్‌వాల్‌జైలులో వారిని నిర్బంధించాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి కల్పించాలన్నది గాంధీజీ ఆలోచన. ఈ పాదయాత్ర కొనసాగుతున్న

కాలంలో గాంధీజీ రెండుసార్లు అరెస్టయి విడుదలయ్యారు. మూడోసారి అరెస్టుచేసినప్పుడు ఆయనను జైలులోపెట్టారు. అయితే,కార్మికుల నైతికబలం ఏమాత్రం సడలకపోవడంతో సత్యాగ్రహం విజయవంతంగా కొనసాగుతూనే ఉంది. చివరకు ప్రభుత్వం దమనకాండకు సిద్ధపడింది. వారందరినీ రైళ్ళలో కుక్కి మళ్ళీ నటాల్ పంపించివేసి అక్కడ జైళ్ళలో నిర్బంధించింది. జైల్లో వారు దుర్భరమైన, దుర్మార్గమైన పరిస్థితులను ఎదుర్కొనాల్సివచ్చింది. ఆకలితోఅల్లాడిపోతూ, కొరడా దెబ్బలుతింటూ, మిలటరీ పోలీసుల అదిలింపులూబెదిరింపుల మధ్య వారు గనుల్లో కూడా బలవంతంగా పనిచేయాల్సివచ్చింది. గాంధీజీని కూడా ఒక చీకటిగదిలో పడేశారు. ఆయన కూడా రాళ్ళుకొట్టడం, చీపురుపట్టుకుని జైలు ఆవరణను ఊడ్చడం వంటి పనులుచేయాల్సివచ్చింది. చివరకు న్యాయస్థానం ముందు హాజరుపరిచినప్పుడు కూడా ఆయన కాళ్ళకూ చేతులకూ సంకెళ్ళువేసి ఉంచారు.

ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గమైన చర్యలు భారతీయులందరిలోనూ ఆగ్రహావేశాలను రగల్చాయి. తోటల్లోనూ, గనుల్లోనూ పనిచేస్తున్న కార్మికులు ఒక్కసారిగా సమ్మెకు నడుంకట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గోఖలే భారతదేశం అంతటా పర్యటించి ఈ ఉద్యమానికి మద్దతు కూడగట్టేందుకు విశేష కృషిచేశారు. వైస్రాయ్ లార్డ్ హార్డింగ్ కూడా 'నాగరిక దేశంగా చెప్పుకొనే ఏ దేశమూ కూడా చూస్తూ ఊరుకోలేని' దుర్మార్గంగా ఈ దమనకాండను నిరసించారు. అకృత్యాల ఆరోపణలపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించాలని ఆయన కోరారు. నిరాయుధంగా, శాంతియుతంగా వ్యవహరిస్తున్న ఆడామగపైన ప్రభుత్వం పాశవికంగా విరుచుకుపడుతున్న సంఘటనలపై సర్వత్రా నిరసన వ్యక్తమైంది.

తరువాత గాంధీజీ, వైస్రాయ్, సి.ఎఫ్, ఆండ్ర్యూస్, జనరల్ స్మట్స్ మధ్య అనేక విడతల్లో జరిగిన చర్చల ద్వారా ఇరుపక్షాలమధ్యా ఒక ఒప్పందం కుదిరింది. పోల్‌టాక్స్ వ్యవహారం, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల వ్యవహారం, వివాహవిధానాలకు సంబంధించిన వివాదం వంటి భారతీయుల ప్రధాన డిమాండ్లన్నింటికీ ప్రభుత్వం తలొగ్గింది. వీటితోపాటుగా భారతీయుల వలసలకు సంబంధించిన వ్యవహారాన్ని సానుభూతితో పరిశీలించడానికి కూడా అంగీకరించింది.

అహింసాయుత విధానంలో సాగిన శాసనోల్లంఘనోద్యమం ఎదుటివారిని చర్చలకు రప్పించడమే కాక, ఉద్యమం ప్రతిపాదించిన డిమాండ్లకు లొంగేట్టుగా చేసింది. ఈ విధంగా గాంధీ తన పోరాట విధానానికి దక్షిణాఫ్రికాలోనే ఒక ముసాయిదా రూపొందించుకుని మాతృదేశానికి పయనమయ్యారు. దక్షిణాఫ్రికాలో అమలు జరిగిన ప్రయోగం ఇప్పుడు మరింత విస్తృతస్థాయిలో భారత ఉపఖండంలో అమలు కాబోతున్నది.

దక్షిణాఫ్రికాలో గాంధీజీ ప్రయోగం ఇతరత్రాకోణాల్లో కూడా భారతజాతీయోద్యమ నాయకత్వానికి సంబంధించి గాంధీజీని సన్నద్ధం చేసింది. నిరుపేద భారతీయ కార్మికులకు నాయకత్వం వహించిన అమూల్యమైన అనుభవం ఆయనకు లభించింది. త్యాగానికి సిద్ధపడే వారి మనస్తత్వం, ఎంతటి కష్టానికైనా వెరవని మనోధైర్యం, అణచివేతలను నిబ్బరంగా ఎదుర్కోగలిగే వారి శక్తిసామర్థ్యాలను ఆయన అనుభవపూర్వకంగా గ్రహించారు. లక్ష్యసాధనకోసం ఉద్యమాల్లో పాలుపంచుకోవడంతో పాటు ప్రాణత్యాగానికైనా సిద్ధపడే భారతీయ జనబాహుళ్యపు సమర్థతతపట్ల దక్షిణాఫ్రికా అనుభవం ఆయనకు అపరమితమైన విశ్వాసాన్నిచ్చింది.

వివిధ మతాలకు చెందినవారికి నాయకత్వం వహించిన అనుభవాన్ని కూడా దక్షిణాఫ్రికా గాంధీజీకి ప్రసాదించింది. దక్షిణాఫ్రికాలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు ఆయన నాయకత్వం కింద ఉమ్మడిగా పోరాడారు. అంతేకాదు, వేరువేరు ప్రాంతాలకు చెందిన గుజరాతీలు, తమిళులు కూడా వారిలో ఉన్నారు. ధనిక వ్యాపారులనుంచి నిరుపేద రోజుకూలీ వరకూ– విభిన్న సామాజికవర్గాలకు చెందిన వారు ఆయనతో పాటు ఉన్నారు. మగవారితో పాటు ఆడవారు కూడా ఆయన నాయకత్వం వహించిన ఉద్యమంలో పాలుపంచుకున్నారు.

దక్షిణాఫ్రికాలో ఆయన నిర్వహించిన పోరాటం ఆయనకు మరో విచిత్రమైన అనుభవాన్ని కూడా నేర్పింది. నాయకుడిగా ఉన్నవాడు శత్రువులనుంచే కాక అనుచరులనుంచి కూడా దాడులు ఎదుర్కొనవలసి ఉంటుందని దక్షిణాఫ్రికా ఆయనకు తెలియచెప్పింది. ఈ దేశంలో ఆయన కనీసం రెండుసార్లు తన ప్రాణానికి ముప్పువాటిల్లే సందర్భాలను ఎదుర్కొన్నారు. 1896లో డర్బన్‌లో ఆయన ఒక వీధిలో నడుచుకుంటూ

పోతున్నప్పుడు శ్వేతజాతి మూక ఒకటి ఆయనను ఇంటివరకూ వెంబడించింది. ఆయన ఇంట్లోకి పోయి తలుపేసుకున్న తరువాత కూడా ఇంటిని చుట్టుముట్టి 'నీ రక్తం కావాలి! బైటకు రా!' అంటూ తీవ్రంగా గొడవచేసింది. మరో సందర్భంలో ఆయనపైన దాడిచేసిన వ్యక్తి భారతీయుడే. ప్రభుత్వంతో గాంధీజీ కుదుర్చుకున్న ఒప్పందంపై తీవ్ర ఆగ్రహావేశాలతో ఊగిపోయిన ఒక పఠాన్ నడివీధిలో ఆయనపైన దాడిచేశాడు. నాయకుడన్నవాడు కొన్ని సందర్భాల్లో తన అభిమానులకు నచ్చని నిర్ణయాలు కూడా తీసుకోవలసి ఉంటుందన్న విషయాన్ని గాంధీజీ గ్రహించారు.

దక్షిణాఫ్రికా ఈ విధంగా గాంధీజీకి అటు రాజకీయాల్లోనూ, ఇటు నాయకత్వం విషయంలోనూ తనకంటూ ఒక ప్రత్యేకమైన విధానాన్ని ఆవిష్కరించుకునే అవకాశాన్ని కల్పించింది. ఇక్కడి పరిధి, పరిమాణం చిన్నదే అయినప్పటికీ, పోరాటానికి సంబంధించి వినూత్నమైన విధానాలను ఆవిష్కరించడానికి ఆయనకు అవకాశం లభించింది. దక్షిణాఫ్రికాలో ఆయన అప్పటికే తన పోరాటాన్ని మితవాద స్థాయినుంచి గాంధేయవాద దశకు తీసుకువచ్చేశారు. తాను ఎంచుకున్న ఈ విధానంలో బలాబలాలు ఏపాటివో ఆయనకు పూర్తి అవగాహన ఉంది. అంతేకాదు, ఉన్నదాంట్లో అన్నిటికంటే ఉత్తమమైన విధానం ఇదేనన్న నమ్మకం కూడా ఆయనకు కలిగింది. ఇక మిగిలిందల్లా తన పోరాటవిధానాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టడమే.

* * *

గాంధీజీ 1915లో భారతదేశానికి తిరిగివచ్చారు. ఆయనకు సాదరస్వాగతం లభించింది. దక్షిణాఫ్రికాలో ఆయన నిర్వహించిన పోరాటం అప్పటికే భారతదేశంలోని విద్యాధికులకే కాక, బడుగుజనాలకు కూడా తెలిసిపోయింది. కుంభమేళ సందర్భంగా హరిద్వార్ వెళ్ళినప్పుడు ఆయన దర్శనం కోసం సామాన్యజనం బారులుతీరడం ఈ విషయాన్ని స్పష్టంచేసింది. 'నాయకులకూ, త్యాగమూర్తులకూ ఉన్న అన్ని లక్షణాలు గాంధీలో ఉన్నాయి' అంటూ గోఖలే అప్పటికే ఆయనను కీర్తించారు. అంతేకాదు, గాంధీలో ఉన్న మరో లక్షణాన్ని కూడా గోఖలే గుర్తించారు. 'తన చుట్టూ ఉన్న సామాన్యులను కూడా ధీరులుగానూ, వీరులుగానూ తీర్చిదిద్దగల ఒక అతీంద్రియశక్తి ఆయనలో ఉంది' అన్నారు గోఖలే.

గోఖలే సలహామేరకూ, ఏ విషయంపైన అయినా సమగ్ర అవగాహన లేనిదే వేలుపెట్టకూడదన్న తన స్వభావానికి అనుగుణంగానూ, ఏడాదిపాటు ఎటువంటి రాజకీయసమస్యపైనా ప్రజాముఖంగా ఒక నిర్ణయానికి కట్టుబడకూడదని గాంధీజీ నిర్ణయించుకున్నారు. ఆయన ఆ ఏడాది అంతా దేశవ్యాప్తంగా పర్యటనలు చేస్తూ దేశప్రజల స్థితిగతులను స్వయంగా అధ్యయనంచేయడంలో గడిపారు. అహ్మదాబాద్‌లో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారు. ఆయనా, అచంచలభక్తివిశ్వాసాలతో ఆయనతోపాటు దక్షిణాఫ్రికానుంచి వచ్చిన అనుచరులూ నివసించడానికి అది ఏర్పాటైంది. మరుసటి ఏడాది కూడా ఆయన రాజకీయవ్యవహారాలకు దూరంగానే ఉండిపోయారు. హోంరూల్ ఉద్యమం క్రమంగా ఊపందుకుంటున్న ఏడాది ఇది. కానీ, తన రాజకీయ అవగాహనకూ, భారతదేశంలో ఉన్న రాజకీయపరిస్థితికీ ఏమాత్రం పొంతనలేని దశ అది. మితవాద విధానంపట్ల విశ్వాసం ఆయనలో అప్పటికే చెరిగిపోయింది. అదేవిధంగా, బ్రిటిష్‌ప్రభుత్వం మొదటిప్రపంచయుద్ధంలో పీకలోతుగా కూరుకుపోయిన ఉన్న తరుణంలోనే ఉద్యమించి ఒత్తిడితీసుకురావాలన్న హోంరూల్ ఉద్యమ నాయకుల వాదనపట్ల కూడా ఆయనకు విశ్వాసంలేదు.

అంతేకాదు, రాజకీయపోరాటానికి ఈ మార్గాలేవీ ఉపకరించవనీ, సత్యాగ్రహం మాత్రమే సరైన పోరాటమార్గమనీ అప్పటికే ఆయన పూర్తివిశ్వాసంతో ఉన్నారు. అప్పటికే ఏర్పడి ఉన్న రాజకీయసంస్థల్లో తాను చేరకపోవడానికి కారణాలను ఆయన మాటల్లోనే వింటే మనకు మరింత చక్కగా విశదమవుతుంది. 'నా జీవితకాలంలో వివిధ అంశాలపట్ల నాకు నిర్దిష్టమైన అభిప్రాయాలు అప్పటికే ఏర్పడిన కారణంగా నేను ఒక సంస్థలో చేరడమన్నది జరిగితే కనుక అది ఆ సంస్థ విధానాలను ప్రభావితం చేయడానికే కానీ, సదరు సంస్థ నన్ను ప్రభావితం చేయడానికి మాత్రం కాదు. దీనర్థం నేను ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడానికి నిరాకరిస్తున్నానని కాదు. నా ఉద్దేశమల్లా విధానం వినూత్నంగా ఉండాలి. మనకు దారిచూపించే కాంతి మినుకుమినుకు మనకుండా కళ్ళుమిరుమిట్లు గొలిపే స్థాయిలో ఉండాలన్నదే నా ఆకాంక్ష!' అని వ్యాఖ్యానించారు గాంధీజీ. మరో విధంగాచెప్పాలంటే, అహింసాయుత విధానంలో సాగే సత్యాగ్రహాన్ని పోరాటవిధానంగా ఆమోదించిన ఉద్యమంలో లేదా సంస్థలో మాత్రమే గాంధీజీ అడుగుపెట్టగలరన్నమాట.

అయితే, దీనర్థం గాంధీజీ అంతవరకూ రాజకీయంగా నిస్తేజంగా ఉండిపోబోతున్నట్టు కాదు. 1917లోనూ, 1918 తొలినాళ్ళలోనూ ఆయన మూడు ప్రధానమైన ఉద్యమాలు చేశారు. బీహార్‌లోని చంపారన్‌లోనూ, అహ్మదాబాద్‌లోనూ, గుజరాత్‌లోని ఖేడాలోనూ ఇవి సాగాయి. ఈ ఉద్యమాల్లో ఉన్న సామీప్యం ఒకటే. ఇవన్నీ కూడా ఆయా ప్రాంతాలకు సంబంధించిన సమస్యలపై– అంటే, స్థానిక సమస్యల ఆధారంగా జరిగినవి. ఈ మూడు ఉద్యమాలూ అక్కడివారి ఆర్థికసంబంధమైన డిమాండ్ల సాధనకోసం జరిగినవి. చంపారన్, ఖేడా ఉద్యమాల్లో రైతుకూలీలు పాల్గొంటే, అహ్మదాబాద్ పోరాటంలో పారిశ్రామిక కార్మికులు ఆయన వెంట నడిచారు.

* * *

చంపారన్ కథ 19వ శతాబ్దం తొలినాళ్ళలో ఆరంభమైంది. భారతీయ వ్యవసాయదారులు తమ కమతాల్లో 3/20వ వంతున నీలిమందు పండించాలని యూరోపియన్ యజమానులు వ్యవసాయదారులతో ఒక ఒప్పందాన్ని కుదర్చుకున్నారు. దీనికే తీన్‌కథియా విధానం అనిపేరు. అయితే,19వ శతాబ్దం చివరినాటికి పరిస్థితులు మారిపోయాయి. జర్మనీలో తయారైన సింథటిక్ రంగులు నీలిమందుకు మార్కెట్‌లో గిరాకీలేకుండా చేశాయి. తమ కమతాల్లో 20వంతుల్లో మూడోవంతు తప్పనిసరిగా నీలిమందును పండించాలన్న ఒప్పందంనుంచి భారతీయ రైతులను విముక్తం చేయాల్సిన యూరోపియన్ యజమానులు రైతుల అవసరాన్ని అడ్డంపెట్టుకుని ఒప్పందంనుంచి విముక్తిచేసే పేరిట కౌలు విపరీతంగా పెంచి, ఇతరత్రా బకాయిలను కూడా అక్రమంగా రైతులనెత్తిన రుద్దారు. దీనితో రైతుల్లో వ్యతిరేక ఆరంభమైంది. ఈ వ్యతిరేకత వాస్తవానికి 1908లోనే మొదలైనప్పటికీ, రాజ్‌కుమార్‌శుక్లా అనే స్థానిక రైతు గాంధీజీతో పాటు దేశవ్యాప్తంగా పర్యటించి ఆయనను చంపారన్ వచ్చి రైతుల సమస్యలను స్వయంగా చూడటానికి ఒప్పించేవరకూ కొనసాగుతూనే ఉంది. గాంధీజీని చంపారన్ తీసుకురావాలన్న రాజ్‌కుమార్ శుక్లా నిర్ణయం పేదలహక్కులకోసం పోరాడుతున్న వ్యక్తిగా గాంధీజీకి అప్పటికే ఉన్న ప్రతిష్ఠకు అద్దంపడుతుంది.

గాంధీజీ చంపారన్‌లో అడుగుపెట్టగానే, వెంటనే జిల్లా విడిచిపొమ్మంటూ జిల్లా కమిషనర్‌నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అయితే, గాంధీజీ అందుకు నిరాకరించడమే కాకుండా ఆదేశాలను ఉల్లంఘించినందుకు శిక్ష అనుభవించడానికి తాను సిద్ధంగా

ఉన్నట్టు కూడా ప్రకటించి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. ఇది అత్యంత అసాధారణమైన చర్య. ఎందుకంటే, అప్పటివరకూ తిలక్, అనిబిసెంట్ వంటివారు ప్రజా ఉద్యమాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరుచేయలేదు. ఒక ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్వహిస్తున్నప్పుడు, వెంటనే ఆ ప్రాంతాన్ని విడిచిపొమ్మని ప్రభుత్వం ఆదేశించినపక్షంలో వారు తుచ తప్పకుండా పాటించేవారు. ఒక అన్యాయమైన ఆదేశాన్ని పరిమితస్థాయిలో తిరస్కరించడం లేదా సహకరించడానికి నిరాకరించడం అప్పటికి ఒక వినూత్నమైన విధానం. ఇక, గాంధీజీ నిర్ణయాన్ని ఒక సమస్యాత్మకమైన అంశంగా మార్చి, గాంధీజీని తిరుగుబాటుదారుడిగా గుర్తించి, వ్యవహారాన్ని సాగదీయడానికి ఇష్టపడని భారతప్రభుత్వం గాంధీజీని ముందుకు సాగనీయమనీ, ఆయన దర్యాప్తేదో ఆయనను చేసుకోనిమ్మనీ స్థానికప్రభుత్వానికి వెంటనే ఆదేశాలు ఇచ్చింది.

ఈ విధంగా విజేయుడైన గాంధీజీ నీలిమందు పండించే రైతుకూలీల సమస్యలను తెలుసుకోవడానికి ఉపక్రమించారు. ఇక్కడకూడా ఆయన వ్యవహారశైలిలో ఒక ప్రత్యేకత మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనా, అప్పటికే ఆయన సహచరులుగా మారిన బీహార్ మేధావులు బ్రిజ్‌కిశోర్, రాజేంద్రప్రసాద్ వంటివారూ, మహదేవ్‌దేశాయ్, నరహరిపారిక్ వంటి గుజరాతీ యువకులూ, జె.బి.కృప్లానీ కలసికట్టుగా ఉదయంనుంచి సాయంత్రంవరకూ గ్రామాల్లో విస్తృతంగా తిరిగి రైతుల సమస్యలను రికార్డుచేశారు. అంతేకాదు, వారిని అనేక విధాలుగా ప్రశ్నించి వారు చెబుతున్నది సరైనదీ కానిదీ నిర్ధారించుకుని మరీ వారి ప్రకటనలను రికార్డుచేశారు.

ఇంతలో, భారత ప్రభుత్వం ఈ మొత్తం వ్యవహారాన్ని అధ్యయనం చేయడానికి ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా అందులో గాంధీజీని సభ్యుడిగా కూడా నియమించింది. 8వేలమంది రైతుకూలీలనుంచి సేకరించిన విస్తృత సమాచారం తన దగ్గరున్న గాంధీజీ ఇక వెనుతిరిగిచూడలేదు. తీన్‌కథియా విధానం రద్దుచేయాల్సిన అవసరాన్ని కమిషన్‌కు తెలియచెప్పడంతోపాటు అక్రమంగా కౌలు హెచ్చించినందుకు నష్టపరిహారం ఇవ్వడానికి కూడా కమిషన్‌ను ఒప్పించారు. ఇక, తోటల యజమానులతో సత్వరమే ఒక అంగీకారానికి వచ్చేందుకు వీలుగా వారు అక్రమంగా వసూలు చేసిన మొత్తంలో నాలుగోవంతు మొత్తాన్ని మాత్రమే రైతుకూలీలకు తిరిగి ఇచ్చేందుకు కూడా గాంధీజీ అంగీకరించారు. మొత్తం సొమ్మంతా వెనక్కు ఇవ్వాల్సిందేనంటూ యజమానులను

ఎందుకు పట్టుపట్టలేదన్న విమర్శకుల ప్రశ్నలకు ఆయన చెప్పిన సమాధానం ఒకటే. వారు ఎంతోకొంత తిరిగి ఇవ్వడమే వారి హోదానూ, ఆత్మగౌరవాన్నీ తగినంతగా దెబ్బతీసిందనీ, అది చాలుననీ గాంధీజీ వ్యాఖ్యానించారు. చాలా సందర్భాల్లో గాంధీజీ అంచనా సరైనది అయినట్టే ఈ సందర్భంలో కూడా ఆయన అనుకున్నట్టే అయింది. సరిగ్గా పదేళ్ళలో తోటల యజమానులందరూ ఆ జిల్లాను విడిచిపెట్టిపోయారు.

* * *

ఆ తరువాత గాంధీజీ అహ్మదాబాద్ మిల్లు కార్మికుల సమస్యపైన దృష్టిసారించారు. అక్కడ కార్మికులకూ, యజమానులకూ మధ్య 'ప్లేగు బోనస్'కు సంబంధించి వివాదం రాజుకుంటోంది. ప్లేగువ్యాధి తగ్గిపోయిన కారణంగా ఈ బోనస్‌ను ఉపసంహరించుకుంటామని యజమానులు అంటుండగా, యుద్ధకాలంలో వేతనాల హెచ్చింపు నామమాత్రంగానే ఉన్నందున, ధరలు ఆకాశాన్నంటుతున్న స్థితిలో బతుకు దుర్భరంగా ఉందనీ, ఈ బోనస్‌ను యధాతథంగా కొనసాగించాలనీ కార్మికులు కోరుతున్నారు. యజమానులకూ, కార్మికులకూ మధ్య సాగుతున్న ఈ వివాదం తీవ్రస్థాయికి చేరుకునే ప్రమాదాన్ని పసిగట్టిన బ్రిటిష్ కలెక్టర్ గాంధీజీని ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవలసిందిగా కోరాడు. మిల్లు యజమానులపై ఒత్తిడి తెచ్చి ఏదో ఒక విధంగా ఇరువర్గాల మధ్యా రాజీకుదర్చమని విజ్ఞప్తిచేశాడు. అహ్మదాబాద్‌లో ప్రముఖ మిల్లు వ్యాపారి అయిన అంబాలాల్ సారాభాయ్ గాంధీజీకి మిత్రుడు. భూరివిరాళంతో సబర్మతీ ఆశ్రమం అంతరించిపోకుండా కాపాడిన దానశీలి. గాంధీజీ అటు మిల్లుయజమానులనూ, ఇటు కార్మికులనూ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి ఉండేందుకు ఎంతో శ్రమకోర్చి ఒప్పించారు. అయితే, ఎక్కడో అనుకోకుండా జరిగిన ఒక చిన్నసమ్మెను అవకాశంగా తీసుకుని మిల్లుయజమానులు ఒప్పందం నుంచి వైదొలిగిపోతూ, 20శాతం బోనస్‌మాత్రమే ఇస్తామనీ, దీనిని ఆమోదించని కార్మికులను డిస్మిస్‌చేస్తామనీ హెచ్చరించారు.

ఈ చర్య గాంధీజీని ఆగ్రహానికి గురిచేసింది. ఒప్పందం ఉల్లంఘనని ఆయన చాలా తీవ్రమైన విషయంగా తీసుకుని వెంటనే మిల్లుకార్మికులకు సమ్మెకట్టాల్సిందిగా సూచించారు. అంతేకాదు, పారిశ్రామిక ఉత్పత్తి వ్యయాన్నీ, లాభాలనూ, మరోవైపు జీవనవ్యయాన్నీ అధ్యయనంచేసిన తరువాత వేతనాల్లో హెచ్చింపు కనీసం 35శాతం ఉండాలన్న డిమాండ్ సమంజసంగా ఉంటుందని కూడా గాంధీజీ సూచించారు.

సమ్మె ప్రారంభమైంది. గాంధీజీ ప్రతిరోజూ సబర్మతీనది ఒడ్డున మిల్లుకార్మికులను ఉద్దేశించి ప్రసగించేవారు. ప్రతిరోజూ ఒక న్యూస్ బులెటిన్‌ను విడుదల చేసేవారు. ఎట్టిపరిస్థితుల్లోనూ హింసకు పాల్పడవద్దని హెచ్చరించేవారు. అంబాలాల్ సారాభాయ్ సోదరి అనసూయాబెన్ ఈ పోరాటంలో గాంధీజీకి కుడిభుజంలా వ్యవహరించారు. ఇంతకూ, ఈ వ్యవహారంలో ఆమె సోదరుడూ, గాంధీజీ మిత్రుడూ అయినా అంబాల్ వీరి ప్రధాన ప్రత్యర్థుల్లో ఒకరు.

కొన్ని రోజుల తరువాత కార్మికుల వ్యవహారశైలిలో మార్పు వచ్చింది. రోజువారీ సమావేశాలకు హాజరయ్యే కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గిపోవడం ప్రారంభమైంది. అడ్డదోవన పనిలో చేరిపోయే ధోరణి పెరిగింది. ఈ పరిస్థితుల్లో కార్మికులను సంఘటితం చేయడానికి గాంధీజీ నిరాహారదీక్షకు సంకల్పించారు. అంతేకాదు, ఒకవేళ సమ్మె ఆకలిమరణాలకు దారితీస్తే ఆ విధంగా మొదట మరణించేది తానేనని అంటూ తన హామీకి రుజువుగా తాను నిరాహారదీక్షకు కూర్చుంటున్నానని ఆయన ప్రకటించారు. ఆయన చేపట్టిన నిరాహారదీక్ష కార్మికులపైనే కాదు, మిల్లు యజమానులపైన కూడా ప్రభావాన్ని చూపింది. మొత్తం వివాదాన్ని ఒక ట్రిబ్యునల్‌కు అప్పగించడానికి వారు అంగీకరించారు. గాంధీజీ వెంటనే సమ్మెను ఉపసంహరించారు. కొద్దికాలంలోనే కార్మికులు డిమాండ్ చేస్తున్న విధంగా వేతనాన్ని 35శాతం పెంచాలని ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది.

* * *

అహ్మదాబాద్ వివాదం ఇంతటితో ముగిసిపోలేదు. ఖేడాజిల్లాలోని రైతుకూలీలు పంటలు దెబ్బతినడంతో దుర్భరమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారనీ, భూమిశిస్తును మినహాయించాలన్న వారి విజ్ఞప్తులను ప్రభుత్వం ఖాతరు చేయడం లేదనీ గాంధీజీకి తెలిసింది. 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియన్ సొసైటీ' సభ్యులూ, విఠల్‌భాయ్ పటేల్, గాంధీజీ కూడా ఈ సమస్యను పరిపూర్ణంగా తెలుసుని కార్మికుల డిమాండ్‌లో ఔచిత్యం ఉందని నిర్ణయించుకున్నారు. పంట ఉత్పత్తి సాధారణస్థాయితో పోలిస్తే నాలుగోవంతుకు పడిపోయింది. రెవెన్యూచట్టం ప్రకారం కార్మికులకు భూమిశిస్తు మినహాయింపు పూర్తిగా లభించాలి.

ఈ ఉద్యమంలో గాంధీజీ అధ్యక్షుడుగా ఉన్న 'గుజరాత్ సభ' ప్రధానభూమికను పోషించింది. విజ్ఞప్తులు, మహాజర్లూ ఏమాత్రం ఫలితాన్నివ్వకపోవడంతో శిస్తు

చెల్లించకుండా మొత్తం ఆదాయాన్ని తమవద్దే అట్టిపెట్టుకోవలసిందిగా గాంధీజీ కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ దాష్టీకానికీ, కక్షసాధింపు విధానాలకూ వ్యతిరేకంగా ప్రాణంపోయేవరకూ పోరాడాల్సిందిగా ప్రకటించారు. 'ప్రజల అంగీకారం లేకుండా వారిని పరిపాలించడం అసాధ్యం' అనే విషయాన్ని ప్రభుత్వానికి స్పష్టం చేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. ఖేడాజిల్లాకు చెందిన యువ న్యాయవాది వల్లభ్‌భాయి పటేల్, ఇందూలాల్ యాజ్ఞిక్‌తో సహా కొంతమంది యువకులు గాంధీజీని అనుసరించి ఆయన జిల్లాలోని వివిధగ్రామాల్లో పర్యటించడానికి తోడ్పడ్డారు. పంటలను జప్తుచేయడం, వస్తువులనూ,పాడిపశువులనూ స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలతో పాటు అనేకరకాల అణచివేత విధానాలను ప్రభుత్వం అనుసరించే అవకాశాలు ఉన్నందున వాటన్నింటికీ ఎదురొడ్డి నిలబడాల్సిందిగా గాంధీజీ గ్రామగ్రామాన తన పర్యటనలో ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వానికి శిస్తుచెల్లించమంటూ ప్రజలచేత ప్రమాణాలు చేయించారు. శిస్తు చెల్లించగలిగే స్తోమత ఉన్నవారు కూడా నిరుపేదల రైతులకు సంఘీభావంగా నిలిచి శిస్తుచెల్లించవద్దని ఆయన కోరారు. అలా చేయనిపక్షంలో, నిరుపేద రైతులు అభద్రత కారణంగా శిస్తు చెల్లించడానికి తమ వస్తువులను అమ్ముకునో, లేదా అప్పులు తెచ్చో అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఒకవేళ ప్రభుత్వం శిస్తు సేకరణ నిలిపివేయడానికి అంగీకరించినపక్షంలో అప్పుడు దానిని ప్రభుత్వానికి చెల్లించవచ్చునని వారికి సూచించారు.

ఉద్యమం ఈ విధంగా కొనసాగుతున్న తరుణంలో శిస్తు చెల్లించగలిగే వారినుంచే దానిని సేకరించవలసిందిగా ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు రహస్యంగా కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను బహిరంగంగా ప్రకటించడానికి ప్రభుత్వానికి అహం అడ్డువచ్చింది. మరోవైపు అప్పటికే ప్లేగు వ్యాధికారణంగానూ, అధికధరలతోనూ, కరువుతోనూ సతమతమైపోతున్న రైతుకూలీలు కూడా నెమ్మదిగా జారిపోవడం ఆరంభించారు. ఈ పరిస్థితుల్లో తాను డిమాండ్ చేస్తున్నది నెరవేరింది కనుక గాంధీజీ తన ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నారు. అనంతరం ఈ ఉద్యమంపై గాంధీజీ వ్యాఖ్యానిస్తూ 'ప్రజలు అప్పటికే పూర్తిగా అలసిపోయార'ని అన్నారు. వాస్తవానికి అప్పటికే తాను 'ఉద్యమాన్ని గౌరవప్రదంగా ఉపసంహరించుకోవడానికి దారులు వెతుకుతున్నాన'ని వ్యాఖ్యానించారు.

గాంధీజీ అనుసరించబోయే రాజకీయ విధానాలకు చంపారన్, అహమ్మదాబాద్, ఖేడా ఉద్యమాలు చక్కని నిదర్శనాలు. ఈ ఉద్యమాలు దేశప్రజల సమస్యలను అర్థం చేసుకోవడానికి ఆయన ఎంతగానో ఉపకరించడమే కాకుండా ప్రజల మధ్య నిలదొక్కుకోవడానికి బాగా పనికివచ్చాయి. అంతేకాదు, ఈ ఉద్యమాల ద్వారా ఆయన ప్రజల బలాబలాలను కచ్చితంగా అంచనావేసుకోగలిగారు. దానితోపాటు రాజకీయంగా తాను ఎంచుకున్న విధానాల బలాబలాలను కూడా ఆయన అంచనావేసుకోగలిగారు. ఈ ఉద్యమాలతో ఆయన రాజకీయ కార్యకర్తల –ముఖ్యంగా యువతరం ఆదరాభిమానాలను చూరగొనగలిగారు. సామాన్యభారతీయుల సమస్యలను గాంధీజీ లోతుగా అర్థం చేసుకోగలగడం, వారి సమస్యలను తనవిగా స్వీకరించి వాటి పరిష్కారం కోసం ప్రాణత్యాగానికి కూడా సిద్ధపడటం యువతరాన్ని బాగా ఆకర్షించి ఆయనపట్ల విశ్వాసాన్ని పెంచింది.

* * *

ప్రజల్లో తనపట్ల ఉన్న అభిమానాన్ని, విశ్వాసాన్ని, వివిధ ఉద్యమాల ద్వారా అప్పటికే సంపాదించుకున్న అనుభవాన్నీ కలుపుకొని 1919లో గాంధీజీ బ్రిటిష్‌వారు చేయదలుచుకున్న ఒక ప్రజావ్యతిరేక చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఉగ్రవాద హింసను నిరోధించే పేరుతో పౌరహక్కులను అణచివేసేందుకు ఉద్దేశించిన రౌలత్ బిల్లులను (వీటిని ప్రవేశపెట్టవలసిందిగా సూచించిన కమిటీ చైర్మన్ పేరుతో ఇవి ప్రసిద్ధి చెందాయి) శాసనమండలిలో ప్రవేశపెట్టడం జరిగింది. వాస్తవానికి అప్పటికే ఒక బిల్లును భారతీయ సభ్యుల తీవ్ర వ్యతిరేకతల మధ్య అర్థంలేని వేగంతో ఆమోదించడం కూడా జరిగిపోయింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యను యావత్ భారతదేశం అత్యంత అవమానంగా భావించింది. ముఖ్యంగా యుద్ధానంతరం రాజ్యాంగపరంగా అనేక రాయితీలు దక్కుతాయని ఆశిస్తున్న భారతీయులను ఈ చర్య తీవ్రంగా నిరుత్సాహపరచింది.

రాజ్యాంగబద్ధమైన నిరసనలు ఏమాత్రం ప్రయోజనాన్ని ఇవ్వకపోవడంతో, గాంధీజీ రంగంలోకి దిగి 'సత్యాగ్రహా'న్ని ఆరంభించవలసిందిగా సూచించారు. సత్యాగ్రహసభ ఒకటి దీనికోసం ఆరంభమైంది. ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంగా ఉన్న హోమ్‌రూల్‌లీగ్‌లకు చెందిన యువసభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇందులో చేరారు.

హోమ్‌రూల్ లీగ్‌ల వివరాలూ, సభ్యుల చిరునామాలూ ఉన్న జాబితాలన్నీ వెలికితీసి వాళ్ళతో సంబంధాలు ఏర్పరచుకుని ప్రచారం ఉధృతంగా ప్రారంభమైంది. నిరసన విధానంగా జాతీయస్థాయిలో హర్తాల్ జరపాలనీ, దానికి అనుబంధంగా నిరాహారదీక్షలూ, ప్రార్థనలూ జరగాలని నిర్ణయించారు. దీనితోపాటుగా కొన్ని చట్టాల విషయంలో శాసనోల్లంఘన కూడా జరుగుతుంది.

సత్యాగ్రహాన్ని ఆరంభించడానికి ఏప్రిల్ 6వతేదీని నిర్ణయించారు. అయితే, ముందు ఊహించినదానికీ, అనుకున్నదానికీ భిన్నంగా ఉద్యమం ఆవిర్భవించింది. ఉద్యమం ఆరంభపు తేదీ విషయంలో పొరపాటుపడి ఢిల్లీలో మార్చి 30వతేదీన హర్తాల్ జరిగింది. అంతేకాదు, ఢిల్లీ వీధుల్లో తీవ్రస్థాయి హింసకూడా జరిగింది. ఢిల్లీలో జరిగిన హింస మిగతాప్రాంతాలను కూడా ప్రభావితం చేసిందా అన్నట్టుగా హర్తాల్ పిలుపునందుకొని స్పందించిన అన్ని ప్రాంతాల్లోనూ కూడా నిరసనతోపాటు హింసకూడా చెలరేగింది. యుద్ధకాలంలో అణచివేతలనూ, బలవంతపు నియామకాలనూ అనుభవించిన పంజాబ్ ఆ దుష్ప్రభావాలనీడలోనే ఉంది. దానికితోడుగా అనేకరకాల రోగాలు ఆ ప్రాంతాన్ని దెబ్బతీశాయి. ఇటువంటి స్థితిలో అక్కడ ప్రజాగ్రహం తీవ్రస్థాయిలో వ్యక్తమైంది. అమృత్‌సర్‌లోనూ, లాహోర్‌లోనూ పరిస్థితి అత్యంతప్రమాదకరమైన స్థాయికి చేరుకుంది. పంజాబ్ వెళ్ళి ప్రజలను శాంతపరచాలని గాంధీజీ ప్రయత్నించారు. అయితే, ప్రభుత్వం ఆయనను బలవంతంగా మళ్ళీ బొంబే తరలించివేసింది. బొంబే, అహ్మదాబాద్‌లతో పాటుగా గుజరాత్ అంతా కూడా తీవ్రస్థాయిలో హింస చెలరేగుతున్న విషయాన్ని తెలుసుకున్న గాంధీజీ అక్కడే ఉండి ప్రజలను శాంతపరచాలని నిర్ణయించుకున్నారు.

పంజాబ్‌లో పరిస్థితులు రానురాను విషాదకరంగా మారుతున్నాయి. ఏప్రిల్ 10వతేదీన అమృత్‌సర్‌లో ఇద్దరు స్థానిక నాయకుల అరెస్టు అనేక దుస్సంఘటనలకు దారితీసింది. టౌన్‌హాల్‌పైనా, పోస్టాఫీసుపైనా దాడులు జరిగాయి. టెలిగ్రాఫ్ తీగలను తెంపివేశారు. యూరోపియన్లపైనా,వారి స్త్రీలపైనా దాడులు జరిగాయి. సైన్యం రంగ ప్రవేశం చేసింది. నగరాన్ని జనరల్ డయ్యర్‌కు అప్పగించారు. ఆయన వెంటనే సభలనూ, సమావేశాలనూ నిషేధించాడు. ఏప్రిల్ 13వతేదీ 'వైశాఖి' పండుగ సందర్భంగా అనేకమంది ప్రజలు– ముఖ్యంగా నగరంలో జరుగుతున్న వేడుకలను చూడడటానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చిన ప్రజలు– జలియన్‌వాలాబాగ్‌లో బహిరంగసభ జరుగుతుండటంతో అక్కడకు

చేరుకున్నారు. తన ఆదేశాలను ధిక్కరించినందుకు తీవ్రంగా ఆగ్రహించిన జనరల్ డయ్యర్ నిరాయుధులైన ఆ ప్రజలపై కాల్పులు జరపాల్సిందిగా సైనికులను ఆదేశించాడు. కాల్పులు పదినిముషాలపాటు నిరవధికంగా కొనసాగాయి. కాల్పులు జరిపేముందు హెచ్చరికలు జారీ చేయాల్సిన బాధ్యత ఉందని జనరల్ డయ్యర్ అనుకోలేదు. దానితోపాటుగా, ఆ సభాస్థలం చుట్టూ ఎత్తయిన గోడలు ఉన్నాయనీ, ప్రజలు తప్పించుకోగలిగే అవకాశాలు ఏమాత్రమూ లేవన్న వాస్తవాన్ని కూడా ఆయన ఖాతరుచేయలేదు. ఈ సంఘటనలో 379మంది మరణించినట్టు ప్రభుత్వం అంచనావేసింది. ఇతరుల అంచనాలు మట్టుకు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి.

జలియన్‌వాలాబాగ్ దురాగతం యావత్ దేశ ప్రజలనూ నిశ్చేష్టులను చేసింది. దీనికి తగినరీతిలో జవాబు చెప్పడమన్నది వెంటనే జరగలేదు కానీ కొద్దికాలం తరువాత సాధ్యమైంది. అప్పటికిమట్టుకు అణచివేత తీవ్రస్థాయిలో జరిగింది. పంజాబ్‌లో మార్షల్‌లా అమలు చేశారు. అమృత్‌సర్ ప్రజలు యూరోపియన్‌ల సమక్షంలో నేలమీద దేకడం వంటి అత్యంత అవమానకరమైన సంఘటనలనూ, పరిస్థితులను చవిచూశారు. ఈ హింసాత్మకమైన పరిస్థితిని చూసి తట్టుకోలేకపోయిన గాంధీజీ ఆ ఉద్యమాన్ని ఏప్రిల్ 18వతేదీన ఉపసంహరించుకున్నారు.

దీనర్థం గాంధీజీ తన అహింసాయుత 'సత్యాగ్రహం'పైన విశ్వాసం కోల్పోయారని కానీ, ఒక పోరాటమార్గంగా దానిని అమలు చేయడంలో భారతదేశ ప్రజలు విఫలమైనారని భావించారని కానీ, వారి శక్తిసామర్థ్యాలపై నమ్మకాన్ని కోల్పోయారని కానీ కాదు. ఒక ఏడాది తరువాత ఆయన 'రౌలత్ సత్యాగ్రహా'న్ని మించిన భారీస్థాయిలో దేశవ్యాప్తంగా ఒక ఉద్యమాన్ని ఆరంభించారు. పంజాబ్‌లో పొరపాటు జరగడమే ఈ కొత్త ఉద్యమాన్ని ఆరంభించడానికి ప్రధానకారణం.

మహాత్ముడి ప్రయోగం భారతదేశంలో ఆరంభమైంది.

* * *

# 15 సహాయ నిరాకరణోద్యమం- 1920-22

ఇరవయ్యవసహస్రాబ్దిలోని ద్వితీయదశాబ్దపు ఆఖరి సంవత్సరంలో భారతదేశం తీవ్రనిరాశానిస్పృహలతోనూ, అవమానభారంతోనూ ఉంది. రౌలత్‌చట్టం, జలియన్‌వాలాబాగ్ ఊచకోత, పంజాబ్‌లో సైనికశాసనం వంటి చర్యల ద్వారా బ్రిటిష్‌వారు తాము యుద్ధకాలంలో చేసిన ప్రమాణాలన్నింటినీ తుంగలోతొక్కారు. ద్వంద్వపాలన లక్ష్యంతో 1919 చివరినాళ్లలో ప్రకటించిన మాంటేగ్యూ–ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ఎవరినీ సంతృప్తిపరచలేదు. యుద్ధానంతరం టర్కీతో సముచితంగా వ్యవహరిస్తామంటూ ప్రమాణం చేసి, యుద్ధకాలంలో తమ సేవలను పొందిన బ్రిటిష్‌ప్రభుత్వం తమను చివరకు మోసగించిందని ముస్లింలు ఆగ్రహంగా ఉన్నారు. టర్కీతో ఉదారంగా వ్యవహరిస్తామన్న హామీ నెరవేర్చాలన్న ఉద్దేశం బ్రిటిష్ రాజకీయవేత్తలకు మొదటినుంచీ లేదు. టర్కీలోని కాలిఫ్‌ను తమ ఆధ్యాత్మికనేతగా భావిస్తున్న ముస్లింలు– కాలిఫ్‌కు ఇకముందు తమ పవిత్రస్థలాలపై ఏ అధికారమూ లేదన్న విషయాన్ని తెలుసుకుని సహజంగానే మనస్తాపానికి గురైనారు. అదేవిధంగా, జలియన్‌వాలాబాగ్‌లోనూ, పంజాబ్‌లోని ఇతర ప్రాంతాల్లోనూ జరిగిన సంఘటనలను యాదృచ్ఛికమని భావించి సరిపెట్టుకోదలుచుకున్నవారూ, త్వరలోనే ఆ తప్పులు దిద్దుకోవడం జరుగుతుందని ఆశించినవారూ కూడా నిశ్చేష్టులయ్యే పరిణామాలు సంభవించాయి. పంజాబ్ అల్లర్లపై ఏర్పాటు చేసిన హంటర్ కమిటీ కంటితుడుపు చర్యమాత్రమేననీ, లార్డ్స్ సభ జనరల్ డయ్యర్ చర్యను సమర్థిస్తూ అనుకూలంగా

ఓటు చేసిందనీ, 'మార్నింగ్ పోస్ట్' పత్రిక జనరల్‌డయ్యర్‌కోసం 30వేల పౌండ్లు సేకరించదలుచుకున్నప్పుడు బ్రిటిష్‌ప్రజలు ఎంతో ఉత్సాహంగా భూరి విరాళాలు ఇచ్చి సంఘీభావాన్ని ప్రకటించారనీ తెలుసుకుని భారతప్రజలు దిగ్భ్రాంతిచెందారు.

1920 ప్రథమార్థానికల్లా బ్రిటిష్‌వారికి అనుకూలంగా ఇస్తూపోతున్న మినహాయింపులన్నీ పూర్తికావచ్చాయి. తమనుంచి దక్కేదేమీలేదని ఖిలాఫత్ నాయకులకు స్పష్టంచేయడం కూడా జరిగిపోయింది. 1920 మేనెలలో టర్కీతో జరిగిన సెవ్రస్ సంధితో టర్కీసామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడం పూర్తయిపోయింది. ఖిలాఫత్ నాయకులతో కొద్దికాలంగా సన్నిహిత సంబంధాలు నెరపుతూ వస్తున్న గాంధీజీకి వారిస్థితిపట్ల సానుభూతి కలిగింది. 1919 నవంబరులో జరిగిన ఖిలాఫత్ సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథి కూడా. బ్రిటిష్ ప్రభుత్వం ఖిలాఫత్ నాయకులకు నమ్మకద్రోహం చేసిందని ఆయన భావించారు. ప్రభుత్వ వ్యవహారశైలికి వ్యతిరేకంగా అహింసాయుత సహాయనిరాకరణోద్యమాన్ని చేపట్టవలసిందిగా ఆయన ఖిలాఫత్ నాయకులకు సూచించారు. 1920 జూన్ 9వతేదీన అలహాబాద్‌లో సమావేశమైన ఖిలాఫత్ కమిటీ ఈ 'సహాయనిరాకరణోద్యమ' సలహాను ఆమోదించి గాంధీజీనే ఈ ఉద్యమానికి సారథ్యం వహించవలసిందిగా కోరింది.

ఇదిలా ఉంటే, రాజ్యాంగబద్ధమైన పద్ధతుల్లో రాజకీయంగా ముందడుగు వేసే అవకాశాలు ఇక ఏమాత్రం లేవని కాంగ్రెస్ నిర్ధారణకు వచ్చింది. పంజాబ్‌లో ప్రభుత్వం అమలు జరిపిన దుష్కృత్యాలపై తాను నియమించిన విచారణకమిటీ నివేదికను చూసిన తరువాత హంటర్ కమిటీ నివేదికపట్ల కాంగ్రెస్ ఆగ్రహం మిన్నుముట్టింది. ఈ పరిస్థితుల్లో సహాయనిరాకరణ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు కాంగ్రెస్ అంగీకరించింది. 1920 మేనెలలో అఖిలభారత జాతీయ కాంగ్రెస్ సమావేశమై భవిష్యత్ కార్యాచరణను తేల్చుకోవడానికి సెప్టెంబర్‌లో ఒక ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో ఒకటి చేయాలన్న ఆగ్రహంతో ప్రజలున్నందున సాధ్యమైనంత వేగంగా కార్యక్రమాన్ని ప్రకటించాల్సిన అవసరం ఏర్పడింది. గత నాలుగుదశాబ్దాలుగానూ, ఇంకా ఎక్కువకాలంగా జాతీయవాద

నాయకత్వం చేసిన నిరంతర విస్తృత ప్రచారం కారణంగా రాజకీయంగా చైతన్యవంతులైన అధికసంఖ్యాక ప్రజలు బ్రిటిష్‌ప్రభుత్వ చర్యలను అవమానకరంగా భావించారు. ఈ అవమానాలను భరించడం ఆత్మగౌరవానికి విఘాతంగానూ, తగిన రీతిలో జవాబుచెప్పకపోవడం పిరికితనమనీ భావించారు. దీనితోపాటుగా, భారతసమాజంలోని చాలా వర్గాలు దుర్భరమైన స్థితిలో ఉన్నాయి. పట్టణాల వారూ, కార్మికులూ, చేతివృత్తులువారూ, దిగువమధ్యతరగతివారూ, మధ్యతరగతివారూ ఆకాశాన్నంటిన ధరలతోనూ, ఆహారధాన్యాల కొరతతోనూ, నిత్యావసరవస్తువుల లేమితోనూ సతమతమైపోతున్నారు. గ్రామీణప్రాంతాల్లోని పేదలను ఈ పరిస్థితులకు తోడుగా విపరీతమైన కరువు, అంటువ్యాధులు బలితీసుకుంటున్నాయి.

* * *

ఽ ఽ ఽ1920 ఆగస్టు 1న ఉద్యమం అధికారికంగా ప్రారంభమైంది. జూన్ 22వతేదీన గాంధీజీ వైస్‌రాయ్‌కు జారీ చేసిన నోటీసు కాలపరిమితి ముగియడంతో కార్యాచరణ ఆరంభమైంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ ఆగస్టు 1వతేదీ తెల్లవారుజామునే కన్నుమూశారు. ఆ సంతాపదినాన్నీ, ఉద్యమ ఆరంభాన్నీ కలుపుకొని దేశవ్యాప్తంగా ప్రజలు 'హర్తాల్' నిర్వహించారు. ఊరేగింపులు కొనసాగాయి. చాలామంది ఉపవాసదీక్షలో ఉంటూ ప్రార్థనలు నిర్వహించారు.

సెప్టెంబర్ మాసంలో కాంగ్రెస్ కలకత్తాలో సమావేశమై సహాయనిరాకరణను ఆమోదించింది. సి. ఆర్.దాస్ నాయకత్వంలోని వ్యతిరేకవర్గం శాసనమండళ్లను, త్వరలో జరగబోతున్న ఎన్నికలను బహిష్కరించాలన్న అభిప్రాయంతో ఉంది. ఈ బహిష్కరణ ఆలోచనను అంగీకరించనివారు కూడా కాంగ్రెస్ మార్గాన్ని ఆమోదించి ఎన్నికలను బహిష్కరించారు. ఓటర్లు కూడా అత్యధికసంఖ్యలో ఎన్నికలకు దూరంగా ఉండిపోయారు.

డిసెంబరులో నాగపూర్‌లో కాంగ్రెస్ తన వార్షిక సమావేశం జరుపుకునేనాటికి వ్యతిరేకవర్గమంటూ లేకుండాపోయింది. ఎన్నికలు పూర్తయిపోయాయి కనుక శాసనమండళ్ళను బహిష్కరించాలన్నది ఒక చర్చనీయాంశంగా మిగలలేదు. సహాయనిరాకరణకు సంబంధించిన ప్రధాన తీర్మానాన్ని

స్వయంగా సి.ఆర్. దాస్ ప్రవేశపెట్టారు. సహాయనిరాకరణ ఉద్యమకార్యక్రమాల్లో భాగంగా, ప్రభుత్వ పాఠశాలనూ,ప్రభుత్వ అనుబంధ పాఠశాలలనూ, కళాశాలలనూ, న్యాయస్థానాలనూ, విదేశీవస్త్రాలనూ బహిష్కరించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ప్రసాదించిన బిరుదులనూ, గౌరవపదవులనూ వదులుకోవడంతోపాటు ప్రభుత్వ సర్వీసులనుంచి వైదొలగడం వరకూ సహాయనిరాకరణ కార్యక్రమం విస్తరించాలని నిర్ణయించారు. పెద్ద ఎత్తున జరిగే ఈ శాసనోల్లంఘనలో పన్నులు చెల్లించకపోవడం కూడా ఒక అంశం కావాలని తీర్మానించారు. ఇక, నిర్మాణాత్మక కార్యక్రమాల్లో భాగంగా దేశస్థాయిలో పాఠశాలలూ, కళాశాలలు ఏర్పాటవుతాయి. వివాదాలను పరిష్కరించడానికి 'పంచాయత్'లు ఏర్పాటు చేస్తారు. చేతితో వడకడం, చేతితో నేయడం వంటివాటిని ప్రోత్సహిస్తారు. హిందూముస్లిం ఐక్యతను పెంపొందించడం, అస్పృశ్యతను వదులుకోవడం, అహింసను సంపూర్ణంగా అమలు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా అమలు చేసిన పక్షంలో ఏడాదిలోగా 'స్వరాజ్యం' అవతరిస్తుందని గాంధీ హామీ ఇచ్చారు. ఈ విధంగా నాగపూర్ సమావేశంలో కాంగ్రెస్ ఒక రాజ్యాంగేతర ప్రజా ఉద్యమానికి సిద్ధపడింది. విప్లవభావజాలం ఉన్న చాలా తీవ్రవాద గ్రూపులు-ముఖ్యంగా పశ్చిమబెంగాల్‌లో- ఈ ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించాయి.

ఈ సరికొత్త హామీని పరిపూర్ణం చేసుకోవడానికి వీలుగా కాంగ్రెస్‌లో మౌలికమైన మార్పులు ఎన్నో అవసరమైనాయి. సంస్థాగతంగా కూడా చాలా మార్పులు జరిగాయి. స్వపరిపాలనను చట్టబద్ధమైన,న్యాయసమ్మతమైన మార్గాలద్వారా సాధించడమన్న కాంగ్రెస్ లక్ష్యం ఇప్పుడు శాంతియుతవిధానాల్లో, సక్రమమైన మార్గాల్లో 'స్వరాజ్యా'న్ని సాధించడంగా మారింది. గాంధీజీ చేతుల్లో రూపుదిద్దుకున్న కాంగ్రెస్ కొత్త సంవిధానం మరికొన్ని ప్రధానమైన మార్పులు ప్రవేశపెట్టింది.

దైనందిన వ్యవహారాలను చూసుకోవడానికి కాంగ్రెస్‌కు 15మంది సభ్యులతో కూడుకున్న వర్కింగ్ కమిటీ ఉంటుంది. ఈ ప్రతిపాదనను మొదటిసారి 1916లో తిలక్ ప్రవేశపెట్టినప్పుడు మితవాద వర్గం దానిని వ్యతిరేకించింది. ఏడాదిపాటూ పనిచేసే ఒక ప్రత్యేక సంఘం లేకుండా ఒక ఉద్యమాన్ని స్థిరంగా కొనసాగించగలగడం అసాధ్యమని గాంధీజీకి తెలుసు. ప్రాంతీయస్థాయిలో భాషాప్రాతిపదికన ప్రాదేశిక కాంగ్రెస్ కమిటీలు కూడా ఏర్పాటవుతాయి. అవి ఆయా స్థానిక భాషల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే

కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. గ్రామ, మొహల్లా, వార్డు కమిటీలు ఏర్పాటవడం ద్వారా అట్టడుగుస్థాయివరకూ కాంగ్రెస్ తన సంస్థాగత విస్తృతిని పెంచుకుంటుంది. పేదలు కూడా సభ్యులు కావడానికి వీలుగా వార్షిక సభ్యత్వరుసుమును నాలుగు అణాలకు తగ్గించివేశారు. ప్రజలు విస్తృతస్థాయిలో భాగస్వాములు కావడంవల్ల కాంగ్రెస్‌కు ఆదాయం కూడా లభిస్తుంది. ఇతరత్రా అంశాల్లో కూడా సంస్థాగతమైన నిర్మాణాన్ని క్రమబద్ధీకరించడమూ, ప్రజాస్వామ్యీకరించడం జరిగింది. సాధ్యమైనంతవరకూ కాంగ్రెస్ హిందీ భాషను ఉపయోగిస్తుంది.

సహాయనిరాకరణోద్యమాన్ని చేపట్టడం కాంగ్రెస్‌కు ఒక కొత్తశక్తిని సమకూర్చింది. 1921 జనవరి నుంచి అది దేశవ్యాప్తంగా చెప్పుకోదగ్గ విజయాలను సాధించడం ఆరంభించింది. అలీ బ్రదర్స్ (ప్రముఖ ఖిలాఫత్‌నాయకులు)తో కలిసి గాంధీజీ దేశవ్యాప్తంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా వందలాది సమావేశాల్లో ప్రసంగాలు చేశారు, రాజకీయకార్యకర్తలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. మొదటినెలలోనే వేలాదిమంది విద్యార్థులు (ఒక అంచనాప్రకారం 90వేల మంది) పాఠశాలలను, కళాశాలలను విడిచిపెట్టి దేశవ్యాప్తంగా పుట్టుకొచ్చిన 800లకు పైగా జాతీయ పాఠశాలల్లోనూ, కళాశాలలలోనూ చేరారు. ఈ రకమైన విద్యాసంబంధిత బహిష్కరణలు ముఖ్యంగా బెంగాల్‌లో అత్యంత విజయం సాధించాయి. కలకత్తా విద్యార్థులు ప్రావిన్సు అంతటా సమ్మెను విజయవంతం చేసి ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పనిసరి పరిస్థితుల్లో తమ సంస్థలతో ప్రభుత్వానికి ఉన్న సంబంధాన్ని తెంపుకునేట్టు చేశారు. ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో సి.ఆర్. దాస్ ప్రధానపాత్ర పోషించారు. సుభాష్ బోస్ కలకత్తాలోని నేషనల్ కాంగ్రెస్‌కు ప్రిన్సిపాల్ అయ్యారు. ఈ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా స్వదేశీ స్ఫూర్తి మరింత బలపడింది. ఈ విద్యాపరమైన బహిష్కరణలో బెంగాల్ తరువాత స్థానాన్ని పంజాబ్ ఆక్రమించుకుంది. ఈ కార్యక్రమం పట్ల ప్రారంభంలో కొన్ని అనుమానాలు వ్యక్తంచేసిన లాలా లజ్‌పత్‌రాయ్ పంజాబ్‌లో ఈ ఉద్యమానికి సారథ్యం వహించారు. బోంబే, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, అస్సాంలలో ఉద్యమం ఎంతో క్రియాశీలంగా సాగితే, మద్రాసులో మట్టుకు స్పందన కరువైంది.

విద్యాసంబంధ బహిష్కరణతో పోలిస్తే న్యాయవాదులు న్యాయస్థానాలను బహిష్కరించే కార్యక్రమం అంత విజయవంతం కాలేదు. అయితే, దాని ప్రభావం మట్టుకు

విస్తృతంగా, వినూత్నంగా ఉంది. దేశంలోని ప్రముఖ న్యాయవాదులైన సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూ, ఎం. ఆర్. జయకర్, సైఫుద్దీన్ కిచ్లూ, వల్లభ్‌భాయ్ పటేల్, సి. రాజగోపాలాచారి, టి. ప్రకాశం, అసఫ్ అలీ వంటివారు ఆర్థికంగా ఎంతో లాభకరమైన తమ వృత్తిని తృణప్రాయంగా విడిచిపెట్టడం అనేకమందికి స్ఫూర్తినిచ్చింది. ఈ కార్యక్రమంలో కూడా బెంగాల్ ప్రథమస్థానంలో ఉంటే ఆ తరువాత స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పంజాబ్‌లు ఉన్నాయి.

అయితే, ఈ మొత్తం ఉద్యమంలో అత్యంత విజయవంతమైన కార్యక్రమం విదేశీ వస్త్ర బహిష్కరణ. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి విదేశీవస్త్రాలను సేకరించి పెద్దపెద్ద కుప్పలుగా పోసి తగులబెట్టేవారు. 1921 ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా గాంధీజీతో పర్యటించిన ప్రభుదాస్ గాంధీ, తాము ప్రయాణిస్తున్న రైలు ప్రతిచిన్నస్టేషన్‌లోనూ కొద్దినిముషాలపాటు ఆగడం, గాంధీజీ తనను చూడడానికి వచ్చిన ప్రజలకు విదేశీవస్త్రాలను బహిష్కరించవలసిందిగా చెబుతూ, ఆక్షణంలో కనీసం తలమీద ఉన్న టోపీనైనా త్యజించాల్సిందిగా పిలుపునివ్వడం, వెంటనే అక్కడికక్కడ టోపీలు, దుప్పటీలు, తలపాగాలతో ఓ పెద్ద బట్టలపోక తయారుకావడం, తమ రైలు ముందుకు సాగిపోతుండగా వెనకన ఆ బట్టలపోకలు తగులబడుతుండటం వంటి దృశ్యాలను కళ్లకు కట్టినట్టు వర్ణించేవారు. విదేశీగుడ్డను అమ్మే దుకాణాలముందు పికెటింగ్ నిర్వహించడం కూడా బహిష్కరణోద్యమంలో భాగంగా కొనసాగేది. 1920–21 మధ్యకాలంలో దేశంలోకి 121కోట్ల విలువైన విదేశీవస్త్రాలు దిగుమతి అయితే, 1921–22నాటికి అది 57కోట్లకు పడిపోయింది. ఈ మహోద్యమంలో చెప్పుకోదగ్గ మరో ఘట్టం ఏమిటంటే, కార్యక్రమంలో ముందుగా అనుకోనప్పటికీ కల్లుదుకాణాలముందు ధర్నాలు నిర్వహించడం మహోధృతంగా సాగింది. ఈ కారణంగా ప్రభుత్వ ఆదాయం విపరీతంగా పడిపోయింది. దీనితో ప్రభుత్వం మద్యం ఆరోగ్యానికి ఎంతమంచిదో తెలియచెబుతూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించుకోవలసి వచ్చింది.

బీహార్, ఒరిస్సా ప్రభుత్వాలైతే మద్యపాన ప్రియులైన చారిత్రక ప్రముఖుల పేర్లను కూడా (మోజెస్, అలెగ్జాండర్, జూలియస్ సీజర్, నెపోలియన్, షేక్స్పియర్, గ్లాడ్‌స్టోన్, టెన్నిసన్, బిస్మార్క్ వగైరా వగైరా...) తమ ప్రచారానికి వాడుకున్నాయి.

విజయవాడలో 1921 మార్చిలో జరిగిన అఖిలభారత జాతీయకాంగ్రెస్ సమావేశం రాబోయే మూడునెలలపాటూ కార్యకర్తలు నిధుల సేకరణ, సభ్యత్వనమోదు, చర్ఖాల పంపిణీ కార్యక్రమాలపై దృష్టిని కేంద్రీకరించాలంటూ ఆదేశించింది. తత్ఫలితంగా పెద్ద ఎత్తున సభ్యత్వనమోదు కార్యక్రమం ఆరంభమైంది. కోటిమందిని సభ్యులుగా చేర్పించాలన్న లక్ష్యం నెరవేరనప్పటికీ కాంగ్రెస్ సభ్యుల సంఖ్య రమారమి 50లక్షలకు చేరుకుంది. తిలక్ స్వరాజ్యనిధి సేకరణ కోటిరూపాయల లక్ష్యాన్ని దాటింది. చర్ఖాలకు పెద్ద ఎత్తున పేరు, ఆదరణ లభించాయి. జాతీయోద్యమానికి ఖాకీ ఒక యూనిఫామ్‌గా మారిపోయింది. మదురైలో విద్యార్థుల సమావేశాన్ని ఉద్దేశించి గాంధీజీ ప్రసంగిస్తున్నప్పుడు ఖాదీ బాగా ఖరీదుగా ఉందంటూ కొందరు ఫిర్యాదుచేశారు. దుస్తులను మితంగా ధరించడమే అందుకు సరైన సమాధానమంటూ ఆరోజునుంచి ఆయన ధోతీ,కుర్తాలను విడిచిపెట్టి కేవలం లంగోటీకే పరిమితమై జీవితాంతం 'అర్థనగ్న సన్యాసి'గానే ఉన్నారు.

1921 జులైలో మహమ్మద్ అలీ ప్రభుత్వానికి ఒక కొత్త సవాలును విసిరారు. జులై 8వతేదీన కరాచీలో జరిగిన అఖిలభారత ఖిలాఫత్ సమావేశంలో ఆయన 'ముస్లింలు బ్రిటిష్ సైన్యంలో కొనసాగడం మతనియమాలను ఉల్లంఘించడమే'నంటూ ఒక ప్రకటన చేశారు. ఈ సందేశాన్ని దేశవ్యాప్తంగా ప్రచారంచేసి సైన్యంలో ఉన్న ప్రతి ముస్లింకు చేరవేయవలసిందిగా కూడా ఆయన కోరారు. ఈ వ్యాఖ్యచేసినందుకు మహమ్మద్ అలీనీ, ఆయనతోపాటు కొందరు నాయకులనూ ప్రభుత్వం వెంటనే అరెస్టుచేసింది. ఈ అరెస్టుకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగిన వివిధ సమావేశాల్లో ఆయన చేసిన ప్రసంగాన్ని యధాతథంగా ప్రచారం చేయడం జరిగింది. అక్టోబర్ 4వతేదీన గాంధీజీతో సహా 47మంది కాంగ్రెస్ ప్రముఖనాయకులు మహమ్మద్ అలీ చేసిన వ్యాఖ్యలను యదాతథంగా ఉటంకిస్తూ ఒక ప్రచారపత్రాన్ని విడుదల చేశారు.దానితోపాటుగా, ప్రతిపౌరుడూ, ప్రతి సైనికుడూ కూడా ఈ నిరంకుశ ప్రభుత్వంతో తన సంబంధాలను తెంపుకోవలసిందిగా కూడా పిలుపునిచ్చారు. మరుసటిరోజు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇదే అంశంతో ఒక తీర్మానం చేసింది. అక్టోబర్ 16వతేదీన దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కాంగ్రెస్ కమిటీలూ సమావేశాలు నిర్వహించి అదేరకమైన తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ వరుస పరిణామాలతో ప్రభుత్వం ఈ అంశాన్ని స్వీయప్రయోజనం నిమిత్తం విస్మరించక తప్పలేదు. ఈ మొత్తం వ్యవహారం ప్రభుత్వ గౌరవ ప్రతిష్ఠలకు పెద్ద ఎదురుదెబ్బ.

ఆ తరువాత జరిగిన మరో సంఘటన 1921 నవంబరు 17న ఆరంభమైన వేల్స్ యువరాజు పర్యటన. యువరాజు బాంబేలో అడుగుపెట్టిన రోజున దేశవ్యాప్తంగా 'హర్తాల్' నిర్వహించారు. బోంబేలో జాతీయవాది ఉమర్ శోభానీకి చెందిన ఎల్ఫిన్‌స్టన్ మిల్లు ఆవరణలో గాంధీజీ పెద్ద బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించి విదేశీవస్త్రాలను దహనం చేశారు. అయితే, దురదృష్టవశాత్తూ, యువరాజు స్వాగత కార్యక్రమానికి వెడుతున్నవారికీ, గాంధీజీ సమావేశంనుంచి వస్తున్నవారికీ మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు సంభవించాయి. అల్లర్లు చెలరేగి ముఖ్యంగా పార్సీలు, క్రిస్టియన్లు, ఆంగ్లో- ఇండియన్లపై దాడులు జరిగాయి. పోలీసుల కాల్పులు కొనసాగాయి. మూడురోజులపాటు కల్లోలం కొనసాగింది. యాభైతొమ్మిది మంది మరణించారు. గాంధీజీ మూడురోజులపాటు నిరసనదీక్షలో కూచున్న తరువాత పరిస్థితి కొలిక్కివచ్చింది. ఈ వరుస పరిణామాలు గాంధీజీని బాగా కదిలించివేశాయి. శాసనోల్లంఘనోద్యమానికి సంకల్పించిన పక్షంలో హింస ఏస్థాయిలో ప్రజ్వరిల్లుతుందోనన్న భయం ఆందోళన ఆయనను కమ్ముకుంది.

వేల్స్ యువరాజు ఏ ప్రాంతాన్ని సందర్శించినా మూతబడిన దుకాణాలూ, ఖాళీగా ఉన్న రహదారులే స్వాగతం పలికాయి.ప్రభుత్వ ధిక్కరణ ఈ విధంగా విజయవంతం కావడం సహాయనిరాకరణోద్యమకారులను మరింత దూకుడుగా వ్యవహరించేట్టు చేసింది. కాంగ్రెస్ స్వచ్ఛంద దళం ప్రత్యామ్నాయ పోలీసు వ్యవస్థగా ఆవిర్భవించింది. ఎక్కడ చూసినా యూనిఫామ్‌లో ఉన్న ఈ స్వచ్ఛందదళాలు కవాతు చేస్తూ కనిపిస్తుండటం ప్రభుత్వానికి కంటకింపుగా మారింది. శాసనోల్లంఘన కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రజలు సంసిద్ధులుగా ఉన్నారని భావించినపక్షంలో దానిని అమలు చేయమంటూ కాంగ్రెస్ అప్పటికే పిసిసిలకు అనుమతిచ్చింది. కొన్ని ప్రాంతాల్లో అంటే– బెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లాలో కేంద్ర బోర్డు పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమం ఆరంభమైతే, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుజిల్లాలకు చెందిన పెదనందిపాడు తాలూకాలోనూ,చీరాల–పేరాలలోనూ పన్నుల నిరాకరణోద్యమం అప్పటికే ఊపందుకుంటోంది.

సహాయనిరాకరణోద్యమం కొన్ని అంశాల్లో పరోక్ష ప్రభావాన్ని కూడా చూపింది. ఉత్తరప్రదేశ్‌లోని అవధ్ ప్రాంతంలో 1918నుంచి కిసాన్ సభలూ, కిసాన్ ఉద్యమం బలాన్ని పుంజుకుంటూ వస్తున్నాయి. జవాహర్‌లాల్ నెహ్రూతో పాటు అనేకమంది నాయకులు జరిపిన సహాయనిరాకరణ ప్రచారం అప్పటికే ఉన్న ఈ ఉద్యమాల ద్వారా

బలపడటం సాధ్యపడింది. త్వరితకాలంలోనే ఒక సహాయనిరాకరణ సభకూ, ఒక కిసాన్ సమావేశానికీ మధ్య తేడాను పోల్చుకోలేనంతగా ఈ రెండూ విలీనమై పోయాయి.కేరళలోని మలబార్ ప్రాంతంలో సహాయనిరాకరణ ప్రచారం, ఖిలాఫత్ ప్రచారం ముస్లిం కౌలుదారులను భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ఉపకరించాయి. అయితే, దురదృష్టవశాత్తూ ఈ ఉద్యమం కొన్ని సందర్భాల్లో మతం రంగు పులుముకుంది.

అస్సాంలో తేయాకు తోటల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెకు నడుంబిగించారు. పనివదులుకొని వెళ్ళిపోతున్న కొందరు కార్మికులపై కాల్పులు జరపడంతో ఓడ కార్మికులు సమ్మె ప్రారంభించారు. అస్సాం-బెంగాల్ రైల్వేలో కూడా ఇదే జరిగింది. బెంగాల్‌కు చెందిన జాతీయవాది జె. ఎం.సేన్‌గుప్తా ఈ పరిణామాల్లో ప్రధానభూమికను పోషించారు. మిడ్నాపూర్‌లో కలకత్తాకు చెందిన ఒక వైద్యవిద్యార్థి నాయకత్వంలో ఒక తెల్లజాతి జమీందారీ కంపెనీకి వ్యతిరేకంగా తోటలపెంపకం దారులు సమ్మె జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అటవీచట్టాలను ఉల్లంఘించే కార్యక్రమం ఎంతో పేరుపొందింది. మెరుగైనజీవన పరిస్థితులకోసం కొన్ని రాజస్థాన్‌రాష్ట్రాల్లోని రైతులు, ఆదివాసులు ఉద్యమాలు ఆరంభించారు. అవినీతిపరులైన మహంతా (పురోహితులు)లనుంచి గురుద్వారాల ఆధిపత్యాన్ని స్వాధీనపరచుకునే అకాలీ ఉద్యమం సహాయనిరాకరణోద్యమంలో భాగంగా సాగింది. విపరీతమైన అణచివేత మధ్యలో కూడా అకాలీలు అహింసకు పూర్తిగా కట్టుబడి ఉన్నారు. ఈ విధంగా అనేక సంఘటనలను, ఉద్యమాలను ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రధానంగా చెప్పుకోవలసింది ఏమిటంటే, సహాయనిరాకరణోద్యమం ఆవిష్కరించిన అధికార ధిక్కరణ భావన, సృష్టించిన అశాంతియుతమైన వాతావరణపు స్ఫూర్తి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అనేక స్థానిక ఉద్యమాలు ఆరంభం కావడానికి దోహదం చేశాయి.అయితే, ఈ ఉద్యమాలు తరచుగా అటు సహాయనిరాకరణోద్యమ కార్యక్రమానికి కానీ, ఇటు కనీసం అహింసా విధానానికి కానీ కట్టుబడి ఉండకపోవడం జరిగింది.

* * *

ఈ పరిస్థితుల్లో తాను గతంలో అనుసరించిన విధానం విజయవంతం కాలేదనీ, ఇక దాడికి ఉపక్రమించడం వినా మరోమార్గంలేదని ప్రభుత్వం భావించడంలో ఆశ్చర్యంలేదు. 1920 సెప్టెంబరులో-అంటే ఉద్యమం ఆరంభం కాలంలో- ప్రభుత్వం

ఉద్యమాన్ని దానిమానాన వదిలేయాలనీ, తాను అణచివేతకు పాల్పడిన పక్షంలో జాతీయవాదులు హీరోలైపోవడమే కాకుండా, తిరుగుబాటుకు లేనిపోని ప్రోత్సాహం ఇచ్చినట్టవుతుందని భావించి ఊరుకుంది. 1921లో గాంధీ-రీడింగ్ చర్చల ద్వారా హింసను ప్రోత్సహించే విధంగా ఉన్న అలీసోదరుల సూచనలను ఉపసంహరింపచేయడానికి ఒక ప్రయత్నం చేసింది. ఖిలాఫత్ నాయకులకూ, గాంధీజీకీ మధ్యన ఒక చీలికతీసుకురావడానికి జరిగిన ఈ ప్రయత్నం విఫలమైంది. డిసెంబరు నాటికల్లా పరిస్థితులు తన అదుపులో లేనిదశకు చేరుకున్నాయని భావించిన ప్రభుత్వం అప్పటివరకూ అనుసరిస్తున్న విధానాన్ని విడిచిపెట్టి, స్వచ్ఛందదళాలు చట్టవ్యతిరేకమైనవంటూ ప్రకటించి సభ్యులైనవారందరినీ అరెస్టులు చేయడం ఆరంభించింది.

మొట్టమొదట అరెస్టయినవారిలో సి.ఆర్.దాస్, ఆయన భార్య బసంతీదేవి ఒకరు. ఈ అరెస్టులు బెంగాల్‌యువతను ఆగ్రహానికి గురిచేశాయి. వేలాదిమంది ముందుకు వచ్చి స్వచ్ఛందంగా అరెస్టయ్యారు. ఆ తరువాత రెండునెలల్లో దేశవ్యాప్తంగా అరెస్టయినవారి సంఖ్య 30వేలకు చేరుకుంది. పరిస్థితులు అనతికాలంలో ఏ స్థాయికి చేరుకున్నాయంటే, ఉన్నతస్థాయి నాయకత్వంలో జైలు వెలుపల మిగిలివున్న ఏకైక వ్యక్తి గాంధీజీ మాత్రమే. డిసెంబరులో మాలవీయ ప్రోద్బలంతో చర్చలకోసం విఫలయత్నం ఒకటి జరిగింది. ఖిలాఫత్ నాయకులను వదులుకోవడం ఈ చర్చల్లో ఒక షరతుగా మారడంతో అటువంటి మార్గాన్ని గాంధీజీ సమ్మతించలేదు. పైగా, ఏ రకమైన ఒప్పందాన్నీ కుదర్చుకునే ఉద్దేశం లేకపోవడంతో, చర్చలనుంచి ఉపసంహరించుకోవలసిందిగా వైస్‌రాయ్‌గా ఉన్న లార్డ్ రీడింగ్‌ను బ్రిటిష్ ప్రభుత్వం ఆదేశించింది. దమనకాండ పెద్ద ఎత్తున సాగుతోంది. సభలూ, సమావేశాలూ నిషేధించారు. పత్రికలపై ఆంక్షలు ఆరంభమైనాయి. కాంగ్రెస్-ఖిలాఫత్ కార్యాలయాలపై రాత్రివేళల్లో ప్రభుత్వ దాడులు నిత్యకృత్యమైపోయాయి.

శాసనోల్లంఘనోద్యమాన్ని పెద్ద ఎత్తున ఆరంభించాల్సిందిగా అటు కాంగ్రెస్ ఉన్నతనాయకత్వంనుంచీ, కార్యకర్తలనుంచీ గాంధీజీపై ఒత్తిడి అధికం కావడం ఆరంభమైంది. ఈ వ్యవహారంపై నిర్ణయాధికారం గాంధీజీదేనంటూ 1921 డిసెంబరులో కాంగ్రెస్ అహమ్మదాబాద్ సమావేశం తీర్మానించింది. ఒక పక్కన ప్రభుత్వం ఏమాత్రం లొంగుబాటు ధోరణిని ప్రదర్శించడం లేదు. 1922 జనవరినెలలో అన్ని రాజకీయపక్షాల

సమావేశం చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం ఖాతరుచేయలేదు. అంతేకాదు, గాంధీజీ వైస్రాయ్‌కు రాసిన లేఖలో, ప్రభుత్వం పౌరహక్కులపై విధించిన నిషేధాలను ఎత్తివేసి, రాజకీయఖైదీలందరినీ విడుదల చేయాలనీ, లేని పక్షంలో తాను శాసనోల్లంఘనను ఆచరించాల్సివస్తుందంటూ చేసిన హెచ్చరికను కూడా ఖాతరుచేయలేదు. వైస్రాయ్ ధోరణిలో ఏమార్పూ రాకపోవడంతో ఇక మరోమార్గం లేక గాంధీజీ విస్తృతస్థాయిలో శాసనోల్లంఘనోద్యమానికి పిలుపునిచ్చారు. సూరత్‌జిల్లాలోని బర్దోలీ తాలూకాలో దానిని ఆరంభిస్తున్నట్టు ప్రకటిస్తూ, మిగతా దేశమంతా సంపూర్ణమైన క్రమశిక్షణను పాటిస్తూ పరిస్థితిని సక్రమంగా ఉంచినపక్షంలో, ఉద్యమం యావత్తూ తన దృష్టిని బర్దోలీపై కేంద్రీకరించడం సాధ్యపడుతుందని ఆయన ప్రకటించారు. అయితే, కొందరు కాంగ్రెస్-ఖిలాఫత్ నాయకుల చర్యల కారణంగా అనుకున్నది అనుకున్నట్టుగా జరగకపోవడంతో అటువంటి ఒక మహదవకాశాన్ని దక్కించుకోవడానికి బర్దోలీ మరో ఆరేళ్లపాటు ఎదురుచూడాల్సి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లాలోని చౌరీచౌరాలో కాంగ్రెస్-ఖిలాఫత్ ప్రదర్శన సాగుతున్నప్పుడు కొందరు పోలీసుల దురుసు ప్రవర్తనకు ఆగ్రహోదగ్రులైన కొందరు కార్యకర్తలు వారిపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు ఇందుకు ప్రతిగా కాల్పులు జరిపారు. దీంతో ఊరేగింపులో పాల్గొన్నవారందరూ రెచ్చిపోయి పోలీసులపై దాడికి దిగారు. భయపడిన పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో దాక్కుండిపోవడంతో ఆ భవనాన్ని తగులబెట్టారు. కొందరు పోలీసులు తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పుడు వారిని నరికివేసి ఆ మంటల్లోకి విసిరేశారు. ఈ విధంగా మొత్తం 22మంది పోలీసులను ఉద్యమకారులు చంపివేశారు. ఈ సంఘటన గురించిన తెలిసిన గాంధీజీ వెంటనే ఉద్యమాన్ని ఉపసంహరించుకుంటున్నట్టుగా ప్రకటించారు. తన నిర్ణయాన్ని ఆమోదించవలసిందిగా కూడా ఆయన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి విజ్ఞప్తిచేసి, ఒప్పించారు. ఆ విధంగా 1922 ఫిబ్రవరి 12న సహాయనిరాకరణోద్యమం ముగిసిపోయింది.

చౌరీచౌరాలో హింసజరిగిన కారణంగా మొత్తం ఉద్యమాన్ని ఉపసంహరించుకోవాలన్న గాంధీజీ నిర్ణయం ఎంతో వివాదాన్ని సృష్టించింది. ఇప్పటికీ కూడా వివిధ వేదికలపైనా, చరిత్రపుటల్లోనూ ఈ వివాదం వేడిగా మనను తాకుతూనే ఉంటుంది. మోతీలాల్ నెహ్రూ, సి. ఆర్.దాస్, జవాహర్‌లాల్ నెహ్రూ,సుభాష్ బోస్, ఇంకా అనేకమంది ఈ

నిర్ణయం విన్నవెంటనే వ్యక్తమైన తమ తీవ్ర దిగ్భ్రాంతిని చరిత్రపుటల్లో నమోదు చేశారు. ఒక చిన్నగ్రామంలో కొందరి దుందుడుకు చర్యకు దేశం యావత్తూ ఎందుకు మూల్యం చెల్లించాలో వారికి అర్థం కాలేదు. ఉద్యమ నాయకుడుగా గాంధీజీ తీవ్రంగా విఫలంచెందారనీ, ఆయన ప్రాభవం అంతరించిపోయిందనీ దేశంలోని చాలామంది భావించారు.

ఆర్. పామేదత్ 'ఇండియా టుడే' లో చూపించిన మార్గంలో నడుస్తున్న తరువాతికాలం నాటి వ్యాఖ్యాతలు కూడా గాంధీజీ తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూనే ఉన్నారు. భారతసమాజంలో ధనికవర్గం పట్ల ఆయనకున్న సానుభూతికి నిదర్శనంగా దీనిని భావిస్తున్నారు. ఉద్యమాన్ని ఉపసంహరించాలన్న గాంధీజీ నిర్ణయానికి అహింసపట్ల ఆయనకున్న అచంచలమైన విశ్వాసం మాత్రమే కారణం కాదని వారి వాదన. చౌరీచౌరాలో జరిగిన సంఘటన సామాన్యప్రజల్లో పెరుగుతున్న అతివాదధోరణులకు ప్రత్యక్షనిదర్శనమనీ, ఆస్తిసంబంధాల యధాతథస్థితిపై దాడిచేసేందుకు వారి సంసిద్ధతను తెలియచేస్తున్నదనీ వారి అభిప్రాయం. ఉద్యమంలో ఈ రకమైన రాడికల్ భావనలు పొడచూపడంతో, ఉద్యమం తన చేతుల్లోనుంచి రాడికల్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే అవకాశాలు కనిపించడంతోనూ, అప్పుడు అంతిమంగా హింసను ఎదుర్కోబోయే భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం గాంధీజీ ఈ ఉద్యమాన్ని నిలిపివేసినట్టుగా వారి అభిప్రాయం. తమ వాదనకు మద్దతుగా వారు 'బర్డోలీ తీర్మానం'గా పేరొందిన 1922 ఫిబ్రవరి 12నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానంలోని కొన్ని అంశాలను ప్రస్తావిస్తున్నారు. ఉద్యమాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించడంతోపాటుగా ఆ తీర్మానం రైతులను పన్నులు చెల్లించాల్సిందిగా, కౌలుదారులు తమ కిరాయిలు చెల్లించాల్సిందిగా కోరింది. 1922 ఫిబ్రవరినాటి చారిత్రాత్మక నిర్ణయం వెనుక అంతర్లీనంగా ఉన్న కారణం ఇదేనంటూ వారు అంటున్నారు.

అయితే, గాంధీజీపై చేస్తున్న ఈ విమర్శ నిష్పక్షపాతంగా ఉన్నట్టు కనిపించదు. ఒక మారుమూల గ్రామంలో జరిగిన హింస యావత్ ఉద్యమాన్నీ ఉపసంహరించుకోవడానికి సరైన కారణం కాదన్న వాదన బలహీనమైనది. ఎందుకంటే, తాను బర్డోలీలో శాసనోల్లంఘనోద్యమాన్ని అమలు చేస్తున్నప్పుడు దేశంలో ఎక్కడా కూడా హింసాయుతమైన ఉద్యమాలను తాను సహించేది లేదని గాంధీజీ స్పష్టంచేశారు. అంతేకాదు, శాసనోల్లంఘన

కార్యక్రమాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీలకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకోమంటూ ఆంధ్ర పిసిసిని ఆయన కోరారు కూడా. దీనికి ప్రధానకారణం ఏమిటంటే, విస్తృతస్థాయిలో ఇటువంటి ఉద్యమాలను నిర్వహిస్తున్నప్పుడు దాని స్వభావం రీత్యా, సంబంధిత అధికారుల దుశ్చర్యల కారణంగానూ ఉద్యమం ఉగ్రరూపాన్ని సంతరించుకునే అవకాశాలు చాలా ఉన్నాయి. ఉద్యమం గాడి తప్పి హింసాయుతంగా మారవచ్చు (1921 నవంబరులో బోంబేలోనూ, ఆ తరువాత చౌరీ చౌరాలోనూ ఇదే జరిగింది). దేశంలోని ఏ ప్రాంతంలోనైనా హింసాయుత సంఘటన ఏ ఒక్కటి జరిగినా ప్రభుత్వం దానిని సాకుగా చూపించి మొత్తం ఉద్యమంపై విరుచుకుపడటానికి ప్రయత్నిస్తుంది. ఒక చోట జరిగిన హింసను ఆధారంగా చూపించి మిగతాప్రాంతాల్లో కూడా హింస చెలరేగే అవకాశాలున్నాయన్న వాదనతో ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఇదే కనుక జరిగితే అహింసాయుత శాసనోల్లంఘనోద్యమం లక్ష్యం పూర్తిగా దెబ్బతింటుంది. ఎందుకంటే, శాంతియుత ప్రతిఘటనాకారులపై సాయుధబలగాలు విరుచుకుపడినప్పుడు ప్రభుత్వ అణచివేత ధోరణి అత్యంత స్పష్టంగా బట్టబయలవుతుందన్న సిద్ధాంతం ఈ ఉద్యమానికి మూలాధారం. అందువల్ల, చౌరీచౌరాకూ బర్డోలీకీ ఏమాత్రం సంబంధం లేదన్న వాదనలో పసలేదు.

బర్డోలీలో తనను శాసనోల్లంఘనోద్యమాన్ని నిర్వహించడానికి ప్రభుత్వం అవకాశం ఇస్తుందన్న నమ్మకం చౌరీచౌరా సంఘటన తరువాత గాంధీజీలో మరింత అణిగిపోయి ఉండవచ్చు. ప్రజలపై పెద్ద ఎత్తున దాడికి పాల్పడటానికీ, తనను అక్కడనుంచి పంపించివేయడానికీ ప్రభుత్వం ఈ ఘటనను సాకుగా వాడుకునే అవకాశాలు చాలా ఉన్నాయి. అప్పుడు శాసనోల్లంఘనోద్యమ లక్ష్యం నెరవేరకుండానే అది అణచివేతకు గురవుతుంది. ఉద్యమాన్ని ఉపసంహరించాలని తాను నిర్ణయించుకోవడం ద్వారా, ఆ విధంగా చేయమంటూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని కోరడం ద్వారా గాంధీజీ ఆ ఉద్యమాన్ని అణచివేత ప్రమాదంనుంచి కాపాడటమే కాకుండా, ప్రజల్లో నైతికస్థైర్యం దెబ్బతినకుండా చూశారు. ఉద్యమాన్ని ఉపసంహరించుకోవాలన్న నిర్ణయం ప్రజలను, ముఖ్యంగా క్రియాశీలక రాజకీయ కార్యకర్తలను తీవ్రంగా నిరుత్సాహపరచి వారి మనోస్థైర్యాన్ని కొంతమేరకు

దెబ్బతీసిందన్న మాట వాస్తవం. కానీ, ఉద్యమం ఆరంభమైన తరువాత ప్రభుత్వం పెద్ద ఎత్తున విరుచుకుపడి అణచివేసిన పక్షంలో అప్పుడు కార్యకర్తలూ, ప్రజలూ మానసికంగా మరింత దెబ్బతినే అవకాశాలు చాలా ఉన్నాయి. గాంధీజీ కనుక ఉద్యమాన్ని ఉపసంహరించుకోకుండా ఉండి ఉంటే, ఉద్యమం యథావిధిగా ముందుకు సాగినపక్షంలో, ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఉద్యమాన్ని అణచివేసినప్పుడు ఏం జరుగుతుంది? 'ప్రజలభాగస్వామ్యంతో చేపట్టే విస్తృతస్థాయి ఉద్యమాలు ప్రభుత్వ అణచివేత ముందు నిలబడలేవు, విజయవంతం కావు' అనే అభిప్రాయం ఏర్పడి ఉండేది. మనం గుర్తించాల్సిన మరో విషయం ఏమిటంటే, సహాయనిరాకరణోద్యమం అన్నది బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న తొలి పోరాటం. ఈ ఆరంభదశలో బలమైన ఎదురుదెబ్బ తగిలితే దాని ప్రభావం చాలా కాలం వరకూ ఉండిపోతుంది. ప్రజల్లో నిరాశానిస్పృహలు ఆవరిస్తాయి. వారు మనోస్థైర్యాన్ని కోల్పోయి నిస్తేజంగా మారిపోయే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రభావం దీర్ఘకాలం పాటు ఉంటుంది.

ఉద్యమంలో తీవ్రవాదధోరణులు పొడచూపుతున్న కారణంగానే గాంధీజీ దానిని ఉపసంహరించుకున్నారన్నది మరో వాదన. దేశంలో క్రమంగా వేళ్ళూనుకోబోతున్న ఈ ధోరణి చౌరీచౌరా సంఘటనలో నామమాత్రంగా కనిపించిందని వారంటున్నారు. వాస్తవానికి చౌరీచౌరా సంఘటనలో మనకు భూస్వాములపై దాడిచేయాలనీ, ఆస్తిసంబంధాల నిర్మాణ వ్యవస్థని తిరగదోడాలనే లక్ష్యం కనిపించదు. కొందరు పోలీసుల దుర్మార్గమైన ప్రవర్తనతో రెచ్చిపోయిన జనం తక్షణ ఆవేశంలో దాడికి పాల్పడ్డారంతే. ఈ కాలానికి బాగా ముందుగానే అవధ్, మలబార్‌లలో రైతు ఉద్యమాలు అంతరించిపోయాయి. అవధ్‌లోని గ్రామీణప్రాంతాల్లో ఉన్న ఏకా ఉద్యమం జమీందారీ వ్యవస్థ అంతానికి పోరాడుతున్న సూచనలు కూడా లేవు. జమీందారులు అక్రమంగా పన్నులు వసూలు చేయడాన్నీ, భూమి కిరాయినీ అడ్డగోలుగా పెంచేయడాన్నీ నిలిపివేయాలని మాత్రమే ఆ ఉద్యమకారులు కోరుతున్నారు. ఏకా ఉద్యమంలో చేరదల్చుకున్న రైతులు చేయవలసిన ప్రమాణాల్లో ప్రధానమైనది తాము ఖరీఫ్, రబీ పంటలకు తప్పనిసరిగా కిరాయి చెల్లిస్తామని. గుంటూరులో చేపట్టిన పన్ను నిరాకరణ ఉద్యమం సహాయనిరాకరణోద్యమపు పరిధికీ, స్ఫూర్తికి పూర్తిగా కట్టుబడి అహింసాయుతంగానే ఉంది. అంతేకాదు, 1922 ఫిబ్రవరి నాటికి అది

అంతరించిపోతున్న దశలో ఉంది. అందువల్ల, తీవ్రవాద ధోరణులు ఏ ప్రాంతంలో పొడచూపుతున్నాయనో చెప్పడం చాలా కష్టం.

ఉద్యమాన్ని ఉపసంహరించుకుంటున్నట్టుగా ప్రకటించిన బర్డోలీ తీర్మానం రైతులు పన్నులు చెల్లించాలనీ, కౌలుదారులు తమ కిరాయిలను కట్టాలనీ చెప్పడం ద్వారా కాంగ్రెస్‌కు జమీందారుల హక్కులను హరించే ఉద్దేశం లేదని స్పష్టంచేసింది. ఉద్యమంలో ఏ దశలోనూ కూడా జమీందారుల హక్కులను ప్రశ్నించే ఉద్దేశం కనిపించదు. అందువల్ల, బర్డోలీ తీర్మానం ఈ అంశంపై కాంగ్రెస్ తన విధానాన్ని పునరుద్ఘాటించడమే తప్ప వేరొకటి కాదు. మొత్తం ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నప్పుడు సహజంగానే 'పన్నుల చెల్లింపు నిరాకరణ' కూడా వెనక్కు పోతుంది.

గాంధీజీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మరికొన్ని అంశాలు కూడా ప్రభావితం చేసాయని చెప్పవచ్చు. 1921 ద్వితీయార్థంనాటికి దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉద్యమం వేడి క్రమంగా చల్లారిపోతున్న సూచనలు ఆరంభమైనాయి. విద్యార్థులు స్కూళ్ళకూ, కాలేజీలకూ, న్యాయవాదులు న్యాయస్థానాలకూ వెళ్ళడం ఆరంభమైంది. వాణిజ్యవర్గాలవారిలో ఉత్సాహం తగ్గిపోయి దాని స్థానంలో విదేశీవస్త్రాల నిలువలు పెరిగిపోతున్నాయన్న భయం ఎక్కువకావడం ఆరంభమైంది. పట్టణ ప్రాంతాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ కూడా సభలకూ, సదస్సులకూ హాజరయ్యేవారి సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. దీనర్థం గుజరాత్‌లోని బర్డోలీ, ఆంధ్రలోని గుంటూరు మాదిరిగా రాజకీయకార్యాచరణ విస్తృతస్థాయిలో జరిగిన ప్రాంతాల్లో కూడా ప్రజలు చప్పగా చల్లారిపోయి ఉన్నారని కాదు. కానీ, 1921 ప్రథమార్థంలో జనబాహుళ్యంలో మనకు కనిపించినంతటి ఉత్సాహం, ఉద్రేకం మట్టుకు లేదు. అటు కార్యకర్తలు, ఇటు రాజకీయంగా క్రియాశీలకంగా వ్యవహరించేవారూ కూడా ఎంతో ఉత్సాహంగా పోరాటాన్ని కొనసాగించాలన్న భావనతోనే ఉన్నారు. కానీ, యావత్ ప్రజలూ మనసా వాచా కర్మణా పాలుపంచుకోవాల్సిన ఇటువంటి ఉద్యమాల్లో వారిలో కొందరు మాత్రమే ఉత్సాహంగా ఉంటే సరిపోదన్న విషయాన్ని మనం గమనించాలి.

విస్తృత స్థాయిలో సాగే ప్రజా ఉద్యమాలకు స్వాభావికంగా ఉన్న ఒక లక్షణాన్ని గుర్తించడంలో గాంధీజీ విమర్శకులు వైఫల్యం చెందుతునట్టు కనిపిస్తోంది. విశాలజనసమూహాలతో నిర్మితమైన ఉద్యమాలు ఉచ్ఛస్థితికి చేరుకున్న తరువాత క్రమంగా

నీరసించిపోవడం మనకు తరచుగా కనిపిస్తుంది. అణచివేతనూ,దాడులనూ, పీడననూ నిభాయించుకోవడంలోనూ, కమ్ముకుంటున్న కష్టాలను తట్టుకుని నిలబడి త్యాగాలు చేయడంలోనూ సామాన్యప్రజల శక్తిసామర్థ్యాలకు పరిమితులు ఉంటాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. పరిస్థితులనుంచి తట్టుకుని నిలబడటానికీ, తమను తాము కూడదీసుకోవడానికీ, మలివిడత పోరాటానికి సమాయత్తం కావడానికీ వాళ్లకు ఊపిరి తీసుకునే వ్యవధి అవసరం. అందువల్ల ప్రజాభాగస్వామ్యంతో చేపట్టిన ఉద్యమాల్లో– ఉద్యమాన్ని ఉపసంహరించుకోవడం లేదా ఘర్షణకు తావులేని దిశలోకి దానిని మరల్చడం– ఒకవ్యూహంగా అమలు జరుగుతూ ఉంటుంది.

అయితే, ఉద్యమాన్ని ఉపసంహరించుకోవాలన్న గాంధీజీ నిర్ణయం సరైన సమయంలోనే జరిగిందా లేదా అన్నది మట్టుకు చర్చనీయాంశమే. బహుశా తాను సకాలంలో సరైన నిర్ణయాన్ని తీసుకుంటున్నాననీ, అందుకు సరైన కారణాలున్నాయనీ గాంధీజీ భావించి ఉండవచ్చు. అప్పటికే ఉద్యమం ఏడాదికి పైగా కొనసాగింది. ప్రభుత్వం చర్చలకు సిద్ధపడుతున్న దాఖలాలు కూడా ఏమీ కనిపించడం లేదు. ఉద్యమం అంతర్గత బలహీనతలు స్పష్టంగా బైటపడిపోయి పూర్తిగా లొంగిపోవడమో, లేదా అత్యంత అవమానకరంగా వెనకడుగు వేయడమో జరగకుండా, గౌరవప్రదంగా ఉద్యమాన్ని ఉపసంహరించుకోవడానికి 'చౌరీచౌరా'ఒక అవకాశాన్ని ఇచ్చింది.

* * *

తన విధానాన్ని ఆమోదించి ఆచరించిన పక్షంలో ఏడాదిలోగా స్వరాజ్యాన్ని ఇస్తానని గాంధీజీ ప్రమాణం చేశారు. కానీ, ఆ ఏడాది ముగిసిపోయింది. ఉద్యమాన్ని ఉపసంహరించుకోవడం కూడా అయిపోయింది. స్వరాజ్యం దరిదాపుల్లోనైనా కనిపించడం లేదు. కనీసం కొన్ని రాయితీలు కూడా దక్కలేదు. ఈ మొత్తం కృషి బూడిదలో పోసిన పన్నీరేనా? యావత్ ఉద్యమమూ విఫలమైపోయినట్టేనా?

'ఔను!' అని తేల్చిచెప్పడం ఎవరికైనా కష్టమే. ఎందుకంటే, సహాయనిరాకరణోద్యమం చాలా విషయాల్లో అనేక విధాలుగా విజయం సాధించింది. వివిధ వర్గాల భారతీయ ప్రజల మద్దతునూ,సానుభూతినీ అది కూడగట్టుకుంది. భారతజాతీయ కాంగ్రెస్‌ను 'మైక్రోస్కోపిక్ మైనారిటీ' ప్రతినిధి అంటూ వైస్రాయ్ డఫెరిన్ 1888లో చేసిన విమర్శ వంటిది సహాయనిరాకరణోద్యమం తరువాత కాంగ్రెస్ ఎన్నడూ

కూడా ఎదుర్కోలేదు. భారతీయ శ్రామికవర్గంలోనూ, కార్మికవర్గంలోనూ, రైతుల్లోనూ, రైతుకూలీల్లోనూ,చేతివృత్తులవారిలోనూ, వృత్తిపనివారిలోనూ, వ్యాపారుల్లోనూ, చివరకు ఉన్నతస్థాయి ఉద్యోగవర్గాల్లోనూ కూడా అది విస్తరించింది. ఈ వర్గాలపై పూర్తి పట్టుసాధించింది. అంతేకాదు, ఉద్యమం విస్తృతి దేశవ్యాప్తమైంది. కొన్ని ప్రాంతాలకంటే మరికొన్ని ప్రాంతాల్లో ఉద్యమం ఉధృతంగా సాగినమాట నిజమే కానీ, అసలు చైతన్యమే లేకుండా నిస్తేజంగా పడివున్న ప్రాంతాలు మట్టుకు లేవు.

అంతేకాదు, 'నోరూవాయా లేని కోట్లాది నిరుపేదలు' అయిన భారతీయులు ఆధునిక జాతీయరాజకీయాల్లో పాలుపంచుకుని తమ శక్తిసామర్థ్యాలను రుజువుచేసుకోవడం కూడా జరిగింది. వారు చూపిన తెగువ, వారి త్యాగనిరతి, హింసనూ, అణచివేతనూ తట్టుకోవడంలో వారు కనబరిచిన మనోస్థైర్యము అప్పటివరకూ స్వాతంత్ర్యకాంక్ష కేవలం ధనిక, విద్యాధిక వర్గాలకు మాత్రమే పరిమితమైన అంశమన్న భ్రమను తుడిచిపెట్టేశాయి. ఇది ఈ దేశపు అన్ని వర్గాలవారి మౌలికమైన ఆకాంక్షని వాళ్ళు రుజువుచేశారు. దాని స్వరూప స్వభావాల గురించి కానీ, ప్రభావాల గురించి కానీ అప్పటికి వాళ్ళకి అవగాహన లేకపోయి ఉండవచ్చు. దాని సాధనకోసం నాయకులు చేస్తున్న వాదనలన్నీ అర్థం కాకపోయి ఉండవచ్చును. ఉద్యమం విజయవంతం కావడానికి అవసరమైన క్రమశిక్షణను కూడా వారు పాటించకపోవచ్చును. ఎందుకంటే, వాళ్ళలో అత్యధికసంఖ్యాకులకు ఆధునిక జాతీయతావాద రాజకీయ ప్రపంచంతో ఏర్పడిన తొలి అనుబంధం ఇదే. జాతీయతావాదమనే ఆధునిక ఆదర్శంతో సంబంధం ఏర్పడిందీ ఇప్పుడే. పట్టణాలకు చెందినవారూ, పాఠశాలలకూ, కళాశాలలకూ చెందిన విద్యార్థులూ, గ్రామీణప్రాంతాల్లో విద్యాగంధం అంటినవారూ, రాజకీయచైతన్యం ఉన్నవారూ ఈ ఉద్యమాన్నీ, ఆదర్శాన్నీ కూడా ఆమోదించి ఆదరించిన తొలి సందర్భమూ ఇదే. ఉద్యమం విజయవంతం కాకుండా ఉండటానికి కారణాలు కావలసినన్ని. బలహీనతలు లెక్కలేనన్ని. ఈ కొత్త చైతన్యపు కాంతికిరణాలు సోకకుండా దూరంగా మిగిలిపోయిన ప్రజల సంఖ్యకూడా లెక్కలేనంత ఉంది. అయితే, ఇది ఆరంభం మాత్రమే. మరింత శ్రద్ధగా, మరింత పట్టుదలతో సాగిన సంఘటనలు ముందుముందున్నాయి. కానీ, విచిత్రమేమంటే, మార్పు అన్నది ఇప్పటికే ఎంతో స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఉద్యమంలో ముస్లింలు విస్తృతంగా పాలుపంచుకోవడమూ, మలబార్ పరిణామాల తరువాత కూడా మతసామరస్యంతో వ్యవహరించడమూ సామాన్యమైన

విషయం కాదు. ముస్లింల భాగస్వామ్యం కారణంగానే చాలా ప్రాంతాల్లో ఉద్యమానికి జనసామాన్యపు స్వభావం వచ్చిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఎందుకంటే, కొన్ని ప్రాంతాల్లో అరెస్టయినవారిలో మూడింట రెండువంతుల మంది ముస్లింలే. అయితే, దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, ఉద్యమంలో ఉన్న ఇంతటి సానుకూలమైన వాతావరణం తరువాతి కాలంలో మతోన్మాదం తన ప్రభావాన్ని చూపించడం ఆరంభించడంతో ఎన్నడూ పునరావృత్తం కాలేదు. గాంధీజీ, ఇతర కాంగ్రెస్ నాయకులూ మసీదుల్లో ప్రసంగాలు చేయడమూ, ముస్లిం మహిళలను ఉద్దేశించి ప్రసంగించడానికి వెళ్లిన గాంధీజీ కళ్లకు గుడ్డకట్టుకోనవసరం లేకుండా అనుమతి పొందడమూ ఆ తరువాతి సంవత్సరాల్లో అనూహ్యమైన సంఘటనలుగానే అనిపించడం ఆరంభమైంది.

* * *

1922 ఫిబ్రవరిలో వేసిన వెనుకడుగు తాత్కాలికమైనదే. యుద్ధం సాగుతూనే ఉంటుంది. 'ఈ ప్రపంచంలో అత్యంత సమర్థులైన వారిపై విజయం సాధించడ భారతదేశానికి అసాధ్యం. అనన్యసామాన్యమైన శక్తిసామర్థ్యాలూ, పట్టుదలా ఉన్న వీరు అటువంటి సవాళ్లకు సరైన సమాధానం చెబుతారు' అంటూ మోంటేగ్యూ-బిర్కెన్‌హెడ్ విసిరిన సవాలుపై 1922 ఫిబ్రవరి 23న యంగ్ ఇండియాలో గాంధీజీ సమాధానం ఇస్తూ ఇలా వ్యాఖ్యానించారు.

'1920లో ఆరంభమైన యుద్ధం కడదాకా కొనసాగడానికే ఆరంభమైందన్న విషయాన్ని బ్రిటిష్‌వారు ఇప్పటికైనా గుర్తించడం మంచిది. ఈ యుద్ధం నెలపాటు సాగుతుందా, సంవత్సరం పాటు జరుగుతుందా, నెలలు పడుతుందా, అనేక ఏళ్ళు పడుతుందా అన్నదానితో కానీ, బ్రిటిష్ ప్రతినిధులు తాము గతంలో ప్రయోగించినటువంటి దుర్మార్గమైన విధానాలను తిరగదోడతారా లేదా అన్నదానితో కానీ నిమిత్తం లేకుండానే ఇది సాగుతుంది.'

* * *

# 16 1920లలో రైతు ఉద్యమాలు-జాతీయవాదం

వలస పాలకులపై రైతులు తీవ్ర వైముఖ్యంతో ఉండటం 19వ శతాబ్దపు ప్రధానలక్షణంగా మనకు కనిపిస్తుంది. 20వ శతాబ్దంలో ఈ ఆగ్రహంనుంచి పుట్టుకొచ్చిన ఉద్యమాలు ఒక కొత్త లక్షణాన్ని సంతరించుకున్నాయి. దేశ స్వాతంత్ర్యపోరాటం ప్రభావం వీటిమీద ఉండటంతోపాటు ఈ పోరాటాల ప్రభావం స్వాతంత్ర్యోద్యమంపై పడింది. ఈ సంక్లిష్టమైన సంబంధాన్ని విశ్లేషించుకోవడానికి మనం ఈ శతాబ్దపు రెండు,మూడవ దశాబ్దాల్లో ఉవ్వెత్తున లేచిన మూడు ప్రధానమైన రైతు ఉద్యమాలను చూద్దాం. అవి, ఉత్తరప్రదేశ్‌లోని అవధ్‌లో సాగిన కిసాన్ సభ, ఏకా ఉద్యమాలు, మలబార్‌లోని మాప్పిలా (మోప్లా) తిరుగుబాటు, గుజరాత్‌లోని బార్డోలీ సత్యాగ్రహం.

* * *

1856లో అవధ్ స్వాధీనం జరిగిన తరువాత, 19వ శతాబ్దపు ద్వితీయార్థంలో వ్యావసాయిక సమాజం తాలూక్‌దార్లు లేదా బడాభూస్వాముల గుప్పిట్లోకి పోయింది. విపరీతంగా పెరిగిన కౌలు, అర్థంపర్థంలేని లెవీలూ, కౌలు పునరుద్ధరణ ఫీజు లేదా నజ్రానాల వంటివి రైతుల జీవితాలను నాశనం చేశాయి. మొదటి ప్రపంచయుద్ధం తరువాత ఆహారమూ, నిత్యావసరవస్తువుల ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో ఈ పరిస్థితి వారి బతుకులను మరింత దుర్భరంగా మార్చింది. దీంతో కౌలుదారుల తిరుగుబాటుకు అవధ్‌లో పరిస్థితి పూర్తి సంసిద్ధంగా ఉంది.

ఉత్తరప్రదేశ్‌లోని హోమ్‌రూల్ లీగ్‌లో క్రియాశీలక సభ్యులుగా ఉన్న కొందరు ఈ ప్రావిన్సులోని కర్షకులను కూడగట్టి కిసాన్‌సభలను ఏర్పాటు చేసే ప్రక్రియకు నాందిపలికారు. 1918లో మదన్ మోహన్ మాలవీయ మద్దతుతో గౌరీశంకర్ మిశ్రా, ఇంద్రనారాయణ్ ద్వివేదీల సారథ్యంలో ఉత్తరప్రదేశ్ కిసాన్‌సభ ప్రారంభమైంది. ఉత్తరప్రదేశ్ కిసాన్‌సభ ఎంత చైతన్యవంతంగా పనిచేసిందంటే, 1919నాటికల్లా ఆ ప్రావిన్సులోని 173 తాసిల్స్‌లో అది 450 శాఖలను ఏర్పాటు చేసింది.

ఈ రకమైన చైతన్యం కారణంగా 1918 డిసెంబరులోనూ, 1919లోనూ ఢిల్లీ, అమృత్‌సర్‌లలో జరిగిన భారతజాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కిసాన్ ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతాప్‌గఢ్ జిల్లా ఎస్టేట్‌లో 'నాయీ-దోభీ బంద్' (ఒక రకమైన సామాజిక బహిష్కరణ) అమలు జరగడంతో 1919 చివరినాటికి రైతు చైతన్యం దిగువస్థాయిలో కూడా వేళ్ళూనుకున్న దశ స్పష్టంగా కనిపించింది. తాలూక్‌దార్ల గుప్పిట్లో ఉన్న అవధ్‌లో గ్రామ పంచాయతీలు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయడం 1920 వేసవినాటికి ఒక సాధారణ విషయంగా మారిపోయింది. జింగూరీ సింగ్, దుర్గపాల్ సింగ్ ఈ పరిణామాలలో కీలకపాత్ర నిర్వహించారు. అయితే, త్వరితకాలంలోనే బాబా రామచంద్ర పేరుతో ప్రసిద్ధికెక్కిన మరో నాయకుడి చుట్టూ ఈ ఉద్యమం అల్లుకుపోయింది.

మహారాష్ట్ర బ్రాహ్మణుడైన బాబా రామచంద్ర 13వ ఏటనే ఇల్లు విడిచిపెట్టిపోయిన దేశదిమ్మరి. ఫిజీలో రోజుకూలీగా కొద్దికాలం పనిచేసి ఆ తరువాత 1909లో ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్‌లో ప్రత్యక్షమైనాడు. 1920 వరకూ ఒక సాధువులా ఊరూవాడా తిరుగుతూ తులసీదాస్ రామాయణాన్ని గ్రామీణులకు చదివి వినిపిస్తూ గడిపాడు. 1920 మధ్యకాలంలో అతడు అవధ్ రైతులకు ప్రతినిధిగా అవతరించాడు. అతి స్వల్పకాలంలోనే అనూహ్యమైన నాయకత్వ లక్షణాలనూ, ఉద్యమనిర్మాణ సమర్థతనూ ప్రదర్శించాడు.

1920 జూన్‌లో బాబారామచంద్ర నాయకత్వంలో జౌన్‌పూర్, ప్రతాప్‌గఢ్‌లకు చెందిన వందలాదిమంది కౌలుదారులు అలహాబాద్ చేరుకున్నారు. వారు గౌరీశంకర్ మిశ్రా, జవాహర్‌లాల్ నెహ్రూలను కలుసుకుని, కౌలుదారుల దుర్భరమైన బతుకులను స్వయంగా చూసి తెలుసుకోవడానికి తమ గ్రామాల్లో పర్యటించాల్సిందిగా కోరారు. ఫలితంగా జూన్- ఆగస్టు మధ్యకాలంలో జవాహర్‌లాల్ నెహ్రూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక పర్యాయాలు పర్యటించడమూ, కిసాన్‌సభ ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకోవడం సాధ్యపడింది.

* * *

ఇదిలా ఉంటే, రైతుల దుస్థితి పట్ల ప్రతాప్‌గఢ్ డిప్యూటీ కమిషనర్ మెహతా సానుభూతి వ్యక్తంచేయడమే కాక, తనకు ఫిర్యాదులను పంపించినట్టయితే వాటిని తప్పక పరిశీలిస్తానని హామీ ఇచ్చాడు. దీంతో ప్రతాప్‌గఢ్‌జిల్లాలోని రూర్ గ్రామానికి చెందిన కిసాన్‌సభ ఒక భారీ కార్యక్రమానికి నడుంబిగించింది. సుమారు లక్షమంది కౌలుదారులు ఒక అణా చెల్లించి తమ ఫిర్యాదులను ఇక్కడ నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగానే గౌరీశంకర్ మిశ్రా ఎంతో కృషిచేసి 'బేడాఖిల్' , 'నజ్రానా' విధానాల విషయంలో కౌలుదారుల ఫిర్యాదులపై మెహతాతో ఒక ఒప్పందాన్ని కుదర్చుకున్నారు. కానీ, 1920 ఆగస్టులో మెహతా సెలవుపై వెళ్ళినప్పుడు తాలూక్‌దారులు అవకాశం చూసుకుని ఊపందుకుంటున్న కిసాన్ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నించారు. బాబా రామచంద్రపైనా, 32మంది రైతు నాయకులపైనా అక్రమంగా దొంగతనం కేసును బనాయించి వారిని అరెస్టు చేయించడంలో విజయం సాధించారు.దీంతో తీవ్రంగా ఆగ్రహించిన నాలుగైదువేలమంది రైతులు ప్రతాప్‌గఢ్ జైలులో ఉన్న తమ నాయకులను చూడడానికి అక్కడకు చేరుకున్నారు. వారందరినీ ఒప్పించి అక్కడినుంచి పంపించివేయడానికి పోలీసులు ఎంతో కష్టపడవలసి వచ్చింది.

పదిరోజుల తరువాత బాబా రామచంద్రను విడుదల చేయించడానికి స్వయంగా గాంధీజీయే వస్తున్నారన్న వదంతి వ్యాపించడంతో 10వేల నుంచి 20వేలమంది రైతులు ప్రతాప్‌గఢ్‌కు పరిగెత్తుకొచ్చారు. బాబా రామచంద్ర దర్శనం కానిదే తాము కదిలేది లేదని వారంతా భీష్మించుకుకూచోవడంతో సమీపంలోని ఒక చెరుకుతోటలో ఉన్న ఒక చెట్టుపై ఎక్కి రామచంద్ర వారందరికీ దర్శనం ఇచ్చారు. అప్పటికే అక్కడ గుమిగూడిన రైతుల సంఖ్య 60వేలకు చేరుకుంది. పరిస్థితిని చక్కదిద్దడానికి డిప్యూటీకమిషనర్ మెహతాను వెంటనే సెలవు రద్దుచేసుకుని రమ్మని ప్రభుత్వం ఆదేశించింది. ఆయన వచ్చిరాగానే రైతు నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయడంతోపాటు భూస్వాములను తమ తీరుతెన్నులు మార్చుకోమంటూ ఒత్తిడి కూడా తీసుకువచ్చారు. రైతులు ఎంతో సులువుగా సాధించిన ఈ విజయం వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఉద్యమానికి మరింత బలం చేకూరింది.

ఇదిలా ఉంటే, కలకత్తాలో కాంగ్రెస్ సహాయనిరాకరణకు నడుంబిగించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చాలామంది జాతీయవాదులు ఈ కొత్త రాజకీయవిధానానికి కట్టుబడ్డారు. మదన్‌మోహన్ మాలవీయ సహా మరికొందరు రాజ్యాంగబద్ధమైన

ఆందోళనకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ విధమైన విభేదాలు ఉత్తరప్రదేశ్ కిసాన్‌సభలో కూడా ప్రతిబింబించాయి. త్వరితకాలంలోనే సహాయ నిరాకరణవాదులు ఈ కిసాన్ సభకు ప్రత్యామ్నాయంగా 1920 అక్టోబర్ 17న ఔధ్ కిసాన్‌సభను ఏర్పాటు చేశారు. ఈ కొత్త సంస్థ అంతకు కొద్దినెలలు ముందునుంచీ అవధ్‌లో పుట్టుకొచ్చిన అనేక కిసాన్‌సభలను తనలో విలీనం చేసుకోవడంలో విజయం సాధించింది. జవాహర్‌లాల్ నెహ్రూ, మాతా బాదల్ పాండే, మిశ్రా, బాబా రామచంద్ర, దేవ్ నారాయణ్‌పాండే, కేదార్ నాథ్ వంటి వారి ప్రయత్నాల కారణంగా ఈ కొత్త సంస్థ తన పరిధిలోకి 330 కిసాన్‌సభలను తెచ్చుకోగలిగింది. ఈ ఔధ్ కిసాన్‌సభ రైతులందరినీ 'బేడాఖ్లీ' భూమిని దున్నడానికి అంగీకరించవద్దనీ, 'హారీ', 'బేగార్' (వెట్టిచాకిరీ) లను తిరస్కరించాలనీ, ఈ నిబంధనలను అంగీకరించని వారిని బహిష్కరించాలనీ, తమ వివాదాలను పంచాయతీలలో పరిష్కరించుకోవాలనీ కోరింది. ఈ సంస్థ ఫైజాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న అయోధ్యలో తొలిసారిగా తన బలం ఏమిటో నిరూపించింది. డిసెంబరు 20,21వతేదీల్లో ఈ సంస్థ ఏర్పాటు చేసిన ర్యాలీకి సుమారు లక్షమంది రైతులు హాజరైనారు. ఈ ర్యాలీకి బాబా రామచంద్ర రైతులపై అమలు జరుగుతున్న అణచివేతకు నిరసనగా తనను తాను తాళ్ళతో కట్టివేసుకుని హాజరైనారు. కిసాన్‌సభ ఉద్యమంలో ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అంశమేమిటంటే, అటు ఎగువకులాలకూ, ఇటు దిగువకులాలకూ చెందిన రైతులు ఇందులో ఉన్నారు.

1921జనవరిలో రైతు ఉద్యమ స్వభావంలో మార్పు వచ్చింది. రాయ్‌బరేలీ, ఫైజాబాద్, కొంతమేరకు సుల్తాన్‌పూర్‌లో ఉద్యమం కార్యకలాపాలు కేంద్రీకృతమైనాయి. బజార్లనూ, ఇళ్ళనూ, గిడ్డంగులనూ లూటీ చేయడం, పోలీసులతో ఘర్షణలు పడడం నిత్యకృత్యమైంది. ఇదేరకమైన సంఘటనలు కాస్త చిన్నా, పెద్దా తేడాగా అనేకం జరిగాయి. మున్షీగంజ్, రాయ్‌బరేలీలోని కర్హాయియా బజార్ వంటిచోట్ల అరెస్టులూ, నాయకులు అరెస్టయ్యారన్న వదంతులతో కల్లోలం సాగింది. ఇటువంటి కార్యక్రమంలో చాలాచోట్ల కిసాన్‌సభ కార్యకర్తలు కాక, స్థానికులు, సాధువులు,మతనాయకులు వంటివారు నాయకత్వం వహించారు.

ఈ విధంగా చెలరేగిన హింసను అణచివేయడం ప్రభుత్వానికి పెద్ద కష్టం కాలేదు. ఎక్కడికక్కడ కాల్పులు జరిగాయి. గుంపులను చెదరగొట్టడం, నాయకులను, కార్యకర్తలనూ అరెస్టు చేయడం, కేసులు పెట్టడం వంటివి యధేచ్ఛగా సాగాయి. ఒకటి రెండు సంఘటనలు మినహా మొత్తం ఉద్యమం అంతా జనవరిలోనే ముగిసిపోయింది. మార్చిలో సభలూ, సమావేశాలను నిషేధించడానికి ఉద్దేశించిన చట్టం ఒకటి ఆయాజిల్లాల్లో

అమలులోకి వచ్చి రాజకీయ కార్యక్రమం పూర్తిగా నిలిచిపోయింది. కౌలుదారుల తరఫున జాతీయవాదులు న్యాయస్థానాల్లో పోరాడుతూనే ఉన్నారు తప్ప అంతకుమించి చేసిందేమీ లేదు. ప్రభుత్వం ఇంతలోగా ఔధ్ కౌలు (సవరణ) చట్టాన్ని తీసుకువచ్చింది. ఇది కౌలుదారులకు పెద్దగా ఒరగబెట్టిందేమీ లేదు కానీ, వారిలో కొన్ని ఆశలు కల్పించగలిగింది. అంతేకాదు, ఉద్యమాన్ని చప్పగా చల్లార్చడానికి బాగా ఉపయోగపడింది.

* * *

ఏడాది చివరలో మళ్ళీ రైతుల్లో అసంతృప్తి రగులుకుంది. అయితే ఈ మారు హర్దోయి, బహ్రాయ్చ్, ప్రావిన్సు ఉత్తరభాగంలోని సీతాపూర్‌లు ఉద్యమానికి కేంద్రాలుగా మారాయి. ఈ ఉద్యమానికి ప్రారంభంలో కాంగ్రెస్, ఖిలాఫత్ నాయకులు ప్రోత్సాహాన్నిచ్చారు. ఏకా లేదా ఐక్య ఉద్యమం పేరుతో ఇది జోరందుకుంది. ఈ ఉద్యమానికి ప్రధానకారణం రాతకోతల్లో ఉన్నదానికంటే అధికంగా సగం మొత్తం కౌలు వసూలు చేసి, దానిని తమమధ్య పంచుకునే టేకీదార్ల దుర్మార్గానికి వ్యతిరేకంగా రైతులు ఈ ఉద్యమానికి నడుంబిగించారు.

ఏకా ఉద్యమాన్ని ఒక మత సంబంధమైన కార్యక్రమంతో ముడిపెట్టడం కూడా జరిగింది. రైతులందరూ ఒక గొయ్యిని తవ్వి దానిని నీటితో నింపేవారు. ఆ నీరు గంగాజలానికి ప్రతీకన్నమాట. ఒక పూజారి అధ్వర్యంలో రైతులందరూ దాని చుట్టూ గుమిగూడి ప్రమాణం చేసేవారు. తాము రికార్డుల్లో ఉన్నమేరకు మాత్రమే కౌలు చెల్లిస్తామనీ, అదనంగా చెల్లించేది లేదనీ, కౌలును సకాలంలో చెల్లిస్తామనీ, తమను తొలగించే ప్రయత్నం చేసినపక్షంలో ఎట్టిపరిస్థితుల్లోనూ భూమిని వదిలిపోమనీ, వెట్టిచాకిరీని తిరస్కరిస్తామనీ, నేరస్తులకు సహకరించమనీ, పంచాయతీ నిర్ణయానికి సంపూర్ణంగా కట్టుబడి ఉంటామనీ వారు ప్రమాణం తీసుకునేవారు.

త్వరితకాలంలోనే ఏకా ఉద్యమానికి అట్టడుగుస్థాయి నాయకత్వం సారథ్యం వహించింది. మాదరి పాసి వంటి దిగువకులాలకు చెందిన నాయకులు కాంగ్రెస్, ఖిలాఫత్ నాయకులు కోరిన అహింసాయుత విధానానికి కట్టుబడటానికి అంగీకరించలేదు. ఈ కారణంగా జాతీయనాయకులతో ఈ ఉద్యమ సంబంధాలు క్రమంగా తగ్గుముఖం పట్టి ఉద్యమం తన ధోరణిలో ముందుకు సాగింది. ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, అంతకుముందు కిసాన్‌సభ ఉద్యమాలు పూర్తిగా కౌలుదారులతో మాత్రమే సాగితే, ఏకా ఉద్యమంలో చిన్నస్థాయి జమీందారులు కూడా పాలుపంచుకున్నారు. ప్రభుత్వం వారినుంచి అత్యధికంగా శిస్తు డిమాండ్ చేస్తుండటంతో వారంతా విసిగివేసారిపోవడమే దీనికి కారణం.

అయితే, అధికారులు పెద్ద ఎత్తున అణచివేత విధానాలను విజయవంతంగా అమలు చేసి 1922 మార్చినాటికల్లా ఏకా ఉద్యమాన్ని చల్లార్చివేయగలిగారు.

* * *

కేరళలోని మలబార్ జిల్లాలో 1921 ఆగస్టులో రైతుల్లో అసంతృప్తిజ్వాలలు పెల్లుబికాయి. మాప్పిల్లా (ముస్లిం) కౌలుదారులు ఇక్కడ తిరుగుబాటు చేశారు. కౌలు కాలానికి సంబంధించి ఎటువంటి భద్రతా లేకపోవడం, కౌలు మొత్తాలు అధికంగా ఉండటం, పునరుద్ధరణ ఫీజులు అన్యాయం ఉండటం వంటి విషయాల్లో భూస్వాములపై వారు చాలా ఆగ్రహంగా ఉన్నారు. 19వ శతాబ్దంలో కూడా భూస్వాముల నిరంకుశ విధానాల పట్ల మాప్పిల్లా తిరుగుబాట్లు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయితే, 1921లో తలెత్తిన తిరుగుబాటు గతంతో పోలిస్తే భిన్నమైనదే కాక, విస్తృతిరీత్యా చాలా పెద్దది.

1920 ఏప్రిల్‌లో మంజేరీలో జరిగిన మలబార్‌జిల్లా కాంగ్రెస్ సమావేశాన్ని ఈ ప్రతిఘటనోద్యమానికి నాందిగా చెప్పుకోవచ్చు. ఈ సమావేశం కౌలుదారుల సమస్యలకు మద్దతు ప్రకటించడమే కాకుండా, కౌలుదారుల-భూస్వాముల సంబంధాలను గాడిలో పెట్టడానికి వీలుగా ఒక చట్టం తీసుకురావాలని కూడా డిమాండ్ చేసింది. దీనిని ఒక వినూత్నమైన పరిణామంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే, అప్పటివరకూ కాంగ్రెస్‌ను ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా, కౌలుదారుల పక్షానికి రాకుండా భూస్వాములు ఆపగలిగారు. మంజేరీ సమావేశం ఈ విధంగా తీర్మానించడమే కాక, కొజికోడ్‌లో కౌలుదారుల సంఘాన్ని కూడా ప్రారంభించింది. అనతికాలంలోనే జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా కౌలుదారుల సంఘాలు ఏర్పాటైనాయి.

ఈ వ్యవహారం ఒకపక్కన సాగుతుండగా, మరోపక్కన ఖిలాఫత్ ఉద్యమం ఉధృతంగా విస్తరిస్తోంది. ఒకదశలో ఖిలాఫత్ సమావేశానికీ, కౌలుదారుల సమావేశానికీ మధ్యన తేడా పోల్చుకోవడం కూడా కష్టమైంది. రెండు సమావేశాల్లోనూ నాయకులూ వాళ్లే, సభికులూ వాళ్ళే. రెండు ఉద్యమాలూ కూడా అభేద్యంగా కలిసిపోయాయి. మాప్పిల్లా కౌలుదారులే ప్రధానంగా ఈ ఉద్యమానికి వెన్నుదన్ను. అనేకమంది హిందూ నాయకులు కూడా ఇందులో ఉన్నప్పటికీ అధికశాతం హిందువులు ఇందులో భాగస్వాములు కాకుండా జాగ్రత్తపడ్డారు.

గాంధీజీ, షౌకత్ అలీ, మౌలానా అజాద్ వంటి నాయకుల పర్యటనల ద్వారా మరింత ఉత్సాహాన్నీ, బలాన్నీ సంతరించుకున్న ఖిలాఫత్-కౌలుదారీ ఉద్యమం ప్రభుత్వాన్ని

ఆందోళనలో పడవేసింది. దీంతో 1921 ఫిబ్రవరి 5న ఖిలాఫత్ సమావేశాలన్నింటినీ నిషేధిస్తూ ప్రభుత్వం ఆజ్ఞలు జారీ చేసింది. ఫిబ్రవరి 18న యాకూబ్ హసన్, యు. గోపాల మీనన్, పి.మొయిదీన్ కోయా, కె. మాధవన్ నాయర్ వంటి ప్రముఖ ఖిలాఫత్, కాంగ్రెస్ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ కారణంగా ఉద్యమ నాయకత్వం స్థానిక మాప్పిల్లా నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయింది.

అణచివేతనుంటి పుట్టుకొచ్చిన ఆగ్రహం ఒకవైపూ, ప్రపంచయుద్ధం కారణంగా బ్రిటిష్‌వారు బలహీనపడి సైనికచర్య తీసుకునే శక్తిని కోల్పోయారన్న దురభిప్రాయం మరోవైపూ తోడై మాప్పిల్లాలు క్రమంగా తమ తిరుగుబాటు వైఖరిని పెంచుకుంటూ పోయారు. 1921 ఆగస్టు 20వతేదీన జరిగిన ఒక సంఘటన పరిస్థితిని అనూహ్యంగా మార్చివేసింది. ఎరానాడ్ తాలూకా జిల్లా మేజిస్ట్రేట్ ఇ.ఎఫ్.థామస్ పోలీసులనూ, సైనికులనూ వెంటేసుకుని ప్రముఖ ఖిలాఫత్ నాయకుడూ, మతపెద్ద అయిన అలీ ముసలియార్‌ను అరెస్టు చేయడానికి తిరురంగడిలో ఉన్న మసీదుపై దాడిచేశాడు. అయితే వారికక్కడ ముగ్గురు ఖిలాఫత్ కార్యకర్తలు మాత్రమే దొరకడంతో చేసేదేమీ లేక వారిని అరెస్టు చేసి తీసుకుపోయారు. అయితే, వదంతులు మట్టుకు అలీముసలియార్ అధ్వర్యంలో ఉన్న ప్రసిద్ధ మంబ్రాత్ మసీదుపై దాడిజరిపి దానిని బ్రిటిష్ సైనికులు నేలమట్టం చేశారంటూ వ్యాపించాయి. దీంతో కోటక్కళ్, తానూర్,పరప్పనగడి ప్రాంతాలకు చెందిన మాప్పిల్లాలు తిరురంగడి చేరుకున్నారు. వారి నాయకులు బ్రిటిష్ అధికారులను కలుసుకుని అరెస్టు చేసిన ముగ్గురు కార్యకర్తలనూ విడుదల చేయించేందుకు ప్రయత్నించారు. ప్రజలు ఎంతో శాంతంగా ఉన్నప్పటికీ పోలీసులు నిరాయుధులైనవారిపై కాల్పులు జరపడంతో అనేకమంది మరణించారు. దీంతో ఘర్షణలు చెలరేగాయి. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేశారు. రికార్డులను తగలబెట్టారు. ప్రభుత్వ ఖజానాను లూటీచేశారు. ఈ తిరుగుబాటు త్వరితగతిన మాప్పిల్లాలు బలంగా ఉన్న ఎరానాడ్, వల్లువనాడ్, పొన్నాని తాలూకాల్లో వ్యాపించింది.

తిరుగుబాటు తొలిదశలో ప్రభుత్వ అధికారానికి ప్రతీకలుగా ఉన్న కచేరీలు (న్యాయస్థానాలు), పోలీస్‌స్టేషన్లు, ట్రెజరీలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్రిటిష్ తోటలయజమానులు లక్ష్యాలుగా మారాయి. అధికశాతం హిందువులైన జెన్మీలు (భూస్వాములు) ఉద్యమకారుల దాడులకు గురైనారు. నిరుపేద హిందువులపైనా, మెతకగా ఉండే భూస్వాములపైనా దాడులు జరగడం అరుదు. తిరుగుబాటు దారులు అనేక మైళ్ళు ప్రయాణించి హిందువులు అత్యధికంగా ఉన్న ప్రాంతాలను చేరుకుని భూస్వాములపై

దాడిచేసి వారి దగ్గర ఉన్న రికార్డులను తగులబెట్టేవారు. కున్‌హమీద్ హాజీ వంటి కొందరు తిరుగుబాటు నాయకులు హిందువులపై దాడులు, అత్యాచారాలు, లూటీలు జరగకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడంతో పాటు హిందువులపై దాడి చేసిన తిరుగుబాటు దారులను శిక్షించడానికి కూడా వెనుకాడలేదు. అలాగే, ముస్లింల పట్ల ప్రత్యేక వివక్ష కూడా చూపించలేదు. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న అనేకమంది మాప్పిల్లాలను అంతంచేయడానికీ, శిక్షించడానికీ ఆయన ఆదేశాలు జారీ చేశాడు.

కానీ, ప్రభుత్వం ఎప్పుడైతే సైనికశాసనాన్ని ప్రకటించి ఈ తిరుగుబాటును అణచివేయడానికి సంకల్పించిందో అప్పటినుంచీ పరిస్థితి మరో విధంగా మారిపోయింది. చాలా మంది హిందువులు ఒత్తిడికారణంగానూ, ఇష్టపూర్వకంగానూ బ్రిటిష్‌పాలకులకు అనుకూలంగా వ్యవహరించడంతో నిరుపేదలూ, నిరక్షరాస్యులైన మాప్పిల్లాల్లో అప్పటికే అంతర్గతంగా ఉన్న హిందూవ్యతిరేకతకు మరింత బలం చేకూరింది. మతపరమైన వాదనలూ, సిద్ధాంతాలూ వారిని సులువుగా మార్చివేశాయి. బలవంతపు మతమార్పిళ్ళు, హిందువులపై దాడులూ, హత్యలూ పెద్ద ఎత్తున సాగాయి. ఈ విధంగా ప్రధానంగా ఒక ప్రభుత్వవ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటం చివరకు మతం రంగును సంతరించుకుంది.

మాప్పిల్లాలు హింసామార్గాన్ని అనుసరించడంతో ప్రధానంగా అహింసపై ఆధారపడిన సహాయనిరాకరణోద్యమానికీ వారికీ మధ్య పెద్ద అగాథం ఏర్పడింది. పైగా ఈ తిరుగుబాటుకు మతవాసనలు సోకడంతో మాప్పిల్లాలు పూర్తిగా ఒంటరివారైపోయారు. బ్రిటిష్ అణచివేతవిధానాలు మిగతా కార్యాన్ని విజయవంతంగా పూర్తిచేయడంతో 1921 డిసెంబరు నాటికల్లా ఈ తిరుగుబాటు పూర్తిగా అణగారిపోయింది. అయితే, ఈ తిరుగుబాటు బలితీసుకున్నవారి సంఖ్య తక్కువేమీ లేదు. 2337మంది మాప్పిల్లాలు మరణించారని అధికారిక లెక్కలు చెబుతుంటే, కనీసం పదివేల మంది మరణించారని అనధికారిక అంచనాలు చెబుతున్నాయి. మొత్తం 45,404 మంది తిరుగుబాటుదారులు అరెస్టు కావడమో, లొంగిపోవడమో జరిగింది. ఈ ఉద్యమం కారణంగా సంభవించిన నష్టం సామాన్యమైనది కాదు. తీవ్రవాద ధోరణులు ఉన్న మాప్పిల్లాలపై అణచివేత ఏస్థాయిలో సాగిందంటే ఈ తిరుగుబాటు తరువాత స్వాతంత్ర్యం లభించేంతవరకూ కూడా ఏ రాజకీయపోరాటంలోనూ వారి పాత్ర లేకుండాపోయింది. వారి నైతికస్థైర్యం ఏ స్థాయిలో దెబ్బతిన్నదంటే వారు అటు జాతీయోద్యమంలో కానీ, తరువాత కాలంలో కేరళలో వామపక్షం నాయకత్వాన ఉద్భవించబోతున్న రైతు ఉద్యమంలో కానీ పాలుపంచుకోలేదు.

* * *

ఉత్తరప్రదేశ్‌లోనూ, మలబార్‌లోనూ సాగిన రైతు ఉద్యమాలు ఆ విధంగా జాతీయస్థాయి రాజకీయాలతో దగ్గరసంబంధాలు కలిగివున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో రైతు ఉద్యమానికి ప్రోత్సాహం హోమ్‌రూల్ లీగ్స్‌నుంచీ, ఆ తరువాత సహాయనిరాకరణ,ఖిలాఫత్ ఉద్యమాల నుంచీ లభించింది. అవధ్‌లో రైతు ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్న 1921వ సంవత్సరం తొలిమాసాల్లో సహాయనిరాకరణోద్యమానికి సంబంధించిన ఒక సమావేశానికీ, ఒక రైతు సభకూ మధ్య తేడాను కనిపించేది కాదు. ఇదేరకమైన పరిస్థితి మలబార్‌లో కూడా ఏర్పడింది. ఖిలాఫత్ సభలూ, రైతు ఉద్యమానికి సంబంధించిన సభలూ ఒకదానిలో ఒకటి విలీనమైపోయాయి. కానీ రెండు చోట్లా కూడా రైతులు హింసాయుత మార్గాన్ని అనుసరించడంతో వారికీ జాతీయోద్యమానికీ మధ్య అగాధం ఏర్పడటం, హింసకు పాల్పడవద్దంటూ జాతీయనాయకులు వారికి విజ్ఞప్తులు చేయాల్సి రావడం జరిగింది. ముఖ్యంగా, భూస్వాములకు కౌలు చెల్లించకపోవడం వంటి విపరీత విధానాలను పాల్పడవద్దని గాంధీజీ రైతులకు విజ్ఞప్తిచేయడం కూడా జరిగింది.

ఈ రకంగా రైతుల, వారి స్థానిక నాయకుల ఆలోచనా విధానంలోనూ, ఎంచుకున్న మార్గానికీ, జాతీయనాయకుల అవగాహనకూ ఉన్న విభేదాన్ని ఆధారంగా చేసుకుని ఉద్యమం తమ క్షేమకరమైన చేతుల్లోనుంచి తీవ్రవాద, విప్లవాత్మక స్వభావం ఉన్న ప్రజానాయకుల చేతుల్లోకి పోతోందన్న బూర్జువా నాయకత్వం ఆందోళనకు సూచనగా దానిని విశ్లేషించడం తరచు జరుగుతోంది. డిమాండ్ల విషయంలోనూ, అనుసరిస్తున్న పద్ధతుల విషయంలోనూ కాస్త నిగ్రహంగా వ్యవహరిచమని చెప్పడం భారత సమాజంలోని భూస్వాముల, ధనస్వాముల పట్ల సానుభూతికి నిదర్శనంగా వ్యాఖ్యానించడం జరిగింది. అయితే, జాతీయ నాయకత్వం ఇటువంటి సలహాలను ఇవ్వడానికి కారణం రైతులు హింసాయుత తిరుగుబాటుకు పాల్పడినప్పుడు తత్ఫలితంగా పుట్టుకొచ్చే పరిణామాలనుంచి వారిని కాపాడటానికేనని మనం చెప్పుకోవచ్చు. అటు ఉత్తరప్రదేశ్‌లో కానీ, ఇటు మలబార్‌లో కానీ హింసాయుత తిరుగుబాటుకు ప్రతిఫలం ఏమిటో తెలియడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రభుత్వం అతి తీవ్రంగా విరుచుకుపడింది. భూస్వాములకు కౌలు చెల్లించకపోవడం వంటి విపరీత విధానాలను అమలు చేయవద్దంటూ కోరడానికి కూడా కారణాలున్నాయి. రైతులు డిమాండ్ చేస్తున్నది భూస్వామ్యం పోవాలని కాదు. అక్రమంగా అమలు చేస్తున్న లెవీలను రద్దుచేయాలనీ, అత్యధికంగా ఉన్న శిస్తులను, కౌలునూ తగ్గించాలని మాత్రమే వారు కోరుతున్నారు. ఈ

డిమాండ్లకు జాతీయ నాయకత్వం మద్దతు ఉన్నది కూడా. ఈ స్థితిలో శిస్తు చెల్లించడానికి నిరాకరించడం వంటి చర్యలకు పూనుకుంటే చిన్నతరహా భూస్వాములు కూడా ప్రభుత్వ పక్షానికి పోయే ప్రమాదం ఉంది. దానివల్ల ప్రభుత్వానికీ, జాతీయ ఉద్యమానికీ మధ్య సాగుతున్న పోరులో వారు తటస్థవైఖరి అవలంబించే అవకాశాలు మృగ్యమైపోతాయి.

* * *

గుజరాత్‌లోని సూరత్‌జిల్లా బర్డోలీతాలూకాలో 1928లో ఆరంభమైన పన్ను నిరాకరణ ఉద్యమం చాలా రకాలుగా సహాయనిరాకరణోద్యమ కాలం నాటి పుత్రికే. 1922లో బర్డోలీని గాంధీజీ శాసనోల్లంఘన కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఎంపికచేసుకున్నారు. అయితే, చౌరీచౌరా సంఘటనతో పరిస్థితి పూర్తిగా మారిపోయి ఆ ఉద్యమం ఆరంభం కానేలేదు. కానీ, శాసనోల్లంఘనోద్యమాన్ని ఆరంభించడానికి వీలుగా వివిధస్థాయిల్లో, వివిధ రకాలుగా జరిగిన విస్తృతమైన ప్రయత్నాలు అంతిమంగా బర్డోలీలో రాజకీయచైతన్యాన్ని కలిగించాయి. స్థానిక నాయకులైన కల్యాణ్‌జీ, కున్వర్‌జీ మెహతా సోదరులూ, దయాళ్జీ దేశాయ్ వంటివారూ సహాయ నిరాకరణోద్యమ స్ఫూర్తిని ప్రచారం చేయడానికి ఎంతో కృషిచేశారు. సంఘసంస్కర్తలుగా వారు ఆజిల్లాలో సహాయనిరాకరణోద్యమానికి దశాబ్దం ముందుగానే అనేక కార్యక్రమాలు నిర్వహించారు. అనేక జాతీయ పాఠశాలలను స్థాపించి ప్రభుత్వ పాఠశాలలను బహిష్కరించవలసిందిగా విద్యార్థులను ప్రోత్సహించారు. విదేశీ వస్త్రాన్నీ, మద్యాన్నీ విడనాడవలసిందిగా ప్రజలను చైతన్యపరిచారు.

సహాయనిరాకరణోద్యమాన్ని ఉపసంహరించుకున్న తరువాత బర్డోలీకి చెందిన కాంగ్రెస్‌వాదులు నిర్మాణాత్మక కార్యక్రమాలకు పూనుకున్నారు. అస్పృశ్యులకూ, ఆదివాసులకూ మీరు చేసిందేమీ లేదంటూ 1922లో గాంధీజీ చేసిన వ్యాఖ్య వారి చెవుల్లో మారుమోగుతూనే ఉంది. ఆ తాలూకాలో 60శాతం వరకూ ఉన్న అస్పృశ్యులూ, ఆదివాసులకు 'కాలిపరాజ్' (నల్లవారు) అన్నది వ్యవహారిక నామం. ఉన్నతకులాలకు చెందిన వారిని 'ఉజాలిపరాజ్' (తెల్లవారు)లంటారు. ఉన్నత కులాలకు చెందిన కాంగ్రెస్‌వాదులు తాలూకాలో ఆరు ఆశ్రమాలను స్థాపించి కాలిపరాజ్‌ల సంక్షేమానికి కృషిచేయడం ఆరంభించారు (వీటిలో చాలా ఆశ్రమాలు ఇప్పటికీ కూడా ఈ పనిలో కొనసాగుతూనే ఉన్నాయి). విద్యావ్యాప్తికి కృషిచేస్తూ ఈ ఆశ్రమాలు 1922నాటి నిర్ణయం వల్ల బర్డోలీ తాలూకాలో ఏర్పడిన నిరాశానిస్పృహలనుంచి ప్రజలను చాలావరకూ బైటపడవేయగలిగాయి. కున్వర్‌జీ మెహతా, కేశవ్‌జీ-గణేష్‌జీలు కాలిపరాజ్‌ల భాషను నేర్చుకుని, ఆయా కులాల్లో చదువుకున్న వారి సహకారంతో ప్రత్యేక సాహిత్యాన్ని అభివృద్ధి

చేశారు. పద్యం, గద్యంతో ఈ సాహిత్యం కాలిపరాజ్‌లను చైతన్యవంతంగా చేసింది. ఎగువకులాలకు చెందిన భూస్వాముల వద్ద తరతరాలుగా 'హాలీ' విధానంలో వెట్టి చాకిరీ చేస్తూ వచ్చిన వీరు ఆ భూస్వాములకు వ్యతిరేకంగా తిరగబడటానికి ఈ సాహిత్యం ఎంతో ఉపకరించింది. దీనితోపాటుగా కాలిపరాజ్‌లను దురలవాట్లనుంచీ, ఆడంబరమైన వివాహ వేడుకలనుంచీ విముక్తిచెందేట్టు చూసి వారు ఆర్థికంగా కునారిల్లిపోకుండా కాపాడింది. కాలిపరాజ్‌లూ, ఉజాలిరాజ్‌లతో కూడుకున్న భజనమండళ్లు ఆ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాయి. కాలిపరాజ్‌లకోసం రాత్రిపాఠశాలలు ఆరంభమైనాయి. 1927లో వారి పిల్లలకోసం బర్డోలీ పట్టణంలో ఒక స్కూలు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఆశ్రమ కార్యకర్తలు అగ్రకులాల ఆగ్రహాన్ని పలుమార్లు చవిచూడాల్సివచ్చింది. వీరు అమలు చేస్తున్న కార్యక్రమాలవల్ల తమ కట్టుబానిసలు తమకు కాకుండా పోతారని అగ్రకులాలవారు భయపడ్డారు. 1922లో కాలిపరాజ్‌ల వార్షిక సమావేశం జరిగింది. 1927లో గాంధీజీ అధ్యక్షతన జరిగిన కాలిపరాజ్‌ల వార్షిక సమావేశంలో వారి దుర్భరస్థితిని అధ్యయనం చేసేందుకు ఒక అధ్యయన సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. దీనితోపాటుగా కాలిపరాజ్ అన్న పదం అత్యంత అవమానకరంగా ఉన్నందున దానిని రాణిపరాజ్‌గా మార్చేందుకు కూడా సమావేశం తీర్మానించింది. గుజరాత్‌లో ప్రముఖులుగా పేరొందిన నరహరి పారిఖ్, జుగత్‌రామ్ దవేలు ఈ అట్టడుగుకులాలవారి స్థితిగతులను అధ్యయనం చేసి హాలీ విధానంపైనా, వడ్డీవ్యాపారులు వారిని దోచుకుంటున్న విధానంపైనా, ఈ కులాలకు చెందిన మహిళలపై అగ్రకులాలవారు సాగిస్తున్న లైగింక దోపిడీపైనా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ రకమైన కార్యక్రమాల ద్వారా కాలిపరాజ్‌లలో కాంగ్రెస్ సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకోగలిగింది. భవిష్యత్తులో వారి మద్దతును కూడా పరిగణనలోకి తీసుకోగలిగే అవకాశం ఏర్పడింది.

మరోపక్కన ఆశ్రమానికి చెందిన వారు భూమివున్న రైతుల సంక్షేమానికి కూడా అనేక కార్యక్రమాలు చేపట్టి వారి మద్దతును కూడా కూడగట్టుకోగలిగారు. అందువల్ల, 1926లో భూమిశిస్తు పునర్‌అంచనాల అధికారిగా ఉన్న జయకర్ ఆ తాలూకాలో భూమిశిస్తును అప్పటికి ఉన్నదానికంటే 30శాతం అధికం చేయాలని సూచించినప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆ ప్రతిపాదనపై తీవ్రంగా అభ్యంతరాలు వ్యక్తంచేయడంతోపాటు ఈ విషయంపై దర్యాప్తు చేయడానికి బార్డోలీ కమిటీని ఏర్పాటు చేశారు. 1926లో ప్రచురితమైన ఈ నివేదిక శిస్తు పెంచడం అన్యాయమనీ, అక్రమమనీ పేర్కొంది. అనంతరం

ఈ అంశంపై పత్రికల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. గాంధీజీ అధ్వర్యంలో ఉన్న యంగ్ ఇండియా, నవజీవన్ పత్రికలు ఈ అన్యాయాన్ని నలుగురి దృష్టికీ తీసుకురావడంతో సారథ్యం వహించాయి. ఆ ప్రాంతంలోని నాయకులూ, శాసనమండలి సభ్యులూ ఈ అంశాన్ని చేపట్టడంతో 1927 జులైలో ప్రభుత్వం పెంచిన శిస్తును 3౦ నుంచి 21.97శాతానికి తగ్గించింది.

అయితే, నామమాత్రమైన ఈ తగ్గింపు ఎవరినీ తృప్తి పరచలేదు. అంతవరకూ అమలులో ఉన్న శిస్తు మొత్తాన్ని మాత్రమే చెల్లించి, ఇప్పుడు పెంచిన భాగాన్ని చెల్లించవద్దంటూ రాజ్యాంగతావాదులు రైతులను ప్రోత్సహించారు. అయితే, ఆశ్రమానికి చెందిన వారు మట్టుకు ప్రభుత్వంమీద ప్రభావం ఉండాలంటే రైతులు శిస్తు కట్టడం పూర్తిగా మానేయాలని సూచించారు. ఈ సందర్భంలో మట్టుకు రైతులు మితవాద నాయకుల సలహానే ఆచరించడానికి మొగ్గుచూపారు.

అయితే, రాజ్యాంగతావాదుల పరిమితి ఏమిటో కూడా రైతులకు క్రమంగా అర్థంకావడం మొదలైంది. కనీసం పెంచిన మొత్తాన్ని చెల్లించకుండా తిరస్కరించే విషయంలో కూడా ఈ నాయకులు ఉద్యమానికి నాయకత్వం వహించడానికి సంసిద్ధంగా లేరన్న విషయం రైతులకు స్పష్టమైపోవడంతో రైతులు క్రమంగా ఆశ్రమానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు చేరువయ్యారు. కాంగ్రెస్‌నాయకులు అప్పటికే ఈ ఉద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా వల్లభ్‌భాయ్ పటేల్‌ను ఒప్పించారు. కాకోడ్ డివిజన్‌లోని బామ్నీలో 60 గ్రామాలకు చెందిన ప్రతినిధులతో జరిగిన ఒక సమావేశం వల్లభ్‌భాయి పటేల్‌ను సారథ్యం వహించవలసిందిగా విజ్ఞప్తి చేసింది. మరోవైపు స్థానిక నాయకులు గాంధీజీని కలుసుకుని ఇటువంటి ఉద్యమం వల్ల ఏర్పడగల పరిణామాల విషయంలోనూ, దాని స్వరూపస్వభావాల విషయంలోనూ రైతులకు పూర్తి అవగాహన ఉందని హామీ ఇచ్చి ఆయన అనుమతిని సాధించగలిగారు.

ఫిబ్రవరి 4వతేదీన పటేల్ బార్డోలీ చేరుకుని రైతు ప్రతినిధులతోనూ, రాజ్యాంగతావాదులతోనూ వరుసగా సమావేశాలు నిర్వహించారు. అటువంటి ఒక సమావేశంలో మితవాదనాయకులు తాము అనుసరిస్తున్న విధానాలు పూర్తిగా వైఫల్యం చెందాయనీ, అందువల్ల రైతులు వల్లభ్‌భాయి పటేల్ విధానాలనే అనుసరించాలని నిర్మొహమాటంగా స్పష్టంచేశారు. ప్రతిపాదిత కార్యక్రమం వల్ల ఏర్పడగల పరిణామాలు ఎటువంటివో రైతులకు వివరించిన వల్లభ్‌భాయి పటేల్ వారు పునరాలోచించుకోవడానికి వీలుగా ఒక వారం గడువు ఇచ్చారు. తరువాత ఆయన అహమదాబాద్ చేరుకుని

బోంబే గవర్నర్‌కు ఒక లేఖరాశారు. ఆ లేఖలో ఆయన శిస్తు నిర్ణయించడంలో ప్రభుత్వం అనుసరించిన విధానాల్లో ఉన్న లోపాన్ని ఎత్తిచూపుతూ ఈ అంశాన్ని అధ్యయనం చేయడానికి ఒక స్వతంత్రసంఘాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. లేనిపక్షంలో తాను రైతులను శిస్తు చెల్లించవద్దనీ, అనంతర పరిణామాలకు సిద్ధంకమ్మనీ సూచించాల్సి వస్తుందని కూడా ఆయన అందులో పేర్కొన్నారు.

ఫిబ్రవరి 12న పటేల్ తిరిగి బర్డోలీ చేరుకుని తన ప్రతిపాదనను తిరస్కరిస్తూ ప్రభుత్వం తనకు ఇచ్చిన జవాబును రైతు ప్రతినిధులకు తెలియచేశారు. అనంతరం బర్డోలీ తాలూకాలోని భూయజమానులందరూ ఒక తీర్మానం చేస్తూ ప్రభుత్వం స్వతంత్ర దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటు చేయడమో, లేదా ప్రస్తుతం చెల్లిస్తున్న మొత్తాన్నే పూర్తి మొత్తంగా అంగీకరించడమో జరిగేవరకూ ఎవరూ పెంచిన మొత్తాన్ని చెల్లించవద్దని సూచించారు. తాము శిస్తును చెల్లించబోమంటూ హిందూ, ముస్లిం రైతులు తాము విశ్వసించే దైవంమీద ప్రమాణాలు చేశారు. అనంతరం భగవద్గీత, ఖురాన్‌ల పఠనం ఆరంభమైంది. హిందూముస్లిం సఖ్యతకు ప్రతీకగా నిలిచిన కబీర్ గీతాలను గానం చేయడం జరిగింది. బర్డోలీ సత్యాగ్రహం ఆరంభమైంది.

ఉద్యమానికి నాయకత్వం వహించడానికి వల్లభ్‌భాయి పటేల్ నూరుపాళ్ళూ సరైన వ్యక్తి. ఖేడా, నాగపూర్, బోర్సద్ సత్యాగ్రహాలతో ఆయన అప్పటికే గుజరాత్‌లో గాంధీజీ తరువాత స్థానాన్ని ఆక్రమించుకున్నారు. ఉద్యమాన్ని నిర్మించడంలోనూ, సామాన్యుల్లో ఉద్యమస్ఫూర్తిని పాదుకొలపడంలోనూ ఆయన సమర్థత అప్పటికే రుజువైంది. మంచి వక్తగా, ప్రచారకుడిగా ఆయన పేరు ప్రఖ్యాతులు సాధించుకున్నాడు. ఇదంతా ఒక ఎత్తయితే, బార్డోలీకి చెందిన మహిళలు ఆయనకు 'సర్దార్' అని గౌరవనామాన్ని ప్రసాదించడం మరో ఎత్తు. సర్దార్ ప్రసంగాల్లో ఉన్న పదును గురించీ, రైతుల మనసుకు హత్తుకునే విధంగా విభిన్నమైన హితోక్తులు, చలోక్తులతో కూడుకున్న ఆయన ప్రసంగాలనూ బర్డోలీ వాసులు ఇప్పటికే తలుచుకుంటూ ఉంటారు.

బర్డోలీ తాలూకాను సర్దార్ 13 చవానీలుగా విభజించి ఒక్కొక్కదానినీ ఒక అనుభవజ్ఞుడైన నాయకుడి అధ్వర్యంలో ఉంచారు. మొత్తం ప్రావిన్సునుంచి 100మంది రాజకీయ కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. వారికి పదిహేనువందలమంది స్వచ్ఛంద సేవకులు (వీరిలో అధికశాతం విద్యార్థులే) సహాయకులుగా నిలిచారు. బర్డోలీ 'సత్యాగ్రహపత్రిక' అనే దినపత్రిక ఆవిర్భవించింది. ఉద్యమానికి సంబంధించిన వార్తాకథనాలూ, నాయకులు ప్రసంగాలూ, ఇతరత్రా సమాచారమూ ఇందులో

ప్రచురితమవుతూ వచ్చింది. దీనిని నిర్వహించడానికి ఒక ప్రత్యేక కమిటీ ఏర్పడింది. అనేకమంది కార్యకర్తలతో కూడుకున్న బృందం ఆ తాలూకాలోని ప్రతిమూలకూ పత్రికను చేరవేసే పనిలో నిమగ్నమైంది. వీటన్నిటితోపాటుగా ఒక నిఘావిభాగం కూడా ఏర్పడింది. ఈ విభాగానికి చెందిన కార్యకర్తలు తాలూకాలోని అన్నిప్రాంతాల్లోనూ పర్యటిస్తూ, శిస్తు చెల్లింపు విషయంలో ఊగిసలాటధోరణిని అవలంబిస్తున్న రైతులను గుర్తించి, వారి వెన్నంటివుంటూ వారు ఎట్టిపరిస్థితుల్లోనూ శిస్తు బకాయిలను చెల్లించకుండా చూడటం వీరి ప్రధానమైన పని. దీనితోపాటుగా, ప్రభుత్వం తీసుకోబోయే చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే తెలుసుకోవడమూ,ముఖ్యంగా 'జబ్తీ' (జప్తు)కి సంబంధించిన అవకాశాలను ముందుగానే పసిగట్టి గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేసి వారిని తమ ఇళ్ళకు తాళాలు వేసుకోమనో,పొరుగున ఉన్న బరోడాకు వెళ్ళిపోమనో చెప్పడం,సాయపడటం వీరి బాధ్యత.

సభలూ, ప్రసంగాలూ, కరపత్రాలూ, ఇంటింటికీ వెళ్ళి ఒప్పించడం వంటి విధానాల ద్వారా ఉద్యమానికి రైతులను కూడగట్టడం జరిగింది. మహిళలను కూడగట్టడానికి ప్రాధాన్యత లభించింది. బోంబేకి చెందిన పార్సీ మహిళ మిథుబెన్ పెటిట్, దర్బార్ గోపాల్‌దాస్ భార్య భక్తిబా, సర్దార్ కుమార్తె మణిబెన్ పటేల్, శారదాబెన్ షా, శారదా మెహతా వంటివారిని ఇందుకోసం ప్రత్యేకంగా వినియోగించారు. తత్ఫలితంగా సమావేశాల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య బాగా ఎక్కువగా ఉండటమే కాక, ప్రభుత్వం ఒత్తిళ్ళకు లొంగకూడదన్న పట్టుదల వారిలోనే అధికంగా కనిపించింది. విద్యార్థులను కూడగట్టడంలో కూడా ఈ ఉద్యమం ప్రాధాన్యతనిచ్చింది. తమ కుటుంబాలు పట్టుదలగా నిలబడివుండేట్టు చూడటంలో వారు ప్రధానపాత్ర పోషించారు.

తీర్మానికి కట్టుబడి ఉండే విషయంలో వెనుకంజవేసిన వారిని దారిలో పెట్టడానికి సామాజిక ఒత్తిళ్ళు ఉపకరించాయి. అటువంటివారికి సామాజిక బహిష్కరణ తప్పదని కులపంచాయతీలూ, గ్రామపంచాయతీలు స్పష్టంచేశాయి. ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నవారు మౌలికమైన సేవలు కోల్పోవలసివచ్చింది. క్షురకులు, చాకలివారు, వ్యవసాయకూలీలు, పారిశుధ్యకార్మికులు అటువంటివారికి తమసేవలను అందించడం మానివేశారు. ఇరుగుపొరుగువారూ, బంధుమిత్రులూ కూడా వారిని బహిష్కరించారు. ఉద్యమం బలహీనపడకుండా కాపాడటంలో ఇటువంటి ఒత్తిళ్ళు పనిచేస్తాయని మనం ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ప్రభుత్వ అధికారులు ఈ రకమైన వెలిని బాగా అనుభవించాల్సివచ్చింది. వారికి సరఫరాలనూ, సేవలనూ,రవాణా సదుపాయాలనూ

తిరస్కరించడంతో, తమ అధికారిక బాధ్యతలను నిర్వహించడం వారికి చాలా కష్టమైపోయింది. 'కాలిపరాజ్'ల అభ్యున్నతికి కాంగ్రెస్ తీసుకున్న చర్యలు ఈ సమయంలో బాగా కలిసివచ్చాయి. అగ్రకులాలకు చెందిన రైతులకు వ్యతిరేకంగా వీరిని అస్త్రంగా వాడుకోవాలన్న ప్రభుత్వ ప్రయత్నాలు విఫలంచెందాయి.

అన్ని ముఖ్యమైన అంశాల్లోనూ మితవాదుల, రాజ్యాంగతావాదుల అభిప్రాయాలనూ, ప్రజాభిప్రాయాన్నీ కూడగట్టే విషయంలో సర్దార్‌పటేల్, ఆయన అనుచరులూ విజయం సాధించారు. ఈ కారణంగా స్వల్పకాలంలోనే తన అనుకూలురూ, మద్దతుదారులూ, సానుభూతిపరులతో పాటు తటస్థంగా ఉన్నవారిని కూడా ప్రభుత్వం తనపక్షంనుంచి కోల్పోవలసి వచ్చింది. కె. ఎం. మున్షీ, లాల్జీ నారన్జీ వంటి నాయకులు బోంబే శాసనమండలినుంచి తమ ప్రాతినిధ్యానికి రాజీనామాలు చేశారు. భారత వాణిజ్య సంఘానికి చెందిన ప్రతినిధులు కూడా రాజీనామాలు సమర్పించడం మరో విశేషమైన మార్పు. 1928 జులై నాటికల్లా బర్డోలీ సమస్య విషయంలో బోంబే ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపట్ల లార్డ్ ఇర్విన్‌కు అనుమానాలు కలిగాయి. ఈ సమస్య పరిష్కారానికి ఏదో ఒక మార్గాన్ని ఆలోచించమంటూ గవర్నర్ విల్సన్‌పై ఆయన ఒత్తిడి తీసుకొచ్చాడు. మరోపక్కన బ్రిటిష్ పార్లమెంటులో ప్రభుత్వం అనేక విమర్శలు కూడా ఎదుర్కొనాల్సివచ్చింది.

దేశవ్యాప్తంగా ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత నానాటికీ మరింత బలపడుతోంది. బోంబే ప్రెసిడెన్సీకి చెందిన రైతులు తమ ప్రాంతాల్లో శిస్తు పెంచినందుకు ఉద్యమానికి సంసిద్ధులవుతున్నారు. మరోపక్కన బోంబే జవుళి మిల్లు కార్మికులు సమ్మెలో ఉన్నారు. బోంబే కమ్యూనిస్టులను కూడగట్టుకుని రైల్వే సమ్మెకు దిగడం ద్వారా బర్డోలీకి సాయుధబలగాలు రాకుండా నిరోధించడానికి పటేల్ ప్రయత్నిస్తున్నారన్న సమాచారం మరోవైపు భయపెడుతోంది. సభలకూ, సమావేశాలకూ, ప్రదర్శనలకూ ప్రజలను బోంబే యూత్‌లీగ్ వంటి సంఘాలు భారీ ఎత్తున కూడగడుతున్నాయి. ఒకవేళ పటేల్‌ను అరెస్టు చేసిన సందర్భంలో ఉద్యమానికి సారథ్యం వహించడానికి వీలుగా 1928 ఆగస్టు 2న గాంధీజీ బర్డోలీ చేరుకున్నారు. ఈ పరిస్థితుల్లో, ఈ వ్యవహారంనుంచి గౌరవప్రదంగా బైటపడి పరువు కాపాడుకోవడానికి ఏదో ఒక అవకాశాన్ని చూసుకోవడమే మంచిదని ప్రభుత్వానికి సలహాలు రావడం ఆరంభమైంది.

ఆ అవకాశాన్ని సూరత్‌కు చెందిన శాసనమండలి సభ్యులు ప్రభుత్వానికి కల్పించారు. గవర్నర్‌కు రాసిన ఒక లేఖలో వారు విచారణసంఘాన్ని నియమించడానికి ప్రభుత్వం విధించిన షరతుకు తాము సంపూర్ణంగా కట్టుబడివున్నామని పేర్కొన్నారు. ఆ

లేఖలో ఆ షరతు ఏమిటో నామమాత్రంగా కూడా ప్రస్తావించకపోయినా (పెంచిన శిస్తును పూర్తిగా చెల్లించడమే ఆ షరతు అన్న విషయం అందరికీ తెలిసినప్పటికీ) పెంచిన శిస్తు మొత్తాన్ని చెల్లించనక్కరలేదన్న ఒప్పందం అప్పటికే కుదిరిపోయినందున గవర్నర్ ఎంతో ఆర్భాటంగా 'ఎటువంటి ముందస్తు షరతులూ లేని సంపూర్ణమైన లొంగుబాటు' జరిగిపోయిందని ప్రకటించినప్పటికీ ఎవరూ దానిని పట్టించుకోలేదు. అంతిమంగా బర్డోలీ రైతులు ఘన విజయం సాధించారు.

బ్రూమ్‌ఫీల్డ్ అనే న్యాయాధికారి, మాక్స్‌వెల్ అనే రెవిన్యూ అధికారీ సమష్టిగా విచారణ నిర్వహించి శిస్తు పెంపకం పూర్తి అన్యాయమనే నిర్ణయానికి వచ్చి దానిని 6.03శాతానికి తగ్గించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని లండన్‌కు చెందిన 'న్యూ స్టేట్స్‌మన్' దినపత్రిక 1929 మే 5న ఈ విధంగా సమీక్షించింది. 'కమిటీ సమర్పించిన ఈ నివేదిక అక్కడి స్థానిక ప్రభుత్వానికి తగిలిన ఎదురుదెబ్బకు నిదర్శనం. ఇన్ని సంవత్సరాల కాలంలో అక్కడి ప్రభుత్వం ఎన్నడూ రుచిచూడనంత తీవ్రస్థాయిలో తగిలిన ఈ దెబ్బవల్ల అనేక అనూహ్యమైన పరిణామాలను ప్రభుత్వం ముందుముందు ఎదుర్కొనాల్సివస్తుంది.... భారతదేశ రెవిన్యూ చరిత్రలో ఇటువంటి సంఘటనతో పోల్చదగ్గ ఘటన ఏదీ లేదు'.

స్వాతంత్ర్యోద్యమానికీ, బర్డోలీ సహా ఇతర రైతు ఉద్యమాలకూ ఉన్న సంబంధాన్ని ఈ సందర్భంగా గాంధీజీ చెప్పిన మాటలు మనకు చక్కగా వివరిస్తాయి.' బర్డోలీ పోరాటం దేనికి సంబంధించినదైనప్పటికీ అది ప్రత్యక్షంగా స్వరాజ్యం కోసం జరిగిన పోరాటం కాదు. అది నేరుగా స్వరాజ్యాన్ని సాధించిపెట్టేది కాదు. కానీ, బర్డోలీవంటి ప్రతిప్రయత్నమూ కూడా మనను స్వరాజ్యాన్ని దగ్గరచేస్తాయి. నేరుగా జరిగే ప్రత్యక్ష ప్రయత్నం కంటే ఇటువంటివాటివల్లే క్రమేపీ మనకు స్వరాజ్యం సన్నిహితమవుతుందని చెప్పడంలో అవాస్తవం లేదు.'

* * *

# 17 భారతదేశ కార్మికవర్గం - జాతీయోద్యమం

ఆధునిక పరిశ్రమల ఏర్పాటు క్రమేపీ ఆరంభం కావడంతో పాటు, రైల్వే, తపాలా, టెలిగ్రాఫ్ వ్యవస్థల ఆవిర్భావంతో 19వ శతాబ్దపు ద్వితీయార్థం నుంచి ఆధునిక కార్మికుడి ఉనికి మనకు కనిపించడం ఆరంభమవుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో దుర్భరమైన పరిస్థితుల్లో, అస్తవ్యస్థంగా ఉన్న కార్మికులు క్రమంగా తమ అస్తిత్వాన్ని చాటుకుంటూ, సమష్టిగా వ్యవహరిస్తూ, తమ ప్రయోజనాలకోసం పోరాడుతూ, ఒక జాతీయస్థాయి వర్గంగా ఆవిర్భవించే ప్రక్రియకూ, భారత జాతీయోద్యమం ఎదుగుదలకూ మధ్య అవినాభావ సంబంధం ఉంది.

* * *

19వ శతాబ్దాంతంలో భారతదేశ జాతీయవాద మేధావివర్గం కార్మికవర్గ ఉద్యమాలతో మమేకం కావడం ఆరంభం కావడానికి ముందే అనేక చోట్ల కార్మికుల సమ్మెలు జరిగాయి. బోంబే, అహమ్మదాబాద్, సూరత్, మద్రాస్, కోయంబత్తూర్, వార్ధా వంటి ప్రాంతాల్లోని జవుళి మిల్లుల్లోనూ, రైల్వేలోనూ, తోటల్లోనూ కార్మికులు సమ్మెలు చేశారు. అయితే ఇవన్నీ కూడా అసంకల్పితంగా, అవ్యవస్థీకృతంగా, దిశానిర్దేశం లేకుండా, తాత్కాలిక ప్రయోజనాలకోసం జరిగినవి. ప్రధానంగా ఆర్థికాంశాల ఆధారంగా జరిగినవి. రాజకీయంగా వీటి ప్రభావం ఏమీలేదు.

కార్మికుల పరిస్థితులను మార్చడానికి మొదట్లో కొన్ని ప్రయత్నాలు నిర్మాణాత్మకంగా జరగలేకపోలేదు. 1870లలో కొందరు లోకోపకారులు ఈ

ప్రయత్నాలు చేశారు. కార్మికుల పనిగంటలను నిర్ణయించడానికి వీలుగా బోంబే శాసనమండలిలో బిల్లు ప్రవేశపెట్టడానికి 1878లో సోరాబ్జీ షాపూర్జీ బెంగాలీ విఫలయత్నం ఒకటి చేశారు. బెంగాల్‌లో బ్రహ్మ సమాజానికి చెందిన సంఘసంస్కర్త శశిపాద బెనర్జీ 1870లో కార్మికుల సంఘాన్ని ఒకటి ఏర్పాటు చేసి 'భారత్ శ్రమజీబి' (భారత కార్మికులు) పేరిట ఒక మాసపత్రికను విడుదల చేసేవారు. కార్మికులను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఈ పత్రిక పనిచేసేది. బోంబేలో నారాయణ్ మేఘాజీ లోఖాండీ 'దీనబంధు' పేరిట ఒక ఆంగ్ల–మరాఠీ వారపత్రికను 1880లో తీసుకొచ్చారు. 1890లో ఆయన బోంబే మిల్ అండ్ మిల్‌హాండ్స్ ఆసోసియేషన్‌ను కూడా ప్రారంభించారు. లోఖాండీ కార్మికులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఒక సందర్భంలో ఐదున్నరవేల మంది కార్మికుల సంతకాలతో బోంబే ఫ్యాక్టరీ కమిషన్‌కు కార్మికుల మౌలికమైన సమస్యల పరిష్కారానికి ఒక వినతిపత్రాన్ని కూడా సమర్పించారు. ఈ ప్రయత్నాలన్నీ కూడా కార్మికుల సానుభూతిపరులూ, లోకోపకారులూ విడివిడిగా జరిపినవే కానీ వ్యవస్థీకృత కార్మికోద్యమానికి తార్కాణాలుగా చెప్పలేనివి. మరో విషయం ఏమిటంటే, ఈ ఉద్యమాలకు నాయకత్వం వహించిన వారికి సమకాలీన జాతీయోద్యమంతో సంబంధం లేదు.

వాస్తవానికి అప్పటికి ప్రధానస్రవంతిలోని జాతీయోద్యమం కార్మికుల సమస్యలను పరిగణనలోకి తీసుకోలేదు. కార్మికులు అప్పట్లో దుర్భరమైన, అన్యాయమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ ప్రారంభంలో జాతీయవాదులు వారి సమస్యల పరిష్కారం మీద ఏమాత్రం దృష్టిపెట్టలేదు. అంతేకాదు, యూరోపియన్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల విషయంలో ఒకవిధంగానూ, దేశీయ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల విషయంలోనూ మరోవిధంగానూ వ్యవహరించడం కూడా కనిపించేది.

సాపేక్షంగా చూసినప్పుడు, తొలి జాతీయతావాదులు కార్మికుల సమస్యలకు సంబంధించి కాస్త నిర్లక్ష్యవైఖరి అవలంబించడానికి ప్రధానకారణం ఒకటుంది. ఆ కాలంనాటికి సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉంది. ఈ స్థితిలో భారతదేశ ప్రజల్లో ఏరకమైన విభజనలైనా ఏర్పడితే, అవి బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా పోరాడటమనే ఉమ్మడి లక్ష్యాన్ని బలహీనపరుస్తాయి. భారతజాతీయ కాంగ్రెస్ రెండో సమావేశంలోనే (1886) దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ 'యావత్ దేశమూ ప్రత్యక్షంగా పాలుపంచుకునే సమస్యలకు మాత్రమే పరిమితం కావాలి. సామాజిక సంస్కరణలు, ఇతరత్రా

వర్గసంబంధమైన అంశాలనూ ఆయా వర్గాలకు చెందిన కాంగ్రెస్‌లకు విడిచిపెట్టాలి' అని స్పష్టంచేశారు. ఆ తరువాత జాతీయోద్యమం క్రమంగా బలపడుతున్న కొద్దీ, సైద్ధాంతిక విషయాల పట్ల జాతీయతావాదుల్లో మార్పువస్తున్న కొద్దీ కార్మికుల సమస్యలపట్ల వారి వైఖరిలో మార్పురావడం ఆరంభమైంది. కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడానికి నడుంబిగించడం మొదలైంది. కార్మికులను సంఘటితపరిచి వారు తమప్రయోజనాల పరిరక్షణకోసం తమ వాదనను బలంగా వినిపించేట్టు చేయడంలో జాతీయతావాదులు సహకరించారు. మరోపక్కన సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో భాగస్వాములుగా ఉన్న ధనికవర్గాలను కూడా నిలబెట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే, సామ్రాజ్యవాద పోరాటంలో ఈ రెండు వర్గాల మధ్యా సయోధ్య అన్నది శక్తివంతమైన ధనికస్వామ్య వర్గం తో అన్ని వర్గాలూ ఎంతోకొంతమేరకు త్యాగం చేసినప్పుడే సాధ్యపడుతుంది. ఈ దశలో జాతీయతావాదులు కార్మికుల సమస్యలను చేపట్టి దేశీయ యజమానులకు వ్యతిరేకంగా వ్యవహరించడానికి ఇష్టపడలేదు. అంతేకాదు, చాలా జాతీయతావాదదినపత్రికలు కార్మికుల పనిపరిస్థితులను చక్కదిద్దడానికి ప్రభుత్వం చట్టాలూ చేయాల్సిన అవసరాన్ని ఖండించాయి కూడా. 1881, 1891 ఫ్యాక్టరీల చట్టాన్ని కూడా వ్యతిరేకించాయి. అదేవిధంగా భారతదేశంలోని జవుళిమిల్లుల్లో సమ్మెలకు మద్దతు కూడా ఇవ్వలేదు. సామ్రాజ్యవ్యతిరేక పోరాటమనే ఉమ్మడి లక్ష్యంలో ఎటువంటి విభజనలూ సృష్టించకూడదన్న కోరికతో పాటు జాతీయతావాదుల వైఖరికి మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం కార్మికచట్టాన్ని తీసుకురావడంలో ఉన్న దురుద్దేశాన్ని జాతీయతావాదులు సరిగానే అంచనావేశారు. బ్రిటిష్ తయారీదారులు భారతదేశంనుంచి క్రమేపీ పెరిగిపోతున్న పోటీని ఎదుర్కొనవలసి వస్తున్నది. భారతదేశంలో వారి మార్కెట్ తగ్గిపోతున్నది. కార్మికుల పనిగంటలు తగ్గించినపక్షంలో బలమైన పోటీ ఇస్తున్న భారతదేశ పారిశ్రామికరంగాన్ని బలహీనపరచవచ్చు. ఈ రకమైన ఆలోచనతో, బ్రిటిష్ తయారీదారుల ఒత్తిడిమేరకు మాత్రమే ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందని జాతీయతావాదులు భావించారు. దానితోపాటు, జాతీయతావాదులు విస్తృతమైన పారిశ్రామికీకరణ మాత్రమే దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలనూ, దారిద్ర్యాన్నీ పరిష్కరించగలదని భావించారు. ఈ ప్రక్రియకు మోకాలడ్డే ఎటువంటి చర్యకూ పూనుకోకూడదని వారు నిర్ణయించుకున్నారు. కార్మికచట్టం భారతదేశంలో పిన్న వయసులో ఉన్న పారిశ్రామికరంగాన్ని చావుదెబ్బతీస్తుందనీ ఇది బంగారుగుడ్లుపెట్టే బాతును చంపుకోవడం వంటిదేనని వారి

వాదన. అయితే, రాడికల్ ఆలోచనలున్న జి. ఎస్. ఆగార్కర్ ప్రభావం ఉన్న 'మహరట్టా' అనే జాతీయవాదపత్రిక మట్టుకు కార్మికుల సమస్యలకు మద్దతు ప్రకటించింది. వారికి రాయితీలూ, మినహాయింపులూ ఇవ్వవలసిందిగా మిల్లు యజమానులకు విజ్ఞప్తి చేసింది. అయితే, ఈ రకమైన ధోరణి అప్పట్లో బాగా బలహీనంగానే ఉండేది.

కానీ, బ్రిటిష్ యాజమాన్యంలో ఉన్న కంపెనీల్లో పనిచేస్తున్న భారతదేశ కార్మికుల విషయంలో మట్టుకు ఈ వైఖరి పూర్తి భిన్నంగా ఉండేది. వీరికి అండగా ఉండటంలోనూ, పూర్తి మద్దతు అందించడంలోనూ జాతీయతావాదులు ఏమాత్రం ఊగిసలాడలేదు. ఇందుకు ప్రధాన కారణం 1891లో కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న పి. ఆనందాచార్యులు మాటల్లో చెప్పాలంటే ఉద్యోగులూ, యజమానులూ 'ఒకే తానులో ముక్కలు' కారు.

అస్సాంలో తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులచేత వారి యూరోపియన్ యజమానులు చేయిస్తున్న వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా జాతీయతావాదుల పత్రికలూ, భారత జాతీయ కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం ప్రారంభించాయి. కార్మికులను అరెస్టు చేయడానికీ, శిక్షించడానికీ, పనివదిలి పారిపోకుండా నిరోధించడానికీ తేయాకుతోటల యజమానులకు ఒక శాసనం ద్వారా ప్రభుత్వం సర్వాధికారాలూ ఇచ్చింది. వలసప్రభుత్వ మద్దతుతో విదేశీ పెట్టుబడిదారులు జరుపుతున్న ఈ దోపిడీని వ్యతిరేకించి దేశ గౌరవప్రతిష్ఠలను కాపాడుకోవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది.

ఆ తరువాత, బ్రిటిష్‌యాజమాన్యంలోనూ, నిర్వహణలోనూ ఉన్న రైల్వేలో జరిగిన తొట్టతొలి వ్యవస్థీకృత సమ్మె ఆరంభమైంది. 1899 మే నెలలో 'గ్రేట్ ఇండియన్ పెనిన్స్యులార్ రైల్వే' (జిఐపి)కు చెందిన సిగ్నల్ వ్యవస్థ కార్మికులు వేతనాలకు, పనిగంటలకూ, పనిపరిస్థితులకు సంబంధించిన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆరంభించిన సమ్మె ఇది. దాదాపు అన్ని జాతీయతావాద పత్రికలూ ఈ సమ్మెకు మద్దతుగా నిలిచాయి. తిలక్‌కు చెందిన వార్తాపత్రిక 'కేసరి' అనేక నెలలపాటు ఈ సమ్మెకు మద్దతుగా ప్రచారం సాగించింది. సమ్మెచేస్తున్న కార్మికులకోసం సురేంద్ర టాగోర్, డి. ఇ. వాచా, ఫిరోజ్‌షా మెహతా వంటి ప్రముఖ జాతీయతావాదులు బోంబేలోనూ, బెంగాల్‌లోనూ నిధులను సేకరించారు. వారికి మద్దతు కూడగట్టడానికి

సభలూ, సమావేశాలూ నిర్వహించారు. ఇటువంటి సందర్భాల్లో దోపిడిదారు విదేశీయుడు కావడమన్న ఏకైక కారణంతో వారికి వ్యతిరేకంగా సాగే సమ్మె ఒక జాతీయసమస్యగానూ, భారతజాతీయోద్యమంలో అంతర్భాగంగానూ మారిపోతుందన్నది వాస్తవం.

దేశంలో కార్మికవర్గం పెరిగిపోతుండటంతో కొత్తశతాబ్దం ఆరంభమయ్యేనాటికి జాతీయతావాదుల్లోని మేధావివర్గం ఆలోచనావిధానంలో కొత్త మార్పువచ్చింది. ఉదాహరణకు బి.సి.పాల్, జి.సుబ్రహ్మణ్య అయ్యర్ వంటివారు కార్మికులనూ, బలహీనవర్గాలవారినీ పెట్టుబడిదారులనుంచి కాపాడటానికి ప్రత్యేకచట్టాలు అవసరమని అనడం ప్రారంభమైంది. కార్మికులంతా ఏకమై తమ హక్కులకోసం పోరాడటానికి వీలుగా సంఘాలను ఏర్పరుచుకోవాలనీ, కార్మికుల తమ లక్ష్యసాధనకు ఉద్యమించినప్పుడు ప్రజలు వారికి మద్దతుగా ఉండాలనీ 1903లో జి. సుబ్రహ్మణ్య అయ్యర్ పిలుపునిచ్చారు.

* * *

1903-08 మధ్యకాలంలో ఉద్భవించిన స్వదేశీ ఉద్యమం కార్మికోద్యమ చరిత్రలో మైలురాయి. సంఘాలు శక్తివంతం కావడం, సమ్మెను ప్రావీణ్యతతో నిర్వహించగలగడం వంటి రెండు ప్రధానమైన పరిణామాలు పారిశ్రామిక సమ్మెలలో కనిపించడం ఈ కాలంలోనే జరిగిందని అధికారిక సర్వే ఒకటి తేల్చిచెప్పింది. ఈ కాలంలో సమ్మెల సంఖ్య విపరీతంగా పెరిగింది. స్వదేశీ నాయకులు సుస్థిరమైన కార్మికసంఘాలను ఏర్పాటు చేయడంలోనూ, సమ్మెలను నిర్వహించడంలోనూ, వారికి న్యాయపరమైన సహకారం అందించడంలోనూ, నిధులను సమీకరించడంలోనూ ఎంతో ఉత్సాహంగా పనిచేశారు. బి.సి.పాల్, సి. ఆర్. దాస్, లియాఖత్ హుస్సేన్ వంటి జాతీయతావాద నాయకులు సమ్మెచేస్తున్న కార్మికులకు మద్దతుగా ఏర్పాటైన బహిరంగ సదస్సులూ, సమావేశాల్లో ప్రసంగాలు చేశారు. అశ్వినీకుమార్ బెనర్జీ, ప్రభాత్‌కుమార్ రాయ్ చౌధురి, ప్రేమ్‌తోష్ బోస్, అపూర్వకుమార్ ఘోష్‌లను పూర్తిగా కార్మికోద్యమాలకు అంకితమైపోయిన స్వదేశీనాయకులుగా చెప్పుకోవాలి. అనేక సమ్మెలలో వారు క్రియాశీలకమైన పాత్రను పోషించిన విషయాన్ని అలా ఉంచితే, వలస ప్రభుత్వ అజమాయిషీ కానీ, విదేశీపెట్టుబడులు కానీ ఉన్న రైల్వేలు, జవుళి పరిశ్రమ వంటి రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల మద్దతు కూడగట్టుకోవడంలోనూ, అక్కడ కార్మిక

సంఘాలను ఏర్పాటు చేయడంలోనూ వారు విజయం సాధించడం ఒక ప్రధానమైన మార్పు.

సమ్మెచేస్తున్న కార్మికులకు మద్దతుగా కలకత్తా వీధుల్లో తరచుగా ర్యాలీలు నిర్వహిస్తుండేవారు. ఊరేగింపులో పాల్గొన్నవారికి దారిపొడవునా ప్రజలు ఆహారపదార్థాలను అందిస్తుండేవారు. మహిళలూ, పోలీస్ కానిస్టేబుళ్ళతో సహా అనేకమంది విరాళాలు ఇస్తుండేవారు. డబ్బు, బియ్యం, బంగాళదుంపలు, ఆకుకూరలు... ఇలా అనేకం విరాళాల రూపంలో అందుతుండేవి. అఖిలభారత స్థాయిలో కార్మికసంఘాలను ఏర్పాటు చేసే ప్రయత్నం కూడా ఈ కాలంలో జరిగినప్పటికీ ఆ ప్రయత్నాలు సుసాధ్యం కాలేదు. యూరోపియన్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకూ, దేశీయ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకూ మధ్య వివక్ష కనబరచే వైఖరి ఈ కాలంలో కూడా కొనసాగుతూనే ఉంది.

కార్మికుడు ప్రధానంగా ఆర్థికపరమైన అంశాలకు మాత్రమే పరిమితమై సమ్మెలూ, పోరాటాలూ నిర్వహించడమన్న వైఖరి మారి ఆనాటి రాజకీయాంశాలపై కూడా స్పందించడ మన్నది స్వదేశీ ఉద్యమకాలంనాటి కార్మికోద్యమంలో వచ్చిన ప్రధానమైన మార్పు. ఆర్థికాంశాలపై అసంకల్పితంగా, అవ్యవస్థీకృతంగా సమ్మెకట్టే స్థితినుంచి జాతీయనాయకుల మద్దతుతో ఆర్థికాంశాలపై వ్యవస్థీకృతంగా సమ్మెచేయడంతో పాటు విస్తృతమైన రాజకీయోద్యమాల్లో కార్మికవర్గ భాగస్వామ్యం ఉండేవిధంగా కార్మికోద్యమం ఎదిగింది.

బెంగాల్ విభజన అమలులోకి వచ్చిన 1905 అక్టోబర్ 16న బెంగాల్‌లో శ్రామికవర్గం సమ్మెలు, హర్తాళ్లూ అనేకం మనకు కనిపిస్తాయి. జవుళిమిల్లుల్లోనూ, జవుళి శుద్ధి కర్మాగారాల్లోనూ పనిచేస్తున్న కార్మికులు, రైల్వే కూలీలు సమ్మెకు దిగారు. హౌరాలోని బర్న్ కంపెనీ షిప్‌యార్డులో పనిచేస్తున్న 12వేలమంది కార్మికులు స్వదేశీనాయకులు ఫెడరేషన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరుకావడానికి అనుమతినివ్వనందుకు ఆగ్రహించి పనిని బహిష్కరించారు. 'వందేమాతర' గీతాన్ని పాడుతున్నందుకూ, సమైక్యతకు నిదర్శనంగా ఒకరిచేతికొకరు రాఖీలు కట్టుకుంటున్నందుకూ యాజమాన్యాలు అభ్యంతరం వ్యక్తంచేసినందుకు నిరసనగా కార్మికులు సమ్మెలు చేశారు.

అధిక వేతనాల కోసం జరిపే కార్మికోద్యమాల ద్వారా విదేశీమిల్లులను నాశనం చేయవచ్చునన్న వాదనతో తమిళనాడులోని ట్యూటికోరన్‌లో సుబ్రమణియ శివ 1908 ఫిబ్రవరి–మార్చిలో విదేశీ యాజమాన్యంలో ఉన్న ఒక కాటన్‌మిల్లులో సమ్మెను ప్రోత్సహించారు. ఆయననూ, ప్రముఖ స్వదేశీనాయకుడు చిదంబరం పిళ్ళైనూ అరెస్టు చేసినప్పుడు ట్యూటికోరన్‌లోనూ, తిరునల్వేలీలోనూ అనేక సమ్మెలూ, అల్లర్లూ జరిగాయి.

పంజాబ్‌లో 1907లో తలెత్తిన తిరుగుబాటులో భాగంగా (లజ్‌పత్‌రాయ్, అజిత్‌సింగ్‌లకు ప్రభుత్వం బహిష్కరణ శిక్ష విధించింది ఈ సందర్భంగానే) రావల్పిండీలోని రైల్వే ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెకు నడుంబిగించారు. బహుశా ఈ కాలంలో రాజకీయాంశాలకు సంబంధించి కార్మికవర్గం తన శక్తిసామర్థ్యాలను విస్తృతంగా కనబరిచింది తిలక్ అరెస్టు, విచారణల సందర్భంగానే. ఈ పరిణామాలకు సంబంధించి మనం ఇంతకుముందే చర్చించుకున్నాం.

యూరోప్‌కు చెందిన సమకాలీన మార్క్సిస్టు, సోషల్ డెమోక్రాట్ల ప్రభావానికి గురైన రాడికల్ జాతీయతావాద నాయకుల్లో సామ్యవాద భావనలు ఊపిరిపోసుకోవడం కూడా ఈ స్వదేశీ కాలంలోనే ఆరంభమైంది. రష్యాలో కార్మికవర్గ ఉద్యమం ఒక ప్రభావవంతమైన రాజకీయ నిరసనకు వీలుకల్పించినందున దానిని ఇక్కడ అమలుచేయాలన్న వాదన వినిపించింది.

1908 తరువాత జాతీయతావాదుల నాయకత్వంలోని ప్రజా ఉద్యమాలు క్రమంగా తగ్గుముఖం పట్టడంవల్ల కార్మికోద్యమానికి కూడా గ్రహణం పట్టింది. మళ్ళీ మొదటి ప్రపంచయుద్ధం అనంతరం వెంటనే ఉద్భవించిన జాతీయతావాద ఉద్యమం ద్వారా మాత్రమే కార్మికోద్యమం తిరిగి తన చురుకు దనాన్ని సంతరించుకోగలిగింది. ఈ మారు మరింత విస్తృతస్థాయిలో అది సాధ్యపడింది.

1915లో హోమ్‌రూల్ సంఘాల ఆవిర్భావంతో ఆరంభమైన జాతీయోద్యమం 1919 నాటి రౌలత్ సత్యాగ్రహంతో వేడెక్కి 1920–22 నాటి సహాయనిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాలతో ఉచ్ఛస్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే 1919–22 మధ్యకాలంలో శ్రామికవర్గం క్రియాశీలకంగా వ్యవహరించడం ఆరంభమైంది. తన

వర్గప్రయోజనాలను కాపాడుకోవడానికి శ్రామికవర్గం జాతీయస్థాయి సంఘాన్ని ఏర్పాటుచేసుకుంది. ఈ కాలంలోనే శ్రామికవర్గం జాతీయ రాజకీయ ప్రధానస్రవంతిలో చేరి తనదంటూ ఒక విశిష్టమైన పాత్రను పోషించింది.

1920లో అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) ఆవిర్భావం ఒక ప్రధానమైన పరిణామం. బాంబే కార్మికులతో సన్నిహితసంబంధాలున్న లోకమాన్య తిలక్ ఈ సంఘం ఆవిర్భావంలో ప్రధాన రుత్విక్కు. పంజాబ్‌కు చెందిన సమరశీల నాయకుడు లజ్‌పత్‌రాయ్ దాని తొలి అధ్యక్షుడు. భారత కార్మికోద్యమానికి పర్యాయపదంగా చెప్పుకోదగిన దివాన్ చమన్‌లాల్ దాని ప్రధానకార్యదర్శి. ఎ ఐటియుసి తొలి సమావేశంలో అధ్యక్షుడు లజ్‌పత్‌రాయ్ తన ప్రసంగంలో మార్గనిర్దేశనం చేశారు.'.... జాతీయస్థాయిలో తమను తాము సంఘటితపరచుకోవడానికి భారతదేశ శ్రామికవర్గం ఇక ఏమాత్రం సమయాన్ని వృథాచేయకూడదు. సమీకరించడం, ఉద్యమించడం,చైతన్యపరచడం ఇప్పుడు మనముందున్న కర్తవ్యాలు. మనం మన శ్రామికులను సంఘటితం చేసి వారిలో వర్గస్పృహను కలిగించాల్సిన అవసరం ఉంది...' అన్నారాయన. శ్రామికుల్లో ఈ రకమైన చైతన్యాన్ని కలిగించడంలో కొంతకాలం పాటు మేధావులు తగిన పాత్ర నిర్వహించాల్సిన అవసరం ఉందని భావించారాయన. ఆ తరువాత దశలో శ్రామికులనుంచే నాయకులు ఉద్భవిస్తారని ఆయన స్పష్టంచేశారు.

కార్మికులకు ఎఐటియుసి ఇచ్చిన కార్యాచరణపత్రంలో వారిని సంఘటితం కావడంతోపాటు జాతీయరాజకీయాల్లో పాలుపంచుకోమని కూడా కోరింది. 'ఈ దేశ కార్మికులారా!....మీ దేశ నాయకులు స్వరాజ్యాన్ని కోరుతున్నారు. మీరు వారిని విస్మరించకూడదు. రాజకీయస్వేచ్ఛకూ, ఆర్థికస్వేచ్ఛకూ మధ్య ఉన్న బంధాన్ని మనం మరిచిపోకూడదు. అందువల్ల దేశ స్వాతంత్ర్యంకోసం జరుగుతున్న ఉద్యమాన్ని మీరు విస్మరించకండి. మీరు కూడా ఈ ఉద్యమంలో ఒక భాగమని గుర్తుంచుకోండి. మీరు దానిని ఖాతరుచేయకపోవడమన్నది స్వేచ్ఛను కోల్పోవడానికి సిద్ధపడినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది' అని ఆ పత్రం వ్యాఖ్యానించింది.

పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యవాదానికీ మధ్య ఉన్న అవిభాజ్యమైన సంబంధాన్ని విప్పిచెప్పినవారిలో లజ్‌పత్‌రాయ్ ఒకరు. ఈ ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా పోరాడటంలో శ్రామికవర్గం పాత్రను ఆయన విశ్లేషించాడు. 1920 నవంబరు 7వతేదీన ఆయన ఇలా

ప్రకటించాడు. 'భారతదేశం ఇప్పుడు వ్యవస్థీకృత పెట్టుబడిదారీ తనం ముందు మోకరిల్లివుంది. సైనికవాదం, సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు కవలపిల్లలు. రూపంలో తేడావున్నట్టు పైకి కనిపించినా ఈ మూడూ ఒకటే. వాటి నీడ, కాయ, చివరకు వాటి బెరడు కూడా విషపూరితాలే. ఈ విషానికి విరుగుడు ఏమిటో చాలా ఆలస్యంగా తెలుసుకున్నాం. ఆ విరుగుడు వ్యవస్థీకృత కార్మికవర్గం మాత్రమే.'

భారతీయ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల విషయంలో జాతీయవాదుల్లో వచ్చిన మార్పును ప్రతిఫలింపచేస్తూ ఆయనచేసిన వ్యాఖ్యలు ఈవిధంగా ఉన్నాయి. '...మాంచెస్టర్‌తోనూ, జపాన్‌తోనూ పోటీపడాలంటే పెట్టుబడిదారీ వర్గానికి అధికలాభాలను సమకూర్చాలనీ, శ్రమశక్తి చవుకగా అందించాలనీ ఒక వాదన వినబడుతోంది. ఈ విధమైన వాదనల్లో ఔచిత్యాన్ని మనం అంగీకరించబోవడంలేదు... దేశాభిమానానికి సంబంధించి ధనికులూ, పేదలూ కూడా సమానంగా స్పందించాలి. ఇంకాచెప్పాలంటే, పేదలకంటే ధనికులు ఎక్కువగా స్పందించాలి. అదేవిధంగా, భారతీయపరిశ్రమలను అభివృద్ధిచేయడమన్నది కార్మికులను బలిపెట్టడం ద్వారా జరగకూడదు. భారతీయపెట్టుబడిదారులు శ్రామికులను ఆదుకోవాలి. న్యాయంగా వారికి దక్కాల్సిన వాటాను వారికి అందివ్వడానికి సంసిద్ధులు కావాలి..... దేశీయపెట్టుబడిదారులు కార్మికుల ప్రయోజనాలను నిర్లక్ష్యంచేసి లాభార్జన గురించే ఆలోచించినపక్షంలో వారి మీద అటు కార్మికుల్లోనూ, ఇటు సామాన్యప్రజానీకంలోనూ కూడా ఏమాత్రం సానుభూతి ఉండదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి'.

అదేవిధంగా, ఎఐటియుసి రెండో సమావేశంలో స్వరాజ్యానికి అనుకూలంగా దివాన్ చమన్‌లాల్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ అది 'పెట్టుబడిదారులకు కాక, కార్మికులకు చెందిన స్వరాజ్యం కావాల'ని ఆకాంక్షించారు.

లజ్‌పతిరాయ్ మాత్రమే కాదు, ఆ కాలానికి చెందిన అనేకమంది ప్రముఖ జాతీయవాదులు ఎఐటియుసికి అనుబంధంగా వ్యవహరించారు. సంఘం మూడు, నాలుగు సమావేశాలకు సి.ఆర్.దాస్ అధ్యక్షత వహించారు. సి.ఎఫ్. ఆండ్రూస్, జె.ఎం.సేన్‌గుప్తా, సుభాష్‌బోస్, జవహర్‌లాల్ నెహ్రూ, సత్యమూర్తి వంటివారు దీని కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. 1922లో గయలో జరిగిన భారతజాతీయకాంగ్రెస్

సదస్సు ఎఐటియుసి ఆవిర్భావాన్ని ఆహ్వానించి దాని కార్యక్రమాల్లో సహకరించడానికి వీలుగా కొంతమంది కాంగ్రెస్ నాయకులతో ఒక సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది.

గయ కాంగ్రెస్ సదస్సులో సి. ఆర్.దాస్ అధ్యక్షోపన్యాసం చేస్తూ, భారతజాతీయ కాంగ్రెస్ కార్మికులనూ, రైతులనూ కలుపుకొని, వారి ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, స్వరాజ్యసాధనకు వీలుకల్పించే వారి ఆదర్శాలను వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఆ విధంగా చేయునప్పుడు కార్మికుల, రైతుల సంఘాలు స్వరాజ్యసాధనలక్ష్యానికి దూరంగా మిగిలిపోయి, కేవలం వర్గపోరాటాలకూ, వారి ప్రయోజనాల సాధనకూ మాత్రమే పరిమితమైపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

మారిన రాజకీయపరిస్థితులకు అనుగుణంగా మారడంలో శ్రామికవర్గం ఎంతో చురుకుగా వ్యవహరించింది. 1920నాటికి దేశంలో రెండున్నరలక్షలమంది సభ్యులుగా ఉన్న 125 శ్రామికసంఘాలు ఆవిర్భవించాయి. వీటిలో అత్యధికం 1919-20 మధ్యకాలంలో ఆవిర్భవించినవే. ప్రధానమైన జాతీయ రాజకీయ సంఘటనల్లో కార్మికులు పాలుపంచుకోవడం కూడా ప్రముఖంగా కనిపించింది. పంజాబ్‌లో దమనకాండ, గాంధీజీ అరెస్టు అనంతరం 1919 ఏప్రిల్‌లో అహ్మదాబాద్‌లోనూ, గుజరాత్‌లోని ఇతరప్రాంతాల్లోనూ కార్మికవర్గం సమ్మెలకూ, ఉద్యమాలకూ, ప్రదర్శనలకూ నడుంబిగించింది. అహ్మదాబాద్‌లో ప్రభుత్వ భవనాలకు నిప్పుపెట్టారు.రైళ్ళరాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. టెలిగ్రాఫ్ లైన్లను తెంపివేశారు. ఉద్యమకారులను అణచివేసేందుకు ప్రభుత్వం జరిపిన దాడిలో 27మంది మరణించారు. 123మంది గాయపడ్డారు. బోంబే, కలకత్తాల్లో కూడా కార్మికశక్తి భగ్గునమండిపడింది.

జాతివివక్షకు వ్యతిరేకంగానూ, ఆర్థిక ప్రయోజనాలసాధనకోసమూ జరిగిన రైల్వే కార్మికుల ఉద్యమాలు కూడా వలసపాలనావ్యతిరేకోద్యమ రూపాన్ని సంతరించుకున్నాయి. 1919-1921 మధ్యకాలంలో అనేక సందర్భాల్లో రైల్వేకార్మికులు రౌలత్ ఉద్యమానికీ, సహాయనిరాకరణోద్యమానికీ, ఖిలాఫత్ ఉద్యమానికీ అండగా నిలబడ్డారు. ఆగ్నేయరైల్వే కార్మిక సంఘం 1919 ఏప్రిల్‌లో ఇచ్చిన సార్వత్రిక సమ్మెకు ఉత్తరభారతదేశంలో విశేషమైన స్పందన లభించింది. బ్రిటిష్ సామ్రాజ్య రాజకీయ ఆర్థిక లక్ష్యాలకు భారతీయ రైల్వే ప్రతీక అయినట్టుగానే, వలసపాలనకూ, దాని దోపిడీ

స్వభావానికీ వ్యతిరేకంగా సాగే పోరాటానికి ప్రతీకగా గాంధీజీని దేశంలోని అధికశాతం రైల్వేకార్మికుల మనస్సుల్లో నిలబెట్టడంలో లజ్‌పత్ జగ్గా విజయం సాధించారు.

1921 నవంబరులో బ్రిటిష్ సింహాసనానికి వారసుడైన వేల్స్ రాకుమారుడు భారతదేశాన్ని సందర్శించినప్పుడు సార్వత్రిక సమ్మెతో నిరసన వ్యక్తంచేయాలన్న కాంగ్రెస్ పిలుపును అందుకున్న కార్మికులు బ్రహ్మాండమైన రీతిలో స్పందించారు. బొంబేలో బట్టలమిల్లులు మూతపడ్డాయి. లక్షానలభైవేలమంది కార్మికులు రోడ్లమీదకు వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. వేల్స్‌యువరాజావారిని స్వాగతించేందుకు వెళ్లిన యూరోపియన్లు, పార్సీలపై దాడులు జరిగాయి. ఈ కాలంలో కార్మికులను కదల్చిన భావావేశాలకూ,ఆకాంక్షలకూ–జాతీయతాభావనావెల్లువకూ మధ్య ఉన్న సంబంధాన్ని అర్జున్ ఆత్మారామ్ ఆల్వే మాటల్లో మనం చక్కగా తెలుసుకోవచ్చు. బొంబేలోని ఒక బట్టలమిల్లులో పనిచేసే నిరక్షరాస్యుడైన ఈ కార్మికుడు తరువాత కాలంలో కార్మికవర్గ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించాడు.

'... మా పోరాటం.... ఈ విధంగా సాగుతున్నదశలో దేశంలో రాజకీయోద్యమానికి ఢంకా మోగింది. స్వపరిపాలనకోసం కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఆరంభించింది. ఆ సమయంలో మేమంతా (కార్మికులు) స్వరాజ్యం అంటే... వడ్డీవ్యాపారి పీడన అంతమవుతుందనీ, అణచివేత నశిస్తుందనీ, వేతనాలు పెరుగుతాయనీ, అనునిత్యం కార్మికులను తన్నుతూ, కొడుతూ పనిచేయించే దుర్మార్గం ఒక చట్టంద్వారా సమసిపోతుందనీ, మా దుర్భరమైన బానిసబతుకులకు ఒక ముగింపు వస్తుందనీ భావించాం. ఇలా అనేకమైన ఆలోచనలు మమ్మల్ని చుట్టుముట్టి మాలో ఒక సమధికోత్సాహాన్ని కలిగించాయి. నేనూ, నాతోపాటు అనేకమంది తోటి కార్మికులు సహాయనిరాకరణోద్యమంలో కార్యకర్తలుగా చేరడానికి పేర్లను నమోదుచేసుకున్నాం.'

ఈ కాలానికి సంబంధించిన ఏ చర్చ అయినా 1918లో గాంధీజీ ప్రారంభించిన అహ్మదాబాద్ బట్టలమిల్లుల కార్మికుల సంఘం గురించిన ప్రస్తావనలేకుంటే అసంపూర్తిగానే ఉంటుంది. 14వేలమంది కార్మికులు సభ్యులుగా ఉన్న ఈ సంఘం ఆకాలంలో బహుశా అతిపెద్ద కార్మిక సంఘం. గాంధీజీ అనుసరించే 'ధర్మకర్తృత్వ' సిద్ధాంతమే (కార్మికుల ప్రయోజనాలకు పెట్టుబడిదారుడే ధర్మకర్త) వివాదాల పరిష్కారానికి ఆధారంగా నిలబడేది. 1918లో వచ్చిన ఒక వివాదం పరిష్కారంలో ఈ కార్మిక సంఘం వేతనాల పెంపును

అత్యధికంగా (27.5శాతం) సాధించుకుంది. గాంధీజీ అనుంగుశిష్యుల్లో ఒకరైన ఆచార్య జె.బి. కృపలానీ మాటల్లోచెప్పాలంటే 'ధర్మకర్త అన్న పదాన్ని వాడటంలోనే మనకు ఒక విషయం స్పష్టమవుతున్నది. ధర్మకర్త అంటే యజమాని కాదన్నమాట. ఈ ధర్మకర్త ఎవరి ప్రయోజనాలనైతే కాపాడవలసివున్నదో అతడే యజమాని'-అంటే, కార్మికుడన్నమాట. అహమ్మదాబాద్ మిల్లు కార్మికులను ఉద్దేశించి గాంధీ స్వయంగా ఈ విషయాన్ని వివరించి చెప్పారు. 'మిల్లుల నిజమైన యజమానులు మీరే. మిల్లు యజమాని వాస్తవయజమానుల (కార్మికుల) ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించని పక్షంలో కార్మికులు 'సత్యాగ్రహాన్ని' అనుసరించి తమ హక్కులను పరిరక్షించుకోవలసి ఉంది' అన్నారాయన. వివాదాలకూ, ధర్మకర్తృత్వానికీ సంబంధించిన వివరణలతో కూడిన గాంధీజీ సిద్ధాంతం సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటం విజయవంతంగా సాగడానికి అత్యవసరం. ఒకదేశం మొగ్గతొడుగుతున్న స్థితిలో విభిన్నవర్గాల మధ్య ఘర్షణ సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటానికి మేలుచేయదు.

1922 తరువాత కార్మికవర్గపోరాటాల్లో స్తబ్ధత ఆవరించడంతోపాటు అవి పూర్తిగా ఆర్థికప్రయోజనాల సాధనకే పరిమితం కావడం కూడా జరిగింది. ఆ తరువాత దశలో వచ్చిన కార్మికవర్గపోరాటాలన్నింటిలోనూ వామపక్షం తన ఆధిపత్యాన్ని చాటుతూవచ్చింది.

* * *

1920 దశాబ్దపు ద్వితీయార్థంలో వివిధ వామపక్ష సిద్ధాంతాలూ వేళ్ళూనుకుని జాతీయోద్యమాన్ని ప్రభావితం చేసిన పరిణామం మనకు కనిపిస్తుంది. 1927 నాటికల్లా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్నమైన కమ్యూనిస్టు గ్రూపులు కార్మిక, రైతు పార్టీలుగా ఆవిర్భవించాయి. ఎస్. ఎ.డాంగే, ముజఫర్ అహ్మద్,పి.సి.జోషీ, సోహన్‌సింగ్ జోష్ వంటివారి నాయకత్వంలో ఇవి ఆవిర్భవించాయి. కాంగ్రెస్‌లోనే వామపక్షంగా వ్యవహరించిన ఈ పార్టీలు త్వరితగతిన బలాన్ని పుంజుకుని ప్రాంతీయస్థాయిలోనూ, జాతీయస్థాయిలోనూ కూడా సంస్థాగతంగా తమ అస్తిత్వాన్ని చాటుకున్నాయి.

విస్తృతమైన వామపక్షంగానూ, కార్మిక, రైతుపార్టీలతో సమష్టిగానూ వ్యవహరించి నప్పటికీ కార్మికసంఘోద్యమంలో కమ్యూనిస్టు ప్రభావం 1927 తొలినాళ్ళవరకూ నామమాత్రంగానే ఉండిపోయి 1928 చివరినాటికి బాగా వేళ్ళూనుకుంది. బొంబేలో 1928 ఏప్రిల్‌నుంచి సెప్టెంబరు వరకూ ఆరునెలలపాటు సాగిన చారిత్రాత్మక మిల్లు

కార్మికుల సమ్మెతో కమ్యూనిస్టుల నాయకత్వంలోని గిర్ని కామ్‌గార్ యూనియన్ (జికెయు) పేరు ప్రఖ్యాతులు సంతరించుకుంది. 1928 చివరినాటికి దాని సభ్యత్వం 324నుంచి 54వేలకు చేరుకుంది. బెంగాల్‌లోనూ, బొంబేలోనూ రైల్వేలోనూ, నేతమిల్లుల్లోనూ, మునిసిపాలిటీల్లోనూ, పేపరు మిల్లుల్లోనూ కమ్యూనిస్టు ప్రభావం బాగా పెరిగింది. మద్రాసులోని బర్మా ఆయిల్ కంపెనీకి కూడా దీని ప్రభావం విస్తరించింది. ఎఐటియుసిలో కూడా–1928 చివర్లో జరిగిన ఝరియా సమావేశం నాటికి వామపక్ష కూటమి ఆధిపత్యస్థాయికి చేరుకోగలిగింది. తత్ఫలితంగా ఆ తరువాత జవాహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన తరువాత సమావేశంలో ఎన్.ఎమ్.జోషీ వంటి నాయకుల అధ్వర్యంలో ఎఐటియుసినుంచి వేరుపడటంకూడా కూడా జరిగింది. 1928 చివరినాటికి పరిస్థితి ఏ స్థాయికి చేరుకుందంటే, 'దేశాన్ని చుట్టుముట్టిన కమ్యూనిజం ప్రభావం పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ లేకుండా మిగిలిపోయిన ఏ ఒక్క సేవారంగం లేదా పరిశ్రమ ఈ దేశంలో లేకుండాపోయింది' అని ప్రభుత్వం ఎంతో ఆందోళనగా ఈ పరిణామాలను వ్యాఖ్యానించాల్సివచ్చింది.

సమరశీల జాతీయవాదుల, కమ్యూనిస్టుల నాయకత్వంలో దేశవ్యాప్తంగా 1927–1929 మధ్యకాలంలో అనేక సమ్మెలూ, ప్రదర్శనలూ జరిగాయి. 1927 నవంబరులో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు ఇవ్వాలని ఎ ఐటియుసి నిర్ణయించినప్పుడు వేలాదిమంది కార్మికులు నిరసన ప్రదర్శనల్లో పాలుపంచుకున్నారు. మేడే, లెనిన్ డే, రష్యన్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగానూ కార్మికుల సదస్సులూ, సమావేశాలూ అనేకం జరిగాయి.

కార్మికవర్గంలో ఈ రకమైన సమరశీలభావనలు చోటుచేసుకోవడం, వారి రాజకీయ జోక్యం ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేసింది. ముఖ్యంగా, జాతీయవాదమూ, వామపక్ష పోకడలూ చేయిచేయీ కలపడం ప్రభుత్వాన్ని భయపెట్టింది. దానితో కార్మికోద్యమంపై దాడికి రెండుమార్గాలను ఎంచుకుంది. ఒక వైపు ప్రజాభద్రతాచట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం వంటివి తీసుకువచ్చి ఒక్కవేటున కార్మికోద్యమానికి నాయకత్వం వహిస్తున్న రాడికల్ భావనలున్న నాయకులందరినీ అరెస్టుచేసి వారిపై మీరట్‌కుట్రకేసు మోపింది. మరోవైపు కార్మికోద్యమాన్ని చల్లార్చే విఫలయత్నంలో భాగంగా కొన్ని చర్యలు కూడా ప్రకటించింది. 1929లో కార్మికుల సమస్యల పరిష్కారానికి రాయల్ కమిషన్ ఏర్పాటు ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ప్రభుత్వం జరిపిన ఈ దాడి కారణంగానూ, కమ్యూనిస్టు నాయకత్వంలోని ఉద్యమం తన విధానాన్ని మార్చుకున్న కారణంగానూ కార్మికోద్యమం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ అంశానికి సంబంధించి తరువాతదశలో మనం మరింత వివరంగా చర్చిద్దాం. అంతవరకూ రెండుముక్కల్లో చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే, 1928 చివరినాటికల్లా కమ్యూనిస్టులు ప్రధానస్రవంతికి చెందిన జాతీయోద్యమంతో కలసికట్టుగానూ, దానికి అనుబంధంగానూ వ్యవహరించే తమ విధానాన్ని పూర్తిగా మార్చేసుకున్నారు. ఈ కారణంగా వారు ఏకాకి కావడంతో పాటు కార్మికవర్గంలో వారికి ఉన్న పట్టు కూడా సడలిపోయింది. 1928 డిసెంబరు నాటికి 54వేల సభ్యత్వం ఉన్న జికెయులో ఆ సంఖ్య 1929 చివరినాటికి 800లకు పడిపోయింది. అదేవిధంగా ఎఐటియుసిలోకూడా కమ్యూనిస్టుల ఒంటరైపోయి 1931లో జరిగిన విభజనలో బయటకుపోవాల్సివచ్చింది.

1930లలో సిపిఐ విడుదల చేసిన ఒక పత్రం శాసనోల్లంఘనోద్యమంనుంచి తాము వైదొలిగిన ప్రభావం బోంబే కార్మికులపై ఏ విధంగా ఉన్నదో వివరించింది. '....మేం వాస్తవానికి పోరాటం నుంచి (శాసనోల్లంఘన) పక్కకు తొలిగిపోయి కదనరంగం మొత్తం కాంగ్రెస్ పరం చేశాం. ఒక విధంగా చెప్పాలంటే ఒక చిన్న గ్రూపుగా మా పాత్రను మేమే పరిమితం చేసుకున్నాం. తత్ఫలితంగా... మేము చేస్తున్నది ఏమీ లేదనీ, కాంగ్రెస్ మాత్రమే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నదనీ కార్మికుల మనసులో అభిప్రాయం బలంగా నాటుకుంది. దాంతో వారంతా కాంగ్రెస్ నాయకత్వాన్ని అనుసరించడం ఆరంభించారు'.

దేశవ్యాప్తంగా కార్మికులు శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు. షోలాపూర్ బట్టలమిల్లుల కార్మికులు, కరాచీ ఓడరేవు కార్మికులు, కలకత్తా రవాణా,మిల్లు యజమానులు, మద్రాస్ మిల్లు కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన ఉద్యమాలు చారిత్రాత్మకమైనవి. షోలాపూర్‌లో బ్రిటిష్‌వ్యతిరేక ప్రదర్శనపై పోలీసులు జరిపిన కాల్పులు కార్మికులను ఆగ్రహోదగ్రులను చేశాయి. మే 7వతేదీనుంచి 16వతేదీవరకూ బట్టలమిల్లు కార్మికులు వరుస దాడులకు పాల్పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాలు, పోలీసుస్టేషన్లు, రైల్వేస్టేషన్లపై దాడులు జరిగాయి. అనేక రోజులపాటు నగరపరిపాలన తిరుగుబాటుదారుల గుప్పిట్లోకి పోయింది. పట్టణంలో

జాతీయపతాకాన్ని ఎగురవేశారు. పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం సైనికశాసనాన్ని ప్రకటించాల్సివచ్చింది. అనేకమంది కార్మికులను ప్రభుత్వం ఉరితీయడమో, దీర్ఘకాలిక జైలుశిక్షలు విధించడమో చేసింది.

'కాంగ్రెస్ కాళ్ళూచేతులూ కార్మికులూ, రైతులే!' అన్నది బోంబేలో శాసనోల్లంఘనోద్యమానికి కాంగ్రెస్ నినాదం. జిఐపి రైల్వేకు చెందిన సుమారు 20వేలమంది కార్మికులు 1930 ఫిబ్రవరి 4వతేదీన పని బహిష్కరించారు. బ్రిటిష్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉప్పు తయారీ చట్టాన్ని ఉల్లంఘించడానికి ఏప్రిల్ 6వతేదీన గాంధీజీ నడుంబిగించినప్పుడు ఆ వినూత్నమైన సత్యాగ్రహ విధానాన్ని జిఐపి రైల్వే కార్మికసంఘం కూడా అనుసరించింది. రైల్వే కార్మికులు బృందాలుగా విడిపోయి ఉత్తరబోంబేలోని సబర్బన్ స్టేషన్లకు చేరుకుని పట్టాలపై ఎర్రజెండాలు పాతి, రైలు పట్టాలపై అడ్డంగా పడుకున్నారు. కార్మికులను అక్కడనుంచి కదల్చడానికి పోలీసులు కాల్పులు జరపాల్సివచ్చింది. భారీ ఎత్తున సాగుతున్న అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన తెలియచేయడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ జూలై 6వతేదీని 'గాంధీ రోజు'గా ప్రకటించినప్పుడు 49 ఫ్యాక్టరీలకు చెందిన కార్మికులు ఆరోజు పనిబహిష్కరించి హర్తాల్‌లో పాల్గొన్నారు.

* * *

1931-36 మధ్యకాలంలో కార్మికోద్యమం మందకొడిగా సాగింది. 1932-34 కాలంనాటి శాసనోల్లంఘనోద్యమంలో కార్మికులు చురుకుగా పాల్గొనపోవడం కూడా మనకు కనిపిస్తుంది. ఆ తరువాత దశలో కార్మికోద్యమం చురుకుదనాన్ని సంతరించుకున్నది 1937-39లో ప్రాదేశిక స్వతంత్రత, మంత్రివర్గాల ఏర్పాటు వంటిచర్యలు అమలు జరిగినప్పుడు మాత్రమే.

ఈ మధ్యకాలంలో కమ్యూనిస్టులు తమ ఆత్మహత్యాసదృశమైన విధానాలను సవరించుకుని 1934నుంచి జాతీయరాజకీయాల్లో పాలుపంచుకోవడంద్వారా ప్రధానస్రవంతికి చేరువైనారు. 1935లో వారు అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)లో కూడా చేరారు. జాతీయరాజకీయాల్లోనూ, కార్మికోద్యమంలోనూ వామపక్ష ప్రభావం పెరగడం అప్పటినుంచి తిరిగి ఆరంభమైంది. జవహర్‌లాల్ నెహ్రూ,

సుబాష్‌బోస్ నాయకత్వంలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సామ్యవాదులు, వామపక్ష జాతీయవాదులతో కూడిన బలమైన వామపక్ష సంఘటన ఒకటి కాంగ్రెస్‌లోనూ, ఇతర జనసామన్య సంఘాల్లోనూ వేళ్లూనుకుంది.

1937 ఎన్నికలకోసం ప్రచారం ఆరంభమైనప్పుడు, కొన్ని గ్రూపులు మినహా ఎ ఐటియుసి మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. కార్మికుల వివాదాల పరిష్కారానికి కృషిచేయడంతోపాటు కార్మికులు సంఘాలను ఏర్పాటు చేసుకుని తమ ప్రయోజనాల నిమిత్తం సమ్మె తలపెట్టే హక్కుల సాధనకోసం తాను కృషిచేస్తానని కాంగ్రెస్ తన ఎన్నికల వాగ్దానపత్రంలో హామీ ఇచ్చింది. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకత్వంలో ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడే కార్మికసంఘోద్యమం బలపడటం ఆరంభమైంది. 1937–39 మధ్యకాలంలో కార్మికసంఘాల సంఖ్య 271నుంచి 562కు పెరిగింది. ఈ సంఘాల సభ్యత్వం కూడా 2,61,047నుంచి 3,99,159కు పెరిగింది. దీనితోపాటు సమ్మెల సంఖ్యకూడా బాగా పెరిగింది.

కార్మికసంఘాల ఉద్యమాలు ఈ కాలంలో బాగా పెరగడానికి దోహదం చేసిన అంశాల్లో ప్రధానమైనవిగా చెప్పుకోవలసినవి కాంగ్రెస్ ప్రభుత్వాల ఏలుబడిలో పౌరస్వేచ్ఛ పెరగడం, దానితోపాటుగా అనేక కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికులకు అనుకూలమైన వైఖరితో వ్యవహరించడం. ఈ కాలంలో జరిగిన సమ్మెల్లో అధికశాతం విజయవంతం కావడం మరో విశేషం. చాలా సమ్మెలు పూర్తిస్థాయిలో కానీ, కనీసం పాక్షికంగా కానీ కార్మికులకు విజయాన్ని సాధించిపెట్టాయి.

1939 సెప్టెంబర్ 3న రెండో ప్రపంచయుద్ధం ఆరంభమైనప్పుడు ప్రపంచంలో ప్రప్రథమంగా యుద్ధవ్యతిరేక సమ్మెను నిర్వహించిన వారిలో బోంబే కార్మికులు కూడా ఉన్నారు. అక్టోబర్ 2వతేదీన జరిగిన ఈ సమ్మెలో 90వేలమంది కార్మికులు పాల్గొన్నారు. యుద్ధసన్నాహాల్లో నిండా మునిగివున్న ప్రభుత్వం ఒకవైపు చేతనైనంతగా అణచివేత ప్రయత్నాలు చేసినప్పటికీ దేశవ్యాప్తంగా ఆర్థికాంశాలపై అనేక సమ్మెలు జరిగాయి.

అయితే, 1941లో నాజీలు సోవియట్ యూనియన్‌పై దాడిజరపడంతో, – యుద్ధ స్వభావం మారిపోయిందనీ, సామ్రాజ్యవాద యుద్ధం ఒక ప్రజాయుద్ధంగా రూపాంతరం చెందిందని కమ్యూనిస్టులు వాదించారు. సామ్యవాదపు పురిటిగడ్డను సవాలు

చేస్తున్న ఫాసిజాన్ని ఓడించడానికి సంకీర్ణదేశాలకు మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత కార్మికవర్గంపైన పడింది. 1942 ఆగస్టులో గాంధీజీ ఆరంభించిన క్విట్ ఇండియా ఉద్యమంనుంచి కమ్యూనిస్టు పార్టీ వైదొలిగింది. అంతేకాదు, పారిశ్రామికశాంతిని కాపాడుతూ, ఉత్పత్తి దెబ్బతినకుండా చూస్తూ, తద్వారా యుద్ధ సన్నాహాలకు ఏమాత్రం విఘాతం లేకుండా కూడా వారు జాగ్రత్తలుపడ్డారు.

అయితే, క్విట్ ఇండియా ఉద్యమం కార్మికవర్గాన్ని స్పృశించకుండా సాగలేదు. ఉద్యమంతో కమ్యూనిస్టుల సైద్ధాంతిక వ్యతిరేకత ఉన్నప్పటికీ, 1942 ఆగస్టు 9వతేదీన క్విట్ ఇండియా తీర్మానం అనంతరం గాంధీజీనీ ఇతర నాయకులనూ ప్రభుత్వం అరెస్టు చేయగానే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున హార్తాళ్ళూ, సమ్మెలూ జరిగాయి. ఢిల్లీ, లక్నో, కాన్పూర్, బోంబే, నాగపూర్, అహమ్మదాబాద్, జమ్షెడ్‌పూర్, మద్రాస్, ఇండోర్, బెంగుళూరు మొదలైనచోట్ల ఏకబిగిన వారంపాటు కార్మికులు సమ్మెలూ, హార్తాళ్లూ నిర్వహించారు. టాటా ఉక్కు కర్మాగారంలో 13రోజులపాటు పని నిలిచిపోయింది. జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేవరకూ తాము పనిలో చేరేది లేదని కార్మికులు నినదించారు. అహ్మదాబాద్‌లో బట్టలమిల్లుల కార్మికులు మూడున్నర నెలలపాటు సమ్మె కొనసాగించారు. జాతీయతాభావనలతో మిల్లుయజమానులు కూడా ఇందుకు సహకరించడం విశేషం. కమ్యూనిస్టుల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో కార్మికులు ఉద్యమంలో పాలుపంచుకోవడం తక్కువగా ఉన్నప్పటికీ, పార్టీ అనుసరిస్తున్న విధానానికి భిన్నంగా చాలా చోట్ల కమ్యూనిస్టు నాయకులూ, కార్యకర్తలూ క్విట్ ఇండియా ఉద్యమంలో ఉత్సాహంగా పాలుపంచుకోవడం కూడా మరోపరిణామం.

1945–47 మధ్యకాలంలో కార్మికవర్గం సమధికోత్సాహంతో వ్యవహరించింది. యుద్ధానంతర రాజకీయ పరిణామాల్లో అధికశాతం కార్మికులు పాలుపంచుకున్నారు. ఐఎన్ఏ యుద్ధఖైదీల విచారణకు సంబంధించిన అనేకానేక పరిణామాలపై నగరాల్లోనూ, పట్టణాల్లోనూ (ముఖ్యంగా కలకత్తా) ఏర్పాటు చేసిన అనేక సమావేశాల్లో వారు ప్రముఖంగా పాల్గొన్నారు. 1945 చివర్లో బోంబే, కలకత్తా ఓడరేవు కార్మికులు విధులు నిర్వర్తించడానికి నిరాకరించడం మరో పరిణామం. ఆగ్నేయాసియాదేశాల్లో వెల్లువెత్తిన విముక్తిపోరాటాలను అణచివేసేందుకు వీలుగా అక్కడున్న బలగాలకు సామగ్రిని తీసుకొని ఇండోనేషియా తరలివెడుతున్న నౌకల్లో సరుకునెత్తడానికి ఈ ఓడరేవు కార్మికులు నిరాకరించారు. 1946లో

భారత నావికులు బోంబేలో జరిపిన తిరుగుబాటుకు సంఘీభావంగా బోంబే కార్మికులు జరిపిన సమ్మెలూ, హోర్తాళ్లూ మరపురానివి. సోషలిస్టుల మద్దతుతో కమ్యూనిస్టులు ఇచ్చిన పిలుపునందుకుని ఫిబ్రవరి 22న మూడువేలమంది కార్మికులు సమ్మెకట్టారు. శాంతియుతంగా సదస్సులూ, సమావేశాలూ జరుపుకుంటుంటే పోలీసులు జోక్యం చేసుకోవడంతో వ్యవహారం చెడింది. ఘర్షణలు చెలరేగాయి. హింసపెద్ద ఎత్తున ప్రజ్వరిల్లింది. వీధుల్లో బారికేడ్లు కట్టుకుని పోలీసులతోనూ, సైన్యంతోనూ వారు జరిపిన పోరాటం ఒక యుద్ధవాతావరణాన్ని తలపింపచేసింది. నగరంలో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి రెండు బెటాలియన్ల సైన్యాన్ని ప్రయోగించాల్సివచ్చింది. 48 గంటలపాటు జరిగిన పోరులో సుమారు రెండు వందలయాభై మంది ఉద్యమకారులు తమ ప్రాణాలు విడిచారు.

వలసపాలన ఆఖరు సంవత్సరాల్లో కూడా ఆర్థికసంబంధమైన అంశాలపై దేశవ్యాప్తంగా అనేకసమ్మెలు జరిగాయి. తంతి – తపాలాశాఖ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె ఎంతో ప్రాచుర్యం పొందింది. యుద్ధకాలంలోనూ, అనంతరం ఉత్పన్నమైన ఆర్థిక సమస్యలు, అధికధరలు, వాస్తవికత వేతనం పడిపోవడం, మరోపక్క అత్యవసరవస్తువుల కొరత వంటి అనేక అంశాలు కార్మికవర్గాన్ని దుర్భరస్థితిలోకి నెట్టి వారు సహనం కోల్పోయేట్టుగా చేశాయి. వారిలో అశాంతి ప్రబలిపోయింది.

భారతప్రజల్లో స్వాతంత్ర్యం ఇంకెంతోదూరంలో లేదన్న భావన బాగా బలపడింది. దానితోపాటుగా అన్ని వర్గాలూ కూడా స్వాతంత్ర్యం ఒక్కటే తమ సమస్యలన్నింటికీ పరిష్కారమన్న నమ్మకం పెంచుకున్నాయి. కార్మికవర్గం కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. స్వాతంత్ర్యం రావడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న సంపూర్ణ విశ్వాసంతో వారు పోరాడుతూనే ఉన్నారు.

* * *

# 18 గురుద్వారా సంస్కరణలూ, ఆలయ ప్రవేశ ఉద్యమాలు!

వెల్లువెత్తిన ప్రజాస్వామిక,జాతీయతాభావనలు రాజకీయరంగానికి మాత్రమే పరిమితం కాకుండా మత, సామాజిక రంగాలకు కూడా వ్యాప్తిచెంది అణగారినవర్గాలనూ, కులాలనూ కూడా ప్రభావితం చేశాయి. అనేకమంది జాతీయతావాదులు కొత్తగా ఉనికిలోకి వచ్చిన అహింసాయుత సత్యాగ్రహ విధానాన్ని ప్రయోగించి భారతీయ సామాజిక వ్యవస్థను ప్రభావితం చేసే అనేక మార్పులకు వీలుగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టగలిగారు. భారతీయ సామాజిక, మత వ్యవస్థలను సంస్కరించే లక్ష్యంతో సాగిన ఈ ఉద్యమాలు తరచుగా వలసపాలకులతో ఘర్షణపడటం కూడా తటస్థించింది. ఈ కారణంగా భారతీయసమాజాన్ని సంస్కరించే ఈ ఉద్యమం వలసపాలన వ్యతిరేకోద్యమంతో మమేకమయ్యే స్వభావాన్ని కూడా కనబరిచింది. జాతీయోద్యమం బలపడుతున్నకొద్దీ వలసపాలన సామాజికమూలాలు బలహీనపడుతుండటమూ, వలసపాలకులు భారతీయసమాజపు ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక ప్రతికూలవర్గాల మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు ఆరంభించడమూ ఈ పరిణామాల కారణంగానే. జాతీయోద్యమంలోని ఈ కోణాన్ని మనకు పంజాబ్‌లో జరిగిన అకాలీ ఉద్యమం, కేరళలో జరిగిన ఆలయప్రవేశ ఉద్యమం చక్కగా వివరిస్తాయి.

* * *

అకాలీ ఉద్యమం ఒక మతసంబంధమైన ఉద్యమంగా ఆరంభమై స్వాతంత్ర్యో ద్యమంలో ఒక శక్తివంతమైన ఘట్టంగా ముగిసింది. 1920నుంచి 1925 వరకూ సాగిన ఈ ఉద్యమంలో దాదాపు 30వేలమంది స్త్రీలూ, పురుషులూ జైళ్ళపాలయ్యారు. సుమారు 400మంది మరణిస్తే, 2వేలమంది గాయపడ్డారు. సిక్కుల ఆలయాలైన గురుద్వారాలను నిర్లక్ష్యానికీ, అవినీతికీ మారుపేరైన 'మహంత్'ల గుప్పిట్లోనుంచి విముక్తిచేయడం ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. 18,19 శతాబ్దాల్లో మహారాజా రంజీత్‌సింగ్, సిక్కుప్రముఖులు, సిక్కు భక్తులూ ఎంతో ఉదారంగా ఇచ్చిన భూరి విరాళాలతోనూ, భూములతోనూ గురుద్వారాలు వెలిగిపోతుండేవి. వాటిమీద పెత్తనం మట్టుకు నిరంకుశులైన మహంతులది. జుట్టు పొడవుగా పెంచుకునే ఆచారం లేని కారణంగా (ఈ కారణంగానే కొంతమంది ఈ మహంతులు హిందువులని విశ్వసించారు. అయితే, ఇది ఏమాత్రం నిజం కాదు) మొఘల్ అధికారుల దాడులనుంచి తప్పించుకోగలిగిన ఈ మహంతులు 18వ శతాబ్దకాలంలో గురుద్వారాలను నిర్వహించేవారు. కొద్దికాలంలోనే ఈ మహంతుల్లో అవినీతి, స్వార్థం విపరీతంగా పెరిగిపోయి గురుద్వారాల ఆదాయం తమ వ్యక్తిగత ఆదాయంగా భావించడం ఆరంభించారు. విలాసవంతమైన జీవితాలు గడుపుతూ భోగలాలసలో తేలియాడటం ప్రారంభించారు. 1849లో పంజాబ్ బ్రిటిష్‌వారిచేతుల్లోకి వచ్చిన తరువాత ప్రభుత్వం ధర్మకర్తలుగా నియమించిన అధికారుల చేతుల్లోకి కూడా కొంతవరకూ అధికారం విస్తరించింది. అయితే, దీనివల్ల పరిస్థితుల్లో పెద్దగా మార్పువచ్చిందేమీలేదు. వీరూ, మహంతులూ కుమ్మక్కయి యథేచ్ఛగా గురుద్వారాల ఆదాయాన్ని అనుభవించేవారు.

ప్రభుత్వం మహంతులకు పూర్తి మద్దతుగా నిలిచేది. సిక్కుల్లో ప్రభుత్వ విధేయతనూ, జాతీయోద్యమ వ్యతిరేకతనూ ప్రచారం చేయడానికి ప్రభుత్వం వారినీ తాను నియమించిన నిర్వాహకులనూ ఉపయోగించుకునేది. ఇందుకు భిన్నంగా జాతీయతావాదులు గురుద్వారాలను అవినీతిపరులైన మహంతులనుంచీ, వారికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వ అధికారులనుంచీ విముక్తిచేసి సంపూర్ణంగా సంస్కరించడానికి ప్రయత్నాలు చేసేవారు. ముఖ్యంగా రెండు ప్రధానమైన

పరిణామాలు జాతీయతావాదులను నిశ్చేష్టులను చేశాయి. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయానికి చెందిన మతపెద్దలు ఒక 'హుకుంనామా' (మతాదేశం) జారీ చేస్తూ ఘదరైట్లను ధర్మభ్రష్టులుగా ముద్రవేయడమే కాకుండా ఆ తరువాత జలియన్‌వాలాబాగ్ ఊచకోతకు మూలకారకుడైన జనరల్ డయ్యర్‌ను 'సరోపా'తో గౌరవించి అతడిని సిక్కుగా ప్రకటించారు.

1920లలో గురుద్వారా సంస్కరణోద్యమం ఉచ్ఛస్థితికి చేరుకుంది. 'జాతాస్'గా పేరొందిన స్వచ్ఛందసేవక బృందాలను సంస్కరణవాదులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నియమించిన నిర్వాహకులనుంచి, మహంతులనుంచీ గురుద్వారాలను స్వాధీనం చేసుకొని స్థానిక భక్తులకు నిర్వహణ బాధ్యతను అప్పగించడం వీరి ప్రధాన బాధ్యత. ఆ ఏడాది అనేక గురుద్వారాలను సంస్కరణవాదులు స్వాధీనం చేసుకోగలిగారు స్వర్ణదేవాలయాన్నీ, అకాల్‌తక్త్‌నూ స్వాధీనం చేసుకోవడం వీరు సాధించిన ప్రధానమైన విజయం. 'సిక్కుమత అత్యున్నత పీఠాన్ని సిక్కులందరికీ ప్రాతినిధ్యం వహించే ఒక సంఘం చేతుల్లో ఉండాల'న్నది సంస్కరణవాదుల అభిలాష. తమ డిమాండుకు మద్దతుగా వారు అనేక సభలూ, సమావేశాలూ నిర్వహించారు. ప్రభుత్వం ఈ దశలో సంస్కరణవాదులను రెచ్చగొట్టడం మంచిది కాదనీ, ప్రజాభిప్రాయానికి సానుకూలంగా స్పందించడం ద్వారా వారిని బుజ్జగించడం ఉత్తమమని భావించింది. తాను నియమించిన అధికారులచేత రాజీనామాలు చేయించి స్వర్ణదేవాలయం సంస్కరణవాదుల అధీనంలోకి వెళ్లేందుకు వీలుకల్పించింది.

స్వర్ణదేవాలయాన్నీ, అకాల్‌తఖ్త్‌నీ, ఇతర గురుద్వారాలను నిర్వహించడానికీ, నియంత్రించడానికీ వీలుగా 1920 నవంబరులో 10వేలమందికి పైగా సంస్కరణవాదులు సమావేశమై 175మంది సభ్యులతో కూడిన ఒక కమిటీని ఎన్నుకున్నారు. దానిపేరు 'శిరోమణి గురుద్వారా ప్రభందక్ కమిటీ (ఎస్‌జిపిసి). దీనితోపాటుగా ఉద్యమాన్ని ఒక క్రమపద్ధతిలో కొనసాగించడానికి వీలుగా మరొక అత్యున్నత నిర్ణాయక సంఘం అవసరమని కూడా వారు భావించారు. ఈ లక్ష్యంతో డిసెంబరులో శిరోమణి అకాలీదళ్ ఆవిర్భవించింది. జాట్ రైతులు వెన్నుదన్నుగా

ఉన్న అకాలీ 'జాఠాస్'ను నియంత్రించే, నిర్దేశించే కేంద్రసంఘం ఇది. జాతీయతావాద మేధావుల చేతుల్లో దీని నాయకత్వం ఉంటుంది. సహాయనిరాకరణోద్యమం సమకాలీనమైనది కావడంతోనూ, చాలామంది నాయకులు రెండు ఉద్యమాలకూ చెందినవారవడంతోనూ– అటు అకాలీదళ్, ఇటు ఎస్‌జిపిసి కూడా సంపూర్ణమైన అహింసే తమ విధానంగా ఆమోదించాయి కూడా.

* * *

1921 ఫిబ్రవరిలో నాన్‌కానా అనే చోట తొలిసారిగా అకాలీ ఉద్యమం చేతికి రక్తం అంటింది. గురునానక్ జన్మస్థలమైన ఈ ప్రాంతంలోని గురుద్వారాను శాంతియుతంగా అప్పగించడానికి దాని మహంత్ నారాయణ్‌దాస్ అంగీకరించలేదు. 500మంది కిరాయిమూకలతో ఆయన ఒక బలగాన్ని ఏర్పాటు చేసాడు. శాంతియుతంగా ఉద్యమిస్తున్న అకాలీ కార్యకర్తలతో పోరాడటానికి వారికి తుపాకులు, కత్తులు, లాఠీలు, ఇతర ఆయుధాలు సమకూర్చాడు. ఫిబ్రవరి 20వతేదీన అకాలీ జాఠాలు గురుద్వారాలో ప్రార్థనలు చేస్తుండగా మహంతా మనుషులు వారిపై కాల్పులు జరిపి, ఆయుధాలతో దాడులు చేశారు. దాదాపు 100మంది అకాలీలు అక్కడికక్కడే మరణించారు. వెనువెంటనే కర్తార్‌సింగ్ జబ్బర్ నాయకత్వంలోని అనేకమంది జాఠాలు గురుద్వారాలోకి ప్రవేశించి దానిని పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. డిప్యూటీ కమిషనర్ హెచ్చరికలను కూడా వారు ఖాతరుచేయలేదు. మహంత్‌ను అప్పటికే అరెస్టుచేయడం జరిగిపోయింది. వాస్తవానికి ఈ కాలానికి ప్రభుత్వ విధానం ఇంకా ఊగిసలాటధోరణిలోనే ఉంది. ఒకపక్క అది సిక్కులకు ఆగ్రహాన్ని కలిగించడానికి భయపడుతోంది, మరోపక్కన గురుద్వారాలమీద తన ఆధిపత్యాన్ని పూర్తిగా వదులుకోలేకపోతోంది.

నాన్‌కానా దుర్ఘటన అకాలీ ఉద్యమంలో ఒక ప్రధానమైన ఘట్టంగా మనం చెప్పుకోవాలి. నాన్‌కానా గురుద్వారాను మహంత్ గుప్పిట్లోనుంచి విముక్తిచేయడానికి పోరాడిన కర్తార్‌సింగ్ జబ్బర్ మాటల్లో ఈ విషయం మనకు స్పష్టంగా తెలుస్తుంది. 'ఈ సంఘటన సిక్కులను ఒక్కమారుగా చైతన్యవంతం చేసింది. వారు నిస్తేజాన్ని వీడి

ఉత్తేజంగా స్వరాజ్యంవైపు వడివడిగా అడుగులువేయడానికి ప్రోత్సహించింది' అన్నాడాయన. ఈ సంఘటన యావత్‌దేశాన్నీ ప్రభావితం చేసింది. మహాత్మాగాంధీ, మౌలానా షౌకత్ అలీ, లాలా లజపతిరాయ్ వంటి అనేకమంది జాతీయనాయకులు నాన్‌కానాను సందర్శించి తమ మద్దతును తెలియచేశారు.

ఈ పరిణామాలతో ప్రభుత్వం తన విధానాన్ని మార్చేసుకుంది. అకాలీ ఉద్యమమూ, జాతీయోద్యమం ఒకదానితో ఒకటి మమేకం కావడం ప్రమాదకరమని భావించి పరిస్థితిని మార్చేందుకు ద్వంద్వ విధానాన్ని అనుసరించాలన్న నిర్ణయానికి వచ్చింది. మతపరమైన సంస్కరణలను మాత్రమే కోరుకునేవారినీ, మితవాదులను తనవైపు తిప్పుకోవడానికి వీలుగా ప్రభుత్వం అనేక హామీలు గుప్పించి ఒక చట్టాన్ని కూడా రూపొందించి వారిని సంతృప్తిపరచేందుకు ప్రయత్నించింది. మరోవైపు శాంతిభద్రతలను కాపాడే పేరుతో అకాలీల్లోని తీవ్రవాద లేదా సామ్రాజ్యవాదవ్యతిరేక శక్తులను అణచివేయడానికి సిద్ధపడింది.

అకాలీలు కూడా తమ విధానాన్ని మార్చుకున్నారు. దేశవ్యాప్తంగా జాతీయతావాదులు తమకు ఇచ్చిన మద్దతుతో ఉత్సాహపూరితులైన వీరు తమ మతవ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యాన్ని సమూలంగా పెకిలించివేయాలని నిర్ణయించుకున్నారు. తమ ఉద్యమాన్ని జాతీయోద్యమంలో అంతర్భాగంగా వారు చూశారు. తత్ఫలితంగా ఎస్‌పిజిసిలో కూడా సహాయనిరాకరణోద్యమ మద్దతుదారులైన జాతీయవాదులే ఆధిపత్యాన్ని సంపాదించుకున్నారు. 1921 మేనెలలో సహాయనిరాకరణోద్యమానికి మద్దతుగా ఎస్‌జిపిసి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. విదేశీవస్త్రాలనూ, మద్యాన్నీ బహిష్కరించడం, బ్రిటిష్ న్యాయస్థానాల స్థానంలో పంచాయితీలకు చోటుకల్పించడం వంటి అంశాలపై అకాలీలు ఉద్యమాలు చేశారు. చట్టాలను ఉల్లంఘిస్తున్నందుకు అకాలీనాయకులు అనేకమంది అరెస్టుకావడమే కాదు, విదేశీన్యాయస్థానాల అధికారపరిధినే సవాలు చేస్తూ తమను తాము న్యాయపరంగా రక్షించుకోవడానికి కూడా వారు నిరాకరించారు.

1921 అక్టోబర్‌లో 'తాళంగుత్తి' వ్యవహారంలో అకాలీలు సాధించిన విజయం గణనీయమైనది. స్వర్ణదేవాలయపు 'తోషాఖానా' తాళం చెవులను తన అధీనంలో ఉంచుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు అకాలీలు వెంటనే ప్రతిస్పందించి భారీ బహిరంగసభలు నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసను తెలియచేశారు. అనేకమంది అకాలీ జాతాలు వెనువెంటనే అమృత్‌సర్ చేరుకున్నారు. వేల్స్ యువరాజు భారతసందర్శన సందర్భంగా జరిగే హర్తాల్‌లో పెద్ద ఎత్తున పాలుపంచుకోవలసిందిగా సిక్కులకు ఎస్‌జిపిసి పిలుపునిచ్చింది.ప్రభుత్వం ఇందుకు ప్రతిగా ఎస్‌జిపిసికి చెందిన బాబా ఖరక్‌సింగ్, మాస్టర్ తారాసింగ్ వంటి తీవ్రవాద జాతీయనాయకులనూ, ఇతర ప్రముఖనాయకులనూ అరెస్టు చేసింది. ఈ రకమైన చర్యలు పరిస్థితిని ఏమాత్రం చల్లార్చకపోగా ఉద్యమం మారుమూల ప్రాంతాలకూ, సైన్యానికీ కూడా విస్తరించింది.మరోపక్కన దేశవ్యాప్తంగా సహాయనిరాకరణోద్యమం ఉచ్ఛస్థితిలో ఉంది. ఈసమయంలో ఒక మతపరమైన అంశంమీద సిక్కులతో ఘర్షణపడడం ప్రమాదకరమని మరోమారు ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ మొత్తం వ్యవహారంలో అరెస్టయినవారినందరినీ వెంటనే విడుదలచేయడమే కాకుండా,తోషాఖానా తాళంచెవులను ఎస్‌జిపిసి అధినాయకుడైన బాబా ఖరక్‌సింగ్‌కు అప్పగించింది. మహాత్మాగాంధీ వెంటనే ఖరక్‌సింగ్‌కు ఒక టెలిగ్రామ్ పంపించారు. 'భారత స్వాతంత్ర్యోద్యమ తొలియుద్ధం విజయవంతమైంది–అభినందనలు' అంటూ.

* * *

గురుద్వారాలను విముక్తిచేసే ఉద్యమం ముగింపు ఒక మహోన్నతమైన అహింసాయుత పోరాటం ద్వారా ముగిసింది. గురూకాబాగ్ గురుద్వారాను అకాలీలు స్వాధీనం చేసుకున్న సంఘటన యావత్‌దేశాన్ని కుదిపివేసింది. తాళం చేతుల వ్యవహారంలో దెబ్బతిన్న పంజాబ్ అధికారగణం అకాలీలకు గుణపాఠం నేర్పాలన్న అత్యుత్సాహంలో చేతులు కాల్చుకున్న సంఘటన ఇది. సహాయనిరాకరణోద్యమం 1922 ఫిబ్రవరిలో ముగిసిపోవడంతో తమ కసితీర్చుకోవడానికి అధికారులు ఓ అవకాశం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఒకానొక పరిణామం వారికి దానిని కల్పించింది.

అమృత్‌సర్‌కు 20కి.మీ.దూరంలో గోఖేవాలా అనే గ్రామం ఉంది. గురూకాబాగ్ గురుద్వారాను దాని మహంత్ 1921 ఆగస్టులోనే ఎస్‌జిపిసికి అప్పగించినప్పటికీ దానికి అనుబంధంగా ఉన్న భూమి మాత్రం తన స్వంతమని వాదిస్తూవచ్చాడు. సమష్టివంటశాలలో వంటచెరకుగా వాడడానికి అకాలీలు ఆ భూమిలో ఉన్న ఎండిపోయిన ఓ చెట్టును నరకడంతో సదరు మహంత్ వారిపై 'దొంగతనం' చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు వెంటనే దీనిని అవకాశంగా తీసుకున్నారు. 1922 ఆగస్టు 9వతేదీన ఐదుగురు అకాలీలను అరెస్టుచేసి విచారణ ప్రారంభించారు. అకాలీదళ్ ఈ సరికొత్త సవాలుకు వెంటనే స్పందించింది. ఆ వివాదాస్పద భూమిలో చెట్లను నరకడానికి వివిధ ప్రాంతాలనుంచి అకాలీ జాతాలు రావడం ఆరంభించారు. ప్రభుత్వం వారిని 'దొంగతనా'నికీ, 'అల్లర్ల'కూ పాల్పడుతున్న నేరంపై వరుసగా అరెస్టులు చేయడం ఆరంభించింది. ఆగస్టు 28వతేదీనాటికల్లా నాలుగువేలమంది అకాలీలు అరెస్టయ్యారు.

దీనితో, అధికారులు హఠాత్తుగా పద్ధతి మార్చుకుని అకాలీ కార్యకర్తలను అరెస్టుచేయడం మానేసి లాఠీలతో అమానుషంగా బాదడం ఆరంభించారు. కానీ, అకాలీలు చేతులూ కాళ్ళూ విరిగి నేలవాలిపోయేవరకూ పట్టుదలగా నిలబడ్డారే కానీ ఎదురుతిరగలేదు. ఈ సంఘటన అందరినీ ఎంతగా కదిలించిందంటే సి ఎఫ్ ఆండ్రూస్ దీనిని 'అత్యంత దారుణమైన, అమానుషమైన, పిరికి చర్య'గా అభివర్ణించాడాయన. ఇంగ్లీషువాడి గౌరవానికి విఘాతం కలిగించిన వ్యవహారంగా, ఇంగ్లండ్ నైతికవైఫల్యంగా ఆయన దానిని పేర్కొన్నాడు. ఈ సంఘటనపట్ల దేశం యావత్తూ మండిపడింది. జాతీయనాయకులూ, పాత్రికేయులూ గురూకా బాగ్‌ను సందర్శించారు. పంజాబ్ అంతటా నిరసనసమావేశాలు జరిగాయి. సెప్టెంబర్ 10న అమృత్‌సర్‌లో జరిగిన అకాలీ సమావేశానికి స్వామి శ్రద్ధానంద, హాకీం అజ్మాల్‌ఖాన్‌తో సహా అనేకమంది హాజరైనారు. పోలీసుల వ్యవహారశైలిపై దర్యాప్తుచేయడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక కమిటీని నియమించింది.

ప్రభుత్వం మరోమారు దిగివచ్చింది. ఈ వ్యవహారంనుంచి బైటపడి తన పరువు కాపాడుకోవడంకోసం ఒక రిటైర్డ్ అధికారిని ఒప్పించి, మహంత్ భూమిని

ఆయనకు లీజుకు ఇప్పించి, అకాలీలను అందులో చెట్లను నరుక్కోనిచ్చింది. అరెస్టయిన అకాలీలను కూడా విడుదల చేసింది.

గురుద్వారాలు ఎస్‌జిపిసి అజమాయిషీలోకి వచ్చిన నేపథ్యంలో, ఇంకా దేశంలోని అన్ని గురుద్వారాలను విముక్తిచేయడం పూర్తికానందున తీవ్రవాద అకాలీలు ప్రభుత్వంతో ఘర్షణపడేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఒత్తిడి మేరకు నాభా మహారాజు పదవీత్యాగం చేసిన అంశం వారికి అందివచ్చింది. 1923 సెప్టెంబరులో అకాలీలు ఈ అంశాన్ని చేపట్టి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహించారు. అయితే, ఇది మతవ్యవహారం కానందువల్లా, మిగతా దేశంనుంచి పెద్దగా సహాయసహకారాలు అందనందునా అకాలీలు ఇందులో పెద్దగా సాధించిందేమీ లేదు. ఈలోగా ప్రభుత్వం ఒక చట్టాన్ని తీసుకువచ్చి (1925 జులైలో ఈ చట్టాన్ని ఆమోదించారు) పంజాబ్‌లోని గురుద్వారాలన్నింటినీ ఎన్నికైన సిక్కు ప్రతినిధులతో కూడుకున్న ఒక సంఘానికి అప్పగించింది. ఈ సంఘాన్ని కూడా ఎస్‌జిపిసి అనే పిలవడం ఆరంభించారు. ఈ చర్యద్వారా ప్రభుత్వం సిక్కు మితవాదులను బుజ్జగించడంలో విజయం సాధించింది.

ఈ రకమైన విజయాలతో పాటుగా పంజాబ్‌లోని అకాలీ ఉద్యమం పంజాబ్ రాజకీయాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేసింది. పంజాబ్ రైతులను ఈ ఉద్యమం చైతన్యవంతం చేసింది. అకాలీ ఉద్యమ చరిత్రకారుడు మొహీందర్ సింగ్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'బ్రిటిష్ అనుకూల ఫ్యూడల్ నాయకత్వాన్ని కూలదోసి దాని స్థానంలో విద్యావంతులైన మధ్యతరగతి జాతీయవాద నాయకత్వాన్ని సిక్కుప్రజలు ప్రతిష్ఠించుకున్నది అకాలీ ఉద్యమకాలంలోనే. అంతేకాదు, అకాలీ ఉద్యమం గ్రామీణ,పట్టణవర్గాలవారిని సంఘటితం చేయడంలో కూడా విజయం సాధించింది'. మతసంబంధమైన అంశాలపై ఆధారపడి సాగినప్పటికీ మతతత్వాన్ని సంతరించుకోకుండా విజవంతమైన ఉద్యమం ఇది. మొహీందర్ సింగ్ మాటల్లో చెప్పాలంటే– 'విదేశీపాలకులనుంచి దేశాన్ని విముక్తం చేయాలన్న లక్ష్యంతో సాగిన ఈ ఉద్యమం సిక్కుప్రజల్లోని అన్ని వర్గాలవారినీ సంఘటితం చేసింది. ఈ ప్రావిన్సులోని

హిందువులను, ముస్లింలనూ, సిక్కులనూ అకాలీ ఉద్యమం తన గుప్పిట్లోకి తెచ్చుకుంది'. అకాలీ ఉద్యమం పంజాబ్‌లోని వివిధ సంస్థానాల ప్రజలను చైతన్యవంతం చేసి వారు రాజకీయ కార్యాచరణకు ముందడుగువేసేట్టు చూసింది. అయితే, ఈ ఉద్యమంలో కొన్ని బలహీనతలు ఉన్న కారణంగా తరువాతి కాలంలో కొన్ని దుష్ప్రభావాలు ఏర్పడిన మాట వాస్తవం. ఉద్యమం కొంతవరకూ మతభావనలను రేకెత్తించిన కారణంగా అనంతరం అది మతతత్వవ్యాప్తికి ఉపయోగపడింది.

గురుద్వారా సంస్కరణలు జరిగిపోయిన తరువాత అప్పటివరకూ మూడు రాజకీయస్రవంతులు కలగలిసి ఏర్పడిన అకాలీ ఉద్యమం ఇక ఒకే అకాలీపార్టీగా నిలదొక్కుకోవడం సాధ్యం కాలేదు. ఇది మూడుపాయలుగా విడిపోయింది. ఉద్యమ మతస్వభావం కారణంగానూ, ప్రజల ఒత్తిడిమేరకూ దానితో కలిసిన మితవాదులు, ప్రభుత్వానుకూల నాయకులు మళ్ళీ పాలకపక్షం పట్ల విధేయతను కనబరుస్తూ భాగస్వాములైనారు. మరో స్రవంతికి చెందిన జాతీయవాదులు వామపక్షంలోనూ, గాంధేయవాదంలోనూ చేరిపోయారు. ఇక మూడోస్రవంతి–అకాలీ ఉద్యమవారసత్వం సంపూర్ణంగా తమదే కానప్పటికీ, 'అకాలీ'పేరును అట్టిపెట్టుకుని, మారుమూల ప్రాంతాలవరకూ వ్యాపించిన దాని ప్రతిష్ఠను సద్వినియోగం చేసుకుని సిక్కుమత రాజకీయ ప్రతినిధిగా అవతరించింది. మతాన్నీ, రాజకీయాన్నీ కలగలుపుతూ, హిందువులకూ, ముస్లింలకూ దూరంగా రాజకీయాలను నడపడం ఆరంభించారు ఈ నాయకులు. 1947కు ముందు ఈ వర్గం అటు జాతీయతకూ, ఇటు బ్రిటిష్ విధేయతకూ మధ్య తరచూ ఊగిసలాడుతుండటం మనకు కనిపిస్తుంది.

* * *

భారతీయులు రాజకీయంగా ఏకమవుతున్న తరుణంలో సామాజిక సంస్కరణలకు సంబంధించిన అంశాలను చేపట్టడం మంచిదికాదన్న భావనతో 1917వరకూ జాతీయ కాంగ్రెస్ ఈ అంశాలజోలికి పోలేదు. 1917లో అది తన ధోరణి మార్చుకుని 'అణగారిన వర్గాలవారిమీద రుద్దిన అన్ని రకాల వివక్షలూ, అసమానతలూ అంతంచేయాల్సిన తరుణం ఆసన్నమైంద'ని తీర్మానించింది. లోకమాన్య

తిలక్ కూడా ఈ సందర్భంగా అస్పృశ్యతను వ్యతిరేకిస్తూ దానిని తొలగించాల్సిందిగా పిలుపునిచ్చారు. అయితే, ఈ దిశగా నాయకులు ఎటువంటి నిర్దిష్టమైన చర్యలూ తీసుకోలేదు. అయితే, గాంధీజీ అస్పృశ్యతానిర్మూలనకు అత్యధికప్రాధాన్యతనిచ్చారు. భారతస్వాతంత్ర్యోద్యమంకంటే ఇది తక్కువ ప్రాధాన్యతగల అంశమేమీ కాదన్నారు. అస్పృశ్యతను నిర్మూలించడానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని 1923లో కాంగ్రెస్ నిర్ణయించుకుంది. ఈ అంశానికి సంబంధించి కులహిందువుల్లో చైతన్యం కలిగించి, వారి సానుకూలతను సంపాదించడం ఒక మౌలికవిధానంగా చేపట్టింది. ఈ లక్ష్యసాధనలో దేశం ఎదుర్కొన్న సవాళ్ళను కేరళలో జరిగిన రెండు ప్రసిద్ధ ఉద్యమాలు మనకు స్పష్టంగా తెలియచెబుతాయి.

కేరళలో అంటరానితనం అధికంగా ఉండేది. సమాజంలో అట్టడుగున ఉన్న అవర్ణులు (కులం లేనివారు, తరువాతకాలంలో హరిజనులు) అత్యంత దుర్మార్గమైన, అమానవీయమైన కట్టుబాట్లకు గురైనారు. కేవలం అంటరానితనానికి మాత్రమే కాక, వారి నీడకూడా సోకకూడనంతగా వారు వెలివేతకు గురయ్యారు. అగ్రకుల హిందువులకు అట్టడుగు కులాలకు చెందిన 'యఝువ'లు 16 అడుగుల దూరంలోనూ, 'పులయ'లు 72 అడుగుల దూరంలోనూ ఉండాలి. ఈ రకమైన వివక్షకు వ్యతిరేకంగా 19వ శతాబ్దం చివర్లో ఉద్యమాలు ఆరంభమైనాయి. నారాయణగురు, ఎన్.కుమరన్ ఆసన్, టి.కె.మాధవన్ వంటి సంఘసంస్కర్తలు, మేధావులు వాటిని నిర్వహించారు.

కాకినాడ సమావేశం ముగిసిన వెంటనే కేరళ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అస్పృశ్యతానివారణను ఒక యుద్ధప్రాతిపదికన చేపట్టింది. అంటరానితనానికి వ్యతిరేకంగా ఒక భారీ ప్రచారాన్ని ఆరంభించడంతోపాటు ఈ కులాలవారిని విద్యావంతులను చేయడానికీ, వారిని సామాజికంగా పైకి తీసుకురావడానికి కార్యక్రమాలు ఆరంభించింది. దీనితోపాటుగా అవర్ణులు లేదా హరిజనుల ప్రవేశం కోసం హిందూదేవాలయాలనూ, రహదారులనూ తక్షణం తెరవాలని కూడా నిర్ణయించుకుంది. ఆలయాల్లో అవర్ణుల ప్రవేశాన్ని నిషేధించడమన్నది వారి అణచివేతకూ, తక్కువతనానికీ నిదర్శనం కాబట్టీ, అస్పృశ్యత అన్నది పూర్తిగా మతసంబంధమైన అంశం కాబట్టీ, హరిజనుల ఆలయప్రవేశం ద్వారా అస్పృశ్యతాభావనలను చావుదెబ్బతీయవచ్చునని కాంగ్రెస్ భావించింది.

ట్రవాన్‌కోర్‌లోని ఒక గ్రామమైన వైకోమ్‌లో దీనికి నాంది పలికారు. ఇక్కడ ఒక బ్రహ్మాండమైన ఆలయం ఉంది. దీనిచుట్టూ నాలుగువైపులా ఉన్న దారుల్లో యరఘవలు, పులయులు తిరుగాడడానికి వీల్లేదు. కొత్తగా ఆచరణలో పెట్టిన సత్యాగ్రహవిధానాన్ని ఉపయోగించుకుని అస్పృశ్యతకు వ్యతిరేకంగా కార్యక్రమం నిర్వహించాలని కెపిసిసి నిర్ణయించుకుంది. 1924 మార్చి 30వతేదీన అంటరానికులాలవారితో కూడుకున్న ఊరేగింపు ఒకటి సవర్ణుల (అగ్రకుల హిందువులు) ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఆలయానికి చెందిన దారులగుండా సాగింది.

ఈ సత్యాగ్రహ సంఘటన రాజకీయ,సామాజిక కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపి వారు సవర్ణుల్లో మనసాక్షిని తట్టిలేపి మద్దతు కూడగట్టడానికి ఉపకరించింది. సవర్ణులకు చెందిన అనేక సంఘాలు-నాయర్ సేవాసంఘం, నాయర్‌సమాజం, కేరళ హిందూ సభ వంటివి సత్యాగ్రహానికి మద్దతు ప్రకటించాయి. నంబూద్రి బ్రాహ్మణులకు చెందిన యోగక్షేమసభ ఆవర్ణుల ప్రవేశానికి దేవాలయాలను తెరవాలంటూ తీర్మానం చేసింది. ట్రవాంకోర్ ప్రభుత్వమూ, దేవాలయ అధికారులూ దేవాలయానికి దారితీసే మార్గాలన్నీ బారికేడ్లతో మూసివేస్తే, జిల్లా మేజిస్ట్రేట్ సత్యాగ్రహ నాయకులపై నిషేధాజ్ఞలు జారీచేశారు. మార్చి 30వతేదీన కె.పి.కేశవమీనన్ నాయకత్వంలో సవర్ణులతోనూ, ఆవర్ణులతోనూ కూడుకున్న సత్యాగ్రహులు కొందరు సత్యాగ్రహశిబిరంనుంచి ఆలయంవరకూ పాదయాత్ర చేశారు. వారినీ, వారిని అనుసరిస్తూ వచ్చిన మరికొన్ని సత్యాగ్రహబృందాలనూ పోలీసులు అరెస్టుచేసి జైళ్ళలో పెట్టారు.

వైకోమ్ సత్యాగ్రహం దేశవ్యాప్తంగా ఎంతో ఉత్సాహాన్ని రేకెత్తించింది. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడం ఆరంభించారు. పంజాబ్‌నుంచి అకాలీకార్యకర్తల బృందం ఒకటి అక్కడకు చేరుకుంది. మదురైనుంచి ఇ.వి.రామస్వామినాయకర్ (తరువాతి కాలంలో పెరియార్‌గా ప్రసిద్ధులు) నాయకత్వంలో ఒక బృందం తరలివచ్చింది. అధికారులు ఆయనను జైల్లోపెట్టారు. మరోవైపున, కులహిందువుల్లోని సాంప్రదాయవాదులూ, ప్రతికూలవర్గాలూ వైకోమ్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసుకుని సత్యాగ్రహానికి అనుకూలంగా ఉన్న కాంగ్రెస్‌వారిని

బహిష్కరించాలనీ, వారిని ఉపాధ్యాయులుగా కానీ, న్యాయవాదులుగా కానీ ఎవరూ నియమించుకోకూడదనీ, వారికి ఓటుకూడా వేయకూడదనీ నిర్ణయించుకున్నారు.

1924 ఆగస్టులో మహారాజా మరణం తరువాత మహారాణి అరెస్టయిన సత్యాగ్రహులనందరినీ విడుదల చేశారు. దీనితో ఉత్సాహపడిన సత్యాగ్రహులు కులహిందువులతో ఒక బృందాన్ని ఏర్పాటుచేసి దేవాలయదారుల్లో ప్రవేశానికి అందరికీ అనుమతివ్వమంటూ మహారాణికి విన్నవించాలని నిర్ణయించుకున్నారు. కేరళలోని వివిధ ప్రాంతాలకు చెందిన కులహిందువుల బృందాలు పెద్ద ఎత్తున వైకోమ్‌కు చేరుకున్నాయి. అక్టోబర్ 31న వందమందితో కూడుకున్న ఒక బృందం త్రివేండ్రమ్‌కు పాదయాత్ర ఆరంభించింది. దారిలో ఉన్న 200 గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వారికి ఘనస్వాగతం లభించింది. త్రివేండ్రమ్ చేరుకునేసరికి బృందంలోని వారి సంఖ్య వెయ్యికి పెరిగింది. అయితే, మహారాణి వారి డిమాండ్‌ను ఆమోదించకపోవడంతో సత్యాగ్రహం కొనసాగింది.

1925 మార్చిలో గాంధీ కేరళలో పర్యటించి మహారాణినీ, ఇతర అధికారులనూ కలుసుకున్నారు. ఇరుపక్షాలమధ్యా రాజీమార్గంగా ఒక ఒప్పందం కుదిరింది. దేవాలయం చుట్టుపక్కల ఉన్న దారుల్లో అవర్ణుల ప్రవేశానికి అనుమతి లభించింది. అయితే, లోపలిభాగంలో ఉన్న మార్గాల్లోకి మట్టుకు వారు ప్రవేశించడానికి వీల్లేదు. అవర్ణులకు ప్రవేశం లేని ఆలయాల్లో తానూ ప్రవేశించనంటూ తన కేరళ పర్యటనలో గాంధీ ఒక్క దేవాలయాన్ని కూడా సందర్శించలేదు. 1924 తరువాత గాంధీ అనుసరించిన నిర్మాణాత్మక కార్యక్రమంలో భాగంగా అస్పృశ్యతకు వ్యతిరేకంగానూ, అట్టడుగుకులస్థుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. కేరళలో ఈ పోరాటం మరోమారు బలంగా సాగింది.

1931లో శాసనోల్లంఘనోద్యమం ఉపసంహరించుకున్న తరుణంలో కె.కేలప్పన్ ప్రోత్సాహంతో కెపిసిసి ఆలయప్రవేశ అంశాన్ని చేపట్టింది. మలబార్ అంతటా

బహిరంగసభలు జరిగి ప్రచారం ఉధృతంగా సాగింది. 1931 నవంబరు 1న గురువాయూర్‌లో ఆలయప్రవేశ సత్యాగ్రహాన్ని నిర్వహించాలని కెపిసిసి నిర్ణయించుకుంది.

కేరళకు చెందిన ప్రసిద్ధ కవి సుబ్రమణియన్ తిరుమాంబు నాయకత్వంలో 16మంది కార్యకర్తలతో కూడిన బృందం ఒకటి గురువాయూర్‌కు ఉత్తరంగా ఉన్న కన్నోర్‌నుంచి అక్టోబర్ 21న పాదయాత్ర ఆరంభించింది. కార్యకర్తల్లో సామాజికంగా అట్టడుగుస్థాయి హరిజనుడినుంచి అత్యున్నతస్థాయి నంబూద్రి వరకూ అందరూ ఉన్నారు. ఈ పాదయాత్రకు దేశం యావత్తూ సానుకూలంగా స్పందించింది. 'నవంబరు 1' ని 'కేరళ ఆలయ ప్రవేశ దినం'గా ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్థనలు, ప్రదర్శనలు, సభలూ, సమావేశాలూ, నిధుల సేకరణ కార్యక్రమాలూ కేరళ అంతటా జరిగాయి. మద్రాస్, బోంబే, కలకత్తా, ఢిల్లీ, కొలంబో (శ్రీలంక) వంటి నగరాల్లో కూడా ఆ రోజును ప్రత్యేక దినంగా జరుపుకున్నారు. దేశంలోని వివిధప్రాంతాలనుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వివిధ ప్రాంతాలనుంచి డబ్బు పెద్దమొత్తంలో వచ్చిపడింది. అలాగే, అనేక చోట్లనుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో వచ్చిచేరారు. ముఖ్యంగా యువత ఎక్కువగా ఆకర్షితులై ముందడుగువేశారు. అస్పృశ్యతావ్యతిరేకోద్యమానికి ఎంతటి పేరుప్రఖ్యాతులు వచ్చాయంటే చాలామంది భక్తులు ఆలయంకంటే సత్యాగ్రహశిబిరం ఇంకా పవిత్రమైనదంటూ ఆలయానికి ఇవ్వదలుచుకున్న విరాళాలను సత్యాగ్రహ శిబిరానికి అందజేయడం ఆరంభించారు.

ఆలయ అధికారులు కూడా తమ ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు. ఆలయంచుట్టూ ఇనుపతీగెలతో కంచెను ఏర్పాటుచేశారు. గీతదాటితే వాత తప్పదంటూ సత్యాగ్రహులను హెచ్చరించడానికి అనేకమంది కాపలాదారులను అక్కడ నిలబెట్టారు. నవంబరు 1వతేదీన ఖద్దరు ధరించిన 16మంది కార్యకర్తలు ఆలయం తూర్పువైపున ఉన్న ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నారు. అయితే,వారి ప్రవేశాన్ని పోలీసు సూపరెంటెండెంట్ ఆధ్వర్యంలో కొందరు పోలీసులు అడ్డుకున్నారు. వెంటనే ఆలయ పనివారూ, స్థానికుల్లోని

అననుకూలశక్తులూ కట్టకట్టుకుని ఒక్కసారిగా సత్యాగ్రహులమీద లంఘించి శాంతియుతంగా, నిరాయుధంగా ఉన్న వారిమీద అత్యంతపాశవికంగా దాడికి పాల్పడ్డారు. ఒకపక్కన పోలీసులు నోరుమెదపకుండా చూస్తుండగా వారు కార్యకర్తలను గొడ్డును బాదినట్టు బాదారు. కేరళలో అనంతరకాలంలో కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్దదిక్కుగా ఉన్న పి.కృష్ణపిళ్ళై, ఎ.కె.గోపాలన్ ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. 1932 జనవరిలో శాసనోల్లంఘనోద్యమం పునరుద్ధరణకు నోచుకుని, తరువాత కాంగ్రెస్ కమిటీలన్నీ కూడా చట్టవిరుద్ధంగా ప్రకటించబడి, సత్యాగ్రహానికి నాయకత్వం వహిస్తున్న అనేకమంది కాంగ్రెస్ నాయకులు నిర్బంధానికి గురైన దశ అనంతరం కూడా ఈ సత్యాగ్రహం సాగుతూనే ఉంది.

1932 సెప్టెంబర్ 21న సత్యాగ్రహం కొత్త దశకు చేరుకుంది. ఆలయాన్ని అణగారినవర్గాలవారికోసం తెరిచేవరకూ తన ఆమరణదీక్ష కొనసాగుతుందని ప్రకటించి ఆలయం ముందు కె.కేలప్పన్ నిరశనవ్రతానికి సంకల్పించారు. దీంతో దేశం యావత్తూ అట్టుడుగిపోయింది. కేరళలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ మళ్ళీ సమావేశాలూ, నిరసనప్రదర్శనలూ ఆరంభమైనాయి. కేరళకూ, మిగతాభారతదేశానికీ చెందిన కులహిందువులు ఆలయంలో హిందువులందరికీ ప్రవేశం కల్పించాల్సిందిగా ఆలయం ధర్మకర్తగా ఉన్న కాలికట్ రాణివారి విన్నవించారు. అయినా ఫలితం లేకపోయింది.

తన నిరశనవ్రతాన్ని కనీసం తాత్కాలికంగానైనా విరమించుకోమని గాంధీజీ అనేకమార్లు కేలప్పన్‌కు విజ్ఞప్తిచేశారు. ఆలయాన్ని ఆవర్ణులకు తెరిచేవరకూ అవసరమైతే తాను స్వయంగా ఉద్యమం నిర్వహిస్తానని కూడా గాంధీజీ హామీ ఇచ్చారు.చివరకు కేలప్పన్ 1932 అక్టోబర్ 2న తన నిరశనవ్రతాన్ని విరమించారు. సత్యాగ్రహ ఉద్యమం కూడా నిలిచిపోయింది. అయితే, ఆలయప్రవేశ ఉద్యమం మాత్రం మరింత తీవ్రస్థాయిలో ముందుకు కొనసాగింది.

ఎ.కె. గోపాలన్ ఒక బృందానికి నాయకత్వం వహిస్తూ కేరళ అంతటా కాలినడక ఒక మహోధృతమైన ప్రచారం నిర్వహించారు. ప్రతిచోటా ఆయన భారీ ఎత్తున ఏర్పాటైన

సభలను ఉద్దేశించి ప్రసంగాలు చేశారు. ఆయన బృందం సుమారు వెయ్యిమైళ్ళు ప్రయాణించింది. ఆయన 500పైచిలుకు సభలను ఉద్దేశించి ప్రసంగించారు.

గురువాయూర్ ఆలయంలో అస్పృశ్యుల ప్రవేశం వెంటనే సాధ్యం కానప్పటికీ, విస్తృతస్థాయిలో సత్యాగ్రహ ఉద్యమం విజయం సాధించింది. ఎ.కె.గోపాలన్ తన ఆత్మకథలో ఈ పరిణామాలపై ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'గురువాయూర్ ఆలయం ఇంకా హరిజనులకోసం తలుపులు తెరవనప్పటికీ, దేశవ్యాప్తంగా ఒక సామాజిక మార్పుకు ఉద్యమం ఊపునిచ్చింది. ప్రతిచోటా ఏదో ఒక స్థాయిలో మార్పుకు అది దోహదం చేసింది'

తరువాతి సంవత్సరాల్లో కూడా అస్పృశ్యతకూ, ఆలయప్రవేశానికీ సంబంధించి ప్రజాదరణ కలిగిన ఉద్యమాలు అనేకం సాగాయి. 1936లో ట్రవాంకోర్ మహారాజు ప్రభుత్వ అధీనంలో ఉన్న అన్ని ఆలయాల్లోకి కులంతో నిమిత్తం లేకుండా హిందువులందరినీ అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 1938లో సి.రాజగోపాలచారి నాయకత్వంలోని మంత్రివర్గం మద్రాసులో ఇదే మార్గాన్ని అనుసరించింది. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇతర ప్రావిన్సుల్లో కూడా ఇదే రకమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

జాతీయోద్యమంలో భారతప్రజలు ఆవిష్కరించిన అన్ని పద్ధతులనూ ఆలయప్రవేశ ఉద్యమం పూర్తిగా ఉపయోగించుకుంది. ఈ ఉద్యమ నిర్వాహకులు సాధ్యమైనంత విస్తృతస్థాయిలో ఐక్యతసాధించడానికి ప్రయత్నాలు చేశారు. ఒకపక్కన పెద్ద ఎత్తున ప్రజలను విద్యాధికులనుచేస్తూ, మరోవైపున అస్పృశ్యతకు సంబంధించి ప్రజలను సంఘటితం చేయడంలో వారు విజయం సాధించారు. కులానికి సంబంధించిన అసమానతలూ, అణచివేతలూ, దాని విధానాలూ,భావనలూ ఎంతో బలమైనవీ, సామాజికంగా లోతుగా వేళ్ళూనుకున్నవీ అన్నమాట నిజం. అదొక సంక్లిష్టమైన వ్యవస్థ. ఆలయప్రవేశం ఒక్కటే దానిని పరిష్కరించలేదు. కానీ, వైకోమ్‌లోనూ, గురువాయూర్‌లోనూ జరిగిన సత్యాగ్రహాలూ, దాని చుట్టూ సాగిన ఉద్యమాలూ ఈ విషయంలో విస్తృతమైన ప్రభావాన్ని చూపించాయి. తరువాతకాలంలో ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ ఈ సంఘటనలపట్ల ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'గురువాయూర్

సత్యాగ్రహం నావంటి వేలాది మంది యువకులను అమితంగా ఆకర్షించిన, తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక అరుదైన ఉద్యమం. ఆత్మగౌరవంతో తమహక్కులకోసం పోరాడేందుకు జనాభాలోని అత్యధికశాతం ప్రజలకు అది ఒక స్ఫూర్తిని ప్రసాదించింది. ఈ ఉద్యమానికి ఎంతో ధైర్యస్థైర్యాలతో నాయకత్వం వహించిన యువతీయువకులే తరువాతి కాలంలో కార్మికకర్షక సంఘాలవ్యవస్థాపకులుగా, నాయకులుగా ఆవిర్భవించారు. వారు ఏర్పరిచిన ఈ సంఘాలు మతాతీత, కులాతీత భావనలతో వర్ధిల్లాయి'.

అలయప్రవేశ ఉద్యమంలోనూ, కులవివక్ష వ్యతిరేక ఉద్యమంలోనూ గాంధేయవాదం లేదా జాతీయతావాదం అనుసరించిన విధానంలో ఉన్న ప్రధానమైన బలహీనత ఏమిటంటే, అది అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేయడంలో విజయం సాధించినప్పటికీ, అస్పృశ్యతకు కారణమైన కులవ్యవస్థను అంతం చేయడానికి దానికి ఒక వ్యూహం అంటూ లేకపోయింది. ఈ విషయంలో జాతీయోద్యమం సాధించిన విజయం మనకు స్వతంత్ర భారతదేశ రాజ్యాంగంలో ప్రతిఫలిస్తున్నది. అస్పృశ్యతను అది రద్దుచేసింది. కులంతో నిమిత్తం లేకుండా ఈ దేశంలోని పౌరులందరూ సమానులేనంటూ ప్రకటించింది. ఇక, దాని వైఫల్యం మనకు 1947 అనంతర భారతదేశంలో పెరుగుతున్న కులతత్వంలోనూ, అట్టడుగువర్గాలపై ఇంకా సాగుతున్న అణచివేత, వెలివేత విధానాల్లోనూ కనిపిస్తూనే ఉంది.

* * *

# 19 స్తబ్ధత ఆవరించిన సంవత్సరాలు - స్వరాజ్యవాదులు, మార్పులు కోరని పక్షం, గాంధీజీ!

సహాయ నిరాకరణోద్యమాన్ని 1922 ఫిబ్రవరిలో ఉపసంహరించుకోవడం, మార్చిలో గాంధీజీ అరెస్టు, ప్రభుత్వ వ్యతిరేకతను రెచ్చగొడుతున్న నేరంపై ఆయనకు ఆరేళ్ళపాటు జైలుశిక్ష పడటం వంటి సంఘటనలు జాతీయతావాద శిబిరాల్లో తీవ్రనిరాశానిస్పృహలను మిగల్చాయి. దిగువస్థాయినుంచి ఎగువస్థాయివరకూ జాతీయతావాద శ్రేణులు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు తలెత్తాయి. నాయకుల మధ్యవిభేదాలు తలెత్తాయి. అనైక్యత మొదలైంది. ఉద్యమంలో స్తబ్ధత ఆవరించడం ఆరంభమైంది. గాంధీ అనుసరించిన వ్యూహాన్ని చాలామంది ప్రశ్నించడం ఆరంభించారు. కొంతమంది ఈ స్తబ్ధతనుంచి బైటపడే మార్గాలను అన్వేషించడం ప్రారంభించారు.

వలసపాలనను వ్యతిరేకించే స్ఫూర్తిని నిలబెట్టేందుకు మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్. దాస్ ఒక కొత్త రాజకీయ కార్యక్రమాన్ని ప్రతిపాదించారు. శాసనసభల బహిష్కరణకు స్వస్తిచెప్పి, వాటిలో అడుగుపెట్టి, అవి నామమాత్రపు సభలేననీ, 'అధికారయంత్రాంగపు ముసుగులు' మాత్రమేనని నిరూపించాలనీ, సభ నిర్వహించే ప్రతిపనికీ ఆటంకం కల్పించాలనీ జాతీయతావాదులు సూచించారు. ఇందువల్ల సహాయనిరాకరణను ఉపసంహరించుకున్నట్టుగా కాక దానిని ప్రభావవంతంగా చట్టసభలకు కూడా విస్తరించినట్టు అవుతుందని వారు వాదించారు.

1922 డిసెంబరులో గయసదస్సులో సి.ఆర్.దాస్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా, మోతీలాల్ నెహ్రూ కార్యదర్శిగా ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. వల్లభ్‌భాయి పటేల్, సి. రాజగోపాలచారి, రాజేంద్రప్రసాద్ నాయకత్వంలోని కాంగ్రెస్‌లోని మరోవర్గం ఈ

కొత్త ప్రతిపాదనను తిరస్కరించింది. ఒక నూతన రాజకీయ కార్యక్రమానికి సంబంధించిన ఈ ప్రతిపాదన 1748-890 ఓట్ల తేడాతో వీగిపోయింది. సి.ఆర్.దాస్, మోతీలాల్ కాంగ్రెస్‌లో తమ పదవులకు రాజీనామాలు చేసి, 1923 జనవరి 1వతేదీన కాంగ్రెస్-ఖిలాఫత్ స్వరాజ్‌పార్టీ (తరువాతి కాలంలో స్వరాజ్‌పార్టీగా పేరొందింది)ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కొత్తపార్టీకి దాస్ అధ్యక్షుడు. పార్టీ కార్యదర్శుల్లో మోతీలాల్ ఒకరు. శాసనసభల్లో ప్రవేశించాలని వాదిస్తున్నవారు 'మార్పులు కోరే పక్షం'గానూ, సభలను బహిష్కరించాలన్న నిర్ణయానికే కట్టుబడివున్నవారు 'మార్పులు కోరని పక్షం'గానూ పేరొందారు.

ఈ కొత్తపార్టీ శాసనసభల్లో పునఃప్రవేశానికి సంబంధించిన ఒక్క అంశం మినహా కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమం మొత్తాన్ని యథాతథంగా ఆమోదించింది. ఆ ఏడాది చివర్లో జరగబోయే ఎన్నికల్లో పాల్గొని తాము శాసనసభల్లో ప్రవేశించి దేశప్రజల విస్తృత డిమాండ్ అయిన స్వయం పాలనకు పట్టుబడతామనీ, దానిని నిరాకరించినపక్షంలో ఎన్నికైన పార్టీసభ్యులు 'శాసన సభల ద్వారా పరిపాలన అసాధ్యమనిపించే విధంగా ఒక నిర్మాణాత్మక కార్యచరణ ద్వారా దాని కార్యక్రమాలకు విఘాతం కలిగిస్తూపోతామని' స్వరాజ్‌పార్టీ ప్రకటించింది. ఆ విధంగా కౌన్సిళ్ళు తమ ముందుకు వచ్చిన ప్రతీ ప్రతిపాదనలోనూ కొరగాకుండా పోతాయని వారు వాదించారు.

1870లో జన్మించిన దేశబంధు చిత్తరంజన్‌దాస్, 1861లో జన్మించిన మోతీలాల్ నెహ్రూ- ఇద్దరూ ప్రసిద్ధన్యాయవాదులే. ఒకప్పుడు మితవాదులుగా ఉన్నవీరు 1920లో సహాయనిరాకరణ, బహిష్కరణల ప్రాతిపదికన సాగే రాజకీయమార్గాన్ని ఆమోదించారు. తమ న్యాయవాద వృత్తిని వదులుకుని, ఉద్యమానికే పూర్తిగా అంకితమైపోయి కలకత్తాలోనూ (దాస్), అలహాబాద్‌లోనూ (మోతీలాల్) ఉన్న తమ విశాలమైన భవంతులను కూడా దేశానికి విరాళంగా ఇచ్చివేశారు. గాంధీజీ అంటే అమితమైన ఆదరాభిమానాలున్న వీరు రాజకీయంగా ఆయనకు సమానులు. ఇద్దరూ కూడా ప్రతిభావంతమైన పార్లమెంటేరియన్లు. ఆలోచనలోనూ, ఆచరణలోనూ ఇద్దరిమధ్యా ఎన్నో తేడాలు ఉన్నప్పటికీ ఇద్దరూ పరస్పరం సహకరించుకుంటూ ముందుకుసాగారు. చక్కని ముందుచూపు, కాస్తంత ఉద్రేకస్వభావం ఉన్న దాస్ మంచివక్త. శత్రువులనూ, మిత్రులనూ కలుపుకుపోగలిగే శక్తిసామర్థ్యాలున్నవాడు. మోతీలాల్ నిక్కచ్చయిన మనిషి. నిబ్బరంగా ఆలోచించి, పరిస్థితిని విశ్లేషించగలిగే సత్తా ఉన్నవాడు. కార్యక్రమ నిర్మాణం,

నిర్వహణ, క్రమశిక్షణలకు ఆయన పెట్టిందిపేరు. వీరిద్దరి మధ్యా అవగాహన లేదా పరస్పర విశ్వాసం ఏ స్థాయిలో ఉండేదంటే, ఏదైనా ప్రకటనచేయాల్సివచ్చినప్పుడు ఒకరిపేరును మరొకరు (ముందుగా చెప్పుకోనక్కరలేకుండా) యధేచ్ఛగా వాడుకునేవారు.

'మార్పులుకోరనిపక్షా'నికి జైల్లో ఉన్నప్పటికీ గాంధీజీయే అసలుసిసలైన నాయకుడు. ఈ పక్షం సహాయనిరాకరణ, బహిష్కరణ విధానాల ఆధారంగా సాగే కార్యక్రమాన్ని కొనసాగించాలనీ, నిలిచిపోయిన శాసనోల్లంఘన కార్యక్రమాన్ని పునరుద్ధరించడానికి నిర్మాణాత్మక కృషి జరగాలనీ వాదిస్తూ వచ్చింది.

మార్పులు కోరుతున్నపక్షానికీ, కోరనిపక్షానికీ మధ్య త్వరలోనే ప్రచండమైన రాజకీయ వివాదం ఆరంభమైంది. అయితే, ఈ రెండుపక్షాల మధ్యా ఉమ్మడి భూమిక ఒకటి ఉంది. ఇద్దరూ కూడా శాసనోల్లంఘనోద్యమం వెంటనే సాధ్యమయ్యే వ్యవహారం కాదనీ, ప్రస్తుత తరుణంలో ప్రజా ఉద్యమాన్ని దీర్ఘకాలం పటిష్టంగా కొనసాగించడం చాలాకష్టమైన విషయమనీ అంగీకరించారు. అటువంటి భారీ ఉద్యమ కార్యక్రమాన్ని ఆరంభించడానికి ముందు ప్రజలకు కాళ్ళూచేతులూ కూడదీసుకునే అవకాశం తప్పక ఉండాలని భావించారు. కాస్తంత విశ్రాంతి కల్పించడంతోపాటుగా, మరోపక్కన, ప్రజల్లో ఆవరించి ఉన్న నిరాశానిస్పృహలను దూరం చేయడం, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల్లో మళ్ళీ సమధికోత్సాహాన్ని నింపడం, రాజకీయచైతన్యాన్ని రగల్చడం, ప్రజలను విస్తృతస్థాయిలో కూడగట్టడం, సంస్థను బలోపేతం చేయడం, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని రగల్చడం అత్యంత అవసరమని కూడా వారు అంగీకరించారు. అయితే, జనసామాన్యంతో ముడివడిన ప్రతి ఉద్యమమూ ఎదుర్కొన్న ఒక మౌలికమైన ప్రశ్ననే జాతీయోద్యమం కూడా ఎదుర్కొంది. ఉద్యమం చైతన్యవంతంగా లేని దశల్లో రాజకీయకార్యాచరణ ఏ రూపంలో ఉండాలన్నదే ఆ ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానాన్ని వెదగడంలోనే ఇరుపక్షాలూ విభేదించాయి. శాసనసభల్లో అడుగుపెట్టడం ద్వారా ఈ రాజకీయశూన్యాన్ని పూడ్చవచ్చునని స్వరాజ్యవాదులు వాదించారు. ఈ విధంగా చేయడం ద్వారా రాజకీయంగా చైతన్యవంతులైన భారతీయుల్లో ఆత్మవిశ్వాసాన్ని రగల్చవచ్చుననీ, పత్రికలద్వారా వారిలో ఉత్సాహాన్ని కలిగించవచ్చుననీ, శాసనసభల ఎన్నికల ప్రచారమూ, ఆ తరువాత సభల్లో చేసే ప్రసంగాలూ రాజకీయ ఉద్యమానికీ, ప్రచారానికీ కూడా ఎంతో వీలుకల్పిస్తాయని వారు వాదించారు. ఒకవేళ ఈ విధంగాకాక, కాంగ్రెస్‌వారు ఎన్నికల్లో పాల్గొనకపోయినా చట్టసభలకు వచ్చిపడే నష్టమేమీ లేదనీ, అవి హాయిగా పనిచేస్తాయనీ,

దీనికితోడుగా ఎన్నికల్లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ఓటుచేసే అవకాశాలు కూడా బాగా కనిపిస్తున్నాయనీ, అటువంటప్పుడు కాంగ్రెస్ మరింత బలహీనపడిపోయే అవకాశాలున్నాయని వారు హెచ్చరించారు. అంతేకాదు, కాంగ్రెసేతరులు ఈ ఎన్నికల్లో పాల్గొని అనంతరం తమ అధికారాన్ని కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఉపయోగించే ప్రమాదం కూడా ఉందని వారు హెచ్చరించారు. ఒక మహోన్నత ఉద్యమాన్ని కొనసాగిస్తున్నప్పుడు ప్రత్యర్థికి ఇటువంటి అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఏముంది? ఎన్నికల్లో పాల్గొని, శాసనసభలో అడుగుపెట్టడం ద్వారా కొన్ని అవాంఛనీయమైన శక్తులను ముందుగానే అడ్డుకోవచ్చు, దానితోపాటుగా, ఏవో చట్టాలు చేయడం ద్వారా గౌరవప్రతిష్ఠలు కూడగట్టుకునే ప్రభుత్వ ప్రయత్నాలకు కూడా గండికొట్టవచ్చునన్నది వారి వాదన.

మరోవిధంగా చెప్పాలంటే, స్వరాజ్యవాదులు తాము చట్టసభలను రాజకీయ పోరాటానికి కేంద్రాలుగా మారుస్తామనీ, దానర్థం తాము వాటిని వలసరాజ్యంలో మార్పులను సాధించుకోవడం కోసం వేదికలుగా వినియోగించుకోవడం కాదనీ, వాటిని వలసరాజ్యాన్ని కూలదోయడానికి రంగస్థలాలుగా మార్చడమేనని చెబుతున్నారు.

మార్పులు కోరని పక్షం ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా ఖండించింది. ఎప్పుడైతే కార్యాచరణ అంతా చట్టసభల్లోకి పోయిందో అప్పుడు ప్రజాసమూహాలతో సంబంధం తెగిపోతుందనీ, ప్రజల్లో అమలుచేయాల్సిన నిర్మాణాత్మక కార్యక్రమాలు అడుగంటిపోయి క్రమంగా వారిలో వలసపాలనకు వ్యతిరేకంగా ఉద్యమించే ఆవేశం అణగారిపోతుందని వారు హెచ్చరించారు. శాసనసభా రాజకీయాలు జాతీయావేశాన్ని చల్లార్చడమే కాదు, నాయకుల మధ్య విభేదాలకూ, రాజకీయ అవినీతికీ కూడా చోటు కల్పిస్తాయని వారు వాదించారు. ప్రభుత్వంతో ఘర్షణకు దిగుతామంటూ చొక్కాలుమడిచి లోపలకు అడుగుపెట్టినవారు ప్రభుత్వానికి అడ్డంకులు సృష్టించే కార్యక్రమాన్ని క్రమేపీ వదులుకుని, అనంతరం సామ్రాజ్యవాదుల రాజ్యాంగపరిమితులకు లోబడిపోయి, చివరకు నామమాత్రపు సంస్కరణలకూ, వారు అప్పుడప్పుడు విదల్చే రాయితీలకూ లొంగిపోవాల్సివస్తుందని వారు హెచ్చరించారు. ఇందుకు భిన్నంగా, జనసామాన్యంలో ఒక నిర్మాణాత్మక కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు వారిని మలిదశ శాసనోల్లంఘనోద్యమానికి సంసిద్ధులుగా మార్చవచ్చునని వారు వాదించారు.

మార్పులు కోరేపక్షానికీ, మార్పులు కోరని పక్షానికీ మధ్య ఈ విధంగా రాజకీయ విభేదాలు పెరిగిపోవడం జాతీయతావాద కార్యకర్తల్లో భయాందోళనలను కలిగించింది.

1907లో సంభవించినట్టుగానే మరోమారు పెద్ద ఎత్తున చీలిక ఏర్పడుతుందేమోనని వారు భయపడ్డారు. బహిరంగ వ్యాఖ్యలూ, విమర్శల విషయంలో కాస్త ఆచితూచి వ్యవహరించాల్సింది గానూ, ఈ ఘర్షణాత్మకమైన వైఖరికి స్వస్తిచెప్పాల్సిందిగానూ దిగువ స్థాయి నుంచి నాయకులమీద ఒత్తిళ్ళు ప్రారంభమైనాయి.

దీంతో, ఇరుపక్షాలనాయకులూ నెమ్మదిగా వెనక్కుతగ్గడం ఆరంభించారు. సర్దుబాటు వైఖరిని కనబరచడం మొదలైంది. ఈ మార్పుకు అనేక కారణాలు దోహదం చేశాయి. ఒకటి, తమలో తాము కలహించుకోకుండా సంఘటితంగా ఉండాల్సిన అవసరాన్ని కాంగ్రెస్‌వారందరూ గుర్తించారు. రెండు, మార్పులు కోరనిపక్షమే కాదు, స్వరాజ్యవాదులు కూడా చట్టసభల్లో కార్యాచరణకు సంబంధించిన పరిమితులను అర్థం చేసుకున్నారు. ఈ కార్యక్రమం బాగా ఉపకరించేదే అయినప్పటికీ, ప్రజల డిమాండ్లకు ప్రభుత్వం లొంగివచ్చేట్టు చేయగలిగేది విస్తృతమైన ప్రజా ఉద్యమమే కాబట్టి ఈ రెండూ సంఘటితంగా సాగాల్సిన అవసరాన్ని వారు గుర్తించారు. చివరగా, ఇరుపక్షాలూకూడా గాంధీజీ నాయకత్వపు అవసరాన్ని సంపూర్ణంగా అంగీకరించాయి.

తత్ఫలితంగా, 1923 సెప్టెంబరులో ఢిల్లీలో జరిగిన సమావేశంలో, చట్టసభల్లో పునఃప్రవేశానికి వ్యతిరేకంగా సాగుతున్న తన ప్రచారాన్ని నిలిపివేయడానికి కాంగ్రెస్ నిర్ణయించుకుంది. దానితోపాటు, కాంగ్రెస్‌వారు ఎన్నికల్లో పోటీచేయడానికీ, ఓటు చేయడానికీ కూడా అనుమతినిచ్చింది.

* * *

అనారోగ్యం కారణంగా గాంధీజీ 1924 ఫిబ్రవరి 5వతేదీన జైలునుంచి విడుదలయ్యారు. శాసనసభల్లో ప్రవేశించాలనీ, పనికి ఆటంకాలు కల్పించాలన్న ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. ఇది అహింసాయుతమైన సహాయనిరాకరణోద్యమానికి ఏమాత్రం పొసగని కార్యక్రమమని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో కాంగ్రెస్ చీలిపోయే అవకాశాలు మరోమారు స్పష్టంగా కనిపించాయి. ప్రభుత్వం ఈ చీలికమీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు కూడా చేసింది. మహాత్ముడిని విడుదల చేస్తూ బోంబే ప్రభుత్వం ఒక సూచన చేస్తూ ఆయన 'సహాయనిరాకరణ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తున్న స్వరాజ్య వాదులను దునుమాడి, తద్వారా చట్టసభలకు చేటుచెయ్యాలనే సంకల్పంతో ఉన్న వారి బలాన్ని తగ్గించి వేయగలర'నే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. అదేవిధంగా, 1924 జూన్ 6న భారత రాజ్య కార్యదర్శిని ఉద్దేశించి రాసిన ఒక లేఖలో

వైస్రాయ్ ఈ విధంగా వ్యాఖ్యానించాడు. '.... స్వరాజ్యవాదులకూ, గాంధీకీ మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. ఇద్దరూ చీలిపోయే అవకాశాలు క్రమంగా బలపడుతున్నాయి..... కాంగ్రెస్‌మీద గాంధీజీ ఆధిపత్యాన్ని బద్దలుకొట్టడమే లక్ష్యంగా స్వరాజ్యవాదులు కృషిచేయాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఇప్పుడు ఏర్పడ్డాయంటూ మూంజే (మధ్యప్రావిన్సులకు చెందిన స్వరాజ్యవాదుల నాయకుడు) వ్యాఖ్యానించాడు.'

కానీ, ఇటువంటి ప్రయత్నాలకు గాంధీజీ లొంగలేదు. స్వరాజ్యవాదులతో ఆయన ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించడం ఆరంభించారు. ఈ దశలో ఆయన స్వరాజ్యవాదులతో వ్యవహరించిన విధానం ఆయన రాజకీయవ్యవహారశైలికి అద్దం పడుతుంది. సైద్ధాంతికంగా విభేదించినప్పటికీ తోటివారిని అంచనావేయడంలోనూ, కలిసికట్టుగా పనిచేయడంలో ఆయనది అందెవేసిన చేయి. అందువల్ల ఈ సందర్భంగా మనం దాని గురించి కూడా ఓ మూడుముక్కలు చెప్పుకోవాలి.

స్వరాజ్యవాదుల విధానంతో విభేదించినప్పటికీ వారి సౌశీల్యంపట్ల గాంధీకి సంపూర్ణమైన విశ్వాసం ఉంది. 'అత్యంత విశ్వసనీయమైన, ఉత్తమోత్తములైన నాయకులు'గా ఆయన వారిని అభివర్ణించాడు. 'దేశంకోసం సర్వమూ త్యాగం చేసి, మాతృభూమికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించాలన్న మహోన్నతమైన లక్ష్యసాధనకోసం ఎటువంటి ఒత్తిళ్లకూ లొంగకుండా కృషిచేస్తున్న' ఉన్నతులుగా వారిని విశ్లేషించాడాయన. అంతేకాదు, ఆయనా, దేశ్‌బంధు దాస్, మోతీలాల్ నెహ్రూలు పరస్పర గౌరవాభిమానాలతో వ్యక్తిగత సంబంధాలు కొనసాగిస్తూనే ఉన్నారు. గాంధీజీ జైలునుంచి విడుదలైన వెంటనే, స్వరాజ్యవాదులతో చర్చించేంతవరకూ చట్టసభల్లో పునఃప్రవేశానికి సంబంధించిన అంశంపై వ్యాఖ్యానించడానికి కూడా నిరాకరించారు. అంతేకాదు, వారితో సమావేశమైన తరువాత కూడా, స్వరాజ్యవాదుల కార్యక్రమం ప్రమాదకరమైనదన్న అభిప్రాయం ఆయనలో ఇంకా బలంగా ఉన్నప్పటికీ కూడా, అప్పటికే ఒక నిర్ణయం జరిగిపోయిన ఈ అంశంపై బహిరంగవ్యాఖ్యలు చేయడం సబబు కాదన్న అభిప్రాయమే ఆయనకు ఉండేది.

సభల్లో స్వరాజ్యవాదులు ఎంతో నిర్భయంగా, ఏమాత్రం రాజీలేకుండా వ్యవహరిస్తుండటంతో రాజకీయంగా వారి విధానం సక్రమమైనది కాకపోయినా, వారు సామ్రాజ్యవాదపాలకుల యంత్రాంగంలో ఒక భాగంగా మారిపోయే ప్రమాదం ఏమీలేదన్న విశ్వాసం ఆయనకు కలిగింది. అందుకే ఆయన వారి గురించి ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావంతో, ఏమాత్రం రాజీలేని వైఖరితో వారు తమ విధానాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. భారతచట్టసభల్లో వారు ఒక కొత్త స్ఫూర్తిని ప్రవేశపెట్టారు'.

మార్పులు కోరే పక్షానికీ, కోరని పక్షానికీ మధ్య విమర్శలు చుక్కలనంటడం గాంధీజీని బాధించింది. పరస్పరం బురదజల్లుకునే ఈ పరిస్థితిని సాధ్యమైనంత వేగంగా చక్కదిద్దాలని ఆయన అనుకున్నారు. శాసనసభల్లో ప్రవేశం ఎలాగూ జరిగిపోయింది కనుక ఇప్పుడు ఆ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవడం చాలా ప్రమాదమని ఆయన భావించారు. అటువంటి నిర్ణయాన్ని అటు ప్రభుత్వమూ, ఇటు ప్రజలూ కూడా 'బలహీనత'కు నిదర్శనంగా భావించే అవకాశాలున్నాయనీ, ప్రభుత్వం తన అణచివేతను మరింత తీవ్రతరం చేయడానికీ, ప్రజలు మరింత నైరాశ్యంలో మునిగిపోవడానికీ ఇది దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తీవ్రవాదులను అణచివేసే పేరుతో ప్రభుత్వం పౌరహక్కులపైనా, స్వరాజ్యవాదులపైనా విరుచుకుపడటంతో పరిస్థితి తీవ్రంగా మారిపోయింది. 1924 అక్టోబర్ 25న ప్రభుత్వం ఒక ఆర్డినెన్సు తీసుకువచ్చి కాంగ్రెస్ కార్యాలయాలనూ, నాయకుల ఇళ్ళనూ గాలించడం ఆరంభించింది. తీవ్రవాద భావాలున్న నాయకులనూ, స్వరాజ్యవాదులనూ, కాంగ్రెస్ నాయకులనూ పెద్ద సంఖ్యలో అరెస్టులు చేసింది. సుభాష్ చంద్రబోస్, బెంగాల్ శాసనసభ సభ్యులైన అనిల్ బరాన్‌రే, ఎస్.సి.మిత్రా వంటివారు ఈ విధంగా అరెస్టయినవారిలో ఉన్నారు.

జాతీయోద్యమంపై ప్రత్యక్షదాడి ఆరంభమైందని గమనించిన గాంధీజీ ఈ సంఘటనలపై ఎంతో ఆగ్రహంగా స్పందించారు. అక్టోబర్ 31న 'యంగ్ ఇండియా'లో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'రౌలత్‌చట్టం మరణించి ఉండవచ్చునేమో కానీ అది రగల్చిన దుర్మార్గం మట్టుకు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇంగ్లీషువారి ప్రయోజనాలు భారతీయుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నంతకాలం హింసకొనసాగుతూనే ఉంటుంది, రౌలత్ పునరావృతం అవుతూనే ఉంటుంది'.

కష్టకాలంలో స్వరాజ్యవాదులకు అండగా ఉండడమే స్వరాజ్యవాదులపై ప్రభుత్వ విరుగుబాటుకు తగిన జవాబని ఆయన నిర్ణయించుకున్నారు.' ఈ సమయంలో స్వరాజ్యవాదులకు తోడునీడగా ఉండకపోతే నేను దేశానికి ద్రోహం చేసినవాడినవుతాను... శాసనసభల్లో ప్రవేశానికి సంబంధించిన విషయంలోకానీ, 'సభాపోరాటా'నికి వారు ఎంచుకున్న కొన్ని విధానాల విషయంలో కానీ నాకు విశ్వాసం లేకపోయినప్పటికీ ఈ విధంగా నిలవకతప్పదు' అని ఆయన యంగ్ ఇండియాలో వ్యాఖ్యానించారు. అంతేకాదు, 'మార్పులుకోరనిపక్షంగా నేను ఏమాత్రం రాజీలేని వైఖరితో ఉన్నప్పటికీ, వారి

(స్వరాజ్యవాదుల) తీరుతెన్నులను సహించడంతోపాటు వారితో కలసి పనిచేయడం, సాధ్యమైనంతమేర వారిని బలపరచడం ఇప్పుడు అవసరం’ అని ఆయన వ్యాఖ్యానించారు.

1924 నవంబరు 6న స్వరాజ్యవాదులకూ, మార్పులుకోరనిపక్షానికీ మధ్య గాంధీజీ ఒక రాజీ కుదర్చారు. దాస్,మోతీలాల్‌తో ఒక సంయుక్తప్రకటనపై సంతకాలు చేయడం ద్వారా స్వరాజ్యవాదుల పార్టీ శాసనసభల్లో కాంగ్రెస్ తరఫున, కాంగ్రెస్ అంతర్భాగంగా వ్యవహరించడానికి ఒప్పందం కుదిరింది. గాంధీజీ అధ్యక్షతన జరిగిన బెల్గామ్ కాంగ్రెస్ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. వర్కింగ్ కమిటీలో స్వరాజ్యవాదులకు ఎక్కువస్థానాలు లభించాయి.

* * *

1923 నవంబరులో శాసనమండళ్ళకు ఎన్నికలు జరిగాయి. అక్టోబర్ 14న విడుదలచేసిన ఎన్నికలపత్రంలో స్వరాజ్యపార్టీ సామ్రాజ్యవాదవ్యతిరేకతను తీవ్రస్థాయిలో వ్యక్తంచేసింది. ‘బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పరిపాలించడానికి ప్రధానకారణం తమ దేశ ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికే. భారతదేశానికి బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని అందిస్తా మంటూ వీరు చేపట్టిన సంస్కరణలు వారి ప్రయోజనాలను మరింతగా పరిరక్షిస్తాయే తప్ప మరొకటి కాదు. భారతదేశ ప్రజలను శాశ్వతంగా బ్రిటన్‌కు బానిసలుగా కట్టిపడేసే లక్ష్యంతోనూ, ఇక్కడివనరులను యధేచ్ఛగా దోచుకోవడానికీ వారు ఇటువంటి కల్లబొల్లిమాటలు చెబుతున్నారు’ అంటూ ఎన్నికల ప్రణాళికాపత్రం లో స్వరాజ్యవాదులు నిప్పులు కక్కారు. స్వరాజ్యవాదులు సభల్లో తిష్ఠవేసి ఈ కల్లబొల్లి సంస్కరణలను దునుమాడతారని పత్రం హామీ ఇచ్చింది.

ఎన్నికలకు కొద్దివారాలు మాత్రమే ఉన్నప్పటికీ, ఓటింగ్ చాలా తక్కువగా – (ఓటు హక్కు ఉన్నవారిలో మూడుశాతంకంటే తక్కువగా అంటే 62లక్షలమంది మాత్రమే ఓట్లువేశారు) ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో స్వరాజ్యవాదులు గణనీయమైన విజయాలు సాధించారు. కేంద్రశాసనసభలో స్వరాజ్యపార్టీ 101 స్థానాల్లో 42స్థానాలను గెలుచుకుంది. సెంట్రల్ ప్రావిన్సుల్లో స్పష్టమైన ఆధిక్యతను సాధించింది. బెంగాల్‌లో అతిపెద్ద పార్టీగా అవతరించింది. మద్రాసులో, పంజాబ్‌లో కుల,మత ప్రభావాలకారణంగా కాస్త వెనుకబడినప్పటికీ, బోంబేలోనూ, ఉత్తరప్రదేశ్ లోనూ ఘనమైన విజయాలు సాధించింది.

ఎం.ఎ. జిన్నా నాయకత్వంలో స్వతంత్రులతోనూ, ఉదారవాదులతోనూ, మదన్‌మోహన్ మాలవీయ వంటివారితోనూ జతకలిసి కేంద్రశాసనసభలో ఒక సంకీర్ణాన్ని

ఏర్పాటు చేసుకోగలిగింది. చాలా ప్రావిన్సుల్లో కూడా స్వరాజ్యవాదులు ఇటువంటి సంకీర్ణాలను సాధించగలిగారు. ప్రభుత్వం చట్టసభల్లో వరుసగా పరాజయాలను చవిచూడాల్సి రావడం ఆరంభమైంది.

1919 నాటి సంస్కరణలకు నోచుకున్న ఈ చట్టసభలు నామమాత్రపు అధికారకేంద్రాలే తప్ప వాటికి వాస్తవిక అధికారాలు లేవు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ, అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల్లోనూ కూడా కార్యనిర్వాహకవర్గం చట్టసభల అజమాయిషిలో లేదు. అది నేరుగా బ్రిటిష్ ప్రభుత్వానికే కట్టుబడి ఉంటుంది. అంతేకాదు, బడ్జెట్ కేటాయింపులతో సహా శాసనసభ తిరస్కరించిన ఏ ప్రతిపాదననైనా వైస్రాయ్ లేదా గవర్నర్ ఆమోదించవచ్చును. అలాగే సభ చేసిన ప్రతిపాదనలను వారు ఏకారణం చేతనైనా తిరస్కరించవచ్చును. ఇక, స్వరాజ్యవాదులు అటు కేంద్రసభలోనూ, ఇటు రాష్ట్రసభల్లోనూ కూడా సమరోత్సాహంతో వ్యవహరిస్తూ ప్రభుత్వమే సంతకాలు పెట్టుకుంటూ పోయి చట్టాలు చేసుకోవాల్సిన పరిస్థితులను కల్పించారు. ఆ విధంగా వారు బ్రిటిష్‌పాలకులు చట్టసభలకు చేపట్టిన సంస్కరణల నిజస్వరూపాన్ని బట్టబయలు చేయగలిగారు. 1925 మార్చిలో ప్రముఖ స్వరాజ్యనాయకుడు విఠల్‌భాయి పటేల్‌ను కేంద్రశాసనసభకు సభాపతిగా ఎన్నుకోవడంలో స్వరాజ్యవాదులు విజయం సాధించారు.

సభలు చేపట్టే ప్రతిపనిలోనూ జోక్యంచేసుకుంటూ, తమ వాదన వినిపిస్తూ, ప్రభుత్వ ఆలోచనను ఎండగడుతూ, సదరు ప్రతిపాదనలను తిరస్కరిస్తూ ముందుకు సాగుతున్న స్వరాజ్యవాదులు ప్రధానంగా మూడురకాల అంశాలపై తమ ప్రచండమైన ఉపన్యాసాల ద్వారా దేశం దృష్టిని ఆకర్షించగలిగారు. వారు సభల్లో చేసిన ప్రసంగాలు పత్రికల్లో పూర్తిగా వస్తుండటమూ, ప్రతిపాఠకుడూ కూడా ఉదయానే వాటిని చదివి ఉత్తేజితుడు కావడమూ జరుగుతుండేది. స్వపరిపాలనకు సంబంధించి రాజ్యాంగంలో సరైనమార్పులు కోరుతుండటమూ, పౌరహక్కులను డిమాండ్ చేస్తూ రాజకీయఖైదీలను విడుదలచేయాలనీ, అణచివేతకు ఉద్దేశించిన చట్టాలను తిరగదోడాలని వాదించడం, దేశీయపరిశ్రమలను అభివృద్ధిచేయాలని ఉద్ఘాటించడం వారు పనిగా పెట్టుకున్నారు.

తొట్టతొలి సమావేశంలోనే మోతీలాల్ నెహ్రూ భారతీయప్రజల మనోభావాన్ని స్పష్టంగా తెలియచెబుతూ భారతదేశానికి వాస్తవాధికారాలు కల్పించే కొత్త రాజ్యాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ 64–48 ఓట్లతో నెగ్గింది. 1925 సెప్టెంబర్‌లో మళ్లీ

ఇదే డిమాండ్‌ను స్వరాజ్యవాదులు పునరుద్ధాటించినప్పుడు ఈ తీర్మానం 72–45 ఓట్లతో నెగ్గింది. వివిధ పద్దులకింద బడ్జెట్ కేటాయింపులను ప్రభుత్వం కోరినప్పుడల్లా వీరు వాటిని తిరస్కరిస్తుండటమూ, ప్రభుత్వం అవమానపడుతుండటమూ జరిగేది. ఇటువంటి ఒక సందర్భంలోనే విఠల్‌భాయి పటేల్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పారు. 'మీ వీటో అధికారంతో కానీ, మీరే ఆమోదముద్రలు వేసుకుని కానీ పరిపాలనసాగించాలన్నది మా అభిమతం. మాకు కావల్సిందల్లా 'భారత ప్రభుత్వ చట్టం' కేవలం ఒక చెత్తకాగితమని మీ చేతలతో మీరే నిరూపించడం. అది జరుగుతుందని కూడా నాకు నమ్మకం ఉంది'

అదేవిధంగా, అణచివేతకు ఉద్దేశించిన చట్టాలు, నియంత్రణల విషయంలోనూ, రాజకీయఖైదీల విడుదల విషయంలోనూ ప్రభుత్వం అనేకపర్యాయాలు ఓటమిపాలయ్యింది. విప్లవ ఉగ్రవాదులపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక అధికారిక విమర్శకు సమాధానంగా సి. ఎస్. అయ్యంగార్ తీవ్రమైన విమర్శలు చేశారు. స్వయంగా ప్రభుత్వ అధికారులే నేరస్తులనీ, స్వాతంత్ర్యప్రియుల హక్కులను హత్యచేస్తున్న వారే నిందితులనీ ఆయన వ్యాఖ్యానించారు. 'విప్లవాలూ, విప్లవోద్యమాలూ అత్యంత సహజమైన ప్రక్రియలు. ఇవి లేనిదే ప్రపంచంలో అభివృద్ధి అంటూ ఉండదు' అన్నారు లాలా లజ్‌పతి రాయ్. ప్రభుత్వ దమనకాండపై సి. ఆర్.దాస్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. బెంగాల్ ప్రాంతీయ సమావేశంలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'నిరంకుశ అధికారాన్ని సుస్థిరపరచుకోవడానికి అణచివేత అన్నది ఒక ఆయుధం. రాజకీయస్వేచ్ఛ సాధించడానికి హింస ఒక మార్గమన్న వాదనను నేను ఏ విధంగా ఖండిస్తానో, అదే విధంగా అణచివేతలో భాగంగా ప్రభుత్వం జరిపే హింస–హింసల్లో కెల్లా పెద్ద హింస–గా నేను ఖండిస్తున్నాను'.

చట్టసభల్లో స్వరాజ్యవాదుల కార్యక్రమం ఏ విధంగా చూసినా అద్భుతమైనదే. రాజకీయంగా చైతన్యవంతులైనవారిలో ఆ చైతన్యం నిలిచివుండేట్లు చేయడంలోనూ, వారిని ఉత్తేజితులను చేయడంలోనూ స్వరాజ్యవాదుల సభాకార్యకలాపాలు విజయవంతమైనాయి. అతిశక్తివంతమైన విదేశీ ఉద్యోగిస్వామ్యం శాసనమండళ్ళలో మనవారి చేతుల్లో మొట్టికాయలు తింటున్నప్పుడల్లా ప్రజలు ఆనందాతిశయాలతో ఊగిపోయేవారు.

1923–24 మధ్య కాంగ్రెస్‌వారు మునిసిపాలిటీలనూ, ఇతర స్థానిక సంస్థలనూ కైవసం చేసుకున్నారు.దాస్ కలకత్తా మేయర్ అయ్యారు (సుభాష్ చంద్రబోస్ ఆయన

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్), విఠల్‌భాయి పటేల్ బోంబే కార్పొరేషన్‌కూ, వల్లభ్‌భాయి పటేల్ అహ్మదాబాద్ మునిసిపాలిటీకీ, రాజేంద్రప్రసాద్ పాట్నా మునిసిపాలిటీకీ, జవాహర్‌లాల్ నెహ్రూ అలహాబాద్ మునిసిపాలిటీకీ అధ్యక్షులైనారు. నిర్మాణాత్మకమైన కార్యక్రమాన్ని చేపట్టడానికి స్థానిక సంస్థలు ఎంతో ఉపకరిస్తాయన్న ఉద్దేశంతో మార్పులు కోరనిపక్షానికి చెందినవారంతా ఈ అధికారాలను ఉత్సాహంగా స్వీకరించారు.

అధికారాలకు సంబంధించి అనేక పరిమితులు ఉన్నప్పటికీ కూడా ఇటువంటి నాయకుల ఆధ్వర్యంలో చాలా మునిసిపాలిటీలూ, జిల్లా బోర్డులు ప్రశంసనీయమైన అభివృద్ధిని సాధించగలిగాయి. ప్రజల బతుకుల్లో ఎంతోకొంత వెలుగువచ్చింది. విద్య, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, అస్పృశ్యతానివారణ, ఖాదీ ప్రోత్సాహం వంటిరంగాల్లో ఈ నాయకులు చక్కని పనితనం కనబరిచారు.

1925 జూన్ 16న సి. ఆర్.దాస్ మరణం స్వరాజ్యవాదులకు తీరనిలోటు. ఆయన మరణం వారికి పెద్దదెబ్బ. దానికితోడుగా కొన్ని రాజకీయపరిణామాలు వారిని మరింత దెబ్బతీశాయి. ప్రజా ఉద్యమం లేని కారణంగా మతతత్వం బాగా పెరిగిపోయి ప్రజల్లో ఉన్న నిరాశానిస్పృహలు మతఘర్షణల రూపంలో వ్యక్తమైనాయి. వలసపాలకులు ఎంతో ఉత్సాహంగా ఆజ్యం పోస్తుండగా, మతవాదులు తమ కార్యకలాపాలను అమితోత్సాహంగా విస్తరించుకోవడం ఆరంభించారు.

పార్లమెంటరీ రాజకీయాల్లో తలమునకలైపోయిన స్వరాజ్యపార్టీ దానివల్ల ఉత్పన్నమైన సమస్యలను అనుభవించడం ఆరంభమైంది. ప్రభుత్వ తీర్మానాలనూ, ప్రతిపాదనలనూ పదేపదే చట్టసభల్లో తిరస్కరిస్తూ పోవడం మినహా అంతకంటే ఎక్కువగా చట్టసభల్లో ఘర్షణాత్మకమైన రాజకీయాన్ని నడపడం స్వరాజ్యపార్టీకి వీలుకాలేదు. ఇటువంటి పని సభ వెలుపల ప్రజా ఉద్యమం ద్వారా మాత్రమే సాధ్యం. కానీ, స్వరాజ్యవాదులకు ఒక పక్క తాము సభల్లో విప్లవిస్తుండగా, మరోపక్క ప్రజలు ఉద్యమించే రాజకీయ కార్యక్రమం అంటూ ఏదీ లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే వారు పూర్తిగా వార్తాపత్రికలమీదే ఆధారపడ్డారు. పత్రికల్లో వార్తలుగా వచ్చినప్పుడు మాత్రమే వారు చేస్తున్నదేమిటో జనబాహుళ్యానికి తెలుస్తుంది.

ప్రతి సందర్భంలోనూ, ప్రతి విషయంలోనూ తమ కూటమి భాగస్వాములను తమతో నిలబెట్టుకోవడం కూడా స్వరాజ్యవాదులకు అన్నివేళలా సాధ్యం కాలేదు. నిరంతరంగా, దీర్ఘకాలం పాటు చట్టసభల్లో ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూపోయే వారి కార్యక్రమంపట్ల వారి

భాగస్వాముల్లో నమ్మకం కూడా సన్నగిల్లింది. మరోపక్కన సంకీర్ణ రాజకీయాల ప్రభావంవల్ల వారి 'అవరోధవాదం'లో తీవ్రతకూడా నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. కొంతమంది స్వరాజ్యవాదులు పార్లమెంటరీ రాజకీయాల కారణంగా వచ్చిపడే అధికారాలనూ, హోదాలనూ, ప్రోత్సాహాన్నీ వదులుకుని మడికట్టుకుకూచోలేకపోయారు.

జాతీయవాదులను చీలికలు పేలికలుగా చేయాలన్న ప్రభుత్వ దురాలోచన కూడా ఆచరణరూపాన్ని సంతరించుకోవడం ఆరంభించింది. స్వరాజ్యవాదుల నుంచి ఉదారవాదులనూ, తీవ్రవాద స్వరాజ్యవాదులనుంచి మితవాదులనూ, హిందువులనుంచి ముస్లింలనూ వేరుచేయాలన్న ప్రభుత్వ పథకం ఫలితాన్నిచ్చింది. బెంగాల్‌లో స్వరాజ్యపార్టీలో ఉన్న అధికశాతం నాయకులు జమీందార్లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులపక్షాన నిలబడలేకపోయారు. అందువల్ల, వారు అధికశాతం ముస్లింలైన రైతుల మద్దతును కోల్పోవలసివచ్చింది. అంతేకాదు, తమ కార్యకర్తల్లోకి చొచ్చుకువచ్చిన మతతత్వ ధోరణులను కూడా స్వరాజ్యపార్టీ నిలువరించలేకపోయింది.

త్వరితకాలంలోనే పార్టీలోనే 'సమాధానవాదుల'నే ఒక బృందం పుట్టుకువచ్చింది. సంస్కరణల విషయంలో ప్రభుత్వంతో సహకరించి అవకాశం ఉన్నచోటల్లా అధికారం స్వీకరించాలన్నది వీరి ఉద్దేశం. ఈ సమాధానవాదులు సెంట్రల్ ప్రావిన్సుల్లోని అధికారప్రభుత్వాల్లో చేరారు. ఎన్.సి. కేల్కర్, ఎం. ఆర్. జయకర్ వంటి నాయకుల రాకతో వారి బలం క్రమంగా పెరిగింది. మదన్‌మోహన్ మాలవీయ, లజ్‌పతిరాయ్ కూడా 'సమాధాన వాదం' ఆధారంగానూ, మతకారణాలరీత్యా స్వరాజ్యపార్టీతో తెగతెంపులు చేసుకున్నారు.

పార్టీ మరిన్ని ముక్కలూచెక్కలూ కాకుండానూ, పార్లమెంటరీ 'అవినీతి'కి అడ్డుకట్టవేయడానికీ, సభ్యుల నైతికశక్తి సన్నగిల్లకుండా ఆపడానికీ పార్టీ ప్రధాన నాయకత్వం విస్తృతమైన ప్రజా ఉద్యమంపట్ల తన విశ్వాసాన్ని ప్రకటించడమే కాక, 1926 మార్చిలో చట్టసభలనుంచి ఉపసంహరించుకోవాలన్న నిర్ణయాన్ని కూడా తీసుకుంది. గాంధీజీకూడా శాసనసభల్లో ప్రవేశంపట్ల తనకున్న విభేదాన్ని పునరుద్ఘాటించాడు. 1926 ఏప్రిల్‌లో శ్రీనివాస అయ్యంగార్‌కు రాసిన లేఖలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'శాసనమండళ్ల పనితీరును అధ్యయనం చేసినకొద్దీ, వాటిలో ప్రవేశించినందువల్ల ప్రజలకు ఒరిగిన ప్రయోజనాలు తరచిచూసినకొద్దీ, హిందూ-ముస్లిం సఖ్యతపై దాని ప్రభావాన్ని గమనించినకొద్దీ – ఈ నిర్ణయంలో ఉన్న లోపం నాకు మరింత స్పష్టంగా కళ్ళకుకట్టినట్టు కనిపిస్తోంది'.

* * *


నైతికంగానూ,భౌతికంగానూ బలహీనపడిన స్వరాజ్యపార్టీ 1926 నవంబర్లో

జరిగిన ఎన్నికల్లో మరోమారు పాలుపంచుకుంది. ఒకపక్కన ప్రభుత్వాన్నీ, పార్టీలో అంతర్గతంగా ఉన్న దాని సానుభూతిపరులనూ, ఇంకోవైపునుంచి హిందూ–ముస్లిం మతతత్వవాదులనూ అది ఎదుర్కొనాల్సివచ్చింది. స్వరాజ్యవాదులకు వ్యతిరేకంగా అత్యంతదుర్మార్గమైన, మతవాసనలతో కూడుకున్న ప్రచారం ఉధృతంగా సాగింది. ఉదాహరణకు, హిందూ వ్యతిరేకి అనీ, గోవధకి అనుకూలుడనీ, గొడ్డుమాంసం తింటాడనీ మోతీలాల్ నెహ్రూ నిందలుపడాల్సివచ్చింది. స్వరాజ్యవాదులు ముస్లిం వ్యతిరేకులని ముస్లింమతతత్వవాదులు ఆడిపోసుకున్నారు. తత్ఫలితంగా స్వరాజ్యపార్టీ మరింత నీరసించిపోయింది. కేంద్రంలో 40స్థానాలనూ, మద్రాసులో సగం స్థానాలనూ సంపాదించుకుని ఇతర ప్రావిన్సుల్లో దారుణంగా దెబ్బతిన్నది. ముఖ్యంగా, యుపి, సెంట్రల్‌ప్రావిన్సు, పంజాబ్‌లలో అది దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. దీనితోపాటుగా, హిందూ,ముస్లిం మతతత్వవాదులు శాసనసభల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంచుకోగలిగారు. 1923లో చేసినట్టుగా ఈమారు ఒక జాతీయస్థాయి కూటమిని ఏర్పాటుచేసుకోవడం కూడా స్వరాజ్యవాదులకు సాధ్యం కాలేదు.

ఈసారి కూడా స్వరాజ్యవాదులు వాయిదాతీర్మానాలు చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక బిల్లులను ఓడించారు. వాటిలో చెప్పుకోదగినది 1928నాటి ప్రజాభద్రతాబిల్లు. దేశంలో కమ్యూనిస్టు, సోషలిస్టు భావజాలం తీవ్రగతిన వ్యాపిస్తుండటం పట్ల ప్రభుత్వం ఆందోళన చెందింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పంపిన విదేశీశక్తులు వీటిని పెంచిపోషించడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వం విశ్వసించింది. ఇటువంటి 'అవాంఛనీయ', 'తిరుగుబాటు' శక్తులను ఏరివేసి వారిని తిరిగి ఆయాదేశాలకు పంపించివేసే పేరిట అధికారాలను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును వ్యతిరేకించడంలో జాతీయవాదులందరూ ఏకమైనారు. మితవాదులనుంచి తీవ్రవాదులవరకూ అందరూ బిల్లును నిర్ద్వంద్వంగా ఖండించారు. 'సామ్రాజ్యవాదానికి మరోపేరే పెట్టుబడిదారీవిధానం.... బోల్షివిజం నుంచీ, కమ్యూనిజం నుంచీ మనకు వచ్చిన ప్రమాదమేమీ లేదు. వచ్చిపడుతున్న ప్రమాదమల్లా పెట్టుబడిదారులనుంచీ, దోపిడిదారులనుంచే' అని లాలాలజ్‌పత్‌రాజ్ వ్యాఖ్యానించారు. మోతీలాల్ నెహ్రూ సోవియట్ యూనియన్‌లో తన అనుభవాలను వివరిస్తూ సోవియట్ వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ప్రజాభద్రతాబిల్లు 'భారతీయ జాతీయవాదంపైనా, భారత జాతీయకాంగ్రెస్‌పైనా జరుగుతున్న ప్రత్యక్షదాడి'గా ఆయన అభివర్ణించారు. ఈ బిల్లును ఆయన 'భారత బానిసత్వ బిల్లు–నెంబర్ వన్' అని

అభివర్ణించారు. 'రైతుల్లోనూ, కార్మికుల్లోనూ జాతీయవాదం విస్తరించకుండా అడ్డుకోవడమే' ఈ బిల్లు పరమావధి అని టంగుటూరి ప్రకాశం వ్యాఖ్యానించారు. 'సామ్యవాదానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, దానిని అణచిపారేసే అధికారాలు దక్కించుకోవడానికి మీరు చేసే ప్రయత్నాలు అంతసులభంగా సాధ్యపడవు. మా శవాలమీదుగా నడిచివెళ్ళి వాటిని దక్కించుకోండి' అని దివాన్ చమన్‌లాల్ గర్జించారు. పెట్టుబడిదారీవర్గానికి ప్రతినిధులుగా ఉన్న పురుషోత్తమ్‌దాస్ ఠాకూర్‌దాస్, జి.డి.బిర్లాలు కూడా ఈ బిల్లును నిర్ద్వంద్వంగా తిరస్కరించారు.

బిల్లు ఆమోదాన్ని సంపాదించుకోవడం విఫలమైన ప్రభుత్వం 1929 మార్చిలో కమ్యూనిస్టు నాయకులనూ, కార్మికసంఘాల నాయకులనూ, ఇతర వామపక్షనాయకులనూ అరెస్టుచేసింది. ఈ విధంగా అరెస్టు చేసిన మొత్తం 31మంది ప్రముఖనాయకులపై మీరట్‌లో విచారణ ఆరంభమైంది. ఈ దాడిని జాతీయవాదులు తీవ్రంగా ఖండించారు. 'ఈ అరెస్టుల పరమావధి కమ్యూనిజాన్ని ఛిద్రం చేయడం కాదు, దేశంలో భయోత్పాతాన్ని రగిలించడం' అని గాంధీజీ వ్యాఖ్యానించారు. 'ప్రభుత్వం ఎప్పటికప్పుడు తాను చట్టాలకు అతీతంగా వ్యవహరించగలనని రుజువుచేయదల్చుకుంది. పంజాచాటున దాగివున్న ఆ నెత్తుటిగోళ్ళను చూపిస్తూ భారతదేశాన్ని భయంతో వొణికిపోయేట్టు చేయడం దాని ఉద్దేశం' అని ఆయన వ్యాఖ్యానించాడు. 1930లో లాహోర్ కాంగ్రెస్ తీర్మానం కారణంగానూ, శాసనోల్లంఘన ఆరంభమవుతున్న రీత్యా స్వరాజ్యవాదులు చట్టసభలనుంచి బైటకువచ్చేశారు.

జాతీయోద్యమం తన శక్తిసామర్థ్యాలను కూడగట్టుకున్న దశలో రాజకీయంగా ఏర్పడిన లోటును భర్తీచేయడంలో స్వరాజ్యవాదులు సాధించిన విజయం అమోఘమైనది. వలసపాలకులతో ఏమాత్రం రాజీపడకుండా వారు ఈ పాత్రను సక్రమంగా నిర్వర్తించడం విశేషం. కొందరు దిగువస్థాయినాయకులు పక్కదారులు పట్టినప్పటికీ మోతీలాల్ నెహ్రూ వ్యాఖ్యానించినట్టుగా వారు కడదాకా బలంగా నిలబడ్డారు. ఎన్నికల్లో దక్కిన మెజారిటీ వారి సమర్థతను తెలియచెప్పడమే కాక, వారి పట్ల వ్యక్తమైన ఆ విశ్వాసాన్ని వారు నిలబెట్టుకోగలిగారు. చట్టసభల్లో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరిస్తూ సమయం రాగానే వాటినుంచి వైదొలిగారు. అన్నిటికీమించి, చట్టసభలను భిన్నంగా, సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చునని వారు నిరూపించారు. 1919నాటి సంస్కరణలచట్టం ఎంత లోపభూయిష్టమైనదో నిరూపిస్తూ, భారతదేశాన్ని అరాచక చట్టాలు ఏలుతున్నాయన్న నిజాన్ని ప్రజలకు రుజువుచేయగలిగారు.

* * *

ఇదిలా ఉంటే, మరోపక్కన 'మార్పులుకోరనిపక్షం' ఎంతో నిశ్శబ్దంగా, ఏమాత్రం ప్రచారార్భటిలేకుండా తన నిర్మాణాత్మకకార్యక్రమాన్ని విస్తృతస్థాయిలో సాగించుకుంటూ పోయింది. ఖాదీ ప్రచారం, నూలువడకడం, జాతీయవిద్య, హిందూ–ముస్లిం సఖ్యత, అస్పృశ్యతపై పోరాటం, విదేశీవస్త్రాల బహిష్కారం వంటి అంశాలపై వీరు కృషిచేశారు. దేశవ్యాప్తంగా ఈ కాలంలో ఆవిర్భవించిన వందలాది ఆశ్రమాలు వీరు పడిన శ్రమకు నిదర్శనాలు. ఈ ఆశ్రమాల్లో కార్యకర్తలకు ఖాదీపనిపైనా, ఆదివాసీ, అట్టడుగుకులాల సముద్ధరణపైనా విస్తృతస్థాయిలో శిక్షణ లభించింది. ఇందుకు ఉదాహరణగా గుజరాత్‌లోని బార్డోలీ తాలూకాలో ఆవిర్భవించిన వేద్ఛి ఆశ్రమాన్ని చెప్పుకోవచ్చు. చిమన్‌లాల్ మెహతా, జుగత్‌రామ్‌దవే, చిమన్‌లాల్ భట్‌లు ఈ ఆశ్రమానికి పూర్తిగా అంకితమైపోయి 'కాలిపరాజ్'లలో విద్యాగంధాన్ని వ్యాప్తిచేయడానికి కృషిచేశారు. అదేవిధంగా ఖేడాజిల్లాలో వెలసిన మరో ఆశ్రమంలో రవిశంకర్ మహరాజ్ 'బరాయా'లనే దిగువకులాన్ని ఉద్ధరించడానికి తమ జీవితాన్ని అంకితం చేశారు.

గాంధీ ప్రబోధించిన ఈ నిర్మాణాత్మక కార్యక్రమం అనేక దిశల్లో సాగింది. పేదల జీవితాలకు ఇది ఎంతో ఊరట ప్రసాదించింది. పట్టణాల్లో ఉన్న అగ్రకులాలవారు గ్రామీణ ప్రాంతాల స్థితిగతులనూ, దిగువకులాలవారి దుర్భమైన బతుకులనూ ఆకళింపుచేసుకోవడానికి వీలుకల్పించింది. జాతీయోద్యమం మందకొడిగా ఉన్న కాలంలో కాంగ్రెస్ కార్యకర్తలు తమ శక్తిని మరో ఉపయోగకరమైన కార్యక్రమంలో ప్రభావవంతంగా వినియోగించడానికీ, ఈ వర్గాలవారితో సత్సంబంధాలు నెలకొల్పుకోవడానికీ ఈ కార్యక్రమం ఉపకరించింది. అంతవరకూ రాజకీయస్పర్శ అంటూలేని ఈ కులాలవారిలో ఆత్మవిశ్వాసాన్ని రగల్చి తమను తాము సమీకరించుకోవడానికి దోహదపడింది. గ్రామీణప్రజల జీవితాలకు కొంతవెలుగు ప్రసాదించి, కొత్త ఆశలను నింపి ఈ కార్యక్రమం ద్వారా వారిలో కాంగ్రెస్ తన ప్రభావాన్ని పెంచుకోగలిగింది.

దిగువకులాల వారినీ, ఆదివాసులనూ చైతన్యవంతం చేయనిదే వలసపాలనకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటం సాధ్యం కాదు. విదేశీవస్త్ర బహిష్కరణ అన్నది ఎంత వివేకవంతమైన ఆలోచనంటే, అది భారతీయ ప్రజల స్వేచ్ఛాప్రియత్వాన్ని వలసపాలకులకూ, యావత్ ప్రపంచానికీ కూడా అత్యంత స్పష్టంగా తెలియచెప్పింది. జాతీయపాఠశాలలూ, కళాశాలలూ ఈ దేశయువతకు వలసపాలకుల సైద్ధాంతిక చట్రానికి అతీతంగా, ఒక ప్రత్యామ్నాయ విధానంలో శిక్షణను అందించగలిగాయి. ఇక్కడనుంచి వచ్చినవారు పూర్తికాలం జాతీయోద్యమానికే అంకితమైపోయి దేశంకోసం కృషిచేశారు.

నాలుగుమాటల్లో చెప్పుకోవాలంటే– స్వాతంత్ర్యపోరాటానికి సైనికులనూ, వారికి రాజకీయ శిక్షణనూ ఈ నిర్మాణాత్మక కార్యక్రమం ప్రసాదించింది. అధికారులనూ, నాయకులనూ ఎంపికచేసింది, పరీక్షించింది. ఈ క్రియాత్మకకార్యక్రమానికి తమ జీవితాలను వెచ్చించిన కార్యకర్తలు జాతీయోద్యమం ఎంతో వాడిగావేడిగా సాగుతున్న సత్యాగ్రహదశలో ఉక్కుకవచాల్లా నిలబడ్డారు. అందువల్ల, ఖాదీభాండార్‌లకూ, గాంధీ ఆశ్రమాలకూ, జాతీయపాఠశాలలూ కళాశాలలకు చెందినవారు శాసనోల్లంఘనోద్యమాలు సాగుతున్నప్పుడు సత్యాగ్రహులుగా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలవడం యాదృచ్ఛికమేమీ కాదు.

1922–27 మధ్యకాలంలో పరస్పర విరుద్ధ పరిణామాలు అనేకం సంభవించాయి. స్వరాజ్యవాదులూ, గాంధేయవాద కార్యకర్తలూ తమతమ కార్యక్రమాలను ఎంతో ఉత్సాహంగా కొనసాగించుకుంటూ పోతున్నారు. దానితోపాటుగానే, రెండు శిబిరాల్లోనూ క్రమశిక్షణ లోపించి, ముఠాతత్వం బాగా పెరిగిపోయింది. 1927 చివరినాటికి మొత్తంమీద ఒక నిరాశాపూరితమైన, ద్వేషపూరితమైన వాతావరణం నెలకొన్నది. 1927 మేనెలలో గాంధీజీ ఈ విధంగా రాశారు. 'ఇప్పుడు నేను పూర్తిగా దైవప్రార్థనమీదా, దాని ఫలితంమీదే అన్ని ఆశలూ పెట్టుకున్నాను'.

కానీ, బూడిద అడుగున నిప్పురగులుకుంటున్నట్టుగా, అనేక సంవత్సరాలపాటు శక్తిసామర్థ్యాలను కూడదీసుకున్న జాతీయవాద శక్తులు మరోదశ పోరాటానికి అంతర్లీనంగా సంసిద్ధమవు తున్నాయి. సైమన్ కమిషన్ ఏర్పాటును ప్రకటించగానే యువతతో సహా దేశం యావత్తూ ప్రతిస్పందించిన తీరే ఇందుకు నిదర్శనం.

* * *

# 20 భగత్‌సింగ్, సూర్యసేన్... ఇతర విప్లవ ఉగ్రవాదులు

**మొ**దటి ప్రపంచయుద్ధకాలంలో విప్లవ ఉగ్రవాదులను తీవ్రంగా అణచివేయడం జరిగింది. చాలామంది నాయకులు అప్పట్లో జైళ్ళలో కానీ, పరారీలో కానీ ఉన్నారు. ఆ తరువాత మోంటేగ్-ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలకు సానుకూలవాతావరణాన్ని కల్పించడం కోసం 1920 ఆరంభంలో ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించి చాలామంది నాయకులను విడుదలచేసింది. వెంటనే జాతీయ కాంగ్రెస్ సహాయనిరాకరణోద్యమాన్ని ఆరంభించడం, గాంధీజీ కోరికపై సి.ఆర్.దాస్ వంటి-ముఖ్యంగా అనేకమంది విప్లవ ఉగ్రవాద నాయకులు- తమ కార్యకలాపాలకు స్వస్తిచెప్పి గాంధీచెబుతున్న ప్రజాందోళనకు వీలుకల్పించడానికి ఉద్యమంలో చేరడం జరిగిపోయింది.

కానీ, సహాయనిరాకరణోద్యమాన్ని హఠాత్తుగా ఉపసంహరించుకోవడం వారి ఆశలను నీరుగార్చింది. జాతీయోద్యమనాయకులు అనుసరిస్తున్న వ్యూహాన్నీ, ముఖ్యంగా లక్ష్యసాధనకోసం అహింసను ఒక మార్గంగా ఎంచుకోవడాన్నీ చాలామంది యువకులు ప్రశ్నించడం ఆరంభమైంది. ప్రత్యామ్నాయమార్గాలకోసం అన్వేషణ ఆరంభమైంది. స్వరాజ్యవాదులు అనుసరిస్తున్న పార్లమెంటరీ రాజకీయాలు కానీ, మార్పులు కోరనిపక్షం సాగిస్తున్న నిర్మాణాత్మక కార్యక్రమం కానీ వారిని ఆకర్షించలేకపోయాయి. హింసామార్గం ఒక్కటే ఈ దేశానికి స్వేచ్ఛప్రసాదించగలదని చాలామంది యువకులు విశ్వసించారు. విప్లవ ఉగ్రవాదం మరోమారు ఆకర్షణీయమైన మార్గంగా మారింది. విప్లవ ఉగ్రవాద రాజకీయాలవైపు ఆకర్షితులైన జోగేష్‌చంద్ర చటర్జీ, సూర్యసేన్, జతిన్‌దాస్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, శివవర్మ, భగవతీచరణ్ వోహ్రా, జైదేవ్ కపూర్ వంటి

చాలామంది నాయకులు అహింసాయుతమైన సహాయనిరాకరణోద్యమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నవారే.

క్రమంగా విప్లవ ఉగ్రవాదంలో రెండు రకాల ఆలోచనాధోరణులు ఆరంభమైనాయి. పంజాబ్, యు.పి., బీహార్‌లలో ఒక రీతిగా, బెంగాల్‌లో మరోరీతిగా ఇది సాగింది. రెండిటిపైనా అనేక నూతన సామాజిక శక్తుల ప్రభావం బాగా ఉంది. యుద్ధానంతరం కార్మికవర్గం సంఘటితమవుతుండటం అందులో ఒకటి. ఈ కొత్త వర్గంలో ఉన్న విప్లవశక్తిని గుర్తించిన విప్లవ ఉగ్రవాదులు దానిని విప్లవాత్మక జాతీయోద్యమానికి కూడా వినియోగించుకోవచ్చునని భావించారు. అదేవిధంగా, రష్యావిప్లవం, కొత్తగా ఆవిర్భవించిన ఈ సోషలిస్టు రాజ్యం తనను తాను సుస్థిరపరచుకోవడంలో సాధించిన విజయం వారిని ప్రభావితం చేసిన మరొక అంశం. ఈ యువ విప్లవకారులు సోవియట్ రాజ్యంనుంచీ, పాలక బోల్షెవిక్ పార్టీనుంచి ఎంతో కొంత నేర్చుకోవాలనీ, సహాయాన్ని అందుకోవాలనీ ఉత్సాహపడేవారు. మార్క్సిజం, సోషలిజం, శ్రామికవర్గ సిద్ధాంతాల ఆధారంగా పుట్టుకువస్తున్న అనేక కమ్యూనిస్టు గ్రూపులు వీరిని ప్రభావితం చేసిన మూడో అంశం.

* * *

నిరాశా నిస్పృహలనుంచి ముందుగా బైటపడినవారు ఉత్తరభారతదేశంలోని విప్లవవాదులు. వీరంతా రామ్‌ప్రసాద్ బిస్మిల్, జోగేష్ చటర్జీ, సచిదానంద్రనాథ్ సన్యాల్ నాయకత్వంలో పునరేకీకరణ చెందారు. 1924 అక్టోబర్‌లో వారు కాన్పూర్‌లో సమావేశమై సాయుధపోరాటం ద్వారా వలసపాలన అంతానికి వీలుగా హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (లేదా ఆర్మీ)–హెచ్ఆర్ఎ ని ఏర్పాటు చేశారు. వలసపాలన స్థానంలో ఫెడరల్ వ్యవస్థని ఏర్పాటు చేయడం వారి లక్ష్యం.

సాయుధ పోరాటం ఆరంభించడానికి ముందు పెద్ద ఎత్తున ప్రజలను చైతన్యవంతులను చేయడం, నియామకాలు జరుపుకోవడం, ఆయుధాలను సమకూర్చుకోవడం వంటివి జరగాల్సి ఉంది. వాటికోసం డబ్బు బాగా అవసరం. హెచ్ఆర్ఎ చేపట్టిన ప్రధానమైన చర్య కాకోరీ దోపిడీ. 1925 ఆగస్టు 9వతేదీన లక్నో సమీపంలోని కాకోరీ అనే కుగ్రామం వద్ద ప్రభుత్వ నగదుతో వస్తున్న ఒక రైలును వీరు అడ్డగించి దోచుకున్నారు. ప్రభుత్వం ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించింది. పెద్ద ఎత్తున గాలింపు

జరిపి అనేకమంది విప్లవకారులను అరెస్టుచేసింది. ప్రసిద్ధి చెందిన కాకోరీ కుట్రకేసులో వారిని విచారించింది. అశ్వఖుల్లా ఖాన్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, రోషన్‌సింగ్, రాజేంద్ర లాహిరిలను ఉరితీసింది. మరో నలుగురు నాయకులకు యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్షపడింది. 17మందికి యావజ్జీవఖైదు విధించారు. చంద్రశేఖర అజాద్ మట్టుకు తప్పించుకోగలిగాడు.

ఉత్తర భారతదేశం లోని విప్లవకారులకు కాకోరీ కేసు ఒక పెద్ద ఎదురుదెబ్బ. అయితే, వారు త్వరలోనే దానినుంచి తేరుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బిజయ్‌కుమార్ సిన్హా, శివ్‌వర్మ, జైదేవ్ కపూర్‌లు, పంజాబ్‌కు చెందిన భగత్‌సింగ్, భగవతిచరన్ వోహ్రా, సుఖదేవ్‌లు చంద్రశేఖర్ అజాద్ ఉమ్మడి నాయకత్వంలో హెచ్‌ఆర్‌ఎను గుర్తించడానికి నిర్ణయించారు. దీనితోపాటుగా వారిమీద సోషలిస్టు భావాల ప్రభావం కూడా ఉంది. మొత్తంమీద ఉత్తరభారతదేశానికి చెందిన విప్లవకారులందరూ 1928 సెప్టెంబర్ 9,10వతేదీల్లో ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్ల స్థలంలో సమావేశమై ఒక సమిష్టి నాయకత్వాన్ని ఆమోదించారు. సామ్యవాదాన్ని సాధించడం తమ లక్ష్యంగా ప్రకటించారు. పార్టీ పేరును హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (ఆర్మీ)గా మార్పు చేశారు.

* * *

అయినప్పటికీ కూడా, హెచ్‌ఎస్‌ఆర్‌ఎ త్వరితకాలంలోనే మళ్ళీ వ్యక్తిగత ధీరోదాత్తతకు ప్రాధాన్యం ఇవ్వడం మనకు కనిపిస్తుంది. 1928 అక్టోబర్‌లో సైమన్‌కమిషన్‌కు వ్యతిరేకంగా లాహోర్‌లో లాలా లజ్‌పతిరాయ్ ఒక ప్రదర్శన నిర్వహిస్తున్నప్పుడు ఆయనపై ఒక పోలీసు అధికారి తీవ్రంగా లాఠీచార్జి చేశాడు. ఆ గాయాలకు తీసుకుని రాయ్ అనతికాలంలోనే కన్నుమూశారు. ఈ సంఘటన విప్లవకారులను మళ్ళీ వ్యక్తిసంహారానికి పురికొల్పింది. షేర్– ఇ–పంజాబ్ అని అందరూ గౌరవంగా పిలుచుకునే పంజాబ్‌కు చెందిన ఈ మహోన్నతనాయకుడి మరణాన్ని విప్లవకారులు తమకు ఎదురైన ప్రత్యక్షసవాలుగా భావించారు. దీంతో 1928 డిసెంబరు 17న భగత్‌సింగ్, అజాద్, రాజ్‌గురు కలిసి లజ్‌పతిరాయ్‌పై లాఠీచార్జి చేసిన పోలీసు అధికారి సాండర్స్‌ను హత్యచేశారు. హత్య అనంతరం వారు విడుదల చేసిన ఒక పోస్టర్‌లో ఆ హత్యను సమర్థించుకుంటూ వారు ఈవిధంగా వ్యాఖ్యానించారు. 'ఈ

దేశంలోని కోట్లాదిమంది ప్రజలు ఆరాధించే ఒక మహోన్నతమైన నాయకుడు ఒక సాధారణ పోలీసు అధికారి పాపపు చేతుల్లో కన్నుమూయడం ఈ జాతికే అవమానం. దాన్ని చెరిపివేయడం ఈ దేశ యువకుల విద్యుక్తధర్మం. ఒక వ్యక్తిని చంపాల్సివచ్చినందుకు మేం బాధపడుతున్నాం. కానీ, అతడు ఒక అమానుష, అక్రమ నిర్మాణంలో అంతర్భాగం. దానిని అంతం చేయాల్సిన అవసరం ఉంది'.

తన మారిన లక్ష్యాన్ని ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరంతో పాటు, ప్రజలను తిరుగుబాటుకు సంసిద్ధులనుచేయాల్సిన అవసరం ఉందని హెచ్ ఎస్ ఆర్ ఎ నాయకత్వం భావించింది. పౌరహక్కులను హరించేందుకు ఉద్దేశించిన ప్రజారక్షణబిల్లునూ, కార్మికుల హక్కులను విచ్ఛిన్నంచేసే వాణిజ్యవివాదాల బిల్లునూ ఆమోదించినందుకు నిరసనగా కేంద్రశాసనసభపై బాంబుతో దాడిచేయాలని వారు నిర్ణయించుకున్నారు. భగత్‌సింగ్, బి.కె.దత్తు ఈ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిద్వారా ఎవరినో చంపాలని కానీ, విధ్వంసం సృష్టించాలని కానీ వారి అభిమతం కాదు. అసెంబ్లీ హాలులోకి వారు విసిరిన కరపత్రంలో 'బధిరులకు వినిపించేట్టు చేయడమే'తమ లక్ష్యమని వారు ప్రకటించారు. అంతేకాదు, బాంబు విసిరాక తప్పించుకునే అవకాశం ఉన్నప్పటికీ వారిద్దరూ తప్పించుకోలేదు. తమ విప్లవ ప్రచారానికి న్యాయస్థానాన్ని వేదికగా ఉపయోగించుకోవాలని నిర్ణయించుకుని వారు అరెస్టయ్యారు.

భగత్‌సింగ్, బి.కె.దత్‌లను ప్రభుత్వం ఈ కేసులో విచారించింది. అనంతరం వీరితోపాటు సుఖ్‌దేవ్, రాజ్‌గురు ఇంకా అనేకమంది విప్లవ ఉగ్రవాదులపై అనేక సుప్రసిద్ధ కేసుల్లో విచారణ సాగింది. న్యాయస్థానాల్లో ఈ యువ విప్లవకారులు చేసిన ప్రకటనలూ, వ్యాఖ్యలూ, ఉద్ఘాటనలూ ప్రజల్లో తెలియని ఆవేశాన్ని రగల్చాయి. ప్రతిరోజూ న్యాయస్థానాల్లో అడుగుపెడుతూనే ' ఇంక్విలాబ్ జిందాబాద్', 'సామ్రాజ్యవాదం నశించాలి' అంటూ వారు నినాదాలు చేసేవారు. 'సర్ఫరోషీ కీ తమన్నా అబ్ హమారే దిల్ మే హైం ' వంటి పాటలు పాడేవారు. ఇవన్నీ దినపత్రికల్లో అనుదినం ప్రముఖంగా వచ్చేవి. వారి నిర్భీతి, ధిక్కారధోరణి, దేశాభిమానం దేశవ్యాప్తంగా ప్రజలందరి సానుభూతినీ సంపాదించుకున్నాయి. చివరకు అహింసను విశ్వసించేవారిలో కూడా వారిపట్ల సానుభూతి పెరిగింది. భగత్‌సింగ్ ప్రతి ఇంట్లోనూ ఆరాధ్యుడైనాడు. 1931 మార్చిలో ఆయనను ఉరితీసిన వార్త తెలియగానే దేశవ్యాప్తంగా అనేకమంది ప్రజలు

కన్నీరుపెట్టుకున్నారు.దైనందిన కార్యకలాపాలకు ఉపక్రమించడానికి వారికి మనసురాలేదు. కనీసం అన్నపానీయాలు కూడా వారికి సహించలేదు.

జైళ్ళలోని దుర్భరపరిస్థితులకు నిరసనగా వారు పూనిన నిరాహారదీక్ష ఎంతో ఉత్తేజకరమైనది. తమను నేరస్తులుగా చూడటాన్ని వారు తిరస్కరించారు. రాజకీయఖైదీలుగా తమను గౌరవించాల్సిన బాధ్యతను వారు గుర్తుచేశారు. దేశం యావత్తూ వారికి అండగా నిలబడింది. 63రోజులపాటు నిరాహారదీక్ష చేసిన జతిన్‌దాస్ అనే ఓ బక్కపలచయువకుడు 64వ రోజున వీరమరణం చెందాడు. ఆయన భౌతికకాయాన్ని తీసుకుని లాహోర్‌నుంచి కలకత్తా వెడుతున్న రైలు ప్రతిస్టేషన్‌లోనే ఎంతో సేపు నిలిచిపోవాల్సివచ్చింది. భౌతికకాయాన్ని దర్శించుకోవడానికి ప్రతిస్టేషన్‌లోనూ వేలాదిమంది గుమిగూడేవారు. కలకత్తాలో ఆయన అంతిమయాత్రలో ఆరులక్షలమంది పాల్గొన్నారు.

లాహోర్ కుట్రకేసులోనూ, ఇంకా అనేక కేసుల్లోనూ అనేకమంది విప్లవకారులకు యావజ్జీవకారాగారశిక్షలు పడ్డాయి. అనేకమందికి ద్వీపాంతరవాస శిక్షలు పడ్డాయి. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు ఉరిశిక్షపడింది. 1931 మార్చి 23న అది అమలుజరిగింది.

* * *

బెంగాల్‌లో కూడా విప్లవ ఉగ్రవాదులు తమను తాము సమీకరించుకోవడం, రహస్యకార్యకలాపాలను విస్తృతం చేయడం ప్రారంభించారు. మరోపక్కన వీరిలో చాలామంది కాంగ్రెస్‌లో కూడా పనిచేశారు. దీనివల్ల వారికి జనబాహుళ్యంలోకి పోవడం సాధ్యపడింది. వీరి కారణంగా కాంగ్రెస్ చిన్నపట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ వ్యవస్థాగతంగా బలపడింది. స్వరాజ్యవాద కృషిలో వీరు సి. ఆర్.దాస్‌కు ఎంతో సహకరించారు. ఆయన మరణం తరువాత బెంగాల్‌లోని కాంగ్రెస్ నాయకత్వం రెండుగా విడిపోయింది. ఒక దానికి సుభాష్ చంద్రబోస్ నాయకత్వం వహించాడు. 'యుగాంతర్' గ్రూపు ఈయనకు మద్దతు కూడగట్టింది. మరో వర్గానికి నాయకుడు జె.ఎమ్.సేన్‌గుప్తా. 'అనుశీలన్' గ్రూపు ఈయనకు అండగా నిలబడింది.

వివిధ విప్లవ గ్రూపులు చేపట్టిన చర్యలలో, గోపీనాథ్ సాహా అనే విప్లవకారుడు కలకత్తా పోలీస్ కమిషనర్ చార్లెస్ టెగార్ట్‌పై1924 జనవరిలో హత్యచేయడానికి ప్రయత్నించడం ఒకటి. అయితే, ఈ ప్రయత్నంలో పొరపాటున 'డే' అనే మరో ఇంగ్లీషువ్యక్తి మరణించాడు.

ఈ ఘటనతరువాత ప్రభుత్వం ప్రజలపై తీవ్రంగా విరుచుకుపడింది. కొత్తగా తెచ్చిన ఆర్డినెన్సును చేతబట్టుకుని ఉగ్రవాదులుగా అనుమానిస్తున్నవారినీ, వారి మద్దతుదారులుగా భావిస్తున్నవారినీ ప్రభుత్వం పెద్దసంఖ్యలో అరెస్టుచేసింది. ఈవిధంగా అరెస్టయినవారిలో సుభాష్‌చంద్రబోస్ సహా అనేకమంది కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం సాహేను ఉరితీసింది. ఈ పరిణామాలు విప్లవాత్మక కార్యకలాపాలను  ఎదురుదెబ్బతీశాయి.

విప్లవ ఉగ్రవాద కార్యకలాపాల్లో స్తబ్ధతకు మరో కారణం ఉగ్రవాద గ్రూపుల్లో అంతర్గత విభేదాలు. ముఖ్యంగా, యుగాంతర్, అనుశీలన్ విభేదాలకు సంబంధించి ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. అయితే, అనతికాలంలోనే యువవిప్లవకారులు కొత్త గ్రూపులుగా తమను తాము సమీకరించుకుని అనుశీలన్, యుగాంతర్‌పార్టీల్లోని క్రియాశీలకశక్తులతో సత్సంబంధాలను నెలకొల్పుకోగలిగారు. కొత్తగా పుట్టుకొచ్చిన ఈ 'తిరుగుబాటు గ్రూపు'ల్లో ఎంతో చురుకైనది, ఎంతో ప్రసిద్ధి చెందినదీ సూర్యసేన్ నాయకత్వంలోని చిట్టగాంగ్ గ్రూపు.

సహాయనిరాకరణోద్యమంలో ఎంతో చురుకుగా పాల్గొన్నవ్యక్తి సూర్యసేన్. చిట్టగాంగ్‌లోని ఒక జాతీయపాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. అందువల్ల ఆ ప్రాంతంలో ఆయనను అందరూ 'మాస్టర్‌దా' అని గౌరవంగా పిలుచుకునేవారు. తిరుగుబాటు కార్యకలాపాలకు పాల్పడుతున్నాడన్న అభియోగంమీద ఆయన 1926–28 మధ్యకాలంలో రెండేళ్ళపాటు జైలుశిక్షను అనుభవించాడు. ఆ తరువాత కూడా ఆయనా, ఆయన సహచరులూ చిట్టగాంగ్ కాంగ్రెస్‌లో ఎంతో చురుకుగా పనిచేశారు. 1929లో చిట్టగాంగ్ జిల్లా కాంగ్రెస్ కమిటీకి సూర్యసేన్ కార్యదర్శిగా, ఆయన సహచరులు సభ్యులుగా నియమితులయ్యారు. ధైర్యసాహసాలూ, తెలివితేటలూ,కార్యదీక్షా మూర్తీభవించిన వ్యక్తి సూర్యసేన్. మానవతకు ఆయన అమితప్రాధాన్యతనిస్తాడు. రబీంద్రనాథ్‌ఠాగూర్‌నూ,  కాజీ నజ్రుల్ ఇస్లామ్‌ను అమితంగా అభిమానించే సూర్యసేన్ కవితాప్రియుడు.

అనంత్‌సింగ్,గణేష్‌ఘోష్, లోక్‌నాథ్ బౌల్ వంటి అనేకమందిని కూడగట్టుకుని సూర్యసేన్ అనతికాలంలోనే ఒక విప్లవగ్రూపును ఏర్పరిచాడు. భారతీయులు తలచుకుంటే ఈ దేశంలో ఉన్న బ్రిటిష్ సైనికశక్తిని చావుదెబ్బతీయగలరని నిరూపించడానికి చిన్నస్థాయిలోనైనా ఒక తిరుగుబాటు జరపాలని సూర్యసేన్ బృందం భావించింది.

చిట్టగాంగ్‌లోని రెండు ప్రధాన ఆయుధగారాలపై దాడి చేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం ద్వారా తమ సాయుధశక్తిని పెంచుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. నగరంలోని టెలిఫోన్, టెలిగ్రాఫ్ వ్యవస్థలనూ, రైల్వే కమ్యూనికేషన్ వ్యవస్థనూ విచ్ఛిన్నం చేసి చిట్టగాంగ్‌కూ మిగతా బెంగాల్‌కూ మధ్య సంబంధాలను తెంపివేయాలని వారు భావించారు. ఈ వ్యూహాన్ని వారు ఎంతో జాగ్రత్తగా రూపొందించి పకడ్బందీగా అమలు చేసేందుకు సిద్ధపడ్డారు. 1930 ఏప్రిల్ 18వతేదీ రాత్రి పదిగంటల సమయాన కార్యాచరణ ఆరంభమైంది. గణేష్‌ఘోష్ నాయకత్వంలో ఆరుగురు విప్లవకారులు పోలీసు ఆయుధాగారాన్ని స్వాధీనం చేసుకుని 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'సామ్రాజ్యవాదం నశించాలి', 'గాంధీజీ రాజ్యం ఏర్పడింది' అంటూ నినాదాలు చేశారు. లోక్‌నాథ్ పౌల్ నాయకత్వంలోని మరో 10మంది ప్రధాన ఆయుధాగారానికి అనుబంధంగా ఉన్న మరో ఆయుధాగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే, లూయిా తుపాకులు, 303 ఆర్మీ రైఫిళ్ళూ ఇందులో ఉన్నాయన్న వారి అంచనాలు తలకిందులైనాయి. ఆ ఆయుధాగారంలో ఎటువంటి సామగ్రి వారికి లభించలేదు. ఇది వారి ప్రణాళికను అనూహ్యంగా దెబ్బతీసింది. అయితే, టెలిఫోన్-టెలిగ్రాఫ్ వ్యవస్థను విచ్ఛిన్నం చేయడంలోనూ, రైళ్ళరాకపోకలను దెబ్బతీయడంలోనూ వారు విజయవంతమైనారు. మొత్తంమీద 'ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ-చిట్టగాంగ్ విభాగం' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో 65మంది విప్లవకారులు పాలుపంచుకున్నారు. ఈ గ్రూపులన్నీ పోలీసు ఆయుధాగారం ముందు తిరిగి కలుసుకున్నాయి. తెల్లని ఖాదీ ధోవతి, పొడువాటి కోటు, గాంధీటోపీ ధరించిన సూర్యసేన్ వారినుంచి సైనికవందనం స్వీకరించి సెల్యూట్ చేశారు. అనంతరం వందేమాతరం, ఇంక్విలాబ్ జిందాబాద్ వంటి నినాదాల మధ్యన ఆయన జాతీయపతాకాన్ని ఎగురవేసి, ప్రాంతీయ విప్లవ ప్రభుత్వం ఏర్పడినట్టు ప్రకటించారు.

పట్టణంలో సైన్యంతో హోరాహోరీ తలపడి దానిని తరిమికొట్టాలన్న వారి ఆలోచన అనుకున్నట్టుగా సాధ్యపడలేదు. దాంతో వారంతా సూర్యోదయం కన్నా ముందుగానే చిట్టగాంగ్ పట్టణాన్ని విడిచిపెట్టి చిట్టగాంగ్ కొండప్రాంతాల గుండా ప్రయాణిస్తూ క్షేమకరమైన చోటుకోసం వెతుక్కోవడం ఆరంభించారు. ఏప్రిల్ 22 మధ్యాహ్నం జలాలాబాద్ కొండల్లో వారిని సైన్యం చుట్టుముట్టింది. అక్కడ జరిగిన భీకరపోరులో 80మంది సైనికులు, 12మంది విప్లవకారులు మరణించారు. విప్లవకారులంతా పొరుగున ఉన్న గ్రామాల్లోకి తరలిపోయి తమ కార్యకలాపాలను

కొనసాగించాలని సూర్యసేన్ నిర్ణయించారు. అనుకున్నట్టుగానే వీరంతా బృందాలుగా చీలిపోయి ప్రభుత్వ సిబ్బందిపైనా, ఆస్తులపైనా దాడులు కొనసాగిస్తూ వచ్చారు. ప్రభుత్వాధికారులు అనేక పర్యాయాలు గాలింపులు జరిపినా, ఆయా గ్రామాలపై దాడులు జరిపినా ఫలితం లేకపోయింది. అత్యధికశాతం ముస్లింలైన ఈ గ్రామాల ప్రజలు విప్లవకారులకు ఆశ్రయమిచ్చి వారికి ఆహారాన్ని సమకూర్చారు. ఈ విధంగా మూడేళ్ళపాటు ఈ బృందాలు తమ కార్యకలాపాలను కొనసాగించగలిగాయి. చివరకు 1933 ఫిబ్రవరి 16న సూర్యసేన్‌ను ప్రభుత్వం పట్టుకోగలిగింది. ఆయనపై విచారణ జరిపి 1934 జనవరి 12న ఉరితీసింది. ఆయనతోపాటు పనిచేసిన చాలామంది పోరాటయోధులను కూడా ప్రభుత్వం పట్టుకుని వారికి యావజ్జీవఖైదు విధించింది.

బెంగాల్ ప్రజలపై 'చిట్టగాంగ్ దాడి' ప్రభావం సామాన్యమైనది కాదు. 'విప్లవభావాలున్న యువతను రంగంలోకి దిగేట్టుగా ఇది ప్రోత్సహించింది' అని అధికారిక ప్రచురణ ఒకటి వ్యాఖ్యానించింది. 'వివిధ ఉగ్రవాద గ్రూపుల్లో చేరడానికి స్వచ్ఛందంగా తరలివస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరిగిపోయింది' అని కూడా వ్యాఖ్యానించింది. 1930 అంతా అనేక తిరుగుబాటు కార్యకలాపాలు సాగాయి. ఆ ప్రభావం మరో రెండేళ్ళపాటు కొనసాగింది. చావుకు తెగించిన పోరాటాలూ, ఆత్మత్యాగాలూ ఉధృతంగా సాగాయి. కేవలం మిడ్నాపూర్ జిల్లాలోనే ముగ్గురు బ్రిటిష్ మేజిస్ట్రేట్‌లను విప్లవకారులు హత్యచేశారు. ఇద్దరు గవర్నర్లపై హత్యాయత్నాలు జరిగాయి. ఇద్దరు పోలీసు ఇనస్పెక్టర్ జనరల్స్‌ను చంపివేశారు. మొత్తంమీద ఈ మూడేళ్ళలో 22మంది అధికారులను విప్లవకారులు హత్యచేశారు.

ఆయుధాగారంపై దాడిజరగడం, విప్లవకర తీవ్రవాదకార్యకలాపాలు మళ్ళీ ఊపిరిపోసుకోవడం ప్రభుత్వాన్ని గందరగోళంలోకి నెట్టేశాయి. మొదట్లో అయోమయంగా వ్యవహరించిన ప్రభుత్వం అనతికాలంలోనే అన్యాయంగా, దుర్మార్గంగా వ్యవహరించడం ఆరంభించింది. ఇరవైకి పైగా అణచివేతచట్టాలను గుప్పిట్లో పెట్టుకున్న ప్రభుత్వం పోలీసులను జనంమీదకు వదిలేసింది. చిట్టగాంగ్‌లో అనేక గ్రామాలను తగులబెట్టింది. చిత్తంవచ్చిన శిక్షలు విధించింది. జరిమానాలు విధించింది. మొత్తంమీద ఆ ప్రాంతంలో తీవ్రభయోత్పాతాన్ని సృష్టించి ప్రజలు వొణికిపోయేట్టు చేసింది. 1933లో దేశద్రోహనేరంపై జవహర్‌లాల్ నెహ్రూను అరెస్టుచేసి రెండేళ్ళ జైలుశిక్షను విధించింది. కలకత్తాలో ఆయన ప్రసంగిస్తూ, లక్ష్యసాధనకోసం ఉగ్రవాదాన్ని ఒక విధానంగా ఆమోదించడంవల్ల ఏమాత్రం ప్రయోజనం లేదనీ, అది కాలానుగుణమైనది కాదనీ అంటూనే విప్లవకారులు కనబరిచిన

ధైర్యసాహసాలను ఆయన విశేషంగా ప్రస్తుతించారు. పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండించారు.

బెంగాల్‌లో ఈ మలిదశ విప్లవోద్యమానికి ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, యువతులు కూడా ఇందులో విశేషంగా పాలుపంచుకోవడం. సూర్యసేన్ నాయకత్వంలో పనిచేసిన వీరు విప్లవకారులకు ఆశ్రయాన్ని కల్పించడం, ఆయుధాగారాలను కనిపెట్టుకుని ఉండటం, మెసెంజర్‌లుగా వ్యవహరించడం వంటి బాధ్యతలతోపాటు తుపాకులు చేతబూని కదనరంగంలోకి కూడా దూకారు. ఒక దాడి జరుపుతుండగా ప్రీతిలతా వడ్డేదార్ కన్నుమూశారు. కల్పనా దత్తా (ప్రస్తుతం జోషీ) అరెస్టయి సూర్యసేన్‌తోపాటు విచారించబడి యావజ్జీవకారాగారశిక్షకు గురైంది. 1931 డిసెంబరులో కొమిల్లాకు చెందిన శాంతిఘోష్, సునితి చౌదరి అనే ఇద్దరు పాఠశాలవిద్యార్థినులు జిల్లా మేజిస్ట్రేట్‌ను కాల్చిచంపారు. 1932లో బీనాదాస్ అనే విద్యార్థిని విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ చేతులమీదుగా పట్టా అందుకుంటూ ఆయనను కాల్చివేసింది.

గతకాలంనాటి విప్లవ ఉగ్రవాదులతోనూ, భగత్‌సింగ్, అతని అనుచరులతోనూ పోలిస్తే చిట్టగాంగ్ తిరుగుబాటుదారులు ఒక విషయంలో ముందడుగువేశారు. వారు విడివిడిగా వ్యక్తిగతంగా కొన్ని దాడులకు, హత్యలకూ పాల్పడినప్పటికీ వలసరాజ్యపు వివిధ అంగాలను దెబ్బతీయడానికి వీలుగా సమష్టిగా వ్యవహరించడంలో కృతకృత్యులైనారు. అయితే, వారి ప్రధాన లక్ష్యం అధికారస్వామ్యాన్ని నైతికంగా దెబ్బతీయడంతోపాటు తమ ఆదర్శాన్ని యువతకు చేరవేయడం కూడా. అందువల్ల ఆ తరువాతి ప్రణాళిక తదనుగుణంగా రూపుదిద్దుకుంది. కల్పనాజోషీ (దత్తా) మాటల్లో చెప్పాలంటే, చిట్టగాంగ్ తిరుగుబాటు తరువాత 'ప్రభుత్వం చిట్టగాంగ్‌కు మళ్ళీ సైనికులను పెద్ద ఎత్తున తరలిస్తుంది. వారు (విప్లవకారులు) ఆ సైనికులతో జరిపిన వీరోచితమైన పోరాటంలో కన్నుమూసి ఈ దేశయువతకు కర్తవ్య బోధన చేస్తారు'. లేదా, ఆనందాగుప్తాకు సూర్యసేన్ చెప్పిన ప్రకారం 'లక్ష్యానికి కట్టుబడిన కొంతమంది యువకులు, వ్యక్తిగత తీవ్రవాదం స్థానంలో వ్యవస్థీకృత సాయుధపోరాటమార్గాన్ని ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో కొంతమంది మరణించడం తథ్యం. అయితే, ఒక మహోన్నతమైన ఆదర్శంకోసం చేస్తున్న ఈ ఆత్మత్యాగం ఊరికే పోదు'.

1920, 1930లకు చెందిన బెంగాల్ విప్లవకారులు గతంలో మాదిరిగా తమ కార్యకలాపాలకు మతవాసనలు సోకనివ్వలేదు. మతపరమైన ప్రమాణాలు, ప్రతిజ్ఞలూ

లేవు. కొన్ని గ్రూపులు ముస్లింలను దూరంగా ఉంచలేదు. చిట్టగాంగ్ ఐఆర్ఎలో సత్తార్, మీర్ మహ్మద్, ఫకీర్ అహ్మద్ మియా, తునూ మియా వంటి నాయకులు ఉన్నారు. చిట్టగాంగ్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల మద్దతును కూడగట్టడంలో వీరు సహకరించారు. అయితే, చాలా విప్లవగ్రూపుల్లో సామాజిక ఛాందసానికి సంబంధించిన కొన్ని అవశేషాలు ఇంకామిగిలేవున్నాయి. ముఖ్యంగా సామాజిక– ఆర్థిక లక్ష్యాల రూపకల్పన విషయంలో ఈ గ్రూపులు ముందుచూపును కనబరచలేకపోయాయి. ముఖ్యంగా స్వరాజ్యపార్టీలో పనిచేసి వచ్చినవారితో ఏర్పడిన విప్లవగ్రూపులు జమీందార్లకు వ్యతిరేకంగా ముస్లిం రైతులు జరుపుతున్న పోరాటానికి మద్దతు నివ్వలేకపోయాయి.

* * *

విప్లవం లక్ష్యం, దాని సిద్ధాంతం, పోరాట విధానాల విషయంలో ఒక మార్పు తీసుకువచ్చినవారు భగత్‌సింగ్, ఆయన సహచరులు. అయితే, ఈ విషయాల్లో హెచ్ఆర్ఎలోనూ పునరాలోచన ఆరంభమైంది. 1925లో అది తన మానిఫెస్టోలో 'ఒక మనిషి మరో మనిషిని దోచుకోవడానికి వీలుకల్పించే అన్ని వ్యవస్థలనూ రద్దుచేయడానికి' కట్టుబడి ఉన్నట్టుగా ప్రకటించింది. 1924లో దాని వ్యవస్థాపక మండలి 'సామాజిక విప్లవాన్నీ, కమ్యూనిస్టు సిద్ధాంతాలనూ' బోధించాలని నిర్ణయించుకుంది. రైల్వేలనూ, ఇతర రవాణావ్యవస్థలనూ, స్టీలు పరిశ్రమనూ జాతీయాకరణ చేయాలని దాని ప్రధాన పత్రిక 'ద రివల్యూషనరీ' ప్రతిపాదించింది. ఒక వ్యవస్థీకృతమైన సాయుధపోరాటాన్ని నిర్మించడానికి వీలుగా 'రైతు,కార్మిక సంఘాలను ప్రారంభించాల'ని కూడా హెచ్ఆర్ఎ నిర్ణయించుకుంది.

మరణానికి ముందు రామ్‌ప్రసాద్ బిస్మిల్ దేశంలోని యువకులందరినీ ఉద్దేశించి ఒక ప్రకటన చేస్తూ 'రివాల్వర్లూ, తుపాకులూ చేతపట్టుకోవాలన్న కోరికను వదులుకో' మని విజ్ఞప్తిచేశారు. 'విప్లవకర కుట్రలకు పాల్పడవద్ద'నీ, 'బహిరంగ ఉద్యమాలకు సిద్ధపడ'మనీ హితవుచెప్పారు. హిందూ–ముస్లిం సమైక్యతకు కృషిచేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ, కాంగ్రెస్ నాయకత్వంలో అన్ని గ్రూపులూ ఏకం కావాలని సూచించారు. కమ్యూనిజంపైనా, 'ప్రకృతివనరులపై ప్రతి మానవుడికీ సమానమైన హక్కులున్నాయన్న' సిద్ధాంతంపైనా తన విశ్వాసాన్ని ప్రకటించారు.

1907లో జన్మించిన భగత్‌సింగ్, ప్రముఖ విప్లవకారుడు అజిత్‌సింగ్‌కు సమీపబంధువు. భగత్‌సింగ్ మహామేధావి, పుస్తకాల పురుగు. ఆ కాలంనాటి రాజకీయ

నాయకుల్లో ఆయనకంటే ఎక్కువగా పుస్తకాలు చదివినవారు బహుశా ఎవరూ లేరు. లాహోర్‌లోని ద్వారకాదాస్ లైబ్రరీలో సామ్యవాదంపైనా, సోవియట్‌యూనియన్‌పైనా, వివిధ విప్లవ ఉద్యమాలపైనా–ముఖ్యంగా రష్యా, ఐర్లండ్, ఇటలీ–పై ఉన్న పుస్తకాలను ఆయన ఔపోసన పట్టేశారు. లాహోర్‌లో ఆయన సుఖ్‌దేవ్, ఇంకా ఇతర సన్నిహితుల సహకారంతో అనేక అధ్యయన కేంద్రాలను ఆరంభించారు. అక్కడ విపరీతంగా రాజకీయచర్చలు జరుగుతుండేవి. హెచ్ఎస్ఆర్ఎ కార్యాలయం ఆగ్రాకు మారినవెంటనే ఆయన అక్కడ ఓ లైబ్రరీ ఏర్పాటు చేసి సామ్యవాదంపైనా, ఇతర విప్లవకర ఆలోచనలపైనా లోతుగా అధ్యయనం చేసి చర్చలు జరపమంటూ సభ్యులకు విజ్ఞప్తిచేశారు. ఆయన జేబులు పుస్తకాలతో లావుగా నిండిపోయి ఉండేవి. ఆయన వాటిని ఎప్పటికప్పుడు కామ్రేడ్‌లకు ఇస్తూ వాటిని చదవమని ప్రోత్సహిస్తుండేవారు. అరెస్టయినతరువాత ఆయన ఆ జైలును కూడా ఓ లైబ్రరీగా తయారుచేశారు. విప్లవాన్ని సృష్టించడంలో ఆలోచనల పాత్రను ఉద్ఘాటిస్తూ లాహోర్ హైకోర్టులో ఆయన 'ఆలోచన అనే రాయితో సానబడితేనే విప్లవం అనే కత్తి పదునుదేరుతుంది' అని వ్యాఖ్యానించాడు. విస్తృతంగా చదవడం, లోతుగా ఆలోచించడమనే వాతావరణం హెచ్ఎస్ఆర్ఎ నాయకులను అనేకమందిని ప్రభావితం చేసింది. సుఖ్‌దేవ్, భగ్‌వతి చరణ్ వోహ్రా, శివ్‌వర్మ, బిజయ్‌సిన్హా, యశ్‌పాల్ వంటివారు అపరిమితమైన మేధావులు. ఇంగ్లీష్ అంతగారాని చంద్రశేఖర ఆజాద్ ఒక ఆలోచనను తనకు పూర్తిగా వివరించి చెబితే దానిని ఆమోదించేవారు. చర్చలద్వారా అనేక వినూత్నమైన ఆలోచనలకు ఆయన వీలుకల్పించాడు. విప్లవకారుల ప్రసిద్ధప్రకటన 'ది ఫిలాసఫీ ఆఫ్ బాంబ్' ముసాయిదాను చంద్రశేఖర ఆజాద్ సూచనమేరకు, ఆయనతో పూర్తిగా చర్చించిన తరువాతే భగవతీచరణ్ వోహ్రా రూపొందించారు.

1929లో అరెస్టు కావడానికి బాగా ముందే ఉగ్రవాదంమీదా, వ్యక్తిగత శౌర్యప్రతాపాల ప్రదర్శనమీదా విశ్వాసాన్ని వదులుకున్నారు. ఆయన తన దృష్టిని మార్క్సిజంవైపుకు మళ్ళించాడు. విప్లవం సంపూర్ణంగా విజయవంతం కావాలంటే విస్తృతస్థాయి ప్రజా ఉద్యమాలే మార్గమని విశ్వసించాడు. 'ప్రజలకోసం ప్రజలద్వారా' మాత్రమే విప్లవం సాధ్యమని ఆయన తేల్చాడు. అందుకే భగత్‌సింగ్ 1926లో 'పంజాబ్ నవ్‌జవాన్ భారత్‌సభ'ను ప్రారంభించాడు (ఆయన దానికి వ్యవస్థాపక కార్యదర్శి). యువకులు, కార్మికులు, రైతుల్లో ఈ సభ పనిచేసింది. గ్రామాల్లో తన శాఖలను తెరిచింది. దాని ద్వారా భగత్‌సింగ్ తన రాజకీయ ఉపన్యాసాలు చేసేవారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌లు

విద్యార్థుల మధ్య చట్టబద్ధమైన కార్యక్రమాలకోసం లాహోర్ విద్యార్థిసంఘాన్ని కూడా ప్రారంభించారు.

విప్లవం అన్నది సమాజంలో అణగారినవర్గాలూ, దోపిడికి గురవుతున్నవర్గాల్లో ఒక మహోన్నతమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి మాత్రమేనన్న భావనను భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్‌లు 1929 నుంచి 1931 మధ్యకాలంలో వివిధ వేదికలపైనా, న్యాయస్థానాల్లోనూ అనేకమార్లు వ్యక్తంచేశారు. మరణానికి ముందు భగత్‌సింగ్ 'వాస్తవికమైన విప్లవసేనలు గ్రామాల్లోనూ, ఫ్యాక్టరీలోనూ ఉన్నాయి' అని ప్రకటించారు. అంతేకాదు, 1931 ఫిబ్రవరి 2న ఆయన ఒక ప్రకటన చేస్తూ 'బహుశా నేను ఒక తీవ్రవాదిలా వ్యవహరించి ఉంటాను. కానీ నేను తీవ్రవాదిని కాదు.... నా గుండెలోతులనుంచీ శక్తిని కూడగట్టుకుని మరోమారు స్పష్టంగా చెబుతున్నాను... నేను తీవ్రవాదిని కాను, ఎన్నడూ కాలేదు–బహుశా నా విప్లవజీవితం ఆరంభమైన తొలినాళ్ళలో మినహా. ఈ రకమైన విధానాల ద్వారా మనం సాధించేది ఏదీ ఉండదని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను'.

అటువంటప్పుడు భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్లు వ్యక్తిగత శౌర్యప్రతాపాల ప్రదర్శనలకు ఎందుకు పాల్పడినట్టు? ఇందుకు ఒక కారణం, వారి ఆలోచనావిధానంలో త్వరితగతిన వచ్చిన కొన్ని మార్పులు. వారి వర్తమానంలో గతం కూడా ఎంతోకొంత భాగాన్ని ఆక్రమించుకొని ఉందన్న విషయాన్ని మనం మరిచిపోకూడదు. దాని ప్రభావం వారిమీద ఉండకుండా పోదు. ఒక సందిగ్ధస్థితిలో వారు ఇరుక్కున్నారు. సామాన్యప్రజలను ప్రభావితం చేసి వారి ఆదరాభిమానాలు సంపాదించుకోగలిగే విప్లవకారులను, వందలాదిమంది యువ రాజకీయకార్యకర్తలను సంపాదించుకోవడం ఎలా? వారిని ఎలా నియమించుకోవాలి? మేధోపరంగా సాగే రాజకీయ కార్యక్రమం ఎంతో నిదానంగా ఉంది. పైగా అది కాంగ్రెస్ అనుసరించే రాజకీయ విధానానికి దగ్గరగా ఉంది. అందువల్ల, ఈ మార్గాన్ని అధిగమించాల్సిన అవసరం ఉందని విప్లవకారులు భావించారు. యువకులను ఆకర్షించాలంటే 'ఆచరణ ద్వారా ప్రచారం' ఒక్కటే మార్గమని వారు నిర్ణయించుకున్నారు. వ్యక్తిగత శౌర్యప్రతాపాలను ప్రదర్శించే కార్యక్రమాలకు సంకల్పించడంద్వారా, అనంతరం న్యాయస్థానాలముందు తమ విప్లవప్రచారం చేయడం ద్వారా ఒక ప్రజావిప్లవపార్టీ ప్రాథమికదశలో తన కేడర్‌ను సమకూర్చుకోగలుగుతుందని వారు భావించారు. అందువల్లే, 1930,1931 సంవత్సరాల్లో వారు ప్రధానంగా తమ

కామ్రేడ్ల వ్యక్తిగత త్యాగాలను ప్రస్తుతించడానికీ, వారి త్యాగాలను ప్రజల దృష్టికి తీసుకుపోవడానికే ఎక్కువగా ప్రయత్నించారు. విప్లవ ఉగ్రవాదమార్గాన్ని విడిచిపెట్టవలసిందిగా నేను విజ్ఞప్తి చేసినప్పటికీ అది వ్యక్తిగతత్యాగాల స్ఫూర్తిని దెబ్బతీయకుండా జరగవలసి ఉందని భగత్‌సింగ్ వ్యాఖ్యానించడంలో అర్థం ఆయన తన రాజకీయవిధానాన్ని సవరించుకున్నాడనే. ఆత్మత్యాగమనే స్ఫూర్తి ఒకసారి నశిస్తే దానిని పునరుద్ధరించడం ఎంతో కష్టమైన పని.

'విప్లవం' నిర్వచనాన్ని విస్తృతం చేసినవారు భగత్‌సింగ్, ఆయన సహచరులు. విప్లవం అన్నది హింసకూ, తీవ్రవాదానికీ సమానమైనది కాదు. దాని తొలి లక్ష్యం దేశానికి స్వేచ్ఛప్రసాదించడం– సామ్రాజ్యవాదాన్ని కూలదోయడం. అయితే అది అక్కడితో ఆగిపోదు. మరింత ముందుకు ప్రయాణించి ఒక నూతన సామ్యవాద సామాజిక క్రమాన్ని ఆవిష్కరించవలసి ఉంది. మనిషి మనిషిని దోచుకునే స్థితిని అంతం చేయాలి. భగవతీచరణ్ వోహ్రా, చంద్రశేఖర ఆజాద్, యశ్‌పాల్ రచించిన 'ది ఫిలాసఫీ ఆఫ్ ది బాంబ్' విప్లవాన్ని 'రాజకీయ, ఆర్థిక దోపిడీ ఏమాత్రం సాధ్యంకాని ఒక నూతన సామాజిక క్రమాన్ని ఆవిష్కరించ'డానికి ఉద్దేశించిన 'సామాజిక, రాజకీయ, ఆర్థిక, స్వాతంత్ర్య' అంశంగా నిర్వచించింది. అసెంబ్లీ బాంబు కేసులో భగత్‌సింగ్ న్యాయస్థానంలో ఇలా వ్యాఖ్యానించారు. 'విప్లవం అంటే అన్ని సందర్భాల్లోనూ రక్తంతో తడిసిముద్దయ్యే పోరాటాలే కానక్కరలేదు. అది బాంబులు, తుపాకుల మతం కాదు. అన్యాయం, అసమానత్వం ఆధారంగా ఏర్పడిన ప్రస్తుత సామాజిక విధానాలను సమూలంగా మార్చడమే 'విప్లవం'. భగత్‌సింగ్ జైలునుంచి రాసిన ఒక లేఖలో 'రైతులు విదేశీశక్తులనుంచి మాత్రమే కాదు, భూస్వాములూ, పెట్టుబడిదారుల చెర నుంచి కూడా విముక్తిసాధించాలి' అని సూచించారు. 1931 మార్చి 3వతేదీన ఇచ్చిన అంతిమ సందేశంలో, భారతదేశంలో పోరాటం 'స్వప్రయోజనాలకోసం సామాన్యుల శ్రమను కొద్దిమంది దోపిడిదారులు దోచుకున్నంత కాలం కొనసాగుతుంది. ఆ దోపిడిదారులు నూటికి నూరుపాళ్ళూ బ్రిటిష్‌పెట్టుబడిదార్లా, బ్రిటిష్–భారత పెట్టుబడిదారుల కూటమా, లేక పదహారణాలా దేశీయ పెట్టుబడిదారులా అన్నదానితో నిమిత్తంలేదు' అని ఆయన ప్రకటించారు. సామ్యవాదాన్ని ఆయన సశాస్త్రీయంగా నిర్వచిస్తూ, పెట్టుబడిదారీతనాన్నీ, వర్గాధిపత్యాన్నీ నిర్మూలించేదే సామ్యవాదమని వ్యాఖ్యానించాడు. మార్క్సిజాన్నీ, వర్గ దృక్పథాన్ని ఆయన పూర్తిగా ఆమోదించాడు. వాస్తవానికి ఆయన తనను తాను విప్లవానికి పూర్వగామిననే భావించాడు

కానీ, సృష్టికర్తననుకోలేదు. సోషలిజం, కమ్యూనిజం ఆదర్శాల ప్రచారకుడుగా, భారతదేశంలో సామ్యవాద ఉద్యమానికి నాందిపలికిన వ్యక్తిగా ఆయన తనను తాను భావించారు.

భగత్‌సింగ్ ఎంతో ముందుచూపున్న మహోన్నతుడు. నికార్సయిన లౌకికవాది. జాతీయోద్యమానికీ, దేశానికీ మతతత్వం తెచ్చిపెట్టబోతున్న పెను ప్రమాదాన్ని ఆయన తన సమకాలికుల కంటే ముందుగానే ఊహించాడు. మతతత్వం వలసపాలనంతటి ప్రమాదకరమైనదని ఆయన పలుమార్లు పలువేదికలనుంచి హెచ్చరించాడు.

1928 ఏప్రిల్‌లో నవ్‌జవాన్ భారత్ సభ పునర్వ్యవస్థీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో, మతసంఘాల్లోనూ,మతతత్వసంస్థల్లోనూ సభ్యులుగా ఉన్న యువకులను కూడా భారత్‌సభలో సభ్యులుగా చేర్చుకోవాలన్న ప్రతిపాదనను భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్లు బహిరంగంగా తిరస్కరించారు. మతం–వ్యక్తిగతం. మతతత్వం–మన శత్రువు అని ఆయన స్పష్టంచేశాడు. అంతకుముందు–అంటే, 1927లో ఆయన మతపరమైన హత్యాకాండలను అమానుషమైనవిగా అభివర్ణించారు. మతవిద్వేషంతో రగిలిపోతున్న హంతకులు ఎదుటివాడు వ్యక్తిగతంగా ఏదో నేరం చేసినందుకు వాడిని చంపడంలేదనీ, వాడు హిందూ లేదా ముస్లిం లేదా సిక్కు కావడం వల్లే వాడిని చంపుతున్నారనీ ఆయన వ్యాఖ్యానించారు. మతానికి అతీతంగా వ్యవహరించే కొత్తతరం యువత రాబోతున్నదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రతివ్యక్తినీ ముందుగా మానవుడుగా, ఆ తరువాత భారతీయుడుగా ఆయన గుర్తించాడు.

లాలాలజ్‌పతిరాయ్‌ను భగత్‌సింగ్ ఎంతో అభిమానించేవాడు.అయితే, లజ్‌పత్‌రాయ్ తన చివరిరోజుల్లో మతరాజకీయాలవైపు తలొగ్గడంతో ఆయనను కూడా భగత్‌సింగ్ విడిచిపెట్టలేదు. ఆయనకు వ్యతిరేకంగా రాజకీయ–సైద్ధాంతిక పోరాటం ప్రారంభించాడు. లజ్‌పత్‌రాయ్ ఎంతో గౌరవనీయమైన నాయకుడు కావడంతో ఆయనను కఠినమైన పదజాలంతో విమర్శించకుండా భగత్‌సింగ్ జాగ్రత్తపడ్డారు. విమర్శల్లో భాగంగా భగత్‌సింగ్ ఒక కరపత్రాన్ని కూడా విడుదల చేశారు. అందులో రాబర్ట్ బ్రౌనింగ్ ప్రసిద్ధ కవిత 'ది లాస్ట్ లీడర్'ను ప్రచురించాడు. ప్రసిద్ధ కవి వర్డ్స్‌వర్త్ స్వేచ్ఛపై వ్యతిరేక వైఖరి తీసుకున్నందుకు నిరసనగా బ్రౌనింగ్ ఈ కవితను రాశారు. 'జస్ట్ ఫర్ ఎ హాండ్‌ఫుల్ ఆఫ్ సిల్వర్ హి లెఫ్ట్ అజ్' అన్న వాక్యంతో ఆ కవిత ఆరంభమవుతుంది. ముఖచిత్రంగా లజ్‌పత్‌రాయ్ ఫొటో మినహా ఈ విమర్శలో ఆయనపై ఒక వ్యాఖ్యకూడా లేదు.

విచిత్రమేమంటే, భగత్‌సింగ్ స్వయంగా రూపొందించిన నవ్‌జీవన్ సభ నిబంధనావళిలోని ఆరు నిబంధనల్లో మతానికి సంబంధించి ప్రస్తావించిన రెండు నిబంధనలు ఈ విధంగా చెబుతున్నాయి. 'మతసంబంధమైన వాదనలనూ, ఆలోచనలనూ ప్రచారం చేసే సంఘాలతోకానీ, పార్టీలతో కానీ సంబంధం ఉండకూడదు' అన్నది అందులో ఒకటి. 'మతం అన్నది పూర్తిగా ఒక మనిషి వ్యక్తిగత వ్యవహారమని ప్రజలను చైతన్యపరచడం, మతానికి సంబంధించి వారిలో సహనాన్ని పెంపొందింపచేయడం'.

మతం, మూఢవిశ్వాసాల బందిఖానానుంచి ప్రజలను విముక్తిచేయాల్సిన అవసరాన్ని భగత్‌సింగ్ గుర్తించాడు. తన మరణానికి కొద్దివారాల ముందు ఆయన 'నేను నాస్తికుడనెందుకయ్యాను?' అంటూ ఒక వ్యాసంరాశారు. అందులో ఆయన మతాన్నీ, దాని తత్వాన్నీ తీవ్రంగా విమర్శించారు. నాస్తికతకు దారి తీసిన తన గమనాన్ని ఆయన అందులో వివరించారు. సిక్కుమతం, ఇతర మతాల పురాణాలపట్లా, అవి ప్రబోధించే మార్గంపట్లా తాను తొలిసారి ఏ విధంగా విశ్వాసాన్ని కోల్పోయిందీ, అంతిమంగా దేవుడి అస్తిత్వంపైనే నమ్మకం ఎలా వదులుకున్నదీ ఆయన అందులో వివరించారు. విప్లవకారుడు కావాలనుకున్న వ్యక్తికి నైతికబలం హెచ్చుస్థాయిలో ఉండాలి, దానితోపాటుగా విమర్శనాత్మకంగా, స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఉండాలని ఆయన వివరించారు. దేవుడిమీద విశ్వాసాన్నీ, మతమనే ఇరుకుభావననూ అధిగమించినప్పుడే మానవజాతి తనను తాను సముద్ధరించుకోగలుగుతుందని ఆయన బోధించాడు. 'అభివృద్ధిపథంలో సాగదల్చుకున్న ప్రతివ్యక్తీ కూడా గతకాలపు విశ్వాసాల్లోని ప్రతి అంశానికీ ఎదురొడ్డాలి. ప్రతి ఒక్కదానినీ విమర్శించాలి. నమ్మకాన్ని వదులుకోవాలి'. నిరీశ్వరవాదంమీదా, భౌతికవాదంమీద తనకున్న విశ్వాసాన్ని ఆ వ్యాసంలో పునరుద్ఘాటిస్తూ, 'కడదాకా నిటారుగా తలపైకెత్తి ఒక మనిషిగా నిలబడేందుకు ప్రయత్నిస్తున్నాను–చివరకు ఉరికంబంమీద కూడా' అని ఆయన ఉద్ఘాటించారు.

* * *

ప్రభుత్వం అనుసరించిన విధానాలు క్రమంగా విప్లవ ఉగ్రవాదులను బలహీనపరిచాయి. 1931 ఫిబ్రవరిలో అలహాబాద్‌లోని ఒక పబ్లిక్‌పార్కులో పోలీసుల కాల్పుల్లో చంద్రశేఖర ఆజాద్ మరణించడంతో పంజాబ్, యు.పి.,బీహార్‌లలోని విప్లవ ఉగ్రవాద ఉద్యమం దాదాపు ముగిసిపోయింది. బెంగాల్‌లో దీర్ఘకాలంసాగిన విప్లవ ఉగ్రవాదం సూర్యసేన్‌తో పాటుగానే అంతమైపోయింది. అండమాన్ ద్వీపంలోనూ,

జైళ్లలోనూ పునరాలోచన ప్రక్రియ ప్రారంభమైంది. అనేకమంది విప్లవకారులు మార్క్సిజంవైపు మళ్ళారు. సామ్యవాద విప్లవానికి ప్రజల్లో కృషిచేయాలని సంకల్పించారు. వారు కమ్యూనిస్టుపార్టీలోనూ, రివల్యూషనరీ సోషలిస్టుపార్టీలోనూ, ఇతర వామపక్షపార్టీలోనూ చేరారు. ఇంకా చాలామంది కాంగ్రెస్‌లో గాంధీమార్గాన్ని అనుసరించారు.

విప్లవ ఉగ్రవాద రాజకీయానికి చాలా పరిమితులున్నాయి. అన్నిటికన్నా ముందు చెప్పుకోవాల్సింది–వారిది ప్రజా ఉద్యమ రాజకీయవిధానం కాదు. వారు జనబాహుళ్యాన్ని రాజకీయంగా చైతన్యవంతులను చేయడంలో కానీ, వారిని రాజకీయకార్యాచరణకు పురిగొల్పడంలో కానీ విజయం సాధించలేకపోయారు. అంతేకాదు, ప్రజలతో సంబంధాలను ఏర్పరుచుకోవడంలో కూడా వారు వైఫల్యం చెందారు. ఈ వైఫల్యాలు అలా ఉంచితే, దేశ స్వాతంత్ర్యోద్యమానికి వారు ఇచ్చిన తోడ్పాటు అద్భుతమైనది. వారి అనన్యమైన దేశభక్తి, ధైర్యసాహసాలు, పట్టుదల, త్యాగనిరతి దేశప్రజలను ఒక కుదుపుకుదిపివేశాయి. ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేశాయి. జాతీయభావాన్ని వ్యాప్తిచేయడంలో వారి సహకారం అనిర్వచనీయం. ఉత్తరభారతదేశంలో సామ్యవాదం విస్తరించడం పూర్తిగా వీరి చలువవల్లే.

* * *

# 21 స్వదేశీ సంస్థానాలలో 1927-1929

సహాయనిరాకరణోద్యమం 1922లో ముగిసిపోయిన తదుపరి సంవత్సరాల్లో కూడా వివిధ కార్యక్రమాలద్వారా జాతీయవాద స్ఫూర్తి ఇంకా వెలుగుతూనే వచ్చింది. గాంధీ ప్రబోధించిన విభిన్నమైన కార్యక్రమాలను అమలు చేస్తూపోవడం వల్ల కార్యకర్తలు మారుమూలగ్రామాల్లోకి సైతం చొచ్చుకుపోగలిగారు. మరోవైపు స్వరాజ్యవాదులు చట్టసభల్లో వివిధ సందర్భాల్లో ప్రభుత్వం చేత గోడకుర్చీ వేయించారు. 1922-24 మధ్యకాలంలో ఆంధ్రలో రామచంద్రరాజు నాయకత్వంలో కోయలు వలసపాలకుల సైన్యంపై వీరోచితమైన పోరాటం చేశారు. పంజాబ్‌లో అకాలీల ఉద్యమం, 1923లో నాగపూర్‌లో జాతీయపతాక గౌరవప్రతిష్టలు కాపాడటానికి సత్యాగ్రహులు కనబరిచిన దీక్షాదక్షతలు, ఇంకా దేశవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో జరిగిన వ్యవస్థాగత, సైద్ధాంతిక ఉద్యమాలు, కార్యక్రమాలు జాతీయస్ఫూర్తిని పదిలంగా నిలబెడుతూ వచ్చాయి.

అయితే,1927 ద్వితీయార్థమే విస్తృతస్థాయి ప్రజా ఉద్యమానికి నాంది పలికింది. భారతీయులకు ఈ అవకాశాన్ని ప్రసాదించింది కూడా బ్రిటిష్‌పాలకులే. భారతదేశం మరిన్ని రాజ్యాంగ సంస్కరణలకు సంసిద్ధంగా ఉన్నదా, ఎటువంటి సంస్కరణలు అక్కడ ప్రవేశపెట్టాల్సి ఉందన్న అంశాలను పరిశీలించడానికి 1927 నవంబరు 8వతేదీన బ్రిటిష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ప్రకటించింది. ఈకమిషన్‌లో సభ్యులందరూ తెల్లవారే. 1919నాటి రాజ్యాంగసంస్కరణలు నామమాత్రంగానే ఉన్నాయనీ, సాధ్యమైనంత వెంటనే రాజకీయాధికారానికి సంబంధించిన సమస్యను

తేల్చమంటూ జాతీయవాదులు వత్తిడి తెస్తూవచ్చినప్పటికీ ప్రభుత్వం వారి విజ్ఞప్తులను ఖాతరు చేయలేదు. కొత్త ప్రతిపాదనలను పరిశీలించాలంటే గతంలో విధించిన పదేళ్లగడువు పూర్తికావల్సిందేనంటూ ప్రభుత్వం ఇంతకాలం పట్టుపట్టుకుకూచుంది. అయితే, బ్రిటన్‌లోని కన్సర్వేటివ్ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో లేబర్‌పార్టీ చేతుల్లో పరాజయం పాలయ్యేసూచనలు కనిపించడం మొదలైంది. బ్రిటిష్‌సామ్రాజ్య భవితవ్యానికి సంబంధించిన ఒక ప్రధానమైన అంశాన్ని ఏమాత్రం అనుభమూ, బాధ్యతా లేని లేబర్‌పార్టీ చేతుల్లో పెట్టడం మంచిదికాదని భావించిన కన్సర్వేటివ్‌పార్టీ 1927లో రాజ్యాంగసంస్కరణలకు సంబంధించి ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్‌కు ఆంగ్లేయుడైన సర్ జాన్ సైమన్ అధ్యక్షుడు కాబట్టి ఆయన పేరుతోనే అది ప్రసిద్ధిచెందింది.

కమిషన్ ఏర్పాటు భారతీయులను ఆగ్రహోదగ్రులను చేసింది. భారతదేశ రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించే కమిషన్‌లో ఒక్క భారతీయుడు కూడా లేకుండాపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. దీనిని భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడానికి బ్రిటిష్ ప్రభుత్వం బుద్ధిపూర్వకంగా చేసిన ప్రయత్నంగా ప్రజలు భావించారు. చివరకు రాజకీయాభిప్రాయాల్లో ఎంతో ఉదారంగా ఉండేవారు కూడా ఈ రకమైన అవమానాన్ని తట్టుకోలేకపోయారు. తేజ్ బహదూర్ సప్రు నేతృత్వంలోనే లిబరల్ ఫెడరేషన్, భారతపారిశ్రామిక–వాణిజ్య కాంగ్రెస్, హిందూమహాసభ సైమన్ కమిషన్ బహిష్కరణకు మద్దతు ప్రకటించాయి. ముస్లింలీగ్ ఈ విషయంలో చీలిపోయినప్పటికీ అత్యధికుల మద్దతు ఉన్న జిన్నా కూడా బహిష్కరణకు అనుకూలంగా ఉన్నారు.

అయితే, కేవల బహిష్కరణను భారత జాతీయ కాంగ్రెస్ ఒక మహోన్నత ప్రజాదరణగల ఉద్యమంగా మార్చింది. 1927 డిసెంబరు నాటి మద్రాసు సదస్సులో సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలని కాంగ్రెస్ తీర్మానించుకుంది. అప్పటి సానుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుని సంపూర్ణ స్వాతంత్ర్యమే కాంగ్రెస్ లక్ష్యంగా ప్రకటిస్తూ మరో తీర్మానాన్ని కూడా నెహ్రూ ఆమోదింపచేశారు. అయితే, నిరసన కేవలం తీర్మానాలకు మాత్రమే పరిమితం కాకూడదు. 1928 జనవరి 12నాటి 'యంగ్ ఇండియా'లో గాంధీజీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. '....దీనికి సరైన జవాబు స్వాతంత్ర్యానికి సంబంధించిన తీర్మానమేనని అంటున్నారు....కానీ, మనం ఇప్పుడు మాట్లాడవలసింది ఈ నియామకానికి (సైమన్‌కమిషన్) సంబంధించి. ఎంతటి అద్భుతమైన ప్రసంగాలైనా, ఎంతటి ధీరోదాత్తమైన

తీర్మానాలైనా వారు చేసిన పనికి సరైన జవాబు కాదు. మనం చేపట్టబోయే చర్యే సరైన జవాబు అవుతుంది'.

1928 ఫిబ్రవరి 3వతేదీన సైమన్, ఆయన తోటిసభ్యులు భారతదేశంలో కాలుమోపగానే తగిన జవాబు చెప్పే కార్యక్రమం ఆరంభమైంది. ఆరోజున దేశంలోని అన్ని ప్రధాన నగరాలూ, పట్టణాలూ జనసముద్రంతో హోరెత్తిపోయాయి. ప్రజలు వేల సంఖ్యలో వీధుల్లోకి వచ్చి హర్తాళ్ళు, ర్యాలీలూ, ప్రదర్శనల్లో పాల్గొన్నారు. నల్లజెండాలు చేతబట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలుచేశారు. మద్రాసులో పోలీసులకూ, ప్రదర్శనకారులకూ మధ్య ఘర్షణ చెలరేగి కాల్పుల్లో ఒకవ్యక్తి మరణించాడు. ఆ స్థలానికి వెళ్ళేందుకు ప్రయత్నించిన టంగుటూరి ప్రకాశంను పోలీసులు అడ్డగించారు. ఆగ్రహోదగ్రుడైన ప్రకాశం తన ఛాతి ఎదురొడ్డి సాయుధులైన పోలీసులను సత్తా ఉంటే కాల్చమంటూ హూంకరించిన వైనం యావత్ భారతదేశంలోనూ సంచలనం సృష్టించింది. సైమన్ వెళ్ళిన ప్రతిచోటా– కలకత్తా, లాహోర్, లక్నో, విజయవాడ, పూనా– నల్లజెండాలుచేబూనిన జనసముద్రం ఆయనకు స్వాగతం చెప్పింది. అంతేకాదు, ప్రతిచోటా కూడా నిరసన వినూత్నరూపాలను సంతరించుకుంది. ఉదాహరణకు, పూనాలో యువకులంతా ఒక అద్భుతమైన విన్యాసం చేశారు. లోనావాలా నుంచి పూనావెళ్లే దారిలో రైలు,రోడ్డుమార్గాలు పరస్పరం కనిపిస్తూ ఉంటాయి. పూనా యువకులు లారీ ఎక్కి నల్లజెండాలు ఊపుతూ సైమన్ బృందం ప్రయాణిస్తున్న రైలుతోపాటుగానే లోనావాలనుంచి పూనావరకూ రోడ్డు మార్గంలో ప్రయాణించారు. లక్నోలో తాలూక్‌దార్లు కమిషన్ సభ్యుల గౌరవార్థం కైసర్‌బాగ్‌లో విందు ఏర్పాటుచేసినప్పుడు 'గోబ్యాక్ సైమన్' అన్న ప్రసిద్ధ నినాదాన్ని ముద్రించిన బెలూన్లు, గాలిపటాలతో అక్కడి ఆకాశమంతా నిండిపోయింది.

సైమన్ బహిష్కరణ ఉద్యమంలో ఇటువంటి అనేక ఉత్తేజకరమైన, హాస్యభరితమైన సంఘటనలు ఎన్నో ఉన్నప్పటికీ వాటికి తోడుగా విషాదాన్ని మిగల్చిన సంఘటనలు కూడా అనేకం. ప్రదర్శనకారులపై పోలీసులు జరిపిన జులుం అనూహ్యామైనది, ఘోరాతిఘోరమైనది. లాఠీచార్జీలు సర్వసామాన్యమైపోయాయి. భారతీయులు గౌరవించే, అభిమానించే పెద్ద నాయకులు కూడా లాఠీ దెబ్బలు చవిచూడాల్సి వచ్చింది. లక్నోలో జవహర్‌లాల్ నెహ్రూ, గోవింద్ వల్లభ్ పంత్‌లను పోలీసులు విపరీతంగా కొట్టారు. లాహోర్‌లో అత్యంత అమానవీయమైన, దారుణమైన ఘటన జరిగింది. 1928 అక్టోబర్

30న పంజాబ్‌కు చెందిన మహోన్నత నాయకుడు లాలాలజ్‌పత్‌రాయ్‌ని పోలీసులు విపరీతంగా కొట్టడంతో ఛాతిమీద తగిలిన దెబ్బలకు తీసుకుని ఆ మహానుభావుడు నవంబరు 17వతేదీన కన్నుమూశాడు. ఆయన మరణమే భగత్‌సింగ్‌లోనూ, ఆయన కామ్రేడ్‌లోనూ ప్రతీకారేచ్ఛ రగల్చి అందుకు కారకుడైన పోలీసు అధికారి శాండర్స్‌ను డిసెంబరులో హత్యచేయడానికి పురికొల్పింది.

* * *

సైమన్ బహిష్కరణ ఉద్యమం కొత్తతరం యువతకు రాజకీయచర్యలోని మాధుర్యాన్ని తొలిసారిగా రుచిచూపించింది. నిరసన ప్రదర్శనల్లో ఎంతో ఉత్సాహంగా, ఉద్రేకంగా పాలుపంచుకోవడమే కాక, ఆ ఉద్యమానికి పోరాటస్వభావాన్ని కూర్చిపెట్టింది కూడా ఈ యువతరమే. యువకులకు సంబంధించిన ఉద్యమాలు 1927 నాటికే మొగ్గతొడుగుతున్నప్పటికీ, సైమన్ బహిష్కరణోద్యమంలో పాలుపంచుకోవడం వల్ల ఈ ఉద్యమాలు వ్యవస్థీకృతరూపాన్ని సంతరించుకోగలిగాయి. వివిధ లీగ్‌లూ, సంఘాలూ దేశవ్యాప్తంగా ఆవిర్భవించాయి. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ ఈ కొత్త తరానికి నాయకులుగా అవతరించారు. వారు దేశవ్యాప్తంగా వివిధ ప్రావిన్సులలో పర్యటిస్తూ యువ, విద్యార్థిసంఘాలనూ, సంస్థలనూ ఉద్దేశించి ప్రోత్సాహకరమైన ప్రసంగాలు చేశారు.

యువతరంలో వచ్చిన ఈ భావావేశవెల్లువ అనేక నూతన ఆలోచనల విస్తరణకు కూడా వీలుకల్పించింది. అప్పుడప్పుడే భారతదేశ తీరాన్ని తాకుతున్న సామ్యవాద పవనాలు దేశంలోకి ప్రవేశించి బలపడటానికి ఇది దోహదపడింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రజెల్స్‌లో జరిగిన సదస్సుకు భారత జాతీయ కాంగ్రెస్ తరఫున హాజరై 1927లో స్వదేశానికి చేరుకున్న నెహ్రూ సోవియట్ యూనియన్‌ను కూడా సందర్శించి అక్కడి సామ్యవాద భావనలకు తీవ్రంగా ప్రభావితుడైనాడు. ఆయన తన ఆలోచనలను పంచుకున్నది మొదట యువతతోనే. ఈ దేశంలో సామ్యవాద దృక్పథానికి ప్రజాదరణను సమకూర్చిపెట్టడంలో జవహర్‌లాల్ బృందానిది అగ్రస్థానమే అయినప్పటికీ ఇతర గ్రూపులూ, వ్యక్తులూ ఈ విషయంలో నిర్వహించిన పాత్ర తక్కువేమీ కాదు. వ్యక్తుల్లో ప్రథమంగా చెప్పుకోవలసిన పేరు సుభాష్‌చంద్రబోస్. అదేవిధంగా, లాహోర్‌లోని నవ్‌జీవన్ భారత్‌సభతోపాటు రైతులనూ, కార్మికులనూ సంఘటితంచేసే లక్ష్యంతో వివిధ రైతు,కార్మిక

పార్టీలను ఏర్పాటు చేసిన చిన్నచిన్న కమ్యూనిస్టు గ్రూపులవరకూ అన్నీ సామ్యవాద విస్తరణలో తోడ్పడ్డాయి. తత్ఫలితంగా, సామ్రాజ్యవాద వ్యతిరేకోద్యమంలో ఉన్న యువకులు మరోపక్కన సామ్యవాద అనుకూలురుగా మారడం కూడా జరిగింది. కొన్ని ప్రాంతాల్లో యువకబృందాలు రైతు–కార్మిక ఉద్యమాలతో సంబంధాలను పెంచుకోవడం కూడా జరిగింది.

వివిధ వర్గాలు, విభిన్నమైన రాజకీయాభిప్రాయాలూ ఉన్న భారతదేశంలో రాజకీయ సంస్కరణలకు సంబంధించి ఒక కచ్చితమైన విధానాన్ని ఎవరూ తయారుచేయలేరని సైమన్ కమిషన్ నియామకానికి కారకుడైన బ్రిటిష్ విదేశాంగమంత్రి లార్డ్ బర్కెన్‌హెడ్‌కు అపరిమితమైన నమ్మకం. ఈ సవాలును కూడా జాతీయనాయకులు ఎదుర్కొన్నారు. ముఖ్యమైన నాయకులు, పార్టీలూ కలిసి అందరికీ ఆమోదయోగ్యమైన భారతరాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా బ్రిటిష్ సవాలును ఎదుర్కొనాలని నిర్ణయించారు. అందుకోసం 1928 ఫిబ్రవరి, మే, ఆగస్టునెలల్లో అఖిలపక్షసమావేశాలు జరిగాయి. మోతీలాల్‌నెహ్రూ అధ్యక్షతన ఏర్పడిన ఉపసంఘం ఒక నమూనాను రూపొందించి నివేదికను సమర్పించింది. అదే నెహ్రూ నివేదిక. రాజ్యాంగసంస్కరణల్లో తొలిమెట్టుగా అధినివేశ ప్రతిపత్తి (డొమినియన్ స్టేటస్)ని భారతదేశం కోరుకుంటున్నదని నివేదిక తెలియచెప్పింది. గతకాలంనాటి సంస్కరణలు ప్రధానంగా ఆధారపడిన– మతప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించే విధానాన్ని– ఈ నివేదిక తిరస్కరించింది. కేంద్రస్థాయిలోనూ, ముస్లింలు అల్పసంఖ్యాకులుగా ఉన్న ప్రావిన్సుల్లోనూ చట్టసభల్లో వారికోసం కొన్ని సీట్లను కేటాయించడం మాత్రమే జరుగుతుంది కానీ, సంఖ్యాపరంగా వారు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాదని నివేదిక వివరించింది. మహిళలకు సమానహక్కులు, సంఘాలను ఏర్పరుచుకునే హక్కు, మత వ్యవహారాల్లో రాజ్యం ఏ రూపంలోనూ జోక్యం చేసుకోకపోవడం వంటివి కూడా ఈ నివేదిక సూచించింది. ఈ నివేదికకు సంబంధించిన చర్చలు సాగుతుండగానే, ముస్లింలీగ్‌లోని ఒక వర్గం విభేదించింది కనుక అది నివేదికను స్వాగతిస్తుందని ఎలాగూ భావించలేం. కానీ, జిన్నా నాయకత్వంలోని వర్గం కూడా ముస్లింలు మెజారిటీగా ఉన్న ప్రావిన్సుల్లో వారికి ప్రత్యేకస్థానాలు కేటాయించాలన్న తమ డిమాండు విషయంలో ఏమాత్రం రాజీపడబోవడంలేదని ఆ ఏడాది చివరినాటికి తేలిపోయింది. మోతీలాల్‌నెహ్రూ, ఇతర

సెక్యులర్ నాయకులు తీవ్రమైన సందిగ్ధావస్థలో పడిపోయారు. ముస్లింనాయకుల మనోభిప్రాయానికి తలొగ్గినపక్షంలో హిందూమతవాదులు తమ మద్దతును ఉపసంహరించుకుంటారు. వీరిని సంతృప్తిపరచాలంటే ముస్లింనాయకులు ఆగ్రహిస్తారు. ఈ దశలో ఇక తమకు రాయితీలు లభించే అవకాశాలు లేవని గ్రహించిన మహమ్మద్ అలీజిన్నా నెహ్రూ నివేదికకు తన మద్దతును ఉపసంహరించుకున్నారు. ఈ నివేదికలో తాను వ్యతిరేకించిన అంశాలనే పునరుద్ఘాటిస్తూ ఆ తరువాత ఆయన ప్రసిద్ధి చెందిన '14 డిమాండ్ల'ను ప్రతిపాదించాడు.

జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలోని యువ జాతీయవాదులకు నెహ్రూ నివేదికపై ఇతరరకాలైన అభ్యంతరాలున్నాయి. 'అధినివేశ ప్రతిపత్తి' అన్న ప్రతిపాదనే వారికి తీవ్ర అసంతృప్తి కలిగించింది. వారి నినాదం 'పూర్ణ స్వరాజ్యం'. 1928 డిసెంబరులో కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో తీవ్రస్థాయిలో చర్చజరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్‌బోస్, సత్యమూర్తి, అధికసంఖ్యాక ప్రతినిధులూ 'పూర్ణస్వరాజ్యం' లేదా సంపూర్ణ స్వాతంత్ర్యానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందంటూ తీర్మానం చేయాలని ఒత్తిడితెచ్చారు. ఎంతో కష్టంమీద జాతీయస్థాయిలో ఏకాభిప్రాయాన్ని సాధించిన 'అధినివేశప్రతిపత్తి' ప్రతిపాదనను తొందరపాటుతనంతో, అంతసులభంగా చేజార్చుకోవడం గాంధీజీ, మోతీలాల్ వంటి అనేకమంది నాయకులకు ఇష్టం లేదు. అందువల్ల బ్రిటిష్ ప్రభుత్వానికి దీని అమలుకు రెండేళ్ళు గడువివ్వాలని వారు భావించారు. తరువాత అధికుల ఒత్తిడిమేరకు దానిని ఏడాదికి కుదించడంతోపాటుగా, ఏడాదిలోగా ప్రభుత్వం అధినివేశ ప్రతిపత్తి ఆధారంగా రాజ్యాంగాన్ని ఆమోదించని పక్షంలో కాంగ్రెస్ సంపూర్ణస్వాతంత్ర్యాన్ని తన లక్ష్యంగా స్వీకరించడమే కాక, ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం శాసనోల్లంఘనోద్యమానికి నడుంబిగిస్తుందని తీర్మానించారు. ఈ తీర్మానానికి అత్యధికశాతం ప్రతినిధులు మద్దతు తెలిపారు. అనంతరం పూర్ణస్వరాజ్యాన్ని వెంటనే కోరుతూ తీర్మానం చేయాలంటూ వచ్చిన కొన్ని ప్రతిపాదనలు సమావేశంలో వీగిపోయాయి.

* * *

ఒకవేళ, 'ఇచ్చిన ఏడాదిగడువు' ముగిసిపోయి, శాసనోల్లంఘనోద్యమాన్ని ఆరంభించాల్సి వస్తే అందుకు తగిన కృషి ఇప్పటినుంచే ఆరంభించాల్సి ఉంది. గాంధీజీ తన యూరప్ పర్యటనను రద్దుచేసుకుని ఈ ప్రయత్నాలకు సంబంధించి 1929 జనవరి

31 యంగ్ ఇండియాలో ఈ విధంగా వ్యాఖ్యానించారు. '... నేను కనుక ఈ పరిస్థితుల్లో యూరప్ వెళితే నాకు అది ఎంతో పాపం చేసిన భావనను మిగల్చుతుంది. రాబోయే కాలానికి సిద్ధంగా ఉండాల్సిన అవసరాన్ని నా ఆత్మ ప్రబోధిస్తున్నది. ఒక మహోన్నతమైన కార్యక్రమానికి ఏ విధంగా సిద్ధం కావాలి, ఏ మార్గాన్ని అనుసరించాలన్న విషయంలో నాకు ఇంకా ఒక అవగాహన లేదు. కానీ, వచ్చే ఏడాది పోరాటానికి– అది ఏ రూపంలో ఉన్నా, ఏ రూపాన్ని తీసుకున్నా– పూర్తిగా తయారు కావాల్సిన అవసరం మట్టుకు ఉంది.'

కానీ, భావిపోరాటానికి గాంధీజీ ప్రజలను విభిన్నమైన విధానాల్లో సంసిద్ధులను చేశారు. ఉదాహరణకు, 1924లో అనారోగ్యకారణాలవల్ల జైలునుంచి విడుదలైన తరువాత ఆయన దేశవ్యాప్తంగా పర్యటించారు. 1929 ఆరంభం నాటికే ఆయన కథియావాడ్, మధ్యప్రావిన్సులు, బెంగాల్,మలబార్, ట్రవాంకోర్, బీహార్, యునైటెడ్ ప్రావిన్సులు, కచ్, అస్సాం, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఒరిస్సాలలో పర్యటన పూర్తిచేశారు. వీటిలో చాలా ప్రాంతాల్లో ఆయన ఒకటికాదు, రెండుసార్లు కూడా పర్యటించారు. 1929లో అంటే, 60వ ఏట ఆయన సింధ్ బయలుదేరారు. అక్కడనుంచి ఢిల్లీ మీదుగా కలకత్తా చేరుకున్నారు. అక్కడనుంచే బర్మా వెళ్ళి మళ్ళీ వెనక్కొచ్చారు. ఇదే ఏడాది ఏప్రిల్‌లో ఆయన ఆంధ్రదేశంలో ఆరువారాలపాటు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన 319 గ్రామాలను సందర్శించారు. జూన్‌లో ఆయన ఉత్తరప్రదేశ్‌లోని పర్వతప్రాంతమైన ఆల్మోరాలో ఉన్నారు. సెప్టెంబర్ నాటికి యు.పి. పర్యటన పూర్తిచేసుకున్నారు. ఏడాది చివర్లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో పాలుపంచుకున్నారు. వాయవ్యప్రావిన్సులోని కోహట్‌లో పర్యటించడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసుకున్నారు కానీ, ప్రభుత్వం ఆయనకు అనుమతి నిరాకరించింది.

విస్తృతప్రజానీకంతో సంబంధాలు నెలకొల్పుకొనేందుకు ఉద్దేశించిన ఇటువంటి పర్యటనలపై గాంధీజీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. '....ప్రజలు నన్నూ, నేను వారినీ కలుసుకోవడమన్నది నాకు ఎంతో ప్రీతిపాత్రమైన విషయం. నేనూ,వారూ కూడా సంతృప్తిపడేట్టు నాకు తోచినదేదో నాలుగుముక్కల్లో చెబుతాను. అది వారి మనస్సుకు హత్తుకుంటుంది, వారిని క్రమంగా, తప్పనిసరిగా ప్రభావితం చేస్తుంది'.

1929 ముందు గాంధీజీ జరిపిన పర్యటనలన్నీ ఆయన ప్రీతిపాత్రమైన కార్యక్రమాలకు–ఖాదీ, హిందూ ముస్లిం సఖ్యత, అస్పృశ్యతానివారణ– సంబంధించినవే.

అయితే, ఇప్పుడు ఆయన ప్రారంభించిన పర్యటనలు మట్టుకు పూర్తిగా రాజకీయచర్యకు ఉద్దేశించినవే. ఉదాహరణకు సింధ్‌లో ఆయన యువతకు 'విషమపరీక్ష'కు సిద్ధంగా ఉండమని పిలుపునిచ్చారు. ఆయన ఆదేశం ప్రకారమే విదేశీవస్త్రాలను బహిష్కరించడం, వాటిని బహిరంగంగా తగలబెట్టడమనే కార్యక్రమం ఉధృతస్థాయిలో సాగేందుకు వీలుగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విదేశీవస్త్ర బహిష్కరణ కమిటీని ఏర్పాటు చేసింది. 1929 మార్చి 4న కలకత్తాలో వేలాదిమంది సమక్షంలో గాంధీజీ విదేశీవస్త్రాలపోకకు నిప్పంటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఆయన అరెస్టుకు వారెంటును జారీ చేసింది కానీ, ఆయన ముందుగా నిర్ణయించుకున్న ప్రకారమే బర్మా వెళ్లనిచ్చింది. బర్మానుంచి తిరిగిరాగానే విచారణను ఎదుర్కోవాల్సివస్తుందని స్పష్టంచేసింది. గాంధీజీ అరెస్టు దేశాన్ని మరింత ఆగ్రహావేశాలకు గురిచేసింది. దేశవ్యాప్తంగా విదేశీవస్త్రాలకుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆయన బర్మానుంచి తిరిగివచ్చి విచారణకు సిద్ధంకాగానే మరోమారు ప్రజలు విదేశీవస్త్రాలను తగులబెట్టి తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. గాంధీజీ వెంటనే ప్రజలకు ఒక విజ్ఞప్తిచేస్తూ, శాసనోల్లంఘనోద్యమానికి సంసిద్ధం కావాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ ఉద్యమం ఇంకా ప్రారంభం కాలేదని గుర్తుంచుకోవాలనీ, అందువల్ల ప్రజలు సాధ్యమైనంతవరకూ చట్టానికి కట్టుబడే వ్యవహరించాలని హితవుచెప్పారు.

ఒకపక్కన శాసనోల్లంఘనోద్యమానికి కాంగ్రెస్ వివిధస్థాయిల్లో, విభిన్నమైన రీతుల్లో ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు అనేక రాజకీయపరిణామాలు కూడా 1929లో ప్రజల్లో ఆవేశం పైస్థాయిలో కొనసాగడానికి దోహదం చేశాయి. 1929 మార్చి 20న ప్రభుత్వం పెద్ద ఎత్తునసాగిన ఏరివేతకార్యక్రమంలో భాగంగా 31మంది కార్మికనాయకులను అరెస్టుచేసింది. వీరిలో అత్యధికులు కమ్యూనిస్టులు. వారిని విచారణ నిమిత్తం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు తరలించింది. గాంధీజీ, కాంగ్రెస్‌లతో సహా జాతీయోద్యమంలోని అన్ని వర్గాలూ ఈ అరెస్టులను తీవ్రంగా ఖండించాయి. యువజన సంఘాలు ప్రదర్శనలను నిర్వహించాయి. 1929 ఏప్రిల్ 8న హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ (హెచ్ఎస్ఆర్ఎ)కి చెందిన భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్తాలు కేంద్రశాసనసభలోకి హానికలిగించని బాంబులు విసిరి అరెస్టయ్యారు. జైల్లో హెచ్ఎస్ఆర్ఎ సభ్యులు రాజకీయఖైదీలకు గౌరవప్రదమైన ఆదరణదక్కాలని డిమాండ్ చేస్తూ నిరశనదీక్ష

ప్రారంభించారు. జతిన్‌దాస్ ఆమరణనిరాహారదీక్షలో 64వరోజున కన్నుమూయడంతో దేశంయావత్తూ భగ్గుమంది. అప్పటివరకూ ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో నిరసనప్రదర్శనలు జరిగాయి.

ఇదిలా ఉంటే, 1929 మేనెలలో బ్రిటన్‌లో రామ్సే మెక్‌డొనాల్డ్ నేతృత్వంలో లేబర్ ప్రభుత్వం ఏర్పడింది. భారతదేశానికి సంబంధించి చర్చించడానికి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్‌ను బ్రిటన్ పిలిపించింది. దాని పరిణామమే అక్టోబర్ 31న ఆయన చేసిన ప్రకటన. భారతదేశ రాజకీయభవిష్యత్తుకు సంబంధించిన 1917 నాటి ప్రకటనలోనే అధినివేశ ప్రతిపత్తి భావన అంతర్లీనంగా ఉందని బ్రిటిష్ ప్రభుత్వం స్పష్టంచేసినట్టు ఆయన ప్రకటించాడు. సైమన్ కమిషన్ తన నివేదికను సమర్పించగానే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని కూడా ఆయన హామీ ఇచ్చాడు. రెండురోజుల అనంతరం ప్రధాన జాతీయనాయకులందరూ సమావేశమై ఢిల్లీ మేనిఫెస్టోగా ప్రసిద్ధి చెందిన ఓ ప్రకటనను విడుదల చేశారు. భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తిని ఎప్పుడు ఇవ్వాలన్న విషయాన్ని చర్చించడానికి కాక, దాని అమలుకు వీలుగా ఒక విధానాన్ని రూపొందించడానికే రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం స్పష్టంచేయాలన్నది ఈ మేనిఫెస్టో సారాంశం. ఈ అంశంపై 1929 నవంబరు 5న లార్డ్స్ సభలో జరిగిన చర్చ బ్రిటిష్‌వారి దురాలోచనను ముందుగానే తెలియచెప్పింది. ఈ అనుమానాలకు తోడుగా డిసెంబరు 23న వైస్రాయ్ ఇర్విన్ గాంధీతోనూ, ఇతర నాయకులతోనూ వారు డిమాండ్ చేస్తున్న ప్రకారం ఈ అంశంపై కచ్చితమైన హామీ ఇచ్చేస్థితిలో తాను లేనని స్పష్టంచేసేశారు. దీంతో మాటల దశ దాటిపోయి చేతల దశ ఆరంభమైంది.

* * *

కాంగ్రెస్ వార్షికసమావేశాల్లో చారిత్రాత్మకమైనదిగా చెప్పుకోదగిన ఒక సమావేశానికి వేదికగా మారిన భాగ్యం లాహోర్‌కు దక్కింది. అదేవిధంగా, భారతీయుల ఆత్మగౌరవాన్ని పరిరక్షించగలిగేది 'పూర్ణస్వరాజ్యం' ఒక్కటేనంటూ ఆ లక్ష్యాన్ని ప్రకటించగల అపూర్వమైన గౌరవం ఆ నినాదానికి ఎంతో ప్రాచుర్యం కల్పించిన నాయకుడు– జవహర్‌లాల్–కు దక్కింది. ఒక మహోన్నతమైన, నిర్ణయాత్మకమైన ప్రజా ఉద్యమం

ఆరంభం కాబోతున్న ఆ సంక్లిష్టమైన సంవత్సరంలో జవహర్‌లాల్‌నెహ్రూకు పార్టీ అధ్యక్షస్థానాన్ని కట్టబెట్టడానికి ప్రధానకారకుడు గాంధీజీ. మొత్తం 18 ప్రావిన్షియల్ కాంగ్రెస్ కమిటీల్లో మూడు మాత్రమే నెహ్రూను పార్టీ అధ్యక్షుడుగా కోరుకున్నాయి. కానీ, అప్పటిపరిస్థితినీ, యువజనంలో వస్తున్న చైతన్యాన్నీ, సైమన్ బహిష్కరణ ఉద్యమంలో వారు నిర్వహించిన పాత్రనూ అర్థంచేసుకున్న గాంధీజీ పట్టుబట్టి తన వాదనను నెగ్గించుకున్నారు. విమర్శకుల వాదనలకు ఆయన ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. 'అధికారం వృద్ధులచేతుల్లోనుంచి యువకుల గుప్పిట్లోకి పోవడం కాంగ్రెస్ వినాశనానికేనని కొందరు భావిస్తున్నారు. నేను మాత్రం అలా అనుకోవడం లేదు.... ఆయన (నెహ్రూ) దుందుడు మనిషనీ, దురితస్వభావనీ కొందరంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి అదనపు అర్హతలే కానీ, లోపాలు కావు. ఆయనలో ఒక యుద్ధవీరుడికి ఉండే ఉద్రేకం, దూకుడుతనంతో పాటు ఒక రాజనీతిజ్ఞుడికి ఉండే వివేకం, విచక్షణ ఉన్నాయి. తన చుట్టూవున్న పరిస్థితులకు అతీతంగా విప్లవాత్మకంగా ఆలోచించే స్వభావం ఉన్నప్పటికీ, ఆ వేగం శృతిమించకుండా నియంత్రించుకోగలిగే జాగ్రత్తా ఉంది. వృద్ధతరం వైదొలగాల్సిందే. ఇప్పుడు భవిష్యత్ పోరాటాన్ని చేపట్టవలసింది యువకులూ, యువతులూ. తమలో ఒకరు నాయకుడుగా వారంతా ముందుకు సాగాలి.... బాధ్యతలు యువతరాన్ని చిత్రికపడతాయి. లక్ష్యాన్ని సాధించడానికి వారిని సంసిద్ధులను చేస్తాయి. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు అన్ని అర్హతలూ ఉన్నాయి. కాంగ్రెస్ కార్యదర్శిగా ఆయన అనేక సంవత్సరాలపాటు అంకితభావంతో తన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చారు. సౌశీల్యం, ధైర్యం, పట్టుదల వంటి సద్గుణాలతో ఆయన ఈ దేశంలోని యువతరం మనసులు చూరగొన్నారు. కార్మికులతోనూ, రైతులతోనూ సత్సంబంధాలు పెంచుకున్నారు. యూరోపియన్ రాజకీయాలతో ఆయనకున్న పరిచయం మన రాజకీయవిధానాలను అంచనావేయడానికి ఎంతో ఉపకరిస్తుంది'.

ప్రభుత్వంతోనూ, వివిధ పార్టీలతోనూ కీలకమైన చర్చలు నిర్వహించాల్సిన తరుణంలో, ఒక మహోన్నతమైన ఉద్యమానికి నాందిపలుకుతున్న స్థితిలో, గాంధీజీయే ఈ బాధ్యతను స్వీకరించాలని వాదించిన వారికి జవాబుగా ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. ' ఈ దేశ ప్రజల విశ్వాసాన్నీ, ఆదరాన్ని నేను పొందుతున్నంతకాలం, ఈ పదవి ద్వారా దక్కే అధికారాలు గుప్పిట్లో లేకుండా నేను అనుకున్నది

సాధించలేమోనన్న భయం నాకు లేదు. అధికారం అవసరం లేకుండానే 1920నుంచి ఇప్పటివరకూ ఈ దేశాన్ని ప్రభావితం చేయగలిగే అవకాశాన్ని ఆ భగవంతుడు నాకు ప్రసాదించాడు'. యువతను ఉద్దేశించి 'జవహర్‌లాల్ ఎన్నికను ఈ దేశయువత వారి సేవలకు లభించిన గుర్తింపుగా భావించాలి. దేశం యావత్తూ యువతరంపై ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి కృషిచేయడం వారి ధర్మం'.

కాంగ్రెస్ అధ్యక్షుడు జవహర్‌లాల్ ప్రసంగం నేరుగా, స్పష్టంగా సాగింది. 'ఈ దేశాన్ని విదేశీపాలననుంచి విముక్తంచేయడమనే బహిరంగకుట్రకు సిద్ధపడ్డాం. ఈ దేశంలోని స్త్రీ పురుషులందరినీ ఇందులో పాలుపంచుకోమని ఆహ్వానిస్తున్నాం' అంటూ ప్రజలను కార్యాచరణకు సిద్ధంకమ్మని ఈ ప్రసంగం పిలుపునిచ్చింది. విముక్తి అంటే కేవలం విదేశీశక్తులనుంచి మాత్రమే కాదని ఆయన తన ప్రసంగంలో స్పష్టంచేశారు. 'నేను సోషలిస్టుననీ, రిపబ్లికన్‌ననీ స్పష్టంగా తెలియచెబుతున్నాను. అలనాటి రాజులూ,రాణుల వ్యవస్థ మీద కానీ, పారిశ్రామిక చక్రవర్తులను సృష్టించే ఈనాటి వ్యవస్థమీద కానీ నాకు నమ్మకం లేదు. ఈ ఆధునిక చక్రవర్తులకు ప్రజల జీవితాలమీదా, వారి భవితవ్యంమీదా గతకాలంనాటి చక్రవర్తులకంటే ఎక్కువగా పట్టు ఉంది. అప్పటి నియంతృత్వ రాజరికం కంటే వీరు ఇప్పుడు అనుసరిస్తున్న విధానాలు ప్రజలను మరింత హింసిస్తున్నాయి'. ఆయన తన ప్రసంగంలో పోరాట విధానాలను గూర్చికూడా ప్రస్తావించారు. 'విముక్తికోసం జరిగే ప్రతి మహోన్నత పోరాటమూ ప్రజా ఉద్యమంగానే ఉంటుంది. ప్రజా ఉద్యమాలన్నీ శాంతియుతంగానే సాగాలి. ఇటువంటి ఉద్యమాల్లో అవాంఛనీయమైన పరిణామాలు చోటుచేసుకున్నప్పుడు వాటి ప్రభావం ఉద్యమంమీద పడుతుందనీ, ఉద్యమం బలహీనపడుతుందనీ గుర్తుంచుకోవాలి'.

1929 డిసెంబరు 31 అర్ధరాత్రి, రావి నది ఒడ్డున జయజయధ్వానాల మధ్య, ఆనందం, ఆవేశం కలగలిసిన తరుణాన కొత్తగా రూపొందిన మువ్వన్నెలజెండా ఆవిష్కరణ జరిగింది. అంతటిసంతోష సమయంలోనూ కొత్త సంవత్సరంలో తాము ఒక మహోద్ధృతమైన పోరుకు సన్నద్ధం కావాల్సిన వాస్తవాన్ని ఎవరూ విస్మరించలేదు.

* * *

ప్రజలను కర్తవ్యోన్ముఖులను చేసే కృషి ఆరంభమైంది. 1930 జనవరి 26న బహిరంగసభలు ఏర్పాటు చేసి అందులో స్వాతంత్ర్యప్రతిజ్ఞ చదవడం, అందరూ ముక్తకంఠంతో దానిని పునరుద్ఘాటించడం జరిగింది. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయం సాధించింది. పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ జరిగిన చిన్నాపెద్దా సభల్లో ప్రజలు స్థానికభాషల్లోకి అనువదించిన ఆ ప్రతిజ్ఞను చదివి తరువాత త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. ఆ ప్రతిజ్ఞ సారాంశాన్ని చూడండి.

'భారతీయప్రజలకు, ఇతర ప్రజలమాదిరిగానే తమ శ్రమశక్తి ఫలాలను అనుభవిస్తూ తద్వారా జీవనానికి కావలసిన మౌలిక అవసరాలను తీర్చుకుంటూ, అభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకునే హక్కు ఉందని మేము విశ్వసిస్తున్నాము. ఈ హక్కులను నిరాకరించిన, వారిని అణచివేసిన ఏ ప్రభుత్వాన్నైనా మార్చుకునే లేదా కూలదోసే హక్కు కూడా ఉందని మేము విశ్వసిస్తున్నాము. భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వం భారతీయ ప్రజలకు స్వేచ్ఛను నిరాకరించడమే కాక, ఈ దేశప్రజలను దోపిడీచేయడం ద్వారా అధికారంలో నిలబడుతోంది. అది భారతదేశాన్ని ఆర్థికం, రాజకీయంగా, సాంస్కృతికంగా నాశనం చేసింది. అందువల్ల, భారతదేశం బ్రిటిష్‌సంబంధాన్ని తెంపుకొని పూర్ణస్వరాజ్యం లేదా సంపూర్ణస్వాతంత్ర్యాన్ని పొందాలని మేము భావిస్తున్నాము'.

'భారతదేశం ఆర్థికంగా నాశనమైంది. ప్రజలనుంచి ప్రభుత్వం పొందుతున్న ఆదాయం ప్రజల సంపాదనకంటే అత్యధికంగా ఉంది. మా సగటు ఆదాయం రోజుకు ఏడుపైసలు లేదా రెండుపెన్నీలకంటే తక్కువ. కానీ, మేము చెల్లిస్తున్న అత్యధికపన్నులు– రైతులనుంచి 20శాతం భూమిశిస్తు, మూడుశాతం ఉప్పుపన్ను – నిరుపేదలను చావుదెబ్బతీశాయి'.

'చేనేతవంటి గ్రామీణ పరిశ్రమలు పూర్తిగా నాశనమైపోయాయి. చేతివృత్తులు దెబ్బతినడంతో రైతులు ఏడాదికి నాలుగునెలలపాటు పనిలేకుండా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామీణప్రజల్లో నైపుణ్యం అడుగంటిపోతోంది. వినాశనమే సాగుతోంది కానీ, మిగతాదేశాల్లో మాదిరిగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కనిపించడం లేదు'.

'శ్రమజీవులమీద మరింత భారాన్ని మోపే విధంగా కరెన్సీ, కస్టమ్స్ విధానాలను చిత్తంవచ్చినట్టుగా రూపొందిస్తున్నారు. దిగుమతుల్లో అధికశాతం బ్రిటిష్ తయారీవస్తువులే. కస్టమ్స్ విధానం బ్రిటిష్ తయారీదారులకు అనుకూలంగా రూపొందించారు. దీనినుంచి వచ్చే ఆదాయాన్ని కూడా ఈదేశ ప్రజలకోసం వినియోగించకుండా పరిపాలనాయంత్రాంగపు ఆడంబరాలకు ఖర్చుచేస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా, అవకతవ ద్రవ్యమార్పిడి విధానం వల్ల ఈ దేశంనుంచి కోట్లాదిరూపాయలు తరలిపోయాయి'.

'రాజకీయంగా భారతదేశ స్థాయి బ్రిటిష్‌పాలనలో దిగజారినంతగా ఎన్నడూ దిగజారలేదు. ఏ సంస్కరణలూ కూడా ప్రజలకు వాస్తవిక అధికారాలను కల్పించలేదు. మాలో మహోన్నతుడు కూడా విదేశీ అధికారం ముందు తలవొంచుకు నిలబడాల్సిన పరిస్థితి కల్పించారు. భావవ్యక్తీకరణస్వేచ్ఛనూ, సంఘాలను ఏర్పరుచుకునే హక్కునూ నిరాకరించారు. మాలో చాలా మంది ఇళ్ళు విడిచి విదేశాల్లో తలదాచుకోవలసిన తప్పనిసరి పరిస్థితులను కల్పించారు. మా పరిపాలనా సమర్థతను సర్వనాశనం చేసి ప్రజలు గుమాస్తాపదవులతోనూ, గ్రామస్థాయిపదవులతోనూ సర్దుకుపోవాల్సిన దుర్గతి కల్పించారు'.

'విద్యావిధానం మా కలలను ఛిద్రంచేసింది. బానిస సంకెళ్ళు వేసింది. మాకు లభిస్తున్న శిక్షణ ఆ సంకెళ్ళను మరింత బలంగా పొదివిపట్టుకునేందుకే తోడ్పడుతోంది'.

'నిరాయుధులను చేసి మమ్మల్ని అడుగడుగునా అణచివేసే ప్రక్రియ మాలో శౌర్యాన్ని చంపివేస్తున్నది. తిరుగుబాటు తత్వాన్ని పాశవికంగా అణచివేసే లక్ష్యంతో పనిచేస్తున్న విదేశీసైన్యం మాలో పోరాటస్ఫూర్తిని నాశనం చేసింది. మా క్షేమాన్ని మేం చూసుకోలేమనీ, విదేశీ చొరబాటుకు ఎదురొడ్డలేమనీ, కనీసం మా ఇళ్ళనూ, కుటుంబాలనూ దొంగలనుంచీ, దోపిడీదారులనుంచీ కూడా రక్షించుకోలేమని అనిపించేంతగా మమ్మల్ని తయారుచేశారు.'

'ఈ దేశానికి నాలుగుమూలలనుంచీ కమ్ముకొస్తున్న ఈ రకమైన వినాశనాన్ని భరిస్తూ ఇంకా లొంగిపడివుండడం మానవుడికీ, దేవునికీ కూడా మహాపచారంగా మేము భావిస్తున్నాము. అయితే, హింసద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించడం సరైన,

ప్రభావవంతమైన మార్గమని మేము అనుకోవడం లేదు. బ్రిటిష్ ప్రభుత్వంతో సాధ్యమైనంతవరకూ మేం అన్నిరకాల బంధాలనూ తెంపుకుంటాం. మా నుంచి ఏ విధమైన సహకారమూ దక్కకుండా చేస్తాం. పన్నుల చెల్లింపులు మానివేయడంతో సహా అన్ని విధాలుగా శాసనోల్లంఘనకు సంసిద్ధులమవుతాం. మా స్వచ్ఛందసహకారాన్ని వదులుకోవడం ద్వారా, పన్నులను చెల్లించకపోవడం ద్వారా, ఎంతరెచ్చగొట్టినా హింసామార్గాన్ని అనుసరించకపోవడం ద్వారా ఈ అమానుషపాలనకు భరతవాక్యం పలకగలమని మా సంపూర్ణవిశ్వాసం. అందువల్ల, 'పూర్ణస్వరాజ్యా'న్ని సాధించే లక్ష్యంతో, ఆ దిశగా ముందుకు సాగడానికి భారతజాతీయ కాంగ్రెస్ ఎప్పటికప్పుడు జారీచేసే ఆదేశాలను అమలు చేస్తామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాము.'

* * *

# 22 శాసనోల్లంఘన 1930-1931

పన్నుల నిరాకరణసహా శాసనోల్లంఘనాన్ని అమలు చేయడానికి 1929నాటి లాహోర్ కాంగ్రెస్ సమావేశం వర్కింగ్‌కమిటీకి అధికారాలు కట్టబెట్టింది. చట్టసభల్లో ఉన్న తన ప్రతినిధులందరూ రాజీనామా చేయాలని కూడా పిలుపునిచ్చింది. 1930లో సబర్మతీ ఆశ్రమంలో వర్కింగ్ కమిటీ సమావేశమై శాసనోల్లంఘనోద్యమాన్ని ఎప్పుడు, ఎక్కడ ఆరంభించాలన్నది గాంధీజీ నిర్ణయానికే వదిలివేసింది. ప్రజాపోరాటాలను నిర్మించడంలో సాటిలేని ఈ మనిషి ఒక ప్రభావవంతమైన మార్గాన్ని అన్వేషించడంలో నిండామునిగి ఉన్నారు. లార్డ్ ఇర్విన్‌కు జనవరి 31న ఆయన సమర్పించిన 11అంశాలతో కూడుకున్న డిమాండ్‌ను ప్రభుత్వం బేఖాతరుచేసింది. అందువల్ల, ఇప్పుడు ఆయన ముందు శాసనోల్లంఘనకు సిద్ధపడటం మినహా మార్గాంతరం లేదు.

* * *

ఫిబ్రవరి ఆఖరునాటికి కార్యక్రమం ఒక రూపాన్ని సంతరించుకోవడం ఆరంభించింది. గాంధీజీ దృష్టి ఉప్పు మీద పడింది. 'నీరు తరువాత ఉప్పును మించిన కనీస అవసరం మరొకటి లేదు. దానిమీద పన్నువేయడం ద్వారా ఆకలితో నకనకలాడుతున్న కోట్లాదిబడుగుజీవుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. కనీసం ఊహకుకూడా అందని ఒక అమానుషమైన పన్ను ఇది' అని ఆయన వ్యాఖ్యానించారు. మార్చి 2వతేదీన ఆయన వైస్రాయ్‌కు రాసిన లేఖ చారిత్రాత్మకమైనది. అందులో ఆయన బ్రిటిష్‌పాలనను ఒక పీడనగా అభివర్ణిస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు. '... ఒక క్రమపద్ధతిలో సాగుతున్న దోపిడి, నోరూవాయాలేని కోట్లాదిమంది ప్రజల జీవితాలను మరింత దుర్భరస్థితిలోకి నెట్టివేస్తున్నది.... ఈ పాలన

రాజకీయంగా మమ్మల్ని బానిసత్వానికి దిగజార్చింది. మా సాంస్కృతిక మూలాలను తురిమివేసేందుకు ప్రయత్నిస్తోంది. మా ఆత్మవిశ్వాసాన్ని అధోగతిపాల్జేస్తోంది'. తరువాత ఆయన తన కార్యక్రమాన్ని వైస్రాయ్‌కు ఈ విధంగా తెలియచేశారు. '.... ఈనెల 11వ రోజున నేను ఆశ్రమానికి చెందిన నా సహచరులతో కలసి ఉప్పుచట్టాలను ఉల్లంఘించడానికి సాగబోతున్నాను. నన్ను అరెస్టుచేయడం ద్వారా ఈ కార్యక్రమాన్ని విచ్ఛిన్నంచేయడానికి మీకు అవకాశం ఉందని కూడా నాకు తెలుసు. అయితే, అది జరిగిన తరువాత ఈ కార్యక్రమాన్ని ఒక క్రమబద్ధమైన రీతిలో కొనసాగించడానికి వేలాదిమంది సంసిద్ధులై ఉన్నారని నా విశ్వాసం. శాసనగ్రంథాల్లో చోటుసంపాదించడానికి ఏమాత్రం అర్హతలేని ఒక చట్టాన్ని ఉల్లంఘించినందుకు ప్రభుత్వం విధించే శిక్షలను భరించడానికి వారు సర్వసన్నద్ధంగా ఉన్నారని మీకు తెలియచేస్తున్నాను'.

ఈ కార్యక్రమాన్ని ప్రకటించినప్పుడు చాలామంది దాని శక్తిని గ్రహించలేకపోయారు. కార్యక్రమం పకడ్బందీగా రూపొందింది. దాని ప్రకారం, దేశంలోని ప్రతి ప్రాంతంనుంచీ, ప్రతీమతంనుంచీ గాంధీజీ స్వయంగా ఎంపిక చేసిన 78మంది అనుచరులతో కలసి సబర్మతి ఆశ్రమంనుంచి బయలుదేరి అనేక గ్రామాలమీదుగా 200మైళ్ళు నడిచి గుజరాత్ సముద్రతీరాన ఉన్న దండి గ్రామాన్ని చేరుకోవాలి. అక్కడ ఆయన తన అనుచరులతో కలిసి సముద్రతీరాన ఉప్పును సేకరించి ఉప్పుచట్టాన్ని ఉల్లంఘిస్తారు. ఈ పాదయాత్ర ప్రారంభం కాకముందే దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వేలాదిమంది ఆశ్రమానికి చేరుకున్నారు. గాంధీజీ వారందరికీ ఎంతో సహనంతో తన ప్రణాళికను వివరించారు. భవిష్యత్ కార్యక్రమానికి సూచనలు చేశారు. అహింసాయుత విధానంలో ఉన్న ఔన్నత్యాన్ని మరోమారు విశదీకరించారు. ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించే అవకాశాలున్నాయో సూచించారు. '...అవకాశం ఉన్నచోటల్లా ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించే కార్యక్రమాలు అమలు జరగాలి. విదేశీ మద్యం, వస్త్రాల దుకాణాలముందు పికెటింగ్ జరగాలి. మనకు తగినంత శక్తిసహనాలు ఉన్నప్పుడే పన్నులను చెల్లించడానికి నిరాకరించగలం. న్యాయవాదులు తమ వృత్తిని వదులుకోవాలి. ప్రజలు కేసులనుంచి వైదొలిగినప్పుడు న్యాయస్థానాలను బహిష్కరించడం సాధ్యపడుతుంది. ప్రభుత్వోద్యోగులు తమ పదవులకు రాజీనామా చేయాలి.... వీటన్నింటి ఆచరణా ఒకే ఒక నిబంధనకు లోబడి జరగాలి. స్వరాజ్యాన్ని సాధించడానికి సత్యం–అహింసలతో కూడిన మార్గాన్ని మాత్రమే అనుసరిస్తామన్న ప్రమాణానికి మనం కట్టుబడి ఉండాలి'.

'శాసనోల్లంఘన'కు ఉన్న శక్తిసామర్థ్యాలను ఆయన ఈ విధంగా వివరించారు. '... ఈ దేశంలోని 7లక్షల గ్రామాలనుంచి గ్రామానికి పదిమంది చొప్పున ముందుకు వచ్చి ఉప్పుసత్యాగ్రహాన్ని ఆచరిస్తే ఏం జరుగుతుంది? ఎంతటి దుర్మార్గమైన ప్రభుత్వమైనా శాంతియుతంగా ప్రతిఘటిస్తున్న వేలాదిమందిపై శతఘ్నులను ప్రయోగించలేదు. వారిని

తుత్తునియలుగా పేల్చివేయలేదు. మీరు కొద్దిగా త్యాగం చేస్తే, మనం ఈ ప్రభుత్వాన్ని అనతికాలంలోనే బలహీనపరచగలమని నేను హామీ ఇస్తున్నాను.'

మార్చి 10వతేదీన ఆశ్రమంలో తనను కలుసుకోవడానికి వచ్చిన ప్రజానీకాన్ని ఉద్దేశించి అహింసాయుత విధానం అత్యధికశాతం ప్రజలను ఉద్యమంలో ఏ విధంగా భాగస్వాములను చేస్తుందో, ప్రభుత్వాన్ని ఏ విధంగా సందిగ్ధస్థితిలోకి నెట్టివేస్తుందో ఆయన వివరించారు. 'పోరాటం ఆరంభం కావడానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉండగా మీరు ఇంత నిర్భయంగా ఇక్కడకు ఎలా రాగలిగారు? తుపాకులనూ, బాంబులనూ ఎదుర్కోవలసిన పరిస్థితులే ఉంటే మీరెవ్వరూ ఇక్కడకు వచ్చి ఉండేవారు. కానీ, మీకు ఇప్పుడు బాంబులూ,తుపాకులు భయం లేదు. ఒకవేళ నేను హింసాయుత ఉద్యమానికి ఆరంభించబోతున్నాననుకోండి, (...తుపాకులతోనే అక్కరలేదు, కర్రలూ,రాళ్ళతోనైనా) ప్రభుత్వం నన్ను ఇప్పటివరకూ ఇలా స్వేచ్ఛగా వదిలేసి ఉండేదా? అంతెందుకు, హింసాయుత ప్రతిఘటనను (ఇంగ్లండ్‌లో కానీ, అమెరికాలో కానీ, రష్యాలోకానీ) ఒక్కరోజైనా సహించిన ప్రభుత్వం చరిత్రలో ఉందా? కానీ, ఇప్పుడు, ఇక్కడి ప్రభుత్వం ఒక అయోమయ,గందరగోళ స్థితిలో నిండామునిగిపోయి ఉందని మీకు తెలుసు.అందుకే ఇక్కడకు రాగలిగారు'.

తన అనుచరులు వెంటవస్తుండగా గాంధీజీ పాదయాత్ర ప్రారంభించారు. దేశప్రజల మనోఫలకాలపై కదలాడిన ఆ అద్భుతదృశ్యం ప్రజలను సమ్మోహితులను చేసింది. ఆయన ప్రతీ అడుగూ, ప్రతీమాటా దినపత్రికలద్వారా ప్రజలకు చేరుతోంది. ఆయన నడుస్తున్నదారిని ఆకులతో అలంకరించి ప్రజలు ఆనందాశ్రువులతో స్వాగతం చెబుతున్న దృశ్యాలూ, గాంధీనీ ఆయన అనుచరులనూ చూడడానికి దారిపొడవునా వేలాదిమంది ఎండనూవాననూ లెక్కచేయకుండా నిరీక్షించిన వైనాన్నీ, వారు తమ గ్రామంగుండా సాగుతున్నప్పుడు చర్ఖాలు వడకడం ద్వారా స్థానికులు తమ కృతజ్ఞతలను తెలియచేసుకున్న అనుభవాలనూ ప్రతిరోజూ వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు వివరించి చెప్పేవారు. గాంధీజీ పిలుపుమేరకు గుజరాత్‌లో 300మంది గ్రామాధికారులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. గాంధీజీ దండి చేరుకునేసరికి దేశం యావత్తూ ఉత్సాహంతో ఊగిపోతోంది. ఆశ, ఆనందం, స్వాతంత్ర్యదీక్ష వారిని కుదిపివేస్తున్నది. ఆయన ఆదేశం కోసం ప్రజలు ఉగ్గబట్టుకుని ఎదురుచూస్తున్నారు. 1930 ఏప్రిల్ 6న తన పిడికిలినిండా ఉప్పుతీసి గాంధీ శాసనోల్లంఘనోద్యమానికి నాందిపలికారు. భారతదేశ జాతీయోద్యమ చరిత్రలో కనీవినీ ఎరుగని విస్తృతస్థాయిలో ప్రజలు పాలుపంచుకున్న ఏకైక మహోద్యమానికి అంకురార్పణ జరిగింది.

* * *

ఒకపక్కన గాంధీజీ దండియాత్రలో ఉండగా మరోవైపున కాంగ్రెస్ నాయకులూ, కార్యకర్తలూ వివిధస్థాయిల్లో సంస్థాగత కార్యక్రమాల్లో నిమగ్నులైపోయారు. కార్యకర్తలనూ, సభ్యులనూ చేర్పించడం, కమిటీలను ఏర్పాటు చేయడం, విరాళాలు సేకరించడం, పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ విస్తృతంగా పర్యటించి సందేశాన్ని వ్యాప్తిచేయడం కొనసాగింది. ఉప్పుసత్యాగ్రహాన్ని ఆచరించడం కోసం స్థలాలను ఎంపికచేయడం, కార్యకర్తలను ఎంపికచేయడం, ప్రభుత్వ పాశవికదాడికి ముందుగానే సంసిద్ధం కావడం వంటివి జరిగాయి.

దండిలో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహానికి అంకురార్పణ చేయగానే దేశవ్యాప్తంగా ఆచరణ ఆరంభమైంది. తమిళనాడులో సి. రాజగోపాలాచారి నాయకత్వంలో ఒక ఉప్పుసత్యాగ్రహ బృందం తిరుచినాపల్లినుంచి తంజావూరు తీరంలోని వేదారణ్యం వరకూ పాదయాత్ర జరిపింది. ఏప్రిల్ 30న తాను అరెస్టయ్యేసరికి ఆ కార్యక్రమాన్ని కొంతకాలంపాటు నిర్విఘ్నంగా కొనసాగించడానికి కావలసినంతమంది కార్యకర్తలను ఆయన సమీకరించగలిగారు. మలబార్‌లో వైకోమ్ సత్యాగ్రహంతో ప్రసిద్ధుడైన కె.కేలప్పన్ కాలికట్‌నుంచి పయన్నూర్ వరకూ ఉప్పు సత్యాగ్రహయాత్ర చేసి చట్టాన్ని ఉల్లంఘించారు. అస్సాంలోని సిల్హట్‌నుంచి ఒక సత్యాగ్రహ బృందం బెంగాల్‌తీరంలోని నౌఖాలీవరకూ పాదయాత్ర చేసి ఉప్పును తయారుచేసింది. ఆంధ్రలో వివిధజిల్లాల్లో ఉప్పుసత్యాగ్రహం కోసం అనేక శిబిరాలు వెలిశాయి. ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించడానికి సత్యాగ్రహులు వివిధ గ్రామాలమీదుగా తీరప్రాంతాలకు చేరుకుని విజయవంతంగా తమ పనిపూర్తిచేసుకుని మరికొన్ని గ్రామాలను చుడుతూ వెనక్కుమళ్లారు. ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించినందుకు గాంధీజీని ప్రభుత్వం అరెస్టుచేయలేకపోవడాన్ని స్థానికనాయకులు ప్రజల్లో ధైర్యంనూరిపోయడానికి చక్కగా వినియోగించుకున్నారు. 'మనను చూసి ప్రభుత్వం బెదిరిపోతోంది. ఉప్పుసత్యాగ్రహం ఆరంభించినప్పటినుంచీ ప్రభుత్వం అన్నది కనిపించకుండా పోయింది. ఇప్పుడున్నది గాంధీ ప్రభుత్వమే' అని వారు ప్రజలను ఉత్సాహపరిచారు. ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించినందుకు ఏప్రిల్ 14న జవహర్‌లాల్ నెహ్రూను ప్రభుత్వం అరెస్టుచేయగానే మద్రాస్, కలకత్తా, కరాచీనగరాల్లో నిరసన ప్రదర్శనలు, ఘర్షణలూ చెలరేగాయి.

కాంగ్రెస్ నాయకులను అరెస్టుచేయడంతో భారతదేశ వాయవ్యప్రాంతంలో నిరసనజ్వాలలు మిన్నుముట్టాయి. ఏప్రిల్ 23న పెషావర్‌లో అనూహ్యస్థాయిలో నిరసనప్రదర్శనలు జరిగాయి. అనేక ఏళ్ళుగా ప్రజల్లో పనిచేసి, 'రెడ్‌షర్ట్స్' పేరుతో ప్రసిద్ధిచెందిన 'ఖుదాయి ఖిద్మత్‌గార్స్' అనే సంస్థను ఏర్పాటు చేసి, ఈ ప్రాంతంలో తిరుగులేని నాయకుడుగా ఎదిగిన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ శాసనోల్లంఘనోద్యమాన్ని

బలంగా ముందుకు తీసుకుపోయారు. అహింసామార్గంలో స్వాతంత్ర్య పోరాటానికి ప్రమాణం తీసుకున్న ఈ సంస్థకు ప్రజల అండదండలు బలంగా ఉన్నందున ప్రజాప్రతిఘటన ఉవ్వెత్తున సాగింది. పెషావర్ నగరం వారానికి పైగా ఉద్యమకారుల చేతుల్లో ఉండిపోయింది. పెషావర్ ఉద్యమానికి చారిత్రక ప్రాధాన్యం లభించడానికి మరో కారణం గఢ్వాలీ సైనికపటాలాలు రెండు నిరాయుధులైన ఈ ప్రదర్శనకారులపై కాల్పులు జరపడానికి నిరాకరించడమే. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఎంతటి ప్రమాదమో తెలిసి కూడా ఈ రెజిమెంటుకు చెందిన సైనికులు పెషావర్ ప్రదర్శనకారులపై కాల్పులు జరపడానికి అంగీకరించలేదు.

* * *

శాసనోల్లంఘనోద్యమాన్ని అణచివేసే విషయంలో ప్రభుత్వం అనుసరించిన వ్యూహం విఫలం చెందిందని చెప్పవచ్చు. ఈ ఉద్యమంలో జోక్యంచేసుకోకుండా దానిమానాన దాన్నివదిలేయడం ద్వారా నాశనం చేయవచ్చునని ప్రభుత్వం భావించింది. ముఖ్యంగా, గాంధీజీ చేపట్టిన ఉప్పుసత్యాగ్రహం ఆలోచనరీత్యా, ఆచరణరీత్యా కూడా సరైనది కాదనీ, అది తప్పకుండా చతికిలబడుతుందని ప్రభుత్వం ఆశించింది. అయితే, ఈవ్యూహం పూర్తిగా బెడిసికొట్టింది. వాస్తవానికి ప్రభుత్వం గాంధీజీ అన్నట్టుగానే, ఒక 'అయోమయ,గందరగోళ' స్థితిలో పడిపోయింది. సామూహికస్థాయిలో అహింసాయుత శాసనోల్లంఘన జరపడమనే గాంధీ వ్యూహం ప్రభుత్వానికి కాళ్ళూచేతులూ ఆడనీయలేదు. 'కొడితే పాపం, కొట్టకపోతే పొరపాటు' అన్నట్టుగా అయిపోయింది దాని పరిస్థితి. తాను చేసిన చట్టాలను నిర్భయంగా, బాహాటంగా ఉల్లంఘిస్తున్న ఒక ఉద్యమాన్ని అణచివేయకపోతే అది తన అధికారాన్ని తానే వదులుకుంటున్నట్టుగా అవుతుంది. ప్రజలను నియంత్రించలేని బలహీనతకు సంకేతమవుతుంది. ఒకవేళ ఉద్యమాన్ని అణచివేస్తే, అహింసామార్గంలో సాగుతున్న నిరాయుధులైన ప్రజలపై కర్కశంగా దాడిచేసిన నిరంకుశ,పాశవిక ప్రభుత్వంగా పేరుపడుతుంది. 'ఎక్కువగా స్పందిస్తే ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతున్నదంటూ కాంగ్రెస్ గగ్గోలుపెడుతుంది. కాదని ఊరుకుంటే విజయం మాదేనంటూ విజయధ్వానాలు చేస్తుంది' అంటూ మద్రాస్ పౌరుడు ఒకరు చేసిన వ్యాఖ్య 1930లలో ప్రభుత్వ మానసిక స్థితికి అద్దంపడుతుంది. ఏదేమైనప్పటికీ, ఈ సందిగ్ధస్థితి ప్రభుత్వ ఆధిపత్యం బలహీనపడటానికే దారితీసింది.

* * *

ఉద్యమం దేశం నలుమూలలకూ అనూహ్యవేగంతో వ్యాప్తిచెందుతుండటంతో బలప్రదర్శనకు దిగడం వినా ప్రభుత్వానికి మార్గాంతరం లేకుండాపోయింది. అధికారులు,

గవర్నర్లు, సైనికులనుంచి ఒత్తిడి పెరిగిపోతుండటంతో ఎట్టకేలకు వైస్రాయ్ మే 4వతేదీన గాంధీజీ అరెస్టుకు ఆదేశాలు జారీచేశాడు. ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించే తన కార్యక్రమంలో భాగంగా ధారాసనా ఉప్పు కేంద్రంపై దృష్టిసారించబోతున్నానని గాంధీజీ ముందుగా ప్రకటించడంతో ప్రభుత్వం ఈ పనికి పాల్పడివుండవచ్చునేమో కానీ, గాంధీజీ అరెస్టుకు అది ఎంచుకున్న సమయం మట్టుకు సరైనది కాదు. ముందుగానే ఆయనను అరెస్టుచేసి ఉంటే ఉద్యమాన్ని బలోపేతం చేయడంలోనూ, వ్యాప్తిచేయడంలోనూ గాంధీజీని కొంతమేరకు కట్టడిచేయడంలో ప్రభుత్వం విజయం సాధించేది. ఆయనను అరెస్టుచేయకుండా ఊరుకుని ఉంటే, ఉద్యమంలో వేలుపెట్టకుండా వదిలేయడంవల్ల ఒనగూరే ప్రయోజనాలైనా ఉండేవి. కానీ, ఉద్యమం ఉచ్ఛస్థితికి చేరుకున్న తరువాత తీసుకున్న ఈ చర్య దానిని మరింత వేగవంతం, తీవ్రతరం చేయడంతోపాటు ప్రభుత్వానికి వరుసగా అనేక సమస్యలు తెచ్చిపెట్టింది.
గాంధీజీ అరెస్టు వార్త తెలియగానే దేశం అట్టుడికిపోయింది. బోంబేలో వీధుల్లోకి చొచ్చుకువచ్చిన జనాభాను చూసి పోలీసులు అక్కడనుంచి తప్పుకున్నారు. వేలాదిమంది జౌళికార్మికులు, రైల్వేకార్మికులూ వచ్చిచేరడంతో రోడ్డు క్రిక్కిరిసిపోయాయి. వస్త్రవ్యాపారులు ఆరురోజులపాటు హర్తాళ్ నిర్వహించారు. కలకత్తాలోనూ, ఢిల్లీలోనూ దాడులూ,కాల్పులూ జరిగాయి. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ప్రజాస్పందన చాలా తీవ్రంగా ఉంది. పట్టణంలో అధికసంఖ్యలో ఉన్న జౌళికార్మికులు మే 7వతేదీన సమ్మెకు నడుంకట్టారు. మిగతాప్రజలను కూడగట్టుకుని మద్యం దుకాణాలను తగులబెట్టారు. ప్రభుత్వ అధికారానికి ప్రతీకలుగా ఉన్న న్యాయస్థానాలూ, పోలీసుస్టేషన్లు, మునిసిపల్ భవనాలూ, రైల్వేస్టేషన్ వంటివాటిపై వరుసగా దాడులు చేశారు. మొత్తం నగరాన్ని స్వాధీనం చేసుకుని దాదాపు పరోక్ష ప్రభుత్వాన్ని నడిపారు. సైనికశాసనాన్ని అమలు చేయడం ద్వారా మే 16వతేదీ తరువాతే ప్రభుత్వం ఆ నగరాన్ని మళ్ళీ తన గుప్పిట్లోకి తెచ్చుకోగలిగింది.

* * *

అయితే, మొత్తం ఉప్పుసత్యాగ్రహాన్ని ఒక మేలిమలుపు తిప్పిన సంఘటన ఒకటి మే 21వతేదీన జరిగింది. అహింసాయుత మార్గంలో ధీరత్వాన్ని ప్రదర్శించిన ఈ సంఘటన దేశాన్నే కాదు, యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. కాంగ్రెస్ అధ్యక్షపదవిని చేపట్టిన తొలి భారతీయ మహిళ సరోజినీనాయుడు, దక్షిణాఫ్రికా పోరాటంలో గాంధీజీ సహచరుడైన ఇమామ్‌సాహెబ్, గాంధీజీ కుమారుడు మణిలాల్ ముందువరుసలో సాగుతుండగా 2000మంది సత్యాగ్రహులు పోలీసుల దిగ్బంధంలో ఉన్న ధారాసనా ఉప్పుకేంద్రం వైపుకు సాగారు. వాళ్ళు దగ్గరకు రాగానే ఇనపమొనలున్న లాఠీలు చేబూనిన

పోలీసులు అడుగుముందుకు వేసి నిరాయుధులైన సత్యాగ్రహులపై దాడిచేశారు. సత్యాగ్రహులు దెబ్బలతో కుప్పకూలిపోయేవరకూ పోలీసులు వారిని విచక్షణారహితంగా కొడుతూనే ఉన్నారు. గాయపడినవారిని వారి సహచరులు తాత్కాలికంగా తయారుచేసిన స్ట్రెచర్లపై పక్కకు తీసుకుపోగానే మరో వరుస సత్యాగ్రహులు ముందుకు రావడం, పోలీసులు వారిని విపరీతంగా బాదడం, వారిని పక్కకు తొలగించగానే మరోగుంపు ముందుకు రావడం... ఇలా కొంతసమయం గడిచిన తరువాత సత్యాగ్రహులు అక్కడే బైఠాయించి పోలీసుల చేతుల్లో లాఠీదెబ్బలు తినడం ప్రారంభించారు. కనీసం ఒక్కచెయ్యికూడా ఆత్మ రక్షణనిమిత్తం పైకి లేవకపోవడం విచిత్రం. ఉష్ణోగ్రత 116 డిగ్రీలసెల్సియస్ ఉన్న 11గంటల సమయానికే గాయపడినవారిసంఖ్య 320కు చేరుకుంది. ఇద్దరు సత్యాగ్రహులు కన్నుమూశారు. సత్యాగ్రహులు కనబరిచిన అపూర్వమైన సాహసాన్నీ, అహింసాయుత ప్రతిఘటన సామాన్యమైనది కాదన్న విషయాన్నీ యావత్ ప్రపంచానికి తెలియచెప్పినవాడు అమెరికన్ పాత్రికేయుడు వెబ్ మిల్లర్. ధారాసన సత్యాగ్రహం ఆయనను నిశ్చేష్టుడిని చేసింది. ఆయన అభిప్రాయాన్ని ఈ వాక్యాలు మనకు తెలియచెబుతాయి. 'దాదాపు 20దేశాల్లో 18 సంవత్సరాలకుపైగా పాత్రికేయుడుగా పనిచేసిన నేను, అంతర్యుద్ధాలనూ, దాడులనూ, ఘర్షణలనూ, వీధిపోరాటాలనూ, తిరుగుబాట్లనూ అనేకం చూశాను. కానీ, ధారాసనలో కనిపించినటువంటి ఒళ్ళుగగుర్పొడిచే దృశ్యాలను నేను ఎక్కడా, ఎన్నడూ చూడలేదు'.

ఉప్పుసత్యాగ్రహంలోని ఈ కొత్త విధానాన్ని ప్రజలు ఎంతో ఉత్సాహంగా స్వీకరించారు. దేశవ్యాప్తంగా అది అమలు జరగడం ఆరంభమైంది. బోంబే శివార్లలో ఉన్న వాడలలో ఉన్న అనేక ఉప్పు తయారీ కేంద్రాలపై ప్రజలు దాడులు చేశారు. పోలీసులు ఏర్పాటు చేసిన అడ్డంకులను ఛేదించుకుంటూ సుమారు 15వేలమంది ప్రజలు అక్కడినుంచి ఉప్పు ఎత్తుకుపోయారు. కర్ణాటకలో 10వేలమంది ప్రజలు సానికట్టా ఉప్పు కేంద్రంపై దాడిచేసి లాఠీలనూ, బుల్లెట్లనూ ఎదుర్కొన్నారు. మద్రాసులో ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించే ఉద్యమంలో పోలీసులకూ, ప్రతిఘటనకారులకూ మధ్య అనేకపర్యాయాలు ఘర్షణలు చెలరేగాయి. లాఠీచార్జీలకు నిరసనగా ఏప్రిల్ 23న ఏర్పాటుచేసిన సమావేశంపై కూడా పోలీసులు దాడిచేశారు. ఉద్యమకారులను చెదరగొట్టేందుకు లాఠీచార్జీచేశారు, కాల్పులు జరిపారు. ముగ్గురిమరణానికి దారితీసిన ఈ సంఘటన నగరాన్ని అట్టుడికించింది. అత్యంత మితవాద భారతీయులు కూడా దీనిని తీవ్రంగా ఖండిస్తూ జాతీయవాదులకు మద్దతుగా నిలిచారు. ఆంధ్రలో వందలాదిమంది గ్రామీణమహిళలు పిడికెడు ఉప్పుకోసం అనేక మైళ్ళు నడిచివచ్చారు. బెంగాల్‌లో గతకాలపు గాంధీ ఆశ్రమాలు మళ్ళీ కళాకాంతులు సంతరించుకున్నాయి. పట్టణాలనుంచి, గ్రామాలనుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన

కార్యకర్తలు మిడ్నాపూర్‌లోనూ, తీరప్రాంతాల్లోనూ ఉప్పుసత్యాగ్రహం చాలాకాలంపాటు నిర్విఘ్నంగా కొనసాగడానికి కృషిచేశారు. ఒరిస్సాలోని బాలాసోర్, పూరీ, కటక్‌జిల్లాల్లో చట్టవ్యతిరేకంగా ఉప్పు తయారుచేసే కార్యక్రమం ఉధృతంగా సాగింది.

* * *

అయితే, విభిన్నరీతుల్లో ఆవిష్కృతమైన ప్రతిఘటనకు ఉప్పుసత్యాగ్రహం నాంది మాత్రమే. తన అరెస్టుకు ముందు గాంధీజీ విదేశీవస్త్రాలనూ, మద్యందుకాణాలను బహిష్కరించవలసిందిగా పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఈ ఉద్యమానికి సారథ్యం వహించవలసింది మహిళలేనని ఆయన స్పష్టంచేశారు. 'అబల అన్నమాట చాలా దుర్మార్గమైనది. అది మగవాడు ఆడదానికి చేస్తున్న అన్యాయం' అని ఆయన వ్యాఖ్యానించారు. 1930లలో మహిళలు ఈ ఉద్యమంలో నిర్వహించిన పాత్ర అమోఘమైనది. పట్టుదలలో తమను మించినవారెవ్వరూ లేరని వారు నిరూపించారు. మరొకరి సాయంలేకుండా ఎన్నడూ బైటకు రానివారూ, పర్దాల్లోనే ఉన్నవారూ, చంటిబిడ్డల తల్లులూ, పెళ్ళికాని ఆడపిల్లలూ, వితంతువులూ ఉదయంనుంచి రాత్రివరకూ మద్యందుకాణాలముందూ, విదేశీవస్త్రదుకాణాలముందూ నిలబడి ఎంతో సహనంగా కొనుగోలుదారులనూ, దుకాణదారులనూ తమ పద్ధతులు మార్చుకోమంటూ విజ్ఞప్తిచేసేవారు.

విదేశీవస్త్రాలనూ, మద్యాన్నీ బహిష్కరించే కార్యక్రమంలో మహిళలతోపాటుగా విద్యార్థులూ, యువకులూ ఎంతో చురుకైన పాత్రపోషించారు. ఉదాహరణకు బోంబేలో వ్యాపారులు విదేశీవస్త్ర బహిష్కరణ నియమాన్ని ఉల్లంఘించకుండా చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు వ్యాపారకేంద్రాలపై నిఘావేసి ఉంచారు. వాస్తవానికి వ్యాపారసంఘాలే స్వయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. బహిష్కరణ కార్యక్రమాన్ని అమలు చేయడంలో భాగంగా చాలామంది మిల్లుయజమానులు ఖాదీని దెబ్బతీస్తున్న విదేశీనూలును ఉపయోగించడానికి నిరాకరించారు. నియమాలని ఉల్లంఘించినవారిపై జరిమానా విధించడం, వారిని సంఘాలనుంచి బహిష్కరించడం, దుకాణాలముందు పికెటింగ్ చేయడం వంటి మార్గాల్లో లొంగదీయడం జరిగింది.

మద్యాన్ని బహిష్కరించడం వల్ల ప్రభుత్వ ఆదాయం విపరీతంగా పడిపోయింది. మద్యవ్యతిరేక ఉద్యమం చివరకు ఏస్థాయికి చేరుకుందంటే చాలా చోట్ల తలలు తెగిపడ్డ తాడిచెట్లు కనిపించడం ఆరంభమైంది. మద్యం, మత్తుపదార్థాలకు దూరంగా ఉండటం వల్ల సమాజంలో గౌరవంపెరుగుతుందన్న భావన కూడా ఈ ఉద్యమం విజయవంతం కావడానికి దోహదం చేసింది. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో దిగువకులాలు ఎగువకుపాకే

ప్రయత్నంలో భాగంగా మద్యాన్నీ,మాంసాన్నీ విస్మరించి ఉన్నతస్థానాన్ని సంతరించుకునే కృషి జరిగింది.

తూర్పు భారతదేశంలో పన్నుల నిరాకరణోద్యమం కొత్తపుంతలు తొక్కింది. 'చౌకీదారీపన్ను'కు వ్యతిరేకంగా ఇక్కడ ఉద్యమం తలెత్తింది. ఇక్కడి గ్రామీణప్రాంతాల్లో పోలీసువ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న చౌకీదార్లపట్ల స్థానికుల్లో తీవ్రవ్యతిరేకత ఉంది. వీరు ప్రభుత్వానికి గూఢచారులుగా పనిచేయడంతోపాటు స్థానికభూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తుండేవారు. చౌకీదారీపన్నును చెల్లించనిరాకరించడంతోపాటు చౌకీదార్లూ, వారిని నియమించే చౌకీదారీ పంచాయతీల సభ్యులూ రాజీనామాలు చేయాలంటూ ఒక ఉద్యమం మొదట బీహార్‌లో మేనెలలోనే ప్రారంభమైంది. ఈ ప్రావిన్సు భౌగోళికంగా ఉప్పుసత్యాగ్రహానికి అంత అనుకూలంగా లేకపోవడం కూడా ఇందుకు ఒక కారణం. మోంఘిర్, శరణ్, భగల్‌పూర్‌జిల్లాల్లో పన్నుచెల్లించడానికి నిరాకరించడంతోపాటు చౌకీదార్లచేత రాజీనామాలు చేయించడానికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రయత్నాలుచేశారు. ఇందుకు నిరాకరించినవారినీ, ఎదురుతిరిగినవారినీ సామాజికంగా బహిష్కరించి వారిపై ఒత్తిడిపెంచారు. ప్రభుత్వం ఇందుకు జవాబుగా పెద్ద ఎత్తున విరుచుకుపడింది. కొద్దిరూపాయల పన్నుకు బదులుగా వందలాది,వేలాది రూపాయల విలువైన ప్రజల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనంచేసుకుంది. వారిని చిత్రహింసలుపెట్టింది. మే 31వతేదీన భగల్‌పూర్‌లోని బిహ్‌పూర్‌లో పోలీసులు ఒక అడుగుముందుకు వేసి ఇక్కడ ఉన్న కాంగ్రెస్ ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో జాతీయవాద కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న ఆశ్రమాన్ని స్వాధీనం చేసుకోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఆశ్రమం ముందు ప్రతిరోజూ నిరసనప్రదర్శనలు జరిగేవి. పాట్నానుంచి రాజేంద్రప్రసాద్, అబ్దుల్‌బారీ వచ్చినప్పుడు పెద్ద ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పోలీసులు రాజేంద్రప్రసాద్‌ను గాయపరిచారు. ఈ విధంగా పోలీసులు అణచివేతయత్నాలను తీవ్రం చేస్తున్నకొద్దీ జాతీయవాదుల బలం మరింతగా పెరగడం ఆరంభమైంది. దానిఫలితంగా కొద్దికాలంలోనే పోలీసులు గ్రామీణప్రాంతాల్లోకి అడుగుపెట్టడానికి కూడా వొణికిపోయే పరిస్థితి ఏర్పడింది.

బెంగాల్‌లో రుతుపవనాలరాకతో ఉప్పుతయారుచేసే అవకాశాలు లేకుండాపోయాయి. దీంతో ఈ ఉద్యమం చౌకీదార్‌వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెందింది. ఇక్కడ కూడా గ్రామీణులు ప్రభుత్వ పాశవికదాడిని చవిచూడాల్సి వచ్చింది. ఆస్తుల స్వాధీనం, విధ్వంసం ద్వారా ప్రజలు వేలాదిరూపాయలను కోల్పోవలసివచ్చింది. పోలీసుల దుర్మార్గంనుంచి తప్పించుకోవడానికి ప్రజలు అనేక రోజులపాటు అడవుల్లోనే తలదాచుకోవలసి వచ్చింది.

గుజరాత్‌లోని ఖేడా జిల్లాలోనూ, సూరత్ జిల్లాలోని బర్డోలీ తాలూకాలోనూ, జంబూసర్‌లోనూ పన్నునిరాకరణ ఉద్యమం ఉధృతంగా సాగింది. ఇక్కడ ప్రజలు వాస్తవానికి చెల్లించనిరాకరించినది భూమిశిస్తు. ఈ ప్రాంతాలనుంచి వేలాదిమంది చెంబూచేటా పట్టుకుని తమ కుటుబాలతో సహా బ్రిటిష్ భారతం సరిహద్దులు దాటి పొరుగున ఉన్న బరోడావంటి సంస్థానాలకు తరలిపోయారు. అక్కడ ఆరుబయలు ప్రదేశాల్లో అనేక నెలలపాటు మకాంవేసుకుని ఉండిపోయారు. బ్రిటిష్ ప్రభుత్వం వారి ఇళ్లను ధ్వంసంచేసింది, మిగిలిన వస్తుసామగ్రిని నాశనం చేసింది, వారి భూములను స్వాధీనం చేసుకుంది. పోలీసులు తమ విధ్వంసకాండలో చివరకు వల్లభ్‌భాయ్ పటేల్ తల్లిగారిని కూడా వదలలేదు. ఎనభైయేళ్ళ ఈ పండుముదుసలి కరమ్‌సద్‌లోని తన ఇంట్లో వండుకుంటూ ఉండగా పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించారు. ఆమె వంటపాత్రలను విసిరిపారేయడమే కాక కొన్నింటిలో కిరోసిన్ పోశారు. 1930లలో జైలుబయట ఉన్న కొద్దికాలంలో వల్లభ్‌భాయి పలుమార్లు పర్యటనలు జరిపి తన ప్రాంత రైతులని ప్రోత్సహిస్తూ వారికి మద్దతుగా నిలిచేవారు. ఉన్న ఆ కొద్ది వనరులు కూడా ప్రభుత్వ దాష్టీకానికీ, పోలీసులు దౌర్జన్యానికీ నాశనమైపోవడంతో రైతులు ఇక లొంగదలుచుకోలేదు. 1931మార్చిలో ప్రభుత్వంతో అవగాహన కుదిరిన తరువాతే వారు మళ్ళీ ఇళ్ళకు చేరుకున్నారు.

మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రావిన్సులలో అటవీచట్టాలను ఉల్లంఘించడం కూడా ఒక విస్తృతమైన ఉద్యమరూపాన్ని సంతరించుకుంది. ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ ఉద్యమం ఊపందుకుంది. అడవులను వినియోగించుకునే విషయంలో వలసప్రభుత్వం విధించిన సవాలక్ష ఆంక్షలతో కుతకుతలాడిపోతున్న ఆదివాసులు అటవీచట్టాలను ఉల్లంఘించడానికి సంకల్పించారు. కొన్ని ప్రాంతాల్లో ఈ చట్టాలను ఉల్లంఘించడానికి తరలివచ్చిన వారి సంఖ్య 70వేలకు మించిపోయేది.

విద్యార్థులూ,వారి సంరక్షకులూ 'సత్ప్రవర్తన'కు సంబంధించి లిఖితపూర్వకమైన హామీ ఇవ్వాలంటూ శాసించిన 'కన్నింగ్‌హామ్ సర్క్యులర్'కు అస్సాంలో వచ్చిన చెడ్డపేరు అంతా ఇంతా కాదు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించారు.

1929 డిసెంబరులో లాహోర్‌లో జాతీయజెండాను ఎగురవేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలు ప్రజల గుండెలోతుల్లోకి ఇంకిపోయినట్టుగా కనిపిస్తున్నది. 'మరోమారు చెబుతున్నాను. బాగా గుర్తుపెట్టుకోండి. ఇప్పుడు రెపరెపలాడుతున్న ఈ జెండా ఎట్టిపరిస్థితుల్లోనూ కిందకు జారకూడదు. ఈ దేశంలో చివరకు ఒక్క భారతీయుడు మిగిలివున్నా ఈ జెండా ఎగురుతూనే ఉండాలి' అన్నారాయన. తీవ్రమైన హింసకు కూడా వెరవకుండా దేశంలోని అనేక చోట్ల జాతీయపతాక గౌరవాన్ని కాపాడుకోవడం

ఒక మహోన్నతమైన, గౌరవప్రదమైన కార్యంగా జరిగింది. ఆంధ్ర తీరప్రాంతమైన బందరులో తోట నరసయ్యనాయుడు జాతీయపతాకం గౌరవాన్ని పరిరక్షించడానికి 15మంది పోలీసుల చేతుల్లో చావుదెబ్బలు తిని చివరకు స్పృహతప్పిపడిపోయారు. కాలికట్‌లో పి. కృష్ణపిళ్ళై కూడా జాతీయపతాకం కోసం ఇదేవిధమైన హింసను అనుభవించారు. సూరత్‌లో మరో విచిత్రమైన సంఘటన జరిగింది. కొంతమంది స్కూలు పిల్లలు జాతీయపతాకాలను చేతబట్టుకుని వెడుతుండగా పోలీసులు వాటిని లాక్కుని చింపివేశారు. ఇలా పలుమార్లు జరుగుతుండటంతో వారు చివరకు జాతీయజెండా రంగులతో ఖాదీ దుస్తులనే ధరించి వీధుల్లో తిరగడం ఆరంభించారు. దేశ ప్రజలకు ఒక కొత్త స్ఫూర్తిని ప్రసాదించిన జాతీయజెండా అనతికాలంలోనే చివరకు గ్రామీణప్రాంతాలకు కూడా వ్యాపించి రెపరెపలాడటం ఆరంభించింది.

ఉత్తరప్రదేశ్‌లో మరో కొత్తరకం ఉద్యమం మొగ్గతొడిగింది. శిస్తునూ, కౌలునూ కూడా చెల్లించనిరాకరించే ఉద్యమం ఇది. ప్రభుత్వానికి భూమిశిస్తును సమకూర్చవద్దంటూ జమీందార్లకూ, జమీందార్లకు కౌలుకట్టవద్దంటూ రైతులకూ పిలుపునిచ్చింది ఈ ఉద్యమం. జమీందార్లలో అత్యధికులు ప్రభుత్వవిధేయులుగానే ఉన్నారు కనుక ఇది ప్రధానంగా కౌలునిరాకరణోద్యమం రూపాన్నే తీసుకుంది. శాసనోల్లంఘనోద్యమం ప్రారంభమైన తొలిమాసాల్లో ఉద్యమం ఈ ప్రాంతంలో బలంగానే వేళ్ళూనుకుంది. అయితే, అణచివేతచర్యలు తీవ్రస్థాయిలో ఉండటం వల్ల కొద్దికాలం అణగారిపోయింది. అక్టోబర్‌లో జవహర్‌లాల్‌నెహ్రూ స్వల్పకాలం జైలునుంచి బైటకురావడంతో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కౌలునిరాకరణకు పిలుపునివ్వడమూ, డిసెంబరులో ఉద్యమం పెద్ద ఎత్తున ఆరంభం కావడమూ జరిగిపోయాయి. ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నాలను తీవ్రతరం చేసింది. జనవరి నాటికల్లా రైతులు తమ ఊళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగ్రా, రాయ్‌బరేలీ జిల్లాల్లో ఈ ఉద్యమం ప్రబలంగా సాగింది.

ప్రజలను సమీకరించడానికి ఈ ఉద్యమం అనుసరించిన విధానాలు వినూత్నమైనవి, విచిత్రమైనవీ. ప్రభాతవేళ దేశభక్తిని ప్రబోధించే గీతాలతో 'ప్రభాతభేరీ'ల ద్వారా ప్రజలను జాగృతం చేయడం జరిగేది. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ కూడా ఈ కార్యక్రమం జరగడం విచిత్రం. అదేవిధంగా, అత్యంత వివాదాస్పదమైన పత్రికాచట్టాన్ని ఉల్లంఘించే లక్ష్యంతో కరపత్రాలను పంచడం కూడా జరిగింది. సైక్లోస్టయిల్ చేసిన లేదా చేత్తోరాసిన చట్టవ్యతిరేక 'పత్రిక'లు దేశాన్ని ముంచెత్తాయి. నాయకులూ, కార్యకర్తలూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటనలు చేయడం, మహిళా బృందాలు మరోప్రాంతానికి తరలివెళ్లి పనిచేయడం, పదిమంది నుంచి వేలాదిమంది వరకూ పాల్గొన్న సభలూ, సమావేశాలూ లెక్కలేనన్ని జరగడం ఉద్యమంలో కనిపించిన కొన్ని లక్షణాలు. పిల్లలు

'వానరసేన' పేరుతో సంఘటితం కావడం మరో విచిత్రమైన పరిణామం. బాలికలు తమకంటూ ప్రత్యేకంగా 'మంజరిసేన'ను ఏర్పాటుచేసుకున్నారు.

ऽ ऽ ऽ

1930 అంతా ప్రభుత్వం ఊగిసలాటధోరణితోనే వ్యవహరించింది. గాంధీజీ అరెస్టు విషయంలోనూ ఇదేవైఖరి మనకు కనిపిస్తుంది. ఆ తరువాత ఒక్కసారిగా ప్రభుత్వం విరుచుకుపడటం ప్రారంభించింది. పౌరహక్కులను కాలరాస్తూ వరుసగా ఆర్డినెన్సులు విడుదలైనాయి. శాసనోల్లంఘనకు పాల్పడుతున్న సంఘాలను రద్దుచేసే అధికారాలు ప్రావిన్షియల్ ప్రభుత్వాలకు లభించాయి. అయితే, జూన్ మాసాంతంవరకూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని చట్టవ్యతిరేకమైనదిగా ప్రకటించడం జరగలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న మోతీలాల్ నెహ్రూ అప్పటివరకూ కూడా స్వేచ్ఛగానే ఉన్నారు. చాలా స్థానిక కాంగ్రెస్ కమిటీలపై ఆగస్టువరకూ నిషేధం విధించలేదు. ఇదిలా ఉంటే, సైమన్ కమిషన్ నివేదిక విడుదల కావడమూ అందులో అధినివేశ ప్రతిపత్తికి సంబంధించిన ప్రస్తావన లేకుండా పోవడంతోపాటు అది అభివృద్ధివ్యతిరేకమైన, అణచివేత విధానాలకు అద్దంపట్టేదిగా ఉండటం మితవాదభావాలున్న వారికి కూడా ఆగ్రహాన్ని కలిగించింది. ఈ నివేదికకు వ్యతిరేకంగా మదన్‌మోహన్ మాలవీయ, ఎమ్.ఎస్. అనీ స్వచ్ఛందంగా అరెస్టయ్యారు. జులై 9వతేదీన వైస్రాయ్ ఒక ప్రకటనచేస్తూ అధినివేశ ప్రతిపత్తిగురించి మరోమారు హామీ ఇచ్చి రాజీమార్గంగా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని సూచించారు. కాంగ్రెస్‌కూ, ప్రభుత్వానికి మధ్య శాంతిని నెలకొల్పే మార్గాలను అన్వేషించడానికి తేజ్‌బహదూర్ సప్రూ, ఎమ్.ఆర్.జయకర్‌లు కృషిచేస్తారంటూ 40మంది కేంద్రశాసనసభ్యులు చేసిన సూచనను కూడా వైస్రాయ్ అంగీకరించారు. ఇందులో భాగంగా నెహ్రూలిద్దరూ (మోతీలాల్, జవహర్‌లాల్) యరవాడ జైలులో ఉన్న గాంధీజీని కలుసుకుని ఒప్పందానికి సంబంధించిన అవకాశాలను చర్చించారు. ఈ చర్చలు చెప్పుకోదగిన ఫలితాన్ని ఇవ్వకపోయినప్పటికీ నవంబరులో లండన్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి కొన్ని వర్గాలు హాజరయ్యేందుకు వీలుకల్పించింది. లండన్‌లో బ్రిటిష్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో భారతీయ ప్రతినిధులు ఒక విషయాన్ని మట్టుకు స్పష్టంచేశారు. ప్రభుత్వం రాజ్యాంగపరమైన పురోగతి ద్వారా శాంతిని సాధించాలని ఆశిస్తున్నపక్షంలో, సంబంధిత చర్చల్లో కాంగ్రెస్ ఒక భాగస్వామిగా లేకుండా శాంతి సాధ్యంకాదన్నది సారాంశం. కాంగ్రెస్‌తో ఘర్షణాత్మకమైన వైఖరికి స్వస్తిచెప్పాల్సిన అవసరాన్ని కూడా వారు నొక్కిచెప్పారు. రౌండ్‌టేబుల్ సమావేశం ముగింపుదశలో బ్రిటిష్ ప్రధాని ఇందుకు సంబంధించిన అవకాశాలను ప్రస్తావించారు కూడా. ఆ ఏడాదిలో జరిగే మలివిడత రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ పాల్గొంటుందన్న ఆశాభావాన్ని

కూడా ఆయన వ్యక్తంచేశారు. జనవరి 25వతేదీన గాంధీజీనీ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులనూ బేషరతుగా విడుదలచేస్తున్నట్టు వైస్రాయ్ ప్రకటించారు.

కాంగ్రెస్ మూడువారాలపాటు అంతర్గత చర్చలు జరిపింది. లండన్‌నుంచి తిరిగివచ్చినవారితోనూ, విభిన్న రాజకీయవర్గాల నాయకులతోనూ సుదీర్ఘంగా చర్చలు సాగించింది. అనంతరం వైస్రాయ్‌తో చర్చలు ఆరంభించడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గాంధీజీకి అధికారం అప్పగించింది. నలభై ఐదురోజులుపాటు సంప్రదింపులు జరిగిన అనంతరం 1931 మార్చి 5వతేదీన గాంధీ- ఇర్విన్ ఒప్పందం ఆవిర్భవించింది.

కాంగ్రెస్ తరఫున గాంధీజీ, ప్రభుత్వం తరఫున లార్డ్ ఇర్విన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. హింసాయుతఘటనల్లో శిక్షలుపడిన వారు మినహా రాజకీయఖైదీలందరినీ విడుదలచేయాలన్నది ఒప్పందంలో ఒక నిబంధన. అంతవరకూ వసూలుచేయని జరిమానాలన్నింటికీ మినహాయింపు, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూముల్లో అప్పటిదాకా మూడోపార్టీకి అమ్మివేయకుండా ఉన్నవాటిని తిరిగి అప్పగించడం ఇందులోని మరికొన్ని అంశాలు. తీరప్రాంతాల ప్రజలకు తమ వినియోగం కోసం ఉప్పును తయారుచేసుకునే హక్కునూ, ప్రజలు శాంతియుతంగా పికెటింగ్ చేసుకునే హక్కునూ కూడా ప్రభుత్వం గుర్తించింది. పోలీసుల అకృత్యాలపై బహిరంగ విచారణ జరిపించాలన్న గాంధీజీ డిమాండుకు ప్రభుత్వం అంగీకరించలేదు. అయితే, విచారణకు గాంధీజీ పట్టుబట్టిన అంశాన్ని ఒప్పందంలో రికార్డుచేశారు. కాంగ్రెస్ తనవంతుగా, శాసనోల్లంఘనోద్యమాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. రెండవరౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావడానికి కూడా కాంగ్రెస్ నాయకులు సంసిద్ధత వెలిబుచ్చారు.

ఽ ఽ ఽ

ఒప్పందంలోని అంశాలూ, ఆ ఒప్పందంపై గాంధీజీ సంతకం చేయడానికి దోహదం చేసిన కారణాలూ, భగత్‌సింగ్- ఆయన సహచరుల మరణశిక్షల విషయంలో అది అనుసరించిన వైఖరీ (ఈ విషయంలో వైస్రాయ్‌ను ఒప్పించేందుకు గాంధీ శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ) సమకాలీనుల్లోనూ, చరిత్రకారుల్లోనూ ఎంతో వివాదాన్ని రేకెత్తించిన విషయం మనకు తెలుసు. ఈ ఒప్పందాన్ని ఒక నమ్మకద్రోహంగానూ, బూర్జువా ఒత్తిళ్ళకు గాంధీజీ లొంగుబాటుకు నిదర్శనంగానూ చూడటం జరిగింది. ప్రజా ఉద్యమాలు తీవ్రవాద ధోరణిని సంతరించుకుంటాయన్న భయం గాంధీజీనీ, భారతీయ బూర్జువాలనూ వెంటాడుతోందనడానికి తార్కాణంగానూ, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములను పూర్తిగా సాధించడంలో (మూడోపక్షానికి అమ్మివేసినవాటితో సహా) జరిగిన వైఫల్యం రైతులకు చేసిన ద్రోహంగానూ... ఇలా అనేక రీతుల్లో ఈ ఒప్పందాన్ని విశ్లేషించడం జరిగింది.

అయితే, 1922లో చౌరీచౌరా సంఘటన కారణంగా సహాయనిరాకరణోద్యమాన్ని ఉపసంహరించుకోవడాన్ని విమర్శిస్తూ వెలువడిన వాదనల మాదిరిగానే ఇవి కూడా జాతీయోద్యమ స్వభావాన్నీ, వ్యూహాన్నీ సరిగా అంచనావేయడంలో విఫలమైనాయని చెప్పవచ్చు. గతంలో మనం చెప్పుకున్నట్టుగానే, ప్రజా ఉద్యమాలకు దీర్ఘకాలం కొనసాగే శక్తిసామర్థ్యాలు ఉండవన్న వాస్తవాన్ని ఈ వాదనలు విస్మరిస్తున్నాయి. పాశవికమైన అణచివేతలూ, అరాచక చర్యల మధ్యన సుదీర్ఘకాలం ఎదురొడ్డి నిలిచే శక్తి ప్రజలకు ఉండదు. వారి త్యాగానికి కూడా ఒక పరిమితి ఉంటుంది. ఈ ఉద్యమంలో కూడా ప్రజల్లో అలసట ఆవహించడం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. విద్యార్థులూ, యువకులూ ఇంకా కొంత ఉత్సాహంగా ఉన్నప్పటికీ కొన్నివర్గాల ప్రజలు మొహం చాటేయడం ఆరంభించారు. ముఖ్యంగా, వ్యాపారులూ, దుకాణం దారులూ మరింతకాలం నష్టాలు భరించి ఉద్యమాన్ని కొనసాగించే పరిస్థితుల్లో లేరు. బహిష్కరణ ఉద్యమం విజయవంతం కావాలంటే వీరి మద్దతు అత్యంతవశ్యమన్న విషయాన్ని మనం విస్మరించకూడదు. 1930 సెప్టెంబరునాటినుంచి ఈ వర్గాల్లో నైరాశ్యం ఆవహించడం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అదేవిధంగా, గ్రామీణప్రాంతాల్లో కూడా పరిస్థితిలో మార్పువచ్చింది. ఏడాది ఆరంభంలో ఉద్యమానికి ఉత్సాహంతో ఉరకలు వేసిన ప్రాంతాలు కూడా ఆ ఏడాది ద్వితీయార్థానికి చల్లారిపోవడం ఆరంభించాయి. అక్కడక్కడ చెదురుమదురుగా జరుగుతున్న సంఘటనలు మినహా చాలా ప్రాంతాల్లో స్తబ్ధత ఆవరించింది. బెంగాల్, బీహార్, ఆంధ్ర, గుజరాత్‌లలో ఉద్యమాలు జరుగుతున్న దాఖలాలూ, పోలీసులతో ఘర్షణలు జరిగిన సంఘటనలూ అప్పుడప్పుడు కనిపించినా దేశంలోని మిగతా ప్రాంతాల్లో మట్టుకు ఉద్రేకం ఆవిరైపోవడం మొదలైంది. ఉత్తరప్రదేశ్‌లో వాస్తవానికి 1930 చివరినెలల్లో మాత్రమే కౌలునిరాకరణోద్యమం రాజుకున్నందున ఆ ఉద్యమానికి మరింతకాలం బలంగా ముందుకు సాగగలిగే సామర్థ్యం ఉండాలి. కానీ, అక్కడకూడా ఒకటిరెండు ప్రాంతాల్లో మినహాయిస్తే మిగతాచోట్ల ఉద్యమం నశించిపోయింది. ఈ విధంగా, దేశవ్యాప్తంగా ప్రజల్లో శక్తిసామర్థ్యాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో ఉద్యమాన్ని ఇంకా కొనసాగించడం వల్ల ప్రయోజనం ఏముంటుంది? ప్రజల్లో నీరసం ఆవహించినప్పుడు లేదా స్వల్పకాలంలోనే ఆ స్థితికి జారుకునే సూచనలు కనిపిస్తున్నప్పుడు ప్రభుత్వం దిగివచ్చేందుకు సిద్ధపడుతుందా? అటువంటి పరిస్థితే కనుక ఏర్పడితే చర్చలకు సిద్ధపడుతుందా? 1931లో 1946 నాటి పరిస్థితులు లేవని మనం గుర్తుంచుకోవాలి. ఇందుకు 1932 మనకు మంచి ఉదాహరణ. ప్రభుత్వం వెంటనే తన దారిమార్చుకుని ఉద్యమాన్ని పాశవికంగా అణచివేయడానికి ఏమాత్రం వెనుకాడదు. ఉద్యమాన్ని నిలిపివేసినందుకు విద్యార్థులు బాగా నిరాశపడ్డారన్నది నిజమే. వాళ్ళ దృష్టివేరు, వారి ఊహా ప్రపంచంవేరు. కోరుకున్నది

వెంటనే కళ్ళముందు ప్రత్యక్షం కావాలని ఆశిస్తారు వారు. అదేవిధంగా గుజరాత్ రైతులను కూడా ఈ ఒప్పందం నిరాశపరిచింది. వారి భూములు వారికి వెంటనే దక్కలేదు (1937లో బోంబేలో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడ్డాక వారి భూములు వారికి దక్కాయి). కానీ, దేశంలోని అత్యధికశాతం ఈ ఒప్పందం విషయంలో సంతోషించారని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. బ్రిటిష్ ప్రభుత్వం తమ ఉద్యమంతో మెట్టు దిగివచ్చి, తమ నాయకుడిని సమానంగా  గౌరవించి, అతడితో ఒక ఒప్పందానికి వచ్చి, కలిసి సంతకాలు చేయడం వారికి ఎంతో సంతోషాన్నీ, విజయగర్వాన్నీ ఇచ్చింది. ఈ ఒప్పదాన్ని వారు తమ బలానికి తార్కాణంగా, ప్రభుత్వం మీద తాము సాధించిన విజయానికి నిదర్శనంగా భావించారు. అంతేకాదు, ఒప్పందంలో భాగంగా జైళ్లనుంచి విడుదలైన వేలాదిమంది రాజకీయఖైదీలు యుద్ధంనుంచి విజయోత్సాహంతో తిరిగివచ్చిన యుద్ధవీరులు మాదిరిగా వచ్చారే కానీ, ఓటమిపాలైన యుద్ధఖైదీలుగా కాదు. ప్రజలు వారికి నీరాజనాలు పట్టారు. ఇది కేవలం ఒప్పందమేననీ, లొంగుబాటు కాదనీ ఈ యుద్ధవీరులకు తెలుసు. ఒకవేళ శత్రువు ఆశించినపక్షంలో యుద్ధం మళ్ళీ ప్రారంభమవుతుందని కూడా వారికి తెలుసు. అంతవరకూ ఈ యుద్ధవీరులు విశ్రాంతితీసుకుని మలివిడత పోరాటానికి సన్నద్ధులు కావచ్చును. వారికి తమ జనరల్ మీదా, తమ మీదా అపరిమితమైన విశ్వాసం ఉంది.

* * *

1930–31 నాటి శాసనోల్లంఘన ఉద్యమం ఈ విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకుపోయింది. ఈ ఉద్యమంలో 90వేలమంది జైలుపాలైనట్టు అంచనా. 1920–22 మధ్యకాలంలో సాగిన సహాయనిరాకరణోద్యమంతో పోలిస్తే ఈ సంఖ్య కనీసం మూడురెట్లు ఎక్కువ. ఉద్యమం ఫలితంగా బ్రిటన్‌నుంచి దిగుమతి అయ్యే మిల్లుగుడ్డ సగానికి సగం పడిపోయింది. సిగరెట్ల వంటి ఇతర విదేశీ ఉత్పత్తులకూ ఇదే దుర్గతి పట్టింది. మద్యంమీదా, భూమిమీదా వచ్చే ఆదాయం కూడా ప్రభుత్వానికి బాగా తగ్గిపోయింది. శాసనమండళ్ళకు జరిగిన ఎన్నికలను బహిష్కరించడం ప్రభావంతంగా జరిగింది. జాతీయవాదం అనేక కొత్త సామాజిక గ్రూపులను ఆకర్షించగలిగింది. తమిళనాడులోనూ, పంజాబ్‌లోనూ, వివిధ నగరాల్లోనూ విద్యార్థులూ, వ్యాపారులూ, దుకాణదారులూ ఎంతోచురుకుగా ఉద్యమంలో పాలుపంచుకుంటే, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఆంధ్ర, బీహార్‌లలో రైతులు ప్రశస్థమైన పాత్రపోషించారు. మహారాష్ట్ర, కర్ణాటక, బెంగాల్, మధ్యప్రావిన్సుల్లో గిరిజనులు తమ సత్తా ఏమిటో చూపించారు. కార్మికులు కూడా ఈ ఉద్యమంలో ఏమాత్రం తగ్గలేదు. బోంబే,కలకత్తా, మద్రాస్‌లలో జరిగిన అనేక ప్రజాప్రదర్శనల్లో వారు అత్యధికసంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా షోలాపూర్‌లో వారు ఎటువంటి పాత్ర నిర్వహించారో మనకు తెలుసు.

శాసనోల్లంఘనోద్యమంలో ముస్లింల భాగస్వామ్యం 1920–22 మాదిరిగానే ఉంది. ఉద్యమానికి దూరంగా ఉండాలంటూ మతవాదనాయకులు పిలుపునివ్వడమూ, జాతీయవాదశక్తులను దెబ్బతీయడానికి ప్రభుత్వం మతవిభేదాలను రెకెత్తించడమూ ప్రభావం చూపించాయి. అయినప్పటికీ, ముస్లింల భాగస్వామ్యం తక్కువగా ఏమీ లేదు. ముఖ్యంగా వాయవ్య ప్రావిన్సులో వారు నిర్వహించిన భూమిక ఎటువంటిదో మనం చూశాం. బెంగాల్‌లో సేన్‌హట్టా, త్రిపుర, గాయ్‌బంధా, బగురా, నౌఖాలీ, డక్కాలలో మధ్యతరగతి ముస్లింలు ఈ ఉద్యమానికి అండగా నిలబడ్డారు. ముస్లిం విద్యార్థులు, దుకాణం దారులు, దిగువకులాలకు చెందిన వారూ ఉద్యమానికి వెన్నుదన్నునిచ్చారు. ఎగువ, మధ్యతరగతి ముస్లిం మహిళలుకూడా క్రియాశీలకమైన పాత్రనిర్వహించారు. బీహార్‌లో నేతపనిలో ఉన్న ముస్లింలు, ఢిల్లీ,లక్నోల్లో దిగువకులాలకు చెందిన ముస్లింలు ఉద్యమంలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. దేశంలోని మిగతాప్రాంతాల్లోకూడా వీరి భాగస్వామ్యం కొంతమేరకు ఉంది.

పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలూ,నిరక్షరాస్యుల మద్దతు కూడగట్టడంలో ఈ ఉద్యమం సాధించిన ఘనవిజయాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఉద్యమంలో వారి భాగస్వామ్యాన్ని ప్రభుత్వం నిర్వహించే 'జైలుపక్షుల' రికార్డులు కూడా రుజువుచేస్తున్నాయి. ఉద్యమంలో భాగస్వామ్యానికి వీలుగా ఉన్న అనేకమార్గాల్లో జైలుకెళ్ళడం కూడా ఒకటి. బెంగాల్ ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఇ.జె.లోమాన్ చేసిన వ్యాఖ్య ఒకటి ప్రభుత్వ ఆశ్చర్యాన్ని మనకు తెలియచెబుతుంది. 'అనామకులూ, అవారాగాళ్ల మద్దతుకూడా కాంగ్రెస్ కూడగట్టుకోగలుగుతుందనీ, వారి సానుభూతి సంపాదించుకోగలుగుతుందనీ నేను కలలో కూడా ఊహించలేదు' అన్నాడాయన.

* * *

# 23 కరాచీ నుంచి వార్ధా : 1932-1934

**గాం**ధీ- ఇర్విన్ ఒప్పందానికి ఆమోదముద్రవేయడానికి 1931 మార్చి 29న కరాచీలో కాంగ్రెస్ సమావేశమైంది. అంతకు ఆరురోజుల ముందు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను ఉరితీశారు. వారి ప్రాణాలను కాపాడటానికి గాంధీజీ శక్తివంచనలేకుండా ఎంతో ప్రయత్నించినప్పటికీ, ఈ అంశంమీద పట్టుబట్టి ఒప్పందంపై సంతకం చేయడానికి గాంధీజీ ఎందుకు నిరాకరించలేదన్న కోపం ప్రజల్లోనూ ముఖ్యంగా యువకుల్లో చాలా ఉంది. ఆయన కరాచీ వెడుతున్న దారిలో ప్రతిచోటా నల్లజెండాలతో ప్రదర్శనకారులు స్వాగతం చెప్పారు. గాంధీజీ తయారుచేసిన తీర్మానాన్ని కరాచీ సమావేశంలో కాంగ్రెస్ ఆమోదించింది. 'రాజకీయ హింస ఏ రూపంలో ఉన్నప్పటికీ అది అనామోదకరమైనదే'నని చెబుతూ, ఈ ముగ్గురు యోధులూ చూపిన తెగువ, చేసిన త్యాగం అమోఘమైనవని ఆ తీర్మానం ప్రస్తుతించింది. ఢిల్లీ ఒప్పందాన్ని ఆమోదిస్తూ తన పూర్ణస్వరాజ్య లక్ష్యాన్ని కాంగ్రెస్ పునరుద్ఘాటించింది.

మౌలికహక్కులు, ఆర్థిక కార్యక్రమం విషయంలో కరాచీ సమావేశం చేసిన తీర్మానాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కాంగ్రెస్ ఆవిర్భావంనుంచి ప్రజల రాజకీయ,పౌర, ఆర్థిక హక్కులకోసం పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రజలపరంగా 'స్వరాజ్యం' అంటే ఏమిటో తొలిసారిగా విశ్లేషించింది ఈ సమావేశంలోనే. 'దోపిడికి స్వస్తిచెప్పాలంటే ఆకలితో అల్లాడుతున్న కోట్లాదిమందికి రాజకీయస్వేచ్ఛతో పాటు ఆర్థికస్వేచ్ఛకూడా దక్కా'లని తీర్మానం వ్యాఖ్యానించింది. వాక్‌స్వాతంత్ర్యం, పత్రికాస్వేచ్ఛ, సమావేశమయ్యే హక్కు, సంఘాలు ఏర్పాటుచేసుకునే హక్కు వంటివాటికి కాంగ్రెస్ హామీ ఇచ్చింది. చట్టముందు కుల,మత,లింగభేదాలకు అతీతంగా అందరూ

సమానులేనని ప్రకటించింది. వయోజన ఓటింగు హక్కును గుర్తించింది. తప్పనిసరి ప్రాథమికవిద్యకు హామీ ఇచ్చింది. పన్ను,శిస్తులను పెద్దమొత్తంలో తగ్గించడానికీ, కార్మికులకు తగినవేతనాలతో కూడుకున్న చక్కని పనిపరిస్థితులను కల్పించడానికీ, పరిమిత పనిగంటలనూ, మహిళాకార్మికులకు రక్షణలనూ కల్పించడానికీ సిద్ధపడింది. రైతులు, కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకోవడానికీ, కీలకమైన పరిశ్రమలనూ, గనులు,రవాణా వంటి రంగాలనూ ప్రభుత్వ అధీనంలోనే ఉంచడానికీ కట్టుబడింది. మైనారిటీలూ, వివిధ భాషాప్రాంతాల సంస్కృతినీ, వారి భాషనూ పరిరక్షించాల్సిన అవసరాన్ని ప్రకటించింది. తరువాతి కాలంలో కాంగ్రెస్ అనుసరించిన రాజకీయ, ఆర్థికకార్యక్రమానికి కరాచీ తీర్మానం మూలాధారంగా పనిచేసింది.

* * *

రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యేందుకు 1931 ఆగస్టు 29వతేదీన గాంధీజీ లండన్ బయలుదేరి వెళ్లారు. లండన్‌లోని బ్రిటిష్ ప్రభుత్వాన్ని శాసిస్తున్న సామ్రాజ్యవాద రాజకీయ ఆర్థిక శక్తులు భారతదేశానికి రాజకీయ, ఆర్థికపరమైన రాయితీలు ఇవ్వడానికి వ్యతిరేకంగా ఉన్నందున ఈ సమావేశంవల్ల ఏదో ఒనగూరుతుందన్న ఆశ కనిపించలేదు. ఈ విధమైన రాయితీలు భారతదేశాన్ని తమ గుప్పిట్లోనుంచి బైటకు జారిపోయేందుకు దోహదం చేస్తాయని వారు వాదిస్తున్నారు. అతివాద నాయకుడు విన్‌స్టన్‌చర్చిల్‌కు బ్రిటిష్‌ప్రభుత్వం ఒక 'అర్ధనగ్న ఫకీర్'తో ముచ్చట్లుపెట్టడం ఏమాత్రం రుచించలేదు. భారతదేశంలో బలమైన ప్రభుత్వం ఉండాలన్నాడు ఆయన. మితవాద పత్రిక 'డైలీ మెయిల్' తన అభిప్రాయాన్ని నిష్కర్షగా వెలిబుచ్చింది. 'భారతదేశంలేకుంటే బ్రిటిష్ సామ్రాజ్యం ముక్కలుచెక్కలు కావల్సిందే. ఆర్థికంగా, రాజకీయంగా, వాణిజ్యపరంగా, భౌగోళికంగా కూడా మన సామ్రాజ్యానికి ఎంతో విలువైన ఆస్తి భారతదేశం. దానిని చేజార్చుకోవడమన్నది పెద్దద్రోహం. బ్రిటిష్‌వాడెవడూ కూడా ఇటువంటి ద్రోహానికి తలపెట్టకూడదు'. భారతదేశంలో ఇర్విన్‌స్థానంలో విల్లింగ్‌డన్ వైస్రాయ్‌గా అడుగుపెట్టాడు. బ్రిటన్‌లో 1931 డిసెంబరు తరువాత రామ్సే మెక్‌డొనాల్డ్ అధ్వర్యంలో మితవాదుల ఆధిక్యత ఉన్న మంత్రివర్గం ఏర్పడింది. సామ్యూల్‌హోర్ భారతరాజ్య వ్యవహారాలు చూడటం ఆరంభించాడు. కొందరు సమర్థులను మినహాయిస్తే, రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు ప్రభుత్వం ఏరికోరి ఎంపికచేసిన వారిలో అత్యధికులు ప్రభుత్వ తొత్తులు, మతవాదులు, అధికారంకోసం అర్రులు చాస్తున్నవారు, భూస్వాములు,రాజప్రతినిధులే. యావత్ భారతదేశ ప్రజల

ప్రయోజనాలకు కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించడంలేదని వాదించడానికి బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఉపయోగించుకుంది. స్వాతంత్ర్యమనే అస్త్రంతో సామ్రాజ్యవాదపాలకులను ఢీకొట్టడానికి ప్రయత్నిస్తున్న గాంధీజీని ఆదిలోనే బలహీనపరచడానికి బ్రిటిష్ ప్రభుత్వానికి వారు ఉపకరించారు.

రౌండ్‌టేబుల్ సమావేశంపై జాతీయవాదులకున్న విశ్వాసం ఏపాటిదో ప్రసిద్ధ గుజరాతీ కవి మెఘానీ కవితలో మనకు తెలియవస్తుంది. సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీ లండన్ బయలుదేరుతున్న సందర్భంగా రాసిన కవితను ఆయన 'ఛెలో కటారో జెర్నో ఆ: పీ జాయో, బాపూ!' అంటూ ప్రారంభించాడు. 'ఈ చివరి కప్పు విషాన్ని కూడా నువ్వు తగాల్సిందే బాపూ!' అని దాని అర్థం. గాంధీజీ కూడా ఈ సమావేశంపై తన అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్తీకరించారు. 'లండన్‌లో జరగబోయేదాన్నీ, ఇక్కడ జరుగుతున్నదానినీ చూస్తుంటే నన్ను కొత్తగా నిరాశలో ముంచెత్తేందుకేమీ లేదని అనిపిస్తోంది. భారతదేశానికి ఒట్టిచేతులతో తిరిగివచ్చే అవకాశాలు చాలా ఉన్నాయి'. లండన్‌లో నూటికినూరుపాళ్ళూ జరిగింది ఇదే. దేశానికి తక్షణం అధినివేశ ప్రతిపత్తిని కల్పించడం ద్వారా స్వాతంత్ర్యాన్ని ఇవ్వడానికి బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించలేదు. మారిన రాజకీయపరిస్థితులు మధ్య 1931 డిసెంబరు చివర్లో గాంధీజీ వెనక్కుతిరిగివచ్చారు.

* * *

ఢిల్లీ ఒప్పందం ప్రభావాన్ని భారతదేశంలోని బ్రిటిష్ ఉన్నతాధికారులు తమ కోణంలో విశ్లేషించుకున్నారు. ఈ ఒప్పందం కాంగ్రెస్ రాజకీయ ప్రతిష్ఠను పెంచిందనీ, ప్రజల్లో విశ్వాసాన్ని ఇనుమడింపచేసిందనీ, బ్రిటిష్ ప్రభుత్వ గౌరవప్రతిష్ఠలను దిగజార్చిందని వారు అభిప్రాయపడ్డారు. ఇద్దరు సమానులు ఒప్పందం కుదుర్చుకున్నట్టుగా భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెస్‌తో ఒప్పందం చేసుకోవడాన్ని వారూ వారితో పాటు కొత్తగా వచ్చిన వైస్రాయ్ కూడా ఈసడించుకున్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని తిరగదోడాలని కృతనిశ్చయానికి వచ్చారు. ఆహ్వానించడాలూ, ఆలోచించడాలూ, ఒప్పందాలూ, అంగీకారాలూ, గాంధీ–వైస్రాయ్ సమావేశాలూ...ఇకమీదట ఇవేమీ ఉండకూడదన్నదే ప్రభుత్వ విధానంగా మారింది.

బ్రిటిష్ విధానం ప్రధానంగా మూడు అంశాలమీద దృష్టి కేంద్రీకరించింది. 1. 1919లోనూ, 1920–21లోనూ, 1930లోనూ జరిగినట్టుగా గాంధీజీ పెద్ద ఉద్యమాలను నిర్మించడం, అవి దీర్ఘకాలం కొనసాగడం ఇకముందు ఉండకూడదు. 2. భారత ప్రభుత్వానికి పాలనాసమర్థత కొరవడిందనీ, గాంధీజీ ఒక ప్రత్యామ్నాయ శక్తిగా

ఎదిగిపోయాడని ప్రభుత్వాధికారులూ, గ్రామాధికారులూ, పోలీసులూ, ఉన్నతాధికారులూ, 'మన మిత్రులూ' ఎట్టిపరిస్థితుల్లోనూ భావించకూడదు. హోమ్‌సభ్యుడు హెచ్.జి.హేగ్ ఈ అంశంమీద ఇలా వ్యాఖ్యానించారు. 'నా అభిప్రాయం ప్రకారం కాంగ్రెస్ సహకారం లేకుండా మనం ఏదైనా చేయవచ్చు. కాంగ్రెస్ సహకరిస్తుందన్న నమ్మకం కూడా నాకు లేదు. కానీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మనం దీర్ఘకాలంగా సాగిస్తున్న పోరాటానికి వెన్నుదన్నుగా ఉంటూవస్తున్న వారి మద్దతు కోల్పోతే మాత్రం మనం ఏమీ సాధించలేం'. 3.ముఖ్యంగా, జాతీయోద్యమం గ్రామీణప్రాంతాల్లో వేళ్ళూనుకునేందుకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్ర, బీహార్, బెంగాల్, వాయవ్యభారతంలో జరిగింది ఇదే. ఈ పరిస్థితి పునరావృతం కాకూడదు.

గాంధీజీ లండన్‌లో ఉన్నప్పుడే జాతీయవాద శక్తులపై పెద్ద ఎత్తున విరుచుకుపడటానికి భారతప్రభుత్వం రహస్య సన్నాహాలు ప్రారంభించింది. 'అత్యంత కఠినంగా, తక్షణం' విరుచుకుపడటానికీ, సాధ్యమైనంత వెంటనే,అవకాశం దొరకగానే గాంధీజీని అరెస్టు చేయడానికీ అది నిర్ణయించుకుంది. దేశాన్ని దాదాపు సైనికశాసనంలోకి తోసివేసేంత కఠినమైన ఆర్డినెన్సులను రూపొందించింది.

శాంతికాలంలో ఉత్తరప్రదేశ్, బెంగాల్, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సులో సాగుతున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ కౌలుతగ్గింపు, పన్నుబకాయిల్లో రాయితీలకోసం మహోద్యమాన్ని నడుపుతోంది. పన్నుచెల్లించని రైతుల భూములను స్వాధీనం చేసుకోకుండా నిలువరించే ప్రయత్నం చేస్తున్నది. డిసెంబరు తొలివారంలో ఐదుజిల్లాల్లో పన్ను-శిస్తులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఆరంభించింది. ప్రభుత్వం ఇందుకు జవాబుగా బోంబేలో గాంధీజీని కలుసుకునేందుకు బయలుదేరిన జవహర్‌లాల్‌నెహ్రూను డిసెంబరు 26న అరెస్టుచేసింది. నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సులో అహింసాయుతంగా ఉద్యమం చేస్తున్న 'ఖుదాయ్ ఖిద్మత్‌గార్స్'పై పెద్ద ఎత్తున విరుచుకుపడింది. ప్రభుత్వం రైతులను తీవ్రంగా హింసించి వారినుంచి శిస్తు వసూలు చేస్తున్నందుకు నిరసనగా ఈ 'ఎర్రచొక్కాల' (రెడ్‌షర్ట్స్) వాళ్ళు అక్కడ ఉద్యమిస్తున్నారు.వారి నాయకుడు ఖాన్‌అబ్దుల్ గఫార్‌ఖాన్‌ను అరెస్టుచేసి, సైనికులు పెషావర్‌ను ఆక్రమించుకున్నారు. బెంగాల్‌లో తీవ్రవాదంపై పోరు పేరుతో దుర్మార్గమైన ఆర్డినెన్సుల ద్వారా ప్రభుత్వం బీభత్సకాండ సృష్టించింది. వేలాదిమంది రాజకీయకార్యకర్తలను అరెస్టుచేసింది. సెప్టెంబరులో పోలీసులు హిజ్లీజైలులోని రాజకీయఖైదీలపై కాల్పులు జరిపి ఇద్దరిని పొట్టనబెట్టుకున్నారు.

* * *

డిసెంబరు 28న గాంధీజీ బోంబేలో అడుగుపెట్టారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మరునాడు సమావేశమై శాసనోల్లంఘనోద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. 31వతేదీన గాంధీజీ వైస్రాయ్‌ను కలుసుకునేందుకు అనుమతికోరారు. సమావేశానికి అనుమతించినపక్షంలో అప్పటివరకూ ఉద్యమాన్ని వాయిదావేసేందుకు ఆయన సంసిద్ధత వెలిబుచ్చారు. కానీ, వైస్రాయ్ గాంధీ మొఖం చూసేందుకు అంగీకరించలేదు. తరువాతి ఐదేళ్ళలో పలుమార్లు జరిగిన ఇటువంటి తిరస్కారాల్లో ఇది మొదటిది. 1932 జనవరి 4న ప్రభుత్వం తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. జాతీయోద్యమంపై పెద్ద ఎత్తున విరుచుకుపడుతూ గాంధీజీని అరెస్టుచేసింది. అధికారులకు విస్తృతమైన అధికారాలు కట్టబెట్టే ఆర్డినెన్సులను ఆచరణకు తెచ్చింది. పౌరహక్కులు గాలిలో కలిసిపోయాయి. ప్రజలను జైళ్ళలో తోయడానికీ, వారి ఆస్తులను సునాయాసంగా స్వాధీనం చేసుకోవడానికీ అధికారులకు వీలుకలిగింది. కేవలం వారం రోజుల్లో దేశంలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకులందరూ జైలుపాలయ్యారు.

భారత ప్రజలు ఈ అరాచకత్వానికి ప్రతిగా తీవ్ర ఆగ్రహంతో స్పందించారు. కాంగ్రెస్ ఎటువంటి ప్రయత్నాలూ చేయకుండా హఠాత్తుగా యుద్ధరంగంలోకి దిగాల్సివచ్చినప్పటికీ ప్రజల స్పందన అనూహ్యంగానూ, అమోఘంగానూ ఉంది. మొదటి నాలుగునెలల్లోనే 80వేలమంది సత్యాగ్రహులు జైలుపాలయ్యారు. వీరిలో అత్యధికులు పట్టణ,గ్రామీణ ప్రాంతాల పేదలే. లక్షలాదిమంది ప్రభుత్వం జారీచేసిన విభిన్నమైన ఆర్డినెన్సులను ధిక్కరిస్తూ కదనరంగంలోకి దూకారు. విదేశీవస్త్రాలనూ,మద్యాన్నీ విక్రయించే దుకాణాలముందు పికెటింగ్ జరపడం, అహింసాయుత ప్రదర్శనలుచేయడం, సభలనూ,సమావేశాలనూ ఏర్పాటు చేయడం, జాతీయదినాలను వేడుకతో జరుపుకోవడం వంటివి చేశారు.

ఈ అహింసాయుత ఉద్యమం తీవ్రస్థాయిలో అణచివేతను ఎదుర్కొంది. కాంగ్రెస్‌నూ, దాని అనుబంధ సంస్థలనూ ప్రభుత్వం చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటించింది. కార్యాలయాలపై దాడులు జరిపి, వాటి ఆస్తిపాస్తులను స్వాధీనం చేసుకుంది. గాంధీ ఆశ్రమాలన్నింటినీ పోలీసులు ఆక్రమించుకున్నారు. శాంతియుతంగా పికెటింగ్‌చేస్తున్నవారినీ, సత్యాగ్రహులనూ, ప్రదర్శనకారులనూ పోలీసులు విచక్షణారహితంగా చావమోదారు. వారికి కఠినమైన జైలుశిక్షలూ, భారీ జరిమానాలూ విధించారు. వారి భూములనూ, ఆస్తులనూ నామమాత్రపు ధరకు అమ్మిపారేసిన ప్రభుత్వం ఆ జరిమానాలను తన ఖాతాల్లో జమచేసుకుంది. జైళ్లలో రాజకీయఖైదీలు దుర్భరమైన, దుర్మార్గమైన పరిస్థితులను చవిచూశారు. కొరడాతో బాదడం ఒక ఆమోదయోగ్యమైన,

సర్వసాధారణమైన శిక్షగా తయారైంది. దేశవ్యాప్తంగా సాగుతున్న పన్నువ్యతిరేక ఉద్యమాలు మరింత తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. ఇళ్ళు, భూములు, పశువులు, వ్యవసాయ పరికరాలూ... ఇలా అదీ ఇదీ అని లేకుండా అన్నింటినీ ప్రభుత్వం నిర్లజ్జగా స్వాధీనం చేసుకుంది. పోలీసులు అతిపాశవికంగా విరుచుకుపడి అనేక రకాల దురాగతాలకు పాల్పడ్డారు. గుజరాత్‌లోని రస్ గ్రామంలో పన్నుచెల్లించడానికి నిరాకరించిన రైతులను నగ్నంగా నిలబెట్టి కొరడాలతో కొట్టారు. వారికి కరెంటుషాక్‌లు ఇచ్చారు. ప్రత్యేకించి మహిళలపై ప్రభుత్వం జరిపిన దమనకాండ అత్యంత అమానుషమైనది. సత్యాగ్రహ ఉద్యమంనుంచి వారు తప్పుకునేట్టు చేయడానికి ప్రభుత్వం వారిని నానాయాతనలూ పెట్టింది. ముఖ్యంగా జైళ్ళలో వారు అనుభవించినంత నరకం మరెక్కడా లేదు. జరుగుతున్న పరిణామాలను నివేదించడానికి కానీ, వ్యాఖ్యానించడానికి కానీ, కనీసం జాతీయనాయకుల ఫొటోలు ముద్రించడానికి కానీ పత్రికలకు అధికారం లేదు. పత్రికాస్వేచ్ఛ మంటగలిసిపోయింది. 1932లో కేవలం ఆరునెలల్లో 109మంది పాత్రికేయులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంది. 98 ముద్రణాకార్యాలయాలను స్వాధీనం చేసుకుంది. జాతీయ సాహిత్యం-కవితలు, కథలు, నవలలు - పై పెద్ద ఎత్తున నిషేధం అమలులోకి వచ్చింది.

ప్రజలు వెనుకంజవేయలేదు. వారు తిరగబడ్డారు, పోరాడారు. కానీ, గాంధీజీ సహా ఇతర జాతీయనాయకులెవ్వరికీ ఉద్యమాన్ని ఒక గాడినపెట్టడానికి కానీ, దాని తీవ్రతను దీర్ఘకాలం కొనసాగించడానికి కానీ అవకాశం లేకపోయింది. కొద్దినెలల్లోనే ప్రభుత్వం ఉద్యమాన్ని విజయవంతంగా అణచిపారేయగలిగింది. రాజకీయ ఉత్సాహం, ఉద్రేకం తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. నిరాశ, అధైర్యం చోటుచేసుకున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో, ఉద్యమాన్ని నిలిపివేయాలని 1933 ఏప్రిల్‌లో గాంధీజీ నిర్ణయం తీసుకున్నారు.

* * *

ఉద్యమం ఈ విధంగా పతనం కావడం రాజకీయ కార్యకర్తలను తీవ్రంగా నిరాశపరచింది. మనం సాధించిందేమిటి? అని చాలా మంది ప్రశ్నించుకున్నారు, ప్రశ్నించారు. ధైర్యానికీ, తెగువకూ మారుపేరైన జవహర్‌లాల్‌నెహ్రూలో కూడా నైరాశ్యం చోటుచేసుకుందనడానికి ఆయన 1935 జూన్‌లో జైలులో ఉండగా తన డైరీలో రాసుకున్న కవితే ఉదాహరణ. 'కన్నీళ్ళు...కన్నీళ్ళు...నా హృదయం ఎక్కడకు పోయింది?' అంటూ

ఆయన అందులో తన అవేదన వెలిబుచ్చారు. అంతకుముందు, గాంధీజీ ఉద్యమం ఉపసంహరించుకోగానే గాంధీజీతో తన దీర్ఘకాలిక అనుబంధం ఇక 'ముగిసిపోతున్నందుకు' జవహర్‌లాల్ మనసు 'నొప్పితో గిలగిల్లాడింది'. సుభాస్‌చంద్రబోస్, విఠల్‌భాయిపటేల్ మరింత తీవ్రంగా గాంధీజీపై విరుచుకుపడ్డారు. 1933లో వారు యూరప్‌నుంచి ఒక ప్రకటన విడుదల చేస్తూ, 'ఒక రాజకీయ నాయకుడుగా గాంధీజీ విఫలమైనాడు' అని వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ ఇప్పుడు ముందుకు సాగాలంటే, ఒక కొత్త సిద్ధాంతాన్ని నమ్మకోవాలి, ఒక కొత్త మార్గాన్ని ఎన్నుకోవాలి, దానికోసం ఒక కొత్తనాయకుడు కావాలి' అని వారు వ్యాఖ్యానించారు.

జాతీయవాదులను ఆవరించిన నైరాశ్యాన్ని భారతజాతీయవాద శత్రువులు పూర్తిగా తప్పుడుకోణంలో అర్థంచేసుకున్నారు. 1933లో విల్లింగ్డన్ చేసిన వ్యాఖ్య చూడండి. 'కాంగ్రెస్ ప్రస్తుతం జారిపోయి ఉంది. 1930లలో అది ఉన్న స్థితితో పోల్చుకుంటే ఇప్పుడు దాని పరిస్థితి దిగజారింది. ప్రజలమీద అది తన పట్టుకోల్పోయింది'. అయితే, భారత జాతీయోద్యమ వ్యూహాన్ని అంచనావేయడంలో విల్లింగ్డన్, ఆయన బృందం విఫలమైనారు. ఈ ఉద్యమం పూర్తిగా దేశప్రజల మనోవాంఛకు సంబంధించింది. గతంలో ఇర్విన్ అనుసరించిన చర్చల విధానం విఫలమైనట్టే, ఇప్పుడు విల్లింగ్డన్ అనుసరిస్తున్న అణచివేత విధానం కూడా విఫలమైంది. అంతే. ప్రజలు ప్రభుత్వ సైనికశక్తికి తలవొంచారే కానీ, కాంగ్రెస్‌మీద విశ్వాసాన్ని కోల్పోలేదు. 1930నుంచి 1934వరకూ సాగిన ఉద్యమం స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టకపోయినా, తాత్కాలికంగా అణిగిపోయినా అది ప్రజలను తిరిగితలెత్తకుండా చేయలేకపోయింది. పైగా అది ప్రజలను మరింత సానుకూలంగా మార్చింది. బ్రిటిష్ పాలనమీద మరింత ద్వేషం పెరిగి, దానికి వ్యతిరేకంగా పోరాడాలన్న పట్టుదలను రెండింతలు చేసింది. పాత్రికేయుడు హెచ్. ఎన్. బ్రెయిల్స్‌ఫోర్డ్ ఈ ఉద్యమాన్నీ, దాని ప్రభావాన్నీ అంచనావేస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించాడు. 'ఈ పోరాటంతో ప్రజల మెదళ్ళు మరింత స్వేచ్ఛయుతమైనాయి. వారు ఎప్పుడో తమ మనస్సులోనే స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నారు'.

గతంలో జరిగినట్టే, ఈ ఉద్యమం తరువాత ఏర్పడిన స్తబ్ధతకూడా ప్రజలు మలిపోరాటానికి పునరంకితం కావడానికీ, శక్తిసామర్థ్యాలను కూడగట్టుకోవడానికీ ఉపకరించింది. ఉద్యమం ఉపసంహరించుకోవడమంటే ఓటమికాదు. ప్రజల మద్దతు కోల్పోయినట్టూ కాదు. దానర్థం డాక్టర్ అన్సారీ చెప్పినట్టు 'దీర్ఘకాలం పోరాడిన తరువాత

కొద్దిపాటి విశ్రాంతి తీసుకుని' మరింత బలంగా, మరింత సమర్థవంతంగా మలిపోరాటానికి దిగడమే. ఈ ఉద్యమం ప్రజలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపించిందనడానికి 1934లో రాజకీయఖైదీలు జైళ్ళనుంచి విడుదలైనప్పుడు ప్రజలు వారిని స్వాగతించిన తీరుతెన్నులే నిదర్శనం. అంతేకాదు, 1937లో ఎన్నో పరిమితులూ, నియంత్రణల మధ్య జరిగిన ఎన్నికల్లో సైతం మొత్తం 11 ప్రావిన్సుల్లో 6 ప్రావిన్సులను కాంగ్రెస్ గెలుచుకోవడం కూడా పరిస్థితిని తెలియచెబుతుంది.

తన సమకాలీనుల్లో గాంధీజీ ఒక్కరే శాసనోల్లంఘనోద్యమ ఫలితాన్ని సరిగా అర్థంచేసుకుని, అంచనావేయగలిగారు. 1933 సెప్టెంబరులో ఆయన నెహ్రూకు రాసిన ఒక లేఖలో ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'ఓడిపోయామని నేను అనుకోవడం లేదు. మనదేశ ప్రజలు 1920లో మాదిరిగానే తమ లక్ష్యాన్ని సాధించడానికి మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతారన్న నమ్మకం నాకుంది'. ఆయన ఈ అభిప్రాయాన్ని 1934 ఏప్రిల్‌లో కొంతమంది కాంగ్రెస్ నాయకులతో కూడా పంచుకున్నారు. 'నాలో నిరాశ ఏకోశానాలేదు. నేను ధైర్యాన్ని ఏమాత్రం కోల్పోలేదు. ఈ దేశప్రజల శక్తిసామర్థ్యాలమీద మీకు నమ్మకం లేదేమో కానీ, నాకు మాత్రం సంపూర్ణంగా ఉంది' అన్నారాయన.

* * *

'విభజించి పాలించే' బ్రిటిష్ విధానం మరో కొత్త అవతారంలో భారతీయుల ముందు సాక్షాత్కరించింది. 1932 ఆగస్టులో ప్రభుత్వం 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించింది. దీని ప్రకారం ప్రతి అల్పసంఖ్యాకవర్గానికీ ప్రభుత్వం చట్టసభల్లో కొన్ని స్థానాలను ప్రత్యేకంగా కేటాయించింది. ముస్లిం ప్రతినిధులను ముస్లింలు, సిక్కు ప్రతినిధులను సిక్కులు... ఇలా కేవలం ఆయా మైనారిటీవర్గాలవారు వారి ప్రతినిధులను ఎన్నుకునే విధానం ఇది. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు అప్పటికే మైనారిటీలుగా గుర్తింపుపొందారు. కానీ, ఇప్పుడు కొత్తగా 'అణగారినవర్గాల'ను కూడా ప్రభుత్వం మైనారిటీలుగా గుర్తించి వారిని కూడా ఇందులో చేర్చి, ఆ విధంగా వారిని మిగతా హిందువులనుంచి విడదీసింది.

ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులకు ప్రత్యేకనియోజకవర్గాలు కల్పించడం వల్ల వారు తమని తాము వేరుగా భావించుకునే అవకాశాలు ఉంటాయనీ, తమప్రయోజనాలూ, మిగతా భారతీయుల ప్రయోజనాలూ వేరని వారు అనుకునే ప్రమాదం ఉందనీ, ఇది వారిలో మతతత్వధోరణులను పెంచేందుకు అవకాశం ఉందని భావించి కాంగ్రెస్ ఈ ఆలోచనను తిరస్కరించింది. ఒక ఉమ్మడి జాతీయస్పృహనూ, సమష్టి చైతన్యాన్నీ

దెబ్బతీయడానికి బ్రిటిష్ ప్రభుత్వం చేసిన కుట్రగా కాంగ్రెస్ దానిని గుర్తించింది. కానీ, 1916లో ముస్లింలీగ్‌తో వచ్చిన ఒక ఒప్పందంలో ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాల విషయంలో కాంగ్రెస్ రాజీపడింది. అందువల్ల, ఇప్పుడు దీనిని వ్యతిరేకిస్తున్నప్పటికీ మైనారిటీలను సంప్రదించకుండా దానిని మార్చడానికి సిద్ధపడలేని స్థితి ఏర్పడింది. తత్ఫలితంగా, కమ్యూనల్ అవార్డును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ దానిని ఆమోదించనూవద్దు, తిరస్కరించనూ వద్దు అని కాంగ్రెస్ నిర్ణయించుకుని వదిలేసింది.

అయితే, అణగారినవర్గాలవారికి రాజకీయంగా వేరుగుర్తింపు ఇస్తూ వారిని మిగతాహిందువులకు దూరంచేసే ప్రయత్నాన్ని జాతీయవాదులందరూ తీవ్రంగా నిరసించారు. ఆ సమయంలో యరవాడా జైలులో ఉన్న గాంధీజీ దీనిపై ఎంతో ఆగ్రహంగా స్పందించారు. ఈ అవార్డును ఆయన దేశ సమైక్యతపైనా, జాతీయవాదంపైనా జరిగిన ప్రత్యక్షదాడిగా భావించారు. హిందూమతానికీ, అణగారినవర్గాలవారికీ తీవ్రనష్టాన్ని చేకూర్చే చర్యగా ప్రకటించారు. ఈ వర్గాల సామాజికహోదాకు సంబంధించి ఈ అవార్డు ఎటువంటి పరిష్కారాలనూ చూపించకపోవడంతోపాటు, ఈ వర్గాలవారిని వేరుగా గుర్తించినందువల్ల అస్పృశ్యతానిర్మూలనమనేది ఉనికిలో లేకుండా పోతుందనీ, ఈ విషయంలో ముందుకు సాగుతున్న హిందూ సమాజపు సంస్కరణ పూర్తిగా నిలిచిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కమ్యూనల్ అవార్డు ముస్లింలకు, సిక్కులకు ఏ రకమైన హాని చేసినప్పటికీ, వారు ముస్లింలుగానూ, సిక్కులుగానే ఉంటారు. అదేవిధంగా, అణగారినవర్గాలను మిగతాసమాజానికి దూరంగా ఉంచుతూ, అస్పృశ్యతను పూర్తిగా అంతం చేయడానికి తనతోపాటుగా మిగతా సంఘసంస్కర్తలు చేస్తున్న కృషిని బూడిదలో పోస్తూ, ఈకమ్యూనల్ అవార్డు 'అస్పృశ్యులను శాశ్వతంగా అస్పృశ్యులుగానే మిగల్చుతుంద'ని ఆయన వాదించారు. అణగారిన వర్గాలవారి ప్రయోజనాలను కాపాడటమన్నది వారికోసం శాసనసభల్లో ప్రత్యేకసీట్లను కేటాయించడం ద్వారా కాకుండా అస్పృశ్యతను కూకటివేళ్లతో సహా పెకిలించడం ద్వారా జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలోని అన్నివర్గాల, అన్ని కులాల, అన్ని మతాల ప్రజలూ సమష్టిగా ఓటుచేసే ప్రాతినిధ్యం అణగారిన వర్గాలవారికి దక్కాలని ఆయన అభిప్రాయపడ్డారు. అణగారినవర్గాలవారికి అత్యధికసంఖ్యలో సీట్లను కేటాయించాలన్న డిమాండును ఆయన సమర్థించారు.

తన డిమాండును నెరవేర్చుకోవడానికి 1932 సెప్టెంబరు 20న గాంధీజీ ఆమరణనిరాహారదీక్షకు సంకల్పించారు. ఈ సందర్భంగా ఒక పత్రికాప్రకటనలో ఆయన

ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'నా ప్రాణం గురించి నాకు ఏమాత్రం ఆలోచనలేదు. ఈ పవిత్రకార్యానికి వందప్రాణాలు పోవడం కూడా తక్కువే. హిందువులు నిస్సహాయులైన తమతోటి వారికి తరతరాలుగా చేస్తున్న అన్యాయానికి చెల్లించాల్సిన పరిహారం ముందు ఇది చాలా చిన్నది'.

చాలామంది నాయకులు గాంధీజీ నిరశనవ్రతానికి సంకల్పించడం వల్ల ఉద్యమం పక్కదారిపడుతుందన్న భయాన్ని వ్యక్తంచేశారు. దేశప్రజలు గాంధీజీ తీసుకున్న నిర్ణయానికి హొణికిపోయారు. దేశవ్యాప్తంగా ప్రార్థనలూ, సమావేశాలూ విస్తృతంగా జరిగాయి. ప్రతిచోటా ఆలయాలనూ, ఊరుబావులనూ అస్పృశ్యులకోసం తెరిచారు. రవీంద్రనాథ్‌ఠాగూర్ గాంధీజీకి ఇచ్చిన టెలిగ్రామ్‌లో ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'దేశ సమైక్యతకోసం, దాని సామాజిక సమగ్రతకోసం ఎంతో విలువైన జీవితాన్ని త్యాగం చేయడం పూర్తిగా సబబు. మీ పట్ల ప్రేమాభిమానాలతో బరువెక్కి ఉన్న మా బాధాతప్త హృదయాలు మీ వెంటే ఉన్నాయి'. మదన్‌మోహన్ మాలవీయ, ఎం.సి.రాజా, బి.ఆర్. అంబేద్కర్ సహా భిన్న రాజకీయదృక్పథాలున్న రాజకీయనాయకులు ఈ సమయంలో క్రియాశీలకమైన పాత్ర నిర్వహించారు. ఒక ఒప్పందాన్ని కుదర్చడంలో వారు చివరకు విజయంసాధించారు. ప్రసిద్ధిచెందిన ఈ పూనా ఒప్పందం ప్రకారం అణగారినవర్గాలవారికి ప్రత్యేక నియోజకవర్గాలంటూ ఉండవు. కానీ, వారికోసం చట్టసభల్లో ప్రత్యేకంగా కొన్ని స్థానాలు కేటాయించడం జరుగుతుంది. ఈ ఒప్పందంలో భాగంగా ప్రావిన్షియల్ సభల్లో వారికి కేటాయించిన స్థానాల సంఖ్య 71 (కమ్యూనల్ అవార్డు కేటాయించిన స్థానాలసంఖ్య) నుంచి 147కు పెరిగింది. కేంద్రశాసనసభలో 18శాతం మేరకు స్థానాలు పెరిగాయి.

* * *

తన నిరశనదీక్షను విరమించిన తరువాత పూనా ఒప్పందం గురించి గాంధీజీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'ఈ ఒప్పందం అమలుకు నా ప్రాణాన్ని తాకట్టు పెడుతున్నాను. హరిజనమిత్రులకు ఇదే నా హామీ'. ఆయన తన హామీని నిలబెట్టుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. మొదటజైలునుంచీ, ఆ తరువాత జైలుబయటా ఆయన కార్యాచరణ ఆరంభమైంది. దాదాపు రెండుసంవత్సరాలపాటు ఆయన మిగతాకార్యక్రమాలజోలికి పోకుండా అస్పృశ్యతకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. జైలునుంచి విడుదలకాగానే ఆయన అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని విడిచిపెట్టి వార్ధాలోని సత్యాగ్రహ ఆశ్రమానికి మకాంమార్చారు. స్వరాజ్యాన్ని సాధించేవరకూ సబర్మతికి తిరిగిరానని 1930లోనే ఆయన ప్రమాణం చేశారు. 1933

నవంబరు 7నుంచి 1934 జులై 29వరకూ అంటే సుమారు తొమ్మిదినెలలపాటు ఆయన ఉధృతంగా హరిజనులకోసం పర్యటన జరిపారు. ఈ దేశవ్యాప్తపర్యటనలో ఆయన రైలు,కారు, ఎడ్లబండి,కాలినడకల ద్వారా 20వేల కిలోమీటర్లు ప్రయాణించి అస్పృశ్యతా నిర్మూలనకు కృషిచేశారు. తాను కొత్తగా ఆరంభించిన 'హరిజన్ సేవక్‌సంఘ్'కు నిధులు సేకరించడంతోపాటు, సామాజిక కార్యకర్తలందరినీ గ్రామాలకు తరలివెళ్ళి విభిన్నరూపాల్లో, వివిధ రీతుల్లో అమలుజరుగుతున్న అస్పృశ్యతను నిర్మూలించడానికీ, హరిజనుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సముద్ధరణకూ కృషిచేయమంటూ ఉద్బోధించారు.

ఈ 'హరిజనోద్ధరణ'లో భాగంగా ఆయన తన సహచరులకూ, అనుచరులకూ ఈ అంశానికున్న ప్రాధాన్యతను తెలియచెప్పి వారిని ఒప్పించడంకోసం రెండుసార్లు నిరశనదీక్షకు సంకల్పించారు. 1933 మే 8న, ఆగస్టు 16న ఆయన దీక్షకు ఉపక్రమించారు. 'వారు అస్పృశ్యతనైనా వదులుకోవాలి, లేదా నన్నైనా కోల్పోవాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దీక్షలు జాతీయవాదుల్లో మానసిక సంక్షోభాన్ని సృష్టించాయి.

గాంధీజీ ప్రచారానికి ఛాందసులనుంచీ, ప్రతికూలశక్తులనుంచీ తీవ్రవ్యతిరేకత వచ్చింది. గాంధీజీకి నల్లజెండాలతో స్వాగతం పలికేవారు. సమావేశాల్లో గందరగోళం సృష్టించేవారు. ఆయనను దుర్భాషలాడుతూ కరపత్రాలు ప్రచురించారు. హిందూ వ్యతిరేకిగా ఆరోపిస్తూ ఆయన చిత్రాలను దహనం చేశారు. పూనాలో 1934 జూన్ 25న ఆయన ప్రయాణిస్తున్నట్టుగా భ్రమించి ఒక కారుపై బాంబువిసిరి అందులో ప్రయాణిస్తున్న ఏడుగురిని తీవ్రంగా గాయపరిచారు. అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీజీ చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రభుత్వం సహకరించని పక్షంలో తాము ప్రభుత్వానికి పూర్తి మద్దతునిస్తామని వీరు ప్రకటించారు. 1934 ఆగస్టులో ప్రభుత్వం ఆలయప్రవేశబిల్లును ఓడించడం ద్వారా వారి మద్దతును స్వీకరించింది.

దీక్షలోనూ, ప్రచారంలోనూ, నిర్మాణ కార్యక్రమంలోనూ గాంధీజీ కొన్ని అంశాలను బలంగా నొక్కివక్కాణించేవారు. అందులో ఒకటి హరిజనులపై అమలు జరుగుతున్న వివక్షస్థాయి. వాస్తవానికి ఆయన హిందూసమాజంపై తన విమర్శ తీవ్రతను క్రమేపీ పెంచుకుంటూ పోవడం కూడా జరిగింది. 'హరిజనులు సామాజికంగా కుష్టురోగులు. ఆర్థికంగా బిచ్చగాళ్ళు. మతపరంగా అంటరానివారు. మనం దేవుడినివాసాలని చెబుతున్న వాటిలోకి వారికి ప్రవేశం లేదు. హిందువులందరికీ అందుబాటులో ఉన్న దారులు, బావులు, పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు వారికి

మట్టుకు దక్కవు. నగరాల్లోనూ, పట్టణాల్లోనూ వారు జనవాసాలకు దూరంగా దుర్భరమైన పరిస్థితుల మధ్య ఉండాల్సిందే' అని ఆయన వ్యాఖ్యానించారు. 'అస్పృశ్యతను కూకటివేళ్ళతో సహా పెకిలించివేయాల'న్నది ఆయన మరో వాదన. ఈ విషయంలో దేవాలయాల్లోకి హరిజన ప్రవేశమన్నది తొలిమెట్టుగా ఆయన భావించారు.

హేతుబద్ధంగా, మానవత్వంతో వ్యవహరించడమనేదానికి ఆయన తన ప్రచారంలో విశేష ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. దానితోపాటుగా, ప్రస్తుతం ఆచరణలో ఉన్న అస్పృశ్యతకు హిందూశాస్త్రాల ఆమోదంలేదన్న విషయాన్ని కూడా ఆయన చెబుతూవచ్చారు. ఒకవేళ అలాకాకపోయినా, హరిజనుడిని అణగదొక్కడం అన్యాయమనీ, సత్యం అన్నది పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకూడదనీ, ఒకవేళ శాస్త్రాలు మానవ గౌరవానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు వాటిని బేఖాతరు చేయడమే ఉత్తమమని ఆయన ప్రబోధించారు.

గాంధీజీ తన ప్రసంగాల్లోనూ, రచనల్లోనూ 'ప్రాయశ్చిత్తం', 'పాపపరిహారం' అన్న రెండు మాటలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. శతాబ్దాలుగా హరిజనులకు చేసిన దురన్యాయాలకు కులహిందువులు పశ్చాత్తాపపడాలనీ, ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ ఆయన ఉద్బోధించేవారు. ఈ కారణంగానే తనను ఏమాత్రం విశ్వసించకుండా తీవ్రంగా విమర్శించిన డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్, ఇతర హరిజననాయకులపై ఆయనకు ఏమాత్రం ఆగ్రహం కలగలేదు. 'నన్ను విశ్వసించకపోయే హక్కు వారికి ఉంది' అన్నారాయన. 'నేను కూడా అస్పృశ్యులనేవారిని దుర్మార్గంగా అణచివేసిన సదరు ఉన్నతకులాలకు చెందినవాడినే కదా!' అని ఆయన తన రచనలో వ్యాఖ్యానించారు. అదే సందర్భంలో ఆయన కులహిందువులను ఉద్దేశించి వారిలో పరివర్తనరానిపక్షంలో హిందూమతం నాశనమైపోతుందని తీవ్రంగా హెచ్చరించారు. 'అంటరాతనం జీవించి ఉంటే హిందూమతం మరణిస్తుంది. హిందూమతం సజీవంగా ఉండాలంటే అంటరానితనం అంతమైపోవాలి' అన్నారాయన. (1947 ముందు భారతదేశంలో జన్మించిన కులహిందువులు–స్వాతంత్ర్యానంతరం షెడ్యూల్డుకులాలు, తెగలవారికి పెద్ద ఎత్తున ఉద్యోగాల్లోనూ, వృత్తివిద్యాకళాశాలల్లోనూ కల్పించిన రిజర్వేషన్లను– వెంటనే ఎందుకు ఆమోదించగలిగారన్నది మనకు ఈ 'ప్రాయశ్చిత్త' వాదన ప్రభావాన్ని తెలియచెబుతుంది). వివాహాల్లోనూ, భోజనాల్లోనూ ఉన్న వివక్షనూ, మరోవైపు కొనసాగుతున్న అస్పృశ్యతనూ ఒకేగాటన కట్టడానికి గాంధీజీ సిద్ధంగా లేరు. భోజనవివాహాదుల్లో ఉన్న వివక్షలు తప్పకుండా చెరిగిపోవాల్సిందేననీ, హిందూసమాజానికి ఇది పెద్ద శాపమని ఆయన అంగీకరించారు. అయితే, కులహిందువులూ, అస్పృశ్యులూ కూడా తమలో తాము

వీటిని ఆచరిస్తున్నారు. ప్రస్తుతం సాగుతున్న ఉద్యమం హరిజనులకు వ్యతిరేకంగా అమలు జరుగుతున్న వివక్షపైనే దృష్టిసారించాలని ఆయన ఉద్బోధించారు. అదేవిధంగా అస్పృశ్యతానిర్మూలనకూ, కులవ్యవస్థ అంతంకావడానికీ మధ్య ఆయన సంబంధం పెట్టలేదు. 'కులవ్యవస్థ కారణంగానే ఈ వ్యవస్థకు వెలుపల అంటరానివారంటూ కొందరు ఏర్పడ్డారు. కులాలున్నంతకాలం వీళ్ళుకూడా ఉంటారు. కులవ్యవస్థను నిర్మూలించనిదే వీరి సముద్ధరణ సాధ్యంకాదు' అని అంబేద్కర్ వంటివారు చేసిన వాదనను గాంధీజీ అంగీకరించలేదు. వర్ణాశ్రమధర్మానికి దాని పరిమితులూ, లోపాలూ దానికున్నప్పటికీ అస్పృశ్యతలో ఉన్నంతపాపం దానిలో లేదని ఆయన వాదించారు. కులవ్యవస్థ కారణంగా కాక 'ఎగువ,దిగువ' అనే తేడాలే అస్పృశ్యతకు కారణమనీ, కులవ్యవస్థ ప్రతీకులమూ ఒకదానికంటే ఒకటి ఎక్కువ లేదా తక్కువ అన్న సూత్రంతో కాక, ఒకదానికొకటి చేదోడువాదోడుగా కొనసాగవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. ఏదేమైనప్పటికీ వర్ణాశ్రమ వ్యవస్థపట్ల విశ్వాసం ఉన్నవారూ లేనివారూ కూడా అస్పృశ్యతానివారణకు నడుంబిగించవచ్చుననీ, ఎందుకంటే ఈ అంశం ఇద్దరికీ కూడా సమానశత్రువేనని ఆయన పిలుపునిచ్చారు.

మతపరంగానూ, ఇంకా ఇతరత్రా అనేక రీతుల్లోనూ అస్పృశ్యతానివారణ అనేక సత్ఫలితాలను ప్రసాదిస్తుందని గాంధీజీ ప్రకటించారు. హిందువులు హిందూయేతరులను ఏదో ఒకరూపంలో అస్పృశ్యులుగా చూస్తారు. ముఖ్యంగా ఆహారపానీయాదుల్లో ఈ వివక్ష మనకు స్పష్టంగా కనిపిస్తుంది. హిందూయేతరులు ఈ వివక్షను తప్పకుండా గుర్తిస్తారు. అందువల్ల, 'అస్పృశ్యతను నిర్మూలించగలిగినపక్షంలో అది భారతీయులందరినీ సంఘటితపరుస్తుంది' అని గాంధీజీ అభిలషించారు. భారతీయ సమాజంలో మనిషికీ మనిషికీ మధ్య తేడాను సృష్టించిన అనేక తప్పుడు విధానాల్లో అస్పృశ్యతకూడా ఒకటనీ, ఈ తేడా 'ఉచ్ఛ, నీచ' సూత్రంపై ఆధారపడి ఉందనీ, అందువల్ల అస్పృశ్యతపై దాడిచేయాలంటే ఈసూత్రాన్ని వ్యతిరేకించాలని ఆయన వాదించారు. 'ప్రస్తుతం మనం కొనసాగిస్తున్న ఒక దశపోరాటంతోనే వ్యవహారం అంతా ముగిసిపోవడంలేదు' అని కూడా ఆయన హెచ్చరించారు.

ఒక హేతుబద్ధమైన చర్చపైనా, అహింసాయుత విధానంపైనా అపరిమితమైన విశ్వాసం ఉన్న గాంధీజీ అస్పృశ్యతానివారణకు సంబంధించి ఎవరినీ ఒత్తిడి చేయడాన్నీ, భయాన లొంగదీయడాన్నీ వ్యతిరేకించారు. వారు తమ అంతరాత్మకు జవాబుదారీగా ఉండాలన్నారు. హేతుబుద్ధితో ఆలోచించమని విజ్ఞప్తిచేశారు. అస్పృశ్యతానివారణను వ్యతిరేకిస్తున్నవారిని ఆయన సనాతనవాదులుగా వ్యాఖ్యానించారు. తాను చేస్తున్న నిరశనదీక్షలు వారిపై

సామాజికంగా ఒత్తిడిపెంచి భయంతోనో,బెదురుతోనో ఆలయాలనూ, బావులనూ తెరవాలన్నది తన ఉద్దేశం కాదనీ,ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నవారిని మరింత చైతన్యవంతం చేసి వారిని కార్యదీక్షాపరులుగా మార్చేందుకే తాను దీక్షకు సంకల్పించానని ఆయన ఒక సందర్భంలో ప్రకటించారు.

హరిజనోద్ధరణలో భాగంగా హరిజనుల్లో సంస్కరణలకు కూడా విశేష ప్రాధాన్యత లభించింది. విద్యావ్యాప్తి, పరిశుభ్రత, ఆరోగ్యపరిరక్షణ వంటి అంశాలకోసం కృషిజరిగింది. మద్యాన్నీ, గొడ్డుమాంసాన్నీ మానివేయడం, అంతర్గతంగా ఉన్న అస్పృశ్యతను నిర్మూలించుకోవడం కోసం ప్రయత్నాలు జరిగాయి. అయితే, భారీ ఉద్యమాలు, ప్రదర్శనలు, పికెటింగ్ వంటి విధానాలతో కూడుకున్న సత్యాగ్రహ మార్గంలో ఈ అంతర్గత సంస్కరణల కార్యక్రమం జరగలేదు. హరిజనోద్ధరణ అన్నది వారిలో క్రమంగా చైతన్యం పెంచుకుంటూ పోవడం ద్వారా సాధ్యపడుతుందని ఆయన భావించారు. అప్పుడు 'సవర్ణ హిందువులకు నచ్చినా, నచ్చకపోయినా హరిజనులు తమస్థాయిని తాము పెంచుకోగలుగుతార'ని ఆయన అభిప్రాయపడ్డారు. హరిజనోద్యమం ఒక రాజకీయ ఉద్యమం కాదనీ, హిందూసమాజాన్నీ, మతాన్నీ పరిశుద్ధిచేయడానికి సాగుతున్న ఉద్యమం మాత్రమేనని గాంధీజీ అనేకసార్లు ప్రకటించారు. అయితే, అస్పృశ్యత 'మొత్తం రాజకీయ, సామాజిక నిర్మాణాన్ని ప్రభావితం చేసినట్టుగానే' ఈ ఉద్యమం 'అనేక నూతన రాజకీయపరిణామాలకు దారితీస్తుంద'ని ఆయనకు తెలుసు.

విస్తృతమైన ప్రజా ఉద్యమాలు లేనికాలంలో, హరిజనోద్ధరణ మాత్రమే కాక, దానితోసహా సాగిన ఇతరత్రా అనేక నిర్మాణాత్మకకార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నిండామునిగిపోయారు. ఈ ఉద్యమం జాతీయవాదం హరిజనుల్లోకి కూడా చొచ్చుకుపోయేందుకు వీలుకల్పించింది. దేశంలోని అత్యధికప్రాంతాల్లో వ్యవసాయకూలీలుగా ఉంటున్న వీరు జాతీయోద్యమంలోనూ, రైతు ఉద్యమాల్లోనూ విస్తృతంగా పాల్గొనడానికి ఇది ఉపకరించింది.

* * *

# 24 ఎదుగుతున్న వామపక్షం

**భా**రతదేశంలో 1920లలో, 1930లలో బలపడిన వామపక్షం జాతీయోద్యమాన్ని మరింత క్రియాశీలకంగా మార్చేందుకు దోహదపడింది. రాజకీయ స్వాతంత్ర్య లక్ష్యానికి సామాజిక, ఆర్థికాంశాలు కూడా తోడయ్యాయి. ఒకపక్కన అణగారినవర్గాల వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం జరుగుతున్న పోరాటాలు, మరోపక్కన దేశ స్వాతంత్ర్యంకోసం జరుగుతున్న జాతీయపోరాటం పరస్పరం చేరువయ్యాయి. భారతదేశంలో సామ్యవాద ఆలోచనలు వేళ్ళూనుకోవడం ప్రారంభమైంది. సామ్యవాదం యువత ఆమోదయోగ్యమైన విధానంగా అవతరించింది. నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్‌లు వారి ఆలోచనలకు ప్రతీకలుగా కనిపించేవారు. క్రమేణా దేశంలో రెండు శక్తిమంతమైన వామపక్షపార్టీలు– కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) అవతరించాయి.

* * *

భారతదేశ ఆలోచనారీతిలో వచ్చిన ఈ మార్పుకు ప్రధానకారణం రష్యావిప్లవం. 1917 నవంబరు 7న వి. ఐ. లెనిన్ నాయకత్వంలోని బోల్షెవిక్ (కమ్యూనిస్టు) పార్టీ జారిస్టు పాలనను కూలదోసి తొలి సోషలిస్టు రాజ్యాన్ని ప్రకటించింది. ఆసియాలోని అనేక ప్రాంతాలపైనా, చైనాపైన ఉన్న సామ్రాజ్యవాద హక్కులను వదులుకుంటున్నట్టు తనంతటతానుగా ప్రకటించి వలసపాలిత ప్రాంతాలవారిని ఆశ్చర్యచకితులను చేసింది. ఈ పరిణామం భారతీయ ప్రజల

ఆలోచనారీతిని ఎంతగానో ప్రభావితం చేసింది.అత్యంత శక్తివంతమైన జారిస్టు సామ్రాజ్యాన్ని సామాన్యప్రజలు తమ సంఘటిత శక్తితో కూలదోసి, దోపిడీకి ఆస్కారంలేని సమాజాన్ని ఏర్పాటుచేయగలిగినప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయులు కూడా ఆ పని ఎందుకు చేయలేరు? అన్న ఆలోచన, చేయగలమన్న విశ్వాసం ప్రజల్లో ప్రారంభమైంది. సామ్యవాద సిద్ధాంతాలూ, ముఖ్యంగా బోల్షివిక్‌పార్టీ కరదీపిక అయిన మార్క్సిజం హఠాత్తుగా యావత్ ప్రపంచాన్నీ ఆకర్షించింది. ముఖ్యంగా ఆసియావాసులను తీవ్రంగా ప్రభావితం చేసింది. ప్రముఖ అతివాద నాయకుడు బిపిన్ చంద్రపాల్ 1919లో ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'జర్మనీ యుద్ధప్రియత్వం,జార్ నిరంకుశత్వం నశించిన తరువాత – ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఒక కొత్త శక్తి జనించింది. కోల్పోయిన తమ హక్కులను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి సంసిద్ధమవుతున్న ప్రజాశక్తి అది. ధనికులు, ఉన్నతవర్గాల దోపిడిలేని సమాజంలో స్వేచ్ఛగా, సంతోషంగా జీవించడానికి జరుగుతున్న ప్రయత్నమది'. దేశంలో సామ్యవాద భావనలు బలంగా విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా సహాయనిరాకరణోద్యమంలో ఉధృతంగా పాల్గొన్న యువతరం దాని అంతిమ ఫలితంపైన తీవ్రనిరాశానిస్పృహలతో ఉన్న తరుణమది. గాంధీ ఆలోచనలు–విధానాలపైనా, ప్రత్యామ్నాయంగా పుట్టుకొచ్చిన స్వరాజ్యవాదుల కార్యక్రమంపైనా యువతరం అసంతృప్తితో ఉంది. దేశవ్యాప్తంగా అనేక సోషలిస్టు, కమ్యూనిస్టు గ్రూపులు ఈ సమయంలో అవతరించాయి. బోంబేలో ఎస్. ఎ. డాంగే 'గాంధీ అండ్ లెనిన్' పేరిట ఒక కరపత్రాన్ని ప్రచురించారు. మొదటి సోషలిస్టు వారపత్రిక 'ది సోషలిస్టు'ను ఆయన ప్రారంభించారు. బెంగాల్‌లో ముజఫర్ అహ్మద్ 'నవయుగ్'ను ప్రారంభించారు. కవి నజ్రూల్ ఇస్లామ్ సహాయంతో ఆయన ఆ తరువాత 'లాంగల్'ను వెలువరించారు. పంజాబ్‌లో ఘులామ్ హుస్సేన్ ' ఇంక్విలాబ్'ను ప్రారంభించారు. మద్రాసులో ఎం.సింగారవేలు 'లేబర్ కిసాన్ గెజిట్'ను స్థాపించారు.

దేశవ్యాప్తంగా 1927నుంచి విద్యార్థి, యువజన సంఘాల ఏర్పాటు ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 1928–29 మధ్యకాలంలో వేలసంఖ్యలో యువజన సమావేశాలు జరిగాయి. జవాహర్‌లాల్‌నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్‌లు దేశవ్యాప్తంగా పర్యటనలు చేస్తూ తమ ప్రసంగాల్లో సామ్రాజ్యవాదాన్నీ, పెట్టుబడిదారీ విధానాలనూ, భూస్వామ్యాన్నీ తీవ్రంగా దుయ్యబడుతూ సామ్యవాద ఆదర్శాలను ప్రచారం చేశారు.

చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్ వంటి విప్లవకర తీవ్రవాదులు కూడా సామ్యవాదాన్ని ఆశ్రయించారు. 1920లలో రైతు ఉద్యమాలు, కార్మికసంఘాల ఏర్పాటు విస్తృతంగా జరిగాయి. 1930లలో ప్రపంచం తీవ్ర ఆర్థికసంక్షోభంలో చిక్కుకున్నప్పుడు సామ్యవాద విధానం మరింతగా ఆకర్షించింది. పెట్టుబడిదారీ దేశాల్లో నిరుద్యోగం పతాకస్థాయికి చేరుకుంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థని అప్రదిష్ట పాల్జేసి ప్రజలదృష్టిని మార్క్సిజం, సోషలిజంవైపు మళ్ళించింది. 1936లోనూ 1937లోనూ జవాహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికకావడం, ఆ తరువాత రెండేళ్ళూ సుభాష్‌చంద్రబోస్ ఆ పదవిని చేపట్టడం కాంగ్రెస్‌లో కూడా బలపడుతున్న వామపక్షధోరణులకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆవిర్భావం కూడా ఇందుకు ఒక సూచిక.

* * *

వీటన్నింటికీ మించి జాతీయపోరాటానికి సామ్యవాద దృక్కోణాన్ని కల్పించిన జవాహర్‌లాల్ నెహ్రూ 1929తరువాత కాలంలో దేశంలో సామ్యవాదానికీ, సామ్యవాద ఆలోచనలకూ ప్రతిరూపంగా అవతరించారు. స్వాతంత్ర్యాన్ని కేవలం రాజకీయాంశంగా మాత్రమే చూడకూడదనీ, సామాజిక, ఆర్థికాంశాల్లో కూడా దానిని అన్వయించాలన్న ఆలోచనకు ఆయన ప్రతీక అయ్యారు.

1929 నాటి చారిత్రాత్మక లాహోర్ కాంగ్రెస్‌లో నెహ్రూ తన 40 ఏళ్ల వయసులో అధ్యక్షుడయ్యారు. 1936లోనూ, 1937లోనూ తిరిగి ఆయన ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షుడుగానూ, జాతీయోద్యమంలో గాంధీజీ తరువాత అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడిగానూ ఆయన తన దేశవ్యాప్త పర్యటనలో వేలాదిమైళ్ళు తిరిగి లక్షలాదిమంది భారతీయులను తన ప్రసంగాలతో ప్రభావితం చేశారు. ఆయన తన పుస్తకాల్లోనూ, వ్యాసాల్లోనూ సామ్యవాదాన్ని విస్తృతంగా ప్రస్తావించారు. సామాన్యులను ఆర్థికంగా ఉద్ధరించగలిగినప్పుడే రాజకీయ స్వేచ్ఛకు అర్థం పరమార్థం ఉంటుందని స్పష్టంచేశారు. సామ్యవాద సమాజం ఆవిర్భవించినప్పుడు మాత్రమే ఇది సాధ్యపడుతుంది కనుక నెహ్రూ ఒక తరం యువ జాతీయవాదుల్లో సామ్యవాద దృక్పథాన్ని పాదుకొలపడానికి తోడ్పడ్డారు.

1920-21 మధ్యకాలంలో తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని రైతు ఉద్యమాల్లో పాలుపంచుకున్న నాటినుంచి నెహ్రూకు అణగారిన వర్గాల ఆర్థిక సమస్యలపై దృష్టి అధికమైంది. 1922-23లో ఆయన జైలులో ఉన్నప్పుడు రష్యన్‌చరిత్రనూ, విప్లవాన్నీ

విస్తృతంగా అధ్యయనం చేశారు. 1927లో ఆయన బ్రెసిల్స్‌లో సామ్రాజ్యవాదంపైన జరిగిన సదస్సుకు హాజరయ్యారు. అక్కడ ఆయనకు ప్రపంచవ్యాప్తంగా వలసపాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న అనేకమంది యోధులతోనూ, కమ్యూనిస్టులతోనూ పరిచయం ఏర్పడింది. అప్పటికే మార్క్సిజం ఆయనను ప్రభావితం చేసింది. అదే ఏడాది ఆయన సోవియట్ యూనియన్‌లో పర్యటించి అక్కడి సోషలిస్టు సమాజాన్ని చూసి అబ్బురపడ్డారు. అక్కడనుంచి తిరిగిరాగానే సోవియట్ యూనియన్‌పై ఒక పుస్తకాన్ని ప్రచురించారు.

1929నాటి లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో జవాహర్‌లాల్ నెహ్రూ తన ప్రసంగంలో ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'నేను సామ్యవాదిని. గతకాలం నాటి రాజులూ,రాణుల వ్యవస్థమీద కానీ, అదేబాటలో ఇప్పుడు పుట్టుకొస్తున్న పారిశ్రామిక చక్రవర్తుల విధానంలో కానీ నాకు విశ్వాసం లేదు. నాటి చక్రవర్తులకంటే నేటి ఈ ఆధునిక చక్రవర్తులు సామాన్యుడి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నారు. వీరి దోపిడీ విధానాలు ఫ్యూడల్ విధానాలకు ఏమాత్రం తీసిపోవు'. అసమానతలనూ, దారిద్ర్యాన్నీ తొలగించుకోవాలంటే భారతదేశం పూర్తిస్థాయిలో సామ్యవాద కార్యక్రమాన్ని అమలుచేయకతప్పదని ఆయన స్పష్టంచేశారు.

సామ్యవాదంలో నెహ్రూకు ఉన్న అపరిమితమైన విశ్వాసాన్ని 1933-36 మధ్యకాలంలో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు తెలియచెబుతాయి. 1933 అక్టోబర్‌లో ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా సామ్యవాద విధానం 'మానవుడి సమున్నత లక్ష్యాలైన ఆర్థిక సామాజిక సమానత్వాన్ని సాధించడానికీ, ఒకదేశం మరొకదేశాన్నీ, ఒక వర్గం మరో వర్గాన్ని చేస్తున్న దోపిడీ అంతం కావడానికీ' వీలుకల్పిస్తుందని వ్యాఖ్యానించారు. 1936 లక్నో కాంగ్రెస్‌లో సామ్యవాదంపట్ల తనకున్న విశ్వాసాన్ని ఆయన పునరుద్ఘాటించారు. 'యావత్ ప్రపంచమూ, భారతదేశమూ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేది సామ్యవాదం ఒక్కటే. నేనీమాటలు ఆదర్శంకోసమో, మానవతాదృక్పథంతోనో చెప్పడం లేదు. సశాస్త్రీయంగా, ఆర్థికపరమైన స్పృహతో అంటున్నాను. భయంకరమైన దారిద్ర్యాన్నీ, ఆకాశాన్నంటిన నిరుద్యోగాన్నీ అంతం చేయాలంటే సామ్యవాదాన్ని మించిన మార్గం మరొకటి లేదు. అది మన రాజకీయ, సామాజిక వ్యవస్థల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుంది. ప్రైవేటు ఆస్తికి స్వస్తిచెప్పడం, సహకార విధానాలను అమలు చేయడం వంటి మార్గాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి'.

ఈ కాలంలో గాంధీజీపట్ల నెహ్రూ వైఖరి విభిన్నరకాలుగా ఉండేది. వర్గవైరుధ్యాలకు సంబంధించిన కీలకమైన అంశాన్ని గుర్తించడానికి నిరాకరించినందుకు ఆయన గాంధీని తీవ్రంగా విమర్శించేవారు. దోపిడీదారుడికీ, బాధితుడికీ మధ్య శాంతిని ప్రబోధిస్తున్నందుకూ, ధర్మకర్తృత్వసిద్ధాంతాన్ని ప్రతిపాదించినందుకూ గాంధీని నెహ్రూ సుతిమెత్తగా విమర్శించేవారు. తన ఆత్మకథలో ఆయన గాంధీ ఆదర్శాల్లోని మౌలికమైన కొన్ని అంశాలను విమర్శించడానికి ఏకంగా ఒక చాప్టర్‌ను కేటాయించారు. అయితే, మరోపక్క భారతసమాజానికి చైతన్యం ప్రసాదించడంలో గాంధీ నిర్వహించిన, నిర్వహిస్తున్న పాత్రను ప్రశంసించడంలో నెహ్రూ ఏమాత్రం వెనక్కుతగ్గలేదు. వామపక్ష విమర్శకుల బారినుంచి గాంధీని వెనకేసుకొస్తూ 1936 జనవరిలో రాసిన ఒక వ్యాసంలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'భారతదేశంలో గాంధీజీ నిర్వహిస్తున్న పాత్ర అత్యంత అద్భుతమైనది, క్రియాశీలకమైనది. దేశ పరిస్థితుల పట్ల ఆయనకు విస్తృతమైన అవగాహన ఉంది. అటువంటి పరిస్థితుల మధ్య కూడా లక్ష్యాన్ని సాధించడానికి ఎటువంటి మార్గాన్ని అనుసరించాలో అవగాహన ఉంది. ఎంతో ఆధునికమైన ఆలోచనలున్న గ్రూపులు గాలిలోనే ఫీట్లు చేస్తుంటే గాంధీజీ నేలమీదే ఉండి ప్రజల మనసుల్ని చూరగొన్నారు'. అంతేకాదు, గాంధీజీ చర్యలు, బోధనలూ 'ప్రజలను చైతన్యవంతం చేశాయి. విభిన్నమైన సామాజిక అంశాలపట్ల వారిలో అవగాహన కలిగింది. జాతీయోద్యమాన్ని సామాన్యుడిపరం చేయడంలో ఆయన నిర్వహించిన పాత్ర అద్భుతమైనది'.

అయితే, భారతదేశం విదేశీపాలనలో ఉన్నస్థితిలో ఒక రాజకీయాంశానికీ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికీ ఉన్న తేడానూ, ప్రాథమ్యాన్ని నెహ్రూ విస్మరించలేదు. ఈ దశలో సామ్యవాదానికి సంబంధించి ఉన్న పరిమితిని ఆయన అర్థం చేసుకున్నారు. 1936లో ఆయన సామ్యవాదులను ఉద్దేశించి ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయవాదం-రాజకీయ స్వేచ్ఛ అనే దృక్పథాన్నీ, సామ్యవాదం ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక స్వాతంత్ర్యమనే దృక్పథాన్నీ యధాతథంగా కొనసాగిస్తూనే వీటిని విస్తృతస్థాయిలో మిళితం చేయడమే భారతీయ సోషలిస్టు ముందున్న సమస్య' అని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ కారణంగానే ఆయన- ఒక స్వతంత్ర సంస్థ ఏర్పాటుకు గానీ, గాంధీజీతో లేదా కాంగ్రెస్‌తో లేదా కాంగ్రెస్‌లోని అతివాదవర్గంతో సంబంధం లేని సంస్థ ఏర్పాటుకు

గానీ సానుకూలంగా లేరు. కాంగ్రెస్‌ను సోషలిస్టు ఆలోచనతో ప్రభావితం చేసి దానిని సంపూర్ణంగా ఆ దిశగా మార్చడమే ఆయన లక్ష్యం. సంస్థలోనే పనిచేస్తూ సంస్థ కార్యకలాపాల్లో కార్మికుల, రైతుల భాగస్వామ్యాన్ని విస్తృతం చేయడం ద్వారా మాత్రమే ఆ లక్ష్యం నెరవేరుతుంది.

* * *

సోవియట్ యూనియన్‌కూ, విప్లవానికీ ఆకర్షితులైన అనేక మంది దేశీయ విప్లవవాదులూ, విదేశాల్లో ఉంటున్నవారూ ఈ కాలంలో తమ తమ మార్గాల్లో నడక ప్రారంభించారు. వీరందరిలోకీ ప్రముఖంగా, ప్రథమంగా చెప్పుకోవలసిన ఎం. ఎన్.రాయ్ లెనిన్‌తో కలిసి వలసప్రాంతాలపై కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ విధానాన్ని ఆవిష్కరించడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారు. రాయ్ నాయకత్వంలో అటువంటి మరో ఏడుగురు 1920 అక్టోబర్‌లో తాష్కెంట్‌లో సమావేశమై కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు. ఈ ప్రయత్నంతో సంబంధం లేకుండానే 1920 తరువాత దేశంలో అనేక వామపక్ష, కమ్యూనిస్టు గ్రూపులు ఆవిర్భవించిన విషయం మనకు తెలుసు. ఈ గ్రూపుల్లో అత్యధికశాతం 1925 డిసెంబరులో కాన్పూర్‌లో సమావేశమై అఖిలభారత స్థాయిలో 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ)'ను ప్రారంభించాయి. కొద్దికాలం తరువాత ఎస్.వి.ఘటే ఈ సంస్థకు ప్రధాన కార్యదర్శి అయ్యారు. తన సభ్యులందరూ కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరి ఆ సంస్థ అన్ని విభాగాల్లో బలమైన వామపక్షాన్ని ఏర్పాటు చేయాలనీ, రాడికల్ భావనలున్న ఇతర జాతీయవాదులకు సహకరించాలనీ, కాంగ్రెస్‌ను మరింత క్రియాశీలకంగా మార్చాలనీ సిపిఐ కోరింది.

* * *

తొలి కమ్యూనిస్టుల రాజకీయ కార్యక్రమం ప్రధానంగా కార్మిక కర్షక పార్టీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా కృషిచేయడం జరిగింది. అటువంటి వాటిలో ప్రథమంగా 1925 నవంబరులో ముజఫర్ అహ్మద్, ఖాజీ నజ్రుల్ ఇస్లామ్, హేమంత్‌కుమార్ సర్కార్ వంటివారితో బెంగాల్‌లో భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందిన 'లేబర్–స్వరాజ్ పార్టీ' ఏర్పడింది. 1926లో బోంబేలో కాంగ్రెస్ లేబర్ పార్టీ, పంజాబ్‌లో కీర్తి–కిసాన్ పార్టీ ఆవిర్భవించాయి. మద్రాస్‌లో 1923నుంచే లేబర్ కిసాన్‌పార్టీ ఆఫ్ హిందుస్థాన్ పనిచేస్తోంది. 1928నాటికి ఈ ప్రాంతీయ సంఘాలన్నీ ఒక జాతీయపార్టీగా 'వర్కర్స్

అండ్ పీసెంట్స్ పార్టీ' (డబ్ల్యుపిపి) ఏర్పడింది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలలో దీని శాఖలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్టులందరూ ఈ పార్టీ సభ్యులు. ఈ పార్టీ ప్రధాన లక్ష్యం కాంగ్రెస్‌తో కలిసిపనిచేస్తూ దానికి మరింత రాడికల్ దృక్పథాన్ని అలవరచి, దానిని 'ప్రజలపార్టీ'గా తీర్చిదిద్దడం, కార్మికులూ రైతులతో సంఘాలను ఏర్పాటు చేస్తూ వారి భాగస్వామ్యాన్ని పెంచి ప్రథమ లక్ష్యమైన సంపూర్ణ స్వాతంత్ర్యాన్నీ, ఆ తరువాత సామ్యవాదాన్నీ సాధించడం. ఈ పార్టీ స్వల్పకాలంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందడంతో కాంగ్రెస్‌లో కమ్యూనిస్టుల ప్రాబల్యం కూడా పెరుగుతూవచ్చింది. ముఖ్యంగా బోంబేలో ఈ మార్పు ప్రముఖంగా కనిపించింది. జవాహర్‌లాల్‌నెహ్రూ, ఇతర రాడికల్ భావనలున్న కాంగ్రెస్‌వాదులు ఈ మార్పును ఆహ్వానించారు. జవాహర్‌లాల్, సుభాష్‌చంద్రబోస్‌లతో పాటు, యూత్‌లీగ్‌లూ, వామపక్ష శక్తులూ, వివిధ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న డబ్ల్యుపిపి శాఖలూ కాంగ్రెస్‌లో బలమైన వామపక్ష ఆవిర్భావంలో ప్రధానపాత్ర పోషించి జాతీయోద్యమాన్ని ఆ దిశగా ప్రభావితం చేశాయి. 1927-29 మధ్యకాలంలో కార్మికపోరాటాల్లో డబ్ల్యుపిపి విశేషమైన పాత్రపోషించింది. కార్మికవర్గంలో కమ్యూనిస్టుల పట్టు పెరగడానికి కూడా ఇది దోహదపడింది.

అయితే, కమ్యూనిస్టుల ఎదుగుదలనూ, జాతీయోద్యమంపై డబ్ల్యుపిపిల ప్రభావాన్నీ 1929లోనూ, ఆ తరువాతా సంభవించిన రెండు పరిణామాలు అడ్డుకున్నాయి. కమ్యూనిస్టులపై ప్రభుత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడటం వీటిలో ప్రధానమైనది. వాస్తవానికి 1922-24లోనే ఇది పెద్దస్థాయిలో సాగింది. సోవియట్‌యూనియన్‌నుంచి భారతదేశంలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న కమ్యూనిస్టులను అనేక కుట్రకేసుల్లో ఇరికించి వారిని దీర్ఘకాలం ప్రభుత్వం జైళ్ళలో ఉంచింది. 1924లో ఎస్. ఎ.డాంగే, ముజఫర్ అహ్మద్, నళినీ గుప్తా, షౌకత్ ఉస్మానీ వంటివారిని కాన్పూర్ బోల్షెవిక్ కుట్రకేసులో విచారించి నాలుగేళ్ల జైలుశిక్ష విధించడం ద్వారా అప్పుడప్పుడే దేశంలో మొగ్గతొడుగుతున్న కమ్యూనిస్టు ఉద్యమాన్ని చిదిమివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది.

దేశంలోనూ, ముఖ్యంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లోనూ కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగిపోతుండటం పట్ల 1929నాటికి ప్రభుత్వంలో ఆందోళన అధికమైంది. తీవ్రస్థాయిలో విరుచుకుపడటానికి నిర్ణయించుకున్న ప్రభుత్వం 1929 మార్చిలో ఒక్కసారిగా దాడిచేసింది. రాజకీయరంగంలోనూ, ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాల్లోనూ

ఉన్న 32మంది రాడికల్ నాయకులను అరెస్టుచేసింది. అరెస్టయినవారిలో ఫిలిప్ స్ప్రాట్, బెన్ బ్రాడ్లీ, లెస్టర్ హచిన్‌సన్ అనే ముగ్గురు బ్రిటిష్ కమ్యూనిస్టులు కూడా ఉన్నారు. వీరు భారతదేశంలో ట్రేడ్‌యూనియన్ ఉద్యమాన్ని నిర్మించడంలో సహాయపడేందుకు వచ్చారు. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం దేశంలో ట్రేడ్‌యూనియన్ ఉద్యమాన్ని కూకటివేళ్ళతో సహా పెకిలించి, జాతీయోద్యమం నుంచి కమ్యూనిస్టులను పూర్తిగా వేరుచేయడం. మీరట్‌లో ఈ 32మంది నాయకులపైనా విచారణ ప్రారంభమైంది. అయితే, అనతికాలంలోనే మీరట్ కుట్రకేసు ఒక సంతోషించదగిన పరిణామంగా అవతరించింది. జవాహర్‌లాల్‌నెహ్రూ, ఎం. ఎ. అన్సారీ, ఎం.సి.చాగ్లా వంటివారు నిందితుల తరఫున వకాల్తా పుచ్చుకున్నారు. గాంధీజీ జైల్లో ఉన్న ఖైదీలను కలుసుకుని వారికి సంఘీభావం తెలియచేశారు. భవిష్యత్ ఉద్యమాల్లో వారి సహకారాన్ని అర్థించారు. ఖైదీలు న్యాయస్థానంలో చేసిన ఉద్వేగపూరితమైన ప్రసంగాలను జాతీయపత్రికలు యధాతథంగా ప్రచురించి లక్షలాదిమంది ప్రజలకు తొలిసారిగా కమ్యూనిస్టు ఆలోచనలను పరిచయం చేశాయి. జాతీయోద్యమ స్రవంతినుంచి కమ్యూనిస్టులను వేరుచేయాలన్న ప్రభుత్వ ఆలోచన భగ్నం కావడంతో పాటు భిన్నమైన ఫలితాన్ని ఇచ్చింది. అయితే, ప్రభుత్వ విరుగుబాటు అప్పుడే మొలకలెత్తుతున్న కార్మికోద్యమానికి నాయకత్వం లేకుండా చేయడంలో మాత్రం విజయం సాధించింది. ఈ దశలో ఒక కొత్తనాయకత్వాన్ని సంపాదించుకోవడం ఎంతో కష్టమైన పని. ఇక, ప్రభుత్వం కొట్టిన దెబ్బ చాలదన్నట్టుగా కమ్యూనిస్టులు ఒక్కసారిగా తమ వైఖరి మార్చుకుని తమను తాము మరింత బలంగా దెబ్బతీసుకున్నారు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 6వ కాంగ్రెస్ తీర్మానాలకు అనుగుణంగా కమ్యూనిస్టులు జాతీయ కాంగ్రెస్‌ను బూర్జువా పార్టీగా ప్రకటిస్తూ దానితో సంబంధాలు తెంపుకున్నారు. కాంగ్రెస్, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 'బూర్జువా నాయకుల'ను సామ్రాజ్యవాద మద్దతుదారులుగా కమ్యూనిస్టులు ప్రకటించారు. 'పూర్ణస్వరాజ్' నినాదంతో కాంగ్రెస్ చేస్తున్నదంతా బూటకపు ప్రయత్నమేననీ, బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో రాజీపడిన బూర్జువానాయకులు ప్రజల్లో పట్టుసాధించడానికి మాత్రమే ఇది జరుగుతోందని వారు ప్రకటించారు. నెహ్రూ, బోస్ వంటి కాంగ్రెస్ వామపక్ష నాయకులను 'జాతీయోద్యమంలో ఉన్న బూర్జువా ఏజెంట్లు'గా అభివర్ణిస్తూ, ప్రజలను మభ్యపెట్టి వారిని బూర్జువా గుప్పిట్లో ఉంచడానికి వీరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'అహింసాయుత పోరాటం' అసలు రంగు ఏమిటో

బైటపెట్టి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆయుధపోరాట నినాదాన్ని మరింత ప్రభావవంతంగా ప్రచారం చేయడమే తమ లక్ష్యమని ప్రకటించారు. 1931లో గాంధీ-ఇర్విన్ ఒప్పందాన్ని జాతీయోద్యమానికి కాంగ్రెస్ చేసిన నమ్మకద్రోహానికి నిదర్శనంగా వారు అభివర్ణించారు.

చివరకు డబ్ల్యుపిపి కూడా రద్దయింది. దీనికి బదులుగా 'కేంద్రీకృతమైన, స్వతంత్ర' కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుపై పూర్తిస్థాయిలో దృష్టికేంద్రీకరించాలని కమ్యూనిస్టులు నిర్ణయించుకున్నారు. కమ్యూనిస్టుల రాజకీయధోరణిలో హఠాత్తుగా వచ్చిన ఈ మార్పు వారు జాతీయోద్యమానికి దూరం కావడానికి కారణమైంది. జాతీయోద్యమం అట్టడుగుస్థాయినుంచీ బలపడుతున్న తరుణంలో, దానిపై వామపక్ష ప్రభావం విస్తృతమయ్యే అవకాశాలున్న దశలో కమ్యూనిస్టులు దానికి దూరమైనారు. అంతేకాదు, కమ్యూనిస్టులు అనేక చిన్న చిన్న గ్రూపులుగా విడిపోవడం కూడా జరిందే. ప్రభుత్వం ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకుంది. 1934లో సిపిఐను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించింది.

అయితే, కమ్యూనిస్టు ఉద్యమం కొన్ని కారణాలవల్ల ఉత్పాతం నుంచి బైటపడగలిగింది. చాలా మంది కమ్యూనిస్టులు శాసనోల్లంఘనోద్యమానికి దూరంగా ఉండడానికి నిరాకరించి, అందులో ఉత్సాహంగా పాలుపంచుకోవడం ఈ కారణాల్లో ఒకటి. మరోవైపు సోషలిస్టు కమ్యూనిస్టు ఆలోచనలు దేశంలో విస్తరిస్తూ బలపడుతూనే ఉన్నాయి. ఈ కారణంగా శాసనోల్లంఘనోద్యమంలోనూ, విప్లవ ఉగ్రవాద సంస్థల్లోనూ భాగస్వాములుగా ఉన్న చాలామంది యువకులు సోషలిజం, మార్క్సిజం, సోవియట్ యూనియన్ వైపు ఆకర్షితులై 1934 తరువాత సిపిఐలో చేరారు.

1935లో కమ్యూనిస్టుపార్టీలో జరిగిన సమూలమైన మార్పుల కారణంగా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పి.సి.జోషీ దానికి నాయకుడు. 1935 ఆగస్టులో మాస్కోలో జరిగిన ఏడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ముంచుకొస్తున్న ఫాసిస్టుముప్పును గుర్తించి తన పూర్వ విధానాన్ని సవరించుకుంటూ, పెట్టుబడిదారీ దేశాల్లో సోషలిస్టులతోనూ, ఇతర ఫాసిస్టు వ్యతిరేక శక్తులతోనూ, వలసదేశాల్లో బూర్జువా నాయకత్వంలోని జాతీయోద్యమాలతోనూ కలసి పనిచేయాలని పిలుపునిచ్చింది. దీంతో భారతీయ కమ్యూనిస్టులు మళ్ళీ ప్రధానస్రవంతికి చేరువై జాతీయకాంగ్రెస్ నాయకత్వంలోని

జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. 1936 తొలినాళ్ళలో కమ్యూనిస్టు రాజకీయాలకూ, సైద్ధాంతిక విధానానికీ మూలాధారం దత్-బ్రాడ్లీ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం జాతీయ కాంగ్రెస్ 'సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్ లక్ష్యాలను సాధించడంలో అత్యున్నతమైన, ప్రధానమైన పాత్ర పోషించగలదు.'

ప్రజలను చైతన్యవంతం చేసి కాంగ్రెస్‌లో సభ్యులుగా చేర్చేందుకు కృషిచేయమంటూ కమ్యూనిస్టుపార్టీ తన సభ్యులకు పిలుపునివ్వడం ప్రారంభించింది. 1938లో ఆ పార్టీ మరో అడుగుముందుకు వేసి 'సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారతీయులకు ప్రాతినిధ్యం వహిస్తున్న విస్తృత ప్రజాదరణగల పార్టీ'గా కాంగ్రెస్‌ను అభివర్ణించింది. 1939లో పి.సి.జోషీ 'నేషనల్ హెరాల్డ్'లో 'ఇప్పుడు జరుగుతున్న అతిపెద్ద వర్గపోరాటం జాతీయోద్యమమే'నంటూ దానిలో ప్రధాన భూమిక కాంగ్రెస్‌దేనని వ్యాఖ్యానించారు. మరోపక్కన జాతీయోద్యమాన్ని శ్రామికవర్గం (కమ్యూనిస్టుపార్టీ) ఆధిపత్యంలోకి తీసుకువచ్చే ప్రయత్నాన్ని కమ్యూనిస్టులు కొనసాగిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌లో అంతర్భాగంగా తీవ్రమైన కృషిచేస్తూ కాంగ్రెస్ జిల్లా, ప్రావిన్షియల్ కమిటీల్లో కమ్యూనిస్టులు అనేక కీలకమైన స్థానాలను కూడా దక్కించుకున్నారు. 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ'లో దాదాపు 20మంది కమ్యూనిస్టులు సభ్యులైనారు. 1936-42 మధ్యకాలంలో కమ్యూనిస్టులు కేరళ, ఆంధ్ర, బెంగాల్, పంజాబ్‌లలో అత్యంత శక్తివంతమైన రైతు ఉద్యమాలను నిర్మించారు. అన్నింటికంటే ముఖ్యంగా, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడుతున్న అత్యంత సమరశీలశక్తులన్న పేరు ప్రఖ్యాతులను వారు తిరిగిసంపాదించుకోగలిగారు.

* * *

సామ్యవాద సిద్ధాంతానికి ఆకర్షితులై, గాంధీ ఆలోచనావిధానంపట్లా, ఆయన నాయకత్వం పట్లా విముఖత చెందిన కొందరు యువ కాంగ్రెస్‌వాదులు 1930-31, 1932-34లలో జైళ్ళలో ఉండగా సోషలిస్టు పార్టీ ఏర్పాటుకు పునాదులు వేశారు. వీరంతా కూడా 1920లలో యువజనోద్యమాల్లో ఎంతో చురుకుగా పనిచేసినవారు. జైళ్ళలో వారు మార్క్సిస్టు, సోషలిస్టు సిద్ధాంతాలను విస్తృతంగా అధ్యయనం చేశారు. మార్క్సిజానికీ, కమ్యూనిజానికీ, సోవియట్ యూనియన్‌కూ ఆకర్షితులైన వీరు సిపిఐ

అనుసరిస్తున్న రాజకీయ విధానాన్ని ఆమోదించలేకపోయారు. చాలామంది ప్రత్యామ్నాయం కోసం వెతుకులాటప్రారంభించారు. చివరకు వీరంతా సంఘటితమై 1934 అక్టోబర్‌లో జయప్రకాష్ నారాయణ్, నరేంద్రదేవ్, మినూ మసానీ నాయకత్వంలో బోంబేలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సి ఎస్ పి)ని ఏర్పాటుచేశారు. ప్రారంభంలోనే కాంగ్రెస్ సోషలిస్టులు నాలుగు ప్రధానమైన అంశాలపై ఒక అంగీకారానికి వచ్చారు. భారతదేశంలో ప్రాథమికమైన పోరాటం స్వాతంత్ర్యపోరాటమే. సామ్యవాదాన్ని సాధించే పథంలో జాతీయవాదం ఒక ప్రధానమైన, ఆవశ్యకమైన దశ. అందువల్ల సోషలిస్టులు జాతీయ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్‌తో కలిసి పనిచేయవలసి ఉంది. 1934లో ఆచార్య నరేంద్రదేవ్ ఈ అంశంపై ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'జాతీయోద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్‌తో సంబంధాలు తెంపుకోవడం ఆత్మహత్యాసదృశమైన విధానమే అవుతుంది. అందువల్ల, ఇప్పుడు జరగాల్సింది జాతీయోద్యమానికి సామ్యవాద దృక్కోణాన్ని కల్పించడం. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే కార్మికులు, రైతులు సంఘటితం కావాలి, తమ ఆర్థిక డిమాండ్లకు అనుగుణంగా ఉద్యమాలు చేయాలి, వారిని జాతీయోద్యమానికి భూమికగా మార్చాలి.'

కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ప్రారంభంనుంచీ కాంగ్రెస్ స్వభావాన్ని మార్చడానికీ, దానిని బలోపేతం చేయడానికీ కట్టుబడి పనిచేసింది. కాంగ్రెస్‌ను మార్చడమన్నది రెండు విధాలుగా ఉంటుంది. దాని సైద్ధాంతిక విధానంలో మార్పు సాధించడం అందులో ఒకటి. కాంగ్రెస్‌వాదుల్లో సోషలిస్టు భావనలను పాదుకొలిపి స్వతంత్రభారతాన్ని వారు సామ్యవాద దృక్కోణంలో చూసేవిధంగా మార్చడమూ, ప్రస్తుత ఆర్థిక సమస్యలపై వారు కార్మిక, రైతు అనుకూల ధోరణితో మరింత క్రియాశీలకంగా వ్యవహరించేట్టు చేయడమూ జరగాలి. అయితే, ఈ విధమైన సైద్ధాంతిక మార్పు అప్పటికప్పుడు సాధ్యపడేది కాదు. అది ఒక సుదీర్ఘమైన ప్రక్రియ. 1934లో జయప్రకాష్ నారాయణ్ తన అనుచరులకు ఈ విషయాన్ని ఇలా స్పష్టంచేశారు. 'మనం కాంగ్రెస్ ముందు ఒక కార్యక్రమాన్ని ఉంచి దానిని అనుసరించాల్సిందిగా కోరుతున్నాం. ఒకవేళ కాంగ్రెస్ దానిని ఆమోదించని పక్షంలో కూడా మనం కాంగ్రెస్‌ను విడిచిపోతున్నామని చెప్పబోవడం లేదు. ఎందుకంటే, ఈ రోజు మనం విఫలమైనా, రేపు మళ్ళీ ప్రయత్నిస్తాం. రేపు కూడా విజయవంతం కాలేకపోయినా మరోమారు ప్రయత్నిస్తాం'.

ఇక, మరోవిధమైన మార్పు సంస్థాగతమైనది. అంటే, దాని ఉన్నతస్థాయి నాయకత్వంనుంచీ జరగాల్సిన మార్పు. జాతీయోద్యమాన్ని విస్తృతమైన ప్రజా ఉద్యమంగా మార్చి దానిని అత్యున్నతస్థాయికి తీసుకుపోగలిగే సమర్థత లోపించినదిగా చెబుతున్న ప్రస్తుత నాయకత్వం స్థానంలో ఒక సమర్థ నాయకత్వాన్ని నెలకొల్పవలసి ఉంటుంది. అయితే, ఈ ఆలోచన ప్రారంభదశలోనే కొన్ని సమస్యలు ఎదుర్కొంది. ఇక, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఒక ప్రత్యామ్నాయ నాయకత్వ కేంద్రంగా రూపొందవలసిన అవసరం ఏర్పడింది. 1935 నాటి సిఎస్‌పి మీరట్ తీర్మానం ఈ లక్ష్యాన్ని ఇలా ఉద్ఘాటించింది. 'కాంగ్రెస్‌లోని సామ్రాజ్యవాద వ్యతిరేకులను దాని ప్రస్తుత బూర్జువా నాయకత్వంనుంచి వేరు చేసి వారిని సామ్యవాద నాయకత్వం కిందకు తీసుకురావాల్సి ఉంది'.

కానీ, ఈ రకమైన ఆలోచన కూడా అవాస్తవికమైనదిగా అర్థంకావడంతో, ఉమ్మడి నాయకత్వం ఉండాలన్న ప్రతిపాదనకు అనుగుణంగా దీనిని వదులుకోవడం జరిగింది. ఈ ప్రతిపాదనలో భాగంగా అన్ని స్థానాల్లోనూ సోషలిస్టులకు చోటు లభించింది. కాంగ్రెస్‌కూ, జాతీయోద్యమానికి ప్రత్యామ్నాయ వామపక్ష నాయకత్వమన్న భావన 1939లోనూ, 1940లోనూ వాస్తవరూపాన్ని సంతరించుకునే అవకాశాలు ఏర్పడ్డాయి. అయితే, కాంగ్రెస్‌ను కుడి- ఎడమల ఆధారంగా చీల్చేవిషయంలోనూ, దానికి వామపక్ష నాయకత్వాన్ని కల్పించే విషయంలోనూ సి ఎస్‌పి (సి పి ఐ కూడా) వెనక్కుతగ్గింది. ఈ ప్రయత్నం జాతీయోద్యమాన్ని బలహీనపరచడమే కాక, ప్రధానస్రవంతికి వామపక్షాన్ని దూరం చేయడం కూడా అవుతుందని భయపడింది. దీనికి కారణం జాతీయోద్యమానికి గాంధీజీ నాయకత్వం వినా ప్రత్యామ్నాయం లేదు. ఆయన నాయకత్వంలో మాత్రమే భారతీయులను సంఘటితం చేసి ఉద్యమాన్ని నిర్మించడం సాధ్యం. అయితే, ఈ వాస్తవాన్ని నెహ్రూ అర్థం చేసుకున్నట్టుగా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నాయకులూ, వామపక్ష గ్రూపులూ, పార్టీలూ పూర్తిగా స్వీకరించలేకపోవడంతో వారు పదేపదే 'ప్రత్యామ్నాయ నాయకత్వ' భావన వైపు మొగ్గుచూపుతూనే ఉన్నారు.

అయితే, సిఎస్‌పి దేశంలోని వాస్తవిక పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకుంది. అందుకే అది కాంగ్రెస్ నాయకత్వానికి సంబంధించిన వ్యవహారాన్ని ఎన్నడూ తెగేదాకా లాగలేదు. సమస్య ఉత్పన్నమైనప్పుడు అది తన సిద్ధాంతాన్ని పక్కనబెట్టి వాస్తవిక

పరిస్థితులకు అనుగుణంగానే వ్యవహరించింది. ఈ ధోరణి కారణంగా అది ఇతర వామపక్ష గ్రూపులూ, పార్టీల ఖండనమండనలకు గురికావలసివచ్చింది. ఉదాహరణకు 1939లో, గాంధీజీతోనూ, కాంగ్రెస్‌లోని మితవాదనాయకులతోనూ సుభాష్‌చంద్రబోస్ విభేదించినప్పుడు ఆయనకు మద్దతు తెలపడానికి నిరాకరించినందుకు సి ఎస్‌పి విమర్శలకు గురైంది. ఇటువంటి అనేక సందర్భాల్లో సోషలిస్టులు తమ వైఖరినీ, భారతదేశ వాస్తవిక పరిస్థితినీ స్పష్టంచేస్తూనే వచ్చారు. 1939లో త్రిపురి సమావేశం అనంతరం జయప్రకాష్ నారాయణ్ చేసిన వ్యాఖ్యను మరొక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 'కాంగ్రెస్‌లో ముఠాలు కట్టడం సోషలిస్టుల ఉద్దేశం కాదు. కాంగ్రెస్‌లో పాతనాయకత్వాన్ని పక్కకుదోసి మరోనాయకత్వాన్ని ప్రతిష్ఠించడం కూడా మా లక్ష్యం కాదు. కాంగ్రెస్ విధానాలూ, కార్యక్రమాలమీద మాత్రమే మా దృష్టి. కాంగ్రెస్ నిర్ణయాలను ప్రభావితం చేయడం మాత్రమే మా లక్ష్యం. పాత నాయకులతో మాకు విభేదాలు వచ్చినప్పుడు వారితో ఘర్షణపడటానికి కాక, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉమ్మడిపోరాటంలో భుజం భుజం కలిపి నడవడానికే మేం అత్యంత ప్రాధాన్యతనిస్తాం' అని సామ్యవాదుల వైఖరిని సౌమ్యంగా వివరించారాయన.

ప్రారంభం నుంచీ సిఎస్‌పి నాయకులు మూడు ప్రధాన సైద్ధాంతిక స్రవంతులుగా విడిపోయి ఉండేవారు. మార్క్స్, ఫాబే, గాంధీ సిద్ధాంతాలు వారిని ప్రభావితం చేస్తూవుండేవి. వాస్తవానికి ఒక విస్తృతమైన ఉద్యమస్వభావాన్ని సంతరించుకున్న సోషలిస్టుపార్టీకి ఇది బలహీనత కానే కాదు. ఇంకా చెప్పాలంటే బలం కూడా. కానీ, సి ఎస్‌పి అప్పటికే ఒక మహోద్యమంలో అంటే జాతీయ కాంగ్రెస్‌లో ఒకభాగం. పైగా, పెద్దసంఖ్యలో కార్యకర్తలున్న ఓ పెద్దపార్టీ. దానికితోడుగా, 1930ల నాటి మార్క్సిజం వామపక్షంలో ఇంతటి వైవిధ్యభరితమైన రాజకీయ స్రవంతులను ఆమోదించే స్థాయిలో లేదు. ఈ కారణంగా సిఎస్‌పి చివరివరకూ సైద్ధాంతిక గందరగోళ స్థితిని ఎదుర్కొంటూనే ఉంది. కానీ, పార్టీలోని సైద్ధాంతిక విభేదాలు దీర్ఘకాలంపాటు బైటకుపొక్కకుండా ఉంచడంలో నాయకులు విజయం సాధించారు. నాయకుల మధ్య ఉన్న వ్యక్తిగత స్నేహ సంబంధాలు, పార్టీ వ్యవస్థాపకుల మధ్య ఉన్న సాన్నిహిత్యం, ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాష్ నారాయణ్‌వంటివారిని సీనియర్ నాయకులుగా ఆమోదించడం, జాతీయవాదానికీ, సామ్యవాదానికీ సంపూర్ణంగా కట్టుబడి ఉండటం వంటి కారణాలవల్ల ఇది సాధ్యమైంది.

* * *

నాయకుల మధ్య సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ కూడా సిఎస్‌పి మొత్తంగా సామ్యవాదానికి మార్క్సిజంతో ఉన్న మౌలికమైన సంబంధాన్ని ఆమోదించింది. అయితే, గాంధీ రాజకీయవిధానాలను మరింత సానుకూలంగా విశ్లేషించడం ఆరంభమైన తరువాత సిఎస్‌పి నాయకత్వపు ఆలోచనారీతులను గాంధీ సిద్ధాంతాలు ప్రభావితం చేయడం ఆరంభమైంది.

1930లలో వామపక్షంలో ఇతర గ్రూపులూ, ఆలోచనాస్రవంతులూ పుట్టుకురావడం ఆరంభమైంది. 1930లో ఎం. ఎన్.రాయ్ భారతదేశం తిరిగివచ్చి ఒక బలమైన 'రాయిస్టు' గ్రూపును తయారుచేశారు. అనేక సంవత్సరాలపాటు ఈ గ్రూపులో రాజకీయ, సైద్ధాంతిక మార్పులు జరిగాయి. కాంగ్రెస్ అధ్యక్షపదవికి తప్పనిసరి పరిస్థితుల్లో రాజీనామా చేసి బైటకొచ్చిన సుభాష్‌చంద్రబోస్ 1939లో తన అనుయాయులతో కలిసి ఫార్వర్డ్ బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. ది హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్, ది రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, అనేక ట్రాట్స్కీ గ్రూపులు 1930లలో దేశంలో పనిచేశాయి. స్వామి సహజానంద సరస్వతి, ప్రొఫెసర్ ఎన్.జి.రంగా, ఇందూలాల్ యాజ్ఞిక్ వంటి వామపక్ష ఆలోచనలున్న కొందరు ప్రముఖులు కూడా ఈ కాలంలో పార్టీలతో సంబంధం లేకుండా పనిచేశారు.

సైద్ధాంతిక, సంస్థాగత విభేదాలు ఉన్నప్పటికీ కూడా దేశంలో సామ్యవాదాన్ని బలోపేతం చేసి దేశరాజకీయాల్లో దానిని ఒక బలమైన శక్తిగా మార్చడంలో సిపిఐ, సిఎస్‌పి, జవాహర్‌లాల్ నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, ఇతర వామపక్ష గ్రూపులూ సంఘటితంగా ఎంతో కృషిచేశాయి. సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యవిధానాన్నీ వ్యతిరేకించడం, కార్మికులనూ, రైతులనూ సంఘటితం చేయడం, ట్రేడ్‌యూనియన్లనూ, కిసాన్‌సభలనూ ఏర్పాటుచేయడం, స్వతంత్రభారతావని సామ్యవాద బాటలో పయనించాలని విశ్వసించడం, సమాజంలోని సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి సామ్యవాద పరిష్కారాలను వెతకడం, ఫాసిస్టువ్యతిరేక, వలసపాలన వ్యతిరేక, యుద్ధవ్యతిరేక విదేశాంగ విధానాలను ఆమోదించడం వంటివి ఈ సమష్టి కృషికి దోహదం చేశాయి.

స్వాతంత్ర్యసమరంలో ఎంతో దూకుడుగా వ్యవహరిస్తూ, తెగువనూ, త్యాగనిరతినీ కనబరచగలిగే వారిలో వామపక్షం ఒకటన్నమాట వాస్తవమే అయినప్పటికీ, జాతీయోద్యమంలో సామ్యవాద ఆలోచనలకూ, పార్టీలకూ పెద్దపీట వేయాలన్న స్వయం

నిర్దేశిత లక్ష్యాన్ని సాధించడంలో మాత్రం అది విఫలమైంది. అంతేకాదు, 1930లనాటి తన ప్రాభవాన్ని పరిరక్షించుకోవడంలో కూడా అది విఫలమైంది. వాస్తవానికి ఈ పరిణామం చరిత్రకారులను ఇప్పటికీ సందిగ్ధంలో పడవేస్తున్నది.

ఈ సంక్లిష్టమైన పరిస్థితికి అనేకానేక కారణాలు దోహదం చేశాయి. వామపక్షం నిరంతరమూ అసంబద్ధమైన అంశాలపైనే కాంగ్రెస్ నాయకత్వంతో పోరాడుతూవచ్చింది. సంక్షోభం ఏర్పడినప్పుడు వెనుకడుగువేయడం కానీ, జాతీయోద్యమానికి దూరమైపోవడం కానీ జరిగింది. కాంగ్రెస్‌లోని మితవాదపక్షం మాదిరిగా కాక వామపక్షం సైద్ధాంతిక, వ్యూహాత్మక అంశాలవిషయంలో పట్టువిడుపులు ప్రదర్శించలేకపోయింది. బలహీనమైన అంశాలను అస్త్రాలుగా ఎంచుకుని మితవాదపక్షంపై దాడికి దిగుతుండేది. ఈ విమర్శల్లో సైద్ధాంతికాంశాలకన్నా పోరాట విధానాలకూ, వ్యూహాలకూ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేది. ఉదాహరణకు, కాంగ్రెస్‌లోని మితవాదపక్షం సామ్రాజ్యవాదులతో రాజీపడిందనీ, బూర్జువాల ఆధిపత్యంలో ఉన్న కాంగ్రెస్ ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద వైఖరి ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమేనంటూ అది చేసిన ఆరోపణ వాస్తవానికి చాలా తీవ్రమైనది. కానీ, దానిని మితవాదపక్షం చాలా సునాయాసంగా తిప్పికొట్టగలిగింది. ప్రజలు కూడా మితవాదపక్షపు వాదననే అంగీకరించారు కానీ, వామపక్ష ఆరోపణను కాదు. ఈ విధమైన ధోరణికి మూడు ఉదాహరణలను ప్రధానంగా చెప్పుకోవచ్చు. 1936-37లో ఎన్నికలు, అధికారపదవులను ఆమోదించే విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని వామపక్షం వ్యతిరేకించింది. ఇది సామ్రాజ్యవాదానికి లొంగిపోవడమేనని విమర్శించింది. 1939-42లలో విస్తృతమైన ప్రజాపోరాటాన్ని ఆరంభించే విషయంలో దాడికి దిగింది. గాంధీజీ ఈ ఆలోచనకు అనుకూలంగా లేకపోవడాన్ని సామ్రాజ్యవాదానికి సానుకూలవైఖరిగా, ఒక మహోన్నత అవకాశాన్ని వదులుకోవడంగా వామపక్షం విమర్శించింది. 1945-47లలో అధికారమార్పిడికి సంబంధించిన అంశంపై జవాహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అజాద్‌వంటి కాంగ్రెస్ అధినాయకులతో వామపక్షం ఘర్షణ పడింది. ఈ వ్యవహారాన్ని బ్రిటిష్ పాలకులు తమ ఆధిపత్యాన్ని మరికొంత కాలం కొనసాగించుకోవడానికి చేస్తున్న ప్రయత్నంగా, అధికార వాంఛతో అల్లాడిపోతున్న కాంగ్రెస్ నాయకులు ప్రదర్శిస్తున్న సర్దుబాటుధోరణిగా విమర్శించింది.

భారతదేశపు వాస్తవిక పరిస్థితులను లోతుగా అర్థం చేసుకోవడంలో వామపక్షం వైఫల్యం చెందింది. జవాహర్‌లాల్‌ను మినహాయించి కాంగ్రెస్ ఉన్నతస్థాయి నాయకత్వాన్ని అది బూర్జువానాయకత్వంగానూ, చర్చలకు ప్రాధాన్యతనివ్వడాన్ని సామ్రాజ్యవాదులతో రాజీపడటంగానూ, రాజ్యాంగబద్ధమైన కార్యక్రమాన్ని 'స్వాతంత్ర్యపోరాటాని'కి స్వస్తిపలకడంగానూ భావిస్తూవచ్చింది. జాతీయోద్యమాన్ని ఒక క్రమపద్ధతిలో నిర్వహించడానికి జరిగే ప్రయత్నాలన్నింటినీ ఉద్యమాన్ని నియంత్రించడానికి జరుగుతున్న ప్రయత్నాలుగానే భావించింది. అహింసాయుత విధానం కంటే సాయుధపోరాట విధానం అత్యున్నతమైనదిగా భావిస్తూ ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యానికి సంబంధించిన స్థితిగతుల్నీ, దానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలనూ, వారిని సంఘటితపరచే అంశాలనూ విస్మరించింది. పోరాటరూపం ఏ విధమైనదైనప్పటికీ ప్రజలు సంసిద్ధంగానే ఉంటారనీ, వారిని రంగంలోకి దించడమన్నది నాయకులచేతుల్లోనే ఉంటుందనీ వామపక్షం భావించింది. ప్రజల్లో తమకున్న బలాన్ని అది ఎక్కువగా అంచనావేసుకుంది. అన్నింటికంటే ముఖ్యంగా, గాంధీ పోరాట విధానాన్ని ఆకళింపు చేసుకోవడంలో అది వైఫల్యం చెందింది.

కొన్ని సందర్భాలనూ, సమయాలనూ మినహాయిస్తే అన్ని వామపక్ష పార్టీలూ, గ్రూపులూ, వ్యక్తులూ సంఘటితంగా వ్యవహరించలేకపోవడం మరో ప్రధాన వైఫల్యంగా చెప్పుకోవచ్చు. వామపక్షవాదులను సంఘటితం చేసి ఒక ఉమ్మడికూటమిని ఏర్పాటుచేయాలన్న ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ దీర్ఘకాలం కలిసి పనిచేయలేక 1939లో బహిరంగంగానే వాదులాడుకున్నారు. నెహ్రూ, సోషలిస్టుల మధ్య రాజకీయ సమన్వయంసాధ్యం కాలేదు. అదేవిధంగా, 1939లో సుభాష్‌చంద్రబోస్, సోషలిస్టులు వేరుపడ్డారు. 1935–40 మధ్యకాలంలో కలసిపనిచేయడానికి కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ, కమ్యూనిస్టులూ నొప్పులుపడాల్సివచ్చింది. బ్రిటిష్‌పాలకులు చట్టవ్యతిరేకమైనదిగా ప్రకటించిన కమ్యూనిస్టుపార్టీ తన రాజకీయ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడానికి వీలు కల్పిస్తుందని భావించి 1935లో కమ్యూనిస్టులనూ, రాయిస్టులనూ ఆహ్వానిస్తూ

కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ తలుపులు తెరిచింది. కానీ, త్వరితకాలంలోనే సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ వేరుపడిపోయి బద్ధశత్రువులుగా తయారైనారు. తత్ఫలితంగా దీర్ఘకాలంపాటు సోషలిస్టులు కరడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరిని అనుసరిస్తే, కమ్యూనిస్టుల దృష్టిలో ప్రతి సోషలిస్టూ కూడా బూర్జువాల ప్రతినిధి లేదా (1947 తరువాత) అమెరికన్ ఏజెంట్.

* * *

సమాజంమీదా, రాజకీయాలమీదా తన ప్రభావాన్ని చూపించడంలో వామపక్షం విజయం సాధించింది. కార్మికులనూ, రైతులనూ సంఘటితం చేయడంలోనూ, తన ఆలోచనా విధానాలతో కాంగ్రెస్‌ను ప్రభావితం చేయడంలోనూ అది అద్భుతమైన విజయాలు సాధించింది. జాతీయ కాంగ్రెస్ కమిటీలో మూడోవంతు ఓట్లు గుప్పిట్లో ఉన్న వామపక్షం అనేక ప్రధానమైన సమస్యలపై సంస్థ వ్యవహారశైలిని ప్రభావితం చేయగలిగింది. 1936-39 మధ్యకాలంలో నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైనారు. ప్రముఖ సోషలిస్టు నాయకులు ఆచార్య నరేంద్రదేవ్,జయప్రకాష్ నారాయణ్, అచ్యుత్ పట్వర్ధన్‌లను నెహ్రూ తన వర్కింగ్ కమిటీలో సభ్యులుగా నియమించుకోగలిగారు. 1939లో కాంగ్రెస్ అధ్యక్షపదవికి వామపక్ష ప్రతినిధిగా పోటీచేసిన సుభాష్‌చంద్రబోస్ 1580 ఓట్లలో 1377 ఓట్లు గెలుచుకుని పట్టాభిసీతారామయ్యను ఓడించగలిగారు.

కాంగ్రెస్‌కు రాజకీయంగానూ, సైద్ధాంతికంగానూ వామపక్ష దృక్పథాన్ని అలవర్చుడం సాధ్యపడింది. దేశ ప్రజల దారిద్ర్యానికీ, సమస్యలకూ వలసపాలనతో పాటు దేశ సామాజిక -ఆర్థిక నిర్మాణం కూడా ప్రధాన కారణమన్న విషయాన్ని మితవాదపక్షంతో సహా కాంగ్రెస్ మొత్తం అంగీకరించింది. ఈ పరిస్థితిని క్రమంగా మార్చవలసిన అవసరాన్ని గుర్తించింది. 1931 కరాచీ సమావేశంలో ప్రాథమిక హక్కులకూ, ఆర్థిక విధానానికీ సంబంధించి కాంగ్రెస్ చేసిన తీర్మానాలు మనకు దానిపై వామపక్ష ప్రభావాన్ని స్పష్టంగా తెలియచెబుతాయి. 1936లో ఫైజాపూర్ సమావేశంలో ఆర్థిక విధానంపై చేసిన తీర్మానాలూ, అదే ఏడాది ప్రకటించిన

ఎన్నికల ప్రణాళికలోనూ, 1938లో ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయడంలోనూ మనకు  ఈ ప్రభావం అర్థమవుతుంది. ఆర్థిక సంబంధమైన, వర్గసంబంధమైన అంశాలపై గాంధీజీ మరింత రాడికల్ ధోరణితో వ్యవహరించడం (ఈ అంశాన్ని 23, 25, 39 చాప్టర్లలో విస్తృతంగా చర్చించాం) కూడా మార్పుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్, ' ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్'లను ఏర్పాటు చేయడం, 1936లో ' ఆల్ ఇండియా స్టేట్స్ పీపుల్స్ కాన్ఫరెన్స్'ను నిర్వహించడం వంటివి వామపక్షం సాధించిన అనేక ప్రధాన విజయాల్లో కొన్ని. 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్'లో వామపక్షం క్రియాశీలకమైన పాత్ర పోషించింది. అన్నింటికీ మించి కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలను ఏర్పాటు చేసి వాటిని ఉచ్ఛస్థితికి తీసుకురావడం మరో అద్భుత విజయం.

* * *

# 25 యుద్ధతంత్రం 1934-37

**శా**సనోల్లంఘనోద్యమాన్ని ఉపసంహరించుకున్న తరువాత భవిష్యత్ వ్యూహంపై జాతీయవాదుల్లో విస్తృతమైన చర్చ జరిగింది. ఈ చర్చ మొదటి దశ–అంటే, 1934–35లో, ప్రజా ఉద్యమం లేని సమీప భవిష్యత్తులో జాతీయోద్యమం ఎటువంటి మార్గాన సాగాలన్నది ప్రధానాంశమైంది. ఈ రాజకీయనిస్తేజాన్ని అంతం చేయడం ఎలా? అన్న ప్రశ్న జాతీయవాదుల మెదళ్ళను దొలిచేసింది. ఈ ప్రశ్నకు రెండు జవాబులు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాత్మక కార్యక్రమానికి, ముఖ్యంగా చేతివృత్తుల పునరుద్ధరణకు గాంధీజీ ఓటువేశారు. దీనివల్ల ప్రజల శక్తిని సుస్థిరం చేసుకోవడం సాధ్యపడుతుందనీ, మలిదశ పోరాటానికి వారిని సన్నద్ధులను చేయడం కూడా సులువవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్‌లోని మరో వర్గం రాజ్యాంగబద్ధమైన పోరాటానికీ, 1934లో జాతీయశాసనసభకు జరిగే ఎన్నికల్లో పోటీచేయడానికీ ఉత్సాహం చూపించారు. డాక్టర్ ఎం. ఎ. అన్సారీ, అసఫ్ అలీ, సత్యమూర్తి, భులాభాయ్ దేశాయ్, బి.సి.రాయ్ వంటివారి నాయకత్వంలో ఈ 'నవీన స్వరాజ్యవాదులు' ఈ వాదన బలంగాముందుకు తీసుకువచ్చారు. ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించే అవకాశాలు కానీ, పరిస్థితులు కానీ లేనప్పుడు ప్రజల రాజకీయ ప్రయోజనాలను పరిరక్షించాలన్నా, వారి నైతికస్థైర్యాన్ని నిలబెట్టాలన్నా చట్టసభల్లో ప్రవేశించడమే అత్యుత్తమమార్గమని వారు వాదించారు. దీనర్థం రాజ్యాంగబద్ధమైన రాజకీయాల్లో విశ్వాసం ఉన్నట్టు కాదనీ, కాంగ్రెస్ సంస్థాగతంగా బలోపేతం కావడానికీ, ప్రజల్లో తన ప్రభావాన్ని నిలబెట్టుకుంటూ, విస్తరించుకుంటూ వారిని మరోపోరాటానికి సిద్ధం చేయడానికి అందివస్తున్న మరో రాజకీయ అవకాశమని

వారు అన్నారు. ఈ 'స్వరాజ్యవాద' విధానాన్ని సి. రాజగోపాలాచారి గాంధీజీ ముందు ఉంచారు. దీనికితోడుగా, ఈ పార్లమెంటరీ కార్యక్రమాన్ని స్వయంగా కాంగ్రెస్ చేపట్టాలనీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ తన కార్యక్రమాలద్వారా ప్రజల్లో కాంగ్రెస్ గౌరవాన్నీ, విశ్వాసాన్నీ ఇనుమడింపచేస్తుందని కూడా ఆయన సూచించారు. గాంధీ– ఇర్విన్ ఒప్పంద కాలంనాటి పరిస్థితిని ఆయన గాంధీకి గుర్తుచేశారు. అటువంటి ఒప్పందానికి ప్రభుత్వం ప్రస్తుతం సిద్ధంగా లేనందువల్ల చట్టసభలో కాంగ్రెస్ ఉన్నందువల్ల ఉద్యమం కొనసాగుతున్న భావన ప్రజల్లో నిలబడే ఉంటుందని ఆయన సలహా ఇచ్చారు.

* * *

అయితే, 1920లలో మాదిరిగా కాక, ఈ మారు మరో ఆలోచన కూడా రంగప్రవేశం చేసింది. 1930 తొలినాళ్ళలో ఎదిగివచ్చిన వామపక్షం చట్టసభల్లో ప్రవేశాన్ని వ్యతిరేకించింది. దానితోపాటుగా, శాసనోల్లంఘనోద్యమాన్ని వదులుకుని దాని బదులుగా నిర్మాణాత్మక కార్యక్రమం చేపట్టాలన్న ఆలోచన అర్థంలేనిదంటూ విమర్శించింది. ఈ రెండు రకాల నిర్ణయాలూ కూడా ప్రత్యక్ష ప్రజా పోరాటాన్నీ, రాజకీయ కార్యాచరణనూ పక్కదారిపట్టిస్తాయనీ, అన్నింటికంటే ముఖ్యంగా సామ్రాజ్యవాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్న భావన అణగారిపోతుందని వారు వాదించారు. రాజ్యాంగేతర ప్రజా ఉద్యమాలను పునరుద్ధరించడం లేదా కొనసాగించడం వల్ల మాత్రమే ప్రయోజనం ఉంటుందని వారు ఉద్ఘాటించారు. ప్రజలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నందువల్లా, వారు పోరాటానికి సిద్ధంగా ఉన్నందువల్లా తమ మార్గం సత్ఫలితాలు ఇస్తుందన్నది వారి వాదన.

గాంధీ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమానికీ, వ్యూహానికీ ఒక కొత్త ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చిన ఈ వామపక్ష ఆలోచనా విధానానికి ఈ మారు నెహ్రూ ప్రాతినిధ్యం వహించారు. అనేక వ్యాసాల్లోనూ, ప్రసంగాల్లోనూ, పుస్తకాల్లోనూ ఈ రకమైన భావాలను ఆయన వ్యక్తంచేశారు. ఫైజాపూర్, లక్నో సమావేశాల్లో తాను చేసిన అధ్యక్షోపన్యాసాల్లో కూడా ఆయన తన అభిప్రాయాలను వ్యక్తంచేశారు. భారతీయ ప్రజలు, ఇంకా చెప్పాలంటే యావత్ ప్రపంచప్రజల కర్తవ్యం పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సామ్యవాదాన్ని ప్రతిష్ఠించడమేనన్నారు. నెహ్రూ ఆలోచనావిధానం గురించి మనం ఇంతకుముందే చెప్పుకున్నందువల్ల దీనితో ముడివడిన రెండు అంశాలను మాత్రం ఇప్పుడు చూద్దాం.

నెహ్రూ దృష్టిలో, శాసనోల్లంఘనోద్యమాన్ని ఉపసంహరించుకోవడం, చట్టసభల్లో ప్రవేశించడం, గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణాత్మక కార్యక్రమానికి మళ్ళిపోవడం వంటివి

లొంగుబాటుతనానికి నిదర్శనాలు. పతనానికి ప్రతీకలు. మరోవిధంగా చెప్పాలంటే, 1919 ముందునాటి మితవాద దశకు మళ్ళిపోవడమే. అన్నింటికీ మించి, కాంగ్రెస్ తన రాడికల్ భావనలను పాతిపెట్టి కొందరి ప్రయోజనాలపట్ల మెతకగా వ్యవహరించడానికి సిద్ధపడుతున్నదని ఆయన వాదన. చాలామంది కాంగ్రెస్ నాయకులు 'కొంతమంది జేబులు ముట్టుకోవడం కంటే అనేకమంది గుండెలు బద్దలుకొట్టడానికి' సిద్ధపడుతున్నారని నెహ్రూ ఆరోపించారు. ఆయన గాంధీకి దూరమవుతున్న సూచనలు దాదాపుగా కనిపించాయి. 1934 ఏప్రిల్‌లో తన జైలుడైరీలో నెహ్రూ ఈ విధంగా రాశారు. 'మన లక్ష్యాలు వేరు, ఆదర్శాలు వేరు, మన దృక్కోణమే వేరు. బహుశా మన మార్గం కూడా వేరుగానే ఉంటుంది'.

జాతీయవాద సిద్ధాంతంలోని లోపాలను తెలియచెబుతూ, దాని స్థానంలో మార్క్సిస్టు లేదా సోషలిస్టు దృక్పథాన్ని అనుసరించాలని ఆయన కోరాడు. దీనివల్ల ప్రజలు తమ సామాజిక పరిస్థితులను సశాస్త్రీయంగా అంచనావేసుకోవడం సాధ్యపడుతుందని ఆయన అన్నారు. గాంధీ అనుసరిస్తున్న పోరాట వ్యూహాన్ని కూడా ఆయన ప్రశ్నించారు.

గాంధీ అనుసరిస్తున్న వ్యూహాన్ని 'యుద్ధం-సంధి-యుద్ధం' విధానంగా వర్ణించవచ్చు. పోరాటం ఈ మూడుదశల గుండా సాగుతూ ఉంటుంది. చట్టవ్యతిరేకంగా ఒక మహోన్నత ప్రజా ఉద్యమం సాగి సామ్రాజ్యవాద ప్రభుత్వంతో తలపడిన తరువాత మలి దశలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యక్షఘర్షణను ఉపసంహరించుకోవడం జరుగుతుంది. ఈదశలో ప్రభుత్వంనుంచి రాజకీయంగా కొన్ని రాయితీలు లేదా సంస్కరణలు లభిస్తాయి. లేదా చట్టపరిధిలో ప్రజలమధ్య కొంత రాజకీయ కార్యక్రమం జరుగుతుంది. ఇది అనంతర దశలో పోరాటానికి ప్రజలను సంసిద్ధులను చేస్తుంది. ఉద్యమంలోని ఈ రకమైన రెండు దశలనూ కూడా వలసపాలకులు ప్రజల్లో స్థిరపరిచిన రెండు రకాల భావనలను దిరగదోడడానికి ఉపయోగించుకోవడం జరుగుతుంది. అవి, బ్రిటిష్ పాలన భారతీయులకు ప్రయోజనకారి అనీ, దానిని ఎదుర్కొనే, కూలదోసే శక్తి భారతీయులకు లేదనేది ఒకటి. పోరాటానికి ప్రజలను సంసిద్ధులను చేయడానికి వీలుగా కార్యకర్తలను నియమించుకుని శిక్షణనిచ్చే సమర్థత లేదనేది రెండవది. ఈ మొత్తం రాజకీయ ప్రక్రియ ఇదే మార్గంలో ఈ రకమైన విభిన్న దశలగుండా ముందుకు పయనిస్తూ అంతిమంగా వలస ప్రభుత్వమే అధికారాలను బదలాయించే దశకు చేరుకుంటుంది.

ఈ రకమైన వ్యూహాన్ని నెహ్రూ ఆమోదించలేదు. గతంలో ఏం జరిగినప్పటికీ, ఏం సాధించినప్పటికీ వర్తమానానికి ఈ వ్యూహం సరిపడదన్నది ఆయన అభిప్రాయం. జాతీయోద్యమం కీలకమైన దశకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో సామ్రాజ్యవాదాన్ని

కూలదోసేవరకూ నిరంతర ఘర్షణ, పోరాటాలు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పోరాటాల్లో ఉత్థానపతనాలు సహజమేనన్న విషయాన్ని ఆమోదిస్తూనే, ఇవి ఒక నిస్తేజమైన స్థితికీ లేదా రాజీపడేదశకూ లేదా 'సహకారానికీ' దారితీయకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. వర్గసంబంధమైన రాజకీయార్థికాంశాలను నిర్మాణాత్మక కార్యక్రమం పక్కదోవపట్టించకూడదన్నారు. ప్రతి ఉద్యమం ఒక దశకు చేరుకున్న తరువాత రాజీలేని ధోరణితో వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడుతుందనీ, లాహోర్ తీర్మానంలో 'పూర్ణ స్వరాజ్యం' కోసం ఉద్ఘాటించిన తరువాత భారతదేశంలో ఉద్యమం అటువంటి కీలకమైన దశకు చేరుకుంది కనుక ఇప్పుడు పోరాటాన్ని కొనసాగించడం వినా మరో మార్గంలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కారణాలచేతనే శాసనోల్లంఘనోద్యమాన్ని ఉపసంహరించుకోవాలన్న ఆలోచనలన్నింటినీ ఆయన ప్రతిఘటించారు. ఈ నిర్ణయం సామ్రాజ్యవాదంతో రాజీపడేందుకు దోహదం చేస్తుందనీ, లక్ష్యాన్ని దెబ్బతీస్తుందనీ, అందువల్ల ఎటువంటి రాజీలూ, రాజీమార్గాలూ, వెనకడుగులూ లేకుండా స్వాతంత్ర్యంకోసం జరుగుతున్న పోరాటాన్ని మరింత సమర్థవంతంగా కొనసాగించడమే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యాన్ని దశలవారీగా సాధించాలనే విధానాన్ని కూడా నెహ్రూ వ్యతిరేకించారు. వాస్తవికమైన అధికారాన్ని 'కొంచెం కొంచెం'గానూ, లేదా 'రెండణాలూ, నాలుగణాలూ'గానూ సాధించలేమనీ, అహింసాయుత విధానంలోనే అయినప్పటికీ అధికారపీఠాన్ని హస్తగతం చేసుకోవడమొక్కటే మార్గమని ఆయన సూచించారు. ఈ విధంగా ఆయన గాంధీ వ్యూహం 'యుద్ధం–సంధి–యుద్ధం' స్థానంలో 'యుద్ధం–విజయం' వ్యూహాన్ని ప్రతిపాదించారు. అంటే, విజయం సాధించేవరకూ యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉండటమన్నమాట.

* * *

నెహ్రూ,వామపక్షవాదులు ఒకవైపూ, చట్టసభల్లోకి ప్రవేశించాలని కోరుకునేవారు ఒకవైపూ చేరి భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి తీవ్రస్థాయిలో ఘర్షణపడుతుండటం జాతీయవాదుల్లో భయాందోళనలు కలిగిస్తే, బ్రిటిష్ అధికారుల్లో కాంగ్రెస్‌లో చీలికతప్పదన్న ఆశ రేకెత్తించింది. కానీ, గాంధీజీ మరోమారు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. సత్యాగ్రహం మాత్రమే స్వాతంత్ర్యాన్ని సంపాదించగలదన్న విశ్వాసం ఆయనకు అమితంగా ఉన్నప్పటికీ, చట్టసభల్లోకి ప్రవేశించాలని కోరుకుంటున్నవారిని అందుకు అనుమతించేందుకు ఒప్పుకుని వారిని శాంతపరిచారు. వారు తక్కువ దేశభక్తి పరులన్న ఆరోపణలనుంచి కూడా కాపాడారు. పార్లమెంటరీ రాజకీయాలు స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చేందుకు దోహదం చేయకపోయినప్పటికీ, కొన్ని కారణాలరీత్యా అటు

సత్యాగ్రహంలోనూ, ఇటు గ్రామీణనిర్మాణంలోనూ పాలుపంచుకోలేని అధికశాతం కాంగ్రెస్‌వాదులు గోళ్ళుగిల్లుకుంటూ కూచోనవసరం లేదనీ, వారు తమ దేశభక్తిని చట్టసభల్లో తమ పనితీరుద్వారా రుజువుచేసుకోవచ్చునని ఆయన అన్నారు. 1934 ఏప్రిల్ 23న ఆయన సర్దార్‌పటేల్‌కు రాసిన లేఖలో ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'వాస్తవిక పరిస్థితులను మనం తోసిపుచ్చలేం. మహా అయితే, పరిస్థితులను కాస్త మెరుగుపరచగలం, లేదా కొంతవరకూ నియంత్రించగలం. అంతకుమించి మనం చేయగలిగిందేమీ ఉండదు'.

అనంతరం, 1934మేలో పాట్నాలో జరిగిన ఎఐసిసి సమావేశం గాంధీజీ సూచన ప్రకారం కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే ఎన్నికల్లో పోటీచేయడానికి వీలుగా పార్లమెంటరీ బోర్డును ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ తీర్మానాన్ని విమర్శిస్తున్న వామపక్షవాదులను గాంధీజీ సముదాయిస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'చట్టసభల్లో పనిచేయాలన్న ఆకర్షణకు అధికశాతం లోబడరనే నేను నమ్ముతున్నాను.... స్వరాజ్యం ఆ మార్గంలో సిద్ధించదు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందింపచేయడం ద్వారా మాత్రమే స్వరాజ్యాన్ని సాధించుకోగలుగుతాం'.

ఇదే సమయంలో నెహ్రూకూ, వామపక్షవాదులకూ ఆయన మరో విషయాన్ని కూడా స్పష్టంచేశారు. శాసనోల్లంఘనోద్యమాన్ని ఉపసంహరించుకోవడం దేశ వాస్తవిక రాజకీయ స్థితిగతుల్ని దృష్టిలోపెట్టుకుని చేసిందే తప్ప, అది రాజకీయ అవకాశవాదంతోనో, రాజీధోరణితోనో, సామ్రాజ్యవాదులకు దాసోహపడో చేసింది కాదని ఆయన వివరించారు. 'శాసనోల్లంఘనోద్యమాన్ని మాత్రమే ఉపసంహరించుకున్నాం. యుద్ధం కొనసాగుతూనే ఉంద'ని ఆయన స్పష్టంచేశారు. 'శాంతియుతమైన చర్యకోసం ప్రజలను తమ శక్తిసామర్థ్యాలను కూడదీసుకోనివ్వడం'గా ఆయన తన విధానాన్ని అభివర్ణించారు. సి. రాజగోపాల చారి సహా ఇతర మితవాదనాయకులు అనుమానాలనూ, అభ్యంతరాలూ వ్యక్తంచేస్తున్నా, లక్నో కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూను అధ్యక్షపదవికి ప్రతిపాదించి వామపక్షవాదులను ఆయన బుజ్జగించారు.

ఇదేసమయంలో గాంధీజీ మరో విషయాన్ని కూడా గుర్తించారు. కాంగ్రెస్‌లో కొత్తగా పుట్టుకొస్తున్న ఆలోచనాసరళి తన ధోరణికి భిన్నంగా, మరింత దూకుడుగా ఉంటున్నదని ఆయన భావించారు. అధికశాతం మేధావివర్గం పార్లమెంటరీ రాజకీయాలకు సానుకూలంగా ఉంటే, ఆయన ఆ విధానాన్ని మౌలికంగా వ్యతిరేకిస్తున్నారు. మేధావివర్గంలోని మరికొంతమంది కాంగ్రెస్ ప్రాధాన్యతనిస్తున్న కొన్ని అంశాలపై అసంతృప్తితో ఉన్నారు. చర్ఖా దేశానికి గుండెకాయవంటిందన్న వాదనపట్లా, నైతిక,

మతపరమైన దృక్పథంతో హరిజనోద్ధరణకూ ఇతరత్రా నిర్మాణ కార్యక్రమాలకు పూనుకోవడం పట్ల వారు అసంతృప్తిగా ఉన్నారు.మరోవైపు నెహ్రూ నాయకత్వంలో సోషలిస్టులు ఒక శక్తివంతమైన, ప్రధానమైన గ్రూపుగా అవతరిస్తున్నారు. వారితో తనకు కొన్ని మౌలికమైన విభేదాలున్నాయి. తన వ్యక్తిగత ప్రాభవం వారికి ఊపిరాడకుండా చేస్తోంది. ఈ పరిస్థితుల మధ్య గాంధీజీ అన్ని గ్రూపులనూ ఉద్దేశించి ఈ విధంగా వ్యాఖ్యానించారు. '... ఈ రకమైన మౌలికమైన విభేదాలున్నప్పటికీ కాంగ్రెస్‌లో ఆధిపత్యంచెలాయించడం ఒక రకమైన హింసే అవుతుంది'. అందువల్ల, ఆయన కాంగ్రెస్‌కు 'మనసా వాచా కర్మణా' మరింత చక్కగా సేవలందించడానికి వీలుగా 1934 అక్టోబర్‌లో కాంగ్రెస్‌నుంచి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

నెహ్రూ, సోషలిస్టుల స్పందన దేశాభిమానానికి అనుగుణంగానే ఉంది. వారి రాడికల్ ధోరణి త్వరలోనే కాంగ్రెస్ విచ్ఛిన్నానికి దారితీస్తుందని కాంగ్రెస్ శత్రువులు సంతోషించినప్పటికీ, తమ ప్రాధాన్యాలేమిటో సోషలిస్టులకూ, నెహ్రూకూ బాగా తెలుసు. సామ్యవాదపోరాటాన్ని ఆరంభించేముందు సామ్రాజ్యవాదులను దేశంనుంచి తరిమికొట్టాలన్న విషయంలో వారికి పూర్తి అవగాహన ఉంది. ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విస్తృతప్రజాదరణ కలిగిన ఏకైక సామ్రాజ్యవాదవ్యతిరేక పోరాట సంస్థగా కాంగ్రెస్‌కున్న స్థానం కొట్టిపారేయలేనిది. సామ్యవాద కోణం నుంచి ఆలోచించినప్పటికీ, కోట్లాదిమంది విశ్వసిస్తున్న కాంగ్రెస్‌ను క్రమక్రమంగా రాడికల్ సంస్థగా మార్చడం ఉత్తమం కానీ, రాజకీయ కారణాలవల్లో, సైద్ధాంతిక పరిశుద్ధత పేరుతోనో ఈ ప్రజలకు దూరం కావడం వల్ల ప్రయోజనం లేదని వామపక్షవాదులూ, నెహ్రూకూడా విశ్వసించారు. 'కొన్ని ప్రతీఘాత శక్తులకు అవకాశమిస్తూ నేను కాంగ్రెస్‌నుంచి నిష్క్రమించాల్సిన అవసరం ఏముంది? అందువల్ల, మేం ఇక్కడే ఉండాలి. అలా ఉంటూ మిగతావారి వేగాన్ని పెంచాలి. వారు మారడమో, పోవడమో జరగాలి' అని నెహ్రూ తన అభిప్రాయాన్ని స్పష్టంగా తేల్చిచెప్పారు. మితవాదపక్షం కూడా పరిస్థితికి అనుగుణంగానే స్పందించింది. 'ఈ అంశం (సామ్యవాదం) మీద కాంగ్రెస్‌లో ఘర్షణతప్పదని బ్రిటిష్‌వారు ఆశపడుతున్నట్టు కనిపిస్తోంది. బహుశా వారిని ఈ విషయంలో నిరాశపరచబోతున్నామనే నేను అనుకుంటున్నాను' అని సి.రాజగోపాలచారి వ్యాఖ్యానించారు.

1934 నవంబరులో కేంద్రశాసనసభకు ఎన్నికలు జరిగాయి. భారతీయులకు ఉన్న మొత్తం 75స్థానాల్లో కాంగ్రెస్ 45 గెలుచుకుంది. 'ఒక్కమాటలో చెప్పాలంటే అత్యంత దురదృష్టకరం. బుల్లిగాంధీకి మహాద్భుతమైన విజయం' అని వైస్రాయ్ విల్లింగ్డన్ వ్యాఖ్యానించాడు.

* * *

1932-33 మధ్యకాలంలో ప్రభుత్వం విజయవంతంగా ప్రజా ఉద్యమాన్ని అణిచివేసినప్పటికీ, ఈ అణిచివేత విధానం తాత్కాలిక విజయాన్ని మాత్రమే ఇస్తుందనీ, రాబోయే కాలంలో జరిగే మరింత మహోన్నతమైన ఉద్యమాన్ని ఈ రకమైన చర్యలు ఆపలేవనీ ప్రభుత్వానికి తెలుసు. అటువంటి ఉద్యమాన్ని అడ్డుకోవాలంటే దానిని ముందుగానే బలహీనపరచడం మార్గం. కాంగ్రెస్ విచ్ఛిన్నమై అధికశాతం నాయకులు వలసప్రభుత్వంలోనూ, అధికారవ్యవస్థలోనూ పాలుపంచుకున్నప్పుడు మాత్రమే ఇది సాధ్యం. అందువల్ల, ఒకపక్కన అణచివేత చర్యలు సాగుతూనే మరోవైపు రాజ్యాంగసంస్కరణలు కూడా అమలుజరగాలి.

1935 ఆగస్టులో బ్రిటిష్‌పార్లమెంటు 'భారత ప్రభుత్వ రాజ్యాంగచట్టం-1935'ను ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం భారత ఫెడరల్ (సమాఖ్య) రాజ్యం ఏర్పడి రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారాలు లభిస్తాయి. బ్రిటిష్ ఇండియాలోని అన్ని రాష్ట్రాలూ, స్వదేశీ సంస్థానాల సమాఖ్యగా భారతదేశం ఉంటుంది. బ్రిటిష్ ఇండియా రాష్ట్ర ప్రతినిధులూ, స్వదేశీ సంస్థానాల ప్రతినిధులతో కేంద్రశాసనసభ ఏర్పడుతుంది. కేంద్రశాసనసభకు పంపే ప్రతినిధులను సంస్థానాధీశులే నిర్ణయిస్తారన్న నిబంధనవల్ల జాతీయవాదులను అదుపులో ఉంచడం సాధ్యపడుతుంది. రాష్ట్రాలనుంచి ప్రతినిధులను ప్రజలే ఎన్నుకుంటారు కానీ, బ్రిటిష్ ఇండియామొత్తం జనాభాలో నూటికి 14మందికి మాత్రమే ఓటింగ్ హక్కు ఉంది. రక్షణ, విదేశవ్యవహారాలు ఈ కేంద్రశాసనసభ పరిధిలోకి రావు. మిగతా చాలా అంశాలపై గవర్నర్‌జనరల్‌కు విస్తృతమైన ప్రత్యేకాధికారాలు ఉంటాయి.

ఇక, రాష్ట్రశాసనసభలు స్వతంత్రంగానే పనిచేస్తాయి. సంబంధిత మంత్రులకు పాలనాపరమైన అన్ని శాఖలపై నియంత్రణ ఉంటుంది. అయితే, బ్రిటిష్ ప్రభుత్వం నియమించే గవర్నర్‌కు ప్రత్యేకాధికారాలున్నాయి. ప్రాంతీయసభలు ఆమోదించిన చర్యలను గవర్నర్ వీటో చేయవచ్చును. అంతేకాదు, అవసరమైతే కొన్ని చట్టాలను స్వతంత్రంగా తీసుకురావచ్చు. ముఖ్యంగా, మైనారిటీలు, ప్రభుత్వోద్యోగులు, శాంతిభద్రతలు, బ్రిటిష్ వ్యాపార ప్రయోజనాలకు సంబంధించి గవర్నర్‌కు అపరిమితమైన అధికారాలు ఉంటాయి. అవసరమైతే సర్వాధికారాన్నీ గవర్నర్ తన గుప్పిట్లోకి తీసుకుని ఒక ప్రావిన్సును తానే పరిపాలించవచ్చును. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే, ఈ చట్టం ప్రకారం రాజాకీయార్థికాంశాలు పూర్తిగా బ్రిటిష్‌వారి చేతుల్లోనే ఉంటూ, వలసపాలన చెక్కుచెదరలేదన్నమాట. ఈ చట్టానికి సంబంధించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ చైర్మన్ లిన్‌లిత్‌గో (1936 నుంచి ఈయనే వైస్రాయ్ కూడా) తరువాతికాలంలో ఈ చట్టంపై ఈ విధంగా వ్యాఖ్యానించాడు. 'భారతదేశంలో బ్రిటిష్ ప్రాభవాన్ని

కొనసాగించాలంటే ఇంతకంటే ఉత్తమమైన మార్గం ఏదీ లేదని భావించినందువల్లే ఈ చట్టాన్ని తీసుకువచ్చాం. రాజ్యాంగసంస్కరణలను వారి (భారతీయుల) ప్రయోజనాలకోసం త్వరితగతిన తీసుకురావాలనో, మేం అనుకున్నదానికంటే ముందుగానే అధికారాలు వారి చేతుల్లో పెట్టిపోవడానికో తీసుకున్న చర్య కాదిది. దీర్ఘకాలంపాటు భారతదేశాన్ని బ్రిటిష్‌సామ్రాజ్యానికి ముడివేసి ఉంచడానికే ఈ చట్టం తీసుకువచ్చాం'.

1935-39 మధ్యకాలంలో బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తూవచ్చిన దీర్ఘకాలిక వ్యూహంలో అనేకానేక అంశాలున్నాయి. వాటిలో మొదటిది సంస్కరణలు. శాసనోల్లంఘనోద్యమ కాలంలో ప్రజలసానుకూలతను కోల్పోయి, రాజ్యాంగబద్ధమైన విధానాలకు ప్రాధాన్యతనిస్తున్న మితవాదులనూ, మరోవైపున ఉదారవాదులనూ రాజ్యాంగ సంస్కరణల ద్వారా లొంగదీయడం బ్రిటిష్‌పాలకుల లక్ష్యం. అదేవిధంగా, ఉద్యమాన్ని అత్యంత దుర్మార్గంగా అణిచివేయడంద్వారా అధికశాతం కాంగ్రెస్‌వాదులకు చట్టవ్యతిరేక పద్ధతులపై విశ్వాసం పోతుంది. వారిని ఈ ప్రజా ఉద్యమ రాజకీయాలనుంచి పక్కకు తప్పించి రాజ్యాంగబద్ధ రాజకీయాలవైపుకు మళ్ళించవచ్చును. ఒకసారి అధికారాన్నీ, ప్రభుత్వ ఆదరణనూ రుచిచూసిన తరువాత మళ్ళీ త్యాగాలతో కూడుకున్న రాజకీయ విధానాలవైపు కాంగ్రెస్‌వారు మొగ్గుచూపించరని కూడా ప్రభుత్వం భావించింది.

వలసపాలకుల వ్యూహంలో మరో కోణం కూడా ఉంది. రాజ్యాంగ సంస్కరణలు కాంగ్రెస్‌లో సైద్ధాంతిక ఘర్షణకు దోహదం చేస్తాయని వారు ఆశించారు. లెఫ్టు-రైటూ ఘర్షణతో పాటు, రాజ్యాంగతావాదులకూ, వ్యతిరేకులకూ మధ్య విభేదాలు తప్పవని పాలకులు ఆశించారు. రాజ్యాంగతావాదులనూ, మితవాదులనూ వివిధరకాల రాజ్యాంగపరమైన రాయితీలద్వారా, ఇతరత్రా చర్యలద్వారా లొంగదీసుకుని వారిచేత ఉద్యమ రాజకీయాలకు స్వస్తిచెప్పించి, పార్లమెంటరీ రాజకీయాల్లోకి రప్పించి, ఉదారవాదులతోనూ, ప్రభుత్వానుకూల శక్తులతోనూ కలపడం ద్వారా జాతీయవాద నాయకత్వంలో వారి ప్రాబల్యాన్ని పెంచవచ్చునని ప్రభుత్వం భావించింది. వామపక్షవాదులూ, రాడికల్ ఆలోచనాపరులూ ఈ పరిణామాలను సామ్రాజ్యవాదులకు దాసోహపడటంగానూ, ప్రజా ఉద్యమ విధానంనుంచి దారిమళ్లడంగానూ భావించి తాడెత్తున మండిపడకతప్పదు. ఈ పరిస్థితుల్లో వామపక్షవాదులు (రాడికల్స్) తమంతటతాముగా కాంగ్రెస్‌నుంచి పోవడం కానీ, వారి మితవాదవ్యతిరేకతనూ, సామ్యవాద భజననూ భరించలేక మితవాదులే వారిని తన్నితరిమేయడం కానీ జరిగితీరుతుందని పాలకులు భావించారు. ఏతావాతా ఏవిధంగా చూసుకున్నా కాంగ్రెస్ ముక్కలు చెక్కలై బలహీనపడకతప్పదు. అన్నిటికంటే ముఖ్యంగా అటు మితవాదపక్షానికి

దూరమై, ఇటు ఒక సమిష్టి ఉద్యమపు రక్షణకవచాన్ని కూడా కోల్పోయిన వామపక్ష (రాడికల్స్) వాదులను అత్యంతసునాయాసంగా పోలీసుచర్యలతో అణచిపారేయవచ్చును.

ఈ వ్యూహంలో భాగంగానే ప్రభుత్వం 1933-34 మధ్యకాలంలో అనుసరించిన విధానాన్ని-అంటే, రాజ్యాంగతావాదాన్ని బలహీనపరచే శక్తులను అణచివేయడమనే పద్ధతిని- మార్చుకుంది. కాంగ్రెస్‌లో కుడి ఎడమల కుమ్ములాటలు తారాస్థాయికి చేరుకుంటున్న దశలో ప్రభుత్వం వామపక్ష కాంగ్రెస్‌వాదులపై విరుచుకుపడటం బాగా తగ్గించింది. ముఖ్యంగా 1935నుంచి ప్రభుత్వ వ్యూహంలో ఈ మార్పు కనబడటం ఆరంభమైంది. అన్నింటికీ మించి ప్రభుత్వం నెహ్రూపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. సామ్యవాదాన్ని నెత్తినెత్తుకుని, వలసప్రభుత్వాన్ని తిరుగుబాటుద్వారా తరిమికొట్టాలంటూ ఆయన చేస్తున్న ఉద్వేగపూరితమైన వ్యాఖ్యలూ, మితవాదులపైనా, రాజ్యాంగతావాదులపైనా ఆయన పాల్పడుతున్న దాడులూ జాతీయవాదుల్లో చీలిక తేకతప్పదని ప్రభుత్వం విశ్వసించింది. నెహ్రూ, ఆయన అనుయాయుల వ్యవహారశైలి పతాకసన్నివేశానికి చేరుకుందనీ, లక్నో కాంగ్రెస్ సమావేశంలోనూ, ఎఐసిసిలోని మితవాదుల చేతుల్లోనూ దెబ్బతిన్న తరువాత వారు వెనకడుగువేయగలిగే అవకాశాలు కూడా లేవని బ్రిటిష్ అధికారులు భావించారు. ఈ కారణంతోనే 1935-36లో అనేకమంది బ్రిటిష్ అధికారులు నెహ్రూను ఎట్టిపరిస్థితుల్లోనూ అరెస్టుచేయవద్దంటూ వైస్రాయ్‌కు పనిగట్టుకుని సలహాలు ఇచ్చారు. ఉదాహరణకు మద్రాస్ గవర్నర్‌గా ఉన్న ఎర్స్కిన్ ఈ విధంగా సూచించాడు. 'నెహ్రూ ఈ విధంగా ఎంతమాట్లాడితే అంతమంచిది. ఆయన వ్యవహారశైలి కాంగ్రెస్‌ను చీల్చకతప్పదు. కాంగ్రెస్‌లో ఉంటూ దానిని అంతర్గతంగా విచ్ఛిన్నం చేస్తున్న ఈయనను మనం సాధ్యమైనంత ప్రేమగా చూసుకోవాలి'.

ఇక, ప్రావిన్షియల్ స్వతంత్రత కారణంగా కాంగ్రెస్‌లో అనేకమంది శక్తివంతమైన ప్రాంతీయనాయకులు పుట్టుకొస్తారనీ, తమకు నచ్చిన రీతిలో అధికారాలు చెలాయిస్తూ, పరిపాలనాపరంగా తమకంటూ కొన్ని ప్రాధాన్యతలను ఏర్పరుచుకుంటూ, చివరకు స్వతంత్ర రాజకీయాధికార కేంద్రాలుగా తయారవుతారని ప్రభుత్వం భావించింది. ఈ కారణంగా కాంగ్రెస్ ప్రాంతీయస్థాయికి కుదించుకుపోతుందనీ, జాతీయస్థాయి నాయకత్వ అధికారాలు పూర్తిగా పోనప్పటికీ, విపరీతంగా తగ్గిపోయి బలహీనపడిపోతుందని ప్రభుత్వం వ్యూహించింది. 1936లో లిన్‌లిత్‌గో ప్రభుత్వ ఆశలను ఈ విధంగా వ్యక్తపరిచాడు. 'జాతీయస్థాయిలో ఉద్యమానికి ప్రతినిధిగా

ఉంటున్న కాంగ్రెస్ ప్రాభవాన్ని నిర్వీర్యంచేయాలన్న మా ఆశలన్నీ ఈ ప్రాంతీయ స్వతంత్రతద్వారానే తీరగలదు. కాంగ్రెస్‌ను బలహీనపరిచే శక్తి దానికే ఉందని మా నమ్మకం'.

1935 భారతరాజ్యాంగచట్టాన్ని దేశంలోని అన్నివర్గాలవారూ ముక్తకంఠంతో ఖండించారు. కాంగ్రెస్ దీనిని పూర్తిగా వ్యతిరేకించింది. దీనికి బదులుగా స్వతంత్రభారతావనికోసం ఒక రాజ్యాంగాన్ని రూపొందించడానికి వీలుగా ఎన్నికలద్వారా రాజ్యాంగసభను ఏర్పాటుచేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

* * *

రెండోదశ వ్యూహాత్మక చర్చ–అధికారపదవులు స్వీకరించాలా, వద్దా?–అన్న అంశానికి సంబంధించింది. భారత ప్రభుత్వ రాజ్యాంగచట్టాన్ని తీసుకువచ్చిన బ్రిటిష్ పాలకులు ప్రాంతీయస్వతంత్రతకు సంబంధించిన భాగాన్ని వెంటనే అమలులోకి తీసుకురావాలని నిర్ణయించడంతో 1937 తొలినాళ్ళలో రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు ప్రకటించారు. జాతీయనాయకులను రాజ్యాంగచట్రంలో ఇమడ్చాలన్న వారి వ్యూహంలో ఇది మరో అడుగు. జాతీయవాదులు తీవ్రసందిగ్ధంలో పడ్డారు. 1935చట్టం నిష్ఫలమైనదనీ, దానిని తిరగొట్టాల్సిన అవసరం ఉందన్న విషయంలో జాతీయవాదులంతా ఏకీభవించారు. కానీ, విస్తృతప్రజా ఉద్యమానికి అవకాశం లేని తరుణంలో ఈ పని ఏవిధంగా జరగాలన్న విషయంలో మాత్రం కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్రవిభేదాలు పొడచూపాయి. విస్తృతమైన రాజకీయ, ఆర్థిక కార్యక్రమంతో ఎన్నికల్లో పాల్గొని, ప్రజల్లో ఉన్న సామ్రాజ్యవాదవ్యతిరేతను మరింత బలోపేతం చేయాలన్న విషయంలో కూడా వారి మధ్య విభేదాలు లేవు. కానీ, ఎన్నికల తరువాత ఒకవేళ రాష్ట్రాల్లో మెజారిటీ వస్తే అప్పుడు ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలా, వద్దా? అన్నదే తీవ్రస్థాయి చర్చకు దారితీసింది.

అధికారం చేపట్టి తద్వారా 1935నాటి చట్టంలో భాగస్వాములు కావడాన్ని జవాహర్‌లాల్‌నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, కాంగ్రెస్ సోషలిస్టులూ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయంలో వామపక్షవాదుల అభిప్రాయాన్ని నెహ్రూ 1936లో లక్నో కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసంలోనే స్పష్టంచేశారు. అధికారాన్ని పంచుకోవడమంటే ఈ చట్టాన్ని తిరస్కరించాలన్న లక్ష్యాన్ని మనకు మనమే భంగపరచుకోవడమని ఆయన వ్యాఖ్యానించారు. ఒకపక్కన, అధికారవ్యవస్థ నిర్మాణంలో ఎటువంటిమార్పులూ లేకుండా, మరోవైపు వాస్తవికాధికారాలు దక్కకుండా కేవలం బాధ్యతలను మాత్రమే స్వీకరించడం ద్వారా కాంగ్రెస్ ప్రజలకు చేయగలిగిందేమీ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటువంటి పరిమితులమధ్య అధికారాన్ని స్వీకరిస్తే సామ్రాజ్యవాదపాలకుల అణచివేత, దోపిడీ

విధానాల్లో మనం కూడా భాగస్వాములు కావడం వినా ప్రయోజనం ఏమీ ఉండదని ఆయన వాదించారు. అధికారాన్ని స్వీకరించడవల్ల 1919నాటినుంచీ కష్టపడి నిర్మించుకుంటూ వస్తున్న ఉద్యమస్ఫూర్తి నాశనమైపోతుందని ఆయన హెచ్చరించారు. 'మనం భారతదేశంలో విప్లవాత్మకమైన మార్పులు రావాలని కోరుకుంటున్నామా, లేక, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విదల్చే రాయితీలకోసం ఎగబడుతున్నామా?' అన్న ప్రశ్న ఈ అంశంతో ముడివడి ఉందని నెహ్రూ స్పష్టంచేశారు. 'అధికారాన్ని పంచుకోవడమంటే ఆచరణలో అది సామ్రాజ్యవాదానికి దాసోహపడటమేనని' ఆయన వ్యాఖ్యానించారు. ఈ రకమైన చర్యవల్ల కాంగ్రెస్ వలసప్రభుత్వ రాజ్యాంగచట్రంలో ఇరుక్కుపోయి ఆర్థికసామాజిక న్యాయం, స్వాతంత్ర్యం, దారిద్ర్యనిర్మూలన వంటి ప్రధానాంశాలను విస్మరించే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. 'అది ఒక పెద్ద అగాధం. అందులో పడినతరువాత బైటకు రావడం అసాధ్యం' అని ఆయన హెచ్చరించారు.

నెహ్రూ,వామపక్షవాదులూ మరోవ్యూహాన్ని కూడా సూచించారు. ఇది గతకాలం నాటి స్వరాజ్యవాదుల విధానం వంటిది. చట్టసభల్లోకి అడుగుపెట్టి 1935 చట్టం అమలును అసాధ్యంగా మార్చాలని వారు సూచించారు. దీర్ఘకాలికవ్యూహంలో భాగంగా, కార్మికులూ, రైతులతో కలిసిపనిచేసి, వారి సంఘాలను బలోపేతం చేసి, ఆ సంఘాలను కాంగ్రెస్‌లో విలీనం చేసి కాంగ్రెస్‌ను సామ్యవాదదిశగా మళ్ళించాలనీ, విస్తృతమైన ప్రజా ఉద్యమానికి వీలుగా కాంగ్రెస్‌ను సన్నద్ధంచేయాలనీ వారు సూచించారు.

అధికార పదవులు స్వీకరించాలని భావిస్తున్నవారు కూడా, 1935 చట్టానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని మనస్ఫూర్తిగా ఆమోదించారు. ఈ విషయంలో వారికి ఎటువంటి విభేదమూ లేదు. అంతేకాదు, శాసనసభల వెలుపల నిర్వహించే కార్యక్రమాలు మాత్రమే ఫలితాలనిస్తాయన్న వాదనతో కూడా వారు ఏకీభవించారు. సభల్లో ప్రవేశమన్నది ఒక తాత్కాలిక వ్యూహమే తప్ప దాని ద్వారా స్వాతంత్ర్యం సిద్ధించదని కూడా వారికి తెలుసు. అయితే, ప్రజా ఉద్యమానికి అవకాశంలేని దశలో, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, రాజ్యాంగబద్ధరాజకీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని వారు వాదించారు. ప్రతికూల రాజకీయ వాతావరణాన్ని కాంగ్రెస్ సానుకూలంగా మార్చుకోవాలంటే ఒకపక్కన ప్రజారాజకీయాలను కొనసాగిస్తూనే, మరోపక్కన శాసనసభల్లోనూ,మంత్రివర్గాల్లోనూ కొనసాగాల్సి ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఒక విధంగా చెప్పాలంటే ఈ దశలో జాతీయనాయకుల మధ్య ఏ విధమైన సిద్ధాంతాన్ని ఎంచుకోవాలన్నది కాక, ఏ రకమైన వ్యూహాన్ని అనుసరించాలన్నదానిపై తీవ్రచర్చ కొనసాగింది. 1935 డిసెంబరులో నెహ్రూకు రాసిన

ఒక లేఖలో రాజేంద్రప్రసాద్ మితవాదపక్షం అభిప్రాయాన్ని అత్యంత సరళంగా, సున్నితంగా వివరించారు. 'నాకు తెలిసినంత వరకూ అధికారం చేపట్టాలని అంటున్నవారెవ్వరూ కూడా ఆ ప్రతిపాదన స్వలాభం కోసం చేయడంలేదు. అలాగే, ప్రభుత్వం ఆశిస్తున్న రీతిలో రాజ్యాగబద్ధంగా పనిచేయాలని కూడా ఎవరూ అనుకోవడం లేదు. మనముందున్న ప్రశ్నలు పూర్తిగా భిన్నమైనవి. మనం ఈ రాజ్యాంగం విషయంలో చేయగలిగిందేమిటి? దానిని పూర్తిగా విస్మరించి మనమానాన మనం పోగలమా? అది సాధ్యమయ్యేపనేనా? లేదంటే, దానిని మనకు తోచినరీతిలో, ఉపయోగపడినంతమేరకు, అనుకూలంగా ఉపయోగించుకోవడం మంచిదా?...ఇప్పుడు ఆలోచించాల్సిన అంశం ఇదే. ఇది మార్పులుకోరే పక్షానికో, వద్దంటున్న పక్షానికో, ఆచరణవాదులకో, ఆటంకవాదులకో సంబంధించిన సైద్ధాంతిక వ్యవహారం కాదు.' అదే విధంగా, లక్నోకాంగ్రెస్ సమావేశంలో జె.బి.కృపలానీ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'విప్లవోద్యమంలో కూడా అప్పుడప్పుడు స్తబ్ధత ఏర్పడుతుంది. ఒక అచేతనావస్థ ఉంటుంది. అటువంటి కాలాల్లో అమలు జరిగే కార్యక్రమాలకు సంస్కరణస్వభావం ఉండటం ఎంత అవసరమో, అవి మొత్తం వ్యూహంలో అంతర్భాగంగా ఉండటం కూడా అంతే అవసరం'. ఈ చర్చలో సామ్యవాదానికి కూడా చోటులేదన్నది మరో అభిప్రాయం. ఆంధ్రకు చెందిన టి. విశ్వనాథమ్ ఈ విషయాన్ని స్పష్టంచేశారు. 'నా సోషలిస్టు కామ్రేడ్లకు నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే. అధికారాన్ని చేపట్టాలా, వద్దా అన్న అంశానికీ, సామ్యవాదానికీ సంబంధం లేదు. ఇది వ్యూహానికి సంబంధించిన వ్యవహారం మాత్రమే.'

అధికారంలో పాలుపంచుకోవాలని కోరుకుంటున్నవారు కూడా, ఈ వ్యవహారంలో కొన్ని లోపాలూ, సమస్యలూ ఉన్నాయని అంగీకరించారు. పదవులను చేపట్టిన కాంగ్రెస్‌వారు అధికార వ్యవస్థలో ఉన్న తప్పుడు ధోరణులకు లొంగిపోయే ప్రమాదం లేకపోలేదని కూడా భావించారు. అయితే, పదవులను చేపట్టకుండా వదిలేయడం కంటే, పదవులను చేపట్టి పరిస్థితులను మార్చడం చాలా అవసరమని వారు భావించారు. అన్నింటికంటే ముఖ్యంగా, పాలనారంగాన్ని పూర్తిగా ప్రభుత్వానుకూల శక్తులకు దఖలుపరచడం ఎంతో ప్రమాదమని కూడా వారు భావించారు. అధికారపదవులను చేపట్టడానికి ఒకవేళ కాంగ్రెస్ తిరస్కరించినా, ఆ పీఠాలను స్వీకరించడానికి అనేక గ్రూపులూ, పార్టీలూ సిద్ధంగా ఉన్నాయనీ, వీరంతా జాతీయవాదాన్ని బలహీనపరచడానికీ, ప్రతీఘాత, మతఛాందసశక్తులను బలోపేతం చేయడానికీ తమ అధికారాన్ని ఉపయోగించే ప్రమాదం లేకపోలేదనీ వారు హెచ్చరించారు. ప్రావిన్షియల్ మంత్రివర్గాలకు అధికారాలు నామమాత్రమే కావచ్చును గానీ, గ్రామాల్లో నిర్మాణాత్మక కార్యక్రమాన్ని విజయవంతంగా

అమలు చేయడానికి వాటిని కూడా వినియోగించుకోవచ్చునని వారు సూచించారు.ముఖ్యంగా, హరిజనోద్ధరణ, ఖాదీ, మద్యపాన వ్యతిరేకోద్యమం, విద్య, రుణభారాన్ని తగ్గించడం, రైతులకు సంబంధించిన పన్ను-కౌలు సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ఈ అధికారాలు ఎంతో కొంతమేరకు ఉపకరిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

మంత్రి పదవులను ఆమోదించడం అంతిమంగా వలసపాలకులతో సహకారానికి దారితీస్తుందా, లేక, సామ్రాజ్యవాదుల వ్యూహాన్ని దెబ్బతీయడానికి ఉపకరిస్తుందా? అన్నది మరో ప్రశ్న. టి. విశ్వనాథం దీనికి జవాబుగా ఈ వ్యాఖ్యచేశారు. "మంత్రివర్గ కార్యాలయాలు'... 'ఆమోదించడం'...వంటి మాటలూ, ఆలోచనలే అనవసరం. వాటిని మనం చూడాల్సింది కార్యాలయాలుగా కాదు. బ్రిటిష్ సామ్రాజ్యవాద లావాను ఎగజిమ్ముతున్న అధికార కేంద్రాలుగా, కోటలుగా గుర్తుపెట్టుకోవాలి.... శాసనసభలు మనని రాజ్యాంగతావాదానికి మళ్ళిస్తాయని భయపడటానికి మనమేం బుడిబుడినడకలు నడుస్తున్న పిల్లలం కాదు. మనమే ఆ శాసనసభలను దారికి తెచ్చుకుని విప్లవానికి ఉపయోగించుకుంటాం'.

ఈ వ్యవహారంమీద గాంధీజీ చాలా తక్కువగా రాశారు. అయితే, వర్కింగ్ కమిటీ చర్చల్లో ఆయన పదవులను స్వీకరించడాన్ని వ్యతిరేకించినట్టుగా తెలుస్తోంది. ఈ ఆలోచనకు బదులుగా గ్రామీణప్రాంతాల్లో విస్తృతమైన కృషిచేసి శాసనోల్లంఘనోద్యమాన్ని పునరుద్ధరించడానికి బాటలు వేయాలని ఆయన కోరారు. అయితే, 1936 ప్రారంభంనాటికి ఆయన ఈ అభిప్రాయం కూడా సరైంది కాదన్న నిర్ధారణకు వచ్చారు. అందువల్ల ఆయన కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పాటుచేసే ప్రయత్నానికే సానుకూలత వ్యక్తంచేశారు. ముఖ్యంగా, కాంగ్రెస్‌లో అధికశాతం దీనికే అనుకూలంగా ఉండటం ఆయన ఆలోచనలో మార్పుకు ఒక కారణం.

* * *

1936 ప్రారంభంలో జరిగిన లక్నో సమావేశంలోనూ, అదే ఏడాది ద్వితీయార్థంలో జరిగిన ఫైజాపూర్ సమావేశంలోనూ కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనడానికే మొగ్గింది. మంత్రివర్గాలు ఏర్పాటు చేయాలా,వద్దా అన్న అంశాన్ని ఎన్నికల తరువాత నిర్ణయించుకోదలచుకుంది. 1922-24లో, 1934లో మాదిరిగా కాంగ్రెస్‌లోని ఉభయపక్షాలూ పరస్పర గౌరవంతోనూ, సామ్రాజ్యవాద వ్యతిరేకత విషయంలో పరస్పర విశ్వాసంతోనూ వ్యవహరించడం ప్రారంభించాయి. ముఖ్యంగా కాంగ్రెస్‌లో చీలిక జాతీయోద్యమాన్ని ఎంతగా బలహీనపరుస్తుందో తెలుసు కనుక పార్టీని చీల్చేంతవరకూ

వ్యవహారాన్ని సాగదీయలేదు. తన వాదన తరచుగా తిరస్కారానికి గురవుతోందన్న బాధ వామపక్షానికి ఉన్నప్పటికీ, మరింత ప్రభావవంతంగా తన వాదన వినిపించే ప్రయత్నం చేసిందే తప్ప వ్యవహారం తెగేదాకా లాగకుండా జాగ్రత్తపడింది.

1937 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించే దిశగా సాగింది. తన ఎన్నికల ప్రణాళికలో 1935 చట్టాన్ని తిరస్కరిస్తున్నట్టు పునరుద్ఘాటించింది. రాజకీయఖైదీల విడుదలకూ, పౌరహక్కుల పరిరక్షణకూ, అస్పృశ్యతానివారణకు, వ్యవసాయ విధానాన్ని ప్రక్షాళించేందుకూ, గ్రామీణరుణభారాన్ని తగ్గించేందుకూ, తక్కువవడ్డీకి రుణాలు కల్పించేందుకూ కట్టుబడి ఉన్నట్టు ప్రకటించింది. ట్రేడ్‌యూనియన్లు ఏర్పాటుచేసుకోవడానికీ, సమ్మెహక్కును కల్పించడానికీ సిద్ధమని హామీ ఇచ్చింది.

కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక మరోమారు దేశప్రజల్లో రాజకీయచైతన్యాన్ని రేకెత్తించింది. ప్రజలు దానిని అపూర్వమైన ఆదరణతో స్వీకరించారు. ముఖ్యంగా, నెహ్రూ దేశవ్యాప్తంగా జరిపిన ఎన్నికల పర్యటన అనితరసాధ్యమైనది. ఐదునెలల్లో ఆయన 80వేల కిలోమీటర్లు తిరిగి నూరులక్షలమందిని ఉద్దేశించి ప్రసంగించారు. గాంధీజీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేదు కానీ, ప్రతి ఓటరు హృదయంలోనూ ఆయన ఉన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన విజయం సాధించింది. పోటీచేసిన 1161 స్థానాల్లో అది 716 స్థానాలను గెలుచుకుంది. చాలా ప్రావిన్సుల్లో మెజారిటీ సాధించింది. బెంగాల్, అస్సాం, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్, పంజాబ్, సింధ్‌లు దీనికి మినహాయింపు. మొదటి మూడింట్లో కాంగ్రెస్ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. వలసప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కున్న గౌరవం ఈ ఎన్నికల తరువాత ఇనుమడించింది. ఎన్నికల పర్యటన, ఎన్నికల్లో సాధించిన ఘనవిజయం నెహ్రూను అమితంగా సంతోషపెట్టాయి. విషణ్ణస్థితిలో కూరుకుపోయిన ఆయనను బైటకుతీసుకురావడమే కాదు, 'యుద్ధం–సంధి–యుద్ధం' వ్యూహానికి రాజీపడేట్టు కూడా చేశాయి.

* * *

# 26 ఇరవై ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలన

ప్రభుత్వంతో కొద్దినెలలపాటు వివాదం నడిచిన తరువాత, 1935 చట్టం ప్రకారం పదవీబాధ్యతలు చేపట్టడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయించుకుంది. జూలైలో అది ఆరు ప్రావిన్సుల్లో–మద్రాస్, బోంబే, మధ్యప్రావిన్సులు, ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్–లలో మంత్రివర్గాలను ఏర్పాటు చేసింది. ఆ తరువాత నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావి న్సులోనూ, అస్సాంలోనూ కూడా కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పాటయ్యాయి. వివిధ ప్రావిన్సుల్లోని కాంగ్రెస్ మంత్రివర్గాలన్నింటికీ దిశానిర్దేశం చేయడానికీ, వీటిమధ్య సమన్వయం సాధించడానికీ, ముఖ్యంగా కాంగ్రెస్‌ను ప్రాంతీయస్థాయికి కుదించాలన్న బ్రిటిష్‌పాలకుల దురాలోచనను విచ్ఛిన్నం చేయడానికి వీలుగా కేంద్రస్థాయిలో ఒక నియంత్రణ సంఘం– పార్లమెంటరీ సబ్‌కమిటీ– ఏర్పడింది. సర్దార్‌పటేల్, మౌలానా అబుల్ కలామ్ అజాద్, రాజేంద్రప్రసాద్ ఈ కమిటీ సభ్యులు. ఈ విధంగా ఒక వినూత్న ప్రయోగం ఆరంభమైంది. బ్రిటిష్ పాలనకు చరమగీతం పాడటానికి అంకితమైన ఒక పార్టీ, బ్రిటిష్ రాజ్యాంగం భారతీయులకు ఇచ్చిన పరిమిత అధికారాలతో పరిపాలనా బాధ్యతలు స్వీకరించిన స్థితి ఇది. ఈ అధికారాలను కూడా సామ్రాజ్యవాద ప్రభువులు ఏక్షణాన్నైనా తన్నుకుపోవచ్చును. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ రెండు పాత్రలు పోషించాల్సి ఉంది. ప్రావిన్సుల్లో ప్రభుత్వాలకు నాయకత్వం వహించాలి, అసలు సిసలు అధికారాలున్న కేంద్రప్రభుత్వానికి ప్రతిపక్షంగా వ్యవహరించాలి. అంతేకాదు, ప్రావిన్సుల్లో తనకున్న అధికారాలను ఉపయోగించుకుని సంస్కరణలు చేపడుతూనే మరోవైపు స్వాతంత్ర్యోద్యమాన్ని కొనసాగిస్తూ మలిదశ పోరాటానికి ప్రజలను సన్నద్ధులను చేయాలి.

పదవులు చేపట్టడం గురించి 1937 ఆగస్టు 7వతేదీ 'హరిజన్'లో గాంధీజీ ఒక వ్యాఖ్యచేస్తూ దానిని ఈ విధంగా నిర్వచించారు. 'ఈ పదవులు మనకు ముళ్ళకిరీటాలే కానీ పూలకిరీటాలు కాదు. మనం మన లక్ష్యాన్ని శీఘ్రగతిన చేరడానికి ఇవి ఉపకరిస్తాయో లేదో తేల్చుకోడానికే మనం వీటిని స్వీకరించామన్న విషయాన్ని మరిచిపోకూడదు'. అంతకుముందు ఆయన కాంగ్రెస్‌వారికి ఒక హితవుచెబుతూ 1935 భారత రాజ్యాంగచట్టాన్ని బ్రిటిష్‌వారు ఆశించిన రీతిలో వినియోగించకుండా జాగ్రత్తపడమంటూ సూచించారు.

* * *

కాంగ్రెస్ నేతృత్వంలో మంత్రివర్గాలు ఏర్పడడం దేశప్రజల మానసికస్థితిని సమూలంగా మార్చివేసింది. ప్రజల్లో స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామనే సంతృప్తి ఆరంభమైంది. ఖాదీగుడ్డలు కట్టుకుని నిన్నమొన్నటివరకూ జైళ్లలో మగ్గినవారు ఈ రోజు సచివాలయంలో కూర్చుని పరిపాలన సాగించడం సామాన్యమైన మార్పు కాదు. వారిని నిన్న జైళ్ళలో తోసిన అధికారులే నేడు వారినుంచి ఆదేశాలు తీసుకుంటున్నారంటే అది గొప్ప విజయమే కదా!. ఆ కాలంనాటి ఈ అద్భుతమైన వాతావరణాన్ని 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో నెహ్రూ ఈ విధంగా వర్ణించారు. ' ప్రజల్లో ఒక్కసారిగా ఉత్సాహం, ఉద్వేగం నెలకొన్నాయి. తమను అథఃపాతాళానికి అణిచేస్తున్న ఓ పెద్దబరువు ఒక్కసారిగా నెత్తిమీదనుంచి తొలిగిపోయినట్టు వారికి అనిపించింది. దీర్ఘకాలంగా తొక్కిపెట్టి ఉన్న వారి శక్తి ఒక్కసారిగా పెల్లుబికింది. ప్రావిన్షియల్ ప్రభుత్వాల ప్రధాన కార్యాలయాల్లోనూ, అధికారిక కేంద్రాల్లోనూ కనిపించిన అనేక దృశ్యాలు వారు అనుభవిస్తున్న స్వేచ్ఛనూ, ముప్పిరిగొన్న ఆనందాన్నీ మనకు తెలియచెబుతాయి. అప్పటివరకూ కాలుమోపడానికి కూడా భయపడిన వీరు పట్టణాలనుంచీ, గ్రామాలనుంచి పనిగట్టుకుని వచ్చి ఈ కార్యాలయాల చుట్టూ షికార్లు చేయడం ఓ అద్భుతదృశ్యం. ప్రతివిషయమూ వారికి ఉత్సుకత కలిగించేదే. అసెంబ్లీ చాంబర్ ఎలా ఉంటుందో పరికించి చూసేవారు. మంత్రుల కార్యాలయ గదుల్లోకి తొంగిచూసేవారు. కార్యాలయాల్లో అధికారులు పనిచేస్తుంటే గుమ్మాలదగ్గరనిలబడి చూసేవారు. వారిని ఆపడం ఎవరితరమూ కాదు– ఎందుకంటే,వారు ఇప్పుడు బయటివారు కాదు. ఇదంతా మాదేనన్న వారి భావనవల్లా, దానినుంచి పుట్టుకొచ్చిన ధైర్యంవల్లా వారిని ఎవరూ ఆపలేరు, ఆపరు. ఒకప్పుడు తళతళా మెరిసిన

పోలీసు లాఠీలు ఇప్పుడు జీవంలేనట్టుగా తయారైనాయి. పాతకాలం నాటి హోదాలకు ఇప్పుడు గుర్తింపే లేదు. అధికారానికీ, హోదాకూ ప్రతీకలుగా చెబుతున్న యూరోపియన్ దుస్తులకు కూడా ఇప్పుడు గౌరవం లేదు. శాసనసభ్యులకూ, గ్రామాలనుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన వారికీ మధ్య తేడాను గుర్తించడం కూడా ఎంతో కష్టం'.

ఒక ప్రత్యామ్నాయ అధికార శక్తిగా, విస్తృత ప్రజానీకపు–ముఖ్యంగా రైతుల ప్రయోజనాలను పరిరక్షించే సంస్థగా కాంగ్రెస్ గౌరవం ఇనుమడించింది. అదేసమయంలో, ప్రజా ఉద్యమాలను నిర్వహించడంలోనే కాక, ఆ ప్రజల శ్రేయస్సుకోసం అధికారాన్ని సద్వినియోగం చేయడంలోకూడా తాను దిట్టేనని నిరూపించుకోవలసిన బాధ్యత కూడా కాంగ్రెస్ మీద పడింది.

అయితే, ఈ బాధ్యత సామాన్యమైనది కాదు. కాంగ్రెస్ మంత్రివర్గాలపైన ఉన్న ఆ బాధ్యత కొండంత–అధికారాలూ, ఆర్థికవనరులూ మాత్రం ఆవగింజంత. పరిపాలన పరమైన పరిమితులు కూడా అనేకం. పరిపాలనావ్యవస్థకున్న సామ్రాజ్యవాద స్వభావాన్ని వారు మార్చలేరు. వినూత్నమైన సంస్కరణలను చేపట్టలేరు. కానీ, ఆ పరిమితుల్లోనూ, వారికి దక్కిన ఆ స్వల్పకాలంలోనే (కేవలం రెండేళ్ళ నాలుగునెలలు మాత్రమే వారు అధికారంలో ఉన్నారు), వారు కొన్ని సంస్కరణలు చేయడానికి ప్రయత్నించారు, దుర్భరమైన పరిస్థితులను చక్కదిద్దేందుకు కృషిచేశారు, ప్రజలను ఉద్ధరించే కార్యక్రమాలకు నడుంబిగించారు. ఒక్కమాటలో చెప్పాలంటే– భవిష్యత్తులో దక్కే 'స్వరాజ్యం' ఎలా ఉంటుందో ప్రజలకు రుచిచూపించారు.

కాంగ్రెస్ మంత్రులు ఆడంబరాలకు పోలేదు. సాదాజీవితాన్ని గడుపుతూ ఉన్నతమైన ప్రమాణాలు నెలకొల్పారు. నెలకు రెండువేల రూపాయలున్న తమ వేతనాన్ని ఐదువందలరూపాయలకు ఇష్టపూర్వకంగా తగ్గించుకున్నారు. సామాన్యప్రజలకు అందుబాటులో ఉన్నారు. అతిస్వల్పకాలంలోనే ప్రజలను సముద్ధరించే అనేకానేక చట్టాలు తీసుకువచ్చి, కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో చేసిన ప్రమాణాలను నెరవేర్చేందుకు కృషిచేశారు.

* * *

పౌరహక్కులనూ,స్వేచ్ఛనూ పరిరక్షించే విషయంలోనూ, వాటిని విస్తృతపరచే విషయంలో కాంగ్రెస్ తన ఆవిర్భావ కాలంనుంచీ కట్టుబడి ఉంది. అందువల్ల, కాంగ్రెస్ మంత్రివర్గాలు ఈ రంగంలో విశేషమైన కృషిచేయడంలో ఆశ్చర్యం లేదు. ప్రజాభద్రతాచట్టం

వంటి అనేక చట్టాల ద్వారా 1932లో ప్రావిన్షియల్ ప్రభుత్వాలు దఖలు పరుచుకున్న అత్యవసర అధికారాలన్నింటినీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌మంత్రివర్గాలు రద్దుచేశాయి. బ్రిటిష్ ప్రభుత్వం చట్టవ్యతిరేకమైనవని ప్రకటించిన హిందూస్థాన్ సేవాదళ్, యువజన సంఘాలవంటివాటిపై నిషేధాన్ని ఎత్తివేశాయి. రాజకీయ గ్రంథాలూ, జర్నల్స్‌పై నిషేధాన్ని తొలగించాయి. కమ్యూనిస్టుపార్టీపై కేంద్రప్రభుత్వం నిషేధం విధించింది కనుకా, ఆ నిషేధాన్ని కేంద్రప్రభుత్వమే రద్దుచేయగలదు కాబట్టీ కమ్యూనిస్టుపార్టీపై నిషేధం యధాతథంగానే కొనసాగింది. అయితే, ఆచరణకు వచ్చేసరికి కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న ప్రావిన్సుల్లో కమ్యూనిస్టులు స్వేచ్ఛగా, నిర్భయంగానే మనగలిగారు. పత్రికలపై ఉన్న అన్నిరకాల ఆంక్షలనూ కాంగ్రెస్ మంత్రివర్గాలు ఎత్తివేశాయి. పత్రికలనుంచీ, ప్రచురణసంస్థలనుంచీ సెక్యూరిటీ పేరుతో ప్రభుత్వం దఖలు పరచుకున్న ఆస్తులను తిరిగి ఇచ్చివేసి, వాటిపై ఉన్న కేసులను కూడా ఉపసంహరించుకోవడం జరిగింది. ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వకుండా కొన్ని పత్రికలను బ్లాక్‌లిస్టులో పెట్టే సంప్రదాయం ముగిసిపోయింది. స్వాధీనం చేసుకున్న ఆయుధాలను తిరిగి అప్పగించడం, రద్దుచేసిన ఆయుధ లైసెన్సులను పునరుద్ధరించడం జరిగింది.

బ్రిటిష్ కార్యనిర్వాహక వ్యవస్థల్లో ప్రజలు భయపడేదీ, తీవ్రంగా వ్యతిరేకించేదీ పోలీసు వ్యవస్థ. కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పాటైన తరువాత 1937 ఆగస్టు21న గాంధీజీ ఈ విధంగా రాశారు. 'పోలీసు, మిలటరీ వ్యవస్థలను ఎంతమేరకు అచేతనంగా ఉంచగలరన్నదానినిబట్టి కాంగ్రెస్ మంత్రివర్గాల సాఫల్యవైఫల్యాలను అంచనావేయడం జరుగుతుంది.... మిలటరీ సహాయం ఏమాత్రం స్వీకరించకుండా, సాధ్యమైనంత తక్కువ పోలీసు సహాయాన్ని మాత్రమే తీసుకుంటూ పరిపాలన చేయగలిగామని నిరూపించడమే ఈ రాజ్యాంగాన్ని వమ్ముచేయడానికి ఉన్న ఏకైక మార్గం'. కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న ప్రావిన్సుల్లో పోలీసుల అధికారాలను బాగా తగ్గించివేశారు. రాజకీయకార్యకర్తలపైనా, వారి ప్రసంగాలపైనా సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) ఏజెంట్ల నిఘా పూర్తిగా నిలిపివేశారు.

వేలాదిమంది రాజకీయకార్యకర్తలను జైళ్ళనుంచి విడుదలచేయడం, వారిపైన ఉన్న అన్ని రకాల కేసులనూ ఉపసంహరించుకోవడం వంటివి కాంగ్రెస్ ప్రభుత్వాలుచేపట్టిన తొట్టతొలిచర్యల్లో కొన్ని. కాకోరీ వంటి అనేక కుట్రకేసుల్లో ఉన్న చాలామంది విప్లవకారులను ప్రభుత్వాలు విడిచిపెట్టాయి. అయితే, ఉత్తరప్రదేశ్, బీహార్‌లో చాలామంది

విప్లవకారులు హింసాత్మక సంఘటనలకు పాల్పడిన కేసుల్లో ఇరుక్కుని ఉండటం వల్ల వారు జైళ్ళలోనే ఉండాల్సివచ్చింది. వీరిలో చాలామందిని ముందు 'కాలాపానీ' (అండమాన్‌లోని సెల్యూలార్ జైలు)కి పంపించివేశారు. అయితే, 1937 జూలైలో వీరు దీర్ఘకాలం నిరాహారదీక్షలు చేయడంతో తరువాత వారిని వారివారి ప్రాంతాలకు తరలించడం జరిగింది. 1938 ఫిబ్రవరి నాటికి ఈ విధమైన శిక్షలు అనుభవిస్తున్నవారు ఉత్తరప్రదేశ్‌లో 15మంది, బీహార్‌లో 23మంది ఉన్నారు. వారిని విడుదల చేయాలంటే గవర్నర్ అనుమతి కావాలి. కానీ, గవర్నర్ ఇందుకు అనుమతించలేదు. ఉత్తరప్రదేశ్, బీహార్ మంత్రివర్గాలు ఈ అంశంపై పట్టుదలగా వ్యవహరిస్తూ చివరకు ఫిబ్రవరి 15న రాజీనామా చేశాయి. ఎట్టకేలకు చర్చల ద్వారా ఈ అంశానికి పరిష్కారం కుదిరి, మార్చి నెలాఖరుకు రెండు ప్రావిన్సుల్లోని ఖైదీలనూ విడుదలచేయడం జరిగింది.

ఈ అంశానికి సంబంధించి కాంగ్రెస్ పాలిత ప్రావిన్సులకూ, కాంగ్రెసేతర మంత్రివర్గాలున్న బెంగాల్, పంజాబ్ ప్రావిన్సులకూ మధ్య అత్యంతస్పష్టంగా తేడా కనిపించింది. బెంగాల్, పంజాబ్‌లలో, ముఖ్యంగా బెంగాల్‌లో, పౌరహక్కుల అణచివేత యధాతథంగా కొనసాగింది. ఖైదులో ఉన్న విప్లవకారులు జైళ్ళలోనే ఏళ్ళ తరబడి విచారణలేకుండా మగ్గవలసి వచ్చింది. వారు పలుమార్లు నిరాహారదీక్షలు చేసినా, వారి విడుదల కోసం పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు సాగినా ఫలితం లేకపోయింది.

బోంబేలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసే మరో చర్యను చేపట్టింది. 1930నాటి శాసనోల్లంఘనోద్యమంలో భాగంగా జరిగిన పన్నునిరాకరణోద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వం రైతులనుంచి భూములను స్వాధీనం చేసుకుని వేరొకరికి ఇచ్చివేసిన విషయం మనకు తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ భూములను వాటి అసలు యజమానులకు దక్కించేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టింది. ఈ విషయంలో గవర్నర్‌ను ఒప్పించడానికి ఇక్కడి కాంగ్రెస్ మంత్రివర్గం రాజీనామా బెదిరింపు చేయాల్సివచ్చింది. ఉద్యమానికి సానుకూలంగా ఉన్నందుకు 1930-32 మధ్యకాలంలో డిస్మిస్ అయిన ప్రభుత్వోద్యోగుల పెన్షన్‌ను కూడా ప్రభుత్వం పునరుద్ధరించింది. అయితే, కాంగ్రెస్ మంత్రివర్గాలకు కొన్ని మాయనిమచ్చలు కూడా ఈ కాలంలో ఏర్పడ్డాయి. 1937 జూలైలో యూసఫ్ మెహరాలీ అనే సోషలిస్టు నాయకుడు మలబార్‌లో ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించినందుకు మద్రాస్ ప్రభుత్వం ఆయనను అరెస్టుచేసింది. ఆయనను త్వరలోనే విడుదల చేసినప్పటికీ, 1937 అక్టోబర్‌లో ఎస్. ఎస్.బాట్లీవాలా అనే మరో సోషలిస్టు నాయకుడి ప్రసంగాన్ని

దేశద్రోహంగా తప్పుపడుతూ ఆయనను ప్రాసిక్యూట్ చేసి ఆరునెలల జైలుశిక్ష విధించింది. ఈ చర్యలు కాంగ్రెస్‌వారిలో తీవ్ర అలజడి రేకెత్తించాయి. కేవలం ప్రసంగాలు చేస్తున్నందుకూ, అందునా ఆ ప్రసంగాలు వలసపాలనకు వ్యతిరేకమైనప్పుడు ఎవరినీ ప్రాసిక్యూట్ చేయకూడదన్న కాంగ్రెస్ నియమానికి భిన్నంగా ఈ చర్యలున్నాయని నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్‌వాదులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు, అప్పటి మద్రాస్ ప్రధాని (ప్రావిన్షియల్ మంత్రివర్గం నాయకుడిని అప్పట్లో ప్రధానిగా వ్యవహరించేవారు) సి.రాజగోపాలచారిని నెహ్రూ నేరుగా చూస్తూ, 'దీనర్థం నేను మద్రాస్ వచ్చి ఇదేరకమైన ప్రసంగం చేస్తే నన్నుకూడా అరెస్టు చేస్తాననేగా?' అని ప్రశ్నించిట్టూ, దానికి రాజగోపాలచారి ఏమాత్రం తడుముకోకుండా 'అవున'ని సమాధానం ఇచ్చినట్టూ చెబుతారు. చివరకు బాట్లీవాలా విడుదల కావడమూ, ఆయన మద్రాస్ ప్రెసిడెన్సీ అంతా పర్యటించి ఇటువంటి ప్రసంగాలే అనేకం చేయడమూ జరిగింది. ఈ సంఘటనలు అరుదుగా జరిగినవే అయినప్పటికీ, కాంగ్రెస్‌లోని మితవాద వర్గం భవిష్యత్ వ్యవహారశైలిపై కొన్ని అనుమానాలు రేకెత్తించింది.

కొంతమంది మితవాద కాంగ్రెస్‌మంత్రుల వ్యవహారశైలి ఇంకా దౌర్భాగ్యకరంగా ఉంది. ఉదాహరణకు బోంబే హోంమంత్రిగా ఉన్న కె. ఎమ్.మున్షీ సిఐడి విభాగాన్ని కమ్యూనిస్టులపైనా, కాంగ్రెస్‌లోని వామపక్షవాదులపైనా నిఘా ఉంచేందుకు వినియోగించారు. 'మీరు అప్పుడే పోలీస్ ఆఫీసర్ కూడా అయిపోయారు:' అంటూ నెహ్రూ ఆయనను దెప్పిపొడిచారు. మద్రాస్ ప్రభుత్వం కూడా రాడికల్ కాంగ్రెస్‌వాదులపై నిఘాకోసం పోలీసువ్యవస్థను ఉపయోగించుకుంది. అయితే, ఈ సంఘటనలను కూడా మనం బోంబే, మద్రాసుల్లో కూడా విస్తృతంగా పెరిగిన పౌరస్వేచ్ఛను దృష్టిలో ఉంచుకునే చూడాల్సి ఉంది. అన్నింటికీ మించి ఈ విషయంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో చైతన్యవంతంగా ఉన్నారు. వామపక్షవాదుల నాయకత్వంలో వీరంతా చురుకుగా వ్యవహరిస్తూ మితవాద కాంగ్రెస్‌మంత్రులు ఎవరూ పౌరహక్కుల విషయంలో దుశ్చర్యలకు పాల్పడకుండా చూసుకున్నారు.

* * *

కార్మికులకూ, రైతులకూ సాధ్యమైనంత వేగంగా ఆర్థికవెసులుబాటు కల్పించడానికి కాంగ్రెస్ మంత్రివర్గాలు కృషిచేశాయి. కాంగ్రెస్ అంతకుముందు, వలసపాలనావ్యవస్థ నిర్మాణంలోనూ, దాని విధానంలోనూ ఉన్న లోపాలనూ, ఆ కారణంగా

పుట్టుకొచ్చిన వారి ఆర్థికసమస్యలనూ విశ్లేషించి చెబుతూ, వారిలో జాతీయభావలను పురిగొల్పి తన సామ్రాజ్యవాదవ్యతిరేకపోరాటానికి వారి సహకారాన్ని స్వీకరించింది. వారి ఆర్థికసమస్యలకూ, డిమాండ్లకూ సంబంధించిన అంశాలపై పోరాటాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్‌కు ఎంతో కొంతమేరకైనా అధికారం ఉన్నందున వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత దానిపై ఉంది. తన అధికారాలను ఉపయోగించి వారి ఆర్థికస్థితిని మెరుగుపరచి తద్వారా తన మద్దతును నిలబెట్టుకోవాల్సిన అవసరమూ ఉంది.

వ్యావసాయిక చట్టాలకు సంబంధించి కాంగ్రెస్ అనుసరించిన వ్యూహం అనేక అంశాలను దృష్టిలో పెట్టుకుని సాగింది. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలోనూ, ఎన్నికల ప్రచారంలోనూ వ్యావసాయిక సంస్కరణలకు అగ్రస్థానం ఇచ్చింది. రుణభారాన్ని తగ్గిస్తాననీ, కౌలు విధానాన్నీ, భూమిశిస్తు పద్ధతినీ సంస్కరిస్తానని హామీ ఇచ్చింది. రైతులను తనవైపు తిప్పుకోవడానికి ఈ విధమైన హామీలు అనేకం గుప్పించి తన అభ్యర్థులకు ఓటు చేయవలసిందిగా అభ్యర్థించింది. గ్రామీణ ఓటర్లు ఈ హామీలను ప్రబలంగా విశ్వసించారు. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ నుంచి లభించిన ప్రభుత్వ సమాచారం ప్రకారం ఎన్నికలరోజున ఓటర్లు తమతో పాటు కొన్ని పేడ పిడకలను కూడా పోలింగ్‌స్టేషన్లకు తీసుకువచ్చి ఓటుచేసిన తరువాత వాటిని తగులబెడుతూ, 'బెడాఖ్లీ' (భూమి ఖాళీ చేయాల్సిన ఆదేశాలు)ని పూర్తిగా తగులబెట్టాశాం' అంటూ నినాదాలు చేసి నృత్యాలు చేశారు.

అయితే, జమీందారీ విధానాన్ని రద్దుచేసి వ్యవసాయ సమాజంలో సమూలమైన మార్పులకు నడుంబిగించే అవకాశాలు కాంగ్రెస్‌కు లేవు. ఇందుకు రెండు కారణాలున్నాయి. 1935 భారతరాజ్యాంగ చట్టం ప్రకారం ప్రావిన్షియల్ ప్రభుత్వాలకు ఈ అధికారాలు లేవు. అంతేకాదు, కాంగ్రెస్‌మంత్రివర్గాలకు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులు చాలా పరిమితమైనవి. ఆదాయంలో సింహభాగం కేంద్రప్రభుత్వానికే పోతుంది. మరోపక్కన, పాలనావ్యవస్థలో మార్పులు చేయడానికి కూడా కాంగ్రెస్ మంత్రివర్గాలకు అధికారాలులేవు. వైస్రాయ్, గవర్నర్‌లు తమ అధికారాలను ఉపయోగించి ఈ వ్యవస్థ పవిత్రతను కాపాడుతుంటారు. అన్నింటికీ మించి, వర్గసంబంధమైన వ్యూహం కారణంగా కూడా ఈ విషయంలో ముందడుగువేయడానికి కుదరదు. పరస్పరం సంఘర్షించుకుంటున్న రెండు వర్గాల ప్రయోజనాలను కొంతమేరకు పరిరక్షిస్తూ, అవసరమైన మేరకు

సర్దుబాటుచేస్తూ, ఈ వర్గాల మధ్య ఒక సమతుల్యత సాధించగలిగినప్పుడు మాత్రమే ఒక విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించడమూ, కొనసాగించడమూ సాధ్యపడుతుంది. ఆ కాలానికి ప్రధానశత్రువైన సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడానికీ, దానిని తరిమికొట్టేందుకు ప్రజలను సంఘటితం చేయడానికీ ఇటువంటి సర్దుబాటు తప్పనిసరి. అందువల్ల, సాధ్యమైనంత అధికంగా భూస్వామ్యవర్గాలను ఆకర్షించడం లేదా కనీసం వారిని తటస్థంగా ఉంచడమనే విధానాన్ని అనుసరించకతప్పదు. ఈ విధంగా చేయడంద్వారా ప్రధానశత్రువైన సామ్రాజ్యవాదపాలకులను ఒంటరిచేయడమూ, ఈ దేశంనుంచి వారికి లభిస్తున్న సామాజిక మద్దతును విచ్ఛిన్నం చేయడమూ సాధ్యపడుతుంది. మరోకోణం నుంచి చూసినా ఈ విధానం సరైనదే. ఎందుకంటే, దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో చిన్న భూస్వాములు జాతీయోద్యమంలో పాలుపంచుకున్నారు. వారికి వ్యతిరేకమైన విధానాన్ని అనుసరించి వారిని దూరం చేసుకోవడం ప్రస్తుత తరుణంలో అత్యంత ప్రమాదకరం. ఆ కాలంనాటి నాయకులు ఈ సమస్య తీవ్రతను బాగా గుర్తించారు. ఉదాహరణకు బీహార్‌కు చెందిన తీవ్రవాద రైతునాయకుడు స్వామి సహజానంద ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'ఒక జాతీయ సంస్థగా కాంగ్రెస్ అన్నివర్గాలకూ ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థే. అన్నివర్గాలవారూ కాంగ్రెస్‌లో భాగస్వాములే. తాను అన్ని తరగతులవారికీ, వర్గాలవారికీ ప్రతీకనని కాంగ్రెస్ చెప్పుకుంటుంది. ఇది వాస్తవమూ, వాంఛనీయమూ కూడా. అందువల్ల ఈ విభిన్నవర్గాల, తరగతులవారి మధ్య సామరస్యపూర్వకమైన వాతావరణాన్ని నెలకొల్పి, తద్వారా తన పోరాటాన్ని కొనసాగించవలసిన బాధ్యత దానిపై ఉంది'.

ఇక, కాలానికి సంబంధించి కూడా పరిమితులున్నాయి. తమ మంత్రివర్గాలు దీర్ఘకాలం కొనసాగేవి కావన్న విషయం కాంగ్రెస్ నాయకత్వానికి స్పష్టంగా తెలుసు. సామ్రాజ్యవాదానికి సహకరించడానికి బదులు రాజకీయంగా ఘర్షణాత్మకవైఖరి అనుసరించాల్సివచ్చినప్పుడు తాము ఈ పదవులను తృణప్రాయంగా వదిలేయాల్సి ఉంటుందనీ వారికి తెలుసు. నెహ్రూ ఆ తరువాతి కాలంలో తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఈ అంశాన్ని ఈ విధంగా వివరించారు. 'రానున్న సంక్షోభపు నీడలు మమ్మల్ని ఎప్పుడూ వెంటాడుతూనే ఉండేవి. అప్పటివాతావరణంలో ఈ హెచ్చరిక అంతర్లీనంగా ఉండనే ఉంది'. కాంగ్రెస్ అధికారపదవులు స్వీకరించగానే తన కార్యక్రమాన్ని అమలు చేయడానికి రెండేళ్ళ కాలపరిమితిని విధించుకుంది. అయితే, 1938నుంచి యూరోప్‌పై యుద్ధమేఘాలు అలుముకోవడం ఆరంభం కాగానే ఈ గడువు మరింత

స్పష్టంగా అర్థమైంది. దీనితో కాంగ్రెస్ మంత్రివర్గాలు సాధ్యమైనంత చురుకుగా వ్యవహరించి తమకు లభించిన స్వల్ప సమయంలో సాధ్యమైనంత ఎక్కువ సాధించాల్సిన అవసరం ఏర్పడింది.

మరోముఖ్యమైన పరిస్థితి ఏమిటంటే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో (ఉత్తరప్రదేశ్, బీహార్, బోంబే, అస్సాం, మద్రాస్) శాసనమండళ్ళుగా ఉన్న ఎగువసభల్లో కాంగ్రెస్‌కు మెజారిటీ లేదు. ఈ రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల్లో 17.5 మిలియన్ల మంది పాలుపంచుకుంటే, శాసనమండళ్ళ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య 70వేలకు మించి లేదు. ఈ సభల్లో భూస్వాములు, పెట్టుబడిదారులు, వడ్డీవ్యాపారులు అత్యధికంగా ఉంటే, కాంగ్రెస్ మైనారిటీగా ఉంది. దిగువసభలో కాంగ్రెస్‌కు మెజారిటీ ఉన్నా ఒక చట్టానికి ఆమోదముద్రపడాలంటే ఎగువసభలో ఉన్న 'పెద్దల'ను బుజ్జగించక తప్పదు. అవసరమైతే ఒత్తిడి చేయకాతప్పదు. అందుకే, బీహార్ ప్రభుత్వం కౌలుదారీ బిల్లుల విషయంలో జమీందారులతో ఒక ఒప్పందాన్ని కుదర్చుకుంటే, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎగువసభలోని వ్యాపారులూ, వడ్డీవ్యాపారుల సూచనప్రకారం రుణాలకు సంబంధించిన ఒక చట్టం విషయంలో పట్టుదలకుపోకుండా –కౌల్దారీచట్టాల విషయంలో వారి మద్దతును సంపాదించుకుంది.

భారతదేశ వ్యవసాయరంగ నిర్మాణం చాలా సంక్లిష్టమైనది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలైన వ్యవస్థలు, విధానాలూ ఉన్నాయి. వ్యవసాయ సంబంధిత సమాచారం కూడా తగినంతగా, నిర్దిష్టంగా లేదు. ప్రతి సమస్యా మరొకదానితో ముడిపడి ఉంటుంది. 'తారకమంత్రాన్ని' ప్రయోగించి అన్ని సమస్యలనూ ఒక్కదెబ్బతో పరిష్కరించగలిగే అవకాశాలు లేవు. సమూలమైన సంస్కరణలు చేపట్టడం ఒక్కటే దానికి మార్గం. ఆ పని ఎంతో సంక్లిష్టమైనదే కాక, దీర్ఘకాలం కొనసాగే ప్రక్రియ.
ఈ నేపథ్యంలో, కొన్ని పరిమితులకు లోబడి కాంగ్రెస్ మంత్రివర్గాలు అనుసరించిన వ్యావసాయిక విధానం రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కృషిచేసింది. వివిధ ప్రావిన్సుల్లో ఉన్న పరిస్థితులు, సమస్యల ఆధారంగా ఆయా మంత్రివర్గాలు వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చాయి. ఈ విషయంలో కాంగ్రెస్ మంత్రివర్గాలు సాధించిన విజయాలను సంక్షిప్తంగా తెలుసుకుందాం.

ఉత్తరప్రదేశ్‌లో 1939 అక్టోబర్‌లో రూపొందిన కౌల్దారీచట్టం చట్టబద్ధ కౌలుదారులకు భూమిపై సంపూర్ణ వారసత్వ హక్కులను కల్పించింది. భూస్వాములకు

భూములను  ఆక్రమించుకునే హక్కులేకుండా చేసింది. వారసత్వ కౌలుదారులు చెల్లించాల్సిన కౌలును పదేళ్ళవరకూ మార్చకుండా ఆక్షలు విధించింది.  ఆ తరువాత కూడా దానిని సవరించే విషయంలో కొన్ని పరిమితులు విధించింది. కౌలు చెల్లించలేని కౌలుదారుడిని అరెస్టుచేయడం, జైలులోపెట్టడం కూడా నిషేధించింది. నజ్రానా, బేగార్ వంటి దుష్టవిధానాలను నిషేధించింది. బీహార్‌లో 1937,1938 సంవత్సరాల్లో కౌల్దారీ చట్టాలు రూపొందాయి. ఉత్తరప్రదేశ్‌కంటే ముందుగా, అక్కడి చట్టాలకంటే మరింత బలంగా బీహార్‌లో కౌల్దారీ చట్టాలు తయారైనాయి. 1911 తరువాత కౌలు మొత్తంలో పెరిగిన భాగాన్ని ఈ చట్టాలు రద్దుచేసి 1911నాటి స్థితిని పునరుద్ధరించాయి. ఆ ప్రకారం లెక్కచూస్తే ఐదోవంతు కౌలు ఒక్కసారిగా తగ్గిపోయిందన్నమాట. అంతేకాదు, ఉత్పత్తుల ధరలు పడిపోయినా, భూస్వామి సాగునీటి సౌకర్యాన్ని కల్పించడంలో విఫలం చెందినా, భూసారం క్షీణించినా ఇది మరింత తగ్గుతుంది. 12 ఏళ్ళ పాటు భూమిని సాగుచేసిన రైతుకు భూమిహక్కు కల్పించడం జరిగింది. కౌలు బకాయిలను పెద్దమొత్తంలో మాఫీ చేయడంతో పాటు బకాయిలపై వడ్డీరేటును 12.5 నుంచి 6.25శాతానికి తగ్గించడం జరిగింది. భూస్వామికి పంటలో వాటా ఉన్నపక్షంలో అది మొత్తం ఉత్పత్తిలో 9/20 వంతుకు మించకూడదు. కౌలుదారుడు బకాయిలు చెల్లించని కారణంగా డిక్రీల ద్వారా 1929లోనూ 1937లోనూ (బకష్త్ భూమి) అమ్మివేసిన భూములపై పూర్వపు కౌలుదారుడికి హక్కులు కల్పించడం జరిగింది. ఇందుకు సదరు కౌలుదారుడు తాను బకాయిపడ్డ మొత్తంలో సగం చెల్లిస్తే సరిపోతుంది. కౌలు వసూలు చేసే విషయంలో భూస్వామి అధికారాలను బాగా నియంత్రించడం జరిగింది. కౌలుదారుడిని ఈ విషయంలో అరెస్టుచేయడం కానీ, జైల్లో పెట్టడం కానీ నిషేధించారు. అతని ఆస్తులను అతని అనుమతిలేకుండా విక్రయించడానికి వీల్లేదు. బకాయిల పేరుతో అక్రమంగా  ఎటువంటి వసూళ్ళకూ  పాల్పడకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘించినపక్షంలో భూస్వామి అర్నెల్ల జైలుశిక్షను అనుభవించవలసి ఉంటుంది. కౌలు కట్టని కారణంగా కౌలుదారుడిని భూమినుంచి వెళ్ళగొట్టే అధికారం భూస్వామికి లేదు. విపరీతంగా తగ్గిపోయిన శిస్తును వసూలు చేసుకోవడం మాత్రమే భూస్వామికి మిగిలిన ఏకైక హక్కు.

ఒరిస్సాలో 1938 మేనెలలో కౌల్దారీ బిల్లును ఆమోదించడం జరిగింది. భూమిని బదలాయించుకునే అధికారాన్ని కౌలుదారుడికి కల్పించడంతో పాటు శిస్తు బకాయిలపై వడ్డీరేటును కూడా 12.5నుంచి 6శాతానికి తగ్గించారు. కౌలుదారుడిపై విధించే అన్నిరకాల

లెవీలనూ నిషేధించారు. 1938 ఫిబ్రవరిలో ఆమోదించిన మరో బిల్లు సమీపగతంలో మద్రాస్ ప్రెసిడెన్సీనుంచి ఒరిస్సాకు బదిలీ అయిన ప్రాంతాల్లో (జమిందారీ విధానం అమలులో ఉన్న) అన్ని రకాల కిరాయిలనూ బాగా తగ్గించివేసింది. సమీప రైత్వారీ ప్రాంతాల్లో అమలులో ఉన్న శిస్తులకు దీనిని సమం చేసి అదనంగా 12.5శాతాన్ని జమీందారులకు నష్టపరిహారంగా ఇవ్వాలని ప్రతిపాదించింది. అయితే, దీనివల్ల జమీందారుల ఆదాయం యాభైనుంచి అరవైశాతం వరకూ పడిపోతుందన్న కారణంగా గవర్నర్ దీనికి ఆమోదముద్రవేయడానికి నిరాకరించారు.
మద్రాసులో రెవిన్యూమంత్రి టి.ప్రకాశం (1872-1957) అధ్యక్షతన గల ఒక కమిటీ అనేక వినూత్నమైన విధానాలను ప్రతిపాదించింది. శాశ్వత జమీందారీ ప్రాంతాల్లో భూమి యజమాని రైతే కానీ జమీందారు కాదనీ,అందువల్ల 1802 నాటి స్థాయిలో కౌలు మొత్తాన్ని నిర్ణయించాలని ఆయన ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనవల్ల కౌలు మొత్తాలు మూడింట రెండువంతులకు తగ్గిపోవడంతో పాటు జమీందారీ వ్యవస్థ దాదాపుగా నిర్వీర్యమైపోతుంది. ప్రధాని సి.రాజగోపాలచారి ఈ నివేదికకు పూర్తి మద్దతు ప్రకటించారు. జమీందార్లకు నష్టపరిహారం చెల్లించాలన్న ప్రతిపాదనను కూడా ఆయన తిరస్కరించారు. 1939 జనవరిలో శాసనసభ ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తూ తీర్మానం చేసింది. అయితే, బిల్లుకు రూపకల్పన చేయకముందే మంత్రివర్గం రాజీనామా చేసింది.

మధ్యప్రావిన్సులు, నార్త్‌వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సు, బోంబేలలో కౌల్దారీ విధానానికి సంబంధించి అనేక సంస్కరణలు అమలు జరిగాయి. కౌలుదారుడికి భూమిపై హక్కు మరింత బలపడింది. ఈ విధంగా కాంగ్రెస్ చేపట్టిన వ్యావసాయిక చట్టాలు దేశవ్యాప్తంగా లక్షలాదిమంది కౌలుదారులకు జమీందారీ ప్రాంతాల్లో భద్రత కల్పించాయి. మరోవైపు భూస్వామ్య విధానపు మౌలికస్వరూపం దెబ్బతినలేదు. అన్నింటికీ మించి శాశ్వత,చట్టబద్ధ కౌలుదారులు ఈ మార్పులవల్ల ప్రయోజనం పొందారు.

ఉత్తరప్రదేశ్, అస్సాంలను మినహాయిస్తే అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులను రుణభారంనుంచి విముక్తిచేసేందుకు చట్టాలు తీసుకువచ్చాయి. ఈ చట్టాలు వడ్డీవ్యాపారాన్నీ, వ్యాపారులనూ అనేక విధాలుగా నియంత్రించాయి. బకాయిలు పడ్డ మొత్తంపై వడ్డీని పూర్తిగా రద్దుచేయడం కానీ బాగా తగ్గించడం కానీ జరిగింది. మద్రాసులో దీనిని 6.25 శాతం మేరకు తగ్గిస్తే బోంబే,బీహార్‌లలో 9శాతం వరకూ తగ్గించివేశారు. ఈ ప్రభుత్వాలు గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాలకు కూడా కృషిచేశాయి. బోంబేలో

40వేల 'దుబ్లా'లకు విముక్తి కల్పించాయి. అటవీ ఉత్పత్తుల వినియోగంపై విధించిన పన్నును బోంబేలో రద్దుచేస్తే, మద్రాసు ప్రభుత్వం సదరు పన్నును బాగా తగ్గించివేసింది. కౌల్దారీ బిల్లులను భూస్వాములు తీవ్రంగా వ్యతిరేకిస్తే, రైతాంగాన్ని రుణభారంనుంచి విముక్తిచేసేందుకు ఉద్దేశించిన బిల్లులను వడ్డీవ్యాపారులూ, న్యాయవాదులూ వ్యతిరేకించారు. ఇతరత్రా అంశాల్లో కాంగ్రెస్‌కు పూర్తి మద్దతుదారులైన న్యాయవాదులు ఈ విషయంలో వ్యతిరేకించడానికి కారణం-వారి ఆదాయంలో అత్యధికభాగం ఇందుకు సంబంధించిన కోర్టు లావాదేవీల ద్వారా వచ్చిపడుతుండటమే.

* * *

కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికానుకూల వైఖరిని తీసుకున్నాయి. వారి విధానం ప్రధానంగా కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ పారిశ్రామిక శాంతిని ప్రోత్సహించడం. సాధ్యమైనంతవరకూ సమ్మెలు జరగకుండా చూస్తూ, సమ్మె కట్టాల్సిన పరిస్థితులు ఏర్పడిన పక్షంలో ముందుగా మధ్యవర్తిత్వ మార్గాన్ని అనుసరించేట్టు చేయడం. కాంగ్రెస్‌మంత్రులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ కార్మికులకూ, పెట్టుబడిదారులకూ మధ్య సత్సంబంధాలు కొనసాగేట్టు చూడటం లక్ష్యం. ఇదేసమయంలో కార్మికుల పనిపరిస్థితులను మెరుగుపరచేందుకూ, వారి వేతనాల్లో పెరుగుదల సాధించేందుకూ కృషిచేయాలని కూడా కాంగ్రెస్ భావించింది. అయితే, ఈ ధోరణి భారతీయ పెట్టుబడిదారీ వర్గానికి ఆందోళన కలిగించింది. ప్రాంతీయ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ వ్యవహారాల్లో అత్యుత్సాహం ప్రదర్శించకుండా చూడాలంటే తామంతా కలసికట్టుగా వ్యవహరించకతప్పదని ఈ వర్గం భావించింది.

పదవీబాధ్యతలు స్వీకరించగానే బోంబే మంత్రివర్గం జౌళిమిల్లుల్లో పనిచేసే కార్మికులకు సంబంధించి ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ పని పరిస్థితుల్లో మెరుగుదలకు సంబంధించి అనేక సూచనలు చేయడంతోపాటు కార్మికుల వేతనాలు పెంచాలని కూడా సూచించింది. ఈ పెరుగుదల కోటిరూపాయలమేర ఉంటుంది. మిల్లు యజమానులు ఈ సూచనలను తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం వాటిని యధాతథంగా అమలు చేసింది. 1938లో నవంబరులో ప్రభుత్వం కార్మిక వివాదాలచట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రధానోద్దేశం బి.జి.ఖేర్ చెప్పినట్టుగా 'వర్గ వైషమ్యాల స్థానంలో వర్గ సహకారాన్ని' సాధించడం. ప్రత్యక్షచర్యకు బదులుగా చర్చలు, మధ్యవర్తిత్వం, రాజీమార్గంద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవడానికి ఈ చట్టం దోహదం

చేస్తుంది. ఆకస్మికసమ్మెలనూ, లాకౌట్లనూ నిరోధిస్తుంది. పారిశ్రామిక వివాదాలను పరిష్కరించే కోర్టుకు సదరు వివాదాలను బదలాయించే అధికారం ప్రభుత్వానికి కల్పిస్తుంది. సదరు కోర్టు తన అభిప్రాయాన్ని ప్రకటించేందుకు నిర్దేశించిన నాలుగునెలల కాలంలో సమ్మెలు కానీ, లాకౌట్లు కానీ ఉండవు. ఈ చట్టాన్ని కాంగ్రెస్‌లోని వామపక్షవాదులూ, కమ్యూనిస్టులూ, కాంగ్రెస్ సోషలిస్టులూ తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికులకు సమ్మెకట్టే హక్కును హరించడమే కాక, ట్రేడ్‌యూనియన్లను రిజిస్టర్ చేయడానికి అత్యంత సంక్లిష్టమైన విధానాన్ని ప్రవేశపెట్టినందుకు వీరు మండిపడ్డారు. యాజమాన్యాల ఆశీస్సులున్న ట్రేడ్‌యూనియన్లు మాత్రమే నిలదొక్కుకొనేందుకు ఈ విధానం వీలుకల్పిస్తుందని వారు వాదించారు. మద్రాస్ ప్రభుత్వం కూడా పారిశ్రామిక వివాదాలను చర్చలద్వారా పరిష్కరించుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వం అధ్వర్యంలో కొనసాగే వివిధ మధ్యవర్తిత్వ, వివాద పరిష్కార విధానాల ద్వారా ఇది సాధ్యపడుతుంది. ఉత్తరప్రదేశ్‌లో కాన్పూర్ కార్మికవివాదాలకు పెట్టింది పేరు. ప్రభుత్వం నుంచి తమకు పూర్తి అండదండలుంటాయని అక్కడి కార్మికులు భావించారు. 1938 మేనెలలో అక్కడ పెద్ద ఎత్తున సమ్మె జరిగింది. ప్రభుత్వం వెంటనే రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటుచేసింది. కార్మికులకు నెలకు 15రూపాయలు కనీసవేతనంగా ఉండాలనీ, కార్మిక వివాదాలను పరిష్కరించడానికి ఒక బోర్డును ఏర్పాటు చేయాలనీ, మహిళా కార్మికులకు అనేక హక్కులు కల్పించాలనీ, అన్ని మిల్లుల్లోనూ కార్మికులను నియమించడానికి ఒక బోర్డును ఏర్పాటు చేయాలనీ, వామపక్ష ఆధిపత్యం ఉన్న మజ్దూర్‌సభను యాజమాన్యాలు గుర్తించాలని ఈ కమిటీ సూచనలు చేసింది. అయితే, ప్రారంభంనుంచీ కమిటీకి సహకరించకుండా వస్తున్న యాజమాన్యాలు ఈ నివేదిక సూచనలను అమలు చేయడానికి కూడా అంగీకరించలేదు. ప్రభుత్వం కూడా ఊరుకోలేదు. చివరకు ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి నివేదికలోని ప్రధానమైన సూచనలను అమలు చేయడానికి యాజమాన్యాలు అంగీకరించాల్సి వచ్చింది. బీహార్‌లో కూడా 1938లో రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ఒక విచారణ కమిటీ ఏర్పడి ట్రేడ్‌యూనియన్ హక్కులను బలోపేతం చేయడం, కార్మికుల పనిపరిస్థితులను మెరుగుపరచడం, సమ్మెకు ముందు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ మార్గాల్లో సమస్యల పరిష్కానికి కృషిచేయడం వంటి సూచనలు అనేకం చేసింది.

* * *

కాంగ్రెస్ ప్రభుత్వాలు సామాజిక సంస్కరణలకూ, సంక్షేమానికీ సంబంధించి కొన్ని నిర్దిష్టమైన చర్యలు తీసుకున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఎంపికచేసిన కొన్ని ప్రాంతాల్లో మద్యనిషేధాన్ని అమలు చేశాయి. అస్పృశ్యతానివారణకూ, హరిజనుల (గాంధీ గారి 'దేవుని బిడ్డలు') సముద్ధరణకు కృషిచేశాయి. ఈ ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాల కారణంగా వారు దేవాలయాల్లో ప్రవేశించడానికీ, బావులు, చెరువులు, రహదారులు, రవాణా, ఆసుపత్రులు, విద్యాసంస్థల వంటి సామాజిక సౌకర్యాలను వినియోగించుకోవడానికీ వీలుకలిగింది. అల్పహార,భోజనశాలల్లో వారి ప్రవేశానికి వీలుకలిగింది. హరిజనులను వివక్షతతో చూసే ఏ రకమైన ఆచారాన్ని కానీ, విధానాన్ని కానీ న్యాయస్థానాలు లేదా అధికార వ్యవస్థలు ఆమోదించడానికి వీల్లేకుండా చేశాయి. హరిజన విద్యార్థులకు పెద్ద ఎత్తున ఉపకారవేతనాలూ, ఉచిత సదుపాయాలూ లభించాయి.పోలీసు, ఇతర ప్రభుత్వ సర్వీసుల్లో హరిజనులు పెద్దసంఖ్యలో ప్రవేశించడానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు కృషిచేశాయి.

ప్రాథమిక, సాంకేతిక, ఉన్నత విద్యారంగంలోనూ, ప్రజారోగ్యం, పారిశుద్ధ్య రంగాల్లోనూ ప్రభుత్వాలు కృషిచేశాయి. విద్యారంగంలో బాలికలు, హరిజనుల ప్రవేశానికి ప్రాధాన్యమిచ్చాయి. వయోజనవిద్యకోసం పెద్ద ఎత్తున పథకాలను ఆరంభించాయి. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలకు విస్తృతస్థాయిలో సబ్సిడీలను, ఆర్థిక సౌకర్యాలనూ కల్పించాయి. దేశీయ పరిశ్రమల అభివృద్ధికి దోహదం చేస్తూనే మరోవైపున వాహనాల తయారీవంటి ఆధునిక పరిశ్రమలు నెలకొనడానికి విశేషకృషిచేశాయి.

కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ బోస్ నియమించిన జాతీయ ప్రణాళికా కమిటీ సహకారంతో వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి విధానం కోసం కృషిచేశాయి.

* * *

జాతీయోద్యమంలో, ప్రజాపోరాటాలు లేని దశల్లో కూడా రాజకీయ కార్యక్రమం ప్రజల మధ్య చురుకుగా కొనసాగుతూనే ఉండాలనీ, ప్రజాసమీకరణ విస్తృతస్థాయిలో సాగుతూనే ఉండాలన్నది కాంగ్రెస్ వ్యూహంలోని మౌలికమైన అంశం. ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులుగా ఉంచుతూ, వారిని సంఘటితం చేయడమన్నది చట్టపరిధిలోనే అయినప్పటికీ నిరంతరంగా కొనసాగాల్సిన ప్రక్రియ. వాస్తవానికి కాంగ్రెస్ అధికారాన్ని స్వీకరించింది కూడా ప్రజల్లో తన రాజకీయకార్యకలాపాలను మరింత

బలోపేతం చేసుకోవడానికే. ఉదాహరణకు కాంగ్రెస్ అధ్యక్షహోదాలో జవహర్‌లాల్‌నెహ్రూ 1937 జూలై 10వతేదీన కాంగ్రెస్‌వారికి ఒక సర్క్యులర్ పంపిస్తూ ఈ విషయాన్ని గుర్తుచేశారు. సంస్థాగత కార్యకలాపాల్లోనూ, ఇతరత్రా కార్యక్రమాల్లోనూ కాంగ్రెస్ తలమునకలుగా పనిచేయాల్సిన అవసరాన్ని తెలియచెబుతూ, చట్టసభలకు ఆవల అటువంటి కృషి జరగనిపక్షంలో చట్టసభ లోపల జరుగుతున్న ప్రయత్నానికి విలువలేకుండా పోతుందని హెచ్చరించారు. ఈ రెండు రకాల కార్యకలాపాలూ పరస్పరం సమన్వయంతో జరగాలనీ, ప్రజలకు ఎప్పటికప్పుడు మనం చేస్తున్నదేమిటో తెలియాలనీ, వారు ఆశిస్తున్నదేమిటో మనకు తెలియాలని ఆయన సూచించారు.

ప్రజారాజకీయ కార్యకలాపాలు ఏ విధమైన రూపాల్లో సాగాలన్నది ఇప్పుడు ప్రశ్న. దానితోపాటుగా, చట్టసభల్లోనూ, కార్యనిర్వాహక వ్యవస్థలోనూ సాగే పనిని దానితో సమన్వయపరచడం ఎలా అన్నది మరో ప్రశ్న. వీటన్నింటికంటే ముఖ్యంగా, ప్రజలను విశేషంగా ఆకర్షించే ఉద్యమాలకు సంకల్పించినప్పుడు- ఒకవేళ అవి చట్టాన్ని అతిక్రమించిన పక్షంలో- ప్రభుత్వాలు అనుసరించాల్సిన వైఖరి ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కుందామన్నా, అనుసరిద్దామన్న చరిత్రలో అటువంటి దృష్టాంతాలు లేవు. దీనితోపాటుగా, వివిధ ప్రావిన్సులకు వేరువేరు పరిష్కారాలు కనిపించాయి. ఇక్కడ మనం ఒక విషయాన్ని ప్రస్తావించుకోవాలి. దురదృష్టవశాత్తూ ఈ అంశాన్ని చరిత్రకారులు లోతుగా అధ్యయనం చేయలేదు. ఉత్తరప్రదేశ్‌కు సంబంధించి విశాలాక్షీ మీనన్ మాత్రం దీనిని కొంతవరకూ పరిశీలించారు. ఆమె చెప్పిన ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లో పరిపాలన- శాసనసభాపరమైన కార్యకలాపాలకూ, పార్లమెంటేతర పోరాటాలకూ మధ్య అద్భుతమైన సమన్వయం సాధించడం జరిగింది. విభిన్నరూపాల్లో ప్రజలను విస్తృతస్థాయిలో సమీకరించడంలో కాంగ్రెస్ విజయం సాధించింది. గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేయడం నుంచి కాంగ్రెస్ పోలీస్‌స్టేషన్లు, పంచాయితీల వంటివి ఏర్పరిచి స్థానిక కాంగ్రెస్ కమిటీల ద్వారా ప్రజలకు న్యాయం చేకూర్చడం వరకూ కార్యకలాపాలు సాగాయి. స్థానిక అధికారులకూ, మంత్రులకూ పెద్ద ఎత్తున విజ్ఞాపనపత్రాలు సమర్పించడం వంటి కార్యక్రమాలతోపాటుగా, స్థానిక సమస్యలను ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకురావడానికి వీలుగా ప్రత్యేక కమిటీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియచెప్పడానికి కొన్ని బృందాలు కృషిచేశాయి. దినోత్సవాలూ, వారోత్సవాలూ నిర్వహించడానికి

గ్రామస్థాయినుంచి రాష్ట్రస్థాయివరకూ ప్రత్యేక సమావేశాలు జరిగేవి. ప్రజలను సమీకరించడానికి ఉద్దేశించిన ఇటువంటి అనేక కార్యకలాపాల్లో రాష్ట్రస్థాయి నాయకులూ,మంత్రులతోపాటు జాతీయస్థాయి నాయకులూ, మంత్రులూ కూడా పాలుపంచుకున్నారు. అయితే, అన్ని రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలూ ఈ విధంగా పరిపాలనకూ, ప్రజా సమీకరణకూ మధ్య సమన్వయాన్ని సాధించలేకపోయి ఉండవచ్చును. ఈ అంశానికి సంబంధించి మరింత విస్తృతమైన అధ్యయనం సాగినప్పుడే మనకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంది. ముఖ్యంగా, కాంగ్రెస్‌లో మితవాదపక్షం బలంగా ఉన్న ప్రాంతాల్లోనూ, అటువంటి ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లోనూ ఈ పరిస్థితి ఉండవచ్చు. ఇదలా ఉంచితే, చివరకు ఉత్తరప్రదేశ్‌లో కూడా 1939నాటికి ఈ ప్రజాసమీకరణ కార్యకలాపాలు వాసిలోనూ,రాశిలోనూ పలుచబడటం మనకు కనిపిస్తుంది.

ఇదేసమయంలో, మరో అంశంలో కూడా సందిగ్ధపరిస్థితి ఏర్పడింది. చట్టసభలకు వెలుపల జరిగే రాజకీయకార్యక్రమంలో పోరాటాలు చేయడం తప్పనిసరి. మరి, ఒక ఉద్యమం తనకు వ్యతిరేకంగా తానే పోరాటాలను నిర్వహించడం సాధ్యపడుతుందా?, అంతేకాదు, ఒక పార్టీ అధికారంలో కొనసాగుతూనే మరోపక్కన ఉద్యమాలను కూడా నిర్వహిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించడం సాధ్యపడే పనేనా? ఒకవేళ, కొన్ని నిరసనపోరాటాలు హింసాయుతంగా మారినా, హక్కులు హద్దులుదాటినా చేయవలసింది ఏమిటి? ఉద్యమంలో అంతర్భాగంగా ఉంటూనే అధికారంలో ఉన్న ఒక విభాగం ఇటువంటి పరిస్థితుల్లో ఏ విధంగా స్పందించాలి? చేసిన చట్టాలను సవ్యంగా, సక్రమంగా అమలు జరిగేట్టు చూడటం ప్రభుత్వ విధి. ఆ ప్రభుత్వం సామ్రాజ్యవాద, జాతీయవాద, వామపక్ష, మితవాద, మధ్యేవాదుల్లో ఎవరిదైనప్పటికీ దాని బాధ్యత అది నిర్వహించవలసిందే కదా!. ఇక, మరోకోణంలో చూస్తే, ఒక జాతీయోద్యమానికి నాయకత్వం వహిస్తున్న పార్టీ తన సమర్థత నిరూపించుకుంటూ, ప్రజల్లో తన ప్రాభవాన్ని పెంచుకోవడం కోసం కృషిచేస్తూనే, మరోవైపు తన పరిపాలనాదక్షత కూడా ప్రదర్శించవలసి ఉంటుంది. అయితే, అమలులో ఉన్నవి సామ్రాజ్యవాద చట్టాలు. సామ్రాజ్యవాదాన్ని కూలదోయడానికి కంకణం కట్టుకున్న వారే స్వయంగా అవే చట్టాలను ప్రయోగించడం సమంజసంగా ఉంటుందా?. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎంతో కాలం ఓపికగా నిరీక్షించే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ప్రభుత్వాలు మావేనంటూ పరిపూర్ణంగా విశ్వసిస్తున్న ప్రజలు సాధ్యమైనంత త్వరగా తమ సమస్యల పరిష్కారం

కోసం ఒత్తిడి చేయకమానరు. మరోపక్కన మంత్రివర్గాలు కూడా ఎంత కృషిచేసినప్పటికీ సమస్యలను వేగంగా పరిష్కరించలేని స్థితిలో ఉన్నాయి. రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తున్న కారణంగా అనేక పరిమితుల మధ్య వ్యవహరించక తప్పడం లేదు. అహింసా విధానాన్ని విశ్వసిస్తున్న కాంగ్రెస్‌వాదులకు ఈ పరిస్థితులతో సులభంగా వ్యవహరించవచ్చునన్న నమ్మకం ఉన్నప్పటికీ, అహింసాయుత విధానంలో అంతటి విశ్వాసంలేని కాంగ్రెస్‌లోని ఇతరవర్గాలు– ఉదాహరణకు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, రాయిస్టులు,విప్లవకర ఉగ్రవాదులు–మరోవిధమైన అభిప్రాయంతో ఉన్నారు. పౌరహక్కులూ, స్వేచ్ఛ విస్తరించి ఉన్న ప్రస్తుత స్థితిని ఉపయోగించుకుని ప్రజల్లో పోరాటధోరణిని మరింత తీవ్రతరం చేయాలనీ, అవసరమైతే హింసాయుత పోరాటాలకు కూడా వారిని సమాయత్తం చేయాలని వారు భావించారు. అయితే, హింసాయుత ఉద్యమ విధానాలను ప్రోత్సహించడం మాట పక్కనపెట్టినా, కనీసం అటువంటిని సహించి భరించడమన్నది ప్రభుత్వంలో ఉండగా సాధ్యపడుతుందా?

మరొక సమస్య కూడా ఉంది. చాలామంది కాంగ్రెస్‌వాదులు కాంగ్రెస్ మంత్రివర్గాలు తమవిగా భావిస్తూ, వాటిని నిలబెట్టి ఉంచడంతో పాటు, ప్రజా ఉద్యమాలద్వారా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం కూడా తమ బాధ్యతగా భావించి సదరు ప్రభుత్వాలు తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సివచ్చే పరిస్థితులు కల్పించకుండా జాగ్రత్తపడవచ్చు. కానీ,, ఇతరులు– కనీసం కొంతమంది అయినా– ఇందుకు భిన్నంగా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్‌మంత్రివర్గాలు ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేశాయనీ, ప్రజలకు చేసిన ప్రమాణాలను అవి ఉల్లంఘించాయనీ నిరూపించేందుకు వచ్చిన అవకాశంగా వారు భావించవచ్చును. కాంగ్రెస్ అసలు రంగును బైటపెడుతూ అది ఉన్నతవర్గాల రాజకీయసంస్థగా, ప్రజా ఉద్యమాలకు సంబంధించినంతవరకూ దానికీ, సామ్రాజ్యవాదపాలకులకూ తేడా ఏమీలేదని రుజువుచేసేందుకూ వారు ప్రయత్నించవచ్చును. మరోవైపున, కాంగ్రెస్‌వారు తీవ్రవిమర్శకులనూ, మిలిటెంట్ స్వభావం ఉన్నవారినీ ఉద్యమాన్ని పెడదోవపట్టించేవారుగా, ప్రజలు తమ భావాలను తీవ్రస్థాయిలో వ్యక్తపరిచినపక్షంలో పరిస్థితి చేజారిపోతున్నట్టుగా భావించవచ్చును.అంతేకాదు, సి. రాజగోపాలచారి, కె. ఎమ్.మున్షీవంటి కాంగ్రెస్‌నాయకులు అణచివేతకోసం తమ రాష్ట్రాల్లో అధికారవ్యవస్థలను వినియోగించడానికి కూడా వెనుకాడరు. దురదృష్టకరమైన విషయమేమంటే, ఈ సందిగ్ధస్థితిని చరిత్రకారులు అన్నికోణాలనుంచీ లోతుగా పరిశీలించడం జరగలేదు.

కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పడటం, పౌరహక్కులు విస్తృతంగా లభించడం వల్ల ప్రతిచోటా ఒక్కసారిగా తెలియని ఉత్సాహం, విపరీతమైన చైతన్యం వచ్చింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో కిసాన్‌సభలు పుట్టుకొచ్చాయి. ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాలు జోరందుకున్నాయి. వాటి సభ్యత్వం పెరిగింది. విద్యార్థి యువజన సంఘాలు బలోపేతమై వారి ఉద్యమాలు ఊపందుకున్నాయి. వామపక్షపార్టీలు బలపడి, విస్తరించాయి. కమ్యూనిస్టుపార్టీపై కేంద్రప్రభుత్వపు నిషేధం ఉన్నప్పటికీ కూడా అది తన వారపత్రిక 'ది నేషనల్ ఫ్రంట్'ను నిర్విఘ్నంగా ప్రచురించుకోగలిగింది. కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ తన 'ది కాంగ్రెస్ సోషలిస్టు'ను తీసుకురావడం ప్రారంభిం చింది. దేశవ్యాప్తంగా వివిధ భారతీయభాషల్లో అనేక పత్రికలు విడుదలకావడం ఆరంభమైంది. వీటిలో ప్రధానంగా ఒక ఉదాహరణగా చెప్పుకోవలసింది పంజాబ్‌కు చెందిన కీర్తి కమ్యూనిస్టులు ప్రచురించే 'కీర్తి లెహర్' గురించి. కేంద్రపాలిత ప్రాంతంగా పంజాబ్ ఉన్నకారణంగా వీరు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌నుంచి దీనిని ప్రచురించడం ప్రారంభించారు.

అనుకున్నట్టుగానే, చాలా ఉద్యమాలు కాంగ్రెస్ ప్రభుత్వాలతో ఘర్షణపడ్డాయి. రైతు ఉద్యమాలు ప్రధానంగా భారీ ప్రదర్శనలకూ, పాదయాత్రలకూ పరిమితమైనప్పటికీ, బీహార్‌లో మాత్రం పరిస్థితి మారిపోయింది. ఇక్కడి రైతు ఉద్యమం ప్రభుత్వంతో తీవ్రస్థాయి ఘర్షణకు దిగింది. కౌలు చెల్లించవద్దనీ, భూస్వాములనుంచి భూములు లాక్కోమనీ కిసాన్‌సభ రైతులకు పిలుపునివ్వడంతో వ్యవహారం చెడింది. చిన్న,పెద్ద భూస్వాములపై భౌతికదాడులు కూడా జరిగాయి. పంటలను లూటీచేయడం కూడా కొన్నిచోట్ల జరిగింది. సహజానంద్ ఇచ్చిన 'లగాన్ లేంగే కైసే, డండా హమారా జిందాబాద్' (శిస్తు ఎలా వసూలు చేస్తావు... లాఠీ జిందాబాద్), 'లాఠీ మేరే సాథీ' (లాఠీ నాకు తోడు) వంటి కొన్ని నినాదాలను ఈ కాలంలో కిసాన్‌సభలు బహుళప్రచారంలోకి తీసుకువచ్చాయి. ఈ రకమైన ఘర్షణ కారణంగా బీహార్ కిసాన్‌సభకూ, అక్కడి కాంగ్రెస్ నాయకత్వానికీ మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి.

బోంబేలో ఎఐటియుసి, కమ్యూనిస్టులూ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అనుచరులూ 1938 నవంబరు 7న పారిశ్రామిక వివాదాల చట్టానికి వ్యతిరేకంగా సమ్మెకు పిలుపునిచ్చారు. మొత్తం 77 బట్టలమిల్లుల్లో 17 మిల్లుల్లో ఈ సమ్మె నిర్వహించారు. సమ్మె సందర్భంగా కొన్ని విపరీతధోరణులు చోటు చేసుకున్నాయి. రెండు మిల్లుల్లో కార్మికులు రాళ్ళు విసిరిన కారణంగా కొందరు పోలీసులు గాయపడ్డారు. పోలీసులు

కాల్పులు జరిపినప్పుడు ఇద్దరు మరణించారు, సుమారు 70మంది గాయపడ్డారు. మద్రాసులో కూడా అక్కడి ప్రభుత్వమూ, ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ సమ్మెలపై కఠినమైన వైఖరే అనుసరించింది. అక్కడకూడా కొన్ని సమ్మెలు హింసకు దారితీశాయి. కాన్పూర్‌లో కార్మికులు అనేక పర్యాయాలు సమ్మెలు చేశారు. కొన్ని సందర్భాల్లో హింసాయుతంగా వ్యవహరిస్తూ పోలీసులపై కూడా దాడులు చేశారు. అయితే, కాంగ్రెస్ వారికి మద్దతుగా నిలబడింది.

చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రివర్గాలకు తాము ఏ విధంగా వ్యవహరించాలో తెలియకుండా పోయింది. మధ్యవర్తిత్వం నెరిపే వారి ప్రయత్నం ఉత్తరప్రదేశ్‌లోనూ, బీహార్‌లోనూ, కొంతమేరకు మద్రాస్‌లోనూ విజయవంతమైంది కానీ, బోంబేలో తీవ్రంగా విఫలమైంది. మొత్తంమీద వారు తాము నిర్వహించిన పాత్రపై వామపక్షవాదుల విమర్శలను ఎదుర్కొనకతప్పలేదు. మిలిటెంట్ ఉద్యమాలను, ముఖ్యంగా ట్రేడ్‌యూనియన్ ఉద్యమాలను కాంగ్రెస్‌మంత్రివర్గాలు చాలావరకూ శాంతిభద్రతల సమస్యగానే చూడటం జరిగింది. దానికి అనుగుణంగానే సెక్షన్ 144 విధించడం, రైతులనూ, ట్రేడ్‌యూనియన్ నాయకులనూ అరెస్టులు చేయడం వంటి విధానాలను అమలు చేశాయి. చివరకు కాన్పూర్‌లో కూడా అరెస్టులు జరిగాయి.

కాంగ్రెస్ మంత్రివర్గాలు వ్యవహరించిన తీరుపై జవాహర్‌లాల్‌నెహ్రూ తన సన్నిహితులవద్ద అసంతృప్తి వ్యక్తంచేశారు. అయితే, ప్రజాముఖంగా అందుకు భిన్నమైన వైఖరి అనుసరించారు. 'మనకు వ్యతిరేకంగా మనమే ఆందోళనలు చేయకూడదు' అని వ్యాఖ్యానించారు. 'మనమంతా కలసికట్టుగా మన మంత్రివర్గాలపై వస్తున్న కువిమర్శలను తిప్పికొట్టాలి' అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌మంత్రివర్గాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలను నిలువరించేందుకు వాటిని ఖండిస్తూ 1938 సెప్టెంబర్‌లో ఎ ఐసిసి ఒక తీర్మానం చేసింది. 'పౌరహక్కుల పేరుతో హత్యలు, లూటీలు,వర్గపోరాటాలను, హింసాయుత విధానాలను ప్రోత్సహించిన కొంతమంది కాంగ్రెస్‌వాదుల' తీరుతెన్నులను ఈ తీర్మానం విమర్శించింది. 'ప్రజల ఆస్తులను, ప్రాణాలను కాపాడేందుకు వీలుగా మంత్రివర్గాలు తీసుకునే చర్యలకు' మద్దతు ప్రకటించింది.

ప్రజాందోళనలను అణచివేసే విషయంలో కాంగ్రెస్‌మంత్రివర్గాలు అనుసరించిన వైఖరిని వామపక్షం తీవ్రంగా నిరసించింది. కార్మిక,కర్షక ఉద్యమాలను అణచివేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని విమర్శించింది. కాంగ్రెస్‌మంత్రివర్గాలపై కమ్యూనిస్టులు చేసిన

విమర్శలను ఆర్. పామేదత్ ఈ విధంగా వివరించారు. 'కాంగ్రెస్ మంత్రివర్గాల రెండేళ్ళ పాలన అప్పటికే రాజీధోరణి ప్రదర్శిస్తున్న ఒక నాయకత్వం సామ్రాజ్యవాద అధికారచట్రంలో భాగస్వామిగా ఉంటే ఏ విధంగా వ్యవహరిస్తుందో స్పష్టంగా తెలియచెప్పింది. కాంగ్రెస్ మంత్రివర్గాల్లోనూ, యంత్రాంగంలోనూ ఆధిపత్యం ఉన్న మితవాద నాయకత్వం సామ్రాజ్యవాద అనుకూలవైఖరిని మరింతగా కనబరుస్తూపోతోంది. ఉన్నతవర్గ భూస్వాములకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, వారి ప్రయోజనాలను పరిరక్షిస్తూ, అన్ని రకాల ప్రజా ఉద్యమాలకూ వ్యతిరేకంగా వ్యవహరించడానికి నిర్ణయించుకుంది...దీనితో, జాతీయోద్యమంలో ఒక కొత్తసంక్షోభం తలెత్తుతోంది'.

మంత్రివర్గాల ఏర్పాటు ఒక కొత్త సంక్షోభానికి దారితీస్తున్నదని గాంధీజీ కూడా భావించారు. అయితే, ఆయన దృక్కోణం కమ్యూనిస్టులకు పూర్తిగా భిన్నమైనది. మిలిటెంట్ ఉద్యమాలను ఆయన ఆదిలోనే వ్యతిరేకించారు. వాటిలో అంతర్గతంగా ఉన్న హింసాయుత స్వభావం ఆయన అనుసరించే అహింసాయుత వ్యూహానికి పూర్తిగా భిన్నమైనది. కాంగ్రెస్‌మంత్రివర్గాలు ఏర్పడగానే పోలీసులూ, మిలటరీ లేకుండా పాలనసాగించాల్సిందిగా సూచించిన విషయం మనకు తెలుసు. ఆ తరువాత ఆయన 'హింసను ప్రోత్సహించే ప్రసంగాలూ, రచనలూ పౌరహక్కులను పరిరక్షించడం కాద'ని వాదించనారంభించారు. ఉద్యమాల్లో ఉన్న తీవ్రతనూ, హింసావిధానాన్నీ నిరసిస్తూనే, ఈ లక్షణాల కారణంగా మంత్రివర్గాలు తమకు అందుబాటులో ఉన్న చట్టపరమైన చర్యలను ప్రయోగించడాన్ని సమర్థిస్తూనే, ప్రజా ఉద్యమాలను నియంత్రించడానికి తరచుగా సామ్రాజ్యవాద చట్టాలను, విధానాలనూ, వ్యవస్థలను కాంగ్రెస్‌మంత్రివర్గాలు ఉపయోగించుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. హింసాయుత విధానాల విషయంలో ప్రజలకున్న రాజకీయపరిణతిని విశ్వసించవలసిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మద్రాస్ ప్రభుత్వం నేరశిక్షాస్మృతిలో చేసిన సవరణలను విమర్శించారు. వామపక్షవాదులు వర్గ హింసను ప్రోత్సహించడాన్ని గర్హిస్తూనే, వామపక్షవాదులపై మితవాదుల దాడిని నిలువరించేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ విధానాలకు లోబడి రాజకీయాలు నిర్వహించుకునే హక్కు వామపక్షవాదులకు, సోషలిస్టులకు ఉందని ఆయన పదేపదే స్పష్టంచేస్తూవచ్చారు. ఉద్యమాలతో వ్యవహరించే విషయంలో కాంగ్రెస్ మంత్రివర్గాలు పదేపదే శాంతిభద్రతల యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్న కారణంగా ప్రజల్లో

కాంగ్రెస్‌కున్న బలం క్షీణించిపోతోందని ఆయన చాలాముందుగా పసిగట్టారు. ఈ పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా మలిదశ ఉద్యమాన్ని నిర్మించగలిగే అవకాశాలు ఉండవని ఆయన భావించారు. ఈ సందిగ్ధ పరిస్థితిని విశ్లేషిస్తూ, సూచనలు చేస్తూ 1938-39 మధ్యకాలంలో 'హరిజన్'లో ఆయన అనేక వ్యాసాలు రాశారు. అధికారపదవులను ఆమోదించే విధానాన్ని ఇంకా కొనసాగించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించడం ప్రారంభించారు. 1938 డిసెంబరులో ఆయన ఈ విధంగా రాశారు. 'పోలీసు,మిలటరీ సహాయం లేకుండా పరిపాలన సాగించడం అసాధ్యమని కాంగ్రెస్‌మంత్రివర్గాలు ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చేసినపక్షంలో, ఇక అధికారాన్ని వదిలిపెట్టాల్సిన తరుణం అసన్నమైనట్టే'.

* * *

కాంగ్రెస్ మంత్రివర్గాలు అధికారంలో ఉన్న కాలంలో కాంగ్రెస్‌లోని అనేక బలహీనతలు స్పష్టంగా కనిపించాయి. ముఠాతగాదాలు, వ్యక్తిగత సైద్ధాంతిక అహంకారాలూ బైటపడ్డాయి. మధ్యప్రావిన్సుల్లో కాంగ్రెస్ మంత్రివర్గానికీ, అసెంబ్లీ పార్టీకి మధ్య విభేదాలు తలెత్తిన కారణంగా ప్రధాని ఎన్.బి.ఖారే రాజీనామా చేయాల్సివచ్చింది. కాంగ్రెస్‌లో బోగస్‌సభ్యత్వం జోరుగా సాగింది. ఉద్యోగాలకోసం, అధికారాలకోసం,స్వ ప్రయోజనాలకోసం వెంపర్లాట ఆరంభమైంది. 'తెప్పలుగ చెరువునిండిన...' అన్నట్టుగా ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చుట్టూ చేరే అవకాశవాదులు కాంగ్రెస్‌లోని అన్ని స్థాయిల్లోకీ ప్రవేశించారు. చాలామంది కాంగ్రెస్‌వారు అధికారంకోసం కులాన్ని వాడుకోవడం ఆరంభమైంది.

గాంధీజీ ఈ పరిస్థితిపట్ల తీవ్ర ఆవేదన పడ్డారు. 'మనం లోలోపలే కుళ్ళికృశించిపోతున్నాం'అని హెచ్చరిస్తూ, కాంగ్రెస్‌వాదుల్లో పెరిగిపోతున్న అవినీతిని దునుమాడుతూ హరిజన్‌లో అనేక వ్యాసాలు రాశారు. 'అవినీతి మయమైపోయిన కాంగ్రెస్‌ను నిలబెట్టేకన్నా, దానికి సగౌరవంగా సమాధికట్టడమే ఉత్తమం' అని ఆయన 1939 మేనెలలో తనను చూడటానికి వచ్చిన గాంధీ సేవాసంఘ్ కార్యకర్తలతో వ్యాఖ్యానించారు. అంతకుముందు 1938 నవంబరులో ఆయన హరిజన్‌లో ఈ విధంగా రాశారు. 'కాంగ్రెస్ తన చెడును వదులుకోలేని పక్షంలో అది ఇప్పుడు దక్కిన అధికారంతోనే అంతమైపోయే అవకాశాలున్నాయి. మనం వాస్తవంగా చేయాల్సిన పోరాటాన్ని చేయగలిగే పరిస్థితుల్లో అది ఉండదు'. ప్రజా ఉద్యమంలేని దశలో ఉద్యమం బలహీనంగా

ఉండటమూ, కాంగ్రెస్‌వారి నైతికస్థైర్యం అథమస్థాయిలో ఉండటమూ సహజమేనన్న విషయం ఆయనకు తెలుసు. అందువల్లే, కాంగ్రెస్‌వారు అధికారపదవులు వదులుకుని మరో సత్యాగ్రహానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు. కాంగ్రెస్‌మంత్రివర్గాలు సకారత్మకమైన పాత్రను నిర్వహించడంలో కొద్దికాలంగా వైఫల్యం చెందుతున్నట్టు ఆయన భావించారు. 1938 ఏప్రిల్ 28న ఆయన గాంధీజీకి ఒక లేఖ రాశారు. 'కాంగ్రెస్‌మంత్రివర్గాలు ప్రభావవంతంగా పనిచేయలేకపోతున్నాయి. తాము చేయగలిగి ఉండికూడా చేయలేని స్థితికి జారుకున్నాయి. సాంప్రదాయిక విధానాలనే అనుసరిస్తూ దానిని సమర్థించే ప్రయత్నం కూడా ఎక్కువైంది. ఇది తప్పుడు ధోరణే అయినప్పటికీ కొంతవరకూ సహించి భరించవచ్చు. కానీ, దీనిని మించిన సమస్య ఏమిటంటే, మనం ఇప్పటివరకూ ఎంతో కష్టపడి సాధించి నిలబెట్టుకున్న ఉన్నతమైన స్థానాన్ని, గౌరవాన్ని ప్రజల్లో కోల్పోతున్నాం. ఏ రోజుకారోజు అవకాశవాదంతో వ్యవహరించే ఒక సాధారణ రాజకీయనాయకుల స్థాయికి మనం దిగజారిపోతున్నట్టుగా నాకు అనిపిస్తోంది'.

1939 అక్టోబర్‌లో కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేశాయి. రెండవ ప్రపంచయుద్ధం తెచ్చిపెట్టిన రాజకీయసంక్షోభం ఇందుకు కారణమైనప్పటికీ గాంధీజీ మరోకారణంతో ఈ పరిణామాన్ని స్వాగతించారు. ఈ నిర్ణయంతో కాంగ్రెస్‌కు పట్టిన అవినీతి చీడ తొలిగిపోతుందని ఆయన సంతోషించారు. 1939 అక్టోబర్ 23న ఆయన సి. రాజగోపాలాచారికి ఒక లేఖ రాస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'ఇది పూర్తిగా మనమంచికే జరిగిందని నా నమ్మకం. ఇది చేదుమాత్రన్న విషయం నాకు తెలుసు. కానీ, ప్రస్తుతం దానిని మింగకతప్పదు. శరీరంలో ఉన్న పరాన్నజీవులను నిర్మూలించాలంటే చేదుగుళిక మింగాల్సిందే'. కాంగ్రెస్ మంత్రివర్గాల రాజీనామాలు మరో సానుకూలపరిణామాన్ని కూడా తీసుకువచ్చాయి. యుద్ధంలో పాల్గొనే అంశంలో ఒక ఉమ్మడి విధానాన్ని అనుసరించిన కారణంగా కాంగ్రెస్‌లోని అతివాద,మితవాద నాయకులు పరస్పరం చేరువయ్యారు.

* * *

మొత్తంమీద చూస్తే, కాంగ్రెస్ మంత్రివర్గాలు శాసనసభా వ్యవహారాల్లోనూ, పరిపాలనారంగంలోనూ నిర్వహించిన పాత్ర ప్రశంసాపూర్వకమైనదే. 1944లో

ఆర్.కప్లాండ్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'భారతదేశంలోని సామాజిక వెనుకబాటుతనాన్ని నిర్మూలించాలంటే స్వపరిపాలన ఉండాల్సిందేనన్న వాదన నూరుశాతం నిజమని దీనితో రుజువైంది'. కాంగ్రెస్‌మంత్రివర్గాల పనితీరును తీవ్రంగా విమర్శించిన నెహ్రూ సైతం 1944 లో ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'ఓసారి వెనక్కుతిరిగిచూస్తే, కాంగ్రెస్ మంత్రివర్గాలు ఎన్నో పరిమితులు, అననుకూల పరిస్థితుల మధ్యకూడా స్వల్పకాలంలో ఇంత చక్కటి విజయాలు సాధించడం ఆశ్చర్యంగా ఉంది'.

కాంగ్రెస్ మంత్రివర్గాలు ఎంతో కొంతమేరకైనా తమ ఎజెండాను పూర్తిచేయడంలో విజయంసాధించాయి. అవి సాధించిన విజయాల్లో ప్రధానమైన ఒక అంశం–మతపరమైన ఘర్షణల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించడం. ఈ విషయంలో వెనక్కుతగ్గవద్దంటూ జిల్లా మేజిస్ట్రేట్లకూ, పోలీసు అధికారులకూ కాంగ్రెస్ ప్రభుత్వాలు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చాయి.

రాజ్యాంగసంస్కరణల ద్వారా జాతీయోద్యమాన్ని నిర్వీర్యం చేయాలన్న సామ్రాజ్యవాద కుట్రను కాంగ్రెస్‌నాయకత్వం భగ్నం చేసింది. ఒకపక్కన, సంపూర్ణ రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ఉద్దేశించిన ఒక మహోన్నతమైన ఉద్యమం ఏమాత్రం దెబ్బతినకుండా చూసుకుంటూ, మరోపక్కన, తనకు లభించిన స్వల్పకాలిక అధికారాన్ని ఆ ఉద్యమం బలపడటానికి వీలుగా సద్వినియోగ పరచడంలో కాంగ్రెస్ విజయం సాధించింది. కొన్ని బలహీనతలు ఉన్నప్పటికీ, అధికారాంతంలో కాంగ్రెస్ బలపడిందే కానీ బలహీనపడలేదు. దైనందిన పరిపాలనావ్యవహారాల్లో నిండామునిగిపోయి ఉన్న కారణంగా, వాస్తవానికి ఉద్యమం బలహీనపడాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగానే జరిగింది. ప్రజల్లో జాతీయావేశాన్ని రెచ్చగొట్టడానికీ, జాతీయవాదుల ప్రాబల్యం విస్తరించడానికీ, భవిష్యత్తులో విస్తృత ప్రజోద్యమాన్ని నిర్మించడానికీ అధికారపదవులు దోహదం చేశాయి. అంతేకాదు, ఉద్యమప్రభావం అధికారస్వామ్యంలోకి కూడా వ్యాపించింది. ముఖ్యంగా దిగువస్థాయి ప్రభుత్వోద్యోగులు అపరిమితంగా ప్రభావితులైనారు. మరోపక్కన, బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు మూలస్తంభంగా ఉన్న 'ఇండియన్ సివిల్ సర్వీస్' మనోధైర్యం బాగా సడలింది. చాలామంది ఐసిఎస్ అధికారులు బ్రిటిష్‌వారు ఈ దేశాన్ని విడిచిపెట్టిపోయే రోజులు దగ్గరపడ్డాయని భావించడం ఆరంభించారు. తరువాతికాలంలో కూడా, ముఖ్యంగా క్విట్ ఇండియా ఉద్యమకాలంలో కాంగ్రెస్ మరోమారు అధికారంలోకి రావచ్చునన్న భయం కాంగ్రెస్‌కు ఎన్నోరకాలుగా

మేలు చేసింది. అప్పటివరకూ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ, సామ్రాజ్యవాదులకు కొమ్ముకాస్తున్న వర్గాలు (భూస్వాములు–అధికారులూ కూడా) కనీసం తటస్థవైఖరిని అవలంబించడానికి ఇది దోహదం చేసింది. 1935 భారత రాజ్యాంగచట్టంలో రాష్ట్రాలకు అధికారాలు ఇచ్చినందువల్ల దేశసమైక్యతా భావన దెబ్బతింటుందన్న సామ్రాజ్యవాదుల ఆలోచనకూడా ఆయా రాష్ట్రాల్లోని మంత్రివర్గాలు కలసికట్టుగా వ్యవహరించినందువల్ల నెరవేరలేదు. ముఠాతగాదాలు ఉన్నప్పటికీ, ఒక సంస్థగా కాంగ్రెస్ క్రమశిక్షణతోనే వ్యవహరించింది. ఉన్నతస్థానాల్లో ఈ విభేదాలు హద్దులుదాటకుండా చూడటంలో అధినాయకత్వం నిర్దాక్షిణ్యంగానే వ్యవహరించింది. అధికారపదవులు వదులుకోవాలని నిర్ణయించినప్పుడు, పదవులను స్వీకరించడమన్నది ఉద్యమంలో ఒక దశ మాత్రమేనన్న విధానానికి అనుగుణంగానే అందరూ వ్యవహరించారు. దేశవ్యాప్తంగా రాజకీయసంక్షోభం ఏర్పడగానే, కాంగ్రెస్ అధి నాయకత్వం ఆదేశించగానే, మంత్రివర్గాలు వెంటనే రాజీనామాలు సమర్పించాయి. అవకాశవాదులు కూడా విడిచిపోవడం ఆరంభించారు. 'అధికారం కోసం,పదవులకోసం కాంగ్రెస్ వెంపర్లాడటం లేదనీ, దేశప్రజల సముద్ధరణకూ, విదేశీశక్తులను ఈ దేశంనుంచి వెళ్లగొట్టేందుకూ అది కంకణం కట్టుకుందనీ ఈ చర్య స్పష్టంచేసింది. కాంగ్రెస్ వైఖరి మీద అనుమానాలు ఉన్నవారికి మంత్రివర్గాల రాజీనామా తప్పకుండా కళ్ళు తెరిపిస్తుంది' అని అప్పటి కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి వ్యాఖ్యానించారు.

మితవాదులూ, అతివాదుల మధ్య చీలికతేవాలని 1934నుంచి బ్రిటిష్ పాలకులు చేస్తున్న ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ వమ్ముచేయగలిగింది. ఈ రెండు గ్రూపులూ పరస్పరం వాదులాడుకున్నా, కీచులాడుకున్నా సమైక్యంగానే ఉండటంతో పాటు మరింత దగ్గరకావడం కూడా సంభవించింది. త్రిపురి సంక్షోభం మనకు ఈ విషయాన్ని స్పష్టంచేస్తుంది.

అన్నింటికీ మించి, కాంగ్రెస్ అన్ని వర్గాల్లోనూ తన ప్రభావాన్ని విస్తరించుకుంది. భారత సమాజంలో కాంగ్రెస్ విస్తరించి, జాతీయవాద స్పృహ బలపడింది. బ్రిటిష్ ఆధిపత్యాన్ని సవాలు చేయడం అసాధ్యమన్న వలసపాలకుల సిద్ధాంతాన్ని ప్రజా ఉద్యమాలు బలహీనపరిస్తే, కొద్దికాలం పాటు అధికారాన్ని చేపట్టిన భారతీయులు మరో దురభిప్రాయాన్ని కూడా తుత్తునియలు చేశారు. భారతీయులు పాలితులే కానీ, పాలకులుగా పనికిరారంటూ సామ్రాజ్య వాదులు సుదీర్ఘకాలంగా నిలబెడుతూ వచ్చిన వాదన ఈ దెబ్బతో పటాపంచలైపోయింది.

* * *

# 27 1930, 1940లలో రైతాంగ ఉద్యమాలు

1930లలో దేశవ్యాప్తంగా తమ జీవన పరిస్థితులను మెరుగు పరచుకునేందుకు తమ శక్తి సామర్థ్యాల మేరకు సంఘటితంగావాలన్న చైతన్యం రైతులలో ప్రారంభమైంది. ఈ చైతన్యం ప్రధానంగా అప్పటి రాజకీయ ఆర్థిక పరిణామాల ఫలితంగా వచ్చింది. అప్పటి ఆర్థిక రాజకీయ పరిణామాలు : 1929-30 నుండి దేశాన్ని ఆవరించిన తీవ్రమైన ఆర్థిక మాంద్యం; 1930లలో భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభించిన ప్రజా పోరాట నూతన దశ.

వ్యవసాయ ఉత్పత్తుల ధరలను సగానికి, యింకా అంతకంటే తక్కువకి పడగొట్టిన మాంద్యం, అప్పటికే శిస్తుల, పన్నుల భారంతో క్రుంగిపోయిన రైతాంగాన్ని ఇది మరింతగా దెబ్బతీసింది. ప్రభుత్వం పన్నులు తగ్గించ నిరాకరించింది. కౌలురేట్లు తగ్గించమని జమిందారులకు చెప్పటానికి కూడా సిద్ధపడలేదు. కాని పారిశ్రామిక వస్తువుల ధరలు అంతగా తగ్గలేదు. ఫలితంగా రైతుల ఆదాయాలు విపరీతంగా పడిపోయినప్పటికీ ఆర్థిక మాంద్యం ముందు కాలంలో లాగానే పన్నులు, శిస్తులు, అప్పులు చెల్లించడం కొనసాగించవలసి వచ్చింది.

రైతులు యిలాంటి అసంతృప్తి వాతావరణంలో వున్న 1930లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైంది. అది దేశంలోని పలు ప్రాంతాలలో పన్నులు, కౌలు చెల్లింపు నిరాకరణ రూపం తీసుకున్నది. బార్డోలి సత్యాగ్రహం (1928) విజయంతో ధైర్యం పుంజుకొన్న రైతులు ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రలో భూమి శిస్తు పెంపుకు ఉద్దేశించిన శిస్తు పునర్నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు చేపట్టారు. ఉత్తరప్రదేశ్‌లో శిస్తు రద్దు ఉద్యమం, కౌలు రద్దు ఉద్యమంగా మారింది.

గాంధీ – ఇర్విన్ ఒడంబడిక తరువాత తాత్కాలిక సంధి కాలంలో కూడా ఉద్యమం కొనసాగింది. చట్టబద్ధంగా చెల్లించవలసిన శిస్తులో సగం మాత్రమే చెల్లించి మొత్తం చెల్లించినట్లు రశీదులు పొందమని ఉత్తరప్రదేశ్ రైతుల నుద్దేశించి గాంధీ ప్రకటన విడుదల చేశాడు. గుజరాత్ రైతులు ప్రత్యేకించి సూరత్, ఖేదాకి చెందిన రైతులు పన్నులు చెల్లించ నిరాకరించి, ప్రభుత్వ నిర్బంధం నుండి తప్పుకొనేందుకు అజ్ఞాత జీవితం గడపడానికి బరోడా వలసపోయారు. వారి భూములు, చరాస్తులు జప్తు చేయబడ్డాయి. రైతుల అణచివేతదారుల పోషణార్థం రైతుల నుండి నిర్బంధంగా వసూలు చేయబడుతున్న చౌకీదార్ పన్నుకి వ్యతిరేకంగా బీహార్, బెంగాల్‌లలో బలమైన ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. పంజాబ్‌లో శిస్తు చెల్లింపు నిరాకరణని ప్రచారం చేసేందుకు కిసాన్‌సభలు స్థాపించబడ్డాయి. కిసాన్‌సభలు భూమి శిస్తుని, నీటి తీరువాని రైతు రుణభారాన్ని తగ్గించమని డిమాండ్ చేశాయి. తెగలవారితో సహా రైతులు అడవులను ఉపయోగించుకొనడాన్ని నిషేధించే అటవీ చట్టాలను ఉల్లంఘిస్తూ చేపట్టిన సత్యాగ్రహాలు మహారాష్ట్ర, బీహార్ సెంట్రల్ ప్రావిన్సులలో ప్రజాదరణ పొందాయి. ఆంధ్రలో జమీందారీ వ్యతిరేక పోరాటాలు ప్రారంభమయ్యాయి. – ముందుగా నెల్లూరు జిల్లాలోని వెంకటగిరిలో ప్రారంభమయింది.

* * *

సహాయ నిరాకరణోద్యమం కొత్తగా ముందుకి వస్తున్న రైతాంగ ఉద్యమానికి మరొక విధంగా దోహదపడింది. సమరశీల పోరాటాలు చేపట్టగల నూతన యువతరం, రాజకీయ కార్యకర్తలు దాని నుండి పుట్టుకొచ్చారు. ఈ కొత్తతరం రాజకీయ కార్యకర్తలు సహాయ నిరాకరణోద్యమం నుండి స్ఫూర్తి పొందారు. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్, కమ్యూనిస్టులు యితర వామపక్ష గ్రూపులు ప్రచారం చేసిన వామపక్ష సిద్ధాంత ప్రభావం వీరిపై ప్రబలంగా పడింది. సహాయ నిరాకరణోద్యమం వెనుకపట్టు పట్టడంతో తమ శక్తిని వినియోగించేందుకు మార్గాంతరాన్ని అన్వేషించడం ప్రారంభించారు. రైతులను సంఘటితపరచేందుకు ముందుకు వచ్చారు.

1934లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపనతో వామపక్షశక్తులు సంఘటితపడే క్రమం ఊపందుకొన్నది. కమ్యూనిస్టులు కూడా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో సభ్యులుగా చేరడం ద్వారా బాహాటంగా, చట్టబద్దంగా పనిచేసే అవకాశం లభించింది. ఎన్.జి.రంగా యితర రైతు నాయకుల ప్రయత్నాల ద్వారా మొదలైన క్రమం వామపక్షశక్తులు సంఘటితపడడం రైతు ఉద్యమాన్ని సమన్వయపరచి అఖిల భారత సంస్థని

ఏర్పాటుచేయటానికి ఊపునిచ్చింది. ఫలితంగా అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ 1936 ఏప్రిల్‌లో లక్నోలో స్థాపించబడింది. తరువాత దానిపేరు ఆలిండియా కిసాన్ సభగా మార్చుకొన్నది. బీహార్ ప్రావిన్సు కిసాన్ సభ (1929) సంస్థాపకుడైన స్వామి సహజానంద అధ్యక్షుడుగాను, వ్యవసాయ సమస్యలపై పూర్తి అవగాహన గలవాడు, ఆంధ్ర రైతు ఉద్యమ వైతాళికుడు అయిన ఎన్.జి.రంగా జనరల్ సెక్రటరీగా ఎన్నుకోబడ్డారు. మొదటి సదస్సుకి జవహర్‌లాల్ నెహ్రూ హాజరయి నిర్వాహకులను అభినందించారు. రాంమనోహర్ లోహియా, సోహన్‌సింగ్ జోషీ, ఇందూలాల్ యాజ్ఞిక్, జయప్రకాష్ నారాయణ, మోహన్‌లాల్ గౌతమ్, కమల్ సర్కార్, సుధిన్ ప్రమాణిక్, అహమ్మద్ దిన్ సదస్సులో పాల్గొన్న యితర ప్రముఖులు.

బొంబాయిలో జరిగిన అఖిలభారత కిసాన్ కమిటీ సదస్సు కిసాన్ ప్రణాళికకు తుదిరూపం యిచ్చింది. కిసాన్ ప్రణాళిక 1937లో జరగనున్న ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చేందుకు వీలుగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి సమర్పించబడింది. భూమిశిస్తు కౌళ్ళలో 50శాతం తగ్గింపు, రైతుల అప్పులపై మారిటోరియం, ఫ్యూడల్ లెవీల రద్దు, కౌలుదార్లకు రక్షణ, వ్యవసాయ కార్మికులకు కనీసవేతనాలు, రైతు సంఘాలకు గుర్తింపు -లాంటి డిమాండ్లు గల కిసాన్ ప్రణాళిక ఫైజాపూర్‌లో కాంగ్రెస్ సదస్సు ఆమోదించిన వ్యవసాయ కార్యక్రమాన్ని గణనీయంగా ప్రభావితం చేసింది.

మహారాష్ట్రలోని ఫైజాపూర్‌లో కాంగ్రెస్ సదస్సుతోపాటు అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ రెండవ సదస్సు ఎన్.జి.రంగా అధ్యక్షతన జరిగింది. కిసాన్ కాంగ్రెస్ లక్ష్యాలను వివరిస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ 500మంది రైతులు మన్మాడ్ నుండి ఫైజాపూర్ వరకు గల 200 మైళ్ళ దూరం పాదయాత్ర జరిపారు. జవహర్‌లాల్ నెహ్రూ, శంకరరావు డియో, యం.యన్.రాయ్, నరేంద్రదేవ్, ఎస్.ఎ.డాంగే, ఎం.ఆర్.మసానీ, యూసుఫ్ మెహరల్లీ, బంకిం ముఖర్జీ లాంటి పలువురు కిసాన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు వారికి ఫైజాపూర్ వద్ద స్వాగతం పలికారు. రంగా తన అధ్యక్షోపన్యాసంలో "సోషలిస్టు సమాజం, సోషలిస్టు ప్రభుత్వ స్థాపనకు మనం సంఘటితమవుతున్నాం" అన్నారు.

* * *

1937 ప్రారంభంలో మెజారిటీ ప్రావిన్సులలో కాంగ్రెస్ మంత్రివర్గాల ఏర్పాటు, రైతాంగ ఉద్యమ పెరుగుదల నూతన దశకు ప్రారంభంగా చెప్పవచ్చు. దేశంలోని రాజకీయ వాతావరణం గణనీయమైన మార్పుకి గురయింది. పెరిగిన పౌరహక్కులు, 'మనవాళ్ళే అధికారంలో వున్నారు' - అనే భావన నుండి పుట్టిన స్వేచ్ఛాయుతమైన ఆలోచన,

మంత్రివర్గాలు ప్రజానుకూలమైన చర్యలు చేపడతాయనే అంచనాలు – అన్నీ కలిసి 1937–39కాలంలో రైతాంగ ఉద్యమాన్ని ఉన్నతస్థాయికి తీసుకొని వెళ్ళాయి. రైతులకు రుణభారం నుండి ఊరట కల్పించేందుకు, ఆర్థిక మాంద్యం కాలంలో కోల్పోయిన భూములను తిరిగి రైతులు పొందేందుకు, కౌలుదారులు నిర్దిష్టకాలం పొలం చేసుకొనే విధంగా రక్షణ కల్పించడం – లాంటి చర్యలు చేపట్టేందుకు వివిధ మంత్రివర్గాలు వ్యవసాయపరమైన చట్టాలను ప్రతిపాదించాయి. ప్రతిపాదిత చట్టాలకు మద్దతుగా లేక చట్టాలలో మార్పులు కోరేందుకు రైతులను సమీకరించడానికి యిది ప్రేరణనిచ్చింది.

ఠానా తాలూకా జిల్లా ప్రావిన్సుల స్థాయిలలో కిసాన్ సదస్సులు, సమావేశాలు జరిపి రైతుల డిమాండ్లపై తీర్మానాలు చేయడం లాంటి చర్యలతో రైతుల సమీకరణ సులభంగా సాధ్యపడేది. సదస్సులలో స్థానిక, ప్రావిన్సు, అఖిల భారతస్థాయి నాయకులు ప్రసంగించేవారు. సదస్సులకు ముందు రైతు ఉద్యమ కార్యకర్తలు గ్రామాలలో పర్యటించి సదస్సులు జరిపి కాంగ్రెస్ కిసాన్‌సభలలో సభ్యులను చేర్పించేవారు. విరాళాలు డబ్బు రూపంలో, వస్తు రూపంలో సేకరించేవారు. కిసాన్ సదస్సులకు పెద్దసంఖ్యలో రైతులు హాజరుకావలసిందిగా విజ్ఞప్తి చేసేవారు. ఈ సదస్సులలో ఉద్యమ సందేశాన్ని రైతులలోకి తీసుకొని పోయేందుకు, వారిని ఆకట్టుకొనే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహింపబడేవి. సదస్సులతో రైతులు ఉత్తేజం పొందేవారు. రైతులు వారి సమస్యలపై మంచి అవగాహనతో, వారి శక్తి సామర్థ్యాలపై పెరిగిన విశ్వాసంతో సదస్సుల నుండి వారి స్వస్థలాలకు వెళ్ళేవారు.

ఉదాహరణకు గ్రామాలలో పర్యటిస్తూ, రైతు సమస్యలపై పనిచేస్తూ కర్షక సంఘాలను స్థాపిస్తూ 1934 నుండి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగా కేరళలోని మలబారులో శక్తివంతమైన రైతాంగ ఉద్యమం అభివృద్ధి చెందింది. ఫ్యూడల్ లెవీల రద్దు, కౌలు పునరుద్ధరణ, ఫీజుల రద్దు, ముందుగా కౌలు చెల్లింపుల రద్దు, స్వంతంగా వ్యవసాయం చేసుకొంటామనే నెపంతో కౌలు రైతులను భూమి నుండి ఖాళీ చేయించడం – రైతు ఉద్యమం చేపట్టిన ప్రధాన సమస్యలు. శిస్తు, కౌలు, రుణ భారాల తగ్గింపు, కౌలుని ధాన్య రూపంలో వసూలు చేసుకొనేటప్పుడు సరియైన కొలమానాలు ఉపయోగించడం, భూస్వాముల వద్ద పనిచేసే ఉద్యోగుల లంచగొండితనానికి స్వస్తి చెప్పడం – లాంటివి రైతుల యితర డిమాండ్లు.

రైతులను సమీకరించేందుకు ఆందోళనలు నిర్వహించేందుకు చేపట్టిన పద్ధతులు గ్రామస్థాయిలో రైతుసంఘాల యూనిట్లు ఏర్పాటు చేయడం, సదస్సులు, సభలు నిర్వహించడం. బాగా ప్రజాదరణ పొంది మంచి ఫలితాలనిచ్చిన మరొక పోరాట రూపం రైతులు పెద్ద గుంపులుగా ప్రదర్శనగా భూస్వాముల యిళ్ళకు వెళ్ళి వారి డిమాండ్లను

భూస్వాముల ముందుంచి వెంటనే కొన్ని డిమాండ్లను సాధించుకొనడం. జాతాల ప్రదర్శనల ప్రధానమైన డిమాండ్ వాసి, నూరి – లాంటి భూస్వామ్య లెవీల రద్దు.

మలబారు కౌలుదారీ చట్టం 1929 సవరణ కొరకు చేపట్టిన డిమాండ్‌పై కర్షక సంఘాలు శక్తివంతమైన ప్రచారం చేపట్టాయి. 1938 నవంబర్ 6వ తేదీ మలబారు కౌలుదారీ చట్ట సవరణ దినంగా పాటించబడింది. డిమాండ్‌పై ఒత్తిడి పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా జరిపిన రైతు సమావేశాలు తీర్మానాన్ని ఆమోదించాయి. సమస్యని క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు అఖిల మలబారు కర్షక సంఘం ఆర్.రామచంద్ర నెడుంగడి నాయకత్వంలో ఒక కమిటీని నియమించింది. కమిటీ సిఫార్సులకు కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ 1938 నవంబర్ 20న ఆమోదం తెలిపింది. డిసెంబర్‌లో ఒక్కొక్కదానిలో 500మంది సభ్యులు గల రెండు జాతాలు – ఒకటి ఉత్తర మలబార్‌లోని కరివల్లూర్ నుండి, మరొకటి దక్షిణాన గల కంజికోడ్ నుండి బయలుదేరి, దారిపొడుగునా కాంగ్రెస్ కమిటీల ఆహ్వానాలను స్వీకరిస్తూ అఖిల మలబార్ కర్షక సంఘం కాలికట్ సమీపంలోని చెవయూర్‌లో నిర్వహిస్తున్న సదస్సు వద్ద కలిశాయి. ఆ సాయంత్రం కాలికట్ బీచ్ వద్ద అప్పటి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకుడు, ఆ తరువాత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు అయిన పి.కృష్ణపిళ్లై అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. కౌలు చట్టంలో సవరణలను డిమాండ్ చేస్తూ తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ప్రజల ఒత్తిడికి స్పందనగా ఆంధ్ర కాంగ్రెస్ నాయకుడు, మద్రాస్ ప్రెసిడెన్సీ కాంగ్రెస్ మంత్రివర్గంలోని రెవెన్యూ మంత్రి అయిన టి.ప్రకాశం 1938 డిసెంబర్‌లో కౌలుదారీ సమస్యపై అవగాహనను పెంచుకొనేందుకు మలబార్‌లో పర్యటించాడు. ముగ్గురు వామపక్ష సభ్యులతో సహా ఒక కౌలుదారీ కమిటీ నియమించబడింది. రైతులను సమీకరించేందుకు, కమిటీకి విజ్ఞాపన పత్రాలను అందజేసేందుకు కర్షక సంఘం యూనిట్లు, కాంగ్రెస్ కమిటీలు చాలా సమావేశాలు నిర్వహించాయి. కానీ 1940లో కమిటీ తన రిపోర్టుని సమర్పించేనాటికి కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేశాయి గనుక ఎలాంటి చర్యలు చేపట్టడం సాధ్యపడలేదు. కాని రైతు ఉద్యమం సాగించిన ప్రచారం కౌలు సమస్యపై జయప్రదంగా రైతులను సమీకరించింది; చైతన్యాన్ని పెంచింది. రానున్న సంవత్సరాలలో ఆ సమస్యలను అనివార్యంగా ఆమోదించవలసిన పరిస్థితి కల్పించింది. ఈ మధ్యకాలంలో మద్రాసు కాంగ్రెస్ మంత్రివర్గం రుణాల పట్ల కొంత వెసులుబాటు కల్పించే చట్టాన్ని ఆమోదించింది. కర్షక సంఘం ఈ చర్యని స్వాగతించింది.

కోస్తా ఆంధ్రలో కూడా గతంలో ఎన్నడూ లేనంతగా రైతుల సమీకరణ జరిగింది. ఆంధ్ర ప్రాంతీయ రైతుసంఘం, ఆంధ్ర జమీన్ రైతు సంఘం – ఈ రెండు సంఘాలు

ప్రభుత్వానికి జమీందారులకు వ్యతిరేకంగా జయప్రదంగా పోరాడిన సుదీర్ఘ చరిత్ర వున్నది. అంతేగాక రైతు ఉద్యమంలో చురుకైన కార్యకర్తలను తయారుచేసేందుకు 1933 నుండి ఎన్.జి. రంగా గుంటూరు జిల్లాలోని తన స్వగ్రామమైన నిడుబ్రోలులో రైతు పాఠశాలను నడుపుతూ వచ్చాడు. 1936 నుండి కాంగ్రెస్ వామపక్ష వాదులు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నుండి సి.పి.ఐ.లో చేరినవారు రైతులను సంఘటితపరచే ప్రయత్నంచేశారు. వారిలో పి.సుందరయ్య ప్రత్యేకించి ఎన్నదగినవాడు.

1937 ఎన్నికలలో జమీందారులు, జమీందారీ అనుకూల అభ్యర్థులు చాలామంది కాంగ్రెస్ అభ్యర్థులచే ఓడింపబడ్డారు. ఇది జమీందారుల అహాన్ని దెబ్బతీసింది. జమీందారీ రైతు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. బొబ్బిలి, మునగాల జమీందారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టబడ్డాయి. వ్యవసాయం, చేపలు పట్టుకొనే హక్కులపై కాళీపట్నం జమీందారుకు వ్యతిరేకంగా పెద్దపోరాటం చెలరేగింది.

కోస్తా ఆంధ్రలో రైతుల పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. రైతు పాదయాత్రలు జిల్లా లేక తాలూకా కేంద్రం వద్ద కలుసుకొని కోర్కెల పత్రాన్ని అధికారులకు సమర్పించేవారు. కాని 1938లో రాష్ట్ర కిసాన్ సదస్సు – మొదటిసారిగా చాలా విస్తృత స్థాయిలో పాదయాత్ర నిర్వహించింది. 2000మంది రైతులు ఉత్తరాన ఇచ్ఛాపురంలో ప్రారంభించి 9 జిల్లాలగుండా 130రోజులపాటు 1500 మైళ్ళ దూరం సాగిన లాంగ్‌మార్చ్ దారి పొడవునా లక్షలాది రైతులు హాజరయిన వందలాది సమావేశాలను నిర్వహిస్తూ 1100 పిటీషన్లను సేకరించింది. వాటిని 1938 మార్చి 27న మద్రాసు రాష్ట్ర అసెంబ్లీకి సమర్పించింది. రుణభారం తగ్గింపు వారి ప్రధానమైన డిమాండ్లలో ఒకటి. దీనిని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. రైతుల డిమాండ్లకు స్పందనగా మంత్రివర్గం జమీందారీ ఎంక్వయిరీ కమిటీని నియమించింది. కాని కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామాలు చేయడానికి ముందుగా కమిటీ సిఫార్సుల నాధారం చేసుకొని చట్టం చేయడం సాధ్యపడలేదు.

ఆంధ్రలో గమనించదగిన మరొక ముఖ్యమైన అంశం: రైతు ఉద్యమ కార్యకర్తలకు ఆర్థికశాస్త్రం, రాజకీయాలపై వేసవి పాఠశాలల నిర్వహణ. కొత్తపట్నం, మంతెనవారిపాలెం – యింకా యితర ప్రాంతాలలో జరుపబడిన శిక్షణా తరగతుల నుద్దేశించి పి.సి.జోషీ, అజయ్ ఘోష్, ఆర్.డి.భరద్వాజలతో సహా ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు ప్రసంగించారు. భారతదేశ చరిత్ర, జాతీయ పోరాట చరిత్ర, మార్క్సిజం, భారతదేశ ఆర్థిక పరిస్థితులు – యింకా వీటికి సంబంధించిన పలు అంశాలు పాఠ్యాంశాలుగా వుండేవి. ఈ శిక్షణా తరగతుల నిర్వహణకు అవసరమైన డబ్బు, యితర వనరులు

ఆంధ్ర రైతుల నుండి సేకరింపబడేవి. రైతు దినోత్సవాలు జరిపి రైతుల పాటలకు విస్తృత ప్రచారం యివ్వడం రైతులను సమీకరించేందుకు అవలంబించే మరొక పద్ధతిగా వుండేది.

ఈ కాలంలో బీహార్‌లో రైతాంగ సమీకరణ ఎక్కువగా జరిగింది. బీహార్ ప్రొవిన్షియల్ కిసాన్‌సభ సంస్థాపకుడు అఖిలభారత కిసాన్ సభ ముఖ్యనాయకుడైన స్వామి సహజానందకి తోడుగా కిసాన్‌సభ సంస్థని గ్రామస్థాయి వరకు విస్తరింపజేసేందుకు కార్యానంద్ శర్మ, రాహుల్ సాంకృత్యాయన్, పంచానన్‌శర్మ, యదునందన్‌శర్మ లాంటి వామపక్ష నాయకులు పనిచేశారు.

బీహార్‌లో వివిధ స్థాయిలలో సభలు, సమావేశాలు, ప్రదర్శనలు జరిపి కిసాన్ సభ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం యివ్వబడింది. కిసాన్‌సభ 1938లో పాట్నాలో లక్షమంది రైతులతో మహా ప్రదర్శన నిర్వహించింది. 1935లో సభచే ఆమోదింపబడిన జమీందారీ విధానం రద్దుకు విస్తృత ప్రచారం యివ్వబడింది. చట్ట విరుద్ధమైన లెవీల వసూళ్ళు ఆపివేయించటం, పొలాల నుండి కౌలుదారులు ఖాళీ చేయకుండా ఆపివేయడం, బకాష్ పొలాలను తిరిగి స్వాధీనపరచడం – ముఖ్యమైన యితర డిమాండ్లు.

కౌలురేటు తగ్గింపుకి, బకాష్ పొలాలను తిరిగి స్వాధీనం చేసేందుకు కాంగ్రెస్ మంత్రివర్గం చట్టపరమైన చర్యలను ప్రారంభించింది. బకాష్ పొలాలంటే ఆర్థిక మాంద్యం కాలంలో రైతులు కౌలు చెల్లించలేకపోవడంతో జమీందారుల వశమైన పొలాలు. అవే పొలాల్లో గతంలో కౌలుదారులుగా వున్నవారిలో అత్యధికులు ఆ తరువాత పాలికాపులయ్యారు. జమీందారులతో కుదిరిన ఒప్పందం ప్రాతిపదికగా వచ్చిన పరిష్కారం కిసాన్‌సభ నాయకులను సంతృప్తిపరచలేదు. పొలం వేలం ధరలో సగం చెల్లించే షరతుపై పొలంలో కొంతభాగాన్ని కౌలు రైతులకు యిచ్చివేయాలని చట్టం చేయబడింది. అంతేగాక కొన్ని రకాల పొలాలు చట్టం పరిధి నుండి మినహాయించబడ్డాయి.

బకాష్ పొలాల సమస్య కిసాన్‌సభకి, కాంగ్రెస్ మంత్రివర్గానికి మధ్య వివాదాన్ని సృష్టించింది. కార్యానంద్ శర్మ నాయకత్వంలో మోంగియార్ జిల్లాలోని బరాహియాతాల్‌లో సాగుతున్న పోరాటాలు కొనసాగాయి. కొత్త పోరాటాలు ప్రారంభమయ్యాయి. గయ జిల్లాలోని రియోరాలో యదునందన్ శర్మ నాయకత్వంలో రైతులు పోరాటం ప్రారంభించారు. వివాదంలో వున్న 1000 బిగాల భూమిలో 850 బిగాల భూమి కౌలుదార్లకు చెందాలని జిల్లా మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఇది పోరాటంతో రైతులు సాధించిన విజయం. ఈ పోరాటం యితర ప్రాంతాల పోరాటాలకు పెద్ద ఊపునిచ్చింది. దర్భాంగాలో పాడ్రి, రాఘోపూర్, దేకులి, పాండౌలలో మాత్రం ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. సరన్ జిల్లాలో జమునాకార్హీ, అన్నవరిలో రాహుల్ సాంకృత్యాయన్

ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఉద్యమాలు సత్యాగ్రహం, బలప్రయోగంతో విత్తడం, పంట మార్పిడి చేయడం పద్ధతులను అవలంబించాయి. జమీందారులు గూండాలను ఉపయోగించి సభలను చెదరగొట్టారు. రైతులను భయోత్పాతానికి గురిచేశారు. జమీందారీ గూండాలతో ఘర్షణలు సర్వసామాన్యమయ్యాయి. నాయకులను, కార్యకర్తలను అరెస్టులు చేసేందుకు పోలీసులు తరచుగా జోక్యం చేసుకొన్నారు. బకాష్ ఉద్యమం 1938, 1939 నాటికి తీవ్రస్థాయికి చేరుకొన్నది. 1939 ఆగస్టు నాటికి కొన్ని రాయితీలు, 600మంది కార్యకర్తల అరెస్టులు ఉద్యమాన్ని క్షీణింపజేయడంలో జయప్రదమయ్యాయి. ఉద్యమం మరలా 1945లో కొన్నిచోట్ల చేపట్టబడింది. జమీందారీ విధానం రద్దు చేయబడేవరకు ఏదో ఒక రూపంలో కొనసాగింది.

కిసాన్ కార్యక్రమాలు చురుకుగా సాగిన మరొక కేంద్రం పంజాబ్. 1930 దశాబ్దం తొలి సంవత్సరాలలో ప్రారంభమైన నౌజవాన్ భారత్ సభ, కీర్తి కిసాన్‌లకు కాంగ్రెస్ అకాలీ కార్యకర్తల ప్రయత్నాలతో ప్రారంభమైన కిసాన్‌సభలకు 1937లో ఏర్పాటైన పంజాబ్ కిసాన్ కమిటీ, నూతన దిశా నిర్దేశం చేసింది. కిసాన్ కార్యకర్తలు కిసాన్‌సభ కాంగ్రెస్ సభ్యత్వాలను చేర్పిస్తూ, సమావేశాలు నిర్వహిస్తూ తహశీల్, జిల్లా, ప్రావిన్సు స్థాయి సదస్సులకు రైతులను సమీకరించేవారు. సదస్సులు తరచుగా జరిగేవి. వాటికి జాతీయస్థాయి నాయకులు వచ్చేవారు. పన్నుల తగ్గింపు, అప్పులపై మారిటోరియం ప్రకటించుట ప్రధానమైన డిమాండ్లు. పశ్చిమ పంజాబ్‌కి చెందిన పెద్ద భూస్వాములు ఆధిపత్యం వహించే యూనియనిస్టు మినిస్ట్రీపై దాడి కేంద్రీకరింపబడింది.

తక్షణ పోరాటం కొరకు ముందుకి వచ్చిన రెండు సమస్యలు. 1.అమృతసర్, లాహోర్ జిల్లాల భూమిశిస్తు రీసెటిల్‌మెంట్. 2. కాలువ పన్నుల పెంపుదల. సమస్యల పరిష్కారానికై జిల్లా కేంద్రాలకు పాదయాత్రలు చేపట్టబడ్డాయి. పెద్ద ప్రదర్శనలు నిర్వహింపబడ్డాయి. వీటి తుదిరూపంగా పరిణమించిన 1939 లాహోర్ కిసాన్‌మోర్చాలో వివిధ జిల్లాల నుండి వచ్చిన వందలాది మంది రైతులు అరెస్టులకు సిద్ధపడ్డారు. ముల్టాన్ మాంటగోలోని మేరీ కెనాల్ కాలనీలో మరొక పోరాటం ప్రారంభమయింది. ప్రభుత్వం నుండి, పెద్ద భూస్వాముల నుండి యిటీవలనే కాలనీలుగా మార్చబడిన భూములను కౌలుకు తీసుకున్న పెద్ద ప్రైవేటు కంపెనీలు భూములు సాగుచేస్తున్న పాలికాపుల నుండి పెద్ద మొత్తాలలో భూస్వామ్య లెవీని వసూలు చేసేందుకు ఒత్తిడి చేశాయి. చట్ట విరుద్ధమైనవిగా యిటీవల ప్రభుత్వంచే ప్రకటించబడిన ఈ వసూళ్ళను అడ్డుకొనేందుకు రైతు నాయకులు రైతులను సంఘటిత పరిచారు. రైతులు సమ్మెలు చేశారు. కొన్ని చోట్ల ప్రత్తి తీయ నిరాకరించారు. పంట నూర్పిడి చేయడం ఆపివేశారు. ఫలితంగా చాలా

రాయితీలు పొందారు. యుద్ధం కారణంగా రైతుల పోరాటం ఆపివేయబడింది. మరలా 1946-47లో చేపట్టబడింది.

పంజాబ్‌లో రైతు ఉద్యమం ప్రధానంగా మధ్య జిల్లాలలో కేంద్రీకరింపబడింది. చురుకుగా ఉద్యమం చేపట్టిన జిల్లాలు జలంధర్, అమృతసర్, హోషియాపూర్, ల్యాల్‌పూర్, షేకూపురాలు. ఇవి స్వయంగా వ్యవసాయం చేసుకొని జీవించే సిక్కు రైతులు నివసించే జిల్లాలు. ఈ రైతులు 1920ల ప్రారంభంలో గురుద్వారా సంస్కరణ ఉద్యమం ద్వారాను 1930-32 సహాయ నిరాకరణోద్యమం ద్వారాను జాతీయోద్యమంలోకి సమీకరించబడినవారు. రాష్ట్రంలో చాలా వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ పంజాబ్‌కి చెందిన ముస్లిం కౌలుదారులు, అలాగే ఆగ్నేయ పంజాబ్ (South eastern)కి చెందిన హిందూ కౌలుదారులు (ఈనాటి హర్యానా) ప్రధానంగా ఉద్యమం వెలుపలే వుండిపోయారు. కిసాన్ నాయకులచే సమీకరించబడిన మాంట్‌గోమెరీ, ముల్తాన్ జిల్లాలకు చెందిన కౌలుదారులలో అత్యధికులు మధ్య పంజాబ్ నుండి వలసపోయినవారు. బాబా సోహన్‌సింగ్, మాస్టర్ హరిసింగ్, భగత్‌సింగ్ బిగ్గా, వాధవా రామ్‌లు - ముఖ్యమైన రైతు నాయకులలో కొందరు.

పంజాబ్‌లోని స్వతంత్ర సంస్థానాలలో కూడా రైతుల అసంతృప్తి పెల్లుబికింది. భూస్వాములు, అధికారులు కుమ్మక్కయి పలు విధాలైన మోసాలు, బెదిరింపులతో చట్ట విరుద్ధంగా కైవశం చేసుకొన్న భూములు రైతులకు దక్కాలి- అనే డిమాండ్‌పై పాటియాలాలో చాలా శక్తివంతమైన ఉద్యమం ప్రారంభమయింది. రైతులు భూస్వాములకు కౌలు చెల్లించ నిరాకరించారు. ఉద్యమానికి భగవాన్‌సింగ్ లోంగోవాలియా, జాగీర్‌సింగ్ జోగా, ఆ తరువాత సంవత్సరాలలో తేజ్‌సింగ్ సత్వంతర్- లాంటి వామపక్ష నాయకులు నాయకత్వం వహించారు. ఈ పోరాటం 1953వరకు అంటే కౌలుదారులు ఆ భూములకు స్వంతదారులని చట్టం చేయబడేవరకు సాగింది.

దేశంలోని యితర ప్రాంతాలలో కూడా కౌలుదారుల రక్షణ, ఫ్యూడల్ లెవీల రద్దు, పన్నులు రుణభారం తగ్గింపు లాంటి సమస్యలపై రైతులు పెద్దఎత్తున సమీకృతులయ్యారు. బెంగాల్‌లో బంకిం ముఖర్జీ నాయకత్వంలో దామోదర్ కాల్వపై కాలువ పన్ను పెంపుకి వ్యతిరేకంగా బర్ద్వాన్ రైతులు ఆందోళన జరిపి చాలా రాయితీలు పొందారు. 24 పరగణాల రైతులు వారి డిమాండ్ల సాధన కొరకు 1938 ఏప్రిల్‌లో కలకత్తాకి పాదయాత్ర చేపట్టారు. అస్సాంలోని సుర్మాలోయలో జమిందార్ అణచివేతకు వ్యతిరేకంగా కౌలురద్దు పోరాటం 6నెలలపాటు సాగింది. కౌలు చట్టం సవరణకు కరుణ సింధురాయ్ పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాడు.

ఒరిస్సాలో 1935లో మాలతీ చౌదురి, యితరుల నాయకత్వంలోని ఉత్కళ ప్రొవిన్షియల్ కిసాన్ సభ ఎన్నికల ప్రణాళికలో భాగంగా కాంగ్రెస్ కమిటీచే కిసాన్ ప్రణాళికను ఆమోదింపచేసింది. ఆ తరువాత ఏర్పడిన మంత్రివర్గం గణనీయంగా వ్యవసాయ చట్టాలను ప్రవేశపెట్టింది. ఒరిస్సాలోని సంస్థానాలలో బలవంతపు చాకిరీ, వెట్టి చాకిరీ, అటవీ హక్కులు, కౌలు తగ్గింపు సమస్యలపై తెగలవారు కూడా పాల్గొన్న శక్తివంతమైన ఉద్యమం చేపట్టబడింది. ధేన్ కెనాల్‌లో పెద్ద ఘర్షణలు చెలరేగాయి. అణచివేత నుండి తప్పుకొనేందుకు వేలాదిమంది పారిపోయారు. కౌలుదారులను భూముల నుండి వెళ్ళగొట్టడానికి, ఫ్యూడల్ వసూళ్ళకు పాల్పడిన నవాబుకి వ్యతిరేకంగా వాయవ్య సరిహద్దు ప్రావిన్సులోని ఘల్లాధీర్ రైతులు నిరసనలు తెలిపారు. గుజరాత్‌లో ప్రధానమైన డిమాండ్ వెట్టిచాకిరీ రద్దు. గణనీయమైన విజయాలు సాధించబడ్డాయి. మాల్గుజారి విధానం రద్దు, పన్నుల తగ్గింపు, అప్పులపై మారిటోరియంలను డిమాండ్ చేస్తూ సెంట్రల్ ప్రావిన్సు కిసాన్‌సభ నాగపూర్‌కి పాదయాత్ర జరిపింది.

* * *

ఉప్పొంగుతున్న రైతాంగ చైతన్య వెల్లువకి యుద్ధం అడ్డుకట్టవేసింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేశాయి. యుద్ధ వ్యతిరేక వైఖరి చేపట్టినందుకుగాను వామపక్షవాదులపై, కిసాన్‌సభ నాయకులపై, కార్యకర్తలపై తీవ్ర నిర్బంధకాండ అమలు జరుపబడింది. హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడిచేసిన తరువాత 1941 డిసెంబర్‌లో సి.పి.ఐ., ప్రజాయుద్ధ పంథా కిసాన్‌సభ యొక్క కమ్యూనిస్టు, కమ్యూనిస్టేతర సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు సృష్టించింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ సభ్యులు ప్రముఖంగా పాల్గొన్న క్విట్ ఇండియా ఉద్యమంతో ఈ అభిప్రాయ భేదాలు తారాస్థాయికి చేరాయి. చాలామంది స్థానిక స్థాయి కార్యకర్తలు క్విట్ ఇండియా ఉద్యమంలో చేరినప్పటికీ, యుద్ధ అనుకూల నిర్ణయం తీసుకొన్న సి.పి.ఐ. తన కార్యకర్తలను ఉద్యమానికి దూరంగా వుండమని చెప్పింది. కిసాన్‌సభ శ్రేణులలో విభేదాల కారణంగా కిసాన్‌సభ చీలిపోయింది. కిసాన్‌సభ ప్రముఖ నాయకులైన ముగ్గురు ఎన్.జి.రంగా, స్వామి సహజానంద సరస్వతి, ఇందూలాల్ యాజ్ఞిక్ సంస్థని వదలివెళ్ళిపోయారు.

అయినప్పటికీ యుద్ధకాలంలో 1943 బెంగాల్ క్షామ సహాయక కార్యక్రమాలలోను, అత్యవసర వస్తువుల రేషనింగ్ లాంటి కొరతల తీవ్రతను తగ్గించడంలోనూ కిసాన్‌సభ ప్రధానపాత్ర నిర్వహించింది. ప్రజాదరణ పొందని యుద్ధ

వ్యతిరేక నిర్ణయం తీసుకొని వివిధ సెక్షన్ల రైతాంగం నుండి కొంత వేరుపడినప్పటికీ కిసాన్‌సభ తన కార్యకలాపాలను కొనసాగించింది.

* * *

యుద్ధానంతరం స్వాతంత్ర్య సాధనపై అంచనాలతో అధికార మార్పిడి కొరకు సాగిన రాయబారాలు రైతాంగ ఉద్యమాభివృద్ధిలో గుణాత్మకమైన మార్పు తీసుకొని వచ్చాయి. నూతన సామాజిక వ్యవస్థ వాగ్ధానంతో కిసాన్ కార్యకర్తలలో నూతనోత్సాహం ప్రస్ఫుటంగా వ్యక్తమయింది.

1939లో వదలిపెట్టబడిన పోరాటాలు తిరిగి చేపట్టబడ్డాయి. జమీందారీ విధానం రద్దు సమస్య ముందుకు వచ్చింది. కొద్ది సంవత్సరాల క్రితం ప్రారంభమైన వ్యవసాయ కార్మికసంఘం కూలి పెంపుదల కోసం, సరియైన కొలమానాల ఉపయోగం కొరకు పోరాటం చేపట్టింది.

తిరువాన్కూరులోని పున్నప్ర- వాయలార్ రైతులు పాలనాయంత్రాంగంతో జరిపిన పోరాటంలో రైతులు రక్తం చిందించారు. తెలంగాణాలో రైతులు, భూస్వాముల అణచివేతను నిరోధించేందుకు సంఘటితమయ్యారు. నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. దేశంలోని యితర ప్రాంతాలలోను పోరాటాలు జరిగాయి.

కాని బ్రిటిషిండియాలో చాలా ప్రసిద్ధిగాంచిన పోరాటం తెభాగ పోరాటం. 1946లో బెంగాల్ పాలికాపులు యిక మీదట పంటలో సగభాగం జోతేదార్లకు (జమీందార్లకు) యివ్వబోమని మూడవ వంతు మాత్రమే యిస్తామని, పంట పంచేవరకు తమ అధీనంలో వుంటుందిగానీ, జోతేదార్ల గోదాములలో కాదని స్పష్టం చేశారు. ఫ్లౌడ్ కమిషన్‌గా ప్రసిద్ధిగాంచిన బెంగాల్ లాండ్ రెవెన్యూ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్టులో చేసిన ఈ సిఫార్సు రైతులను నిస్సందేహంగా పోరాటానికి ప్రోత్సహించింది. అదే సమయంలో హాజాంగ్ తెగలవారు తమ శ్రమకు సాంవత్సరికంగా యిస్తున్న మేరని డబ్బు రూపంలో యివ్వాలని డిమాండ్ చేశారు.

బెంగాల్ ప్రొవిన్షియల్ కిసాన్‌సభ నాయకత్వంలోని తెభాగ ఉద్యమం, పంచేవరకు పంట తమ అధీనంలో వుండాలని పాలికాపులు పట్టు పట్టడంతో జోతేదార్ల, బార్గాదార్ల (పాలికాపుల) మధ్య వివాదం ఘర్షణల రూపం తీసుకొన్నది.

సుహ్రావర్దీ నాయకత్వంలోని ముస్లింలీగు మంత్రివర్గం 1947 జనవరి 22న కలకత్తా గజెట్‌లో బెంగాల్ బర్గాదార్ల తాత్కాలిక నియంత్రణ బిల్లుని ప్రకటించడంతో జనవరి నెలాఖరులో ఉద్యమానికి మంచి ప్రోత్సాహం లభించింది. తెభాగ డిమాండు

చట్ట విరుద్ధమైనదికాదని తేలడంతో లభించిన ప్రోత్సాహంతో, అప్పటివరకూ ఉద్యమాలకు దూరంగా వున్న గ్రామాల రైతులు కూడా పోరాటంలోకి వచ్చారు. చాలా చోట్ల రైతులు జోతేదార్ల గోదాములలోని ధాన్యాన్ని తరలించేందుకు ప్రయత్నాలు చేశారు. ఫలితంగా అసంఖ్యాకమైన ఘర్షణలు చెలరేగాయి.

జోతేదార్లు ప్రభుత్వానికి అప్పీలు చేశారు. రైతులను అణచడానికి పోలీసులు రంగప్రవేశం చేశారు. కొన్నిచోట్ల పెద్ద ఘర్షణలు జరిగాయి. కాన్పూర్‌లో 20మంది రైతులు చంపబడ్డారు. అణచివేత కొనసాగింది. ఫిబ్రవరి చివరికి ఉద్యమం దాదాపు అణగారిపోయింది. మార్చిలో కూడా చెదురుమదురు ఘటనలు జరిగాయి. కాని అవి అంతమవుతున్న పోరాటం యొక్క తుదిశ్వాసలు మాత్రమే.

ముస్లింలీగు మంత్రివర్గం బిల్లుని ఆమోదింపచేయడంలో విఫలమయింది. 1950లో కాంగ్రెస్ మంత్రివర్గం బర్గాదార్ల బిల్లును ఆమోదించింది. ఉద్యమం యొక్క డిమాండ్లన్నీ బిల్లులో చేర్చబడ్డాయి.

ఉద్యమం యొక్క ప్రధాన కేంద్రాలు దినాజ్‌పూర్, రంగపూర్, జల్‌పాయ్‌గురి, మెమెన్‌సింగ్, మిడ్నాపూర్; కాస్త తక్కువస్థాయిలో 24 పరగణాలు, ఖుల్నా – మొదట ఉద్యమం రాజ్‌బని క్షత్రియ రైతులతో ప్రారంభమయింది. త్వరలో అది ముస్లిములు, హాజాంగ్‌లు, సంతాల్‌లు, బరాయన్లకు వ్యాపించింది. ఉద్యమం యొక్క ముఖ్యమైన నాయకులు కృష్ణోబినోడిరే, అబని లహరి, సునిల్‌సేన్, బవానిసేన్, మోనిసింగ్, అనంతసింగ్, బిబుతి గుహ, అజిత్‌రే, సుషీల్‌సేన్, సమర్‌గంగూలి, గురుదాస్ తాలూక్‌దార్.

* * *

విస్తృతమైన వైవిధ్యంగల పోరాటం యొక్క లాభనష్టాలను అంచనా వేయడం అంత సులభమైన పనికాదు. 1930, 1940లలో ఉపఖండంలోని పెద్ద ప్రాంతాలకు వ్యాప్తిచెందిన ఉద్యమాలు తక్షణ విజయాలను సాధించనప్పటికీ స్వాతంత్ర్యానంతరం అనివార్యంగా వ్యవసాయ సంస్కరణలు చేపట్టాలనే వాతావరణాన్ని సృష్టించాయి. ఉదాహరణకు జమీందారీ విధానం రద్దు అనేది ఒక ప్రత్యేక పోరాటంతో సాధించబడలేదు. కాని ప్రజాదరణ పొందేలా కిసాన్‌సభ చేపట్టిన విస్తృత ప్రచారం జమీందారీ విధానం రద్దుకు దోహదపడింది.

స్వతంత్రం రాకముందు రైతు పోరాటాలు చేపట్టిన తక్షణ సమస్యలు: పన్నుల తగ్గింపు, చట్ట విరుద్ధమైన శిస్తులు లేక ఫ్యూడల్ లెవీల రద్దు, భూస్వాముల, వారి

ఏజంట్ల అణచివేత నిలుపుదల, రుణాల తగ్గింపు, చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకొన్న భూముల్ని తిరిగి యిచ్చివేయుట, కౌలుదారులకు రక్షణ కల్పించుట. ఆంధ్ర, గుజరాత్ లాంటి కొన్ని ప్రాంతాలలో మినహాయించి వ్యవసాయ కార్మికుల డిమాండ్లు ఉద్యమంలో భాగం కాలేదు. ఈ డిమాండ్లు న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన హక్కులపై రైతాంగానికి గల చైతన్యంపై ఆధారపడివుంటాయి. రైతులకు చట్టవిరుద్ధంగా కన్పించిన అధికపన్నులు, అధిక కౌళ్ళు, చట్ట విరుద్ధమైన శిస్తులు, వెట్టిచాకిరి, రైతులు తమవిగా భావించే భూమిపై హక్కులు వగైరాలను భూస్వాములు ప్రభుత్వం నిరాకరించినప్పుడు రైతులు తమకు గల సంఘపరమైన యితరములైన వనరులను సేకరించుకొని ప్రతిఘటించేందుకు సిద్ధపడ్డారు. కాని చట్టబద్దమైనవిగా వారు పరిగణించిన ప్రభుత్వం యొక్క, భూస్వాముల యొక్క డిమాండ్లను గౌరవించడం కొనసాగించారు.

రైతులు తమ డిమాండ్ల కొరకు చేసిన పోరాటాలు ప్రస్తుత వ్యవసాయ చక్రాన్ని కూలదోయటానికి ఉద్దేశింపబడినవి కావు. అణచివేతను తగ్గించడానికి చేసినవి మాత్రమే. అయినప్పటికీ అవి భూస్వామ్యవర్గాల అధికారాన్ని చాలా విధాలుగా తగ్గించాయి. వ్యవసాయచక్రం మార్పుకి రంగాన్ని సిద్ధం చేశాయి. రైతుల చైతన్యాన్ని పెంచటం, పెరిగిన చైతన్యాన్ని ఆధారం చేసుకొని ఉద్యమాలు నిర్మించడం – రైతుసంఘం తన కర్తవ్యంగా పనిచేసింది.

మొత్తం మీద వివిధ ప్రాంతాలలో రైతు ఉద్యమాలు అమలు జరిపిన పోరాట రూపాలలో వారి డిమాండ్లలో లాగానే సారూప్యత వున్నది. సమావేశాలు, సదస్సులు, సభలు, ప్రదర్శనలు, సభ్యత్వ నమోదు, సంఘాల నిర్మాణం ద్వారా రైతులను సమీకరించారు. ప్రత్యక్ష చర్యలు సాధారణంగా సత్యాగ్రహం లేక సహాయ నిరాకరణ, శిస్తులు, పన్నుల చెల్లింపు నిరాకరణ పద్ధతులలో సాగాయి. ఇవన్నీ జాతీయోద్యమం చాలాకాలం నుండి అనుసరిస్తున్న పోరాట రూపాలే. జాతీయోద్యమంలో లాగానే హింసాత్మక ఘర్షణలు మినహాయింపులేగానీ సర్వసామాన్యంగావు. అవి తీవ్రమైన అణచివేతకు ప్రజల స్పందనలే గాని నాయకత్వం ఆమోదంతో జరిగినవికావు.

జాతీయోద్యమంతో రైతు ఉద్యమానికి గల సంబంధం కీలకమైనది; అవిభాజ్యమైనది. తొలుత జాతీయోద్యమంలోనికి వచ్చిన పంజాబ్, కేరళ, ఆంధ్ర, యు.పి., బీహార్ ప్రాంతాలలో రైతు ఉద్యమం చురుకుగా పనిచేసింది. జాతీయోద్యమ వ్యాప్తి రైతాంగ పోరాటాలకు అవసరమైన పరిస్థితులను సృష్టించింది.

రైతు ఉద్యమం జాతీయవాద సిద్ధాంతాన్ని అంగీకరించింది. దానిని ఆధారంగా చేసుకొని పనిచేసింది. రైతు ఉద్యమ నాయకులు, కార్యకర్తలు వర్గపరంగా రైతు ఉద్యమ సందేశాన్ని ప్రచారం చేయడమేగాక జాతీయ స్వాతంత్ర్యాన్ని గురించి ప్రచారం చేశారు. ఇంతకుముందు ప్రస్తావించినట్లు చాలా ప్రాంతాలలో రైతు ఉద్యమ కార్యకర్తలు కిసాన్‌సభ సభ్యత్వంతో పాటు కాంగ్రెస్ సభ్యత్వం చేర్పించారు.

బీహార్ లాంటి కొన్ని ప్రాంతాలలో కాంగ్రెస్‌లోని కొన్ని సెక్షన్లకు కిసాన్‌సభకి మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తాయి. కొన్ని సందర్భాలలో కిసాన్‌సభ కాంగ్రెస్‌తో ఘర్షణపడే వైఖరి నవలంబించింది. ఈ వైఖరికి కారణం వామపక్ష కార్యకర్తలు, కాంగ్రెస్ మితవాదులు విపరీతమైన ధోరణులతో సర్దుకుపోయేందుకు విముఖత చూపడం. 1942కి ముందు ఈ విభేదాలు అంతర్గతంగా వుండేవి. కిసాన్ ఉద్యమానికి జాతీయోద్యమానికి విస్తృతమైన సామాన్యమైన ప్రాతిపదిక వుంది. 1942 చీలిక అనుభవంతో కిసాన్ ఉద్యమం జాతీయోద్యమంతో విభేదించి చాలా దూరం పోయినట్లు గమనించింది. తన ప్రజా పునాదిని కోల్పోతున్నట్లుగానే గాక నాయకత్వ శ్రేణులలో విభేదాలు సృష్టించబడ్డాయని గూడా గుర్తించింది. మొత్తంమీద రైతు ఉద్యమం పెరుగుదల అభివృద్ధి జాతీయ పోరాటంతో విడివడని విధంగా అనుసంధానం చేయబడింది.

* * *

# 28 స్వదేశీ సంస్థానాలలో స్వాతంత్ర్య పోరాటం

**భా**రతదేశంపై విజయం సాధించడంలో బ్రిటిషు పాలకులు అవలంబించిన చిత్ర విచిత్రమైన పద్ధతి, దేశంలోని వివిధ ప్రాంతాలను వలసపాలన క్రిందికి తీసుకొని రావడంలో పన్నిన మాయోపాయాల ఫలితంగా ఉపఖండంలోని ఐదింట రెండువంతులు స్వదేశీ సంస్థానాధీశుల పరిపాలనలో వుండిపోయింది. స్వదేశీ సంస్థానాధీశుల క్రింద వున్న ప్రాంతాలు హైదరాబాద్, మైసూర్, కాశ్మీరులాంటివి యూరపు దేశాలంత విస్తీర్ణమైనవి. అలాగాక కొన్నివేల జనాభా మాత్రమే గలిగిన చిన్న రాజ్యాలూ వున్నాయి. ఈ పెద్ద చిన్న సంస్థానాలు అన్నీ కూడా బ్రిటీషు సార్వభౌమాధికారాన్ని అంగీకరించాయి.

అందుకు ప్రతిఫలంగా సంస్థానాధీశుల నిరంకుశాధికారానికి లోపల నుండి వెలుపల నుండి ప్రమాదం రాకుండా బ్రిటిషుపాలకులు రక్షణ కల్పించారు. చాలా స్వదేశీ సంస్థానాలలో నిరంకుశపాలన సాగింది. అధికారం అంతా పాలకుని చేతిలో అతడి ఆశ్రితుల చేతుల్లో కేంద్రీకృతమయింది. భూమి శిస్తు సాధారణంగా బ్రిటిషిండియాలో కంటే ఎక్కువగా వసూలు చేయబడింది. చట్టబద్ధమైన పరిపాలన, పౌరహక్కులు దాదాపు లేవనే చెప్పాలి. ప్రభుత్వాదాయంపై పాలకులకు విశృంఖలమైన అధికారం వుండేది. ఫలితంగా పాలకుల విలాసవంతమైన ఆడంబర జీవితాలు, ప్రభుత్వాదాయం వృథా – సర్వసామాన్యాలు. కాని కొందరు చైతన్యవంతులైన పాలకులు వారి మంత్రులు పాలనా నిర్వహణలో, పన్నుల విధానంలో సంస్కరణలు చేపట్టేందుకు, పాలనా వ్యవహారాలలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించేందుకు కొన్ని ప్రయత్నాలు చేశారు. కాని అత్యధిక స్వదేశీ సంస్థానాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ విద్యాపరమైన వెనుకబాటు తనానికి నిలయాలుగా వుండిపోయాయి.

బ్రిటిషు ప్రభుత్వం చేపట్టిన విధానాలు స్వదేశీ సంస్థానాలను వెనుకబాటుతనంలోకి నెట్టివేశాయి. జాతీయోద్యమ బలం పెరిగినప్పుడు బ్రిటిషు ప్రభుత్వం సంస్థానాధీశులను రక్షణ ప్రాకారాలుగా ఉపయోగించుకొన్నది. బరోడా మహారాజాలాంటి వారెవరైనా జాతీయవాదంపై కాస్త సానుభూతి వ్యక్తం చేస్తే వారిపై ఒక కన్నువేసి వుంచింది. బ్రిటిషు పాలకులు నియమించిన రాజప్రతినిధుల పర్యవేక్షణ, జోక్యంతో సంస్కరణలు చేపట్టాలనే పాలకుల చొరవ నీరుగారిపోయింది. అయినప్పటికీ కొన్ని గౌరవప్రదమైన మినహాయింపులు వున్నాయి. బరోడా, మైసూరు – లాంటి కొన్ని సంస్థానాలు పారిశ్రామిక వ్యవసాయాభివృద్ధి, పాలనాపరమైన రాజకీయ సంస్కరణలు, గణనీయమైన స్థాయిలో విద్యని ప్రోత్సహించడంలో జయప్రదమయ్యాయి.

* * *

బ్రిటిషిండియాలో జాతీయోద్యమం వేసిన ముందడుగు దానితోపాటు ప్రజాస్వామ్యం బాధ్యతాయుత ప్రభుత్వం, పౌరహక్కులు, రాజకీయ చైతన్యం– ఇవన్నీ స్వదేశీ సంస్థానాల ప్రజలపై అనివార్యమైన ప్రభావాన్ని చూపాయి. 20వ శతాబ్దం మొదటి, రెండవ దశాబ్దాలలో బ్రిటిషిండియా నుండి ఆశ్రయం కొరకు సంస్థానాలకు పారిపోయి తలదాచుకొన్న తీవ్రవాదులు సంస్థానాలలో రాజకీయ చైతన్యం పెరగడానికి కారకులయ్యారు. 1920లో ప్రారంభించబడిన సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాలు చాలా శక్తివంతమైన ప్రభావం చూపాయి. ఈ కాలంలో ఈ ఉద్యమాల ప్రభావంతో స్వదేశీ సంస్థానాలలో అసంఖ్యాకమైన స్థానిక ఉద్యమాలు పుట్టాయి. మైసూరు, హైదరాబాద్, బరోడా, కథియవాడ్, దక్కన్ సంస్థానాలు, జామ్‌నగర్, ఇండోర్, నవాన్‌గర్ లాంటి సంస్థానాలలో ప్రజా సదస్సులు నిర్వహింపబడ్డాయి. ఈ క్రమానికి పతాకస్థాయిగా 1927 డిసెంబర్‌లో అఖిలభారత స్వదేశీ సంస్థాన ప్రజాసభ (AISPC) నిర్వహింపబడింది. దీనికి వివిధ స్వదేశీ సంస్థానాల నుండి 700మంది రాజకీయ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ చొరవకి ప్రధాన బాధ్యులు బల్వంత్‌రాయ్ మెహతా, మానిక్‌లాల్ కొఠారి, జి.ఆర్.అభయంకర్.

సంస్థానాధీశులు వారివారి సంస్థానాలలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి, భారత జాతీయ కాంగ్రెస్ మొదటిసారిగా 1920లో నాగపూర్‌లో స్వదేశీ సంస్థానాలపై తమ విధానాన్ని ప్రకటించింది. కాని కాంగ్రెస్, సంస్థానాల ప్రజలు కాంగ్రెస్‌లో సభ్యులుగా చేరటాన్ని అనుమతిస్తూనే, వారు

వ్యక్తిగతంగా గాని లేక స్థానిక రాజకీయ సంస్థల సభ్యులుగా గాని రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించవచ్చును గాని కాంగ్రెస్ సభ్యులుగా కాదని స్పష్టం చేసింది. బ్రిటిషిండియా స్వదేశీ సంస్థానాల మధ్య, వాటిలోని వివిధ రాష్ట్రాల మధ్య రాజకీయ పరిస్థితులలో గల తేడాలు, సభలు పెట్టుకొనే హక్కుతోపాటు పౌరహక్కులు లేకపోవడం, రాజకీయ చైతన్యంలో వెనుకబాటుతనం, స్వదేశీ సంస్థానాలు చట్టపరంగా స్వతంత్ర రాజ్యాలు కావడం– లాంటివి బ్రిటిషిండియాలోను స్వదేశీ సంస్థానాలలోనూ ఉద్యమ ప్రయోజనాలకు ఆటంకాలుగా నిలిచాయి. స్వదేశీ సంస్థానాల ప్రజలు వారి డిమాండ్లు సాధించుకొనడానికి వారి బలాన్ని కూడగట్టుకొని శక్తిని ప్రదర్శించాలన్నది కాంగ్రెస్. అఖిల భారత స్వదేశీ సంస్థాన ప్రజాసభ (AISPC)తో సహా కాంగ్రెస్‌కి స్వదేశీ సంస్థానాలలోని వివిధ ప్రజాసంఘాల మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగాయి. 1927లో కాంగ్రెస్ తన 1920నాటి తీర్మానాన్ని పునరుద్ఘాటించింది. 1929లో జవహర్‌లాల్ నెహ్రూ లాహోర్ కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసంలో యిలా ప్రకటించారు. "స్వదేశీ సంస్థానాలు మిగిలిన భారతదేశానికి దూరంగా వుండజాలవు... స్వదేశీ సంస్థానాల భవిష్యత్‌ను నిర్ణయించే హక్కు ఆయా సంస్థానాల ప్రజలదే". తరువాతి సంవత్సరాలలో ప్రజల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ సంస్థానాధీశులను డిమాండ్ చేసింది.

1930ల మధ్యకాలంలో రెండు పరిణామాలు స్వదేశీ సంస్థానాలలోని పరిస్థితులలో స్పష్టమైన మార్పులు తెచ్చాయి. మొదటిది: 1935 భారత ప్రభుత్వ చట్టం సమాఖ్య పథకాన్ని ప్రతిపాదించింది. దీని ప్రకారం స్వదేశీ సంస్థానాలకు బ్రిటిషిండియాతో ప్రత్యక్ష రాజ్యాంగపరమైన సంబంధం ఏర్పడింది. సంస్థానాలు తమ ప్రతినిధులను సమాఖ్య చట్టసభ (Federal Legislature)కి పంపించవలసి వుంటుంది. ఇక్కడ గమనించవలసిన అంశం: ఈ ప్రతినిధులు సంస్థానాధీశులచే ఎంపిక చేయబడేవారేగాని, ప్రజలచేత ఎన్నుకోబడేవారుకాదు. వీరు సమాఖ్య చట్టసభలో మూడింట ఒకవంతు వుంటారు. వీరు జాతీయవాద ఒత్తిడిని అడ్డుకుంటూ బ్రిటిషు ప్రభుత్వానికి విధేయులుగా పనిచేస్తారు. భారత జాతీయ కాంగ్రెస్, ఎ.ఐ.ఎస్.పి.సి. సంస్థానాలలోని ప్రజాసంఘాలు ఈ ఎత్తుగడలోని సామ్రాజ్యవాద యుక్తిని స్పష్టంగా గ్రహించాయి. సంస్థానాల నుండి పంపించబడే ప్రతినిధులు ఎంపిక చేయబడినవారుగాక ప్రజలచేత ఎన్నుకొనబడినవారుగా వుండాలని డిమాండు చేశాయి. దీనితో సంస్థానాలలో బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం కొరకు డిమాండ్ ముందుకు వచ్చింది.

రెండవ పరిణామం: 1937లో బ్రిటిషిండియాలోని మెజారిటీ రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రివర్గాలు అధికారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సంస్థానాల ప్రజలలో ప్రభుత్వాల నుండి ఆశించే అంచనాలు పెరిగాయి. ప్రజల ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. నూతన రాజకీయ కార్యకలాపాలకు ఊపునిచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షంలో వున్న పార్టీ మాత్రమేకాదు. అధికారంలో వుండి యిరుగు పొరుగున వున్న సంస్థానాలలోని పరిణామాలను ప్రభావితం చేయగల పార్టీ. ఇక సంస్థానాధీశులు కూడా నూతన రాజకీయ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోవలసివచ్చింది.

1938, 1939 సంవత్సరాలు స్వదేశీ సంస్థానాలలో నూతన చైతన్యానికి ప్రతీకలుగా నిలిచే సంవత్సరాలు. బాధ్యతాయుత ప్రభుత్వాన్ని యితర సంస్కరణలనూ డిమాండ్ చేస్తూ చాలా ఉద్యమాలు చేపట్టిన సంవత్సరాలు. అంతకుముందు ఎలాంటి సంఘాలు లేని సంస్థానాలలో ప్రజామండళ్ళు పుట్టుకొచ్చాయి. జయపూర్, రాజకోట్, పాటియాల, హైదరాబాద్, మైసూర్, తిరువాన్కూర్, ఒరిస్సాలలో పెద్ద పోరాటాలు చెలరేగాయి.

ఈ నూతన పరిణామాలు కాంగ్రెస్ విధానంలో కూడా గణనీయమైన మార్పులు తీసుకొనివచ్చాయి. స్వదేశీ సంస్థానాలలో ఉద్యమాలు కాంగ్రెస్ పేరుతో చేపట్టరాదని, తమ స్వంత బలంపై ఆధారపడి స్థానిక సంఘాల ద్వారానే పోరాటాలు నడపాలని 1938 హరిపుర కాంగ్రెస్ కూడా పాత విధానాన్ని పునరుద్ఘాటించింది. కాని కొద్ది నెలల తరువాత ప్రజలలో పెల్లుబికిన నూతన చైతన్యాన్ని, పోరాట పటిమని గమనించి గాంధీజీ, కాంగ్రెస్ వైఖరి మారింది. కాంగ్రెస్‌లోని వామపక్షవాదులు, సోషలిస్టులు అలాగే సంస్థానాలలోని రాజకీయ కార్యకర్తలు కొంతకాలం నుండి కాంగ్రెస్ వైఖరిలో ఈ మార్పు రావాలని ఒత్తిడి చేస్తూ వచ్చారు.

1939 జనవరి 24న గాంధీజీ 'టైమ్స్ ఆఫ్ ఇండియా'కి యిచ్చిన ఇంటర్వ్యూలో కాంగ్రెస్ వైఖరిలో వచ్చిన మార్పుని గురించి యిలా వివరించారు. "సంస్థానాల ప్రజలు చైతన్యవంతం కానంతవరకు, నా అభిప్రాయాన్ని అనుసరించి కాంగ్రెస్ జోక్యం చేసుకోకుండా వుండడం రాజనీతిజ్ఞత. స్వదేశీ సంస్థానాల ప్రజలలో చైతన్యం పెల్లుబికినప్పుడు వారి న్యాయబద్ధమైన హక్కుల సాధనకు కష్టనష్టాల నెదుర్కొని దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధపడినప్పుడు చట్టపరమైన, రాజ్యాంగపరమైన కృత్రిమ హద్దు ధ్వంసం చేయబడుతుంది."

ఆ తరువాత 1939లో త్రిపురి కాంగ్రెస్ తన నూతన విధానాన్ని ప్రకటిస్తూ తీర్మానం చేసింది. "స్వదేశీ సంస్థానాల ప్రజలలో పెల్లుబుకుతున్న చైతన్యం కాంగ్రెస్ తనకు తానుగా పెట్టుకొన్న అవరోధాన్ని తొలగించడానికి దారితీస్తున్నది; ఫలితంగా సంస్థానాల ప్రజలతో మరింతగా మమేకమవుతుంది" భారతదేశంలోను స్వదేశీ సంస్థానాలలోను రాజకీయ పోరాటాలు జాతీయ ఉమ్మడి లక్ష్యాల ప్రాధాన్యాన్ని ప్రదర్శించడానికా అన్నట్లు అఖిల భారత సంస్థాన సభ 1939 లూధియానా సదస్సు జవహర్‌లాల్ నెహ్రూని అధ్యక్షునిగా ఎన్నుకొన్నది.

హఠాత్తుగా వచ్చిపడిన రెండవ ప్రపంచ యుద్ధం రాజకీయ వాతావరణంలో స్పష్టమైన మార్పుని తెచ్చింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేశాయి. ప్రభుత్వం ఇండియా రక్షణ చట్టంతో సాయుధమయింది. సంస్థానాలలోని రాజకీయ కార్యకలాపాలపై అసహనాన్ని పెంచుకొన్నది. 1942 క్విట్ ఇండియా ఉద్యమంతో పరిస్థితులు తారాస్థాయికి చేరుకొన్నాయి. బ్రిటిషిండియా స్వదేశీ సంస్థానాల మధ్యగల విభజన రేఖను కాంగ్రెస్ తుడిచివేసింది. పోరాటం కొరకు యిచ్చిన పిలుపు సంస్థానాల ప్రజలకు విస్తరించబడింది. సంస్థానాల ప్రజలు బాధ్యతాయుత ప్రభుత్వం డిమాండ్‌తో పాటు భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. బ్రిటిషువారిని దేశం వదలివెళ్ళమన్నారు. స్వదేశీ సంస్థానాలు భారతదేశంలో అవిచ్ఛిన్న భాగాలన్నారు.

యుద్ధం ముగిసిన తరువాత అధికార మార్పిడి కొరకు ప్రారంభమైన సంప్రదింపులతో స్వదేశీ సంస్థానాల సమస్య ముఖ్యమైన సమస్యగా ముందుకు వచ్చింది. బ్రిటిషు సార్వభౌమాధికారం రద్దవడం, స్వదేశీ సంస్థానాలు చట్టబద్ధంగా స్వతంత్రమవడంతో ఏర్పడిన సంక్లిష్ట సమస్యని పరిష్కరించడంలో జాతీయ నాయకత్వం ప్రత్యేకించి సర్దార్ పటేల్ చాలా సంయమనంతోను, దృఢంగానూ వ్యవహరించారు. చాలా సంస్థానాలు నచ్చజెప్పడంతో, దౌత్యపరమైన ఒత్తిడితో, ప్రజా ఉద్యమాలతో – వీటన్నిటి కలయికతో విలీనానికి అంగీకరించాయి. కాని తిరువాన్కూరు, జూనాగడ్, కాశ్మీర్, హైదరాబాద్ లాంటి కొన్ని సంస్థానాలు చివరి వరకూ లొంగకుండా భీష్మించుకొని కూర్చున్నాయి. హైదరాబాద్ చివరి వరకూ లొంగకుండా స్వతంత్ర రాజ్యంగా వుండాలని పట్టుపట్టింది.

స్వదేశీ సంస్థానాలలోని రాజకీయ కార్యకలాపాల విధానాన్ని అర్థం చేసుకొనేందుకు రాజ్‌కోట, హైదరాబాద్ సంస్థానాలలోని ఉద్యమాలను అధ్యయనం చేయడం అర్థవంతంగా వుంటుంది. ఒకటి అన్నింటికంటె చిన్నది. మరొకటి అన్నిటికంటె

పెద్దది. ఒకటి గాంధీజీ జోక్యంతో ప్రసిద్ధిగాంచింది. మరొకటి 1947లో ఇండియన్ యూనియన్‌లో విలీనమయ్యేందుకు తిరస్కరించి, సాయుధ జోక్యాన్ని అనివార్యం చేసింది.

* * *

రాజ్‌కోట కథియవాడ ద్వీపకల్పంలోని 75,000 జనాభా గల చిన్న స్వదేశీ సంస్థానం. బ్రిటిషు రాజకీయ ప్రతినిధి రాజ్‌కోటలో వుంటూ చాలా సంస్థానాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తుంటాడు గనుక రాజ్‌కోట దాని పరిమితికి మించిన ప్రాధాన్యతగల స్వదేశీ సంస్థానం.

రాజ్‌కోట 20 సంవత్సరాల పాటు – 1930 వరకు లఖాజిరాజ్‌చే పరిపాలింపబడింది. ఆయన తన సంస్థానం పారిశ్రామికంగా, విద్యాపరంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి అత్యంత శ్రద్ధ వహించాడు. ఆయన 1923లోనే ప్రజాప్రతినిధి సభను ప్రారంభించడం ద్వారా ప్రభుత్వంలో ప్రజల ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించాడు. ప్రజాప్రతినిధి సభలో ప్రజలచే వయోజన ఓటింగ్ హక్కు ద్వారా ఎన్నుకోబడిన 90మంది ప్రతినిధులు వుండేవారు. ఆ కాలంలో అందునా సంస్థానాధీశుడు ప్రజలకు అలాంటి అవకాశం కల్పించడం చాలా విపరీతం. పాలకుడిని ఠాకూర్ సాహిబ్ అని పిలిచేవారు. ఠాకూర్ సాహిబ్‌కు ఏ సలహానైనా వీటోచేసే అధికారం వున్నప్పటికీ ఆయన పాలనలో ప్రజాప్రాతినిధ్యానికి చట్టబద్ధత కల్పించాడు.

లఖాజిరాజ్ విఠల్‌భాయ్ పటేల్ అధ్యక్షతన 1921లో రాజ్‌కోటలో మొదటి కథియవాడ రాజకీయ సదస్సు జరుపుకొనడానికి మన్‌సుఖ్‌లాల్ మెహతా, అమృతలాల్ సేఠీలకు అనుమతి యిచ్చి జాతీయవాద రాజకీయ కార్యకలాపాలను ప్రోత్సహించాడు. ఆయన రాజ్‌కోట, భావనగర్ సదస్సులకు హాజరయ్యాడు. రాజ్‌కోటలో జాతీయ పాఠశాల ప్రారంభించేందుకు భూమిని విరాళంగా యిచ్చాడు. తరువాత అది రాజకీయ కార్యకలాపాల కేంద్రంగా ఎదిగింది. ఆయన బ్రిటిషు రాజప్రతినిధిని తిరస్కరించి జాతీయోద్యమ ప్రతీకగా వున్న ఖద్దరు ధరించాడు. గాంధీజీ పట్ల, గాంధీజీ సాధించిన విజయాల పట్ల ఆయనకు ఎనలేని గౌరవం. గాంధీజీని దర్బారుకి ఆహ్వానించి తన సింహాసనంపై కూర్చుండబెట్టి, తాను దర్బారులో కూర్చునేవాడు. జవహర్‌లాల్ నెహ్రూ సంస్థానాన్ని సందర్శించినప్పుడు ఆయనకు పౌర స్వాగతం ఏర్పాటు చేశాడు.

లఖాజిరాజ్ 1939లో చనిపోయాడు. ఆయనకు పూర్తిగా విరుద్ధమైన స్వభావం గల ఆయన కుమారుడు ధర్మేంద్ర సింఘ్జి పాలనా బాధ్యతలు చేపట్టాడు. కొత్త ఠాకూర్‌కి

సరదాల పట్ల మక్కువ ఎక్కువ. అసలైన అధికారం దివాన్జీ వీరవాలా చేతులకు చిక్కింది. సంస్థాన ఖజానాని క్రమంగా కరిగిస్తున్న ఠాకూర్ విలాస జీవితాన్ని అడ్డుకునేందుకు దివాన్జీ ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. అగ్గిపెట్టెలు, చక్కెర, బియ్యం, సినిమా లైసెన్సులపై సంస్థానానికి గల గుత్తాధికారాలను వ్యక్తిగత వ్యాపారులకు అమ్ముకొనడం ప్రారంభమయింది. ఫలితంగా ధరలు పెరిగాయి. అప్పటికే ఠాకూర్ విలాస జీవితం గడుపుతూ ప్రతినిధి సభకి కాలపరిమితి గడచిపోయినా పట్టించుకొనకపోవడం, ప్రభుత్వంలో ప్రజల భాగస్వామ్యం పట్ల శ్రద్ధలేకపోవడం– లాంటి కారణాలతో ప్రజల అసంతృప్తి పెరిగింది.

రాజ్‌కోట కథియవాడలలో చాలా సంవత్సరాలుగా రాజకీయ గ్రూపులు సాగించిన కార్యకలాపాలు పోరాటానికి రంగాన్ని సిద్ధం చేశాయి. మొదట మన్‌సుఖ్‌లాల్ నాయకత్వంలోను, ఆ తరువాత బల్వంత్‌రాయ్ మెహతా నాయకత్వంలో మొదటి గ్రూపు, ఫూల్‌చంద్‌షా నాయకత్వంలో రెండవ గ్రూపు, ప్రజలాల్ శుక్లా నాయకత్వంలో మూడవ గ్రూపు, గాంధేయ పద్ధతులలో నిర్మాణాత్మక కార్యకర్తలు కలిగి 1936 తరువాత యు.ఎన్. నాయకత్వంలో నాల్గవ గ్రూపు పోరాటాలు జరిపాయి.

గాంధేయవాదియైన జేఠాలాల్ జోషి నాయకత్వంలో మొదటి పోరాటం ప్రారంభమయింది. సంస్థాన యాజమాన్యంలో గల ప్రత్తి మిల్లు కార్మికులు 800మంది సంఘంగా ఏర్పడి తమ పని పరిస్థితుల మెరుగుదల కోసం 1936లో 21 రోజులపాటు సమ్మె చేశారు. యూనియన్ డిమాండ్లను దర్బారు ఆమోదించవలసి వచ్చింది. ఈ విజయం 8 సంవత్సరాలుగా ఆగిపోయిన రాజకీయ పరిషత్ సమావేశాలను జరిపేలా ప్రోత్సహించింది. సదస్సుకి 15,000 ప్రజలు హాజరయ్యారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏర్పడాలని డిమాండ్ చేశారు. ఇంకా పన్నుల తగ్గింపుని, ప్రభుత్వ వ్యయం తగ్గింపుని డిమాండ్ చేశారు.

దర్బారు నుండి ఎలాంటి స్పందన లేదు. పరిషత్ కార్యకర్తలు 1938 ఆగస్టు 15 గోకులాష్టమి సంత వద్ద సాగుతున్న జూదానికి (జూదంపై గుత్తాధికారం కార్నివాల్ అనే వ్యక్తికి అమ్మివేయబడింది) వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముందుగా వేసుకొన్న పథకం ప్రకారం నిరసనకారులను మొదట ఏజెన్సీ పోలీసులు, ఆ తరువాత సంస్థానానికి చెందిన పోలీసులు లాఠీలతో దారుణంగా కొట్టారు. ఫలితంగా రాజ్‌కోటలో పూర్తి హర్తాళ్ పాటించబడింది. సర్దార్ పటేల్ అధ్యక్షతన పరిషత్ సదస్సు సెప్టెంబర్ 5న నిర్వహించబడింది. దివాన్ వీరవాలాని పటేల్ పరిషత్ ప్రతినిధిగా కలిశాడు.

బాధ్యతాయుత ప్రభుత్వం కొరకు ప్రతిపాదనలను, కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతినిధి సభకు కొత్తగా ఎన్నికలు జరపాలని, భూమిశిస్తు 15శాతం తగ్గించాలని, అన్ని రకాల గుత్తాధిపత్యాలను రద్దు చేయాలని, ప్రభుత్వ ఖజానానుండి పాలకుని వాటాను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లని అంగీకరించడానికి బదులుగా పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఒక బ్రిటిషు అధికారిని దివాన్‌గా నియమించవలసిందిగా దర్బార్ రాజప్రతినిధిని కోరింది. సెప్టెంబర్ 12న కేడెల్ దివాన్ బాధ్యతలు చేపట్టారు. తెరవెనుక నుండి నాటకం నడిపించేందుకు వీరవాలా ఠాకూర్‌కి ప్రైవేట్ సలహాదారుడయ్యాడు.

శిస్తు చెల్లింపుల నిరాకరణ, గుత్తహక్కుల తిరస్కరణ, విద్యుత్, బట్టలతో సహా ప్రభుత్వం ఉత్పత్తి చేసే అన్ని వస్తువుల బహిష్కరణలతో సత్యాగ్రహం తీవ్రరూపం దాల్చింది. ప్రభుత్వ పత్తి మిల్లులో సమ్మెలు, విద్యార్థుల సమ్మెలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అన్ని దారులు మూసివేయాలని నిర్ణయాలు జరిగాయి.

సర్దార్‌పటేల్ పూర్తికాలం రాజ్‌కోటలో వుండకపోయినప్పటికీ ప్రతిరోజు సాయంత్రం రాజ్‌కోట నాయకుల నుండి టెలిఫోన్ ద్వారా సమాచారం తెలుసుకొంటున్నాడు. వలంటీర్లు కథియవాడ, యితర ప్రాంతాల నుండి బ్రిటిషుపాలనలో వున్న గుజరాత్, బొంబాయిల నుండి రావడం ప్రారంభమయింది. ఉద్యమం పథకం ప్రకారం నిర్మాణబద్ధంగా సాగింది. ఒక నాయకుని అరెస్టుచేస్తే మరొక నాయకుడు బాధ్యతలు చేపట్టేవాడు. వార్తాపత్రికలలో ప్రచురించిన కోడ్ నెంబర్లు సత్యాగ్రహి రావల్సిన తేదీని, రాజ్‌కోటలోని ఏర్పాట్లను తెలియజేసేవి.

నవంబర్ చివరినాటికి రాజ్‌కోటలో కాంగ్రెస్ గెలిస్తే వచ్చే ఏడాది పరిణామాలను గురించి బ్రిటిషువారు ఆందోళన చెందారు. "రాజ్‌కోటలో కాంగ్రెస్ గెలిస్తే ఉద్యమం కథియవాడకి విస్తరిస్తుంది. అప్పుడు వారి కార్యకలాపాలు అన్ని దిశలకు విస్తరింపజేస్తారు" – వైస్రాయ్ భారత రాజ్య కార్యదర్శికి టెలిగ్రాం పంపించాడు.

కాని దర్బారు రాజకీయశాఖ యొక్క సలహాని విస్మరించి సర్దార్ పటేల్ ఒప్పందంతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఠాకూర్ రాజభరణంపై పరిమితి విధించాలని, ప్రజలకు విస్తృతమైన అధికారాలు యిచ్చేవిధంగా సంస్కరణల పథకాన్ని రూపొందించేందుకు 10మంది సభ్యులతో ఒక కమిటీని నియమించాలని 1938 డిసెంబర్ 26న ఒక ఒప్పందం కుదిరింది. ఠాకూర్ సర్దార్ పటేల్‌కి పంపించిన లేఖలో 'కమిటీలోని

10మంది సభ్యులలో సర్దార్‌పటేల్ ఏడుగురిని సిఫార్సు చేస్తారని, వారిని తాము నియమిస్తాం' అని పేర్కొన్నారు. ఖైదీలందరూ విడుదల చేయబడతారు. సత్యాగ్రహం విరమించబడుతుంది.

కాని ఠాకూర్ యొక్క అలాంటి బాహాటమైన ఉల్లంఘనని బ్రిటిషు ప్రభుత్వం ఆమోదించదు. రాజప్రతినిధి, రాజకీయ విభాగం, వైస్రాయ్, భారత రాజ్య కార్యదర్శి చర్చలు జరిపి సర్దార్ ఎంపిక చేసిన సభ్యులను ఠాకూర్ ఆమోదించకూడదని, రాజప్రతినిధితో సంప్రదించి సభ్యుల్ని ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దానికనుగుణంగా సర్దార్ పంపించిన పేర్ల జాబితా తిరస్కరింపబడింది. జాబితాలో బ్రాహ్మణుల, వైశ్యుల పేర్లు మాత్రమే వున్నాయని రాజ్‌పుట్‌లకు, ముస్లిములకు యితర అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేదని సాకు చూపబడింది.

ఒప్పందాన్ని ప్రభుత్వం ఉల్లంఘించడంతో 1939 జనవరి 26న సత్యాగ్రహం తిరిగి చేపట్టబడింది. ప్రభుత్వం తీవ్ర నిర్బంధకాండ ప్రయోగించింది. రాజ్‌కోట వెలుపల వున్న జాతీయవాదులు ఆగ్రహోదగ్రులయ్యారు. రాజ్‌కోటలో పుట్టి పెరిగిన గాంధీజీ సతీమణి కస్తూరిబాయిని ఈ ఘటనలు కలచివేశాయి. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ, అందరూ వారించినప్పటికీ ఆమె రాజకోట వెళ్ళాలని నిర్ణయించుకొన్నది. ఆమె రాజకోట చేరగానే ఆమెని, ఆమె సహచరురాలు సర్దార్‌పటేల్ కూతురు అయిన మణిబెన్ పటేల్‌ని అరెస్టు చేసి రాజ్‌కోటకు 16 మైళ్ళ దూరంలో వున్న ఒక గ్రామంలో నిర్బంధించారు.

రాజకోటలో చాలా నాటకీయ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. గాంధీజీ రాజకోట వెళ్ళాలని నిర్ణయించుకొన్నాడు. ఒప్పందాన్ని ఠాకూర్ ఉల్లంఘించడం తీవ్రమైన విషయంగా పరిగణించానని, ఠాకూర్ చర్యని ప్రతిఘటించడం ప్రతి సత్యాగ్రహి బాధ్యత అని పేర్కొన్నాడు. సంస్థానంతోను, ఠాకూర్ కుటుంబంతోను సన్నిహిత సంబంధాలుండడం వలన తాను వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవడం సమంజసమేనన్నాడు.

సంప్రదింపులకు మార్గం సుగమంచేసేందుకు మూకుమ్మడి సత్యాగ్రహం విరమించబడింది. రాజప్రతినిధితోను, ఠాకూర్‌తోను, దివాన్‌తోను పలుదఫాలుగా సాగించిన చర్చలు ఎలాంటి ఫలితాలను యివ్వలేదు. మార్చి 3నాటికి సర్దార్‌తో చేసుకొన్న ఒప్పందాన్ని అమలుజరపకపోతే తాను ఆమరణ నిరాహారదీక్ష చేపడతానని గాంధీజీ తుది హెచ్చరిక జారీ చేశాడు. ఠాకూర్ గానీ, తెరవెనుక వుండి అధికారాన్ని చెలాయిస్తున్న వీర్‌వాలాగానీ స్పందించలేదు. గాంధీజీకి నిరాహారదీక్ష పూనడం తప్ప మార్గాంతరం లేకపోయింది.

నిరాహారదీక్ష దేశవ్యాప్త నిరసనకి సంకేతం. గాంధీజీ ఆరోగ్యం అంతంత మాత్రంగా వుంది. నిరాహారదీక్ష ఎక్కువకాలం కొనసాగడం చాలా ప్రమాదకరం. దేశవ్యాప్తంగా హర్తాళ్ళు జరిగాయి. శాసనసభ వాయిదా పడింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేస్తాయని హెచ్చరికలు వెలువడ్డాయి. జోక్యం చేసుకోవలసిందిగా వైస్రాయికి కుప్పలు తెప్పలుగా టెలిగ్రాంలు పంపబడ్డాయి. ఠాకూర్ తన వాగ్దానాన్ని అమలుజరిపేలా ఒత్తిడి చేయమని బ్రిటిషు సార్వభౌమాధికారానికి గాంధీజీ విజ్ఞప్తి చేశాడు. ఠాకూర్ ఒప్పందాన్ని ఉల్లంఘించాడా లేదా? – పరిశీలించమని వైస్రాయి మార్చి 7న భారత ప్రధాన న్యాయమూర్తి సర్ మౌరిస్ గయర్‌ని ఆదేశించాడు. ఇది సరియైన చర్యగా భావించి గాంధీజీ నిరాహారదీక్ష విరమించాడు.

కమిటీలో సర్దార్ ఎంపిక చేసిన ఏడుగురు ప్రతినిధులను తీసుకొనేందుకు ఠాకూర్ ఒప్పుకొన్నాడని 1939 ఏప్రిల్ 3న ప్రధాన న్యాయమూర్తి తీర్పు ధృవీకరించింది. మరలా సమస్య ఠాకూర్ దగ్గరికి వచ్చింది. కాని రాజ్‌కోట మనస్సు మార్చుకోలేదు. సర్దార్ ప్రతినిధులు మెజారిటీగా వుండాలని అంగీకరిస్తూనే రాజ్‌పుట్, ముస్లిముల, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం వుండాలని పట్టుబట్టి గాంధీజీ చేసిన ప్రతిపాదనలను తిరస్కరించాడు.

గాంధీజీ ప్రార్థనా సమావేశాల సమయంలో రాజ్‌పుట్‌లు, ముస్లిములు గాంధీ వ్యతిరేక ప్రదర్శనలు జరిపారు. ముస్లిములకు, అణగారిన వర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని మహమ్మదాలీ జిన్నా, అంబేద్కర్‌లు డిమాండ్ చేశారు. ఒప్పందాన్ని తిరస్కరించేందుకు దర్బార్ వీటన్నింటినీ ఉపయోగించుకొన్నది. జోక్యం చేసుకొంటే నష్టపోవడం తప్ప ప్రయోజనంలేదు గనుక సార్వభౌమాధికారం మిన్నకున్నది.

ఈ దశలో గాంధీజీ తన ప్రత్యర్థుల మనస్సు మార్చడంలో వైఫల్యాన్ని విశ్లేషిస్తూ ఠాకూర్‌ని ఒప్పందానికి అంగీకరింపచేయడానికి బ్రిటిషు సార్వభౌమాధికారాన్ని ఉపయోగించడం తప్పు అనే నిర్ణయానికి వచ్చాడు. హింస తనని చెంపదెబ్బ కొట్టిందని భావించాడు. నిరాహారదీక్ష ఠాకూర్, వీర్‌వాలాలను గమనంలో పెట్టుకొని చేసివుండవలసిందని, వారి మనస్సులను మార్చేందుకు తాను పడిన బాధ యొక్క బలంపై ఆధారపడివుండవలసిందని భావించాడు. కాబట్టి ఒప్పందం నుండి ఠాకూర్‌ని తప్పించాడు. వారి సమయాన్ని వృధా చేసినందుకు వైస్రాయికి, ప్రధాన న్యాయమూర్తికి, ప్రత్యర్థులైన ముస్లిములకు, రాజ్‌పుట్‌లకు కూడా క్షమాపణలు చెప్పి రాజ్‌కోట వదలి బ్రిటిషిండియాకి వచ్చాడు.

సంస్థానాలలో ప్రతిఘటనని సంక్లిష్టం చేసే వైవిధ్యభరితమైన పరిస్థితిని రాజ్‌కోట సత్యాగ్రహం వెలుగులోకి తెచ్చింది. సంస్కరణ కొరకు చేపట్టే ప్రజా ఉద్యమాల నుండి సంస్థానాలను బ్రిటిషు ప్రభుత్వం రక్షిస్తుంది. సంస్కరణల కొరకు బ్రిటిషు ప్రభుత్వంపై ప్రజాపరమైన ఒత్తిడితెస్తే సంస్థానాల స్వయం ప్రతిపత్తి అనే చట్టపరమైన అంశాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిఘటిస్తుంది. కాని సంస్థానాలు సార్వభౌమాధికారానికి రుచించని క్రమాన్ని అనుసరించాలని కోరినప్పుడు ఈ చట్టపరమైన స్వేచ్ఛని సమయోచితంగా విస్మరిస్తుంది. అసలు సర్దార్‌తో కుదిరిన ఒప్పందాన్ని అమలు జరుపవద్దని ఆదేశించింది బ్రిటిషు ప్రభుత్వమే. సంస్థానాలకు బ్రిటిషు ప్రభుత్వానికి మధ్య అధికారాలను, బాధ్యతలను విభజించడం ప్రజాపరమైన ఒత్తిడిని నిరోధించేందుకు చూపే సాకు మాత్రమే. దీనిని బట్టి స్వదేశ సంస్థానాలలో ఉద్యమాలను అడ్డుకొనేందుకు, అణచివేసేందుకు చేపట్టే పద్ధతులు బ్రిటిషిండియాలోని పద్ధతులకు భిన్నంగా వుంటాయని స్పష్టమయింది. కాబట్టి చాలా సంవత్సరాల నుండి కాంగ్రెస్ స్వదేశ సంస్థానాలలోని ఉద్యమాలను బ్రిటిషిండియాలోని ఉద్యమాలతో కలపరాదని చెపుతూ వుండడం బహుశా తప్పుకాదేమో. స్వదేశ సంస్థానాల పరిస్థితులను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని ఉద్యమాలు నడపడానికి కాంగ్రెస్ తటపటాయించింది. ఇందుకు రాజ్‌కోట సరియైన ఉదాహరణ.

రాజ్‌కోట సత్యాగ్రహం విఫలమైనప్పటికీ, దాని శక్తివంతమైన రాజకీయ ప్రభావం స్వదేశ సంస్థానాల ప్రజలపై – ప్రత్యేకించి పశ్చిమ భారతదేశ ప్రజలపై పడింది. అంతేగాదు సంస్థానాధీశులు బతికి బట్టకట్టగలుగుతున్నారంటే కేవలం బ్రిటిషు పాలకుల అండదండల వలన మాత్రమేనని వారికి తెలియజెప్పింది. ఆ విధంగా రాజకోట పోరాటం, ఆ కాలం నాటి యితర పోరాటాలతోపాటు స్వాతంత్ర్యానంతరం స్వదేశ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనమయ్యే క్రమానికి దోహదపడింది. ఈ పోరాటాలు జరగకపోతే విలీనమయ్యే క్రమం చాలా కష్టసాధ్యమయివుండేది; చాలా కాలం పట్టివుండేది. 1947–48లో సంస్థానాలను విలీనం చేయడంలో ప్రధాన బాధ్యుడుగా వున్న వ్యక్తి సంస్థానాలపై అనేక పోరాటాలు నడిపిన దిట్ట కావడం ఆశ్చర్యజనకం కాదు.

* * *

గోడమీద రాతని చూడ నిరాకరించిన సంస్థానం ఒకటి వుంది – అది హైదరాబాద్. హైదరాబాద్ విస్తీర్ణంలోనూ, జనాభా రీత్యా స్వదేశ సంస్థానాలన్నింటిలో పెద్దది. నైజాం మూడు భాషా ప్రాంతాలకు విస్తరించి వుంది. మరాఠీ మాట్లాడేవారు (28శాతం), కన్నడం మాట్లాడేవారు (22శాతం), తెలుగు మాట్లాడేవారు (51శాతం).

1911లో నిజాం అయిన ఉస్మాన్ అలీఖాన్ 1948వరకు వ్యక్తిగత నిరంకుశాధికారంతో పరిపాలించాడు. నిజాం స్వంత ఎస్టేటు సంస్థానంలో 10వ వంతు వుండేది. దాని నుండి వచ్చిన ఆదాయం పాలకుని ఖర్చులకు వెచ్చించబడేది. సంస్థానంలో మరొక 30శాతం విస్తీర్ణం గ్రామీణ ప్రాంతాలకు చెందిన వివిధ స్థాయిల వారి జాగీర్లుగా వుండేది. చట్టవిరుద్ధమైన లెవీలు, బలవంతపు వసూళ్ళు, వెట్టిచాకిరి వగైరాలతో పాలక వర్గాలు ప్రజలను పీల్చిపిప్పి చేసేవారు.

అత్యధికంగా వున్న హిందూ జనాభా సాంస్కృతిక మతపరమైన అణచివేతకు గురయింది. ఉర్దూ కోర్టు భాష చేయబడింది. ఉర్దూ అభివృద్ధి కొరకు ఉస్మానియా యూనివర్శిటీ నెలకొల్పడంతో సహా అన్ని ప్రయత్నాలు చేయబడ్డాయి. ఇతర భాషలు - తెలుగు, మరాఠీ, కన్నడం నిరాదరణకు గురయ్యాయి. ఈ భాషలలో విద్యాభివృద్ధి కొరకు జరిగిన ప్రైవేటు ప్రయత్నాలు కూడా అడ్డుకొనబడ్డాయి. పాలనా యంత్రాంగంలో- ముఖ్యంగా పైస్థాయి ఉద్యోగాలలో ముస్లింలకు చాలా ప్రాధాన్యత యివ్వబడింది. 1920లలో వేగంగా అభివృద్ధి చెందిన ఆర్య సమాజ ఉద్యమం అణచివేయబడింది. ఆర్యసమాజ్ యొక్క మతపరమైన కార్యకలాపాల నిర్వహణకు అధికారుల అనుమతి పొందవలసి వచ్చింది. నిజాం పరిపాలన హైదరాబాద్‌ని ముస్లిం రాజ్యంగా చూప ప్రయత్నించింది. ఈ క్రమం 1927లో ఇత్తేహాద్-ఉల్-ముస్లిమిక్ స్థాపనతో వేగం పుంజుకొన్నది. 'దక్కన్‌లో ముస్లిం సర్వసత్తాక ఆధిపత్యానికి ప్రతీక నిజాం' - అనే భావనపై స్థాపించబడిన సంస్థ 'ఇత్తేహాద్ - ఉల్-ముస్లిమిక్.

ఈ విధమైన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, మతపరమైన అణచివేతల నేపథ్యంలో హైదరాబాద్‌లో రాజకీయ చైతన్యం పెరుగుదలను, నిజాం సంస్థానంలో ప్రజా ఉద్యమాల క్రమాన్ని అర్థం చేసుకోవాలి.

భారతదేశంలో యితర ప్రాంతాలలో లాగానే 1920-21నాటి సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాలు నిజాం సంస్థానంలో కూడా రాజకీయ కార్యకలాపాలకు తొలి కదలికలను సృష్టించాయి. "చరఖాలు ప్రచారం చేయబడుతున్నాయి; జాతీయ పాఠశాలలు నెలకొల్ప బడుతున్నాయి; అంటరానితనం, మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం; గాంధీజీ ఆలీ సోదరుల బ్యాడ్జీలు అమ్మబడుతున్నాయి" - లాంటి రిపోర్టులు సంస్థానంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చాయి. ఖిలాఫత్ ఉద్యమ సందర్భంగా మినహాయించి బహిరంగ సభలు అంతగా జరగలేదు. ఈ సంవత్సరాలలో హిందూ-ముస్లిం ఐక్యతని కోరే ప్రజా ప్రదర్శనలు ప్రజాదరణ పొందాయి.

తరువాత సంవత్సరాలలో నిజాం సంస్థానం వెలుపల పలుచోట్ల 'హైదరాబాద్ రాజకీయ సదస్సులు' జరపడంతో ఈ నూతన చైతన్యం వ్యక్తమయింది. ఈ సదస్సులలో బాధ్యతాయుతమైన ప్రభుత్వ విధానం యొక్క ఆవశ్యకతపై, ప్రాథమిక పౌరహక్కులపై ప్రధానంగా చర్చలు జరిగాయి. వెట్టిచాకిరి, విపరీతమైన పన్నుల భారం, మతపరమైన, సాంస్కృతికపరమైన అణచివేత– లాంటి అణచివేత విధానాలు ఖండింపబడ్డాయి.

అదే సమయంలో ప్రాంతీయంగా చైతన్యవంతమయ్యే క్రమం ప్రారంభమయింది. అందుకు చొరవచూపింది తెలంగాణా ప్రాంతం. ఆంధ్రజన సంఘం స్థాపించబడింది. తరువాత అది ఆంధ్ర మహాసభగా ఎదిగింది. గ్రంథాలయ సంఘాలు, పాఠశాలలు, పత్రికలు, వార్తా పత్రికలు, పరిశోధనా సంస్థలను స్థాపించడం ద్వారా తెలుగు భాషా సాహిత్యాలను ప్రోత్సహించడంపై కేంద్రీకరించింది. ఈ కార్యకలాపాలపై కూడా ప్రభుత్వ దాడులు సాగాయి. పాఠశాలలు, గ్రంథాలయాలు, పత్రికలు క్రమంగా మూసివేయబడ్డాయి. ఆంధ్రమహాసభ 1940 వరకు ప్రత్యక్ష రాజకీయ కార్యకలాపాలకు దూరంగా వుండిపోవలసివచ్చింది.

నిజాం సంస్థానం నుండి చాలామంది బ్రిటిషు పాలిత ప్రాంతాలకు వెళ్ళి 1930–32 సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. రాజకీయాకరణ క్రమాన్ని తీసుకొని వచ్చారు. హైదరాబాద్ జాతీయవాదులు, ప్రత్యేకించి యువకులు బ్రిటిషిండియాకు చెందిన జాతీయవాదులతో జైళ్ళలో సహజీవనం చేశారు. దేశంలోని యితర ప్రాంతాలను ఊపివేస్తున్న రాజకీయ వైఖరులలో భాగమయ్యారు. వారి రాజకీయాలలో అసహనం ప్రవేశించింది. తీవ్రమైన రాజకీయ కార్యకలాపాలు చేపట్టాలనే ఒత్తిడి బలం పుంజుకొన్నది.

1937లో నిజాం సంస్థానంలో మిగిలిన రెండు ప్రాంతాలు కూడా వారి సంఘాలను – మహారాష్ట్ర పరిషత్, కర్నాటక పరిషత్‌లను స్థాపించుకొన్నాయి. 1938లో మూడు ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు కలిసి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపించాలని నిర్ణయించారు. పేరులో కాంగ్రెస్ వున్నప్పటికీ యిది భారత జాతీయ కాంగ్రెస్ శాఖకాదు. కాని సభ్యులకు కాంగ్రెస్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి. సంస్థ స్థాపించక ముందే నిజాం ప్రభుత్వం దాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అది హిందూ మత సంస్థయని, దానిలో ముస్లిములకు సరియైన ప్రాతినిధ్యం లేదు గనుక నిషేధిస్తున్నానన్నది ప్రభుత్వం. ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల వలన ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. సత్యాగ్రహం చేపట్టాలని నిర్ణయం తీసుకొనబడింది.

ఈ సత్యాగ్రహానికి నాయకుడు స్వామి రామానంద తీర్థ. రామానంద తీర్థ మాతృభాష మరాఠీ. జాతీయవాది. సహాయ నిరాకరణోద్యమకాలంలో చదువు మానుకొన్నాడు. జాతీయ పాఠశాల, జాతీయ కళాశాలలకు హాజరయ్యాడు. బొంబాయి, షోలాపూర్‌లలో ట్రేడ్‌యూనియన్ రంగంలో పనిచేశాడు. నిజాం సంస్థానంలోని మొమినాబాద్ చేరి అక్కడ జాతీయవాద పద్ధతులలో పాఠశాల నడిపాడు. జీవన విధానంలో గాంధేయవాది. సైద్ధాంతికంగా నెహ్రూకి సన్నిహితుడు. ప్రభుత్వంతో ఘర్షణకి దిగే రాజకీయాలలోకి వచ్చేందుకు  పాతతరం నాయకులు తటపటాయిస్తున్న సమయంలో, అంటే 1938లో స్వామి నాయకుడిగా ముందుకు వచ్చాడు.

సత్యాగ్రహం 1938 అక్టోబరులో ప్రారంభమయింది. సత్యాగ్రహానికి అనుసరించిన పద్ధతి: ఒక ప్రఖ్యాత నాయకుని నాయకత్వంలో అన్ని ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు తాము కాంగ్రెస్ సభ్యులమని ప్రకటించుకొని నిషేధాన్ని ఉల్లంఘించడం, వారానికి మూడుసార్లు చొప్పున రెండు నెలల పాటు అలా చేశారు. సత్యాగ్రహులందరూ జైళ్ళకు పంపించబడ్డారు. ప్రజలు గుంపులుగా వచ్చి ఉద్యమానికి సంఘీభావాన్ని ప్రకటించారు. సత్యాగ్రహానికి ఎంపిక చేసుకొన్న కేంద్రాలు హైదరాబాద్, మరాట్వాడా ప్రాంతంలోని  ఔరంగాబాద్.

ఈ పరిణామాల పట్ల గాంధీజీ వ్యక్తిగత శ్రద్ధ వహించాడు. సత్యాగ్రహులను మంచిగా చూడమని, ప్రభుత్వ వైఖరిని మార్చుకొమ్మని సంస్థాన ప్రధానమంత్రి అక్బర్ హైదర్‌కి క్రమం తప్పకుండా లేఖలు రాశాడు. రెండు నెలల తరువాత డిసెంబరులో గాంధీజీ సూచనల మేరకు సత్యాగ్రహం విరమించబడింది.

అప్పుడు జరిగిన మరొక ఘటన కారణంగా  సత్యాగ్రహం విరమించబడింది. స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం ప్రారంభించినప్పుడే ఆర్య సమాజం, హిందూ పౌరహక్కుల సంఘం కూడా సత్యాగ్రహం ప్రారంభించాయి. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి కార్యకర్తలను రప్పించి ప్రభుత్వం సాగిస్తున్న మతపరమైన పీడనకి వ్యతిరేకంగా సత్యాగ్రహం ప్రారంభించింది ఆర్యసమాజ్. ఆర్యసమాజ్ సత్యాగ్రహంలో స్పష్టంగా మతపరమైన లక్ష్యాలున్నాయి. స్పష్టమైన రాజకీయ లక్ష్యాలతో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సెక్యులర్ సత్యాగ్రహానికి, ఆర్యసమాజ్ చేపట్టిన మతపరమైన సత్యాగ్రహానికి మధ్య తేడాని గ్రహించలేని సాధారణ ప్రజలు గందరగోళపడతారని గాంధీజీతోపాటు స్టేట్ కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఆర్యసమాజ్ నుండి తమని తాము వేరుపరచుకొనేందుకు స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాన్ని విరమించింది. కాని అధికారులు మాత్రం రెండింటిని ఒకే గాట కట్టేసి స్టేట్ కాంగ్రెస్‌ని కూడా హిందూ మతతత్వవాద సంస్థగా చూపయత్నించింది.

అదే సమయంలో వందేమాతరం పేరుతో ఒక ఉద్యమం ప్రారంభమయింది. హైదరాబాద్‌లోని కళాశాలల విద్యార్థులు తమని తమ హాస్టలు గదులలో వందేమాతరం గీతాన్ని పాడుకొనరాదని ప్రభుత్వం ఆంక్షలు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన సమ్మె చేశారు. సమ్మె త్వరత్వరగా సంస్థానంలోని యితర ప్రాంతాలకు వ్యాపించింది. హైదరాబాద్ కాలేజీల నుండి బహిష్కరింపబడిన విద్యార్థులు కాంగ్రెస్ పాలిత సెంట్రల్ ప్రావిన్సులోని నాగపూర్ యూనివర్శిటీలో చేరి చదువు కొనసాగించారు. సమరశీల యువతని సృష్టించి తరువాతకాలంలో ఉద్యమానికి చురుకైన కార్యకర్తలను, నాయకత్వాన్ని సమకూర్చింది గనుక ఈ ఉద్యమానికి చాలా ప్రాధాన్యత వుంది.

స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం కొనసాగుతూండడంతో రాజకీయ కార్యక్రమాలకు ప్రాంతీయ సాంస్కృతిక సంఘాలు ప్రధాన వేదికలయ్యాయి. ఈ దశలో ఆంధ్రమహాసభ చురుకుగా పనిచేస్తూ వుండడంతో కొత్తగా రాజకీయాలలోకి వచ్చిన యువత దానిచుట్టూ చేరారు. ఆంధ్రమహాసభలో బి.యల్లారెడ్డితో కలిసి సత్యాగ్రహంలో పాల్గొన్న రావి నారాయణరెడ్డి కమ్యూనిస్టు పార్టీలో చేరడం 1940 ప్రాంతంలో వచ్చిన గమనించదగిన పరిణామం. ఫలితంగా చాలామంది యువకులు కమ్యూనిస్టుపార్టీవైపు ఆకర్షితులయ్యారు. వీరి బలం క్రమంగా పెరగడంతో ఆంధ్రమహాసభ అభివృద్ధికరమైన రాజకీయ సంస్థగా ఎదిగింది. ఆంధ్రమహాసభ రైతు సమస్యలపై చాలా ఆసక్తిచూపడం ప్రారంభించింది.

యుద్ధం ప్రారంభమవడం ప్రభుత్వానికి రాజకీయపరమైన రాజ్యాంగ సంస్కరణల పరమైన ప్రతిపాదనల నుండి తప్పించుకోవడానికి అవకాశం కల్పించింది. కొనసాగుతున్న నిషేధానికి వ్యతిరేకంగా రామానంద తీర్థ, గాంధీజీచే ఎంపిక చేయబడిన ఆరుగురు సభ్యులు నిరసన ప్రదర్శన జరిపారు. ప్రదర్శకులు 1940 సెప్టెంబర్‌లో అరెస్టు చేయబడ్డారు. 1941 డిసెంబర్ వరకు నిర్బంధంలో వుంచబడ్డారు. అఖిల భారతస్థాయిలో త్వరలో పోరాటం ప్రారంభం కానున్నది గనుక అన్ని పోరాటాలు దానిలో అంతర్భాగాలుగా వుంటాయి గనుక తిరిగి పోరాటం చేపట్టడాన్ని గాంధీజీ త్రోసిపుచ్చాడు.

క్విట్ ఇండియా ఉద్యమం 1942 ఆగస్టులో ప్రారంభించబడింది. బ్రిటిషిండియా, స్వదేశ సంస్థానాల ప్రజల మధ్యగల విభజనరేఖ తుడిచిపెట్టబడింది. ప్రతి భారతీయుడు ఉద్యమంలో పాల్గొనాలని ప్రకటించబడింది. బొంబాయి కాంగ్రెస్‌తోపాటు అఖిల భారత స్వదేశ సంస్థాన ప్రజాసభ (AISPC)ని కూడా జరిపి పోరాటం ప్రారంభమైనట్లుగా ప్రకటించబడింది. గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ ఎ.ఐ.ఎస్.పి.సి. స్థాయీ సంఘాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమంలో ఎదురయ్యే చిక్కులను

వివరించారు. ఇక నుండి ఒక ఉద్యమం మాత్రమే వుంటుందన్నారు. స్వదేశ సంస్థానాలలోని ఉద్యమం బాధ్యతాయుత ప్రభుత్వం కొరకు మాత్రమేగాక భారతదేశ స్వాతంత్ర్యం కొరకు, బ్రిటిషిండియాలో సంస్థానాల విలీనం కొరకు చేపట్టాలన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమానికి హైదరాబాద్ నుండి ప్రత్యేకించి యువత నుండి మంచి స్పందన లభించింది. స్వామీజీతో సహా ప్రధాన నాయకుల అరెస్టులు నిర్మాణ యుతంగా ఉద్యమం ఎదగడాన్ని అడ్డుకొన్నప్పటికీ సంస్థానం యొక్క అన్ని ప్రాంతాల నుండి ప్రజలు సత్యాగ్రహులుగా ముందుకు వచ్చారు. పలువురు అరెస్టు చేయబడ్డారు. 1942 అక్టోబర్ 2న హైదరాబాద్ నగరంలో సత్యాగ్రహంలో పాల్గొనేందుకు మహిళా బృందం ముందుకు వచ్చింది. సరోజిని నాయుడు ముందుగా అరెస్టు చేయబడ్డారు. 'గాంధీకా చరఖా చలానా పడేగా, గొరొన్ కొ లండన్ జానా పడేగా' (గాంధీజీ చరఖా నూలు వడుకుతుంది. తెల్లవాడు లండన్ వెళ్ళక తప్పదు) – లాంటి నినాదాలు బహుళ ప్రచారం పొందాయి. కొన్ని సంవత్సరాల క్రితం వరకు పెద్ద పేరున్న నాయకులు సైతం వారి ఉపన్యాసాలను ముందుగా కలెక్టరుకి పంపి అతడు చేసిన తొలగింపులను ఆమోదించి తీరవలసిన రాజ్యంలో యిప్పుడు నెలకొన్న వాతావరణం విప్లవాత్మకమైనదే.

కమ్యూనిస్టు పార్టీ 1941 డిసెంబరులో ప్రజాయుద్ధం నినాదాన్ని ఆమోదించిన తరువాత జాతీయవాదులలో కమ్యూనిస్టులకు కమ్యూనిష్టేతరులకు మధ్య వచ్చిన వివాదానికి క్విట్ ఇండియా ఉద్యమం తెరదించింది. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం చేస్తున్న బ్రిటన్‌కి మద్దతు యివ్వాలనే కమ్యూనిస్టుల అవగాహనకు వ్యతిరేకంగా క్విట్‌ఇండియా ఉద్యమం పనిచేస్తుంది గనుక కమ్యూనిస్టులు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించారు. తెలంగాణాలోని యితర జాతీయవాదులు జమాల్‌పురం కేశవరావుతో కలిశారు. కాని వారిలో పెద్ద సెక్షన్ రావి నారాయణరెడ్డిని అనుసరించి కమ్యూనిస్టులయ్యారు. కమ్యూనిస్టుపార్టీ యుద్ధానికి అనుకూలమైన నిర్ణయం చేసింది గనుక భారతదేశ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీపై నిషేధాన్ని తొలగించింది. ఈ నిర్ణయాన్ని అనుసరించి నిజాం కూడా నిషేధాన్ని తొలగించాడు. కాబట్టి క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతు యిచ్చిన కారణంగా జాతీయవాదులు జైళ్ళలో నిర్బంధింపబడగా, కమ్యూనిస్టులకు తమ ప్రజాపునాదిని పటిష్టపరచుకొనడానికి, విస్తరింపజేసుకొనడానికి స్వేచ్ఛ లభించింది. ఈ క్రమం 1944 నాటికి పతాకస్థాయికి చేరుకొన్నది. భువనగిరి సదస్సులో ఆంధ్రమహాసభ రెండుగా చీలిపోయింది. జాతీయవాద అనుకూలురు, ఉదారవాదులు సభ నుండి వాకౌట్ చేసి ప్రత్యేక సంస్థని స్థాపించారు. ఆంధ్రమహాసభ పూర్తిగా కమ్యూనిస్టుల నాయకత్వం క్రిందికి

వచ్చింది. కమ్యూనిస్టులు రైతులను సమీకరించి రైతు సంఘాలను నిర్మించే కార్యక్రమం చేపట్టారు. 1945లో యుద్ధం ముగింపు ప్రజాయుద్ధ పంథాలో మార్పు తెచ్చింది. పోరాటాల నిర్వహణపై గల ఆంక్షలు తొలగించబడ్డాయి.

1945, 1946 సంవత్సరాలలో – ప్రత్యేకించి 1946 ద్వితీయార్ధంలో నల్గొండ జిల్లాలోని చాలా ప్రాంతాలలో ఒకమేరకు ఖమ్మం, వరంగల్ జిల్లాలలో శక్తివంతమైన రైతాంగ పోరాటాలు చెలరేగాయి. నిర్బంధంగా ధాన్యం వసూలు చేయడం, వెట్టిచాకిరి, చట్టవిరుద్ధమైన వసూళ్ళు, చట్ట విరుద్ధంగా భూముల స్వాధీనం – లాంటి రైతుల జీవన్మరణ సమస్యల సాధనకు రైతులు పోరాటాలు చేపట్టారు. ఘర్షణలు మొదట భూస్వాముల గూండాలకు, సంఘం (అందరికీ తెలిసిన ఆంధ్రమహాసభ మరోపేరు) నాయకత్వంలోని రైతులకు మధ్య జరిగాయి; తరువాత నిజాం సాయుధ పోలీసులకు, కర్రలు, రాళ్ళు ఆయుధాలుగా చేసుకొన్న రైతులకు మధ్య జరిగాయి. రైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. అణచివేత తీవ్రంగా వుంది. కాని 1946 చివరినాటికి అణచివేత పైచేయి అయింది. పోరాటం వెనుకపట్టు పట్టింది. వేలాదిమంది రైతులు నిర్బంధింపబడ్డారు. అతి కిరాతకమైన చిత్రహింసలకు గురిచేయబడ్డారు. చాలామంది ప్రాణాలు అర్పించారు. నాయకులు జైళ్ళలో కృశించిపోయారు. అయినప్పటికీ అణగారిన అణచివేయబడిన తెలంగాణా రైతులలో తమ శక్తి సామర్థ్యాలతో ప్రతిఘటించగలమనే విశ్వాసాన్ని కలిగించడంతో ఉద్యమం జయప్రదమయింది.

బ్రిటిషువారు ఆగస్టు 15న భారతదేశం వదలి వెళ్ళిపోతారని 1947 జూన్ 4న వైస్రాయి మౌంట్ బాటెన్ ప్రకటించాడు. బ్రిటిషు సార్వభౌమాధికారం అండదండలతో స్వతంత్రరాజునవుతానని నిజాం జూన్ 12న ప్రకటించాడు. నిజాం అభిమతం స్పష్టంగానే వున్నది. తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయనన్నాడు. జూన్ 16నుండి 18వరకు జరుపబడిన హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ తొలి బహిరంగ సదస్సు సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో చేర్చమని, బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించమని డిమాండ్ చేసింది. కొన్ని నెలల క్రితం ప్రజాస్వామ్య విరుద్ధమైన రాజ్యాంగాన్ని ప్రజలపై రుద్దేందుకు నిజాంచేసిన ప్రయత్నాన్ని భారత జాతీయ కాంగ్రెస్ పూర్తి మద్దతుతో స్టేట్ కాంగ్రెస్ అడ్డుకొన్నది. వారు చేపట్టిన ఎన్నికల బహిష్కరణకు ప్రజల పూర్తి మద్దతు లభించింది. ఈ నూతన విశ్వాసంతో నిజాం ఎత్తుగడలకు వ్యతిరేకంగా సాహసోపేతమైన వైఖరి తీసుకొనడం ప్రారంభించారు.

స్టేట్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో జాతీయ నాయకులను సంప్రదించి తుదిపోరాటం చేపట్టాలని నిర్ణయం తీసుకొన్నారు. స్వామి రామానంద తీర్థ 'హైదరాబాద్ స్వతంత్ర పోరాటం – జ్ఞాపకాలు'లో వ్రాసిన విధంగా 'హైదరాబాద్ స్వతంత్ర సాధన తుది దశలో ఇండియన్ యూనియన్‌తో సాయుధ ఘర్షణ అనివార్యమవుతుందని మేము విశ్వసిస్తున్నాము. దానికి ముందు విస్తృతస్థాయిలో సత్యాగ్రహ ఉద్యమం చేపట్టవలసి వుంటుంది.'

షోలాపూర్, విజయవాడ, గదగ్‌లలో కార్యాలయాలు, బొంబాయిలో ప్రధాన కార్యాలయం, నిధుల సేకరణ– లాంటి ప్రాథమిక చర్యలు పూర్తయిన తరువాత డి.జి.బిందు ఛైర్మన్‌గా కార్యాచరణ కమిటీ (అరెస్టులను నివారించేందుకు కమిటీ సంస్థానం వెలుపల నుండి పనిచేస్తుంది) నియమించబడింది. నిధుల సేకరణలో జయప్రకాష్ నారాయణ కీలకపాత్ర వహించాడు. ఆగస్టు 7 'జాయన్ ఇండియన్ యూనియన్ డే'గా పోరాటం ప్రారంభించబడింది. ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నిషేధాలను ఉల్లంఘించేందుకు సభలు, సమావేశాలు పట్టణాలలో, పల్లెల్లో సంస్థానమంతటా జరిగాయి. బొంబాయిలో పనిచేస్తున్న 12,000మంది హైదరాబాద్ కార్మికులతో సహా కార్మికులు, విద్యార్థులు సమ్మె చేశారు. లాఠీదెబ్బలు, అరెస్టులు సర్వసామాన్యం. నిజాం ఆగస్టు 13న జాతీయజెండా ఆవిష్కరణ ఉత్సవాన్ని నిషేధించాడు. 'ఉత్తర్వు (నిషేధపుటుత్తర్వు) హైదరాబాద్ ప్రజలకు సవాల్, సవాల్‌ని స్వీకరించాలి'– అని స్వామిజీ పిలుపునిచ్చాడు. స్వామిజీ ఆయన అనుచరులు 1947 ఆగస్టు 15 తెల్లవారు జామున స్వాతంత్ర్యం పొందిన తొలి గంటలలో అరెస్టు చేయబడ్డారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లనధిగమించి ముందుగా వేసుకొన్న పథకం ప్రకారం 100మంది విద్యార్థులు హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫీసు నుండి ఒక్క ఉదుటున వచ్చి సుల్తాన్‌బజార్‌లో జెండా ఎగురవేశారు. ఆ తరువాతి రోజులలో జాతీయజెండా ఎగురవేయడం ఉల్లంఘనకు ప్రధాన పోరాట రూపమయింది. అందుకు కొత్త పద్ధతులు రూపొందింపబడ్డాయి. జాతీయ జెండాలతో అలంకరింపబడిన రైళ్ళు బయటి ప్రాంతాల నుండి హైదరాబాద్‌కి వచ్చేవి. విద్యార్థులు ఉద్యమంలో ప్రధాన పాత్రని కొనసాగించారు. ఆ తరువాత మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి చేరారు. వారిలో ప్రముఖంగా పేర్కొనదగినవారు బ్రిజ్‌రాణి, యశోదాబెన్.

ఉద్యమం బలాన్ని, వేగాన్ని పుంజుకొనడంతో నిజాం, ఆయన పాలనా యంత్రాంగం దానిపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ప్రజాపోరాటాన్ని అణచివేసేందుకు 'ఇత్తేహాద్–ఉల్–ముసిల్మిన్' ముట్టడిసేనగా పనిచేసే రజాకార్లను ఉసిగొల్పి పంపించింది. నిరసన తెలిపే ప్రజాసమూహాలపై విరుచుకుపడేందుకు రజాకార్లకు ఆయుధాలు సరఫరా

చేయబడ్డాయి. తిరుగుబాట్లు చేసే గ్రామాల వద్ద రజాకార్ల క్యాంపులు పెట్టారు. గ్రామాలపై సాయుధదాడులు సాగించారు.

1947నవంబర్ 29న నిజాం భారత ప్రభుత్వంతో యథాతథ స్థితి కొనసాగింపు ఒప్పందానికి వచ్చి, దానిపై సంతకం చేశాడు. మరోవైపు అణచివేతను తీవ్రతరం చేశాడు. వేలాదిమంది ప్రజలు ఇల్లూవాకిలీ, కొంపాగోడు వదిలి పారిపోయి భారతదేశ సరిహద్దులలో తలదాచుకొన్నారు. ప్రజలు ఏది దొరికితే దానిని ఆయుధంగా మలచుకొని ఆత్మరక్షణకు సిద్ధపడ్డారు. రజాకార్ల దాడుల నుండి ప్రజలకు రక్షణ కల్పించడంలోను, రజాకార్ల క్యాంపులపై దాడులు చేయడంలోను కమ్యూనిస్టులు - ప్రత్యేకించి వారికి బలమైన కేంద్రాలుగా వున్న నల్గొండ, వరంగల్, ఖమ్మంలలో చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. రైతుదళాలను ఏర్పాటుచేశారు. దళాలకు సాయుధ శిక్షణ యిచ్చారు. నిజాం వ్యతిరేక పోరాటం కొరకు సంఘటితపరచారు. ఈ ప్రాంతాలలో పోరాటం భూస్వామ్య వ్యతిరేక రూపం తీసుకొన్నది. క్రూరులైన భూస్వాములపై దాడులు జరిగాయి. కొంతమంది చంపబడ్డారు. చట్టవిరుద్ధంగా ఆక్రమించుకోబడిన భూములను కమ్యూనిస్టులు స్వంతదారులకు అప్పజెప్పారు. పెద్ద భూస్వాములు పారిపోయారు. వారి పొలాలు పొలంలేని వారికి పంచబడింది. నిరుపేదలు, చిన్న రైతులు ఆ పొలాల్లో వ్యవసాయం చేసుకొన్నారు.

స్టేట్ కాంగ్రెస్ కూడా నిజాం రాష్ట్ర సరిహద్దులలో క్యాంపులు పెట్టి సాయుధ ప్రతిఘటన చేపట్టింది. పోలీసు స్టేషన్లపై, రజాకార్ల క్యాంపులపై దాడులు చేసింది. కమ్యూనిస్టులకు బలమైన కేంద్రాలను మినహాయించి మిగిలిన తెలంగాణా ప్రాంతాలలో స్టేట్ కాంగ్రెస్ ప్రతిఘటించి పోరాడింది. స్టేట్ కాంగ్రెస్‌కి చెందిన 20,000మంది జైళ్ళలో నిర్బంధింపబడ్డారు. ఇంకా చాలామంది ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

1948 సెప్టెంబర్ నాటికి నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం కదిలింది. 18న నిజాం లొంగిపోయాడు. ఇండియన్ యూనియన్‌లో అన్ని స్వదేశీ సంస్థానాలను విలీనం చేసే క్రమం పూర్తయింది. విముక్తి సైన్యంగా; నిజాం, రజాకార్ల అణచివేతను అంతమొందించిన సైన్యంగా భారతసైన్యాన్ని ప్రజలు స్వాగతించారు. అంతటా ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. జాతీయజెండా ఎగురవేయబడింది. ఆయుధాలు త్యజించ నిరాకరించి, ఇండియన్ యూనియన్‌తో పోరాటం కొనసాగించాలని కమ్యూనిస్టులు తీసుకొన్న నిర్ణయం ప్రజల ఆనందోత్సాహాలను కొంతవరకు హరించింది.

* * *

బ్రిటిషిండియా పరిస్థితుల కనుగుణంగా రూపొందించుకొన్న అహింసాయుత సహాయ నిరాకరణ సత్యాగ్రహం లాంటి పోరాట పద్ధతులు స్వదేశీ సంస్థానాలలో పనిచేయవనడానికి రాజ్‌కోట, హైదరాబాద్‌లు ఉదాహరణలుగా నిలుస్తాయి.

పౌరహక్కులు, ప్రజలకు ప్రాతినిధ్యం వహించే సంస్థలు లేకపోవడం అంటే ప్రజల ప్రాబల్యం పెంచుకొనే రాజకీయాలకు గల అవకాశం బ్రిటిషిండియాలోని పరిస్థితులతో పోల్చినప్పటికీ సంస్థానాలలో చాలా తక్కువ. బ్రిటిషు పాలకులు సంస్థానాధీశులకు కల్పించిన రక్షణ వారికి ప్రజాపరమైన ఒత్తిడికి తట్టుకొనగలిగిన శక్తినిచ్చింది. ఫలితంగా సంస్థానాలలో చేపట్టబడే ఉద్యమాలకు హింసాయుత మార్గం పట్టే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. హైదరాబాద్‌లోనే గాక తిరువాన్కూరు, పాటియాలా, ఒరిస్సా సంస్థానాల ఉద్యమాలుగూడా హింసామార్గం పట్టాయి. హైదరాబాద్‌లో స్టేట్ కాంగ్రెస్ కూడా చివరికి హింసాత్మక దాడులు చేసింది. అంతేగాదు నిజాంని లొంగదీసింది భారత సైన్యమే.

హింసాయుత పోరాట రూపాలను చేపట్టడంలో కాంగ్రెస్‌కంటే తక్కువగా తటపటాయించే కమ్యూనిస్టులు యితర వామపక్ష గ్రూపులు సంస్థానాలలో రాజకీయశక్తిగా ఎదగగలిగారు. ఇందుకు కూడా హైదరాబాద్, తిరువాన్కూరు, పాటియాలా, ఒరిస్సా సంస్థానాలు ఉదాహరణలుగా నిలుస్తాయి.

సంస్థానాలలోని ఉద్యమాల్ని బ్రిటిషిండియా ఉద్యమాలలో కలిపివేసేందుకు కాంగ్రెస్‌కి గల సందేహాన్ని వివరించడానికి సంస్థానాలకు బ్రిటిషిండియాకి మధ్యగల రాజకీయ పరిస్థితులలోని వ్యత్యాసాలు చాలా సహాయకారిగా వుంటాయి. బ్రిటిషిండియాలోని ఉద్యమం అక్కడి పరిస్థితుల కనుగుణమైన వ్యూహాన్ని పోరాట పద్ధతుల్ని అమలుజరిపింది. అంతేగాక సంస్థానాల ప్రజలు బలమైన రాజకీయశక్తిగా ఎదిగేవరకు సంస్థానాధీశుల్ని భారత జాతీయవాదానికి వ్యతిరేకంగా కఠినంగా వ్యవహరించే స్థితికి నెట్టివేయకూడదని రాజకీయ విజ్ఞత ఆదేశించింది.

* * *

# 29 భారతీయ పెట్టుబడిదారులు - జాతీయోద్యమం

జాతీయోద్యమంలో పాల్గొన్న వివిధ గ్రూపులలో వ్యక్తులుగా ముందుకువచ్చి కాంగ్రెస్‌లో చేరిన పెట్టుబడిదారులు చాలామంది వున్నారు. వారు ఉద్యమంలో మమేకమయ్యారు. కారాగారవాసం చేశారు. వలసపాలన కాలంనాటి అత్యధిక కాంగ్రెస్‌వాదులలా కష్టాల నెదుర్కొన్నారు. జమ్నాలాల్ బజాజ్, వాడిలాల్ లల్లూభాయ్ మెహతా, శామ్యూల్ ఆరొన్, లాలా శంకర్‌లాల్ లాంటి పలువురు ఈ కోవకి చెందినవారు. కొందరు పెట్టుబడిదారులు కాంగ్రెస్‌లో చేరలేదు. కాని ఆర్థికంగా, హార్థికంగా ఉద్యమానికి సహాయపడ్డారు. జి.డి.బిర్లా, అంబాలాల్ సారాబాయ్, వాల్‌చంద్ హీరాచంద్ ఈ కోవకి చెందినవారు. ఇంకా పలువురు చిన్న వర్తకులు, వ్యాపారులు, వివిధ సందర్భాలలో ముందుకు వచ్చి ఉద్యమానికి తోడ్పడ్డారు. మరొకవైపు పెట్టుబడిదారులు కొందరు వ్యక్తులుగా, సెక్షన్లుగా జాతీయోద్యమం పట్ల కాంగ్రెస్ పట్ల తటస్థవైఖరి నవలంబించారు. కొంతమంది తీవ్రంగా వ్యతిరేకించారు.

ఈ అధ్యాయంలో పెట్టుబడిదారీ వర్గానికి చెందిన వివిధవ్యక్తులు సెక్షన్లు అవలంబించిన వైఖరిగాక పెట్టుబడిదారీ వర్గం ఒక వర్గంగా జాతీయోద్యమం పట్ల చేపట్టిన వ్యూహాన్ని పరిశీలిద్దాం.

వలసపాలనాకాలంలో భారతీయ పెట్టుబడిదారీ వర్గం గణనీయమైన ఆర్థికాభివృద్ధి సాధించింది. ఈ అభివృద్ధి స్వభావం యితర వలసదేశాల సాధారణ అనుభవాలకంటె భిన్నంగావుంది. ఇది సామ్రాజ్యవాదంతో ఈ వర్గం అనుసరించిన వైఖరిని వ్యక్తం చేస్తుంది. భారతదేశ పెట్టుబడిదారీ వర్గం 19వ శతాబ్దం మధ్యకాలం

నుండి స్వతంత్రమైన ఆర్థిక పునాదిపై అభివృద్ధి చెందింది; కాని విదేశీ పెట్టుబడికి జూనియర్ భాగస్వాములుగా గాని లేక దళారులుగా గాని అభివృద్ధి చెందలేదు. రెండవ అంశం : మొత్తం మీద పెట్టుబడిదారీ వర్గం ఆర్థికంగా గాని రాజకీయంగా గాని సామ్రాజ్యవాద అనుకూల ఫ్యూడల్‌శక్తులతో ముడిబడిలేదు. పెట్టుబడిదారీ వర్గ నాయకత్వంలోని గణనీయమైన సెక్షన్ 1944-45లో బొంబాయి ప్లాను ద్వారా, సహకార రంగంలో ఉత్పత్తి, ఆర్థికం, మార్కెటింగ్‌లతో సమగ్రమైన భూసంస్కరణలు చేపట్టాలని వాదించింది. (పురుషోత్తమ్‌దాస్ ఠాకూర్‌దాస్, జె.ఆర్.డి.తాతా, జి.డి.బిర్లా, ఆర్దేషిర్ దలాల్, శ్రీరాం, కస్తూర్‌భాయ్ లాల్‌భాయ్, ఎ.డి.షరోఫ్, జాన్ మత్తయ్ లాంటి ప్రముఖులు బొంబాయి పథకంపై సంతకాలు చేశారు)

మూడవది : 1914-1947 కాలంలో పెట్టుబడిదారీ వర్గం బలాన్ని ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని వేగంగా అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధి దిగుమతి చేయబడుతున్న వస్తువులను దేశీయంగా ఉత్పత్తిచేయడం ద్వారా, యూరపు ఆధిపత్యం సాధించిన రంగాలలో చొరబడి చొచ్చుకుపోవడం ద్వారా, 1920 నుండి పెట్టుబడులు పెడుతున్న రంగాలలో పూర్తి ఆధిపత్యం సాధించడం ద్వారా సాధింపబడింది. స్వతంత్రం రావడానికి ముందు దేశీయ పెట్టుబడిదారీ వర్గం దేశీయ మార్కెట్‌లో 72శాతాన్ని, బ్యాంకింగ్ రంగంలోని డిపాజిట్లలో 80శాతానికిపైగా తన ఆధిపత్యం క్రిందికి తెచ్చుకోగలిగింది.

కాని వలసదేశంలోని పెట్టుబడిదారీ వర్గానికి అసాధారణమైన ఈ పెరుగుదల వలసవాదం వలన సాధింపబడింది కాదు. అందుకు భిన్నంగా వలసపాలన కొనసాగుతున్నప్పటికీ దానిని వ్యతిరేకించి సాధింపబడిన అభివృద్ధి; వలసపాలనకు వలసవాద ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎడతెగని పోరాటాలు చేయడం ద్వారా అంటే వలసవాదం నుండి బలవంతంగా లాక్కొనడం ద్వారా సాధించబడిన అభివృద్ధి.

ఆ విధంగా భారతీయ పెట్టుబడిదారీవర్గ స్థితి రీత్యాగానీ, ఆ వర్గం యొక్క ఆర్థిక ప్రయోజనాల రీత్యాగానీ తరచుగా చేయబడుతున్న వాదనలకు భిన్నంగా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించి వుండవలసిన అవసరం లేదు. 1920ల మధ్యకాలంనాటికి భారతీయ పెట్టుబడిదారీ వర్గం తమ దీర్ఘకాలిక వర్గ ప్రయోజనాలను సరిగ్గా అంచనా వేయడం ప్రారంభించింది. సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని నిరంతరంగా, బాహాటంగా చేపట్టగల బలాన్ని పుంజుకొన్నామని గ్రహించారు. వారు వ్యక్తం చేసిన సందేహం

సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించటాన్ని గురించికాదు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయవలసిన ప్రత్యేకమైన పంథాని గురించి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చేపట్టే పంథా తమ ఉనికికే ప్రమాదం తెచ్చిపెట్టేదిగా వుండకూడదు. పెట్టుబడిదారీ విధానాన్ని బలహీనపరిచేదిగా వుండకూడదు.

పెట్టుబడిదారీ వర్గం, సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం వగైరాలను గురించి చర్చించడానికి ముందు పెట్టుబడిదారీ వర్గం రాజకీయశక్తిగా ఎదిగిన క్రమాన్ని గమనిద్దాం.

1920ల ప్రారంభం నుండి జి.డి.బిర్లా, పురుషోత్తం దాస్ ఠాకూర్ లాంటి పలువురు పెట్టుబడిదారులు భారతదేశ వాణిజ్య, పారిశ్రామిక, ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ కొరకు (భారతదేశంలో యూరపు పెట్టుబడిదారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా) వలసవాద ప్రభుత్వంతో సమర్ధవంతంగా లాబీ చేయగల జాతీయసంస్థని స్థాపించేందుకు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఈ ప్రయత్నం ఫలితంగా దేశంలోని అన్ని ప్రాంతాల వారి ప్రాతినిధ్యంతో 1927లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్.ఐ.సి.సి.ఐ), ఫిక్కీ స్థాపించబడింది. ఫిక్కీ భారత పెట్టుబడిదారీ వర్గం యొక్క ఏకాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించే సంస్థగా బ్రిటిషు ప్రభుత్వంచేత, భారత ప్రజలచేత గుర్తింపబడింది.

వలస పాలనలో వున్న భారతదేశం యొక్క ఆర్థికరంగంలో జాతీయ ప్రభుత్వం చేపట్టవలసిన బాధ్యతలు అంటే వర్తక వాణిజ్య పరిశ్రమల జాతీయ సంరక్షణ బాధ్యత ఫిక్కీ నిర్వహిస్తున్నట్లు పెట్టుబడిదారీ వర్గ నాయకులు గుర్తించారు. ఈ క్రమంలో భారతీయ పెట్టుబడిదారులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమగ్రమైన విమర్శలనభివృద్ధి చేశారు. హోంరూలు పేరుతో ప్రత్యక్ష వసూళ్ళ ద్వారాగానీ లేక వర్తకం వాణిజ్యం, ఆర్థికం కరెన్సీల మోసాలతో కూడిన దోపిడీ ద్వారాగానీ, వివిధ ఉత్పత్తి స్థాయిల్ని బట్టి దేశాల మధ్య అసమాన మారకాలతో కూడిన విదేశీ పెట్టుబడుల ద్వారాగానీ సాగుతున్న సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పెట్టుబడిదారులు సహేతుకమైన, సమగ్రమైన విమర్శనా విధానాన్ని అభివృద్ధిపరచారు. కాంగ్రెస్ నాయకులు వారి సలహాలు సహాయం అమూల్యమైనవిగా భావించారు. జాతీయ ఆర్థిక సమస్యలపై వారి అభిప్రాయాల్ని సాదరంగా స్వీకరించారు.

కాని ఫిక్కీ పెట్టుబడిదారుల యొక్క అలాగే దేశం యొక్క ఆర్థిక డిమాండ్ల కొరకు మాత్రమే పోరాడే సంస్థగా వుండిపోలేదు. పెట్టుబడిదారీ వర్గం నాయకులు తమ

వర్గం రాజకీయాలలో సమర్థవంతంగా జోక్యం చేసుకోవలసిన అవసరాన్ని, అందుకు తమకు గల సత్తాని గుర్తించారు. ఫిక్కీ అధ్యక్షుడైన పురుషోత్తం దాస్ 1928లో తమ రెండవ వార్షిక సదస్సులో "మనం యిక ఎంతమాత్రం మన రాజకీయాలను మన ఆర్థిక పరిస్థితుల నుండి వేరుచేసి చూడలేమని" అన్నారు. అంతేగాక ఒక వర్గంగా రాజకీయాలలో కలుగజేసుకొనడం అంటే భారత జాతీయవాదం పక్షాన కలుగజేసుకొనడం. "భారత వాణిజ్యం పరిశ్రమలు జాతీయ ఉద్యమంతో అత్యంత సన్నిహితమై జాతీయోద్యమంలో అవిచ్ఛిన్న భాగాలయ్యాయి. ఉద్యమం పెరుగుదలతో అవీ పెరిగాయి. ఉద్యమానికి బలాన్ని చేకూర్చాయి." అలాగే జి.డి.బిర్లా ఆ తరువాత 1930లో యిలా చెప్పవలసి వచ్చింది. "ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితిని ప్రభుత్వాన్ని మన అభిప్రాయాల కనుగుణంగా మార్చడం అసాధ్యం... ఒకే పరిష్కారం. దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడేవారి చేతులకు బలాన్ని చేకూర్చడం ప్రతి వ్యాపారస్తుని కర్తవ్యం."

* * *

కాని యింతకుముందు ప్రస్తావించినట్లు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నిర్వహించబడటంపై భారత పెట్టుబడిదారీ వర్గానికి తమవైన అభిప్రాయాలు వున్నాయి. ఈ వర్గం రాజ్యాంగ పద్ధతుల మార్గాన్ని అనుసరించేందుకు, చర్చల ద్వారా పరిష్కారం కనుగొనేందుకు అనుకూలంగా వుంది. కాని రాజ్యాంగవిరుద్ధమైన సహాయ నిరాకరణని వ్యతిరేకించింది. రాజ్యాంగ బద్ధమైన పోరాట పద్ధతులకు మద్దతునిచ్చింది. అందుకు చాలా కారణాలున్నాయి.

**మొదటి కారణం :** "సహాయ నిరాకరణ ఎక్కువకాలం కొనసాగితే ఉద్యమం విప్లవ రూపం తీసుకొంటుంది. (అది పెట్టుబడిదారీ విధానం వునికికి ప్రశ్నార్థకమవుతుంది)." 1930 మార్చిలో పురుషోత్తం దాస్‌కి లాల్జీ నారాంజీ వ్రాసినట్లుగా "వ్యక్తిగత ఆస్తి వునికి ప్రశ్నార్థకమవుతుంది. అధికారం పట్ల సృష్టించబడే నిర్లక్ష్య భావం స్వాతంత్ర్యానంతర ప్రభుత్వానికి కూడా చాలా సమస్యలను తెచ్చిపెడుతుంది. ఉద్యమం ప్రమాదంలో పడుతుందని (రాజ్యాంగేతర పద్ధతులు అనుసరిస్తున్నప్పుడు) గమనించినప్పుడు పెట్టుబడిదారులు ఉద్యమాన్ని రాజ్యాంగబద్ధమైన పోరాట మార్గంలోకి తీసుకొని రావడానికి చేయగలిగిందంతా చేశారు.

**రెండు :** ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే తీవ్రమైన దీర్ఘకాలిక పోరాటాలు దైనందిన వ్యాపార కార్యకలాపాలను అడ్డుకొనడమేగాక ఒక వర్గంగా వారి ఉనికికి

ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. గనుక అలాంటి పోరాటాలకు మద్దతు తెలపడానికి పెట్టుబడిదారులు సుముఖంగా లేరు.

అంతేగాక అసెంబ్లీలలో గానీ, సదస్సులలోగాని, వైస్రాయి ఎగ్జిగ్యూటివ్ కౌన్సిల్‌లో గాని రాజ్యాంగబద్ధంగా పాల్గొనడానికి భారతీయ పెట్టుబడిదారులు మద్దతు యివ్వడాన్నివారు సామ్రాజ్యవాద విధానంలో యిముద్చుకోబడుతున్నట్లుగానో లేక సామ్రాజ్యవాదానికి లొంగిపోతున్నట్లుగానో అర్థం చేసుకోరాదు. ఇదంతా వ్యతిరేకతను సమర్థవంతంగా వ్యక్తం చేయడంగా చూశారు. ఈ సంస్థలను బహిష్కరించడం జాతికి ప్రాతినిధ్యం వహించని శక్తులకు తోడ్పడుతుందని, సమర్థవంతమైన వ్యతిరేకతని వ్యక్తం చేయకపోతే భారత ఆర్థిక వ్యవస్థపైన, పెట్టుబడిదారీ వర్గంపైన తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపే చర్యలు సులభంగా ప్రభుత్వం చేపట్టడానికి దోహదపడుతుందని భావించారు. కాని బేషరతుగా సంస్కరణల నామోదించడం గాని చట్టసభలలో సదస్సులలో పాల్గొనడంగాని జరగదన్నారు. పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలకు జాతీయ డిమాండ్లకు సరిపడని అంశాలతో విభేదిస్తూ ప్రాథమిక అంశాలపై రాజీపడకుండా వారి షరతులపై పాల్గొనవలసి వుంటుంది. ఈ ప్రాతిపదికపైనే 1934లో ఫిక్కీ ఇండియా రాజ్యాంగ సంస్కరణలపై నియమించబడిన జాయింట్ పార్లమెంటరీ రిపోర్టుని తిరస్కరించింది. రిపోర్టులో పేర్కొన్న సంస్కరణలు శ్వేతపత్రంలో వున్నవాటికంటె అభివృద్ధి నిరోధకమైనవని చెప్పింది.”

అంతేగాక రాజ్యాంగపరమైన దారులన్నింటిని తెరచివుంచడంపై పెట్టుబడిదారులు ఎంత ఆసక్తి కనపరచినప్పటికీ ఫిక్కీ అధ్యక్షుడు 1934లో పేర్కొన్నట్లు దేశం కూడా వాటిలో చేరాలని నిర్ణయించకపోతే కౌన్సిళ్ళు యితర రాజ్యాంగ సంస్థలలో ప్రవేశించడం నిరుపయోగమని గుర్తించారు. వారు రాజ్యాంగపరమైన, ఆర్థికపరమైన అంశాలపై కాంగ్రెస్‌తో ప్రమేయంలేకుండా, దాని భాగస్వామ్యం లేకుండా లేక కనీసం దాని ఆమోదం పొందకుండా బ్రిటిషు ప్రభుత్వంతో చర్చించేందుకు సాధారణంగా తిరస్కరించారు. ‘మహాత్మాగాంధీ పాల్గొనకుండా లేక ఆయన అనుమతిలేకుండా భారత రాజ్యాంగ పురోగతిపై ఏర్పాటుచేయబడే ఏ సదస్సు కూడా ఏ పరిష్కారం కనుగొనలేదు’ అని కాంగ్రెస్ మాత్రమే ఫలితాలను సాధించగలదని పెట్టుబడిదారులకు తెలుసుగనుక రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ వద్ద భిన్నాభిప్రాయాలు వ్యక్తంగావడం వారికి యిష్టం లేకపోవచ్చు. అందుకే ‘కాంగ్రెస్ మద్దతులేకుండా ప్రభుత్వం నీ మాట వినదు’ అని అంబాలాల్ సారాభాయ్ 1929లో చెప్పారు.

చివరిగా పెట్టుబడిదారుల గమ్యం రాజ్యాంగ రూపకల్పన కాదు. అలాగని క్రమ పరిణామవాదం 'గ్రాడ్యుయలిజం' కూడా కాదు. అవే లక్ష్యాలైతే సహాయ నిరాకరణతో సహా రాజ్యాంగ విరుద్ధమైన పోరాటం చేపట్టే కాంగ్రెస్‌కి మద్దతునిచ్చేవారు కాదు. పెట్టుబడిదారీ వర్గం యితర పోరాట రూపాలను కాదనలేదు; త్రోసిపుచ్చలేదు. రాజ్యాంగసంస్థలలో పాల్గొనడం లక్ష్యసాధన దిశలో ఒక ముందడుగు మాత్రమేనన్నది. లక్ష్యసాధనకు యితర చర్యలు అవసరం అన్నది. ఉదాహరణకు 1937లో అధికారం చేపట్టడానికి అంగీకరింపజేసేందుకు తీవ్రంగా కృషిచేసిన జి.డి.బిర్లా, లార్డ్ హారిఫాక్స్, లార్డ్ లోథియన్‌లను యిలా హెచ్చరించారు. "కాంగ్రెస్ రాజ్యాంగబద్ధంగా పనిచేయటానికి మాత్రమేగాక లక్ష్యసాధన దిశగా ముందుకి వస్తున్నది. గవర్నర్లు యితర ఉన్నతాధికారులు వారి పాత్ర సక్రమంగా నిర్వహించకపోతే లేక రాజ్యాంగబద్ధమైన చర్యల ద్వారా రెండు మూడు సంవత్సరాలలో పురోగతి సాధించలేకపోతే అప్పుడు భారతదేశం ప్రత్యక్షచర్య చేపట్టడం అనివార్యమవుతుంది." ప్రత్యక్షచర్య అంటే ఆయన దృష్టిలో అహింసాయుత సహాయ నిరాకరణ చేపట్టడం.

ఇది ప్రజల సహాయ నిరాకరణ పట్ల పెట్టుబడిదారుల వైఖరిని తెలియజేస్తున్నది. ఒకవైపు దీర్ఘకాలిక సహాయ నిరాకరణ అంటే భయపడుతున్నారు. మరొకవైపు వారు వారి వర్గానికి జాతికి ముఖ్యమైన రాయితీలు పొందేందుకు సహాయ నిరాకరణ అవసరాన్ని, ఉపయోగాన్ని గుర్తించారు. 1931 జనవరిలో అప్పటి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ జి.డి.బిర్లా, పురుషోత్తం దాస్‌కి యిలా వ్రాశాడు. "మనకు యిప్పుడు యివ్వజూపిన రాయితీలు పూర్తిగా గాంధీజీ వలననే అనడంలో ఎలాంటి సందేహంలేదు. మనం కోరుతున్న ఫలితాలను సాధించాలంటే ప్రస్తుత ఉద్యమం సడలిపోవటాన్ని అనుమతించరాదు."

ప్రజా ఉద్యమం కొంతకాలం కొనసాగిన తరువాత పెట్టుబడిదారులు పైన చెప్పిన కారణాల రీత్యా ఉద్యమాన్ని విరమింపజేసి రాజీపడాలని (ప్రభుత్వం, కాంగ్రెస్‌ల మధ్య శాంతిసాధనకు రాయబారాలు నడుపుతూ) కోరారు. ఈ రాజీపడడం కూడా ఉద్యమాన్ని ఉపయోగించుకొని, మరలా ఉద్యమం చేపడతామని బెదిరించి, బేరసారాలాడి– యివన్నీ కూడా కొన్ని నిర్దిష్టమైన రాయితీలు పొందిన తరువాతనే చేయాలని వారు స్పష్టమైన అభిప్రాయంతో వున్నారు. శాంతిసాధన పట్ల గల ఆతురతతో వారు లొంగిపోవడానికిగాని డిమాండ్లను తగ్గించుకొనడానికిగాని సిద్ధపడలేదు. జాతీయోద్యమాన్ని బలహీనపరచకుండా ఒప్పందానికి రావడం, రాయితీలను సాధించడం – ఈ

ద్వంద్వలక్ష్యాల్ని 1931 జనవరిలో జి.డి.బిర్లా యిలా వివరించాడు. "మన గమనంలో రెండు లక్ష్యాలు వుండాలి. ఒకటి: చాలా అనుకూల సమయం చూసి మనం ఒప్పందానికి రావాలి. రెండు: ఎవరి ప్రయత్నాల ద్వారా మనం ఈ స్థితికి చేరుకొన్నామో వారి చేతులను మనం బలహీనపరచకూడదు."

అంతేగాక ఒక దశలో పెట్టుబడిదారీ వర్గం ప్రజల సహాయ నిరాకరణోద్యమాన్ని వ్యతిరేకించినప్పటికీ, వలసవాద ప్రభుత్వం ఉద్యమాన్ని అణచడాన్ని వారు ఎప్పుడూ సమర్థించలేదు. అంతేగాక రాజ్యాంగేతర ప్రజా ఉద్యమం చాలా తీవ్రదశలో వున్నప్పుడు కూడా పెట్టుబడిదారులు అణచివేతని ఆపమని, కాంగ్రెస్‌పైన పత్రికలపైన నిషేధం ఎత్తివేయమని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, ఏ ఒప్పందానికైనా వచ్చేందుకు మొదటి చర్యగా ఆర్డినెన్స్‌ల ద్వారా సాగుతున్న తాత్కాలికపాలన ఆపమని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ సమరశీలత పట్ల గల భయంతో పెట్టుబడిదారులు (ప్రత్యేకించి 1920లలో) ఉద్యమాన్ని అణచివేసేందుకు సామ్రాజ్యవాదానికి మద్దతు యివ్వడంగాని, ఉద్యమాన్ని బాహాటంగా ఖండించడంగాని, కాంగ్రెస్‌తో సంబంధాలు తెంచుకొని వేరుపడడంగాని చేయలేదు.

భారతీయ పెట్టుబడిదారుల వైఖరిలో కాలక్రమంలో గణనీయమైన మార్పులు వచ్చాయి. స్వదేశీ ఉద్యమకాలంలో (1905-08) పెట్టుబడిదారులు బహిష్కరణ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. 1920ల ప్రారంభం నాటి సహాయ నిరాకరణ ఉద్యమకాలంలో పురుషోత్తందాస్‌తో సహా పెట్టుబడిదారీ వర్గంలోని చిన్న సెక్షన్ సహాయ నిరాకరణ ఉద్యమానికి తాము శత్రువులమని బాహాటంగా ప్రకటించారు. కాని 1930లలో సహాయ నిరాకరణోద్యమ కాలంలో పెట్టుబడిదారులు ఉద్యమాన్ని బలపరిచారు. కాంగ్రెస్ వైఖరిని బాహాటంగా ఖండించమని, అలా ఖండించిన వారికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని వైస్రాయి చేసిన ఉద్బోధలకు పెట్టుబడిదారులు స్పందించ నిరాకరించారు. అప్పటి బ్రిటిష ప్రభుత్వం కల్పించిన పరిస్థితులలో సహాయ నిరాకరణోద్యమం చేపట్టడం తప్ప కాంగ్రెస్‌కి మార్గాంతరం లేదని 1940 సెప్టెంబర్‌లో పురుషోత్తం దాస్ అభిప్రాయపడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించడానికి నాలుగురోజుల ముందు అంటే 1942 ఆగస్టు 5న పురుషోత్తం దాస్, జె.ఆర్.డి.తాతా, జి.డి.బిర్లాలు వైస్రాయికి లేఖ రాస్తూ 'ప్రస్తుత సంక్షోభానికి వున్న ఒకే ఒక పరిష్కారం యుద్ధాన్ని సక్రమంగా నిర్వహించడంతోపాటు 'యుద్ధం కొనసాగుతున్నప్పటికీ దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం ప్రకటించడం' మాత్రమే మరొక సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నివారించగలదని పేర్కొన్నారు.

* * *

ఈ దశలో మరొక అంశాన్ని ప్రస్తావించాలి. 1920 దశాబ్దం చివరికి భారత పెట్టుబడిదారీ వర్గంలోని అత్యధికులు కాంగ్రెస్‌ని బలపరచడం ప్రారంభించారు. జాతీయోద్యమం ఈ వర్గంచేత సృష్టించబడలేదు. ఉద్యమానికి ఈ వర్గం నాయకత్వం వహించలేదు; కీలక సమయాలలో ఈ వర్గం మద్దతుపై ఆధారపడలేదు. స్వయంప్రతిపత్తి గల జాతీయోద్యమానికి అనుగుణంగా పెట్టుబడిదారీ వర్గం వ్యూహం రూపొందించుకుంటూ వచ్చింది. అంతేగాక మొత్తం మీద పెట్టుబడిదారీవర్గం జాతీయ క్యాంపులో వుండిపోయింది.

కానీ భారత జాతీయోద్యమం యొక్క స్వయం ప్రతిపత్తిపై సందేహాలు వ్యక్తమయ్యాయి. పెట్టుబడిదారులు ప్రధానంగా వారి ఆర్థికవనరుల్ని ఉపయోగించుకొని రూపాయి– స్టెర్లింగు నిష్పత్తిని తగ్గించాలని, సుంకాల రక్షణ, సైనిక వ్యయం తగ్గుదల – లాంటి డిమాండ్ల కొరకు ఒత్తిడి తీసుకొని రాగలిగారని, ఇవి వారి వర్గ ప్రయోజనాలకు మాత్రమే అనుకూలమైన డిమాండ్లని విమర్శలు వున్నాయి. అంతేగాక కాంగ్రెస్ అనుసరించే రాజకీయ విధానాలపై – ఒక ఉద్యమం ప్రారంభించాలా, కొనసాగించాలా, విరమించాలా లాంటి నిర్ణయాలు చేసే మేరకు పెట్టుబడిదారుల ప్రమేయం వుందని విమర్శలు వున్నాయి. అందుకు 1931లో గాంధీ – ఇర్విన్ ఒప్పందంతో సహాయ నిరాకరణ ఉద్యమం విరమించుకొనడం, 1945–47కాలంలో మరొక ఉద్యమాన్ని చేపట్టకపోవడం – లాంటివి ఉదాహరణలుగా చెప్పబడ్డాయి.

చాలా కారణాలరీత్యా ఈ సూత్రీకరణలు వాస్తవాలను ప్రతిఫలించడం లేదు. మొదటిది: ఆర్థిక ద్రవ్య స్వయం ప్రతిపత్తి డిమాండ్లతో కూడిన జాతీయవాద ఆర్థిక విధాన కార్యక్రమం పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించేది కాదు. సామ్రాజ్యవాద దోపిడీకి గురయిన మొత్తం దేశానికి సంబంధించిన డిమాండ్లు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, వామపక్షవాదులు – నెహ్రూ, సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఈ డిమాండ్ల కొరకు పోరాడవలసి వచ్చింది; పోరాడారు.

రెండవది: భారతీయ పెట్టుబడిదారులు ఒక వర్గంగా ఏర్పడి రాజకీయ రంగంలో ప్రవేశించి ఈ డిమాండ్ల కొరకు పోరాటం ప్రారంభించడానికి 50 సం॥లు ముందే జాతీయవాద సిద్ధాంతం గురించి సవివరంగా అధ్యయనం చేయడం జరిగింది. కాబట్టి పెట్టుబడిదారీ వర్గానికి కాంగ్రెస్ అమ్ముడుపోయింది, వారి ప్రయోజనాల కనుగుణంగా మలచబడింది లేక ఒత్తిడికి గురయింది– లాంటి విమర్శలు అర్థరహితాలు.

మూడవది: కాంగ్రెస్‌కి నిధులు ప్రత్యేకించి ఎన్నికల సమయాలలో

అవసరమయ్యాయి. వాటిని వ్యాపార వర్గాల నుండి సేకరించింది. నిజమే; కాని ఈ నిధుల్ని సమకూర్చడం ద్వారా వ్యాపారులు కాంగ్రెస్ పార్టీ విధానాన్ని, సిద్ధాంతాన్ని ప్రభావితం చేశారనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవు. కాంగ్రెస్ నిధులపై (అవి ప్రజా ఉద్యమంగా సాగేటప్పుడు) ఆధారపడడాన్ని గురించి కూడా అతిశయించి చెప్పడం జరిగింది. వైస్రాయి నుండి వచ్చిన ప్రశ్నకు 1939 మార్చిలో జవాబు పంపిన డైరెక్టరు ఆఫ్ ఇంటెలిజెన్స్ బ్యూరో యిలా పేర్కొన్నాడు. "కాంగ్రెస్ నిధులు సేకరించడానికి చాలా మార్గాలున్నాయి. దేశభక్తి పిలుపు చాలా డబ్బు సమకూర్చగలుగుతుంది. కాంగ్రెస్ సాధారణ కార్యకలాపాలకు ఎన్నికల కొరకు నిధుల సేకరణ విషయంలో పెట్టుబడిదారుల పాత్ర కంటె ప్రజలకు గాంధీపై గల గుడ్డి నమ్మకం బాగా పనిచేస్తుంది. స్థానిక కాంగ్రెస్ సంస్థలు ప్రజల మద్దతుని బాగా కూడగట్టగలవు. నిధుల అవసరం ఎక్కువగా లేకుండానే వారు ఎన్నికలలో పాల్గొనగలరు." ఎన్నికలు లేని సందర్భాలలో కాంగ్రెస్ కార్యకర్తలలో అత్యధికులు దైనందిన ఆందోళనలను సభ్యత్వరుసుము, కొద్దిపాటి విరాళాలతో సాగించగలరు.

పెట్టుబడిదారుల మద్దతు విషయంలో గాంధీజీ వైఖరి చాలా స్పష్టంగా వున్నది. 1922లో గాంధీజీ వ్యాపారుల, మిల్లు యాజమానుల మద్దతు కొరకు విజ్ఞప్తి చేస్తూనే యిలా హెచ్చరించాడు. "వారు మద్దతు యిచ్చినా యివ్వకపోయినా స్వతంత్రం కొరకు వేసే ముందడుగు ఏ కార్పొరేషన్ లేక గ్రూపులపై ఆధారపడి వేయడం జరగదు. ఇది ఒక ప్రజా ఉద్యమం. ప్రజలు విమోచనం దిశగా వేగంగా ముందుకి పోతున్నారు. పెట్టుబడిదారుల ఆర్థిక సహకారం వున్నా లేకపోయినా వారు తప్పక ముందుకి పోతారు. ఉద్యమం డబ్బుకి అతీతంగా పనిచేస్తుంది. అదే సమయంలో పెట్టుబడిదారులు సమకూర్చే నిధులకు కాంగ్రెస్ వ్యతిరేకి కాదు. ప్రజలకు సహాయపడేందుకు పెట్టుబడిదారులు డబ్బు సమకూర్చితే స్వతంత్రం త్వరగా సిద్ధిస్తుంది." రెండవ ప్రపంచయుద్ధ కాలంలో ఒకవైపు జాతీయోద్యమం తీవ్ర నిర్బంధాల నెదుర్కొంటున్నది; ప్రజలు కొరతలతో, కరువులతో అలమటిస్తున్నారు. మరొకవైపు పెట్టుబడిదారులలో అత్యధికులు లాభాలు పోగుచేసుకొనడంలో నిమగ్నమయ్యారు. దానితో పెట్టుబడిదారులపట్ల గాంధీజీ వైఖరి మరికొంత కఠినత్వాన్ని సంతరించుకొన్నది.

చివరిగా కాంగ్రెస్ నాయకత్వంలోని ఉద్యమాల క్రమాన్ని పెట్టుబడిదారులు నిర్ణయించే విషయానికి వస్తే (చాలా ప్రాంతాలలో చాలా ఉద్యమాలు కమ్యూనిస్టుల, సోషలిస్టుల నాయకత్వంలో లేక వారి మద్దతుతో గాని జరిగాయి) యిందుకు సరియైన

సాక్ష్యాధారాలు లేవు. వలసవాద ప్రభుత్వం, అది చేపడుతున్న చర్యలపై కాంగ్రెస్‌కి గల అవగాహన, సంస్థాపరంగా, రాజకీయంగా, సైద్ధాంతికంగా ప్రజల సంసిద్ధత అణచివేతలను ఎదుర్కొంటూ ఉద్యమాలలో ప్రజలు నిలబడగల శక్తి – లాంటి అంశాల ప్రాతిపదికగా కాంగ్రెస్ ఉద్యమాలు ప్రారంభించింది; నడిపింది; విరమించింది. పెట్టుబడిదారీ వర్గం ఆదేశాల మేరకు గాని లేక వారి తరఫున గాని ఉద్యమాలను ప్రారంభించడంగాని, విరమించడంగాని జరగలేదు. కాంగ్రెస్ ఉద్యమాలు ప్రారంభించిన సందర్భాలలో అంటే 1905–08, 1920–22, 1930, 1932, 1942లలో పెట్టుబడిదారీ వర్గం యొక్క ఆమోదాన్ని గాని లేక ఆ వర్గంలోని గణనీయమైన సెక్షన్ యొక్క ఆమోదాన్ని గాని పొందలేదు. కాని ఉద్యమాలు ప్రారంభించబడిన తరువాత పెట్టుబడిదారీ వర్గం యొక్క స్పందన పైన చర్చించబడిన విధంగా మారుతూ వచ్చింది.

భారతదేశ పెట్టుబడిదారులు కాంగ్రెస్‌ని వారి వర్గ పార్టీగా గాని లేక తమ పలుకుపడి క్రింద పనిచేసే పార్టీగా గాని ఎప్పుడూ చూడలేదు. అందుకు భిన్నంగా వారు కాంగ్రెస్‌ని ప్రజా ఉద్యమాలను నడిపే, అందరికీ చెందిన పార్టీగా చూశారు. ఇండియన్ మర్చంట్స్ ఛాంబర్ సెక్రటరీ జె.కె.మెహతా మాటల్లో చెప్పాలంటే “అన్నిరకాల రాజకీయాభిప్రాయాలు, ఆర్థిక దృక్పథాలు గలవారికి అందులో చోటు వుంది” కాబట్టి లెఫ్టుకి గాని రైటుకి గాని మార్పుజెందడానికి అవకాశం వుంది.

* * *

1930లలో నెహ్రూ, కాంగ్రెస్‌లో గల సోషలిస్టుల, కమ్యూనిస్టుల పలుకుబడి పెరగడంతో వామపక్ష దిశగా కాంగ్రెస్ మార్పు చెందుతున్న క్రమం పెట్టుబడిదారుల్ని చురుకుగా రాజకీయాలలో పాల్గొనేలా తొందరపెట్టింది. కాని జాతీయోద్యమం మౌలిక మార్పులకు గురవుతుందనే భయం సమకాలీన విమర్శకులు అంచనావేసిన విధంగాను, కొన్ని వలసవాద, అర్ధ వలసవాద దేశాలలో జరిగిన విధంగాను పెట్టుబడిదారుల్ని సామ్రాజ్యవాదుల పంచకు చేర్చలేదు. అంతేగాక భారతదేశ పెట్టుబడిదారులు వామపక్షాల్ని యిముడ్చుకునే విధంగాను, వాటిలో ఏ భాగం సామ్రాజ్యవాదానికిగాని, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు లొంగిపోని విధంగా బహుముఖమైన వ్యూహాన్ని రూపొందించారు.

ఉదాహరణకు 1929లో ట్రేడ్ యూనియన్ రంగంలో కమ్యూనిస్టులు చేపట్టిన తీవ్రమైన కార్యక్రమాల్ని ఎదుర్కొనేందుకు, యూరపు భారత పెట్టుబడిదారులు కలిపి వర్గ పార్టీని పెట్టడానికి కొందరు పెట్టుబడిదారులు ప్రయత్నించినప్పుడు భారత పెట్టుబడిదారీ వర్గం నాయకులు ఆ ప్రయత్నాన్ని నిక్కచ్చిగా తిరస్కరించారు. జి.డి.బిర్లా దీనినిలా చెప్పాడు. "పెట్టుబడిదారుల ముక్తి భారతదేశంలో సామ్రాజ్యవాద అనుకూల యూరపు ప్రయోజనాలతో ముడిబడిలేదు; రాజ్యాంగ పద్ధతుల ద్వారా ప్రభుత్వాన్ని జాతీయ ప్రభుత్వంగా మార్చే దారిలో సహకరించడంలో వుంది". అలాగే 1928లో ప్రభుత్వం కమ్యూనిస్టుల్ని యిముడ్చుకొనేందుకు ఉద్దేశించబడిన పబ్లిక్ సేఫ్టీ బిల్లుని- అది జాతీయోద్యమంపై ఉపయోగింపబడుతుందనే కారణంగా బలపరచ నిరాకరించారు.

అంతేగాక పెట్టుబడిదారులు బోల్షివిజాన్ని, కమ్యూనిజాన్ని అంతమొందించేందుకు, పేద ప్రజల్ని, మధ్య తరగతి ప్రజల్ని ప్రభావితం చేయలేని దుర్బలమైన వారి వర్గ సంఘాలతో ఎదుర్కొనే ప్రయత్నం చేయలేదు. "కమ్యూనిజానికి వ్యతిరేకంగా సమర్థవంతమైన పోరాటం చేసేందుకు పూర్తి పెట్టుబడిదారీ సంస్థ చివరిది కాదనడంలో నాకెలాంటి సందేహంలేదు" అన్నాడు బిర్లా. నెహ్రూ వామపక్షవైఖరి ప్రమాదకరంగా వ్యక్తమైనప్పుడు బిర్లా "మీరు చెప్పదలచుకొన్నది ఆస్తులు పోగొట్టుకొన్నవారు చెప్పనీయండి" అన్నాడు. అంటే వారి వ్యూహం పెట్టుబడిదారీ విధానం పరిమితుల్ని అధిగమించని లేక సోషలిజాన్ని వ్యతిరేకించే జాతీయవాదుల చేతుల్ని బలోపేతం చేయడం.

సామాజిక తిరుగుబాట్లకి వ్యతిరేకంగా నిరంతర సంస్కరణల కార్యక్రమం చేపట్టడం సమర్థవంతమైన విరుగుడని ఫిక్కీ అధ్యక్షుడు జి.యల్.మెహతా 1943లో చేసిన వాదనని పెట్టుబడిదారులు గుర్తించారు. ఇలాంటి సంస్కరణ వాదంతో కూడిన ముందుచూపుతోనే 1942లో పెట్టుబడిదారులు యుద్ధానంతర ఆర్థికాభివృద్ధి కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీ 'బాంబే ప్లాను' రూపొందించింది. సోషలిస్టు ఉద్యమంలోని మంచిని సాధ్యమైన వాటిని స్వీకరించి, పెట్టుబడిదారీ విధానం యొక్క మౌలిక అంశాల్ని వదులుకోకుండా సోషలిస్టు డిమాండ్లకు స్థానం కల్పించడం బాంబేప్లాను ప్రయత్నం. కాబట్టి బాంబేప్లాను పాక్షికంగా జాతీయం చేయవలసిన అవసరాన్ని పబ్లిక్ సెక్టారు భూసంస్కరణలు కార్మిక సంక్షేమ పథకాలతో సహా వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, సమాన

పంపిణీ సమస్యని చేపట్టింది. స్వతంత్ర జాతీయ ప్రభుత్వం ఆధ్వర్యంలో మాత్రమే ఈ పథకం అమలు జరుపబడాలని ప్రణాళికా కర్తలు స్పష్టం చేశారు.

భారతీయ పెట్టుబడిదారీ వర్గం బూర్జువా వర్గం. సోషలిస్టు వ్యతిరేక వర్గం; కాని సామ్రాజ్యవాద అనుకూల వర్గం కాదు.

తన దీర్ఘకాలిక ప్రయోజనాల్ని గుర్తించడంలో భారత పెట్టుబడిదారీ వర్గం యొక్క పరిపక్వత, కాంగ్రెస్ స్వభావం పట్ల భారతీయ సమాజంలోని వివిధ వర్గాలతో దానికిగల సంబంధం పట్ల సరియైన అవగాహన, వామపక్షాలు బెదిరించినప్పటికీ, సామ్రాజ్యవాదం ఆకట్టుకొనే ప్రయత్నాలు చేసినప్పటికీ జాతీయవాద పక్షాన్ని విడనాడేందుకు దాని తిరస్కారం, తన వర్గ ప్రయోజనాల్ని సామాజిక ప్రయోజనాలుగా చూపెట్టగల దాని సామర్థ్యం– మొత్తం మీద దానితో ఘర్షణపడే ధోరణులు అంతర్గతంగా వున్నప్పటికీ స్వాతంత్ర్యం సాధించేవరకు భారత జాతీయోద్యమం బూర్జువా సైద్ధాంతిక ఆధిపత్యం క్రింద కొనసాగడాన్ని వివరించే కొన్ని కారణాలు.

* * *

# 30 జాతీయవాద విదేశాంగ విధానం అభివృద్ధి

**భా**రత ప్రజలు తమ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట క్రమంలో భాగంగా సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాన్ని రూపొందించుకొన్నారు. ప్రపంచంలోని యితర ప్రాంతాల సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు తమ మద్దతుని, సంఘీభావాన్ని ప్రకటించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకొనే బ్రిటిషు విధానాన్ని భారత జాతీయవాదులు వ్యతిరేకించారు. అలాగే ఆసియా, ఆఫ్రికాలలో బ్రిటిషు సామ్రాజ్యవాద రక్షణకు, విస్తరణకు భారత సైన్యాన్ని, భారతదేశ వనరుల్ని వినియోగించుకొనే విధానాన్ని వ్యతిరేకించారు.

* * *

జాతీయోద్యమం తొలి సంవత్సరాలలో బ్రిటిషు సామ్రాజ్య విస్తరణ వాదం చురుకుగా పనిచేస్తున్నకాలంలో జాతీయవాద విదేశాంగ విధానానికి విశాలమైన పునాది వేయబడింది. 1878 తరువాత భారతదేశ ప్రభుత్వం భారతదేశం వెలుపల పెద్ద దండయాత్రలు చేసింది. బ్రిటిషు ప్రభుత్వం ఆసియాలో ఆఫ్రికాలో చేసిన కొన్ని యుద్ధాలలో భారత సాయుధ దళాల్ని ఉపయోగించుకొన్నది. ఈ దండయాత్రల, యుద్ధాల కారణంగా భారతదేశ మిలిటరీ వ్యయం విపరీతంగా పెరిగింది. భారత ప్రజలపై మోపబడుతున్న ఆర్థిక భారం కారణంగానూ, రాజకీయనీతి రీత్యాను, ఇవి సామ్రాజ్యవాద విస్తరణ, వాణిజ్య ప్రయోజనాల్ని సంరక్షించడానికిగాని భారత ప్రయోజనాల రక్షణ కొరకు కాదు గనుకను ఈ యుద్ధాలు, దండయాత్రలలో భారతదేశ జోక్యాన్ని తొలినాటి జాతీయనాయకులు ఖండించారు. వీటికయ్యే పూర్తి వ్యయాన్ని

బ్రిటిషు ప్రభుత్వం భరించాలని డిమాండు చేశారు. భారతదేశ ప్రయోజనాలు శాంతియుత విధానం ద్వారా పరిరక్షింపబడతాయని వాదించారు.

రెండవ ఆఫ్గన్ యుద్ధం 1878–80లలో జరిగింది. భారతీయుల అభిప్రాయాన్ని వ్యక్తంజేస్తూ సురేంద్రనాథ బెనర్జీ యిది కేవలం దురాక్రమణ యుద్ధమని, చరిత్ర పుటలకు నలుపురంగు పులిమిన అత్యంత అక్రమ యుద్ధాలలో యిదొకటని బాహాటంగా ప్రకటించారు. ఈ యుద్ధం సామ్రాజ్యవాద లక్ష్యాల విధానాలననుసరించి చేయబడింది గనుక యుద్ధ వ్యయం పూర్తిగా బ్రిటన్ భరించాలని భారతీయులు డిమాండు చేశారు. 1880 మార్చి 19న అమృతబజారు పత్రిక వ్యంగ్యంగా యిలా వ్యాఖ్యానించింది. 'ఇంగ్లీషువాడు వాడి జేబునంటుకొన్నప్పుడు పొందేటంత ఉద్రిక్తతకు మరెప్పుడూ లోనుగాడు. తన ప్రయోజనాలు యితరుల ఖర్చుతో నెరవేరుతున్నప్పుడు పొందేటంత ఆనందాన్ని ఎప్పుడూ పొందడు".

1882లో కల్నల్ అరాబి నాయకత్వంలో జరిగిన జాతీయవాద తిరుగుబాటుని అణచివేసేందుకు ఇంగ్లాండు ఈజిప్టుపై జరిపిన సైనికచర్యలో భారతప్రభుత్వం పాల్గొన్నదని. దురాక్రమణ పూరితమైన అనైతికమైన బ్రిటిషువిధానాన్ని భారత జాతీయవాదులు ఖండిస్తూ ఈజిప్టులో యుద్ధం బ్రిటిషు పెట్టుబడిదారుల, వ్యాపారుల, బ్యాంకర్ల ప్రయోజనాల సంరక్షణ కొరకే చేయబడిందన్నారు.

1885 సంవత్సరాంతంలో భారతదేశ ప్రభుత్వం బర్మాపై దాడి జరిపి ఆక్రమించుకొన్నది. బర్మా ప్రజలపై జరిపిన యుద్ధం అనైతికం, అన్యాయం, అవాంఛనీయం, దురాక్రమణ పూరితమని జాతీయనాయకులు ముక్తకంఠంతో ఖండించారు. యుద్ధానికి కారణం బర్మాలో, బర్మాకి ఉత్తరాన గల చైనాలో బ్రిటిషు వ్యాపార ప్రయోజనాలను విస్తరింపజేసుకోవడం. జాతీయవాదులు బర్మా ఆక్రమణని ఖండించారు. ఆ తరువాత సంవత్సరాలలో బర్మా ప్రజలు సాగించిన గొరిల్లా పోరాటాన్ని అభినందించారు.

1903లో లార్డ్ కర్జన్ టిబెట్‌పై దాడిచేశాడు. వ్యాపారపరమైన పేరాశ, రాజ్యవిస్తరణ – లక్ష్యాలుగా చేసిన దురాక్రమణ యుద్ధాన్ని జాతీయవాదులు ఖండించారు.

అన్నిటిని మించి భారతదేశ వాయవ్య సరిహద్దుపై 1890 దశాబ్దంలో బ్రిటిషు ప్రభుత్వం చేపట్టిన విస్తరణ విధానం భారత ప్రజల కోపాగ్నిని రగిల్చింది. రష్యా పథకాల నుండి భారతదేశానికి రక్షణ కల్పించే నెపంతో, తిరగబడుతున్న తెగల ప్రజలకు వ్యతిరేకంగా

60,000సైన్యాన్ని దించింది. భారతదేశాన్ని భాగస్వామిని చేసింది. కొత్త ప్రాంతాలను కలుపుకొన్నది. భారత ప్రభుత్వ ఖజానాని కొల్లగొట్టింది. కాని బ్రిటన్, రష్యాల మధ్య పోటీ యూరప్, ఆసియాలలోని రెండు సామ్రాజ్యవాదాల మధ్య ఘర్షణ ఫలితమని, రష్యా దురాక్రమణ అనేది అభూతకల్పనని, బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ విస్తరణని సమర్థించుకొనేందుకు చేపట్టిన దుష్ప్రచారమని భారతీయులు చెప్పారు. సరిహద్దుల తెగల ప్రజలు వారి స్వతంత్రాన్ని రక్షించుకొనేందుకు చేపట్టిన ప్రతిఘటనను జాతీయవాదులు సమర్థించారు. సరిహద్దుల తెగల ప్రజల రక్తదాహం, చట్టవిరుద్ధ కార్యకలాపాల కారణంగా సాయుధ చర్యలు చేపట్టబడ్డాయనే ప్రభుత్వ ప్రచారాన్ని జాతీయవాదులు అంగీకరించ నిరాకరించారు. తెగల తిరుగుబాటుల్ని అణచడంలో ప్రభుత్వం అవలంబించిన ఆటవిక చర్యల్ని ఖండించారు. సరిహద్దు యుద్ధాలు 'నాగరికతా కెరటాలు తీరం వెంబడి పైపైకి వచ్చి మిగిల్చే గుర్తుల లాంటివ'ని బ్రిటిషు ప్రధాని చేసిన వ్యాఖ్యని జాతీయవాదులు ఖండించారు. 1897 అక్టోబర్ 17 తిలక్ 'మరాటా' పత్రికలో "దుర్మార్గుడైన రాజకీయవేత్త చివరిగా 'మానవప్రేమ' మాటున ఆశ్రయం పొందజూస్తాడు. హేతుబద్ధత లోపించినప్పుడు, కుతర్కం బహిర్గతపరచబడినప్పుడు దొరికే గడ్డిపరక మానవప్రేమ."

భారతదేశ ప్రభుత్వ సరిహద్దుల విస్తరణ విధానం బ్రిటన్ ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న సామ్రాజ్యవాద విధానంలో భాగమని జాతీయ నాయకులు వాదించారు. సైనిక బలగాల పెంపు, మిలిటరీ వ్యయంలో పెరుగుదల, ప్రభుత్వం యొక్క దయనీయమైన ఆర్థికస్థితి, 1815 తరువాత పన్నుల పెంపు – యివన్నీ విస్తరణ విధానం యొక్క ఫలితాలు. అందువలన భారతీయులు శాంతియుత విధానాన్ని అవలంబించాలని డిమాండ్ చేశారు. 1897లో కాంగ్రెస్ అధ్యక్షులు సి.శంకరరామన్ "మన నిజమైన విధానం శాంతియుత విధానం... అంతర్గతంగా భారతదేశం కలిగియున్న శక్తితో, మన సంక్షేమం కొరకు సంస్కరణలు అమలు జరుపవలసిన అవసరంతో దీర్ఘకాలిక శాంతిని మనం కోరుకుంటాము" అన్నారు.

1880–1914 కాలంలో జాతీయవాద విదేశాంగ విధానంలో మూడు ప్రధానమైన అంశాలు ముందుకు వచ్చాయి. ఒకటి: స్వేచ్ఛ, విముక్తి కొరకు పోరాడుతున్న ప్రజలకు సానుభూతి వ్యక్తం చేయడం, పోరాటాలను బలపరచడం. ఆ విధంగా ఐర్లాండు, రష్యా, టర్కీ, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, ఈజిప్టు, సూడాన్, ఇథియోపియా, ఆఫ్రికాలోని యితర ప్రజలకు సంఘీభావం ప్రకటించబడింది. పత్రికల ద్వారా ప్రచారం చేయబడింది. చైనాలో

బాక్సర్ తిరుగుబాటు కాలంలో విదేశీ జోక్యాన్ని జాతీయ నాయకులు నిరసించారు.

రెండవది: ఆసియా చైతన్యం, 1885లో బర్మా యుద్ధాన్ని వ్యతిరేకించే కాలంలో మొదటిసారిగా ఆసియా గుర్తింపు, ఆసియా చైతన్యం మొదలయింది. తోటి ఆసియా దేశం అదృశ్యమవడం పట్ల కొన్ని జాతీయవాద పత్రికలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశాయి. 1868 తరువాత పారిశ్రామిక శక్తిగా ఆధునిక జపాన్ అభివృద్ధి – ఒక వెనుకబడిన ఆసియాదేశం పాశ్చాత్యుల అదుపులోవుండి కూడా అభివృద్ధి చెందగలదు అనే వాస్తవానికి ఉదాహరణగా నిలుస్తుందని భారతీయులు ప్రశంసించారు. భారతీయులు జపాన్ అభివృద్ధి చెందడాన్ని అభిమానించినప్పటికీ 1895లో జపాన్ చైనాపై దాడిచేయడాన్ని, బాక్సర్ తిరుగుబాటు అణచివేతలో అంతర్జాతీయంగా భాగస్వామ్యం వహించడాన్ని జాతీయవాద వార్తాపత్రికలు ఖండించాయి. చైనా విభజనలో విజయం సాధిస్తే అది ఒక ప్రధానమైన స్వతంత్ర ఆసియాశక్తి అదృశ్యమవడానికి దారితీస్తుంది గనుక చైనా విభజన కొరకు జరిగిన సామ్రాజ్యవాద యత్నాన్ని ఖండించారు. జపాన్‌చేతిలో జారిస్టు రష్యా ఓటమి, యూరపు ఐక్యతలోని డొల్లతనాన్ని బహిర్గతపరచింది. అఖిల ఆసియా భావన పునరుజ్జీవానికి దారితీసింది.

19వ శతాబ్దంలో సామ్రాజ్యవాద పునరుజ్జీవం వెనుక విదేశీ పెట్టుబడులతో సహా గల ఆర్థిక హేతుబద్ధతను భారతీయులు అర్థం చేసుకొనడం, వ్యాఖ్యానించడం ప్రారంభించారు. బర్మాపై దాడిచేయడానికి వెనుకవున్న కారణాలను వ్యాఖ్యానిస్తూ 1885 నవంబర్ 15న మరాటా పత్రిక యిలా రాసింది: “అత్యధికమైన మానవశక్తితోను పొంగిపొరలుతున్న పెట్టుబడులతోను వున్న ఇంగ్లాండు రానున్న కొన్ని శతాబ్దాల వరకు తన జనాభాకి ఆహారం సమకూర్చేందుకు, పారిశ్రామికవేత్తలకు మార్కెట్లను సమకూర్చేందుకు ‘బలంగలవాడిదే రాజ్యం’ – అనే సూత్రానికి కట్టుబడివుండక తప్పదు.” అదేవిధంగా 1889 సెప్టెంబర్ 23 ‘హిందూ’ యిలా వ్యాఖ్యానించింది. “విదేశీ పెట్టుబడులు వచ్చిపడిన దేశంలో ఆ దేశం యొక్క పాలనా వ్యవహారాలపై బాండు హోల్డర్ల ఆసక్తి పెరుగుతుంది.”

* * *

1914 జూన్‌లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. లోకమాన్య తిలక్‌తో సహా జాతీయవాద నాయకులు ప్రభుత్వ యుద్ధ ప్రయత్నాలను బలపరచాలని నిర్ణయించారు. సామ్రాజ్యం పట్ల విధేయతా భావాలు, దానిని రక్షించే కాంక్ష స్పష్టంగా

వ్యక్తం చేయబడ్డాయి. కాని జవహర్‌లాల్ నెహ్రూ తన జీవిత చరిత్రలో ప్రస్తావించినట్లు "విధేయతని గురించి ఎంతగా చెప్పినప్పటికీ బ్రిటిషువారి పట్ల సానుభూతిలేదు. మితవాదులు, అతివాదులు కూడా జర్మనీ విజయాలను సంతృప్తిగా విన్నారు. అలాగని జర్మనీ పట్ల వారికి ప్రేమ ఏమాత్రం లేదు. పాలకులు న్యూనతకు గురయితే చూడాలని ఆకాంక్ష మాత్రమే" బ్రిటన్ కృతజ్ఞతతో భారతదేశం యొక్క విధేయతకు ఆర్థిక రాజకీయ రాయితీల రూపంలో మూల్యం చెల్లిస్తుందని, ఫలితంగా భారతదేశం స్వయం పరిపాలన దిశలో ముందడుగు వేస్తుందని, బ్రిటన్ యితర యూరపు దేశాలు ఏ ప్రజాస్వామ్య సూత్రాల కొరకు యుద్ధం చేస్తున్నామని చెప్పుకొంటున్నాయో వాటిని బ్రిటన్ భారతదేశానికి వర్తింపచేస్తుందని ఆశ."

యుద్ధానంతరం ప్రపంచశాంతి కొరకు అన్ని దేశాల సహకారం సాధించేందుకు అనువుగా జాతీయవాదులు తమ విదేశాంగ విధానాన్ని మరికొంత అభివృద్ధి పరిచారు. ఈ విధానంలో భాగంగా 1919 ఢిల్లీ కాంగ్రెస్ సదస్సు తమచే ఎన్నుకోబడిన ప్రతినిధులకు శాంతి సదస్సులో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

భారతీయులు యితర దేశాలలో స్వతంత్రం కొరకు పోరాడుతున్న ప్రజలకు తమ సానుభూతిని వ్యక్తం చేయడం కొనసాగించారు. ఐరిష్, ఈజిప్ట్ ప్రజలకు, టర్కీ ప్రభుత్వానికి తమ మద్దతు ప్రకటించారు. పశ్చిమాసియాలో యుద్ధం చేసేందుకు సైన్యంలో చేరవద్దని 1920 కలకత్తా కాంగ్రెస్ సదస్సు ప్రజలను కోరింది. ఆఫ్ఘన్‌పై ఎలాంటి దాడినైనా భారత ప్రజలు వ్యతిరేకిస్తారని 1921 మేలో గాంధీజీ ప్రకటించారు. నానాజాతి సమితి యొక్క ఫర్మానా విధానం సామ్రాజ్యవాద పేరాశ కప్పుకొన్న ముసుగు అని కాంగ్రెస్ స్పష్టం చేసింది. 1921లో స్వతంత్రం కొరకు పోరాడుతున్న బర్మా ప్రజలను కాంగ్రెస్ అభినందించింది. అప్పుడు బర్మా భారతదేశంలో భాగం. కాని స్వతంత్ర భారతదేశం బర్మా స్వాతంత్ర్యాన్ని కోరుకుంటుందని కాంగ్రెస్ ప్రకటించింది. 1922లో గాంధీజీ యిలా వ్రాశాడు. "బర్మా భారతదేశంలో భాగం కావడం నాకేమాత్రం సంతోషం కలిగించదు. బర్మా గతంలో ఎప్పుడూ భారతదేశంలో భాగం కాదు. ఇకముందూ కాకూడదు. బర్మా ప్రజలకు వారిదైన నాగరికత వుంది." బర్మా ప్రజల హక్కులకు భంగం కలిగించే ప్రత్యేకమైన హక్కుల కొరకు డిమాండ్ చేయరాదని 1924లో బర్మాలో స్థిరపడిన భారతీయుల్ని కాంగ్రెస్ కోరింది.

1925లో చైనా జాతీయవాద సైన్యం సన్‌యెట్‌సెన్ నాయకత్వంలో ఉత్తర దిశగా జైత్రయాత్ర ప్రారంభించింది. విదేశీ శక్తులు జోక్యానికి సిద్ధమయ్యాయి. ఉమ్మడి

శత్రువుకి వ్యతిరేకంగా జాతీయైక్యత కొరకు పోరాడుతున్న చైనా ప్రజల పోరాటానికి కాంగ్రెస్ వెంటనే సౌహార్థంతో కూడిన మద్దతు ప్రకటించింది. భారత సైన్యాన్ని చైనాకి పంపడానికి వ్యతిరేకంగా తీవ్రమైన నిరసన వ్యక్తం చేసింది. 1925లో అమాయకులైన చైనా విద్యార్థులపై భారత సైనికులు కాల్పులు జరపడాన్ని అత్యంత బాధాకరమైన సిగ్గుతో తలవంచుకోవాల్సిన దృశ్యంగా గాంధీజీ వర్ణించాడు. భారతదేశంపై వలసపాలన సాగించడం భారతదేశాన్ని దోచుకొనడానికేగాక గొప్ప ప్రాచీన చైనా జాతిని కూడా దోచుకొనే అవకాశం కూడా కల్పించింది.

చైనా ప్రజల్ని అణచివేసేందుకు భారత సైన్యాన్ని ఉపయోగించుకొనడాన్ని నిరసిస్తూ 1927 జనవరిలో ఎస్.శ్రీనివాస అయ్యంగార్ సెంట్రల్ అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. ఈ సమస్యపై భారత ప్రజల మనోభావాలు 1927లో (మద్రాసు కాంగ్రెస్ సదస్సుతో సహా) మాటిమాటికి వ్యక్తం చేయబడ్డాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మనలాగానే పోరాడుతున్న చైనా ప్రజలపై యుద్ధానికి పోరాదని మద్రాస్ కాంగ్రెస్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. భారత సైన్యాల్ని మెసపటోమియా, ఇరాన్ తదితర దేశాల నుండి వెనక్కి రప్పించాలని డిమాండు చేసింది. 1928లో కాంగ్రెస్, ఈజిప్టు, సిరియా, పాలస్తీనా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు వారి జాతీయ విముక్తి పోరాటాలలో పూర్తి మద్దతు యిస్తామని హామీ యిచ్చింది.

వలసవాదానికి గురయిన ప్రజలతో భారత ప్రబల సంఘీభావం, ప్రపంచవ్యాప్తంగా గల బ్రిటిషు సామ్రాజ్యవాదంతో భారతదేశానికి గల కీలకమైన పాత్రని గురించి 1927 కాంగ్రెస్ సదస్సు అధ్యక్షోపన్యాసంలో డాక్టర్ ఎం.ఎ.అన్సారీ యిలా సంక్షిప్తీకరించారు. "మానవ ప్రేమ  పేరుతో సాగిస్తున్న యూరపు దోపిడీ చరిత్ర కాంగో నుండి కాంటన్ వరకు గల ప్రజల రక్తాక్షరాలతో వ్రాయబడింది. సామ్రాజ్యవాదం అనే ఆర్చిలో భారతదేశం కీలకమైన రాయిగనుక, భారతదేశం స్వతంత్రమైతే మొత్తం సామ్రాజ్యవాద చట్రమే కూలిపోతుంది."

* * *

1926-27లో నెహ్రూ యూరపులో పర్యటించారు. యూరపులోని వామపక్ష రాజకీయ నాయకులతోను మేధావులతోను సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. ఇది విదేశీ వ్యవహారాల రంగంతో సహా మొత్తం ఆయన రాజకీయ అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావం చూపింది. బ్రిటన్ యూరపులలో సామ్రాజ్యవాద వ్యతిరేక భావాలు గల ప్రజలతో

సంబంధాలు, వారి మద్దతు నెహ్రూతోనే ప్రారంభంకాలేదు. దాదాబాయ్ నౌరోజీకి సోషలిస్టు హెచ్.యం.హిండ్మన్ సన్నిహిత మిత్రుడు. నౌరోజి 1904 ఆగస్టులో జరిగిన ఇంటర్నేషనల్ సోషలిస్టు కాంగ్రెస్ హేగ్ సదస్సుకు హాజరయ్యాడు. సామ్రాజ్యవాదం ఆటవిక సంస్కృతికి చెందిందని వర్ణించాడు. బ్రిటిషు రాజకీయ పార్టీల మీద పార్లమెంటు మీద భారత ప్రజలు విశ్వాసం కోల్పోయారని, బ్రిటిషు కార్మికవర్గం యొక్క సహకారాన్ని అపేక్షిస్తున్నారని ప్రకటించాడు. లజపతిరాయ్ అమెరికాలో వున్న 1914-18 కాలంలో అమెరికా సోషలిస్టులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. యుద్ధం యొక్క సామ్రాజ్యవాద స్వభావం కారణంగా 1917లో యుద్ధంలో అమెరికా పాల్గొనడాన్ని వ్యతిరేకించాడు. యూరపు ప్రముఖ వ్యక్తులైన టాల్స్టాయ్, రొమైన్రోలాండుతో గాంధీజీకి సన్నిహిత సంబంధాలున్నాయి.

వలసవాద దోపిడీకి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా 1927 ఫిబ్రవరిలో బ్రెజిల్స్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుకి కాంగ్రెస్ ప్రతినిధిగా జవహర్‌లాల్ నెహ్రూ హాజరయ్యాడు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా ప్రజల్ని, పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడుతున్న పెట్టుబడిదారీ దేశాల కార్మికుల్ని సమీకరించడం సదస్సుయొక్క ప్రాథమిక లక్ష్యం. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, రొమైన్ రొలాండ్, మేడం సన్‌యెట్‌సేన్, జార్జి లాక్స్‌బరీలతో పాటు నెహ్రూ గౌరవాధ్యక్షులలో ఒకడుగా ఎన్నికయ్యారు. సదస్సులలోని ఉపన్యాసాలలో, ప్రకటనలలో నెహ్రూ వలసవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి గల సన్నిహిత సంబంధాన్ని గురించి, అలాగే భారత జాతీయవాదానికి, అంతర్జాతీయవాదం పట్ల ప్రపంచవ్యాప్తంగా గల వలసవాద వ్యతిరేక పోరాటాల పట్ల గల గాఢమైన నిబద్ధత గురించి నొక్కి చెప్పాడు. నెహ్రూ లాటిన్ అమెరికా ప్రతినిధులతో చర్చలు జరిపి అమెరికా సామ్రాజ్యవాద ప్రమాదాన్ని గుర్తించాడు. ఇది గతంలోని భారతీయ వైఖరుల కంటే భిన్నమైనది. సదస్సుపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి యిచ్చిన రిపోర్టులో యిలా వ్రాశాడు. “మనలో చాలామందికి ప్రత్యేకించి ఆసియా నుండి వచ్చిన వారికి దక్షిణ అమెరికా సమస్యలు తెలియవు. అభివృద్ధి చెందుతున్న అమెరికా సామ్రాజ్యవాదం విపరీతమైన వనరులతో బయట నుండి దాడులు జరగకపోవడంతో ఏర్పడిన రక్షణతో క్రమంగా సెంట్రల్‌సౌత్ అమెరికాపై ఎలా పట్టు బిగిస్తున్నదీ తెలియదు. సమీప భవిష్యత్‌లో అమెరికా సామ్రాజ్యవాదం బ్రిటిషు సామ్రాజ్యవాదం కంటే పెద్ద సమస్య కానున్నదని తెలుసుకొనడానికి ఎక్కువకాలం పట్టకపోవచ్చు.”

జాతీయ స్వతంత్రం కొరకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఒక లీగుని స్థాపించాలని బ్రజెల్స్ సదస్సు నిర్ణయించింది. లీగు యొక్క ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కి నెహ్రూ ఎన్నికయ్యాడు. అసోసియేటివ్ సభ్యత్వంతో కాంగ్రెస్ లీగుతో అనుసంధానం చేయబడింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భారతదేశ పోరాటం ఒక భాగమని కలకత్తా కాంగ్రెస్ సదస్సు ప్రకటించింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలతో ఉద్యమాలతో సంబంధాలు పెంచుకొనేందుకు ఒక విదేశీశాఖని ప్రారంభించాలని కూడా కాంగ్రెస్ నిర్ణయించింది. ఇది నెహ్రూకి వామపక్షవాదులకు పరిమితమైన అవగాహన కాదు. గాంధీజీ 1923 సెప్టెంబర్‌లో నెహ్రూకి యిలా వ్రాశాడు. "మన జాతీయవాదం అభివృద్ధికరమైన అంతర్జాతీయ వాదానికి అనుగుణమైనదిగా వుండాలని... మనం గుర్తించాలి. ప్రపంచంలోని అభివృద్ధికరమైన శక్తుల సరసన మనం వుండాలి."

* * *

జాతీయవాద విదేశాంగ విధానంలో చాలా చురుకైన దశ 1936లో ప్రారంభమైంది. ప్రపంచంలో ప్రతి ముఖ్యమైన సంఘటనకు కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు స్పందించారు. ఫాసిజం అప్పటికే ఇటలీ, జర్మనీ, జపాన్‌లలో విజయం సాధించింది. పెట్టుబడిదారీ ప్రపంచంలోని యితర ప్రాంతాలలో తన వికృతమైన పడగని విప్పుతుంది. అది సామ్రాజ్యవాదం వర్ణ వివక్షతల యొక్క అత్యంత తీవ్రమైన రూపమని కాంగ్రెస్ ఖండించింది. ఫాసిజానికి, సోషలిజం ప్రజాస్వామ్యం స్వేచ్ఛాయుత శక్తులకు మధ్య జరుగనున్న పోరాటానికి భారతదేశం సన్నిహితంగా అనుసంధానం చేయబడిందని కాంగ్రెస్ గుర్తించింది. ఫాసిజం దాడులకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న ఇథియోపియా, స్పెయిన్, చైనా, జెకొస్లోవేకియా ప్రజలకు పూర్తి మద్దతు ప్రకటించింది.

ప్రపంచ వ్యవహారాలపై కాంగ్రెస్ ప్రతినిధియైన నెహ్రూ ప్రపంచ సమస్యలపై జాతీయవాద వైఖరిని 1936లో లక్నో కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసంలో స్పష్టంగా సూత్రీకరించాడు. ఫాసిజానికి వ్యతిరేకంగా రానున్న ప్రపంచ పోరాటం నేపథ్యంలో భారతదేశ పోరాటంపై దృష్టిని కేంద్రీకరించాలని వివరించాడు. "మన పోరాటం స్వేచ్ఛ కొరకు జరుగుతున్న విస్తృత పోరాటంలో భాగం. మనల్ని కదిలించిన శక్తులు ప్రపంచవ్యాప్తంగా ప్రజల్ని కార్యాచరణలోకి దించాయి... పెట్టుబడిదారీ విధానం తన క్లిష్ట దశలో ఫాసిజాన్ని ఆశ్రయించింది. దాని సామ్రాజ్యవాద వలసదేశాలలో చాలా కాలం నుండి చేస్తున్నట్లుగా.... ఆ విధంగా ఫాసిజం, సామ్రాజ్యవాదం క్షీణిస్తున్న

పెట్టుబడిదారీ విధానం యొక్క రెండు ముఖాలుగా పనిచేస్తున్నాయి." అంతేగాక "ఆ విధంగా ప్రపంచం రెండు పెద్ద గ్రూపులుగా విభజింపబడడం మనం చూస్తున్నాం - ఒకవైపు సామ్రాజ్యవాద ఫాసిస్టు గ్రూపు; మరొకవైపు ప్రజాస్వామ్య సోషలిస్టు గ్రూపు. అనివార్యంగా ఫాసిజం సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా మోహరింపబడిన అభివృద్ధికరమైన శక్తుల పక్షాన మనం వుంటాం." నెహ్రూ తరువాతి సంవత్సరాలలో ఈ అంశాల్ని చాలాసార్లు ప్రస్తావించాడు. నెహ్రూ 1939 జనవరిలో యిలా వ్రాశాడు. "మన పోరాట హద్దులు మన దేశంలోనే లేవు. స్పెయిన్, చైనాలో కూడా వున్నాయి."

గాంధీజీ కూడా బలమైన సామ్రాజ్య వ్యతిరేక భావాల్ని వ్యక్తం చేశాడు. హిట్లర్ యూదులపై సాగించిన హత్యాకాండని నిరసించాడు. అమానుషమైన హత్యాకాండని సమర్థించుకొంటూ హిట్లర్ ప్రతిపాదించిన సమరశీల జాతీయవాదంతో కూడిన క్రొత్త మతాన్ని గాంధీజీ నిరసించాడు. గాంధీజీ యిలా వ్రాశాడు. "మానవత్వం పేరుతో మానవత కొరకు ఏదైనా యుద్ధానికి అవకాశం వుంటే ఉద్దేశపూర్వకంగా ఒక జాతి మొత్తాన్ని పీడించడాన్ని నివారించే జర్మనీ వ్యతిరేక యుద్ధం పూర్తిగా సమర్థనీయం."

1936 ప్రారంభంలో ఫాసిస్టు ఇటలీ, ఇథియోపియాపై దాడిచేసినప్పుడు దోపిడీకి గురయిన ప్రజలంతా స్వేచ్ఛ కొరకు సాగించే పోరాటంలో ఇథియోపియా ప్రజల పోరాటం భాగంకావాలని కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ మే 9న ఇథియోపియా దినంగా ప్రకటించింది. ఇథియోపియా ప్రజలకు సానుభూతి మద్దతు ప్రకటిస్తూ సభలు జరిపింది; ప్రదర్శనలు నిర్వహించింది. ముసోలిని చాలాసార్లు ఆహ్వానించినప్పటికీ నెహ్రూ ముసోలినీని కలిసేందుకు నిరాకరించాడు.

స్పెయిన్ అంతర్యుద్ధంలో ఫాసిస్టు ఫ్రాంకోతో జీవన్మరణ పోరాటం సాగిస్తున్న స్పానిష్ రిపబ్లికన్లకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. 1936 డిసెంబర్ ఫైజాపూర్ కాంగ్రెస్ అధ్యక్షోపన్యాసంలో నెహ్రూ, స్పెయిన్‌లో జరుగుతున్న పోరాటం రిపబ్లిక్కులకు, ఫ్రాంకోకి మధ్య జరుగుతున్న పోరాటం మాత్రమేకాదని లేక ఫాసిజానికి, ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న పోరాటం మాత్రమేకాదని, ప్రపంచవ్యాప్తంగా గల అభివృద్ధికర శక్తులకు ప్రతీఘాత శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటమని నొక్కి చెప్పాడు. "ఈనాడు స్పెయిన్‌లో మన పోరాటాలు జరుగుతున్నాయి. ఈ పోరాటాల్ని మనం కేవలం సానుభూతితో బయటనున్న మిత్రులుగా చూడడం కాదు. దానిలో భాగస్వాములైనవారి బాధాకరమైన ఆతురతతో చూస్తున్నాం." 1938 జూన్‌లో కృష్ణమీనన్‌తో కలిసి నెహ్రూ స్పెయిన్ సందర్శించాడు. యుద్ధరంగాన్ని చూశాడు. నిరంతరం బాంబుదాడులు జరుగుతున్న

బార్సిలోనాలో ఐదు రోజులున్నాడు. 1938 అక్టోబర్ 13న గాంధీజీ స్పెయిన్ ప్రధానమంత్రి జుయన్ నేగ్రికి "నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. మీ బాధలకు ప్రతిఫలంగా నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని ఆశిస్తున్నాను" – అన్న సందేశం పంపించాడు.

1938 చివరలో హిట్లర్ జెకొస్లోవేకియాపై దౌత్యపరమైన, రాజకీయపరమైన దురాక్రమణ ప్రారంభించాడు. బ్రిటన్, ఫ్రాన్స్‌లు నమ్మకద్రోహానికి పాల్పడ్డాయి. జెకొస్లోవేకియా స్వేచ్ఛని హరిస్తూ నిస్సిగ్గుగా జర్మనీ చేసిన దాడి పట్ల తీవ్రమైన ఆందోళనను, సాహసులైన జెకొస్లోవేకియా ప్రజలకు ప్రగాఢమైన సానుభూతి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం ఆమోదించింది. గాంధీజీ హరిజన పత్రికలో జెకొస్లోవేకియా పతనం నిర్ణయమవడంతో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీవ్రమైన వ్యధకి గురయింది' అని వ్రాశాడు. 'జెక్ ప్రజల దురవస్థ నన్ను శారీరకంగా, మానసికంగా క్రుంగదీసింది' అని తన బాధని వ్యక్తం చేశాడు. అప్పుడు యూరపులో వున్న నెహ్రూ ప్రభుత్వ అతిథిగా జర్మనీ సందర్శించ నిరాకరించి, ప్రేగ్‌కి వెళ్ళాడు. జర్మనీని ప్రోత్సహించినందుకు బ్రిటిషు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మాంచెస్టర్ గార్డియన్ పత్రికకి వ్రాసిన లేఖలో యిలా పేర్కొన్నాడు. "జెకోస్లోవేకియాలోని యిటీవలి పరిణామాలు, బ్రిటిషు ప్రభుత్వం ప్రత్యక్షంగాను, మధ్యవర్తుల ద్వారాను జెక్ ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తూ బెదిరించిన తీరు నాలో ఏహ్యాభావాన్ని కలిగించింది." మ్యూనిచ్ ఒప్పందం ఆయనకు చిరాకు కలిగించింది. నెహ్రూ 1938 అక్టోబర్ 5న నేషనల్ హెరాల్డ్ పత్రికకు వ్రాసిన వ్యాసంలో మ్యూనిచ్ ఒప్పందాన్ని "బ్రిటన్, ఫ్రాన్స్‌లు జెకొస్లోవేకియాని బలంగా పట్టుకొనగా, జర్మనీ చేసిన మానభంగంగా" వర్ణించాడు. సోవియట్ యూనియన్‌ని ఏకాకిని చేసి, దాని ప్రాబల్యం పెరగకుండా సమతుల్యతని నిలబెట్టేందుకు బ్రిటన్, ఫ్రాన్స్‌లు యూరపులో ఫాసిజాన్ని ప్రోత్సహించాయని నెహ్రూ వ్యాఖ్యానించాడు. ఫాసిస్టు శక్తులకు అండదండలందించి ప్రజాస్వామ్య దేశాల విధ్వంసానికి తోడ్పడుతున్న బ్రిటిషు విదేశాంగ విధానాన్నుండి విడగొట్టుకుంటున్నట్లుగా 1939 ప్రారంభంలో త్రిపురి కాంగ్రెస్ సదస్సు తీర్మానాన్ని ఆమోదించింది.

1937లో జపాన్ చైనాపై దాడిచేసింది. జపాన్ చర్యని ఖండిస్తూ కాంగ్రెస్ తీర్మానం చేసింది. చైనాపై సానుభూతి సూచనగా జపాన్ వస్తువుల్ని బహిష్కరించమని భారత ప్రజలకు పిలుపునిచ్చింది. చైనాపై చేసిన కిరాతకమైన సామ్రాజ్యవాద దురాక్రమణని, సాగించిన భయోత్పాతాన్ని ఖండిస్తూ 1938లో హరిపుర కాంగ్రెస్ సదస్సు ఈ పిలుపుని పునరుద్ఘాటించింది. చైనాపై దాడి ఆసియా స్వేచ్ఛకి ప్రపంచశాంతికి హానికరమని

హెచ్చరించింది. చైనా ప్రజలకు సంఘీభావాన్ని వ్యక్తం చేస్తూ భారతదేశమంతటా జూన్ 12 చైనా దినంగా పాటించబడింది.

చైనా సాయుధ దళాలకు వైద్యసేవలందించేందుకు కాంగ్రెస్ డాక్టర్ యం.అటల్ నాయకత్వంలో ఒక వైద్యబృందాన్ని పంపింది. మావోసెటుంగ్ నాయకత్వంలోని ఎయిత్‌రూట్ ఆర్మీకి సేవలందిస్తూ వైద్య బృందంలోని సభ్యుడు డాక్టర్ కొట్నీస్ అసువులర్పించాడు.

పాలస్తీనా సమస్యపై చేపట్టిన వైఖరిలో భారత జాతీయవాద విదేశాంగ విధానం యొక్క మానవతా దృక్పథం సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావం స్పష్టంగా వ్యక్తమయ్యాయి. పాలస్తీనాలో బ్రిటిషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అరబ్బులు పోరాడుతుండగా, నాజీ జర్మనీలో యూదులు వేటాడి చంపబడ్డారు. యూరపు అంతటా వివక్షకు గురిచేసి అణచబడ్డారు. కాని పాలస్తీనాలో యూదులు బ్రిటిషు మద్దతుతో కొంత భూభాగాన్ని ఆక్రమించి మాతృభూమిని స్థాపించుకొనే యత్నాలు చేపట్టారు. నాజీ హత్యాకాండకు గురయిన, హింసించబడిన యూదుల పట్ల భారతీయులు సానుభూతి వ్యక్తం చేశారు. అదే సమయంలో అరబ్బులపై యూదుల చర్యని నిరసించారు. అరబ్బులను బలపరిచారు. అరబ్బులతో ఒప్పందానికి రావలసిందిగా యూదుల్ని అర్థించారు. 1937 అక్టోబర్‌లో పాలస్తీనాలోని బీభత్సాన్ని, పాలస్తీనాని విభజించాలనే ప్రతిపాదనని కాంగ్రెస్ నిరసించింది. అరబ్బులకు భారతీయుల సంఘీభావాన్ని ప్రకటించింది. 1938 సెప్టెంబర్‌లో విభజన నిర్ణయాన్ని మరొకసారి ఖండించింది. యూదులు, అరబ్బుల సమస్యని శాంతియుతంగా పరిష్కరించుకొనేందుకు అనువుగా వైదొలగమని బ్రిటిషు ప్రభుత్వాన్ని అర్థించింది. బ్రిటిషు సామ్రాజ్యవాద నీడలో ఆశ్రయం పొందవద్దని యూదులకు విజ్ఞప్తి చేసింది. గాంధీజీ యూరపులోని యూదుల దురవస్థని గురించి 1938 డిసెంబర్ 'హరిజన'లో సంపాదకీయం వ్రాస్తూ ఈ అభిప్రాయాలన్నింటినీ పునరుద్ఘాటించాడు. "యూదుల పట్ల నా సానుభూతి వుంటుంది. కాని అరబ్బులపై యూదుల్ని రుద్దడం తప్పు. అరబ్బుల ఆత్మగౌరవాన్ని న్యూనత పరచడం మానవత్వానికి వ్యతిరేకంగా చేసే నేరం." అరబ్బులతో హేతుబద్ధంగా వ్యవహరించమని యూదులకు విజ్ఞప్తిచేస్తూ 'బ్రిటిషు తుపాకుల్ని తోసిపుచ్చుమ'న్నాడు. వారికెలాంటి అపకారం చేయని ప్రజల్ని దోచుకొనడంలో వారు బ్రిటిషువారితో భాగస్వాములవుతున్నారన్నాడు. 1936 నుండి 1939వరకు నెహ్రూ యిలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశాడు.

జాతీయవాదుల – ప్రధానంగా యువత యొక్క ప్రాపంచిక దృక్పథంలో ప్రధానమైన అంశం: సోవియట్ యూనియన్ పట్ల అపారమైన సుహృద్భావం అభిమానం పెరగడం. లోకమాన్య తిలక్, లజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్ లాంటి అప్పటి ముఖ్యమైన భారత రాజకీయ నాయకులు 1917–18నాటి రష్యన్ విప్లవంలో అణచివేయబడిన ప్రజల విజయాన్ని చూసి సానుకూలంగా స్పందించారు. 1920లలో సోషలిస్టులు, కమ్యూనిస్టు గ్రూపులు, యువమేధావులు సోవియట్ యూనియన్ వైపు ఆకర్షితులయ్యారు. దాని సర్వమానవ సమతావాదం, సోషలిస్టు ఆదర్శవాదం, సామ్రాజ్యవాద వ్యతిరేకత, పంచవర్ష ప్రణాళిక – ఇవన్నీ సోషలిస్టు దేశం పట్ల ప్రేమాభిమానాల్ని పెంచాయి. 1927 నవంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, మోతీలాల్ నెహ్రూ సోవియట్ యూనియన్ సందర్శించారు. తిరిగి వచ్చిన తరువాత జవహర్‌లాల్ హిందూ పత్రికకి వరుసగా చాలా వ్యాసాలు వ్రాశాడు. తరువాత అవి పుస్తకరూపంలో వచ్చాయి. పుస్తకంపై ముద్రించిన ఈ క్రింది మాటలు ఆయన సానుకూల ఆదర్శవాద స్పందనని తెలియజేస్తాయి. "ఆ ప్రాతః సంధ్యలో సజీవంగా వుండడం ఆనందం; యువకులుగా వుండడం మరి స్వర్గమే". 1928లో, ఆ తరువాత సోవియట్ యూనియన్‌ని 'సామ్రాజ్యవాదానికి గొప్ప ప్రత్యర్థి' అని నెహ్రూ చాలాసార్లు ప్రశంసించాడు. ఆయన మార్క్సిజం ప్రభావానికి బాగా లోనయిన తరువాత సోవియట్ యూనియన్‌పై అభిమానం యింకా బలపడింది. సోవియట్ యూనియన్‌లో అప్పుడు జరుగుతున్న ఘటనలు ఆయనకి బాధ కలిగించినప్పటికీ, వాటితో విభేదించినప్పటికీ అక్కడ వాస్తవ రూపం దాల్చిన అద్భుతమైన నూతన వ్యవస్థ, నూతన నాగరికత చీకటి ఆవహించిన ప్రస్తుత కాలానికి వెలుగురేఖలని భవిష్యత్ పట్ల విశ్వాసాన్ని పెంచేవని 1936లో లక్నోలో చెప్పారు. 'భవిష్యత్ పూర్తిగా ఆశాజనకంగా వుందంటే అది ప్రధానంగా సోవియట్ రష్యా కారణంగానే' అన్నాడు నెహ్రూ. 1930లలో స్టాలిన్ ప్రత్యర్థులపై సాగించిన విచారణలు తొలగింపులు ఆయనకు జుగుప్స కలిగించాయి. కాని సోవియట్ ప్రభుత్వంపై ఆయన విశ్వాసం కొనసాగింది. నెహ్రూ అభిప్రాయాన్ని అనుసరించి "సోవియట్ యూనియన్ యూరపులో, ఆసియాలో ఫాసిజానికి వ్యతిరేకంగా నిజమైన సమర్థవంతమైన అడ్డుకట్టగా నిలిచింది."

సి.ఆర్.దాస్, గాంధీజీ లాంటి కాంగ్రెస్ నాయకులకు కూడా సోవియట్ యూనియన్ పట్ల మిత్రభావం వున్నప్పటికీ కమ్యూనిస్టులు హింసావాదులనే నమ్మకం వారిని కాస్త దూరంగా వుంచింది. ఈ వైఖరి ప్రత్యేకించి గాంధీజీకి వర్తించింది. కాని ఆయన కూడా తన వైఖరిని క్రమంగా మార్చుకొన్నాడు. 1928 చివరిలో గుజరాత్ విద్యాపీఠ్ విద్యార్థులతో జరిపిన చర్చలో గాంధీజీ వ్యక్తిగత ఆస్తి వ్యవస్థని రద్దుచేసిన బోల్షివిక్ ఆదర్శాన్ని అభినందించాడు. కాని అదే సమయంలో హింసద్వారా సాధించినందుకు ఖండించాడు. 1930 దశాబ్దంలో కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కిసాన్‌సభలు, ట్రేడ్‌యూనియన్లు – వాటి ప్రచారంలో ఆందోళనలలో కార్మిక కర్షకులు అధికారంలోకి వస్తే సాధించగలిగే దానికి ఉదాహరణగా సోవియట్ యూనియన్‌ని పేర్కొనడంతో ప్రజలలో దానిపట్ల సుహృద్భావం, అభిమానం పెరిగింది.

* * *

1920 దశాబ్దం చివరి నుండి ప్రపంచాన్ని యుద్ధ మేఘాలు ఆవరించడం ప్రారంభమయింది. సామ్రాజ్యవాద యుద్ధంలో భారతదేశం భాగస్వామి కాబోదని, ప్రజల ఆమోదంలేకుండా భారతదేశాన్ని యుద్ధంలోకి దించడం సాధ్యపడదని 1927 మద్రాసు కాంగ్రెస్ సదస్సు ప్రకటించింది. తరువాతి సంవత్సరాలలో జాతీయవాద విదేశాంగ విధానానికి ఈ ప్రకటన ప్రాతిపదిక అయింది. ఈ అంశం చాలాసార్లు పునరుద్ఘాటించబడింది. ఫాసిజం పెరుగుదల, శాంతికి ప్రజాస్వామ్యానికి, సోషలిజానికి జాతుల స్వేచ్ఛకి ఫాసిజం విసిరిన సవాల్ పరిస్థితిని గణనీయంగా మార్చింది. ఇంతకుముందు ప్రస్తావించినట్లు భారత జాతీయ నాయకత్వం ఫాసిజాన్ని ఫాసిస్టు యుద్ధ యత్నాల్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అదే సమయంలో బ్రిటన్ శాంతి ప్రజాస్వామ్య సంరక్షణకు గాక సామ్రాజ్యవాద ప్రయోజనాల పరిరక్షణకు యుద్ధానికి సిద్ధపడుతుందని జాతీయవాద నాయకత్వం ఆందోళన చెందింది. భారతదేశం సామ్రాజ్యవాద యుద్ధాన్ని బలపరచదు. అసలు సామ్రాజ్యవాదమే యుద్ధానికి ప్రధాన కారణం. ఫాసిస్టు భయాన్ని జయప్రదంగా ఎదుర్కోవాలంటే సామ్రాజ్యవాదం అంతంకావాలి. ఒక దేశం యొక్క ఆధిపత్య దోపిడీలు మరొక దేశంపై అంతమొందించినప్పుడే శాశ్వత శాంతి స్థాపించబడుతుంది. బ్రిటన్ పాల్గొనే యుద్ధం యొక్క స్వభావం భారతదేశం పట్ల అది

అనుసరించే వైఖరిని బట్టి నిర్ణయించబడుతుంది. బానిసత్వంలో వున్న భారతదేశం యితరుల స్వేచ్ఛ కొరకు పోరాడలేదు. భారతదేశాన్ని స్వతంత్ర దేశంగా వెంటనే గుర్తిస్తే అది ఫాసిస్టు వ్యతిరేక యుద్ధానికి చురుకుగా మద్దతు యిస్తుంది. మరొకవైపు బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రయోజనాల్ని సాధించుకోడానికి చేసే యుద్ధానికి భారత ప్రజల్ని, వారి డబ్బుని, యితర వనరుల్ని వినియోగించుకోడాన్ని అడ్డుకొనేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుందని 1936-39 కాలంలో కాంగ్రెస్ మాటిమాటికి ప్రకటించింది. జాతీయవాద విధానాన్ని గురించి 1939 ఏప్రిల్ 18న నెహ్రూ యిలా వ్రాశాడు. "భారతదేశం మార్గం చాలా స్పష్టంగా వుంది. ఫాసిస్టుల్ని వ్యతిరేకిస్తాం. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తాం. ఛాంబర్లైనిజంతో జతకట్టబోము. సామ్రాజ్య సంరక్షణకు వనరుల్ని వినియోగించనీయం. మా వనరుల్ని ప్రజాస్వామ్య పరిరక్షణకు - యితర స్వేచ్ఛాయుత దేశాల సరసన నిలిచే స్వతంత్ర భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు సంతోషంగా వినియోగిస్తాం." ఈ వైఖరిని 1939 ఆగస్టు రెండవ వారంలో యుద్ధం ప్రారంభమవడానికి ముందు రోజు సాయంత్రం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పునరుద్ఘాటించింది. అహింస పట్ల తనకు గల నిబద్ధత కారణంగా గాంధీజీ ఈ వైఖరితో విభేదించాడు. కాని కమిటీ నిర్ణయానికి కట్టుబడివుండేందుకు అంగీకరించాడు. కాంగ్రెస్ వైఖరి రానున్న మూడు సంవత్సరాలలో పరీక్షను ఎదుర్కోవలసి వుంటుంది.

* * *

# 31 మతతత్వం పుట్టుక - పెరుగుదల

ఆధునిక భారతదేశంలోని మతతత్వాన్ని గురించి చర్చించడానికి ముందు మతతత్వాన్ని నిర్వచించడం, దానికి సంబంధించిన కొన్ని అపోహలను గురించి ప్రస్తావించడం ప్రయోజనకరంగా వుంటుంది. మతతత్వం ఒక సిద్ధాంతం. దానితో యిప్పటివరకు మనం సహజీవనం చేశాం గనుక అది అతి సామాన్యమైనది, సులభంగా అర్థం చేసుకోగలిగింది అనుకొంటాం. కాని అది వాస్తవం కాకపోవచ్చు.

మతతత్వ సిద్ధాంతం ఒకదాని తరువాత మరొకటిగా వచ్చే మూడు దశలు కలిగివుంటుంది. మొదటిది: ఒకే మతానికి చెందిన ప్రజలందరికీ ఒకేరకమైన సెక్యులర్ ప్రయోజనాలు – అంటే ఒకే రకమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు వుంటాయనే నమ్మకం. దీనినుండి మత ప్రాతిపదిక గల సామాజిక రాజకీయ సమూహాల భావన పుడుతుంది. మత ప్రాతిపదికగల ఈ సమూహాలు వర్గాలు కాదు; భాషా సాంస్కృతిక గ్రూపులుకాదు, రాష్ట్రాలు కాదు; జాతులు కాదు. కాని మత ప్రాతిపదికగల ఈ సమూహాలు భారతీయ సమాజం యొక్క ప్రాథమిక యూనిట్లుగా పరిగణింపబడతాయి. భారత ప్రజలు మత ప్రాతిపదిక గల ఈ సమూహాల సభ్యులుగా మాత్రమే వారి వ్యక్తిగతేతర సమిష్టి ప్రయోజనాలను సంరక్షించుకొనగలరని విశ్వాసం. ఈ వివిధ సమూహాలకు వారివారి నాయకులు వుంటారు. జాతీయ, ప్రాంతీయ లేక వర్గ నాయకులమని చెప్పుకొనేవారు ముసుగులో వుంటారు. ముసుగు లోపల వారు వారి స్వంత సమూహాల నాయకులు మాత్రమే. వారు సమూహాల నాయకులుగా ఐక్యమై విస్తృత ప్రాతిపదికన జాతికి లేక దేశానికి సేవ చేయగలరు.

భారతదేశం లాంటి బహుళ మతాలు గల సమాజంలో ఒక మతానికి చెందిన ప్రజల సెక్యులర్ ప్రయోజనాలు – అంటే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు మరొక మతానికి చెందిన ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా వుంటాయి. ఇది మతతత్వం యొక్క రెండవ దశ.

వివిధ మతాలకు, వివిధ సమూహాలకు చెందిన ప్రజల ప్రయోజనాలు పరస్పర విరుద్ధంగానేగాక శత్రు భావంతో కూడుకొన్నవిగా పరిగణించగలగడం మతతత్వం యొక్క మూడవ దశ. ఈ దశలో మతతత్వవాది హిందువులకు, ముస్లిములకు ఉమ్మడి సెక్యులర్ ప్రయోజనాలేమీ వుండవని హిందూ ముస్లిం ప్రయోజనాలు పరస్పరం విరుద్ధంగా వుంటాయని నొక్కి  వక్కాణిస్తాడు.

కాబట్టి మతతత్వం, మతతత్వ రాజకీయాలు ప్రాతిపదికగా గల సిద్ధాంతం. మతపరమైన హింస మతతత్వ సిద్ధాంత ఫలితంగా చెలరేగుతుంది. అలాగే హిందూ , ముస్లిం, సిక్కు, క్రైస్తవ మతతత్వాలు ఒకటి మరొకదానికి భిన్నంగా వుండవు. అన్నీ ఒకే తరహాకి చెందినవి. ఒకే మతతత్వ సిద్ధాంతానికి భిన్న ముఖాలు.

ఒక వ్యక్తిలోగాని పార్టీలో గాని లేక ఉద్యమంలో గాని మతతత్వ సిద్ధాంతం మొదటి దశతో ప్రారంభమవుతుంది. చాలామంది జాతీయ నాయకులు మతతత్వం యొక్క తరువాత రెండు దశలను తిరస్కరిస్తూనే మొదటి దశలో చిక్కుకొన్నారు;  లేక ఆ పరిమితులలో ఆలోచించారు. వీరు తమని తాము జాతీయవాద హిందువులు, జాతీయవాద ముస్లిములు, జాతీయవాద సిక్కులుగా చూపుకొన్నారు గాని జాతీయవాదులుగా మాత్రంకాదు.

రెండవ దశ మతతత్వాన్ని ఉదారవాద మతతత్వం లేక మితవాద మతతత్వంగా చెప్పవచ్చు. ఉదారవాద మతతత్వవాది మతతత్వ రాజకీయాలను విశ్వసిస్తాడు; ఆచరిస్తాడు. కాని అతడు కొన్ని ఉదారవాద, ప్రజాస్వామ్య, మానవతావాద, జాతీయవాద విలువలను సమర్థిస్తాడు. భారతదేశం స్పష్టమైన మతప్రాతిపదిక గల సమూహాలు కలిగివున్నదని, ఈ సమూహాల ప్రత్యేక ప్రయోజనాలు కొన్ని సందర్భాలలో పరస్పరం ఘర్షణ పడ్డాయని అతడు నమ్ముతాడు; బాహాటంగా చెపుతాడు. కాని వేర్వేరు మతపరమైన ప్రయోజనాలకు మొత్తంగా అభివృద్ధి చెందుతున్న జాతీయ ప్రయోజనాలలో స్థానం కల్పించవచ్చునని, సామరస్యం సాధ్యమేనని, భారతదేశం ఒక జాతిగా రూపుదిద్దుకొంటుందని విశ్వసిస్తాడు. 1937కి ముందు చాలామంది మతతత్వవాదులు – 1925 తరువాత హిందూ మహాసభ,

ముస్లింలీగు ఆలీ సోదరులు; 1922 తరువాత ఎం.ఎ.జిన్నా, మదన్‌మోహన్ మాలవ్యా, లజపతిరాయ్, యన్.సి.కేల్కర్‌లు ఉదార మతతత్వ చట్రంలో పనిచేశారు.

తీవ్రమైన మతతత్వవాదం ఫాసిస్టు చట్రంలో పనిచేసే మతతత్వవాదం. ఇది మతతత్వం యొక్క మూడవ దశగా వుంటుంది. ఇది భయం, ద్వేషంపై ఆధారపడుతుంది. హింసాయుతమైన భాష, ప్రవర్తన, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూసే వైఖరి కలిగివుంటుంది. ఈ దశలో మతతత్వవాదులు ముస్లిములు, ముస్లిం సంస్కృతి, ఇస్లాం; హిందువులు, హిందూ సంస్కృతి, హిందూత్వం ప్రమాదంలో పడ్డాయి; అణచివేయబడుతున్నాయి; నిర్మూలింపబడుతున్నాయి – లాంటి ప్రకటనలు చేస్తుంటారు. ఈ దశలో హిందువులు, ముస్లిములు వేర్వేరు జాతులకు చెందినవారని, వాటి మధ్యగల వైరుధ్యం శాశ్వతమైనదని, పరిష్కరించేందుకు సాధ్యపడనిది – అనే సిద్ధాంతాన్ని హిందూ ముస్లిం– రెండు మతాలకు చెందిన మతతత్వవాదులు ముందుకు తెస్తారు. 1937 తరువాత ముస్లిం లీగు, హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాలు ఫాసిస్టు మతతత్వవాద దారిపట్టాయి.

మతతత్వం యొక్క మూడు దశలలో తరతమ భేదాలున్నప్పటికీ ఒక దశ మరొక దశని ప్రభావితంజేసి ఒకవిధమైన కొనసాగింపుకి అవకాశం కల్పిస్తాయి. మొదటిదశలో వున్నవానికి ఉదారవాద, తీవ్ర మతతత్వ భావజాలాన్ని అందజేస్తే అతడు వాటికి వ్యతిరేకంగా పోరాటం సాగించలేడు. అదేవిధంగా ఫాసిస్టు మతతత్వవాదిగా జరిగే సైద్ధాంతిక మార్పుని అడ్డుకొనడం ఉదార మతతత్వవాదికి అసాధ్యంగా కనిపిస్తుంది.

మనం చాలా సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మతతత్వవాది తన సమూహం యొక్క ప్రయోజనాలను గురించి మాట్లాడతాడు; విశ్వసిస్తాడు. కాని వాస్తవ జీవితంలో మతానికి వెలుపల అలాంటి ప్రయోజనాలు లేవు. హిందువుల, ముస్లిముల, యింకా యితర మతాల వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఒకేరకంగా వుంటాయి. ఆ అర్థంలో వారు వేర్వేరు సమూహాలు కూడా కాదు. హిందువులుగా లేక ముస్లిములుగా వారికి అఖిల భారతస్థాయిలోగాని లేక ప్రాంతీయస్థాయిలోగాని వేర్వేరు రాజకీయ, ఆర్థిక జీవితాలుగాని, ప్రయోజనాలుగాని వుండవు. తోటి హిందువులనుండి లేక తోటి ముస్లిముల నుండి ప్రజలు, ప్రాంతం, భాష, సంస్కృతి, వర్గం, కులం, సామాజికస్థాయి, సామాజిక ఆచారాలు, ఆహారం, వస్త్రధారణ, అలవాట్లతో విభజింపబడ్డారు. ఈ అంశాల వారీగా యితర మతాలవారితో మమేకమయ్యారు. పై వర్గానికి చెందిన ముస్లింకి పేద వర్గానికి చెందిన ముస్లింకంటె, పై వర్గానికి చెందిన

హిందువు సన్నిహితంగా వుంటాడు. వారి మధ్య సామాన్య ప్రయోజనాలూ వుంటాయి. అలాగే పంజాబీ హిందువుకి, బెంగాలీ హిందువుకంటె పంజాబీ ముస్లిం సాంస్కృతికంగా కూడా సన్నిహితంగా వుంటాడు. ఇదే బెంగాలీ ముస్లిం, బెంగాలీ హిందువు, పంజాబీ ముస్లింకి వర్తిస్తుంది. ఈ విధంగా భాషా సాంస్కృతిక ప్రాంతాలుగా, సామాజిక వర్గాలుగాను చేయబడిన నిజమైన విభజనను, వారిలో పెరుగుతున్న జాతీయైక్యతను, అవాస్తవమైన మతవిభజన మరుగుపరుస్తుంది.

మతతత్వవాది తాను సమూహం యొక్క ప్రయోజనాలను పరిరక్షిస్తున్నానంటాడు. కాని అలాంటి ప్రయోజనాలే లేనప్పుడు అతడు తన సమూహం యొక్క ప్రయోజనాల కొరకుగాని, యితర సమూహాల ప్రయోజనాల కొరకు గాని పనిచేయడమనేదిలేదు. అతడు తన సమూహానికి ప్రతినిధికాలేడు. తన సమూహం ప్రయోజనాల కొరకు పనిచేస్తున్నాడనే పేరుతో అతడు తెలిసో, తెలియకో మరెవరి ప్రయోజనాల కొరకో సేవలు చేస్తున్నాడు. కాబట్టి అతడు యితరులను మోసం చేస్తున్నాడు. తెలియకుండానే తనను తాను మోసం చేసుకొంటున్నాడు. మతపరమైన ఊహలు, మతపరమైన తర్కం, మతపరమైన జవాబులు అవాస్తవాలు. మతతత్వవాది వేటినైతే సమస్యలుగా చెపుతున్నాడో అవి నిజమైన సమస్యలు కావు; ఏవి జవాబులంటున్నారో అవి జవాబులుకావు.

మతతత్వం గతం నుండి కాలానికి తట్టుకొని నిలబడినట్లుగా, మధ్యయుగాలు ఆధునిక యుగానికి అందజేసినట్లుగా లేక కనీసం దాని మూలాలు మధ్యయుగాలలో వున్నట్లుగా చెప్పబడుతున్నది. కాని మతతత్వం ప్రాచీన మధ్యయుగాల నాటి సిద్ధాంతాలను ఉపయోగించుకొంటున్నప్పటికీ అది సామాజిక ప్రేరణలను వ్యక్తం చేస్తూ ఆధునిక, సామాజిక గ్రూపుల, వర్గాల, శక్తుల, రాజకీయ అవసరాలకు సేవలు చేస్తున్న యిటీవలి రాజకీయ వైఖరి. దాని సామాజిక మూలాలు, అలాగే దాని సామాజిక, రాజకీయ, ఆర్థిక లక్ష్యాలు భారత దేశ ఆధునిక చరిత్రలోనే వున్నాయి. దానిని వునికిలోకి తెచ్చిందీ నిలదొక్కుకొనేలా చేసిందీ సమకాలీన సామాజిక, ఆర్థిక నిర్మాణమే.

* * *

ప్రాచీన మధ్యయుగాల నాటి లేక 1857 ముందు నాటి రాజకీయాలకు భిన్నంగా ఆధునిక రాజకీయాల అవతరణ ఫలితంగా మతతత్వం ముందుకు వచ్చింది. ప్రజలపై ఆధారపడిన రాజకీయాలు, ప్రజల భాగస్వామ్యం, ప్రజల సమీకరణతో కూడిన రాజకీయాలు, ప్రజాభిప్రాయాన్ని సృష్టించి తమకనుకూలంగా మలచుకొనే రాజకీయాలు

ఉనికిలోకి వచ్చిన తరువాతనే జాతీయవాదం, సోషలిజం లాంటి ఆధునిక ఆలోచనలలాగానే మతతత్వం రాజకీయ విధానంగా, రాజకీయ సిద్ధాంతంగా ముందుకు రాగలిగింది. ఆధునిక రాజకీయాలకంటె ముందునాటి రాజకీయాలలో, కులీనవర్గాలపై ఆధారపడిన రాజకీయాలలో ప్రజలు విస్మరింపబడ్డారు; లేక రాజకీయ వ్యవస్థకి వెలుపల తిరుగుబాట్లు చేసే స్థితికి నెట్టివేయబడ్డారు. అలాంటి తిరుగుబాట్లు విజయవంతమైతే వారి నాయకులు పాత పాలకవర్గాలలో యిముడ్చుకోబడ్డారు. ఈ వాస్తవాన్ని మేధావులైన భారతీయులు గుర్తించారు. ఉదాహరణకు జవహర్‌లాల్ నెహ్రూ 1936లో "భారతదేశంలో మతతత్వం ఇటీవలి కాలంలో మన కళ్లముందు ఎదిగిందేనని ఎప్పుడూ మరువరాదు" అన్నాడు. మతతత్వం భారతదేశం యొక్క ప్రత్యేకమైన చారిత్రక, సామాజిక అభివృద్ధిలో అంతర్గతమైన, అనివార్యమైన అంశం కాదు. ఇతర సమాజాలలో అక్కడి పరిస్థితుల ఫలితంగా ఫాసిజం, సెమిటిజం వ్యతిరేకత, జాతి వివక్షత, ఉత్తర ఐర్లాండులో కేథలిక్, ప్రొటెస్టెంట్ ఘర్షణ, లేక లెబనాన్‌లో క్రైస్తవ, ముస్లిం ఘర్షణల లాంటిదే.

వలస పాలన ప్రభావంతో భారతీయ సమాజంలో వచ్చిన మార్పు, వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడవలసిన ఆవశ్యకత ఫలితంగా మతతత్వ చైతన్యం పుట్టింది, పెరిగింది. వివిధ ప్రాంతాలలోను, దేశంలోను పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ పాలనాపరమైన ఏకీకరణ, భారతదేశం ఒక జాతిగా రూపుదిద్దుకొంటున్న క్రమం, వలసపాలనకు భారత ప్రజలకు మధ్య పెరుగుతున్న వైరుధ్యం, ఆధునిక సామాజిక వర్గాల ఏర్పాటు – ఇవన్నీ ఉమ్మడి ప్రయోజనాలను సాధించుకొనేందుకు కొత్త మార్గాలను అన్వేషించవలసిన అవసరాన్ని కల్పించాయి. ఇవి ప్రజల మధ్య విస్తృతమైన కొత్త సంబంధాలను, విధేయతలను, కొత్త గుర్తింపులను ఏర్పాటుచేసుకోవలసిన అవసరాన్ని కలుగజేశాయి. 19వ శతాబ్దం ద్వితీయార్థంలో పుట్టిన నూతన రాజకీయాలను యివి అనుసరించాయి. ఈ నూతన రాజకీయాలు భారత ప్రజల పెరుగుతున్న రాజకీయాకరణ సమీకరణలపై ఆధారపడ్డాయి.

ఈ నూతన రాజకీయ వాస్తవికత, సామాజిక సంబంధాలు, నూతన ఐక్యతా సూత్రాల అమలు, నూతన ఆలోచనలు, భావనలతో నూతన సామాజిక రాజకీయ గుర్తింపులు – మొత్తంగా ఈ క్రమం క్లిష్టమైనది. ఈ క్రమానికి ఆధునిక జాతీయవాద ఆలోచనలు, సాంస్కృతిక భాషాపరమైన అభివృద్ధి, వర్గపోరాటం అవసరమవుతాయి. కాని ఎక్కడైతే వాటి పెరుగుదల నెమ్మదిగా, పాక్షికంగా జరుగుతుందో అక్కడ ప్రజలు ఈ నూతన వాస్తవికతను అర్థం చేసుకొనేందుకు కొత్త గుర్తింపులను, సిద్ధాంతాలను

రూపొందించుకొనేందుకు అనివార్యంగా పాత, అలవాటుపడిన, ఆధునిక కాలానికి ముందు నాటి కులం, ప్రాంతం, తెగ, మతం, వృత్తి – లాంటి వాటిని ఆశ్రయిస్తారు. అలాంటి పరిస్థితులలో ప్రపంచవ్యాప్తంగా అలాంటి పరిణామాలే సంభవించాయి. కాని తరచుగా పాత, అసమగ్రమైన తప్పుడు ఆలోచనలు క్రమంగా క్రొత్త చారిత్రకంగా అవసరమైన ఆలోచనలకు, జాతి జాతీయత,వర్గ గుర్తింపులకు అవకాశం కల్పించాయి. భారతదేశంలో యిది విస్తృతస్థాయిలో జరిగింది. కాని భారతీయులందరిలో ఒకే మాదిరిగా జరగలేదు. ప్రత్యేకించి దేశంలోని కొన్ని ప్రాంతాలలో ప్రజానీకంలోని కొన్ని సెక్షన్లలో మతపరమైన చైతన్యం, మతతత్వ చైతన్యంగా రూపాంతరం చెందింది. ఇలా జరగడానికి కారణం భారతదేశ పరిస్థితులలో దాని పెరుగుదలకు తోడ్పడే కొన్ని అంశాలు వున్నాయి. సమాజంలోని కొన్ని సెక్షన్లలో నిర్ణీతమైన సామాజిక, రాజకీయ శక్తుల అవసరాలను అది తీర్చింది. 20వ శతాబ్దంలో మతతత్వం ఎందుకు పెరిగింది? భారతదేశ పరిస్థితులలో ఈ క్రమానికి తోడ్పడిన అంశాలేవి? ఏ సామాజిక వర్గాలకు, ఏ రాజకీయ శక్తులకు అది సేవలు చేసింది? భారతీయ వాస్తవికతలో అంత విస్తృతమైన భాగమెలా అయింది? భారతదేశ పరిస్థితులలో మతతత్వవాదం అనివార్యమైన అంతర్గత భాగం కానప్పటికీ కేవలం అధికార దాహం గల రాజకీయవేత్తల, పాలనా యంత్రాంగంలోని కీలకమైన వ్యక్తుల కుట్ర కాదు. దానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ మూలాలు వున్నాయి. ఆ దిశగా నెట్టివేసే సామాజిక పరిస్థితి వుంది. అది లేకపోతే చాలాకాలంపాటు మతతత్వం బతకగలిగేదికాదు.

* * *

భారత ఆర్థిక విధానంలోని వలసవాద స్వభావం, వలసవాద వెనుకబాటుతనం, భారత ఆర్థిక విధానాన్ని అభివృద్ధి పరచడంలో వలసవాద అశక్తత యొక్క సహ ఉత్పాదకతలలో మతతత్వం ఒకటి. ఫలితంగా వచ్చిన ఆర్థిక ప్రతిష్టంభన, భారత ప్రజల జీవితాలపై ప్రత్యేకించి మధ్య తరగతి ప్రజల జీవితాలపై దాని ప్రభావం– భారతీయ సమాజంలో విభజనకు, వైరుధ్యానికి, అలాగే మార్పుకి అనుకూలమైన పరిస్థితులను సృష్టించాయి.

20వ శతాబ్దం అంతటా ఆర్థిక పారిశ్రామికాభివృద్ధి, విద్య, ఆరోగ్యం యితర సామాజిక, సాంస్కృతిక సేవల అభివృద్ధి ఏమాత్రం జరగలేదు. సామాజిక, ఆర్థిక పరిస్థితులు నిరంతరం క్షీణిస్తుండడంతో మధ్యతరగతి, దిగువ మధ్య తరగతులకు చెందిన విద్యావంతులు భూమిపై ఆధారపడి బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ తరగతులకు

చెందిన విద్యావంతులలో నిరుద్యోగ సమస్య తీవ్రమైన సమస్యగా ముందుకు వచ్చింది. తీవ్రమైన ఆర్థికమాంద్యం ఆవరించిన కాలంలో అంటే 1928 తరువాతకాలంలో విస్తృత స్థాయిలో నిరుద్యోగం ప్రబలడంతో వీరి ఆర్థిక పరిస్థితులు మరీ క్షీణించాయి.

ఈ సామాజిక పరిస్థితులలో ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు వలసపాలనని అంతమొందించడం, సమూలమైన సామాజిక మార్పులు తీసుకొని రావడం - లక్ష్యాలుగా జాతీయవాద ఉద్యమాలు యితర ప్రజా ఉద్యమాలు పనిచేశాయి. 1905 నుండి 1947వరకు సాగిన సమరశీల జాతీయోద్యమానికి 1920 దశాబ్దం నుండి వామపక్ష పార్టీలు, గ్రూపులు నడిపిన ఉద్యమాలకు మధ్యతరగతులు వెన్నుముకగా నిలిచాయి. కాని దురదృష్టవశాత్తు విశాలమైన సామాజిక దృక్పథం, రాజకీయ అవగాహన కొరవడిన కొందరు సంకుచితమైన తక్షణ ప్రయోజనాల సాధనకొరకు, స్వల్ప వ్యవధి పరిష్కారాల కొరకు, కుల, మత ప్రాంతీయాభిమానాలు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, మున్సిపాలిటీలలో, చట్టసభలలో సీట్లు- లాంటి దగ్గరి దారులు పట్టారు.

ఆర్థిక స్తంభన కారణంగా ప్రభుత్వోద్యోగాల కొరకు, వైద్య, న్యాయవాద వృత్తులలో, వ్యాపారంలో వినిమయదారుల మార్కెట్ల కొరకు వ్యక్తుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్నది. ఆర్థికావకాశాలలో ఎక్కువ వాటా పొందే ప్రయత్నంలో మధ్య తరగతి వ్యక్తులు వారికి అందుబాటులో వున్న విద్యార్హతలు, వ్యక్తిగత ప్రతిభ, బంధుప్రీతి, లంచగొండితనం - లాంటి అన్ని సాధనాలను ఉపయోగించుకొన్నారు. అదే సమయంలో వారి పోరాటాలకు విస్తృత ప్రాతిపదిక కల్పించుకొనేందుకు, పోటీపడే శక్తిని పెంచుకొనేందుకు కులం, మతం, ప్రాంతం లాంటి యితర గ్రూపు పరమైన గుర్తింపులను ఉపయోగించుకొన్నారు. ఆ విధంగా మధ్య తరగతుల నుండి కొందరు వ్యక్తులు మతతత్వం నుండి ప్రత్యేకించి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి ప్రయోజనాలు పొందారు. ఇది మతతత్వ రాజకీయాలకు ఒక విధమైన గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించింది. మధ్య తరగతి సామాజిక అనుభవంలో మతతత్వానికి పాక్షికమైనదైనా, స్వల్పకాలికమైనదైనా, వక్రీకరింపబడినదైనా ఒక సామాజిక పునాది వున్నది; గనుక దానితో మతతత్వవాది తనదైన సామాజిక దృక్పథంతో మధ్యతరగతి ప్రజలను ప్రభావితం చేయగలుగుతున్నాడు.

క్రమంగా విద్యావ్యాప్తి సంపన్న రైతులు, చిన్న భూస్వాముల నుండి గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగాలు కోరే మధ్య తరగతికి విస్తరించింది. వలసపాలన కారణంగా వ్యవసాయం స్తంభించిపోవడంతో కొత్తగా విద్యావంతులైన యువకులు గ్రామాలలోని

భూములను అంటిపెట్టుకొని వుండడం సాధ్యపడలేదు. వారు ప్రభుత్వోద్యోగాలలో స్థిరపడేందుకు పట్టణాలు, నగరాలు చేరారు. ఉపాధి దక్కించుకొనేందుకు కులం, మతం, ప్రాంతం, రిజర్వేషన్లు లాంటి అన్ని సాధనాలను ఉపయోగించుకొన్నారు. ఈ పరిణామం మతతత్వం యొక్క సామాజిక పునాదిని గ్రామీణ ప్రాంతాలలోని సంపన్న రైతులు, భూస్వాముల వరకు విస్తరింపజేసింది.

ఆ విధంగా వలసవాద ఆర్థికవిధానంలోని సంక్షోభం మధ్య తరగతులలో రెండు భిన్నమైన సిద్ధాంతాలను, రాజకీయ ధోరణులను సృష్టించింది. సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవం సామాజిక మార్పులు జరుగుతున్న సమయంలో మధ్య తరగతి ప్రజలు చాలా ఉత్సాహంగా జాతీయోద్యమంలోను, యితర ప్రజా ఉద్యమాలలోను చేరారు. పెట్టుబడిదారుల నుండి రైతాంగం, కార్మికుల వరకు గల మొత్తం ప్రజానీకం యొక్క డిమాండ్లకు విస్తృతమైన ప్రచారం యిచ్చారు. సామాజిక ప్రయోజనాల కొరకు చేసే పోరాటాలలో వ్యక్తిగత ప్రయోజనాలను విస్మరించారు. కాని విప్లవాత్మక మార్పుకి గల అవకాశాలు వెనుకపట్టు పట్టడంతో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం మందకొడి దశకు చేరుకొనడంతో మధ్య తరగతికి చెందిన చాలామంది వారి వ్యక్తిగత కోర్కెల సత్వర పరిష్కారాల కొరకు మతతత్వ సిద్ధాంతాన్ని యితర సిద్దాంతాలను ఆశ్రయించారు. అలాంటి కార్యకారణ సంబంధం గల పరిస్థితులను బట్టి దేశంలోని చాలా ప్రాంతాలలోగల మధ్య తరగతులలోని పెద్ద సెక్షన్ల ప్రజానీకం సామ్రాజ్యవాద వ్యతిరేకతకి, మతతత్వవాద రాజకీయాలకి మధ్య ఊగిసలాడారు. కాని ఈ రెండింటి మధ్య మౌలికమైన భేదం వుంది. మొదటి తరహా రాజకీయాలలో వారి ప్రయోజనాలు సాధారణ సామాజికాభివృద్ధి క్రమంలో కలిసిపోయాయి. వారి రాజకీయాలు విస్తృత సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగమయ్యాయి. కాని రెండవ తరహాకి చెందిన వారు సంకుచిత స్వార్థ ప్రయోజనాలు సాధించుకునే గ్రూపుగా పనిచేశారు. సామాజిక, రాజకీయ యథాతథ స్థితిని అంగీకరించారు. ఆచరణలో వలసవాదానికి సేవలు చేశారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే మధ్య తరగతి ప్రజలకు అవకాశాలు చాలా తక్కువగా వున్న సామాజిక పరిస్థితులలో వారి ఆశలు ఆకాంక్షల వ్యక్తీకరణగా మతతత్వం ముందుకు వస్తుంది. కాబట్టి మతతత్వవాద సమస్య మధ్య తరగతుల సమస్య. దాని యొక్క ప్రధానమైన సామాజిక పునాది మధ్య తరగతులు. కాని మధ్య తరగతికి చెందినవారిలో అత్యధికులు 1930, 1940లలో కూడా మతతత్వానికి అతీతులుగా వున్నారని గుర్తించడం చాలా ముఖ్యం. హిందూ, ముస్లిం లేక సిక్కు మతాలకు చెందిన మేధావులలో అత్యధికులు

మతతత్వానికి అతీతులుగా వున్నారు. వాస్తవంగా 1930 దశాబ్దానికి చెందిన నమూనా భారతీయ మేధావి సెక్యులర్ వామపక్షాల వైపు మొగ్గుచూపాడు.

* * *

వలసవాద ఆర్థిక విధానంలో మతతత్వాన్ని ప్రోత్సహించిన మరొక అంశం వున్నది. పరిశ్రమ, వాణిజ్యం, విద్య యితర సామాజిక సేవలు, సాంస్కృతిక, వినోద రంగాలలో ఎలాంటి నూతన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ప్రభుత్వ సేవారంగం మాత్రమే మధ్యతరగతులకు ఉపాధి కల్పించే ప్రధాన రంగమయింది. ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు ప్రభుత్వ యాజమాన్యం క్రింద పనిచేస్తున్నారు. 1951లో కూడా 12 లక్షల మంది ఫ్యాక్టరీ చట్టాల పరిధిలో పనిచేస్తుండగా 33 లక్షల మంది ప్రభుత్వ సేవలలో ఉపాధి పొందారు. వృత్తి విద్యా కళాశాలల్లో కుల, మత ప్రాతిపదికన ఉద్యోగాలు, సీట్ల కేటాయింపుకి రిజర్వేషన్లకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మతతత్వ రాజకీయాలు ఉపయోగించుకోబడుతున్నాయి. 1937నాటికి మతతత్వ రాజకీయాలు ప్రభుత్వ ఉద్యోగాలలో విద్యాపరమైన రాయితీలలో, చట్టసభలు, మున్సిపల్ సంస్థల సీట్లలో గణనీయమైన అదుపు సాధించాయి. మతతత్వవాదులు, వారి సమూహాలను గురించి చాలా చెప్పినప్పటికీ, రిజర్వేషన్లు సీట్లకే పరిమితమయ్యారు. ప్రజా బాహుళ్యానికి సంబంధించిన ఏ యితర సమస్యలు వారు చేపట్టలేదు.

* * *

మరొకవైపు వివిధ ప్రాంతాలకు చెందిన దోపిడీదారులకు, దోపిడీకి గురయ్యేవారికి మధ్య గల వర్గ ఘర్షణని, సామాజిక ఉద్రిక్తతని మతతత్వం వక్రీకరించి, తప్పుడు వ్యాఖ్యానాలుచేసి మతపరమైన ఘర్షణగా చిత్రీకరిస్తుంది. అసంతృప్తి, ప్రయోజనాల మధ్య ఘర్షణ వాస్తవమైనప్పటికీ, కుల, మతపరమైన అంశాలతో సంబంధం లేనిదైనప్పటికీ, రాజకీయ చైతన్యం కొరవడిన కారణంగా మతఘర్షణగా వక్రీకరణతో వ్యక్తమవుతోంది. సి.జి.షా చెప్పినట్లు "మతతత్వ ప్రచారం తీవ్రతతో ప్రజలు దోపిడీకి, అణచివేతకు, బాధలకు నిజమైన కారణాలు అర్థంచేసుకోలేక మతమే అన్నిటికీ కారణమని భ్రమిస్తారు."

మతపరమైన వక్రీకరణని ఏవి సాధ్యపడేలా చేశాయి? – అనేది భారత సామాజిక పరిణామంలో ప్రత్యేకమైన అంశం. దేశంలోని చాలా ప్రాంతాలలో మతపరమైన ప్రత్యేకత సామాజిక వర్గపరమైన ప్రత్యేకతలతో ఏకీభవించింది. ఇక్కడ తరచుగా దోపిడీచేసే సెక్షన్లు – భూస్వాములు, వ్యాపారులు, అప్పులు యిచ్చేవారు హిందువులలోని అగ్రవర్ణాలకు

చెందినవారు. పేదలు, దోపిడీకి గురయ్యేవారు – ముస్లిములు, హిందువులలోని క్రింది కులాలకు చెందినవారు. ఫలితంగా హిందువులు, ముస్లిములను దోపిడీ చేస్తున్నారని ముస్లిం మతతత్వవాదులు చేసే ప్రచారం, హిందువుల ఆస్తులకు రక్షణలేకుండా పోయిందని హిందూ మతతత్వవాదుల ప్రచారం –వాస్తవాలు పూర్తిగా భిన్నంగా వున్నప్పటికీ ప్రచారకులు ఆశించిన ఫలితాలు సాధించింది. అలాగే తూర్పు బెంగాల్‌లోని కౌలుదారులు, భూస్వాముల మధ్య పోరాటాలు, మలబార్‌లోని రైతులు, రుణదాతల మధ్య పోరాటాలు, పంజాబ్‌లోని వ్యాపారులు, రుణదాతల మధ్య పోరాటాలు మతతత్వవాదులచే హిందూ, ముస్లిం ఘర్షణగా చిత్రించబడ్డాయి. అలాగే భూస్వాములు, రుణదాతలు సాగిస్తున్న అణచివేతని ముస్లింలను హిందువుల అణచివేతగాను, గ్రామీణ పేదలు, గ్రామీణ సంపన్నులపై చేసిన దాడులను ముస్లిములు హిందువులపై చేసిన దాడులుగాను చిత్రించబడ్డాయి. ఉదాహరణకు పంజాబ్‌లో  మతతత్వం పెరుగుదలకు కారణం పెద్ద ముస్లిం భూస్వాములు వారి ఆర్థిక, సామాజిక స్థాయిని నిలబెట్టుకొనేందుకు ముస్లిం కౌలుదారుల కోపాన్ని హిందూ వ్యాపారుల, రుణదాతలపైకి మరల్చారు. హిందూ మతతత్వవాదులు హిందువుల ప్రయోజనాలు ప్రమాదంలో పడ్డాయని గగ్గోలు పెట్టారు. వాస్తవంగా రైతులు తమ విముక్తి కొరకు చేసిన పోరాటం అనివార్యమైనది. రెండు మతాలకు చెందిన మతతత్వవాదులు, వలసపాలనా యంత్రాంగంలోని అధికారులు వ్యవసాయపరమైన దోపిడీ, అణచివేతల్ని మతపరమైన అణచివేతగా నొక్కిచెప్పారు. ఆ విధంగా ముస్లిం రైతులు రుణగ్రస్తులు దోచుకొనబడడం, వారు రైతులు రుణగ్రస్తులు అవడం వలనగాక కేవలం ముస్లిములు కావడం వలననే దోపిడీకి గురయ్యారని చెప్పారు.

చాలా సందర్భాలలో సామాజిక ఘర్షణకు మతపరమైన స్వభావాన్ని అంటగట్టింది బాధితులుకాదు. పరిశీలకుడు, అధికారి, పత్రికా రచయిత, రాజకీయవేత్త, చివరిగా చరిత్రకారుడు – అంటగట్టారు. వీరంతా ఘర్షణలు జరిగిన తరువాత తెలిసో, తెలియకో మతపరమైన వివరణ యిచ్చారు. వ్యవసాయ ఘర్షణలకు మతతత్వరంగు, మతతత్వవాదం అభివృద్ధి చెందేవరకు అంటే 20వ శతాబ్దం వరకు అంటలేదనేది గమనించవలసిన అంశం. 1873నాటి పబ్ని వ్యవసాయ ఘర్షణలలో జమిందారులకు వ్యతిరేకంగా హిందూ, ముస్లిం కౌలుదారులు  భుజంభుజం కలిపి పోరాడారు. అలాగే యింతకుముందు అధ్యాయాలలో వివరించినట్లుగా 1919 తరువాత జరిగిన వ్యవసాయ ఘర్షణలలో అత్యధికం కూడా మతతత్వ దారులు  పట్టలేదు. రైతులు, కార్మికులు, మేధావులు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ముఖ్యమైన భాగాలైన, బలమైన సెక్యులర్ రైతాంగ కార్మిక ఉద్యమాలను, సంఘాలను నిర్మించగలిగారు.

బెంగాల్‌లో హిందూ జమిందారులు భూమిపై అదుపు సాధించడానికి కారణం వారు హిందువులవడం వలన కాదని, బెంగాల్‌లో క్రింది తరగతులు వర్గాలలో ఇస్లాం మతవ్యాప్తి యొక్క చారిత్రక క్రమం ఫలితమని గమనించడం చాలా ముఖ్యం. 18వ శతాబ్దం ప్రారంభంలో ఔరంగజేబ్ అధికారులకు, అనుచరులకు పరమభక్తుడైన ముర్షిద్ ఖులిఖాన్ పాలనా కాలంలో బెంగాల్‌లోని హిందూ జమిందారులు, వ్యాపారస్తులు భూమి రూపంలో వున్న పెట్టుబడిపై ఆధిపత్యాన్ని సాధించారు. అతడి పాలనలో జమిందారులు తాలూకాదార్లలో అత్యధికులు హిందువులు. 1793నాటి పర్మినెంట్ సెటిల్‌మెంట్ పెద్దసంఖ్యలో వున్న హిందూ ముస్లిం జమిందారీ కుటుంబాల స్థానంలో హిందూ వ్యాపారులను నియమించడం ఈ ధోరణికి మరికొంత బలాన్ని చేకూర్చింది. అదేవిధంగా ఉత్తర భారతదేశంలో బ్యాంకర్లు, వ్యాపారులు, వడ్డీ వ్యాపారులలో హిందూ ఆధిక్యత మధ్యయుగాల నుండి కొనసాగుతుంది. బ్రిటిషుపాలనలో ఈ వర్గాలు గ్రామీణ ప్రాంతాలపై ఆధిపత్యం సాధించడానికి కారణం వలసపాలన సాగించిన దోపిడీలో వీరు నిర్వహించిన పాత్రగాని, వారు హిందువులవడం వలన కాదు. మరొకవిధంగా చెప్పాలంటే వ్యాపారుల, వడ్డీ వ్యాపారుల ఆర్థికపరమైన ఆధిక్యత పెరుగుదలకు వలసవాద చరిత్ర హామీ యిచ్చింది. వారిలో అత్యధికులు హిందువులవడానికి మధ్యయుగాల చరిత్ర హామీ ఇచ్చింది.

రెండు ఉన్నత వర్గాలకు చెందిన వారి మధ్య అధికారం ప్రత్యేక హక్కులు ఆర్థిక ప్రయోజనాల కొరకు జరిగిన పోరాటానికి మతతత్వం ప్రాతినిధ్యం వహించింది. వేర్వేరు మతాలకు చెందిన ఈ వర్గాలు వారివారి మతాలకు చెందిన ప్రజల మద్దతును కూడగట్టుకొనేందుకు మతతత్వాన్ని ఉపయోగించుకొన్నారు. ఉదాహరణకు పశ్చిమ పంజాబ్‌లో ముస్లిం భూస్వాములు, హిందూ వడ్డీ వ్యాపారుల్ని వ్యతిరేకించారు. తూర్పు బెంగాల్‌లో ముస్లిం జోతేదార్లు (చిన్న భూస్వాములు) హిందూ జమిందారుల్ని వ్యతిరేకించారు.

* * *

వ్యాపారుల, వడ్డీ వ్యాపారుల, వలసరాజ్యం అభివృద్ధి నిరోధక సామాజిక వర్గాల రాజకీయశక్తుల యొక్క ఆయుధంగా మతతత్వం అభివృద్ధి పరచబడింది. మతతత్వ నాయకులు, పార్టీలు సాధారణంగా ఈ వర్గాలకు, శక్తులకు మిత్రులు. ప్రజాపోరాటాలను వక్రీకరించి ప్రక్కదారులు పట్టించేందుకు, ప్రజలు వారి సామాజిక స్థితికి బాధ్యులైన సామాజిక, ఆర్థిక, రాజకీయ శక్తుల్ని అర్థం చేసుకొనకుండా నిరోధించేందుకు; జాతీయ, వర్గ పద్ధతులలో ఐక్యతను నివారించేందుకు, ప్రజల్ని వారి వాస్తవ జాతీయ సామాజిక,

ఆర్థిక ప్రయోజనాల నుండి, వారి చుట్టూ వున్న సమస్యల నుండి, ప్రజా ఉద్యమాల నుండి వేరుచేసి దూరం చేసేందుకు స్వప్రయోజనాపరులు మతతత్వాన్ని బాహాటంగా ప్రోత్సహించారు; అమలు జరిపారు. ఉన్నతవర్గాలు, వలసపాలకులు, మధ్య తరగతి సెక్షన్లతో ఐక్యమవటాన్ని, ఆ సెక్షన్ల ప్రజల రాజకీయాలు ఉన్నతవర్గాల ప్రయోజనాలకు సేవలు చేయటాన్ని మతతత్వం సాధ్యపడేలా చేసింది.

* * *

దేశంలో నెలకొన్న అంతర్గత సామాజిక, రాజకీయ పరిస్థితుల నాధారం చేసుకొని బ్రిటిషు పాలన – దాని విభజించి పాలించే విధానం, ఆధునిక భారతదేశంలో మతతత్వాన్ని పెంచగలిగింది. రాజ్యం తన విశేషమైన అధికారాలతో జాతీయ సమగ్రతని పెంచగలదు. అన్ని రకాల విచ్ఛిన్నకర శక్తుల్ని ప్రోత్సహించగలదు. వలసవాద రాజ్యం రెండవదానిని ఎంపిక చేసుకొంది. పెరుగుతున్న జాతీయోద్యమాన్ని, జాతిగా ఒక్కటవుతున్న భారత ప్రజల్ని ప్రతిఘటించి, బలహీనపరచేందుకు రాజ్యం మతతత్వాన్ని మైనారిటీల రక్షణ సమస్యగా చిత్రీకరించింది. నాగరికతా లక్ష్యం, తెల్లవాని భారం, పాలకుల సంక్షేమం – లాంటి సిద్ధాంతాలు అపఖ్యాతి పాలయిన తరువాత హిందూ, ముస్లిం అనైక్యత, మెజారిటీ ప్రజల ఆధిక్యత అణచివేతల నుండి మైనారిటీలకు రక్షణ కల్పించవలసిన అవసరం – బ్రిటిషు పాలన కొనసాగింపుకి ప్రధానమైన సమర్థనగా చూపబడింది.

మతతత్వం 'విభజించి పాలించు' విధానంలోని ఒకే ఒక భాగం కాదు. పెరుగుతున్న భారత ప్రజల ఐక్యతని అడ్డుకొనేందుకు భారత సమాజంలో వున్న ప్రతి విభజన ప్రోత్సహించబడింది. ప్రాంతానికి వ్యతిరేకంగా ప్రాంతాన్ని, ప్రావిన్సుకి వ్యతిరేకంగా ప్రావిన్సుని, కులానికి వ్యతిరేకంగా కులాన్ని, భాషకి వ్యతిరేకంగా భాషని, సాంప్రదాయవాదులకు వ్యతిరేకంగా సంస్కర్తల్ని, సమరశీల పోరాటాలు చేసేవారికి వ్యతిరేకంగా మితవాదుల్ని, మితవాదులకు వ్యతిరేకంగా వామపక్షవాదుల్ని నిలబెట్టే ప్రయత్నాలు చేయబడ్డాయి. కొన్ని విభజనలు కొంతకాలం మాత్రమే పనిచేశాయి. కాని మతతత్వ విభజన చివరివరకూ నిలిచింది. బ్రిటిషు పాలకులకు చాలా సేవలు చేసింది. చివరలో కూడా వలసవాదానికి అండగా నిలిచింది. వలసరాజ్యం యొక్క బలమైన మద్దతులేకపోతే మతతత్వం దేశాన్ని విభజించే మేరకు ఎదిగివుండేదికాదు. వలసవాదం తన పరిమితమైన సామాజిక పునాదిని వలసవాదానికి భిన్నమైన ప్రయోజనాలు గల కార్మిక, కర్షక మధ్య తరగతుల సెక్షన్లలోకి విస్తరించుకొనగలగడానికి మతతత్వం ఒక మార్గంగా ఉపయోగపడింది.

బ్రిటిషు పాలకులు మతతత్వాన్ని పెంచి పోషించడానికి అవలంబించిన పద్ధతులు, విధానాలు ఏమిటి?

మొదటిది : హిందువులు, ముస్లిములు, సిక్కుల మధ్య ఎలాంటి సామాన్య అంశంలేని సామాజిక, రాజకీయ అస్తిత్వాలు గల ప్రత్యేక సమూహాలుగా నిరంతరం పరిగణించడం. భారతదేశం ఒక జాతిగా గాని, రూపు దిద్దుకొంటున్న జాతిగా గాని, వివిధ స్థానిక సమాజాలు కలిగియున్నట్లుగాగాని పరిగణించక అది నిర్మాణయుతమైన, పరస్పర విశిష్టమైన వైరుధ్యంగల మతప్రాతిపదిక గల సమూహాలను కలిగి వున్నట్లుగా పరిగణించడం.

రెండవది : మతతత్వవాదులకు అధికారుల అభిమానం, ప్రోత్సాహాలు వున్నాయి.

మూడవది : మతతత్వ పత్రికల పట్ల, వ్యక్తుల పట్ల ఆందోళనల పట్ల అసాధారణమైన సహనం చూపించబడింది.

నాలుగు : మతపరమైన డిమాండ్లు వెంటనే ఆమోదింపబడ్డాయి. ఫలితంగా మతతత్వ సంస్థలకు రాజకీయ బలం చేకూరింది. ప్రజలపై మతతత్వ సంస్థల పట్టు పెరిగింది. ఉదాహరణకు 1885–1905 నుండి కాంగ్రెస్ తన డిమాండ్లలో దేనినీ ఆమోదింపజేసుకోలేక పోయింది. కాని ముస్లిం మతతత్వ డిమాండ్లు వైస్రాయికి సమర్పించబడగానే ఆమోదింపబడ్డాయి. అదేవిధంగా 1932లో కమ్యూనల్ అవార్డు మతతత్వవాదుల అప్పటి ప్రధానమైన డిమాండ్లనన్నింటినీ అంగీకరించింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ముస్లిం మతతత్వవాదులకు ఎలాంటి రాజకీయపరమైన చర్యపైనైనా పూర్తి వీటో అధికారం యివ్వబడింది.

ఐదవది : బ్రిటిషువారు మతతత్వ సంస్థల్ని, నాయకుల్ని వారి మతాల ప్రతినిధులుగా గుర్తించింది. అదే సమయంలో జాతీయవాద నాయకులు అత్యంత మైనారిటీ వర్గ – అంటే కులీనుల ప్రతినిధులుగా గుర్తింపబడ్డారు.

ఆరవది : ప్రత్యేక నియోజకవర్గాలు మతతత్వ రాజకీయాల అభివృద్ధికి ముఖ్యమైన సాధనాలుగా పనిచేశాయి. చివరిగా వలసవాద ప్రభుత్వం మతతత్వంపై ఎలాంటి చర్య తీసుకోకుండా మతతత్వాన్ని ప్రోత్సహించింది. మతతత్వ పెరుగుదలను అదుపు చేసేందుకు ప్రభుత్వం మాత్రమే చేపట్టగలిగిన సానుకూలమైన చర్యలు అవసరమవుతాయి. అలాంటి చర్యలు చేపట్టడంలోని వైఫల్యం మతతత్వానికి పరోక్షమైన ప్రోత్సాహకంగా పనిచేసింది. పత్రికలు, కరపత్రాలు, సాహిత్యం, బహిరంగవేదికలు, పుకార్లు – వీటన్నింటి ద్వారా

సాగే మతతత్వ విద్వేష ప్రచారంపై చర్య తీసుకొనేందుకు ప్రభుత్వం నిరాకరించింది. అందుకు పూర్తి విరుద్ధంగా తరచుగా జాతీయవాద పత్రికల్ని, సాహిత్యాన్ని, ప్రచారాన్ని అణచివేసింది. మరొకవైపు మతతత్వ నాయకులకు, మేధావులకు, ఉద్యోగులకు బిరుదులిచ్చి ప్రయోజనాలు పొందే స్థానాలు కల్పించి, పెద్ద మొత్తాలలో వేతనాలిచ్చి సత్కరించింది. మతకలహాల విషయంలో బ్రిటిషు పాలనా వ్యవహారాల నిర్వాహకులు చూసీచూడనట్లు బాధ్యతా రహితంగా వ్యవహరించారు. అలాంటి ఘటనలు జరిగినప్పుడు పట్టుదలగా అణచివేయలేదు. మత ఉద్రిక్తతల పరిస్థితుల్ని నివారించేందుకు పాలనా యంత్రాంగం జాతీయ తదితర ప్రజా నిరసన ప్రదర్శనల పట్ల చేపట్టిన విధంగా సన్నాహకచర్యలు చేపట్టలేదు.

వలసవాద ప్రభుత్వం మతతత్వానికి మద్దతు యిచ్చినంతకాలం, ఆ ప్రభుత్వం వున్నంతకాలం మతతత్వ సమస్యకి పరిష్కారం సులభంగా సాధ్యపడదు. మతతత్వానికి వ్యతిరేకంగా జయప్రదంగా పోరాడేందుకు వలసవాద ప్రభుత్వాన్ని కూలదోయడం అవసరమేగాని అదే సర్వస్వంకాదు.

* * *

20వ శతాబ్దం ప్రారంభంలో జాతీయవాద ఆలోచనలలో, ప్రచారంలో ప్రకటితమైన హిందూ భావనలు, మతతత్వ పెరుగుదలకు బలమైన సహాయక అంశంగా పనిచేసింది.

అతివాదులలో చాలామంది జాతీయవాద ఆలోచనలలో ప్రచారంలో బలమైన హిందూమతపరమైన అంశాల్ని ప్రవేశపెట్టారు. ప్రాచీన భారతదేశ సంస్కృతిని ఆకాశానికి ఎత్తారు. మధ్యయుగాల భారతదేశ సంస్కృతిని విస్మరించారు. రోజువారీ రాజకీయ ఆందోళనలకు హిందూ ఆచార సాంప్రదాయాల్ని సమకూర్చయత్నించారు. భారతీయ జాతీయవాదానికి హిందూ సిద్ధాంతపరమైన సమర్థన సమకూర్చయత్నించారు. తిలక్ జాతీయవాద ప్రచారానికి గణేష్ పూజ, శివాజీ ఉత్సవాలను ఉపయోగించాడు. బెంగాల్ విభజన వ్యతిరేక ఆందోళన గంగా స్నానాలతో ప్రారంభింపబడింది. అంతేగాక బకించంద్ర ఛటర్జీ యింకా పలువురు బెంగాలీ, హిందీ, ఉర్దూ, యితర భాషల రచయితలు వారి నవలల్లో, నాటకాలలో, కవితలలో, కథలలో

తరచుగా ముస్లింలను విదేశీయులుగా చిత్రించారు. జాతీయవాదాన్ని హిందూమతంతో మమేకం చేశారు. ముస్లిం పాలకులను, అధికార్లను నిరంకుశులుగా చిత్రించిన ఈ తరహా సాహిత్యం విద్యావంతులైన ముస్లింలలో అసంతృప్తి కలిగించింది. జాతీయోద్యమానికి వారిని దూరం చేసింది. అంతేగాక హిందూ సంకేతాల్ని, కల్పిత కథల్ని ఉపయోగించడం వలన జాతీయవాద ఉద్యమంలో చాలా భాగాన్ని హిందూ వాతావరణం ఆవరించింది.

ఐనప్పటికీ జాతీయవాద ఉద్యమం సెక్యులర్ విధానాన్ని, వైఖరిని నిలబెట్టుకొంది. ఎం.ఎ.జిన్నా, మౌలానా అబుల్ కలాం అజాద్ లాంటి ముస్లిం యువ జాతీయతావాదులు దానిని సెక్యులర్ ఉద్యమంగా అంగీకరించి చేరారు. గాంధీజీ, సి.ఆర్.దాస్, మోతిలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అజాద్, డాక్టర్ ఎం.ఎ.అన్సారీ, సుభాస్ బోస్, సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్ – లాంటి వారి నాయకత్వంలో సెక్యులరిజం దృఢపడింది. జాతీయోద్యమంపై హిందూ భావాల ప్రభావం మతతత్వం కారణంగా పడింది కాదు. కాని దాని పెరుగుదలను అదుపు చేయకపోవడం జాతీయవాద వైఫల్యం. ఈ వైఫల్యం కారణంగా జాతీయోద్యమంలోనికి ముస్లిముల్ని రాబట్టడం కొంత కష్టసాధ్యమయింది. అది ముస్లింలలోని పెద్ద సెక్షన్లను జాతీయోద్యమానికి దూరంగా వుంచటానికి, 'ఉద్యమం విజయం సాధించడమంటే దేశంలో హిందువుల ఆధిపత్యం' – అనే భావన వారి మనస్సులలో జొప్పించడం ప్రభుత్వానికి ముస్లిం మతతత్వవాదులకు సాధ్యపడేలా చేసింది.

హిందూ భావన హిందూ మతతత్వానికి సైద్ధాంతిక అవకాశాల్ని కల్పించింది. హిందూ మతతత్వ రాజకీయ సైద్ధాంతిక అంశాల్ని ఉద్యమ శ్రేణుల నుండి తొలగించడం జాతీయోద్యమానికి కష్టతరమయింది. అది ముస్లిం జాతీయవాదులలో ముస్లిం భావనలు వ్యాపించడానికి దోహదపడింది.

* * *

భారతదేశ చరిత్ర–ప్రత్యేకించి ప్రాచీన మధ్యయుగాల నాటి చరిత్ర పట్ల గల మతపరమైన వక్రీకరించబడిన అశాస్త్రీయ దృక్పథం మతతత్వ స్పృహని వ్యాప్తిజెందించడానికి సాధనమయింది. మతతత్వ సిద్ధాంతంలో ముఖ్యమైన భాగమయింది. పాఠశాలల్లో, కళాశాలల్లో మతతత్వ దృక్పథంతో సాగుతున్న భారతదేశ చరిత్ర బోధన

మతతత్వ పుట్టుకకు పెరుగుదలకు చాలా దోహదపడింది. కొన్ని తరాలనుండి, ఆధునిక పాఠశాల విధానం ప్రారంభమైనప్పటి నుండి వివిధ స్థాయిల్లో చరిత్రపై మతతత్వ దృక్పథంతో కూడిన వ్యాఖ్యానాల ప్రచారం మొదట సామ్రాజ్యవాద చరిత్రకారులు, ఆ తరువాత యితరులు చేశారు. చరిత్రలో మతతత్వ ప్రచారం ఎంత తీవ్రంగా, విస్తృతంగా జరిగిందంటే దృఢమైన జాతీయవాదులు కూడా దానిలోని ప్రాథమిక అంశాల్ని అసంకల్పితంగా అంగీకరించేంతగా సాగింది. సమకాలీన పరిశీలకులు దీనిని గమనించారు. ఉదాహరణకు గాంధీజీ యిలా వ్రాశారు. "చరిత్ర పుస్తకాల ద్వారా పాఠశాలల్లో, కళాశాలల్లో విపరీతంగా వక్రీకరించబడిన పాఠ్యాంశాలు బోధింపబడుతున్నంతకాలం మనదేశంలో మతసామరస్యాన్ని పూర్తిగా తీసుకొనిరావడం సాధ్యపడదు." పాఠ్యపుస్తకాల ద్వారానే గాక చరిత్రపట్ల మతతత్వ దృక్పథం కవిత్వం, నాటకాలు, కరపత్రాలు, బహిరంగ ఉపన్యాసాలు, తరగతి గది బోధన, కుటుంబం ద్వారా జరిగే సామాజికీకరణ, ప్రైవేటు చర్చలు, సంభాషణల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయబడుతుంది.

19వ శతాబ్దం ప్రారంభంలో బ్రిటిషు చరిత్రకారుడు జేమ్స్‌మిల్ ఈ ధోరణికి ప్రారంభకుడు. అతడు భారతదేశ చరిత్రలో ప్రాచీన యుగాన్ని హిందూ యుగమని, మధ్యయుగాల్ని ముస్లిం యుగమని వర్గీకరించాడు. (ఆధునిక యుగాన్ని క్రైస్తవయుగంగా వర్గీకరించలేదు) ఇతర బ్రిటిషు, భారతీయ చరిత్రకారులు అతడ్ని అనుసరించారు. అంతేగాక సాధారణ ముస్లిం ప్రజానీకం, సాధారణ హిందువుల లాగానే పీడనకు, అణచివేతకు గురయినప్పటికీ ముస్లింలలో లాగానే హిందువులలో జమిందారులు, పాలకులు వున్నప్పటికీ మధ్యయుగాలలో ముస్లింలందరినీ పాలకులుగా, హిందువులందరినీ పాలితులుగా చిత్రీకరించాడు. ఆ విధంగా భారతదేశంలో రాజ్యతంత్రం యొక్క ప్రాథమిక స్వభావం పాలకుని మతంతో మమేకం చేయబడింది. ఆ తరువాత వివిధ కాలాల సమాజం సంస్కృతి స్వభావరీత్యా హిందూ లేక ముస్లింగా వర్ణించబడింది.

'మధ్యయుగాల నాటి భారతదేశ పాలకులు హిందూ వ్యతిరేకులు; హిందువుల్ని అణచివేశారు; బలవంతంగా మతమార్పిడులు చేయించారు' – అనే సామ్రాజ్యవాద దృక్పథాన్ని హిందూ మతతత్వవాది స్వీకరించాడు. మతతత్వ, సామ్రాజ్యవాద చరిత్రకారులందరూ మధ్యయుగాల చరిత్రని సుదీర్ఘమైన హిందూ, ముస్లిం ఘర్షణగా

చూశారు. మధ్యయుగాల కాలమంతటా విలక్షణమైన హిందూ ముస్లిం సంస్కృతులు వున్నట్లు నమ్మారు. హిందూ మతతత్వవాదులు మధ్య యుగాలనాటి పాలనను పాలకుల మతం కారణంగా విదేశీ పాలనగా వర్ణించారు. 'వేయి సంవత్సరాల బానిసత్వం' 'విదేశీ పాలన' సాధారణ పదజాల మయింది. కొన్ని సందర్భాలలో జాతీయవాదులు కూడా ఈ పదజాలాన్ని ఉపయోగించారు. అంతేగాక హిందూ మతతత్వవాది చారిత్రక దృక్పథం 'భారతీయ సమాజం, సంస్కృతి ప్రాచీన కాలంలో అత్యున్నత శిఖరాలకు చేరుకొన్నది. మధ్యయుగాలనాటి ముస్లిం పాలన ఆధిక్యతల కారణంగా ఆ సమున్నత స్థానం నుండి క్రమంగా క్షీణించడం ప్రారంభమయింది'– అనే అసత్యంపై ఆధారపడింది. భారతీయ ఆర్థిక, సాంకేతిక శాస్త్రాలు మతం, తత్వశాస్త్రాలు, సాహిత్యం, కళలు, సమాజం, సంస్కృతులు అభివృద్ధికి మధ్యయుగాల తోడ్పాటు నిరాకరించబడింది.

అదేవిధంగా ముస్లిం మతతత్వవాదులు పశ్చిమాసియాలో 'ఇస్లాం సాధించిన స్వర్ణయుగం' అప్పటి వీరుల్ని, కల్పనల్ని, సాంస్కృతిక సాంప్రదాయాల్ని ఆశ్రయించారు. మధ్యయుగాలనాడు ముస్లింలందరూ పాలకులని లేక ముస్లిం పాలన వలన ప్రయోజనాలు పొందారనే భావనని ప్రచారం చేశారు. ఔరంగజేబ్ లాంటి మత దురభిమానితో సహా ముస్లిం పాలకులందరినీ ఆకాశానికెత్తారు. క్షీణదశకు వారి కథలు వారూ అల్లారు. 19వ శతాబ్దంలో హిందువులు పైకి ఎగబాకుతుంటే ముస్లిములు రాజ్యాధికారం కోల్పోయిన తరువాత పతనమయ్యారని చెప్పారు.

* * *

భారతదేశంలో చాలా మతాలు వుండడం మతతత్వ పెరుగుదలకు ప్రధాన కారణమని కొందరు రచయితలు అభిప్రాయపడ్డారు. కాని ఇది వాస్తవంకాదు. పలు మతాలున్న సమాజంలో మతతత్వం పుడుతుందనడం వాస్తవంకాదు. మతం మతతత్వానికి కారణంకాదు. మత సమస్యని పరిష్కరించడానికి మతతత్వాన్ని తొలగించడం ప్రాథమికమైన షరతు అవుతుంది. ప్రజలు వ్యక్తిగతంగా అనుసరించే విశ్వాసాల విధానంగా అనుసరించే మతానికి, మత ప్రాతిపదికగా సామాజిక రాజకీయ గుర్తింపు పొందే మతతత్వ సిద్ధాంతానికి మధ్యగల తేడాని గుర్తించాలి. ఈ తేడా మతేతర రంగాలలో ఉత్పన్నమయ్యే సామాజిక అవసరాల్ని, ఆశల్ని, ఆకాంక్షల్ని, ఘర్షణల్ని దాచిపెట్టేందుకు లేక వాటిపై ముసుగుకప్పేందుకు ఉపయోగించుకొనబడుతుంది. మతంకాకుండా యితర రంగాలలో

ఉత్పన్నమయ్యే రాజకీయ ప్రయోజనాలకు సేవలుచేసే మేరకు మతం మతతత్వానికి ఉపకరిస్తుంది. ఈ అంశాన్నే 'మజబ్‌కి సియాసి దుకాన్‌దారీ' (మతంతో రాజకీయ వ్యాపారం)గా కె.ఎం. అషరఫ్ వర్ణించాడు. మతతత్వం మతంచే ప్రేరేపించబడదు. మతతత్వ రాజకీయాల లక్ష్యం మతంకాదు. మతం కేవలం వాహకం మాత్రమే.

కాని మతం ప్రజల్ని సమీకరించే సాధనంగా మతతత్వవాదులచే ఉపయోగించు కోబడింది. 1939 తరువాత ప్రత్యేకించి 1945-47కాలంలో 'మతం ప్రమాదంలో పడింది' - అనే ఉద్రేకపూరిత నినాదం యిచ్చిన తరువాత మతతత్వం ప్రజా ఉద్యమం కాగలిగింది. అంతేగాక మతపరమైన కార్యకలాపాలు మతపరమైన ఉద్రిక్తతలకు, ఘర్షణలకు తక్షణ కారణాలయ్యాయి. మతం మతతత్వానికి కారణం కాదు. కాని మత దురభిమానం మతతత్వ పెరుగుదలకు తోడ్పడే ప్రధానమైన అంశం. (మత దురభిమానాన్ని మతపరమైన విషయాల పట్ల తీవ్రమైన ఆవేశపూరితమైన నిబద్ధత; మతం, మతపరమైన ఉద్రేకాలు, మతేతరమైన, ఆధ్యాత్మికేతరమైన, వైయక్తిక ప్రపంచాన్ని దాటి జీవితరంగాలలోకి చొరబడడాన్ని అనుమతించే ధోరణిగా నిర్వచించవచ్చు.) మత దురభిమానం మతతత్వంకాదు. కాని అది మతం పేరుతో మతతత్వవాది చేసే విజ్ఞప్తికి వ్యక్తిని సుముఖుడ్ని చేస్తుంది. కాబట్టి సెక్యులరిస్టులుగా మార్చడం అంటే మతాన్ని తొలగించడం కాదు. మత దురహంకారాన్ని తగ్గించడం లేక మతాన్ని వ్యక్తిగత జీవితానికి పరిమితం చేయడం.

* * *

# 32 మతతత్వం - ఉదారవాదం దశ

19వ వ శతాబ్దం చివరి 25 సం॥లకు ముందు భారతదేశంలో మతతత్వం దాదాపు లేదనే చెప్పాలి. 1857 తిరుగుబాటులో హిందువులు, ముస్లింలు భుజం భుజం కలిపి పోరాడారు. మతేతర రంగాలలో హిందువులు ముస్లింల మధ్య తేడాగాని, వారి ప్రయోజనాల మధ్య ఘర్షణల ప్రసక్తిగాని 1860నాటి పత్రికలలో కన్పించదు. దేశ ప్రజల్ని బ్రిటిషువారి నుండి వేరుచేసి చూపేందుకు ఉత్తర భారతదేశ పత్రికలు 'హిందూస్తానీలు' అనే పదం వాడేవి.

దేశంలోని కొన్ని భాగాలలోని ముస్లింలు ఆధునిక విద్యలో, ఉద్యోగాలలో హిందువుల కంటె వెనుకబడి వుండడాన్ని గమనించిన కొందరు ముస్లిం మేధావులు కూడా హిందువుల్ని నిందించలేదు. ప్రభుత్వం యొక్క ముస్లిం వ్యతిరేక విధానాన్ని, పై తరగతులకు చెందిన ముస్లింలు ఆధునిక విద్యపట్ల అశ్రద్ధ వహించడాన్ని నిందించారు. 19వ శతాబ్దపు ప్రముఖ భారతీయులలో ఒకరైన సయ్యద్ అహమ్మద్‌ఖాన్ తన కార్యకలాపాల్ని ఎలాంటి మత వివక్షత లేకుండా ప్రారంభించాడు. ముస్లింలలో ఆధునిక విద్యావ్యాప్తి పట్ల అనుసరించబడుతున్న వివక్షతకు వ్యతిరేకంగా ఆయన స్థాపించిన అలీఘర్ కాలేజికి సంపన్న హిందువుల నుండి ఆర్థిక సహాయం లభించింది. ఆ కాలేజి అధ్యాపకులు, విద్యార్థులలో హిందువులు పెద్దసంఖ్యలో వున్నారు. 1885లో కాంగ్రెస్ స్థాపించేవరకు హిందూ ముస్లింల ఉమ్మడి అంశాలకు అహమ్మద్‌ఖాన్ విశేష ప్రచారం యిచ్చాడు. ఉదాహరణకు 1884లో యిలా అన్నారు. "నీవు ఈ దేశంలో నివసించడం లేదా? చనిపోయిన తరువాత యిక్కడ పూడ్చిపెట్టబడవా?

దహన సంస్కారాలు యిక్కడ జరగవా? ఇదే గడ్డపైన నీవు బతుకుతావు; చస్తావు. హిందువులు ముస్లింలు అనేవి మతపరమైన పదాలని గుర్తుంచుకోండి. ఈ దేశంలో నివసించే హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు ఒకే జాతి."

1880 దశాబ్దంలో జాతీయ కాంగ్రెస్‌చే ప్రారంభించబడిన జాతీయోద్యమాన్ని సయ్యద్ అహమ్మద్ ఖాన్ వ్యతిరేకించడంతో భారతదేశంలో మతతత్వం మొదలయింది. కాంగ్రెస్ తన సామ్రాజ్యవాద వ్యతిరేకతని వ్యక్తం చేయడంతో 1887లో వైస్రాయి డఫెరిన్, యు.పి. లెఫ్టినెంట్ గవర్నర్ కాల్విన్ కాంగ్రెస్‌పై బహిరంగ దాడి ప్రారంభించారు. వలసపాలకులకు విధేయతగా వుంటే పాలనాయంత్రాంగంలోని ఉద్యోగాలలో ముస్లింల వాటా పెంచవచ్చునని నమ్మిన సయ్యద్ అహమ్మద్ ఈ దాడిలో చేరాలని నిర్ణయించుకొన్నాడు. అంతేగాక అలీఘర్ కాలేజీకి పెద్ద జమిందారుల, బ్రిటిషు అధికారుల మద్దతు అవసరమని భావించాడు. అభివృద్ధి చెందుతున్న జాతీయ ప్రజాస్వామ్య ఉద్యమానికి వ్యతిరేకంగా జమిందారులతో ఉన్నతాధికారులతో సంస్థని స్థాపించడానికి భింగా రాజా శివప్రసాద్‌తో కలిసి తొలుత ఒక ప్రయత్నం చేశాడు. కాని ఆ ప్రయత్నం జయప్రదం కాలేదు.

సయ్యద్ అహమ్మద్ ముస్లింలలోని భూస్వామ్య శక్తుల్ని ముస్లింల పేరుతో సంఘటితపరచే ప్రయత్నం చేశాడు. ఆయన, ఆయన అనుచరులు 20వ శతాబ్దం తొలి అర్ధభాగంలో ప్రచారం చేయనున్న మతతత్వ సిద్ధాంతం యొక్క ప్రాథమిక అంశాలకు పునాదులు వేశారు. ప్రాథమిక అంశాలలో ముఖ్యమైనది; ప్రాతినిధ్య ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ప్రవేశపెడితే లేక బ్రిటిషు పాలన అంతమై పాలనాధికారం భారతీయులకు అప్పజెప్పబడితే, హిందువులు మెజారిటీ గనుక ముస్లింలపై ఆధిపత్యం చెలాయిస్తారు. మైనారిటీగా వున్న ముస్లింల రక్షణకు బ్రిటిషువారు అవసరమవుతారు. భారతదేశ పరిస్థితులలో బ్రిటిషువారు ముస్లిం ప్రజల ప్రయోజనాల సంరక్షకులుగా వుంటారు. కాబట్టి ముస్లింలు బ్రిటిషు పాలకులకు విధేయంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వుండాలి. హిందువులు, ముస్లింల ప్రయోజనాల మధ్య శాశ్వత ఘర్షణ అనే అంశం కూడా ముందుకు తీసుకొనిరాబడింది. అంతకుముందు గల అభిప్రాయాల్ని వదిలిపెట్టి భారతదేశాన్ని జాతిగా పరిగణించరాదన్నాడు. కాంగ్రెస్ హిందూ సంస్థ గనుక దాని ప్రధానమైన లక్ష్యాలు ముస్లింల ప్రయోజనాలకు భిన్నమైనవని ప్రకటించాడు. అదే సమయంలో పుట్టుక చేత ఉన్నతులకు, తక్కువవారికి మధ్య సామాజిక సమానత సూత్రంపై ఆధారపడిన కాంగ్రెస్‌ని విమర్శించాడు.

కాంగ్రెస్ డిమాండ్‌చేసిన ప్రజాస్వామ్య ఎన్నికలకు అభ్యంతరం చెప్పాడు. అలాంటి ఎన్నికలు ఒకడు నాలుగు పాచికలతో, మరొకడు ఒక పాచికతో ఆడే పందెం లాంటిదన్నాడు. ఏ ఎన్నికల విధానమైన బెంగాలీలు లేక బెంగాలీ తరహా హిందువుల చేతుల్లో అధికారాన్ని పెడుతుందని, ముస్లింల పతనానికి దారితీస్తుందని, వారిని బానిసత్వంలోకి నెడుతుందని చెప్పాడు. ప్రభుత్వ ఉద్యోగాలలో, చట్టసభలలో, జిల్లా బోర్డులలో ముస్లిములకు రక్షణ కల్పించాలని సయ్యద్ అహమ్మద్, ఆయన అనుచరులు డిమాండ్ చేశారు. ముస్లిముల రాజకీయ ప్రాధాన్యతని, వారి చారిత్రక పాత్రని గుర్తించి చట్టసభలలో వారి ప్రాతినిధ్యం హిందువులకే మాత్రం తీసిపోని విధంగా వుండాలని డిమాండ్ చేశారు. అప్పటి బ్రిటిష పాలకులు ప్రజల్ని రాజకీయాలలోకి సమీకరించడం పట్ల ఆగ్రహంగా వున్నారు గనుక ప్రత్యామ్నాయ రాజకీయ సంస్థని స్థాపించలేదు. ఆందోళనలు చేపట్టే రాజకీయాలు ప్రభుత్వ వ్యతిరేకమైనవని, రాజద్రోహపూరితమైనవని, పాలకులకు తమ పట్ల అవిధేయులమనే భావం సృష్టిస్తాయని సయ్యద్ అహమ్మద్ అభిప్రాయపడ్డాడు. కాబట్టి రాజకీయాల పట్ల ఉదాసీనంగా వ్యవహరించమని అంటే ఆందోళనలు చేపట్టవద్దని ఆయన ముస్లిముల్ని కోరాడు. మతతత్వంలోను మైనారిటీలకు ప్రభుత్వం రక్షణ కల్పించే సిద్ధాంతంలోను గల అంతర్గత తర్కాన్ని గ్రహించిన వలసపాలకులు మతతత్వాన్ని బలపరిచారు; ప్రోత్సహించారు.

ముస్లిం మతతత్వవాదులు సయ్యద్ అహమ్మద్ మరణానంతరం విధేయతా రాజకీయాల్ని కొనసాగించారు. 1905–06 బెంగాల్ స్వదేశీ ఉద్యమకాలంలో బాహాటంగా ప్రభుత్వ పక్షాన వున్నారు. ఉద్యమాన్ని బలపరచిన ముస్లిముల్ని నీచమైన ఇస్లాం విద్రోహులని, కాంగ్రెస్ తొత్తులని నిందించారు.

కాని ముస్లిం మేధావుల్ని ప్రభుత్వానికి విధేయంగా వుంచే ప్రయత్నం పూర్తిగా జయప్రదం కాలేదు. 1887 కాంగ్రెస్ సదస్సుకి బద్రుద్దీన్ త్యాబ్జి అధ్యక్షత వహించాడు. తరువాత సంవత్సరాలలో కాంగ్రెస్‌కి ముస్లిం ప్రతినిధుల సంఖ్య పెరిగింది. ఆర్.యం.సయాని, ఎ.బీమ్జి, మీర్ ముషారఫ్ హుస్సేన్, హమీద్ అలీఖాన్, యింకా బొంబాయి, బెంగాల్, ఉత్తర భారతదేశానికి చెందిన పలువురు ముస్లిం మేధావులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ డిమాండ్లలో ఏ ఒక్కటీ మతపరమైనది కాదని లేక హిందువులకు మాత్రమే వర్తించేది కాదని వారు స్పష్టం చేశారు. దేశమంతటా ముస్లిములలో జాతీయవాద ధోరణి వ్యాప్తి జెందడం 19వ శతాబ్దం వరకూ కొనసాగింది. బెంగాల్

విభజనకు వ్యతిరేకంగా చేపట్టిన స్వదేశీ ఆందోళనని అబ్దుల్ రసూల్ యింకా పలువురు బెంగాల్ ముస్లిం మేధావులు బలపరచారు. బెంగాల్ ముస్లింలలో జాతీయవాద ధోరణి 1920–30 దశాబ్దం వరకు ప్రబలంగా వుంది.

భారతదేశంలోకి స్వదేశీ ఉద్యమం ప్రజా రాజకీయాల్ని తీసుకొని రావడంతో ముస్లిం మేధావులలోని పెద్ద సెక్షన్ని కాంగ్రెస్‌లోకి రప్పించే ప్రయత్నాలు జరిగాయి. బ్రిటిషు ప్రభుత్వం కొన్ని రాజ్యాంగపరమైన రాయితీలను యివ్వక తప్పలేదు. ముస్లిం మతతత్వానికి రాజకీయ ఉదాసీనవైఖరి కొనసాగించడం సాధ్యపడలేదు. మతతత్వవాదులు, ప్రభుత్వంలోని వారి మద్దతుదారులు రాజకీయ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించారు. పెద్ద జమిందారులు, ఉన్నతాధికారులు, ఢక్కా నవాబ్  ఆగాఖాన్, నవాబు మోషిన్ –ఉల్–మల్క్ లాంటి ఉన్నత వర్గానికి చెందిన ముస్లింలచే 1927 చివరలో అఖిల భారత ముస్లిం లీగ్ స్థాపించబడింది. బ్రిటిషు పాలనకు విధేయత, మతతత్వ లక్షణాలతో స్థాపించబడిన ముస్లింలీగు  బెంగాల్ విభజనకు మద్దతు ప్రకటించింది. ముస్లిముల ప్రత్యేక ప్రయోజనాల నినాదమిచ్చింది. ప్రత్యేక నియోజకవర్గాల్ని, ప్రభుత్వ సర్వీసులలో ముస్లింలకు రక్షణల్ని డిమాండ్ చేసింది. గతంలో సయ్యద్ అహమ్మద్, ఆయన అనుచరులు ప్రతిపాదించిన మతతత్వ రాజకీయాలలోని అన్ని ప్రధానమైన డిమాండ్లను పునరుద్ఘాటించింది. ఉదాహరణకు వికర్ ఉల్ మల్క్ యిలా అన్నాడు  "భారతదేశంలో బ్రిటిషు పాలన అంతమైతే హిందువులు పాలకులవుతారు. మన ప్రాణాలు, ఆస్తులు, గౌరవ ప్రతిష్టలు – అన్నీ నిరంతర ప్రమాదంలో పడతాయి. ఈ ప్రమాదం నుండి తట్టుకొనడానికి ముస్లింలకు గల ఒకే ఒక మార్గం బ్రిటిషుపాలన కొనసాగింపుకి సహాయపడడమే." అతడు మైనారిటీలు తమ గుర్తింపుని కోల్పోతారన్న భయాన్ని వ్యక్తం చేశాడు. కొత్తగా వస్తున్న ముస్లిం మేధావి వర్గాన్ని కాంగ్రెస్‌లో చేరకుండా చూడడం ముస్లింలీగు లక్ష్యాలలో ఒకటి. దాని కార్యకలాపాలు వలసపాలనకి వ్యతిరేకంగా గాక జాతీయ కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా, హిందువులకు వ్యతిరేకంగా నిర్దేశించబడ్డాయి.

* * *

ముస్లింలీగుతో పాటు దాదాపు అదే కాలంలో హిందూ మతతత్వం కూడా పుట్టింది. 1870 నుండి హిందూ జమిందారులు, వడ్డీ వ్యాపారులు, మధ్య తరగతి వృత్తిదారులలో ఒక సెక్షన్ ముస్లిం వ్యతిరేక భావాలను రెచ్చగొట్టడం ప్రారంభించింది. వారు వలసవాద చారిత్రక దృక్పథాన్ని ఆమోదిస్తూ, మధ్య యుగాలనాటి ముస్లిం

నిరంకుశపాలనని, ముస్లింల అణచివేత నుండి హిందువులను రక్షించడంలో బ్రిటిషు పాలకులు నిర్వహించిన విమోచనాత్మక పాత్రని గురించి  చాలా చెప్పారు. యు.పి., బీహార్‌లలో హిందీ సమస్యని చేపట్టి, దానికి మతం రంగు పులిమారు. ఉర్దూ – ముస్లింల భాష, హిందీ –  హిందువుల భాష అన్నారు. 1890లో దేశవ్యాప్తంగా గోవధ వ్యతిరేక ప్రచారం చేపట్టారు. ప్రచారం ముస్లింలకు వ్యతిరేకంగా ఉద్దేశించబడిందిగాని, బ్రిటిషువారికి వ్యతిరేకంగా కాదు. బ్రిటిషు కంటోన్మెంట్లలో పెద్దఎత్తున జరుగుతున్న గోవధని ప్రచారం నుండి మినహాయించారు. ఆందోళనలలో అనివార్యంగా మతతత్వం జొరపడింది. ఫలితంగా కొన్నిచోట్ల మత ఘర్షణలు జరిగాయి. 1896నాటికి గోవధ వ్యతిరేక ఉద్యమం సద్దుమణిగింది. కాని 20వ శతాబ్దం రెండవ దశాబ్దంలో తీవ్రరూపంలో పునరుద్ధరించబడింది. చట్టసభల సీట్లలోను, ప్రభుత్వ ఉద్యోగాలలోను హిందువుల వాటా కొరకు హిందు మతతత్వవాదులు ఆందోళనలు కొనసాగించారు.

1909లో పంజాబ్ హిందూసభ స్థాపించబడింది. దాని నాయకులు యు.యన్.ముఖర్జీ, లాల్‌చంద్‌లు హిందూ మతతత్వ రాజకీయాలకు పునాదులు వేశారు. భారతీయుల్ని ఒక జాతిగా ఏకంచేస్తున్నందుకు, ముస్లింలను బుజ్జగించేందుకు హిందువుల ప్రయోజనాల్ని త్యాగం చేస్తున్నందుకు వారు జాతీయ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'రాజకీయాలలో ఆత్మ త్యాగం' అనే చిన్న పుస్తకంలో లాల్‌చంద్, హిందువులు తమంతట తాముగా తలకెత్తుకొన్న దురదృష్టంగా కాంగ్రెస్‌ని వర్ణించాడు. గడచిన  25 సంవత్సరాలుగా కొంచెంకొంచెంగా మింగుతూ వచ్చిన విషం ఫలితంగా హిందువులు వినాశనం దిశగా సాగుతున్నారని వ్రాశాడు. విషానికి విరుగుడు వేసుకొని ప్రమాదంనుండి బయటపడాలని వారు కోరుకొంటే బయట పడగలరు. ప్రమాదం నుండి రక్షింపబడతారు. ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అసాధ్యమైన కోరికలు కోరి హిందువులపైన, కాంగ్రెస్‌పైన ప్రభుత్వానికి సహేతుకమైన ఆగ్రహం వచ్చేలా చేస్తున్నదని ఆరోపించారు. ముస్లింలకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో ప్రభుత్వం తటస్థ పాత్ర వహించేలా హిందువులు ప్రయత్నించాలన్నాడు. ఒక హిందువు మొదట తాను హిందువునని, ఆ తరువాతనే భారతీయుణ్ణని త్రికరణశుద్ధిగా విశ్వసించాలని  లాల్‌చంద్ ప్రకటించాడు.

అఖిల భారత హిందూ మహాసభ మొదటి సదస్సు 1915 ఏప్రిల్‌లో కాశింబజార్ మహారాజా అధ్యక్షతన జరిగింది. కాని అది ముస్లింలీగుతో పోల్చిచూస్తే చాలా సంవత్సరాల వరకు జబ్బునపడ్డ బిడ్డలాగే వుండిపోయింది. అందుకు చాలా కారణాలు వున్నాయి.

ముస్లింలలోని జమిందారులు, కులీనులు, మాజీ ఉన్నతోద్యోగులు యింకా మధ్య తరగతికి చెందినవారు కూడా ముస్లింలీగులో ప్రముఖపాత్ర వహించారు. ఇక పార్శీలు హిందువులలో సైన్సు ప్రజాస్వామ్యం జాతీయవాద భావాల్ని అలవరచుకొన్న ఆధునిక మేధావివర్గం. సాధారణ బూర్జువా వర్గం సామాజిక, ఆర్థిక, రాజకీయ పలుకుబడి ఆధిపత్యం సాధించాయి. ముస్లింలలో అభివృద్ధి నిరోధక భూస్వాముల, ముల్లాల ఆధిపత్యం కొనసాగుతూ వచ్చింది. హిందువులలో గాని, ముస్లింలలోగాని భూస్వాములు, సాంప్రదాయ మత ప్రచారకులు వలసాధిపత్యానికి మద్దతుదారులుగా వుండిపోయారు. కాని హిందువులలో వారు క్రమంగా నాయకత్వ స్థానాల్ని కోల్పోతూ వచ్చారు. ముస్లింలలో వారి ఆధిపత్యం కొనసాగుతూ వచ్చింది. ముస్లింలలోని మధ్య తరగతి బలహీనమైన స్థితి – దాని సామాజిక సైద్ధాంతిక వెనుకబాటుతనం ముస్లిం మతతత్వ పెరుగుదలకు తోడ్పడింది.

హిందూ మతతత్వం బలహీనంగా వుండడానికి యితర కారణాలు కూడా వున్నాయి. వలసవాద ప్రభుత్వం ముస్లిం మతతత్వంపై ఎక్కువగా ఆధారపడడం వలన ఒకే సమయంలో రెండు (హిందూ, ముస్లిం) మతతత్వాల్ని తృప్తిపరచగలగడం అంత సులభసాధ్యం కానందువలన హిందూ మతత్వానికి చాలా తక్కువ మద్దతుని, చాలా కొద్ది రాయితీలనే యిచ్చింది.

* * *

మతతత్వాన్ని పటిష్టపరిచేందుకు వ్యాప్తిజెందించేందుకు వలసపాలకులు మతతత్వవాదులు మరొక శక్తివంతమైన సాధనాన్ని కనుగొన్నారు. అది మింటోమోర్లే సంస్కరణల ద్వారా ప్రవేశపెట్టబడిన ప్రత్యేక నియోజకవర్గాలు. ఈ సంస్కరణలననుసరించి ముస్లిం ఓటర్లకు ప్రత్యేక నియోజకవర్గాలు వుంటాయి. వాటిలో ముస్లిం అభ్యర్థులు మాత్రమే పోటీ చేస్తారు. ముస్లింలు మాత్రమే ఓటు చేస్తారు. ప్రత్యేక నియోజకవర్గాలు ఎన్నికల్ని, చట్టసభల్ని మత ఘర్షణల రంగస్థలాలుగా మార్చాయి. ఓటర్లు ఒకే మతానికి చెందినవారు కావడం వలన అభ్యర్థులు యితర మతాలకు చెందిన ఓటర్లకు విజ్ఞప్తి చేయవలసిన అవసరం లేకపోయింది. వారు బాహాటంగా మతపరమైన విజ్ఞప్తుల్ని చేసుకోవచ్చు. ఈ విజ్ఞప్తుల్ని విన్న ఓటర్లు, యితరులు క్రమంగా మతపరంగా ఆలోచించేందుకు, ఓటువేసేందుకు శిక్షణ యివ్వబడ్డారు. మతతత్వ అధికారం మతతత్వ అభివృద్ధి పరిభాషలో ఆలోచించే విధంగాను, వారి సామాజిక, ఆర్థిక యిబ్బందుల్ని మతతత్వ పరిభాషలో వ్యక్తం చేసేవిధంగాను నియంత్రించబడ్డారు. సీట్ల రిజర్వేషన్,

చట్టసభల్లో, ప్రభుత్వ సర్వీసుల్లో, విద్యాసంస్థల్లో ప్రోత్సాహకాలు వగైరా – లాంటి విధానం కూడా అలాంటి పరిణామాలకే దారితీసింది.

* * *

ఇక్కడ మరొక విషయాన్ని ప్రస్తావించడం అవసరం. మతతత్వం, మతతత్వ సంస్థల మూలాలు, వాటి పెరుగుదల చరిత్రని గురించి చర్చించేటప్పుడు ఒక ప్రత్యేకమైన తప్పు జరగకుండా జాగ్రత్తపడాలి. ఒక మతతత్వం యొక్క మూలాలు మరొక మతతత్వం వునికికి కారణమని లేక ఒక మతతత్వం మరొక మతతత్వానికి ప్రతి చర్య అని మతతత్వ చరిత్ర రచయితలు ఆపాదించారు లేక ఆపాదిస్తారు. తమ మతతత్వాన్ని దొడ్డిదారిన సమర్థించుకోడానికి అసలు కారణం ఎదుటి మతతత్వమని నిందిస్తారు. ఆ విధంగా యితరులు ప్రారంభించిన మతతత్వానికి తాము స్పందిస్తున్నామని హిందూ, ముస్లిం లేక సిక్కు మతతత్వవాదులు తమని తాము సమర్థించుకొంటారు. వాస్తవంగా ఏ మతతత్వం మొదట మొదలయింది? అనే ప్రశ్నకు జవాబు చెప్పడం చెట్టుముందా? విత్తు ముందా? – అనే ప్రశ్నకు జవాబు లాంటిదే. ఒకసారి మతతత్వం పుట్టి పెరిగిన తరువాత దానిలోని భాగాలు ఒకదానినొకటి ఆహారంగా స్వీకరించి మరీ బలుస్తాయి.

యువ ముస్లిం మేధావులు ముస్లింలీగులోని పై వర్గాలకు చెందిన నాయకత్వం యొక్క హిందూ వ్యతిరేక, బ్రిటిషు అనుకూల ధోరణి పట్ల అసంతృప్తి చెందారు. వారు జాతీయవాద భావాలవైపు ఆకర్షితులయ్యారు. ఈ కాలంలో మౌలానా మహమ్మదాలీ, హకీం అజమల్ ఖాన్, హస్సాన్ హిమామ్, మౌలానా జఫర్ అలీఖాన్, మజహిర్ ఉల్ హక్‌ల  నాయకత్వంలో సమరశీల జాతీయవాద అహరార్ ఉద్యమం స్థాపించబడింది. వారు సాంప్రదాయవాద ఉలేమాల (పండితుల)లోని ఒక సెక్షన్ మద్దతుని – ప్రత్యేకించి దియోబండ్ ఆలోచనా విధానానికి చెందినవారి మద్దతు పొందారు. జాతీయోద్యంలోకి ఆకర్షితుడైన మరొక సాంప్రదాయ పండితుడు మౌలానా అబుల్ కలాం అజాద్. ఆయన కైరోలోని అల్‌హజర్ యూనివర్శిటీలో విద్యనార్జించాడు. 1912లో తన 24వ ఏట జాతీయవాద భావాలను తన 'ఆల్ హిలాల్' పత్రికద్వారా ప్రచారం చేశాడు. తీవ్రమైన పోరాటం తరువాత జాతీయవాద ముస్లిం యువకులు ముస్లింలీగులో ముందుకి రాగలిగారు. కాంగ్రెస్‌లో కూడా చురుకుగా పనిచేయసాగారు. స్వయం పరిపాలన తన లక్ష్యాలలో ఒకటిగా ఆమోదించిన ముస్లింలీగు 1912లో సూక్ష్మబుద్ధి, కాంగ్రెస్ నాయకుడు

అయిన యం.ఎ. జిన్నాని ముస్లింలీగులో చేరవలసిందిగా ఆహ్వానించింది. అదే సంవత్సరం ఆగాఖాన్ లీగు అధ్యక్షపదవికి రాజీనామా చేశాడు.

1912నుండి 1924వరకు లీగులోని బ్రిటిషు విధేయుల నధిగమించి యువ జాతీయవాదులు ముందుకి సాగారు. లీగు కూడా కాంగ్రెస్ విధానాలకు దగ్గరవడం ప్రారంభించింది. కాని దాని జాతీయవాదం లోపభూయిష్టమైనది; అంటే పూర్తి సెక్యులర్ స్వభావం గలదికాదు. బలమైన మతభావాలు గలది. అఖిల ముస్లిం ప్రపంచ ధోరణి గలది. అది ఆధునిక సామ్రాజ్యవాదం, ఆర్థిక, రాజకీయ పరిణామాల్ని అర్థం చేసుకొని, వ్యతిరేకించటానికి బదులుగా ఖలీపాకి పవిత్ర స్థలాలకు ప్రమాదకరంగా మారిందనే ప్రాతిపదికన పోరాడింది. మతపరమైన భావాల్ని కదిలించే విజ్ఞప్తులు చేసింది. కాని ఈ మతపరమైన వైఖరి వెంటనే జాతీయవాదంతో ఘర్షణ పడలేదు. సన్నిహితుల్ని సామ్రాజ్యవాద వ్యతిరేకులుగా మార్చింది. పట్టణ ముస్లింలలో జాతీయవాద ధోరణిని ప్రోత్సహించింది. అది రాజకీయ సమస్యల్ని మత దృక్పథంతో చూడటాన్ని ప్రోత్సహించింది. గనుక దీర్ఘకాలికంగా చూసినప్పుడు అది ప్రమాదకారి అని రుజువయింది.

* * *

వెనుకటి అధ్యాయంలో వివరించినట్లు కాంగ్రెస్‌లో వచ్చిన సానుకూల పరిణామాలు అలాగే ముస్లింలీగులో వచ్చిన పరిణామాలు రెండింటి మధ్య విస్తృతమైన రాజకీయ ఐక్యతకి దారితీశాయి. దీనిలో లోకమాన్య తిలక్, ఎం.ఎ.జిన్నా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. రెండు సంస్థలు 1916 చివరిలో లక్నోలో సదస్సులు జరిపాయి. లక్నో ఒప్పందంగా పేరుబడ్డ ఒప్పందంపై సంతకాలు చేశాయి. యుద్ధం తరువాత భారతదేశానికి స్వయంపరిపాలన కొరకు డిమాండ్‌తో సహా ఉమ్మడి రాజకీయ డిమాండ్లను ప్రభుత్వం ముందు వుంచాయి. ప్రత్యేక నియోజకవర్గాల్ని, చట్టసభల్లో మైనారిటీలకు రిజర్వేషన్లని, జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపుల్ని ఒప్పందం ఆమోదించింది. ఒప్పందం ఒక అడుగు ముందుకు వేసినట్లు భారత రాజకీయవాది యొక్క ఉత్సుకతని పెంచినప్పటికి ఒప్పందం ఒక అడుగు వెనక్కి కూడా వేసింది. కాంగ్రెస్ ప్రత్యేక నియోజకవర్గాల్ని ఆమోదించింది. మతతత్వరాజకీయాల్ని సూత్రరీత్యా అంగీకరించింది. అన్నిటిని మించి 'భారతదేశం వేర్వేరు ప్రయోజనాలుగల వివిధ సమూహాల్ని కలిగివుంది'– అనే అంచనాపై ఒప్పందం ఆధారపడి వుంది కాబట్టి భారత రాజకీయాలలో మతతత్వం పునరుజ్జీవం పొందడానికి మార్గాన్ని తెరచి వుంచింది.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళన, ఖిలాపత్, సహాయ నిరాకరణ– ఉద్యమాల కాలంలో అటు జాతీయవాద ఉద్యమం, యిటు హిందూ ముస్లిం ఐక్యత– రెండూ పెద్ద ముందడుగు వేశాయి. రాజకీయ కార్యకలాపాలలో హిందూ, ముస్లిం ఐక్యతని ప్రపంచానికి ప్రదర్శించటానికా అన్నట్లు తీవ్రమైన ఆర్య సమాజవాది అయిన స్వామి శ్రద్ధానందని ఢిల్లీలోని జుమ్మా మసీదు నుండి సందేశం యివ్వవలసిందిగా కోరారు; అమృతసర్‌లోని సిక్కుల పవిత్రస్థానమైన స్వర్ణదేవాలయపు తాళపుచెవుల్ని సిక్కులు డాక్టర్ సైఫుద్దీన్ కిచ్లూకి యిచ్చారు. 'హిందూ ముస్లిం ఐక్యత వర్ధిల్లాలి' నినాదం దేశమంతటా మారుమోగింది. భూస్వామ్య మతతత్వవాదులు, మాజీ ఉన్నతాధికారులు క్రమంగా ముస్లింలీగుకి దూరమయ్యారు. చాలామంది లీగు నాయకులు, కాంగ్రెస్ పాతతరం నాయకులు ప్రజా ఉద్యమ రాజకీయాల వేగాన్ని అందుకోలేకపోవడంతో లీగుపై ఖిలాఫత్ కమిటీ ఆధిపత్యం పెరిగింది. ఖిలాఫత్ మతపరమైన సమస్య అయినప్పటికీ ముస్లిం ప్రజానీకంలో– ముఖ్యంగా మధ్య తరగతులలో అది జాతీయవాద, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంచింది. అంతేగాక హిందువులకు మాత్రమే వర్తించే అస్పృశ్యతా వ్యతిరేక ఉద్యమాన్ని సిక్కులకు మాత్రమే వర్తించే అకాలీదళ్ సమస్య చేపట్టినట్లు ముస్లింలకు మాత్రమే వర్తించే సమస్యని జాతీయవాద ఉద్యమం చేపట్టడంలో తప్పులేదు.

కాని వీటిలో కొన్ని బలహీనతలు కూడా వున్నాయి. ముస్లింల మతపరమైన రాజకీయపరమైన చైతన్యాన్ని ఉన్నత దశయైన సెక్యులర్ రాజకీయ చైతన్యస్థాయికి పెంచడంలో జాతీయవాద నాయకత్వం ఒకమేరకు విఫలమయింది. ఉదాహరణకు ఖిలాఫత్ నాయకులు మతపరమైన ఆదేశాలు జారీ చేశారు; ఫట్వాలు జారీ చేశారు. ఫలితంగా సాధారణ ప్రజల మనస్సులపై పూజారుల పురాతన ఛాందసవాద భావాల పట్టు పెంచారు. రాజకీయ సమస్యల్ని మతపరమైన దృక్పథంతో చూసే అలవాటుని ప్రోత్సహించారు. అంతేగాక ముస్లిం ఐక్యతాభావాన్ని గురించి నొక్కిచెప్పడం ద్వారా భవిష్యత్‌లో మతతత్వ సిద్ధాంతం, మతతత్వ రాజకీయాలు పెరగడానికి అవకాశాలు కల్పించారు.

* * *

1922 ఫిబ్రవరిలో సహాయ నిరాకరణోద్యమం విరమించబడింది. ప్రజలు తమ భ్రమలు తొలగిపోయినట్లు భావించారు. నిరాశా నిస్పృహలకు గురయ్యారు. ద్వంద్వ

పరిపాలన అమలులోకి వచ్చింది. మతతత్వం తన వికృతమైన తల పైకెత్తింది. 1922 తరువాత సంవత్సరాలలో దేశం మాటిమాటికి మతఘర్షణల నిలయమయింది. ముస్లింలీగు చురుకుదనం పుంజుకొంది. జాతీయవాద భావాలు గలవారు లీగు నుండి నెట్టివేయబడ్డారు. పై వర్గాలకు చెందిన నాయకులు బాహాటమైన ప్రభుత్వవిధేయతతో మతతత్వ సిద్ధాంతంతో ముందుకి వచ్చారు. 1923లో హిందూ మహాసభ పునరుద్ధరించబడింది. ముస్లిం వ్యతిరేక భావాల ప్రచారంలో నిమగ్నమయింది. దాని ప్రకటిత లక్ష్యం: 'హిందూరాష్ట్ర అభివృద్ధి కొరకు హిందూ జాతి, హిందూ సంస్కృతి, హిందూ నాగరికత నిర్వహణ, రక్షణ, ప్రోత్సాహం'.

హిందూ ముస్లిం మతతత్వవాదులు హిందువులలోను, ముస్లింలలోను 'అణచివేయబడుతున్నాం, హింసించబడుతున్నాం, నిర్మూలించబడుతున్నాం' - లాంటి ప్రచారాలతో నిరంతరం వారి మనసుల్ని భయాందోళనలకు గురిచేశారు. ఈ కాలంలో మతపరమైన ఏకీకరణ కోసం, మత మార్పిడులకోసం హిందువులలో సంఘటన, శుద్ధి ఉద్యమాలు; ముస్లింలలో తంజీమ్, తాబ్లిగ్ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. జాతీయవాదులు మతభ్రష్టులుగాను, తమ మతానికి సహ మతస్థులకు శత్రువులుగాను దూషించబడ్డారు.

జాతీయవాదులలో చాలామంది మతపరమైన ఒత్తిడులకు దృఢంగా నిలబడ లేకపోయారు. మతతత్వం కారణంగా స్వరాజ్యవాదులు చీలిపోయారు. వారిలో ఒక గ్రూపు బాధ్యతాయుతవాదులు (responsivists) హిందువుల ప్రయోజనాల పరిరక్షణ కొరకు ప్రభుత్వంతో సహకరించడానికి సిద్ధపడ్డారు. లజపతిరాయ్, మదన్‌మోహన్ మాలవ్య, యన్.సి.కేల్కర్‌లు హిందూ మహాసభలో చేరారు. హిందువుల ఐక్యత కొరకు వాదనలు చేశారు. హిందూ మహాసభ సభ్యులు సెక్యులర్ కాంగ్రెస్ వాదులకు వ్యతిరేకంగా తీవ్రమైన ప్రచారం చేపట్టారు. మోతీలాల్ నెహ్రూ సరియైన సమయానికి హిందువులకు తోడ్పడని వ్యక్తియని, హిందూ వ్యతిరేకియని, ఇస్లాం అభిమానియని, గోవధని ప్రోత్సహించేవాడని, ఆవుమాంసం తినేవాడని నిందించారు. చాలామంది పాత ఖిలాఫత్ వాదులు కూడా మతతత్వవాదులుగా మారారు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, ముస్లిముల్ని అణచివేసి, హిందువుల ఆధిపత్యం సాధించయత్నిస్తున్నదని, మౌలానాలు మహమ్మదాలీ, షౌకత్‌ఆలీలు కాంగ్రెస్‌ని, హిందువుల్ని నిందించడం- ఈ కాలంలో జరిగిన నాటకీయ పరిణామాలు. 1923-24 కాలంలో

ఉత్తర భారతదేశంలోని పెద్ద నగరాలలో మత ఘర్షణలు చెలరేగాయి. సైమన్ కమిషన్ రిపోర్టుననుసరించి 1922-27కాలంలో దాదాపు 112 పెద్ద మత ఘర్షణలు జరిగాయి.

* * *

మతతత్వ రాజకీయశక్తుల్ని వ్యతిరేకించేందుకు జాతీయవాద నాయకత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేసింది. కాని సరియైన కార్యాచరణ పథకాన్ని రూపొందించలేకపోయింది. అది చేపట్టిన కార్యాచరణ ఏమిటి? ఎందుకు విఫలమయింది? మతతత్వ నాయకుల మధ్య చర్చల ద్వారా ఐక్యత సాధించడం దాని ప్రధానమైన ఎత్తుగడ. అంటే వివిధ మతతత్వ గ్రూపుల మధ్య కాంగ్రెస్ నాయకులు మధ్యవర్తులుగా వ్యవహరించారు; లేక చట్టసభల్లో సీట్ల రిజర్వేషన్, ప్రభుత్వ ఉద్యోగాల రక్షణ సమస్యలపై ముస్లిం మతతత్వ నాయకులతో ఒప్పందానికి వచ్చేందుకు ప్రయత్నించారు.

అలాంటి ప్రయత్నాలు 1928లో చేశారు. సైమన్ కమిషన్ విసిరిన సమస్యకి జవాబుగా మతతత్వ సమస్యల్ని పరిష్కరించి భారతదేశానికి ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని రూపొందించేందుకు రాజకీయ నాయకులు చాలా అఖిల భారత సదస్సులు నిర్వహించారు. ముస్లిం మతతత్వ నాయకులు పెద్దసంఖ్యలో 1927 డిసెంబర్‌లో ఢిల్లీలో సమావేశమై ఢిల్లీ ప్రతిపాదనల పేరుతో నాలుగు ప్రధానమైన డిమాండ్లను రూపొందించారు. నాలుగు డిమాండ్లు: 1) సింధు ప్రత్యేక రాష్ట్రం చేయబడాలి. 2) ఇతర రాష్ట్రాలతో సమానమైన స్థాయిలో రాజ్యాంగబద్ధంగా వాయవ్య సరిహద్దు రాష్ట్రాన్ని గుర్తించాలి. 3) కేంద్ర చట్టసభలో ముస్లింలకు 33 1/3 శాతం ప్రాతినిధ్యం కల్పించబడాలి. 4) పంజాబ్, బెంగాల్‌లలో ముస్లిం మెజారిటీకి గ్యారంటీ కల్పిస్తూ జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించబడాలి. ముస్లింలు మైనారిటీగా వున్న యితర రాష్ట్రాలలో ముస్లింలకు ప్రస్తుతం వున్న సీట్ల రిజర్వేషన్ కొనసాగించాలి.

కాంగ్రెస్ ప్రతిపాదనలు అన్ని పార్టీల కమిటీచే రూపొందించబడి నెహ్రూ రిపోర్టు పేరుతో ప్రకటించబడ్డాయి. రిపోర్టు ఆమోదం కొరకు 1928 డిసెంబర్ చివరిలో కలకత్తాలో జరిగిన అన్ని పార్టీల సదస్సు ముందుంచబడింది. ఇతర అంశాలతోపాటు నెహ్రూ రిపోనేకట రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన భారతదేశం సమాఖ్య రాజ్యంగా వుండాలని, ఎన్నికలు ఉమ్మడి నియోజకవర్గాల ప్రాతిపదికన మతపరమైన మైనారిటీలకు కేంద్ర, రాష్ట్ర చట్టసభలలో సీట్ల రిజర్వేషన్

వారి జనాభా నిష్పత్తిని బట్టి వుండాలని సిఫార్సు చేసింది. బొంబాయి నుండి సింధ్‌ని విడగొట్టాలని వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో రాజ్యాంగపరమైన సంస్కరణ చేపట్టాలని రిపోర్టు సిఫార్సు చేసింది.

రిపోర్టు కలకత్తా సదస్సు యొక్క ఏకగ్రీవామోదం పొందలేకపోయింది. ముస్లిం మతతత్వవాదులలో విస్తృతమైన భేదాభిప్రాయాలుండగా, యం.ఎ.జిన్నా ప్రతిపాదించిన మూడు సవరణలు ఆమోదింపబడితే రిపోర్టులోని ఉమ్మడి నియోజకవర్గాల్ని యింకా యితర ప్రతిపాదనల్ని లీగులోని ఒక సెక్షన్, ఖిలాఫత్‌వాదులు ఆమోదించటానికి సిద్ధపడ్డారు. వీటిలో రెండు ఢిల్లీ ప్రతిపాదనలలోని మూడవ, నాల్గవ ప్రతిపాదనలు, మొదటి రెండు డిమాండ్లు నెహ్రూ కమిటీ ఆమోదం పొందాయి. శేషాధికారాలు రాష్ట్రాలకు వుండాలనే మూడవ డిమాండ్ కొత్తది. మహమ్మద్ షఫీ ఆగాఖాన్ నాయకత్వంలో గల లీగులోని పెద్ద సెక్షన్, యింకా చాలా ముస్లిం గ్రూపులు ఈ సవరణల్ని తిరస్కరించాయి. ప్రత్యేక నియోజకవర్గాల్ని వదులుకోడానికి వారు యిష్టపడలేదు. సింధు, వాయవ్య సరిహద్దు రాష్ట్రం, బెంగాల్, పంజాబ్‌లకు సంబంధించిన రిపోర్టులోని భాగాలపై హిందూ మహాసభ, సిక్కులీగు తీవ్రమైన అభ్యంతరాలు తెలిపాయి. జిన్నా ప్రతిపాదనలు ప్రస్తావించిన బలహీనమైన కేంద్రాన్ని అంగీకరించేందుకు కాంగ్రెస్ నాయకులు యిష్టపడలేదు.

ముస్లిం మతతత్వవాదులతో చాలామంది చేతులు కలిపారు. జిన్నా వారి సరసన చేరాడు. నెహ్రూ రిపోర్టు హిందువుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుందని ప్రకటించిన జిన్నా వివిధ మతసంస్థలు వేర్వేరు సమయాలలో చేసిన డిమాండ్లను క్రోడీకరించి ఒక పత్రం రూపొందించాడు. దీనినే జిన్నా 14 అంశాల పథకం అంటారు. ఈ 14 అంశాలలో నాలుగు ఢిల్లీ ప్రతిపాదనలు, మూడు కలకత్తా సవరణలు, మిగిలినవి ప్రత్యేక నియోజకవర్గాల కొనసాగింపుకు, ప్రభుత్వ ఉద్యోగాలలో స్వయం పరిపాలనా సంస్థలలో సీట్ల రిజర్వేషన్‌కి సంబంధించినవి. ఆ తరువాత కాలంలో మతతత్వ ప్రచారానికి జిన్నా 14అంశాలు ప్రాతిపదిక అయ్యాయి.

హిందూ, ముస్లిం, సిక్కు మతతత్వవాదులతో ఒక ఒప్పందానికి రావడం ద్వారా మతతత్వ సమస్యను పరిష్కరించటానికి అవలంబించిన ఎత్తుగడ పూర్తిగా విఫలమయింది. ఎత్తుగడలో కొన్ని అంతర్గత బలహీనతలు వున్నాయి. అంతేగాక మతతత్వవాదులు వారివారి సమూహాలకు సంబంధించిన మతతత్వ ప్రయోజనాల ప్రతినిధులమని చెప్పుకొంటున్న హక్కుని కాంగ్రెస్ ఒకమేరకు మౌనంగా అంగీకరించినట్లయింది. మతతత్వ నాయకులతో

చర్చలు జరపడం ద్వారా కాంగ్రెస్ వారి రాజకీయాలకు న్యాయబద్ధత కల్పించింది. వారి రాజకీయాలకు గౌరవాన్ని తెచ్చిపెట్టింది. కాంగ్రెస్ మతతత్వ పార్టీలకు, వ్యక్తులకు వ్యతిరేకంగా కఠినమైన రాజకీయ సైద్ధాంతిక ప్రచారం కొనసాగించే హక్కుని, సంకల్పాన్ని బలహీనపరచుకొన్నది. ముస్లిం మతతత్వ నాయకులతో నిరంతర చర్చలు అజాద్, అన్సారి, అసిఫ్ ఆలి లాంటి సెక్యులర్, సామ్రాజ్యవాద వ్యతిరేక ముస్లిం నాయకుల యొక్క స్థానాన్ని బలహీనపరచింది. కాంగ్రెస్ నాయకులుగా వుంటూ మతవాదం పట్ల సానుకూల వైఖరితో వ్యవహరించిన మదనమోహన మాలవ్యా, లజపతిరాయ్, మౌలానా మహమ్మదాలీ లాంటి నాయకుల మతవాదాన్ని బహిర్గతపరచి వ్యతిరేకించటాన్ని కష్టతరం చేసింది.

పై స్థాయిలో చర్చలు జరిపితే మెజారిటీ మతతత్వం ఉద్యోగాలలో చట్టసభల సీట్లలో ఉదారమైన రాయితీలు మైనారిటీ మతతత్వానికి యివ్వవలసివస్తుంది. వలసపాలన కారణంగా అభివృద్ధి చెందని హిందూ మధ్య తరగతి వర్గాలలో మతతత్వం బలంగా వుంది. ముస్లిం మతతత్వవాదులకిచ్చే రాయితీలను హిందూ, సిక్కు మతతత్వవాదులచే ఆమోదింపజేయడం కాంగ్రెస్‌కి రాజకీయంగా కష్టసాధ్యమయింది. ఆ విధంగా ముస్లిం మతతత్వాన్ని సమాధానపరచడంలోని వైఫల్యం వారు బలం పుంజుకోడానికి సహాయపడింది. ఏమైనప్పటికీ ఉదారంతో, వివేకంతో, పెద్ద ప్రయత్నంతో మతతత్వ నాయకులతో రాజీకుదిరి వుండినట్లయితే అది లక్నో ఒప్పందంలాగా లేక ఒక మేరకు నెహ్రూ రిపోర్టులాగా తాత్కాలికమని నిరూపితమై వుండేది. ఏ ఒక్క మతతత్వ పార్టీగానీ లేక గ్రూపుగాని లేక నాయకుడుగాని యితర మతతత్వ గ్రూపులతోగాని వ్యక్తులతోగాని శాశ్వతమైన ఒప్పందంపై సంతకం చేసే స్థితిలో లేదు. రాయితీలు మతతత్వం యొక్క ఆకలిని పెంచాయి. ఒక గ్రూపుని బుజ్జగించగానే మతతత్వ డిమాండ్లతో మరొక గ్రూపు లేక నాయకుడు ముందుకి వచ్చాడు. ఫలితంగా తరచుగా కొంత హేతుబద్ధమైన గ్రూపు లేక నాయకుడు అనుచరులపై తన మతపరమైన పట్టు సడలిపోతున్నట్లు భావించాడు. గతంలో చేసుకొన్న పాక్షిక లేక పూర్తి ఒప్పందం నుండి వెనక్కిపోవడం అవసరంగా భావించాడు. 1928-29కాలంలో యిది మాటిమాటికి జరిగింది. అందుకు జిన్నా ఉదాహరణగా నిలుస్తాడు. మతతత్వ సిద్ధాంతం అభివృద్ధి చెందుతున్నంతకాలం లేక మతతత్వ రాజకీయాలకు అనుకూలమైన సామాజిక రాజకీయ పరిస్థితులు కొనసాగుతున్నంత కాలం మతతత్వ నాయకుల్ని శాశ్వతంగా గాని లేక నిర్దిష్ట కాలపరిమితి వరకు బుజ్జగించడం గాని లేక సమాధానపరచడం గాని చాలా కష్టం.

మతతత్వాన్ని అన్ని రంగాలలో సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాలలో ఎదిరించి తీవ్రంగా పోరాడడం సమస్యని పరిష్కరిస్తుంది. దాని సిద్ధాంతం, దాని సామాజిక సైద్ధాంతిక వనరులు, మూలాలు, దాని సామాజిక పునాది, హిందూ ముస్లిం ఐక్యతకై చేపట్టిన జాతీయవాద కార్యక్రమంలో దాని పెరుగుదలకు కారణాల గురించి శాస్త్రీయమైన అవగాహన ఆధారం చేసుకొని మతతత్వానికి, మతతత్వ రాజకీయశక్తులకు వ్యతిరేకంగా తీవ్రమైన రాజకీయ సైద్ధాంతిక పోరాటం చేపట్టాలి. అంతేగాక రైతుల వర్గపోరాటం, మతపరమైన దారుల్లోకి మళ్ళించబడినప్పుడు రైతాంగ సమస్యలపై పోరాటం చేపట్టాలి. దాదాభాయ్ నౌరోజి నుండి గాంధీ, నెహ్రూ వరకు జాతీయవాద నాయకత్వంలోని అత్యధిక భాగం సెక్యులరిజానికి దృఢంగా కట్టుబడివున్నప్పటికీ అలాంటి పోరాటాలు చేపట్టడం జరగలేదు. మతతత్వవాదులతో చర్చ ఆవేశకావేషాలతో వివక్షతతోగాక హేతుబద్ధమైన, శాస్త్రీయ పునాదులపై నిక్కచ్చిగా విశ్లేషణాత్మకమైన మార్గంలో జరపాలి. జాతీయవాద వేదికయొక్క మూడు ప్రధానమైన అంశాలలో హిందూ, ముస్లిం ఐక్యత ఒకటి. చాలా క్లిష్టమైన సమయాలలో హిందూ మతతత్వవాదుల్ని బుజ్జగించేందుకు గాంధీజీ, కాంగ్రెస్ నిరాకరించారు. గాంధీజీ చాలాసార్లు సెక్యులరిజం కొరకు తన ప్రాణాల్ని ఫణంగా పెట్టారు. కాని గాంధీగాని, కాంగ్రెస్‌గాని మతతత్వంపై లోతైన విశ్లేషణని సమకూర్చలేదు.

* * *

1920లలో మతతత్వపార్టీలు, గ్రూపులు తమ కార్యకలాపాల్ని తీవ్రతరం చేసినప్పటికీ మతతత్వం భారతీయ సమాజంలో విస్తృతంగా వ్యాపించలేదు. మత ఘర్షణలు ప్రధానంగా నగరాలకే పరిమితమయ్యాయి. దేశం యొక్క విస్తీర్ణం గమనంలో పెట్టుకొన్నప్పుడు మతఘర్షణల సంఖ్య అంత ఎక్కువేంగాదు. హిందూ మతతత్వానికి ప్రజల నుండి మద్దతు అంతగా లభించలేదు. ముస్లిం మతతత్వం యొక్క సామాజిక పునాది కూడా చాలా పరిమితమైనది మాత్రమే. కాంగ్రెస్‌లో భాగంగా వున్న జాతీయవాద ముస్లింలు యింకా పెద్ద రాజకీయశక్తికి ప్రతినిధులుగా

వున్నారు. అభివృద్ధి చెందుతున్న ట్రేడ్ యూనియన్, రైతాంగ యువజన ఉద్యమాలు పూర్తిగా సెక్యులర్ స్వభావం గలవి. సైమన్ కమిషన్‌కి వచ్చిన స్పందన మతతత్వశక్తుల బలహీనతల్ని బహిర్గతం చేసింది. సైమన్ కమిషన్‌ని బహిష్కరించాలని కొందరు, సహకరించాలని కొందరు కోరడంతో హిందూ మహాసభ, ముస్లిం లీగు - రెండింటిలోనూ చీలికలు వచ్చాయి.

సైమన్ కమిషన్ వ్యతిరేక నిరసనోద్యమం, 1930 నుండి 1934వరకు సాగిన రెండవ సహాయ నిరాకరణోద్యమం- దేశాన్ని ఊపివేశాయి. మతతత్వవాదుల్ని మొత్తంగా తెరవెనక్కి నెట్టివేశాయి. కాంగ్రెస్, జమాయిత్-ఉల్-ఉలామా- హింద్, ఖుదాయ్ ఖిట్మట్గార్ల నాయకత్వంలో వేలాది ముస్లిములు జైళ్ళకెళ్ళారు. జాతీయోద్యమం మొదటిసారిగా ముస్లింలు మెజారిటీగా గల రెండు పెద్ద ప్రాంతాల్ని - వాయవ్య సరిహద్దు రాష్ట్రం, కాశ్మీర్‌లను ముంచెత్తింది.

1930ల నాటి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌ల కాలంలో మతతత్వవాద నాయకులు తెరపైకి రావడానికి అవకాశం లభించింది. ఈ కాన్ఫరెన్స్‌లలో బ్రిటిషు పాలకవర్గాలలోని అత్యంత అభివృద్ధి నిరోధక సెక్షన్లతో మతతత్వవాదులు చేతులు కలిపారు. హిందూ, ముస్లిం మతతత్వవాదులు వారి మతపరమైన ప్రయోజనాలనబడేవి సాధించుకొనడానికి బ్రిటిషు పాలకుల మద్దతు కొరకు ప్రయత్నాలు చేశారు. 1932లో హౌస్ ఆఫ్ కామన్స్ మీటింగ్‌లో ఆగాఖాన్, కవి మహమ్మద్ ఇక్బాల్, చరిత్రకారుడు షాఫత్ అహమ్మద్‌ఖాన్ హిందూ, ముస్లిముల సామాజిక, రాజకీయ ప్రయోజనాల మధ్య ఐక్యత సాధించడం అసాధ్యమని, భారతదేశాన్ని బ్రిటిషు ఏజెంట్లుగాక మరొకరు పాలించడం అసాధ్యమని నొక్కి చెప్పారు. అలాగే 1933లో హిందూ మహాసభకి అధ్యక్షత వహించిన భాయ్ పరమానంద్ బ్రిటిష్ ప్రభుత్వం హిందువుల మధ్య సహకారం కొరకు విజ్ఞప్తి చేస్తూ యిలా అన్నారు. "నూతన భారతదేశం యొక్క రాజకీయ సంస్థలలో ప్రధానమైన జాతిగా హిందువుల స్థాయి, బాధ్యతాయుతమైన స్థానం గుర్తించబడితే హిందువులు మనస్ఫూర్తిగా బ్రిటన్‌తో సహకరిస్తారని నా అంతరాత్మ చెపుతుంది."

మతతత్వ పార్టీలు, గ్రూపులు 1937 వరకు చాలా పరిమితంగా, బలహీనంగా వున్నాయి. కాని 1930 దశాబ్దపు తొలి సంవత్సరాలలో అత్యధిక హిందూ, ముస్లిం యువ మేధావులు, కార్మికులు, రైతులు, జాతీయవాదం, సోషలిజం ప్రధాన స్రవంతులలో కలిసిపోయారు. బెంగాల్‌లో సెక్యులర్ కృషిక్ ప్రజాపార్టీలో చేరారు. కాని 1932లో ముస్లిం మతతత్వానికి చేయూతనిచ్చి పైకిలాగే ప్రయత్నంలో భాగంగా బ్రిటిషు ప్రభుత్వం 1927నాటి ఢిల్లీ ప్రతిపాదనల్ని, 1929నాటి జిన్నా 14 అంశాల్ని – మొత్తంగా అంగీకరించి కమ్యూనల్ అవార్డుని ప్రకటించింది. మతతత్వశక్తులు కొత్త పరిస్థితిని ఎదుర్కొన్నాయి. గతంలో లాగా ముందుకి సాగలేవు. ఇక్కడ నుండి ఎటుపోవాలి?

* * *

# 33 జిన్నా, గోల్వాల్కర్ - తీవ్ర మతతత్వవాదం

మతతత్వం 1937 వరకు ఉదారవాద దశలో వుండిపోయింది. ఆ తరువాత తీవ్రవాద దశ లేక ఫాసిస్టు రూపం దాల్చడం ప్రారంభమయింది. భారతదేశం విభిన్నమైన మత ప్రాతిపదికగల సమూహాలు కలిగివుందని, ఆ సమూహాలు వేర్వేరు ప్రత్యేకమైన ప్రయోజనాలు కలిగివున్నాయని, వాటి మధ్య తరచుగా ఘర్షణలు చెలరేగాయని ఉదారవాద మతతత్వవాది వాదించాడు. కాని వివిధ సమూహాలు ఒక జాతిగా కలిసిపోవడం భారత రాజకీయాల తుదిగమ్యం అని అతడు అంగీకరించాడు. ఆ విధంగా ఉదార మతతత్వవాది విస్తృతమైన భారతజాతిగా రూపొందే క్రమంలో భాగంగా ప్రత్యేకమైన, మతపరమైన హక్కులు, రక్షణలు రిజర్వేషన్లు లాంటివి డిమాండు చేశాడు. అతడు హిందువుల, ముస్లింల, క్రైస్తవుల ఉమ్మడి ప్రయోజనాల భావనని, అలాగే జాతీయైక్యతని తుది లక్ష్యంగా అంగీకరించాడు. ఉదారమతతత్వం యొక్క సామాజిక పునాది పరిమితమైనది. రాజకీయంగా ప్రధానంగా వున్నత మధ్య తరగతులపై ఆధారపడింది. తీవ్ర మతతత్వవాదం భయం, ద్వేషం, హేతురాహిత్యం ప్రాతిపదికగా గల రాజకీయాలపై ఆధారపడుతుంది.

మతతత్వ ప్రచారంలో ఎప్పుడూ ఆధిపత్యం అణచివేత ఉద్దేశాలు వుంటాయి. హిందువుల, ముస్లిముల ప్రయోజనాలు నిరంతరం ఘర్షణ పడుతుంటాయని యితర మతస్థులపై ద్వేషం ప్రచారం చేయబడుతుంది. మతతత్వవాద ఫాసిస్టు దశలో 1937

తరువాత మతతత్వవాదులు యితర మతాలకు చెందిన వారిపై డబ్ల్యు.సి.స్మిత్ మాటల్లో చెప్పాలంటే 'భయం, ధిక్కారం, తీవ్రమైన ద్వేషం'తో దాడులు చేశారు. పీడన, అణచివేత, ఆధిక్యత, అణగదొక్కబడుట, భౌతికంగా నిర్మూలన, వినాశనం లాంటి పదాలు ఉపయోగించబడ్డాయి. మతతత్వవాదులు 'పెద్ద అబద్ధం- పెద్ద ప్రయోజనం' సూత్రంతో పనిచేశారు. వారు జాతీయ కాంగ్రెస్‌పై, గాంధీజీపై విషం గ్రక్కారు. జాతీయవాదులలోని స్వమతస్థులపై దుర్మార్గమైన దాడులు చేశారు.

1937 తరువాత మతతత్వం ప్రజాపునాదిని గడించింది. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం ప్రారంభించింది. పట్టణ దిగువ, మధ్య తరగతులలో మతతత్వ రాజకీయాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించదలచింది. అందుకు ప్రజల ఆవేశాన్ని రెచ్చగొట్టగల నినాదం అవసరమయింది. మతతత్వం యొక్క అభివృద్ధి నిరోధక పై వర్గాల పునాది కారణంగా సామాజిక సమస్యల కొరకు విజ్ఞప్తి చేయడం సాధ్యపడలేదు. మరో విధంగా చెప్పాలంటే మతతత్వం సామాజిక, ఆర్థిక లేక రాజకీయ లేక సైద్ధాంతిక సమస్యలపై పనిచేయలేదు. కాబట్టి అనివార్యంగా హేతురాహిత్యంగా భయం, ద్వేషాల్ని రెచ్చగొట్టే మతాన్ని ఆశ్రయించింది.

చాలా కారణాల రీత్యా ఉదార మతతత్వవాదం తీవ్రమైన మతతత్వవాదంగా మార్పుజెందించబడింది. జాతీయవాదం పెరుగుదల కారణంగాను, ప్రత్యేకించి 1930-34 సహాయ నిరాకరణోద్యమం కారణంగాను 1937 ఎన్నికలలో కాంగ్రెస్ ప్రధానమైన రాజకీయశక్తిగా ముందుకి వచ్చింది. భూస్వాముల యితర స్వప్రయోజనాపరులకు చెందిన వివిధ రాజకీయ పార్టీలు బాగా దెబ్బతిన్నాయి. అంతేగాక యువకులు, కార్మికులు, రైతులు అధికాధికంగా వామపక్షాలవైపు మళ్ళారు. జాతీయవాద ఉద్యమం మొత్తంగా దాని ఆర్థిక, రాజకీయ కార్యక్రమాలు విధానాలలో అంతకంతకూ సమూలమైన మార్పులకు గురయింది. జాతీయోద్యమ రాజకీయాలతో భూస్వాముల రక్షణ యిక ఎంతమాత్రం సాధ్యపడదని గ్రహించిన జమిందారులు, భూస్వాములు వారి వర్గ ప్రయోజనాల రక్షణ కొరకు మతతత్వాన్ని ఆశ్రయించారు. యు.పి., బీహార్‌లలోనేగాక పంజాబ్, బెంగాల్‌లలో కూడా యిదే పరిస్థితి. ఉదాహరణకు పంజాబ్‌లో పశ్చిమ పంజాబ్‌కి చెందిన పెద్ద భూస్వాములు ఉన్నతోద్యోగులు, ప్రభుత్వానికి విధేయతగా వున్న కులం, మతం మద్దతుగల

యూనియనిస్టు పార్టీని బలపరిచారు. కాని యూనియనిస్టు పార్టీ ప్రాంతీయపార్టీ గనుక అది కాంగ్రెస్ నుండి తమని రక్షించజాలదని, అందువలన 1937-45కాలంలో తమ ప్రయోజనాల రక్షణకు దృఢంగా నిలబడతానని వాగ్దానం చేసిన ముస్లింలీగుకి మద్దతు యివ్వడానికి  సిద్ధపడ్డారు. బెంగాల్‌లోని ముస్లిం జమిందారులు, జోతేదారులు అదేదారి పట్టారు. ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని హిందూ జమిందారులు, భూస్వాములు, వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు కూడా హిందూ మతతత్వ పార్టీలు, గ్రూపుల వైపు మారడం ప్రారంభమయింది. వారిని ఆకర్షించేందుకు హిందూ మహాసభ అధ్యక్షుడు డి.వి.సావర్కర్ భూస్వాములు, కౌలుదారుల మధ్యగల వర్గపోరాటాన్ని ఖండించడం ప్రారంభించాడు. అలాగే పంజాబ్‌లో వడ్డీ వ్యాపారుల, యితర వర్తకుల ప్రయోజనాల రక్షణ కొరకు హిందూ మతతత్వవాదులు గతంలోకంటే చురుకుగా పనిచేయడం ప్రారంభించారు.

1937 తరువాత వలస పాలకుల విభజించి పాలించే విధానానికి ఒకే ఒక రాజకీయ ఆలంబనం మతతత్వం అయింది. అప్పటికే బ్రిటిషుపాలకులు పెంచి పోషించిన విభజనల్ని, వైరుధ్యాల్ని జాతీయోద్యమం అధిగమించింది. మహారాష్ట్రలోను, దక్షిణ భారతదేశంలోను బ్రాహ్మణేతర సమస్య పాలకులు ఆశించిన ప్రయోజనాన్ని సాధించలేకపోయింది. కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా షెడ్యుల్డు కులాల్ని, వెనుకబడిన కులాల్ని సమీకరించడం యిక ఏమాత్రం సాధ్యపడలేదు. కాంగ్రెస్‌లోని అతివాదులు, మితవాదులు ఐక్యమయ్యారు. కాంగ్రెస్ భాషా రాష్ట్రాల యొక్క, భారత ప్రజల సాంస్కృతిక వైవిధ్యం యొక్క ఆవశ్యకతని అంగీకరించిన తరువాత రాష్ట్రాల మధ్య, భాషల మధ్య గల వైషమ్యాలు అంతరించాయి. జాతీయోద్యమానికి వ్యతిరేకంగా జమిందారుల్ని, భూస్వాముల్ని నిలబెట్టే ప్రయత్నం కూడా పూర్తిగా విఫలమయింది. వలసవాదం ప్రోత్సహించిన అన్ని పెద్ద సామాజిక, రాజకీయ గ్రూపులు చెల్లా చెదురయ్యాయని 1937 ఎన్నికలు స్పష్టం చేశాయి. జాతీయోద్యమానికి వ్యతిరేకంగా ఆడే ఆటలో వలసవాదానికి ఒక మతతత్వం కార్డు మాత్రమే మిగిలింది. సర్వస్వం ఒడ్డి దానిని ప్రయోగించాలని వలసపాలకులు నిర్ణయించారు. వలసవాద వ్యతిరేకతని స్పష్టంగా వ్యక్తంజేస్తూ స్వతంత్రంగా వ్యవహరించే యం.ఎ.జిన్నా అంటే అయిష్టత, బెరుకు వున్నప్పటికీ వలసవాద రాజ్యం యొక్క సత్తాని జిన్నా వెనుక మోహరించారు.

1939 సెప్టెంబరు 1న ప్రారంభమైన రెండవ ప్రపంచ యుద్ధం మతతత్వంపై ఆధారపడడానికి మరింత ఊతమిచ్చింది. కాంగ్రెస్ మంత్రివర్గాలచేత రాజీనామా చేయించింది. యుద్ధానంతరం భారతదేశానికి పూర్తి స్వతంత్రం యిచ్చి, ప్రభుత్వాధికారాన్ని భారతీయులకు అప్పజెపుతామని బ్రిటన్ ప్రకటించాలని డిమాండ్ చేసింది. ప్రజాభిప్రాయాన్ని విభజించేందుకు బ్రిటిషు ప్రభుత్వం ముస్లింలీగుపై ఆధారపడింది. జాతీయవాదుల డిమాండ్లకు వ్యతిరేకంగా ముస్లింలీగు డిమాండ్లను ముందుకు తెచ్చింది. ముస్లింలీగుని ముస్లిం ప్రజల ప్రతినిధిగా గుర్తించింది. రాజకీయపరమైన ఎలాంటి నిర్ణయాన్నైనా వీటో చేసే అధికారం కట్టబెట్టింది. హిందువులు, ముస్లిములు ఐక్యంకానంతవరకు భారతదేశానికి స్వతంత్రం యివ్వడం సాధ్యపడదన్నది. ముస్లిం మతతత్వానికి ప్రభుత్వం పూర్తి మద్దతుయిచ్చి ఐక్యతని అసాధ్యం చేసింది. ముస్లింలీగు వలసపాలకులకు సహకరించడానికి అంగీకరించింది. తన స్వంత కారణాల రీత్యా వారి చేతుల్లో రాజకీయ పనిముట్టుగా పనిచేసేందుకు అంగీకరించింది. హిందూ మహాసభ యింకా యితర హిందూ, సిక్కు మతసంస్థలు కూడా వలసపాలకులకు మద్దతు యిచ్చేందుకు ముందుకు వచ్చాయి. కాని వలసపాలకులు వారి మద్దతుని అంగీకరిస్తూనే ముస్లిం మతతత్వం పట్ల పాలకుల నిబద్దత యుద్ధకాలంలోనూ, ఆ తరువాత కూడా కొనసాగింది.

కాని ముస్లింలీగు, హిందూ మహాసభ– రెండూ కూడా 1937 ఎన్నికల ప్రచారాన్ని ఉదార మతతత్వవాద పద్ధతిలో సాగించాయి. వారివారి ఎన్నికల ప్రణాళికలలో వ్యవసాయ సమస్యల్ని మినహాయించి చాలావరకు జాతీయవాద కార్యక్రమాన్ని కాంగ్రెస్ విధానాలలో చాలా అంశాల్ని చొప్పించాయి. కాని ఎన్నికలలో రెండూ ఘోరంగా విఫలమయ్యాయి. ఉదాహరణకు ముస్లింలీగు ప్రత్యేక నియోజకవర్గాల క్రింద ముస్లింలకు కేటాయించబడిన 482 నియోజకవర్గాలలో మొత్తం ముస్లిం ఓట్లలో 4.8శాతం మాత్రమే పొంది, కేవలం 109 సీట్లు మాత్రమే గెలిచింది. హిందూ మహాసభ పరిస్థితి అంతకంటే అధ్వానంగా వుంది.

మతతత్వవాదులు తాము సమరశీలమైన ప్రజాపునాది గల రాజకీయాలు చేపట్టకపోతే క్రమంగా క్షీణించిపోతామని గుర్తించారు. అప్పటివరకు సంఘటిత ప్రజా

ఉద్యమాలు, కార్యకర్తల పునాదిగల రాజకీయాలు యథాతథవాద వ్యతిరేకులైన జాతీయవాదులచే నిర్మించబడ్డాయి. మతతత్వవాదులు ప్రజా ఉద్యమాలకు దూరంగా వుండిపోయారు. 1930లలో స్వప్రయోజనాపరుల్ని భయపెట్టని ప్రజా రాజకీయాల నమూనా ఫాసిస్టు ఉద్యమరూపంలో లభ్యమయింది. హిందూ ముస్లిం మతతత్వవాదులు ఈ నమూనాని అనుసరించాలని నిర్ణయించారు. అంతేగాక కాంగ్రెస్‌కి సాధారణ ప్రజల్లో – ప్రత్యేకించి ముస్లిం ప్రజానీకంలో గట్టి పునాదులు ఏర్పడలేదు. కాంగ్రెస్ రాజకీయ అపరిపక్వతని అవకాశంగా తీసుకొనడానికి సమయం మించిపోలేదు. కాని జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ముస్లిం ప్రజా సంబంధాల కార్యక్రమం పేరుతో ముస్లిం ప్రజలలో కలిసి పనిచేసే ప్రజాకార్యక్రమం ప్రారంభించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దీనితో ముస్లింలలో తమ పట్టుని పెంచుకొనేందుకు ముస్లిం మతతత్వవాదులు మతతత్వ తీవ్రతని పెంచారు.

మతతత్వవాదం యొక్క తర్కం అనివార్యంగా తీవ్ర మతతత్వవాదానికి దారితీసింది. 1920 దశాబ్దం చివరిలో కాంగ్రెస్, ముస్లిం మతతత్వ డిమాండ్లను చాలావరకు అంగీకరించింది. 1932లో కమ్యూనల్ అవార్డు, ఆ తరువాత 1935 భారత ప్రభుత్వం చట్టం – ఉదార మతతత్వ డిమాండ్లనన్నింటినీ అంగీకరించాయి. మతతత్వవాదులకు యిచ్చిన ఈ రాయితీలను కాంగ్రెస్ వ్యతిరేకించలేదు. కాని రాజకీయరంగం నుండి విదేశీపాలకులు అదృశ్యమై దేశం ప్రజాస్వామ్య పాలన క్రిందికి వస్తే రాయితీలన్నీ అలాగే కొనసాగుతాయనే హామీ ఏమీ లేదు. ఒకవేళ అలాంటి హామీ వున్నప్పటికీ ఆ తరువాత మతతత్వవాదులు ఏంచేయాలి? వారి డిమాండ్లన్నీ అంగీకరింపబడ్డాయి గనుక వారి రాజకీయ సంస్థలన్నింటినీ రద్దు చేసుకోవాలి. మతతత్వాన్ని విడనాడాలి; లేదా కొత్త డిమాండ్లను కనుక్కోవాలి. కొత్త భయాల్ని వెతుక్కోవాలి. అవసరం లేకపోయినా అనివార్యంగా తీవ్ర మతతత్వవాదం చేపట్టి కొత్తపథకం రూపొందించుకోవాలి. అలాగే హిందూ మతతత్వవాదులు పెరగడంలో విఫలమయ్యారు. అంతేగాక 1937వరకు కాంగ్రెస్, హిందూ, ముస్లిం ఉదార మతతత్వవాదుల్ని కాంగ్రెస్ సంస్థలో వుండి పనిచేయటాన్ని అనుమతించింది. జవహర్‌లాల్ నెహ్రూ, వామపక్షాల ఒత్తిడితో కాంగ్రెస్ మతతత్వవాదుల్ని ఎదుర్కొంటూ వచ్చింది. 1934, 1937 ఎన్నికలలో వారికి స్థానం కల్పించకపోవడమేగాక కాంగ్రెస్ నుండి

బహిష్కరించే దిశగా ముందుకు సాగింది. 1938లో బహిష్కరించింది. హిందూ మతతత్వవాదులు రాజకీయ వినాశనాన్ని ఎదుర్కొన్నారు. కాబట్టి వారు వారి మనుగడకు, అభివృద్ధికి కొత్త ఆధారాన్ని, కొత్త కార్యక్రమాన్ని వెతుక్కొనడం అనివార్యమయింది.

'మతతత్వవాదానికి దాని తర్కం దానికి వుంటుంది. తొలి దశలలో అదుపుచేయబడకపోతే అది తరువాతి దశలకు ఎదుగుతోంది' – అనే వాస్తవాన్ని జిన్నా జీవితచరిత్ర తేటతెల్లం జేస్తుంది. 'మతతత్వవాదం ఒక వాలుబల్ల. సరియైన చర్యలు తీసుకొనకపోతే దాని నుండి జారడం అనివార్యమని కూడా జిన్నా చరిత్ర చెపుతుంది. మతతత్వ సిద్ధాంతం యొక్క ప్రాథమిక అంశాల్ని ఒకసారి అంగీకరించడం జరిగితే వ్యక్తి యొక్క స్వతంత్ర ఆలోచనలతో సంబంధంలేకుండా అది కొంచెంకొంచెంగా అతడ్ని తన అధీనంలోకి తెచ్చుకొంటుంది. హిందూ, ముస్లిం ఐక్యతా రాయబారిగా రాజకీయ జీవితం ప్రారంభించిన వ్యక్తి చివరలో పాకిస్తాన్ డిమాండ్ చేశాడు.

యం.ఎ.జిన్నా బారిష్టరు పూర్తిచేసి సెక్యులర్ జాతీయవాదిగా, దాదాభాయ్ నౌరోజి అనుచరుడిగా 1906లో భారతదేశానికి తిరిగివచ్చాడు. ఆయన రాగానే కాంగ్రెస్‌లో చేరాడు. 1906 కలకత్తా కాంగ్రెస్ సదస్సులో దాదాభాయ్ కార్యదర్శిగా పనిచేశాడు. అప్పుడు స్థాపించబడిన ముస్లింలీగుకి ఆయన వ్యతిరేకి. మొట్టమొదటి ముస్లింలీగు అధ్యక్షుడు ఆగాఖాన్ యిలా వ్రాశాడు. "1906లో జిన్నా మాకు తీవ్రమైన ప్రత్యర్థి. నేను, నా స్నేహితులు చేసిన, చేయ ప్రయత్నిస్తున్న వాటిని అతడు తీవ్రంగా వ్యతిరేకించాడు. ప్రత్యేక నియోజకవర్గాలు జాతిని విభజిస్తున్నాయన్నాడు." అప్పటి హిందూ ముస్లిం ఐక్యత రాయబారిగా పనిచేస్తున్న సరోజినీ నాయుడుని అనుసరించి 1906 నుండి జిన్నా జాతీయైక్యతకు ప్రచారం యిచ్చాడు.

మతతత్వం వైపు మొదటి అడుగు – జిన్నా ప్రత్యేక నియోజకవర్గాల విధానం క్రింద బొంబాయి నుండి ముస్లిం సభ్యుడిగా సెంట్రల్ అసెంబ్లీకి ఎన్నికైన తరువాత అలా వేయాలని ఆకాంక్షలేకుండా – బహుశా తన యిష్టానికి భిన్నంగా వేశాడు. స్వచ్ఛమైన జాతీయవాదిగా వున్న జిన్నా 1913లో ముస్లింలీగులో చేరి మతతత్వ జాతీయవాదిగా మారడంతో అతడి దిగజారుడుతనం ప్రారంభమయింది. అప్పటికీ అతడు ప్రధానంగా జాతీయవాదిగానే వున్నాడు. కాంగ్రెస్‌లోనే వున్నాడు. ప్రత్యేక నియోజకవర్గాలు భారతదేశాన్ని

కలపడానికి వీలుపడని భాగాలుగా విడగొడతాయని వాదిస్తూ ప్రత్యేక నియోజకవర్గాల్ని వ్యతిరేకించాడు. కాని అదే సమయంలో మొత్తం ముస్లిం ప్రజల ప్రతినిధి పాత్ర కూడా నిర్వహించాడు. తిలక్‌తో కలిసి లక్నో కాంగ్రెస్– లీగు ఒప్పందానికి రూపకల్పన చేసేవరకు ఈ ద్విపాత్రాభినయం కొనసాగించాడు. ముస్లిం మతతత్వ ప్రతినిధిగా కాంగ్రెస్‌చేత ప్రత్యేక నియోజకవర్గాల్ని, మతపరమైన రిజర్వేషన్ల విధానాన్ని ఆమోదింపచేశాడు. అప్పటివరకు జాతీయవాద సెక్యులర్ రాజకీయాల పట్ల నిబద్ధత కలిగివున్నాడు. రౌలట్ బిల్లు ఆమోదాన్ని నిరసిస్తూ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. భారతదేశంలో స్వయంపరిపాలన హిందూ పాలనకి దారితీస్తుందనే మతతత్వ అంచనాని తిరస్కరించాడు. హోంరూల్ లేక అధికారవర్గం నుండి ప్రజాస్వామ్యానికి అధికారాన్ని మార్పిడిచేయడం భారతదేశంలోని నిజమైన సమస్య అని వాదించాడు.

1919–20లో కాంగ్రెస్ అప్పటి చట్టాల్ని శాంతియుతంగా అతిక్రమించడంపై ఆధారపడిన ప్రజా రాజకీయాల్ని చేపట్టింది. జిన్నా విభేదించాడు. గాంధీజీతో కలిసి పనిచేయడం సాధ్యపడదనుకొన్నాడు. సురేంద్రనాథ బెనర్జీ, బిపిన్ చంద్రపాల్, తేజ్ బహద్దూర్ సప్రూ, సి.శంకర్‌నాయర్ – యింకా పలువురు తనలాగా ఆలోచించే ఉదారవాదులతో కలిసి జిన్నా కాంగ్రెస్‌ని వదిలివెళ్లారు. కాని కేవలం ఉదారవాద రాజకీయాలకు భవిష్యత్ లేదని గ్రహించాడు. రాజకీయంగా అజ్ఞాతవాసంలోకి వెళ్ళడం అతడి అభిమతంకాదు. చాలామంది ఉదారవాదుల్లాగాక అతడు మతతత్వ రాజకీయాలవైపు మళ్ళాడు. ఉదార మతతత్వవాది అయ్యాడు. మతతత్వవాద తర్కం పనిచేసింది. మొదటి జాతీయవాదియైన జిన్నాని మతపరమైన జాతీయవాదిగాను, ఆ తరువాత ఉదార మతతత్వవాదిగాను మార్చింది.

1920లలో జిన్నా జాతీయవాదాన్ని మతతత్వం పూర్తిగా కబళించలేదు. 1924లో శిథిలావస్థలోవున్న ముస్లింలీగు పునరుద్ధరణ చేపట్టాడు. ముస్లింల ప్రయోజనాలు, ముస్లింల హక్కుల రక్షణ డిమాండ్లనాధారం చేసుకొని నిర్మాణం ప్రారంభించాడు. 'ముస్లింలు తమంతట తాము సంఘటితపడాలి. ఐక్యతగా వుండాలి. వారి సమాజ రక్షణకొరకు ప్రతి హేతుబద్ధమైన అంశంపై ఒత్తిడి చేయాలి'. ఆ సమయంలో బ్రిటిషువారితో సమైక్యంగా పోరాడేందుకు లక్నో ఒప్పందం ప్రాతిపదికన హిందూ ముస్లిం ఐక్యత కొరకు విజ్ఞప్తి

చేశాడు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ప్రభుత్వ విధానాల్ని, చర్యల్ని వ్యతిరేకించేందుకు స్వరాజ్యవాదులకు సహకరించాడు. 1925లో తాను ముందుగా ముస్లింనని చెప్పుకొన్న యువకునితో జిన్నా "అబ్బాయ్ నీవు ముందుగా భారతీయుడివి, ఆ తరువాతనే ముస్లిం అయ్యావు' అన్నాడు. 1927-28లలో సైమన్ కమిషన్‌కి వ్యతిరేకంగా జరిగిన ప్రజా ప్రదర్శనలలో పాల్గొనకపోయినప్పటికీ సైమన్ కమిషన్ బహిష్కరణని సమర్థించాడు.

అప్పటికి అతడి సామాజిక సంబంధాలు పూర్తిగా మతతత్వ ఆలోచనలు గలవారికి పరిమితమయ్యాయి. తన రాజకీయ పలుకుబడిని నిలబెట్టుకోవాలంటే మతతత్వాన్ని వదిలిపెట్టుకోలేని దశ వచ్చింది. 1928-29కాలంలో నెహ్రూ రిపోర్టుపై జరిగిన చర్చలలో యిది స్పష్టమయింది. అతడు క్రమక్రమంగా ఆగాఖాన్, యం.షఫీల నాయకత్వంలోని మతతత్వవాదులకు లొంగిపోయాడు. మొత్తం ముస్లిం మతతత్వవాదానికి నాయకుడయ్యాడు. యం.ఎ.అన్సారీ, టి.ఎ.కె.షెర్వాని, సయ్యద్ మహమూద్, అతడి ముఖ్య అనుచరుడైన యం.సి.చాగ్లా- లాంటి జాతీయవాద నాయకుల మద్దతు కోల్పోయాడు. అభివృద్ధి నిరోధక ముస్లిం మతతత్వవాదుల డిమాండ్లను చేర్చి 14 డిమాండ్లకు రూపకల్పన చేయడం అతడి దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలిచింది.

కాంగ్రెస్ 1930 నాటికి విస్తృత ప్రజా ఉద్యమాన్ని చేపట్టి సామాజిక, ఆర్థిక కార్యక్రమంతో ముందుకిపోతూ వుండడంతో, జిన్నా ప్రధాన జాతీయ స్రవంతి నుండి యింకా వేరుచేయబడ్డాడు. అంతేగాక ముస్లిం ప్రజలు- ప్రత్యేకించి యువతరం అంతకంతకు జాతీయవాద వామపక్ష రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. జిన్నా సందిగ్ధావస్థలో పడ్డాడు. భవిష్యత్తు ఆశాజనకంగా కనిపించలేదు. అందువలన ఎక్కువకాలం బ్రిటన్‌లో గడపాలని నిర్ణయించుకొన్నాడు.

కాని జిన్నా కార్యాచరణశీలి. రాజకీయవేత్త. అక్కడ ఎక్కువకాలం వుండలేకపోయాడు. ముస్లింలీగుని పునరుద్ధరించేందుకు 1936లో భారతదేశానికి తిరిగివచ్చాడు. తొలుత ఉదార మతతత్వ ప్రాతిపదికన ముస్లింలీగుని పునరుద్ధరించాలనుకొన్నాడు. 1936 సంవత్సరమంతా తన జాతీయవాదాన్ని, స్వాతంత్ర్యం పట్ల తన ఆకాంక్షని, హిందూ ముస్లిం సహకారాన్ని గురించి చెప్పాడు. ఉదాహరణకు 1936 మార్చిలో లాహోర్‌లో యిలా చెప్పాడు. "భారతజాతీయ కాంగ్రెస్‌లో చేరిన

రోజునుండి నాలో ఎలాంటి మార్పు– కొద్దిపాటి మార్పు కూడా లేదు. కొన్ని సందర్భాలలో నేను తప్పులు చేసివుండవచ్చు. కాని పాక్షిక దృక్పథంతో చేయలేదు. నా ప్రధాన లక్ష్యం – ఒకే ఒక లక్ష్యం దేశ సంక్షేమం. భారతదేశ ప్రయోజనం యిప్పుడూ, యికముందు కూడా పరమపవిత్రమైనది. ఆ స్థితి నుండి నన్ను ఏదీ కూడా ఒక్క అంగుళం కూడా కదపలేదు.” ఒకవైపు జిన్నా ముస్లిముల్ని ప్రత్యేకంగా సంఘటితంకమ్మని పిలుపిస్తున్నాడు. మరొకవైపు ముస్లింల దేశభక్తి అకుంఠితమైనదని, భారతదేశం దాని అభివృద్ధి పట్ల వారి ప్రేమ, యితరులకంటె తక్కువకాదని నిరూపించుకోవాలని చెపుతున్నాడు.

కాంగ్రెస్‌పై మరొక లక్నో ఒప్పందాన్ని రుద్ది ముస్లింలీగుకి తగినన్ని సీట్లు సాధించడం జిన్నా పథకమై వుండవచ్చు. 1937 ఎన్నికలలో పాల్గొనడం ద్వారా కాంగ్రెస్, గాంధీకి ముందునాటి రాజ్యాంగబద్ధమైన రాజకీయాలకు మరలుతుందని జిన్నా అంచనా. పాక్షికంగా ఈ అంచనాల కారణంగాను, మతపరమైన డిమాండ్లన్నీ కమ్యూనల్ అవార్డుద్వారా ఆమోదింపబడడంతోను, మతపరమైన డిమాండ్ల సంచి ఖాళీగా వుండడం వలననూ– జిన్నా ముస్లింలీగు జాతీయవాద కాంగ్రెస్ తరహా కార్యక్రమంతో ఎన్నికలలో పోరాడారు. ఇక ఉర్దూ భాషని, లిపిని సంరక్షించి ప్రోత్సహించటం, రక్షణ కల్పించటం, ముస్లింల సాధారణ పరిస్థితుల మెరుగు కొరకు చర్యల అమలు మాత్రమే ముస్లింల డిమాండ్లు.

జిన్నా అంచనాలన్నీ తప్పని ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. జిన్నా ఏంచేయాలో నిర్ణయించుకోవాలి. సత్తాని పూర్తిగా కోల్పోయిన అర్ధ జాతీయవాదంతో కూడిన ఉదార మతతత్వ రాజకీయాలకు అంటిపెట్టుకొని వుండాలా? లేక మతతత్వ రాజకీయాల్ని త్యజించాలా? ఈ రెండింటిలో ఏదిచేసినా రాజకీయంగా అజ్ఞాతవాసంలోకి వెళ్ళడమే. మూడవ ప్రత్యామ్నాయం ప్రజా రాజకీయాల్ని చేపట్టడం. అర్ధ భూస్వామ్య విధానం, బ్రిటిషు పాలకులకు విధేయత– లీగు దృక్పథం. సామాజికంగా, ఆర్థికంగా కులీన దృక్పథం జిన్నాది. ఈ పరిస్థితులలో ‘ప్రమాదంలో ఇస్లాం మతం’, ‘హిందూ రాజ్య ప్రమాదం’ – లాంటి నినాదాలతో ప్రజా రాజకీయాల్ని చేపట్టడం మూడవ ప్రత్యామ్నాయం. 1937–38లో జిన్నా మూడవ ప్రత్యామ్నాయాన్ని ఎంపికచేసుకొన్నాడు. ఒకసారి ఈ నిర్ణయం తీసుకున్న తరువాత ద్వేషం, భయంపై ఆధారపడిన తీవ్ర మతతత్వ

రాజకీయాలపై తన శక్తియుక్తులు కేంద్రీకరించాడు. ఇక అప్పటి నుండి కాంగ్రెస్ బ్రిటిష సామ్రాజ్యవాదం నుండి  కోరుతున్నది స్వరాజ్యం కాదని, బ్రిటిషువారి సహకారంతో హిందూ రాజ్యస్థాపనయని, ముస్లింలపై ఆధిపత్యం, వారిని తుదముట్టించడం, ఇస్లాం మతాన్ని ధ్వంసం చేయడమని, తోటి మతస్థులలో భయాన్ని, అభద్రతా భావాన్ని పెంచడం లక్ష్యాలుగా మతతత్వ రాజకీయ నాయకుల ప్రచారాలు సాగాయి.

అందుకు కొన్ని ఉదాహరణలు. 1938లో జిన్నా అధ్యక్షోపన్యాసంలో లీగుని ఉద్దేశించి యిలా చెప్పాడు. "ఈ దేశంలో యితర మతాల సంస్కృతుల్ని నామరూపాలు లేకుండా తుదముట్టించి, హిందూరాజ్యాన్ని స్థాపించాలని  కాంగ్రెస్ స్పష్టమైన నిర్ణయానికి వచ్చింది." 1940 మార్చిలో అలీఘర్  విద్యార్థులతో యిలా చెప్పాడు. "హిందూ రాజ్యంలో ముస్లిముల్ని అణచివేసి, బానిసల్ని చేసుకొనడం గాంధీజీ ఆకాంక్ష." "ఈ దేశంలో ఇస్లాం మతాన్ని పూర్తి వినాశనం నుండి రక్షించాలంటే పాకిస్తాన్ ఒక ఆచరణీయమైన లక్ష్యం మాత్రమే కాదు; ఒకే ఒక లక్ష్యం." 1941 ఏప్రిల్‌లో జిన్నా తన అధ్యక్షోపన్యాసంలో 'సమైక్య భారతదేశంలో ముస్లింలు సమూలంగా తుడిచిపెట్టబడతార'ని పేర్కొన్నాడు. 1946 ఆగస్టు 18న తాత్కాలిక ప్రభుత్వాన్ని గురించి ప్రస్తావిస్తూ, భారతదేశంలోని ముసల్మానులపై యితర మైనారిటీ మతాలవారిపై సవర్ణ హిందూ కాంగ్రెస్ బ్రిటిష తుపాకులతో ఆధిపత్యం సాధించి పాలించాలని కోరుకుంటుందన్నాడు. 1946లో ముస్లిముల్ని లీగుకి ఓటువేయమని  అర్థిస్తూ ఇలా చెప్పాడు. "మనం ఈనాటి బాధ్యతని గుర్తించడంలో విఫలమైతే మనం శూద్రులస్థాయికి దిగజార్చబడతాము. భారతదేశంలో ఇస్లాం మతం తుడిచిపెట్టబడుతుంది."

జిన్నాలాంటి స్థాయిగల నాయకుడు అంతటి తక్కువ స్థాయి ఆందోళనని రాజకీయాల్ని చేపట్టగలిగాడంటే యిక సాధారణ స్థాయి మతతత్వ ప్రచారకుల ఆందోళనల్ని, రాజకీయాల్ని గురించి చెప్పనవసరం లేదు. జడ్.ఎ.సులేరి, యఫ్.ఎం. దురాని లాంటి వారు గోబెల్స్‌ని మించిపోయారు. బెంగాల్ ప్రీమియర్ లాంటి బాధ్యతాయుత స్థానంలో వున్న ఫజల్ ఉల్ హక్ 1938లో లీగు సదస్సులో యిలా చెప్పాడు. "కాంగ్రెస్ రాష్ట్రాలలోని ఘర్షణలు గ్రామ ప్రాంతాల బతుకుల్ని దుర్భరం చేశాయి. ముస్లిం ప్రజల ఆస్తిపాస్తులు, జీవితాలు ధ్వంసం చేయబడ్డాయి. రక్తం ఏరులై పారింది. అక్కడ ముస్లింలు హిందువులచే

అణచివేయబడుతూ నిరంతరం భయం, ఆందోళనలతో బతుకులు వెళ్ళదీస్తున్నారు. మసీదులు ధ్వంసం చేయబడుతున్నాయి. ముస్లిం భక్తులు అత్యాచారాలకు గురవుతున్నారు. కాని నేరస్థులు దొరకరు." సింధ్ ప్రాంతానికి చెందిన ప్రముఖ లీగ్ నాయకుడు యం.హెచ్.గజదార్ 1941 మార్చిలో కరాచీ లీగు సమావేశంలో యిలా చెప్పాడు. "హిందువులు సరిగా ప్రవర్తించకపోతే జర్మనీలో యూదుల్ని చేసినట్లు వీరిని నిర్మూలించవలసి వుంటుంది." జిన్నా కూడా చాలా పరుషంగా మాట్లాడేవాడు గనుక వారిని మందలించలేదు.

ముస్లిం మతతత్వవాదులు జాతీయవాద ముస్లింలపై విషప్రచారం చేపట్టారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్, యింకా యితర జాతీయవాద నాయకులపై కాంగ్రెస్ షోకేస్‌లోని బొమ్మలుగా, ఇస్లాం విద్రోహులుగా, హిందువుల కిరాయి ఏజెంట్లుగా ముద్రవేశారు. 1945-47కాలంలో మత మౌఢ్య ప్రచారాలు సాగించి సామాజిక భయోత్పాతాన్ని సృష్టించడమేగాక, వారిపై భౌతికదాడులు కూడా చేశారు. జిన్నా 1943లో అధ్యక్షోపన్యాసంలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ ముస్లిముల్ని హిందువులుగా మార్చే బాధ్యత నిర్వహిస్తున్నాడని, వీరపఠాన్లను నపుంసకులుగా మారుస్తున్నాడని ఆరోపించాడు.

మతం ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశం చేయబడింది. లీగుకి పాకిస్తాన్‌కి వేసే ఓటు ఇస్లాంకి వేసే ఓటని చెపుతూ ముస్లింలందరూ ముస్లింలీగుకి ఓటు వేయాలని ప్రచారం జరిగింది. లీగు సమావేశాలు శుక్రవారం ప్రార్థనానంతర సమావేశాలుగా మసీదులలో జరుపబడ్డాయి. పాకిస్తాన్ 'షరియా' ననుసరించి పరిపాలించబడుతుందని వాగ్దానం చేయబడింది. ముస్లింలు మసీదు, గుడి - రెంటిలో ఒకదానిని ఎంపిక చేసుకోవాలన్నారు. లీగు చిహ్నంగా ఖురాన్ ఉపయోగించుకోబడింది. కాంగ్రెస్‌తో లీగు చేసే యుద్ధం ఇస్లాం కాఫిర్ల మధ్య యుద్ధంగా చిత్రీకరించబడింది.

* * *

హిందూ మతతత్వవాదం కూడా అంతగా వెనుకబడిపోలేదు. 1920లలో లజపతిరాయ్, మదన్‌మోహన్ మాలవ్యా - యిద్దరు ముఖ్యమైన ఉదార మతతత్వ నాయకులు. 1928లో లజపతిరాయ్ చనిపోయాడు. 1937లో మాలవ్యా, అదే సంవత్సరం జిన్నా చిక్కుకొన్న సందిగ్ధంలో చిక్కుకొన్నాడు. కాని ఆరోగ్య కారణాల రీత్యా

చురుకైన రాజకీయాల నుండి విరమించుకోవాలని నిర్ణయించుకొన్నాడు. కానీ హిందూ మతతత్వం స్తబ్ధతగా వుండిపోలేదు. అదికూడా తీవ్రమైన ఫాసిస్టు దిశగా ముందుకు సాగింది. మతతత్వవాద తర్కం కొత్త మతతత్వ నాయకుల్ని ముందుకు తెచ్చింది. వి.డి.సావర్కర్ నాయకత్వంలో హిందూ మహాసభ ఫాసిస్టు దిశగా మలుపు తిరిగింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మొదటి నుండి ఫాసిస్టు పంథాలో నిర్మించబడింది. ఇప్పుడది మహారాష్ట్ర వెలుపల కూడా తన శాఖల్ని విస్తరించింది.

వి.డి.సావర్కర్ ముస్లిం ఆధిక్యతలో హిందువులకు రానున్న ప్రమాదాల్ని గురించి హెచ్చరించాడు. 1937లో సావర్కర్ "హిందూస్తాన్‌లో హిందువులు, యితర ముస్లిమేతర సెక్షన్ల నొసటిపై 'ఆత్మ న్యూనతా భావం, ముస్లిం ఆధిపత్యం' ముద్రల్ని ముస్లిములు వేయాలని కోరుతున్నారు. వారి స్వంతగడ్డపై హిందువుల్ని బానిసల స్థితికి దిగజార్చాలని కోరుతున్నారు" అన్నాడు. 1938లో సావర్కర్ "మనం ఇప్పటికే మన దేశవ్యాప్తంగా నిజమైన బానిసల స్థాయికి దిగజార్చబడ్డాము" అన్నాడు.

ఆర్.యస్.యస్. మతతత్వవాద సిద్ధాంతకర్త అయింది. ప్రచార బాధ్యతలు చేపట్టింది. ఆర్.యస్.యస్. అధినేత యం.యస్.గోల్వాల్కర్ ఆర్.యస్.యస్. సిద్ధాంతాన్ని తన పుస్తకం 'మనం'లో క్రోడీకరించాడు. 'మైనారిటీల డిమాండ్లు అంగీకరించబడితే హిందూ జాతీయ జీవనం ఛిన్నాభిన్నం అయ్యే ప్రమాదం వుంది' –అని గోల్వాల్కర్ ప్రకటించాడు. ఆర్.యస్.యస్. ముస్లిముల్ని, కాంగ్రెస్ నాయకుల్ని ఎదుర్కొన్నది. మన దీర్ఘకాలిక శత్రువుల్ని (ముస్లిముల్ని) అక్కున చేర్చుకొని జాతీయవాదులు మన ఉనికికే ప్రమాదం తెచ్చి పెడుతున్నారని జాతీయవాదంపై గోల్వాల్కర్ దాడిచేశాడు. మనపై దాడిచేసినవారిని, మన శత్రువుల్ని, మనల్ని 'ఇండియన్' అనే విదేశీపేరుతో ఒకేవర్గంగా పరిగణించాలని జాతీయవాదులు ప్రచారం చేస్తున్న భావనని ఖండిస్తూ గోల్వాల్కర్ యిలా వ్రాశాడు. "మన శత్రువుల్ని మన మిత్రులుగా మనంతట మనమే నమ్మే విధంగా మోసగించబడ్డాం. అది ఈనాటి ప్రమాదం, మన మతిమరుపుదనం – మన పాత బద్ధ శత్రువుల్ని మిత్రులుగా నమ్మడం." ముస్లింలకు యితర మతపరమైన మైనారిటీలకు గోల్వాల్కర్ ఈ సలహా యిచ్చాడు. "హిందూస్థాన్‌లోని హిందూయేతర ప్రజలు హిందూ భాషా సంస్కృతుల్ని అంగీకరించాలి; గౌరవించడం నేర్చుకోవాలి; హిందూమతం పట్ల

పూజ్యభావం కలిగివుండాలి. హిందూజాతి సంస్కృతి పట్ల ఆరాధనా భావం తప్ప యితర ఆలోచనలకు అవకాశం కల్పించకూడదు. ఈ దేశం పట్ల, ఈ దేశం యొక్క ప్రాచీన సాంప్రదాయాల పట్ల అసహనం, కృతఘ్నతా వైఖరుల్ని విడనాడడమేగాక, ప్రేమ, భక్తిభావంతో కూడిన సానుకూలవైఖరిని అలవరచుకోవాలి. – ఒక్క మాటలో విదేశీయులుగా వుండకూడదు; లేక హిందూ జాతికి పూర్తిగా విధేయతతో, ఎలాంటి ప్రాధాన్యతలు గల ఆదరణ, రాయితీలు – కనీసం పౌరహక్కులు కూడా కోరకుండా ఈ దేశంలో వుండవచ్చు." ఆయన యింకా యిలా వ్రాశాడు. "మనం హిందువులం. ఒకేసారి ఒకవైపు ముస్లింలతోను, మరోవైపు బ్రిటిషువారితోను యుద్ధంలో వున్నాం." అతడు ఇటలీ, జర్మనీ – రెండు దేశాలలో ప్రాచీన జాతీయ స్ఫూర్తి పునర్వికాసం పొందిందన్నాడు. మహమ్మదీయులను బహిష్కరించే హక్కు హిందువులకు కల్పిస్తూ మనం అలాంటి స్ఫూర్తిని పొందాలి. కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేస్తూ నిజమైన ఫాసిస్టు తరహాలో రెచ్చగొడుతూ హిందువుల నుద్దేశించి "ముస్లింల విధ్వంసానికి, అత్యాచారాలకు చేతగానివాళ్ళలా లొంగిపొండి" అని ఈసడించాడు. ఇంకా హిందువు దుర్బలుడని, అశక్తుడని, అతడికి స్ఫూర్తి లేదని, అతడి కాళ్ళపై అతడు నిలబడి మాతృభూమి స్వేచ్ఛకొరకు పోరాటం చేయలేని శక్తిహీనుడని, ఆ శక్తిని ముస్లిం రక్తం రూపంలో అతడికి ఎక్కించవలసి వచ్చిందని అసహనాన్ని ప్రేరేపించాడు. 1947లో గాంధీజీ పేరు ప్రస్తావించకుండా, గాంధీజీ గురించి యిలా అన్నాడు. "హిందూ ముస్లిం ఐక్యత లేకుండా స్వరాజ్యం లేదు" – అని ప్రకటించినవాళ్ళు మన సమాజానికి తీరని ద్రోహం చేశారు. ఒక గొప్ప ప్రాచీన నాగరికతగల ప్రజల జీవన స్ఫూర్తిని చంపడం అనే నీచమైన పాపం చేశాడు. గాంధీజీ స్వయంగా ఈ క్రింది విధంగా అన్నట్లు గోల్వాల్కర్ ఆరోపించాడు. "హిందూ ముస్లిం ఐక్యత లేకుండా స్వరాజ్యం లేదు. ఈ ఐక్యత సాధించడానికి సులభమైన మార్గం హిందువులందరినీ ముస్లిములుగా మార్పిడి చేయడం."

హిందూ మతతత్వవాదులు 'ప్రమాదంలో హిందూమతం', 'ప్రమాదంలో హిందూ విశ్వాసాలు', 'ప్రమాదంలో హిందూ సంస్కృతి' – లాంటి అరుపులు, పెడబొబ్బలు పెట్టే ప్రయత్నాలు చేశారు.

* * *

19వ శతాబ్దం చివర నుండి ప్రత్యేకించి 1937 తరువాత హిందూ, ముస్లిం మతతత్వవాదులు సాగించిన 'భయం– ద్వేషం' యొక్క చేదు ఫలితాలు ఐదు రోజులలో ఐదువేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన 1946 ఆగస్టు నాటి కలకత్తా హత్యల రూపంలోను, బెంగాల్‌లోని నౌఖాలీ హిందువుల హత్యాకాండ బీహార్‌లో ముస్లింల హత్యాకాండ రూపంలోను, దేశ విభజన సందర్భంగా జరిగిన మారణహోమం రూపంలోను, మతోన్మాది చేతిలో గాంధీజీ హత్యరూపంలోను ప్రజలు అనుభవించారు.

కాని దేశంలో వుండిపోయిన ముస్లిములు, పాకిస్తాన్‌కి వలసపోయిన ముస్లింలు ఎక్కువ మూల్యాన్ని చెల్లించారు. పాకిస్తాన్ ఏర్పడిన తరువాత జిన్నా ఉదారవాద మతతత్వం వైపు లేక సెక్యులరిజం వైపు వెనక్కి వెళ్ళాలని ఆశించాడు. 1947 ఆగస్టు 11న పాకిస్తాన్ రాజ్యాంగ అసెంబ్లీలో జిన్నా పాకిస్తాన్ ప్రజల నుద్దేశించి చేసిన అధ్యక్షోపన్యాసంలో "మీరు ఏ మతానికి లేక కులానికి లేక సంప్రదాయానికైనా చెంది వుండవచ్చు. దానికి రాజ్యపాలనతో ఎలాంటి సంబంధం వుండదు. మనమంతా ఒక రాజ్యం యొక్క పౌరులం. సమానస్థాయి గల పౌరులమనే ప్రాథమికమైన సూత్రంతో ప్రారంభిద్దాం. ఇప్పుడు దానిని మన ఆదర్శంగా పెట్టుకొందాం. హిందువులు హిందువులుగా మిగిలిపోరు; ముస్లిములు ముస్లిములుగా నిలిచిపోరు. మతపరమైన అర్థంలోకాదు. అది ప్రతి వ్యక్తి యొక్క వ్యక్తిగత విశ్వాసం గనుక. కాని రాజకీయ అర్థంలో అందరం ఒకే రాజ్యం యొక్క పౌరులుగా మిగిలిపోతాం." కాని అప్పటికే పరిస్థితులు చేయిజారిపోయాయి. జిన్నా ఒక భూతాన్ని సృష్టించాడు. అది దేశాన్ని విభజించడమే కాదు, అతడి పాకిస్తాన్ భావనని మింగివేసింది. సెక్యులర్ వ్యక్తులు ఊహించిన లేక అంచనా వేసినదానికంటే పాకిస్తాన్ ముస్లింలకు ఎక్కువ హానిచేసింది. మరొకవైపు పాకిస్తాన్ ఏర్పాటు 1947 మత ఘర్షణలతో రక్తపాతం జరిగినప్పటికీ జాతీయవాద భారతదేశం, కొన్ని బలహీనతలు వున్నప్పటికీ సెక్యులర్ రాజ్యాంగాన్ని, సెక్యులర్ ప్రభుత్వ విధానాన్ని రూపొందించుకోవడంలో జయప్రదమైంది. మరొకవిధంగా చెప్పాలంటే సిద్ధాంతాల ననుసరించే ఫలితాలుంటాయి.

* * *

మతతత్వ సమస్యపై గడచిన 30 సంవత్సరాలలో రెండు పెద్ద చర్చలు జరిగాయి. ఒకటి: జిన్నాని సమాధానపరచి 1937–39కాలంలో ప్రత్యేకించి 1937లో యు.పి.లో

ముస్లింలీగుతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేయబడి వుంటే మతతత్వ సమస్య అదృశ్యమయ్యేది లేక పరిష్కరించబడివుండేది. జిన్నా రాజకీయ ఆకాంక్షలకు ఎదురైన తిరస్కృతి. అతణ్ణి దేశ విభజన వైపు నెట్టింది.

అతి సాధారణంగా చేసే ఈ వాదనని పరిశీలించండి. ఈ "తిరస్కృతికి" ముందే జిన్నా పూర్తిస్థాయి ఉదార మతతత్వవాది అనే వాస్తవాన్ని ఈ వాదన విస్మరిస్తుంది.

రెండవది: 1937-39 కాలంలో జిన్నాని సమాధాన పర్చడానికి కాంగ్రెస్ చేయగలిగిన ప్రయత్నాలన్నీ చేసింది. కానీ జిన్నా మతతత్వవాద తర్కంలో పట్టుబడ్డాడు. హేతుబద్ధంగా ప్రతిపాదించి చర్చించదగిన డిమాండ్లేమీ అతడివద్ద లేవు. ఇక్కడ ఒక ముఖ్యమైన చారిత్రక వాస్తవాన్ని గుర్తుంచుకొనడం చాలా అవసరం. సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి, కాంగ్రెస్‌లో చేరేందుకు అతడి డిమాండ్లు ఏమిటో అతడు కాంగ్రెస్ నాయకులకు చెప్పేందుకు నిరాకరించాడు. చర్చలు ప్రారంభించడానికి అతడు విధించిన అసాధారణమైన షరతు: కాంగ్రెస్ నాయకత్వం ముందుగా సెక్యులర్ స్వభావాన్ని వదులుకొని, తనకు తానుగా హిందూ మతతత్వ సంస్థగా ప్రకటించుకొని, ముస్లింలీగుని ముస్లిములకు ప్రాతినిధ్యం వహించే ఏకైక సంస్థగా అంగీకరించాలి. ఇది కాంగ్రెస్ అంగీకరించగలిగే షరతుకాదు. రాజేంద్రప్రసాద్ చెప్పినట్లు కాంగ్రెస్ మతతత్వ సంస్థగా అంగీకరించడం అంటే తన గతాన్ని తాను తిరస్కరించడం, చరిత్రను తప్పుడుగా చిత్రీకరించడం; భవిష్యత్‌కి నమ్మక ద్రోహం చేయడం. - వాస్తవంగా భారతప్రజల్ని, వారి భవిష్యత్‌ని వంచించడమే. కాంగ్రెస్ జిన్నా డిమాండ్‌ని అంగీకరించి, జిన్నాను సమాధానపరచి వుంటే మనం పాకిస్తాన్ నమూనాలో వున్న హిందూదేశంలో లేక ఫాసిస్టు రాజ్యంలో నివసిస్తూ వుండేవాళ్ళం. అందువలన చర్చలు ప్రారంభమేకాలేదు.

జిన్నా కూడా తన సిద్ధాంతం రాజకీయాల తర్కాన్ని అనుసరిస్తూనే వచ్చాడు. కాని ఎక్కువకాలం అలాగే వుండిపోవడం సాధ్యపడలేదు. మతతత్వ సిద్ధాంత కార్యక్రమంలో అమలు జరుపకుండా మిగిలిపోయింది ఒక్క వేర్పాటువాదమే గనుక, పాకిస్తాన్‌ని డిమాండ్ చేయడం అనివార్యమయింది. ప్రత్యామ్నాయం మతతత్వ రాజకీయాల్ని వదిలిపెట్టడం. హిందువులు, ముస్లిములు రెండు ప్రత్యేకమైన జాతులని, వాటికి వేర్వేరు మాతృభూములు వుండాలన్న సిద్ధాంతాన్ని ఆధారం చేసికొని జిన్నా, ముస్లింలీగు పాకిస్తాన్ కొరకు 1940లో

డిమాండ్ చేశాడు. హిందూ మతతత్వవాదం కూడా అదే దిశలో ముందుకి సాగింది. కానీ దాని వేర్పాటువాదం ఇండియాలో కొంతభాగాన్ని హిందుస్థాన్‌గా కోరడంకాదు. అలాచేస్తే, ముస్లిం మతతత్వవాదం చేతుల్లో చిక్కుకొన్నట్లవుతుంది. అందువలన హిందూ మతతత్వవాదం ఇండియాలో నివసిస్తున్నది హిందూజాతి మాత్రమేనని, ముస్లింలు భారతదేశం నుండి బహిష్కరించబడాలి లేక రెండవ తరగతి పౌరులుగా నివసించాలన్నారు.

1937నాటి యు.పి. నిర్ణయంలో యిలాంటి అంశమే యిమిడివున్నది. జిన్నా, ముస్లింలీగు ప్రజా రాజకీయాల్ని వ్యతిరేకించారు. వారితో చేతులు కలపడమంటే ప్రజలు నిర్వహించే పాత్ర ఏమీలేని రాజ్యాంగబద్ధమైన రాజకీయాల నుండీ వెనుకడుగు వేయడమే. మంత్రివర్గాల చర్చలు జరగకముందు లేక చర్చలు విఫలమైన తర్వాత బ్రిటిషువారికి, కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న భారత జాతీయవాదానికి భిన్నంగా ముస్లిములు మూడవ వర్గమని జిన్నా ప్రకటించాడు. యస్.గోపాల్ చెప్పినట్లు “లీగుతో సంకీర్ణం అంటే కాంగ్రెస్, హిందూ సంబంధాన్ని అంగీకరించినట్లు, మొత్తం భారతీయుల పక్షాన మాట్లాడేహక్కుని వదులుకున్నట్లు అవుతుంది.” అంతేగాక సెక్యులర్ జాతీయవాదానికి దృఢంగా కట్టుబడివున్న జాతీయవాద ముస్లిముల్ని వంచించడమవుతుంది. అంతేకాదు, 1936లో ఫైజాపూర్‌లో ఆమోదించిన సమూలమైన మార్పులు కోరే వ్యవసాయ కార్యక్రమాన్ని వదిలిపెట్టినట్లవుతుంది. ఈ వ్యవసాయ కార్యక్రమం పట్ల కాంగ్రెస్ మంత్రివర్గం పూర్తి నిబద్ధత కలిగివున్నది. అదే సమయంలో లీగు భూస్వాముల ప్రయోజనాల పట్ల నిబద్ధత కలిగివుంది. ప్రభుత్వంలో వారి ప్రతినిధులు వుంటే రైతులకు అనుకూలమైన చట్టం చేయడం సాధ్యపడకపోవచ్చు. అప్పటి యు.పి. కాంగ్రెస్‌లో ముఖ్యంగా వున్నది కాంగ్రెస్ సోషలిస్టులు, కమ్యూనిస్టులు. లీగుతో ఎలాంటి సంకీర్ణాన్నైనా తిరస్కరించాలని వారు నెహ్రూపై ఒత్తిడి తెచ్చారు. తమ డిమాండుని తిరస్కరిస్తే ప్రజలలోకెళ్ళి ప్రచారం చేపడతామని హెచ్చరించారు. యు.పి.లో కాంగ్రెస్ మంత్రివర్గ ఏర్పాటుకై చర్చలు ప్రారంభంకాకముందే 1937 మేలో యు.పి. అసెంబ్లీ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా చేపట్టిన ప్రచారంలో లీగు ‘ప్రమాదంలో ఇస్లాం’ నినాదాన్ని ముందుకి తెచ్చింది. జిన్నా స్వయంగా అల్లా, ఖురాన్‌ల పేరుతో ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు.

ఏమైనప్పటికీ ఒక రాష్ట్ర మంత్రివర్గంలో తన పార్టీకి రెండు స్థానాలు కల్పించనందుకు ఒక నాయకుడు సంకుచితమైన మతతత్వ వేర్పాటువాదాలవైపు కొట్టుకుపోతే అతణ్ణి సమాధానపరచి వుంచడం ఎంతకాలం సాధ్యపడుతుంది? ఈ విధంగా వాదించడం బహుశా చరిత్రని, రాజకీయాల్ని ఒక ప్రహసనంగా లేక వ్యక్తి చపలతతో ఆడే ఆటగా పరిగణించడ మవుతుంది. మతతత్వం బుజ్జగించడానికి సమాధానపరచడానికి వీలుపడని ఒక సిద్ధాంతం. ఇంతకుముందు వివరించినట్లు దానిని వ్యతిరేకించాలి; ఎదుర్కోవాలి. అలా చేయడంలోని వైఫల్యం కాంగ్రెస్, జాతీయోద్యమాల బలహీనత. కమ్యూనిస్టులు కూడా లీగులోని మంచివ్యక్తుల్ని దాని నుండి బయటికి రప్పించేందుకు, 1942 నుండి 1946వరకు ముస్లింలీగుని బుజ్జగించేందుకు ప్రయత్నించారు. వారు ఈ ప్రయత్నంలో విఫలమవడమేగాక మంచి కార్యకర్తల్ని కోల్పోయారు. 1946లో కమ్యూనిస్టులు విజ్ఞతతో ఆ ప్రయత్నం విరమించుకొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కమ్యూనిస్టులు జరిపిన సంప్రదింపులు ఉదార మతతత్వవాదుల్ని సమాధానపరచి, వారిని జాతి వ్యతిరేక తీవ్ర మతతత్వవాదంతో పోరాడేందుకు ఒప్పించవచ్చును. – అనే తప్పుడు అవగాహనపై జరిపిన సంప్రదింపులు. 1937 తరువాత జాతీయవాద హిందువులు, జాతీయవాద ముస్లింలు మాత్రమే మతతత్వవాదాన్ని నిక్కచ్చిగా వ్యతిరేకించారు. మాలవ్యా, శ్యాంప్రసాద్ ముఖర్జీ, యన్.సి.ఛటర్జీ– లాంటి ఉదార మతతత్వవాదులు సావర్కర్, ఆర్.యస్.యస్.లను ఎదుర్కొనడంలో విఫలమయ్యారు. అలాగే ఉదారవాద ఇక్బాల్ లేక యితర ఉదారవాద ముస్లిం మతతత్వవాదులు 1937 తరువాత జిన్నా, సులేరి, ఫజల్ ఉల్ హక్ తదితరులు చేపట్టిన విద్వేష ప్రచారాన్ని వ్యతిరేకించే సాహసం చేయలేకపోయారు. మౌనంగా వుండిపోయారు.

అన్ని చారిత్రక సమస్యలకు తక్షణ పరిష్కారాలు వుండవు. 1947లో అలాంటి పరిష్కారం లేదు. మతతత్వం లాంటి సామాజిక, రాజకీయ సమస్యకి తక్షణ పరిష్కారం ఎప్పుడూ లభించదు. సంవత్సరాల తరబడి – దశాబ్దాల తరబడి అందుకనువైన పరిస్థితుల్ని, శక్తుల్ని కూడగట్టాలి. అలా చేయడంలో కాంగ్రెస్, జాతీయోద్యమం విఫలమయ్యాయి. సెక్యులరిజం పట్ల వాటికి నిబద్ధత వున్నప్పటికీ, హిందూ, ముస్లిం

ఐక్యతని గురించి గాంధీజీ నిరంతరం నొక్కి చెపుతున్నప్పటికీ, హిందూ, ముస్లిం ఐక్యత పెంపు కొరకు ఆయన ప్రాణత్యాగానికి, తన సంసిద్ధతని వ్యక్తం చేసినప్పటికీ మతతత్వవాదం యొక్క సామాజిక, ఆర్థిక మూలాలపై నెహ్రూ అత్యంత ప్రతిభావంతమైన విశ్లేషణ చేసినప్పటికీ మతతత్వవాదం యొక్క సైద్ధాంతిక అంశాల్ని, సామాజిక, రాజకీయ మూలాల్ని, రాజకీయ ఫలితాలను సహనంతో, శాస్త్రీయంగా బహిర్గతపరచే ప్రాతిపదికపై దానియొక్క అన్ని రూపాలకు వ్యతిరేకంగా, సైద్ధాంతిక రాజకీయ ప్రజాపోరాటం చేపట్టడంలో భారత జాతీయవాదులు విఫలమయ్యారు. కాంగ్రెస్ ఎక్కువగా మతతత్వవాదులతో జరిపే చర్చలపై ఆధారపడింది. రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక స్థాయిల్లో మతతత్వవాదంతో పోరాడేందుకు ఆచరణీయమైన, సమర్థవంతమైన దీర్ఘకాలిక ఎత్తుగడని రూపొందించడంలో విఫలమయింది.

* * *

# 34 త్రిపుర సంక్షోభం నుండి క్రిప్సు రాయబారం వరకు

1937లో కాంగ్రెస్ విజయం, ఆ తరువాత మంత్రివర్గాల ఏర్పాటు, వలసపాలకులకు వ్యతిరేకంగా దేశంలోని పాలనాధికార సమతుల్యతని మార్చాయి. వామపక్ష పార్టీల ఆలోచనల పెరుగుదల, జాతీయవాద నాయకత్వంలో సమరశీలత పెరగడానికి దారితీసింది. మరొక జాతీయోద్యమ పునరుజ్జీవానికి రంగం సిద్ధమయినట్లుంది. సరిగ్గా ఈ సమయంలో పైస్థాయి కాంగ్రెస్ సంక్షోభంలో పడిపోయింది. – తరచుగా కాంగ్రెస్‌ని పట్టి పీడించే జబ్బే ఇది.

* * *

సుభాస్ బోస్ 1938లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. 1939లో మరలా నిలబడాలని నిర్ణయించుకొన్నాడు, – ఈసారి సమూలమైన మార్పులు కోరే సమరశీల రాజకీయాల ప్రతినిధిగా. 1939 జనవరి 1న తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించుకొంటూ 'భారతదేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం అభివృద్ధికరంగా పదునుదేరడంతో ఉత్పన్నమైన నూతన భావాలకు, సిద్ధాంతాలకు, సమస్యలకు, కార్యక్రమాలకు ప్రాతినిధ్యం వహిస్తాన'ని చెప్పాడు. నిర్దిష్టమైన సమస్యలు, కార్యక్రమాల ప్రాతిపదికన అధ్యక్ష ఎన్నికలకు వివిధ అభ్యర్థుల మధ్య పోటీ జరగాలన్నాడు. సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్, జె.బి.కృపలానీ– యింకా నలుగురు కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు దానికి ప్రతిగా ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, కార్యక్రమాలు, విధానాలు ఎ.ఐ.సి.సి., కార్యవర్గం లాంటి వివిధ కాంగ్రెస్

సంస్థలచే రూపొందించబడతాయి గనుక అధ్యక్ష ఎన్నికలలో వాటి ప్రస్తావన అసంబద్ధమని, యిక కాంగ్రెస్ అధ్యక్షుని స్థానం జాతి సంఘీభావం, ఐక్యతల ప్రతీకగా ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగబద్ధమైన పెద్దలాంటిదని పేర్కొన్నారు. గాంధీజీ ఆశీస్సులతో పైన పేర్కొనబడినవారు, యితర నాయకులు పట్టాభి సీతారామయ్యని పోటీ అభ్యర్థిగా నిలబెట్టారు. జనవరి 29న జరిగిన ఎన్నికలలో బోస్‌కి 1580ఓట్లు రాగా, సీతారామయ్యకి 1377 ఓట్లు వచ్చాయి. బోస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. సీతారామయ్య ఓటమిని తన ఓటమిగా గాంధీ ప్రకటించాడు.

బోస్ ఎన్నిక ఏ సమస్యనీ పరిష్కరించలేదు. లోలోపల రగులుతున్న సంక్షోభం త్రిపుర కాంగ్రెస్ సదస్సులో పెల్లుబికింది. ఈ సంక్షోభానికి రెండు పెద్ద కారణాలు వున్నాయి. ఒకటి: సర్దార్ పటేల్, కాంగ్రెస్ పైస్థాయి నాయకత్వంలోని మెజారిటీపై మితవాదులనే ముద్రవేసి, బోస్ సాగించిన ప్రచార ధోరణి. సమాఖ్య సమస్యపై ప్రభుత్వంతో రాజీకొరకు ప్రయత్నించారని, కానున్న కేంద్రమంత్రుల జాబితాను కూడా తయారుచేశారని బాహాటంగా ఆరోపించాడు. అంతేగాక కాంగ్రెస్ అధ్యక్షుడిగా వామపక్షవాది వుంటే వారి చర్చల దారిలో ముల్లులా వుంటాడని, చర్చలకు ఆటంకాలు కల్పిస్తాడు గనుక వామపక్షవాది కాంగ్రెస్ అధ్యక్షుడుగా వుండకూడదని వారు కోరుకుంటున్నారని ఆరోపించాడు. కాబట్టి వామపక్షవాదికి సమాఖ్య వ్యతిరేకవాదికి ఓటు వేయవలసిందిగా ఆయన కాంగ్రెస్ సభ్యులకు విజ్ఞప్తి చేశాడు. స్వీయచరిత్రలోని రెండవ భాగంలో ఆ కాలంనాటి ఆలోచనల్ని యింకా స్పష్టంగా వ్యక్తం చేశాడు. "బ్రిటన్‌తో ఎలాంటి రాజీకైనా కాంగ్రెస్ పార్టీ యొక్క వ్యతిరేకతని పెంచేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడిగా రచయిత చేయగలిగిందంతా చేశాడు. బ్రిటిషు ప్రభుత్వంతో అవగాహన కొరకు ఎదురుచూస్తున్న గాంధీజీ అనుచరులకు యిది చిరాకు కలిగించింది. మంత్రివర్గాల ఏర్పాటుకి, పార్లమెంటరీ వ్యవహారాల పనులకు ఆటంకం కలిగించడం గాంధీ అనుచరులు కోరుకొనలేదు. అప్పుడు జాతీయ పోరాటాన్ని వ్యతిరేకించారు.

అనుసంధానకర్తలుగా ముద్రవేయబడిన కాంగ్రెస్‌వాదులు అలాంటి ఆరోపణలను నిరసించారు. వారు ఒక ప్రకటనలో యిలా పేర్కొన్నారు. "సుభాస్ బోస్ సమాఖ్య పట్ల తన వ్యతిరేకతని వ్యక్తం చేశాడు. కార్యవర్గ సభ్యులంతా యిదే అభిప్రాయంతో వున్నారు. ఇది కాంగ్రెస్ విధానం." సుభాస్ ఎన్నిక తరువాత జాతీయవాదం పట్ల తమ నిజాయితీని శంకించి, నిందలువేసిన అధ్యక్షునితో కలిసిపనిచేయలేమని వారు భావించారు.

అంతకుముందు జనవరి 1న గాంధీజీ ఈ ప్రకటన చేశాడు. "సుభాస్ బాబు తాను మితవాదులని పిలిచేవారి ఉపేక్షాంగీకారంతో అధ్యక్షుడవడం కంటే యిప్పుడు పోటీచేసి అధ్యక్షుడుగా ఎన్నికైనందువలన ఈ ఓటమితో నేను సంతోషిస్తున్నాను. ఇది ఆయన తన సహచరులను ఎంపికచేసుకొని ఎలాంటి ఆటంకాలు లేకుండా తన కార్యక్రమాన్ని అమలుజరపడం సాధ్యపడేలా చేస్తుంది."

ఇతర 12మంది కార్యవర్గ సభ్యులతో పాటు జవహర్‌లాల్ నెహ్రూ రాజీనామా చేయలేదు. బోస్‌తో బాహాటంగా తలపడడం ఆయనకిష్టం లేదు. అలాగని ఆయన బోస్‌తో ఏకీభవించడంలేదు. ఎన్నికలు ఎలాంటి సూత్రాలు, కార్యక్రమాలపై జరగడంలేదని ఆయన ఎన్నికల ముందు ప్రకటించాడు. తన సహచరులపై బోస్ ఆరోపణల పట్ల ఆయన అసంతృప్తి చెందాడు. అతివాదులు, మితవాదుల మధ్య పోరాటమనే అంశాన్ని ఆయన అంగీకరించలేదు. 1939 ఫిబ్రవరి 4న బోస్‌కి వ్రాసిన లేఖలో యిలా పేర్కొన్నాడు. "మీరు ఎవరిని అతివాదిగా, ఎవరిని మితవాదిగా పరిగణిస్తున్నారో నాకు తెలియదు. అధ్యక్ష ఎన్నికల కాలంలో మీ ప్రకటనలలో ఉపయోగించబడిన మాటల తీరుని బట్టి గాంధీజీ, ఆయన గ్రూపుగా పరిగణింపబడేవారు మితవాద నాయకులు. వారిని వ్యతిరేకించేవారు ఎవరైనప్పటికీ అతివాదులు. ఇది పూర్తిగా తప్పుడు వర్ణనగా నాకనిపిస్తుంది. అతివాదులనబడేవారిలో చాలామంది మితవాదులనబడేవారికంటే చాలా మితవాదులని నా అభిప్రాయం. శక్తివంతమైన భాష, పాత కాంగ్రెస్ నాయకత్వాన్ని ఎదుర్కొని విమర్శించే సామర్థ్యం రాజకీయాలలో అతివాదాన్ని నిగ్గుదేల్చే పరీక్షకాదు. అతివాద, మితవాద పదాలు పూర్తిగా గందరగోళపరిచేవి. ఈ మాటలకు బదులుగా మనం రాజకీయాల్ని మాట్లాడుకొంటే మంచిది. మీరెలాంటి రాజకీయాల కోసం నిలబడుతున్నారు? సమాఖ్య వ్యతిరేక రాజకీయాలా? మంచిది. కార్యవర్గంలోని అత్యధిక మెజారిటీ సభ్యులు అదే కోరుకుంటున్నారు. ఇది వారి బలహీనతగా మీరు ప్రస్తావించడం మంచిదికాదు."

కాని గాంధీ, బోస్ వివాదంలో విధానపరమైన, ఎత్తుగడల పరమైన విభేదాలు వున్నాయి. అవి రాజకీయ వాస్తవికతపై, కాంగ్రెస్ యొక్క బలం, బలహీనతలపై ప్రజా ఉద్యమాన్ని నిర్మించడంపై, పోరాటానికి ప్రజల సంసిద్ధతపై పరస్పరం విభేదించే అవగాహనలు, అంచనాల ప్రాతిపదికన ఉత్పన్నమయ్యాయి.

కాంగ్రెస్ తక్షణం పోరాటం చేపట్టగలిగేంత బలంగా వుందని, అలాంటి పోరాటానికి ప్రజలు సిద్ధంగా వున్నారని సుభాస్ బోస్ నమ్మాడు. "దేశం గతంలో ఎన్నడూ లేనంతగా విప్లవానికి సన్నద్ధంగా వుంది. రానున్న అంతర్జాతీయ సంక్షోభం మానవ చరిత్రలో అరుదుగా సంభవించే విధంగా విముక్తి సాధించే అవకాశాన్ని భారతదేశానికి యిస్తుంది" అని బోస్ ఆ తరువాత వ్రాశాడు. అదే విశ్వసించాడు. కాబట్టి ఆయన త్రిపురి అధ్యక్షోపన్యాసంలో జాతీయ డిమాండుని ఆమోదించి 6నెలల్లో స్వాతంత్ర్యం ప్రకటించాలని, అలా ప్రకటించని పక్షంలో పెద్దఎత్తున సహాయ నిరాకరణోద్యమం చేపడతామని బ్రిటిషు ప్రభుత్వానికి అల్టిమేటం యివ్వాలని వాదించాడు.

గాంధీజీ ఆలోచనలు అందుకు భిన్నంగా వున్నాయి. భారత ప్రజలు అసాధారణమైన పరిస్థితుల నెదుర్కొంటున్నారు గనుక స్వాతంత్ర్య సాధనకు మరొక ప్రజాపోరాటం అవసరమని గాంధీజీ కూడా విశ్వసించాడు. 1938 జూలై మధ్యలో ఆయన యిలా వ్రాశాడు. "నన్ను ఆవరించినట్లున్న చీకటి అదృశ్యమవుతుంది. దండి సత్యాగ్రహం కంటె పెద్ద పోరాటంతోనో లేక అలాంటిది లేకుండానో భారతదేశం స్వతంత్రమవుతుంది." కాని కాంగ్రెస్‌గాని, ప్రజలుగాని యింకా పోరాటానికి సిద్ధంగా లేనందున అల్టిమేటం యివ్వడానికి సమయం ఆసన్నంకాలేదని గాంధీజీ నమ్మాడు. భారతీయులు ముందుగా 'తమ యింటిని చక్కదిద్దుకోవాలి.' 1939 మే 5న ఒక ఇంటర్వ్యూలో గాంధీజీ యిలా ప్రకటించాడు. "ఆయన (సుభాస్ బోస్) పోరాటానికి తగినన్ని వనరులు మనకు వున్నాయంటున్నాడు. ఆయన ఉద్దేశాలతో నేను పూర్తిగా విభేదిస్తున్నాను. ఈనాడు పోరాటానికి తగిన వనరులు లేవు. మత కలహాలకు పరిమితులు లేకుండా పోయాయి. బీహార్ రైతాంగంపై మనకుంటూ వచ్చిన పట్టు యిప్పుడు లేదు... దండియాత్ర చేపట్టమని నన్ను ఈనాడు అడిగితే, చేపట్టే ధైర్యం నాకులేదు. కార్మికులు, రైతులు లేకుండా ఏదైనా ఎలా చేయగలం? దేశం వారికే చెందుతుంది. ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసేందుకు తగిన సాధనసంపత్తి నావద్ద లేదు. దేశం అపహాస్యం పాలవుతుంది."

గాంధీజీ వ్యక్తం చేసిన ఉద్దేశాలు కాంగ్రెస్ సంస్థపై, ఆయన అంచనాల ప్రాతిపదికన చేసినవి. అవినీతి, లంచగొండితనం కాంగ్రెస్ పోరాటపటిమని, దుర్బలపరిచాయని ఆయన నమ్మాడు. ఇంతకుముందు మనం గమనించినట్లు 1938లో, 1939 ప్రారంభంలో ఆయన కాంగ్రెస్‌వాదులలో పరస్పర శత్రుత్వాలు, జగడాలు, నకిలీ

సభ్యత్వం, పార్టీ ఎన్నికలలో వంచన, కాంగ్రెస్ కమిటీల్ని కైవశం చేసుకొనే ప్రయత్నాలు, కాంగ్రెస్‌లో ప్రమాణాల పతనం సమస్యల్ని గురించి మాటిమాటికి బాహాటంగా ప్రస్తావించాడు.

* * *

అంతర్గత పోరాటం 1939 మార్చి 8నుండి 12వరకు జరుపబడిన కాంగ్రెస్ సదస్సులో పరాకాష్టకు చేరింది. అధ్యక్ష ఎన్నికలలో తనకి లభించిన మద్దతుపైన, మెజారిటీపైన బోస్ పూర్తిగా తప్పుడు నిర్ణయాలు చేశాడు. కాంగ్రెస్‌వాదులు వివిధ కారణాల రీత్యా ఆయనకు ఓట్లు వేశారు. అన్నిటినిమించి ఆయన సమరశీల రాజకీయాలకు దృఢంగా నిలబడతాడని ఓట్లు వేశారుగాని జాతీయోద్యమానికి అధినాయకుడ్ని చేయడానికి కాదు. గాంధీజీ నాయకత్వాన్ని గాని, ఈ విషయాన్ని సుభాస్ బోస్‌కి చెప్పటానికి నిర్ణయించిన వృద్ధ కాంగ్రెస్ నాయకుల్నిగాని తిరస్కరించడానికి వారు సిద్ధంగా లేరు. పాత కాంగ్రెస్ కార్యవర్గంపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ఉద్యమంపై గాంధీజీ నాయకత్వం పట్ల, గడచిన 20 సంవత్సరాల కాంగ్రెస్ విధానాల పట్ల పూర్తి విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూ, గాంధీజీ యిష్టానికి అనుకూలంగా కార్యవర్గాన్ని నియమించవలసిందిగా సుభాస్‌ని కోరుతూ గోవింద వల్లభపంత్ త్రిపురి కాంగ్రెస్‌లో తీర్మానాన్ని ప్రతిపాదించాడు. తీర్మానం పెద్ద మెజారిటీతో ఆమోదం పొందింది. కాని గాంధీజీ తీర్మానాన్ని ఆమోదించలేదు. తనకు యిష్టమైన కార్యవర్గాన్ని సుభాస్‌పై రుద్దడాన్ని తిరస్కరించాడు. ఆయన యిష్టానుసారం కమిటీని ఎంపికచేసుకొమ్మని సుభాస్‌కి చెప్పాడు.

సుభాస్‌బోస్ ఈ సవాల్‌ని స్వీకరించ నిరాకరించాడు. తనంతట తాను సంస్థని నడిపించలేదని బోస్‌కి తెలుసు. కాని మెజారిటీ నాయకత్వాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేడు. రానున్న పోరాటానికి నాయకత్వం వహించవలసిందిగా గాంధీజీని కోరాడు. కాని తన చేత, వామపక్ష పార్టీలు, గ్రూపులచేత రూపొందించబడిన వ్యూహం, ఎత్తుగడల్ని అనుసరించాలని గాంధీజీని కోరాడు. మరొకవైపు గాంధీజీ తన వ్యూహం, ఎత్తుగడల ప్రాతిపదికగా కాంగ్రెస్‌ని నడిపించాలి లేక నాయకత్వస్థానాన్ని వదులుకోవాలి. ఆయన బోస్‌కి వ్రాసినట్లు "నీ జోస్యం సరియైనదైతే నేను వెనుకబడినట్లే. సత్యాగ్రహం యొక్క ప్రధాన సేనానిగా నా చరిత్ర

పరిసమాప్తమైనట్లే." మరొకవిధంగా చెప్పాలంటే రాజేంద్రప్రసాద్ తరువాత తన స్వీయచరిత్రలో వ్రాసుకొన్నట్లుగా "తమవిగాని వ్యూహం ఎత్తుగడల్ని అమలు జరిపే, బాధ్యత వహించే పరిస్థితిని గాంధీజీ, యితర వృద్ధతరం నాయకులు అంగీకరించలేదు."

అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం తప్ప బోస్‌కి మార్గాంతరం లేకపోయింది. నెహ్రూ రెండు పక్షాల మధ్య మధ్యవర్తిత్వం నెరప యత్నించాడు. రాజీనామా చేయవద్దని నచ్చజెప్పయత్నించాడు. గాంధీజీ యితర వృద్ధతరం నాయకుల్ని మరికొంత సర్దుబాటుగా వ్యవహరించమని కోరాడు. బోస్ తన స్థానం నుండి వెనుకడుగు వేయలేదు. ఒకవైపు తనను ఎన్నుకొన్న మార్పులుగోరే ధోరణులకు, గ్రూపులకు కార్యవర్గం ప్రతినిధిగా వుండాలన్నాడు. మరొకవైపు తన కార్యవర్గాన్ని తాను నియమించనన్నాడు. తన రాజీనామాపై ఒత్తిడి పెంచేందుకే ప్రాధాన్యత యిచ్చాడు. ఇది ఆయన స్థానంలో రాజేంద్రప్రసాద్ ఎన్నికకు దారితీసింది. కాంగ్రెస్ మరొక తుఫాన్‌ని అధిగమించింది.

త్రిపురలోగాని ఆ తరువాతగాని బోస్ కాంగ్రెస్ సోషలిస్టుల, కమ్యూనిస్టుల మద్దతు పొందలేకపోయాడు. సోషలిస్టులు, కమ్యూనిస్టులు జాతీయోద్యమాన్ని విభజించేందుకు యిష్టపడలేదు దాని ఐక్యతని పరిరక్షించాలని కోరారు. త్రిపురి సదస్సు తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ తన వైఖరిని వివరించింది. "సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం యొక్క ప్రయోజనాలు ఒక పక్షం యొక్క ప్రత్యేకమైన నాయకత్వానికిగాక గాంధీజీ మార్గదర్శకత్వంలో సంఘటిత నాయకత్వాన్ని డిమాండు చేస్తున్నాయి." 1939 ఏప్రిల్‌లో సి.పి.ఐ. జనరల్ సెక్రటరీ పి.సి.జోషి యిలా వ్రాశాడు. "ఈనాటి అత్యంత గొప్ప వర్గపోరాటం మన జాతీయపోరాటం. ఈ పోరాటానికి ప్రధానాంగం కాంగ్రెస్, దాని ఐక్యతని పరిరక్షించడం ప్రాథమిక కర్తవ్యం."

తరువాత మేలో సుభాస్ బోస్, ఆయన అనుచరులు కాంగ్రెస్ లోపల ఫార్వర్డ్‌బ్లాక్ అనే కొత్త పార్టీని ఏర్పాటుచేశారు. ఆయన జూలై 9న ఎ.ఐ.సి.సి. తీర్మానానికి వ్యతిరేకంగా అఖిలభారత స్థాయిలో నిరసనకు పిలుపిచ్చాడు. కార్యవర్గం బోస్‌ని బెంగాల్ ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి నుండి తొలగించడమేగాక మూడు సంవత్సరాలపాటు కాంగ్రెస్‌లో ఎలాంటి బాధ్యతలు చేపట్టడానికైనా అనర్హుడని ప్రకటించి క్రమశిక్షణాచర్యలు చేపట్టింది.

* * *

1939 సెప్టెంబర్ 1న నాజీ జర్మనీ పోలెండుపై దాడిచేయడంతో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమయింది. అంతకు ముందు జర్మనీ 1938 మార్చిలో ఆస్ట్రియాని, 1939లో జెకొస్లొవేకియాని ఆక్రమించింది. అప్పటి వరకు హిట్లర్‌ని బుజ్జగించే పద్ధతిని పాటిస్తూ వచ్చిన బ్రిటన్, ఫ్రాన్సులు పోలెండుకు అండగా నిలబడి జర్మనీతో యుద్ధం ప్రకటించక తప్పలేదు. 1939 సెప్టెంబరు 3న యుద్దం ప్రకటించిన బ్రిటిషిండియా ప్రభుత్వం కాంగ్రెస్‌తోగాని, కేంద్ర శాసనసభకి ఎన్నికైన సభ్యులతోగాని మాటమాత్రమైనా చెప్పకుండా వెంటనే యుద్ధంలోకి దూకింది.

మనం యింతకు ముందు గమనించినట్లు ఫాసిస్టు దురాక్రమణకు గురయిన బాధితులపట్ల కాంగ్రెస్‌కి పూర్తిగా సానుభూతి వుంది. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే ప్రజాస్వామ్యశక్తులకు మద్దతివ్వడానికి సర్వసన్నద్ధంగావుంది. గాంధీజీ చాలా ఆవేశపూరితంగా స్పందించారు. పార్లమెంటు భవనం, లండన్ విధ్వంసమయ్యే అవకాశం వుందనే ఆలోచన తనలో ఆవేశపూరితమైన స్పందన కలిగించిందని గాంధీ వైస్రాయికి చెప్పాడు. మిత్రరాజ్యాలపట్ల సానుభూతితో బ్రిటన్‌కి పూర్తి సహకారం అందించడానికి సిద్ధపడ్డాడు. అయితే కాంగ్రెస్ నాయకులు ఒక ప్రశ్న అడిగారు. బానిస సంకెళ్ళలో వున్న ఒక జాతి స్వాతంత్ర్యం కోసం పోరాడే యితర ప్రజలకు సాయపడ్డం ఎలా సాధ్యపడుతుంది? యుద్ధంపట్ల కాంగ్రెస్ వైఖరిని నిర్ణయించేందుకు వార్ధాలో సెప్టెంబరు 10నుండి 14వరకు కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగింది. అభిప్రాయాల్లో వైవిధ్యానికి అవకాశం కల్పించేందుకు జాతీయవాద సాంప్రదాయాల్ని గమనంలో పెట్టుకుని సుభాస్ బోస్, ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాష్ నారాయణ కూడా ఆహ్వానింపబడ్డారు. ఈ సమావేశంలో తీవ్రమైన విభేదాలు వ్యక్తమయ్యాయి. గాంధీజీ మిత్రరాజ్యాలపట్ల సానుభూతితో కూడిన వైఖరితో వున్నాడు. పశ్చిమ యూరపులోని ప్రజాస్వామ్య రాజ్యాలకు, హిట్లరు అధిపతిగావున్న నియంతృత్వ నాజీ రాజ్యానికి మధ్య స్పష్టమైన తేడావుందని ఆయన విశ్వసించాడు. ఇక యుద్ధం సామ్రాజ్యవాదయుద్ధమని, ఇరుపక్షాలు వలస రాజ్యాల సరిహద్దుల్ని విస్తరించుకోడానికి పోట్లాడుతున్నాయని సోషలిస్టులు, సుభాస్ బోస్ వాదించారు. కాబట్టి ఇరుపక్షాలలో దేనినీ సమర్ధించే ప్రశ్న ఉత్పన్నం కాకూడదన్నారు. దానికి బదులుగా పరిస్థితిని అవకాశంగా తీసుకొని వెంటనే సహాయనిరాకరణోద్యమాన్ని ప్రారంభించి స్వాతంత్ర్యం సాధించాలన్నారు.

ఈ అంశంపై జవహర్‌లాల్ నెహ్రూ వైఖరి వేరుగా వుంది. నాజీ దురాక్రమణ ప్రమాదాలకు వ్యతిరేకంగా ప్రపంచాన్ని ఆయన చాలా సంవత్సరాల నుండి హెచ్చరిస్తూ వున్నాడు. ప్రజాస్వామ్యానికి, ఫాసిజానికి మధ్యగల తేడాని స్పష్టంగా గుర్తించాడు. బ్రిటన్, ఫ్రాన్స్, పోలెండ్‌ల పక్షాన న్యాయం వుందని నమ్మాడు. కాని అదే సమయంలో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సామ్రాజ్యవాద దేశాలని, మొదటి ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుండి పరిపక్వమవుతున్న పెట్టుబడిదారీ విధానం యొక్క అంతర్గత వైరుధ్యాల ఫలితం యుద్ధమని కూడా నమ్మాడు. కాబట్టి భారతదేశం స్వాతంత్ర్యం పొందేవరకు యుద్ధంలో చేరకూడదని, అలాగే వెంటనే పోరాటం ప్రారంభించి బ్రిటన్ యిబ్బందుల్ని అవకాశంగా తీసుకోకూడదని వాదించాడు. గాంధీజీ వైఖరిని ఆయన సన్నిహిత సహచరులైన సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్‌లాంటి వారు కూడా బలపరచకపోవడం గమనించాడు. ఫలితంగా గాంధీజీ నెహ్రూ వైఖరిని బలపరచాలని నిర్ణయించాడు. అది కార్యవర్గం యొక్క ఆమోదం పొందింది. తీర్మానం పోలెండుపై నాజీదాడిని, అలాగే నాజీయిజాన్ని, ఫాసిజాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే, ప్రజాస్వామ్య స్వేచ్ఛకొరకు చేయబడుతున్న యుద్ధంగా చెప్పుకొంటున్న బ్రిటన్, అలాంటి స్వేచ్ఛని భారతదేశానికి తిరస్కరిస్తున్నందున భారతదేశం యుద్ధంలో భాగస్వామి కాకూడదని ప్రకటించింది. బ్రిటన్ ప్రజాస్వామ్యం కొరకు, స్వేచ్ఛకొరకు యుద్ధం చేస్తున్నట్లయితే దానిని భారతదేశంలో నిరూపించాలి. యుద్ధం ముగిసిన తరువాత తన యుద్ధ లక్ష్యాలు భారతదేశంలో ఏ విధంగా అమలుజరుపబడతాయో ప్రకటించాలి. అప్పుడు యుద్ధ ప్రయత్నాలలో భారతదేశం, యితర ప్రజాస్వామ్య దేశాలతో సంతోషంగా కలుస్తుంది. కాని నిర్ణయం తీసుకొనడానికి ఎక్కువ సమయం పట్టకూడదని తీర్మానం హెచ్చరించింది. నెహ్రూ చెప్పినట్లు కాంగ్రెస్ నాయకత్వం వైస్రాయికి, బ్రిటిషు ప్రభుత్వానికి ప్రతి అవకాశం యివ్వాలని కోరుకొంటుంది.

బ్రిటిషు ప్రభుత్వం యొక్క స్పందన పూర్తిగా ప్రతికూలంగా వున్నది. 1939 అక్టోబర్ 17న వైస్రాయి లిన్‌లిత్‌గౌ ఆచితూచి చేసిన ప్రకటనలో భారతీయులలో వున్న విభేదాల్ని పదేపదే ప్రస్తావించాడు. కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా ముస్లింలీగుని, స్వదేశీ సంస్థానాధీశుల్ని ఉపయోగించుకొనే ప్రయత్నం చేశాడు. బ్రిటన్ దురాక్రమణని అడ్డుకొంటుందని చెప్పడం మినహా బ్రిటన్ యుద్ధ లక్ష్యాల్ని నిర్వచించ నిరాకరించాడు. అవసరమనిపిస్తే, ప్రభుత్వం సలహా పొందేందుకు తక్షణమే ఒక సంప్రదింపుల కమిటీని నియమిస్తుందని చెప్పారు. భవిష్యత్‌లో యుద్ధం ముగిసిన తరువాత బ్రిటిషు ప్రభుత్వం

వివిధ మతాల, పార్టీల స్వదేశీ సంస్థానాల ప్రతినిధులతో భారత ప్రభుత్వ చట్టం 1935లో ఎలాంటి మార్పులు చేయాలనే విషయంపై సంప్రదింపులు జరుపుతుందన్నారు. కొన్ని నెలల తరువాత అనధికారికంగా బ్రిటిషు ప్రభుత్వ కార్యదర్శి జెట్‌లాండుకు పంపిన సమాచారంలో లిన్‌లిత్‌గౌ "భారతదేశంలో బ్రిటిషు పాలన ముగిసిన తరువాతికాలాన్ని గురించి మాట్లాడడం పట్ల నాకంత ఆసక్తిలేదు. అలాంటి రోజు దరిదాపుల్లో లేదు. దానిని గురించి ఎంత తక్కువగా చెపితే అంతమంచిది." అక్టోబర్ 18న జెట్‌లాండ్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో మాట్లాడుతూ, భారతీయులలో – ప్రత్యేకించి హిందూ, ముస్లింల మధ్య విభేదాల్ని గురించి నొక్కిచెప్పాడు. కాంగ్రెస్‌పై పూర్తి హిందూసంస్థ ముద్ర వేశాడు. ఆ విధంగా బ్రిటిషు ప్రభుత్వానికి యుద్ధకాలంలోగాని, యుద్ధం తరువాతగానీ భారతదేశంపై పట్టుసడలించే ఉద్దేశం లేదని స్పష్టమయింది. అవసరమైతే కాంగ్రెస్‌ని శత్రువుగా పరిగణిస్తుంది.

భారత ప్రజలు, జాతీయ నాయకత్వం తీవ్రంగా స్పందించారు. బ్రిటన్‌కి దాదాపు షరతులులేని మద్దతు యివ్వాలని చెపుతూ వచ్చిన గాంధీజీ ఆగ్రహోదగ్రుడయ్యాడు. విభజించి పాలించే బ్రిటిషు ప్రభుత్వ పాత విధానాన్ని గురించి ప్రస్తావిస్తూ ఆయనిలా అన్నాడు. "బ్రిటన్ అడ్డుకొనగలిగితే భారతదేశానికి ప్రజాస్వామ్యం రాదని వైస్రాయి ప్రకటన స్పష్టం చేస్తున్నది... కాంగ్రెస్ రొట్టె ముక్క అడిగింది. రాయిని పొందింది." మైనారిటీలను యింకా సంస్థానాధీశులు, విదేశీ పెట్టుబడిదారులు, జమిందారులు లాంటి ప్రత్యేక ప్రయోజనాలు గలవారిని గురించి ప్రస్తావిస్తూ గాంధీజీ యిలా అన్నాడు. "భారతదేశ స్వాతంత్ర్యానికి భంగం కలిగించే కోరికలు కోరనంత వరకు ప్రతి మైనారిటీ వర్గం యొక్క హక్కులకు కాంగ్రెస్ రక్షణ కల్పిస్తుంది." ఆయన యింకా యిలా అన్నారు. "సాధారణ ప్రజల నిజమైన ప్రయోజనాలతో ఘర్షణపడే ఎలాంటి ప్రయోజనాల్ని స్వతంత్ర భారతదేశం సహించదు."

అక్టోబర్ 23నాటి కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం వైస్రాయి ప్రకటనని సామ్రాజ్యవాద విధానాన్ని తిరిగి చెప్పటంగా పేర్కొంటూ తిరస్కరించింది. యుద్ధానికి మద్దతు యివ్వకూడదని నిర్ణయించింది. కాంగ్రెస్ మంత్రివర్గాన్ని రాజీనామా చేయవలసిందిగా పిలుపునిచ్చింది. జాతీయోద్యమం యొక్క క్రమశిక్షణాయుత సైనికులుగా మంత్రులు రాజీనామా చేశారు. కాని కాంగ్రెస్ నాయకత్వం యింకా చేతులు ముడుచుకు కూర్చున్నది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం తక్షణమే పెద్దఎత్తున చేపట్టాలని

పిలుపుయిచ్చేందుకు విముఖంగా వున్నది. అంతేగాక అక్టోబర్ 23నాటి కార్యవర్గ తీర్మానం తొందరపాటు చర్యలు చేపట్టవద్దని కాంగ్రెస్ కార్యకర్తల్ని హెచ్చరించింది.

* * *

యుద్ధం పట్ల వైఖరి, మంత్రివర్గాల రాజీనామా సమస్యలపై కాంగ్రెస్‌లో ఏకాభిప్రాయం వున్నప్పటికీ వెంటనే ప్రజా సత్యాగ్రహం చేపట్టే సమస్యపై తీవ్రమైన విభేదాలు తలెత్తాయి. గాంధీజీ, కాంగ్రెస్‌పై ఆధిపత్యంగల యితర నాయకత్వం వెంటనే ఉద్యమం ప్రారంభించకపోవడానికి మూడు కారణాలు చెప్పారు. మొదటిది: మిత్ర రాజ్యాలైన బ్రిటన్, ఫ్రాన్స్‌ల పక్షాన న్యాయం వుంది. యుద్ధం కొనసాగించడంలో వారికి యిబ్బందులు వుండకూడదు. రెండవది : హిందూ, ముస్లిం ఐక్యత లోపించడం పోరాటానికి ఆటంకం. ప్రస్తుతమున్న వాతావరణంలో ఎలాంటి సహాయ నిరాకరణోద్యమమైన మతఘర్షణగా లేక అంతర్యుద్ధంగా మారే ప్రమాదం వుంది. అంతేగాక, దేశంలో వెంటనే పోరాటం చేపట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు లేవు. ప్రజలు సిద్ధంగా లేరు. కాంగ్రెస్ నిర్మాణపరంగా కూడా పోరాటం చేపట్టగలిగే స్థితిలోలేదు. కాంగ్రెస్ సంస్థ బలహీనంగా వున్నది. 1938-39 కాలంలో అవినీతిమయమయింది. కాంగ్రెస్ శ్రేణులలో క్రమశిక్షణా రాహిత్యం, సమన్వయ లోపం అలముకొన్నాయి. ఈ పరిస్థితులలో చేపట్టే ప్రజా ఉద్యమం ప్రభుత్వ అణచివేత చర్యలను తట్టుకొని నిలబడలేదు. కాబట్టి ప్రజల్ని పోరాటానికి సన్నద్ధం చేసేందుకు, బలహీనతల్ని అధిగమించి కాంగ్రెస్ సంస్థని సరియైన మార్గంలో పెట్టేందుకు, చర్చలతో అంగీకారానికి రావడానికి గల అవకాశాలన్నింటినీ ఉపయోగించుకొనే విధంగా రాయబారాలు సాగించడానికి, ప్రభుత్వానిది తప్పని స్పష్టంగా కనబడేవరకు ప్రజలలో తీవ్రమైన రాజకీయ కార్యకలాపాలు చేపట్టాలి.

ప్రజలు పోరాటానికి సిద్ధపడినప్పుడు, కాంగ్రెస్ సంస్థని దృఢంగా నిలబెట్టగలిగినప్పుడు, ప్రభుత్వం చేపట్టే తీవ్రమైన అణచివేత చర్యలకు ప్రజాపోరాటం తప్పనిసరియైన అవసరమని ప్రజలు భావించినప్పుడు పోరాటం చేపట్టవలసిన సమయం వచ్చినట్లవుతుంది. ఈ దృక్పథాన్ని సంక్షిప్తీకరించి తీర్మానంగా 1940 మార్చి రామ్‌ఘర్ కాంగ్రెస్ సదస్సు ముందుంచింది. తీర్మానం యుద్ధంపై కాంగ్రెస్ వైఖరిని పునరుద్ఘాటిస్తూ సంపూర్ణ స్వాతంత్ర్యం తప్ప మరేదీ ప్రజలకామోదయోగ్యం కాదని నిర్ధారిస్తూ, తగిన సమయం ఆసన్నమైనదని కాంగ్రెస్ భావించినప్పుడు లేక

పరిస్థితులు అనివార్యం చేసినప్పుడు, కాంగ్రెస్ సహాయ నిరాకరణ చేపడుతుందని స్పష్టం చేసింది.

ప్రధానమైన నాయకత్వం యొక్క వైఖరికి ప్రత్యామ్నాయం వివిధ వామపక్ష గ్రూపులు, సుభాస్‌బోసు ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టుపార్టీ, రాయిస్టుల నుండి ముందుకి వచ్చింది. యుద్ధం సామ్రాజ్యవాద యుద్ధమని, బ్రిటిషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పూర్తిస్థాయి పోరాటం చేపట్టడం ద్వారా స్వాతంత్ర్యం సాధించేందుకు యుద్ధ సంక్షోభం అవకాశం కల్పించిందని వామపక్షవాదులు నొక్కిచెప్పారు. కార్యాచరణకు ప్రజలు సిద్ధంగా వున్నారని, నాయకత్వం నుండి పిలుపు కొరకు ఎదురుచూస్తున్నారని నమ్మారు. మతతత్వ సమస్య, కాంగ్రెస్ సంస్థలో బలహీనతలు వున్నాయని అంగీకరించారు. కాని ప్రజాపోరాటం ప్రారంభింపబడితే అవి చాలా సులభంగా, వాటంతటవే కొట్టుకుపోతాయని నమ్మారు. సంస్థాపరమైనబలం పోరాటం ముందుగాక పోరాటక్రమంలో నిర్మించ బడుతుందన్నారు. కాంగ్రెస్ నాయకత్వం యొక్క 'వేచిచూద్దాం' విధానాన్ని నిశితంగా విమర్శిస్తూ నాయకత్వం ప్రజల్నిచూసి భయపడుతుందని, పోరాటం పట్ల ఆసక్తి కోల్పోయిందని, ఫలితంగా అరకొర రాయితీలకొరకు సామ్రాజ్యవాదంతో బేరసారాలాడ యత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రజాపోరాటానికి తక్షణచర్యలు చేపట్టవలసిందిగా కాంగ్రెస్ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చారు.

తక్షణ పోరాటం యొక్క అవసరాన్ని అంగీకరిస్తున్న వామపక్షశక్తులలో కూడా రాజకీయశక్తుల బలాన్ని అర్థం చేసుకొనడంలోను, కాంగ్రెస్ ప్రధాన నాయకత్వం తక్షణం పోరాటానికి అంగీకరించకపోతే చేపట్టవలసిన కార్యాచరణ విషయంలోనూ భిన్నాభిప్రాయాలు వున్నాయి. వెంటనే పోరాటం చేపట్టకపోతే వామపక్షాలు కాంగ్రెస్‌ని విభజించాలని, తనంతట తాను పోరాటం ప్రారంభించేందుకు సమాంతర కాంగ్రెస్‌ని నిర్మించాలని బోస్ కోరాడు. ప్రజలు, కాంగ్రెస్‌లోని అత్యధిక మెజారిటీ వామపక్షాల నాయకత్వంలోని సమాంతర కాంగ్రెస్‌కి మద్దతుయిచ్చి అది ప్రారంభించే ఉద్యమంలో చేరతారని ఆయన నమ్మాడు. ఈ అభిప్రాయంతో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ విభేదించాయి. వామపక్షవాదుల పలుకుబడిని గురించి బోస్ అతిగా అంచనాలు వేస్తున్నాడని, గాంధీజీ నాయకత్వం, కాంగ్రెస్ లేకుండా పోరాటం సాధ్యపడదని అవి నమ్మాయి. కాబట్టి కాంగ్రెస్ విడిపోకుండా ఆ విధంగా జాతీయ

ఐక్య సంఘటన విచ్ఛిన్నంగాకుండా వుండేందుకు, కాంగ్రెస్ నాయకత్వం పోరాటం ప్రారంభించే విధంగా ఒత్తిడిచేసి ఒప్పించేందుకు ప్రయత్నం చేయాలని నిర్ణయించాయి.

జవహర్‌లాల్ నెహ్రూ సందిగ్ధావస్థలో వున్నాడు. ఒకవైపు మిత్రరాజ్యాల సామ్రాజ్యవాద యుద్ధ స్వభావాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నాడు. మరొకవైపు యూరపులో హిట్లర్ నాజీ విజయాన్ని అడ్డుకొనేందుకు చేయగలిగిందేమీ లేదు. తన వ్యక్తిత్వం, రాజకీయ ఆలోచనలు సహాయ నిరాకరణ త్వరగా ప్రారంభించాలని ఒత్తిడి చేస్తున్నాయి. కాని యూరపులో నాజీ వ్యతిరేక యుద్ధాన్ని జపాన్ దురాక్రమణకి వ్యతిరేకంగా చైనా ప్రజల పోరాటానికి చేయగలిగిందేమీ లేదు. చివరికి గాంధీజీని కాంగ్రెస్ నాయకత్వంలోని మెజారిటీని అనుసరించడంతో నెహ్రూ సందిగ్ధం పరిష్కరించబడింది.

* * *

రాజకీయాలు స్థిమితంగా ఎక్కువకాలం కొనసాగవు. కాంగ్రెస్ నాయకత్వం సహనం, ప్రజల సహనం నశించింది. ముస్లిం మతతత్వవాదులతో కాంగ్రెస్ అంగీకారానికి వచ్చేవరకు రాజ్యాంగపరమైన పురోగతి వుండదనే వైఖరి నుండి ప్రభుత్వం ఒక అడుగుకూడా వెనక్కివేయడానికి సిద్ధపడలేదు. మాట్లాడే స్వేచ్ఛని, పత్రికా స్వేచ్ఛని, సమావేశాలు ఏర్పాటుచేసుకొనే స్వేచ్ఛని హరిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్సులపై ఆర్డినెన్సులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా జాతీయవాద కార్యకర్తలు – ప్రత్యేకించి వామపక్షాలకు చెందిన వారు నిర్బంధించబడ్డారు. జైళ్ళలో కుక్కబడ్డారు. ప్రజా పోరాటానికి ఎలాంటి చర్యలు చేపట్టినా కాంగ్రెస్‌ని అణచివేయడానికి ప్రభుత్వం సన్నద్ధమయింది.

ఈ పరిస్థితులలో భారత ప్రజలు తమ సహనం బలహీనత కాదని బ్రిటిషు ప్రభుత్వానికి చూపించే సమయం వచ్చినట్లు భావించారు. 'విడిపోతున్నదారులు' అనే వ్యాసంలో నెహ్రూ యిలా వ్రాశాడు. "యుద్ధ విమానాలు, ట్యాంకులు గల సాయుధ ప్రపంచంలో మనం చాలా బలహీనంగా వున్నామని బ్రిటిషు పాలకుల విశ్వాసం. కాని విధ్వంసకాయుధాల ఘర్షణా ప్రపంచంలో విస్మరించరాని, గౌరవహీనంగాని, బలహీనపడని మానవస్ఫూర్తి, జాతీయస్ఫూర్తి మనకు వున్నాయి." 1940 సంవత్సరం చివరలో కాంగ్రెస్ ప్రజాపోరాటానికి మరొకమారు నాయకత్వం వహించవలసిందిగా గాంధీజీని కోరింది. గాంధీజీ తన విస్తృతమైన ఎత్తుగడల దృక్పథంతో ప్రజాపోరాటానికి దారితీసే చర్యలు ప్రారంభించాడు. ప్రతి ప్రాంతంలో ఎంపికచేయబడిన వ్యక్తులతో వ్యక్తిగత ప్రాతిపదికపై

పరిమితమైన సత్యాగ్రహాన్ని ప్రారంభించాలని నిర్ణయించాడు. యుద్ధంలో పాల్గొనరాదని, స్వేచ్ఛగా మాట్లాడేహక్కు లేక ప్రచారం చేసుకొనే హక్కు కావాలని సత్యాగ్రహి డిమాండ్ చేస్తాడు. "బ్రిటిషు యుద్ధయత్నానికి మనుషులతోగాని, డబ్బుతోగాని సహాయం చేయడం తప్పు. యుద్ధాన్ని అహింసాయుతంగా అడ్డుకోవాలి" – అని సత్యాగ్రహి బాహాటంగా ప్రకటిస్తాడు. సత్యాగ్రహి తాను యుద్ధ వ్యతిరేక ఉపన్యాసం ఎక్కడ ఏ సమయంలో యిచ్చేది ముందుగా జిల్లా మేజిస్ట్రేట్‌కి తెలియజేస్తాడు. చాలా జాగ్రత్తగా ఎంపిక చేయబడిన సత్యాగ్రహులు – వినోభాభావె 1940 అక్టోబర్ 17న మొదటి సత్యాగ్రహి, జవహర్‌లాల్ నెహ్రూ రెండవ సత్యాగ్రహి– వేదికపై కనిపించగానే జనం వారిచుట్టూ మూగారు. వారి ఉపన్యాసాలు పూర్తిచేసిన తరువాతనే వారిని అధికారులు అరెస్టు చేయగలిగారు. ప్రభుత్వం సత్యాగ్రహిని అరెస్టు చేయకపోతే అతడు లేక ఆమె మరల మరలా అదేపని చేస్తారు. గ్రామాలలోకి వెళతారు. చలో ఢిల్లీ ఉద్యమంలో భాగస్వామి అవుతారు.

వ్యక్తి సత్యాగ్రహం ఉధృతంగా కాకుండా చాలా తక్కువ మోతాదులో ప్రారంభమైనట్లు గాంధీజీ వైస్రాయికి వ్రాసిన లేఖలో పేర్కొన్నారు. "నాజీయిజం విజయానికి ఏ బ్రిటిషు పౌరుడైనా ఎంత విముఖుడో కాంగ్రెస్ కూడా అంత విముఖం. కాని దానిని యుద్ధంలో పాల్గొనేటంత దూరం తీసుకుపోలేం. మీరు, భారతరాజ్య కార్యదర్శి కలిసి యావద్భారతదేశం స్వచ్ఛందంగా యుద్ధ కృషిలో తోడ్పడుతున్నట్లు ప్రకటించారు. కాబట్టి వివరణ యివ్వడం అవసరం. భారత ప్రజానీకంలో అత్యధిక భాగానికి మీ యుద్ధ కృషిలో ఎటువంటి ఆసక్తిలేదు. నాజీయిజానికి, ఇండియాని పాలించే ద్విగుణీకృత నిరంకుశత్వానికి మధ్య వాళ్ళు తేడా చూడరు."

వ్యక్తి సత్యాగ్రహానికి రెండు ప్రయోజనాలు వున్నాయి. భారత ప్రజల రాజకీయ ఆలోచనల్ని, వారి డిమాండ్లను శాంతియుతంగా ఆమోదించేందుకు బ్రిటిషు ప్రభుత్వానికి మరొక అవకాశం యిచ్చింది. నాజీ వ్యతిరేక భావాల కారణంగా గాంధీజీ, కాంగ్రెస్ బ్రిటిషు క్లిష్ట పరిస్థితిని అవకాశంగా తీసుకొని భారతదేశంలో ప్రజల తిరుగుబాటుద్వారా బ్రిటిషు ప్రభుత్వాన్ని యిరకాటంలో పెట్టేందుకు యింకా విముఖంగానే వున్నారు. అంతకంటే ముఖ్యంగా గాంధీజీ రానున్న పోరాటానికి ప్రజల్ని సన్నద్ధం చేయడం ప్రారంభించాడు. కాంగ్రెస్ సంస్థ సరియైన స్థితికి తీసుకొని రాబడింది. అవకాశవాదశక్తులు గుర్తించబడి సంస్థ నుండి వెలివేయబడ్డాయి. అంతేగాక ప్రజలు రాజకీయంగా చైతన్యవంతం చేయబడ్డారు. సంఘటిత పరచబడ్డారు. 1941 మే 15నాటికి వ్యక్తిగతంగా సహాయ

నిరాకరణ చేపట్టినందుకు 25,000మంది దోషులుగా నిర్ధారింపబడ్డారు. ఇంకా చాలా మంది క్రిందిస్థాయి కార్యకర్తలు వదలివేయబడ్డారు.

* * *

1941లో బ్రిటిషు రాజకీయాలలో రెండు పెద్ద మార్పులు సంభవించాయి. పోలెండ్, బెల్జియం, హాలెండ్, నార్వే, ఫ్రాన్స్, తూర్పు యూరప్‌లను ఆక్రమించుకొన్న నాజీ జర్మనీ 1941 జూన్ 22న సోవియట్ యూనియన్‌పై దాడిచేసింది. ఇక తూర్పున డిసెంబర్ 7న జపాన్ పెరల్ హార్బర్‌లో అమెరికా నౌకాశ్రేణిపై మెరుపుదాడి చేసింది. ఫిలిప్పీన్స్, ఇండోచైనా, ఇండోనేషియా, మలేసియా, బర్మాలను ఆక్రమించింది. 1942లో రంగూన్‌ని ఆక్రమించింది. యుద్ధం భారతదేశం గుమ్మంలోకి వచ్చిపడింది. అప్పటి బ్రిటిషు ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ బర్మా, సిలోన్, కలకత్తా, మద్రాస్ శత్రువుల హస్తగతం కావచ్చని బ్రిటిషు రాజుకి చెప్పాడు.

డిసెంబర్ మొదటిలో విడుదలైన భారతదేశ నాయకులు భారతదేశ భద్రత రక్షణలను గురించి ఆందోళన చెందారు. సోవియట్ యూనియన్‌పై హిట్లరు దాడి యుద్ధ స్వభావాన్ని మార్చిందని చాలామంది అభిప్రాయపడ్డారు. 'ఆసియా ఆసియా వాసులకే' అని గతంలో జపాన్ యిచ్చిన నినాదాన్ని గాంధీజీ నిరసించాడు. జపాన్ వస్తువుల్ని బహిష్కరించమని భారతీయులకు పిలుపు యిచ్చాడు. యుద్ధం తరువాత భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రాన్ని యిచ్చేందుకు బ్రిటన్ అంగీకరిస్తే భారతదేశ రక్షణకు మిత్రరాజ్యాల యుద్దానికి పూర్తిగా సహకరిస్తామని డిసెంబరు చివరలో కాంగ్రెస్ కార్యవర్గం గాంధీ, నెహ్రూల అభ్యంతరాలను త్రోసిపుచ్చి తీర్మానాన్ని ఆమోదించింది. ఈ దశలో గాంధీజీ నెహ్రూని తన వారసునిగా ప్రకటించాడు. 1941 జనవరి 15న ఎ.ఐ.సి.సి.నుద్దేశించి మాట్లాడుతూ యిలా చెప్పాడు. "నేను, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పూర్తిగా విడిపోయామని అంటున్నారు. విడిపోవడానికి అభిప్రాయభేదాల కంటే పెద్ద కారణాలుండాలి. మేము కలిసిపనిచేయడం ప్రారంభమైనప్పటి నుండి అభిప్రాయ భేదాలు వున్నాయి. అయినప్పటికీ నేను కొన్ని సంవత్సరాల నుండి చెపుతూ వచ్చాను. ఇప్పుడూ చెపుతున్నాను. నా వారసుడు రాజాజీ (సి.రాజగోపాలాచారి) కాదు. నెహ్రూ నా వారసుడు. నా భాష అతనికి అర్థంకాదు అంటాడు. నాకు విదేశీయంగా కనిపించే భాష ఆయన మాట్లాడతాడు. ఇది వాస్తవం కావచ్చు; కాకపోనూవచ్చు.

కాని మనస్సులు కలవడానికి భాష ఆటంకం కాదు. నేను పోయిన తరువాత అతడు నా భాష మాట్లాడతాడని నాకు తెలుసు.”

* * *

యుద్ధ పరిస్థితి క్షీణించడంతో యుద్ధంలో భారతీయుల సహకారం పొందవలసిందిగా చర్చిల్‌పై అమెరికా అధ్యక్షుడు రూజ్వెల్ట్, చైనా అధ్యక్షుడు చాంగ్‌కైషేక్, బ్రిటన్ లేబరు పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చారు. సహకారం పొందేందుకు బ్రిటిషు ప్రభుత్వం 1942 మార్చిలో క్రిప్సుని రాయబారిగా పంపింది. క్రిప్సు బ్రిటిషు మంత్రివర్గంలో కేబినెట్ మంత్రి. గతంలో భారత జాతీయోద్యమానికి మద్దతు ప్రకటించిన వాడు. భారతదేశంలో వీలైనంత త్వరలో స్వయంపరిపాలన బ్రిటిషు లక్ష్యంగా క్రిప్సు ప్రకటించినప్పటికీ అతడు తీసుకొని వచ్చిన ముసాయిదా ప్రకటన నిరాశపరిచేదిగా వుంది. ప్రకటన భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తిని, రాజ్యాంగాన్ని తయారుచేసే కమిటీని వాగ్దానం చేసింది. రాజ్యాంగాన్ని తయారుచేసే కమిటీలో రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులు, స్వదేశీ సంస్థానాలలో పాలకులచే ఎంపిక చేయబడిన సభ్యులు వుంటారు. కొత్త రాజ్యాంగాన్ని అంగీకరించేందుకు సిద్ధపడని ఏ రాష్ట్రమైనా బ్రిటన్‌తో ప్రత్యేకమైన ఒప్పందం కుదుర్చుకొనే హక్కు వుంటుంది – అనే షరతు పెట్టడంతో పాకిస్తాన్ డిమాండ్‌కు అవకాశం కల్పించబడింది. ప్రస్తుతానికి దేశరక్షణపై పూర్తి అదుపు బ్రిటిషు ప్రభుత్వానికి వుంటుంది. ప్రకటనను భారత రాజ్య కార్యదర్శి అమెరీ అభివృద్ధి నిరోధకమైన, పరిమితమైన ప్రకటనగా పేర్కొన్నారు. క్రిప్సుకి స్నేహితుడైన నెహ్రూ ఆ తరువాత యిలా వ్రాశాడు. “మొదటిసారిగా ఈ ప్రకటన చదివినప్పుడు నేను పూర్తిగా నిస్పృహకు గురయ్యాను.”

క్రిప్సుకి, కాంగ్రెస్ నాయకులకు మధ్య చర్చలు విఫలమయ్యాయి. సంపూర్ణ స్వాతంత్ర్యానికి బదులుగా అధినివేశ ప్రతిపత్తి పట్ల, రాజ్యాంగ అసెంబ్లీలో స్వదేశీ సంస్థానాల ప్రతినిధులు ప్రజలచే ఎన్నుకొనబడేవారుగాక సంస్థానాలచే ఎంపిక చేయబడినవారికి అవకాశం కల్పించడం పట్ల, అన్నిటిని మించి దేశ విభజనకు అవకాశం కల్పించడం పట్ల కాంగ్రెస్ అభ్యంతరం తెలిపింది. భారతీయులకు రాజకీయాధికారాన్ని వెంటనే బదిలీ చేయాలన్న డిమాండుని, భారతదేశ రక్షణలో నిజమైన భాగస్వామ్యాన్ని బ్రిటిషు ప్రభుత్వం తిరస్కరించింది. చర్చలు విఫలం కావడానికి

ముఖ్యమైన కారణం చర్చలు జరపడంలో క్రిప్సు యొక్క అశక్తత. ముసాయిదా ప్రకటనని మించి మాట్లాడకూడదని క్రిప్సుపై ఆంక్షలు విధించబడ్డాయి. అంతేగాక చర్చిల్, భారత రాజ్యకార్యదర్శి అమెరీ, వైస్రాయి లిన్‌లిత్‌గో, కమాండర్ ఇన్ ఛీఫ్ వేవల్ – అందరూ క్రిప్సు రాయబారం జయప్రదం కావాలని కోరుకోలేదు. భారతీయుల అభిప్రాయానికి అవకాశం కల్పించే క్రిప్సు ప్రయత్నాలను అడ్డుకొన్నారు. నిరాశా నిస్పృహలకు గురయిన భారత ప్రజల్ని వదలి ఏప్రిల్ మధ్యలో క్రిప్సు స్వదేశానికి వెళ్ళాడు. భారత ప్రజలకు ఫాసిస్టు వ్యతిరేకశక్తుల పట్ల ప్రత్యేకించి చైనా, సోవియట్ ప్రజల పట్ల సానుభూతి వున్నప్పటికీ దేశంలో అప్పుడున్న పరిస్థితులు భరింపరానివిగా తయారయ్యాయి. సామ్రాజ్యవాదంపై తుది దాడిచేసే సమయం వచ్చినట్లు భావించారు.

* * *

# 35 క్విట్ ఇండియా ఉద్యమం భారత జాతీయ సైన్యం

'క్విట్ ఇండియా', 'భారత్ ఛోడో'. సాధారణమైన కాని అతి శక్తివంతమైన ఈ నినాదం ఆగస్టు విప్లవం అని కూడా పిలువబడే ప్రఖ్యాత ఐతిహాసిక పోరాటాన్ని ప్రారంభించింది. ఈ పోరాటంలో దేశంలోని సాధారణ ప్రజలు సాటిలేని సాహసాన్ని అపూర్వమైన సమరశీలతను ప్రదర్శించారు. వారు గతంలో ఎన్నడూలేనంత తీవ్రమైన అణచివేతను ఎదుర్కొన్నారు. యుద్ధయత్నాల సమర్థన నెపంతో ప్రభుత్వం రాక్షస చట్టాలతో సాయుధమయింది. సాధారణ పౌరస్వేచ్ఛను హరించివేసింది. ఏ రాజకీయచర్యయైనా– ఎంత శాంతియుతమైనదైనా చట్టబద్ధమైనదైనా ఈ కాలంలో చట్టవిరుద్ధమైన విప్లవాత్మక చర్య అయింది.

పాశవికంగా అణచివేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్న ఈ క్లిష్ట పరిస్థితులలో ఉద్యమం ప్రారంభించడం ఎందుకవసరమయింది?

* * *

యుద్ధకాలంలో నిజమైన రాజ్యాంగపరమైన పురోగతి కొరకు గౌరవప్రదమైన పరిష్కారాన్ని సూచించేందుకు బ్రిటన్ సిద్ధంగాలేదని, యుద్ధ యత్నాలలో భారతదేశం యొక్క యిష్టంలేని భాగస్వామ్యం కొనసాగాలని బ్రిటన్ స్థిర నిర్ణయంతో వుందని 1942 ఏప్రిల్ నాటి క్రిప్సు రాయబార వైఫల్యం స్పష్టం చేసింది. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధయత్నానికి అడ్డుపడే ఎలాంటి చర్య చేపట్టరాదని నెహ్రూ, గాంధీజీలాంటి కాంగ్రెస్ నాయకులు భావించారు. 1939 నుండి ప్రజా పోరాటం చేపట్టాలని వాదిస్తున్న

వారిని అదుపు చేస్తూ వచ్చారు. ఎంతో సంయమనం పాటించారు. కాని ఇకముందు కూడా మౌనంగా వుండడమంటే భారత ప్రజల ఆశలు ఆకాంక్షలతో సంబంధం లేకుండా, భారతదేశ భవితవ్యాన్ని నిర్ణయించేందుకు బ్రిటిషు ప్రభుత్వానికి హక్కువుందని అంగీకరించడమే అవుతుందని క్రిప్సు చూపిన రిక్తహస్తాలు నమ్మించాయి. నెహ్రూలాగానే గాంధీజీ కూడా ఫాసిస్టు వ్యతిరేక యుద్ధానికి – ప్రత్యేకించి రష్యా, చైనా ప్రజల యుద్ధానికి ఎలాంటి ఆటంకం కలిగించరాదని కోరాడు. 1942 ఏప్రిల్ నాటికి యుద్ధం యొక్క అనివార్యతని గుర్తించాడు. క్రిప్సు దేశాన్ని వదలివెళ్ళిన 15రోజుల తరువాత గాంధీజీ బ్రిటన్ అధికారం వదులుకొని వెళ్ళాలని, జపాన్ దాడికి వ్యతిరేకంగా అహింసాయుత సహాయ నిరాకరణ చేపట్టాలని కాంగ్రెస్ కార్యవర్గానికి ఒక తీర్మానం తయారుచేశారు. కాంగ్రెస్ సవాల్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక అధికారాలతో బ్రిటన్ సాయుధమవుతుండగా కాంగ్రెస్ 'క్విట్ ఇండియా'కి సన్నద్ధమయింది. నెహ్రూ 1942 ఆగస్టు వరకు పోరాటం చేపట్టే ఆలోచనని వ్యతిరేకించాడు. ఆగస్టు నెలాఖరుకి సుముఖుడయ్యాడు.

పట్టూవిడుపూలేని బ్రిటిషు వైఖరేగాక పోరాటాన్ని అవసరమూ, అనివార్యమూ చేసిన యితర అంశాలూ వున్నాయి. యుద్ధకాలంలో వస్తువుల కొరతలు, ధరల పెరుగుదలతోపాటు ప్రజల అసంతృప్తి క్రమంగా పెరిగాయి. జపాన్ వాళ్ళు పడవల్ని ఉపయోగించుకోకుండా అడ్డుకొనేందుకు ప్రభుత్వం బెంగాల్, ఒరిస్సాలలో పడవల్ని జప్తు చేయడంలాంటి చర్యలు ప్రజల ఆగ్రహాన్ని పెంచాయి.

బ్రిటిషు పతనం అనివార్యమనే భావం కూడా అసంతృప్తిని వ్యక్తీకరించేందుకు ప్రజల్ని ముందుకు నడిపింది. అంతేగాక మిత్ర రాజ్యాలకు ఎదురుదెబ్బలు, ఆగ్నేయాసియా బర్మాల నుండి బ్రిటిషు సేనల ఉపసంహరణ వార్తలు, అస్సాం, బర్మా సరిహద్దు నుండి గాయపడిన సైనికుల్ని తీసుకొనివస్తున్న రైళ్ళు – ఈ భావాన్ని ధృవీకరించాయి.

దీనికితోడు మలయా నుండి బర్మా నుండి బ్రిటిషువారు ఖాళీచేసిన విధానం కూడా ప్రజలపై ప్రతికూల ప్రభావం కలిగించింది. బ్రిటిషు ప్రభుత్వం తెల్లవారిని ఖాళీ చేయించింది. ఇతరుల్ని పట్టించుకోలేదు. ఆగ్నేయాసియాలో వున్న భారతీయులు, వారి బంధువులకు వ్రాసిన లేఖలలో ప్రజల్ని దురాక్రమణదారులైన జపాన్వారి దయాదాక్షిణ్యాలకు వదలిన బ్రిటిషుపాలకుల మోసపూరిత వైఖరి, కపటత్వం కళ్ళకు కట్టినట్లు వర్ణించబడింది. జపాన్ భారతదేశాన్ని ఆక్రమిస్తే యిక్కడ అలాగాక మరొకరకంగా

వ్యవహరిస్తారా? జాతీయ నాయకులు ప్రజాపోరాటం ప్రారంభించాలనే నిర్ణయానికి ప్రధానమైన కారణం ప్రజలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారనే భావం నాయకత్వానికి కలగడం. అలాంటి పరిస్థితులలో జపాన్ ఆక్రమణ జరిగితే ప్రతిఘటన కూడా సాధ్యపడకపోవచ్చు. జపాన్ దాడిని ప్రతిఘటించేందుకు ప్రజల శక్తియుక్తుల్ని ప్రజలకు తెలియజేయాలి. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలి.

బ్రిటిష ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పూర్తిగా సడలిపోయింది. రేపోమాపో ప్రభుత్వం కూలిపోతుందని ప్రజల విశ్వాసం. బ్యాంకుల్లో, పోస్టాఫీసుల్లో పొదుపు ఖాతాల డబ్బుని ప్రజలు వాపసు తీసుకొన్నారు. బంగారు, వెండి నాణాలను దాచుకొనడం ప్రారంభించారు. ఇలాంటి ఘటనలు తూర్పు యు.పి.లోను, బీహార్‌లోనూ ఎక్కువగా జరిగాయి. మద్రాసు ప్రెసిడెన్సీలో కూడా జరిగాయి.

పోరాటానికి పరిపక్వమైన పరిస్థితులు ఏర్పడినట్లు గాంధీజీ నమ్మాడు. జూన్ ప్రారంభంలో ఆయన లూయీఫిషర్‌కి యిచ్చిన ఇంటర్వ్యూలో యిలా చెప్పారు. “నా సహనం నశించింది. నేను కాంగ్రెస్‌ని ఒప్పించలేకపోవచ్చు.నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి చెపుతాను.” ఆయన నేరుగా ప్రజల వద్దకు వెళ్ళవలసిన అవసరం కలగలేదు. ప్రజాపోరాటం చేపట్టవలసిన సమయంపై కాంగ్రెస్ గాంధీ సలహాను ఆమోదించింది.

* * *

గాంధీజీ కొంతకాలం నుండి రానున్న పోరాటాన్ని గురించి మాట్లాడడం ప్రారంభించినప్పటికీ 1942 జులై 14న వార్ధాలో జరిగిన కార్యవర్గ సమావేశం పోరాటం చేపట్టాలని నిర్ణయించింది. దీనిని ఆగస్టులో బొంబాయిలో సమావేశంకానున్న అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఆమోదించవలసి వుంది.

బొంబాయిలోని గొవాలియా టాంకువద్ద ఆగస్టు చారిత్రక సమావేశం ప్రజలలో రేకెత్తించిన ఉత్కంఠ దృష్ట్యా అపూర్వమైనది. లోపల నాయకులు చర్చలు జరుపుతుంటే బయట గుంపులుగా వేలాదిమంది ప్రజలు నిరీక్షించారు. ప్రజల అంచనాలు చాలా దూరం వెళ్ళాయి. ఆ తరువాత జరిగిన బహిరంగసభకి హాజరైన వేలాదిమంది అతి నిశ్శబ్దంగా నాయకుల ఉపన్యాసాలు విన్నారు.

అతి సాధారణంగా, ఎలాంటి పదాడంబరం లేని రీతిలో సాగిన గాంధీజీ ఉపన్యాసం ప్రజల్ని విశేషంగా ఆకట్టుకొన్నది. "వెంటనే పోరాటం మొదలవడంలేదని ముందుగానే స్పష్టం చేశారు. మీరు అధికారాలన్నీ నా చేతుల్లో పెట్టారు. కాంగ్రెస్ డిమాండ్‌ని ఆమోదించమని వైస్రాయికి విజ్ఞప్తి చేస్తాను. అందుకు రెండు లేక మూడు వారాల సమయం పట్టవచ్చు. కాని ఒక విషయం స్పష్టం చేయదలచుకొన్నాను. వైస్రాయితో మంత్రివర్గాలు లాంటి బేరసారాలపై ఒప్పందం కుదుర్చుకో బోవడంలేదు. సంపూర్ణ స్వాతంత్ర్యానికి తక్కువైన దానితో తృప్తిపడే ప్రసక్తే లేదు. ఉప్పు పన్ను మినహాయింపు, మద్యపాన దురాచారం – లాంటివి ఆయన ప్రతిపాదించవచ్చు. 'సంపూర్ణ స్వాతంత్ర్యానికి తక్కువైనదేదీ' – అని నేనంటాను." తరువాత ఆయన సాధించడమో, చావడమో తేల్చుకొందామన్నాడు. ఆయన మాటల్లో "మంత్రం, చాలా చిన్నది మీకు చెపుతాను. దానిని మీ హృదయఫలకాలపై ముద్రించుకోండి. మీ ప్రతి శ్వాస దానిని ఉచ్చరించాలి. మంత్రం యిది. 'చేయండి లేక చావండి'. దేశానికి స్వతంత్రం సాధించాలి లేక ఆ ప్రయత్నంలో చావాలి. బానిసత్వం పెరుగుదలని చూసేందుకు బ్రతకం."

గాంధీజీ ఉపన్యాసంలో వివిధ సెక్షన్ల ప్రజానీకానికి ప్రత్యేకమైన సూచనలు వున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల్ని రాజీనామా చేయమని కోరడంలేదు; కాని వారు కాంగ్రెస్ పట్ల బాహాటంగా విశ్వాసం ప్రకటించాలి. సైనికులు, ఉద్యోగాలు వదలిపెట్టవద్దు; కాని వారు వారి స్వంత ప్రజలపై కాల్పులు జరిపేందుకు నిరాకరించాలి. సంస్థానాధీశులు విదేశీ అధికారం ముందు మోకరిల్లడానికి బదులుగా 'మీ ప్రజల సార్వభౌమాధికారాన్ని అంగీకరించాలి.' స్వదేశీ సంస్థానాల ప్రజలు వారు భారతజాతిలో భాగమని, సంస్థానాధీశులు ప్రజల పక్షాన నిలిస్తేనే వారి నాయకత్వాన్ని అంగీకరిస్తామని ప్రకటించాలి. స్వాతంత్ర్యం సాధించేవరకు దృఢంగా నిలబడగలుగుతామనుకొంటే విద్యార్థులు చదువు మానేయాలి. ఆగస్టు 7న గాంధీజీ రూపొందించిన సూచనల్ని కార్యవర్గం ముందుంచారు. వాటిలో తమ సర్వస్వాన్ని ఒడ్డి ధైర్యంగల రైతులు భూమి శిస్తు చెల్లించ నిరాకరించాలని ప్రతిపాదించాడు. భూమిపై వుండి పనిచేసేవాడికి అంటే దున్నేవారికే భూమి చెందుతుందిగాని యితరులకు కాదనేది కాంగ్రెస్ విధానమని కౌలుదారులకు చెప్పాడు. జమిందారీ విధానం వున్నచోట జమిందారు రైతుల ప్రయోజనాల్ని కోరేవాడైతే ఒప్పందం ప్రకారం అతడికి యివ్వవలసింది యివ్వమని చెప్పాడు. కాని జమిందారు ప్రభుత్వపక్షం వహించేవాడయితే పన్నులు చెల్లించవద్దు. ముందుగా చేపట్టిన అరెస్టుల కారణంగా ఈ

సూచనలు ప్రజలకు అందలేదు. కాని అవి గాంధీజీ అభిప్రాయాల్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

* * *

ప్రభుత్వం కాంగ్రెస్‌తో చర్చలు జరిపేందుకుగాని లేక ఉద్యమం ప్రారంభించేవరకు నిరీక్షించేందుకుగాని సిద్ధంగా లేదు. ఆగస్టు 9 అర్ధరాత్రి కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకుల్ని ప్రభుత్వం అరెస్టు చేసింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం అందుకు సన్నద్ధమవుతూ వచ్చింది. 1940 నుండి విప్లవోద్యమ ఆర్డినెన్స్‌తో సిద్ధపడివుంది. 1940 ఆగస్టు 8న వైస్రాయి లిన్‌లిత్‌గౌ గవర్నర్లకు వ్రాసిన లేఖలో తన అభిప్రాయాల్ని స్పష్టం చేశాడు. "ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెస్‌లోని ఏ గ్రూపు అయినా యుద్ధంపై చేసే ప్రకటనకు ఒకే ఒక సాధ్యమైన జవాబు దృఢ నిశ్చయంతో సంస్థని అణచివేయడమేనని నేను కచ్చితంగా అభిప్రాయపడుతున్నాను." తొందరపాటు ప్రకటనలు చేయకుండా వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమం, సంస్థాపరమైన పునర్నిర్మాణం, నిరంతర ప్రచారం చేపట్టడం ద్వారా రెండు సంవత్సరాల నుండి గాంధీజీ ఆయన కొరకు అమర్చబడిన బోనులో చిక్కకుండా తప్పుకొంటూ వచ్చాడు. కాని ప్రభుత్వం యిక ఆయన ఎత్తుగడల కొనసాగింపుకి అవకాశం యివ్వదలచుకోలేదు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆమోదిస్తుందని ముందుగానే తెలుసుకొని నిర్బంధాలక,ు అణచివేతకు సూచనలు అన్ని రాష్ట్రాలకు అందజేయబడ్డాయి.

ప్రభుత్వదాడితో ప్రజలు వెంటనే స్పందించారు. బొంబాయిలో అరెస్టుల వార్తలు వ్యాపించగానే బహిరంగసభ జరుగనున్న గొవాలియా టాంకు వద్దకు లక్షలాది మంది చేరుకొన్నారు. ప్రభుత్వాధికారులతో ఘర్షణలు జరిగాయి. ఆగస్టు 9న అలాంటి గందరగోళాలు, ఘర్షణలు అహమ్మదాబాద్, పూనాలలో కూడా జరిగాయి. ఆగస్టు 10న ఢిల్లీలో, కాన్పూరు, అల్హాబాద్, వారణాసి, పాట్నాలతో సహా యు.పి., బీహార్‌లలోని చాలా పట్టణాలలో చట్టాన్ని ఉల్లంఘిస్తూ హర్తాళ్ళు, బహిరంగ ప్రదర్శనలు, ఊరేగింపులు జరిగాయి. ప్రభుత్వం పత్రికల నోళ్ళు నొక్కింది. పోరాటం జరిగినంతకాలం నేషనల్ హెరాల్డ్, హరిజన పత్రికల ప్రచురణ ఆగిపోయింది. ఇతర పత్రికల ప్రచురణ కూడా తరతమ భేదాలతో ఆగిపోయింది.

ఈ కాలంలో చాలామంది రాష్ట్రస్థాయి, స్థానిక స్థాయి నాయకులు నిర్బంధాలను  తప్పుకొని, కొత్తదారుల గుండా స్వంత ప్రాంతాలు చేరుకొని ప్రతిఘటనాయత్నాలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలకు వార్తలు వ్యాపించడంతో నిరసనలలో గ్రామీణ ప్రజలు కలిశారు. ఆగస్టు 9 తరువాత ఆరు, ఏడు వారాలపాటు దేశవ్యాప్తంగా ప్రజల తిరుగుబాటు చెలరేగింది. ఆగ్రహం వ్యక్తం చేసేందుకు ప్రజలు చాలా పద్ధతులు కనుగొన్నారు. కొన్నిచోట్ల పెద్దగుంపులు పోలీసు స్టేషన్లపై, పోస్టాఫీసులపై, కచేరీలపై (కోర్టులపై), రైల్వేస్టేషన్లపై యింకా ప్రభుత్వ యాజమాన్య సంకేతాలపై దాడులు చేశారు. ప్రభుత్వ భవనాలపై జాతీయజెండాలు ఎగురవేశారు. ప్రజలు గుంపులుగా వెళ్ళి తాలూకా కార్యాలయాల వద్ద, జిల్లా ప్రధాన కార్యాలయాల వద్ద అరెస్టులకు సిద్ధపడ్డారు. పల్లె  ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్ళి  వందలు వేలమంది రైలు పట్టాల్ని తొలగించారు. మరికొన్ని చోట్ల చిన్న గ్రూపులు వంతెనల్ని కూల్చారు. రైలు పట్టాల్ని తొలగించారు. టెలిఫోను, టెలిగ్రాఫు తీగెల్ని కత్తిరించివేశారు. దేశవ్యాప్తంగా పాఠశాలల, కళాశాలల విద్యార్థులు సమ్మెలు చేశారు. ప్రదర్శనలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వందలాది పత్రికలు ప్రచురింపబడ్డాయి. విద్యార్థులు, యువకులు రహస్య కార్యకలాపాలకు కొరియర్లుగా పనిచేశారు. కార్మికులు సమ్మెలు చేశారు. అహమ్మదాబాద్‌లో మూడున్నర నెలలపాటు మిల్లులు మూతపడ్డాయి. ఆగస్టు 9 అరెస్టుల తరువాత బొంబాయి కార్మికులు వారంరోజులపైగా సమ్మెచేశారు. జంషెడ్‌పూర్‌లో 13రోజులపాటు సమ్మె జరిగింది. అహమ్మద్‌నగర్, పూనాలలో చాలా నెలలపాటు ఉద్యమ కార్యక్రమాలలో చురుకుగా పనిచేశారు.

ఉద్యమం తిరుగుబాటు రూపం తీసుకొన్న బీహార్, తూర్పు యు.పి.లలో అరెస్టులకు ప్రజలు తీవ్రంగా స్పందించారు. ఆగస్టు మధ్య నుండి వార్తలు విద్యార్థుల ద్వారా, రాజకీయ కార్యకర్తల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చేరాయి. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ విద్యార్థులు క్విట్ ఇండియా ఉద్యమ సందేశాన్ని వ్యాపింపచేసేందుకు గ్రామాలకు వెళ్ళాలని నిర్ణయించారు. 'ఠాణా జలావో (పోలీసుస్టేషన్ తగలెట్టండి)', 'స్టేషన్ ఫూంక్‌దో (రైల్వేస్టేషన్ తగలెట్టండి)', 'అంగ్రేజి భాగ్‌గయా (ఇంగ్లీషువారు పారిపోయారు)' – లాంటి నినాదాలు యిచ్చారు. రైళ్ళను నిలిపివేసి వాటిని జాతీయ పతాకాలతో కప్పివేశారు.

గ్రామీణ ప్రాంతాలలో తహసీల్‌కి లేక జిల్లా, పట్టణానికి రైతులు గుంపులుగా వచ్చి ప్రభుత్వ అధికార చిహ్నాలపై దాడులు చేశారు. ప్రభుత్వం అణచివేత చర్యలు చేపట్టింది. కాల్పులు జరిపించింది. కాని తిరుగుబాటు ఊపందుకొంది. బీహార్‌లోని తీర్‌హట్ ప్రాంతానికి దేశంలోని యితర ప్రాంతాలతోగల సంబంధాలు తెంచివేయబడ్డాయి. అక్కడ ప్రభుత్వమేలేని పరిస్థితి ఏర్పడింది. సెక్రటేరియట్ వద్ద కాల్పులు జరిపిన తరువాత రెండు రోజులపాటు ప్రభుత్వానికి పాట్నాపై ఎలాంటి అదుపులేకుండా పోయింది. ఉత్తర మధ్య బీహార్‌లోని 80శాతం పోలీసుస్టేషన్లు ఆక్రమించబడ్డాయి; లేక తాత్కాలికంగా ఖాళీ చేయబడ్డాయి. బ్రిటిషు వారిపై భౌతికమైన దాడులు కూడా జరిగాయి. పాట్నా దగ్గర పాట్వా రైల్వేస్టేషన్ సమీపంలో యిద్దరు ఆర్.ఎ.యఫ్. ఆఫీసర్లు కోపోద్రిక్తులైన గుంపుచేత చంపివేయబడ్డారు. వారి మృత దేహాలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించబడింది. మోంఘిర్‌లో – ఆగస్టు 18న పాస్రాలో, ఆగస్టు 30న మయిహిర్‌లో – ఆర్.ఎ.యఫ్. విమానాల సిబ్బంది గ్రామస్థులచే చంపివేయబడ్డారు. ఈ దశలో ప్రతిఘటన యిచ్చిన ముఖ్య కేంద్రాలు అజాంఘర్, తూర్పు యు.పి.లోని బాలియా, గోరక్‌పూర్, బీహార్‌లోని గయ, భాగల్పూర్, సరణ్, పూర్ణియా, షాబాద్, ముజఫర్‌పూర్, చంపారన్.

నాయకుల్ని అరెస్టు చేసిన తరువాత మొదటివారంలో ప్రభుత్వం అంచనాల మేరకు 250 రైల్వేస్టేషన్లు ధ్వంసం చేయబడ్డాయి. 500 పోస్టాఫీసులు, 150 పోలీసు స్టేషన్లు దాడులకు గురయ్యాయి. బీహార్, తూర్పు యు.పి.లలో కొన్ని వారాలపాటు రైళ్ళ రాకపోకలు ఆగిపోయాయి. ఒక్క కర్నాటకలోనే టెలిగ్రాఫ్ తీగలు తెంపివేసిన ఘటనలు 1600 జరిగాయి. 26 రైల్వేస్టేషన్లపై, 32 పోస్టాఫీసులపై దాడులు జరిగాయి. నిరాయుధులైన ప్రజలు పోలీసులు, మిలిటరీ కాల్పుల్ని 538 సందర్భాలలో ఎదుర్కొన్నారు. వారిపై విమానాల నుండి మర తుపాకులతో కాల్పులు జరపబడ్డాయి. అణచివేత తీవ్రరూపం దాల్చింది. గ్రామాలలో విచక్షణా రహితంగా అరెస్టులు చేయడం, సామూహిక జరిమానాలు విధించి, ప్రజల ఆస్తుల్ని లూటీ చేసి, వసూళ్ళు చేయడం, అనుమానితుల్ని కొరడాలతో కొట్టడం, గ్రామాల నుండి ప్రజలు పారిపోయి పట్టుబడకపోతే గ్రామాల్ని మొత్తంగా తగులబెట్టడం – లాంటి అమానుష పద్ధతులు చేపట్టబడ్డాయి. 1942 సంవత్సరాంతానికి 60,000మంది అరెస్టు చేయబడ్డారు. 26,000మందికి శిక్షలు విధించబడ్డాయి. 18,000మంది ఇండియా రక్షణ చట్టం క్రింద నిర్బంధింపబడ్డారు.

మార్షల్ చట్టం ప్రకటింపబడలేదు కాని సైన్యం పైకి సివిలు అధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్నప్పటికి జిల్లా అధికారుల ప్రమేయం లేకుండా తరచుగా వారు చేయదలచుకొన్నది చేశారు. అణచివేత సైనికపాలనలో వుండేటంత తీవ్రంగా వుంది.

* * *

పాశవికమైన అణచివేత ఆరేడు వారాలలో ప్రజాపోరాటాన్ని అణచివేయగలిగింది. కాని ఈ కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో రహస్య కార్యకలాపాలు చేపట్టబడ్డాయి. అచ్యుత్ పట్వర్థన్, అరుణా అసఫాలి, రామమనోహర్ లోహియా, సుచేతా కృపలానీ, చోతూభాయ్ పురాణిక్, బిజు పట్నాయక్, ఆర్.పి.గోయంకా, జైలునుండి తప్పించుకొన్న తరువాత జయప్రకాష్ నారాయణ లాంటి ప్రముఖ నాయకులతో రహస్య కార్యకలాపాలు సాగించడం ప్రారంభమయింది. ఉద్యమం యొక్క రహస్య కార్యకలాపాల పాత్రని దేశవ్యాప్తంగా గల కార్యకర్తలకు నాయకత్వాన్ని, మార్గదర్శకత్వాన్ని సమకూర్చే వనరుగాను, ప్రజల నైతికస్థాయిని నిలబెట్టేదిగాను, నాయకత్వం గుర్తించింది. నాయకత్వం దేశవ్యాప్తంగా రహస్యంగా పనిచేస్తున్న గ్రూపులకు డబ్బుతో పాటు బాంబులు, ఆయుధాలు, డైనమెట్లు లాంటి పరికరాల్ని సరఫరా చేసింది. బొంబాయి, పూనా, సతారా, బరోడా యింకా గుజరాత్‌లోని యితర ప్రాంతాలు, కర్నాటక, కేరళ, ఆంధ్ర, యు.పి.; బీహార్, ఢిల్లీలో స్థానిక రహస్యసంస్థలు చురుకుగా పనిచేశాయి. ఈ కార్యకలాపాల్లో సోషలిస్టులు ముందున్నారు. గాంధేయ ఆశ్రమవాసులు, ఫార్వర్డ్‌బ్లాక్ సభ్యులు, రివల్యూషనరీ టెర్రరిస్టులు, కాంగ్రెస్‌వాదులు కూడా పాల్గొన్నారు.

రహస్య కార్యకలాపాలలో పాల్గొన్నవారు తక్కువమందే కావచ్చు. కాని వివిధ రకాల ప్రజల నుండి పలు రకాల మద్దతు పొందారు. వ్యాపార సంస్థలు విరివిగా విరాళాలిచ్చాయి. ఉదాహరణకు తరువాతి కాలంలో పెద్ద మహిళా పారిశ్రామికవేత్త అయిన సుమతి మొరార్జీ తన సంపన్న మిత్రుల నుండి తెప్పించి, అచ్యుత్ పట్వర్థన్ గుర్తింపబడకుండా వుండేందుకు ఆయనకు రోజుకొక కారు ఏర్పాటుచేశారు. మరికొందరు నాయకులకు, కార్యకర్తలకు రహస్య స్థావరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు కొరియర్లుగా పనిచేశారు. గ్రామస్థులు సమాచారం పోలీసులకు చెప్పకుండా సహాయపడ్డారు. పైలట్లు, రైళ్ళ డ్రైవర్లు దేశం వెలుపల నుండి బాంబులు, యితర పరికరాలు తెచ్చియిచ్చారు. పోలీసులతో సహా ప్రభుత్వ ఉద్యోగులు చేయబోతున్న అరెస్టులకు చెందిన సమాచారం ముందుగా తెలియజేశారు. కాంగ్రెస్ రహస్య కార్యకలాపాలపై నియమింపబడిన ముగ్గురు

ఉన్నతాధికారులతో కూడిన కమిటీలోని ఒక సభ్యుడు కమిటీలో జరిగే విషయాల్ని అచ్యుత పట్వర్ధన్‌కి తెలియజేసేవాడు.

రహస్య ఉద్యమం యొక్క పనివిధానం సాధారణంగా బ్రిడ్జిలు పడగొట్టడం, టెలిఫోన్, టెలిగ్రాఫ్ తీగెల్ని కత్తిరించడం, రైళ్ళు పట్టాలు తప్పేలా చేయడం. ప్రభుత్వ ఉద్యోగులపై, పోలీసు ఉద్యోగులపై, పోలీసు ఇన్ఫార్మర్లపై కొద్ది దాడులు జరిగాయి. రహస్య ఉద్యమం రాజ్య వ్యవస్థకు పెద్దగా అవాంతరాలు కల్పించలేకపోయినప్పటికి ప్రభుత్వ సాయుధ బలప్రయోగం కారణంగా ప్రజా ఉద్యమాలు అసాధ్యమైన సమయంలో ఈ చర్యలు ప్రజల నైతిక స్థైర్యాన్ని నిలబెట్టడంలో విజయవంతమయ్యాయి. వార్తా ప్రసారం రహస్య కార్యకలాపాలలో చాలా ముఖ్యమైన భాగం. దానిలో కూడా గణనీయమైన విజయం సాధించబడింది. కాంగ్రెస్ రేడియో బొంబాయిలోని వివిధ ప్రాంతాల నుండి పనిచేసింది. అది ప్రసారం చేసిన వార్తలు దూరప్రాంతమైన మద్రాసు నుండి కూడా వినడం సాధ్యపడింది. రామ్ మనోహర్ లోహియా క్రమబద్ధంగా వార్తా ప్రసారం చేశాడు. పోలీసులు కనుగొని స్వాధీనం చేసుకొనేవరకు అంటే 1942 నవంబర్ వరకు రేడియో స్టేషన్ పనిచేసింది.

* * *

1943 ఫిబ్రవరిలో జరిగిన పరిణామం రాజకీయ కార్యకలాపాలు వెల్లువెత్తడానికి అవకాశం కల్పించింది. గాంధీజీ ఫిబ్రవరి 10న జైలులో నిరాహారదీక్ష ప్రారంభించాడు. నిరాహారదీక్ష 21రోజుల వరకు కొనసాగుతుందని ప్రకటించాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రజల హింసను ఖండించవలసిందిగా ప్రభుత్వం గాంధీజీపై చేస్తున్న ఒత్తిడికి జవాబుగా గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టాడు. ప్రజలు హింసాత్మక ఘటనలకు పాల్పడటాన్ని గాంధీజీ ఖండించకపోవడమేగాక అందుకు ప్రభుత్వానిదే బాధ్యతయని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. వేలాదిమంది కాంగ్రెస్ నాయకుల్ని నిర్బంధించడంతో సహా ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న రాజ్యహింసకి వ్యతిరేకంగా జైలు నిర్బంధంలో వున్న గాంధీజీకి గల ఒకే ఒక అవకాశం మేరకు తన నిరసనని వ్యక్తం చేసేందుకు నిరాహారదీక్ష చేపట్టాడు.

నిరాహారదీక్ష వార్తలకు ప్రజల స్పందన అపూర్వం, అమోఘం. దేశవ్యాప్తంగా హర్తాళ్లు, ప్రదర్శనలు, సమ్మెలు జరిగాయి. కలకత్తా, అహమ్మదాబాద్‌ల స్పందన ప్రత్యేకించి పేర్కొనదగినది. జైళ్ళలోని ఖైదీలు, బయటవున్న ప్రజలు సానుభూతి నిరాహారదీక్షలు

పూనారు. గాంధీజీని నిర్బంధించిన ఆగాఖాన్ భవనం వెలుపల సత్యాగ్రహం చేపట్టేందుకు గుంపులుగా ప్రజలు రహస్యంగా పూనా చేరుకొన్నారు. గాంధీజీని విడుదలని డిమాండ్ చేస్తూ, బహిరంగసభలు జరిగాయి. అన్ని రంగాలకు చెందిన ప్రజలు – విద్యార్థులు, యువకులు, వర్తకులు, లాయర్లు, సాధారణ ప్రజలు, కార్మికసంఘాలు ప్రభుత్వాన్ని టెలిగ్రాంలతో ముంచెత్తాయి. మాంచెస్టర్, గార్డియన్, న్యూస్టేట్స్‌మన్, నేషన్, న్యూస్ క్రానికల్, చికాగో సన్ – లాంటి పలు విదేశీ వార్తాపత్రికలు, అలాగే బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ, లండన్ మాంచెస్టర్ పౌరులు, ది విమెన్స్ ఇంటర్నేషనల్ లీగ్, ది ఆస్ట్రేలియన్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్‌యూనియన్స్, సిలోన్ స్టేట్ కౌన్సిల్, యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం– గాంధీజీ విడుదల కొరకు ఒత్తిడి చేశాయి.

ఢిల్లీలో ఫిబ్రవరి 19, 20 తేదీలలో నాయకుల సదస్సు జరుపబడింది. పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు, ప్రజానాయకులు హాజరయ్యారు. అందరూ గాంధీజీ విడుదలకు డిమాండ్ చేశారు. పలువురు – ఇతర సందర్భాలలో కాంగ్రెస్ పట్ల ఎలాంటి సానుభూతిలేని వారు కూడా ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని భావించారు. వైస్రాయి కార్యనిర్వాహక మండలిలోని ముగ్గురు భారతీయ సభ్యులైన యం.యస్.ఆనే, యన్.ఆర్.సర్కార్, హెచ్.పి.మోడీల రాజీనామా ప్రభుత్వ ప్రతిష్టపై పెద్ద దెబ్బతీసింది. వీరు 1942 ఉద్యమాన్ని అణచివేయడంలో ప్రభుత్వాన్ని బలపరిచారు. కాని గాంధీజీ మరణానికి బాధ్యత వహించడానికి సిద్ధంగా లేరు.

కాని వైస్రాయి, అతడి ఉద్యోగులలో ఎలాంటి చలనం లేదు. 'ప్రపంచం అంతటా విజయం సాధించిన ఈ సమయం మనకెప్పుడూ శత్రువుగా వుంటూ వచ్చిన ఒక ముసలివాని ముందు ప్రాకులాడే సమయంకాదు' అని చర్చిల్ తన మంత్రివర్గ సహచరుల వద్ద చేసిన ప్రకటనని మార్గదర్శకంగా తీసుకొన్న వైస్రాయి, ఆయన సహచరులు భారతీయుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొనేందుకు అహంభావంతో తిరస్కరించారు. గాంధీజీ చనిపోతే సంభవించే పరిణామాలను వైస్రాయి "ఆరునెలల్లో బాధ క్రమంగా తగ్గుతూ ఆ తరువాత లేకుండా పోతుంది" అనే మాటలతో చులకన భావంతో త్రోసిపుచ్చారు. అతడు అలాంటి అవకాశాన్ని స్వాగతిస్తున్నట్లు అతడి మాటల్లో ధ్వనింపజేశాడు. "మన ప్రయోజనాలకు, కార్యకలాపాలకు భారతదేశం విశ్వసనీయమైన స్థావరం అవుతుంది. పరిష్కారం కొరకు చేస్తున్న ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకొంటున్న గాంధీ లేకపోతే పరిష్కారానికి అవకాశం పెరుగుతుంది."

'గాంధీజీ ప్రాణం కొరకు ఆతురతతో యావజ్జాతి విజ్ఞప్తి చేస్తుండగా, ప్రభుత్వం ఆయన  అంత్యక్రియలకు సన్నాహాలు చేసింది. అత్యవసర పరిస్థితికి సిద్ధంగా వుండమని మిలిటరీకి ఆదేశాలు యివ్వబడ్డాయి. ఆయన చితాభస్మాన్ని తీసికెళ్ళేందుకు విమానాన్ని సిద్ధం చేయడం బహిరంగంగా అంత్యక్రియలు జరపడం, ఆఫీసులకు  అర రోజు సెలవు ప్రకటించడం– లాంటి వాటికి ఉదారంగా అవకాశం కల్పించబడింది.' కాని గాంధీజీ ఎప్పుడూ ప్రత్యర్థులపై విజయం సాధించే విధంగానే మరణాన్ని తిరస్కరించాడు.

నిరాహారదీక్ష ఉద్దేశించబడిన  కర్తవ్యాన్ని నెరవేర్చింది. ప్రజల నైతిక స్థైర్యం పెంచబడింది. బ్రిటిషు వ్యతిరేకత అత్యున్నత స్థాయికి చేరింది. రాజకీయ కార్యకలాపాలు సాగించడానికి సరియైన వాతావరణం కల్పించబడింది. ప్రతిఘటన సంకేతం దేశవ్యాప్తంగా ప్రతిఘటనని రగుల్కొలిపింది. ప్రభుత్వ దమనకాండని ప్రపంచానికి చాటి చెప్పింది. 1942 నాటి దారుణమైన అణచివేతకు ప్రభుత్వం తనకు తానుగా చేసుకొన్న సమర్థన తిరస్కరించబడింది. ప్రభుత్వం దోషిస్థానంలో నిలబెట్టబడింది.

* * *

క్విట్ ఇండియా ఉద్యమం కాలంలో కొన్ని ప్రాంతాలలో సమాంతర ప్రభుత్వాలు ఏర్పడడం ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. మొదటి సమాంతర ప్రభుత్వం తూర్పు యు.పి.లోని బాలియాలో 1942 ఆగస్టులో తనను తాను గాంధేయవాదిగా చెప్పుకొన్న చిట్టుపాండే నాయకత్వంలో ఏర్పడింది. అది కలెక్టర్ నుండి అధికారాలు స్వీకరించడంలోను, అరెస్టు చేయబడిన కాంగ్రెస్ నాయకుల్ని విడిపించడంలోను జయప్రదమైనప్పటికీ ఎక్కువకాలం నిలబడలేకపోయింది. సమాంతర ప్రభుత్వం ఏర్పరచిన వారం రోజుల తరువాత బ్రిటిషు ప్రభుత్వ సైనికులు ప్రవేశించారు. అప్పటికే నాయకులు పారిపోయారు.

బెంగాల్‌లోని మిడ్నాపూర్ జిల్లాలోని తమ్‌లుక్‌లో 1942 డిసెంబర్ 17న ఏర్పడిన జాతీయ ప్రభుత్వం 1944 సెప్టెంబర్ వరకు మనగలిగింది. తమ్‌లుక్ గాంధేయ నిర్మాణాత్మక కార్యక్రమాలు గణనీయమైన అభివృద్ధి సాధించిన ప్రాంతం. గతంలో అక్కడ ప్రజాపోరాటాలు జరిగాయి. జాతీయ ప్రభుత్వం తుఫాను పునరావాస

కార్యక్రమం చేపట్టింది. పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. విద్యుత్ వాహిని అనే సాయుధ దళాల్ని నిర్వహించింది. తగవులను పరిష్కరించే కోర్టుల్ని స్థాపించింది. సంపన్నుల వద్దనున్న మిగులు ధాన్యాన్ని పేదలకు పంచింది. మారుమూల ప్రాంతం గనుక తన కార్యక్రమాల్ని కొంత సులువుగా నిర్వహించగలిగింది.

మహారాష్ట్రలోని సతారా ఎక్కువకాలం మనగలిగిన సమర్థవంతమైన సమాంతర ప్రభుత్వం. క్విట్ ఇండియా ఉద్యమ ప్రారంభం నుండి ఆ ప్రాంతం చాలా చురుకైన పాత్ర నిర్వహించింది. 1942 ఆగస్టు నుండి ప్రారంభమైన మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలున్న చోట్ల ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. కరాడ్, తాస్‌గాన్, ఇస్లాంపూర్‌లలో వేలాదిమంది ప్రదర్శనలు జరిపారు. ఆ తరువాత పోస్టాఫీసులపై దాడులు, బ్యాంకుల లూటీలు, టెలిగ్రాపు తీగెల కత్తిరింపులు జరిగాయి. అచ్యుత్ పట్వర్ధన్‌తోను యితర అజ్ఞాతవాసంలో వున్న నాయకులతోను సంబంధాలున్న వై.బి.చవాన్ అక్కడ చాలా ముఖ్యమైన నాయకుడు. దాదాపు 2000మందిని అరెస్టు చేయడంతో 1942 సంవత్సరాంతానికి ఈ దశ ముగిసింది. 1943 నుండి రహస్యంగా పనిచేసే కార్యకర్తలు తిరిగి పనిచేయడం ప్రారంభించారు. 6 నెలలకు సంస్థని పటిష్టపరచారు. సమాంతర ప్రభుత్వం లేక ప్రతిసర్కార్ స్థాపించబడింది. దాని ముఖ్యమైన నాయకుడు నానిపాటిల్. ఈ దశలో ప్రభుత్వానికి సహకరించేవారిపైన, ఇన్‌ఫార్మర్లపైన, క్రిందిస్థాయి ఉద్యోగులపైన దాడులు చేశారు. రాబిన్‌హుడ్ తరహా దోపిడీలు సాగించారు. న్యాయాదన్ మండళ్ళు లేక ప్రజాకోర్టులు నిర్వహించబడ్డాయి. మద్యపాన నిషేధం అమలు జరుపబడింది. అంటరానివాళ్ళు ఆహ్వానింపబడ్డారు. గ్రామీణ గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి. విద్య ప్రోత్సహించబడింది. స్థానిక సంస్థానమైన 'ఔధ్' పాలకుడు జాతీయాభిమాని. తన సంస్థానానికి రాజ్యాంగాన్ని గాంధీజీ చేత తయారుచేయించాడు. ప్రతి సర్కార్ కార్యకర్తలకు రక్షణ కల్పించి అమూల్యమైన మద్దతు యిచ్చాడు. ప్రతిసర్కార్ 1945 వరకు పనిచేసింది.

జాతీయోద్యమంలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయడంలోగాని, జాతీయవాదానికి ప్రజల సానుభూతిని పొందడంలోగాని క్విట్‌ఇండియా ఉద్యమం జాతీయోద్యమంలో అత్యున్నత దశకి ప్రతీకగా నిలుస్తుంది. గతంలో లాగానే యువకులు పోరాటానికి అగ్రభాగాన నిలిచారు. కాలేజీ విద్యార్థులేగాక హైస్కూలు విద్యార్థులు కూడా ఉద్యమాలలో అధికసంఖ్యలో పాల్గొన్నారు. (1942 ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థుల సగటు వయస్సు అంతకుముందు కాలాల ఉద్యమాలలోని సగటు వయస్సు కంటే తక్కువ.) స్త్రీలు ప్రత్యేకించి

కాలేజి, హైస్కూలు విద్యార్థులు చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. అరుణా అసఫాలీ, సుచేత కృపలానీ అజ్ఞాతంలో వుండి ఉద్యమాన్ని నడిపిన ముఖ్యమైన మహిళా నాయకులు. కాంగ్రెస్ రేడియోని నడిపిన చిన్నగ్రూపులోని ముఖ్యమైన సభ్యురాలు ఉషామెహతా. ఎక్కువకాలం జరిగిన సమ్మెలకు తట్టుకొని నిలబడి, వీధుల్లో పోలీసుల అణచివేతను ధైర్యంగా ఎదుర్కొని కార్మికులు ఉద్యమానికి గణనీయమైన సేవలు చేశారు.

సంపన్న రైతులు, పేద రైతులు – మొత్తం రైతాంగం ఉద్యమానికి ప్రత్యేకించి తూర్పు యు.పి., బీహార్లలో, బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో, మహారాష్ట్రలోని సతారాలు, ఆంధ్ర, గుజరాత్, కేరళల్లోని యితర ప్రాంతాలలో గుండెకాయల్లా పనిచేశారు. పెద్ద జమిందారులు కూడా తటస్థవైఖరి నవలంబించారు; ఉద్యమాన్ని అణచివేయడంలో బ్రిటిషువారికి సహకరించ నిరాకరించారు. వీరిలో ప్రత్యేకించి పేర్కొనదగిన వారు పెద్ద జమిందారులలో ఒకరైన దర్భాంగా రాజా. తన వద్ద అనుమతించబడిన సాయుధ సిపాయిల్ని బ్రిటిష ప్రభుత్వం ఉపయోగించుకొనడాన్ని నిరాకరించాడు. అరెస్టు చేయబడిన రైతులకు సహకరించవలసిందిగా తన ఉద్యోగులకు సూచనలిచ్చాడు. రైతుల కార్యకలాపాలలో గమనించదగిన అంశం: రైతాంగం బ్రిటిష అధికార చిహ్నాలపై దాడులు చేశారుగాని బీహార్‌లో, తూర్పు యు.పి., సతారా, మిడ్నాపూర్– లాంటిచోట్ల ప్రభుత్వ యంత్రాంగం చాలా కాలంపాటు స్తంభించిపోయి, హింసకి అవకాశాలు లభించినప్పటికీ జమిందారీ వ్యతిరేక హింసకి పాల్పడిన సంఘటన ఒక్కటి కూడా జరగకపోవడం. ప్రభుత్వోద్యోగులు – ప్రత్యేకించి పోలీసు, పాలనా యంత్రాంగంలోని క్రిందిస్థాయి ఉద్యోగులు ఉద్యమానికి సహకరించడంలో చాలా ఉదారంగా వ్యవహరించారు. వారు ఉద్యమ కార్యకర్తలకు ఆశ్రయం యిచ్చారు. అవసరమైన సమాచారం అందించారు. ఆర్థికంగా సహాయపడ్డారు. బ్రిటిష ప్రభుత్వానికి తన ఉద్యోగుల విధేయత క్షీణించడం క్విట్ఇండియా ఉద్యమంలో ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. గతంలోకంటె జైలు అధికారులలో కూడా ఖైదీలపట్ల కొంత దయ, సానుభూతితో కూడిన వైఖరి వ్యక్తమయింది. తరచుగా వారి సానుభూతిని బాహాటంగా కూడా వ్యక్తంచేశారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో ముస్లిం ప్రజల భాగస్వామ్యం అంత ఎక్కువగా లేకపోయినప్పటికీ ముస్లింలీగు మద్దతుదారులు కూడా రహస్య కార్యకలాపాలు సాగించే కార్యకర్తలకు ఆశ్రయమిచ్చి సహకరించారు. ఇన్ఫార్మర్లుగా పనిచేయలేదు. అంతేగాదు, మత ఘర్షణలు మచ్చుకైనా జరగలేదు. ఉద్యమం ముస్లిం ప్రజల పూర్తి మద్దతు పొందనప్పటికి, వారినుండి ఎలాంటి వ్యతిరేకత వ్యక్తంకాలేదు.

కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన వైఖరికి భిన్నంగా వందలాది స్థానిక గ్రామస్థాయి కమ్యూనిస్టులు ఉద్యమంలో పాల్గొన్నారు. వారికి వారి నాయకుల ఫాసిస్టు వ్యతిరేక భావాలపై గౌరవమున్నప్పటికీ ఉద్యమం పట్ల ఆకర్షితులై, కొన్ని వారాలు లేక కొన్ని రోజులు ఉద్యమంలో చేరి పనిచేశారు.

* * *

క్విట్ ఇండియా ఉద్యమంపై చర్చ ప్రత్యేకించి రెండు అంశాల్ని దృష్టిలో పెట్టుకొని సాగుతుంది. మొదటిది: ఉద్యమం ఆకస్మిక విస్ఫోటనమా లేక క్రమబద్ధంగా నిర్మించబడిన తిరుగుబాటా? రెండవది: ఈ పోరాటంలో ప్రజలు చేపట్టిన హింసా పద్ధతులు కాంగ్రెస్ విధానమైన అహింసాయుత పోరాటంలో యిమిడిపోతాయా?

మొదట 1942 ఉద్యమంలో ఆకస్మికంగా అప్పటికప్పుడు పెల్లుబుకటం - గత ఉద్యమాలలో కంటే చాలా ఎక్కువగా జరిగింది. 1919-22లోను, అలాగే 1930-31, 32లలోనూ ఆకస్మికతకు ప్రజల చొరవకు కాంగ్రెస్ నాయకత్వం తగు అవకాశం యిచ్చింది. వాస్తవంగా గాంధేయ ప్రజా ఉద్యమాల నిర్వహణ విధానం యిలా వుంటుంది. నాయకత్వం విస్తృత కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తుంది. దానిని అమలు జరిపే విధానం క్రిందిస్థాయి కార్యకర్తల, ప్రజల చొరవకి వదిలివేస్తుంది. గాంధేయ ఉద్యమాలలో చాలా నిర్మాణబద్ధంగా సాగిన 1930 సహాయ నిరాకరణ ఉద్యమంలో కూడా గాంధీజీ దండికి పాదయాత్ర జరిపి ఉప్పు చట్టాల్ని ఉల్లంఘించి, ఉద్యమాన్ని ప్రారంభించిన సంకేతాలు పంపాడు. భూమిశిస్తు, కౌలు చెల్లించ నిరాకరించడమా, అటవీ చట్టాలకు వ్యతిరేకంగా సత్యాగ్రహం చేపట్టడమా? సారాయి షాపుల వద్ద పికెటింగ్ చేయడమా? కార్యక్రమంలోని యితర అంశాల్ని చేపట్టడమా? - స్థానిక స్థాయి నాయకులు, ప్రజలు నిర్ణయించారు. కాని 1942లో నాయకత్వం యింకా ఉద్యమం ప్రారంభించవలసి వుంది గనుక విస్తృతమైన కార్యక్రమం కూడా రూపొందించబడలేదు. కాని త్వరితంగా, ఆకస్మికంగా స్పందించేందుకు, నిర్ణయాలు చేసేందుకు స్థానిక నాయకత్వానికి అనుమతి లభించింది. 1942 ఆగస్టు 8న ఆమోదించబడిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ తీర్మానం స్పష్టంగా యిలా పేర్కొన్నది. "కాంగ్రెస్ కమిటీలు పనిచేయలేకపోతే సూచనలు యివ్వటానికి, సూచనలు ప్రజలకు చేరటానికి వీలుపడని సమయం రావచ్చు. ఇది జరిగితే ఈ ఉద్యమంలో పనిచేస్తున్న ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ యింతకుముందు అందజేయబడిన సాధారణ సూచనల

పరిమితులలో  పనిచేయాలి. స్వేచ్ఛని కోరి, అందుకొరకు పోరాడే ప్రతి భారతీయుడు తనకు తానే మార్గదర్శిగా పనిచేయాలి."

అంతేగాక కాంగ్రెస్ సైద్ధాంతికంగా, రాజకీయ నిర్మాణపరంగా చాలాకాలం నుండి పోరాటానికి సన్నద్ధమవుతూ వచ్చింది. 1932-34 కాలం నాటి అణచివేత వలన కలిగిన నష్టాన్ని అధిగమించేందుకు 1937నుండి పునర్నిర్మించబడింది. రాజకీయంగా, సైద్ధాంతికంగా మంత్రివర్గాలు కాంగ్రెస్ స్థాయిని పెంచాయి. 1937 నుండి ప్రజల సమీకరణ, సంస్థాపరమైన నిర్మాణం చేపట్టబడిన తూర్పు యు.పి., బీహార్‌లలోనే 1942లో తీవ్రమైన రాజకీయ కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. గుజరాత్‌లో 1942 జూన్ నుండి సర్దార్ పటేల్ బార్డోలి, యితర ప్రాంతాలలో పర్యటించి రానున్న పోరాటంలో శిస్తుల చెల్లింపు నిరాకరణ ఉద్యమంలో భాగంగా వుంటుందని ప్రజల్ని పోరాటానికి సన్నద్ధం చేశాడు. కాంగ్రెస్ సోషలిస్టులు 1942 జూన్ నుండి పూనాలో వలంటీర్లకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ వచ్చారు. గాంధీజీ 1940-41 నుండి వ్యక్తి సత్యాగ్రహం ద్వారా 1942నుండి యింకా స్పష్టంగా రానున్న యుద్ధం 'తక్కువ వ్యవధిలో వేగంగా జరిగేదిగా వుంటుంద'ని చెపుతూ ప్రజల్ని పోరాటానికి సన్నద్ధం చేశాడు.

ఏమైనప్పటికి పోరాట సన్నద్ధతని నిర్ణయించేది ఉద్యమం ప్రజలపై సాధించిన ప్రాబల్యం లేక పట్టు గాని, చేపట్టిన కార్యకలాపాల సంఖ్య, పరిమాణంకాదు.

1942లోని హింసా ప్రయోగం కాంగ్రెస్ అహింసా విధానానికి అనుగుణమైనదేనా? లేక అహింసని విధానంగా పాటిస్తూ వచ్చిన కాంగ్రెస్ హింసాత్మక ఘటనలకు పాల్పడటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? హింసా పద్ధతులు పాటించడాన్నిగాని, అనుమతించడాన్నిగాని తిరస్కరించేవారు చాలామంది కాంగ్రెస్ యొక్క సాంప్రదాయ ఆయుధాలకే పరిమితమయ్యారు. కాని శుద్ధ గాంధేయవాదులతో సహా చాలామంది 1942లో హింసాత్మక పద్ధతులకు పాల్పడినవారు అప్పటి ప్రత్యేక పరిస్థితులలో హింసా పద్ధతులు చేపట్టవలసిన అవసరాన్ని కల్పించాలని నమ్మారు. మనుషుల ప్రాణహాని జరగనంతవరకు వంతెనలు  పేల్చివేయడం, టెలిగ్రాఫ్ తీగల కత్తిరింపు లాంటి చర్యలు సమర్థనీయమే అన్నారు. మరికొందరు తాము చేపట్టిన హింసాత్మక చర్యలు అహింసా సిద్ధాంతానికి విరుద్ధమైనవేనని స్పష్టంగా ఒప్పుకొన్నారు. రాజ్యం యొక్క పెద్ద హింసకి ప్రతిచర్య ప్రజాహింస గనుక ప్రజలు చేపట్టిన హింసాత్మక చర్యల్ని గాంధీజీ ఖండించ నిరాకరించాడు. హింసా పద్ధతులు ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని నిరోధిస్తాయి.

గాంధీజీ హింసా పద్ధతులకు అభ్యంతరం చెప్పడానికి యిదే ప్రధాన కారణమంటాడు ఫ్రాన్సిస్ హటిన్స్. కాని 1942లో హింస కారణంగా ప్రజల భాగస్వామ్యాన్ని పరిమితం చేయకూడదనే అభిప్రాయానికి గాంధీజీ వచ్చాడు.

జాతీయోద్యమం యొక్క తక్షణ ఎజెండాలో స్వాతంత్ర్యం డిమాండ్‌ను పెట్టడం ఈ చారిత్రక ఉద్యమం యొక్క ప్రాధాన్యత. 'క్విట్ ఇండియా' తరువాత వెనుకడుగు సాధ్యపడదు. బ్రిటిషు ప్రభుత్వంతో భవిష్యత్‌లో జరుపబోయే సంప్రదింపులు అధికార మార్పిడి జరిపే విధానాన్ని గురించి మాత్రమే. స్వాతంత్ర్యంపై ఇక బేరసారాలు లేవు. యుద్ధం తరువాత ఈ విషయం స్పష్టమైంది.

* * *

గాంధీజీ 1944 మే 6న వైద్య కారణాల రీత్యా విడుదల కావడంతో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. నిర్మాణాత్మకమైన పని కాంగ్రెస్ కార్యశీలత యొక్క ప్రధాన రూపం అయింది. కాంగ్రెస్ యంత్రాంగం యొక్క పునర్నిర్మాణంపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టింది. కాంగ్రెస్ కమిటీలపై వున్న నిషేధాన్ని నిర్వీర్యం చేస్తూ, కాంగ్రెస్ వర్కర్ల అసెంబ్లీలు, రిప్రెజెంటేటివ్ అసెంబ్లీస్ ఆఫ్ కాంగ్రెస్‌మెన్ –లాంటి వివిధ పేర్లతో కాంగ్రెస్ కమిటీలు పునరుద్ధరించబడ్డాయి. కార్యకర్తల శిక్షణ, సభ్యత్వ నమోదు, నిధి వసూలు– కర్తవ్యం చేపట్టింది. నిర్మాణాత్మకమైన పని ముసుగు కింద కాంగ్రెస్ చేపడుతున్న పునర్నిర్మాణాన్ని ప్రభుత్వం అనుమానాస్పదంగా చూసింది. రానున్న పోరాటానికి సన్నద్ధం చేసేందుకు గ్రామాలలో కాంగ్రెస్ పలుకుబడిని, సంస్థని పునర్నిర్మించే ప్రయత్నంగా భావించింది. ఈ పరిణామాలపై నిఘా పెంచింది. అణచివేత చర్యల్ని గురించి ఆలోచించలేదు. జపాన్‌తో యుద్ధం ముగించడానికి ముందు కాంగ్రెస్‌తో ఒప్పందానికి రావడం ద్వారా, కాంగ్రెస్ పోరాటం చేపట్టే అవకాశం లేకుండా చేసే ప్రతిపాదన (వేవల్ ప్రతిపాదన లేక సిమ్లా సదస్సు) రూపొందించడంపై వైస్రాయి కేంద్రీకరించారు. 1945 జూన్‌లో జరగనున్న సిమ్లా సదస్సులో పాల్గొనేందుకు కాంగ్రెస్ నాయకులు విడుదల చేయబడ్డారు. దీనితో 1942 ఆగస్టు నుండి కొనసాగుతున్న ప్రతిఘటనకు తెరపడినట్లు అయింది.

* * *

ఈ అధ్యాయం ముగించడానికి ముందు భారత జాతీయ సైన్యాన్ని (ఐ.యన్.ఎ.) గురించి సంక్షిప్తంగా ప్రస్తావించడం అవసరం. మోహన్‌సింగ్ మలయాలో వుండగా, ఐ.యన్.ఎ. నిర్మాణాన్ని గురించి మొదటిసారిగా ఆలోచించాడు. మోహన్‌సింగ్ బ్రిటిషిండియా సైన్యంలో ఆఫీసరు. మలయా నుండి వెనక్కి మళ్ళిన బ్రిటిష్ సైన్యంలో కొనసాగదలచుకోలేదు. సహాయం కొరకు జపాన్ వెళ్ళాడు. అప్పటి వరకు జపాన్ భారత పౌరుల్ని, బ్రిటిషు వ్యతిరేక సంస్థల్ని ఏర్పాటు చేయవలసిందిగా ప్రోత్సహించింది, కాని భారతీయులతో సైన్యాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన లేదు.

జపాన్, భారత యుద్ధ ఖైదీలను మోహన్‌సింగ్‌కు అప్పజెప్పింది. మోహన్‌సింగ్ వారిని భారత జాతీయ సైన్యం (ఐ.యన్.ఎ.)లో చేర్చుకొనేందుకు ప్రయత్నించాడు. సింగపూర్ పతనం చాలా కీలకమైనది. ఇది 45,000మంది భారత యుద్ధ ఖైదీలను మోహన్‌సింగ్ పలుకుబడి కిందకు తెచ్చింది. 1942 చివరినాటికి 40,000మంది ఐ.యన్.ఎ.లో చేరేందుకు అంగీకారం తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్, భారత ప్రజల ఆహ్వానం మేరకు ఐ.యన్.ఎ. సైనిక చర్యలు చేపడుతుందని, భారత జాతికి చెందిన నాయకులు ఇండియన్ ఆర్మీ ఆఫీసర్లు వివిధ సమయాలలో చాలాసార్లు స్పష్టం చేశారు. అంతేగాక ఐ.యన్.ఎ. ఆగ్నేయాసియాలో భారతీయులపై జపాన్‌వారి దుష్ప్రవర్తనని అడ్డుకొంటుందని జపాన్ భారతదేశాన్ని ఆక్రమించకుండా రక్షణస్థావరంగా పనిచేస్తుందని భావించబడింది.

క్విట్ ఇండియా ఉద్యమ వెల్లువ ఐ.యన్.ఎ.కి ప్రేరణ ఇచ్చింది. మలయాలో బ్రిటిషు వ్యతిరేక ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. 1942 మే1న ఐ.యన్.ఎ. మొదట 16,300మందితో స్థాపించబడింది. జపాన్‌వారు అప్పుడు సాయుధ భారతీయ విభాగం పట్ల సానుకూలంగా వున్నారు. కానీ 1942 డిసెంబరు నాటికి ఐ.యన్.ఎ. నిర్వహించవలసిన పాత్ర పట్ల మోహన్‌సింగ్ నాయకత్వంలోని ఇండియన్ ఆర్మీ ఆఫీసర్లకు, జపాన్‌కి మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తాయి. మోహన్‌సింగ్ నాయకత్వంలోని ఐ.యన్.ఎ.లో చేరిన సీనియర్ ఆఫీసర్ నిరంజన్‌సింగ్ గిల్ నిర్బంధింపబడ్డాడు. జపాన్ ఐయన్ఎ నామమాత్రంగా 2000మందితో వుండాలన్నది. కాని మోహన్‌సింగ్ ఐ.యన్.ఎ.ని 20,000మందికి పెంచాలనుకున్నాడు.

జర్మనీ, జపాన్ సబ్‌మెరీన్‌ల ద్వారా సుభాస్ చంద్రబోస్ 1943 జూలై 2న సింగపూర్‌కి తీసుకొని రాబడడంతో ఐ.యన్.ఎ. రెండవ దశ ప్రారంభమైంది. బోస్

టోక్యో వెళ్ళాడు. జపాన్‌కి భారతదేశ భూభాగాన్ని ఆక్రమించే ఆలోచనలేదని జపాన్ ప్రధానమంత్రి టోజో ప్రకటించాడు. బోస్ సింగపూర్ తిరిగివచ్చి, స్వతంత్ర భారతదేశ తాత్కాలిక ప్రభుత్వాన్ని 1943 అక్టోబర్ 21న స్థాపించాడు. తాత్కాలిక ప్రభుత్వం బ్రిటన్, అమెరికాలపై యుద్ధం ప్రకటించింది. అక్ష రాజ్యాల, వాటి అనుకూల దేశాల గుర్తింపు పొందింది. సుభాస్ బోస్ ఐ.యన్.ఎ. ప్రధాన కార్యాలయాన్ని రంగూన్, సింగపూర్ – రెండుచోట్ల నెలకొల్పాడు. ఐ.యన్.ఎ.ని పునర్నిర్మించడం ప్రారంభించాడు. పౌరుల్ని చేర్చుకున్నాడు. నిధులు సేకరించబడ్డాయి. మహిళా సైనిక విభాగం రాణీ ఝాన్సీ రెజిమెంట్ ఏర్పాటుచేయబడింది. 1944 జూలై 6న సుభాస్ బోస్ ఆజాద్ హిందు రేడియో ప్రసారంలో ప్రసంగిస్తూ, గాంధీజీని ఉద్దేశించి "స్వాతంత్ర్యం కొరకు భారతదేశపు చివరి యుద్ధం ప్రారంభమైంది.... జాతిపితా! భారతదేశ విముక్తి కొరకు జరుగుతున్న ఈ పవిత్ర యుద్ధానికి మీ ఆశీస్సులు, అభినందనలు కోరుతున్నాం." అన్నారు.

షానరాజ్ నాయకత్వాన గల ఒక ఐ.యన్.ఎ. బెటాలియన్ ఇండియా, బర్మా రంగంలో జపాన్ సైన్యంతోపాటు ఇంఫాల్ క్యాంపెయిన్‌లో పాల్గొనేందుకు అనుమతించబడింది. కాని ఆహారం, ఆయుధాల సరఫరా నిరాకరణ, జపాన్ సైనికులకు లోబడి, వారికి అవసరమైన నీచమైన పనులు చేయించడం – లాంటి వివక్షత ఐ.యన్.ఎ. నైతిక స్థైర్యాన్ని దిగజార్చింది. ఇంఫాల్ క్యాంపెయిన్ వైఫల్యం, ఆ తరువాత జపాన్ సైన్యాల తిరోగమనం – ఐ.యన్.ఎ. భారతదేశాన్ని విముక్తి చేస్తుందనే ఆశల్ని భగ్నం చేశాయి. 1944 మధ్యలో ప్రారంభమైన తిరోగమనం 1945 మధ్యవరకు కొనసాగింది. ఆగ్నేయాసియాలో బ్రిటిషు సైన్యాలకు లొంగిపోయింది. ఐ.యన్.ఎ. సైనికులు భారతదేశానికి తీసుకొనిరాబడ్డారు. తీవ్రమైన శిక్షలు, బెదిరింపులు పొంచివున్నాయి. వారి రక్షణ కొరకు బలమైన ఉద్యమం చేపట్టవలసి వుంది.

* * *

# 36 యుద్ధానంతర జాతీయవాద వెల్లువ

రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు నాటకీయమైన మార్పుల్ని తీసుకొనివచ్చింది. అప్పటి నుండి 1947లో స్వాతంత్ర్యం సాధించే వరకు రాజకీయ రంగంలో ప్రజా చైతన్యం వెల్లివిరిసింది. దేశవ్యాప్తంగా చెలరేగిన సమ్మెలు, తెభాగ ఉద్యమం, వర్లీల తిరుగుబాటు, పంజాబు రైతు ఉద్యమాలు, తిరువాన్కూరు ప్రజల పోరాటం (ప్రత్యేకించి పున్నప్ర- వాయలర్ ఉదంతం), తెలంగాణా ఉద్యమం రూపందాల్చిన కార్మికుల, రైతుల, స్వదేశీ సంస్థానాల ప్రజల పోరాటాలను మన పరిశీలన నుండి వదలివేయక తప్పడంలేదు. ఈ ఉద్యమాలు సామ్రాజ్యవాద వ్యతిరేక స్వభావాల్ని కలిగివున్నాయి. అణచివేతదారులు, స్వప్రయోజనాపరులు, వలసరాజ్యానికి మద్దతుదారులు. ఈ పోరాటాలలో, ఉద్యమాలలో పాల్గొన్న ప్రజలు వలస రాజ్యంతో ప్రత్యక్షంగా ఘర్షణకు తలపడలేదు. అణచివేతదారులకు వ్యతిరేకంగా పోరాడారు. మనం ప్రస్తుతం బ్రిటిషుపాలన యొక్క చట్టబద్ధతని ప్రత్యక్షంగా సవాలుచేసిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు పరిమితమవుదాం.

* * *

యుద్ధ పరిసమాప్తిని భారత ప్రజలు స్వాగతించారు. పెద్ద నిట్టూర్పు విడిచారు. యుద్ధం కారణంగా పెట్టుబడిదారులకు గాలివాటంగా పెద్ద లాభాలు వచ్చిపడ్డాయి. మధ్య తరగతులకు ఒక మేరకు ఉద్యోగావకాశాలు పెరిగాయి. కాని సాధారణ ప్రజలు విధ్వంసానికి గురయ్యారు. భరింపరాని కష్టాల పాలయ్యారు. యుద్ధ ప్రయత్నం కాడిక్రిందపడి నలిగి వలసరాజ్యం సొమ్మసిల్లిపోయింది. కరువు, ద్రవ్యోల్బణం,

నిత్యావసర వస్తువుల కొరత, అక్రమ నిల్వలు, బ్లాకు మార్కెటింగు– దేశాన్ని ప్లేగు వ్యాధిలా పీడించాయి. నాయకులులేని వీరోచిత పోరాటం – క్విట్ ఇండియా ఉద్యమం 8 వారాలలో అణచివేయబడింది. ప్రతిఘటనా కేంద్రాలు – ఉజ్వలంగా వెలిగిన కాగడాలు ఎక్కువకాలం వెలుతురు నివ్వలేకపోయాయి.

1942 అణచివేతతో అచేతనులై, నాయకత్వం లేకపోవడంతో కలతజెంది, యుద్ధం తెచ్చిపెట్టిన కష్టాలు కడగండ్లతో క్రుంగిపోయి – మొత్తం మీద నైతిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన ప్రజల్ని చూడబోతున్నాం అనుకొన్నారు 1945 జూన్ మధ్యలో జైళ్ళ నుండి విడుదలయిన కాంగ్రెస్ నాయకులు. కాని నాయకుల కొరకు ఎంతో ఆతురతతో ఎదురుచూస్తూ, ఏదో చేయాలని అసహనంతో వున్న, నిర్ణయాత్మకమైన బ్రిటిషు వ్యతిరేకతతో వున్న ప్రజా సమూహాల్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. అణచివేత సాహసవంతుల ధైర్యాన్ని దృఢతరం చేసింది. తటస్థుల చైతన్యాన్ని కదిలించింది. మూడున్నర సంవత్సరాలకుపైగా సాగించిన అణచివేత తరువాత లోలోపలి రాజకీయశక్తులు ఉపరితలంపైకి వచ్చాయి. నాయకుల విడుదలతో ప్రజల అంచనాలు పెరిగాయి. విడుదల త్వరితమైన రాజకీయ కార్యక్రమాల ప్రారంభానికి సంకేతంగా ప్రజలు విశ్వసించారు. జవహర్‌లాల్ నెహ్రూ విడుదల కానున్నాడని తెలియగానే అల్మోరా జైలుగేట్ల వద్ద ప్రజలు గుంపులు గుంపులుగా చేరారు. మౌలానా అజాద్ నిర్బంధింపబడిన బంకూరా జైలు వద్ద ప్రజలు గంటలకొలది నిరీక్షించారు. బొంబాయిలో కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి వస్తున్న నాయకులకు లక్షలాదిమంది జనం వీధులవెంట కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని లెక్కచేయకుండా బారులుగా నిలిచి ఆహ్వానించారు. వైస్రాయి ఆహ్వానం మేరకు సిమ్లా సదస్సుకి వెళ్ళిన నాయకులకు సిమ్లాలో అలాంటి దృశ్యాలే కనిపించాయి. సిమ్లాకి చాలా దూరంగా వున్న గ్రామాల నుండి వచ్చిన పల్లె ప్రజలు వారి నాయకుల్ని చూసేందుకు చెట్లు ఎక్కి గంటల తరబడి నిరీక్షించారు.

బ్రిటన్‌లో యుద్ధం తరువాత అధికారానికి వచ్చిన లేబర్ పార్టీ భారతదేశ సమస్యని పరిష్కరించటం పట్ల ఆసక్తి చూపింది. ఫలితంగా కాంగ్రెస్‌పై గల నిషేధం ఎత్తివేయబడింది. ఎన్నికలు ప్రకటించబడ్డాయి. మంత్రివర్గాలు ఏర్పడడం పట్ల ప్రజలు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఎన్నికల మీటింగులకు చాలా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాధారణ సభలకు సగటున 50వేల మంది, జాతీయ నాయకులకు లక్షమంది హాజరయ్యారు. 1937 ఎన్నికలకు ప్రధాన ప్రచారకుడిగా వున్న నెహ్రూ గతంలో అంతపెద్ద

సంఖ్యలో అంత ఉత్సాహంగా సమీకృతులైన ప్రజల్ని తాను చూడలేదన్నారు. జాతీయవాద ముస్లింలను నిలబెట్టిన నియోజకవర్గాలలో తప్ప మిగిలిన వాటిలో ప్రచారం చేయవలసిన అవసరం గానీ, డబ్బు ఖర్చుపెట్టవలసిన అవసరం గానీ లేనేలేదు. సభలకు రావడమే గాదు; ఓట్లు కూడా అలాగే వేశారని ఎన్నికల ఫలితాలు స్పష్టంజేశాయి. రాష్ట్రాలకు జరిగిన ఎన్నికలలో జనరల్ సీట్లలో 90శాతం (లేబరు సీట్లలోని 26కి 23తో సహా) కాంగ్రెస్ గెలిచింది. ముస్లిం నియోజకవర్గాలలో ముస్లింలీగు అలాంటి విజయాలే సాధించింది. ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశం కేవలం ఓట్లు సాధించడమేగాక బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భారతీయుల్ని సమీకరించడం. ఎన్నికల ప్రచారంలో 1942 అణచివేత, భారత జాతీయ సైన్యంపై విచారణ– రెండు అంశాలు ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి.

కాంగ్రెస్ నాయకులు జైళ్ళ నుండి విడుదల కాగానే ప్రభుత్వం సాగించిన అకృత్యాల సమస్యని చేపట్టారు. మృతవీరుల త్యాగాల్ని స్మరించడం నాణానికి ఒకవైపు అయితే అధికారుల చర్యల్ని ఖండించడం రెండవవైపు. నాయకులు లేకుండా ప్రజలు సాగించిన ప్రతిఘటనని కాంగ్రెస్‌వాదులు ప్రశంసించారు. మృతవీరుల స్మారక చిహ్నాలు చాలాచోట్ల ప్రతిష్టింపబడ్డాయి. బాధితులకు సహాయక నిధి వసూలు చేయబడింది. అణచివేత తీవ్రత కథలు కథలుగా ప్రచారంచేయబడింది. అణచివేతకు బాధ్యులైన అధికారుల పేర్లు ప్రస్తావించి మరీ ఖండింపబడ్డాయి. విచారణలు జరిపించి తీవ్రంగా శిక్షిస్తామని వాగ్దానాలు చేయబడ్డాయి. అలాంటి ఉపన్యాసాలు ప్రభుత్వం అదుపుచేయలేకపోవడంతో అధికారుల నైతికస్థైర్యంపై చాలా ప్రతికూల ప్రభావం చూపాయి. అధికారుల చర్యలపై విచారణలు జరపాలన్న డిమాండ్లు విపరీతంగా పెరిగిపోతాయని అధికారులు ఆందోళన చెందారు. రానున్న ఎన్నికలు – ప్రత్యేకించి అణచివేత చర్యలు పాశవికంగా అమలు జరుపబడిన రాష్ట్రాలలో – కాంగ్రెస్ మంత్రివర్గాల్ని అధికారంలోకి తెచ్చే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. 1942లో యు.పి. అధికారులు చేపట్టిన చర్యల్ని 1946లో బయటికి లాగితే వాటిని ఎవరూ సమర్థించజాలరని యు.పి. గవర్నర్ వైలీ 1946 ఫిబ్రవరి 19న అంగీకరించాడు. వీటన్నింటికి ముగింపుగా కాంగ్రెస్‌తో పెద్దమనుషుల ఒప్పందం మాత్రమే సమస్యని పరిష్కరించగలదని వైస్రాయి చెప్పాడు.

కాని బ్రిటిషు వారికి పట్టుబడిన సుభాష్ చంద్రబోస్ యొక్క భారత జాతీయ సైన్యం (ఐ.యన్.ఎ.) భవితవ్యం సమస్య ప్రజల మనసుల్ని ఆవహించి వున్నది. తీవ్రమైన

నేరాలుచేసిన వారికే విచారణ పరిమితం చేయబడుతుందని, 1945 చివరినాటికి ప్రభుత్వ ప్రకటన వెలువడనుంది. కాని ప్రభుత్వ ప్రకటన వెలువడకముందే నెహ్రూ 1945 ఆగస్టు 16న బందీలైన సైనికుల పట్ల సానుకూలంగా సానుభూతితో వ్యవహరించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. నెహ్రూ వారిని దారితప్పించబడిన దేశభక్తులుగా ప్రశంసిస్తూ, భారతదేశంలో పెనుమార్పులు జరుగనున్నాయని, బ్రిటిషు ప్రభుత్వ ప్రకటన కనుగుణంగా న్యాయపరమైన చర్యలు చేపట్టాలని నెహ్రూ కోరాడు. ఇతర కాంగ్రెస్ నాయకులు కూడా ఈ అంశాన్ని చేపట్టారు. యుద్ధం ముగిసిన తరువాత 1945 సెప్టెంబరు 21 నుండి 23వరకు జరిగిన తొలి కాంగ్రెస్ సదస్సు ఐ.యన్.ఎ. బందీలకు మద్దతు ప్రకటిస్తూ తీర్మానం చేసింది. ఐ.ఎన్.ఎ. ఖైదీల రక్షణ బాధ్యత కాంగ్రెస్ చేపట్టింది. చారిత్రాత్మకమైన ఎర్రకోట వద్ద జరిగిన విచారణకు బూలాభాయ్ దేశాయ్, తేజ్ బహద్దూర్ సప్రూ; కె.యన్.కట్జూ, నెహ్రూ, అసఫ్అలీ హాజరయ్యారు. కాంగ్రెస్ ఐ.యన్.ఎ. సహాయ నిధిని, విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. విడుదలైన వారికి కొద్ది మొత్తాలలో ఆర్థిక సహాయం అందించింది; ఉపాధి కల్పించేందుకు ప్రయత్నం పరిమితంగా జయప్రదమయింది. నిధి వసూలు చేసేందుకు సెంట్రల్ ఐ.యన్.ఎ. ఫండ్ కమిటీకి, బొంబాయిలో మేయర్ ఫండ్కి, ఎ.ఐ.సి.సి., పి.సి.సి. కార్యాలయాలకు శరత్ బోస్కి అధికారాలిచ్చింది. దేశవ్యాప్తంగా జరిగిన సభలలో ఐ.యన్.ఎ. సమస్యకి కాంగ్రెస్ వేదిక అయింది. వాస్తవంగా ఐ.యన్.ఎ. సభకి, ఎలక్షన్ సభకి తేడా గుర్తించడానికి వీలుపడనంతగా కాంగ్రెస్ ఐ.యన్.ఎ.తో మమేకమయింది. నెహ్రూ ఐ.యన్.ఎ. సమస్యని ముందుగా చేపట్టడం, తరువాత కాంగ్రెస్ పలువిధాలుగా జోక్యం చేసుకోవడం కారణాలుగా చూపి సమస్యని కాంగ్రెస్ ఎన్నికల స్టంటుగా ఉపయోగించుకొన్నదని చేసిన ఆరోపణలో వాస్తవంలేదు.

ఐ.యన్.ఎ. ఆందోళన పలు విధాలుగా ప్రముఖమైన ఘటన. మొదటిది: ఖైదీల విడుదల కొరకు చేపట్టబడిన ప్రచారం గతంలో ఎన్నడూలేనంత తీవ్రంగా సాగింది. పత్రికలు విపరీతమైన ప్రచారం యిచ్చాయి. కసి తీర్చుకొంటామని బెదిరింపులు బాహాటంగా చేయబడ్డాయి. అందుకు అసంఖ్యాకమైన సభలు జరుపబడ్డాయి.

మొదట దారితప్పిన వారికి క్షమాభిక్ష పెట్టమని పత్రికలలో ప్రకటనలు వచ్చాయి. కాని 1945 నవంబరు నాటికి మొదటి ఎర్రకోట విచారణలు ప్రారంభమైనప్పుడు ఐ.యన్.ఎ. సైనికుల్ని ధైర్యసాహసాలుగల దేశభక్తులుగా ప్రశంసిస్తూ, ప్రభుత్వ వైఖరిని

నిరసిస్తూ ప్రతిరోజూ సంపాదకీయాలు వచ్చాయి. అంతర్జాతీయ వార్తల్ని విస్మరించి, అత్యధిక ప్రాధాన్యత ఐ.యన్.ఎ. విచారణలకు ఐ.యన్.ఎ. ప్రచారానికి యివ్వబడింది. కరపత్రాలు – ముఖ్యంగా చాలా ప్రజాభిమానం చూరగొన్న కరపత్రం 'దేశద్రోహులు కాదు, దేశభక్తులు' విస్తృతంగా పంచబడింది. 'జైహింద్', 'క్విట్ ఇండియా' అజ్మీరు గోడల నిండా వ్రాయబడ్డాయి. ఒక ఐ.యన్.ఎ. సైనికుణ్ణి శిక్షిస్తే 20 బ్రిటిషు కుక్కల్ని చంపుతామని బెదిరింపు వాల్‌పోస్టర్లు ఢిల్లీ గోడలనిండా పరుచుకొన్నాయి. ఐ.యన్.ఎ. సైనికుల్ని రక్షించకపోతే యూరోపియన్ బిడ్డలపై పగతీర్చుకొంటామని బనారస్ బహిరంగసభలో బాహాటంగా ప్రకటించబడింది. ఐ.యన్.ఎ. బందీలకు క్షమాభిక్షని డిమాండ్ చేస్తూ 1945 అక్టోబరులోని మొదటి 15రోజులలో సెంట్రల్ ప్రావిన్సెస్, బేరార్‌లలో 160 రాజకీయ సభలు జరుపబడ్డాయి. నవంబరు 12 ఐ.యన్.ఎ. దినంగా, 1945 నవంబరు 5నుండి 11వరకు ఐ.యన్.ఎ. వారంగాను పాటించబడ్డాయి. పెద్ద సభలకు 50,000మంది ప్రజలు వచ్చారు. అన్నిటికంటె పెద్దసభ కలకత్తాలోని దేశప్రియ పార్కులో జరుపబడింది. ఐ.యన్.ఎ. రిలీఫ్ కమిటీచే నిర్వహింపబడిన ఈ సభలో శరత్‌బోస్, నెహ్రూ, పటేల్ ప్రసంగించారు. సభకి 2, 3 లక్షలమంది, నెహ్రూ ప్రసంగానికి 5 నుండి 7 లక్షలమంది హాజరయ్యారని అంచనా.

ఐ.యన్.ఎ. ప్రచారంలో విభిన్నమైన సామాజిక గ్రూపులు, రాజకీయపార్టీలు భాగస్వామ్యం వహించాయి. దీనిలో రెండు అంశాలున్నాయి. ఒకటి: ఆందోళన యొక్క విస్తృతమైన స్వభావం. రెండు: ఐ.యన్.ఎ. అనుకూల భావాలు జాతీయవాద పరిధికి వెలుపలనున్న సామాజిక గ్రూపులలో వ్యాప్తిచెందడం. 'ప్రజల ఆసక్తిని అంతగా ఆకర్షించిన సంఘటన – అంతకంటే ప్రజల సానుభూతిని చూరగొన్న సంఘటన ఎప్పుడోగాని జరగదు' – అని ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టరు అంగీకరించాడు. మారుమూల గ్రామం నుండి కులం, మతం, రంగుతో సంబంధంలేకుండా సానుభూతి వ్యక్తమయింది. "అజాద్ హింద్ ఫౌజుపై విభిన్నమైన సెక్షన్ల ప్రజానీకం వ్యక్తం చేసిన సమైక్య భావాలు, ఆలోచనలు భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగనివి." ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, మద్రాసు నగరాలు, యు.పి., పంజాబ్ పట్టణాలు ఆందోళన నాడీ కేంద్రాలు. అంతేగాదు. ఆందోళన కూర్గ్, బెలూచిస్తాన్, అస్సాంలకు వ్యాపించడం గమనించదగిన అంశం.

భాగస్వామ్యం పలురకాలు. కొందరు విరాళాలిచ్చారు. మరికొందరు సభలు నిర్వహించారు. దుకాణదారులు షాపులు మూసివేశారు. రాజకీయపార్టీలు, సంస్థలు

ఖైదీల విడుదల కొరకు డిమాండు చేశాయి. మునిసిపల్ కమిటీలు, విదేశాలలో వున్న భారతీయులు, గురుద్వార కమిటీలు ఉదారంగా విరాళాలిచ్చాయి. శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ రు.7000లు విరాళమిచ్చింది. మరొకరు 10,000 సహాయక నిధికి కేటాయించింది. పూనా నగర మునిసిపాలిటీ, కాన్పూర్ సిటీ ఫండ్, మద్రాసు ప్రెసిడెన్సీలోని ఒక జిల్లా బోర్డు ఒక్కొక్కటి రు.1000లు విరాళాలిచ్చాయి. అంతేగాక బొంబాయి, కలకత్తా సినిమా తారలు, కేంబ్రిడ్జి అమరావతి టాంగావాలాలు విరాళాలిచ్చి సహకరించారు. దక్షిణాన సేలం నుండి ఉత్తరాన రావల్పిండి వరకు విద్యార్థులు తరగతుల్ని బహిష్కరించారు. సభలు జరిపారు. ప్రదర్శనలు నిర్వహించారు. ఐ.యన్.ఎ. విచారణ ప్రారంభమైన 1945 డిసెంబరు 5న ఐ.యన్.ఎ. దినం, ఐ.యన్.ఎ. వారం దినాలలో వాణిజ్యసంస్థలు, షాపులు, మార్కెట్లు వ్యాపారాన్ని బంద్ చేశాయి. 1945 నవంబరు 16న ధామన్‌గావ్ షోలాపూర్‌లలో నిర్వహించబడిన కిసాన్ సదస్సులు, 1945 డిసెంబరు 29న జరిగిన 10వ అఖిలభారత మహిళా సదస్సు ఐ.యన్.ఎ. ఖైదీలను విడుదల చేయమని డిమాండు చేశాయి. ఈస్టరన్ కమాండ్ జనరల్ టూకర్ పేర్కొన్నట్లు "ఇంగ్లీషు మేధావులు – ఒకటి రెండు సంవత్సరాలు భారతదేశంలో గడపటానికి వచ్చిన వలసపక్షులు కూడా ఐ.యన్.ఎ. సైనికుల తప్పొప్పుల పట్ల, తప్పుల స్థాయి పట్ల చాలా ఆసక్తి కనబరచారు. ఐ.యన్.ఎ. సైనికుల పట్ల సానుభూతితో పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలు దీపావళి పండుగ జరుపుకొనలేదు. కలకత్తా గురుద్వారాలు ఐ.యన్.ఎ. ప్రచార కేంద్రాలయ్యాయి. ముస్లింలీగు, భారత కమ్యూనిస్టుపార్టీ, యూనియనిస్టు పార్టీ, అకాలీలు, జస్టిస్ పార్టీ, రావల్పిండిలోని అహరాన్లు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, హిందూ మహాసభ, సిక్కులీగు – అన్నీ కూడా తరతమ భేదాలతో ఐ.యన్.ఎ.ని బలపరచాయి. వైస్రాయి గమనిక మేరకు "కాంగ్రెస్ కొంత ఎక్కువ గందరగోళం చేసినప్పటికీ అన్ని పార్టీలు ఒకే మార్గాన నడిచాయి."

ఐ.యన్.ఎ. ఆందోళనలో ముఖ్యంగా గమనించవలసిన అంశం: బ్రిటిషు రాజ్యం యొక్క సాంప్రదాయ రక్షణ స్థావరాలపై ఆందోళన చూపిన ప్రభావం. ప్రభుత్వోద్యోగులలోని గణనీయమైన సెక్షన్లు, విధేయతగా వుండే సెక్షన్లు సాయుధ బలగాలలో పనిచేసేవారు కూడా ఐ.యన్.ఎ. అనుకూల భావాల ప్రవాహంలో ముంచివేయబడ్డారు. చాలామంది అధికారులు దీనిలో అలజడి, ఆందోళనకరమైన ధోరణిని చూశారు. ఇకనుండి గడిచే ప్రతిరోజూ కూడా సంపన్న భారతీయుల్ని, సమాజంలో పై స్థాయిలో ఉన్న భారతీయుల్ని

అధికారికంగా బ్రిటిషు వ్యతిరేక శిబిరంలోకి నెడుతుంది అని హెచ్చరించాడు వాయవ్య సరిహద్దు గవర్నర్. డైరెక్టర్ ఆఫ్ ఇంటెలిజెన్స్ బ్యూరో పరిశీలన మేరకు "ఐ.యన్.ఎ. పట్ల సానుభూతి సాధారణంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వుండేవారి గుత్తాధిపత్యం కాదు. ఐ.యన్.ఎ. సైనికులు విధేయత సాంప్రదాయాలుగల కుటుంబాల నుండి వచ్చినవారు." పంజాబ్‌లో (1946 ఫిబ్రవరి వరకు విడుదల చేయబడిన ఐ.యన్.ఎ. సైనికులలో 48.07 శాతం వున్న రాష్ట్రంలో) విడుదల చేయబడిన సైనికులు వారి గ్రామాలకు తిరిగి రావడంతో అప్పటివరకు ఎలాంటి రాజకీయ ప్రభావంలేని గ్రూపులలో ఒక విధమైన కదలిక, ప్రేరణ ప్రారంభమయింది. విడుదలయిన ఐ.యన్.ఎ. ఆఫీసర్లు ఆ ప్రాంతంలోని పలుకుబడి గలిగిన కుటుంబాలకు చెందిన వారవడంకూడా స్థానిక ప్రజల ఆసక్తిని పెంచడానికి దోహదపడింది. ఎర్రకోటలో విచారణకు తీసుకొని రాబడిన ముగ్గురిలో ఒకరైన పి.కె.సేఘల్ పంజాబు హైకోర్టు మాజీ జడ్జి దివాన్ అచ్చూరామ్ కుమారుడు. భారతదేశం, బ్రిటన్‌ల మధ్య మంచి సంబంధాలుండవలసిన అవసరం రీత్యా విచారణలను ఆపివేయవలసిందిగా యుద్ధ ఖైదీల పక్షాన వాదించిన లాయర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు వ్యక్తులుగా ఐ.యన్.ఎ. ఖైదీల పట్ల సానుభూతి చూపారు. అంతేగాక సెంట్రల్ ప్రావిన్స్, బేరార్ లాంటి చోట్ల రైల్వే ఉద్యోగులు నిధులు వసూలుచేసిన ఘటనలు కూడా వున్నాయి.

ఐ.యన్.ఎ. దేశద్రోహుల పట్ల ప్రభుత్వ సైనికులు చాలా వ్యతిరేకంగా వుంటారనే ప్రభుత్వ భావనకు భిన్నంగా సైనిక బలగాలు అనూహ్యమైనంత సానుభూతితో వున్నారు. కోహట్‌లోని రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సైనికులు షానవాజ్ సభలకు హాజరయ్యారు. అలాగే యు.పి., పంజాబులోని సైనికులు ఐ.యన్.ఎ. సభలకు తరచుగా యూనిఫారంతో హాజరయ్యారు. యు.పి.లోని యితర ప్రభుత్వ ఉద్యోగులు యిచ్చినట్లుగానే కలకత్తా, కోహట్, అల్హాబాద్, బార్మోలీ, కాన్పూరులలోని ఆర్.ఐ.ఎ.యఫ్. సైనికులు విరాళాలిచ్చారు. కమాండర్ ఇన్ ఛీఫ్ చెప్పినట్లుగా బాహాటంగా మద్దతు తెలపడంతోపాటు ఐ.యన్.ఎ. పట్ల సానుభూతి సైనికుల మనసుల నావరించింది. అతడు సైనికుల ఆలోచన క్షమాభిక్షకి అనుకూలంగా వుంది గనుక ప్రభుత్వం కూడా ఉదారంగా వ్యవహరించాలని వైట్‌హాల్‌కి సూచించాడు.

ఐ.యన్.ఎ. సైనికులు చేపట్టిన చర్య యొక్క తప్పొప్పుల సమస్య ఎప్పుడూ చర్చించబడలేదు. భారతీయులకు సంబంధించిన విషయాన్ని నిర్ణయించేహక్కు బ్రిటన్‌కి

వుందా? – అనేది సమస్య. నెహ్రూ తరచుగా నొక్కి చెప్పినట్లు భారత బ్రిటిషు సంబంధాలు మార్పు చెందాలని చేస్తున్న బ్రిటను ప్రకటన చిత్తశుద్ధితో చేసిందైతే ఐ.యన్.ఎ. సమస్యను భారతీయులకు వదలిపెట్టి, వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఉదారవాదులైన భారతీయులు చేసిన విజ్ఞప్తులు కూడా భారత బ్రిటన్ దేశాల మధ్య భవిష్యత్‌లో మంచి సంబంధాలు ఆశించి చేసినవే. బ్రిటిషు పాలకులు ఐ.యన్.ఎ. సమస్య యొక్క రాజకీయ ప్రాధాన్యతను గుర్తించారు. రోజుకి రోజు సమస్య బ్రిటన్‌కి వ్యతిరేకంగా భారతదేశం అనే వైఖరి తీసుకొంటుంది గనుక విచారణ విరమించబడాలని వాయవ్య సరిహద్దు రాష్ట్ర గవర్నర్ వాదించాడు.

* * *

ఐ.యన్.ఎ. విచారణల నాటికి అత్యున్నత స్థాయికి చేరిన జాతీయవాద భావం 1945–46 నాటికి ప్రభుత్వంతో ఘర్షణలుగా పరిణామం చెందింది. మూడు తిరుగుబాట్లు జరిగాయి. మొదటిది: ఐ.యన్.ఎ. విచారణలపై కలకత్తాలో 1945 నవంబరు 21న, రెండవది: 1946 ఫిబ్రవరి 11న ఐ.యన్.ఎ. ఆఫీసరైన రషీదు అలీకి 7సంౣలు శిక్ష విధించినందుకు నిరసనగా కలకత్తాలో. మూడవది : 1946 ఫిబ్రవరి 18న రాయల్ ఇండియన్ నేవీ సైనికులు సమ్మె చేసినప్పుడు. ఈ తిరుగుబాట్లు ఒకే నమూనాని పాటించాయి. ప్రారంభదశలో ఒక గ్రూపు అధికారాన్ని తిరస్కరించి, అణచివేయబడింది. రెండవ దశ: నగరంలోని ప్రజలు దానిలో చేరారు. మూడవ దశ: దేశంలోని యితర ప్రాంతాల ప్రజలు సానుభూతి సంఘీభావం ప్రకటించారు.

మొదటిదశ విద్యార్థులు, నావికా సైనికులు అధికారాన్ని సవాల్ చేయడంతో ప్రారంభమై అణచివేతతో అంతమయింది. 1945 నవంబరు 21న ఫార్వర్డ్‌బ్లాకు సానుభూతిపరులు, విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలు, ఇస్లామియా కాలేజి విద్యార్థులు కలిసి ఊరేగింపుగా డల్హౌసీ స్క్వేర్ చేరారు. పోలీసులు లాఠీఛార్జి చేశారు. విద్యార్థులు రాళ్ళు, యిటుక ముక్కలతో ఎదుర్కొన్నారు. పోలీసులు కాల్పులు జరిపారు. ఇద్దరు చనిపోయారు. 52మంది గాయపడ్డారు. 1946 ఫిబ్రవరి 11న ముస్లింలీగు విద్యార్థులు ప్రదర్శనకు నాయకత్వం వహించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు కలిశాయి. ధరమటోల వీధిలో కొన్ని అరెస్టులు చేయబడ్డాయి. ఈ చర్య విద్యార్థుల్ని రెచ్చగొట్టింది. డల్హౌసీ స్క్వేర్ వద్ద విధించబడిన 144 సెక్షన్‌ని అతిక్రమించారు. లాఠీఛార్జి, మరికొన్ని అరెస్టులు జరిగాయి.

హెచ్.యం.ఐ.యస్. తల్వార్‌కి చెందిన 1100మంది నావికా సైనికులు ఫిబ్రవరి 18న బొంబాయిలో చేసిన సమ్మెతో భారత నావికుల తిరుగుబాటు ప్రారంభమయింది. బ్రిటిషు అధికారులు అమలుజరుపుతున్న జాతి వివక్షతకు, ఆహారం సరఫరా చేయడంలో వివక్షతకు పరుషమైన పదజాలంతో అవమానించడానికి, నిరసన తెలిపేందుకు నావికా సైనికులు సమ్మె చేశారు. నావికా సైనికుడు బి.సి.దత్ హెచ్.ఐ.యం.యస్. తల్వార్‌పై 'క్విట్ ఇండియా' అని వ్రాసినందుకు చేయబడిన అరెస్టుకు నిరసన వ్యక్తం చేయబడింది. మరుసటి రోజు హెచ్.యం.ఐ.యస్. నావికులపై కాల్పులు జరుపబడ్డాయి (ఇది అవాస్తవం) అనే వార్త వినగానే కేజిల్, ఫోర్టు స్థావరాల నుండి నావికా సైనికులు తమ స్థానాల్ని వదిలిపెట్టి సమ్మెలో చేరారు. కాంగ్రెస్ జెండాలు పట్టుకొని బొంబాయి వీధుల్లో ప్రదర్శన జరిపారు. ఇంగ్లీషువారిని, పోలీసుల్ని బెదిరించారు. ఇక్కడొకటి అక్కడొకటిగా షాపు కిటికీల్ని పగులగొట్టారు.

పెల్లుబికిన బ్రిటిషు వ్యతిరేకతతో ప్రజలు వెల్లువెత్తినట్లు చేరడంతో రెండు మహానగరాలు – కలకత్తా, బొంబాయి స్తంభించిపోయాయి. ఇది తిరుగుబాట్ల రెండవ దశ. సమ్మెలు, హర్తాళ్ళు, బారికేడ్లు, ఇళ్ళపై నుండి సందుగొందుల నుండి సాగించిన పోరాటాలు, యూరోపియన్లపై దాడులు, పోలీసుస్టేషన్లు, పోస్టాఫీసులు, షాపులు, ట్రామ్స్ డిపోలు, రైల్వేస్టేషన్లు, బ్యాంకులు, ఆహారధాన్యాల షాపులు ఒక వై.యం.సి.ఎ. సెంటరు తగులబెట్టబడ్డాయి. మూడు సందర్భాలలో అనుసరించబడిన పద్ధతి యిది. ప్రభుత్వ అంచనాల ప్రకారం నావికా తిరుగుబాటు, బొంబాయి ప్రజల ఆగ్రహం 30షాపుల్ని, 10 పోస్టాఫీసుల్ని, 10 పోలీస్ స్టేషన్లను, 64 ఆహార ధాన్యాల షాపుల్ని, 200 వీధి దీపాల్ని ధ్వంసం చేసింది. నగర సాధారణ జీవితానికి పూర్తిగా అంతరాయం కల్పించబడింది. సాధారణ సమ్మెకై కమ్యూనిస్టులు యిచ్చిన పిలుపుతో లక్షలాది మంది కార్మికులు ఫ్యాక్టరీలు వదలి వీధుల్లోకి వచ్చారు. షాపుల యజమానుల, వ్యాపారస్థుల, హోటల్ యజమానుల హర్తాళ్ళు, పారిశ్రామిక రవాణారంగాలలో సమ్మెలు – మొత్తంగా నగరాన్ని స్తంభింపజేశాయి. రైలు పట్టాలపై బైఠాయింపులు జరిపి రైళ్ళను ఆపివేయడం, పోలీసు, మిలిటరీ లారీలపై రాళ్ళు విసరడం. తగులబెట్టడం, వీధుల్లో బారికేడ్ల ఏర్పాటు – అన్నీ యథేచ్ఛగా సాగిపోయాయి.

మూడవ దశ: దేశంలోని యితర ప్రాంతాల ప్రజల సంఘీభావ వ్యక్తీకరణ. విద్యార్థులు తరగతుల్ని బహిష్కరించారు. విద్యార్థులకు నావికా సైనికులకు సానుభూతి

వ్యక్తం చేసేందుకు, ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించేందుకు హర్తాళ్ళు, ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. నావికాదళ తిరుగుబాటుకి బొంబాయి తరువాత కరాచి ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 19న వార్తలు కరాచీ చేరాయి. మరొక నౌకతోపాటు హెచ్.యం.ఐ.యస్. హిందూస్తాన్, ఒడ్డున వున్న మరి మూడు సంస్థలు మెరుపు సమ్మెచేశాయి. మద్రాసు, విశాఖపట్నం, కలకత్తా, ఢిల్లీ, కొచ్చిన్, జాంనగర్, అండమాన్, బహరైన్, అడెన్‌లలోని మిలిటరీ సంస్థలు సానుభూతితో నిరసన సమ్మెలు చేశాయి. 78 నౌకలు, ఒడ్డున వున్న 20 సంస్థలలో పనిచేసే 20,000 మంది దీనితో ప్రభావితులయ్యారు. మెరీనా డ్రైవ్‌లో బొంబాయిలోని అంధేరి సియాన్లలో యింకా పూనా, కలకత్తా, జెస్సోరి, అంబాలా యూనిట్లకు చెందిన ఆర్.ఐ.ఎ.యఫ్. నిరసన సమ్మెలు చేశారు.

* * *

ఈ సంఘటనల ప్రాధాన్యత ఏమిటి? ఇవి ప్రజల మనస్సులలోని సమరశీలతకు ఒక రూపాన్ని యిచ్చాయి. చర్యలు తొందరపాటువైనప్పటికీ, ఆ చర్యలకు దిగడంలో భయంలేదు. గుంపులు పోలీసుల కాల్పుల్ని ఎదుర్కొన్నప్పుడు తాత్కాలికంగా వెనక్కి తగ్గినా మరలా కూడగట్టుకొని యథాస్థానానికి వచ్చాయి. బెంగాల్ గవర్నర్ యొక్క సఱుగుడుతో కూడిన అభిమానాన్ని చూరగొన్నాయి. నావికా బలాల తిరుగుబాటు ఈ నాటికీ ఒక అద్భుతమైన సాహసగాథగా మిగిలింది. అది జరిగినప్పుడు ప్రజా చైతన్యంపై నాటకీయ ప్రభావాన్ని చూపింది. సాయుధ దళాలలో తిరుగుబాటు త్వరలో అణచివేయబడినప్పటికీ దానికి ప్రజల మనస్సులలో విముక్తి కల్పించే ప్రభావం వుంది. నావికా దళం తిరుగుబాటు బ్రిటిషు పాలనని అంతమొందించిన – దాదాపు 1947లో సాధించిన స్వాతంత్ర్యదినంగా పరిగణించబడింది. కాని వాస్తవం – దానిని ప్రజలు అర్థం చేసుకొనడం వేరువేరుగా వుంటాయి. 1945–46 నాటి నాటకీయ ఘటనలకు యిది వర్తిస్తుంది. సమూలమైన మార్పులు కోరే విజ్ఞులు ఈ చారిత్రక ఘటనల్ని సంకేతాలుగా పరిగణించక అతిశయించి చెప్పారు. ప్రజల సమరశీలత, వారికి గల అవకాశాలు, సాధించగల సమర్థత– అన్నీ అతిశయించి చెప్పబడ్డాయి. భారతదేశం విప్లవం అంచున వున్నట్లు చూపబడింది. అంతేగాదు ఈ ఘటనల కాలం నాటి మతపరమైన ఐక్యతని పటిష్టపరచివుండివుంటే మతపరమైన ప్రతిష్టంభనకు మార్గాంతరం ఏర్పడివుండేది– అనే వాదన కూడా వుంది.

మనం ఈ తిరుగుబాట్లను, నిశితంగా పరిశీలిస్తే అవి చేపట్టిన తీవ్రమైన ప్రత్యక్షమైన హింసాత్మకమైన ఘర్షణ రూపానికి కొన్ని పరిమితులున్నట్లు గమనిస్తాం. సమాజంలోని అత్యంత సమరశీలమైన సెక్షన్లు మాత్రమే వీటిలో పాల్గొనగలిగాయి. వీటిలో ఉదారవాద సాంప్రదాయవాద గ్రూపులకు స్థానంలేదు. గడచిన దశాబ్దాలలో ప్రజా ఉద్యమాలకు వెన్నెముకగా నిలిచిన గ్రామీణ చిన్న పట్టణాల స్త్రీ పురుషులకు స్థానం లేదు. అంతేగాక ఈ తిరుగుబాట్లు తాత్కాలికమైనవి. ప్రజల ఆగ్రహ వెల్లువ వెనుకపట్టు పడితే యివీ త్వరగా అణగిపోతాయి. 1946 ఫిబ్రవరి 11 నుండి 13 వరకు అద్భుతమైన కోలాహల దృశ్యంగా వున్న కలకత్తా వారం రోజుల తరువాత నావికాదళ తిరుగుబాటు కాలంలో ప్రశాంతంగా వుంది. లక్షమంది కార్మికులు ఒకరోజు సమ్మె చేశారు. సంఘటిత కార్మికవర్గం మినహాయించి మిగిలిన నగరం ప్రశాంతంగా వుంది. అంతేగాక ఐ.యన్.ఎ. ఆందోళన మారుమూల గ్రామాలకు చేరగా ఈ తిరుగుబాట్లు కొన్ని పట్టణ కేంద్రాలకు పరిమితం చేయబడ్డాయి. ఈ పట్టణ కేంద్రీకరణ సైన్యాల్ని పంపించి ప్రభుత్వం తిరుగుబాటుని అణచివేయడాన్ని సులభతరం చేసింది.

ఈ సందర్భంగా కన్పించిన మతపరమైన ఐక్యత, సంస్థాపరమైన ఐక్యతేగాని ప్రజల ఐక్యతకాదు. అంతేగాక కలకత్తాలో రషీద్ అలీ విచారణ సందర్భంగా జరిగినట్లు కొద్దిరోజులపాటు జరిపే ప్రత్యేకమైన ఆందోళన కొరకు సంస్థలు చేరువయ్యాయి. 1946 ఫిబ్రవరిలో దాదాపు విప్లవ దృశ్యంగా వున్న కలకత్తా కేవలం ఆరునెలల తరువాత అంటే 1946 ఆగస్టు 16న మతోన్మాదులకు రణరంగమయింది. నౌకల తెరచాపలపై కాంగ్రెస్, లీగు, కమ్యూనిస్టుల జెండాలు ఉమ్మడిగా ఎగురవేయబడినప్పటికి ఆర్.ఐ.యన్. తిరుగుబాటు సందర్భంగా వ్యక్తమైన మతపరమైన ఐక్యత చాలా పరిమితమైనది. భవిష్యత్ కార్యక్రమంపై సలహా పొందేందుకు ముస్లిం నావికా సైనికులు లీగువద్దకు వెళ్ళారు. లొంగిపొమ్మని జిన్నా ముస్లిం సైనికులకు మాత్రమే సలహాయిచ్చాడు. వారు జిన్నా సలహాని వెంటనే పాటించారు. 1945-46 నాటి మతపరమైన ఐక్యతని ముందుకు తీసుకొనిపోయి వున్నట్లయితే దేశ విభజన నివారింపబడి వుండేది- అనేవాదన నిర్దిష్టమైన చారిత్రక సంభావ్యతపైన ఆధారపడింది కాదు; ఊహాజనితమైన అనుకూల ఆలోచన మాత్రమే. బారికేడ్ల వద్ద ఐక్యత దీనికనుగుణంగా లేదు.

ఆర్.ఐ.యన్. తిరుగుబాటు బ్రిటిషు సామ్రాజ్య పునాదుల్ని కదిలించిందని కొందరు నమ్మారు. కాని ఈ సమయంలో ఉన్నతాధికార వర్గం యొక్క నైతికస్థాయి,

సాయుధ బలగాల దృఢత్వం గణనీయంగా సడలిపోయినప్పటికీ అణచివేయగల బ్రిటిష సాధనసంపత్తి యథాతథంగా వుంది. నౌకాదళ సమ్మె తరువాత కొద్ది రోజులకు వైస్రాయి సాయుధ బలగాలు 'మొత్తం మీద భారతదేశ సైన్యం అభినందనీయంగా, దృఢంగా వుంది' - అని ప్రశంసించాడు. 'మరికొంత బలమైన ఒత్తిడి తెచ్చి వున్నట్లయితే బ్రిటిషవారు లొంగిపోయి వుండేవారు'- అనే నమ్మకం తప్పని నిరూపితమయింది. సైన్యం నుండి, ప్రజల నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నప్పుడు ఐ.యన్.ఎ. విచారణలు చేపట్టాలనే బ్రిటిష వైఖరిని ప్రశ్నించడం ఒక అంశం. వారి ఆధిక్యతకు సవాళ్ళు ఎదురవడం మరొక అంశం. శాంతికి ఎదురయ్యే సవాళ్ళు అణచివేయబడాలి- అనేది బ్రిటిషవారి నిశ్చితాభిప్రాయం.

కలకత్తాలో 1945 నవంబరు సంఘటనల సందర్భంలో సైన్యం సిద్ధంగా వుంది. కాని బెంగాల్ గవర్నర్ పోలీసులతో పరిస్థితిని అదుపుచేయటానికి ప్రాధాన్యత యిచ్చాడు. చేయగలిగాడు. 1946 ఫిబ్రవరి 12న కలకత్తాకు సైన్యం రప్పించబడింది. కాల్పుల్లో 26మంది పౌరులు హతులయ్యారు. అలాగే ఆర్.ఐ.యన్. తిరుగుబాటు సమయంలో కరాచీలో లొంగిపోవలసిందిగా తిరుగుబాటు సైనికులపై ఒత్తిడి తీసుకొనిరాబడింది. ఆ క్రమంలో ఆర్గురు కాల్చి చంపబడ్డారు. బొంబాయిలో భారతీయ సైనికులు తమ దేశ ప్రజలపై కాల్పులు జరిపేందుకు నిరాకరించారు- అనే ప్రజల విశ్వాసానికి విరుద్ధంగా బొంబాయిలో తిరుగుబాటుదారుల్ని చుట్టుముట్టి, సైనిక స్థావరానికి తరలించింది. మరాటా బెటాలియన్. బొంబాయి తిరుగుబాటు సైనికులనేగాక, వారికి సహాయ సహకారాలందించి, వారితో కలిసి బొంబాయి నగరాన్ని స్తంభింపజేసిన ప్రజల్ని కూడా లొంగతీసింది భారతీయ సైనికులే. రాయల్ నేవీ షిప్స్ బొంబాయికి వెళ్ళే మార్గంలో వున్నాయని బ్రిటిష ప్రధానమంత్రి అట్లీ హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రకటించాడు. ఆర్.ఐ.యన్.కి చెందిన అడ్మిరల్ గాడ్‌ఫ్రే తిరుగుబాటుదారులకు తీవ్రమైన హెచ్చరిక చేశాడు. ఆ తరువాత సైనికులు నౌకల్ని చుట్టుముట్టారు. బాంబర్లు పైకి ఎగిసాయి. దీనినే బొంబాయి చుట్టూ ఇనుపవలయంగా వర్ణించింది అమృతబజార్ పత్రిక. బొంబాయిలో 228 మంది పౌరులు హతులయ్యారు. 1046మంది గాయపడ్డారు.

నౌకాదళ తిరుగుబాటు ప్రభావాన్ని అంచనా వేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం (Cabinet Mission) పంపించబడింది. ఆర్.పి. దత్ చాలా సంవత్సరాల క్రితం ఈ రెంటిని కలిపి - "ఫిబ్రవరి 18న బొంబాయిలో నావికుల సమ్మె ప్రారంభమయింది.

ఫిబ్రవరి 19న అట్లీ మంత్రివర్గ ఉపసంఘాన్ని పంపిస్తున్నట్లు హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రకటించాడు" అని వ్రాశాడు. ఇది స్పష్టంగా పొసగని విషయం. మంత్రివర్గ ఉపసంఘాన్ని పంపించాలని బ్రిటిషు మంత్రివర్గం 1946 జనవరి 22న నిర్ణయం చేసింది. ఈ సమయంలో ప్రజాపోరాటాల, సమరశీల పోరాటాల సమిష్టి ఫలితంగా గణనీయమైన రాజకీయ రాయితీలు యిచ్చేందుకు బ్రిటిషువారు సంసిద్ధంగా వున్నారని యితరులు వివరించారు. కాని మనం తరువాతి అధ్యాయంలో చూడబోతున్నట్లు అధికారం బదిలీ చేయాలన్న బ్రిటిషు పాలకుల నిర్ణయం 1945-46నాటి పరిస్థితుల తక్షణ స్పందనకాదు, పరిపాలించేందుకు వారికి గల చట్టబద్ధత క్రమంగా క్షీణిస్తుందని గుర్తించిన ఫలితంగా చేయబడింది. కాంగ్రెస్ ఈ తిరుగుబాట్లని వ్యతిరేకించిందని లేక వాటికి దూరంగా వుందని భావించబడింది. ఈ ఆందోళనలు కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఫార్వర్డ్‌బ్లాక్ లేక వీరందరిచేత నడపబడినవని భావించబడింది. పరిస్థితి తన చేయిజారిపోతుందనే భయంతో కాంగ్రెస్ విప్లవ పరిస్థితుల్ని నిర్వీర్యపరచిందని లేక త్వరలో తమ పార్టీ పరిపాలించనున్న స్వతంత్ర భారతదేశంలో క్రమశిక్షణాయుతమైన సాయుధబలగాలు వుండడం అవసరమని తలచిందని కాంగ్రెస్‌పై ఆరోపణలు వున్నాయి. అలాగే కాంగ్రెస్ రాయబారాలు జరపడంలో, మంత్రివర్గాల నిర్మాణంలో, అధికారం కొరకు ఆరాటపడడంలో నిమగ్నమయిందని, కాంగ్రెస్ నాయకులు అధికారకాంక్షకి లొంగివుండకపోతే స్వతంత్ర సాధనకు వేరే మార్గం సాధ్యపడివుండేదని కూడా ఆరోపణలు వున్నాయి.

మా అభిప్రాయం ప్రకారం మూడు తిరుగుబాట్లు కూడా కాంగ్రెస్ అప్పటి వరకు సాగిస్తున్న జాతీయవాద కార్యకలాపాల కొనసాగింపే. కాంగ్రెస్ ఎలక్షన్ ప్రచారం ద్వారా, ఐ.యన్.ఎ.కి యిచ్చిన మద్దతు ద్వారా, 1942 ఉద్యమ సందర్భంగా ప్రభుత్వం అతిగా వ్యవహరించిన తీరుని ఎత్తిచూపడం ద్వారా పెంచి పెద్దచేసిన సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి -1945 నవంబరు 1946 ఫిబ్రవరి మధ్య చెలరేగిన మూడు తిరుగుబాట్లలో వ్యక్తమయింది. గడచిన మూడు నెలల్లో కాంగ్రెస్ నాయకుల ఉపన్యాసాలచే సృష్టించబడిన ఉద్రేకపూరితమైన వాతావరణం ఈ అలజడులకు కారణమని హోంశాఖ జరిపిన ఎంక్వయిరీ స్పష్టం చేసింది. ఆర్.ఐ.యన్. తిరుగుబాటుకి ప్రధాన కారణం గడచిన సెప్టెంబరు నుండి కాంగ్రెస్ నాయకుల ఉపన్యాసాలని కాంగ్రెస్ నిశ్చితాభిప్రాయం. కమ్యూనిస్టులు గుర్రం ముందు బండి పెడతారని వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని, కాంగ్రెస్‌ని ప్రధాన శత్రువుగా గుర్తించాలని పంజాబు సి.ఐ.డి. అధికారులు డైరెక్టర్ ఆఫ్ ఇంటెలిజెంట్ బ్యూరోని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఈ తిరుగుబాట్లకు పిలుపివ్వలేదు. కాంగ్రెసే కాదు, ఏ రాజకీయ పార్టీ పిలుపివ్వలేదు. విద్యార్థులపై, నావికా సైనికులపై సానుభూతితోను, అలాగే అణచివేతకు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేసేందుకు ప్రజలు కదిలారు. వ్యక్తులుగా కమ్యూనిస్టులు, యితరులు పాల్గొన్నట్టే వ్యక్తులుగా కాంగ్రెస్‌వారు పాల్గొన్నారు. కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డు బ్లాక్, కమ్యూనిస్టు పార్టీల సానుభూతిపరులైన విద్యార్థులు సమిష్టిగా కలకత్తాలో 1945 నవంబరు 21నాటి ప్రదర్శనకు నాయకత్వం వహించారు. కాంగ్రెస్ ప్రజల స్ఫూర్తిని అభినందించింది. ప్రభుత్వ అణచివేతను ఖండించింది. ఈ పోరాటాల ఎత్తుగడలు, చేపడుతున్న సమయం – సరియైనవికావని భావించి కాంగ్రెస్ వీటికి అధికారికంగా మద్దతు తెలపలేదు. ప్రభుత్వం దృఢంగా వుందని, అణచివేసేందుకు కృతనిశ్చయంతో వుందని కాంగ్రెస్ నాయకులకు తెలుసు. బొంబాయిలో అణచివేతకు చేస్తున్న ప్రభుత్వ సన్నాహాలను గమనించిన వల్లభాయ్ పటేల్ లొంగిపోవలసిందిగా నావికా సైనికులకు చెప్పాడు. ఆయన 1946 ఫిబ్రవరి 22న నెహ్రూకి యిలా వ్రాశాడు. “తిరుగుబాటు దారుల్ని నామరూపాలు లేకుండా చేయగలిగినంత ఎక్కువ సంఖ్యలో నావికాదళాలు, మిలిటరీ దళాలు సమీకరించబడ్డాయి.” శాంతిని నెలకొల్పాలని కోరింది కాంగ్రెస్ నాయకులు మాత్రమే కాదు. 1945 నవంబరులో 1946 ఫిబ్రవరిలో కలకత్తా ప్రజల్ని ఇళ్ళకు తిరిగివెళ్ళండని చెప్పడంతో కమ్యూనిస్టులు కూడా కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఆర్.ఐ.యన్. తిరుగుబాటు కాలంలో కమ్యూనిస్టు, కాంగ్రెస్ శాంతిరథాలు కరాచీ వీధుల్లో తిరిగాయి.

ప్రజలు అతిగా వ్యవహరించారనే భయం కాంగ్రెస్ నాయకులను చర్చలు, రాజీపంథాకి అంటిపెట్టుకొనేలా చేసిందని, అనవసరమైన మూల్యంగా విభజనకి అంగీకరించారని చేసే వాదనలో వాస్తవంలేదు. చర్చలు కాంగ్రెస్ ఎత్తుగడలో విడదీయరాని భాగం. చర్చలకు గల అవకాశాలన్నీ వినియోగించుకొన్న తరువాతనే కాంగ్రెస్ ప్రజా ఉద్యమం చేపడుతుంది. 1945 సెప్టెంబరు 22న కాంగ్రెస్ విధానంపై ఎ.ఐ.సి.సి. ఆమోదించిన తీర్మానంలో యిది పునరుద్ఘాటించబడింది. “కవ్వింపు ఎంత తీవ్రంగా వున్నప్పటికి శాంతియుత విధానం యొక్క కీలకాంశమైన ‘సంప్రదింపులు – రాజీ’ పద్ధతిని కాంగ్రెస్ ఎప్పుడూ విడనాడదు. సాధ్యమైనప్పుడు చర్చలు పరిష్కారం, అవసరమైనప్పుడు సహాయ నిరాకరణ ప్రత్యక్ష చర్య– కాంగ్రెస్‌కి మార్గదర్శకంగా, సిద్ధాంతంగా వుంటుంది.”

నెహ్రూ అంచనానిబట్టి బ్రిటిషువారు భారతదేశాన్ని రెండు నుండి ఐదుసంవత్సరాల లోపు వదలివెళ్ళవచ్చు. గనుక 1946లో ఉద్యమం చేపట్టడానికి ముందు చర్చలకుగల అవకాశాల్ని అన్వేషించడం  కీలకమైన అంశంగా పరిగణించబడింది. భారత రాజ్య కార్యదర్శి యొక్క నూతన సంవత్సర ప్రకటన, 1946 ఫిబ్రవరి 19న మంత్రివర్గ రాయబార సంఘాన్ని పంపించనున్నామని బ్రిటిషు ప్రధాని ప్రకటన - భారతదేశానికి త్వరలో స్వాతంత్ర్యం రానున్నదని చెప్పాయి. ఐనప్పటికి ఒప్పందానికి వచ్చేందుకు బ్రిటిషు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగించాలి. అందుకు ఉద్యమ సంసిద్ధతని సంస్థని పునర్నిర్మించడం ద్వారా ఎలక్షన్ ప్రచారం ద్వారా ఆర్.ఐ.యన్ ఆందోళనకి నాయకత్వం వహించడం ద్వారా నిలబెట్టాలి. సంప్రదింపుల ప్రక్రియని ప్రారంభించాలి. ప్రజా ఉద్యమాన్ని రిజర్వులో వుంచుకోవాలి. గాంధీజీ 1946 మార్చి 3న 'హరిజన'లో ప్రచురించిన మూడు ప్రకటనలలో ప్రజలు యిటీవల చేపట్టిన మార్గంలోని యిబ్బందుల్ని వివరించాడు. "నావికా సైనికులు సర్దార్ పటేల్ సలహావిని లొంగిపోవడం ఊరట కలిగించింది. కాని వారి గౌరవాన్ని పణంగా పెట్టలేదు. నేను గమనించిన మేరకు తిరుగుబాటు చేశారంటే చెడ్డ సలహాలకు లోనయ్యారు. ఇబ్బందుల నివారణ కొరకైతే వారు ఎంపిక చేసుకొన్న రాజకీయ నాయకుల మార్గదర్శకత్వం, చొరవ కొరకు నిరీక్షించి వుండవలసింది. భారతదేశ స్వాతంత్ర్యం కొరకు తిరుగుబాటు చేసివుంటే వారు రెండు విధాల తప్పులు చేసినట్లు. సంసిద్ధమైన విప్లవపార్టీ పిలుపు లేకుండా వారలా చేయకూడదు. విదేశీ ఆధిపత్యం నుండి వారి బలంతో భారతదేశాన్ని విముక్తి కలిగించగలరని నమ్మివుంటే వారు అనాలోచనాపరులు, అమాయకులు...

హోంరూలు లేక స్వరాజ్యం మన జన్మహక్కని లోకమాన్య తిలక్ మనకు బోధించాడు. అలాంటి స్వరాజ్యం ఈనాడు బొంబాయి, కలకత్తా, కరాచీలలో జరుగుతున్న వాటితో సాధ్యపడదు.

తిరుగుబాటుదారుల్ని ప్రోత్సహించినవారికి వారేంచేస్తున్నారో తెలియదు. తిరుగుబాటుదారులు అంతిమంగా లొంగిపోక తప్పదు... "హిందూ ముస్లింల్ని రాజ్యాంగ రంగంలో కంటే బారికేడ్ల వద్ద సమైక్యం చేశారు". హింస విషయానికి వచ్చినా యిది దారితప్పించే ప్రతిపాదన. బారికేడ్ల వద్ద ఐక్యత, నిజాయితీతో కూడుకొన్నదయితే ఈ రాజ్యాంగ రంగంలో కూడా ఐక్యత వుండితీరాలి. పోరాటం చేసేవారు బారికేడ్లవద్ద నివసించరు. వారు ఆత్మహత్య చేసుకొనే మూర్ఖులుకారు. బారికేడు జీవితం

రాజ్యాంగబద్ధమైన జీవితాన్ని అనుసరించి వుండాలి. ఆ రంగం ఎప్పటికీ నిషిద్ధంగాదు. జాతి అనుసరించవలసిన మార్గాన్ని గురించి గాంధీజీ యింకా యిలా చెప్పాడు. "బ్రిటిషు ప్రకటనలపై అపనమ్మకంతో పోరాటాన్ని తెచ్చుకొనడం అంటే దూరదృష్టి లోపించడమే. అధికార ప్రతినిధివర్గం ఒక గొప్ప జాతిని వంచించడానికి వస్తుందా? నిరీక్షిస్తే నష్టపోయేదేమిటి? బ్రిటిషువారి ప్రకటనలు విశ్వసనీయమైనవి కావని చివరిసారిగా అధికార ప్రతినిధివర్గం నిరూపించనీయండి. నమ్మడం ద్వారా జాతి లాభిస్తుంది. వంచనకు గురియైన వాని నుండి సరియైన స్పందన వస్తే వంచన చేసేవారు నష్టపోతారు... భారతీయుల పాలన కనుకూలంగా వదలివెళ్ళాలనే వారి ఉద్దేశాన్ని పాలకులు ప్రకటించారు...

కాని జాతి కూడా ఆట ఆడాలి. అలా ఆడటమంటే బారికేడ్లు పక్కకు నెట్టబడాలి; కనీసం తాత్కాలికంగానైనా."

* * *

# 37 స్వాతంత్ర్యం - విభజన

1947 ఆగస్టు 15, భారతదేశ స్వాతంత్ర్యం యొక్క వైరుధ్య స్వభావం ఈనాటికీ చరిత్రకారులలో ఆసక్తి రేకెత్తిస్తూ వుంది. సరిహద్దుల కిరువైపులనున్న ప్రజల్ని బాధిస్తూ వుంది. సుదీర్ఘంగా దశాబ్దాలపాటు సాగించిన ఉజ్వల పోరాటంతో స్వాతంత్ర్యం సాధించబడింది. వివాదకరమైన విభజన రూపుదిద్దుకొంటున్న జాతిని రెండు ముక్కలు చేసింది. ఈ సందర్భంగా రెండు ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. బ్రిటిష పాలకులు చివరిగా దేశాన్ని ఎందుకు వదలివెళ్ళారు? దేశ విభజనని కాంగ్రెస్ ఎందుకు ఆమోదించింది?

సామ్రాజ్యవాదుల జవాబు; స్వయం పరిపాలనలో భారతీయులకు సహాయపడేందుకు బ్రిటన్ తనంతట తానుగా చేపట్టిన కర్తవ్యాన్ని నెరవేర్చడమే స్వాతంత్ర్యం. హిందువులు, ముస్లిముల మధ్య తరతరాలుగా కొనసాగుతున్న విభేదం, అధికారం ఎవరికి ఎలా బదిలీ చేయబడాలి? - అనే అంశంపై అంగీకారానికి రావడంలో రెండు మతాల వైఫల్యం యొక్క దురదృష్టకరమైన ఫలితం విభజన. సమూలమైన మార్పులు గోరే వారి అభిప్రాయాన్ని అనుసరించి కమ్యూనిస్టులు అధికసంఖ్యలో పాల్గొని తరచుగా నాయకత్వం వహించి నడిపిన 1946-47 ఉద్యమాల ద్వారా స్వాతంత్ర్యం సాధించబడింది. కాని విప్లవాత్మకమైన తిరుగుబాటుతో భయభ్రాంతులైన కాంగ్రెస్ బూర్జువా నాయకులు సామ్రాజ్యవాదులతో ఒప్పందానికి వచ్చారు. ఒప్పందం మేరకు అధికారం వారికి బదిలీ చేయబడింది. విభజన మూల్యాన్ని జాతి చెల్లించింది.

ఈ గొప్ప నమూనా యొక్క భావనామయమైన దృశ్యాలు లేక విప్లవాత్మకమైన భావాలు మసకగా వున్న వాస్తవంపై కాంతిని ప్రసరింపజేయడంకంటే చీకటిని పులుముతాయి. స్వాతంత్ర్యం – విభజన, కాంగ్రెస్ నాయకత్వం వహించిన సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమం యొక్క విజయం – వైఫల్యాన్ని ప్రతిఫలిస్తున్నాయి. కాంగ్రెస్ ద్విముఖమైన కర్తవ్యాన్ని నిర్వహించింది. వివిధ వర్గాలు, మతాలు, గ్రూపులు, ప్రాంతాలను సమైక్యపరచి రూపుదిద్దుకొంటున్న జాతికి స్వాతంత్ర్యం సాధించింది. భారతదేశాన్ని వదలి వెళ్ళేలా బ్రిటిషువారిపై ఒత్తిడి తెచ్చేందుకు తగినంత జాతీయ చైతన్యాన్ని నిర్మించడంలో కాంగ్రెస్ జయప్రదమయింది. కాని జాతిని సమైక్యపరచే కర్తవ్యాన్ని – ప్రత్యేకించి ముస్లిముల్ని ఈ జాతిలో సమైక్యపరచే కర్తవ్యాన్ని పూర్తిచేయలేకపోయింది. ఈ వైరుధ్యం – జాతీయోద్యమం యొక్క విజయం, వైఫల్యం మరొక వైరుధ్యంగా – స్వాతంత్ర్యం, కాని విభజనలో ప్రతిఫలించింది.

* * *

యుద్ధం ముగిసేటప్పటికి జాతీయవాద శక్తులు భారతీయ సమాజంపై ఆధిపత్యం సాధించాయి. బ్రిటిషు పాలకులు హిట్లరుపై విజయం సాధించారు; కాని భారతదేశంలో పరాజితులయ్యారు. బ్రిటిషు రాజ్యం చిమ్మిన చీకటి ఆక్రమించిన స్థలంకంటే జాతీయోద్యమం విరజిమ్మిన వెలుగులు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించాయి. అప్పటివరకు రాజకీయ చైతన్యంలేని గ్రామాలు, రాజకీయాలకు దూరంగా వున్న గ్రూపులు ఐ.యన్.ఎ. విచారణ సందర్భంగా రాజకీయ ప్రధాన స్రవంతిలో కలిశాయి. వెనుకటి అధ్యాయంలో గమనించినట్లు సాయుధ దళాలలో పనిచేసేవారు, అధికారవర్గానికి చెందినవారు బాహాటంగా సభలకు హాజరయ్యారు. విరాళాలిచ్చారు. కాంగ్రెస్‌కి ఓట్లు వేశారు. అంతేగాదు. ఇవన్నీ చేస్తున్నట్లు అందరికీ తెలిసేలా చేశారు. రాజకీయ చైతన్యం కలిగించబడిన సెక్షన్ల యొక్క సమరశీలత 1942నాటి వీరోచిత కార్యక్రమాలలో వ్యక్తమయింది. పెల్లుబికిన జనసమూహాలు, ఉద్యమ విస్తృతి, జాతీయవాద భావాల తీవ్రత, ఆ భావాల పట్ల ప్రజల అత్యుత్సాహం – వీటిని గ్రాఫుపై చిత్రీకరిస్తే జాతీయవాద విజయాన్ని అద్భుతంగా చూపుతుంది.

దీనితోపాటు బ్రిటిషు అధికారుల నైతిక స్థైర్య పతనం, ప్రభుత్వ విధేయులలో వచ్చిన మార్పు, భారతీయ అధికారుల విధేయతలలో మార్పు – వీటిని గ్రాఫుపై చిత్రిస్తే కూడా జాతీయవాద విజయాన్నే మరొకరకంగా చూపుతుంది. జాతీయవాద ఉద్యమం

వలసాధిపత్యాన్ని తుడిచిపెడుతున్నట్లు వలసవాద సామ్రాజ్యపు పునాదుల్ని ఊపివేస్తున్నట్లు, కళ్ళకు కట్టినట్లు చూపటమేగాక బ్రిటిషు రాజకీయ వ్యూహం వైరుధ్యాల పుట్టగా మారినట్లు కూడా స్పష్టం చేస్తుంది.

బ్రిటిషు పాలన భారత ప్రజలలోని చాలా సెక్షన్లయొక్క అంగీకారంతోను లేక మౌన సమ్మతితోను కొనసాగింది. వలసపాలన యొక్క సామాజిక పునాదిని జమిందారులు పై వర్గాలు ఏర్పరిచాయి. వీరు బ్రిటిషు పాలకులకు విధేయులు; బ్రిటిషుపాలకుల ఆదరాభిమానాలు పొందినవారు. పాలనా యంత్రాంగానికి అవసరమైన మానవ వనరుల్ని సమకూర్చినవారు. ప్రభుత్వ విధానాల్ని బలపరచినవారు. బ్రిటిషుపాలకులు ఆలస్యంగా, అయిష్టంగా ప్రవేశపెట్టిన సంస్కరణల్ని అమలు జరిపినవారు. అంతేగాదు, వలసపాలకుల బ్రిటిషు న్యాయం, నిష్పక్షపాత వైఖరి పట్ల ప్రజలకు విశ్వాసం కలిగించి, వారి సమ్మతిని కూడా పొందినవారు. బ్రిటిషు అధికారిని వారి సంరక్షకునిగా అంగీకరింపజేశారు. బ్రిటిషు సామ్రాజ్యం నెలకొల్పిన శాంతిభద్రతల్ని ఆమోదింపజేశారు. వీటితో బ్రిటిషుపాలకులు తమ సామ్రాజ్యం యొక్క పునాదులు పటిష్టంగా వున్నాయని నిర్ణయానికి వచ్చారు. బ్రిటిషు రాజ్యం ప్రతిష్ట మీద ఆధారపడి నడిచింది. ఈ ప్రతిష్టకి మూర్తిమత్వం ఇండియన్ సివిల్ సర్వీస్‌కి చెందిన జిల్లా అధికారి. ఇండియన్ సివిల్ సర్వీస్ పైనుండి దిగవచ్చిన సర్వీసుగా, బ్రిటిషు రాజ్యానికి ఇనుప చట్రంగా గొప్పలు చెప్పుకొన్న సర్వీసు.

విధేయులు వదలివెళ్ళడం, ప్రతిష్ట ఊగిసలాటకు గురికావడం, జిల్లా అధికారి నియంత్రణా బాధ్యతల నుండి వైదొలగడంతో నౌక మునిగిపోతుందని– త్వరగా మునిగిపోతుందని స్పష్టమయింది. పాలనా వ్యవస్థలో సంవత్సరాల తరబడి రెండురకాల విధ్వంసం జరుగుతూ వచ్చింది. లోలోపల కుళ్ళిపోతుంది. బయట దెబ్బమీద దెబ్బ పడుతుంది.

ఐ.సి.యస్.కి యూరోపియన్ అభ్యర్థుల కొరత, ఐ.సి.యస్. నియామకాలలో భారతీయీకరణ (ప్రజల డిమాండుకు స్పందనగా పాక్షికంగా ఆమోదింపబడింది)– కారణంగా మొదటి ప్రపంచయుద్ధం నాటికే ఇండియన్ సివిల్ సర్వీసులో బ్రిటిషు ఆధిక్యత అంతమయింది. సమతుల్యతని కాపాడేందుకు మొదట నియామకాలలో కోత విధింపబడింది. ఆ తరువాత 1943లో నియామకాలు ఆపివేయబడ్డాయి. 1940–46ల మధ్య ఐ.సి.యస్. అధికారుల సంఖ్య 1201 నుండి 931కి పడిపోయింది. బ్రిటిషు ఐ.సి.యస్. అధికారుల సంఖ్య 587 నుండి 429కి, ఇండియన్ అధికారుల సంఖ్య 614 నుండి 510కి పడిపోయింది. 1946నాటికి బెంగాల్‌లోని 65 ఐ.సి.యస్. పోస్టులకు

కేవలం 19మంది యూరోపియన్ అధికారులు లభ్యమయ్యారు. అంతేగాక ఉద్యోగాలకు వచ్చినవారు కూడా కులీన కుటుంబాల నుండి వచ్చిన ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి పట్టభద్రులు కారు. వారి తండ్రులు, మామలు 'ఇండియా ఛైల్డ్ పీపుల్'ని పరిపాలించడం బ్రిటిషుజాతి లక్ష్యమని విశ్వసించిన 'ఓల్డు ఇండియా హేండ్స్' కారు. వారు గ్రామరు స్కూల్సు, పాలిటెక్నిక్ స్కూల్సు నుండి వచ్చినవారు. వారికి ఉద్యోగం కర్తవ్యంకాదు; జీవనోపాధి మాత్రమే. యుద్ధం సమస్యని పరిష్కరించింది. 1945నాటికి యుద్ధం కలిగించిన అలసట తీవ్రమయింది. కుటుంబాలకు దూరంగా చాలాకాలం వుండడం వారి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసింది. ద్రవ్యోల్బణం కారణంగా ఆర్థిక సమస్యలు పెరిగాయి. చాలామంది రిటైరు కానున్నారు. ఇతరులు పదవీకాలానికి ముందుగా పదవీ విరమణ కోరనున్నారని అంచనా వేయబడింది. యుద్ధం కలిగించిన అలసటతోను, 1942 ఉద్యమంతో దెబ్బమీద దెబ్బ తిన్న ఉద్యోగవర్గం మిగిలివుంది.

మానవ వనరుల కొరతతోపాటు, ఐ.సి.యస్.ని బ్రిటిషురాజ్యాన్ని దుర్బలపరచిన జాతీయవాదాన్ని ఎదుర్కొంటున్న బ్రిటిషు ఎత్తుగడలలోని వైరుధ్యాలు ముందుకు వచ్చాయి. పెరుగుతున్న జాతీయ ఉద్యమాన్ని యిముడ్చుకొనేందుకు బ్రిటిషు పాలకులు చాలా సంవత్సరాల నుండి 'సమాధానపరచడం – అణచివేత' విధానాన్ని అనుసరిస్తూ వచ్చారు. కాని 1942నాటి క్రిప్సు రాయబారం తరువాత 'సంపూర్ణ స్వాతంత్ర్యం, అధికారమార్పిడి' తప్ప యివ్వదగిన రాయితీలు ఏమీ మిగలలేదు. కాని జాతీయవాద ఉద్యమం ఎత్తుగడ – రాజ్యాంగ సంస్కరణలతో కలగలిపిన అహింసాయుత ప్రజా ఉద్యమం బ్రిటిషు పాలకుల ఎత్తుగడకి మించినదని నిరూపితమయింది. అహింసాయుత ఉద్యమాలపై అణచివేత చేపట్టినప్పుడు ప్రభుత్వం వెనుకనున్న బలం నగ్నంగా ప్రదర్శించబడింది. ప్రభుత్వం 'రాజద్రోహ నేరం' అస్త్రాన్ని ప్రయోగించకపోతే లేక సంధి ఒప్పందాన్ని (1931లో గాంధీ–ఇర్విన్ ఒప్పందం) అమలు జరపకపోతే లేక భారత ప్రభుత్వ చట్టం 1935 క్రింద రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి అంగీకరించకపోతే ప్రభుత్వం పాలనా వ్యవహారాల్ని నిర్వహించలేనంతగా బలహీనపడిపోయి వుండేదని గమనించవచ్చు. మరొకవైపు 1942 ఉద్యమాన్ని పాశవికంగా అణచివేయడం ఉదారవాదుల్ని విధేయుల్ని కలతపరచింది. అలాగే 1943 ఫిబ్రవరి– మార్చిలో గాంధీజీ 21 రోజులు నిరాహారదీక్షబూని ఆయన పరిస్థితి ఆందోళనకరంగా వున్నప్పుడు కూడా గాంధీజీ విడుదలకు ప్రభుత్వం తిరస్కరించడం, ఉదారవాదులు, విధేయులు విజ్ఞప్తులు చేసుకొన్నప్పటికి ఐ.యన్.ఎ. విచారణలు కొనసాగించాలని నిర్ణయించడం కూడా ప్రభుత్వానికి సన్నిహితంగా

వుండేవారిని గాయపరిచాయి. ఇక ప్రభుత్వం శత్రువుల్ని ప్రసన్నం చేసుకొంటున్నట్లు కన్పించినప్పుడు – 1945–46లో లాగా ప్రభుత్వంలో చేరమని కాంగ్రెస్‌ని లాలించినప్పుడు కూడా పాలకులకు మిత్రులుగా వున్నవారు చాలా కలతచెందారు. ప్రభుత్వ అశక్తత విధేయుల్ని వ్యాకులపరచింది. కాంగ్రెస్ హింసాయుత ఉపన్యాసాలు దిక్కుల్ని పిక్కటిల్లజేస్తున్నప్పుడు అధికారులు సహకరించారు. దీనితో బ్రిటిషు రాజ్యం యొక్క సత్తాపై విధేయులకు గల నమ్మకం సడలిపోయింది.

విధేయుల సంక్షోభం విశ్వాసానికి సంబంధించింది. ఉద్యోగుల సందిగ్ధం ఆచరణకి సంబంధించినది. విధానం– అణచివేతగాని, రాజీగాని– రెండూ గాక ఏదోఒకటి స్పష్టంగా వున్నప్పుడు మాత్రమే ఆచరణ నిర్ణయాత్మకంగా వుంటుంది. ఒకే అధికారులు విధానంలోని పరస్పర విరుద్ధమైన అంశాలను అమలు జరిపేటప్పుడు రెంటినీ కలగలిపిన విధానం సమస్యల్ని సృష్టిస్తుంది. ఈ సందిగ్ధపరిస్థితి మొదట 1930లో ఉత్పన్నమయింది. అధికారులు, ప్రజా మంత్రివర్గాల ఏర్పాటు అవకాశం పట్ల ఆందోళనజెందారు. సహాయ నిరాకరణోద్యమ కాలంలో తమచే అణచివేయబడిన కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర మంత్రివర్గాలలో తమ రాజకీయ యజమానులు అయ్యే అవకాశముండడంపట్ల కలత చెందారు. ఈ అవకాశం 8 రాష్ట్రాలలో వాస్తవరూపం దాల్చింది.

గతంలో ప్రజా ఉద్యమాలలాగానే యిప్పుడు రాజ్యాంగబద్ధత అధికారుల స్థైర్యాన్ని దెబ్బతీసింది. ప్రజలకు ప్రభుత్వం పట్ల గల భయాన్ని అహింసాయుత ప్రజా ఉద్యమం పారద్రోలింది. కాంగ్రెస్ రాజ్యం వారిలో విశ్వాసాన్ని పెంచింది. మద్రాసులోని బ్రిటిషు ముఖ్య కార్యదర్శి ఖద్దరు వస్త్రధారణ చేపట్టడం, అలాగే అప్పటి రెవెన్యూమంత్రియైన మొరార్జీ దేశాయ్‌తోపాటు టూర్‌లో వున్న బొంబాయి రెవెన్యూ కార్యదర్శి, మంత్రి తన కొరకు ఎదురు చూడడాన్ని నివారించేందుకు మొదటి తరగతి కంపార్టుమెంటు నుండి మూడవ తరగతి కంపార్టుమెంటు వరకు ప్లాటుఫారంపై పరుగులు తీయడం ప్రజలు గమనించకపోలేదు.

చాలా ముఖ్యంగా తరువాత కాంగ్రెస్ ఆందోళనలతో వ్యవహరించవలసి వచ్చేటప్పుడు అధికారులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశాల్ని పరిగణనలోకి తీసుకోవలసి వచ్చింది. ఈ పరిగణన– యు.పి.లోని వ్యక్తిగత సహాయ నిరాకరణ ఉద్యమానికి వ్యతిరేకంగాను, తూర్పు యు.పి., బీహారులలో 1942 తిరుగుబాట్లకు వ్యతిరేకంగాను అర్ధమనస్కంగా చర్యలు చేపట్టేలా చేసింది. ఉద్యమాన్ని అణచివేయడంలో కఠినంగా వ్యవహరించిన అధికారులపై ఎంక్వయిరీలు జరిపిస్తామని, పగదీర్చుకొంటామని

కాంగ్రెస్ నాయకులు బాహాటంగా ప్రకటనలు చేసినప్పుడు, ప్రభుత్వం ఎన్నికల సమయంలో కొంత ఉదారంగా వుండాలనే కారణం చూపుతూ వారిపై ఎలాంటి చర్యలు తీసుకొనకపోవడంతో అధికారుల్లో నైతిక స్థైర్యం పూర్తిగా సడలిపోయింది. గతంలో వున్న వైస్రాయి లిన్‌లిత్‌గౌ ఎంక్వయిరీలు వుండబోవని వాగ్దానం చేశాడు. కాని కాంగ్రెస్ ఒత్తిడికి తట్టుకొని ప్రభుత్వం ఎంక్వయిరీలు జరపకుండా వుండగలదనే నమ్మకం అధికారులకు లేదు. రాష్ట్రమంత్రి వర్గాల ఏర్పాటుతో ఎంక్వయిరీలు చాలా క్లిష్టమైన సమస్య అవుతుందని, ఆ తరువాత వచ్చిన వేవెల్ అంగీకరించాడు.

యుద్ధం ముగిసేటప్పటికి రాజ్యాధికారాన్ని ప్రభుత్వం యొక్క కదలికల్ని అర్థంచేసుకొన్న అధికారులకు, విధాన రూపకర్తలకు స్పష్టమైన సూచనలు అందాయి. ఐ.యన్.ఎ. పట్ల ఉదారంగా వ్యవహరించాలని సైన్యంలోపల నుండి వచ్చిన డిమాండు, ఆర్.ఐ.యన్.లోని ఒక సెక్షన్ తిరుగుబాటు – పూర్తిస్థాయి తిరుగుబాటుకి సంకేతాలని, ఈసారి రగులుతున్న అగ్నిపర్వతాన్ని ఆర్పివేయడం సాధ్యపడకపోవచ్చునని దూరదృష్టిగల అధికారులు ఆందోళన చెందారు. కాంగ్రెస్ మంత్రివర్గాలు సహకరించి అదుపుచేసే ఎన్నికల తరువాత కాంగ్రెస్ 1942 తరహా ఉద్యమం చేపడితే ఉన్నతాధికారులు, సాయుధ దళాలు విశ్వసనీయంగా వుండవనే భయం ప్రభుత్వానికీ వుంది. వైస్రాయి ఈ విషయాన్నే యిలా సంక్షిప్తీకరించాడు. "అలాంటి తిరుగుబాటుని మనం అణచగలం. కాని దాని స్థానంలో పెట్టగలిగిందేమీ లేదు; కేవలం అధికారికంగా పాలన సాగిస్తాం. కాని అందుకవసరమైనంత మంది అధికారులు మిగలరు."

బ్రిటిషుపాలన పాతతరహాలో ఎక్కువకాలం కొనసాగదని గుర్తించిన మీదట, అధికార మార్పిడి, అలాగే బ్రిటన్, భారతదేశాల మధ్య సామ్రాజ్యవాదానంతర స్వభావంపై అనుసరించవలసిన పద్ధతులపై ఒక అంగీకారానికి వచ్చిన తరువాత భారతదేశం నుండి గౌరవప్రదమైన విరమణ అమలుజరపడం బ్రిటిషు విధానాల రూపకర్తల లక్ష్యం అయింది. బ్రిటన్, భారతదేశాల మధ్య మంచి భవిష్యత్ సంబంధాల కొరకు, ప్రజా ఉద్యమాన్ని పూడ్చిపెట్టడానికి పరిష్కారం తప్పనిసరియని బ్రిటిషు ప్రభుత్వం స్పష్టమైన అభిప్రాయానికి వచ్చింది. బ్రిటిషువారు భారతదేశాన్ని విడిచివెళ్ళాలన్న కాంగ్రెస్ డిమాండుపై జాతీయ ప్రభుత్వం ఏర్పాటును గురించి చర్చించేందుకు, అధికార మార్పిడికి యంత్రాంగం పని ప్రారంభించేందుకు 1946 మార్చిలో మంత్రివర్గ రాయబారం కమిటీ భారతదేశానికి వచ్చింది. ఇది 1942నాటి క్రిప్సు రాయబారం లాంటిది కాదు. మంత్రివర్గ రాయబార కమిటీ ఎక్కువకాలం వుండేందుకు సిద్ధపడి వచ్చింది.

* * *

అటు సామ్రాజ్యవాదులు పరిష్కారానికి రావలసిన అవసరాన్ని గుర్తించడం, యిటు జాతీయవాద నాయకులు చర్చలు జరపడానికి సిద్ధపడడంతో పరిష్కారానికి పరిస్థితులు పరిపక్వమయ్యాయి. కాని భారతదేశ సాతంత్ర్యానికి ముందు రక్తపుటేరులు ప్రవహిస్తాయని 1946 ప్రారంభంలో చేయబడిన సూచన 1947 మధ్యలో వాస్తవ రూపం దాల్చింది. 1946 ప్రారంభానికి సామ్రాజ్యవాద - జాతీయవాద ఘర్షణ సూత్రప్రాయంగా పరిష్కరింపబడింది. సామ్రాజ్యవాదానంతర వ్యవస్థపై బ్రిటిషు కాంగ్రెస్ ముస్లింలీగుల ఘర్షణాత్మక వైఖరులు రంగంపైకి వచ్చాయి.

స్వయంపాలన నుండి, ఇండియన్ యూనియన్ నుండి విడిపోయేవరకు స్వయం నిర్ణయాధికారం గల ముస్లిం రాష్ట్రాల వరకు గల మైనారిటీల డిమాండ్లను పరిష్కరించే చట్రంతో పాటు అధికారాన్ని ఒకే కేంద్రానికి బదిలీ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. బ్రిటన్‌తో స్నేహపూర్వకంగా వుంటూ, కామన్‌వెల్తు రక్షణలో చురుకైన భాగస్వామిగా వుండే సమైక్య భారతదేశాన్ని బ్రిటిషుపాలకులు ప్రతిపాదించారు. విభజింపబడిన భారతదేశం యొక్క రక్షణపాటవం తగ్గిపోతుందని ఉమ్మడి రక్షణ పథకాలను నిర్వీర్యం చేస్తుందని, బ్రిటన్ రాజనీతిజ్ఞతపై మచ్చగా మిగులుతుందని భావించబడింది. 1906లో ముస్లింలీగు ఏర్పడినప్పటినుండి ప్రభుత్వం దానిని పెంచిపోషించే విధానాన్ని అవలంబించినప్పటికి పాకిస్తాన్‌కి పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలకు ఈనాటి సంబంధాలు సూచిస్తున్న విధంగా బ్రిటన్ పాకిస్తాన్‌ని భవిష్యత్‌లో తన సహజమైన మిత్రదేశంగా పరిగణించలేదు.

1946లో బ్రిటిషు విధానం అంతకుముందు చేసిన ప్రకటనలకు పూర్తి విరుద్ధంగా, సమైక్య భారతదేశానికి ప్రాధాన్యత యిచ్చింది. పాకిస్తాన్ ఆచరణీయం కాదని, సమైక్య భారతదేశం చట్రంలోనే మైనారిటీల స్వయంప్రతిపత్తికి రక్షణ కల్పించబడాలని బ్రిటిషు మంత్రివర్గ రాయబార సంఘం (Cabinet Mission) అభిప్రాయపడింది. మంత్రివర్గ రాయబార సంఘం మూడు సెక్షన్లను సూచించింది. ఎ– మద్రాసు, బొంబాయి, ఉత్తరప్రదేశ్, బీహార్, సెంట్రల్ ప్రావిన్స్, ఒరిస్సా; బి– పంజాబ్, వాయవ్య సరిహద్దు రాష్ట్రం, సింధు; సి– బెంగాల్, అస్సాం. రక్షణ విదేశీ వ్యవహారాలు, రవాణా సౌకర్యాల అదుపుచేసేందుకు ఉమ్మడి కేంద్రం వుండాలి. మొదటి సాధారణ ఎన్నికల తరువాత రాష్ట్రం ఆ గ్రూపు నుండి బయటకు రాగలుగుతుంది. 10 సం॥ల తరువాత రాష్ట్రం గ్రూపు లేక యూనియన్ రాజ్యాంగం యొక్క పునఃపరిశీలనని కోరగలుగుతుంది. ఒక రాష్ట్రం గ్రూపుని వదిలేందుకు ఎన్నికల వరకు నిరీక్షించనవసరం వుండకూడదని కాంగ్రెస్

కోరింది. రాష్ట్రానికి ఏ గ్రూపులో చేరకుండా వుండే స్వేచ్ఛ కూడా వుండాలన్నది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన అస్సాం, వాయవ్య సరిహద్దు రాష్ట్రం (అవి సెక్షన్ సి, బిలలో వున్నాయి) గమనంలో పెట్టుకొని ఈ సమస్యని ప్రస్తావించింది. ఇక లీగు యూనియన్ రాజ్యాంగాన్ని ప్రశ్నించే హక్కు రాష్ట్రాలకు యిప్పుడే వుండాలని, 10 సం॥ల వరకు నిరీక్షించవలసిన అవసరం వుండకూడదని కోరింది. గ్రూపులు నిర్బంధమా, ఐచ్ఛికమా అనే విషయంపై మంత్రివర్గ రాయబార సంఘం పథకంలో స్పష్టతలేదు. గ్రూపులలో చేరడం ఐచ్ఛికమేగాని సెక్షన్లు మాత్రం నిర్బంధమని రాయబార సంఘం ప్రకటించింది. ఇదొక వైరుధ్యం. దీనిని తొలగించడానికి మారుగా రాయబార సంఘం రాజీపడడానికి వీలుపడని దానిని ఏదోరకంగా రాజీపరచే ఆశతో దాటవేసింది.

కాంగ్రెస్, లీగు – రెండూ కూడా కేబినెట్ మిషన్ పథకాన్ని వారివారి పద్ధతులలో వ్యాఖ్యానించాయి. రెండు కూడా వారివారి వైఖరుల్ని అది ధృవీకరిస్తుందన్నారు. కేబినెట్ మిషన్ ప్లాను పాకిస్తాన్‌కి వ్యతిరేకంగా వుందని, పాకిస్తాన్ వీటో రద్దయిందని, ఒకే రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పడుతుందని పటేల్ చెప్పాడు. గ్రూపులుగా విడగొట్టడాన్ని నిర్బంధం చేయడం ద్వారా పాకిస్తాన్ ఏర్పాటు ప్లానులో యిమిడివుందని భావించి లీగు కేబినెట్ ప్లానుకి తన ఆమోదాన్ని జూన్ 6న ప్రకటించింది. కేబినెట్ ప్లానుపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వ్యాఖ్యని 1946 జులై 7న నెహ్రూ ఎ.ఐ.సి.సి.కి యిలా చెప్పాడు. “మనం రాజ్యాంగ అసెంబ్లీకి వెళ్ళాలని నిర్ణయించడం తప్ప ఏ ఒక్క అంశానికి కట్టుబడిలేము.” దీనిలో యిమిడివున్న అంశం: “అసెంబ్లీ సర్వసత్తాకమైనది. పాటించవలసిన నియమాలను అది నిర్ణయిస్తుంది” అని. నెహ్రూ ఉపన్యాసం యిచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని జిన్నా కేబినెట్ ప్లానుకి లీగు యిచ్చిన అంగీకారాన్ని 1946 జూలై29న వెనక్కి తీసుకొన్నాడు.

కాంగ్రెస్‌తో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయించడమా? లేక ప్లానుకి ముస్లింలీగు అంగీకారం కోసం ఎదురు చూడడమా? – అనేది ప్రభుత్వం ముందున్న సందిగ్ధం. సంవత్సరం క్రితం సిమ్లాలో లీగు అంగీకారం పొందాలన్న వేవెల్ మరలా అదే చెప్పాడు. కాని బ్రిటిషు ప్రభుత్వం ప్రత్యేకించి స్టేట్ సెక్రటరీ కాంగ్రెస్ సహకారం పొందడం చాలా అవసరమని వాదించాడు. 1946 సెప్టెంబరు 2న నెహ్రూ నాయకత్వాన కాంగ్రెస్ సభ్యులతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుచేయబడింది. అన్ని పరిష్కారాలు తనకు అంగీకారయోగ్యంగా వుండాలని లీగు పట్టుపట్టడానికి వ్యతిరేకంగా ఈ నిర్ణయం చేయబడింది. బ్రిటిషువారు స్వాతంత్ర్యానంతరం భారత ఉపఖండంలో తమ ప్రయోజనాల్ని

సంరక్షించుకొనేందుకు గతంలో మతతత్వశక్తుల్ని ప్రోత్సహిస్తూ జాతీయవాద న్యాయబద్ధతని కాంగ్రెస్ యొక్క ప్రాతినిధ్య స్వభావాన్ని తిరస్కరిస్తూ వచ్చిన విధానానికి పూర్తిగా భిన్నమైన వైఖరిని చేపట్టారు. పరిపాలన కొనసాగింపు ఒక వైఖరిని డిమాండు చేసింది. కాని వైదొలగడం, సామ్రాజ్యవాదానంతర సంబంధాలు అందుకు భిన్నమైన వైఖరిని ఆదేశించాయి.

బ్రిటిషు పాలకులు తమ వైఖరి మార్చుకొనడం జిన్నాకి యిష్టంలేదు. ముస్లింలు రక్తం చిందించడాన్ని అనివార్యం చేసే విధంగా బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెస్‌కి లొంగిపోయింది అన్నాడు జిన్నా. ప్రత్యక్ష చర్య ఆయుధం సిద్ధం చేయబడింది. ఓట్లు వేసే బజారు మనుషులకు జవాబుదారీగా వుంటానన్నాడు జిన్నా. 'లేకర్ రహేంగే పాకిస్తాన్', 'లడ్‌కే లేంగే పాకిస్తాన్' నినాదాలతో ముస్లిం మతతత్వ గ్రూపులు కలకత్తాలో 1946 ఆగస్టు 15న మత ఉద్రిక్తత రెచ్చగొట్టాయి. అంతే తీవ్రతతో హిందూ మతతత్వ గ్రూపులు త్రిప్పికొట్టాయి. అందుకు చెల్లించబడిన మూల్యం 5000మంది ప్రాణాలు. తమ తోడ్పాటుతో సృష్టించబడిన మతతత్వ భూతం తమ అదుపు తప్పడం పట్ల బ్రిటిషుపాలకులు ఆందోళన చెందారు. దానిని మచ్చిక చేసుకొనగల సమయం మించిపోయిందని గ్రహించారు. జిన్నా అంతర్యుద్ధం తీసుకొని రాగలడని భయపడి బుజ్జగించారు. లీగు కేబినెట్ మిషను ప్లానులోని స్వల్పకాలిక లేక దీర్ఘకాలిక అంశాలలో దేనినీ అంగీకరించకపోయినప్పటికీ, ప్రత్యక్ష చర్య చేపట్టే విధానాన్ని విడనాడనప్పటికీ 1946 అక్టోబర్ 26న వేవెల్ నెమ్మదిగా లీగుని తాత్కాలిక ప్రభుత్వంలోకి తీసుకొనివచ్చాడు. ప్రభుత్వంలో లీగు చేరకపోతే అంతర్యుద్ధం అనివార్యమై వుండేదని భారత రాజ్య కార్యదర్శి వాదించాడు. బ్రిటిషుపాలకుల్ని తన గుప్పెట్లో పెట్టుకొనడంలో జిన్నా విజయం సాధించాడు.

తాత్కాలిక ప్రభుత్వంపై లీగువైఖరి మార్చుకొనేలా చేయాలి లేదా లీగు వైదొలగేలా చూడాలని కాంగ్రెస్ బ్రిటిషు పాలకుల్ని డిమాండు చేసింది. దాదాపు అదే సమయంలో లీగు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. లియాకత్ ఆలీఖాన్ తప్ప తక్కిన వారంతా ద్వితీయ శ్రేణికి చెందినవారు. వివాదంలో వున్న అంశం రాజ్యాధికారంగాని ప్రభుత్వాన్ని నిర్వహించే బాధ్యతకాదు. పాలనావ్యవహారాలు కాంగ్రెస్‌కి వదిలివేయడం ప్రాణాంతకమని జిన్నా గ్రహించాడు. పాకిస్తాన్ కొరకు పోరాడేందుకు తమకు ప్రభుత్వంలో ఆధారం వుండాలని కోరుకున్నాడు. జిన్నా దృష్టిలో తాత్కాలిక ప్రభుత్వం అంటే యితర పద్ధతుల ద్వారా అంతర్యుద్ధం కొనసాగింపే. ఉద్యోగాలు యివ్వడంతో సహా కాంగ్రెస్ చేపట్టే

చర్యలన్నింటినీ లీగు మంత్రులు అడ్డుకొన్నారు. వేవల్‌తో సంబంధంలేకుండా నిర్ణయాలు తీసుకొనేందుకు నెహ్రూ ఏర్పాటుచేసిన మీటింగులకు హాజరయ్యేందుకు నిరాకరించారు. తాత్కాలిక ప్రభుత్వం కాంగ్రెస్, లీగుల మధ్య సహకారం పెంపొందిస్తుందని కాంగ్రెస్ మంత్రులు ఆశించారు. కాని లీగు మంత్రుల విచ్ఛిన్నకరమైన ఎత్తుగడలు ఆ ఆశలపై నీళ్ళుచల్లాయి. 1947ఫిబ్రవరి 5న లీగు మంత్రులు రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ తాత్కాలిక ప్రభుత్వంలోని 9మంది మంత్రులు వైస్రాయికి లేఖ వ్రాశారు. 1946 డిసెంబరు 9న మొదటిసారిగా సమావేశమైన రాజ్యాంగ అసెంబ్లీని రద్దు చేయాలని చేసిన లీగు డిమాండు దానికి చివరి సమిధగా పనిచేసింది. గ్రూపుల విభజనపై లీగు వ్యాఖ్యానాలు సరియైనవని ఒప్పుకొంటూ బ్రిటిషు ప్రభుత్వం 1946 డిసెంబరు 6న ప్రకటన చేసినప్పటికీ లీగు రాజ్యాంగ అసెంబ్లీలో చేరేందుకు నిరాకరించింది. మిషన్‌ప్లాను ద్వారా గాక తన డిమాండు ద్వారా పాకిస్తాన్ ఏర్పడాలనేది జిన్నా డిమాండు.

అట్లీ 1947 ఫిబ్రవరి 20న పార్లమెంటులో చేసిన ప్రకటన పెరుగుతున్న ఈ సంక్షోభాన్ని తాత్కాలికంగా నివారించింది. బ్రిటిషువారు భారతదేశాన్ని వదిలివెళ్ళే తేదీ 1948 జూన్ 20వ తేదీగా ప్రకటించబడింది. కొత్త వైస్రాయిగా లార్డ్ మౌంట్‌బాటెన్ నియామకం కూడా ప్రకటించబడింది. విరమణ తేదీ ఇరుపక్షాల్ని ప్రధాన సమస్యపై ఒప్పందానికి అంగీకరింపజేస్తుందని, రాజ్యాంగ సంక్షోభం నివారింపబడుతుందని ఆశ. తుది గడువు యొక్క తేదీ అవసరాన్ని అట్లీ ప్రభుత్వం గుర్తించడానికి కారణం; ప్రభుత్వ అధికారం యొక్క పతనం అనివార్యమన్న వేవల్ అంచనాలోని వాస్తవాన్ని విస్మరించలేకపోవడమే. వేవల్ నిరాశావాదంలో కూరుకుపోయాడన్న నెపంతో వైస్రాయిని బ్రిటిషు ప్రభుత్వం తొలగించగలదు. చాలా అమర్యాదకరంగా తొలగించింది. వేవల్‌కి వర్తమానం అందకముందే ఆయన బర్తరఫ్ ఢిల్లీలో ఉబుసుపోక కబురయింది. కాని అతడు చెప్పిన వాస్తవాన్ని రద్దు చేయలేకపోయింది. కాబట్టి ఫిబ్రవరి 20 ప్రకటన భారతదేశ పరిస్థితిపై తొలగించబడిన వైస్రాయి యొక్క గమనికకు అంగీకారం తప్ప మరొకటికాదు.

నిరంతరం అంతఃకలహాలతో ఆవరించిన చీకటిని స్వాతంత్ర్యం కొరకు ఎదురుచూసే చూపులు తొలగించాయి. ప్రకటనని కాంగ్రెస్ స్వాగతించింది. భారతదేశం వదలివెళ్ళడం పట్ల గల బ్రిటిషు చిత్తశుద్ధికి ఈ ప్రకటన నిదర్శనం అన్నది. రాజ్యాంగ అసెంబ్లీ పూర్తిగా ప్రాతినిధ్యం వహించకపోతే (ముస్లిం మెజారిటీ రాష్ట్రాలు చేరకపోతే) ఒకటికంటే ఎక్కువ కేంద్ర ప్రభుత్వాలకు అధికారం బదిలీ చేయబడుతుంది– అనే షరతుతో

దేశ విభజన యిమిడివున్నది. ప్రస్తుతం అమలులో వున్న అసెంబ్లీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలకు  రాజ్యాంగాన్ని తయారుచేసే పనితో ముందుకు సాగవచ్చు గనుక కాంగ్రెస్‌కి యిదికూడా ఆమోదయోగ్యమే. అది ప్రస్తుత ప్రతిష్టంభనకి ఒక మార్గాంతరాన్ని చూపింది. ఇక లీగు రాజ్యాంగ అసెంబ్లీలో చేరేందుకు నిరాకరించడమేగాక దానిని రద్దుచేయాలని డిమాండు చేసింది. నెహ్రూ లియాకత్ అలీఖాన్‌కి యిలా విజ్ఞప్తి చేశాడు. "బ్రిటిషువారు రంగం మీద నుండి నిష్క్రమిస్తున్నారు. ఈ నిర్ణయం యొక్క భారం మనందరిపైనా వుంది. దూరదూరంగా వుండి మాట్లాడడం కంటే ఈ సమస్యని నిజాయితీగా ఎదుర్కొనడం వాంఛనీయం." నిర్దిష్టమైన గడువు భారతదేశంలోని రెండు రాజకీయ పార్టీలు దగ్గరయ్యేలా ఒత్తిడి చేస్తుందన్న అట్లీ ఆశలు నెరవేరేందుకు కొంత అవకాశం వున్నట్లనిపించింది.

ఈ పరిస్థితులలో మౌంట్‌బాటెన్ భారతదేశానికి వైస్రాయిగా వచ్చారు. అతడు చివరి వైస్రాయి.  1948 జూన్ 30నాటికి రాజ్య బాధ్యతలు అప్పజెప్పే కర్తవ్యం నెరవేర్చవలసివుంది. ఫిబ్రవరి 20 ప్రకటనలో కాలవ్యవధిని తానే జొప్పించానని మౌంట్‌బాటెన్ చెప్పుకొన్నాడు. "కాలవ్యవధిని గురించి ఆలోచించాను. అట్లీని ఒప్పించటానికి చాలా శ్రమపడవలసి వచ్చింది.  కాలవ్యవధి చాలా ప్రధానమైనది. నిర్దిష్ట కాలవ్యవధిని నిర్ణయించుకోకుండా పని ప్రారంభించివుంటే నేను యింకా అక్కడే వుండిపోయేవాణ్ణి." ఇది పూర్తిగా అవాస్తవం. ఖండన కూడా అవసరంలేనంత అవాస్తవం. చరిత్ర గతిని ఒంటిచేతిమీదుగా నిర్ధారించినట్లు మౌంట్‌బాటెన్ చేసిన ప్రకటనలను 'అర్ధరాత్రి స్వాతంత్ర్యం' అనే గ్రంథంలో లెపియరే, కొల్లిన్స్‌లు యింకా యితరులు కూడా గతించిన చరిత్రగా పేర్కొన్నారు. నిశ్చితమైన తేదీ అనే ఆలోచన వేవల్‌ది. 1948 మార్చి 31నాటికి అధికారం ప్రసక్తిలేని బాధ్యతాయుతమైన దశ వస్తుందని అంచనా వేశాడు. అట్లీ 1948 సంవత్సరం మధ్యలో ఒక తేదీని గమనంలో పెట్టుకొన్నాడు. మౌంట్‌బాటెన్ ఒత్తిడితో 1948 జూన్ 30గా నిర్ధారించబడింది.

మౌంట్‌బాటెన్ తనకు సర్వాధికారాలున్నాయని, తనకు లండన్‌తో సంప్రదించవలసిన పనిలేదని చెప్పుకొనడం కూడా దారి తప్పించేదిగా వుంది. అంతకు ముందు వైస్రాయిలకంటే మౌంటబాటెన్‌కి ఎక్కువ స్వేచ్ఛ వుండటం వాస్తవమే. ఆయన అభిప్రాయాల్ని లేబర్ గవర్నమెంట్ పరిగణనలోకి తీసుకొనడం వాస్తవమే. అయినప్పటికీ తన పథకాన్ని అమలుజరిపే ప్రతి దశలోనూ లండన్‌తో సంప్రదించాడు; తన సహాయకుడైన ఇస్మేని లండన్ పంపించాడు. జూన్ 3 పథకానికి అట్లీ, ఆయన మంత్రివర్గ సహచరుల ఆమోదముద్ర పొందేందుకు అతడు స్వయంగా లండన్ వెళ్ళాడు.

మౌంట్‌బాటెన్‌కి బ్రిటన్ ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలు వున్నాయి. ఆయన చెప్పుకొన్నట్లు వ్యవహారాలన్నీ తన యిష్టానుసారం చేయగలిగిన స్థితిలోలేదు. 1947 అక్టోబర్ చివరివరకు ఐక్యత విభజనకు గల అవకాశాల్ని అన్వేషించవలసిందిగా అతడికి ఆదేశాలు వున్నాయి. ఆ తరువాత బ్రిటన్ ప్రభుత్వానికి అధికారం బదిలీ చేయవలసిన విధానాన్ని గురించి సలహా యివ్వాలి. ఇక్కడ కూడా అతడి ఎంపిక నామమాత్రమే. అందుకు విస్తృతమైన రూపురేఖలు అతడు రాకముందే నిర్ణయించబడ్డాయి. అతడు వచ్చిన రెండు నెలలలోపే కేబినెట్ మిషన్ ప్లానుపై ఒత్తిడి తెచ్చినా ఎలాంటి ప్రయోజనం వుండబోదని గ్రహించాడు. అది అప్పటికే చచ్చిన గుర్రం. ముస్లింలు స్వతంత్ర రాజ్యంకంటే తక్కువైన దానినేమీ అంగీకరించరని జిన్నా పట్టుదలతో వున్నాడు. మౌంట్‌బాటెన్ జిన్నా వైఖరిని ఏమాత్రం మార్చలేకపోయాడు. అతడు ఏం చెప్పినా వినిపించుకోడు. అతడితో వాదించడం అసాధ్యమయింది. ఏం చెప్పినా, ఎలా చెప్పినా పాకిస్తాన్ మీద పట్టు సడలించేలా లేదు.

బ్రిటిషుపాలకులు మధ్యవర్తులుగా వారి పాత్రని వదులుకొని భారతీయులు ఒప్పుకొన్న పరిష్కారాన్ని అమలుచేయడానికి ప్రయత్నించి వుంటే భారతదేశాన్ని సమైక్యంగా వుంచగలిగేవారు. ఐక్యత – మతతత్వశక్తుల్ని కఠినంగా అణచివేయడంతో సహా సానుకూలమైన జోక్యాన్ని కోరింది. ఈ పని బ్రిటిషుపాలకులు చేయదలచుకోలేదు. అట్లీ ఆ తరువాత వ్రాశాడు "మనం సమైక్య భారతదేశానికి ప్రాధాన్యత యిచ్చి వుండవలసింది. మనం చాలా ప్రయత్నించినప్పటికి సాధించలేకపోయాం". వాస్తవంగా వారు సులభమైన మార్గాంతరాన్ని చేపట్టారు. ఐక్యతని నిలబెట్టేందుకు చేసే గట్టి ప్రయత్నంలో భాగంగా సమైక్య భారతదేశాన్ని కోరే శక్తుల్ని గుర్తించాలి. దానిని వ్యతిరేకించేవారిని ఎదుర్కోవాలి. కాని అలా చేయడానికి బదులుగా వారు రెండు పక్షాల్ని బ్రిటన్‌కి వ్యూహ, రక్షణ రంగాలలో సహకరించవలసిందిగా బుజ్జగించారు. కామన్వెల్తుకు బలమైన మిత్రునిగా వుండే సమైక్య భారత ఉపఖండం అనే ప్రాధాన్యత – రెండు స్వతంత్ర ప్రతిపత్తిగల దేశాలు, రెండు కలిపి మొత్తం సమైక్యభారతదేశం నిర్వర్తించగలిగిన కర్తవ్యాన్ని నిర్వహించాలని మార్చబడింది. ఇక యిప్పటి సమస్య: ఇండియా పాకిస్తాన్– రెండింటి మైత్రి సహకారాలు ఎలా పొందాలి?

మౌంట్‌బాటెన్ రూపొందించిన సూత్రం: భారత దేశాన్ని విభజించాలి; కాని వాటి మధ్య వీలైనంత ఎక్కువస్థాయిలో ఐక్యతని నిలబెట్టాలి. దేశం విభజింపబడుతుంది. అలాగే పంజాబ్, బెంగాల్ కూడా. పరిమిత ప్రాంతంతో ఏర్పడే పాకిస్తాన్ అటు లీగు,

యిటు కాంగ్రెస్ వైఖరులను ఒకమేరకు నెరవేరుస్తుంది. పాకిస్తాన్‌పై లీగు వైఖరి– 'అది ప్రత్యేక రాజ్యంగా ఏర్పడాలి' అనే మేరకు అంగీకరింపబడింది. ఐక్యతపై కాంగ్రెస్ వైఖరి: 'పాకిస్తాన్‌ని వీలైనంత చిన్నదిగా చేయడం' పరిగణనలోకి తీసుకొనబడింది. ఇక సంస్థానాధీశుల స్వాతంత్ర్యాన్ని రద్దు చేయడం లేక బెంగాల్ ఐక్యత లేక హైదరాబాద్ సంస్థానం భారతదేశానికి బదులుగా పాకిస్తాన్‌లో చేరడం– లాంటి అంశాలలో మౌంట్‌బాటెన్ కాంగ్రెస్‌ని గట్టిగా సమర్థించాడు. భారతదేశం కామన్వెల్తులో వుండాలంటే కాంగ్రెస్ మద్దతు కీలకమని బ్రిటన్ ప్రభుత్వాన్ని ఒప్పించగలిగాడు.

మౌంట్‌బాటెన్ పథకంగా గుర్తింపు పొందిన 1947 జూన్ 3 పథకం ఇండియా, పాకిస్తాన్– రెండు రాజ్యాలకు అధినివేశ ప్రతిపత్తి ప్రాతిపదికన త్వరలో అధికారం బదిలీ చేయాలని చెప్పింది. దేశంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్ని సాహసోపేతంగా ఎదుర్కొనేందుకు పూర్తి అధికారాన్ని పటిష్టపరచుకోవాలి గనుక కొంతకాలం పాటు అధినివేశ ప్రతిపత్తికి కాంగ్రెస్ అంగీకరించింది. నెహ్రూ అప్పటి పరిస్థితుల్ని గురించి "వ్యక్తులు, గుంపులు దిగ్భ్రాంతికలిగించే దుర్మార్గాలకు ఒడిగడుతున్నారు. వీధుల్లో మృత్యువు స్వైరవిహారం చేస్తున్నది." అధినివేశ ప్రతిపత్తి బ్రిటిషు అధికారులు, సివిలు ఉద్యోగులు కొంతకాలంపాటు వుండడం వలన కొత్తగా అధికార స్థానాలలోకి వచ్చిన భారతీయులు వారి స్థానాలలో నిలదొక్కుకొనే అవకాశం అధినివేశ ప్రతిపత్తి కల్పిస్తుంది గనుక మొత్తం పాలనా యంత్రాంగానికి వెసులుబాటు లభిస్తుంది. అధినివేశ ప్రతిపత్తి భారతదేశాన్ని కామన్వెల్తులో వుంచే అవకాశాన్ని కల్పించింది. జిన్నా పాకిస్తాన్‌ని కామన్వెల్తులో తీసుకొని వస్తానని ప్రతిపాదించినప్పటికీ భారతదేశం యొక్క ఆర్థిక, రక్షణ పాటవాలు మెరుగ్గా వుంటాయి గనుక, వర్తక, వాణిజ్యాలకు పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఎక్కువగా వుంటాయి గనుక బ్రిటన్ భారతదేశం యొక్క కామన్వెల్తు సభ్యత్వానికి ప్రాధాన్యతనిచ్చింది.

కాంగ్రెస్‌ని అధినివేశ ప్రతిపత్తికి ఒప్పించేందుకు అధికార మార్పిడి తేదీని కాస్త ముందుకులాగి 1947 ఆగస్టు 15గా నిర్ణయించబడింది. త్వరితంగా క్షీణిస్తున్న మతపరమైన ఉద్రిక్త పరిస్థితుల బాధ్యత నుండి బ్రిటన్‌ను తప్పించడం కూడా పాలకులు ఆశించిన మరొక ప్రయోజనం. అప్పటి పరిస్థితులలో చాలామంది అధికారులు భారతీయుల్ని, వారి కర్మకు వారిని వదిలిపెట్టి మూటాముల్లె సర్దుకొనడానికి ఉత్సాహపడ్డారు. వైస్రాయితో పటేల్ 'మీరు పాలించరు. మమ్మల్ని పాలించనివ్వరు' అనడంలో అప్పటి పరిస్థితుల తీవ్రత అర్థమవుతుంది. మౌంట్‌బాటెన్ తేదీని 1947 ఆగస్టు 15కి మార్చటాన్ని సమర్థించుకొంటూ అప్పుడు తాము వదలివెళ్ళకపోతే పరిస్థితులు చాలా తీవ్రరూపం

దాల్చేవి అన్నాడు. బ్రిటిషువారు భారతదేశాన్ని ఆగస్టు 15, 1947న వదలివెళ్ళడం చాలా ముందుగా వెళ్ళడం కాదు; చాలా ఆలస్యంగా వెళ్ళడం అన్నాడు వైస్రాయి అధికారులలో ముఖ్యుడు ఇస్మే. బ్రిటిషువారి ఆలోచనల ననుసరించి త్వరగా వెనక్కి తగ్గడం చాలా సరియైన చర్య. కాని మౌంట్‌బాటెన్, ఇస్మే మనల్ని నమ్మించడానికి ప్రయత్నించినట్లు అది అనివార్యమైన ఎంపిక కాదు. ప్రభుత్వ అధికారం క్రమంగా క్షీణించినప్పటికీ అధికారం లేకుండా బాధ్యతవహించవలసిన పరిస్థితి ఊహ అవుతుంది గాని వాస్తవంకాదు. ఆ స్వల్ప వ్యవధిలో కూడా బ్రిటిషుపాలకులు అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు కృపలానీ మౌంట్‌బాటెన్‌తో ప్రస్తావించినట్లు అధికారంతో పరిస్థితిని చక్కదిద్దవచ్చు. కాని వారలా చేయలేదు. అంతేగాక అధికారాన్ని ఉపసంహరించుకోవడంగాక ఎవరో ఒకరు నిర్వహించవలసిన పరిస్థితులు వున్నాయి.

బాధ్యతని త్యజించడం కఠినమైన చర్య అయితే త్యజించడానికి పడిన తొందరపాటు అంతకంటే దారుణమైనది. అధికార మార్పిడి, దేశ విభజన కొరకు 1947 జూన్ 3 నుండి ఆగస్టు 15వరకు గల 72 రోజులకు వేసుకొన్న టైంటేబుల్ వినాశకరమైనదిగా నిరూపితమయింది. శాంతియుతమైన విభజనకు మహా అయితే కొద్ది సంవత్సరాల కాలవ్యవధి అవసరమయ్యేదని పంజాబ్ గవర్నరు జెంకిన్స్, కమాండర్ ఇన్ ఛీఫ్ అబిన్‌లెక్ లాంటి అధికారులు అభిప్రాయపడ్డారు. టైపు రైటర్లు, ప్రింటింగు ప్రెస్సుల నుండి అన్ని ఆస్తిపాస్తుల్ని విభజన కౌన్సిల్ కొద్ది వారాలలో పంచవలసి వచ్చింది. విభజన నుండి ఉత్పన్నమైన చిక్కు సమస్యల్ని పరిష్కరించగల సంధికాలిక సంస్థాగత నిర్మాణాలు లేవు. మౌంట్‌బాటెన్ భారత పాకిస్తాన్‌లకు గవర్నరు జనరలై రెండు దేశాల సంబంధాలకు అవకాశం కల్పించాలని ఆశించాడు. కాని జిన్నా కూడా గవర్నరు జనరల్ కావాలని కోరుకొన్నాడు గనుక అది సాధ్యపడలేదు. నెలకొల్పబడిన ఉమ్మడి రక్షణ యంత్రాంగం 1947 డిసెంబరు తరువాత పనిచేయలేకపోయింది. అప్పటికే కాశ్మీరులో రాజకీయ పరిష్కారానికి మారుగా మిలిటరీ ఘర్షణ ప్రారంభమయింది.

విభజన తరువాత జరిగిన పంజాబు హత్యాకాండ మౌంటుబాటెన్‌పై చేయబడిన చివరి దోషారోపణ. ఆయన సహాయకుడు ఇస్మే 1947 సెప్టెంబరు 16న అతడి భార్యకి ఇలా వ్రాశాడు. "మా రాయబారం దాదాపు జయప్రదమయింది. కాని పూర్తి వైఫల్యంగా ముగిసింది." ముందుగా నిర్ణయించబడిన తేదీ 1947 ఆగస్టు 15, సరిహద్దు కమిషన్ తీర్పు ప్రకటనలో జాప్యం– మౌంటుబాటెన్ చేసిన రెండు నిర్ణయాలు విషాదాన్ని పెంచాయి. విభజనని ఒక సంవత్సరం పాటు వాయిదావేసివుంటే పంజాబు విషాదం

జరిగివుండేదికాదని 1947లో పంజాబ్‌లో నియమింపబడిన సీనియర్ సైనికాధికారి బ్రిగేడియర్ బ్రిస్టో అభిప్రాయపడ్డారు. 1947 ఆగస్టు 15 నుండి డిసెంబర్ 31 వరకు ఇండియన్ ఆర్మీ ఛీప్ కమాండరుగా పనిచేసిన లాక్‌హార్ట్ ఈ అభిప్రాయాన్ని ధృవీకరించాడు. సివిల్ సర్వీసులలోని ప్రతి గ్రేడుకి చెందిన అధికారులు, సాయుధ దళాలలోని సైనికులందరూ స్వాతంత్ర్యానికి ముందు కొత్త దేశాలలో, వారి సంబంధిత స్థానాలలో వున్నట్లయితే విస్తృతమైన అశాంతిని నివారించడానికి ఎక్కువ అవకాశాలుండేవి. సరిహద్దు కమిషన్ నిర్ణయం 1947 ఆగస్టు 12కి సిద్ధంగా వుంది. బాధ్యత బ్రిటిషువారిపై పడకుండా చేసేందుకు మౌంటుబాటెన్ స్వాతంత్ర్యం తరువాతనే ప్రకటించాలని నిర్ణయించాడు. పంజాబు, బెంగాల్‌లలో స్వాతంత్ర్యదినం వింత దృశ్యాల్ని చూసింది. లాహోర్, అమృత్‌సర్ మధ్యగల గ్రామాలలో ఇండియా, పాకిస్తాన్ జెండాలు ఎగురవేయబడ్డాయి. రెండు మతాలకు చెందినవారు తాము సరిహద్దుకి సరియైన వైపునే వున్నామని విశ్వసించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఉదయం వారు వారివారి ఇళ్ళలో పరాయివారుగా వున్నారు. అధికారుల ఆదేశాలతో ప్రవాసితులయ్యారు.

* * *

దేశ విభజనని కాంగ్రెస్ ఎందుకు ఎలా అంగీకరించవలసి వచ్చింది? షైలాక్ పౌను మాంసం కోసం పట్టుపట్టినట్లు లీగు డిమాండు చేసి, పాకిస్తాన్ సాధించింది. బ్రిటన్ తాను సృష్టించిన విషవలయంలో తానే చిక్కుకొని బయటపడలేక అంగీకరించింది; అర్థం చేసుకోవచ్చు. కాని ఒకే భారతజాతి సిద్ధాంతానికి కట్టుబడిన కాంగ్రెస్ దేశ విభజనకి ఎందుకు అంగీకరించింది? చాలా క్లిష్టమైన ప్రశ్న. జూన్3 పథకం అంగీకారానికి నెహ్రూ, పటేల్ ఎందుకు ప్రచారమిచ్చారు? దాని కనుకూలంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, ఎ.ఐ.సి.సి. తీర్మానాన్ని ఎందుకు ఆమోదించాయి? అన్నిటికంటే మిన్నగా గాంధీజీ ఆక్షేపించకుండా ఎందుకు అంగీకరించారు? త్వరగా సులభంగా అధికారం పొందాలనే తహతహతో నెహ్రూ, పటేల్ దేశ విభజనకు అంగీకారం తెలిపారని; ఆ విధంగా వారు ప్రజల్ని మోసగించారని వ్యాఖ్యానాలు వున్నాయి. అంతేగాక గాంధీజీ సలహాలను పెడచెవిన పెట్టారని, గాంధీజీ శిష్యులచే మోసగించబడి ఆత్మార్పణకు కూడా సిద్ధపడ్డాడని, ఆ తరువాత మతోన్మాదానికి వ్యతిరేకంగా ఒంటరి పోరాటం చేశారని కూడా వ్యాఖ్యానాలు వున్నాయి.

విస్తృత ముస్లిం ప్రజానీకాన్ని - ప్రత్యేకించి 1937నుండి పైపైకి ఎగుస్తున్న ముస్లిం మతతత్వ కెరటాల్ని అడ్డుకొని జాతీయోద్యమంలోకి సమీకరించడంలో కాంగ్రెస్

విఫలమవడం కారణంగా నెహ్రూ, పటేల్, గాంధీజీలు అనివార్యమైన దానిని మాత్రమే అంగీకరిస్తూ వచ్చారు. ఈ వైఫల్యం 1946 ఎన్నికలలో లీగు 90శాతం ముస్లిం సీట్లు గెలవడంతో చాలా స్పష్టంగా వ్యక్తమయింది. జిన్నాతో యుద్ధంలో 1946 ప్రారంభంలోనే పరాజయం పాలయినప్పటికీ కలకత్తా, రావల్పిండి వీధులలో నౌఖాలీ, బీహార్ గ్రామాలలోని సందుగొందులలో నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా జరిగిన తుది సమరం తరువాతనే ఓటమి అంగీకరించబడింది. 1947 జూన్ నాటికి కాంగ్రెస్ నాయకులు తక్షణ అధికార మార్పిడి మాత్రమే మత ఘర్షణల వ్యాప్తిని అడ్డుకొనగలదని భావించారు. తాత్కాలిక ప్రభుత్వం దాదాపు కుప్పకూలిపోవడం కూడా పాకిస్తాన్ ఏర్పాటుని అనివార్యం చేసింది. 1947 జూన్ 14న జరిగిన ఎ.ఐ.సి.సి. సమావేశంలో పటేల్ పాకిస్తాన్, పంజాబ్‌లో, బెంగాల్‌లో తాత్కాలిక ప్రభుత్వంలో పనిచేస్తుందనే వాస్తవాన్ని గమనించాలని వాదించాడు. తాత్కాలిక ప్రభుత్వం పోరాటరంగంగా మారడంపట్ల నెహ్రూ ఆందోళనజెందాడు. మంత్రుల మధ్య వాగ్వివాదాలు జరిగాయి. నిర్ణయాలకు వచ్చేందుకు ప్రత్యేక సమావేశాలు జరుపుకొన్నారు. గవర్నర్లు లీగుని ప్రోత్సహించడాన్ని అదుపుచేయలేని, బెంగాల్ రాష్ట్రప్రభుత్వం దొమ్మీలలో భాగస్వామ్యం వహించకుండా నిరోధించలేని ప్రజలు నిర్దాక్షిణ్యమైన ఊచకోతకు గురవుతుంటే ఏమీ చేయలేని తాత్కాలిక ప్రభుత్వం కొనసాగడం అర్థరహితమని నెహ్రూ భావించాడు. తక్షణ అధికార మార్పిడి అంటే అప్పుడున్న పరిస్థితుల్నిబట్టి అధికారాల నుపయోగించి అదుపుచేయగల ప్రభుత్వమై వుండాలి; కాని తాత్కాలిక ప్రభుత్వానికి అలాంటి అధికారాలు లేవు.

రెండు అధినివేశ రాజ్యాలకు తక్షణ అధికార మార్పిడిని అంగీకరించడంలో మరొక అంశం యిమిడివుంది. చిన్నచిన్న రాజ్యాలుగా విభజితమయ్యే అవకాశాన్ని తోసిపుచ్చారు. రాష్ట్రాలకు, సంస్థానాధీశులకు స్వేచ్ఛగా ఎంపికచేసుకొనే అవకాశం యివ్వలేదు. సంస్థానాధీశులను బుజ్జగింపులతో, నిర్బంధాలతో ఏదో ఒక అధినివేశ రాజ్యంలో చేరేలా ఒప్పించారు. ఇది చిన్న విషయంకాదు. సంస్థానాలు విడివిడిగా వుండడం పాకిస్తాన్ కంటే ఇండియాకి పెద్దదెబ్బ.

1947లో విభజనకి అంగీకారం లీగు యొక్క రాజీకి సమ్మతించని స్వతంత్ర ప్రతిపత్తిగల ముస్లిం రాజ్యానికి యివ్వబడిన రాయితీల క్రమంలో చివరి అంకం. 1942లో క్రిప్సు రాయబారం సమయంలో ముస్లిం మెజారిటీ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి అంగీకరించబడింది. 1944లో జిన్నాతో జరిపిన సంభాషణలలో గాంధీజీ మరొక అడుగు ముందుకేసి ముస్లిం మెజారిటీ రాష్ట్రాల స్వయం నిర్ణయాధికార హక్కుని అంగీకరించాడు.

1946 జూన్‌లో కాంగ్రెస్ ముస్లిం మెజారిటీ రాష్ట్రాలు (కేబినెట్ మిషన్‌లోని బి, సి గ్రూపులు) ప్రత్యేక రాజ్యాంగ అసెంబ్లీని ఏర్పాటుచేసుకొనే అవకాశానికి అంగీకరించింది. నిర్బంధ గ్రూపుల విధానాన్ని వ్యతిరేకించింది. వాయువ్య సరిహద్దు రాష్ట్రం అస్సాంలు కోరుకొంటే ఆ గ్రూపులలో చేరకుండా వుండే హక్కుని సమర్థించింది. కాని ఆ సంవత్సరం చివరిలో నెహ్రూ గ్రూపుల విభజన నిర్బంధమా లేక ఐచ్ఛికమా? – అనే సమస్యపై ఫెడరల్ కోర్టు ఆదేశాన్ని అంగీకరిస్తామని చెప్పాడు. గ్రూపు విభజన నిర్బంధమని బ్రిటిష మంత్రివర్గం 1946 డిసెంబరులో యిచ్చిన వివరణకు కాంగ్రెస్ ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా అంగీకరించింది. 1947 మార్చి ప్రారంభంలో దేశం విభజింపబడేటట్లయితే పంజాబ్ (బెంగాల్ కూడా) విభజింపబడాలని కాంగ్రెస్ వర్కింగు కమిటీ తీర్మానం ఆమోదించినప్పుడు కాంగ్రెస్ అధికారికంగా విభజనని గురించి ప్రస్తావించింది. ముస్లింలీగు డిమాండ్లకు కాంగ్రెస్ పూర్తిగా లొంగిపోయిన చరమాంకం జూన్ 3 పథకం క్రింద కాంగ్రెస్ విభజనని అంగీకరించడంతో పరిసమాప్తమయింది.

నాయకుల సాహసోపేతమైన మాటలు చేతలకు విరుద్ధంగా వున్నాయి. రాజ్యాంగ సర్వసత్తాధికారాన్ని నొక్కి వక్కాణిస్తూనే కాంగ్రెస్ నిర్బంధ గ్రూపింగ్‌ని అంగీకరించింది. వాయువ్య సరిహద్దు రాష్ట్రాన్ని పాకిస్తాన్‌కి ధారాదత్తం చేసింది. హింసాయుతమైన బెదిరింపులకు లొంగబోమని మరిమరి చెప్పినప్పటికీ మతకలహాల్ని ఆపలేకపోయారు గనుక చివరికి కాంగ్రెస్ నాయకులు దేశ విభజనకి అంగీకరించారు. 1946 ఆగస్టు 22న నెహ్రూ వేవల్‌కి యిలా వ్రాశాడు. "మేము హత్యలతో కరచాలనం చేయబోవడంలేదు. దేశం యొక్క విధానాన్ని హత్యలు నిర్ణయించడానికి అనుమతించబోము."

ఇక్కడ యిమిడివున్న అంశం వాస్తవాన్ని అంగీకరించకుండా తిరస్కరించడం. వారి ఇప్పటి మాటలు చేతలు గత వైఫల్యాన్ని రద్దు చేయలేవు. ఎవరైనా విషాదం యొక్క తీవ్రతని వెల్లడిచేస్తారని ఆశిస్తారు లేక మార్చరానిదని అంగీకరించడానికి సిద్ధపడతారు. కనుక యిది ఎవరికీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కొత్త సరిహద్దుకి యిరువైపులనున్న లక్షలాది ప్రజలు చాలాకాలం వరకు విభజనని అంగీకరించ నిరాకరించారు. అందుకే ప్రజల్ని తరలించడం ఉద్రిక్తతలకు దారితీసింది. అనుకూల ఆలోచనలు చేయడం, మితిమీరిన ఆశలకు అంటిపెట్టుకొని వుండడం, మతపరమైన ఆలోచనలలో వచ్చిన మార్పుల్ని గమనించకపోవడం – అన్నీ కలగలిపి కాంగ్రెస్ వైఖరి, ప్రత్యేకించి నెహ్రూ వైఖరి అయింది. ముస్లింలు తమ భయాన్ని తొలగించుకోవడానికి మాత్రమే వేర్పాటువాదాన్ని ఉపయోగించుకొంటారు తప్ప విడిపోవడానికి వినియోగించుకోరని

విశ్వసించి కాంగ్రెస్ వేర్పాటు హక్కుని అంగీకరించింది. మతతత్వం 1920, 1930 దశాబ్దాలలోలాగా మైనారిటీలలో భయాందోళనల్ని వ్యాప్తిచేసే దశలోగాక 1940 దశాబ్దం మధ్యకాలం నాటికి దృఢమైన పట్టుదలగల నాయకుని నాయకత్వంలో ఏ విధంగానైనా ప్రత్యేక రాజ్యాన్ని సాధించ నిర్ణయించిందని కాంగ్రెస్ గుర్తించలేకపోయింది. ఫలితంగా కాంగ్రెస్ యిచ్చిన ప్రతి రాయితీ మతతత్వాన్ని బలహీనపరచకపోగా, దాని పట్టుని పెంచింది. మతతత్వం సాధించిన ప్రతి రాయితీ యింకా ఎక్కువ సంఖ్యలో ముస్లింలు దానివెనుక సమీకృతులయ్యేలా చేసింది. కాంగ్రెస్ లొంగిపోవడాన్ని అవకాశంగా తీసుకొని జిన్నా తన డిమాండ్లని పెంచాడు. హిందువుల ప్రయోజనాలకు నిజమైన రక్షణ కల్పించేది తానేనని ఆత్మస్తుతి చేసుకొనడం ద్వారా ఐక్యతా బలిపీఠం వద్ద హిందువుల ప్రయోజనాల్ని కాంగ్రెస్ త్యాగం చేస్తున్నదని, ప్రచారం చేయడం ద్వారా హిందూ మతతత్వం పెరిగేందుకు అవకాశం లభించింది.

'బ్రిటిషువారు దేశాన్ని వదలివెళితే విభేదాల్ని సర్దుబాటు చేసుకోవచ్చు. హిందువులు, ముస్లింలతో స్వతంత్ర భారతదేశాన్ని నిర్మించవచ్చు'– ఇది అవాస్తవమైన ఆశ; ఒక అపోహ. ఇది అప్పటి మతతత్వం యొక్క స్వయం ప్రతిపత్తిని తక్కువగా అంచనావేసింది. మతతత్వం బ్రిటిషువారి ఆసరాతో పెరిగే దశలోలేదు. ఊతంగా యిచ్చిన చేతికర్రని విసిరిపడేసింది. బ్రిటిషువారిని కూడా తిరస్కరించి స్వతంత్రతని చాటుకొంది. అయినప్పటికీ విభజన తాత్కాలికమేనని మరొక అపోహ. హిందువుల, ముస్లింల ప్రస్తుత మానసిక ఉద్రిక్తతల కారణంగా విభజన అనివార్యమయింది; కాని మతపరమైన ఉద్రిక్తతలు తగ్గిన తరువాత విభజనని రద్దు చేయవచ్చు. 'ప్రజలు తమ హృదయాలలో విభజనని తిరస్కరిస్తే పాకిస్తాన్ ఎక్కువకాలం మనలేదు" – అని గాంధీజీ తరచుగా చెపుతూండేవాడు. నెహ్రూ జనరల్ కరియప్పకి యిలా వ్రాశాడు. "తుట్టతుదకు సమైక్యమైన దృఢమైన భారతదేశం వుంటుందని నేను నమ్ముతున్నాను. సూర్యకాంతితో విరాజిల్లే పర్వతశిఖరాలను చేరటానికి ముందు లోయల నీడలలో నడవాల్సి వుంటుంది.'

విభజన ప్రశాంతంగా జరుగుతుందని విశ్వసించారు. ఇది అత్యంత అవాస్తవమైన అపోహ. పాకిస్తాన్‌కి అంగీకరిస్తే యిక పోట్లాడడానికేముంది? – అనుకొన్నారు. దొమ్మీలు జరుగుతాయని అంచనాలేదు. ప్రజల మార్పిడికి పథకాలు లేవు. 1946 ఆగస్టు నుండి దొమ్మీలు, ఘర్షణలు దేశాన్ని అంటువ్యాధిలా పట్టి పీడించినప్పటికీ నెహ్రూ ప్రజల మంచితనాన్ని విశ్వసించడం కొనసాగించాడు. ఆపరేషన్‌తో పిచ్చి కుదుర్చుతుందని విశ్వాసం. కాని శరీరం వ్యాధిగ్రస్తమయింది. ఆపరేషన్‌కి ఉపయోగించే పనిముట్లు జబ్బుని

వ్యాపింపజేసేలా వున్నాయి. విభజనని అంటిపెట్టుకొని భయోత్పాతాలు పొంచి కూర్చున్నాయి.

గాంధీజీ పరిస్థితి ఏమిటి? గాంధీజీ అశక్తత తరచుగా ప్రస్తావనకొచ్చింది. ఆయన స్తబ్ధతకి వివరణ వెలువడింది. నిర్ణయాలుచేసే కాంగ్రెస్ కౌన్సిళ్ళకు దూరంగా వుండవలసిరావడం, సంవత్సరాల తరబడి అత్యంత విశ్వసనీయమైన అనుచరులుగా, వ్యక్తిగత త్యాగాలుచేసి, యిప్పుడు అధికార ఆకర్షణకు లోనైన తన శిష్యుల్ని – నెహ్రూ, పటేల్ చర్యల్ని ఖండించలేని ఆశక్తత కారణంగా మౌనంగా వుండిపోయాడు.

మా దృష్టిలో గాంధీజీ నిస్సహాయతకు మూలం రాజీకి సమ్మతించని జిన్నా వైఖరి కాదు. అధికారం పట్ల ఆయన శిష్యులకు గల తహతహకాదు; ప్రజల్ని మతతత్వానికిలోను చేయడం. ప్రజలు కోరారు గనుక కాంగ్రెస్ దేశ విభజనని అంగీకరించిందని, గాంధీజీ 1947 జూన్ 4న ప్రార్థనా సమావేశంలో వివరించారు. 'మీరు అడిగారు గనుక డిమాండు అంగీకరించబడింది. కాంగ్రెస్ ఎప్పుడూ విభజన కావాలని అడగలేదు... కాని కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల నాడిని పట్టుకోగలదు. ముస్లింలేగాక హిందువులు కూడా కావాలన్నారు. విభజన కావాలని హిందువులు, సిక్కులు కోరడం గాంధీజీని నిస్సహాయుణ్ని చేసింది. ముస్లిములు అప్పటికే గాంధీజీని శత్రువుగా పరిగణించారు. పిలుపునందుకొనే ప్రజా సమూహాలు లేకుండా ప్రజా నాయకుడేంటి? మతతత్వంతో పోరాడేందుకు, మతతత్వానికి లోనయిన ప్రజలపై ఆధారపడి ఉద్యమాన్ని ఎలా నడపగలడు?" 1942లో లాగా ఉద్యమం పోరాటానికి సన్నద్ధంగా వున్నప్పుడు ఆయన నాయకుల సలహాల్ని తిరస్కరించగలడు. కాని గాంధీజీ యన్.కె.బోసుతో నమ్రతగా చెప్పినట్లు తాను అలాంటి పరిస్థితిని సృష్టించలేడు. ఆయనకు ప్రత్యేకమైన సామర్థ్యం వుంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే ప్రజల హృదయాలలో కదలాడే భావాల్ని పసిగట్టి, వాటికి ఆకారం కల్పించడం. 1947లో గాంధీజీ కొందరిని ప్రోగుచేసి కార్యక్రమాన్ని రూపొందించేందుకు మంచి శక్తులు తటస్థపడలేదు. "ఈనాడు అలాంటి ఆరోగ్యకరమైన వాతావరణపు సూచనలు లేవు. కాబట్టి నేను కాలం అనుకూలించే వరకు నిరీక్షించవలసి వుంటుంది'. కాని ఒక గ్రుడ్డి వ్యక్తి ఒంటరిగా చీకటిలో తడుములాడుకొంటూ వెలుతురు దారి కనుగొనేవరకు రాజకీయ పరిణామాలు ఆగలేదు. దేశం ముఖంపై దొమ్మీలు మిగిల్చిన వికృతమైన గాయాలలో, చేష్టలుడిగి బిగుసుకుపోయిన తాత్కాలిక ప్రభుత్వంలోను గాంధీజీ విభజన యొక్క అనివార్యతని చూశాడు. గాంధీజీ 1947 జూన్ 14 ఎ.ఐ.సి.సి. సమావేశానికి హాజరయి, అప్పటి పరిస్థితులలో అనివార్యమైన అవసరంగా విభజనను

అంగీకరించామని, కాని హృదయాలలో అంగీకరించకుండా దీర్ఘకాలిక పోరాటం చేయమని కాంగ్రెస్‌ని కోరాడు. ఆయన మనస్ఫూర్తిగా అంగీకరించలేదు. ప్రజలపై విశ్వాసాన్ని హృదయాలలో పదిలపరచుకొన్నారు. ఆయన ఒంటరిగా బీడుభూమిలో వ్యవసాయం చేయ నిర్ణయించాడు. నౌఖాలీ గ్రామాలలో చెప్పులు కూడా లేకుండా సంచరిస్తూ, బీహారులోని ముస్లింలకు తాను దగ్గరుండి విశ్వాసం కల్పిస్తూ, కలకత్తాలో నయానా, నిరాహారదీక్ష చేపడతానని బెదిరింపులతో దొమ్మీలను నివారిస్తూ... చాలాకాలం నుండి 'ఏక్‌లా చెలో' ఆయనకు అభిమానపాత్రమైన పాటయింది – "నీ పిలుపుని ఎవరూ శ్రద్ధగా ఆదరించకపోతే ఒంటరిగానడువు; ఒంటరిగా నడువు:" ఆయన అదే చేశాడు.

1947 ఆగస్టు 15 స్వాతంత్ర్యం, విభజన – ద్వంద్వ వాస్తవికతను వ్యక్తం చేసింది. గాంధీజీ, నెహ్రూ– యిద్దరి మధ్య భారత ప్రజల మనోభావాలు ప్రతిఫలించాయి. గాంధీజీ కలకత్తాలో కొనసాగుతున్న హత్యాకాండ అంతంగావాలని ప్రార్థనలు చేశాడు. ఆయన సన్నిహిత అనుచరురాలు మృదుల సారాబాయ్ బొంబాయిలో ఎక్కడో ఒక గదిలో కూర్చుని, ఇల్లులేని, అపహరించబడిన 15 సం॥రాల బాలికని ఓదారుస్తూ కూర్చుని వుంది. చీకటిలో కొనసాగుతున్న హత్యలు, అపహరణలు, మానభంగాలు గాంధీజీ ప్రార్థనలలో ప్రతిఫలించాయి. నెహ్రూ చూపులు దిగంతాలలోని కాంతిరేఖలపై, శుభోదయంపై, స్వతంత్ర భారతదేశం పుట్టుకపై వున్నాయి. "అర్ధరాత్రి గంటమోగిన క్షణాన ప్రపంచం సుషుప్తిలో మునిగివున్నప్పుడు భారతదేశం చైతన్యవంతమవుతూంది" ఆయన కవితాత్మకంగా చెప్పిన మాటలు "బహు దీర్ఘకాలం అణచిపెట్టబడ్డ జాతి ఆత్మ గొంతుక విప్పుతుంది"; – ప్రజల ఈనాటి ఆగ్రహంతో కూడిన దిగ్భ్రమ ఒక్కటే వాస్తవం కాదని వారికి గుర్తు చేశాయి. అంతకంటె గొప్ప వాస్తవం – ఉజ్వలమైన పోరాటం, దీర్ఘకాలం పోరాడి సాధించిన విజయం; భారతదేశం స్వతంత్రమవుతుందని కలలుగంటూ ఎందరో త్యాగధనుల బలిదానం, అసంఖ్యాకమైన త్యాగాలు– ఆ రోజు వచ్చింది. భారత ప్రజలు ఆగస్టు 15న అది చూశారు. దేశ విభజన కలిగించిన దుఃఖం హృదయాలలో వున్నప్పటికి ప్రజలు వీధుల్లో ఆనందంతో నృత్యం చేశారు.

* * *

# 38 జాతీయోద్యమం దీర్ఘకాలిక వ్యూహం

**భా**రత జాతీయోద్యమం వలసపాలనకు వ్యతిరేకంగా జరిపిన సుదీర్ఘ పోరాటంలో అమలు జరిపిన వ్యూహం రీత్యా ఉద్యమ గమనంలో చాలా మార్పులు సంభవించాయి. ప్రజలు పోరాటం చేయగలిగేశక్తి, వారు ఉద్యమాన్ని అర్థం చేసుకొని సాధించే ఆధిక్యతపైనేగాక పోరాటం అనుసరించే వ్యూహం, ఎత్తుగడలపై కూడా ఆధారపడి వుంటుంది.

జాతీయోద్యమంపై లభ్యమవుతున్న రచనలు జాతీయోద్యమం అమలుజరిపిన వ్యూహాన్ని చర్చించడంలో విఫలమయ్యాయి. జాతీయోద్యమాన్ని సమగ్రమైన వ్యూహంలేని వివిధ పోరాటాల సమ్మేళనంగాను లేక గాంధీజీ నాయకత్వం వహించిన దశలో అహింసలాంటి సూత్రాలు, సత్యాగ్రహం పికెటింగు లాంటి కొన్ని పోరాటరూపాలుగాను పరిగణించడం జరిగింది. లభ్యమయ్యే రచనలలోని ఈ వైఫల్యానికి ఒక కారణం జాతీయవాద వ్యూహం యొక్క సిద్ధాంతపరమైన స్వభావాన్ని వ్యక్తీకరించలేకపోవడమే. రష్యా– చైనా విప్లవ నాయకుల లాగా భారత జాతీయోద్యమ నాయకులు సిద్ధాంతంపట్ల ఆసక్తి చూపలేదు. వారి రాజకీయ వ్యూహానికి విస్పష్టమైన రూపమిస్తూ గ్రంథాలు, యితర రచనలు చేయలేదు. రాజ్యాంగబద్ధమైన కార్యక్రమాలు, నిర్మాణాత్మక కార్యక్రమాలు, రాజకీయ నిర్ణయాలు – లాంటి పోరాటం యొక్క వివిధ దశలను, అహింస సత్యాగ్రహం లాంటి పోరాటరూపాలను జాతీయోద్యమం యొక్క ప్రధానమైన వ్యూహంలోని అవిచ్ఛిన్నమైన భాగాలుగా చూడకపోతే వాటిని సరిగ్గా అర్థం చేసుకొనడం, చారిత్రకంగా అంచనా వేయడం సాధ్యపడదు.

జాతీయవాద వ్యూహంలోని చాలా అంశాలు ఉద్యమం యొక్క మితవాద, అతివాద దశలలో రూపకల్పన చేయబడ్డాయి. గాంధీజీ నాయకత్వం వహించిన దశలో అవి ఆచరణలోకి వచ్చాయి. సమకాలీన వ్యాఖ్యాతల లాగానే చరిత్రకారులు, యితర సామాజిక శాస్త్రవేత్తలు గాంధీజీ యొక్క జీవితదార్శనికత పట్ల కేంద్రీకరించడంపై మొగ్గుచూపారు. కాని ఆయన జీవిత దార్శనికత ప్రజలపై పరిమితమైన ప్రభావమే చూపింది. ఆయన రాజకీయ నాయకుడిగా రాజకీయ వ్యూహం, పోరాట ఎత్తుగడల ద్వారా లక్షలాది మందిని రాజకీయ కార్యరంగంలోకి నడిపించారు.

* * *

బ్రిటిషు పాలన యొక్క అలాగే వలసరాజ్యం యొక్క ప్రత్యేక స్వభావంపై జాతీయవాద వ్యూహం ఆధారపడివుంది. భారతీయ నాయకులు వలసపాలన యొక్క దోపిడీ స్వభావాన్ని పూర్తిగా గ్రహించారు. అలాగే వలసరాజ్యం సగం అధికార విధేయతని సమర్థించే స్వభావం, సగం ఆధిపత్యం వహించే స్వభావం గలదని కూడా గుర్తించారు. అది హిట్లర్ జర్మనీ లేక జారిస్టు రష్యా లేక చాంగ్‌కై షేక్ చైనా, బాటిస్టా క్యూబా లాంటిదికాదు. దాని స్వభావాన్ని చట్టబద్ధమైన అధికారవాదంగా చెప్పవచ్చు.

వలసరాజ్యం బలప్రయోగంతో స్థాపించబడింది. బలప్రయోగంతో పాలన సాగించింది. శాంతియుతమైన ఉద్యమాల్ని అణచివేసేందుకు తరచుగా బలం ప్రయోగింపబడింది. కాని వలసపాలన కేవలం బలం మీద మాత్రమే ఆధారపడలేదు. ఎన్నుకోబడిన అసెంబ్లీలు, స్థానిక ప్రభుత్వ సంస్థలు, కోర్టులు, పాఠశాలలు, కాలేజీలు – అన్నింటినీ మించి చట్టబద్ధ పరిపాలనపై ఆధారపడింది. ఉద్యమాలు చేపట్టని కాలంలో ఒక మేరకు పౌరహక్కులు కల్పించబడ్డాయి. అంతేగాక తరచుగా ప్రజావ్యతిరేకతని అణచివేసేటప్పుడు కూడా అది కొన్ని చట్టపరమైన నియమాలను, పాలనాపరమైన పద్ధతులను పాటించింది. మరొకవిధంగా చెప్పాలంటే అది అర్ధ ప్రజాస్వామ్యం, అర్ధ నియంతృత్వం.

వలసపాలన చాలాకాలంగా ప్రజల్ని రెండు ధోరణులకు అలవాటుచేసి భారతప్రజల ఆమోదంతో పాలించడంపై చాలా ఎక్కువగా ఆధారపడింది. ఒకటి: బ్రిటిషుపాలకులు ఉదారులు. న్యాయపాలన చేస్తారు. వారు ప్రజలకు తల్లిదండ్రులు. వారు భారతదేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి పరుస్తున్నారు

లేక భారతదేశాన్ని ఆధునీకరిస్తున్నారు. రెండవది: వలసపాలకులు అజేయులు. వారిని వ్యతిరేకించడం నిష్ప్రయోజనం. వారిని జయప్రదంగా ఎదుర్కొనగలిగినంత బలం, ఐక్యత భారతీయులలో లేదు. వారు అనుమతించిన మేరకు వ్యతిరేకతను సహిస్తారు; మించితే అణచివేస్తారు. కాబట్టి వారిని ప్రతిఘటించడం రాజ్యాంగ పద్ధతులలోనే జరగాలి. వలసపాలకులు కేవలం అణచివేతపైనే ఆధారపడకుండా రాజ్యాంగపరమైన, ఆర్థికపరమైన యింకా యితర రాయితీలను యిచ్చారు. వారు దాన దండోపాయాల్ని ప్రయోగించే పద్ధతిని అనుసరించారు.

ఈ నేపథ్యంలో సగం ఆధిపత్యం, సగం నియంతృత్వ స్వభావం గల వలస రాజ్యానికి వ్యతిరేకంగా జాతీయోద్యమం క్రమంగా వ్యూహాన్ని, ఎత్తుగడలను రూపొందించుకొన్నది.

* * *

జాతీయోద్యమం యొక్క ప్రాథమిక వ్యూహం దీర్ఘకాలిక ఆధిపత్యపోరాటం సాగించడం. ఆధిపత్య పోరాటం అంటే వివిధ మార్గాల ద్వారా ఉద్యమం యొక్క వివిధ దశల ద్వారా జాతీయవాద ప్రభావం ప్రజలలో నిరంతరం పెరిగి స్త్రీ, పురుషుల హృదయాలలో రగిలే ఘర్షణ. ఉద్యమాలు రెండు రకాలుగా చేపట్టబడ్డాయి. ఒకటి: చట్టాన్ని ఉల్లంఘించి చేపట్టే ప్రజా ఉద్యమాల దశలు. రెండు : చట్టం నాలుగు గోడల పరిమితులలో సాగే ఉద్యమాల దశలు. ఇవి ఒకదానికొకటి ప్రత్యామ్నాయాలుగా చేపట్టబడ్డాయి. ప్రజలలో జాతీయోద్యమ ప్రభావాన్ని విస్తరించేందుకు రెండు దశలు ఒకదానికొకటి అనుసంధానం చేయబడ్డాయి. అంతేగాక జాతీయోద్యమం యొక్క ప్రాథమిక వ్యూహం క్రమబద్ధమైన సంస్కరణల వ్యూహం. ఇది వలసపాలకుల నుండి అధికారాన్ని కైవశం చేసుకొనే లక్ష్యంతో సాగిన పోరాటవ్యూహం.

జాతీయవాద వ్యూహం యొక్క సమర్థత క్రమబద్ధత ఉద్యమంలో ప్రజల చురుకైన భాగస్వామ్యంతో ముడిబడివుంది. కాబట్టి ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంచాలి. ఉత్సాహంగా ఉద్యమంలో పాల్గొనేలా చేయాలి. వలసపాలకులు ప్రజలలో – ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల ప్రజలలో రాజకీయ నిర్లిప్తతని ఒక అలవాటుగా చేసి పెంచి పోషించారు. వలసపాలన స్థిరపడడానికి ఇది ప్రధాన కారణం. ఈ ప్రజల్ని చురుకైన రాజకీయాలలోకి రాజకీయ కార్యక్రమాలలోకి తీసుకొనిరావడం గాంధేయశకంలోని

ఉద్యమాల ప్రధాన లక్ష్యం. గాంధీజీ చాలాసార్లు ప్రకటించినట్లు 'ప్రజలు తీసుకొనగలిగిన శక్తి సాధించినప్పుడు అడిగితే స్వరాజ్యం వస్తుంది.'

జీవితంలోని అన్ని రంగాలలో వలసపాలకుల ఆధిపత్యాన్ని లేక సైద్ధాంతిక పలుకుబడిని కొంచెంకొంచెంగా తుడిచిపెట్టడం జాతీయవాద వ్యూహం యొక్క రెండవ లక్ష్యం. బ్రిటిషుపాలకులు బలప్రయోగంతోనేగాక జాగ్రత్తగా పొందుపరచబడిన విశ్వాసాల విధానంతో పాలన సాగిస్తున్నారు గనుక ఈ విశ్వాసాల విధానాన్ని బలహీనపరచి త్రోసివేయాలి. అంటే ఆలోచనాపరమైన యుద్ధం జరగాలి. జాతీయవాద భావాల్ని అధికాధికంగా ప్రజలచే ఆమోదింపజేయడం లక్ష్యం. వలసవాద సిద్ధాంతం యొక్క ప్రధానమైన లక్ష్యం నిజమైన శత్రువుయొక్క ముఖాన్ని– అంటే వలసవాదాన్ని దాచిపెట్టడం. అంటే భారత ప్రజల ప్రయోజనాలకు వలసవాదానికి మధ్యగల ప్రాథమిక వైరుధ్యాన్ని దాచిపెట్టడం. కాబట్టి ప్రత్యామ్నాయ జాతీయవాద ఉద్యమం యొక్క ప్రాథమిక కర్తవ్యం వలసవాద శత్రువు యొక్క ముఖాన్ని, ప్రాథమిక వైరుధ్యాన్ని బహిర్గతపరచడం. కాబట్టి జాతీయవాద వ్యూహం యొక్క ప్రధానమైన అంశం సైద్ధాంతిక రాజకీయ కార్యక్రమాన్ని చేపట్టడం.

అన్నిటిని మించి దీని అర్థం బ్రిటిషుపాలన యొక్క ఉదారత, అజేయం భావాలను బలహీనపరచడం. బ్రిటిషు ఔదార్యాన్ని బలహీనపరచి మేధాపరమైన నమూనాని సృష్టించి అద్భుతంగా ముందుకు తీసుకొనిపోయినవారు దాదాభాయి నౌరోజి, జస్టిస్ రనడే, ఆర్.పి.దత్ యితర మితవాదులు. ఈ క్రమాన్ని అతివాదులు గాంధేయశకంలో దిగువ మధ్య తరగతులలోకి తీసుకొని పోయారు. 19వ శతాబ్దం చివరికాలం నాటికి స్వేచ్ఛగా పనిచేయగల వార్తాపత్రికలు, ఫిరోజిషా మెహతా, గోపాలకృష్ణ గోఖలే –లాంటి నాయకులు చట్టసభలలో చేసిన కృషి, లోకమాన్యతిలక్, అరవింద్ ఘోష్ అతివాదులు సాగించిన సాహసోపేతమైన ప్రచారం, మృత్యు భయాన్ని సైతం లక్ష్యపెట్టని టెర్రరిస్టుల విప్లవాత్మక కార్యక్రమాలు - వలసవాద రాజ్యం యొక్క అజేయ భావాన్ని సవాలుచేశాయి. కాని 1918తరువాత కాలం నాటి చట్టాన్ని ఉల్లంఘించిన ఉద్యమాలు భారత ప్రజలలో నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని నిర్వహించాయి. ఈ ఉద్యమాల ప్రాథమిక కర్తవ్యం బ్రిటిషుపాలన ప్రశ్నించడానికి వీలుపడనిదనే భావనని ధ్వంసం చేయడం; ధైర్య సాహసాలతో పోరాడి త్యాగాలు చేసేందుకు ప్రజల్ని సంసిద్ధుల్ని చేయడం, ప్రజలు తమ అంగీకారంలేకుండా పాలింపబడరనే భావాన్ని పాలకులకు కలిగించడం.

కాంగ్రెస్‌వ్యూహంలోని మూడవ లక్ష్యం వలసరాజ్యం యొక్క యంత్రాంగంపై – సివిల్ ఉద్యోగులు, పోలీసులు, సాయుధ దళాలపై రాజ్యం యొక్క పట్టుని బలహీనపరచడం. ఈ లక్ష్యసాధనలో జాతీయవాద ఉద్యమం చాలావరకు జయప్రదమయింది. క్రమంగా పోలీసుల జైలు అధికారుల ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. చాలామంది అధికారులు– అన్ని రకాల అధికారులు 1942 ఉద్యమానికి తాము ఎదుర్కొనబోయే విపత్కర పరిస్థితుల్ని లక్ష్యపెట్టకుండా సహాయపడ్డారు. ఇంతకుముందు మనం గమనించినట్లు 1945 తరువాత పోలీసులలో, సైన్యంలో, అధికారవర్గంలో విధేయత క్షీణించడం, ఫలితంగా బ్రిటిషు పాలనా యంత్రాంగం అస్తవ్యస్తమవడం– భారతదేశాన్ని వదలివెళ్ళాలని బ్రిటిషు పాలకులు చేసిన నిర్ణయానికి ప్రధానమైన కారణాలు.

జాతీయోద్యమం ప్రారంభం నుండి బ్రిటన్‌లో కూడా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి వలసవాద ఆధిపత్యాన్ని బలహీనపరచే ప్రయత్నాలు చేసింది. 1890 నుండి విలియం దిగ్బీ, విలియం వెడర్‌బర్న్, యితరుల సేవలను ఇండియా లీగ్ కొరకు వినియోగించుకొనేలా నేషనల్ కాంగ్రెస్ బ్రిటిషు కమిటీ కృషిచేస్తూ వచ్చింది. అందుకు వి.కె.కృష్ణమీనన్ ఫెన్నర్ బ్రాక్‌వే చురుకుగా పనిచేశారు.

దీనితోపాటు భారతదేశంలో కాంగ్రెసేతర నాయకుల మద్దతు పొందడం, ప్రజాభిప్రాయం కూడగట్టడం కూడా జాతీయవాద నాల్గవ లక్ష్యం సాధించడానికి తోడయ్యాయి. జాతీయవాద నాల్గవ లక్ష్యం: ప్రజాస్వామ్య రాజకీయ అవకాశాన్ని నిరంతరం విస్తరింపజేయడం; చట్టబద్ధమైన కార్యకలాపాలు, శాంతియుత ప్రజా ఉద్యమాల నిర్వహణకు ప్రస్తుతం వున్న అవకాశాల్ని పరిమితం చేయకుండా వలసవాద పాలకుల్ని నిరోధించడం.

* * *

జాతీయవాద వ్యూహంలోని రెండవ ప్రధానమైన అంశం ఆధిపత్యం కొరకు సాగిన పోరాటం యొక్క దీర్ఘకాలిక స్వభావం. 'పోరాటం– సంధి– పోరాటం'గా వర్ణించదగిన ఈ వ్యూహంలో వలసపాలనని ప్రత్యక్షంగా ప్రతిఘటించే చట్టానికతీతమైన తీవ్రమైన ప్రజా ఉద్యమ దశ; దానివెంటనే ప్రత్యక్ష ప్రతిఘటన విరమించి వలసపాలన నుండి రాజకీయ రాయితీలు పొందే దశ– అసమగ్రంగా వున్నట్లు భావించబడింది.

కాని ఈ సాత్వికదశలో చట్టపరమైన రాజ్యాంగపరమైన పరిమితులలో ప్రజలలో చురుకైన రాజకీయ సైద్ధాంతిక కార్యక్రమం చేపట్టి అంతకంటె ఉన్నతమైన మరొక ప్రజా ఉద్యమం కొరకు బలాలు సమీకరించబడ్డాయి. 'పోరాటం– సంధి– పోరాటం' వ్యూహం యొక్క ముగింపుగా క్విట్ ఇండియా పిలుపు, ఆపై స్వాతంత్ర్య సాధన జరిగాయి. ఉద్యమం యొక్క రెండు దశలు కూడా వలసవాద ఆధిపత్యాన్ని బలహీనపరచేందుకు, జాతీయవాద కార్యకర్తల్ని ఎంపిక చేసుకొని శిక్షణ యిచ్చి ప్రజలపోరాట పటిమని పెంచేందుకు ఉద్యమ అవసరాల్ని బట్టి వినియోగించుకోబడ్డాయి.

'పోరాటం – సంధి– పోరాటం' యొక్క రాజకీయ క్రమం ఉన్నత దశకి అభివృద్ధి చెందే క్రమం. ఈ వ్యూహం వివిధ దశల ద్వారా పురోగమించింది. ప్రతి దశలో అంతకుముందు దశలోకంటె పురోగతి వున్నది. అదే సమయంలో అధికార మార్పిడి జరిగేవరకు జాతీయవిముక్తి కర్తవ్యం మిగిలివున్నట్లేనని గుర్తించబడింది. రాజ్యాంగ సంస్కరణల ఉన్నతదశ అంటె కూడా కూడా స్వేచ్ఛ పాక్షికంగా బదిలీ చేయబడడం కాదు. స్వేచ్ఛ అనేది సమగ్రమైనది; మొత్తంగా వుంటుంది. దానిని పూర్తిగా సాధించాలి. దానిలో పాక్షికత ప్రస్తావన లేదు. ఇందుకు భిన్నమైన ఏ యితర దృక్పథమైనా, ఉద్యమం యొక్క సంస్కరణదశలలో భారతీయుల్ని వలసవాదం యొక్క భాగస్వాముల్ని చేయయత్నిస్తుంది. వలసవాదం జాతీయవాదాన్ని తనలో యిముడ్చుకొనే ప్రయత్నం చేసింది. భారత జాతీయవాదులు ప్రజా ఉద్యమాలు చేపట్టని దశల్నికూడా రాజకీయ వలసవాద వ్యతిరేకపోరాట దశలుగా పరిగణించడం ద్వారా వలసపాలకుల వలలో చిక్కుకోలేదు. సంస్కరణల పని వలసవ్యవస్థ పనితో సమానం చేయబడలేదు. జాతీయవాద వ్యూహంలోని ప్రాథమిక అంశం: వలసవాదం యొక్క ప్రతి దశని వ్యతిరేకించి పోరాడుతున్న జాతీయవాదం వలసరాజ్యంచేత యిముడ్చుకొనబడకుండా ఒక దశనుండి మరొక దశకి ఎదిగింది. పోరాటరూపాన్ని మాత్రమే మార్చింది. చట్టానికి అతీతంగా ప్రజాఉద్యమాలు నడిపే దశలలో చట్టాలు అతిక్రమించబడ్డాయి. సహాయ నిరాకరణ అమలు జరుపబడింది. ప్రజా ఉద్యమాలు చేపట్టని నిర్లిప్త దశలలో ప్రజాందోళనలు, నాయకుల విస్తృతమైన పర్యటనలు పెద్దస్థాయిలో బహిరంగసభలు, కార్మికుల, రైతుల, విద్యార్థుల, యువకుల సంఘాల నిర్మాణం– వాటి పోరాటాలు – 1920, 1930 దశాబ్దాలలో ముఖ్యంగా వామపక్షాలచే నిర్వహింపబడ్డాయి. ఈ రెండు దశలు సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యూహంలోని భాగాలు ఒకే రకమైన సామ్రాజ్యవాద వ్యతిరేక తీవ్రతని కలిగివున్నాయి. రాజకీయ

పోరాటం నిరంతరాయంగా సాగింది. కాని పోరాట రూపాలు మాత్రం మార్పుచెందాయి. గాంధీజీ చెప్పినట్లు సహాయ నిరాకరణ ఆపివేయడమంటే యుద్ధం ఆపివేయడంకాదు, భారతదేశం తాను తయారు చేసుకొన్న రాజ్యాంగం కలిగివున్నప్పుడే పోరాటం అంతమవుతుంది.

* * *

'పోరాటం – సంధి– పోరాటం' వ్యూహానికి సంబంధించిన ప్రాథమిక ప్రశ్న: జాతీయోద్యమంలో రెండు దశలు ఎందుకు వుండవలసి వచ్చింది? చట్టానికతీతమైన ప్రజా పోరాటదశని ప్రజా ఉద్యమేతర దశ అనివార్యంగా ఎందుకు అనుసరించి వుండాలి? జాతీయోద్యమం స్వాతంత్ర్యం సాధించేవరకు ఒక నిరంతర ప్రజాపోరాట రూపం ఎందుకు తీసుకోలేకపోయింది? అలాచేస్తే అంతకంటే ముందే స్వాతంత్ర్యం సాధించబడి వుండేది గదా! గాంధీజీ నాయకత్వంలోని జాతీయవాద వ్యూహాన్ని అనుసరించి ప్రజా ఉద్యమం స్వభావరీత్యా సుదీర్ఘకాలం నిర్వహించడం సాధ్యపడదు. ఉద్యమం కాస్త ముందూ వెనుకగా వెనుకపట్టు పడుతుంది. ప్రజా ఉద్యమాలు స్వల్పకాలికమైనవిగానే వుండితీరాలి. తరువాత మరలా చేపట్టబోయే పోరాటానికి బలాన్ని కూడబెట్టుకొనేందుకు, ఉద్యమం ఊపిరిపోసుకొని పూర్వవైభవాన్ని పొందేందుకు కొంత విరామం అవసరమవుతుంది.

ప్రజా ఉద్యమంలో పాల్గొనే ప్రజలు అనివార్యంగా కొంతకాలం వ్యవధి తరువాత అలసిపోతారు. జైలు నిర్బంధాలు, పాశవికమైన లాఠీఛార్జీలు, చెల్లించలేని జరిమానాలు, ఇళ్ళు,పొలాలు యితర ఆస్తుల జప్తులు – లాంటి ప్రతికూల పరిస్థితులలో ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అణచివేతని ప్రతిఘటించే శక్తి పరిమితంగానే వుంటుంది. త్యాగాలు చేయగలశక్తి పరిమితంగానే వుంటుంది. ప్రజలు వలసవాద నిర్బంధాన్ని ఎదుర్కొని త్యాగాలు చేయగల శక్తిని పెంచేందుకు జాతీయ నాయకత్వం సైద్ధాంతిక కార్యక్రమం ద్వారా నిరంతర ప్రయత్నాలు చేసింది. అదే సమయంలో బాధలు భరించగల శక్తికి వుండే పరిమితుల్ని కూడా గుర్తించింది. అందువలన శక్తికి మించిన భారాన్ని వారిపై మోపలేదు. అంతేగాక వలసవాద ప్రభుత్వం కనీసం 1945వరకు అస్తవ్యస్తంగా లేదు. పాలనాయంత్రాంగం ప్రభుత్వానికి విధేయంగానే వుంది. 1932–33, 1942లలో లాగానే ఉద్యమాన్ని అణచివేయగల శక్తి కలిగివుంది. ఈ వాస్తవాన్ని కూడా గమనంలోకి తీసుకొని జాతీయవాద నాయకత్వం తన ఎత్తుగడల్ని రూపొందించింది.

ప్రజా ఉద్యమానికి సర్వసన్నద్ధంగా వుండే సైన్యం లేక పూర్తికాలం పనిచేసే కార్యకర్తల ఇనుపచట్రం యొక్క అవసరం వున్నప్పటికి, ప్రజా ఉద్యమం పూర్తిగా వారిపై ఆధారపడి మాత్రమే పనిచేయలేదు. ఈ అవగాహనతో జాతీయోద్యమంలో రెండు దశలు వుండాలన్నది వ్యూహం. ఉద్యమానికి నిర్ణయాత్మక శక్తి ప్రజలనుండే లభిస్తుంది. జాతీయోద్యమం సర్వస్వం జాతీయపోరాటానికి అంకితంచేసిన వేలాదిమంది పూర్తికాలం పనిచేసే కార్యకర్తల్ని తయారుచేసింది. ఈ కార్యకర్తలు వారి జీవితాన్ని జైళ్ళలో, ఆశ్రమాలలో, ఖాదీ భాండార్లలో, ట్రేడ్ యూనియన్, కిసాన్‌సభ కార్యాలయాల్లో గడిపారు. ప్రజల్ని సమీకరించడంలో, నిర్మాణంలోకి తీసుకొని రావడంలో వారు కీలకపాత్ర వహించినప్పటికీ ఉద్యమం ప్రజలపై ఆధారపడింది. వలసరాజ్యాన్ని ప్రతిఘటించే ప్రజా ఉద్యమం చేపట్టడం, ప్రతిఘటించని దశకి ఉద్యమాన్ని మార్చుకొనడం– ప్రజలపై ఆధారపడిన రాజకీయ పోరాట వ్యూహంలోని అంతర్భాగం. ఆ విధంగా ప్రజలు, ప్రభుత్వం వెళ్ళగలిగిన పరిమితుల అవగాహనతో గాంధేయవాదం రూపొందింపబడింది.

ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించడం, దానిని మరొక దశకి మార్చడం– ప్రజా ఉద్యమ వ్యూహంగా గుర్తించబడిన తరువాత ఒక దశనుండి మరొక దశకి మార్చే నిర్ణయం ఎత్తుగడ అయిందిగాని సూత్రంకాదు. అప్పుడు ఎదురైన ప్రశ్న: వాస్తవ పరిస్థితుల్ని గమనంలో పెట్టుకొని మార్పు నిర్ణయం ఎప్పుడు చేయాలి? తన రాజకీయ ఆచరణని గాంధీజీ సిద్ధాంతబద్ధం చేసిన రెండు అరుదైన సందర్భాలలో నాయకత్వ పాత్రని గురించి ఆయన ఎలా ఆలోచిస్తాడో సూచన ప్రాయంగా చెప్పారు. 1938లో ఆయన యిలా వ్రాశాడు. "తెలివైన సేనాని తాను పూర్తిగా తుడిచిపెట్టబడే వరకు నిరీక్షించడు. అతడు నిలబెట్టుకోలేని స్థానం నుండి సరియైన సమయంలో క్రమబద్ధంగా వెనక్కి తగ్గుతాడు", 1939లో "సమర్థుడైన సేనాని తన కనువైన సమయంలో తాను ఎంపిక చేసుకొన్న ప్రాతిపదికపై పోరాడతాడు. ఈ అంశాలపై చొరవ తాను అట్టిపెట్టుకొంటాడు; శత్రువు చేతుల్లోకి పోనీయడు."సత్యాగ్రహ ప్రచారంలో పోరాటపద్ధతి ఎత్తుగడల ఎంపిక అంటే ముందుకి పోవాలా, వెనక్కి తగ్గాలా, పౌర ప్రతిఘటన యివ్వాలా లేక నిస్వార్థమైన మానవసేవ నిర్మాణాత్మక కార్యక్రమాలలో అహింసాయుతమైన బలాన్ని కూడగట్టాలా? – పరిస్థితుల అవసరాలను బట్టి నిర్ణయింపబడతాయి.

మరొక విధంగా చెప్పాలంటే ఒక ఉద్యమాన్ని ప్రారంభించే లేక విరమించే సమయానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు ఉద్యమం యొక్క బలాబలాల

ప్రాతిపదికన ప్రజలు నిలబడగలిగే శక్తి మీద, ప్రభుత్వ రాజకీయ పాలనాపరమైన శక్తి మీద ఆధారపడి గాంధీజీ జాతీయ నాయకత్వం చేత చేయబడ్డాయి.

అలాగే ప్రభుత్వంతో రాయబారాలు జరపాలా వద్దా- అన్నది సమస్య కాదు. రాయబారాలు జరిపేటప్పుడు సరియైన సమయాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలి, ఎలా రాయబారాలు జరపాలి, దేనిని గురించి రాయబారాలు జరపాలి, ఒప్పందం కుదిరితే ఎలాంటి షరతుల కంగీకరించి ఒప్పందంపై సంతకాలు చేయాలి- అనేది సమస్య. కాంగ్రెస్ విధానంపై ఎ.ఐ.సి.సి. 1945 సెప్టెంబర్ 22 ఆమోదించిన తీర్మానం యిలా పేర్కొన్నది. "శాంతియుత విధానం యొక్క కీలకాంశం అయిన చర్చలు రాజీ పద్ధతిని కాంగ్రెస్ ఎప్పుడూ విడనాడదు. కాబట్టి కాంగ్రెస్ మార్గదర్శక సూత్రం: అవకాశమున్నప్పుడు 'చర్చ- అంగీకారం' అవసరమైనప్పుడు సహాయ నిరాకరణ - ప్రత్యక్ష చర్య".

గాంధేయ (గాంధీజీకి ముందు కాలంలో సైతం) వ్యూహంలో నిర్మాణాత్మకమైన పని చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. ఖద్దరు ప్రోత్సాహం, నూలు తీయుట, గ్రామీణ పరిశ్రమలు, జాతీయ విద్య, హిందూ ముస్లిం ఐక్యత, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం, హరిజనోద్ధరణ, విదేశీ వస్త్రాల్ని, విదేశీ మద్యాన్ని బహిష్కరించుట- లాంటి సమస్యలపై నిర్మాణాత్మక కార్యకలాపాల రూపకల్పన జరిగింది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో వందలాది ఆశ్రమాలు నిర్మాణాత్మక పనికి చిహ్నాలుగా వెలిశాయి.

ప్రజా ఉద్యమాలు చేపట్టని దశలో సహాయ నిరాకరణ విరమించుకొనడం వలన ఏర్పడిన రాజకీయపరమైన ఖాళీని నింపడంలో నిర్మాణాత్మకమైన పని చాలా కీలకమైన పాత్ర నిర్వహించింది. ప్రజా ఉద్యమాలు చేపట్టని దశలో కార్యకర్తలకు పని కల్పించి చురుకుగా వుంచే సమస్యని నిర్మాణాత్మకమైన పని పరిష్కరించింది. నిర్మాణాత్మక కార్యక్రమాలు పెద్దసంఖ్యలో ప్రజల్ని భాగస్వాముల్ని చేశాయి. పార్లమెంటరీ మేధాపరమైన పనిచేసేందుకు కొద్దిమంది వ్యక్తులు చాలు; కాని నిర్మాణాత్మక కార్యక్రమాలకు లక్షలాది మంది జోక్యం అవసరం. అంతేగాక అందరూ జైళ్ళకు వెళ్ళలేరు. కాని నిర్మాణాత్మకమైన పని అందరికీ అందుబాటులో వుంది.

నిర్మాణాత్మక కార్యక్రమాలకు చెందిన ముఖ్యులు సహాయ నిరాకరణోద్యమానికి పెద్దసంఖ్యలో కార్యకర్తల్ని సరఫరా చేశారు. వారు గాంధీజీయొక్క ఇనుప చట్రం లేక రిజర్వు సైన్యం.

* * *

భారత జాతీయవాద సవాలుని ఎదుర్కొనేందుకు వలసవాద వ్యూహం, రాజ్యాంగ సంస్కరణల్ని చట్టసభల్ని ఏర్పాటు చేసింది. చట్టసభలకు దీటైన వైఖరిని భారతీయులు చేపట్టవలసివచ్చింది. ఒకవైపు రాజ్యాంగ చట్రం, రాజ్యాంగ సంస్కరణలు జాతీయోద్యమాన్ని తమలో కలుపుకొనేందుకు లేక దారి తప్పించేందుకు వలసవాదానికి సాధనాలుగా పనిచేశాయి. మరొకవైపు అవి జాతీయోద్యమం పనిచేయగల ప్రజాస్వామ్య అవకాశాల్ని పెంచడం ద్వారా భారత ప్రజలు సాధించిన వలసవాద వ్యతిరేక పోరాట ఫలితాలకు ప్రాతినిధ్యం వహించాయి. రాజ్యాంగ సంస్కరణలు జాతీయకాంక్షని ప్రజలలో వ్యాపింపచేయటాన్ని అడ్డుకొంటాయని; రాజ్యాంగబద్ధం – రాజ్యాంగేతర, మితవాద– వామపక్షవాద ప్రాతిపదికన జాతీయవాద శ్రేణులలో అసమ్మతిని, చీలికల్ని ప్రోత్సహిస్తాయని వలసపాలకులు ఆశించారు.

వలసవాద వ్యూహాన్ని ఎదుర్కొనడంలో జాతీయనాయకులు రాజ్యాంగ సంస్కరణల తర్కాన్ని, అలాగే వలసపాలకుల వ్యూహపరమైన తర్కాన్ని అనుసరించవలసి వచ్చింది. వలసవాదం అనివార్యంగా కొంత రాజకీయ అవకాశాన్ని కల్పించవలసి వచ్చింది. జాతీయవాదం ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని వలసవాదానికి వ్యతిరేకంగా రాజకీయ సైద్ధాంతిక పోరాటం జరిపింది. సంస్కరణలు రూపొందింపబడాలి. ఎలా రూపొందింపబడాలి? – అనేది సమస్య. జాతీయవాద శ్రేణులలో తీవ్రమైన చర్చ జరిగిన మీదట సంస్కరణల రూపకల్పన సామ్రాజ్యవాదుల అంచనాల్ని తలక్రిందులు చేసేదిగాను, జాతీయవాదుల ఆకాంక్షని ముందుకు తీసుకొనిపోయేదిగాను వుండాలి. వాస్తవంగా 1880 నుండి జాతీయనాయకత్వం కౌన్సిళ్ళను వలసవాద ఆధిపత్యాన్ని బలహీనపరచేవిగా పరిగణించింది. అణగారిన ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు, వారిని వారు పాలించుకోగలరని ప్రజలలో విశ్వాసం కల్పించేందుకు, కాంగ్రెస్ యొక్క జాతీయోద్యమం యొక్క ప్రతిష్టని పెంచేదిగాను చట్టసభలలో, మున్సిపల్ సంస్థలలో, 1937 తరువాత మంత్రివర్గాలలో చేసిన కృషి వినియోగించుకోబడింది.

చాలాకాలం రాజకీయాధికారం నుండి దూరం చేయబడిన ప్రజలు, వలసవాదానికి గురిచేయబడి, రాజకీయాధికారం వినియోగించుకోలేని అశక్తులుగా వున్న ప్రజలు, వలసపాలకుల్ని సవాలు చేయడం, చట్టసభలలో ఒక ఫిరోజ్‌షా, ఒక జి.కె.గోఖలే, ఒక సిఆర్.దాస్, ఒక మోతీలాల్ నెహ్రూల శక్తివంతమైన ఉపన్యాసాలు, చట్టసభలలో 1920లలో ప్రభుత్వ ఓటమి, చాలా నగరాలలో, పట్టణాలలో, జిల్లాలలో జాతీయవాదులు

మున్సిపల్ అధికారులపై సాధించిన పట్టు - వారి శక్తి సామర్థ్యాల్ని తెలియజెప్పి ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి.

చట్టసభలలో రాజ్యాంగ సంస్కరణలలో జాతీయవాద వ్యూహం గణనీయమైన విజయాల్ని నమోదు చేసింది. జాతీయోద్యమం బలం పుంజుకొంటున్నప్పుడు చట్టసభలలోని కార్యకలాపాలు రాజకీయ శూన్యాన్ని నింపాయి. చట్టసభలలో మునిసిపల్ సంస్థలలో పనిచేసినవారు వలసరాజ్యం తనలో యిముడ్చుకొనడానికి చేసిన ప్రయత్నాలకు లోబడలేదు. వలసవాద డొల్లతనాన్ని బహిర్గత పరచారు. భారతదేశం బ్రిటిషువారి ప్రయోజనాల మేరకు అరాచక చట్టాల సహాయంతో బ్రిటన్ నుండి పాలింపబడుతుందని చూపారు.

1907లో సూరత్ చీలిక నేర్పిన గుణపాఠాలతో జాతీయ కాంగ్రెస్ ఆ తరువాత చీలికల్ని జయప్రదంగా నివారించగలిగింది. 1919 తరువాత కాంగ్రెస్‌వాదులందరు రాజ్యాంగ సంస్కరణల రాజకీయాల పట్లగాక ప్రజా రాజకీయాల పట్ల నిబద్ధులై వున్నారు గనుక యిది సాధ్యపడింది. ప్రజల తిరుగుబాటు వచ్చిన ప్రతి సందర్భంలోనూ కాంగ్రెస్ నాయకులు చట్టసభల్ని వదిలిపెట్టి ప్రజా ఉద్యమాలలోకి దూకారు. వారు చట్టసభల్ని వలసవాద చట్రంలో క్రమబద్ధమైన సంస్కరణల్ని తెచ్చిపెట్టే సాధనాలుగాగాక వలసరాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం జరిపే వేదికలుగా భావించారు.

* * *

గాంధీజీకి అహింస ఒక సూత్రం. కాని కాంగ్రెస్‌లోని ఆయన సమకాలికులు - సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అజాద్, సర్దార్ పటేల్, ఆచార్య నరేంద్రదేవ్- లాంటి వారికి అదొక విధానం. ఒక విధానంగా రాజకీయ ప్రవర్తనా రూపంగా జాతీయ కాంగ్రెస్ వ్యూహంలో అదొక ముఖ్యమైన భాగమయింది. విస్తృత ప్రజా సమీకరణపై ఆధారపడిన జాతీయోద్యమ స్వభావంలో అహింస అంతర్భాగమయింది. దాని ప్రాథమిక అంశాలలో ఒకటయింది.

అహింసాయుత పోరాట పద్ధతుల కారణంగా ప్రజలు విరివిగా పాల్గొన్నారు. హింసాయుత పద్ధతులలో పోరాడివుంటే అంతగా పాల్గొనివుండేవారు కాదు. పోరాటాలలో స్త్రీల భాగస్వామ్యానికి యిది ప్రత్యేకంగా వర్తిస్తుంది. సాయుధ పోరాటంలో మహిళలు పెద్దసంఖ్యలో చేరడం కష్టమయ్యేది. బాధల్ని భరించడం, లాఠీఛార్జీల్ని ఎదుర్కొనడం,

గంటలకొలది పికెటింగు జరపడం – లాంటి చర్యలలో బహుశా స్త్రీలు పురుషులకంటే బలాఢ్యులు. పోరాటరూపంగా రాజకీయ ప్రవర్తనగా అహింస వలసరాజ్యం యొక్క సగం ఆధిపత్య, సగం నియంతృత్వ స్వభావానికి బ్రిటన్ రాజకీయాల ప్రజాస్వామ్య స్వభావానికి అనుసంధానం చేయబడింది.

అహింస అంటే అన్నిటిని మించి నైతికబలం ప్రాతిపదికగా పోరాడటం. అహింసాయుత ప్రజా ఉద్యమాలు వలసపాలకులను ఒక మూలకు నెట్టివేశాయి. శాంతియుతంగా సత్యాగ్రహం సాగించేవారిపై పాలకులు సాయుధదళాన్ని ప్రయోగించినప్పుడు వలసరాజ్యం పాశవికబలంపై ఆధారపడి పనిచేస్తుందనే వాస్తవాన్ని బయటపెట్టింది. అహింసాయుత ప్రజా ఉద్యమం పాలకుల్ని సందిగ్ధంలో నిలబెట్టింది. శాంతియుతంగా వుంది గనుక అణచివేసేందుకు సందేహించారు. ప్రతిఘటించేవారు వలసవాదచట్టాల్ని ఉల్లంఘించారు గనుక వారి ఆధిపత్యంలో గల ముఖ్యమైన భాగాన్ని కోల్పోయారు. ఉద్యమకారులపై చర్య తీసుకొనకపోవడం అంటే పాలనాపరమైన బాధ్యతల్ని త్యజించడం, పరిపాలించడానికి అవసరమైన బలం లేదని ఒప్పుకోవడమయింది. ఉద్యమాన్ని బలప్రయోగంతో అణచివేస్తే అప్పటికీ వారు పరాజితులే. శాంతియుత ఉద్యమాన్ని, అహింసాయుతంగా శాసనోల్లంఘన చేసేవారిని బలప్రయోగంతో అణచివేతని సమర్థించుకొనడం నైతికంగా చాలా కష్టమయింది. వారు ఏ విధంగానూ గెలవలేని స్థితిలో వున్నారు. మరొకవైపు జాతీయోద్యమం గెలిచే వ్యూహం కలిగివుంది. ప్రజల మద్దతు గల అహింసాయుత ప్రజా ఉద్యమానికి అర్ధ ప్రజాస్వామ్య పాలన వద్ద జవాబులేదు. వలసపాలకులు రెండింటి మధ్య ఊగిసలాడి అణచివేతని ఆశ్రయించారు. అహింసాయుత ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయోగించిన బలప్రయోగం స్పష్టంగా బహిర్గతమవడంతో వలసపాలకుల ఆధిపత్యం క్రమక్రమంగా క్షీణించింది; నైతికపునాది కొంచెం కొంచెంగా ధ్వంసమయింది.

అహింసా పద్ధతి అమలు జరపడం 'నిరాయుధులైన ప్రజలకు ప్రత్యామ్నాయం వుండదు' – అనే వాస్తవంతో కూడా ముడిపడివుంది. వలసరాజ్యం తనకుగల విస్తృతమైన వ్యవస్థతో భారత ప్రజల్ని 1858నుండి నిరాయుధుల్ని చేసింది. ఆయుధాలు సేకరించడం, శిక్షణ పొందడం దాదాపు అసాధ్యంగా మారింది. బలమైన వలసరాజ్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసేందుకు అవసరమైన భౌతిక వనరులు భారతీయులకు లేవని జాతీయోద్యమ నాయకులు మొదటి నుండి గుర్తించారు. అహింసాయుత ప్రజాపోరాటంలో

నైతికబలానికి, కూడగట్టబడిన ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత లభించింది. ఇక్కడ నిరాయుధులుగా చేయబడిన భారత ప్రజలు ప్రతికూల పరిస్థితులలో లేరు. మరొక విధంగా చెప్పాలంటే ప్రజాఉద్యమం యొక్క అహింసాయుత విధానం రాజకీయ వనరుల్ని సమీకరించుకొనడంలో సాయుధ వలసరాజ్యానికి దీటుగావుంది.

ఈ సందర్భంగా హింసా ప్రయోగంపై వలసపాలకుల అవగాహనని అర్ధంచేసుకొనడం అవసరం. నిరాయుధులుగా చేయబడిన భారత ప్రజలు ప్రభుత్వంసాగించే తీవ్ర నిర్బంధకాండని తట్టుకోలేరు. హింసాయుత పద్ధతులకు దిగుతారు. ప్రజలు హింసాయుత పద్ధతులకు దిగితే ప్రభుత్వం అణచివేత చర్యలు చేపట్టడాన్ని సమర్ధించుకొనడానికి అవకాశం లభిస్తుంది. తీవ్ర నిర్బంధకాండ ప్రజల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. ప్రజల రాజకీయ స్తబ్ధతకి దారితీస్తుంది.

ఈ సందర్భంగా రెండు అంశాలు గమనార్హం. ప్రజా ఉద్యమం హింసాయుత రూపం తీసుకొంటుందా? లేక జవహర్‌లాల్ నెహ్రూ, భగత్‌సింగ్ సంక్షిప్తంగా భావగర్భితంగా ప్రస్తావించినట్లు కార్యకర్తలు చేపట్టే ఉద్యమాలకు భిన్నంగా లక్షలాదిమంది ప్రజలు  భాగస్వామ్యం వహించే ప్రజా ఉద్యమాలు స్వభావరీత్యా శాంతియుతంగా వుంటాయా? రెండవది: భారతదేశంలో అహింసా పోరాటం స్వభావరీత్యా యితర దేశాలలోని సాయుధ పోరాటాలంత విప్లవాత్మకమైనది.

* * *

జాతీయవాద వ్యూహం యొక్క స్వభావం లక్ష్యాల్ని అవగతం చేసుకొన్న తరువాత, ప్రజలే చరిత్ర నిర్మాతలని వారికి తెలియజెప్పి వారి హృదయాల్ని, మనస్సుల్ని ఆకట్టుకొని ఉద్యమంలో చురుకైన భాగస్వాముల్ని చేసేందుకు జాతీయోద్యమం యొక్క రెండు దశలు సమాయత్తం చేయబడాలని గుర్తించిన తరువాత ఉద్యమం యొక్క ప్రాథమిక వ్యూహాన్ని, ఉద్యమం యొక్క వివిధ దశలలోని విజయాల్ని పరాజయాల్ని నూతన పద్ధతిలో అంచనా వేయవలసివుంటుంది. భారత ప్రజలపై వలసవాద ఆధిపత్యం ఏ మేరకు బలహీనపరచబడింది, ప్రజలు ఏ మేరకు రాజకీయ చైతన్యంతో పోరాటానికి సన్నద్ధం చేయబడ్డారు– అనేవి ఉద్యమం యొక్క విజయానికి లేక వైఫల్యానికి గీటురాళ్ళు. ఈ దృక్కోణం నుండి పరిశీలిస్తే వరుసగా వచ్చిన ప్రజా ఉద్యమ కెరటాలు, సంధి దశలు లక్ష్యాల్ని సాధించినట్లు గమనిస్తాము. ప్రజా ఉద్యమాలు అణచివేయబడినప్పుడు (1932,

1942) విరమించినప్పుడు (1922) విస్మరించబడి అణచివేయబడినప్పుడు (1940-41) లేక రాజీతో ముగిసినప్పుడు (1930-31), సంపూర్ణ స్వరాజ్యం లక్ష్యంగా పెట్టుకొని సాధించలేకపోయినప్పుడు - అన్ని సందర్భాలలో ఆధిపత్యం సాధించడంలో విజయవంతమయ్యాయి. రాజకీయ చైతన్యాన్ని పెంచడంలో విజయవంతమయ్యాయి.

* * *

భారత జాతీయోద్యమ వ్యూహం యొక్క ఆచరణకి - ప్రత్యేకించి గాంధీజీ నాయకత్వం వహించిన కాలంలో ఆచరణకి ప్రపంచ చరిత్రలో బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా, క్యూబా, వియత్నాం విప్లవాలతో పోల్చదగిన ప్రాధాన్యత వుంది. కాని భారతదేశం మాత్రమే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య దేశంగా అవతరించి మన గలిగింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంపై అధ్యయనం రాజకీయ కార్యకర్తకి, చరిత్రకారునికి చారిత్రక క్రమంపై లోతైన అవగాహన కల్పించగలుగుతుంది.

* * *

# 39 భారత జాతీయోద్యమం- సైద్ధాంతిక కోణం

**భా**రత జాతీయోద్యమం వలసవాదానికి భారత ప్రజల ప్రయోజనాలకు మధ్య గల ప్రధానమైన వైరుధ్యం నుండి పుట్టింది. బ్రిటిషు సమాజం యొక్క ఆర్థికవ్యవస్థ ప్రయోజనాల కనుగుణంగా భారత సమాజాన్ని భారతదేశ ఆర్థిక వ్యవస్థని నియంత్రించేందుకు బ్రిటిషు పాలకులు తమ రాజకీయాధికారాన్ని ఉపయోగించుకొంటున్నారు - అని జాతీయోద్యమ నాయకత్వం స్పష్టమైన శాస్త్రీయమైన దృఢమైన అవగాహనకు వచ్చింది. ఈ అవగాహన ప్రాతిపదికగా ఉద్యమాన్ని నిర్మించింది. దేశం మొత్తంగా తిరోగమిస్తుందని వెనుకబడిపోతుందని గ్రహించింది. దీనిని ఆధారంచేసుకొని స్పష్టమైన వలసవాద వ్యతిరేక సిద్ధాంతాన్ని రూపొందించింది.

19వ శతాబ్దాంతానికి జాతీయోద్యమ పితామహులు వలసవాద దోపిడీ పద్ధతులపై స్పష్టమైన అవగాహనకు వచ్చారు. వలసవాద దోపిడీ పద్ధతులు: దోపిడీ, పన్నుల విధింపు, భారతదేశంలోని ఉద్యోగాలలో బ్రిటిషు వారి నియామకం, స్వేచ్ఛాయుతమైన అసమాన వర్తక వాణిజ్యాలు, భారతదేశంలో బ్రిటిషు పెట్టుబడులు భారతదేశంలో వలసవాద సంబంధం యాదృచ్ఛికంగా జరిగిన ఘటన కాదని లేక రాజకీయ విధానం యొక్క అనివార్య ఫలితం కాదని, కేవలం బ్రిటిషు సమాజం యొక్క స్వభావం నుండి ఉత్పన్నమైందని గ్రహించారు. భారతదేశం నుండి సంపద

తరలింపు - భారతదేశం యొక్క పెట్టుబడి సంపదలోని అత్యధిక భాగం బ్రిటన్‌కి తరలింపబడుతుంది - అనే అంశంపై కేంద్రీకరించి విమర్శలు చేశారు.

ఆధునిక సామ్రాజ్యవాదం యొక్క సంక్లిష్టమైన ఆర్థిక విధానాల పట్ల అవగాహన, 1918 తరువాత సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు మార్క్సిస్టు ఆలోచనల వ్యాప్తి ప్రభావంతో పరిపుష్టం చేయబడింది. వలసవాద ఆర్థిక సంబంధాలను కూలదోయడం ద్వారానే ప్రధాన వైరుధ్యం పరిష్కరింపబడుతుందని కూడా జాతీయవాద నాయకత్వం గుర్తించింది. అంతేగాక ఉద్యమాభివృద్ధి యొక్క ప్రతిదశలో నాయకత్వం తన విశ్లేషణని వలసవాదం యొక్క విశ్లేషణతో అనుసంధానం చేసింది.

వలసవాద వ్యతిరేక ప్రాపంచిక దృక్పథాన్ని జాతీయోద్యమం యొక్క క్రిందిస్థాయి కార్యకర్తలు ప్రజలలోకి తీసుకొని వెళ్ళారు. దేశ సంపదని తరలించడం, బ్రిటన్ పారిశ్రామిక వస్తువులకు భారతదేశాన్ని మార్కెట్‌గా ఉపయోగించుకొనడం- ఫలితంగా భారతీయ చేతివృత్తులు, కుటీర పరిశ్రమల విధ్వంసం, ఆందోళనకు ప్రధానాంశం అయింది. ఈ ఆందోళన సాధారణ ప్రజలలో వలస పాలనపట్ల ఏహ్యాభావాన్ని పెంచింది. 'భారత ప్రజల మంచి కొరకే బ్రిటిషు పాలకులు పాలిస్తున్నారు, బ్రిటిషుపాలకులు సాధారణ ప్రజలకు తల్లిదండ్రులు' - లాంటి వలసవాదం పొందికగా ప్రజల మనస్సులలోకి ఎక్కించిన భ్రమలు తొలగిపోయాయి.

ఆ విధంగా ప్రాథమిక వైరుధ్యం జాతీయ ఉద్యమానికి అవసరమైన సమాచారాన్ని లేక సంస్థాగతమైన పునాదిని సమకూర్చింది. వలసవాద వ్యతిరేక సిద్ధాంతం పట్ల అవగాహన సైద్ధాంతిక పునాదిని సమకూర్చింది.

ఏ ప్రజా ఉద్యమంలోనైనా సిద్ధాంతం చాలా కీలకమైన పాత్ర నిర్వహిస్తుంది గనుక ఉద్యమం యొక్క ఈ బలమైన వలసవాద వ్యతిరేక పునాది చాలా ముఖ్యమైనది. సాధారణ రాజకీయాలలో పాలనకి నిర్లిప్తంగా యిచ్చే మద్దతు లేక వ్యతిరేకతకి, అనుకూలంగా లేక ప్రతికూలంగా ఓటింగుకి ప్రజల్ని అంతగా సన్నద్ధం చేయనవసరంలేదు. కాని ప్రజా ఉద్యమంలో త్యాగాలతో కూడుకొన్న చురుకైన భాగస్వామ్యం కేవలం 'పేదగా వుండడం, దోపిడీకి గురవుతుండడం' - లాంటి భావాల

ప్రాతిపదికన మాత్రమే సాధ్యపడదు. అందుకు సామాజిక పరిస్థితుల పట్ల గల అవగాహనపై ఆధారపడిన బలమైన – చాలా బలమైన సైద్ధాంతిక నిబద్ధత అవసరం. కాబట్టి సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ఉద్యమం యొక్క శాస్త్రీయ వలసవాద వ్యతిరేక సిద్ధాంతం ప్రధాన చోదకశక్తి అయింది.

వలసవాద వ్యతిరేక ప్రాపంచిక దృక్పథంతో పాటు భారత జాతీయోద్యమం యొక్క విస్తృతమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ భవిష్యద్దర్శనంలో మరికొన్ని యితర సైద్ధాంతిక అంశాలు వున్నాయి. ఈ భవిష్యద్దర్శనం బూర్జువాలది. పెట్టుడిదారీ స్వతంత్ర ఆర్థికాభివృద్ధి, సెక్యులర్ రిపబ్లిక్, ప్రజాస్వామ్యయుత పౌరస్వేచ్ఛలు గల రాజకీయ వ్యవస్థ. సామాజిక సమానత సూత్రాలపై ఆధారపడిన సామాజిక రాజకీయ వ్యవస్థ. కాని 1920 తరువాత ఆర్థికవ్యవస్థ యొక్క పెట్టుబడిదారీ స్వభావం సవాల్ చేయబడింది.

* * *

జాతీయోద్యమం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల, పౌరహక్కుల పట్ల పూర్తి నిబద్ధత కలిగివుంది. 'భారత ప్రజల చారిత్రక సాంప్రదాయాలు, మతపరమైన, సామాజికపరమైన సంస్థల స్వభావం కారణంగా ప్రజాస్వామ్యం భారతదేశానికి సరిపడదు; భారతీయులు నియంతృత్వ పద్ధతిలో పరిపాలింపబడవలసిందే' – అని పాలకులు ప్రచారాలు సాగిస్తున్న సమయంలో జాతీయోద్యమం యొక్క నిబద్ధత ప్రజాస్వామ్యం, పౌరహక్కులు వేళ్ళూనుకొనడానికి అవసరమైన సారవంతమైన నేలని, అనుకూల వాతావరణాన్ని సమకూర్చింది. వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యంలో బ్రిటిషు పాలకులు తరచుగా జోక్యం చేసుకొన్నారు. వాటిపై అధికాధికంగా దాడులు చేశారు.

ఫలితంగా ప్రజాస్వామ్యం కొరకు పోరాడడం, దానిని దేశీయం చేయడం అంటే భారతగడ్డపై వేళ్ళూనుకొని ఎదిగేలా చేయడం జాతీయోద్యమ కర్తవ్యం అయింది. జాతీయోద్యమం మొదటి నుండి ఎన్నికల ప్రాతిపదికన ప్రాతినిధ్య ప్రభుత్వ విధానం కొరకు పోరాడింది. 1920 ముందు తిలక్ యితర జాతీయవాదులు, ఆ తరువాత గాంధీజీ, కాంగ్రెస్ స్త్రీ, పురుషులు ఓటు వేయగలిగే వయోజన ఓటింగు విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండు చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడినప్పటి నుండి

ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించబడింది. తీర్మానాలన్నీ బహిరంగ చర్చకి పెట్టి ఆ తరువాత ఓటింగు జరపడం సాగించింది. మైనారిటీ అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి కాంగ్రెస్ అవకాశమిచ్చింది; ప్రోత్సహించింది.

కాంగ్రెస్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన నిర్ణయాలలో కొన్ని తీవ్రమైన చర్చలు ఓటింగ్ ద్వారానే తీసుకొనబడ్డాయి. ఉదాహరణకు 1920లో కలకత్తాలో గాంధీజీ ప్రవేశపెట్టిన తీర్మానంపై అనుకూలంగా 1886, వ్యతిరేకంగా 884 ఓట్లు రావడంతో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించాలని నిర్ణయం తీసుకొనబడింది. అలాగే 1929 లాహోర్ కాంగ్రెస్‌లో వైస్రాయి రైలుపై టెర్రరిస్టుల బాంబుదాడిని ఖండిస్తూ గాంధీజీ మద్దతుతో ప్రవేశపెట్టబడిన తీర్మానం 942-724తో ఆమోదం పొందింది. 1942లో ఎ.ఐ.సి.సి.లోని 13మంది కమ్యూనిస్టు సభ్యులు క్విట్ ఇండియా తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు చేశారు. గాంధీజీ తన ప్రఖ్యాతమైన 'డూ ఆర్ డై' ఉపన్యాసానికి ముందు యిలా చెప్పాడు. "తీర్మానానికి వ్యతిరేకంగా ఓటుచేసిన 13మంది మిత్రుల్ని నేను అభినందిస్తున్నాను. అలా చేయుడంలో వారు సిగ్గుపడాల్సిందేమీ లేదు. గడచిన 20 సం॥ల నుండి మనం పూర్తి మైనారిటీలో వుండి అపహాస్యానికి గురయినప్పటికీ ధైర్యం కోల్పోకుండా వుండడాన్ని నేర్చుకొన్నాం. మనది సరియైనదనే నమ్మకంతో మన విశ్వాసాలకు కట్టుబడి వుండడాన్ని నేర్చుకొన్నాం. అది విశ్వాసం పట్ల ధైర్యాన్ని అలవరుస్తుంది. వ్యక్తి యొక్క నైతికస్థాయిని పెంచుతుంది. కాబట్టి నేను 50సం॥లు లేక అంతకంటే ఎక్కువకాలం నుండి అనుసరించాలనుకొన్న సూత్రాన్ని ఈ మిత్రులు స్వాయత్తం చేసుకొన్నందుకు చాలా సంతోషిస్తున్నాను."

* * *

జాతీయోద్యమం ప్రారంభం నుండి పౌరహక్కుల రక్షణకొరకు పట్టుదలగా పనిచేసింది. వాక్సభా పత్రికా స్వేచ్ఛ యితర పౌరహక్కులపై వలసపాలకులు చేసిన దాడులకు వ్యతిరేకంగా జాతీయ నాయకులు పోరాడారు. ఉదాహరణకు తిలక్ తరచుగా "వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ జాతికి పుట్టుక నిస్తాయి; పెంచి పోషిస్తాయి" అనేవాడు.

పౌరహక్కుల పట్ల గాంధీజీ పూర్తి నిబద్ధత కలిగివున్నాడు. సహాయ నిరాకరణోద్యమం అత్యున్నత దశలో వున్నప్పుడు 1922 జనవరి 'యంగ్ ఇండియా' పత్రికలో యిలా రాసాడు. "ప్రభుత్వం దూకుడుతో పోల్చినప్పుడు స్వరాజ్, ఖిలాఫత్, పంజాబ్ ఉద్యమాలు చాలా సంయమనం పాటించాయి. మన లక్ష్యం దిశగా ముందుకు పోయే ముందు వాక్‌స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛని పటిష్టపరచుకోవాలి. ఈ ప్రాథమిక హక్కుల్ని ప్రాణపదంగా కాపాడుకోవాలి." ఆ తరువాత మరొక వ్యాసంలో ఈ హక్కుల్ని గురించి యిలా వివరించాడు. "వాక్‌స్వాతంత్ర్యం అంటే అది బాధ కలిగించినప్పుడు కూడా ఆటంకపరచబడకుండా వుండాలి. పత్రికలు కఠినమైన పదజాలంతో వ్యాఖ్యానించినప్పుడు కూడా, విషయాల్ని వక్రీకరించినప్పుడు కూడా పత్రికా స్వేచ్ఛకి ఆటంకాలు కల్పించకపోవడం నిజమైన పత్రికా స్వేచ్ఛ. ప్రజాసభలు విప్లవ కార్యక్రమాన్ని చర్చించగలిగినప్పుడు సభలు జరుపుకొనే స్వేచ్ఛ గౌరవింపబడినట్లు." ఈ సందర్భంగా గాంధీజీ చెప్పిన మరొక అంశాన్ని ప్రస్తావించడం అవసరం. "అహింస ఆచరణ కనుగుణమైన పౌరస్వేచ్ఛ స్వరాజ్యం దిశగా వేసే మొదటి అడుగు. రాజకీయ సామాజిక జీవితానికి అది శ్వాస. పౌరస్వేచ్ఛ జాతి జీవజలం."

పౌరహక్కులకు బహుశా అందరికంటే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చినవాడు జవహర్‌లాల్ నెహ్రూ. ఆయన ఆర్థిక సమానత్వానికి, సోషలిజానికి యిచ్చినంత ప్రాధాన్యత పౌరహక్కులకు యిచ్చాడు. నెహ్రూచే రూపొందించబడి 1931 కరాచీ కాంగ్రెస్‌చే ఆమోదించబడిన ప్రాథమిక హక్కులపై తీర్మానం, ఉపన్యాసాలు పత్రికలు సభల ద్వారా భావ వ్యక్తీకరణకి హామీ యిచ్చింది. 1936 ఆగస్టులో ఆయన కృషి ఫలితంగా పౌరహక్కులపై దాడులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు పార్టీలకతీతంగా గ్రూపులకతీతంగా భారతీయ పౌరహక్కుల సంఘం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ఆయనిలా ప్రకటించాడు. "పౌరహక్కులు అణచివేయబడితే జాతి తన జీవశక్తిని కోల్పోతుంది; దుర్బలమవుతుంది." మరలా 1940 మార్చిలో "మనకు యిష్టమైన అంశాలు పత్రికలలో వచ్చేందుకు అనుమతించడం పత్రికా స్వేచ్ఛ కాదు. అలాంటి స్వేచ్ఛ నియంతకి కూడా అంగీకారంగానే వుంటుంది. మనకు యిష్టంలేని వాటిని అనుమతించడంలోను, విమర్శల్ని సహించడంలోను, మన ప్రయోజనాలకు హాని కలిగించే అభిప్రాయాల్ని

బాహాటంగా వ్యక్తీకరించడాన్ని అనుమతించడంలోను పౌరస్వేచ్ఛ పత్రికా స్వేచ్ఛ వుంటాయి" అని వ్రాశాడు.

ఆ విధంగా జాతీయవాద ఉద్యమం అసమ్మతిని గౌరవించగల ప్రాతిపదికన పౌరహక్కులు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, మైనారిటీ హక్కులు మనగలగడానికి, అభివృద్ధి చెందడానికి హక్కు, మెజారిటీ సూత్రాన్ని పాటించే ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని, సంస్కృతిని సృష్టించింది.

సెక్యులరిజం మొదటి నుండి జాతీయవాద సిద్ధాంతంలో భాగం చేయబడింది. హిందూ, ముస్లిం ఐక్యతకు ప్రాధాన్యత యివ్వబడింది. జాతీయోద్యమం మతతత్వాన్ని నిర్మూలించడంలోను, దేశ విభజనని నివారించడంలోనూ విఫలమైనప్పటికీ ఈ వైఫల్యం సెక్యులర్ సిద్ధాంతం నుండి వైదొలగడం వలన కలిగిన వైఫల్యంకాదు. మతతత్వంతో పోరాడేందుకు అనుసరించిన వ్యూహంలోని బలహీనత, మతతత్వం యొక్క సామాజిక, ఆర్థిక, సైద్ధాంతిక మూలాలను అవగాహన చేసుకోలేకపోవడం వలన కలిగిన వైఫల్యం. జాతీయోద్యమం కులపరమైన అణచివేతని వ్యతిరేకించింది. 1920 తరువాత అంటరానితనం రద్దు జాతీయోద్యమం యొక్క కార్యక్రమంలోనూ, పని విధానంలోను ప్రధానాంశం అయింది. కాని ఈ అంశంలోను తీవ్రమైన సైద్ధాంతిక లోపాలున్నాయి. ప్రత్యేకించి బలమైన కులవ్యతిరేక సిద్ధాంతాన్ని రూపొందించలేదు; ప్రచారం చేయలేదు. మహిళా విముక్తి సమస్యను కూడా చేపట్టలేదు.

జాతీయోద్యమం భారత ప్రజల యొక్క బహుముఖమైన వైవిధ్యాన్ని పూర్తిగా గుర్తించింది. భారతదేశం జాతిగా రూపుదిద్దుకొంటుంది గాని జాతిగా అభివృద్ధి చెందలేదనే అంశాన్ని జాతీయోద్యమం గమనంలోకి తీసుకొని, దానిని సైద్ధాంతిక రాజకీయ కార్యకలాపాలకు ప్రాతిపదికగా చేసుకొన్నది. దేశం వలసపాలనకు గురికావడం జాతి నిర్మాణానికి భౌతికమైన, భావపరమైన ప్రాతిపదిక సమకూర్చిందని, వలసవాదానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం ద్వారా జాతి నిర్మాణం చేపట్టాలని జాతీయోద్యమం గుర్తించింది. ఉద్యమం యొక్క రాజకీయ, సైద్ధాంతిక కార్యకలాపాలు జాతి నిర్మాణంలో కీలకపాత్ర నిర్వహిస్తాయని గమనించింది. అంతేగాక భారత ప్రజల్ని జాతిగా ఐక్యపరచే

లక్ష్యం సాధించేందుకు ప్రాంతీయ, మత, కుల, భాషాపరమైన భేదాల్ని పరిగణనలోకి తీసుకోవలసి వుంటుంది. వేర్వేరు భాషాపరమైన గ్రూపులకు సాంస్కృతికపరమైన పూర్తి గుర్తింపు యివ్వాలి. 1921 నుండి కాంగ్రెస్ బ్రిటిషు పాలకులు సృష్టించిన బహుభాషలతో కూడిన రాష్ట్రాల ప్రాతిపదికన గాక ఏకభాషా ప్రాతిపదికన రాష్ట్ర కమిటీల్ని ఏర్పాటు చేసింది.

* * *

ఆధునిక పారిశ్రామిక వ్యవసాయాభివృద్ధి ప్రాతిపదికన దేశంలో సమూలమైన మార్పులు తీసుకొని రావాలనే లక్ష్యాన్ని జాతీయోద్యమం ఏకగ్రీవంగా ఆమోదించింది. జస్టిస్ రనడే నుండి జాతీయవాదులు ప్రజల పేదరికాన్ని అధిగమించేందుకు పారిశ్రామికీకరణ ఏకైక సాధనమని అంగీకరించారు. ఈ ఏకగ్రీవాభిప్రాయానికి గాంధీజీ ఒక మేరకు మినహాయింపు అని చెప్పాలి. అది కూడా పూర్తిగా కాదు. యంత్రాలు, భారీ పరిశ్రమల పట్ల ఆయన వైఖరి వక్రీకరించబడింది. కార్మికుల్ని తొలగించే యంత్రాల్ని, చాలామందిని ఫణంగాపెట్టి కొద్దిమందికి ప్రయోజనాలు చేకూర్చే యంత్రాల్ని వ్యతిరేకించాడు. అంతేగాక అందరికి ప్రయోజనాలు చేకూర్చే సైన్సు పరిశోధనల్ని ఆయన అభినందించాడు. కార్మికుల్ని తొలగించేదిగా గాక మానవశ్రమ భారాన్ని తగ్గించే మేరకు ఆధునిక భారీ పరిశ్రమలకు వ్యతిరేకిని గానని గాంధీజీ చాలాసార్లు ప్రకటించాడు. అంతేగాక ఆయన మరొక షరతుని కూడా పెట్టాడు. భారీ పరిశ్రమలు, ప్రైవేటు పెట్టుబడిదారుల అధీనంలోగాక ప్రభుత్వ యాజమాన్యంలో ప్రభుత్వ అదుపులో వుండాలన్నారు.

విదేశీ పెట్టుబడిపై ఆధారపడని స్వావలంబన గల ఆర్థికాభివృద్ధి, దేశీయ యంత్రపరికరాల తయారీ రంగం, స్వతంత్రమైన సైన్సు టెక్నాలజీల స్థాపన, అభివృద్ధి పట్ల జాతీయవాదులు పూర్తి నిబద్ధత ప్రకటించారు. 1840ల నుండి భారతదేశ అభివృద్ధికి విదేశీ పెట్టుబడులు ప్రధానమైన సాధనమని బ్రిటిషు ఆర్థికవేత్తలు, పాలకులూ వాదిస్తూ వచ్చారు. దాదాభాయి నౌరోజి, తిలక్‌ల నుండి గాంధీజీ, నెహ్రూల వరకు గల జాతీయవాదులు ఈ వాదనని వ్యతిరేకించారు. విదేశీ పెట్టుబడి దేశాన్ని అభివృద్ధి

పరచలేదని, క్రుంగదీసిందని వారు వాదించారు. విదేశీ పెట్టుబడి దేశీయ పెట్టుబడిని అణచివేసింది. భవిష్యత్‌లో పెరుగుదలను కష్టతరం చేసింది. కాస్త ముందూ వెనుకగా విదేశీ పెట్టుబడి పాలనా వ్యవహారాలలో పలుకుబడిని పెంచుకొనడం ప్రారంభిస్తుంది గనుక ప్రమాదకరమని  జాతీయవాదులు హెచ్చరించారు.

దాదాభాయ్ నౌరోజీ, రనడేల నుండి జాతీయవాదులు స్వతంత్రమైన ఆర్థికవిధానాన్ని నిర్మించడంలో ప్రభుత్వ రంగం యొక్క కీలకమైన పాత్రని భవిష్యద్దర్శనం చేశారు. కొద్దిమంది చేతుల్లో సంపద కేంద్రీకరణని నివారించేందుకు భారీస్థాయి కీలకపరిశ్రమలు  ప్రభుత్వ రంగంలో వుండాలని 1930ల నుండి జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీజీ, వామపక్షాలు వాదించారు. 1930ల చివరిలో ఆర్థిక ప్రణాళికా లక్ష్యం ఆమోదించబడింది. 1938లో సుభాస్ చంద్రబోస్ అధ్యక్షతన కాంగ్రెస్ స్వతంత్ర భారతదేశ అభివృద్ధి ప్రణాళికను రూపొందించేందుకు నెహ్రూ అధ్యక్షుడుగా జాతీయ ప్రణాళికా కమిటీని నియమించింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో చాలా యితర పథకాలు రూపొందాయి. వాటిలో అతి ముఖ్యమైనది భారతీయ పెట్టుబడిదారీ  ప్రపంచంలో అతిముఖ్యులైన జె.ఆర్.డి.తాతా, జి.డి.బిర్లా, శ్రీరాంలు తయారుచేసిన బోంబే ప్లాను. ఈ ప్లాను కూడా దూరదృష్టితో భూ సంస్కరణల్ని, ప్రభుత్వ రంగాన్ని, పబ్లిక్,  ప్రైవేటు పెట్టుబడుల్ని భవిష్యద్దర్శనం చేసింది.

ఇంతకుముందు వివరించినట్లుగా వలసవాద వ్యతిరేక ఫాసిస్టు వ్యతిరేక, జాతీయస్వేచ్ఛ, శాంతి ప్రాతిపదికగా గల జాతీయోద్యమం యొక్క ప్రాపంచిక దృక్పథం జాతీయవాద సిద్ధాంతంలో శక్తివంతమైన అంశం.

* * *

జాతీయోద్యమం తొలిరోజుల నుండి పేదల కనుకూలమైన వైఖరి చేపట్టింది. మితవాదుల ఆర్థిక ఆందోళన, వలసవాదంపై వారి విమర్శలు ప్రజల పేదరికం పెరుగుదలకు కారణాలను గుర్తించాయి. ఈ వైఖరి 1917 రష్యా విప్లవం ప్రభావం, రాజకీయరంగంపైకి గాంధీజీరాక; 1920, 1930లలో బలమైన వామపక్ష పార్టీల, గ్రూపుల పెరుగుదలతో బలపడింది. ఉద్యమం వివిధ దశలలో సమకాలీన పరిస్థితులతో

పోల్చిచూస్తే సమూలమైన మార్పులుగోరే విధానాల్ని, సంస్కరణల కార్యక్రమాన్ని ఆమోదించింది.

నిర్బంధ ప్రాథమిక విద్య, పేద, మధ్యతరగతులపై పన్నుల తగ్గింపు, ఉప్పు పన్ను తగ్గింపు, భూమిశిస్తు కౌలు తగ్గింపు, రైతులకు రుణభారం నుండి ఉపశమనం, తక్కువ వడ్డీరేట్లకు రుణ సౌకర్యం కల్పించుట, కౌలుదారుల హక్కుల రక్షణ, కార్మికులకు కనీసవేతనాలు, పనిగంటల తగ్గింపు, పోలీసులతో సహా తక్కువ జీతాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపు, కార్మికుల, రైతుల హక్కుల రక్షణ కొరకు సంఘాల నిర్మాణం, గ్రామీణ పరిశ్రమలకు  రక్షణ ప్రోత్సాహం, ఆధునిక సైన్సు, సాంకేతిక విద్యకి ప్రోత్సాహం, మద్యపాన నిషేధం, మహిళలకు పనిచేసే హక్కు, విద్య హక్కు, సమాన రాజకీయ హక్కులతోపాటు వారి సామాజిక స్థాయిని పెంచుట, అంటరానితనం నిర్మూలనకు సామాజిక చట్టపరమైన చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణలో సంస్కరణలు – భారత జాతీయోద్యమం డిమాండు చేసిన కొన్ని ముఖ్యమైన సంస్కరణలు.

జాతీయోద్యమం యొక్క ప్రజానుకూలమైన– పేద ప్రజల కనుకూలమైన దిశానిర్దేశం, రాజకీయ చైతన్యం కలిగించి రాజకీయాలలోకి తీసుకొని రావడమనే భావం – ప్రజలకు సోషలిస్టు దృక్పథం కలిగించడాన్ని సులభతరం చేశాయి.

ఐనప్పటికి యింతకుముందు ప్రస్తావించినట్లు జాతీయవాద అభివృద్ధి దృక్పథం బూర్జువా ప్రమాణాలకు పరిమితం చేయబడింది. అంటే స్వతంత్ర ఆర్థికాభివృద్ధి పెట్టుబడిదారీ చట్రంలో ఊహించబడింది. 1919 తరువాత జాతీయోద్యమం ప్రజా ఉద్యమమయినప్పుడు గాంధీజీ పెట్టుబడిదారీయేతర రైతాంగ చేతివృత్తుల దృక్పథాన్ని రూపొందించి ప్రచారం చేశాడు. కాని ఆయన సామాజిక ఆర్థిక కార్యక్రమం, ఆలోచనలు జాతీయోద్యమంపై బూర్జువా సైద్ధాంతిక ఆధిపత్యాన్ని సవాలు చేయలేకపోయాయి.

వలసదేశంలో వలసవాద వ్యతిరేక ఉద్యమంగా మొత్తం సమాజాన్ని వలసవాదానికి వ్యతిరేకంగా మోహరింపజేసిన జాతీయోద్యమం ప్రజా ఉద్యమం. అది విభిన్నమైన తరగతుల ఉద్యమం. ఈ ఉద్యమం భారతీయ సమాజంలోని విభిన్న స్థాయిలలో వున్న విభిన్నమైన తరగతుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించింది. కాని వలసవాదానికి

వ్యతిరేకంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భారత ప్రజలు ఐక్యం చేయబడినప్పటికీ వారు సామాజిక తరగతులుగా విభజింపబడి వున్నారు. ఈ తరగతులకు సామ్రాజ్యవాదంతో వైరుధ్యాలున్నాయి. విభిన్నమైన తరగతుల మధ్య వైరుధ్యాలున్నాయి. వలసవాదంతో విభిన్నవర్గాలకు గల వైరుధ్యంలో తరతమ భేదాలున్నాయి. అలాగే వారు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యం వహించడంలోనూ వున్నాయి. అందువలన వలసవాద వ్యతిరేక పోరాటం విభిన్నవర్గ ప్రయోజనాలనిచ్చింది. పోరాటం యొక్క తుది ఫలితం చాలా విభిన్నమైన వర్గాల లేక రాజకీయ సైద్ధాంతిక శక్తుల సమతుల్యతని సాధించింది. ఈ శక్తుల సమతుల్యత సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఫలితంగా ప్రధాన వైరుధ్యం ఏ వర్గం ప్రయోజనాల కనుకూలంగా పరిష్కరింపబడిందో నిర్ణయించడానికి తోడ్పడింది. అంటే స్వాతంత్ర్యానంతరం ఎలాంటి భారతదేశం అవతరిస్తుందో తెలియజేస్తుంది. మరొక విధంగా చెప్పాలంటే స్వతంత్రం యొక్క ఫలితం సోషలిస్టు వ్యవస్థా లేక పెట్టుబడిదారీ వ్యవస్థా?

1920ల నుండి జాతీయోద్యమంలో బలమైన సోషలిస్టు ధోరణి అభివృద్ధి చెందింది. జాతీయోద్యమం యొక్క బూర్జువా అభివృద్ధి దృక్పథం తొలి కమ్యూనిస్టు గ్రూపులు, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్, చాలా సోషలిస్టు గ్రూపులు యింకా వ్యక్తులచే సవాలు చేయబడింది. వీరితో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, గుర్తింపు పొందిన కమ్యూనిస్టుపార్టీ, రాయిస్టులు కలిసిన తరువాత 1930లలో సోషలిస్టు భావజాల వ్యాప్తికొరకు తీవ్రమైన పోరాటం జరిగింది. పెట్టుబడిదారీ ప్రపంచంలోని 1930లనాటి తీవ్రమైన ఆర్థికమాంద్యం, రష్యా విప్లవం, సోవియట్ పంచవర్ష ప్రణాళికల విజయం, 1930లలో ప్రపంచవ్యాప్తంగా ఎగసిన ఫాసిస్టు వ్యతిరేక కెరటాలు – యివన్నీ సోషలిస్టు ఆలోచనల్ని ఆకర్షవంతం జేశాయి. 1920ల చివర యువజన ఉద్యమాల నాయకులలోని అత్యధికులు రివల్యూషనరీ టెర్రరిస్టులలోని చాలామంది సోషలిజం దిశగా మళ్ళారు. 1920, 1930, 1940లలో యువ జాతీయవాద శ్రేణులు అధికారికంగా సోషలిస్టు ఆలోచనల వైపు మళ్ళారు.

వామపక్షాలు భారతదేశంలో రైతులకు – భూస్వాములకు మధ్య, కార్మికులకు – పెట్టుబడిదారులకు మధ్య నిరంతర వర్గపోరాటాలు జరుగుతున్నాయనే భావాన్ని ప్రచారం

చేసేందుకు ప్రయత్నించాయి. ఈ పోరాటాల్ని వారి సంఘాలైన కిసాన్‌సభలు, ట్రేడ్ యూనియన్ల ద్వారా నిర్వహించేందుకు ప్రయత్నించాయి. అన్నిటి నిమించి జాతీయోద్యమాన్ని వామపక్ష సోషలిస్టు దిశగా మార్చేందుకు, స్వాతంత్ర్యానంతరం సోషలిస్టు భారతదేశం అవతరిస్తుందనే భావం కలిగించేందుకు ప్రయత్నించాయి.

జాతీయోద్యమంలోను దేశవ్యాప్తంగానూ సోషలిస్టు భారతదేశ స్వప్నానికి విశేష ప్రచారం యివ్వడంలో జవహర్‌లాల్ నెహ్రూ చాలా ముఖ్యమైన పాత్ర పోషించాడు. రాజకీయ స్వాతంత్ర్యం అంటే ప్రజల ఆర్థికపరమైన విముక్తి అని నెహ్రూ వాదించాడు. 1930లలో నెహ్రూ అప్పుడున్న జాతీయవాద సిద్ధాంతంలోని అసమగ్రతని జాతీయోద్యమంపై బూర్జువా సిద్ధాంత ఆధిపత్యాన్ని ఎత్తిచూపాడు. ప్రజలు వారి సామాజిక స్థితిని శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి తోడ్పడే కొత్త సోషలిస్టు లేక మార్క్సిస్టు సిద్ధాంతాన్ని బలవరచవలసిన అవసరాన్ని నొక్కిచెప్పాడు. కాంగ్రెస్‌కి సోషలిస్టు సైద్ధాంతిక దృక్పథాన్ని యివ్వాలని చెప్పాడు.

1930లలో సోషలిస్టు భావాలకు చాలా అనుకూలత వుంది. సోషలిస్టు భావాలు వేగంగా విస్తృతంగా వ్యాపించాయి. వామపక్ష సోషలిస్టు ఆలోచనలు నికరమైన రీతిలో పెరిగినప్పటికి, అవి జాతీయోద్యమంలో ఆధిపత్య సైద్ధాంతిక ధోరణి కాలేకపోయాయి. కాని అవి జాతీయోద్యమంలో ప్రధానభాగమై జాతీయోద్యమాన్ని నిరంతరంగా వామపక్షదిశగా మార్చడంలో జయప్రదమయ్యాయి. ఆ తరువాత స్వాతంత్ర్యాన్ని జాతీయోద్యమం కేవలం విదేశీ పాలన అంతంగావడంగా గాక సామాజిక, ఆర్థిక పరిభాషలో నిర్వచించింది. 1930లలో చివరికి భారత జాతీయోద్యమం, జాతీయవిముక్తి ఉద్యమాలలో అత్యంత ప్రగతి శీలకమైనదయింది.

ఈ సమూలమైన మార్పులు కరాచి, లక్నో, ఫైజాపూర్ కాంగ్రెస్ తీర్మానాలలోను (1931, 1936లలో), 1935, 1945-46 ఎన్నికల ప్రణాళికలలో, 1937-39 కాంగ్రెస్ మంత్రివర్గాల ఆర్థిక, సామాజిక సంస్కరణలలోను ప్రతిఫలించాయి. వాస్తవంగా కాంగ్రెస్ క్రమంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ దిశలో అభివృద్ధికరంగా పరిణామం చెందింది. వామపక్షాలు ప్రస్తావించిన డిమాండ్లను కొద్ది సంవత్సరాలలో అమలు జరిపింది. ఈ

పరిణామంలో వామపక్షాల రాజకీయాలు కార్మిక, కర్షక పోరాటాలు కీలకపాత్ర నిర్వహించాయి.  మితవాద కాంగ్రెస్ కూడా సోషలిజాన్ని వ్యతిరేకించినప్పటికి దృఢమైన సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరినవలంబించడమేగాక రాజకీయ ఆర్థిక, ప్రాథమిక మార్పుల పట్ల నిబద్ధత కలిగివుంది. అది సంస్కరణల్ని ఆమోదించి, బూర్జువా దృక్పథాన్ని నిలబెట్టుకొన్నది.

భారతదేశంలో రైతు సామాజిక స్థితి కీలకమైన సమస్య గనుక కాంగ్రెస్ వ్యవసాయ విధానంలో వచ్చిన మార్పులు రైతుల కనుకూలంగా సాగాయి. వలసరాజ్యంలో రైతుల డిమాండ్ల కొరకు  కాంగ్రెస్ నిరంతరం పోరాడింది. వామపక్షాల రైతు ఉద్యమాల ప్రేరణతో 1936లో ఫైజాపూర్ కాంగ్రెస్ శిస్తు కౌలు రేట్లలో గణనీయమైన తగ్గింపు, బలవంతపు చాకిరి ఫ్యూడల్ అప్పుల రద్దు, కౌలుదారుల కాలపరిమితి, వ్యవసాయ కార్మికులకు కనీస కూలి వగైరాలను ఆమోదించింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు చట్టంచేశాయి. కౌలుదారులకు రక్షణ కల్పించడం, వడ్డీ వ్యాపారుల దోపిడీని నిరోధించడం – లాంటి అంశాలతో ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి కొన్ని తేడాలున్నాయి. చివరిగా 1945లో దున్నేవాడికే భూమి అని పేర్కొంటూ భూస్వామ్య విధానం రద్దుని ఆమోదించింది. 'భూసంస్కరణ విధానంలో రైతుకి రాజ్యానికి మధ్యగల దళారుల్ని తొలగించడం యిమిడివుంది.'

* * *

గాంధీజీ, గాంధేయుల సామాజిక దృక్పథమే జాతీయోద్యమంలోని ప్రధానమైన సైద్ధాంతిక కోణం. గాంధీజీ సమాజం యొక్క వర్గ విశ్లేషణని, వర్గపోరాటం యొక్క పాత్రని అంగీకరించలేదు. పేద ప్రజల ప్రయోజనాల రక్షణ కొరకు కూడా హింసా ప్రయోగాన్ని ఆయన వ్యతిరేకించాడు. కాని ఆయన ప్రాథమిక దృక్పథం సామాజిక మార్పు, ప్రస్తుత వ్యవస్థలోని ఆర్థిక రాజకీయ అధికారాల మార్పుకి ఆయన నిబద్ధుడు. అంతేగాక 1930, 1940 దశాబ్దాలలో సమూలమైన మార్పులు కోరే దిశలో ఆయన ఆలోచనలు సాగాయి. నెహ్రూ ఆలోచనతో ఆయన 1933లో ఏకీభవించాడు. వ్యక్తిగత ఆస్తిని వ్యతిరేకించడం ప్రారంభించాడు. తన ధర్మకర్తృత్వ సిద్ధాంతంలో సమూలమైన మార్పులు చేశాడు. భారీ పరిశ్రమల్ని జాతీయం చేయాలని వాదించాడు. పెట్టుబడిదారీ

విధానంలోను భూస్వామ్య విధానంలోను అంతర్గతంగా యిమిడివున్న సాధారణ ప్రజలపై దోపిడీని ఆయన ఖండించాడు. మధ్యతరగతులు నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక పాత్రని తీవ్రంగా విమర్శించాడు.

శారీరక మానసిక శ్రమల మధ్యగల తేడా వివక్షత తొలగించబడుట, సామాజిక ఆర్థిక సమానత్వం సాధారణ ప్రజలు స్వయంగా కార్యకలాపాలు చేపట్టడం, కులపరమైన అసమానతకి అణచివేతకు వ్యతిరేకత, మహిళల సామాజిక విముక్తికి చురుకైన మద్దతు, దోపిడీకి గురయిన వారికి అణచివేయబడినవారికి అణగారిన వారికి అనుకూలంగా సాగిన ఆయన ఆలోచనలు, రచనలు – జాతీయోద్యమానికి దిశానిర్దేశం చేశాయి.

వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పులు కోరడం ఆయన ఆలోచనలలో వచ్చిన గమనించదగిన మార్పు. ఆయన 1937లో "భూమి ప్రజలకు చెందడంలేదనేది చాలా వాస్తవం. కాని పొలం, యితర ఆస్తి పనిచేసేవాడిది. దురదృష్టవశాత్తు ఈ సాధారణమైన వాస్తవం తెలుసుకోకుండా కార్మికులు అజ్ఞానంలో వుంచబడ్డారు" అన్నాడు. మరలా 1942లో ఆయన యిలా ప్రకటించాడు. పొలంలో పనిచేసే వానికే గాని మరొకరికి చెందదు. అలాగే 1942లో లూయిస్ ఫిషర్ అడిగిన "రైతులు అభివృద్ధి చెందటానికి మీరు చేపడుతున్న కార్యక్రమం ఏమిటి?" ప్రశ్నకు గాంధీజీ "రైతులు పొలాలు తీసుకొంటారు. ఆక్రమించుకోమని మేము చెప్పనవసరం లేదు. వారే తీసుకొంటారు", భూస్వాములకు నష్టపరిహారం యివ్వబడుతుందా?, ఫిషర్ ప్రశ్న. "లేదు. అలా చేయడం ఆర్థికపరంగా అసాధ్యం" గాంధీజీ జవాబు. 'రానున్న సహాయ నిరాకరణోద్యమం నుండి ఏం ఆశిస్తున్నారు?' ఫిషర్ ప్రశ్న. "గ్రామాలలో రైతులు పన్నులు చెల్లించడం ఆపివేస్తారు. అధికారికంగా నిషేధం వున్నప్పటికీ ఉప్పు తయారు చేస్తారు... తరువాత కార్యక్రమం భూముల్ని ఆక్రమించడం" గాంధీజీ జవాబు.

"హింసతోనా?' ఫిషర్ ప్రశ్న. దానికి గాంధీజీ జవాబు "హింస వుండవచ్చు. కాని భూస్వాములే సహకరించవచ్చు.... పారిపోవడం ద్వారా సహకరించవచ్చు."

"భూస్వాములు హింసతో ప్రతిఘటించవచ్చు గదా?" ఫిషర్ ప్రశ్న.

"15 రోజులు అలజడి వుండవచ్చు. త్వరలోనే అదుపులోకి తీసుకొని రాగలుగుతాము" గాంధీజీ జవాబు.

"అంటే నష్టపరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకోవడమేనా?" ఫిషర్ ప్రశ్న.

గాంధీజీ జవాబు "అవును. భూస్వాములకు నష్టపరిహారం చెల్లించడం ఆర్థికంగా ఎవరికైనా సాధ్యపడదు."

* * *

ఆ విధంగా జాతీయోద్యమం స్పష్టమైన వలసవాద వ్యతిరేక సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొని పౌరస్వేచ్ఛ, ప్రజాస్వామ్య సెక్యులర్, సమూలమైన మార్పులుగోరే సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో పనిచేసింది. భారత ఆర్థిక విధానాన్ని స్వేచ్ఛగా స్వావలంబన విధానాలపై అభివృద్ధిపరచాలని నిర్ణయించింది. వలసవాద వ్యతిరేక సిద్ధాంతంతో పేద ప్రజలకనుకూలమైన సామాజిక ఆర్థిక దృక్పథంతో కూడిన ఈ భవిష్యద్దర్శనం జాతీయోద్యమాన్ని రాజకీయాలలో చురుకుగా పాల్గొనే రాజకీయ చైతన్యంగల ప్రజలపై ఆధారపడేలా చేయగలిగింది. ఉద్యమానికి ప్రజా ఉద్యమ స్వభావాన్ని తెచ్చిపెట్టింది.

భారత స్వతంత్ర పోరాటంలోని అన్ని స్రవంతులను సమగ్రంగా, తులనాత్మకంగా విశ్లేషించి అందించిన గ్రంథం ఇది. ప్రామాణిక పరిశోధకులు ఒక బృందంగా ఏర్పడి అందుబాటులో ఉన్న చారిత్రక పత్రాలు సమాచారంతోపాటు, పదిహేనువందల మందికి పైగా స్వతంత్ర సమరయోధులను ప్రత్యక్షంగా కలుసుకొని వారి ఇంటర్వ్యూల ఆధారంగా రూపొందించిన గ్రంథం ఇది. ఇలాంటి గ్రంథం తెలుగులో వెలువడటం ఇదే మొదటిసారి.

***

'విద్యార్థులు, వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికి గతాన్ని తెలుసుకోగోరే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం.'

– ఇండియన్ ఎక్స్‌ప్రెస్

రు.200/-

ప్రజాశక్తి బుక్‌హౌస్